శ్రీరామకృష్ణ పరమహంస

సమగ్ర సప్రామాణిక జీవిత గాధ

Cat-1038



శ్రీ శారదానంద స్వామి

శ్రీరామకృష్ణ పరమహంస



శ్రీరామకృష్ణ పరమహంస

[సమగ్ర, సప్రామాణిక జీవిత గాథ]

మొదటి సంపుటం

వంగమూలం: శ్రీ శారదానందస్వామి

తెలుగుసేత: శ్రీ దయాత్మానందస్వామి

శ్రీరామకృష్ణ మఠం

మైలాపూర్ :: చెన్నై 600 004

Published by
The President
Sri Ramakrishna Math
Mylapore, Chennai-4

181.493

C. 9698

79092

500 044.

© Sri Ramakrishna Math, Chennai
All rights reserved

I-3M 3C-11-2002
ISBN 81-7823-011-9
ISBN 81-7823-012-7

Printed in India at
Sri Ramakrishna Math Printing Press
Mylapore, Chennai-4

విజ్ఞప్తి

మా మఠ తెలుగు మాసపత్రిక 'శ్రీరామకృష్ణ ప్రభ'లో గత ఎనిమిదేళ్ళుగా 'శ్రీరామకృష్ణ లీలాప్రసంగం' ధారావాహికగా వెలువడుతూన్న విషయం అందరికీ సువిదితమే. అనేకమంది పాఠకులను ఎంతగానో ఆకట్టుకొన్న ఈ ధారావాహికను పుస్తకరూపంలో ప్రచురించమని అనేకులు కోరి ఉన్నారు. అంతేగాక తెలుగులో శ్రీరామకృష్ణుల సమగ్ర, సప్రామాణిక జీవిత గాథ ఇప్పటి వరకూ వెలువడలేదు. కాబట్టి ఇటు ఆ కొరతను తీరుస్తూ, అటు పాఠకుల కోర్కెను ఈడేర్చే ఉద్దేశంతో పుస్తక రూపంలో, రెండు సంపుటాలలో, 'శ్రీరామకృష్ణ పరమహంస' పేరిట ఇప్పుడు విడుదల చేస్తున్నాం. ఇది ఈ గ్రంథం మొదటి సంపుటం.

గురుదేవుల ప్రత్యక్ష శిష్యులలో ఒకరూ, శ్రీరామకృష్ణ మఠ-మిషన్ల ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించి ఎనలేని సేవలు అందించిన వారూ అయిన స్వామి శారదానంద ఈ గ్రంథ వంగమూలాన్ని రచించారు. వంగమూలం నుండి తెలుగులోకి అనువదించడం సులభమైన పని కాదు. సామాన్యంగా ఇటువంటి బృహద్గ్రంథ అనువాదాన్ని పలువురు ఒక బృందంగా కలిసి చేయడం పరిపాటి. కాని ఈ గ్రంథ తెలుగు అనువాదాన్ని ఒక్కరే, ఎవరి తోడ్పాటూ లేకుండా పూర్తిచేయడం గొప్ప విశేషం. ఈ గ్రంథ అనువాదాన్ని నిర్దిష్టంగా పూర్తిచేసి ఇచ్చినవారు లండన్‌లోని శ్రీరామకృష్ణ వేదాంత సెంటర్ మినిస్టర్ (అధ్యక్షులు) స్వామి దయాత్మానందగారు. ఆయనకు కృతజ్ఞతాభివందనాలు తెలుపుకొంటున్నాము.

ఈ బృహద్గ్రంథ ప్రచురణకు రూపకల్పనచేసి, అనునిత్యం పురోగతిని సమీక్షిస్తూ, ఈ కార్యక్రమానికి నేపథ్య సారథ్యం వహించిన వారు మా మఠ మేనేజర్ స్వామి జ్ఞానదానందగారు.

ఈ కృషిలో పాలుపంచుకొన్న ఇతరు లందరూ భగవాన్ శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రులవుతారుగాక!

ఈ 'శ్రీరామకృష్ణ పరమహంస' గ్రంథాన్ని చదివే పాఠకు లందరూ శాంత్యానందాలను సంతరించుకొంటారని మేం ఆకాంక్షి స్తున్నాము.

- ప్రకాశకులు

తొలిపలుకు

లోకోద్ధరణ నిమిత్తం జన్మించే అవతార పురుషుల ఆగమనంతో ఈ ఇలలో ఆధ్యాత్మిక మార్గం సుగమమౌతుంది. కాలానుగుణమైన ఆవశ్యకాలను దృష్టిలో ఉంచుకొని వీరు జనులకు సులభమార్గం ఆవిష్కరిస్తారు, ఆధ్యాత్మిక పయనాన్ని సులభతరం చేస్తారు. అటువంటి మహాత్ములు ఎన్నడోగాని అవతరించరు. వీరు లోకంనుండి నిష్క్రమించినప్పటికీ, వీరి మహోన్నత జీవితమూ, ఉదాత్త బోధనలూ కనుమరుగు కావు. అవి సర్వకాలాలలో నివురుగప్పిన నిప్పులా ఉండి, జనులను ఆధ్యాత్మికపరంగా జాగృతం చేస్తూనే ఉంటాయి. అటువంటి ఒక ఆధ్యాత్మిక ఉత్తుంగ తరంగాన్ని మన సమీపకాలంలో సృష్టించి, మానవాళికి ఆధ్యాత్మిక జీవన జాగృతాన్ని అనుగ్రహించిన వారు శ్రీరామకృష్ణ పరమహంస దేవులు. ఆయనను గురించి ఎన్నో పుస్తకాలు నేడు వెలువడి ఉన్నాయి. ఆ పుస్తకాలన్నిటికీ మూలాధారమైన గ్రంథం, ఆయన సన్న్యాస శిష్యుడైన స్వామి శారదానంద వంగభాషలో రచించిన 'శ్రీ శ్రీరామకృష్ణ లీలాప్రసంగ'. సాటిలేని ఆ గ్రంథాన్ని, ప్రప్రథమంగా ఇప్పుడు తెలుగులో విడుదల చేస్తున్నందుకు ఎంతో ఆనందిస్తున్నాం.

శ్రీరామకృష్ణులు జీవించి ఉన్నప్పుడే ఆయనను గురించి వ్యాసాలు, రచనలు పత్రికలలో రావడం ప్రారంభమైంది. ఆయన గతించిన తరువాత అనేక పుస్తకాలు వెలువడ్డాయి. కాని వాటిలో ఏ పుస్తకమూ కచ్చితంగా, సప్రామాణికంగా ఆయన జీవితాన్ని ప్రతిబింబించలేకపోయాయి. ఈ కొరతను తీర్చడానికే తాను ఈ గ్రంథం రచించానని స్వామి శారదానంద చెప్పేవారు.

ఈ రచనా వ్యాసంగాన్ని స్వామి శారదానంద ఉపక్రమించడానికి ఆసక్తికరమైన నేపథ్యం ఒకటి ఉంది. గురుదేవుల మహాసమాధి అనంతరం ఆయన దివ్యసతీమణి మాతృదేవి (శ్రీ శారదాదేవి) జయరామ్‌బాటిలో తమ పుట్టింట్లో నివసించసాగారు. భక్తుల ఆహ్వానం మేరకు ఆమె కలకత్తాకు రావడం కద్దు. అటువంటి సందర్భాలలో ఆమె బసచేయడానికి శాశ్వత నివాసం అంటూ ఏదీ

ఉండేది కాదు. తనను మాతృదేవి సేవకుడిగా పరిగణించుకొన్న స్వామి శారదానందకు ఇదొక తీరని కొరతగా అనిపించేది. చేత పైకం లేకపోయినప్పటికీ, మాతృదేవికి ఒక స్థిర నివాసం కట్టించాలనే తపనతో, అప్పుచేసి భవన నిర్మాణం పూర్తిచేశారాయన. పుచ్చుకొన్న అప్పును తీర్చడం ఎలా అని యోచించినప్పుడే, గురుదేవుల జీవితగాథను రచించి, పుస్తకంగా విడుదల చేయాలన్న యోచన ఆయనకు తట్టింది. వెంటనే ఆయన గురుదేవుల శిష్యులు, భక్తులు, బంధువులు మొదలైన నమ్మకస్థులైన సన్నిహితులను కలుసుకొని, సమాచారం సేకరింప ప్రారంభించారు. అలా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి శ్రీరామకృష్ణ మఠ వంగ పత్రికయైన 'ఉద్బోధన్'లో 1909 నుండి ప్రచురించడం మొదలుపెట్టారు. 1911-1918 మధ్య కాలంలో వాటిని పుస్తక రూపంలో ఐదు భాగాలుగా విడుదల చేశారు.

మొదటి భాగం 'బాల్యభావం'లో గురుదేవుల బాల్యం, రెండవ భాగం 'సాధక భావం'లో ఆయన అనుష్ఠించిన అసాధారణ ఆధ్యాత్మిక సాధనల వివరాలు చోటుచేసుకొన్నాయి. మూడు నాలుగు భాగాలైన 'గురుభావం'లో శ్రీరామకృష్ణులు తమ శిష్యుల, భక్తుల పారమార్థిక జీవితాన్ని తీర్చిదిద్దిన తీరుతెన్నులు పొందుపరచబడ్డాయి. 'దివ్యభావం-నరేంద్రుడు' అన్న ఐదవ భాగంలో ఆయన మహోన్నత జీవితం ద్వారా, స్వామి వివేకానందను రూపొందించడం ద్వారా మానవాళి ఎలా పటిష్టతను సంతరించుకొన్నదో వివరింపబడింది. స్వామి శారదానంద ఈ వరుస క్రమంలో గ్రంథాన్ని విడుదల చేయలేదు. మొట్టమొదట 'గురుభావం', భాగాన్ని (III & IV) విడుదల చేశారు. తరువాత 'బాల్యభావం', 'సాధక భావం' (I & II), చివరగా 'దివ్యభావం - నరేంద్రుడు' (V) భాగాన్ని ఆయన విడుదల చేశారు.

ఈ 'శ్రీరామకృష్ణ కావ్యం' 1886వ సం॥ జనవరి 1వ తేదీ నాడు గురుదేవులు కల్పతరువులా భక్తులను అనుగ్రహించిన సంఘటనతో సమాప్తమౌతున్నది. ఆ తరువాత గురుదేవులు దాదాపు ఎనిమిది నెలల కాలం ఈ లోకంలో భౌతిక దేహంతో జీవించారు. కాని స్వామి శారదానంద కల్పతరువు నాటితోనే ఈ గ్రంథాన్ని పూర్తిచేశారు.

ఈ గ్రంథం మూడు ప్రధాన అంశాలను సంతరించుకొన్నది. మొదటిదిగా, ఇదొక అవతార పురుషుని గాథ. భగవంతుణ్ణి గురించీ, ఆయన అనుయాయుల గురించీ గానం చేయడం, పఠించడం కంటే భక్తునికి పరమానందం కలిగించేది మరొకటి ఏదీ ఉండదు. దాసానుదాసునిగా జీవించి, చరిత్ర కనీవినీ ఎరుగని ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించి, ఒక్కొ- సాధనలో పరిపూర్ణత్వాన్ని సిద్ధించుకొని,

జగద్గురువులై విరాజిల్లిన శ్రీరామకృష్ణుల పావన చరితం ఒక వట్టిపోని మహదానంద ఊట అనడం అతిశయోక్తి కాదు. ఆయన జీవితంలో జరిగిన ప్రతి సంఘటనా భక్తుని ధ్యానానికి ఎంతో అనువైనదిగా భాసిస్తూ ఉన్నది.

రెండవదిగా, మత చరిత్రలోనే ఒక మైలురాయిలా నిలిచిపోయే గ్రంథం ఇది. ఇప్పటి వరకు అరుదెంచిన అవతార పురుషులలో ఎవరి చరిత్రా ఆయన శిష్యునిచే చారిత్రక దాఖలాలతో మాస, తేదీ వారీగా రచించబడి ఉండలేదు. ఆ విధంగా రచింపబడిన ప్రప్రథమ గ్రంథం ఈ 'శ్రీ శ్రీరామకృష్ణ లీలాప్రసంగ'మే.

మూడవ అంశం, ఈ గ్రంథ రచయితయైన స్వామి శారదానందయే. ఆయన గురుదేవుల శిష్యుడు, ఉత్తమ జ్ఞాని, లక్ష్య కర్మయోగి; వీటికి తోడు ఆయన అసాధారణ ప్రతిభాశాలి. చరిత్ర, మనస్తత్వశాస్త్రం, విజ్ఞానం వంటి ఆధునిక విద్యాంశాలలో ఆయన దిట్టయైనందున శ్రీరామకృష్ణుల జీవితగాథను ఒక పరిశోధనాత్మక గ్రంథంగా మలచగలిగారు. గురుదేవులను ఒక అవతార పురుషునిగా అవలోకించినప్పుడు, ఆయన కారుణ్యమూర్తిమత్వంలో మునిగిపోయి తన మనస్సులోని ఉద్వేగాల నన్నిటిని వెలువరించడం మూలంగా, చదువరుల మనస్సుల నన్నిటినీ భక్తి వృష్టిలో తడిపివేశారు. అదే సమయంలో గురుదేవులను ఒక మానవమాత్రునిగా పరిగణనలోకి తీసుకొని ఆయన జీవిత సంఘటనలను మనస్తత్వ, వైజ్ఞానిక రీతిలో విశ్లేషించి, చిన్నిచిన్ని సంఘటనలలో సైతం ఎంత గొప్ప అర్థం ఇమిడి ఉందో వెల్లడించడం ద్వారా ఈ గ్రంథం పాఠకుల పరిశోధనాత్మక దృష్టికి కనువిందు చేస్తుందనడంలో ఏమాత్రం సంశయమూ లేదు. మొత్తంమీద ఈ గ్రంథం ఒక భక్తి - జ్ఞాన కావ్యంగా అలరారుతూన్నది.

విషయ సూచిక

1. బాల్య భావం

ప్రస్తావన ... 3

ఉపోద్ఘాతం ... 5

భారతదేశ జీవిత కేంద్రంగా ఆధ్యాత్మికత 5; భారతదేశంలో తరచు మహాపురుషుల ఆవిర్భావమే అందుకు కారణం 5; భారతదేశంలో మతం భగవదనుభూతిపై స్థాపిత మైంది 6; దివ్యావతార భావన వికాసం 6; భక్తియుగంలో సాకార దైవం 7; అవ తారాల పట్ల విశ్వాసం కలగడానికి గురుపూజ మరో కారణం 8; వేదజ్ఞానం, సమాధి అనుభూతి ఆధారంపై అవతారవాదం నెలకొల్పబడింది 8; భగవదనుగ్రహ అనుభూతి - అవతారవాద పరివ్యాప్తి 9; అవతార పురుషుల దివ్యస్వభావం గురించి శాస్త్రాల సారం 9; అవతార పురుషుల అవిచ్ఛిన్న స్మృతి 9; అవతార పురుషులు మతానికి క్రొత్త ఆకృతిని కల్పిస్తారు 10; అవతార పురుషులు ఎప్పుడు అరుదెంచు తారు 10; ఆధునిక యుగంలో అవతార పురుషుని ఆగమనం 11.

1. యుగావశ్యకత ... 13

ఆధునిక కాలంలో మానవశక్తి - ప్రగతులు 13, శక్తి ప్రగతుల విస్తరణ - పాశ్చాత్యం నుంచి ప్రాచ్యానికి 14; పర్యవసానంగా పాశ్చాత్య జీవన సరళి, ప్రగతికి ప్రమాణమవు తుంది 14; పాశ్చాత్యంలోని యీ ప్రగతికి కారణం, దాని చరిత్ర 15; ఆత్మజ్ఞానం పట్ల అజ్ఞానం : తత్ఫలితంగా అసంతృప్తి 16; ప్రాచ్యంకూడ పాశ్చాత్యంలా 'పురోగ మించా'లంటే, అది స్వార్థాన్ని, భోగలాలసను అలవరచుకోవాలి 17; ధార్మికత : భారతీయుల ప్రాచీన జాతీయ జీవన పునాది 17; ప్రాపంచిక భోగాలను భారతదేశం ఎన్నడూ ఆదర్శంగా తీసుకోలేదు 17; పాశ్చాత్యుల భారతదేశ ఆక్రమణ - తత్ఫలితాలు 18; భారత జాతీయ జీవనం : గుణదోషాలు 19; ప్రస్తుత ధర్మగ్లానికి పాశ్చాత్య భావనలే కారకాలు 20; ధర్మ సంరక్షణార్థం భగవానుడు మళ్లీ అవత రించాడు 20.

2. శ్రీరామకృష్ణుల జన్మస్థలం (కామార్పుకూర్) - పూర్వీకులు ... 21

పేదకుటుంబంలో భగవంతుడు ఎందుకు అవతరిస్తాడు 21; కామార్పుకూర్ : శ్రీరామకృష్ణుల జన్మస్థలం 22; కామార్పుకూర్ ప్రాంతాల్లో ఆనాటి సుభిక్షత: నేటి స్థితిగతులు 23; ఆ ప్రాంతాలలో 'ధర్మం' యొక్క ఆరాధన 24; హల్దార్ చెరువు: 'భూతి' వాగు : మామిడితోట 25; భూర్సుబో వాస్తవ్యుడు మణిక్ రాజా 25; మందారణ్ కోట 25; ఉచాలన్ వద్దనున్న పెద్ద చెరువు - మొగల్‌మారి యుద్ధభూమి 25; దేరే గ్రామ జమీందారు - రామానందరాయ్ 26; దేరే గ్రామ వాస్తవ్యుడు మణిక్‌రాం ఛట్టోపాధ్యాయ 26; మణిక్‌రాం కుమారుడు ఖుదిరామ్ 27; ఖుదిరామ్ భార్య చంద్రాదేవి 27; జమీందారుతో వివాదం : ఖుదిరామ్ ఆస్తిపాస్తుల్ని కోల్పోవటం 27; ఖుదీరామ్ దేరే గ్రామాన్ని విడిచి వెళ్లటం 28; ఖుదిరామ్ కామార్పుకూర్‌కు వలస పోవటం 28.

3. కామార్పుకూర్‌లో ధార్మిక కుటుంబం ... 30

కామార్పుకూర్‌లో ఖుదిరామ్ వానప్రస్థ జీవనం 30; అనూహ్య రీతిలో రఘువీరుని సాలగ్రామ ప్రాప్తి 31; ఖుదిరామ్ భగవత్ పరాధీనత 32; లక్ష్మీజలలోని వరి చేను 32; ఖుదిరామ్ భగవద్భక్తి పురోగతి 33; ఇరుగుపొరుగులు చంద్రాదేవిని గౌరవించే తీరుతెన్నులు 34; ఖుదిరామ్ చెల్లెలు రామశీల ఉదంతం 34; ఖుదిరామ్ ఇద్దరి తమ్ముళ్ల ఉదంతం 35; ఖుదిరామ్ మేనల్లుడు రాంచంద్ర 35; ఖుదిరామ్ ప్రగాఢ భక్తిని చాటే సంఘటన 35; రాంకుమార్ కాత్యాయనుల వివాహాలు 36; సుఖలాల్ గోస్వామి మరణం, తదితర సంఘటనలు 36; ఖుదిరామ్ రామేశ్వర తీర్థయాత్ర; రామేశ్వర్ జననం 37; రాంకుమార్ అలౌకికశక్తి 37; రాంకుమార్ అలౌకిక శక్తిని చాటే ఒక సంఘటన 38; రాంకుమార్ భార్యను గురించిన ఒక సంఘటన 38; ఖుదిరామ్ కుటుంబంలోని విలక్షణ అంశం 39; చంద్రాదేవి దివ్యదర్శనం 40; ఖుదిరామ్ గయా తీర్థయాత్ర ఆకాంక్ష 41; దీని గురించి హృదయరాం కథనం 41; గయలో ఖుదిరామ్ గాంచిన దివ్యస్వప్నం 42; ఖుదిరామ్ కామార్పుకూర్‌కు తిరిగి రావటం 44.

4. చంద్రాదేవి విచిత్ర అనుభూతులు ... 45

అవతారమూర్తుల జనన కాలంలో వారి తల్లిదండ్రుల దివ్యానుభూతులు 45; యుక్తికూడ శాస్త్రవాక్యాన్ని బలపరుస్తూ ఉంది 46; ఆ దివ్యదర్శనాల మహత్వం, ఔచిత్యం 47; చంద్రాదేవిలో కలిగిన మానసిక మార్పును ఖుదిరామ్ గుర్తించడం 47; చంద్రాదేవి మాతృప్రేమ విస్తృతి 48; ఆమెను గురించి ఖుదిరామ్ ఆదుర్దా 48; చంద్రాదేవి విచిత్ర స్వప్నం 48; శివాలయంలో చంద్రాదేవి దివ్యదర్శనం, దివ్యానుభూతి 49; చంద్రాదేవిని ముందు జాగ్రత్తగా ఖుదిరామ్ హెచ్చరించడం 50; గర్భవతి అయ్యాక చంద్రాదేవి దివ్యదర్శనాలు 51.

5. యుగపురుషుని అవతరణ ... 53

చంద్రాదేవి భయోద్వేగాలను భర్త తొలగించడం 53; గదాధర్ జననం 54; గదాధర్ జనన ముహూర్తంలో గ్రహగతులు 54; జన్మరాశి రీత్యా శిశువు నామకరణం 55.

6. గదాధర్ శైశవం - క్షుదీరామ్ మరణం ... 56

రాంచంద్రుని గోదానం 56; గదాధర్ ఆకర్షణలు 56; చంద్రాదేవి దివ్యదర్శనాలు 58; గదాధర్, చంద్రాదేవికి 'పెద్దవాడు'గా కన్పించడం 58; 'సర్వమంగళ' జననం 59; గదాధర్ విద్యారంభం 59; లాహాబాబుల పాఠశాల 60; గదాధర్ విచిత్ర ప్రవృత్తి 61; దానిని సూచించే ఒక సంఘటన 62; గదాధర్ విద్యాభ్యాస పురోగతి 63; గదాధర్ సాహసం 64; అందరితో కలివిడిగా మెలగడం 65; గదాధర్ కల్పనాశక్తి వికాసం 65; రామ్‌చంద్రుని ఇంట్లో దుర్గాపూజ 68; క్షుదీరామ్ శరన్నవరాత్రి ఉత్సవంలో పాల్గొనడం 68; క్షుదీరామ్ వ్యాధి - మరణం 69.

7. గదాధర్ బాల్యం ... 71

క్షుదీరామ్ మరణంతో కుటుంబంలో ఏర్పడ్డ పరిణామాలు 71; తండ్రి మరణంతో గదాధర్ మానసిక స్థితి 72; ఇప్పుడు తల్లి పట్ల గదాయ్ ప్రవర్తన 73; సాధువులతో అతడి సాంగత్యం 73; ఈ సందర్భంగా చంద్రాదేవిలో జనించిన భయం తొలగిపోయిన తీరు 74; రెండవసారి గదాధర్‌కు భావసమాధి 76; గదాధర్ ఆప్తమిత్రుడు 'గయావిష్ణు' 76; గదాధర్ ఉపనయనం 77; పండిత సమావేశంలో వివాదాస్పద శాస్త్రాంశాన్ని గదాధర్ పరిష్కరించడం 78; మూడవసారి గదాధర్‌కు భావసమాధి 78; గదాధర్‌కు పదేపదే భావసమాధులు కలగడం 80; చదువు విషయంలో గదాధర్ ఉదాసీనత 81; గదాధర్ విద్యాభ్యాస పురోగతి 82; రామేశ్వర్, సర్వమంగళలకు వివాహాలు 84; గర్భిణిగా ఉన్నప్పుడు రాంకుమార్ భార్య ప్రవర్తనలో మార్పు 84; రాంకుమార్ ఆర్థిక దుఃస్థితి 85; రాంకుమార్ భార్య మరణించడం 85.

8. యౌవన ప్రాదుర్భావం ... 86

కలకత్తాలో రాంకుమార్ సంస్కృత పాఠశాలను ప్రారంభించడం 86; కుటుంబంపై రాంకుమార్ భార్య మరణం చూపిన ప్రభావం 87; రామేశ్వర్ ఉదంతం 87; గదాధర్ గురించి రామేశ్వర్ ఆలోచనలు 87; ఈ సమయంలో గదాధర్ మానసిక స్థితి, వైఖరి 88; గ్రామంలోని స్త్రీలకోసం గదాధర్ పురాణ పఠనం, సంకీర్తనాదులు 89; గదాధర్ పట్ల గ్రామంలోని స్త్రీల భక్తిప్రపత్తులు 90; స్త్రీ వేషధారణలో గదాధర్ 90; గదాధర్: సీతానాథ్ పాయిన్ కుటుంబం 91; దుర్గాదాస్ గర్వభంగం 92; గదాధర్ పట్ల వణిక్ పల్లెలోని స్త్రీల భక్తివిశ్వాసాలు 93; గదాధర్ గురించి శ్రీమతి రుక్మిణి వివరణ 93; గదాధర్ పట్ల గ్రామస్థు లందరి ప్రేమ 94; పొట్టకూటి చదువుపట్ల గదాధర్ విరక్తి 96; గదాధర్ నిస్వార్థపరత్వం 97; గదాధర్ బడికి వెళ్లక,

మిత్రులతో నాటకాలు ఆడడం 97; లలిత కళలలో గదాధర్ అభినివేశం 98; రాంకుమార్ ఆతణ్ణి కలకత్తాకు తోడ్కొనిపోవడం 99.

2. సాధక భావం

ప్రస్తావన ... 103

ఉపోద్ఘాతం ... 105

అవతార పురుషుల సాధన వృత్తాంతాల అలభ్యత 105; భక్తుల అపార్థాలు 106; దాని నిర్హేతుకత 107; శ్రీరామకృష్ణుల ఉపదేశం: ఈశ్వరుని మహాత్మ్య జ్ఞానం ఉన్నంతవరకూ, 'నువ్వూ-నేను' అన్న ఆత్మీయ ప్రేమ సంబంధం ఏర్పడదు; ఎవరి ఆధ్యాత్మిక భావాన్నీ భగ్నం చేయకు 107; ఆధ్యాత్మిక భావాన్ని భగ్నపరచ డాన్ని గూర్చి ఒక ఉదాహరణ: కాశీపూర్‌లో శివరాత్రి నాడు జరిగిన ఒక సంఘటన 108; అవతారంలో భగవంతుడు మానవమాత్రునిగా ప్రవర్తిస్తాడు 112; ఈ అంశంపై విష్ణు - నారద సంవాదోపాఖ్యానం 114; అవతార పురుషులు ముక్తి మార్గాలను ఆవిష్కరిస్తారు 115; అవతార పురుషులను మానవులుగా భావించ కుంటే ఆ భావన ప్రాధాన్యాన్ని కోల్పోతుంది 115; అవతార పురుషుల గురించిన దృక్పథాలు 116; భగవదవతారం - మానవాళి పట్ల భగవంతుని కారుణ్యం 116.

1. సాధకుడు - సాధన ... 119

సాధన విషయమై సామాన్యుల భ్రాంతి భావన 119; సకల జీవాల్లో బ్రహ్మ దర్శనానికి సాధనే ఉపాయం 120; భ్రమ సత్యాన్ని మరుగుపరుస్తుంది: భ్రమకు హేతువు ఒక మర్మం 121; ఋషులు జగత్తును ఎలా కాంచారో అదే సత్యం: అందుకు కారణం 122; అనేకులకు ఒకే రకం 'భ్రమ' కలుగుతున్నా, ఆ భ్రమ 'సత్యం' కాబోదు 122; సర్వులకూ ఒకే భ్రమ కలగడం ఎందుకు 122; జగత్తు అనే భావం దేశకాలాలకు అతీతమైంది; ప్రకృతికూడ అనాదే! 123; దేశకాలాలకు అతీతమైన జగత్ కారణాన్ని తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే 'సాధన' 124; 'నేతి, నేతి' - 'ఇతి, ఇతి' సాధన మార్గాలు 124; 'నేతి, నేతి' - అనే జ్ఞానమార్గ లక్ష్యం - 'నేను ఎవరినీ?' అన్నదాన్ని తెలుసుకోవడమే 125; నిర్వికల్ప సమాధి 125; సవికల్ప సమాధి : 'ఇతి, ఇతి' సాధనమార్గం 126; దైవీ-మానవ భావాల సంయోగమే అవతార పురుషులు 128.

2. అవతార పురుషుల జీవితాల్లో సాధక భావం ... 129

శ్రీరామకృష్ణులలో దైవ, మానవ భావాల మేళనం 129; అవతార పురుషులందరి విషయం కూడ అలాగే ఉంటుంది 130; అవతార పురుషులకు స్వార్థసుఖభావన లుండవు 130; అవతార పురుషుల కారుణ్యం, సాధనలు ఇతరుల మేలుకే! 131; ఆనంద వన దృష్టాంతం 131; ఆత్మ సంయమం 132; మనసులోని అపరిమిత కోరికలు 132; ''వాసనల నన్నింటినీ త్యజించాలి'' - గురుదేవుల బోధ 133;

వాసనాత్యాగం చేయమని భక్తురాంద్రకు ఉపదేశం 133; అవతార పురుషులు సైతం సూక్ష్మవాసనలతో పోరాడవలసిందే 135; అవతార పురుషులలో మానవ భావా లుంటాయి - అన్నదాని గురించిన ఆక్షేపణకు ఖండన 135; పై విషయాన్నే మరో దృక్కోణం నుండి చూద్దాం 136; ఉన్నత భావస్థాయుల నుండి చూస్తే, ఈ జగత్తు ఆయా స్థాయులకు అనుగుణంగా గోచరిస్తుంది 137; అవతార పురుషుల శక్తిద్వారా మనిషి ఉన్నత భావస్థాయులకు అధిరోహించి, వారిని మానవ స్వభావ రహితులుగా దర్శిస్తాడు 137; అవతార పురుషుల మనోపరిణామక్రమం 138; దేవమానవుడైన అవతార పురుషుడు సర్వజ్ఞుడు 138; జడప్రకృతి విజ్ఞానం జగత్కారణాన్ని వెల్లడించలేదు 139; బాల్యం నుండే అవతార పురుషులు ఆధ్యాత్మిక భావతన్మయులై ఉంటారు 139; ఆరేళ్ల ప్రాయంలో శ్రీరామకృష్ణుల భావ పారవశ్యం 140; విశాలాక్షీదేవిని దర్శింప వెళ్లే సమయంలో గురుదేవులు రెండవ మారు భావసమాధి పొందడం 140; శివరాత్రి నాడు శ్రీరామకృష్ణులు భావ సమాధి పొందడం 146.

3. సాధకభావ తొలి అభివ్యక్తీకరణ ... 149

శ్రీరామకృష్ణుల బాల్యంలో భావపారవశ్యాలను తెలిపే ఇతర సంఘటనలు 149; శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగిన సంఘటనలను ఆరు కోవలుగా వర్గీకరించవచ్చు 150; అద్భుత జ్ఞాపకశక్తికి ఒక దృష్టాంతం 150; సడలని పట్టుదలకు ఒక ఉదాహరణ 151; అఖండ సాహసానికి ఒక ఉదాహరణ 151; వినోద ప్రియత్వానికి ఒక తార్కాణం 151; శ్రీరామకృష్ణుల స్వాభావిక మనోనిర్మాణం 152; పొట్ట కూటి విద్యపట్ల ఆయన ఏహ్యత 152; ఝామపుకూర్ పాఠశాలలో గురుదేవులు 153; గదాయ్ దృక్పథం గుర్తించలేని రాంకుమార్ 154; రాంకుమార్ సాంసారిక పరిస్థితులు 154.

4. దక్షిణేశ్వర కాళికాలయం ... 156

రాంకుమార్ కలకత్తాలో సంస్కృత పాఠశాలను ప్రారంభించడానికి కారణం 156; రాణీ రాస్మణి 157; రాణి దేవీభక్తి 159; ఆలయం గురించి దైవాదేశం 159; కాళికాలయ నిర్మాణం 159; అన్న నైవేద్యం చేయడంలో ఎదురైన సమస్య 160; ఈ సమస్యపరంగా పండితుల ప్రతికూల అభిప్రాయం 160; రాంకుమార్ అభిప్రాయం 161; ఆలయ ప్రతిష్ఠాపనకు రాణి సంకల్పం 161; రాంకుమార్ సర్వతోముఖత్వం 162; యోగ్యుడైన పూజారి కోసం రాణి అన్వేషణ 162; మహేశ్ చంద్ర ఛటోపాధ్యాయ పూజారులను సమకూర్చే బాధ్యత వహించడం 162; పూజారి బాధ్యత వహించమని రాణి, రాంకుమార్‌ను కోరడం 163; దేవిని రాణి ప్రతిష్ఠించడం 165; ప్రతిష్ఠాపన నాడు శ్రీరామకృష్ణుల ప్రవర్తన 165; కాళికాలయ ప్రతిష్ఠాపన గురించి శ్రీరామకృష్ణుల అభివర్ణన 166; ఆహార విషయంలో గురుదేవుల కఠోర నియమం 169; శ్రీరామకృష్ణుల గంగాభక్తి 170; శ్రీరామకృష్ణులు స్వయంగా వండుకొని జీవించడం 170; సంకుచితత్వం, ధార్మిక నిష్ఠ - వీటి తారతమ్యం 171.

5. పూజారిగా శ్రీరామకృష్ణులు ... 173

మొదటిసారి చూసినప్పటినుండి శ్రీరామకృష్ణుల పట్ల మథుర్‌బాబు ఆకర్షణ 173; శ్రీరామకృష్ణుల మేనల్లుడైన హృదయ్ 174; హృదయ్ వచ్చిన సమయంలో శ్రీరామ కృష్ణుల పరిస్థితి 176; శ్రీరామకృష్ణుల పట్ల హృదయ్ ప్రేమ 176; శ్రీరామకృష్ణుల చర్యలను అవగతం చేసుకోలేని హృదయ్ 177; శ్రీరామకృష్ణులు రూపొందించిన శివ విగ్రహాన్ని మథుర్ ప్రశంసించడం 177; ఉద్యోగం చేయడంపై శ్రీరామకృష్ణుల అభిప్రాయం 178; మథుర్‌ను కలుసుకోవడానికి శ్రీరామకృష్ణుల సంకోచం 179; శ్రీరామకృష్ణులు పూజారి పదవిని స్వీకరించడం 180; గోవిందుని విగ్రహం పగిలి పోవడం 181; విరిగిన విగ్రహపూజను గురించి శ్రీరామకృష్ణుల ఉవాచ 182; శ్రీరామకృష్ణుల సంగీత ప్రతిభ 183; పూజ చేస్తున్నప్పుడు శ్రీరామకృష్ణుల ప్రథమ దివ్యదర్శనం 184; రాంకుమార్ శ్రీరామకృష్ణులకు వివిధ దేవతల పూజాపద్ధ తులు నేర్పడం 185; శ్రీ కేనారామ్ భట్టాచార్యుల నుండి శ్రీరామకృష్ణుల శక్తిదీక్ష స్వీకారం 186; రాంకుమార్ మరణం 186.

6. ఆత్మక్షోభ - ప్రథమ దివ్యదర్శనం ... 188

అన్న రాంకుమార్ మరణం తర్వాత శ్రీరామకృష్ణుల ప్రవర్తన 188; హృదయ్ ఆందోళన 189; ఆ సమయంలో పంచవటి, పరిసరాలు 189; రాత్రివేళ ఆ అడవిలోకి ఎందుకు వెళుతున్నారో హృదయ్ వాకబు చేయడం 190; శ్రీరామకృష్ణు లను భయపెట్టడానికి హృదయ్ ప్రయత్నించడం 190; "పాశముక్తుడై ధ్యానం చేయాలి" - శ్రీరామకృష్ణుల ఉవాచ 190; భావనలను కార్యాచరణలో పెట్టడం లోని ఆవశ్యకత 191; సమగ్రమైన శ్రీరామకృష్ణుల పరిత్యాగం 192; శ్రీరామకృష్ణుల సాధన విధానం పట్ల ఆక్షేపణకు ఖండనం 192; ఈ స్థితిలో శ్రీరామకృష్ణుల దేవీపూజా కార్యకలాపాలు 194; శ్రీరామకృష్ణుల పూజాదుల గూర్చి మథుర్‌బాబు ప్రశంస 195; భగవదనురాగం పెంపొందేకొద్దీ, శ్రీరామకృష్ణుల శారీరక మార్పులు 196; మహావ్యాకులతానంతరం జగజ్జనని దర్శనం 197.

7. సాధన - దివ్యోన్మాదం ... 199

ప్రథమ దివ్యదర్శనానంతర స్థితి 199; వినూత్న భౌతిక సంచలనాలు, మానసిక స్ఫురణలు 199; జగన్మాత దర్శనానంతర శ్రీరామకృష్ణుల భావనల, చర్యలలో మార్పు 200; శ్రీరామకృష్ణుల పూజ - దర్శనాదుల్లో మునుపటికీ ఇప్పటికీ మధ్య కనిపించే వ్యత్యాసం 201; ఈ సమయంలో శ్రీరామకృష్ణుల పూజ గురించి హృదయ్ దృక్పథం 202; శ్రీరామకృష్ణుల విపరీత చేష్టలను చూసి ఆలయ ఉద్యో గులు మథుర్‌బాబుకు విన్నవించడం 203; మథుర్‌బాబు శ్రీరామకృష్ణుల పూజా దులను చూసి ముగ్ధుడవడం 204; శ్రీరామకృష్ణులు రాగాత్మిక భక్తిని సంతరించు కోవడం 205; అవతార పురుషులు : రాగాత్మిక భక్తి 206; పాపపురుషుని అను

భూతి 207; రాణీ రాస్మణిని శిక్షించడం 208; భక్తి పరిపక్వత - శ్రీరామకృష్ణుల బాహ్యపూజ సహజంగా ఆగిపోవడం 209; పూజాకార్యాలు ఆగిపోవడం గూర్చి హృదయ్ కథనం; ఆ అవస్థను చూసి మథుర్ సంశయం 210; శ్రీరామకృష్ణులకు ఆయుర్వేద వైద్యుడు గంగాప్రసాద్ సేన్ చికిత్స 211; దక్షిణేశ్వరానికి హలధారి రాక 212.

8. తొలి నాలుగేళ్ల సాధనలో తుది ఘట్టాలు ... 214

సాధనకాల పూర్వాపర్యత 214; సాధనకాల ప్రధాన విభాగాలు 214; తొలి నాలుగు సంవత్సరాల సాధనానుభూతుల సింహావలోకనం 215; జగన్మాత సాక్షాత్కారానంతరం కూడ శ్రీరామకృష్ణులు ఇంకా సాధనలు ఎందుకు చేశారు? 215; శుకుని సాదృశ్యం 216; ఇతరుల కోసమే శ్రీరామకృష్ణులు సాధనలు చేశారు 217; శ్రీరామకృష్ణుల నిక్కమైన తపన - భగవత్సాక్షాత్కారం 217; శ్రీరామకృష్ణుల దాస్యభావ సాధన 219; సీతామాత దర్శనం 219; శ్రీరామకృష్ణులు స్వయంగా పంచవటి నాటడం 220; శ్రీరామకృష్ణుల హఠయోగ అభ్యాసం 222; హలధారి పెట్టిన శాపం 222; శ్రీరామకృష్ణులను గూర్చి హలధారి వైఖరి 224; హలధారి పాండిత్యాహంకారం 224; హలధారి - కాళీ భావన 225; ఉచ్ఛిష్ట భక్షణం 226; హలధారి విమర్శ : భావముఖంలో నెలకొని ఉండమన్న అమ్మ ఆదేశం 227; దక్షిణేశ్వరంలో హలధారి వసించిన కాలగడువు 228; శ్రీరామకృష్ణుల దివ్యోన్మాదం గురించి చర్చ 228; దాన్ని రుగ్మతగా ఎంచడంలోని యుక్తిదోషం 229; అప్పటి శ్రీరామకృష్ణుల ప్రవర్తన ఆ నిర్ణయాన్ని ఖండిస్తుంది 230; శ్రీరామకృష్ణులతో వైష్ణవచరణ్ తొలి సమావేశం 231; విచిత్ర సాధనలు; మనసే (అంతరాత్మ) గురువు 232; పై దర్శన ఆంతర్యం 235; శ్రీరామకృష్ణుల దివ్యదర్శనాలు ఎన్నడూ అసత్యాలు కావు 236; సురేశ్‌చంద్ర మిత్ర ఇంట్లో కలిగిన దర్శనం 236; రాస్మణి, మథుర్‌ల తప్పుడు అభిప్రాయాలు 239.

9. వివాహం : దక్షిణేశ్వరానికి తిరిగి రావడం ... 241

కామార్పుకూర్‌లో శ్రీరామకృష్ణులు 241; శ్రీరామకృష్ణులను భూతం ఆవహించిందన్న వదంతి 242; మంత్రవేత్త 'చండ'ను ఆవాహన చేయడం 242; శ్రీరామకృష్ణుల బంధుగణం అభిప్రాయం 243; శ్రీరామకృష్ణులలో యోగశక్తులు వ్యక్తం కావడం 244; శ్రీరామకృష్ణులకు వివాహం చేయాలని బంధువులు నిర్ణయించడం 245; ఎందుకు శ్రీరామకృష్ణులు వివాహానికి అంగీకరించారు? 245; వధువును తానే ఎంపిక చేయడం 245; వివాహం 246; వివాహానంతరం చంద్రాదేవి, శ్రీరామకృష్ణుల ప్రవర్తన 246; శ్రీరామకృష్ణులు కలకత్తాకు తిరిగి వెళ్లడం 247; రెండవ మారు శ్రీరామకృష్ణుల దివ్యోన్మాదం 248; చంద్రాదేవి ప్రాయోపవేశం 248; ఈ సమయంలో శ్రీరామకృష్ణుల స్థితి 249; శ్రీరామకృష్ణులలో శివ-కాళీలను మథుర్ దర్శించడం 250.

10. భైరవీ బ్రాహ్మణి ఆగమనం ... 251

రాణీ రాస్మణికి తీవ్రవ్యాధి 251; దానపత్రం అమలుపరచడం - రాణి మరణం 251; మృత్యుకాలంలో రాణికి దేవీదర్శనం 252; రాణి అనుమానం నిజమైంది 252; మథుర్‌బాబు అభ్యున్నతి - అతడి భాగస్వామ్యం 253; మథుర్‌బాబు వన రులు శ్రీరామకృష్ణుల తోడ్పాటుకే 253; శ్రీరామకృష్ణుల పట్ల మథుర్, ఇతరుల భావనలు 254; భైరవీ బ్రాహ్మణి ఆగమనం 255; శ్రీరామకృష్ణులతో ఆమె తొలి సమావేశం 256; ఇద్దరి మధ్య సంభాషణ 257; పంచవటిలో భైరవికి దివ్యదర్శనం 258; పంచవటిలో శాస్త్రచర్చ 258; దేవమండల్ ఘాట్‌కు భైరవి బసను కూర్చుకోవడానికి కారణం 259; శ్రీరామకృష్ణులు అవతార పురుషులన్న భైరవి విశ్వాసానికి హేతువులు 260; వైష్ణవచరణ్ రాక 261.

11. తాంత్రిక సాధన ... 263

శ్రీరామకృష్ణుల పట్ల బ్రాహ్మణికిగల కచ్చితమైన అవగాహన 263; బ్రాహ్మణి, శ్రీరామకృష్ణులను తాంత్రిక సాధనలు ఎందుకు చేయ మన్నది? 264; అవతార మూర్తియైన ఆయనకు సహాయపడాలని బ్రాహ్మణికి ఎలా తోచింది? 264; అలా చేయడంలో బ్రాహ్మణి ఆతురత 265; జగజ్జనని అనుజ్ఞతోనే శ్రీరామ కృష్ణులు తాంత్రిక సాధనల నను ష్ఠించడం : వాటికోసం ఆయన వ్యాకులత 265; సాధనా కాలంలో గురుదేవుల తీవ్రవ్యాకులత 266; పంచముండి పీఠ నిర్మాణం, 64 తంత్రాలలోని ముఖ్యసాధనల నను ష్ఠించడం 268; స్త్రీమూర్తిలో జగన్మాతను దర్శించడం 269; ఘృణాత్యాగం (ఏహ్యభావాన్ని విడిచిపెట్టడం) 270; తాంత్రిక సాధనా సమయాలలో శ్రీరామకృష్ణుల ప్రవర్తన 270; శ్రీరామకృష్ణులు చెప్పిన వినాయకుడి కథ 271; గణేశ కార్తికేయుల విశ్వపరిభ్రమణ వృత్తాంతం 272; తాంత్రిక సాధన : శ్రీరామకృష్ణుల అనుపమానత 273; ఆ అనుపమానత వెనుకవున్నది జగన్మాత సంకల్పమే! 273; శక్తి (స్త్రీ) సాహచర్యం లేకనే శ్రీరామ కృష్ణుల విజయంలోని అంతస్సూచన 274; తాంత్రిక సాధనల ఉద్దేశం 274; స్త్రీ సాహచర్యం లేకనే శ్రీరామకృష్ణులు విజయవంతు లవడంలోని మరొక కారణం 275; తాంత్రిక సాధనా కాలంలో శ్రీరామకృష్ణుల అనుభవాలు - దర్శ నాలు 275; నర్మాంస ఉచ్ఛిష్టాన్ని తినడం 275; జ్ఞానాగ్నిచే ఆవృతుడై ఉన్నట్లు దర్శించడం 276; కుండలినీ జాగ్రుతం 276; బ్రహ్మయోనిని దర్శించడం 276; అనాహత ధ్వనిని ఆలకించడం 276; అష్టసిద్ధులు : వాటి నిరర్థకత్వం 277; అష్టసిద్ధుల గురించి వివేకానందులతో శ్రీరామకృష్ణుల ముచ్చట 277; మహామాయ దర్శనం 277; షోడశీ సౌందర్యం 278; తాంత్రిక సాధనల ఫలి తాలు 278; తంత్రోక్త సాధన కాలంలో శ్రీరామకృష్ణుల మేనిఛాయ 279; భైరవీ బ్రాహ్మణి యోగమాయ అంశ 279.

12. జటాధారి ఆగమనం - శ్రీరామకృష్ణుల వాత్సల్యభావ సాధన ... 280

మథురానాథ్ అనుభవం - నడవడిక 280; మథుర్ 'అన్నమేరు' వ్రతానుష్ఠానం 281; వేదాంత పండితుడు పద్మలోచన్‌ను శ్రీరామకృష్ణులు కలుసుకోవడం 282; శ్రీరామకృష్ణుల వైష్ణవీయ సాధనలకు కారణాలు 282; వాత్సల్య మధుర భావ సాధనలప్పుడు శ్రీరామకృష్ణులలో స్త్రీ స్వభావాలు ఉదయించడం 283; శ్రీరామకృష్ణుల మనోనిర్మాణం 284; శ్రీరామకృష్ణులలో గత సంస్కారాలు అసలు లేకపోవడం 285; శ్రీరామకృష్ణుల సద్గుణసంపత్తి 285; శ్రీరామకృష్ణుల అసాధారణ మనోనిర్మాణానికి కొన్ని దృష్టాంతాలు 286; సాధుసత్తములకు మథుర్ సేవా నిరతులు 287; జటాధారి ఆగమనం 288; శ్రీరామకృష్ణ జటాధారుల మధ్య నెలకొన్న సాన్నిహిత్యం 289; సఖీభావ మనోదశ 289; స్త్రీభావ మనోదశలో వాత్సల్యభావ సాధన 290; శ్రీరామకృష్ణుల సాధన తీవ్రత్వం 290; సాధక శ్రేష్ఠులు : సంయమం 290; అటువంటి సాధకులు ఏ విషయంలోనూ కలత చెందరు 292; అలాంటి సాధకులు నిస్వార్థపరులు 293; అలాంటి సాధకులు సత్యసంకల్పులవుతారు : ఇందుకు శ్రీరామకృష్ణుల జీవితంలో దృష్టాంతాలు 293; శ్రీరామకృష్ణులు - జటాధారి 294; జటాధారి 'రామ్‌లాలా' విగ్రహాన్ని శ్రీరామకృష్ణులకు కానుకగా ఇవ్వడం 295; వాత్సల్యభావ సాధనలో భైరవీ బ్రాహ్మణి సహాయం 295.

13. మధురభావ సార తత్త్వం ... 297

సాధకుడి అంతరంగ పోరాటం 297; నిర్వికల్ప సమాధి - అసాధారణ సాధకులు 298; 'శూన్యం', 'పూర్ణం' యథార్థానికి ఒక్కటే 298; అద్వైత స్వరూపం 299; పంచ భావాలు - భగవత్సాక్షాత్కారం 299; ఈ పంచభావాలు మనిషి పురోగతికి ఎలా తోడ్పడతాయి 300; భగవంతుడి ప్రేమ - వ్యక్తిత్వం 301; ప్రేమ శక్తుల - చైతన్య నిర్మూలన 301; ప్రతి భావం యొక్క స్వావలంబన 302; పంచభావాల ద్వారా అద్వయ స్థితిని పొందడం 303; విభిన్న యుగాలలో వేర్వేరు సాధనలు 303; భారతదేశంలోను విదేశాలలోను పంచభావాల వికాసం 304; భావ ప్రగాఢతను తెల్పే సూచికలు 304; ఈ భావాలన్నింటిలోను శ్రీరామకృష్ణుల అనుపమాన సాఫల్యం 305; సాధక వీరుల ఆధ్యాత్మిక సాధనల నమోదు కొరత 305; ఉదాహరణలు: శ్రీకృష్ణుని గురించి 306; బుద్ధదేవుని గురించి 306; భగవాన్ ఏసును గురించి 306; శంకరుల గురించి 307; చైతన్యుల గురించి 307; మధురభావం చరమ తత్త్వాన్ని గురించి శ్రీరామకృష్ణులు 308; మధురభావం: వైష్ణవాచార్యులు 308; బృందావన లీలలపై శ్రీరామకృష్ణులు నుడివినది 309; శ్రీచైతన్యులు - మధురభావం 310; శ్రీచైతన్యులు - సమకాలీన ఆధ్యాత్మిక స్థితిగతులు 311; మధురభావ సార తత్త్వం 312; ప్రియుడిపైగల యావత్తు ప్రేమనూ భగవంతుడిపై ఆరోపితం చేయడం 314; అన్ని ఇతర భావాలూ వెరసినా మధుర భావమే మిన్న 314;

మధురభావం ద్వారా చైతన్యులు చేసిన సేవలు 315; వేదాంతులు - మధుర భావం 316; మధుర భావం - శ్రీమతి ప్రేమభావ స్థితి 317.

14. శ్రీరామకృష్ణుల మధురభావ సాధన ... 318

ఆధ్యాత్మిక భావాలలో నెలకొని ఉండడమే శ్రీరామకృష్ణుల స్వాభావికత 318; శ్రీరామకృష్ణులపై సాధనల పరిణామాలు 319; మధురభావ సాధనకు పూర్వం ఆయన వైఖరి 319; శ్రీరామకృష్ణుల సాధనలు శాస్త్ర సమ్మతాలే! 320; శాస్త్రాల ధర్మాదేశాలను శ్రీరామకృష్ణులు పాటించడం 320; మధురభావ సాధన కాలంలో శ్రీరామకృష్ణుల స్త్రీ వేషధారణ 321; స్త్రీల లక్షణాలు ఆయనలో అభివ్యక్త మవడం 322; మథుర్ కుటుంబంలో మిత్రురాలిగా శ్రీరామకృష్ణులు 322; స్త్రీ వేషధారణలో శ్రీరామకృష్ణులను గుర్తించలేకపోవడం 323; మధురభావ సాధనానుష్ఠాన కాలంలో భౌతిక మార్పులు 323; శ్రీరామకృష్ణుల సర్వోత్కృష్ట ప్రేమ 324; శ్రీమతి సర్వాతిశయ ప్రేమ 324; శ్రీ గౌరాంగుని సర్వోత్కృష్ట ప్రేమ 325; శ్రీరామకృష్ణుల రాధాదేవి దర్శనం 325; శ్రీమతితో శ్రీరామకృష్ణులు తాదాత్మ్యం చెందడం 326; స్త్రీభావం నెలకొన్న కాలంలో శ్రీరామకృష్ణులలో కలిగిన అసాధారణ భౌతిక మార్పులు 327; మానసమే దేహాన్ని కల్పిస్తుంది 327; శ్రీకృష్ణ దర్శనం 328; యౌవనంలో శ్రీరామకృష్ణుల ఆకాంక్ష 328; భాగవతం, భక్తుడు, భగవంతుడు - మూడూ ఒకటే - ఒకటే మూడూ 329.

15. శ్రీరామకృష్ణుల వేదాంత సాధన ... 330

ఈ సమయంలో శ్రీరామకృష్ణుల మనఃస్థితి గురించి ఒక అధ్యయనం 330; భగవత్సాక్షాత్కారానంతరం ఆయన సాధన - దాని అంతరార్థం 332; దక్షిణేశ్వరానికి శ్రీరామకృష్ణుల తల్లి రాక 333; చంద్రాదేవిలోని లోభరాహిత్యం 334; హలధారి నిష్క్రమణ - అక్షయ్ ఆగమనం 335; భావసమాధిలో పరిపూర్ణత నొందాక అద్వైత సాధనానుష్ఠానం - తత్కారణం 336; అద్వైత భావం - భక్తి భావం 337; శ్రీ తోతాపురి దక్షిణేశ్వర ఆగమనం 337; శ్రీరామకృష్ణులకు జగజ్జనని ఆదేశం 338; జగన్మాతను గురించి తోతాపురి భావన 338; గోప్యంగా సన్న్యాసం స్వీకరించాలన్న శ్రీరామకృష్ణుల నిశ్చయం : తత్కారణం 339; శ్రాద్ధాది కర్మల ఆచరణ 340; సన్న్యాస దీక్షకు ముందు పఠించే ప్రార్థనా మంత్రాలు 341; సన్న్యాస దీక్షకు ముందు అనుష్ఠించే విరజాహోమ భావార్థం 342; శిఖను, యజ్ఞోపవీతాన్ని త్యజించడం 342; తోతాపురి ఉద్బోధ 343; శ్రీరామకృష్ణులకు నిర్వికల్ప సమాధి సిద్ధించడం 344; తోతాపురి నిర్ధారణ - విస్మయం 345; శ్రీరామకృష్ణులను సమాధి స్థితి నుండి బాహ్యస్పృహలోకి తేవడానికి తోతాపురి చేసిన ప్రయత్నం 346; ప్రాణాంతకమైన రోగం నుండి జగదంబాదాసిని శ్రీరామకృష్ణులు రక్షించడం 347.

16. వేదాంత సాధనకు భరతవాక్యం - ఇస్లాం మత సాధన ... 349

శ్రీరామకృష్ణుల తీవ్ర వ్యాధి : ఆయన అసదృశ వైఖరి 349; 'భావముఖం'లో నెలకొని ఉండడం గురించి శ్రవణ సంబంధిత అనుభవం : తత్ఫలితం 350; గతజన్మల స్మృతి - బ్రహ్మజ్ఞాన అనుభూతి 351; సంకల్పాలన్నీ సత్యం అయ్యే స్థితి 352; శాస్త్రబోధనల వెలుగులో శ్రీరామకృష్ణుల అసాధారణ అనుభూతులు 352; పైన పేర్కొన్న అనుభూతులన్నీ ఏకకాలంలో కలుగకపోవడానికి హేతువు 353; సాధన లన్నిటి చరమలక్ష్యం అద్వైత సాక్షాత్కారమే 353; పైన పేర్కొన్న శ్రీరామకృష్ణుల అనుభూతి న భూతో న భవిష్యతి 354; శ్రీరామకృష్ణుల ఇస్లాం మత సాధన - ఆయన ఉదారతకొక దృష్టాంతం 354; సూఫీ సాధకుడు గోవింద రాయ్ ఆగమనం 355; గోవిందతో మాట్లాడిన పిదప శ్రీరామకృష్ణుల సంకల్పం 355; గోవింద నుండి దీక్ష - తత్సాధనలో సిద్ధి 356; ఇస్లాం ధర్మసాధనా కాలంలో శ్రీరామకృష్ణుల ప్రవర్తన 356; ఇస్లాం మత సాధన - దాని ప్రాధాన్యం 357; శ్రీరామకృష్ణులలో అద్వైత స్మృతి ప్రగాఢత 357; కొన్ని ఉదాహరణలు : గడ్డికోసే ముసలివాడు 357; గాయపడిన సీతాకోక చిలుక 358; కాళ్ళక్రింద త్రొక్కివేయబడిన లేతపచ్చిక 358; పడవవాని ముష్టిఘాతానికి శ్రీరామకృష్ణుల వీపు వాచిపోవడం 358.

17. కామార్పుకూర్‌లో... ... 360

భైరవీ బ్రాహ్మణి, హృదయ్‌లతో శ్రీరామకృష్ణులు కామార్పుకూర్ సందర్శిం చడం 360; బంధుమిత్రుల నడుమ 361; కామార్పుకూర్‌కు మాతృదేవి ఆగమనం 362; అందరి పట్ల శ్రీరామకృష్ణులు ప్రవర్తించిన తీరుతెన్నులు 362; కొందరు గ్రామస్థుల ఆధ్యాత్మిక పురోభివృద్ధి గురించి 363; కామార్పుకూర్‌లో శ్రీరామకృష్ణుల భావనలు 363; స్వగ్రామం పట్ల శ్రీరామకృష్ణుల అభిమానం 364; భార్యపట్ల శ్రీరామకృష్ణుల కర్తవ్య నిర్వహణ 365; దానిలో శ్రీరామకృష్ణుల సాఫల్యం 365; భైరవీ బ్రాహ్మణి వెరపు 366; గర్వాహంకారాల ఉద్ధతితో బ్రాహ్మణి వివేచనాశక్తిని కోల్పోవడం 367; ఆ పరిస్థితిని కల్పించిన సంఘటన 367; బ్రాహ్మణితో హృదయ్ తగవులాట 367; బ్రాహ్మణి తన తప్పిదాన్ని గుర్తించడం - సెలవు పుచ్చుకోవడం 368; దక్షిణేశ్వరానికి శ్రీరామకృష్ణులు తిరిగి రావడం 368.

18. శ్రీరామకృష్ణుల తీర్థయాత్ర - హృదయరాం వృత్తాంతం ... 369

శ్రీరామకృష్ణుల తీర్థయాత్ర నిర్ణయమవడం 369; తీర్థయాత్రకు బయలుదేరిన రోజు 369; యాత్ర ఏర్పాట్లు 369; వైద్యనాథ్ సందర్శనం - దరిద్ర నారాయణ సేవ 370; దారిలో ఊహించని సంఘటన 370; కేదార్‌ఘాట్ వద్ద బస చేయడం 370; శ్రీరామకృష్ణులు - త్రైలింగస్వామి 371; ప్రయాగలో శ్రీరామ కృష్ణుల ప్రవర్తన 371; బృందావనంలోని నిధువనం ప్రభృత స్థలాల సందర్శనం

371; కాశీకి తిరిగి రాక 372; కాశీలో భైరవీ బ్రాహ్మణిని కలుసుకోవడం 372; వీణావాదకుడైన మహేశ్‌ను చూడవెళ్లడం 372; దక్షిణేశ్వరానికి తిరిగి రావడం: తదనంతర కార్యాలు 373; హృదయ్ భార్య మరణం 373; హృదయ్ భావ పారవశ్యం 375; హృదయ్ చూసిన అద్భుత దర్శనం 375; హృదయ్ మనస్సు మందగించడం 376; హృదయ్ సాధనలకు విఘ్నం 376; హృదయ్ శ్రీశ్రీ దుర్గాపూజ మహోత్సవం నిర్వర్తించడం 377; హృదయ్‌కు శ్రీరామకృష్ణుల దర్శనం 378; దేవీనవరాత్రోత్సవ కడపటి సందర్భం 379.

19. బంధు వియోగం ... 380

అక్షయ్ వృత్తాంతం 380; అక్షయ్ సౌందర్యం 380; సాధన పట్ల అక్షయ్ భక్తి ప్రపత్తులు 381; అక్షయ్ వివాహం 381; వివాహానంతరం అక్షయ్ తీవ్ర వ్యాధిగ్రస్తుడవడం 381; అక్షయ్ బ్రతకడని శ్రీరామకృష్ణులు చెప్పిన భవిష్యవాణి 382; హృదయ్ దడుపు, ప్రవర్తన 382; అక్షయ్ మరణం : శ్రీరామకృష్ణుల ప్రవర్తన 382; అక్షయ్ మరణం పట్ల శ్రీరామకృష్ణుల మనోక్లేశం 382; పూజారిగా రామేశ్వర్ నియామకం 383; మథుర్‌తో రాణాఘాట్‌లో శ్రీరామకృష్ణులు - దరిద్ర నారాయణ సేవ 383; మథుర్ పూర్వీకుల గృహంలో శ్రీరామకృష్ణులు 384; 'కలుటోలా' హరిసభలో, కాల్నా, నవద్వీపాది ప్రాంతాలలో శ్రీరామ కృష్ణులు 384; మథుర్‌బాబు నిస్వార్థ భక్తిప్రపత్తులు 385; మథుర్, శ్రీరామ కృష్ణుల పరస్పర ప్రేమ, ఆరాధన 386; ఒక వృత్తాంతం 386; మరో వృత్తాంతం 386; నిస్వార్థ భక్తిపై శాస్త్రవాక్యం 387; మథుర్‌బాబు కాలధర్మం 387; భావసమాధిలో శ్రీరామకృష్ణులు ఆ సంఘటన తిలకించడం 388.

20. షోడశీ పూజ ... 389

వివాహానంతరం మొట్టమొదటిసారి శ్రీరామకృష్ణులతో మాతృదేవి సమావేశం 389; అప్పటి మాతృదేవి మనోవైఖరి 390; జయరాంబాటిలో ఆమె జీవితం 390; ఆమె మనోవ్యథ - సంకల్పం 391; సంకల్ప కార్యాచరణ 391; కాలి నడకన తండ్రితో దక్షిణేశ్వరానికి 392; జ్వరపీడితురాలైన మాతృదేవికి కలిగిన అద్భుత దర్శనం 393; మాతృదేవి దక్షిణేశ్వర ఆగమనం : శ్రీరామకృష్ణుల ప్రవర్తన 393; ఆనందభరితురాలైన మాతృదేవి 394; స్వీయ బ్రహ్మజ్ఞానాన్ని శ్రీరామకృష్ణులు పరీక్షించుకోవడం 394; మాతృదేవికి ఆయన శిక్షణ 395; ఆయన బోధన విధానం 395; మాతృదేవిని ఏ దృష్టితో శ్రీరామకృష్ణులు చూసేవారు? 396; ఆత్మసంయమాన్ని శ్రీరామకృష్ణులు పరీక్షించుకోవడం 396; అనుపమానమైన శ్రీరామకృష్ణుల వర్తన 397; మాతృదేవి అసాధారణ ప్రవృత్తి గురించి శ్రీరామకృష్ణులు 397; పరీక్షానంతరం శ్రీరామకృష్ణుల సంకల్పం 398; షోడశీ పూజకు సన్నాహాలు 398; మాతృదేవికి అభిషేకం చేసి ఆమెను శ్రీరామకృష్ణులు అర్చించడం 399; శ్రీరామకృష్ణుల సమాధి, జపత

పాదుల సమర్పణ 399; మాతృదేవి : శ్రీరామకృష్ణుల ఎడతెగని సమాధి స్థితి 401.

21. శ్రీరామకృష్ణుల సాధనలకు భరతవాక్యం ... 402

షోడశీ పూజతో శ్రీరామకృష్ణులలో సాధన ఆకాంక్ష సమసిపోవడం 402; అద్భుత రీతిలో క్రీస్తుమత పరిపూర్ణత్వాన్ని శ్రీరామకృష్ణులు సంతరించుకోవడం 403; శ్రీరామకృష్ణుల ఏసుక్రీస్తు దర్శనం బుజువు కావడం 405; బుద్ధుని గురించి శ్రీరామకృష్ణుల దృక్పథం 405; జైన సిక్కు సంప్రదాయాల పట్ల శ్రీరామకృష్ణుల భక్తి విశ్వాసాలు 406; శ్రీరామకృష్ణుల అద్భుత అనుభూతుల పునరావృత్తి 407; తమను గురించిన అనుభూతులు : తాము ఒక భగవదవతారం 407; తమకు ముక్తి లేదనే విషయం 408; తమ మరణాన్ని గురించిన ఎరుక 408; ఆధ్యాత్మికతకు చెందిన అనుభూతులు : అన్ని మతాలూ సత్యాలే - ఎన్ని మతాలో అన్ని మార్గాలు 409; ప్రతి వ్యక్తీ తన మనఃస్థితుల మేరకు ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత తత్త్వాలను అంగీకరింప వలసిందే! 409; కర్మయోగాన్ని ఆశ్రయిస్తే సామాన్యంగా జనం ప్రగతి నొందుతారు 410; ఉదార దృక్పథ సంప్రదాయ సుస్థాపన 411; కడపటి జన్మలో ఉన్న వారంతా ఆయన ఉపదేశాలు అంగీకరించారు 411; విభిన్న సమయాల్లో శ్రీరామకృష్ణులను దర్శించిన ముగ్గురు ప్రసిద్ధ సాధకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు 412; పండితుల ఆగమన సమయాల నిరూపణ 412; తమ అంతరంగిక భక్తులను చూడగోరడం - బిగ్గరగా వారిని పిలవడం 414.

అనుబంధం ... 415

రామేశ్వర్ మరణం 415; రామేశ్వర్ మరణం గురించి శ్రీరామకృష్ణుల హెచ్చరిక 416; తల్లి సంవేదన పట్ల శ్రీరామకృష్ణుల అక్కర 416; మరణ సమయంలో రామేశ్వర్ ప్రవర్తన 416; మరణానంతరం రామేశ్వర్ మళ్లీ కానరావడం 417; దక్షిణేశ్వర పూజారిగా రామ్‌లాల్ నియామకం 417; శంభుమల్లిక్ ఉదంతం 418; మాతృదేవి నిమిత్తం శంభు ఒక గది కట్టించి ఇవ్వడం 419; మాతృదేవి తీవ్ర అనారోగ్యానికి గురికావడం 420; సింహవాహినీ ఆలయంలో మాతృదేవి ప్రాయోపవేశం 420; మరణ సమయంలో శంభు నిర్భీక వర్తనం 420; చంద్రమణీదేవి అంతిమ దినాలు 421; శ్రీరామకృష్ణులు తల్లికి తర్పణం చేయ ప్రయత్నించడం 423; శ్రీరామకృష్ణులు కేశవచంద్ర సేన్‌ను చూడబోవడం 423; బేల్ఘరియా ఉద్యానంలో కేశవ్ 423; మొదటిసారిగా కేశవ్‌తో శ్రీరామకృష్ణులు సంభాషించడం 424; శ్రీరామకృష్ణులకూ, కేశవ్‌సేన్‌కూ మధ్య నెలకొన్న సాన్నిహిత్యం 425; దక్షిణేశ్వరంలో కేశవ్ ప్రవర్తన 425; కేశవ్‌కు, శ్రీరామకృష్ణుల ఉపదేశాలు 426; కూచ్‌బిహార్ వివాహం : పర్యవసానం 427; శ్రీరామకృష్ణులను అమితంగా గౌరవించాడు కాని ఆయన ఆదర్శాల నన్నిటినీ

కేశవ్ అంగీకరించలేదు 427; 'నవవిధాన్' : శ్రీరామకృష్ణుల అభిప్రాయం 428; శ్రీరామకృష్ణులు : భారత జాతీయ సమస్య 428; కేశవ్ మరణం పట్ల శ్రీరామ కృష్ణుల ప్రతిస్పందన 429; సంకీర్తన చేస్తున్న గౌరాంగుని శ్రీరామకృష్ణులు దర్శిం చడం 429.

3. గురు భావం - 1

ప్రస్తావన ... 435

హిందూమతం : శ్రీరామకృష్ణులు ... 438

1. భావముఖంలో శ్రీరామకృష్ణులు ... 445

శ్రీరామకృష్ణుల పలుకులలోని గూఢార్థం 445; అవతార పురుషు లందరి వచనాల్లో సారూప్యం 446; ఒక ఉదాహరణ : గిరీశ్ - ముక్త్యారునామా 447; గిరీశ్ మాన సిక స్థితి 447; ముక్త్యారునామా ఇవ్వాక గిరీశ్ మానసిక స్థితి 449; ముక్త్యారు నామాను ఇవ్వడం ఒక ప్రేమ బంధనం 449; గిరీశ్‌కు శిక్షణ ఇచ్చిన విధానం 450; ముక్త్యారునామాను ఇవ్వడంలోని ప్రాధాన్యాన్ని గిరీశ్ అవగతం చేసుకోవడం 451; అవతార పురుషులు : ముక్త్యారునామా 452; ఉదాహరణ 452; 'ముక్త్యారునామా'ను అంగీకరించడంలో శ్రీరామకృష్ణుల అంతర్దృష్టి 453; బొల్లి వ్యాధిని శ్రీరామకృష్ణులు నయం చేయడం 453; 'ముక్త్యారునామా'ను ఇవ్వడం లోని క్లిష్టత 454; 'ముక్త్యారునామా'ను ఇవ్వగల మానసిక స్థితి 455; మనస్సు కల్పించే భ్రమ నుంచి జాగ్రత్త వహించు 455; మరో దృక్పథం 456; గోహత్యకు పాల్పడిన బ్రాహ్మణుని కథ 457; శ్రీరామకృష్ణుల వచనాల ప్రగాఢతర అర్థం 457; యుక్తసమయంలో అవగాహన కలుగుతుంది 458; పట్టువిడువని సాధనానుష్ఠాన ఆవశ్యకత 459; మందభక్తిని వీడు 460; ఆధ్యాత్మిక భావనల మూర్తియైన శ్రీరామకృష్ణులు - భావనల మార్పుకు అనుగుణమైన శారీరక మార్పులు 460; సర్వులలోని సమస్త భావాలను గ్రహించగల శ్రీరామకృష్ణుల శక్తి 461; మొదటి దృష్టాంతం : మణిమోహన్ పుత్రశోక ఉదంతం 462; రెండవ ఉదాహరణ : కామాన్ని జయించడంపై శ్రీరామకృష్ణులు 466; మూడవ ఉదాహరణ: పై విష యంలో యోగానందస్వామికి శ్రీరామకృష్ణుల ఉపదేశం 467; నాలుగవ ఉదా హరణ: మణిమోహన్ బంధువు ఉదంతం 469; స్త్రీల నానా మానసిక అవస్థలను గ్రహించగల శ్రీరామకృష్ణుల శక్తి 469; అందుకు కారణం 470; శ్రీరామకృష్ణుల సమక్షంలో స్త్రీలు అరమరికలు లేకుండా మెలగడానికి హేతువు 471; మొదటి ఉదాహరణ 471; పై విషయం గురించి రెండవ ఉదాహరణ 472; స్త్రీలపై సమాన కృపను శ్రీరామకృష్ణులు వర్షించడం 474; స్త్రీల హావభావాలను శ్రీరామ కృష్ణులు అనుకరించడం 475; స్త్రీ పురుషుల నైజాలు రెండూ శ్రీరామకృష్ణులలో మేళవించి ఉండడం 476; భావముఖ స్థితిలో వసించడం చేత శ్రీరామకృష్ణులు సర్వుల భావాలూ అవగతం చేసుకోగలిగారు 476.

2. భావం, సమాధి, దివ్యదర్శనాలు ... 478

సమాధి: మెదడుకు సంబంధించిన రుగ్మత కాదు 479; పారమార్థికతను, శాశ్వత శాంతి సమాధి ద్వారా మాత్రమే పొందగలరు 479; దేవతామూర్తుల దర్శనాదులు: ఆధ్యాత్మిక పురోగతి 480; ఆధ్యాత్మికతకు నిజమైన చిహ్నాలు 481; ఆధికారిక పురుషులు, ఈశ్వరకోటులు, జీవకోటులు 481; అద్వైత స్థితిలోని పరిమాణ తారతమ్యాలు 482; సవికల్ప సమాధి: భావాల ప్రాధత 482; ఆధ్యాత్మిక భావాల మార్పు మేరకు శారీరక మార్పులు అనివార్యం 482; ఉన్నత, నిమ్న భావసమాధులను తెలుసుకొనే పద్ధతి 483; అవతార పురుషులు మాత్రమే ఈ అన్ని ఆధ్యాత్మిక భావాలను సమగ్రంగా అనుభూతం చేసుకోగలరు 483; శ్రీరామకృష్ణుల వేదాంత చర్చకు బ్రాహ్మణి ప్రతికూలత 484; నిర్వికల్ప సమాధిలో సతతం మగ్నులై ఉండాలని శ్రీరామకృష్ణుల సంకల్పం 484; శ్రీరామకృష్ణుల అనుపమాన మానసం 485; శ్రీరామకృష్ణుల సత్యనిష్ఠ 486; మొదటి ఉదాహరణ 487; రెండవ ఉదాహరణ 487; మూడవ ఉదాహరణ 487; జగజ్జనని ఆయనను తప్పుటడుగు వేయనివ్వదు 488; నిర్వికల్ప సమాధి మార్గంలో శ్రీరామకృష్ణులకు ఎదురైన అడ్డంకి 489; సమాధ్యవస్థలో ఆరు నెలలు 490; శ్రీరామకృష్ణుల సమాధి స్థితిపై కెప్టెన్ 491; దీనిని గురించి శ్రీరామకృష్ణుల ఉవాచ 492; భావానుగుణంగా ఏర్పడే శారీరక మార్పుల పట్ల ప్రాచ్య, పాశ్చాత్యుల దృక్పథాలు 492; చుట్ట చుట్టుకొన్న శక్తి - కుండలిని 493; మనశ్శరీరాల సంబంధం 493; భావాలు సాంక్రమికాలు కావడం చేత సత్సాంగత్య ఆవశ్యకం 494; మానసిక ఏకాగ్రత వలననే శారీరక మార్పు కలుగుతుంది 494; భక్తి, యోగమార్గాల సామరస్యం 494; కుండలినీ శక్తి, దాని అవస్థలు 495; జాగృతమైన కుండలినీశక్తి పురోగతి: షట్చక్ర భేదనం: సమాధి 496; ఈ విషయంలో శ్రీరామకృష్ణుల అనుభవం 497; నిర్వికల్ప సమాధి అనుభూతులను వివరించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు 497; సమాధి మార్గంలో కుండలినీశక్తి ఐదు గతులు 498; వేదాంతం పేర్కొనే సప్తభూములు 499; శ్రీరామకృష్ణుల ధారణశీల శక్తి 500; సరళంగా అద్వైత స్థితిని శ్రీరామకృష్ణులు వివరించడం 500; స్వామి తురీయానంద 501; వేదాంత సూక్తి : బ్రహ్మసత్యం - జగన్మిథ్య 501; భగవదనుగ్రహం లేనిదే భగవత్సాక్షాత్కారం సిద్ధించదు 504; స్వయంగా తమ వ్యాధిని నయం చేసుకోమన్న శశధర పండితునికి, శ్రీరామకృష్ణుల సమాధానం 504; వివేకానందాదులు అట్లే చేయమని పట్టుబట్టడం: ఆయన జవాబు 505; శ్రీరామకృష్ణుల అద్వైతభావ ప్రాధత 506; నానారకాల శోధనలను అతిక్రమించిన శ్రీరామకృష్ణులు 506; శ్రీరామకృష్ణుల అంతరంగ అనుభూతులు - బాహ్యజగత్తు వాస్తవాలు 506; విభిన్న భక్తులతో శ్రీరామకృష్ణుల విభిన్న సంబంధాలు 508; రెండు కోవల భక్తులు 508; ప్రతి ఒక్క భక్తుని అంతరంగ ప్రవృత్తిని శ్రీరామకృష్ణులు ఎరిగి ఉండడం 509; ఆధ్యాత్మికపథంలో భక్తులను నానారీతుల్లో ఆయన పురోగమింప చేయడం 509; భక్తులు: దేవీదేవతల దర్శనాలు 510; వైకుంఠ దర్శనం పొందిన ఒక భక్తుడు 510; సాకారవాదులకు

శ్రీరామకృష్ణుల ఉపదేశం 511; ధ్యానానికి మునుపు మనస్సును ప్రక్షాళన చేసుకో 511; సాకారవాదమా, నిరాకారవాదమా? ఏది ఉత్కృష్టం? 512; సాకార, నిరాకారాల సామరస్యం 512; స్వామి వివేకానంద అంధవిశ్వాసం 513; అపక్వ నిరాకారవాదులకు ఉపదేశం 514; తమ రూపాన్ని ధ్యానించమని భక్తులకు ఉపదేశం 514; భగవంతుని తోటి బాంధవ్య ఆవశ్యకత 514; బాంధవ్యం ప్రగాఢమయ్యే కొద్దీ ఆయనపై ప్రేమపూర్వకంగా ఒత్తిడి తీసుకురావచ్చు 515; పదభ్రష్టయైన స్త్రీ ఉదాహరణ 515; భగవత్సాక్షాత్కార సంకల్పం 515; ఒక్కొక్కటిగా కోర్కెలను పరిత్యజించాలి 516; గాలంవేసి చేపలు పట్టేటప్పుడు కనబరిచే పట్టుదల, ఓర్పు అవసరం 516; భగవంతుని వినికిడి అతిసూక్ష్మం 516; ఆధ్యాత్మిక భావమగ్నులైనప్పటికీ అన్నిటిపట్ల ఆయన నిశిత దృష్టి 517; మొదటి ఉదాహరణ 517; రెండవ ఉదాహరణ 518; మూడవ ఉదాహరణ: మాతృదేవికి ఉపదేశం 518; ఈ అంశంపై తుది మాట 518; భావరాజ్యపు యథార్థ చక్రవర్తి శ్రీరామకృష్ణులు 519; దానిపై స్వామి వివేకానంద వ్యాఖ్యానం 519.

3. పారమార్థిక గురువుగా శ్రీరామకృష్ణులు ... 520

'గురువు', 'బాబా', 'కర్తా' అంటూ తమను ఎవరైనా సంబోధించినప్పుడు శ్రీరామకృష్ణులు చికాకుపడేవారు. అలాటి ఆయనలో 'గురుభావం' ఉండడం ఎలా సాధ్యం? 520; సర్వులలోను భగవంతుని గాంచడంచేత, ఆయన సర్వులకూ దాసుడు 521; ఆయనలో నిత్యం అభివ్యక్తమయ్యే గురుభావశక్తి పట్ల భక్తుల ప్రతిస్పందన 522; ఎల్ల లెరుగని శ్రీరామకృష్ణుల భావాలు 522; శ్రీరామకృష్ణులు భక్తునిగా, జ్ఞానిగా ఎలా మనగలిగారో తెలుసుకోగోరితే భావముఖ ప్రాధాన్యాన్ని అవగతం చేసుకోవడం ఆవశ్యకం 523; సవికల్ప సమాధి, నిర్వికల్ప సమాధి, సుషుప్తి 523; నిజమైన సమాధి ఫలాలు 524; ఆరు నెలలపాటు కొనసాగిన శ్రీరామకృష్ణుల నిర్వికల్ప సమాధి 525; అంత దీర్ఘకాలం ఆయన దేహం ఎలా నిలవగలిగింది 525; బలవంతంగా ఒక యోగి ఆయనకు ఆహారం తినిపించడం 526; 'భావముఖంలో నెలకొని ఉండు' - జగజ్జనని ఆదేశం 526; సగుణ - నిర్గుణ బ్రహ్మం, విరాట్ అహంకారం, ఈశ్వరుడు, జగజ్జనని 527; ఈ విరాట్ అహంకారానికే 'భావముఖం' (భావాలన్నిటికీ ఆలవాలం) అని పేరు 528; నిర్వికల్ప స్థితిలో, సవికల్ప లేక భావముఖ స్థితిలో శ్రీరామకృష్ణుల అనుభూతి 528; 'భావముఖంలో నెలకొని ఉండు' అన్న ఆదేశ తాత్పర్యం 529; ఆధ్యాత్మిక పురోగతి మేరకు ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత స్థితులు ఏర్పడతాయి 530; ఈ విషయంపై ఆంజనేయుని అభిప్రాయం 531; బ్రహ్మం యొక్క నిత్యం, లీల భావాలను అంగీకరించాల్సిన అవసరం 531; పై విషయంగా కొన్ని ఉదాహరణలు: సంగీత స్వరాల ఆరోహణ, అవరోహణ క్రమాలు 532; రెండవ ఉదాహరణ - మారేడు పండు 532; మూడవ ఉదాహరణ - అరటి ఊచ 532; నాలుగవ ఉదాహరణ - నీరుల్లి 532; భావముఖ అనుభూతి వివరణ 533; విద్యామాయ: 'నేను దాసుడను, భక్తుడను, బిడ్డను, అంశను' అనే అనుభూతి 533; విరాట్ 'పక్వాహంకారం'

గురుదేవులు సంక్రమించుకోవడం: గురుభావంలో దీని అంతస్సూచన 534; ఆధ్యాత్మికతను జాగృతంచేసే ఆయన శక్తి: 1886వ సం॥ జనవరి 1వ తేదీ సంఘటన 535; శ్రీరామకృష్ణుల స్పర్శాఫలితంగా భక్తులు పొందిన అనుభూతులు 538; శ్రీరామకృష్ణులు ఎప్పుడు ఎవరిని అనుగ్రహించేవారో తెలిసేది కాదు 539; 'అపక్వాహంకారం' లుప్తమైనప్పుడే 'గురుభావం' అభివ్యక్తమౌతుంది 539; జగజ్జనని ఒక అభివ్యక్తీకరణే 'గురుభావం' 539; భగవద్భక్తి, గురుభక్తి ఒక్కటే. ఎందుచేత? 540; విభీషణుని గురుభక్తిని చాటే కథ 541; భావాల ద్వారా భక్తి ప్రేరితం కావడం: చైతన్యుల ఉదాహరణ 542; అర్జునుని గురుభక్తి 543; ఈ సామాన్య గురుభావన వెలుగులో సొంత గురుభక్తి స్థానం: హనుమంతుని ఉదాహరణ 544; మానవులందరిలోను గురుభావం నిద్రాణ స్థితిలో ఉంటుంది 545; శ్రీరామకృష్ణుల ఉవాచ: 'చిట్టచివరకు మనస్సే గురువుగా వ్యవహరిస్తుంది' 545; గురువు చెలికత్తె వంటివాడు 546; శిష్యుని ఇష్టదేవతలో చివరకు గురువు లీనమైపోతాడు 546.

4. గురుభావ ప్రథమ అభివ్యక్తీకరణ ... 547

'మొదట పండ్లు పిదప పువ్వులు' - ఇదే ప్రతి అవతార పురుషుని విశిష్టత 548; శ్రీరామకృష్ణులలో గురుభావ ప్రథమ అభివ్యక్తీకరణ 549; ఏసుక్రీస్తు జీవితంలో జరిగిన ఇటువంటి సంఘటన 550; ఆనాటి యూదుల తీర్థయాత్ర 550; జెహోవా ఆలయంలో ఏసుక్రీస్తు శాస్త్రాలను విశదీకరించడం 550; మాక్స్‌ముల్లర్ దృక్పథ ఖండనం 551; శ్రీరామకృష్ణులు వివాహం ఎందుకు చేసుకొన్నారు? బంధువులు కోరినందుకా? కాదు 551; సుఖించాలనే ఆకాంక్ష వలనా? కాదు 552; శ్రీరామకృష్ణుల వివాహం ప్రారబ్ధ కర్మను అనుభవించడానికా? కాదు 553; ప్రారబ్ధ కర్మను అనుభవించడం, అనుభవించకపోవడం పూర్ణజ్ఞాని ఇచ్ఛాధీనం 555; 'ఎవడు రాముడో, ఎవడు కృష్ణుడో అతడే ఇప్పుడు శ్రీరామకృష్ణుడు' అన్న వారి పలుకుల దృష్ట్యా ఆయనను గురించి ప్రస్తావింప అవసరంలేదు 555; తమ వివాహం గురించి శ్రీరామకృష్ణుల సంబరం 555; హైందవులకు విధాయకమైన దశ సంస్కారాలను నిర్వర్తింప గురుదేవులు వివాహం చేసుకొన్నారా? కాదు 556; హైందవ వివాహం: తదాదర్శం 556; అనుభవం, వివేచన - ఈ రెండూ జ్ఞానానికి దారితీస్తాయి 557; సుఖభోగాల ప్రేరణను అధిగమించడంపై శ్రీరామకృష్ణులు 558; ఇంద్రియ నిగ్రహరాహిత్యమే ప్రస్తుత జాతీయ పతనానికి హేతువు 559; మహోన్నత వివాహాదర్శాన్ని పునరుద్ధరించడానికే శ్రీరామకృష్ణులు వివాహం చేసుకొన్నారు 560; దీనిపై మాతృదేవి వ్యాఖ్యానం 560; గృహస్థులకు బోధించే నిమిత్తమే శ్రీరామకృష్ణులు వివాహం చేసుకొన్నారు 561; శ్రీరామకృష్ణుల ఆదర్శాన్ని అనుసరించడంలోని ఆవశ్యకత 562; శ్రీరామకృష్ణుల ఆదర్శంపై కొన్ని ఆక్షేపణలు: తత్సమాధానాలు 563; శ్రీరామకృష్ణుల వివాహం: ఆయన గురుభావం 564.

5. యౌవనంలో గురుభావం ... 566

అభిలషించిన మాత్రాన మనిషి గురువు కాలేదు 566; విరాట్ 'అహంకారం': గురువు 567; శ్రీరామకృష్ణులలో దాని స్వాభావిక అభివ్యక్తీకరణ 568; సాధన కాలంలో గురుభావం 568; శ్రీరామకృష్ణుల విచిత్ర స్వభావం 569; శ్రీరామకృష్ణులను గుర్తించడం సంపన్నులకు, పండితులకు కష్టసాధ్యం 571; శ్రీరామకృష్ణుల పట్ల మథుర్ ఆకర్షణ: ఇతరుల అభిప్రాయం 572; గురుభావ ఉద్వేగంలో రాణీ రాస్మణిని శిక్షించడం 574; తత్ఫలితం 574; చైతన్యుల, ఏసుక్రీస్తు, శ్రీకృష్ణుని జీవితాలలో ఇటువంటి సంఘటనలే జరగడం 575; రాణీ రాస్మణి మహద్భాగ్యం 576; భావలీనమైన మనస్సు లక్షణాలు 577; జగద్గురువుల ప్రవర్తనను అవగతం చేసుకోవడంలోని జటిలతకు హేతువు 578.

6. గురుభావం - మథురానాథ్ ... 581

పెద్దపువ్వు వికసింప చాలాకాలం పడుతుంది 581; మథుర్‌తో గల శ్రీరామకృష్ణుల విచిత్ర సంబంధం 582; మిత్రులు, శత్రువులు అవతార పురుషుల శక్తి అభివ్యక్తీకరణకు దోహదం చేస్తారు 582; సర్వుల జీవితాలలో దివ్యశక్తి లీల కానవస్తుంది 584; భక్తుడైనా మథుర్ మూర్ఖుడు కాడు 585; శ్రీరామకృష్ణుల పట్ల మథుర్ బాబు ఆకర్షణ 586; భక్తి ప్రభావమే మథుర్‌లో మార్పుకు హేతువు 587; ప్రకృతి నియతులలో మార్పు : ఎఱ్ఱమందారం సంఘటన 587; శ్రీరామకృష్ణుల ఆరోగ్యం పట్ల మథుర్ అక్కఱ 588; శివమహిమ్న స్తోత్ర పారాయణ సంఘటన 589; శ్రీరామకృష్ణుల సాంగత్యంలో సత్వర ఆధ్యాత్మిక పురోగతి 590; శ్రీరామకృష్ణులలో శివ-శక్తులను ఏకకాలంలో మథుర్ దర్శించడం 591; ఆ దర్శన ఫలితం 592; మథుర్ మహద్భాగ్యం 592; శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అనుభూతులు: వాటి పరీక్షానంతరం రూఢియైన మథుర్ విశ్వాసం 593; పూజారి హాల్దార్ ఈర్ష్యాసూయలు 595; వారణాసి శాలువల దుర్గతి 596; శ్రీరామకృష్ణుల అనాసక్తత 597; పూజారి హాల్దార్ దుష్ప్రవర్తన 597; మథుర్ కుటుంబంతో శ్రీరామకృష్ణుల ఆత్మీయత 598; ఏకకాలంలో శ్రీరామకృష్ణులలో విరుద్ధ భావాలు నెలకొని ఉండడం 599; 'విరిగిపోయిన విగ్రహం' గురించి దక్షిణేశ్వరంలో పండిత సదస్సు 599; శ్రీరామకృష్ణుల నిర్ణయం 600.

7. గురుభావంలో మథుర్‌ను అనుగ్రహించడం ... 602

శ్రీరామకృష్ణుల సాంగత్యంలో మథుర్ దుర్గాపూజ జరపడం 602; శ్రీరామకృష్ణుల వ్యక్తిత్వ సౌందర్యం 603; శ్రీరామకృష్ణుల రూపసౌందర్యాన్ని తిలకింప కామార్పుకూర్‌లో జనం గుమిగూడడం 604; శ్రీరామకృష్ణుల బాహ్యసౌందర్య తిరస్కృతి 605; జగదంబ దాసి: శ్రీరామకృష్ణుల భావపారవశ్యం 607; సమాధ్యవస్థ నుండి శ్రీరామకృష్ణులు దిగివచ్చే తీరు 607; చెలికత్తెలా శ్రీరామకృష్ణులు దుర్గాదేవిని చామరంతో వీవడం 609; మథుర్‌బాబు గందరగోళం 609; విజయదశమి 610;

దేవీ ప్రతిమను నిమజ్జనం చేయడం విస్మరించిన మథుర్ 610; నిమజ్జన తంతుకు మథుర్ నిరసన 611; నచ్చజెప్పబోయిన వారికి మథుర్ సమాధానం 611; శ్రీరామకృష్ణులు మథుర్‌కు నచ్చజెప్పడం 612; శ్రీరామకృష్ణుల స్పర్శ, పలుకుల అద్భుత శక్తి 612; మథుర్ మామూలు స్థితిలోకి రావడం 613; పరీక్షల కారణంగా మథుర్ విశ్వాసం ప్రగాఢం కావడం 613; భావసమాధి పొందాలన్న మథుర్ ఆకాంక్ష 614; భావసమాధికై మథుర్ శ్రీరామకృష్ణులను ప్రార్థించడం 615; మథుర్‌ను శ్రీరామకృష్ణులు నిరుత్సాహపరచడం 615; మథుర్ భావ సమాధి: శ్రీరామకృష్ణులను ప్రార్థించడం 616; త్యాగి పురుషులు తప్ప భావ సమాధిని ఎవరూ నిలుపుకోలేరు 617; ఒక యువకుడి దృష్టాంతం 617; ఆధ్యాత్మిక భావోద్వేగాన్ని గుర్తించే శ్రీరామకృష్ణుల శక్తి 618; ఆ యువకుడి స్థితి గురించి శ్రీరామకృష్ణుల అభిప్రాయం 620; మథుర్ పట్ల శ్రీరామకృష్ణుల నిర్మోహ మాట ప్రవర్తన 620; మథుర్ సంక్షేమం పట్ల శ్రీరామకృష్ణుల అక్కర 621; ఆలయ ప్రసాదంలో తమ వంతు ప్రసాదాన్ని స్వాధికారికంగా అడగడం 622; విశేష సందర్భాలలో శ్రీరామకృష్ణులలో విభిన్న భావసమాధ్యవస్థలు 622; శ్రీరామ కృష్ణులు స్వాధికారికంగా ప్రసాదాన్ని అడగడంపై స్వామి యోగానంద తలంపు 624; తమ ఆతురతకు శ్రీరామకృష్ణుల విశదీకరణ 624; శ్రీరామకృష్ణ - మథుర్‌ల మధ్య నెలకొన్న అద్భుత బాంధవ్యం 625; శ్రీరామకృష్ణులను మథుర్ ఊరడించడం 626; తమ ఆంతరంగిక భక్తుల రాక గురించి మథుర్‌తో, శ్రీరామకృష్ణులు ప్రస్తావించడం 626; శ్రీరామకృష్ణుల బాలక స్వభావం: ఆకుకూర సంఘటన 627; విపత్కర సమయాలలో శ్రీరామకృష్ణులను, మథుర్ శరణు జొచ్చడం 628; శ్రీరామకృష్ణుల నిమిత్తం మథుర్ నిస్సంకోచంగా ధనం వెచ్చించడం 628; ఈ విషయంగా ఇతర దృష్టాంతాలు 629; వైద్యనాథంలో మథుర్ దరిద్రనారాయణ సేవ 630; మథుర్‌తో కలిగిన శ్రీరామకృష్ణుల సంబంధం దైవనిర్ణయం 630.

8. గురుభావంలో తమ గురువులతో ... 632

అవతార పురుషులు జన్మతః గురువులు 632; పలువురు గురువుల నుండి శ్రీరామకృష్ణులు దీక్ష పుచ్చుకోవడం 633; భైరవీ బ్రాహ్మణి 633; సాధనలో శ్రీరామకృష్ణులకు భైరవీ బ్రాహ్మణి సహాయం 634; భైరవీ బ్రాహ్మణి అనుభూతులు : వైష్ణవ శాస్త్రాలు 634; మథుర్ సంశయాలు 635; భైరవీ బ్రాహ్మణి పుట్టుపూర్వోత్తరాలు 636; భైరవీ బ్రాహ్మణి ఎంతో ఉన్నతదశ నొందిన సాధకురాలు 636; బ్రాహ్మణి యౌగిక దృష్టి 636; చంద్రుని వృత్తాంతం 637; అణిమాది సిద్ధులు ఆధ్యాత్మిక పతనానికి దారితీస్తాయి 637; చంద్రుని పతనం 638; గిరిజుని వృత్తాంతం 638; గిరిజుని అద్భుతశక్తి 639; గురుభావంలో శ్రీరామ కృష్ణులు చంద్ర, గిరిజుల అద్భుత శక్తులను దగ్ధం చేయడం 640; సిద్ధులు భగవన్మార్గంలో విఘ్నాలు 640; సిద్ధులు అహంకారాన్ని పెంచుతాయి; ఏనుగు దృష్టాంతం 641; బ్రాహ్మణికి నిర్వికల్ప అద్వైత సాక్షాత్కారం లభించక పోవడం 643; తంత్రాలలో పేర్కొన్న పశు, వీర, దివ్యభావాలు 644; దివ్యభావ సాధనకు

భైరవీ బ్రాహ్మణి ఇంకా అర్హురాలు కాకపోవడం 645; పై విషయానికి ఋజువు 646; తన లోటుపాట్లను బ్రాహ్మణి గుర్తించడం 646; తోతాపురి వృత్తాంతం 647; తోతాపురితో, శ్రీరామకృష్ణుల సంబంధాలు 648; బ్రహ్మజ్ఞానుల నిర్భీకత, నిర్మమత్వత 649; తోతాపురి మహోన్నత అవస్థ 650; తోతాపురి నిర్భయత్వం 650; తోతాపురి గురువుల వృత్తాంతం 651; తమ సన్న్యాస సంఘం గురించి తోతాపురి చెప్పిన విషయాలు 652; తోతాపురి పుట్టుపూర్వోత్తరాలు 653; తోతాపురి మానసం 654; భక్తిమార్గం గురించి తోతాపురి అజ్ఞత 655; అందుకు నిదర్శనాలు 656; తోతాపురి క్రోధాన్ని విడిచిపెట్టడానికి దారితీసిన సంఘటన 657; మాయ దారి విడువనంత వరకూ భగవత్సాక్షాత్కారం సాధ్యం కాదు 658; అందుకొక ఉదాహరణ 659; జగజ్జననిని గురించి తోతాపురి అజ్ఞానం 659; తోతాపురి అస్వస్థత 660; మనోసూచనలను తోతాపురి నిర్లక్ష్యం చేయడం 660; సెలవు పుచ్చుకొని వెళ్లిపోవడానికి ప్రయత్నించడం - వ్యాధి తీవ్రత 661; గంగలో మునిగిపోవడానికి ప్రయత్నించడం : జగజ్జనని దివ్యదర్శనం 661; ఆత్మహత్యా సంకల్పాన్ని తోతాపురి విడనాడడం 663; బ్రహ్మం, బ్రహ్మశక్తి అభేదమని తోతాపురి గ్రహించడం 663; జగజ్జననిని అంగీకరించి తోతాపురి నిష్క్రమించడం 663; 'రసవాద' విద్య నెరిగిన తోతాపురి 664; ముగింపు 664.

ఓం

సర్వధర్మస్థాపకస్త్వం
    సర్వధర్మస్వరూపకః ।
ఆచార్యాణాం మహాచార్యో
    రామకృష్ణాయ తే నమః ॥

-స్వామి శారదానంద

ॐ భగవాన్ శ్రీరామకృష్ణులు ॐ

॥ భగవాన్ శ్రీరామకృష్ణులు ॥

I

బాల్య భావం

ప్రస్తావన

భగవదనుగ్రహంతో 'శ్రీరామకృష్ణ పరమహంస' మొదటి భాగం ఇప్పుడు వెలువడింది. దీన్లో శ్రీరామకృష్ణుల బాల్యజీవితం, ఆయన ఆవిర్భావ ఉద్దేశ వివరాలు పొందుపరచబడి ఉన్నవి. ఆయన బాల్యజీవితానికి సంబంధించని అనేక సంఘటనలను పలువురి నుండి విని మా మనస్సులో రూపొందిన చిత్రాన్ని పాఠకులకు అందించడానికి చేసిన ప్రయత్నమే ఇది. కొన్ని సంఘటనల కాల నిరూపణ విషయంలో హృదయరాం ముఖోపాధ్యాయ (శ్రీరామకృష్ణుల మేనల్లుడు), రాంలాల్ ఛటోపాధ్యాయ (శ్రీరామకృష్ణుల అన్నగారి కుమారుడు) తదితరులు సాధ్యమైనంత మేరకు సహాయం అందించారు; ఐనా కొన్నిచోట్ల ఆ అంశాలపైని సంశయం తీరలేదు. వారు మాకు శ్రీరామకృష్ణుల తండ్రిగారి, పెద్దన్నగారి, సమీప బంధువుల జాతకాలను అందించలేకపోయారు; కాని అందుకు మారుగా శ్రీరామకృష్ణుల జీవితంతో ముడివడిన కొన్ని సంఘటనల ఉజ్జాయింపు తేదీల వివరాలు మాకు అందచేశారు. ఉదాహరణకు: ''శ్రీరామకృష్ణులు జన్మించినప్పుడు ఆయన తండ్రి (ఖుదిరామ్) గారి వయస్సు అరవై ఒకటి లేక అరవై రెండు ఏళ్లు ఉండవచ్చు.'' ''పెద్దన్నగారైన రామకుమార్, శ్రీరామకృష్ణుల కంటె ముప్పైఒకటి లేక ముప్పై రెండేళ్లు పెద్దవాడై ఉంటాడు.'' మొదలైనవి.

అయినప్పటికీ యీ పుస్తకంలోని 'యుగపురుషుని ఆవిర్భావం' అన్న ఐదవ అధ్యాయం చదివినప్పుడు దాన్లో పొందుపరచిన శ్రీరామకృష్ణులు జన్మించిన తేదీ గురించి పాఠకులకు ఎలాటి సంశయమూ కలుగదు. ఈ విషయంలోనే కాక యీ పుస్తకంలో ఉల్లేఖించిన అనేక సంఘటనలను స్వయంగా శ్రీరామకృష్ణుల పలుకులే పునర్నిర్ధరించాయి; కొన్నిటిని శ్రీరామకృష్ణుల ముఖతా స్వయంగా యీ రచయితే వినడం జరిగింది. అటువంటి సమాచారం అందించిన శ్రీరామకృష్ణులకే నిజానికి మనం కృతజ్ఞులమై ఉండాలి.

శ్రీరామకృష్ణుల జీవితంలోని కొన్ని కాలఘట్టాలను వర్ణింప పూను కొన్నప్పుడు ఆయన బాల్య, యౌవన జీవిత సంఘటనలను విపులంగా, సంబద్ధ యుతంగా పొందుపరచగలగడం అసాధ్యంగా తోచింది. అయినా ఎవరి కృప మూగవాణ్ణి వాచాలునిగా చేస్తుందో, కుంటివాణ్ణి పర్వతాలను సైతం అధిరోహింప చేస్తుందో ఆ భగవంతుని అనుగ్రహం వల్ల ఇది సంభవమైంది. కనుక ఆయనకు మా శతకోటి ప్రణామాలు.

చివరగా ఒక్క మాట. పాఠకమహాశయులు పుస్తకంలోని యీ భాగం చదివాక 'సాధక భావం', 'గురు భావం' అనే భాగాలు కూడ చదివితే శ్రీరామ కృష్ణుల జనన తేదీ నుండి 1881[1]వ సం॥ వరకు ఆయన జీవిత చరిత్ర పూర్వా పర్యంగా (Chronologically) నమోదు కాబడి ఉండటం గ్రహించగలరు.

— రచయిత

1. తదనంతరం 'దివ్యభావం, నరేంద్రనాథ్' అనే మరొక భాగం చేర్చబడి శ్రీరామ కృష్ణుల జీవిత చరిత్ర 1886వ సం॥ వరకు పూరింపబడింది.

ఉపోద్ఘాతం

1. భారతదేశ జీవిత కేంద్రంగా ఆధ్యాత్మికత

భారతదేశ ఇతర దేశాల ఆధ్యాత్మిక విషయిక ఆదర్శాలను, సంప్రదాయాలను తులనాత్మకంగా అధ్యయనం చేసినప్పుడు వాటి మధ్య విస్తారమైన వ్యత్యాసం మనకు కనిపిస్తుంది. భారతదేశం అతిప్రాచీన కాలం నుంచే భగవంతుడు, ఆత్మ, పారలౌకికత మొదలైన ఇంద్రియాతీత, ఆధ్యాత్మిక విషయాలనే పరమ సత్యాలుగా స్వీకరించింది. వాటి ప్రత్యక్ష అనుభూతికై సకల ప్రయత్నాలు చేసింది; తత్ఫలితంగా సంతరించుకొన్న అనుభూతి లేక ప్రత్యక్ష జ్ఞానాన్ని జాతీయ, వ్యక్తిగత జీవనం యొక్క పరమ పురుషార్థంగా చేసుకొన్నది. కాబట్టే దాని కార్యకలాపాలన్నీ తదనుగుణంగా యుగాల పర్యంతం అపూర్వ ఆధ్యాత్మికతో రంజిల్లినవి.

2. భారతదేశంలో తరచు మహాపురుషుల ఆవిర్భావమే అందుకు కారణం

ఇంద్రియాతీత విషయాలపట్ల ఉత్కంఠజనిత ఆసక్తి కలగడానికి మూలం ఏమిటని ఆలోచిస్తే దివ్యగుణాన్వితులై, భగవత్సాక్షాత్కారం పొందిన మహాపురుషులు తరచు భారతావనిలో జన్మించడమేనని నిశ్చయంగా తెలియవస్తుంది. వీరి అసాధారణ దివ్యదర్శనాలు, అనుపమాన శక్తి అభివ్యక్తీకరణలు సదా తిలకిస్తూ, వాటి గురించి చర్చిస్తూ ఉండటం వల్లనే ఆ విషయాలపట్ల ప్రగాఢ విశ్వాసం, ఆకర్షణ జనించాయి. ఈ విధంగా ప్రాచీన కాలం నుంచే ఆధ్యాత్మికత అనే అతిగట్టి పునాదిపై స్థిరంగా జాతీయ జీవనం నెలకొల్పబడింది; తన దృక్కులను గమ్యంపై స్థిరంగా పరపి, అనుపమాన సంప్రదాయ, రివాజులతో కూడిన ఒక సమాజాన్ని రూపొందించింది; ఈ సమాజం తన సభ్యులు వారి సహజ అభిరుచుల, గుణాలకు తదనుగుణంగా దైనందిన కర్మాచరణం మూలంగా చరమ లక్ష్యమైన భగవత్సాక్షాత్కారం పొందడానికి దోహదం చేసింది. ఈ నియమ నిబంధనలు తరతరాలుగా పాటింపబడుతూ రావటం వలన ఈనాటికీ

భారతదేశంలో ఆధ్యాత్మిక భావాలు సజీవాలై నిలిచివున్నాయి. పర్యవసానంగా తపస్సు, సంయమం, తీవ్ర వ్యాకులత ద్వారా జగత్కారణుడైన ఆ భగవంతుని దర్శనం పొంది, శాశ్వతంగా ఆయనలో ఐక్యం చెందగలమని నేటికీ పురుషులు, స్త్రీలు యావన్మందీ ప్రగాఢ విశ్వాసం కలిగి ఉన్నారు.

3. భారతదేశంలో మతం భగవదనుభూతిపై స్థాపితమైంది : అందుకు ప్రమాణం

ఋషి, ఆప్తుడు, అధికారి, ప్రకృతిలీనపురుషుడు ఇత్యాది పేర్ల, పదాల ప్రాధాన్యాన్ని పరికిస్తే భారతదేశం మతం భగవత్సాక్షాత్కార ప్రాతిపదికపై ప్రతిష్ఠితమై ఉన్నట్లు స్పష్టమౌతుంది. మతాన్ని తిరిగి స్థాపింప అరుదెంచిన ఆచార్యవర్యులను వర్ణించడానికి ఈ పేర్లు వేదకాలం నుండి ఉపయోగిస్తూ వచ్చారు. ఇంద్రియాతీతమైన ప్రత్యక్ష జ్ఞానం మూలంగా సంతరించుకొన్న తమ అనుపమాన శక్తులను నిరూపించినందున వారిని యీ పేర్లతో పేర్కొన్నారనడం నిస్సందేహం. వేదకాలం నాటి ఋషుల నుండి, పురాణకాలంనాటి అవతారపురుషుల వరకు ప్రతి ఒక్కరి పట్ల యిది అక్షర సత్యం.

4. దివ్యావతార భావన వికాసం

వేదకాలంలోని ఋషియే కాలక్రమాన పౌరాణిక కాలంనాటి భగవదవతారంగా పరిగణింపబడ్డాడనే విషయం అవగాహన చేసుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. కొందరు మహాపురుషులకు అతీంద్రియ సత్యాలను దర్శించగల శక్తి ఉన్నదని వేదకాలంనాటి మనిషి అర్థం చేసుకొన్నాడు; కాని ఆ శక్తులలో తారతమ్యం ఉందనే విషయం అతడు తెలుసుకోలేకపోయాడు. పర్యవసానంగా వారినందరినీ 'ఋషు'లని పేర్కొని సంతృప్తి చెందాడు. కాలక్రమాన అతడి బుద్ధి, వివేచనాశక్తి కుశాగ్రమైయ్యేకొద్దీ, ఋషులందరూ సమానమైన శక్తి కలిగినవారు కారనీ, ఆధ్యాత్మిక జగత్తులో వారిలో కొందరు సూర్యునిలా, ఇంకా కొందరు చంద్రునిలా, కొందరు నక్షత్రాలలా, మరి కొందరు సాధారణమైన మిణుగురు పురుగుల్లా ప్రకాశించేవారని అర్థం చేసుకొన్నాడు. అప్పుడతడు ఆ ఋషులను వర్గీకరించసాగాడు; అలా వర్గీకరిస్తూ ఉన్నప్పుడు ఆ ఋషులలో కొందరు ఆధ్యాత్మిక సత్యాలను అభివ్యక్తం చేసే విశిష్ట శక్తిని సంతరించుకొని ఉన్నారని కనుగొన్నాడు. భగవంతుని అస్తిత్వాన్ని విశ్వసించని సాంఖ్యదర్శన స్థాపకుడైన కపిలాచార్యుడు కూడ ఈ ఆధికారిక పురుషుల ఉనికిని గురించి సంశయించలేదు; ఎందుకంటె ప్రత్యక్షంగా కానవస్తున్న దాన్ని ఎవరు మటుకు సంశయించగలరు? తదనుసారం కపిలాచార్యుడు, ఆయన అనుయాయులు తమ రచనలలో యీ 'ఆధికారిక పురుషులను', 'ప్రకృతిలీన పురుషుల' క్రింద జమకట్టారు. అసాధారణ శక్తివంతులైన ఈ పురుషుల ఆగమన కారణం తెలుసుకోబోయి సాంఖ్యులు యీ నిర్ణయానికి వచ్చారు: పవిత్రత,

సంయమం ఇత్యాది సద్గుణాలతో శోభిల్లిన వీరు అనంత జ్ఞానప్రాప్తికి అర్హులైనప్పటికీ లోకానికి హితం చేయాలనే తీవ్ర ఆకాంక్ష వారిని అనంత మహిమాన్వితమైన తమ స్వస్వరూపంలో తక్షణం లీనం కాకుండా చేసింది. ఆ బలీయమైన కోర్కెవలన వారు ప్రకృతితో ఒకటై, ప్రకృతి శక్తులను తమవిగా తెలుసుకొన్నారు. ఈ రీతిలో అనంతజ్ఞానం ప్రభృత షడైశ్వర్యాలను సంతరించుకొని ఒక కల్పం వరకు నానారీతుల లోకకల్యాణ కార్యాలు ఒనరిస్తూ, చివరకు తమ స్వస్వరూపంలో తాదాత్మ్యం చెందుతారు.

సాంఖ్యాచార్యులు మళ్లీ ప్రకృతిలీన పురుషులను, వారి శక్తి తారతమ్యానుగుణంగా రెండు తరగతులుగా వర్గీకరించారు: 1. కాల్పనియామక ఈశ్వరుడు (ఒక కల్పం యొక్క పాలకుడు). 2. ఈశ్వరకోటి. దార్శనిక యుగం తదుపరి భగవంతుని పట్ల విశేష భక్తి వికాసం చెందిన భక్తియుగం ప్రారంభమైంది. ఈ సమయంలో ముంచెత్తివేసే వేదాంత ఉపదేశాల ప్రభావ ఫలితంగా యావన్మంది యొక్క సమష్టి స్వరూపుడు, మహాన్ వ్యక్తిత్వం గల ఈశ్వరుని పట్ల జనులు ప్రగాఢ విశ్వాసం కలిగినవారయ్యారు. అనన్య భక్తి సహకారంతో భగవంతుని ఉపాసించడం ద్వారా పరిపూర్ణ జ్ఞానం, యోగం కూడ పొందగలమనే శ్రద్ధ వారిలో జనించింది. కనుక సాంఖ్యదర్శనంలో వర్ణింపబడ్డ 'ఈశ్వరుని' అప్పుడు నిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావుడైన ఈశ్వరుని అంశంగా లేదా ఆయన పూర్ణావతారంగా పరిగణించడానికి ఇక ఎక్కువ కాలం పట్టలేదు. ఈ విధంగా పౌరాణిక యుగంలో అవతారపురుషుల పట్ల విశ్వాసం జనించింది. అంతేకాక వైదిక యుగంలోని అనుపమాన, అసాధారణ లక్షణాన్వితులైన ఋషులు ఇప్పుడు 'అవతారాలుగా' గుర్తింపబడసాగారు. కనుక అతి లోకసామాన్యమైన ఆధ్యాత్మిక శక్తితో అరుదెంచిన యీ మహాపురుషుల దర్శన ఫలితంగా జనులు క్రమంగా ఈశ్వరావతారాలలో విశ్వాసం పొందసాగారు. ఈ మహాపురుషుల అతీంద్రియ దివ్యదర్శనాలు, దివ్యానుభూతులు అనే పునాది మీదనే భారతీయ ధర్మమనే మహాభవనం సుప్రతిష్ఠితమై మంచుకప్పిన హిమగిరిలా ఎదిగి గగనసీమను చేరింది. ఈ మహాపురుషులు మానవజీవిత పరమ గమ్యం చేరడం చూసి భారతీయులు వారిని 'ఆప్తు'లని పిలువసాగారు. ఉత్కృష్ట ఆధ్యాత్మిక జ్ఞానాన్ని వ్యక్తీకరించే వీరి వచనాలే వేదాలుగా పేర్కొనబడ్డాయి.

5. భక్తి యుగంలో సాకార ద్వైతం

కొంతమంది ఋషులను అవతార పురుషులుగా అంగీకరించడానికి మరో కారణం గురుపూజ. వేద, ఉపనిషత్తుల కాలం నుండి భారతీయులు జ్ఞానప్రదాయకుడైన గురువును విశేష భక్తిశ్రద్ధలతో పూజిస్తూ వచ్చారు. ధ్యానంతో మేళనమైన యీ గురుపూజా ఫలితంగా కాలక్రమేణా జనులు

భగవంతుని అతీంద్రియ దివ్యశక్తిలో అభివ్యక్తం కానంతవరకూ ఏ మానవ మాత్రుడూ గురువు కాజాలడని గ్రహించారు. మొట్ట మొదట జనులు గురువును విశిష్ట గుణాన్వితుడైన ఒక విభిన్న మానవునిగా భావించి, పూజిస్తూ వచ్చారు. కాని స్వార్థపరుడైన ఒక సామాన్యునితో పోల్చి చూసినప్పుడు నిజమైన గురువు స్వార్థరహితంగా, పరమకృపాపూర్ణుడై లోకానికి హితం చేకూర్చడం గమనించారు. తదనంతరం వారి శ్రద్ధ, గౌరవం, భక్తి పెంపొందేకొద్దీ గురువులో వారు భగవత్ శక్తి అభివ్యక్తమై పనిచేయడం ప్రత్యక్షంగా గ్రహించారు. గురువులో భగవదావిర్భావాన్ని విశ్వసించారు. ''రుద్ర యత్తే దక్షిణం ముఖం తేన మాం పాహి నిత్యం'' (భగవాన్! కృపాపూర్ణమైన ముఖంతో మమ్ము సర్వదా రక్షించు) అని దీర్ఘకాలం తాము చేసిన ప్రార్థన ఇప్పుడు ఫలించిందనీ, భగవత్కృప గురుశక్తి రూపంలో మూర్తిమంతమై ఇప్పుడు తమ ఎదుట ప్రత్యక్షమైనదని వారు గ్రహించసాగారు.

6. అవతారాల పట్ల విశ్వాసం కలగడానికి గురుపూజ మరో కారణం

గురువును యీ విధంగా పూజించడంలో పురోగమించిన మనిషి, ఎవరిని ఆశ్రయించి భగవచ్ఛక్తి యొక్క విశేష లీల వ్యక్తమౌతుందో ఆ గురువును జ్ఞానదాయకుడైన దక్షిణామూర్తిగా గుర్తించడంలో యిక జాప్యం చేయలేదు. ఈ విధమైన ఆచార్యోపాసన కాల క్రమాన అవతారవాదాన్ని పటిష్ఠం చేసింది. ఇంతకుముందే చెప్పినట్లు అవతారవాదం నిజానికి పురాణ కాలం నాటిదే అయినప్పటికీ ఆ భావన వేదకాలంలోనే ఆవిర్భవించింది. వైదిక, ఔపనిషదిక, దార్శనిక యుగాలలో మానవుడు ఈశ్వరుని యొక్క గుణాలను, కర్మలను, స్వరూపాన్ని గురించి పొందిన అనుభవజ్ఞానమే పౌరాణిక యుగంలో క్రమంగా మరింత స్పష్టమైన ఆకృతిని సంతరించుకొని అవతారవాదం పట్ల విశ్వాస రూపంగా అభివ్యక్తమైంది. మనిషి ఉపనిషత్తుల కాలంలో సంయమం, తపస్సు ఇత్యాదుల సహాయంతో 'నేతి, నేతి' (ఇది కాదు, ఇది కాదు) మార్గంలో సఫలుడై నిర్వికల్ప సమాధి అనుభవాన్ని పొంది, మళ్లీ విలోమ మార్గాన్ని అనుసరించి క్రిందికి దిగివచ్చిన పిదప అతడు యావత్తు జగత్తును ఆ నిర్గుణబ్రహ్మం యొక్క ప్రత్యక్ష అభివ్యక్తీకరణగా గాంచసాగాడు. తదనంతరమే అతడు సగుణ బ్రహ్మను లేదా ఈశ్వరుని అపార భక్తితో ఉపాసించసాగాడు. ఆ ఈశ్వరుని గుణ కర్మ స్వభావాలను గురించి ఒక స్పష్టమైన అభిప్రాయానికి వచ్చాడు; ఆయన విశేష రూపంలో అవతరించే సంభావ్యత ఉన్నదని విశ్వసించాడు.

7. వేదజ్ఞానం, సమాధి అనుభూతి ఆధారంపై అవతార వాదం నెలకొల్పబడింది

8. భగవదనుగ్రహ అనుభూతి - అవతార వాద పరివ్యాప్తి

భగవంతుడు అవతరిస్తాడనే విశ్వాసం పౌరాణిక యుగంలో విశేషంగా అభివృద్ధి చెందింది. ఆ యుగంలో ఆధ్యాత్మిక వికాసంలో అనేక లోపాలు చోటు చేసుకొన్నప్పటికీ, అవతారం యొక్క మహిమ పట్ల కనబరచిన విశ్వాసమే ఆ యుగానికి ఘనతను చేకూర్చింది. భగవదవతార ఉనికి పట్ల కలిగిన యీ విశ్వాసమే మనిషికి సగుణబ్రహ్మం యొక్క లీలావిలాసాలను గ్రహించే సమర్థతను కల్పించింది. పర్యవసానంగా ఆధ్యాత్మిక ప్రపంచంలో తనకు ఏకైక మార్గదర్శి జగత్కారణుడైన ఆ భగవంతుడే అని అతడు తెలుసుకొన్నాడు; తానెంత పతితుడైనప్పటికీ భగవంతుని అపార కరుణ ఎన్నటికీ తాను నాశనం కావడానికి అనుమతించదని అతడికి విశ్వాసం కలిగింది. మరోవైపు ఆ భగవంతుడు ప్రతి యుగంలోను అవతరించి మనిషి స్వభావానికి అనుగుణంగా నూతన ఆధ్యాత్మిక మార్గాలను ఆవిష్కరించి అతడికి ఆత్మసాక్షాత్కారం సుగమం చేస్తాడని నమ్మకం ఏర్పడింది.

9. అవతారపురుషుల దివ్య స్వభావం గురించి శాస్త్రాల సారం

కల్యాణ గుణసంపన్నులైన అవతారపురుషుల జననాల, కర్మల గురించి స్మృతులలో, పురాణాలలో నమోదైన మూల భావాల సంక్షిప్త సారాంశాన్ని ఇక్కడ ప్రస్తావించడం అసంగతం కాబోదు. అవతారపురుషుడు ఈశ్వరునిలా నిత్యశుద్ధ బుద్ధ ముక్తస్వభావుడని శాస్త్రాలు తెలుపుతున్నాయి. సామాన్య జీవునిలా అతడెప్పుడూ కర్మబంధనంలో చిక్కుకపడడు. జన్మాదిగా ఆత్మారాముడవడంతో ప్రాపంచిక సుఖభోగాల కోసం జీవునిలా స్వార్థభావనలు అతడిలో ఎన్నడూ తలెత్తకపోవడమే ఇందుకు కారణం. అతడి యావజ్జీవితం పరుల శ్రేయస్సు కోసమే అంకితమైంది. మాయాపాశం నుండి ముక్తుడై ఉండడం చేత అతడిలో గతజన్మల స్మృతులు అట్లే నిలిచి ఉంటాయి.

10. అవతారపురుషుల అవిచ్ఛిన్న స్మృతి

బాల్యం నుంచీ అతడిలో ఈ అవిచ్ఛిన్న స్మృతి ఉండి ఉంటుందా? అని అడుగవచ్చు. అందుకు పురాణాలు ఇలా జవాబిస్తాయి: ఆ స్మృతి అతడిలో అంతర్గతంగా ఉన్నప్పటికీ బాల్యంలో అది సదా అభివ్యక్తం కాదు. కాని అతడి మనశ్శరీరాలు పరిపక్వతను సంతరించుకోగానే అప్రయత్నంగానో లేక స్వల్ప ప్రయత్నంతోనో ఆ స్మృతి ఎరుక కలుగుతుంది. అతడొనరించే ప్రతి కార్యానికీ ఇది అనువర్తిస్తుంది. (అంటే తానెందుకు జన్మించాడో, ఏం చేయాలో అంతా అతడికి ముందుగానే తెలియవస్తుంది.) అయినా మానవదేహం ధరించినందున అన్నివిధాలా మానవునిలాగే అతడు ప్రవర్తిస్తాడు.

మనశ్శరీరాలు పరిపూర్ణంగా పరిపక్వత చెందగానే అవతారపురుషునికి అతడి జీవితోద్దేశం వెల్లడవుతుంది. ధర్మాన్ని పునఃస్థాపించడమే తన రాకలోని ఏకైక లక్ష్యంగా అతడు గుర్తిస్తాడు. ఆ లక్ష్య సాధనకు అవసరమైన తోడ్పాటులన్నీ ఊహాతీతమైన రీతిలో వాటంతట అవే సమకూరుతాయి. ఇతరులు అంధకారంలో తడుముకొంటూ ఉన్నప్పుడు అతడు వెలుగుబాటలో నడుస్తాడు; నిర్భీతుడై అతడు తన గమ్యాన్ని చేరుకొంటాడు. తన అడుగుజాడలను అనుసరించమని సైగ చేసి సూచిస్తాడు. మాయాతీతుడైన పరబ్రహ్మాన్ని, జగత్కారణుడైన ఈశ్వరుణ్ణే సాక్షాత్కరించుకోవడానికి దారితీసే మార్గాలను ఆతడు ప్రతి యుగంలోను ఆవిష్కరిస్తాడు.

11. అవతారపురుషులు మతానికి క్రొత్త ఆకృతిని కల్పిస్తారు

అవతారపురుషుల కర్మలు, విశేషగుణాలను విశ్లేషించడంతోనే పురాణ కర్తలు ఆగిపోలేదు. అవతారపురుషులు ఏ సందర్భంలో ఈ ఇలపై అడుగు పెడతారో అన్న విషయం గురించి వారొక కచ్చితమైన నిర్ణయానికి రాగలిగారు. కాలప్రభావం చేత విశ్వజనీన సనాతన ధర్మానికి గ్లాని ఏర్పడినప్పుడు, మాయాశక్తిచే మోహితుడైనప్పుడు మానవుడు భోగవిలాసాలే పరమార్థాలని భావిస్తూ జీవితం సాగిస్తాడు. భగవంతుడు, ఆత్మ, ముక్తి ఇత్యాది అతీంద్రియ నిత్య సత్యాలు ఏదో ఒక అజ్ఞానయుగానికి చెందిన స్వాప్నికరాజ్య కవి అభూతకల్పనలుగా పరిగణిస్తాడు. న్యాయంగానో లేక మోసం చేసో ఏదో విధంగా ఆర్జించిన అపార సంపదలు, ఇంద్రియసుఖాలు తన హృదయంలోని శూన్యాన్ని పూరింపలేవని మనిషి చివరకు కనుగొన్నప్పుడు; తీరమే కానరాని నిరాశాపూరిత నల్లసముద్రపు తరంగాలు తనను ముంచెత్తివేసినప్పుడు వ్యథతో అతడు విమోచనార్థం బిగ్గరగా కేక పెడతాడు. అప్పుడు దుర్బల మానవులపై కరుణించి భగవంతుడు మానవుడిగా అవతరిస్తాడు. యుగాల పర్యంతం సనాతన ధర్మానికి పేరుకుపోయిన మకిలిని తొలగించి రాహువు నుండి వెలువడ్డ గ్రహణకాల చంద్రునిలా ప్రకాశింప చేస్తాడు. తరువాత మనిషి చేయి పుచ్చుకొని ధర్మమార్గంలో అతణ్ణి నడిపింప చేస్తాడు. కారణం లేని కార్యం ఏదీ ఉండదు. అల్లే విశ్వజనీన ఆవశ్యకత తల ఎత్తనిదే ఈశ్వరుడు కూడా ఏనాడూ లీలావిలాసంగా శరీరాన్ని దాల్చడు. అలాంటి ఆవశ్యకత యావత్తు సమాజంలో అనివార్యమైనప్పుడు భగవంతుని అనంత కరుణ ఘనీభూతమై, జగద్గురు రూపంలో ఆయన సాక్షాత్కరిస్తాడు. పదే పదే అవతారపురుషులు సాక్షాత్కరించడం చూసిన పురాణ కర్తలు అవసరం ఏర్పడ్డప్పుడు భగవంతుడు ఇలా అవతరిస్తాడనే నిర్ణయానికి వచ్చారు.

12. అవతారపురుషులు ఎప్పుడు అరుదెంచుతారు?

యుగావశ్యకత కారణంగానే సర్వజ్ఞుడైన జగద్గురువు, అవతారపురుషుడు ధర్మం మీద నూతన వెలుగును ప్రసరించడానికి అరుదెంచుతాడు. ధర్మానికి, ఆధ్యాత్మికతకు ఆలవాలమైన భారతదేశం యుగయుగాలలో ఆవిర్భవించిన అవతారపురుషుల పాదచిహ్నాలను తన హృదయంలో సంతరించుకొని పావనమైంది. యుగావశ్యకత ఏర్పడిన సందర్భాలలో శక్తిమంతమైన అవతారపురుషులు ప్రస్తుత కాలం వరకు ఆవిర్భవిస్తూనే వచ్చారు. దాదాపు నాలుగు వందల సంవత్సరాల క్రితం భగవంతుడు శ్రీ చైతన్యుడుగా అవతరించాడు. జనులను హరినామ సంకీర్తనలో అతడు ఉన్మత్తులను చేయడం సువిదితమే. అటువంటి తరుణం మళ్లీ వచ్చిందా? విభవాన్ని కోల్పోయి, విదేశీయుల ధిక్కారణకు గురైన భారతదేశంలో మళ్లీ ఆ యుగావశ్యకత కలిగిందా? అది భగవంతుని కరుణను ప్రేరేపించి మరోసారి ఆయనను అవతరించడానికి పురిగొల్పిందా? అశేష కల్యాణ గుణసంపన్నుడైన ఏ మహాపురుషుని జీవితచరిత్రను తెలుపడానికి మేం ఉపక్రమించామో, ఆయన జీవిత చరిత్రను ధ్యానపూర్వకంగా అధ్యయనం చేస్తే అటువంటి ఘటనే జరిగిందని గ్రహించగలము. గడచిపోయిన యుగాలలో శ్రీరాముడుగా, శ్రీకృష్ణుడుగా అవతరించి ఎవరు సనాతన ధర్మాన్ని పునరుద్ధరించారో, నేటి యుగావశ్యకతను పురస్కరించుకొని ఆతడు మళ్లీ అవతరించడం మూలంగా భారతదేశం మరోసారి ధన్యమైంది.

13. ఆధునిక యుగంలో అవతార పురుషుని ఆగమనం

1. యుగావశ్యకత

1. ఆధునిక కాలంలో మానవశక్తి - ప్రగతులు

విజ్ఞానం, సంపద, స్వయంకృషి - వీటి ఆసరాతో ప్రతి రంగంలోను మనిషి ఎలా ముందంజ వేస్తున్నాడో అతిసామాన్యుడు కూడా తెలుసుకోగలడు. జీవితంలోని ఏ క్షేత్రంలోనైనా యీ ప్రగతి కొక పరిధిని గీసుకోవడానికి మనిషి ఇష్టపడటం లేదని తోస్తోంది. నేల మీద, నీటిమీద పయనించటంతోనే సంతృప్తిపడక అతగాడు ఆకాశంలో ఎగరటానికీ ఒక యంత్రాన్ని కనుగొన్నాడు. సాగర గర్భంలోకి చొచ్చుకొనిపోయి ప్రజ్వరించే అగ్నిపర్వతాల అన్వేషణకు అతడిలోని జిజ్ఞాస వెన్నుతట్టింది. నిరంతరం మంచుతో కప్పబడిన పర్వతాలను అధిరోహించాడు, సముద్రాలను దాటాడు, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల అద్భుతాలను సూక్ష్మావలోకనం చేశాడు. లతల, మొక్కల, చెట్లలోకూడ తనలోవున్న ప్రాణమే స్పందిస్తోందని కనుగొన్నాడు. ప్రాణికోటిని పరిశీలన ప్రయోగాలకు గురిచేసి తన విజ్ఞానాన్ని విస్తృతం చేసుకొన్నాడు. పంచభూతాలయిన భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశాల మీద ఆధిపత్యాన్ని సాధించి మనం నివసించే భూమికి సంబంధించిన అసంఖ్యాక వాస్తవాలను తెలుసుకొన్నాడు. అంతటితో తృప్తిపడలేదు. అనంత దూరాలలోని గ్రహ నక్షత్రాల రహస్యాలను ఆవిష్కరించటంలో ఉత్సుకత చూపాడు - తన అన్వేషణలో యిప్పటికే కొంతమేరకు విజయుడయినాడు. అంతర్జగత్తు నియమాలను దర్యాప్తు చేయటంలో అతడి ప్రయత్నలోపం కానరాదు. ప్రయోగ పరిశోధనలతో అతడు ఆ క్షేత్రంలో నిరంతరం నూతన సత్యాలను కనుగొంటూనే ఉన్నాడు. ఒక జాతి మరో జాతిగా పరిణమిస్తుందనే నిర్ణయానికి వచ్చాడు. మనస్సు ఆది, అంతం ఉన్న సూక్ష్మపదార్థమని అర్థం చేసుకొన్నాడు. బాహ్య ప్రపంచంలో మాదిరే మానసిక ప్రపంచంలో కూడ ప్రతీ సంఘటన ఒక అనుల్లంఘనీయ నియమావళి మేరకు జరుగుతోందన్న నమ్మకానికొచ్చాడు.

అంతేకాదు, ఆత్మహత్య చేసుకోవాలనే విపరీతపు చర్యను ప్రేరేపించే మానసిక ప్రవృత్తుల నియమాలతో అతడు చిరపరిచితుడయినాడు. మరణానంతర జీవి అస్తిత్వ విషయంగా కచ్చితమైన ప్రమాణం లభించకపోయినా జాతీయ జీవనం కొనసాగటమేకాక పరిణామం కూడ చెందుతుందని చరిత్ర అధ్యయనం అతణ్ణి విశ్వసింపజేసింది. ఇలా వ్యక్తిగత జీవితం జాతీయ జీవనంలో సార్థకమవటం గాంచి దాన్ని మరింత ఫలవంతం చేయటానికి విజ్ఞానం, సహకార కార్యకలాపాల సాయంతో అజ్ఞానాన్ని పారదోలటానికి నిరంతర పోరాటం సాగిస్తున్నాడు. ఇలా అనుక్షణ పోరాటం చేస్తూ, బాహ్యాభ్యంతరాల నిగూఢ క్షేత్రాలను కనుగొంటూ, శాశ్వత ప్రగతిని గురించిన ఊహల్లో తేలిపోతూ, అంతులేని కోరికలనే మహా ప్రవాహంలో తన జీవన నౌకను జలప్రవేశం చేయించాడు.

కోరికలను అధికరించుకొంటూపోయే భౌతికవాద జీవన ప్రగతి ప్రధానంగా పాశ్చాత్యంలో ఉద్భవించింది. కాని భారతదేశంలోను, యితర ప్రాచ్యదేశాలలోను దాని తాలూకు ప్రభావం చాలామేరకు కానవస్తోంది. విజ్ఞాన పురోభివృద్ధితో ప్రాచ్య పాశ్చాత్యాలు ప్రతిరోజు చేరువ అవుతున్నకొద్దీ ప్రాచ్య జీవన సరళి మార్పుకు లోనై పాశ్చాత్య విధానానికి అర్థంపడుతోంది. పర్షియా, చైనా, జపాన్, భారతదేశం, తదితర ప్రాచ్యదేశాల చరిత్రలను అధ్యయనం చేస్తే మన కీ విషయం స్పష్టమవుతుంది. మంచికో, మరి చెడుకో పాశ్చాత్య భావాల ప్రభావం ప్రాచ్యం మీద పడిందన్న విషయంలో ఈషణ్మాత్రమూ సందేహం లేదు. అంతేకాదు కాలగమనంలో యీ పాశ్చాత్య భావాలు ప్రపంచం యావత్తు వ్యాపిస్తాయని స్ఫురిస్తోంది.

2. శక్తి ప్రగతుల విస్తరణ- పాశ్చాత్యం నుంచి ప్రాచ్యానికి

పైన చెప్పిన జీవన ప్రగతి మంచిచెడులను నిర్ణయించాలంటే మనం ప్రత్యేకంగా పాశ్చాత్యానికి వెళ్లాలి. అక్కడ మనం దీని మూలం, స్వభావాలను కనుగొనవచ్చు. అలాంటి దర్యాప్తు - పాశ్చాత్యుల తొలకరి భావనలు ప్రగతిగాములా లేక తిరోగాములా; మనిషికి ప్రాప్తించే మొత్తం సుఖంలో లాభదాయకాలా నష్టదాయకాలా - మనకు తెలియచేస్తుంది. ఇలా వ్యష్టిగా సమష్టిగా పాశ్చాత్య జీవనంలో ఆ ప్రగతి ఫలితాలను ఒక్కమారు నిర్ణయించగలిగితే, అదే ప్రక్రియను సులభంగా యితర దేశాలకూ వర్తింపచేయవచ్చు. అలా చేసేటప్పుడు యీ ఆధునిక ప్రభావాలకు ఆ దేశాలు ఎంత కాలంగా గురి అయినవో గణనలోకి తీసుకోవాలి.

3. పర్యవసానంగా పాశ్చాత్య జీవన సరళి, ప్రగతికి ప్రమాణమవుతుంది

పాశ్చాత్య దేశాలలో నెలకొన్న భరించరాని శీతలం అక్కడి మనిషిని ప్రాచీన కాలం నుంచీ తీవ్ర దేహస్మృతిగామిగా రూపొందించినదని చరిత్ర స్పష్టంగా

నమోదు చేసింది. ఇది అతణ్ణి స్వార్థపరుణ్ణి చేసింది. కాని అదే సమయంలో వ్యక్తిగత స్వార్థసిద్ధి సమష్టి కృషితోనే సుసాధ్యం అని అతడు గుర్తించాడు. ఈ గుర్తింపు అతణ్ణి దేశభక్తుడిగా రూపొందించింది. ఈ స్వార్థపరత్వమూ, దేశభక్తీ కాలక్రమంలో మొక్కవోని సాహసంతో పరాయి దేశాలను నిర్జించి, వాటి సంపదలను కొల్లగొట్టటంలో అతడికి దోహదకారులయినవి. తదనంతరం అతడి జీవనపోరాటం సుగమం అయింది. క్రమంగా దృష్టిని తన కేసి మళ్లించుకొనే సమర్థత గడించాడు; ఫలితంగా పాండిత్యం, కులీన లక్షణాలు సముపార్జించే ప్రయత్నంలో పడ్డాడు. కేవల జీవన సమరాన్ని మించిన ఉన్నత అంశాలకేసి అతడు మరింతగా చేరువ కాసాగాడు. కాని ఇప్పుడతడు అవరోధాలను ఎదుర్కోవలసి వచ్చింది. మత విశ్వాసాలు, మత దురభిమానులైన పురోహితవర్గం పురోగమన పథానికి అడ్డుగోడలుగా నిలిచాయి. విద్యాసముపార్జనకు ఎవడైనా పూనుకొంటే అతగాడు నిశ్చయంగా నరకానికి వెళ్లక తప్పదు అంటూ బెదిరించటంతో మాత్రమే ఊరుకోలేదు ఆ పురోహితుడు. మరింత ముందుకువెళ్లి, ఆ ప్రగతిమార్గంలో ఎవడూ ముందుకుపోకుండా నివారించటానికై మోసం, శక్తి, కపటోపాయాలు ప్రయోగించాడు. కాని స్వార్థపరత్వం సాధించటానికి అలవాటుపడ్డ పాశ్చాత్యుడికి ఈ అవరోధాలను అధిగమించటానికి ఎక్కువ సమయం పట్టలేదు. తను గమించే మార్గం నుంచి పురోహితుణ్ణి బలాత్కారంగా తొలగించి, ముందంజ వేశాడు. ధర్మశాస్త్ర గ్రంథాలను, మతాన్ని త్రోసిరాజనీ, పురోహితుణ్ణి ధిక్కరించీ ఒక కొత్తబాటలో తన జీవితాన్ని నిర్దేశించుకొన్నాడు. ఇంద్రియాతీతమైన దేనినీ విశ్వసించకూడదనీ, స్వీకరించకూడదనీ నిర్ణయించుకొన్నాడు.

4. పాశ్చాత్యంలోని యీ ప్రగతికి కారణం, దాని చరిత్ర

పంచేంద్రియాలతో ప్రత్యక్షంగా అనుభూతమై, హేతువాదానికి నిలబడేదే 'సత్యం'గా పాశ్చాత్యం ఎంచుకొంది; అప్పటినుంచి పాశ్చాత్యం కనపడే (యుష్మదీ ప్రత్యయగోచరమైన - అంటే నేను తప్ప తక్కిన దాని నంతా) ఈ విషయాలన్నిటినీ పదార్థంగా భావించి, దానినే ఆరాధించసాగింది. అంతేగాక అస్మత్ ప్రత్యయ గోచరమైన (అంటే నేను అనే ఎరుకను) విషయిని కూడ యితర విషయాలలో మరొకటిగా భావించసాగింది. కనుక యీ విషయిని కూడ అది ఇంద్రియాల చేత ప్రత్యక్షంగా అనుభూతమయ్యే ఇతర పదార్థాలను పరిశోధించినట్లే పరిశోధించసాగింది. ఇలా గత నాలుగు వందల సంవత్సరాల నుంచి పాశ్చాత్యుడు విశ్వంలోని ప్రతిదానినీ ప్రత్యక్ష ప్రమాణం ద్వారానే స్వీకరించసాగాడు. ఈలోపు తన శైశవదశా లోపాలను, పరిమితులను అధిగమించి, పెరిగి పెద్దదై - బలం,

ఆశావాదం, ఉత్సాహం, శక్తితో కూడుకొన్న యౌవనంలోకి అడుగుపెట్టింది విజ్ఞానశాస్త్రం.

విజ్ఞానశాస్త్రంలో మరింత పురోభివృద్ధి గాంచటంలో సమర్థుడైనప్పటికీ, పైన తెల్పిన విధానం పాశ్చాత్యుణ్ణి ఆత్మజ్ఞానం కేసి దారితీయించలేకపోయింది.

5. ఆత్మజ్ఞానం పట్ల అజ్ఞానం: తత్ఫలితంగా అసంతృప్తి

ఎందువల్లనంటే - ఆత్మజ్ఞానమనేది ఆత్మసంయమం, స్వార్థత్యాగం, అంతర్ముఖత్వం ద్వారా మాత్రమే పొందగలుగుతాం. పైగా సంపూర్ణంగా నియంత్రించబడిన వృత్తులతో కూడిన మనస్సే యీ ఆత్మజ్ఞానానికి దారితీయించే ఏకైక పరికరం. కాబట్టే కేవల బహిర్ముఖుడైన పాశ్చాత్యుడు ఆత్మజ్ఞాన మార్గభ్రష్టుడై భౌతికవాదిగా, దేహాత్మవాదిగా మారిపోవటంలో ఆశ్చర్యపడనక్కర్లేదు. అందుకే కాబోలు ప్రాపంచిక సుఖాలనే పరమార్థాలుగా ఎంచుతూ, వాటిని పొందటంలో తన సర్వశక్తులనూ వినియోగించసాగాడు. విజ్ఞానశాస్త్రం మూలంగా భౌతిక పదార్థాలను గురించి గడించిన జ్ఞానాన్ని అతగాడు తన భోగసాధనకై ఉపయోగించసాగాడు. ఫలితంగా అతడు స్వార్థపరుడూ, మహాదాంభికుడూ ఐనాడు. కనుకనే పాశ్చాత్యంలో సంపద మీద ఆధారపడిన సాంఘిక వ్యవస్థను మనం గమనించవచ్చు. ప్రళయకాలంలో వినవచ్చే బీభత్స వాదాలతో సరిపోలే మారణాయుధాలను మనం అక్కడ చూడవచ్చు. దీనితోపాటు తులలేని సౌభాగ్యం ప్రక్కనే నెలకొన్న పేదరికపు అసంతృప్తినీ, ఐశ్వర్యం కోసమైన తీరని దాహాన్ని, పరాయి దేశాల దురాక్రమణ, అణచివేతలను అక్కడ మనం చూడగలం. మళ్లీ యీ భోగాలాలస కారణంగా సుఖభోగాల చరమసీమకు చేరినా కూడ పాశ్చాత్య స్త్రీపురుషుల హృదయాలలో ఒక అగాధమైన వెలితి అలాగే ఉండిపోయింది. వ్యక్తిగతంగా తాము మరణించినా జాతిపరంగా తాము ఉంటామనే నమ్మకం కూడ వారిలో ఎలాంటి సంతోషాన్నీ కలిగించలేకపోయింది. సావధాన పరిశోధనానంతరం పాశ్చాత్యుడికి పంచేంద్రియాలు ఉత్పాదించే జ్ఞానం దేశకాలాతీతమైన సత్యాన్ని గురించిన జ్ఞానాన్ని ఇవ్వజాలదని అర్థమైంది. భౌతికవిజ్ఞానం ఆ సత్యం ఉనికిని సూచించటంతో ఆగిపోతుంది. కారణం ఆ సత్యం భౌతిక జ్ఞానానికి అతీతమైనది కాబట్టి! కనుకనే ప్రాపంచిక జ్ఞాన మనే ఏ దేవత సహాయంతో అతడు యింత బలవంతుడూ శక్తిమంతుడూ అయినాడో, ఏ దేవత అతడికి భోగభాగ్యాలను అనుగ్రహించిందో, ఆ సదరు దేవత తన కీ విషయంలో ఉపకరించలేదని అతడు అర్థం చేసుకొన్నాడు. అతడి హృదయం యిప్పుడు నిరాశానిస్పృహలతో, అంతులేని బాధతో నిండిపోయింది.

ఆ విధంగా మతవిశ్వాసరాహిత్యం, స్వార్థపరత్వం, భోగాసక్తి అనే పునాదుల మీద పాశ్చాత్య నాగరకత నిర్మితమైనదని చరిత్ర అధ్యయనం తెలుపుతుంది.

6. ప్రాచ్యం కూడ పాశ్చాత్యంలా 'పురోగమించా' లంటే, అది స్వార్థాన్ని, భోగలాలసను అలవరచుకోవాలి

కాబట్టి ఏ వ్యక్తిగాని, దేశంకాని పాశ్చాత్యం సముపార్జించిన ఫలాలను తానూ పొందాలని ఆకాంక్షిస్తే ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా ఆ పునాదుల మీదనే తమ జీవన సరళిని నిర్మించాలి. అందుకే పాశ్చాత్య భావాలను అనుకరించి తమ జాతీయ జీవనాన్ని దిద్దుకొన్న జపాన్ మొదలైన ప్రాచ్యదేశాలలో కూడ - అవి తమ దేశాలను ఎంత ప్రేమిస్తూన్నా కూడ - పైన పేర్కొన్న చెడులు తప్పటం లేదు. పాశ్చాత్య భావాల, ఆదర్శాల స్ఫూర్తి ఫలితమే యీ అనర్థం; ఈ సంగతి పాశ్చాత్యంతో భారతీయ జీవన సరళి సంపర్కం పొందిన తదనంతర కాల చరిత్రను అధ్యయనం చేస్తే స్పష్టమవుతుంది.

పాశ్చాత్యంతో సంసర్గం కలుగటానికి మునుపు భారతదేశంలో 'జాతీయ జీవనం' అంటూ ఒకటి ఉండేదా? అందుకు జవాబు, 'జాతీయ జీవనం'

7. ధార్మికత: భారతీయుల ప్రాచీన జాతీయజీవన పునాది

పేరిట అలా ఒకటి ఉండకపోయినా, నిస్సందేహంగా అది ఉండినదనటం యథార్థమే. ప్రాచీన కాలం నుంచి భారతీయులందరూ ఐదు 'గ' కారాల - అంటే 1. గురువు 2. గంగ 3. గాయత్రి 4. గీత (భగవద్గీత) 5. గోవు (ఆవు) -పట్ల శ్రద్ధాభక్తులు గలిగినవారై పూజిస్తూండటం ప్రతిచోటా మనకు కానవస్తున్నది. అలాగే రామాయణం, మహాభారతం తదితర ధార్మిక గ్రంథాలలోని పవిత్ర ఆదర్శాలు ప్రతి వ్యక్తి జీవితానికీ ప్రేరణనిచ్చి మార్గదర్శకాలైనవి. అట్లే దేవభాష ఐన సంస్కృతం విద్యావంతులకు వాడుకభాష అయినది. ఇలా వారిని సమైక్యమొనర్చే అంశాలు ఎన్నో ఉన్నప్పటికీ, ధార్మికాదర్శాలు, ధర్మానుష్ఠానం నిస్సంశయంగా ఆ సమైక్యతకు పునాది అని చెప్పక తప్పదు.

భారతదేశ జాతీయ జీవన పునాది ధార్మికత మీద ప్రతిష్ఠితం కావటంతో, దాని నాగరకత అపూర్వంగా రూపుదిద్దుకొంది. వ్యక్తిపరమైన, జాతిపరమైన

8. ప్రాపంచిక భోగాలను భారతదేశం ఎన్నడూ ఆదర్శంగా తీసుకోలేదు

నడవడిని నియంత్రించే ఆత్మసంయమమే యీ నాగరకత యొక్క ముఖ్య లక్షణం. భోగం త్యాగానికి దారితీయటానికే, ఐహిక జీవనం పరలోక జీవనం నిమిత్తమే - అనే సిద్ధాంతాన్ని సర్వులకూ జ్ఞప్తిచేస్తూ వచ్చిం దీ సంస్కృతి. ఈ మహోత్తమ ఆదర్శమే వ్యక్తిగత లేక జాతీయ జీవనానికి ప్రాణనాడిగా పనిచేసింది. కాబట్టే కుల లేక వర్ణ విధానం సుదీర్ఘకాలం పరస్పర విభేదాలనుగాని, అసంతృప్తినిగాని సమాజంలో కల్పించలేదు. ఎందుకంటే ప్రతివ్యక్తీ జన్మతో

నిమిత్తం లేకుండా కుల లేక వర్ణానికి చెందిన కర్తవ్యాలను నిస్స్వార్థంగా నిర్వర్తించి మోక్షాన్ని పొందవచ్చు. అలాంటప్పుడు అసంతృప్తికి చోటెక్కడ? సుఖించటానికి సమాన అవకాశాల హక్కు ప్రాతిపదిక మీద నెలకొన్న పాశ్చాత్య సమాజంలో సంభవించిన దానికి విరుద్ధంగా, ముక్తిని పొందటానికి సమాన అవకాశాలు కల్పించిన ప్రాచీన భారతీయ సమాజంలో సాంఘిక వర్గాలలో ఎలాటి అసంతృప్తి జనించలేదు. పాశ్చాత్య సాన్నిహిత్య ఫలితంగా భారతదేశ జాతీయ జీవనంలో వచ్చిన పరిణామాలు యీ దిగువన చర్చించబడినవి.

పాశ్చాత్యం భారతదేశాన్ని ఆక్రమణ చేసుకొన్న ఫలితంగా జాతీయ సంపద పంపిణీలో అనేక మార్పులు సంభవించటం సహజమూ, అనివార్యమూను! కాని

9. పాశ్చాత్యుల భారతదేశ ఆక్రమణ - తత్ఫలితాలు

పాశ్చాత్య ప్రభావం అక్కడితో ఆగక, మరింత ముందుకు చొచ్చుకుపోయింది. అనాదిగా స్త్రీ, పురుషులకు మార్గదర్శకాలుగా ఉన్న వేళ్లూనిన విశ్వాసాలలో ఆ ప్రభావం విపరీత పరిణామాలను తీసుకువచ్చింది. తత్ఫలితంగా - భోగం త్యాగం నిమిత్తమే - అంటే సుఖించే ఉద్దేశం ఆఖరుకు దాన్ని త్యజించటానికే అనే సిద్ధాంతం స్వార్థాన్వేషకులైన పురోహితుల మిథ్యాకల్పన అనీ, మరణానంతరం జీవు డుంటాడనే భావన కవుల ఊహాగానమనీ భారతీయు లిప్పుడు దృఢంగా విశ్వసించసాగారు. ఒక వ్యక్తి ఏ జాతిలో, ఏ అంతస్తులో జన్మిస్తాడో జీవితాంతం అతడు దాన్లోనే ఉండిపోవాలనటం కంటే అన్యాయమైన విషయం మరొకటి ఏం ఉంటుంది? ఇలా క్రమక్రమంగా పాశ్చాత్య వశీకరణకు లోనవుతూ త్యాగం, ఆత్మసంయమం అనే ఆదర్శాలను త్రోసిపుచ్చి, ప్రాపంచిక భోగాలకేసి భారతదేశం పరుగులెత్తసాగింది. ఈ వైఖరి ప్రాచీన విద్యాశిక్షణా విధానాలలో క్షయాన్ని కొనితెచ్చింది; అంతేగాక నాస్తికత్వం, అనుకరణపట్ల ప్రీతి, ఆత్మవిశ్వాసరాహిత్యాలను పెంపొందించసాగింది. ఆ విధంగా భారతదేశం తన వెన్నెముకనే కోల్పోయింది. సుదీర్ఘ కాలంగా తాము విశ్వసిస్తూ వస్తూన్న నమ్మకాలు, అనుష్ఠానాలు తప్పుల కుప్పలనీ, పాశ్చాత్యం తన అద్భుత విజ్ఞాన పరిజ్ఞానంతో భారతీయ సంప్రదాయాలు మొరటువని, అనాగరకాలని ప్రకటించటంతో భారతీయులు కూడ అలాగే భావించసాగారు. భోగాసక్తతతో అంధురాలై భారతదేశం తన ప్రాచీన సంస్కృతీ వైభవాలను మరచిపోయింది. ఈ మరపు దాని అవగాహనాశక్తిని అస్తవ్యస్తపరచింది. అప్పుడు దాని జాతీయ అస్తిత్వమే ప్రమాదంలో పడింది. ప్రాపంచిక సుఖాలకు కూడ ఇతరులపైనే ఆధారపడవలసిన కారణంగా నిరాశాభావం చోటుచేసుకుంది. ఆ విధంగా రెంటికీ చెడ్డ రేవడిలా భుక్తిని, ముక్తిని రెండిటినీ కోల్పోయినా, యితరులను అనుకరించటాన్ని వీడక, భోగవాసనలనే

అలల్లో చిక్కు-వడిన సరంగులేని నావ మాదిరి దేశం అల్లకల్లోలితం కాసాగింది. అటువంటప్పుడు నాల్గుమూలల నుండి పెద్ద కలవరం చెలరేగింది: ''భారత దేశంలో జాతీయ జీవన మనేది ఎన్నడూ ఉండివుండలేదు. పాశ్చాత్యుల పుణ్యమా అంటూ యిప్పుడిప్పుడది కానవస్తూన్నా, పూర్తిగా అదింకా వ్యక్తం కావటానికి ఎన్నో అడ్డంకులున్నవి. ముఖ్యంగా వేళ్లానిన మతవిశ్వాసాలు దానిని పూర్తిగా చంపివేశాయి. విగ్రహారాధన - అసంఖ్యాక దేవీదేవతల పూజ - కూడ ఆ జాతీయ జీవనాన్ని ఎదగకుండా నిలువరించింది. కాబట్టి దీన్ని నాశనం చెయ్యి, కూకటివేళ్లతో సహా పెరికివెయ్యి, అప్పుడే భారతీయ స్త్రీ పురుషులందరిలో సజీవత్వం కొత్తగా నెలకొంటుంది.'' ఇందుతోపాటు క్రైస్తవ మతం, దానికి అనుకరణగా ఏకేశ్వరవాదం[1] ప్రచారంలోనికి వచ్చాయి. రాజకీయాల మీద, సాంఘికశాస్త్రం మీద, స్త్రీ స్వాతంత్ర్యంమీద, వితంతు పునర్వివాహాల మీద పాశ్చాత్య పద్ధతిలో బహిరంగ సభలలో యిచ్చే ప్రసంగాలను సాగిలబడి భారతదేశం ఆలకించసాగింది. ఇంత జరిగినా కూడ నిరాశా నిస్పృహలు తగ్గటానికి బదులుగా అవి మరింత పెరుగసాగాయి. పాశ్చాత్య నాగరకతా ఉత్పాదకాలైన రైళ్లు, టెలిగ్రాఫ్‌లు ఉపయోగంలోనికి వచ్చాయి. ఇవీ పరిస్థితులను చక్కదిద్దలేకపోయాయి. అందుకు కారణం - జాతీయ జీవన ఆదర్శాలను అవి స్పృశించనూ, ప్రేరణను కలిగించనూ లేకపోవడమే. సరైన చికిత్స చేయనిదే, రోగం నయం కాదుగదా! భారతదేశపు ఆత్మ మతంలో, ధార్మికతలో నెలకొని ఉంది. ఆ ధార్మికతను జీవవంతం చేయలేనప్పుడు దేశం ఎలా జీవవంతం కాగలదు? పాశ్చాత్య భావాల ప్రభావమే యీ పతనానికి మూలకారణం. అలాంటప్పుడు నాస్తికత్వంతో కూడిన పాశ్చాత్యం దాన్నెలా పునరుజ్జీవింప చేయగలదు? స్వయంగా లోపభూయిష్ఠమైన పాశ్చాత్యం మరొక దేశాన్ని ఎలా ఉద్ధరించగలదు?

10. భారత జాతీయ జీవనం : గుణదోషాలు

పాశ్చాత్యుల ఆగమనానికి పూర్వం భారత జాతీయ జీవనంలో లోపాలు లేవనటం సబబు కాదు. కాని నాడు జాతీయ జీవనం జీవవంతమై ఉండటంతో తన దోషాలను స్వయంగా సరిదిద్దుకోవటానికి అది సర్వదా ప్రయత్నిస్తూనే ఉండినది. కాని ప్రస్తుతం జాతిలోను, సమాజంలోను ఆ ప్రయత్నం కానరావటం లేదు. ఫలితంగా పాశ్చాత్య భావాల, ఆదర్శాల వ్యాప్తి రోగాన్ని నయం చేయటానికి మారుగా రోగినే చంపపూనుతూన్నది.

---

1. భగవంతుడు ఒక్కడే అనే సిద్ధాంతం (monotheism).

కనుక పాశ్చాత్యంలో జరిగిన ధర్మగ్లాని భారతదేశంలోను దాని ప్రభావం చూపినదనటం స్పష్టం. ప్రస్తుత కాలంలో యీ ధర్మగ్లాని ప్రపంచ వ్యాప్తంగా

11. ప్రస్తుత ధర్మగ్లానికి పాశ్చాత్య భావనలే కారణాలు

ఎంతగా పాకిపోయిందో ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది. నిజానికి ధార్మికత అనేది ఏదైనా ఒకటి ఉంటే, భగవంతుడి దయతో దాన్ని సాక్షాత్కరించుకొనే శక్తి మనిషికి కనుకవుంటే, భోగపరాయణుడైన అతగాడు యీ ఆధునిక యుగంలో దాన్ని వీడి సుదూరం వెళ్లాడనటం నిస్సంశయం. నూతన ప్రక్రియలతో సరికొత్త భోగాలను మానవుడికి అందించి తద్ద్వారా అతడి జీవితాన్ని సుసంపన్నం చేస్తున్నానని భావించే విజ్ఞానశాస్త్రం, మానవుడికి శాంతిని ప్రసాదించటంలో పరాజయాన్నే చవిచూసింది. ఈ శోచనీయ స్థితిలో మానవుడికి చేయూత నిచ్చేదెవరు? మానవ ఆత్మ అనుభవిస్తూన్న యీ అశాంతి, ఆవేదనలకు చలించిపోయి, యీ యుగానికి అనుకూలించేదీ, మనిషిని యీ ఇంద్రియభోగాల ఉచ్చునుంచి కాపాడేదీ ఐన ఒక మతాన్ని అందించే ఆధ్యాత్మిక శక్తి ఒకటి లేదా? ప్రాచ్య పాశ్చాత్యాలలో దిగజారిపోతూన్న ఆధ్యాత్మిక విలువలను తిరిగి ఉన్నతస్థాయికి తీసుకొచ్చి, మనిషిని మళ్లీ శాంతిమయ జీవనాన్ని గడిపే మార్గంలోపెట్టే శక్తి ఏది?

భగవద్గీతలో భగవానుడు వాగ్దానం చేశాడు, 'లోకంలో ధర్మం క్షీణించినప్పుడు తన మాయ ద్వారా మానవరూపంలో అవతరించి, అధర్మాన్ని అరికట్టి, తిరిగి మనిషికి శాంతిమార్గం చూపెడతా'నని. అంతులేని యీ సమకాలీన ఆవేదన - యీ యుగావశ్యకత - అతడి కరుణను ఉప్పొంగనీయరాదా? మనిషి పొందుతున్న నిస్సహాయత, నిస్పృహ అతణ్ణి మళ్లీ అవతరించటానికి పురికొల్పదా?

ఓ పాఠక మహాశయా! ఈ యుగ ఆవశ్యకత ఈ కార్యాన్ని మళ్లీ నిర్వర్తింపచేసింది; భగవానుడు జగద్గురువు రూపంలో మళ్లీ నిజంగానే అవతరించాడు.

12. ధర్మ సంరక్షణార్థం భగవానుడు మళ్లీ అవతరించాడు

విశ్వాసంతో అతడి పవిత్ర వాణిని శ్రద్ధతో ఆలకించు: ''ఎన్ని మతాలో, అన్ని మార్గాలు'', ''శ్రద్ధతో ఆచరించిన ఏ ఆధ్యాత్మిక సాధనతోనైనా భగవత్సాక్షాత్కారం పొందగలవు.'' కోల్పోయిన ఆ పరావిద్యను తీసుకురావటానికై అతడు ఆచరించిన కనీ వినీ ఎరుగని పరిత్యాగ తపోసాధనల గురించి ముగ్ధుడవై ఆలకించి, మననం చెయ్యి. లవలేశమైనా కామగంధంలేని ఆ మహనీయుడి పావన చరితాన్ని చర్చించుకొంటూ, ధ్యానిస్తూ మనమూ పవిత్రుల మవుదాం, పదండి!

2. శ్రీరామకృష్ణుల జన్మస్థలం (కామార్పుకూర్) - పూర్వీకులు

1. పేదకుటుంబంలో భగవంతుడు ఎందుకు అవతరిస్తాడు?

భగవదవతారాలుగా లోకంలో నేటికీ పూజింపబడుతున్న వారిలో శ్రీరామచంద్రుడు, శాక్యముని (బుద్ధుడు) మినహా తక్కిన అవతారమూర్తు లందరూ పేదరికంలోను, కష్టపరంపరలోను జన్మించారు. ఉదాహరణకు క్షత్రియ కులభూషణుడైన శ్రీకృష్ణుడు కారాగారంలో జన్మించి, తల్లితండ్రుల నుంచి దూరమై బాల్యాన్నంతా ఒక చిన్న గొల్లపల్లెలో గడిపాడు. పేదలైన తల్లితండ్రులను అమరజీవులుగా చేసిన ఏసుక్రీస్తు జన్మించింది ఒక గుర్రాల చావడిలో. తండ్రి మరణానంతరం పేద వితంతువుకు శంకరభగవత్పాదుడు జన్మించాడు. చైతన్యదేవుడు జన్మించినది సామాన్య కుటుంబంలోనే. ఐనప్పటికీ దుఃఖదారిద్ర్యాల పరిధిలోనే సంతృప్తి సంతోషాలు ఎక్కడ లేవో, సంసారం అతికష్టం మీద ఎలాగో జరిగిపోతూవున్నా ప్రేమ, స్వార్థరాహిత్యాలు ఎక్కడ లుప్తమో, తల్లితండ్రులు పేదలైనా త్యాగం, పవిత్రత, నిబ్బరమైన గుండెతోపాటు కోమలమైన దయాదాక్షిణ్యాది సుగుణాలు ఎక్కడ శూన్యమో - అటువంటి చోట్లలోమాత్రం వారెన్నడూ జన్మించలేదు.

మనం లోతుగా ఆలోచించి చూస్తే వారు జన్మించిన పేదరిక పరిస్థితులకూ, వారి భావి జీవితాలకూ మధ్య నిగూఢమైన సంబంధం కానవస్తుంది. లేకుంటే బాల్యంలో వారు పేదసాదల, అణగారిన, దుఃఖితుల స్థితి పట్ల స్వానుభూతి ప్రకటించని పక్షంలో, పెరిగి పెద్దవారయ్యాక ఆ ప్రజల కన్నీళ్లను తుడిచి వారి హృదయాలను ఎలా శాంతితో నింపగలిగేవారు? అవతారమూర్తుల రాక అదొక్క కార్యసాధనకు మాత్రమే కాదు. ప్రధానంగా, ధర్మగ్లానిని అరికట్టటానికే వారు అవతరిస్తారు. ఈ కార్యాన్ని నెరవేర్చాలంటే తొలుత వారు పూర్వపు

77042
హైదరాబాద్-500 044

ఆధ్యాత్మిక మార్గాలలో సుపరిచితులు కావాలి. వాటి క్షీణతకు గల కారణాలను తెలుసుకొని, దేశకాల పరిస్థితులకు అనుగుణంగా ఆ ఆధ్యాత్మిక మార్గాలకు క్రొత్త, సమగ్ర స్వరూపాన్ని మలచాలి. వీటిని గురించిన వాస్తవికతలు పేదవారి పూరిళ్లలోనేగాని రాజప్రాసాదాలలో లభించవు. ఎందుకంటే ప్రాపంచిక సుఖభోగాలకు నోచుకోని పేదవారే భగవంతుణ్ణి, ఆయన వితరణను తమ జీవిత ముఖ్యావలంబనంగా ఎంచుతారు. కాబట్టి ధర్మగ్లాని సర్వత్రా కానవస్తున్నా కూడ, పూర్వం ఆచరణలో ఉండిన ధార్మిక బోధలు ఒకింత ఐనా యథాతథంగా అనుసరించబడుతూ ఉండేది యీ బీదసాదల ఇళ్లలోనే. జగద్గురువులైన మహాపురుషులందరూ జన్మించేటప్పుడు పేదల పూరిళ్లకే ఆకర్షితు లవుతూ ఉండటానికి బహుశ యిదే కారణం కావచ్చు.

ఏ మహాపురుషుడి చరితాన్ని మేం చెప్ప పూనుకొన్నామో ఆయన కూడా యిదే పరిస్థితులలో జన్మించటం జరిగింది. హుగ్లీ జిల్లా పశ్చిమోత్తర ప్రాంతం

2. కామార్పుకూర్: శ్రీరామకృష్ణుల జన్మ స్థలం

బంకురా, మేదినీపూర్ జిల్లాలతో కలిసే చోటుకు సమీపంలో ఒక త్రికోణాకృతిలో నెలకొన్న మూడు చిన్న గ్రామాలు ఉన్నాయి. గ్రామస్థులు వీటిని శ్రీపూర్, కామార్పుకూర్, ముకుందపూర్లుగా పేర్కొంటున్నా, యివి ఎంత దగ్గరగా ఉన్నాయంటే బాటసారికి అవి ఒకే గ్రామంలోని మూడు పేటలుగా తోస్తాయి. స్థానిక జమీందార్లు కామార్పుకూర్‌లో అనేక తరాలుగా నివసిస్తూండిన కారణం చేత కాబోలు చుట్టుపట్ల గ్రామస్థులు యీ మూడు గ్రామాలను కలిపి

కామార్పుకూర్: ఒక దృశ్యం

'కామార్పుకూర్'గా పిలుస్తూండేవారు. మన కథాకాలం నాటికి యీ కామార్పుకూర్ బర్ద్వాన్ మహారాజుల రాజగురువు కుటుంబానికి చెందిన శిస్తు చెల్లించని

జమీలో ఒక భాగంగా ఉంది. ఆ గురువు వంశీయుల సంతతిలోని శ్రీ గోపీలాల్ గోస్వామి, శ్రీ సుఖలాల్ గోస్వామి, తదితరులు[1] అప్పుడక్కడ నివసిస్తూండే వారు.

బర్ద్వాన్ పట్టణం కామార్పుకూర్‌కు ఉత్తరంగా ముప్ఫై రెండు మైళ్ల దూరంలో నెలకొనివుంది. ఇక్కడ నుంచి వేయబడిన కంకర బాట, కామార్పు కూర్ మీదుగా పూరీ దాకా వెళుతుంది. పూరీ జగన్నాథుణ్ణి దర్శించటానికి చాలామంది సాధువులు, పేద యాత్రికులు యీ బాట మీదుగానే కాలినడకన వస్తూ పోతూ ఉండేవారు. సుప్రసిద్ధ తారకేశ్వర్ శివాలయం కామార్పుకూర్‌కు ఉత్తరంగా పంధొమ్మిది లేక ఇరవై మైళ్ల దూరంలో ఉంది. ద్వారకేశ్వర్ నదీ తీరంలోని జహానాబాద్ లేక ఆరాంబాగ్ పట్టణాల మీదుగా వెళ్లే బాట తార కేశ్వర్‌ను కామార్పుకూర్‌తో కలుపుతుంది. అంతేగాక 18 మైళ్ల దక్షిణంలోవున్న ఘటాల్ నుంచి, 26 మైళ్ల పశ్చిమంలోవున్న వనవిష్ణుపూర్ నుంచి రెండు రహదార్లు కామార్పుకూర్‌లో ప్రవేశించేవి.

1867వ సం॥లో మలేరియా జ్వరం సర్వనాశనం చేయటానికి మునుపు వ్యవసాయమే ప్రధానంగావున్న బెంగాల్ పల్లెలలో వెల్లివిరిసిన ప్రశాంతత వర్ణనా

3. కామార్పుకూర్ ప్రాంతాల్లో ఆనాటి సుభిక్షత : నేటి స్థితి గతులు

తీతం. పచ్చని పైర్లతో కళకళలాడుతూండే పొలాల మధ్య హుగ్లీ జిల్లాలోని ఈ పల్లెలు ఆకుపచ్చని సముద్రంలో తేలి యాడే దీవులుగా కన్నుల పండువ చేసేవి. సారవంతమైన భూములు కావటంతో పంటలు సమృద్ధిగా పండేవి. స్వచ్ఛ మైన గాలిని పీలుస్తూ పగటి వేళల్లో పొలాలలో పరిశ్రమిస్తున్నందున యిక్కడి ప్రజలు బలారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవితం సాగించేవారు. ఈ గ్రామాలు జనాభాతో క్రిక్కిరిసి ఉండేవి. వ్యవసాయంతోపాటు జనులు వివిధ లఘుపరిశ్రమలలో నిమగ్నులై ఉండేవారు. కామార్పుకూర్ జిలేబీలకు, నబత్ (ఒక రకమైన మిఠాయి) తయారీకీ నేటికీ ప్రసిద్ధం. ఈనాటికీ యిక్కడి ప్రజలు ఎబొనీ (ఒక రకం కలప)తో హుక్కా గొట్టాలను తయారుచేసి, కలకత్తాకు

---

1. హృదయరాం ముఖోపాధ్యాయ సుఖలాల్‌కు మారుగా అనూప్ గోస్వామి అనే వ్యక్తి గురించి చెప్పాడు. ఇది సందేహాస్పదమే. ఎందుకంటే కామార్పుకూర్ భూస్వాములైన లాహాలు అక్కడుండిన గోస్వామి పేరు సుఖలాల్ అనీ, అతడి కుమారుడు కృష్ణలాల్ గోస్వామి వద్ద నుండే తాము 55 ఏళ్ల క్రితం కామార్పుకూర్ భూములలో అత్యధిక భాగం కొనుగోలు చేశామనీ మాతో చెప్పారు. గోపీలాల్ గోస్వామి 'గోపేశ్వర్' అనే పెద్ద శివలింగాన్ని ప్రతిష్ఠించాడని గ్రామంలో చెప్పుకొనేవారు. ఈ గోపీలాల్, సుఖలాల్ పూర్వీకుడై ఉండవచ్చు. లేదా సుఖలాల్ మరొక పేరు గోపీలాల్ అయివుండవచ్చు.

సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఒకప్పు డీ గ్రామం నూలు, ధోవతులు, తువ్వాళ్లు యిత్యాది చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి పొందినది. విష్ణుఘష్టి మొదలైన పేరుగాంచిన వస్త్ర వ్యాపారు లీ పల్లెలో నివసిస్తూ కలకత్తాతో వ్యాపారం సాగించే వారు. ఈనాటికీ ప్రతి మంగళ, శనివారాలలో యిక్కడ సంత జరుగుతుంది. చుట్టుపట్ల గ్రామాల నుంచి ప్రజలు నూలు, ధోవతులు, తువ్వాళ్లు, వంట పాత్రలు, కుండలు, బుట్టలు, చాపలు, ఆహారపదార్థాలు యిత్యాది నిత్యోపయోగ వస్తువులను విక్రయించటానికి సంతకు తీసుకువస్తూంటారు. అనేక పండుగలు, ఉత్సవాలు యిప్పటికీ యిక్కడ జరుపుకుంటూనే ఉన్నారు. నేటికీ చైత్ర మాసంలో మానసపూజ, శివపూజ; వైశాఖ, జ్యేష్ఠాలలో మూడు రోజులపాటు జరుపుకొనే హరి భజనలతో కామార్పుకూర్ సందడిగా ఉంటుంది. వీటితో పాటు జమీందారుగారి ఇంట్లో సంవత్సరం పొడవునా అష్టమీ, చతుర్దశి, అమావాస్య, పౌర్ణమికి చెందిన విశేషోత్సవాలు జరుగుతూనే ఉంటాయి. ప్రతిష్ఠింపబడిన ఆలయాలలో నిత్యనైమిత్తిక పూజలు జరిపించబడుతూనే ఉంటవి. ఈ గ్రామంలో నెలకొన్న దారిద్ర్యం కారణంగా యీ ఉత్సవాలలో అనేకం యిప్పుడు ఆగిపోయాయి.

4. ఆ ప్రాంతాలలో 'ధర్మం' యొక్క ఆరాధన

ఒకప్పు డిక్కడ బౌద్ధుల త్రిరత్నాలలో ఒకటైన ధర్మం ఆరాధన ప్రతి ఏటా వైభవోపేతంగా జరుపబడుతూండేది. అందుకు యిప్పుడు కాలం చెల్లిపోయింది. ఆ ధర్మం ప్రస్తుతం విష్ణుమూర్తి అవతారాలలో రెండవదైన కూర్మావతారంగా చూడబడి, యిక్కడి ప్రాంతాలలో నిరాడంబరంగా పూజలందుకొంటూంది. బ్రాహ్మణులు కూడ ఆ దేవతా ప్రతిమను పూజించటం కద్దు. ఈ ధర్మ దేవత వేర్వేరు పేర్లతో, వివిధ గ్రామాలలో పేర్కొనబడటం మనం వినవచ్చు. ఉదాహరణకు కామార్పుకూర్‌లో ధర్మ దేవత రాజాధిరాజుగా పేర్కొనబడుతోంది. శ్రీపూర్‌లో ప్రతిష్ఠితమైన యీ ధర్మమే యాత్రాసిద్ధిరాజ అనీ, ముకుందపూర్‌కు సమీపంలోవున్న మధువతిలో సన్యాసిరాజ అనీ పిలువబడుతూ ఉన్నది. కామార్పుకూర్‌లో యీ ధర్మదేవత 'రథోత్సవం' ఒకప్పుడు ఆడంబరంగా జరుపబడేది. తొమ్మిది స్తంభాలతో చెక్కబడిన ఆ దేవుడి పెద్ద రథం ఆలయ సమీపంలో కానవస్తుంది. కాని అది విరిగిపోయినప్పటి నుండి మళ్లీ బాగు చేయబడలేదు. మరమ్మత్తులకు నోచుకోని ఆ ఆలయం యిప్పుడు శిథిలావస్థలో ఉన్నది. దేవతా విగ్రహాన్ని పూజారి యజ్ఞేశ్వర తన స్వగృహానికి తరలించాడు.

బ్రాహ్మణులు, కాయస్థులు, సాలెవారు, గొల్లవారు, కమ్మరులు, కుమ్మరులు, బెస్తవారు, మాదిగవారు - యిలా వివిధ కులాలకు చెందినవారు కామార్పు

కూర్‌లో నివసిస్తూండేవారు. ఈ గ్రామంలో మూడు నాలుగు చెరువులున్నవి.

5. హల్దార్ చెరువు: 'భూతి' వాగు: మామిడి తోట

వాటిలో హల్దార్పుకూర్ పెద్ద చెరువు. వీటితోపాటు ఎన్నో గుంటలు ఉన్నాయి. కొన్నిటిలో శతదళ పద్మాలు, తెల్ల కలువపువ్వులు పూచి, చూడముచ్చటగొలిపేవి. పూర్వం ఇటుకలతో కట్టబడిన ఇళ్లు, సమాధులు ఎన్నో ఉండినప్పటికీ, యిప్పటికీ అనేకం కానవస్తున్నవి. శిథిలావస్థలోవున్న రామానంద శాంఖారి ఆలయం, ఫకీర్ దత్తుడి రాసమంచె, పెరిగిన తుప్పలతో కప్పబడిన ఇటుకల గుట్టలు, ఆలనా పాలనాలేని ఆలయాలు - యివన్నీ కామార్పుకూర్ గత వైభవాన్ని చాటు తున్నాయి. ఊరికి వాయవ్యంలో 'బుధుయి మొరల్', ఈశాన్యంలో 'భూతిర్ ఖాల్' (ఖాల్ అంటే కాలువ అని అర్థం) అనే రెండు శ్మశానవాటిక లున్నవి. భూతిర్ ఖాల్‌కు పశ్చిమాన పశువులు మేసే పచ్చిక మైదానం, మణిక్‌రాజాచే నాటబడిన ఒక మామిడితోపు, ఆమోదర్ నది ఉన్నాయి. భూతిర్ కాలువ దక్షిణంగా ప్రవహిస్తూ ఊరికి ఒకింత దూరంలో యీ నదిని చేరుతోంది.

కామార్పుకూర్‌కు ఒక మైలు ఉత్తరంలో 'భూర్ సుబో' అనే గ్రామం వుంది. మణిక్‌చంద్ర వందోపాధ్యాయ అనే గొప్ప ధనవంతుడు ఆ గ్రామంలో

6. భూర్‌సుబో వాస్తవ్యుడు మణిక్ రాజా

నివసించేవాడు. చుట్టుపట్ల గ్రామాలన్నిటిలో ఇతడు 'మణిక్ రాజా'గా పిలువబడేవాడు. పైన పేర్కొన్న మామిడితోపే కాక 'సుఖ సాయర్', 'హాథీ సాయర్' (సాయర్ అంటే సముద్రం; హాథీ అంటే ఏనుగు) అనే చెరువులు తవ్వించి కీర్తి గడించా డితడు. అనేక సందర్భాలలో ఇతడి ఇంట్లో ఒక లక్షమంది బ్రాహ్మణులు ఆహ్వానింపబడి, భోజనం చేశారని వినికిడి.

కామార్పుకూర్‌కు ఆగ్నేయంలో మందారణ్ గ్రామం నెలకొనివుంది.

7. మందారణ్ కోట

ఇరుగుపొరుగు గ్రామ ప్రజలను శత్రు దాడుల నుంచి రక్షించటానికి మునుపు ఏనాడో యిక్కడొక పటిష్ఠమైన కోట కట్టబడింది. కోట చుట్టూవున్న అగడ్తలోనికి నీళ్లు రావటానికి సమీపంలోని ఆమోదర్ నదీప్రవాహాన్ని చాకచక్యంగా మళ్లించారు.

శిథిలావస్థలోవున్న మందారణ్ కోట సింహద్వారం, గోపురం, అగడ్త,

8. ఉచాలన్ వద్దనున్న పెద్ద చెరువు - మొగల్ మారి యుద్ధభూమి

కోటకు సమీపంలోని శైలేశ్వర శివాలయం - నేటికీ కానవస్తున్నాయి. పఠానుల పరిపాలనా కాలంలో వీటి ప్రాధాన్యాన్ని అవి చెప్పక చెబుతున్నాయి. బర్ద్వాన్‌కు వెళ్లే కాలిబాట యీ మందారణ్ కోట పక్కనుంచి పోతుంది. ఈ బాటకు యిరువైపులా ఎన్నో పెద్ద చెరువులు కానవస్తాయి; ఈ కోటకు ఉత్తరంగా 18 మైళ్ల దూరంలో

ఉన్న ఉచాలన్ అనే స్థలంలోవున్న చెరువే అన్నిటికంటే పెద్దది. ఈ దారిలో ఒకచోట పాడుబడిన ఒక గజశాలకూడ ఉన్నది. వీటన్నిటిని చూసినప్పుడు యుద్ధ, కల్లోల సమయాలలో సౌకర్యార్థం యీ బాట నిర్మించబడినదని స్పష్ట మౌతుంది. ఈ బాటకు ప్రక్కనున్న 'మొగల్ మారి' యుద్ధభూమి యిందుకు సాక్ష్యంగా నిలబడివుంది.

కామార్పుకూర్‌కు రెండు మైళ్ల పశ్చిమంలో సాత్‌బేరీ, నారాయణ్‌పూర్, దేరే అనబడే మూడు గ్రామాలు ప్రక్కప్రక్కనే ఉన్నాయి. దేరే గ్రామంలోని చెరువు, దాని ప్రక్కనే నెలకొన్న ఆలయం తదితరమైనవి ఆ గ్రామాల గతించిపోయిన సిరిసంపదలను చాటు తున్నాయి. మనం ప్రసంగిస్తున్న కాలం నాటికి యీ మూడు గ్రామాలు మూడు విభిన్న జమీలలో ఉండేవి. దేరే గ్రామ జమీందారు రామానందరాయ్. ఇతడు సాత్‌బేరీ గ్రామంలో నివసిస్తూండేవాడు. ఇతడు అంత ధనవంతుడు కాకపోయినా ప్రజలను పీడించే పరమ దుర్మార్గుడు. కారణంవున్నా లేకపోయినా ఎవరిమీదైనా కోపం వస్తే చాలు, అతణ్ణి సర్వనాశనం చేయటానికి వెనుకాడేవాడు కాదు యీ రామానందరాయ్. అతడి కొడుకులూ, కూతుళ్లూ ఎక్కువ కాలం జీవించలేదు. ప్రజలను పీడించిన పాపం కారణంగా అతడిది నిర్వంశమైనదని చెప్పుకొనేవారు. అతడి మరణానంతరం ఆస్తిపాస్తులు పరాయి వారి చేతుల్లోకి జారిపోయాయి.

9. దేరే గ్రామ జమీందారు - రామానందరాయ్

సుమారు నూటయాభై ఏళ్ల క్రితం, మధ్యతరగతికి చెందిన ధార్మిక బ్రాహ్మణ కుటుంబం ఒకటి యీ దేరే గ్రామంలో నివసిస్తూండేది. వీరు సదాచారపరాయణులు, కులీనులు, శ్రీరామచంద్రుని భక్తులు. వీరు నిర్మించిన శివాలయం, దాని ప్రక్కనేవున్న 'చాటుర్జీ'[1] కోనేరు నేటికీ వారి జ్ఞాపకార్థంగా మిగిలి వున్నాయి. ఆ కుటుంబానికి చెందిన శ్రీమణిక్‌రాం ఛటోపాధ్యాయ్‌కి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. వీరిలో పెద్దవాడైన ఖుదిరాం బహుశ 1775వ సం॥లో జన్మించివుండవచ్చును. అతడి తర్వాత రాంశీలా అనే కుమార్తె, నిధిరాం, కనాయ్‌రాం అనే కుమారులు జన్మించారు.

10. దేరే గ్రామ వాస్తవ్యుడు మణిక్‌రాం ఛట్టోపాధ్యాయ

జీవనోపాధినిచ్చే విద్య నేదైనా ఖుదిరాం నేర్చాడా అన్న సంగతి ఇదమిత్థంగా తెలియరావటం లేదు. సత్యనిష్ఠ, సంతృప్తి, క్షమాగుణం, పరిత్యాగం మొదలైన ఏ ఉదాత్త గుణాలు నిజమైన బ్రాహ్మణుడికి స్వాభావికాలని శాస్త్రాలు అభివర్ణి

---

1. ఛట్టోపాధ్యాయ్ అన్న పేరు కుదింపునకు ఛటర్జీ, చటర్జీగా రూపాంతరం చెందింది.

స్తున్నవో, ఆ గుణగణా లన్నిటిని భగవంతుడు అతడికి ప్రసాదించాడు. క్షుదిరాం స్ఫురద్రూపి. పచ్చని శరీరచ్ఛాయ, ఆకర్షవంతమైన మాపులతో చూడ ముచ్చటగొలిపేవాడు. కులదైవమైన శ్రీరామచంద్రుని మీద అతడికి ప్రగాఢ ప్రపత్తులుండేవి. అనునిత్యం సంధ్యావందనాది నిత్యకర్మానుష్ఠానాలను నిర్వర్తించి, పువ్వులను సేకరించి శ్రీ రఘువీరుని పూజ ముగించిన తరువాతనే అతడు ఏదైనా ఆహారం స్వీకరించేవాడు. శూద్రుల వద్ద నుంచి ఎన్నటికీ దానాలు పట్టేవాడు కాడు. శూద్రుల ఇళ్లలో కర్మకాండలను నిర్వర్తించే బ్రాహ్మణుల ఆహ్వానాలను సైతం అతడు తిరస్కరించేవాడు. కన్యాశుల్కం పుచ్చుకున్న బ్రాహ్మణులు స్పృశించిన మంచినీళ్లను సైతం అతడు తాగేవాడు కాడు. అద్భుతమైన క్షుదిరాముడి సదాచారపరాయణతను చూసి, గ్రామస్థులు ముగ్ధులై అతడిపట్ల విశేష గౌరవాభిమానాలను చూపించేవారు.

11. మాణిక్‌రాం కుమారుడు క్షుదిరామ్

తండ్రి మరణానంతరం కుటుంబ ఆస్తిపాస్తులు, నిర్వహణభారం క్షుదిరామ్ మీద పడింది. ధర్మమార్గం నుంచి తొలగకుండా తన శక్తి మేరకు అతడీ కర్తవ్యాలను నిర్వర్తించసాగాడు. ఒకింత కాలం క్రితమే యితడికి వివాహం అయింది. కాని పిన్నవయస్సులోనే భార్య మరణించింది. ఇరవై ఐదు సంవత్సరాల వయస్సులో అతడు పునర్వివాహం చేసుకొన్నాడు. ఈ రెండవ భార్య పేరు చంద్రమణి. కాని ఆమెను అందరూ 'చంద్రా' అంటూ క్లుప్తంగా పిలిచేవారు. ఆమె పుట్టిల్లు 'సరాట్ మాయాపూర్' అనే గ్రామంలో ఉన్నది. చూపులకు అందంగా కనిపించే చంద్రాదేవి లమాయకురాలు. దేవుడంటేనూ, బ్రాహ్మణులంటేనూ ఆమెకు పరమ భక్తి. ధార్మిక విశ్వాసం, ప్రేమ - ఇవి ఆమెలోని విశిష్ట గుణాలని చెప్పవచ్చు. ఈ కారణంగానే అందరికీ ఆమె ప్రేమపాత్రురాలయింది. బహుశా ఆమె 1791వ సం॥లో జన్మించి ఉండవచ్చు. 1799వ సం॥ వివాహం జరిగినప్పుడు ఆమెకు ఎనిమిదేళ్ళు. ఆమె మొదటి కుమారుడు రాంకుమార్ 1805లో పుట్టి ఉండవచ్చు. ఐదేళ్ల తరువాత కాత్యాయని అనే కుమార్తె, 1826లో రామేశ్వర్ అనే రెండవ కుమారుడు జన్మించారు.

12. క్షుదిరామ్ భార్య చంద్రాదేవి

ధర్మమార్గం నుంచి వైదొలగకుండా సంసారాన్ని నడపటం ఎంత కష్టతరమో తెలుసుకోవటానికి క్షుదిరామ్‌కి ఎంతోకాలం పట్టలేదు. కుమార్తె కాత్యాయని పుట్టిన ఒకింత కాలంలోనే అతడు ఒక అగ్నిపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. గ్రామ జమీందారు రామానందరాయ్ ప్రజాకంటకుడనే సంగతి ముందే చెప్పటం జరిగింది. అతడు దేరే గ్రామస్థు డొకడి మీద ఏదో కారణంగా ఆగ్రహం పూని,

13. జమీందారుతో వివాదం: క్షుదిరామ్ ఆస్తిపాస్తుల్ని కోల్పోవటం

అతడిపై తప్పుడు వ్యాజ్యం తెచ్చాడు. వాజ్యంలో గెలవటానికి కీర్తిప్రతిష్ఠ లున్న సాక్షి అవసరమొచ్చి, తన పక్షంలో తప్పుడు సాక్ష్యం యివ్వమని క్షుదిరామ్‌ను రామానందరాయ్ కోరాడు. ధర్మపరాయణుడైన క్షుదిరామ్‌కు వ్యాజ్యాలన్నా, న్యాయస్థానాలన్నా భయమూ, జంకూను! న్యాయం తన పక్షానవున్నాకూడ అతడు ఏనాడూ ఎవరికీ వ్యతిరేకంగా న్యాయస్థానానికి వెళ్లలేదు. కాబట్టి జమీందారు కోరిక అతడి కొక విషమ సమస్యగా తయారయింది. తప్పుడు సాక్ష్యం చెప్పకపోతే జమీందారు పగ పడతాడని అతడికి బాగా తెలుసు. కూట సాక్ష్యం యివ్వటానికి అతడు ససేమిరా నిరాకరించాడు. అలాంటి సందర్భాలలో అనివార్యంగా జరిగేదే యిక్కడా జరిగిపోయింది. జమీందారు, క్షుదిరామ్ మీద న్యాయస్థానంలో ఒక తప్పుడు వ్యాజ్యాన్ని బనాయించి, గెలిచాడు. తాతతండ్రుల నుంచి సంక్రమించిన క్షుదిరామ్ యావదాస్తినీ వేలంలో జమీందారు కైవసం చేసుకొన్నాడు. ఫలితంగా దేరే గ్రామంలో క్షుదిరామ్‌కు చిల్లిగవ్వ కూడ మిగల లేదు. గ్రామస్థులంతా ఆ మహానుభావుడికి వాటిల్లిన కష్టానికి కన్నీరు కార్చారేగాని, జమీందారు భయంతో ఏ రకంగా తోడ్పడటానికీ వారు సాహసించలేకపోయారు.

14. క్షుదిరామ్ దేరే గ్రామాన్ని విడిచి వెళ్లటం

నలభై ఏళ్ల వయస్సులో క్షుదిరామ్ యిలా ఒక్క క్షణంలో తన సర్వస్వాన్ని కోల్పోయాడు. తాత తండ్రుల నుంచి సంక్రమించిన ఆస్తితో[1] పాటు తను స్వయంగా సంపాదించిన ఆస్తి పెనుగాలి తాకిడికి చెదరిపోయిన మబ్బు తునక మాదిరి హఠాత్తుగా అదృశ్యమైపోయింది.

కామార్పుకూర్‌లోని సుఖలాల్ గోస్వామిని గురించి యింతకు మునుపే చెప్పుకొన్నాం. అతడు, క్షుదిరామ్ సన్నిహితులైన చిరకాల మిత్రులు. ఇద్దరూ

15. క్షుదిరామ్ కామార్పుకూర్‌కు వలస పోవటం

ఒకే స్వభావం గలవారు. తన మిత్రుడికి వాటిల్లిన యీ ఆపద అతణ్ణి ఎంతో కదిలించి వేసింది. తనకు చెందిన కొన్ని చావళ్లను అతడు వెంటనే ఖాళీచేయించి, కామార్పుకూర్‌కు వచ్చి నివసించమని క్షుదిరామ్‌ను ఆహ్వానించాడు. 'తుపానులో తీరం' చేరిన చందమయింది క్షుదిరామ్‌కు. ఈ ఆహ్వానాన్ని దైవలీలగా ఎంచి, అంగీకరించాడు. అతడి హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. కామార్పుకూర్‌కు వలసవచ్చి, ఆనాటి నుంచి అక్కడ నివసించసాగాడు. తన మిత్రుణ్ణి అమితంగా

---

1. క్షుదిరాంకు దేరే గ్రామంలో 150 బీఘాల శ్రేష్ఠమైన పొలం ఉండినదని హృదయరాం ముఖోపాధ్యాయ్ మాతో చెప్పాడు.

ఎకరం = $3\frac{1}{2}$ బీఘాలు (అంటే అతడు దాదాపు 50 ఎకరాలు పోగొట్టుకొన్నాడు.)

ప్రేమిస్తూన్న సుఖలాల్ మిత్రుడి రాకతో ఎంతో ఆనందించాడు. అతడి కుటుంబ నిర్వహణ నిమిత్తం ఒక బీఘా పది ఛట్కాం[1] భూమిని క్షుదిరామ్‌కు శాశ్వతంగా ధారాదత్తం చేశాడు.

1. పదహారు ఛట్కాలు = 1 కథ; 20 కథలు = 1 బీఘా - అనువాదకుడు

3. కామార్పుకూర్‌లో ధార్మిక కుటుంబం

1. కామార్పుకూర్‌లో క్షుదిరామ్ వానప్రస్థ జీవనం

పదేళ్ల రాంకుమార్‌ను, నాలుగేళ్ల కాత్యాయనిని వెంటపెట్టుకొని భార్యతో సహా క్షుదిరామ్ కామార్పుకూర్ వచ్చి, పూరింట నివసించటానికి సిద్ధపడినప్పుడు ఆ దంపతుల హృదయాలలో చెలరేగిన భావాలు వర్ణనాతీతం. అసూయాద్వేషాలతో నిండిపోయిన లోకం ఆనాడు వారికి చిమ్మచీకటితో కూడిన భయానక శ్మశానంగా కనిపించటం సహజమే. ప్రేమ, సానుభూతి, దయ, ధర్మం వంటి సద్గుణాలు కాంతిహీనంగా మెరుస్తూ బహుశా ఆనందం కలుగవచ్చుననే ఆశను రేకెత్తించినా, మరుక్షణంలో అవి అదృశ్యమై, ఎప్పటి అంధకారాన్ని అలాగే మిగిల్చిపోయేవి. తమ వెనుకటి స్థితితో ప్రస్తుత స్థితిని పోల్చుకున్నప్పుడు వారి మనస్సులలో ఇలాంటి భావాలు కలగటం సహజమే. క్లేశమూ, విపత్తూ వాటిల్లినప్పుడే మనిషి యీ లోకం యొక్క అనిత్యత్వాన్ని, నిరర్థకతనూ చక్కగా గ్రహిస్తాడు. కాబట్టి క్షుదిరామ్ హృదయం వైరాగ్యంతో నిండిపోవటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అనుకోకుండానే, అడగకుండానే తనకు నిలువ నీడ లభించటం జ్ఞాపకం వచ్చినప్పుడు అతడి హృదయం భగవంతుడి పట్ల భక్తితో పొంగిపొరలిందని చెప్పనిలేదు. కనుక శ్రీరఘువీరుడికి పరిపూర్ణంగా ఆత్మసమర్పణం చేసుకొని, ప్రాపంచిక సుఖసంపదల పట్ల ఉదాసీనుడై, అతడిప్పుడు భగవత్పూజాసేవాదులలో నిరతుడై కాలాన్ని గడప సాగాడంటే దాన్లో ఆశ్చర్యం లేదు. అప్పటి నుంచి అతడు సంసారంలో ఉంటూన్నప్పటికీ, ప్రాచీనకాలం నాటి వానప్రస్థుడిలా అనాసక్తుడై జీవించసాగాడు.

ఈ కాలంలో జరిగిన ఒక సంఘటన క్షుదిరామ్ భగవద్భక్తిని మరింత ఇనుమడింపచేసింది. అతడొక రోజు కార్యార్థం మరొక గ్రామానికి వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పుడు అలసిపోయి ఒక చెట్టు నీడన విశ్రమించసాగాడు. విస్తృతమైన

ఆ నిర్జన మైదానప్రాంతం, చల్లని పిల్లగాలులు చింతాక్రాంతమైన అతడి మనస్సును శాంతితో నింపి, శారీరక అలసటను తొలగించసాగాయి.

2. అనూహ్య రీతిలో రఘువీరుని సాలగ్రామ ప్రాప్తి

నిద్రించాలనే కోరిక బలీయమై, నడుం వాల్చిన మరుక్షణం లోనే అతడు నిద్రలోకి జారుకున్నాడు. కాసేపట్లోనే అతడొక అద్భుతమైన కలకన్నాడు. కలలో అతడు లేత గరికవంటి పచ్చని మేని ఛాయతో ఒప్పుతున్న బాల శ్రీరామచంద్రుడు తన ఎట్టఎదుట నిలబడి, ఒక ప్రత్యేక స్థానాన్ని చూపిస్తూ, ''చాలాకాలం నుంచి నిరాహారినై, నిర్లక్ష్యితుడనై నే నిక్కడ పడివున్నాను. నన్ను నీ ఇంటికి తీసుకొనివెళ్లు. నీ సేవలను అందుకోవాలనే ప్రగాఢ వాంఛ నాకు కలిగింది'' అని పలుకుతూ కనిపించాడు. ఆ మాటలు వినగానే క్షుదిరాం ఉద్విగ్నుడై పదేపదే ఆ దివ్యబాలమూర్తికి ప్రణామాలు చేస్తూ యిలా అన్నాడు: ''ప్రభూ! నేను భక్తిహీనుణ్ణి. పైగా కటిక దరిద్రుణ్ణి. మా ఇంట్లో నీకు తగిన రీతిలో సేవలు లభించటం అసాధ్యమే కాక, సేవాపరాధుడనై నేను నరకానికి పోవలసి వస్తుంది. ఎందుకు ఇలాంటి దుస్సాధ్యమైన కోరిక కోరుతున్నావు?'' అందుమీదట ఆ బాల రామచంద్రుడు అతడిపట్ల మరింత ప్రసన్నుడై, అతణ్ణి అనునయిస్తూ, ''వెరవకు! నీ సేవలో లోటుపాట్లను పట్టించుకోను. నీతో నన్ను తీసుకొని వెళ్లు'' అన్నాడు. అయాచితంగా తన కిలా లభించిన భగవదనుగ్రహాన్ని సంబాళించుకోలేక, భావపారవశ్యుడై క్షుదిరామ్ అశ్రుపూరితుడైనాడు. అంతటితో కల చెదరిపోయి, అతడు మేల్కొన్నాడు.

నిద్రనుంచి మేల్కొని క్షుదిరాం తనలో యిలా భావించుకోసాగాడు: ''ఎంత అద్భుతమైన కల. ఏనాటికైనా నే నంత భాగ్యవంతుణ్ణి అవగలనా?'' ఇలా భావిస్తున్న అతడి దృష్టి అకస్మాత్తుగా సమీపంలోని వరి చేను మీద పడింది.

శ్రీరఘువీరుని సాలగ్రామం



కులదేవతలు

కలలో తను చూసిన స్థలం అదే అని తక్షణం గుర్తించాడు. కుతూహలంతో అత డా స్థలాన్ని సమీపించగానే అక్కడొక అందమైన సాలగ్రామ శిల, శిలను పరి రక్షిస్తూ ఒక త్రాచుపాము పడగవిప్పి ఉండటమూ కంటపడ్డాయి. సాలగ్రామాన్ని స్వాధీనం చేసుకోవాలనే ఉత్కంఠతో అటుకేసి అడుగులు కంటపడ్డాయి. అతడు దగ్గరకెళ్లి చూడగా, పాము అదృశ్యమైంది. సాలగ్రామశిల పాము కలుగువద్ద పడి ఉన్నది. కల నిజం కావటంతో అతడి హృదయం మహదానందంతో నిండి పోయింది. తనకు భగవదాజ్ఞ అయినదనే నమ్మకంతో పాము భయం తొలగి పోయి, 'జై రఘువీర్' అంటూ జయజయధ్వానాలు చేస్తూ శిలను తన చేతుల్లోకి తీసుకొన్నాడు. తనకు తెలిసిన శాస్త్రజ్ఞానంతో ఆ సాలగ్రామశిల మీది గుర్తులను జాగ్రత్తగా పరీక్షించి అది నిజానికి శ్రీరఘువీరుని సాలగ్రామశిల అని తెల్సు కొన్నాడు. ఆనందాశ్చర్యాలతో ఖుదిరామ్ ఇంటికి తిరిగివచ్చాడు. తరువాత శాస్త్రానుసారం ఆ సాలగ్రామానికి సంస్కారాలను నిర్వర్తించి, దాన్ని విధిపూర్వ కంగా తన కులదేవతగా ప్రతిష్ఠించి, నిత్యం పూజించసాగాడు. శ్రీ రఘువీరుణ్ణి యిలా అనూహ్యరీతిలో పొందటానికి మునుపుకూడ ఖుదిరామ్ శ్రీరామ చంద్రుని తన ఇష్టదేవతగా పూజిస్తూండేవాడు. అలాగే ఒక కుండలో శీతలా దేవినీ ప్రతిష్ఠించి నిత్యపూజలు చేస్తూండేవాడు.

3. ఖుదిరామ్ భగవత్ పరాధీనత

అతడి కష్టాలు కొనసాగుతూన్నాయి. కాని ఖుదిరాం మాత్రం దౌర్భాగ్యాల నన్నిటిని నిర్లిప్తంగా భరిస్తూ, ఒక్క ధర్మమార్గాన్నే దృఢంగా అవలంబించి, సంతుష్టహృదయంతో కాలం వెళ్లబుచ్చసాగాడు. ఆ కుటుంబం తినడానికి కూడ కొన్ని రోజులు ఏమీ ఉండేది కాదు. అలాంటి సమయంలో పతినే ప్రత్యక్షదైవంగా భావించే చంద్రాదేవి ఆందోళనపడి ఆ సంగతి భర్తకు తెలిపేది. ఖుదిరామ్ అలాంటి సందిగ్ధ స్థితి లోనూ వ్యాకులపడక, "ఫరవాలేదు, రఘువీరుడు ఉపవాసం చేయటానికి ఇష్ట పడినప్పుడు మనమూ అట్లే గడుపుదాంలే" అంటూ ఆమెను అనునయించే వాడు. అంతటితో సరళ హృదయురాలైన చంద్రాదేవికూడ భర్త మాదిరే భారం యావత్తూ శ్రీరఘువీరుని మీద వేసి, నిర్వికారచిత్తంతో గృహకృత్యాలలో నిమగ్న రాలయ్యేది. మరి ఆ రోజుకు సరిపడే ఆహారం ఎలాగో సమకూరేది.

4. లక్ష్మీజల లోని వరి చేను

కాని ఆహారం గురించిన యీ అనిశ్చిత పరిస్థితి మూలంగా దీర్ఘకాలం ఖుదిరామ్ బాధపడలేదు. మిత్రుడు సుఖలాల్ గోస్వామి లక్ష్మీజల అనే ప్రదేశంలో కానుకగా ఇచ్చిన ఒక బీఘా పది ఛట్కాల పొలం శ్రీ రఘువీరుడి కృపతో సమృద్ధిగా పండసాగింది. దానితో ఏడాది పొడవునా ఆ చిన్ని కుటుంబం అక్కరలు తీరటమేగాక, అతిథి అభ్యాగతులకు

సరిపడేటంత మిగిలేది. పొలం దున్నటానికి క్షుదిరాం, కూలీలను పెట్టుకొనే వాడు. వరి మొలకలెత్తినప్పుడు క్షుదిరామ్ రఘువీరుణ్ణి స్మరిస్తూ స్వయంగా తన చేతులతో కొన్ని మొలకలను నాటి, తరువాత మిగిలిన నాటు పనిని కూలీల ద్వారా పూర్తిచేయించేవాడు.

5. క్షుదిరామ్ భగవద్భక్తి పురోగతి

ఈ రీతిలో రెండు మూడు ఏళ్లు గడచిపోయాయి. క్షుదిరాం పూర్తిగా రఘువీరుడి మీద ఆధారపడి, అయాచితంగా లభించిన దానితో సంసారాన్ని గడపసాగాడు. ఐనా అన్నవస్త్రాదులకు లోటు లేదు. ఈ రెండు మూడేళ్ల కాలంలో అతడు అనుభవించిన బాధలు, కష్టాలు అతడికి మేలునే చేకూర్చాయి. ఫలితంగా అతడి హృదయం అనవరతం శాంతి సంతోషాలతో, సంతృప్తితో భగవంతుడి మీద నిర్భరత్వంతో పొంగి ప్రవహించసాగింది. ఏ కొద్దిమందికో ఇలాంటి సౌభాగ్యం అబ్బుతుంది. ఇప్పు డతడి మనస్సు సర్వదా అంతర్ముఖావస్థలో నెలకొనివుంటోంది. తత్ఫలితంగా అప్పుడప్పుడు అతడికి కొన్ని అద్భుతమైన దివ్యదర్శనాలు కలుగసాగాయి. నిత్యం ఉదయం, సాయంత్రం సంధ్యావందనం చేయటానికి కూర్చుని, గాయత్రీదేవి ధ్యానమంత్రాన్ని ఉచ్చరిస్తూ క్షుదిరాం భావమగ్నుడయ్యేవాడు. అప్పు డతడి వక్షస్థలం ఎర్రబారి, నిమీలితనేత్రాల నుంచి ప్రేమానందాశ్రువులు కాలువలు కట్టేవి. తెల్లవారుజామునే, బుట్టను పుచ్చుకొని పువ్వులను సేకరించటానికి వెళ్లినప్పుడు - తన ఆరాధ్యదేవత ఐన శీతలాదేవి ఎనిమిదేళ్ల బాలికారూపంలో ఎర్రని వలువలు ధరించి, వివిధాభరణభూషితయై, చిరునవ్వు లొలకబోస్తూ, తనతో పాటు తిరుగుతూ, పువ్వులచెట్ల కొమ్మలను కిందికి వంచుతూ, పువ్వులు కోయటంలో అతడికి తోడ్పడేది! ఇలాంటి దివ్యదర్శనాలు అతడి హృదయాన్ని సతతం మహదానందంతో నింపివేసేవి. అతడి భక్తి, ఆంతరిక విశ్వాసం అతడి ముఖమండలంలో ద్యోతకమవుతూంటే, సర్వదా అతడొక దివ్యభావావేశంలో మగ్నుడైవుండటం జరిగేది. అతడి సౌమ్య, ప్రశాంత వదనాన్ని గాంచి, తమ హృదయాంతరాళాలలో ఆయన్నొక మహర్షిగా గుర్తించిన గ్రామస్థులు ఆయనపట్ల అపార గౌరవ భక్తిప్రపత్తులు చూపసాగారు. ఆయన రాకను పసిగట్టగానే వ్యర్థ ప్రసంగాలను కట్టిపెట్టి, గౌరవపురస్సరంగా లేచి నిలబడి అభివాదం చేసేవారు. ఆయన స్నానం ఆచరిస్తున్నప్పుడు చెరువులోకి దిగటానికి సంకోచించి, ఆయన స్నానం అయ్యేదాకా గౌరవభావంతో వేచివుండేవారు. ఆయనపట్ల పూర్తి విశ్వాసం వహించి, తమ సుఖదుఃఖ సమయాల్లో ఆశీస్సులకై ఆయన వద్దకు రావటం వారికి పరిపాటి అయింది.

చంద్రాదేవి ప్రేమ, నిష్కాపట్యాల అపరావతారం. తన కరుణ, అభిమానాలతో ఎల్లరిని తనవారిగా చేసుకొని వారందరి మాతృభక్తిని పొందగలిగింది.

6. ఇరుగుపొరుగులు చంద్రాదేవిని గౌరవించే తీరుతెన్నులు

కారణం ఏమంటే తమ విపత్కర సమయాలలో ఆమె చూపించే హృదయపూర్వక సానుభూతి మరెక్కడా వారికి లభించకపోవటమే! ఇక పేదల విషయంలో - చంద్రాదేవి వద్దకు తాము ఎప్పుడు పోయినాసరే తినటానికి ఒక పిడికెడు మెతుకులే గాక, మనఃస్ఫూర్తి ప్రేమాదరాలు లభించి వారి హృదయాలు చెప్పనలివిగాని ఆనందంతో నిండిపోయేవి. ఆ యింటి ద్వారాలు తమకోసం ఎప్పుడూ తెరుచుకొనే ఉంటాయని భిక్షానికి వచ్చే సాధువులందరికీ ఎరుకే. ఇక ఇరుగు పొరుగు బాలబాలికలు - తమకు ఏం కావలసి వచ్చినా ఎలాగైనా ఆమె నుంచి పొగడ్తలతో సంపాదించవచ్చునని బాగా గ్రహించారు. ఈ విధంగా ఇరుగుపొరుగువారు, ఆబాలగోపాలం ఖుదిరామ్ పూరింటికి వేళాపాళా లేకుండా వస్తూ పోతూండేవారు. దుఃఖదారిద్ర్యాలు తాండవిస్తున్నా అతడి గృహం సర్వదా అపూర్వ శాంత్యానందాలతో వెలుగొందేది.

ఖుదిరామ్‌కు రామశీల అనే ఒక చెల్లెలు, నిధిరాం, కానాయిరాం లేదా రాంకానాయి అనే యిద్దరు తమ్ముళ్లు ఉన్నారని చెప్పుకొన్నాం. దేరేపూర్

7. ఖుదిరామ్ చెల్లెలు రామశీల ఉదంతం

జమీందారుతో ఏర్పడ్డ వివాదంలో ఖుదిరామ్ తన యావదాస్తినీ కోల్పోయిన నాటికి రామశీలకు ముప్ఫై ఐదేళ్లు, తమ్ముళ్లకు ముప్ఫై, ఇరవై ఐదేళ్ల వయస్సు ఉండవచ్చు. అప్పటికే వారందరికీ వివాహాలై సంసారం చేసుకొంటున్నారు. కామార్పుకూర్‌కు పశ్చిమంగా పన్నెండు మైళ్ల దూరంలోని సిలింపూర్ అనే గ్రామవాస్తవ్యుడు భగవత్ వందోపాధ్యాయ్‌తో రామశీలకు వివాహం జరిగింది. ఆమెకు రాంచంద్ అనే కుమారుడు, హేమాంగిని అనే కుమార్తె కలిగారు. ఖుదిరాముని యీ దురదృష్ట కాలఘట్ట సమయంలో రాంచంద్ర ఇరవైఒక్క ఏళ్లవాడు, హేమాంగిని పదహారేళ్లది. రాంచంద్ ఆ సమయంలో మేదినీపూర్‌లో ప్లీడర్ వృత్తిలో ఉండేవాడు. దేర్‌పూర్‌లో మేనమామల ఇంట్లోనే పుట్టి పెరిగిన హేమాంగిని, అన్నకంటే వారికి మరింత ప్రీతిపాత్రంగా ఉండేది. ఖుదిరామ్ ఆమెను తన స్వంతకుమార్తెగా పెంచి పెద్దచేశాడు. యుక్తవయస్కురాలవగానే కామార్పుకూర్‌కు వాయవ్యంగా ఐదుమైళ్ల దూరంలోవున్న సిహోర్ గ్రామవాస్తవ్యుడు కృష్ణచంద్ర ముఖోపాధ్యాయకిచ్చి స్వయంగా ఆమె వివాహం జరిపించాడు. కాలక్రమంలో ఆమెకు రాఘవ్, రాంరతన్, హృదయరాం, రాజారాం అనే నలుగురు కుమారులు కలిగారు.

నిధిరాంకు పిల్లలు కలిగారో లేదో అనే సంగతి మేం కనుగొనలేకపోయాం. కాని అందరిలోకీ చిన్నవాడైన కానాయిరాంకు రాంతారక్ (హలధారిగా పేరు గాంచాడు), కాళిదాస్ అనే యిద్దరు కుమారులు జన్మించారు. కానాయిరాం భక్తితత్పరుడు, ధ్యానశీలుడు. ఒకప్పుడితడు 'శ్రీరామచంద్రుడి వనవాసం' అనే నాటకాన్ని చూడటానికి వెళ్లాడు. నాటకాన్ని చూస్తూ అతడు తన్మయుడైపోయి శ్రీరాముణ్ణి వనవాసానికి పంపాలనే కైకేయి పన్నాగం యథార్థంగా తన కళ్లముందే జరుగుతున్నదనుకొని, ఆ పాత్రధారిని కొట్టబోయాడట. పైతృక ఆస్తినంతా కోల్పోయిన తదనంతరం నిధిరాం, కానాయిరాంలు దేరేపూర్ గ్రామాన్ని వీడి, బహుశా తమ తమ మామగారి ఊళ్లలోనే స్థిరపడిపోయినట్లుగా తోస్తోంది.

8. క్షుదిరామ్ యొక్క తమ్ముళ్ల ఉదంతం

రామశీల కుమారుడైన రాంచంద్ర వందోపాధ్యాయ్ మేదినీపూర్‌లో ప్లీడర్ వృత్తిలో ఉంటున్నట్లు యింత క్రితమే చెప్పుకొన్నాం. ఆ వృత్తిలో అతడు పుష్కలంగానే గడించేవాడు. మేనమామల దుఃస్థితిని బాగా ఎరిగిన రాంచంద్ ఇప్పుడు క్షుదిరాంకు నెలకు పదిహేను రూపాయలు, నిధిరాం, కానాయిరాంలకు పదిరూపాయల చొప్పునా పంపిస్తూ వారికి తోడ్పడసాగాడు. మేనల్లుడి క్షేమసమాచారం అందటంలో ఆలస్యం జరిగితే క్షుదిరాం వ్యాకులపడి, అతణ్ణి చూడటానికి స్వయంగా మేదినీపూర్ వెళ్లటం జరిగేది. ఒకసారి యిలా క్షుదిరాం మేదినీపూర్ పోతున్నప్పుడు సంభవించిన ఒక విచిత్ర సంఘటన గురించి మేం వినివున్నాం. క్షుదిరాం ప్రగాఢ దైవభక్తికి ఆ ఉదంతం ఒక నిదర్శనం కావటం వల్ల దాన్ని ఇక్కడ వర్ణిస్తున్నాం.

9. క్షుదిరామ్ మేనల్లుడు రాంచంద్ర

మేదినీపూర్ కామార్పుకూర్‌కు పశ్చిమాన సుమారు నలభై మైళ్ల దూరంలో నెలకొని ఉంది. చాలాకాలం నుంచి రాంచంద్ర, అతడి కుటుంబీకుల క్షేమ సమాచారాలు తెలియరాకపోవటంతో క్షుదిరాం ఒకరోజు మేదినీపూర్‌కు బయలుదేరాడు. బహుశా అది మాఘం లేక ఫాల్గుణ మాసం అయివుంటుంది. ఆ కాలంలో మారేడు చెట్లు ఆకులన్నీ రాల్చి మోడుబారి ఉంటాయి. మళ్లీ క్రొత్త ఆకులు చిగురించేదాకా శివుణ్ణి పూజించటం[1] దుర్లభమౌతుంది. కొంతకాలం నుంచీ క్షుదిరామ్ యీ యిబ్బందికి గురి అవుతూనే ఉన్నాడు.

10. క్షుదిరామ్ ప్రగాఢ భక్తిని చాటే సంఘటన

---

1. శివపూజకు మారేడు దళాలు శ్రేష్ఠం.

క్షుదిరామ్ చాలా ప్రొద్దుటే బయలుదేరాడు. అతడలా నడుచుకొంటూ దాదాపు పది గంటల ప్రాంతాన ఒక గ్రామం చేరుకొన్నాడు. అక్కడున్న మారేడు చెట్లు క్రొత్త చిగుళ్లతో నిండివుండటం చూడగానే అతడి హృదయం సంతోషంతో ఉప్పొంగింది. ఇక మేదినీపూర్ ప్రయాణం సంగతే మర్చిపోయాడు. ఒక కొత్తబుట్టను, వస్త్రాన్ని కొని సమీపంలోని ఒక నీటిగుంటలో వాటిని చక్కగా శుభ్రంచేశాడు. తరువాత ఆ బుట్టను క్రొత్త మారేడు ఆకులతో నింపి, బుట్టను తడిగుడ్డతో కప్పి వెనక్కు తిరిగి, దాదాపు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతాన ఇల్లు చేరాడు. వెంటనే స్నానం చేసి, పూజాగృహంలో ప్రవేశించి మహదానందంతో చాలాసేపటి వరకు శివుణ్ణి, శీతలాదేవిని పూజించాడు. పూజ పూర్తి కాగానే భోజనానికి కూర్చున్నాడు. మేదినీపూర్‌కు భర్త ఎందుకు వెళ్లలేదో అడగటానికి యిదే అనువైన సమయం అనుకొంది చంద్రాదేవి. జరిగిన వృత్తాంతం అతడి నుంచి విన్న చంద్రాదేవి ఆశ్చర్యానికి అంతే లేకపోయింది. అతడు అంతదూరం కాలినడకన వెళ్లి తిరిగిరావటం కేవలం క్రొత్తమారేడు ఆకులతో శివుణ్ణే పూజించటంకోసం మాత్రమే! మరునాడు తెల్లవారుజామునే లేచి క్షుదిరాం మేదినీపూర్‌కు మళ్లీ బయలుదేరాడు.

క్షుదిరామ్ యిలా ఆరేళ్లు కామార్పుకూర్‌లో గడిపాడు. అతడి కుమారుడు రాంకుమార్‌కు అప్పుడు పదహారేళ్లు, కూతురు కాత్యాయనికి పదకొండేళ్లు.

11. రాంకుమార్, కాత్యాయనుల వివాహాలు

యుక్తవయస్కురాలైన కుమార్తె నతడు కామార్పుకూర్‌కు వాయవ్యంలో రెండు మైళ్ల దూరంలోని అనూర్ గ్రామానికి చెందిన కేనారాం వందోపాధ్యాయ్ కిచ్చి వివాహం చేశాడు. కేనారాం చెల్లెల్ని రాంకుమార్ వివాహమాడాడు. రాంకుమార్ అప్పటికే చతుష్పాఠిలో (సంస్కృత పాఠశాల) చేరి వ్యాకరణం, కావ్యం ముగించి స్మృతి[1] అధ్యయనం చేయటం ప్రారంభించాడు.

కాలక్రమంలో మరి మూడు నాలుగేళ్లు దొర్లిపోయాయి. శ్రీ రఘువీరుడి అనుగ్రహంతో క్షుదిరామ్ కుటుంబ పరిస్థితులు వెనుకటి కంటే మెరుగుపడ్డాయి.

12. సుఖలాల్ గోస్వామి మరణం, తదితర సంఘటనలు

అత డిప్పుడు నిశ్చింతగా అధిక సమయం భగవత్సేవలో గడపసాగాడు. ఇదే సమయంలో రాంకుమార్ కూడ తన స్మృతి అధ్యయనం ముగించి, కుటుంబ ఆర్థిక స్థితిగతుల పెంపుదలకు తన శక్తిమేరకు తోడ్పడసాగాడు. ఈ కాలఘట్టంలో ఏదో

---

1. హిందూ సమాజానికి, మతానికి సంబంధించిన ఆచార వ్యవహారాలను వివరించే మనుధర్మశాస్త్రాదులు.

సమయంలో క్షుదిరామ్ అనుంగు మిత్రుడు సుఖలాల్ గోస్వామి మరణించటం జరిగింది. మిత్రుడి మరణం క్షుదిరాంను దుఃఖసాగరంలో ముంచింది.

రాంకుమార్ అప్పటికి పెద్దవాడై కుటుంబ పోషణ బాధ్యతలను చేపట్టటంతో క్షుదిరాం యిక నిశ్చింతుడై తన మనస్సును యితర విషయాల వైపు

13. క్షుదిరామ్ రామేశ్వర తీర్థయాత్ర; రామేశ్వర్ జననం

మరల్చాడు. అతడి మనస్సులో తీర్థయాత్రలు చేయాలనే గట్టి ఆకాంక్ష కలిగింది. త్వరలోనే అతడు, బహుశా 1824వ సం॥లో సేతుబంధ రామేశ్వరానికి కాలినడకన బయలుదేరాడు. ఒక ఏడాది కాలంపాటు దక్షిణ భారతదేశంలోని పుణ్యక్షేత్రాలను సందర్శించి ఇంటికి మరలి వచ్చాడు. రామేశ్వరం నుంచి ఒక బాణలింగాన్ని (శివలింగం) తీసుకొనివచ్చి దానిని నిత్యం అర్చించసాగాడు. రఘువీరుని సాలగ్రామ శిల, శీతలాదేవి ఘటానికి ప్రక్కన ఉంచబడిన 'రామేశ్వర్' అని పిలువబడే యీ శివలింగాన్ని నేటికీ కామార్పుకూర్‌లో చూడవచ్చు. చాలాకాలం తరువాత చంద్రాదేవి మళ్లీ గర్భం ధరించి, 1826వ సం॥లో ఒక కుమారుణ్ణి ప్రసవించింది. రామేశ్వర తీర్థయాత్ర ముగించుకొని వచ్చాక పుట్టటం వల్ల క్షుదిరాం యీ పిల్లవాడికి 'రామేశ్వర్' అని నామకరణం చేశాడు.

ఈ సంఘటన తరువాతి ఎనిమిదేళ్ల కామార్పుకూర్‌లోని యీ పేద కుటుంబ జీవన ప్రవాహం ఏ ఒడుదొడుకులూ లేకుండా సాఫీగానే సాగి

14. రాంకుమార్ అలౌకిక శక్తి

పోయింది. రాంకుమార్ స్మృతి శాస్త్రాలలో చెప్పబడిన శాంతి, స్వస్త్యయనాది కర్మలను చేస్తూ కొంత ఆర్జనాపరుడయ్యాడు. ఫలితంగా కుటుంబానికి గతంలో మాదిరి ప్రతిదానికీ తడుముకొనే అగత్యం లేకుండాపోయింది. రాంకుమార్ శాంతి, స్వస్త్యయనాది కర్మలలో నిష్ణాతుడైనాడు. ఇంతకు మునుపు శాస్త్రాధ్యయనం ద్వారా ఆద్యాశక్తి (జగన్మాత) ఉపాసనలో అతడికి ఎంతో శ్రద్ధ జనించింది. అందు నిమిత్తం అతడు ఉపయుక్తుడైన గురువు నుంచి దేవీమంత్రోపదేశాన్ని పొందాడు. అంతేగాక అమిత శ్రద్ధాభక్తులతో నిత్యం తన ఇష్టదేవిని అర్చించసాగాడు. ఇలా పూజిస్తూండేటప్పుడు ఒకరోజు అతడికి అపూర్వమైన దేవీదర్శనం కలిగింది. జ్యోతిష శాస్త్రంలో సిద్ధిని పొందే నిమిత్తం దేవి తన చేతి వ్రేలితో తన నాలుక మీద మంత్రాక్షరాలను వ్రాసినట్లు అతడికి అనుభూతి కలిగింది. అప్పటినుంచి రోగిని చూడగానే అతడికి నయం అవుతుందో లేదో తెలుసుకొనే శక్తి రాంకుమార్‌కు లభించింది. తద్వారా అతడు రోగిని గురించి చెప్పేదంతా ఫలించసాగింది. ఈ విధంగా భవిష్యత్తు చెప్పగలడనే కొంత ఖ్యాతిని ఆ చుట్టుపట్ల ప్రాంతాలలో అతడు గడించాడు. ఈ కాలఘట్టంలో రాంకుమార్ తీవ్రవ్యాధిగ్రస్తులైన

రోగులను నయం చేయటం కోసం శాంతి, స్వస్త్యయనం చేసేవాడు. పైగా యిలా ఉద్ఘాటించేవాడు: ''ఈ స్వస్త్యయన వేదికమీద నేను చల్లుతూన్న యీ ధాన్యం మొలకలెత్తటంతోనే యీ వ్యక్తి ఆరోగ్యవంతుడవుతాడు.'' నిజానికి అతడు పలికినట్టే జరిగేది. అతడికి ఇలాంటి శక్తి ఉన్నదనటానికి ఉదాహరణగా అతడి తమ్ముడి కుమారుడు శివరాం చట్టోపాధ్యాయ్ మాతో చెప్పిన ఉదంతం ఇది:

రాంకుమార్ ఒకానొక సమయంలో పనిబడి కలకత్తాకు వెళ్లి ఒకరోజు గంగాస్నానం చేస్తున్నాడు. అప్పుడే స్నానార్థం ఎవరో ఒక సంపన్నుడు సకుటుం

15. రాంకుమార్ అలౌకికశక్తిని చాటే ఒక సంఘటన

బంగా అక్కడికే రావటం తటస్థించింది. పల్లకీలో కూర్చునివున్న అతడి భార్య అందులో కూర్చునే స్నానం చేసే ఉద్దేశంతో పల్లకీని తిన్నగా నదిలోనికి తీసుకువెళ్లారు. గ్రామం నుంచి వచ్చిన రాంకుమార్‌కు యిలా ఒక స్త్రీ జనం కంటపడకుండా యీ తీరులో స్నానం చేయటం విచిత్రంగా తోచింది. ఆ పల్లకీ వంక ఆశ్చర్య పోతూ చూస్తున్న రాంకుమార్‌కు ఆ స్త్రీ ముఖం ఓ క్షణకాలం కనబడింది. తక్షణమే తనకున్న అలౌకిక శక్తి ద్వారా ఆమె మరునాడే మరణిస్తుందని తెలుసు కోగలిగిన రాంకుమార్ నోట, 'అయ్యో! యింత గౌరవమర్యాదలతో స్నానం చేయించబడుతున్న యీ దేహం రేపు శవమై అందరి సమక్షంలో నదిలో వేయబడుతుందే' అనే మాటలు యాంత్రికంగా వెలువడ్డాయి. ఆ సంపన్నుడు యీ మాటలు విని, అతడి మాటల్లోని యథార్థాన్ని పరీక్షించే నిమిత్తం రాంకుమార్‌ను తన ఇంటికి రావలసిందని కాస్త బలవంతపెట్టాడు. రాంకుమార్ జోస్యం నిజం కాకపోతే అతడికి గట్టిగా బుద్ధిచెప్పి పంపటమే ఆ సంపన్నుడి అసలు ఉద్దేశం. ఆ యువతి కూడ పూర్ణ ఆరోగ్యంతో ఉండటం వల్ల దుర్ఘటన జరిగే లక్షణాలేవీ సూచనప్రాయంగా కూడ కనిపించటం లేదు. కాని చివరికి రాంకుమార్ చెప్పినట్లే జరిగింది. గత్యంతరంలేక ఆ సంపన్నుడు రాంకుమార్‌కు మర్యాదతో వీడ్కోలిచ్చాడు.

ఒకప్పుడు రాంకుమార్ తన భార్య భవిష్యత్తు చూసి, విచారకరంగా జోస్యం చెప్పాడు. తదనంతరం ఆ జోస్యం నిజమైంది. అతడి భార్య శుభలక్షణ

16. రాంకుమార్ భార్యను గురించిన ఒక సంఘటన

సంపన్నురాలని విన్నాం. రాంకుమార్ వివాహం బహుశా 1820 వ సం॥లో జరిగివుంటుంది. అతడి ఏడేళ్ల బాలికాపత్ని ఏ ముహూర్తంలో ఆ ఇంట్లో అడుగిడిందో ఆనాటి నుంచీ అతడి భాగ్యచక్రం పైకి తిరుగసాగింది. కారణం: మేదినీపూర్‌లో వుంటున్న ఖుదిరాం మేనల్లుడు రాంచంద్ర వందోపాధ్యాయ్ ఆ సమయం నుంచే ప్రతి నెలా ఆ కుటుంబానికి సహాయం చేయసాగాడు. ఏ స్త్రీగాని, పురుషుడుగాని

అడుగిడిన నాటి నుంచి ఏ కుటుంబంలో ఆ విధంగా అదృష్టం కలుగుతుందో అలాంటి వ్యక్తిని ఆ హిందూకుటుంబాలలో అపార ప్రేమ గౌరవాలతో చూస్తారనే విషయం అందరూ ఎరిగినదే. పైగా రాంకుమార్ బాలికాపత్ని అప్పటికి ఆ కుటుంబంలోని ఒక్కగానొక్క కోడలు కనుక ఆమె ఇంటిల్లిపాది ప్రేమ ఆదరాలకు పాత్రురాలు కావటంలో ఆశ్చర్యం లేదు. ఎన్నో సుగుణాలు ఆమెలో ఉన్నప్పటికీ తనపట్ల చూపుతున్న యీ అతి ఆదరాభిమానాల ఫలితంగా ఆమెలో గర్వం, మంకుతనం పుట్టాయని మేం విన్నాం. ఈ లోపాలు ఆమెలో గమనించినా వాటి గురించి ఆమెతో ప్రస్తావించటం గాని, వాటిని సరిదిద్దటానికి ప్రయత్నం గాని చేయటానికి ఎవ్వరూ సాహసించలేదట. ఎందుకంటే యీ స్వల్ప లోపాలు ఆమెలో కనిపిస్తున్నా, ఆమె వచ్చిన నాటినుంచే గదా తమ కుటుంబంలో యీ అభివృద్ధి కలగటం - అని అందరూ సరిపెట్టుకున్నారు.

కాని ఆమె పెరిగి యౌవనంలో అడుగుపెట్టాక రాంకుమార్ ఒకరోజు ఆమెను చూసి, ''శుభలక్షణవతి అయినప్పటికీ మొదటి కాన్పుతోనే ఆమె మరణిస్తుంది'' అంటూ భవిష్యద్వాణి పలికాడు. ఆ తరువాత అనేక సంవత్సరాలు గడిచినా ఆమె గర్భం ధరించకపోవటంతో బహుశా ఆమె వంధ్యురాలు అనుకొని, రాంకుమార్ నిశ్చింత మనస్కుడయ్యాడు. కాని తన ముప్పై ఐదవ ఏట, బహుశా 1848వ సం॥లో ఆమె గర్భం ధరించి, మరుసటి సంవత్సరం 1849లో ఒక పండంటి పుత్రుణ్ణి కని మరణించింది. ఆ పిల్లవాడికి అక్షయ్ అని నామకరణం చేశారు. ఈ సంఘటన కాలక్రమానుసారంలో సుదీర్ఘకాలం తర్వాత జరిగినప్పటికీ పాఠకుల అనుకూలత కోసం ఇక్కడ చెప్పటం జరిగింది.

క్షుదిరాముడి సదాచార కుటుంబంలోని ప్రతి ఒక్కరిలోనూ ఒక అసాధారణ విలక్షణత కనిపిస్తుంది. సూక్ష్మమైన ఆధ్యాత్మిక శక్తే అది. బహుశా యీ శక్తి క్షుదిరామ్, చంద్రాదేవులలో అధికంగా అభివ్యక్తం కావటంవల్ల కాబోలు వారసత్వంగా వారి పిల్లలందరిలోను చోటుచేసుకొన్నది. క్షుదిరాముడి ఆధ్యాత్మిక శక్తికి తార్కాణాలుగా కొన్ని సంఘటనల గురించి ప్రస్తావించటం జరిగింది. ఇప్పుడు చంద్రాదేవిని గురించి అలాంటి ఒకానొక సంఘటన తెలుపుతున్నాం. భర్తలా చంద్రాదేవిలోనూ అప్పుడప్పుడు దివ్యదర్శనాలను అవలోకించే శక్తి ఉన్నదని యిందు మూలంగా స్పష్టమవుతుంది. ఈ సంఘటన రాంకుమార్ వివాహానికి కాస్త ముందు జరిగింది. పదిహేనేళ్ల రాంకుమార్ అప్పుడు సంస్కృత పాఠశాలలో చదువుకొంటూ, అదే సమయంలో కొందరి ఇళ్లలో పూజాది కర్మలను చేస్తూ, కుటుంబ పోషణలో చేదోడువాదోడుగా ఉండేవాడు.

17. క్షుదిరామ్ కుటుంబంలోని విలక్షణ అంశం

ఒకసారి ఆశ్వయుజ మాసంలో 'కొజాగౌరి లక్ష్మి' పూజ చేయటానికి భూర్సుబో గ్రామానికి రాంకుమార్ వెళ్లాడు. అర్ధరాత్రి అయినా కూడ అతడు

18. చంద్రాదేవి దివ్య దర్శనం

తిరిగి రాకపోవటంతో చంద్రాదేవి ఎంతో ఆందోళన చెంది ఇంటి బయటకు వచ్చి అతడి కోసం ఆతురతతో నిరీక్షించ సాగింది. అతడు రావలసిన దిశ కేసే చూస్తూన్న చంద్రాదేవి కాసేపయ్యాక భూర్సుబో నుంచి కామార్పుకూర్ దారినే పొలం పక్కనుంచి ఎవరో ఒక వ్యక్తి తన వైపు రావటం గమనించింది. ఆ వ్యక్తిని రాంకుమార్ గానే భావించి అతణ్ణి కలుసుకోవటం కోసం ఆనందంతో కాస్తదూరం ముందుకు వెళ్లింది. కాని ఆ వ్యక్తి దగ్గరికి రాగానే రాంకుమార్ కాదని గ్రహించింది. పరమ సౌందర్యవతి ఐన ఒక యువతి నానారకాల ఆభరణాలను ధరించి, ఒంటరిగా తనవైపు రావటం చూసింది. గౌరవనీయురాలైన ఒక అందమైన యువతి, అర్ధరాత్రి వేళ యిలా ఒంటరిగా నడిచి రావటం - తన కుమారుడికి ఏదైనా కీడు వాటిల్లిందేమో అనే భయం ఆవరించిన చంద్రాదేవి మనస్సులో - విచిత్రంగా కూడా తోచలేదు. ఆమె వద్దకెళ్లి, ''అమ్మా! నువ్వు ఎక్కడ నుంచి వస్తున్నావు?'' అని అడిగింది. ఆ యువతి ''భూర్సుబో నుంచి'' అని జవాబు చెప్పింది. ఆతురతతో మళ్లీ చంద్రా దేవి, ''నా కుమారుడు రాంకుమార్‌ని నువ్వు చూశావా? అతడు తిరిగివస్తు న్నాడా?'' అంటూ అడిగింది. అపరిచితురాలైన ఒక యువతి తన కుమారుణ్ణి ఎలా ఎరిగి ఉంటుందనే ఆలోచన ఆమె మనస్సులో క్షణమైనా కలగలేదు. కాని ఆమెను అనునయిస్తూ ఆ యువతి యిలా అంది: ''అవునమ్మా! నీ కుమారుడు పూజ చేయటానికి ఏ యింటికి వెళ్లాడో ఆ ఇంటి నుంచే నేను వస్తున్నాను. భయం లేదు. అతడు త్వరలోనే తిరిగి వస్తాడు.'' ఆ మాటలు విన్నాక చంద్రా దేవి మనస్సు ఊరట చెందింది. ఇతర విషయాలను యోచించ గలిగింది. అమూల్యమైన వస్త్రాలను ధరించి నవీన ఆభరణాలను అలంకరించుకొని సుమధుర కంఠంతో మాట్లాడుతున్న ఆ అసమాన రూపవతిని అప్పుడు గమనించి యిలా అడిగింది చంద్రాదేవి: ''అమ్మా! యవ్వనంలో ఉన్నదానివి, అమూల్యమైన ఆభరణాదులను ధరించి యింత రాత్రి సమయంలో ఎక్కడికి పోతున్నావు? నీ చెవులకున్న ఆ వింత ఆభరణం ఏమిటమ్మా?'' చిరునవ్వుతో ఆ యువతి, ''వాటి పేరు కుండలాలు'' అంటూ, మళ్లీ, ''నే నింకా చాలా దూరం పోవాలి'' అంది. పాపం ఆ యువతి ఏదో పెద్ద కష్టంలో ఉందేమో అనుకొని చంద్రాదేవి ''పదమ్మా యీ రాత్రికి మా ఇంట్లో విశ్రమించి, రేపు తీరికగా బయలుదేరుదువు గాని'' అంది ఉట్టిపడే అనురాగంతో. కాని ఆ యువతి, ''లేదమ్మా! నే నిప్పుడే వెళ్లాలి. ఇంకెప్పుడైనా మీ ఇంటికి వస్తాను''

అంటూ, చంద్రాదేవి నుంచి సెలవు పుచ్చుకొని, సమీపంలోని లాహాబాబుల ధాన్యపు కుప్పల వైపుగా వెళ్ళిపోయింది. దారి వీడి లాహాం ఇంటివైపు ఆమె వెళ్లటం చూసి చంద్రాదేవి ఆశ్చర్యపోయింది. పాపం దారితప్పిందేమో అనుకొని గబగబ అటుకేసి వెళ్లి నాలుగు వైపులా ఆమె కోసం వెతికింది. కాని ఆ యువతి కనిపించలేదు. తదనంతరం ఆ యువతి మాటలన్నిటినీ జ్ఞాపకం తెచ్చుకొంటున్నప్పుడు హఠాత్తుగా చంద్రాదేవికి స్ఫురించింది, 'తనకు సాక్షాత్తు లక్ష్మీదేవి దర్శనమే అయిందా!' అని. వెంటనే కంపిత హృదయంతో భర్త వద్దకెళ్లి జరిగింది యావత్తూ పూసగుచ్చినట్లు వివరించింది. క్షుదిరామ్ ఆ ఉదంతం విని ''అనుగ్రహంతో లక్ష్మీదేవి నీకు దర్శనం యిచ్చింది'' అంటూ ఆమె నమ్మకాన్ని బలపరిచాడు. ఇది జరిగిన కాసేపటికి రాంకుమార్ ఇంటికి తిరిగి వచ్చాడు. జరిగినదంతా విని అతడూ నిశ్చేష్టుడయ్యాడు.

కాలం క్రమంగా గడుస్తూ 1835వ సంవత్సరం వచ్చింది. క్షుదిరామ్ జీవితంలో యీ సమయంలో ఒక విశేష సంఘటన జరిగింది. మళ్లీ అతడి

19. క్షుదిరామ్ గయా తీర్థయాత్ర ఆకాంక్ష

మనస్సులో తీర్థయాత్రలు చేసిరావాలనే ప్రగాఢ ఆకాంక్ష కలిగింది. పితృపురుషుల శ్రేయస్సుకై అతడు ఈమారు గయా తీర్థానికి వెళ్లి, పిండాది కర్మలను ఆచరించి రావాలని నిశ్చయించుకొన్నాడు. అరవై ఏళ్ల వయస్సు పైబడ్డా కాలినడకనే పోవటానికి అతడు వెనుకాడలేదు. గయాక్షేత్రానికి వెళ్లిరావాలనే అతడి యీ నిశ్చయానికి వెనుక ఒక అద్భుత ఉదంతం ఉన్నదని హేమాంగినీదేవి కుమారుడైన హృదయరాం ముఖోపాధ్యాయ మాతో చెప్పాడు.

తన కుమార్తె కాత్యాయని తీవ్రరోగగ్రస్థురాలై ఉన్నదన్న వార్త వినగానే క్షుదిరాం ఆమెను చూసిరావటానికి అనూర్ వెళ్లాడు. అప్పుడామె వయస్సు

20. దీని గురించి హృదయరాం కథనం

సుమారు పాతికేళ్లు. ఆమె ప్రవర్తన, మాటతీరు పరికించగానే ఆమెను ఏదో దయ్యం ఆవహించిందని రూఢీచేసుకొన్నాడు క్షుదిరాం. అతడు భగవంతుడి మీద మనస్సును లగ్నం చేసి తన కుమార్తెను ఆవహించిన దయ్యాన్ని ఉద్దేశించి, ''నువ్వు దేవతవో, దయ్యానివో ఎవరివైనా కావచ్చు. నా కుమార్తెను ఎందుకు కష్టపెడుతున్నావు? తక్షణం ఆమెను విడిచి వెళ్లిపో'' అంటూ పలికాడు. ఆ పలుకులకు ఆ భూతం భీతిల్లి, ప్రాధేయపూర్వకంగా కాత్యాయని ముఖతా, ''గయాతీర్థంలో నా కోసం పిండదానం చేసి నన్నీ దుర్భర స్థితి నుంచి ఉద్ధరిస్తానని మీరు వాగ్దానం చేస్తే తక్షణమే మీ కుమార్తెను విడిచిపోతాను. ఆ కార్యం నిమిత్తం మీరు ఇంటి నుంచి బయలుదేరిన మరుక్షణమే అన్ని ఇక్కట్ల నుంచీ ఆమె విముక్తురాలు కాగలదని నేను దృఢ ప్రతిజ్ఞ చేస్తున్నాను'' అంది.

ఆ జీవుడి (దయ్యం) దుస్థితి క్షుదిరాం మనస్సును కదిలించివేయగా అతడిలా అన్నాడు: "నేను సాధ్యమైనంత త్వరలోనే గయా క్షేత్రానికి వెళ్ళి నీ కోరికను నెరవేరుస్తాను. అయినా పిండదానం చేశాక రూఢిగా నువ్వు ఉద్ధరించబడ్డావని నాకు తెలిస్తే ఎంతో సంతోషిస్తాను." అందుకు ఆ దయ్యం "అందుకు పూచీ నాది. నేను ఉద్ధరించబడ్డానని నిదర్శనంగా ఎదుటవున్న వేపచెట్టు కొమ్మల్లో అతిపెద్దదాన్ని విరగగొట్టిపోతాను" అన్నది. ఈ ఉదంతమే హృదయరాం కథనం ప్రకారం క్షుదిరాం గయకు వెళ్ళటానికి కారణం. ఇది జరిగిన కొద్దికాలానికే నిజంగానే ఆ వేపచెట్టు కొమ్మ హఠాత్తుగా విరిగిపోవటంతో ఆ దయ్యం ఉద్ధరించబడిందని అంతా విశ్వసించారు. కాత్యాయనికి కూడ ఆ పీడ తొలగిపోయింది. హృదయరాం కథనంలోని సత్యాన్ని రూఢిపరచలేం. కాని యీ సమయంలో క్షుదిరాం గయాతీర్థాన్ని సందర్శించి రావటం మాత్రం ముమ్మాటికీ నిజం.

1835వ సం॥ శీతకాలంలో క్షుదిరామ్ కాశీ[1], గయా క్షేత్రాల్ని సందర్శించటానికి వెళ్ళాడు. మొదట కాశీ విశ్వనాథుణ్ణి సేవించుకొని అతడు గయా క్షేత్రాన్ని

21. గయలో క్షుదిరామ్ గాంచిన దివ్యస్వప్నం

చేరుకొనేటప్పటికి చైత్ర (మార్చి) మాసం ఆరంభమైంది. ఈ పుణ్యక్షేత్రంలో వసంతఋతువులో చేయబడిన పిండ ప్రదానం పితృదేవత లందరికీ అక్షయమైన పరితృప్తిని కలిగిస్తుందనే శాస్త్రోక్తి అతడికి తెలుసు. అందుకే కాబోలు యీ నెలలో అతడు రావటం! దాదాపు ఒక నెల రోజులు క్షుదిరాం అక్కడ బసచేసి, ఆ క్షేత్రంలో నియమించబడ్డ కర్మకాండ లన్నిటినీ చక్కగా ఆచరించి, చివరకు క్షేత్రాధిపతి అయిన గదాధరుడి (విష్ణువు) శ్రీ పాదపద్మాల వద్ద పిండ ప్రదానం చేశాడు. ఇలా శాస్త్రోక్తంగా పైతృక కార్యాల నన్నిటిని యథావిధిగా నిర్వర్తించిన క్షుదిరామ్ శ్రద్ధాభరిత హృదయం ఆనాడు ఎంత తృప్తితో, శాంతితో పొంగిపోయిందో వర్ణనాతీతం. తన శక్తి మేరకు పితౄణాన్నిలా తీర్చుకొని అతడు నిశ్చల మనస్కుడైనాడు. అంతేగాక భగవంతుడు తనవంటి అల్పుడికి యిటువంటి ఘనకార్యం నిర్వర్తించగలిగే సదవకాశం కలిగించాడనే భావనతో కృతజ్ఞతాపూరితమైన క్షుదిరాం హృదయం మునుపు ఎన్నడూ పొందని వినమ్రతతో, ప్రేమతో పొంగి

1. క్షుదిరాం కాశీని సందర్శించినది చాలాకాలం క్రితమేననీ, దేరేపూర్ నుంచి బయలుదేరి బృందావనం, అయోధ్యలకు తీర్థయాత్రలు చేసినప్పుడు ఆయన కాశీని సందర్శించటం జరిగిందనీ కొందరంటారు. యాత్ర నుంచి తిరిగివచ్చాక కొద్దికాలం తర్వాత పుట్టిన కుమారుడికి రాంకుమార్ అని, కుమార్తెకు కాత్యాయని అని పేరుపెట్టాడని వారి అభిప్రాయం.



గదాధర్ దేవాలయం, గయ



శ్రీవిష్ణుపాదాలు

పొర్లింది. పగటివేళే కాక రాత్రి నిదురించే సమయంలోకూడ అతడి మనస్సు శాంత్యానందాలతో తులతూగింది.

నాటి రాత్రి నిద్రించిన కొన్ని క్షణాల్లో అతడొక దివ్యస్వప్నం గాంచాడు. స్వప్నంలో అతడు పవిత్ర దేవాలయంలో గదాధరుడి శ్రీపాదపద్మాల వద్ద పితృ పురుషు లందరికీ పిండప్రదానం చేస్తూండగా, వారందరూ దివ్యజ్యోతిర్మయ దేహాలను దాల్చి ఆ పిండాలను మహాసంతోషంతో స్వీకరిస్తూ, మనసారా ఆతణ్ణి ఆశీర్వదిస్తూంటే చూడటం జరిగింది. సుదీర్ఘకాలం పిమ్మట మళ్లీ వారి దర్శ నాన్ని పొందిన క్షుదిరాం ఉద్విగ్నుడైనాడు. సజలపూరిత నేత్రాలతో, భక్తి పొంగి పొరలే హృదయంతో వారి పాదాలను తాకి ప్రణామం చేయసాగాడు. మరుక్షణం మళ్లీ చూసేసరికి ఆలయం యావత్తు తానెన్నడూ చూడని ఒక దివ్యమయ కాంతితో నిండిపోయింది. అతడి పితృదేవత లందరూ గౌరవప్రపత్తులతో లేచి ముకుళిత హస్తాలతో రెండు వైపులా నిలబడి ఆలయం మధ్యలో అద్భుతమైన ఒక సింహాసనం మీద సుఖాసీనుడై ఉన్న ఒక దివ్యపురుషుణ్ణి ఆరాధించసాగారు. నవ దూర్వాదళ శ్యాముడూ, జ్యోతిర్మయదేహుడూ ఐన ఆ పురుషుడు స్నిగ్ధ మధుర ప్రసన్న దృష్టితో తన వైపే చూస్తూ, చిరునవ్వుతో తనను దగ్గరగా రావల సిందిగా సూచిస్తూన్నట్లు క్షుదిరాం చూశాడు. మంత్రముగ్ధుడిలా ఆ దివ్య పురుషుణ్ణి సమీపించి, భక్తివిహ్వల హృదయుడై సాష్టాంగ ప్రణామం చేసి, హృదయోద్వేగంతో ఆ మూర్తిని స్తుతించసాగాడు. ఆ దివ్యమూర్తి అతడి భక్తికి పరవశించి వీణ మీటినట్లున్న కంఠధ్వనితో అతడితో యిలా పలికాడు: ''క్షుదిరామ్! నీ అపూర్వ భక్తికి నేను ప్రసన్నుడనయ్యాను. నీ కుమారుడిగా అవతరించి, నీ సేవానురాగాలను అందుకోగలను.'' కలలోనైనా ఊహించలేనట్టి ఆ మాటలను ఆలకించి క్షుదిరామ్ హృదయం పట్టరాని ఆనందంతో పొంగి

పోయింది. కాని మరుక్షణంలోనే తన పేదరికాన్ని గుర్తు తెచ్చుకొని, తాను ఆయన ఆలనాపాలనా ఎలా చూడగలడు? అనే ఆలోచన అతణ్ణి విషాదంలో ముంచగా, సజల నేత్రాలతో గాద్గదికంగా యిలా అన్నాడు: ''వద్దు ప్రభూ! వద్దు! అటు వంటి మహద్భాగ్యానికి నేను తగను. కృపాకటాక్షంతో నువ్వు సాక్షాత్కరించటమే కాక నా పుత్రుడిగా అవతరిస్తానన్న కోరికను వ్యక్తపరచటమే నాకు పదివేలు. నిజంగా నువ్వు నా కుమారుడివై జన్మిస్తే నిరుపేదనైన నేను నిన్నెలా సేవించు కోగలను?'' అప్పుడు ఆ దివ్యమూర్తి కరుణరసం తొణికిసలాడే క్షుదిరామ్ పలు కులు ఆలకించి, ఇనుమడించిన ప్రసన్నతతో యిలా పలికాడు: ''భయపడకు క్షుదిరామ్! నువ్వు ఏమిస్తావో దానినే ప్రీతితో స్వీకరిస్తాను. నా ఆకాంక్ష మాత్రం నెరవేర్చు.'' క్షుదిరాం హృదయం 'వద్దు' అనలేకపోయింది. ఆనందం, దుఃఖం - పరస్పర విరుద్ధమైన యీ భావోద్వేగాలు ఏకకాలంలో ఉవ్వెత్తున చెలరేగగా, అతడు వాటి ధాటికి తట్టుకోలేక, స్పృహకోల్పోయాడు. ఆ సమయంలో అతడి కల చెదిరిపోయింది.

22. క్షుదిరామ్ కామార్పుకూర్‌కు తిరిగి రావటం

మేలుకొన్న పిదప చాలాసేపటి వరకు తానెక్కడున్నాడో క్షుదిరామ్ తెలుసు కోలేకపోయాడు. తన స్వప్నం యొక్క వాస్తవికత అతణ్ణి పూర్తిగా వివశుణ్ణి చేసింది. క్రమంగా జాగ్రదావస్థకు వచ్చాక, లేచి కూర్చుని, ఆ వింత స్వప్నాన్ని జ్ఞాపకానికి తెచ్చుకొంటూ, దాన్ని గురించి విభిన్న కోణాలలో వితర్కించుకోసాగాడు. చివ రికి అతడి విశ్వాసపూరిత హృదయం - ఆ దివ్యస్వప్నం నిజమై తీరుతుందనీ, తప్పకుండా ఎవరో ఒక మహాపురుషుడు తన ఇంట త్వరలో జన్మించనున్నాడనీ, వృద్ధాప్యంలో మళ్లీ తనకు నూతన పుత్రుడి ముఖారవిందాన్ని చూసే అదృష్టం పట్టిందనీ - ఒక దృఢనిశ్చయానికి వచ్చింది. ఈ అద్భుత స్వప్నం నిజమయ్యే దాకా దీన్ని గురించి ఎవరికీ చెప్పకూడదని అతడు నిర్ణయించుకొన్నాడు. మరి కొన్ని రోజుల తరువాత గయా క్షేత్రానికి వీడ్కోలు చెప్పి, కామార్పుకూర్‌కు క్షుదిరామ్ తిరిగి వచ్చాడు. అప్పుడు 1835వ సం॥ ఏప్రిల్ నెల జరుగుతోంది.

4. చంద్రాదేవి విచిత్ర అనుభూతులు

1. అవతారమూర్తుల జననకాలంలో వారి తల్లితండ్రుల దివ్యానుభూతులు

జగత్పావనులైన మహాత్ములు జన్మించబోయే కాలంలో వారి తల్లితండ్రుల జీవితాల్లో అసాధారణమైన ఆధ్యాత్మికానుభూతులు, దివ్యదర్శనాలు కలుగుతూండేవని ప్రపంచంలోని జాతు లన్నిటి మతగ్రంథాలలో నమోదు కాబడివుంది. మహామహిమోపేతులైన శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణ పరమాత్మ, మాయాదేవి పుత్రుడైన గౌతమ బుద్ధుడు, మేరీమాత తనయుడైన ఏసుక్రీస్తు, శంకరాచార్యుడు, చైతన్యమహాప్రభు తదితర పురుషవరేణ్యులు - ఏ మహాపురుషులు సమస్త మానవజాతి నివాళులను నేటికీ అందుకుంటున్నారో - అందరి తల్లితండ్రులను గురించి అటువంటి సంగతులు శాస్త్రాలలో కానవస్తూన్నాయి. ఇందుకు నిదర్శనంగా కొన్ని సంఘటనలు క్రింద పొందుపరుస్తున్నాం.

దశరథుడి ముగ్గురు భార్యలూ యజ్ఞానంతరం పాత్రలో మిగిలివున్న దేవప్రసాదితమైన పాయసాన్ని ఆరగించిన తరువాత వారికి శ్రీరామచంద్రుడు, లక్ష్మణుడు, భరత, శత్రుఘ్నులు జన్మించారని రామాయణం చదివిన అందరికీ తెలిసిన సంగతే. అంతేగాక జన్మించటానికి మునుపే వారు జగద్రక్షకుడైన మహావిష్ణువు దివ్యాంశసంభూతులనీ, దివ్యశక్తి సంపన్నులనీ తల్లిదండ్రులకు ఎరుకే అన్న సంగతీ రామాయణంలో పేర్కొనబడే ఉంది.

శ్రీకృష్ణుడి తల్లితండ్రులు అతడు తల్లి గర్భంలో ప్రవేశించినప్పుడూ, జన్మించిన తక్షణమూ షడైశ్వర్య సంపన్నుడైన భగవంతుడే తమ కుమారుడుగా అవతరించాడని గ్రహించారు. అంతేగాక అతడు పుట్టిన నాటి నుంచీ ప్రతిరోజూ అద్భుత సంఘటనల నెన్నిటినో తమ కళ్లారా వారు చూడటం శ్రీమద్భాగవతాది పురాణాలలో వివరించబడివుంది.

బుద్ధ భగవానుడు అవతరించ నున్నప్పుడు దివ్యపురుషు డొకడు జ్యోతిర్మయమైన తెల్లని ఏనుగు రూపం దాల్చి తన గర్భంలో ప్రవేశించటం, ఇంద్రాది దేవత లందరూ తన గొప్ప అదృష్టాన్ని గాంచి తన పట్ల భక్తిప్రపత్తులు కనబరచటం మాయాదేవి దర్శించింది.

ఏసుక్రీస్తు జననానికి ముందు అతడి తల్లి మేరీ, తన భర్త జోసెఫ్‌తో దైహిక సంబంధం లేకున్నప్పటికీ తాను గర్భం ధరించినట్లు భావించింది. ఎన్నడూ కనీ వినీ ఎరుగని దివ్య తేజస్సు సంతరించుకొన్నదై, తాను దివ్యగర్భాన్ని ధరించినట్లు తెలుసుకొన్నది.

దేవాధిదేవుడైన మహాదేవుడి దివ్యదర్శనాన్ని పొంది ఆయన ఒసగిన వరం ద్వారా తాను గర్భవతినైనట్లు శ్రీ శంకరుల తల్లికి తెలిసింది.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువుల తల్లియైన శచీదేవి జీవితంలో కూడ పైన వర్ణించినట్టి దివ్యానుభవాలు కలిగినవని శ్రీ చైతన్య చరితామృతం మొదలైన గ్రంథాలలో మనం చూడవచ్చు.

హిందూ, బౌద్ధ, క్రైస్తవాది మతాలన్నీ ప్రగాఢ భక్తితో భగవంతుణ్ణి ఆరాధించడం ద్వారా ఆయన అనుగ్రహాన్ని సులువుగా పొందవచ్చునని ఘంటాపథంగా చాటిచెబుతున్నాయి. ఆ మతాలన్నీ యీ విషయాన్ని ఇంతగా నొక్కి చెబుతు న్నప్పుడు నిష్పక్షపాతియైన పరిశోధకుని మనస్సులో సహజంగా తలఎత్తే ప్రశ్న ఏమంటే : పై విషయంలో ఆలంబనంగా సత్యం ఏదైనా ఉందా? ఉంటే, పై కథనంలోని ఏ విభాగాలను స్వీకరించాలి, వేటిని నిరాకరించాలి?

2. యుక్తి కూడ శాస్త్రవాక్యాన్ని బల పరుస్తూ ఉంది

మరోవైపు నుండి చూస్తే యుక్తికూడ పై శాస్త్రవాక్యంలో కొంత సత్యం ఉండి ఉండవచ్చునని సూచిస్తోంది. ఎందుకంటే ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడ సుగుణ సంపన్నులైన తల్లితండ్రులకు ఉత్కృష్టశీలురైన పిల్లలు జన్మిస్తారని అంగీకరిస్తూ ఉంది కనుక! అలాంటప్పుడు శ్రీకృష్ణుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు మొదలైన మహాపురుషుల తల్లితండ్రులు కూడ అతిశయ సద్గుణ సంపన్నులనే సంగతిని అంగీకరించాలి. ఆ మహాపురుషు లందరి జనన కాలంలో వారి తల్లితండ్రుల మనస్సులు సాధారణ మానవులకు శక్యంకాని అత్యున్నత భూమిలలో నెలకొని ఉండేవనడం స్పష్టం. ఇదే వారిని అనుపమాన దివ్యదర్శనాలు, దివ్యానుభూతులు పొందడానికి అర్హులను చేసింది.

పురాణేతిహాసాలు అలాటి దివ్యానుభూతుల దృష్టాంతాల ననేకం నమోదు చేసివున్నప్పటికీ, యుక్తికి అవి ప్రతికూలాలు కాకపోయినప్పటికీ మనిషి మనస్సు వాటిని పూర్తిగా విశ్వసించలేదు. ఇంద్రియ సముపార్జిత జ్ఞానం పట్ల మాత్రమే

నమ్మకం ఉంచిన అతడి మనస్సు ఆత్మ, ఈశ్వరుడు, ముక్తి, పరలోకం ఇత్యాది అతీంద్రియ సత్యాలను గురించి వాటి ప్రత్యక్షానుభూతిని పొందేవరకు నిస్సందేహంగా నమ్మజాలదు. ఇది నిజమైనా కూడ నిష్పక్షిక పరిశోధకుడు అలౌకిక, అసాధారణమంటూ ఏ అనుభవాన్నీ త్రోసిపుచ్చడు. అలా కాక స్వయం సాక్షీభూతుడుగా ఆ అనుభవాలకు చెందిన అనుకూల, ప్రతికూల ప్రమాణాలను ఓపికగా సేకరించి, చివరికి ఆ యథాతథ భోగట్టా ఆధారంగా వాటిని నిరాకరించడమో లేక అంగీకరించడమో చేస్తాడు.

3. ఆ దివ్యదర్శనాల మహత్త్వం, ఔచిత్యం

ఏది ఏమైనప్పటికీ ఏ మహాపురుషుని జీవిత చరిత్రను మేము రచింప ఉపక్రమించామో, ఆయన జనన కాలంలో ఆయన తల్లితండ్రులు కూడ పలు దివ్యదర్శనాలు, అపూర్వానుభూతులు పొందారన్న విషయం అతి విశ్వసనీయ ఆధారాల నుండి మేం తెలుసుకొన్నాము. కనుక ఆ విషయాలను పొందుపరచడం తప్ప మాకు మరో ప్రత్యామ్నాయం కనబడలేదు. వెనుకటి అధ్యాయంలో క్షుదిరామ్‌కు కలిగిన దివ్యానుభూతులు కొన్నిటిని పాఠకులకు తెలిపి ఉన్నాం. ఇప్పుడు చంద్రాదేవి పొందిన దివ్యానుభూతులు కొన్నిటిని తెలుపనున్నాము.

ఇంటికి తిరిగి వచ్చాక గయలో తాను గాంచిన స్వప్నవృత్తాంతం ఎవ్వరికీ చెప్పకుండా ఏం జరుగనున్నదో అని క్షుదిరామ్ నిరీక్షించసాగాడు. మొట్టమొదటి విషయం అతడు గమనించింది చంద్రాదేవిలో కలిగిన అపూర్వ పరిణామం. అతడి దృష్టిలో ఆమె ఒక సామాన్య స్త్రీలా కాక ఒక దేవతగా కనిపించసాగింది. గుర్తు తెలియని ఏ ఉత్పత్తిస్థానం నుంచో ఉద్భవించిన సర్వజనాకర్షక ప్రేమ వెల్లువ ఆమె హృదయాన్ని నింపివేసి లౌకిక వాంఛితాలన్నిటికీ అతీతమైన ఉత్కృష్ట స్థానంలో ఆమెను నిలిపివుంచింది. ఇప్పుడు ఆమె తన కుటుంబం కంటే ఇరుగుపొరుగువారి అవసరాలను గురించే ఎక్కువగా పట్టించుకోసాగింది. తన ఇంటి పనులలో సతమతమౌతూ ఉన్నప్పటికీ అప్పుడప్పుడు వెళ్లి వారి అవసరాలను తీర్చడం ఆమెకు పరిపాటి అయింది. ఆహారపదార్థాలు, యితర నిత్యావసర వస్తువులు తన ఇంటి నుంచి తీసుకువెళ్లి వాటి అవసరం ఉన్న వారికి రెండో కంటికి తెలియకుండా ఇవ్వసాగింది. శ్రీ రఘువీరుని పూజాకార్యం ముగించాక భర్తకు, పిల్లలకు భోజనం వడ్డించేది. పిదప అప్పటికే ఆలస్యం అయినప్పటికీ, తను భోజనం చేసేముందు ఇరుగుపొరుగు ఇళ్లకు వెళ్లి వారి భోజనాలు అయినవో లేవో కనుగొని వచ్చేది. ఏనాడైనా ఏదో కారణాన ఎవరికైనా భోజనం లేదని తెలియగానే ఆప్యాయంగా ఆ సదరు వ్యక్తిని తన ఇంటికి ఆహ్వానించి తన

4. చంద్రాదేవిలో కలిగిన మానసిక మార్పును క్షుదిరామ్ గుర్తించడం

వంతు భోజనాన్ని అతడికి వడ్డించేది. మిగిలివున్న నాలుగు మెతుకులను తాను తిని సంతృప్తితో ఆ ప్రొద్దు గడిపేది చంద్రాదేవి.

ఇరుగుపొరుగు వారి బిడ్డల నందరినీ సదా తన సొంత బిడ్డలగానే ప్రేమించే చంద్రాదేవి ఇప్పుడు దేవతల పట్ల కూడ మాతృప్రేమను వ్యక్తం చేయడం ఖుదిరామ్ గమనించాడు. కులదైవమైన రఘువీరుని కన్న కుమారునిగా చూడసాగింది. అట్లే శీతలాదేవిని, బాణేశ్వర శివలింగాన్ని తన సొంత బిడ్డలుగా పరిగణించసాగింది. ఇంతకు మునుపు ఆ దేవతల సేవ, పూజాదులు నిర్వర్తింపబడుతున్నప్పుడు ఆమె హృదయం భక్తిపూర్వకమైన భీతితో నిండిపోయేది. మాతృప్రేమ ఇప్పుడు ఆ భీతిని పూర్తిగా తరిమివేసింది. వారి సాన్నిధ్యంలో ఇప్పుడామెకు ఎలాంటి జంకుగాని, సంకోచంగాని లేవు. వారి నుండి దాచుకోవలసిందిగాని, కోరవలసిందిగాని ఏదీ లేదు. అందుకు మారుగా ఆ దేవతలు తన సొంత బిడ్డలకంటే మరింత సన్నిహితులనే నమ్మిక, వారి సుఖంకోసం తన సర్వస్వాన్ని త్యజించాలనే తీవ్ర ఆకాంక్ష, వారితో శాశ్వతమైన బంధంతో కట్టుబడి ఉన్నాననే పరమానందం ఆమెలో పొంగిపొరలాయి.

5. చంద్రాదేవి మాతృప్రేమ విస్తృతి

దేవతల పట్ల చంద్రాదేవి నిష్కపట భక్తి, వారి ఎడ కలిగిన అతి సాన్నిహిత్య సంబంధం వలన జనించిన ఆనందం సరళ హృదయురాలైన చంద్రాదేవిని మరింత సరళతమం చేయడం ఖుదిరామ్ గమనించాడు. ఆపైన ఎవరినీ సందేహించడం గాని, ఎవరినీ అపరిచితునిగా గాని చూడలేకపోయింది. 'స్వార్థపూరిత ప్రపంచం అటువంటి నిష్కాపట్యాన్ని ప్రశంసించకపోవడం అటుంచి ఆమెను వెర్రిదాని క్రిందో పిచ్చిదాని క్రిందో జమకడుతుంది' అని ఖుదిరామ్ తలపోశాడు. ఈ విషయంగా ఆమెను హెచ్చరించడానికి సరైన అవకాశం కోసం అతడు ఎదురు చూడసాగాడు.

6. ఆమెను గురించి ఖుదిరామ్ ఆదుర్దా

త్వరలోనే ఆ అవకాశం వచ్చింది. అమాయకురాలైన చంద్రాదేవి భర్త నుంచి ఏ ఒక్క ఆలోచననూ దాచుకొనేది కాదు. తరచు ఆమె తన ఆలోచనలను స్నేహితురాళ్లతో దాపరికం లేకుండా చెప్పుకొనేది. అలాంటప్పుడు ప్రపంచంలో అందరికన్నా తనకు ఆప్తునిగా భగవంతుడు నియామకం చేసిన భర్త నుంచి ఎలా దాచగలదు? ఖుదిరామ్ గయ నుంచి తిరిగి రాగానే అతడు అక్కడ లేనప్పుడు తాను చూసిన దివ్యదర్శనాల, పొందిన అనుభూతుల గురించి సందర్భం దొరికినప్పుడు అతడితో చెప్పాలనుకొన్నది. అవకాశం చూసుకొని ఒకరోజు అతడితో యిలా చెప్పింది: ''మీరు ఇక్కడ లేనప్పుడు ఒకరోజు రాత్రి నా కొక విచిత్రమైన కల వచ్చింది. దాన్లో జ్యోతిర్మయుడైన ఒక దేవుడు నా మంచం మీద పడుకొని ఉండటం చూశాను.

7. చంద్రాదేవి విచిత్ర స్వప్నం

మొదట మీరేమో అనుకొన్నాను. కాని వెంటనే మానవు దెవడికీ అటువంటి దివ్యరూపం ఉండటం అసంభవమని తోచింది. పిదప నిద్ర నుంచి లేచాను; కాని ఆ దేవుడు యింకా పక్కమీదనే ఉన్నట్లు అనిపించింది. మరుక్షణమే మరో ఆలోచన వచ్చింది. 'దేవుడు ఎప్పుడైనా మనిషి ముందు యీ విధంగా కనబడతాడా?' తరువాత నాకు యిలా అనిపించింది: 'దుష్టుడు ఎవడైనా ఏదైనా దురుద్దేశంతో గదిలోకి ప్రవేశించాడేమో, బహుశా అతడి అడుగుల సవ్వడి విని నాకు అలాటి కల వచ్చిందేమో!' గొప్ప భయం సన్నావరించింది. వెంటనే దీపం వెలిగించాను. గదిలో ఎవరూ లేరు. వేసిన తలుపు గడియ వేసినట్లే ఉంది. కాని భయం ఆ రాత్రి నన్ను జాగారం చేయించింది. నేను ఇలా అనుకొన్నాను: 'తలుపు గడియ తీసి ఎవరైనా గదిలోకి ప్రవేశించి నేను మేల్కొని ఉండటం చూసి మళ్లీ తెలివిగా గడియ వేసి పారిపోయాడేమో!' తెల్లవారగానే ధనికామారిణిని, ధర్మదాస్‌లాహా చెల్లెలు ప్రసన్నను పిలువనంపాను. జరిగినదంతా వారికి చెప్పాక వారిని యిలా అడిగాను: 'నిజంగానే ఎవడైనా నా గదిలోకి వచ్చాడంటారా? గ్రామంలో ఎవరితోనూ నాకు విరోధం లేదే! ఏదో స్వల్ప విషయంగా ఆ రోజు మధు యుగి, నేను మాట మాట అనుకొన్నాం, అంతే! కక్షకట్టి అతడేమన్నా నా గదిలోకి ప్రవేశించి ఉంటాడా?' నా మాటలకు వారిద్దరూ పకపక నవ్వి నన్ను యిలా మందలించారు: 'వెర్రిదానా! ముసలితనం నీ బుర్రను పాడు చేస్తోందా? నీ కల గురించి ఎందుకు అలా విశ్లేషిస్తావు? ఎవరైనా దీన్ని గురించి వింటే ఏమంటారో కాస్త యోచించు! ఇది అపవాదుకు దారితీస్తుంది. మళ్లీ ఈ సంగతి మరెవరితోనైనా ప్రస్తావిస్తే నిన్ను ఎగతాళి పట్టిస్తారు.' వారి మాటలు విని, 'అలా అయితే నిజంగా అదొక కలే. ఇక దీన్ని గురించి ఎవరితోనూ ప్రస్తావించను, మీరు తిరిగి వచ్చాక మీతోనే చెప్తాను' అని అనుకొన్నాను.

8. శివాలయంలో చంద్రాదేవి దివ్యదర్శనం, దివ్యానుభూతి

''మరో సందర్భంలో యుగుల శివాలయం ఎదుట ధనితో మాట్లాడుతున్నప్పుడు మహాదేవుని పావన విగ్రహం నుండి దివ్యజ్యోతి ఒకటి ప్రసరించడం నేను చూశాను. ఆ దివ్యజ్యోతి ఆలయాన్ని క్రమ్మివేసి తరంగాకృతిలో నాకేసి వేగంగా రాసాగింది. ఆశ్చర్యచకితనైనే నా విషయం ధనితో చెప్పబోతూ ఉండగా హఠాత్తుగా ఆ దివ్యజ్యోతి నన్ను ముంచివేసి వడిగా నాలో ప్రవేశించింది. ఆశ్చర్యంతో స్తంభించిపోయి, స్పృహకోల్పోయి క్రిందపడిపోయాను. ధని శుశ్రూష చేయగా బాహ్యచైతన్యం పొంది, జరిగినదంతా ఆమెతో చెప్పాను. మొదట ఆమె ఆశ్చర్యం వెలిబుచ్చింది. పిదప, 'నీకు అపస్మారం కలిగింది' అన్నది. కాని అప్పటి నుంచి ఆ జ్యోతి నా గర్భంలో ఉన్నట్లు, నేను గర్భవతి నైనట్లు అనిపిస్తూ ఉంది. ఈ



యుగుల శివాలయం

విషయం కూడ ధనికి, ప్రసన్నకు చెప్పాను. కాని వాళ్ల 'మూర్ఖురాలు, వెర్రిది' అంటూ నన్ను కసురుకొన్నారు. నా అనుభూతి భ్రాంతిజనితమో లేక వాతం వల్ల కలిగిందో అని వారు నిర్ణయించారు. ఈ విషయం నాకు అర్థం అయ్యేట్లు నానావిధాల ప్రయత్నించి, యీ సంఘటనను మరెవ్వరికీ వెల్లడించవద్దని నన్ను హెచ్చరించారు. మీకు తప్ప మరెవరికీ చెప్పకూడదని ఇప్పటిదాక మౌనం వహించాను. సరే, మీకు ఏమనిపిస్తోంది? భగవత్కృపతో అలా అయిందా లేక వాతం కమ్మి అలా జరిగిందా? ఇప్పటికీ నేను గర్భవతిననే నాకు అనిపిస్తున్నది.''

చంద్రాదేవి చెబుతున్నదంతా వింటున్న క్షుదిరామ్ గయాక్షేత్రంలో తనకు వచ్చిన కలను జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. పిదప ఎన్నో విధాల ఆమెకు పునరాశ్వాసనం కలిగిస్తూ యిలా అన్నాడు: ''ఇక నుంచి అట్టి దర్శనాల, అనుభూతుల గురించి ఎవరితోనూ మాట్లాడబోకు, నాతో తప్ప! శ్రీరఘువీర్ కృపతో ఏం దర్శింప చేస్తాడో అదంతా మన మేలుకే అనుకొని నిశ్చింతగా ఉండు. గయాధామంలో బసచేసి ఉన్నప్పుడు మళ్లీ మనకు పుత్రోదయం కానున్నట్లు శ్రీ గదాధరుడు అలౌకిక రీతిలో నాకు వెల్లడించాడు.'' దైవసమానుడైన భర్త పలుకులు విని చంద్రాదేవి మనస్సు కుదుటపడింది. భర్త ఆజ్ఞానుసారం అప్పటి నుండి తన భారాన్నంతా సంపూర్ణంగా శ్రీ రఘువీరుని మీదనే వేసి కాలం గడపసాగింది. ఆ బ్రాహ్మణ దంపతులు ఇలా మాట్లాడుకొన్న తరువాత మూడు నాలుగు నెలలు గడచిపోయాయి. నలభై ఐదేళ్ల చంద్రాదేవి నిజంగానే గర్భవతి అయిందని అప్పటికి ప్రతి ఒక్కరికీ తెలిసిపోయింది. గర్భం ధరించినప్పుడు స్త్రీల రూపలావణ్యాలు ఇనుమడిస్తాయని చెప్పుకొంటారు. చంద్రాదేవిలో కూడ యీ మార్పు కనిపించింది. ఇదివరలో గర్భం ధరించినప్పటి కంటే ఈసారి ఆమె రూప లావణ్యాలు మిక్కుటమయ్యాయని ధని, ఇతర గ్రామ స్త్రీలు వ్యాఖ్యానించారు. ఈ వార్త వ్యాపించగానే కొందరు స్త్రీలు తమలో తాము ఇలా గుసగుసలాడుకొన్నారు: ''ఈ వయస్సులో ఒక స్త్రీ గర్భం ధరించడమూ, ఇంత రూపలావణ్యాలు సంతరించుకోవడమూనా! పురిట్లో ఆమె బహుశా బ్రతకదేమో!''

9. చంద్రాదేవిని ముందు జాగ్రత్తగా షుదిరామ్ హెచ్చరించడం

గర్భవతి అయిన తరువాత చంద్రాదేవి దివ్యదర్శనాలు, అనుభూతులు రోజురోజుకూ ఎక్కువయ్యాయి. ఈ కాలంలో దాదాపు నిత్యం ఆమెకు దేవీ దేవతల దర్శనాలు కలుగుతూండేవట. ఆ దేవీదేవతల పవిత్ర దేహాలు వెదజల్లే సుగంధం ఇంట్లో యావత్తూ వ్యాపించడం ఆమెకు ఎరుకే! మరొకప్పుడు దైవవాణిని ఆల కిస్తూ ఆమె స్తంభించిపోయేది. కొన్ని సమయాల్లో ఆ దేవీదేవతల పట్ల జనించిన మాతృప్రేమ ఆమె హృదయంలో పొంగిపొరలేదట. దాదాపు ప్రతి రోజు తన భర్తకు యీ దివ్యదర్శనాల, అనుభూతుల గురించి తెలిపి, తనకు అవి ఎందుకు కలుగుతున్నాయని ప్రశ్నించేది. ఖుదిరామ్ గాబరా చెందవద్దని ఆమెను ఎన్నో విధాల ఊరడించేవాడు. ఆ సమయంలో జరిగిన ఒక సంఘటనను యిక్కడ తెలుపుతున్నాం. చంద్రాదేవి ఆ సంఘటనను భీతితో యిలా వర్ణించి చెప్పిందని మేం వినివున్నాం: ''ఓ స్వామీ! శివాలయం ఎదుట జ్యోతిదర్శనం అయినప్పటి నుండి అప్పుడప్పుడు ఎందరి దేవీదేవతల దర్శనం నాకు కలుగుతున్నదో లెక్కే లేదు. వారిలో అనేకుల మూర్తులను నేను ఇంతవరకు కనీసం చిత్తరువులలో కూడ చూసివుండలేదు. ఈ రోజు ఒక దేవుడు హంస వాహనం మీద రావడం చూశాను. మొదట నేను బెదిరిపోయాను. కాని ఎండ వేడిమికి ఆతడి ముఖం ఎర్రబారి ఉండటం చూసి నా మనస్సు చివుక్కుమన్నది. ఆతణ్ణి పిలిచి, 'నాయనా, ఓ హంస వాహన దేవా! ఎండకు నీ ముఖం కమిలిపోయి ఉంది. ఇంట్లో చద్ది అన్నం ఉంది. రెండు ముద్దలు తిని సేద తీర్చుకొని వెళుదువు గాని' అని అన్నాను. నా మాటలు విని అతడు నవ్వాడు. కాని వెంటనే మాయమై పోయాడు. ఇలాంటి ఎందరో మూర్తులు నాకు కనిపిస్తూ ఉంటారు. వారిని అర్చించను, వారిని ధ్యానించను; అయినా వారిని పగలు లేక రాత్రి ఏ వేళలోనన్నా చూడగలుగుతున్నాను. కొన్ని వేళల్లో వారు మానవ రూపంలో నా ముందుకు వచ్చి, పిదప గాలిలో కలిసి అదృశ్యులైపోతారు. నాకీ దర్శనాలు ఎందుకు కలుగు తున్నాయో మీరు చెప్పగలరా? ఇది ఏదన్నా రోగమా? గోసైన్[1] దయ్యమేమైనా నన్ను ఆవహించిందా అని అప్పుడప్పుడు ఆశ్చర్యపోతూ ఉంటాను.'' ఖుదిరామ్

10. గర్భవతి అయ్యాక చంద్రాదేవి దివ్యదర్శనాలు

---

1. సుఖలాల్ గోస్వామి మరణించాక ఊళ్లో ఎన్నో ఉత్పాతాలు సంభవించడం చూసి గోస్వామిగాని లేక ఆతడి కుటుంబంలో మరణించిన మరో వ్యక్తిగాని దయ్యమై గోస్వామి ఇంటికి ఎదురుగా ఉన్న పొగడచెట్టును ఆశ్రయించుకొని ఉన్నారని గ్రామస్థులు నమ్మేవారు. ఆ నమ్మకంతోనే ఆ రోజుల్లో ఎవరికైనా ఏ విధమైన అతీంద్రియ అనుభవాలు కలిగితే ఆ వ్యక్తిని గోస్వామి దయ్యం ఆవహించిందని గ్రామస్థులు అనుకొనేవారు. సరళురాలైన చంద్రాదేవి కూడా ఆ సమయంలో అట్లే భావించింది.

19092

మళ్లీ ఆమెకు గయలో తాను కన్న కల గురించి చెప్పి, పురుషోత్తముణ్ణే గర్భంలో ధరిస్తున్న ఆమె నిజానికి ఎంతో అదృష్టవంతురాలనీ, ఆయన పావన సంస్పర్శ ఫలితంగానే ఆమెకు యీ దివ్యదర్శనాలు కలుగుతున్నవనీ సూచనప్రాయంగా తెలి పాడు. భర్త మాటల పట్ల ప్రగాఢ విశ్వాసం ఉన్న చంద్రాదేవికి ఆతడి యీ వివ రణ ఆమె హృదయాన్ని పరమభక్తితో నింపివేసింది. క్రొత్తబలం పుంజుకొన్న ఆమె ఇప్పుడు నిశ్చింతురాలైంది.

గురుదేవులు శ్రీరామకృష్ణులు పుట్టిన ఇల్లు

కాలం దొర్లిపోసాగింది. క్షుదిరామ్, సుగుణాలరాశియైన చంద్రాదేవి రఘువీరుని సంపూర్ణంగా శరణుజొచ్చి, ఎవరి శుభాగమనంతో తమ జీవితాలు భగవద్భక్తితో పరిపూర్ణమైనవో ఆ మహనీయ తనయుని ముఖారవింద దర్శన లాలసులై కాలం గడపసాగారు.

5. యుగపురుషుని అవతరణ

శరత్, హేమంత, శిశిర ఋతువులు వచ్చి వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఋతురాజు వసంతుడు అరుదెంచాడు. వాతావరణంలో ఆహ్లాదం నెలకొని సృష్టి యావత్తు నూత్నజీవంతో పులకరించిపోతున్నది. అంత వేడి, అంత చలి కాని ఫాల్గుణ మాసం వచ్చి ఆరు రోజులే అయింది. ప్రాణు లన్నింటిలో విశేష ఉత్సాహం, ఆనందం, ప్రేమలు పెల్లుబుకుతున్నాయి. శాస్త్రాలు పేర్కొంటున్నట్లు బ్రహ్మానందంలోని ఒక్క బిందువు యావన్మందిలో నిహితమై ఆనందం కలుగ చేస్తున్నది. ఈ వసంతానికి ఆ దివ్యానందంలో ఒక పాలు ఎక్కువ లభించినట్లుం దేమో! అందుకే కాబోలు యీ సమయంలో లోకంలో మహోల్లాసం ఇంతగా పొంగిపొర్లిపోతున్నది.

చంద్రాదేవికి ప్రసవ సమయం దగ్గరపడింది. శ్రీ రఘువీరునికి నైవేద్యం తయారుచేస్తున్నప్పుడు ఆమె హృదయం దివ్యానందంతో నిండిపోసాగింది. కాని శరీరం ఎంతో బడలికగా ఉన్నట్లు ఆమెకు అనిపించింది. అట్టి స్థితిలో ఎప్పుడు ఏమౌతుందో ఎవరికి తెలుసు? నొప్పులు మొదలైతే దేవుళ్ల సేవకు ఇంట్లో ఎవ్వరూ లేరాయె? ఎలామరి? - అన్న ఆలోచన హఠాత్తుగా ఆమెలో మెదిలింది. ముందు జాగ్రత్తకోసం ఆమె తన ఆలోచనను భర్తకు తెలిపింది.

1. చంద్రాదేవి భయోద్వేగాలను భర్త తొలగించడం

''భయపడకు. నీ గర్భంలో ఉన్న శిశువు తన జన్మకారణంగా శ్రీ రఘువీరుని సేవలకు ఎలాంటి ఆటంకమూ కల్పించడు. ఆందోళన చెందకు. నేడు భగవత్సేవను నువ్వు తప్పక నిర్వహించగలుగుతావు. రేపటినుండి వేరే ఏర్పాటు చేశాను. అంతేకాదు, యీ రోజు రాత్రి నుండి ఇక్కడే పడుకోమని ధనికి చెప్పాను కూడ'' అని ఖుదీరామ్ చెప్పి, ఆమెను నిశ్చింతురాలను చేశాడు. దానితో చంద్రాదేవి కొత్త బలాన్ని పుంజుకొన్నదై సంతోషంగా ఇంటి పనుల్లో మునిగి

పోయింది. క్షుదీరామ్ అన్నట్లే జరిగింది. ఆ రోజు రఘువీరుని మధ్యాహ్న సాయంకాల నివేదనలు, సేవలు నిర్విఘ్నంగా జరిగిపోయాయి. రాత్రి భోజనం ముగించి క్షుదీరాం, రాంకుమార్ నిద్రకు ఉపక్రమించారు. ధని వచ్చి చంద్రాదేవి గదిలోనే పడుకొంది. ఆ ఇంట్లో రఘువీరుని పూజామందిరంతోపాటు రెళ్ళ పైకప్పుగల రెండు పడక గదులు, ఒక వంట గది ఉన్నాయి. మరో చిన్నగదిలో వడ్లు దంపడానికి రోలూ, దంచిన వడ్లను ఉడకబెట్టడానికి పొయ్యి ఉన్నాయి. మరో అనువైన చోటు లేనందున చంద్రాదేవికి రెల్లుతో కప్పిన యీ చిన్నగదే పురిటి గది అయింది.

2. గదాధర్ జననం

అరుణోదయానికి ఇంకా పది నిమిషాలు ఉండగా చంద్రాదేవికి మొదటి నొప్పులు మొదలయ్యాయి. ధని సహాయంతో ఆమె వడ్లగదిలోకి వెళ్లి పడుకొంది. దాదాపు వెంటనే ఆమె ఒక మగబిడ్డను ప్రసవించింది. చంద్రాదేవికి అవసరమైన సపర్యలు చేసి ధని తన దృష్టిని బిడ్డ వైపుకు సారించింది; తను బిడ్డను ఉంచినచోట బిడ్డ కనిపించలేదు. ధని భయంతో వణికిపోయి దీపంతో గదంతా వెదకింది. రక్తసిక్తమైన నేలమీద ఉన్న బిడ్డ ఎలా దొర్లాడోగాని పొయ్యి వద్దకు దొర్లిపోయాడు. పొయ్యిలోని బూడిదలో వెల్లకిలా పడుకొని కనిపించాడు. అతడి దేహమంతా విభూతి అలదినట్లుగా ఉంది. ఇంత జరిగినప్పటికీ బిడ్డ ఏడుపు వినిపించలేదు. మెల్లగా ధని బిడ్డను లేవనెత్తి, శుభ్రంగా కడిగి ఆ దీపం వెలుగులో ఆ బిడ్డ అందాన్ని, పరిమాణాన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఆ శిశువు ఆరు నెలల బిడ్డలా ఆమెకు కనిపించాడు. చంద్రాదేవి స్నేహితురాళ్లయిన ప్రసన్నకు, లాహా కుటుంబంలోని ఇతర స్త్రీలకు కబురు పంపారు. వాళ్లు రాగానే జరిగింది ధని వాళ్లతో చెప్పింది. అతిపవిత్ర బ్రహ్మముహూర్తంలో, పరమ పావనుడైన క్షుదీరాం పర్ణకుటీరం మంగళ శంఖ ధ్వానాలతో మార్మోగింది. యుగపురుషుని అవతరణాన్ని ఆ ధ్వానాలు లోకానికి చాటిచెప్పాయి. జ్యోతిషంలో మంచి ప్రవేశమున్న క్షుదీరాం వెంటనే పుట్టిన బిడ్డ రాశిచక్రం గణించి చూశాడు. ఆ శిశువు విశేష శుభముహూర్తంలో యీ ప్రపంచంలోకి వచ్చాడని కనుగొన్నాడు.

3. గదాధర్ జనన ముహూర్తంలో గ్రహగతులు

మన్మథనామ సంవత్సరం, ఫాల్గుణ మాసం, ఆరవ దినం, శుక్లపక్షం, ద్వితీయాతిథి, బుధవారం రాత్రి ముప్పై ఒక్క గడియలకు ఇంకా అర్ధ గడియ సమయం ఉండగా బిడ్డ జన్మించాడు. అంటే ఆంగ్లమానం ప్రకారం 1836వ సంవత్సరం ఫిబ్రవరి 17వ తేదీ సూర్యోదయానికి ఇంకా పన్నెండు నిమిషాలు ఉండగా శిశువు జన్మించాడు. అప్పుడు పూర్వాభాద్ర నక్షత్రంలో ద్వితీయాతిథి కలిసి

సిద్ధయోగం తటస్థించింది. శిశువు జన్మలగ్నంలో రవి, చంద్రుడు, బుధుడు ఒకే స్థానంలో చేరారు. శుక్ర, శని, మంగళగ్రహాలు ఉచ్ఛస్థానంలో ఉన్నాయి. ఈ గ్రహాలు శిశువు అనుపమాన జీవితాన్ని సూచిస్తున్నాయి. పరాశర సంహిత ప్రకారం గణిస్తే రాహుకేతువులు ఉన్నతస్థానంలో ఉండడం గమనించవచ్చు. బృహస్పతి కూడ బిడ్డ భవితవ్యంపై విశేష శుభకర ప్రభావాన్ని చూపనున్నట్లు కానవస్తున్నది.

తదనంతరం సుప్రసిద్ధ జ్యోతిష్కులు ఆ బాలుని జాతకం గణించి, ఇలా చెప్పారు: ''ఈ బిడ్డడు శుభలగ్నంలో జన్మించాడు. జాతకరీత్యా యీ లగ్నంలో

4. జన్మరాశి రీత్యా శిశువు నామకరణం

జన్మించిన వారు సద్గుణ సంపన్నులు, మహాసమ్మాన్యులు, సదా సత్కార్యాలు ఆచరించేవారు అవుతారని జ్యోతిశ్శాస్త్రం వక్కాణిస్తున్నది. ఈతడు అనేకమంది శిష్యులతో పరివేష్టితుడై ఒక దేవాలయంలో జీవిస్తాడు. ఒక నూతన మత సంప్రదాయాన్ని నెలకొల్పుతాడు. నారాయణాంశ సంభూతుడైన మహాత్మునిగా విరాజిల్లుతాడు.''

ఆ మాటలు విని ఖుదీరాం ఎంతో విస్మయం చెందాడు. గయలో తాను పొందిన దివ్యస్వప్నం నిజంగా ఫలించిందని భగవంతునిపట్ల అతడి హృదయం కృతజ్ఞతతో పొంగిపోయింది. తరువాత అతడు శాస్త్రోక్తంగా జాతకర్మలు జరిపించి జాతకరీత్యా బిడ్డకు 'శంభుచంద్ర' అని నామకరణం చేశాడు. కాని తన అద్భుత స్వప్నం జ్ఞాపకార్థం బిడ్డను గదాధర్ అని పిలవాలని నిర్ణయించుకొన్నాడు; బాలునికి ఆ పేరే తదనంతరం స్థిరపడిపోయింది.

కనులవిందు చేసే తమ బిడ్డ ముఖారవిందం తిలకిస్తూ, అనుపమానమైన ఆతడి భవితవ్యాన్ని తలపోస్తూ ఖుదీరామ్, చంద్రమణీదేవులు తాము తరించినట్లు భావించుకోసాగారు. యుక్త సమయంలో శిశువుకు 'నిష్క్రమణ' కర్మ నిర్వర్తించారు (శిశువును ప్రప్రథమంగా ఆరుబయటకు తీసుకెళ్లే ఆచారకర్మను 'నిష్క్రమణ' కర్మ అంటారు). అమిత శ్రద్ధతో బిడ్డను పెంచాలని ఆ దంపతులు సంకల్పించుకొన్నారు.

6. గదాధర్ శైశవం - ఖుదీరామ్ మరణం

శ్రీరామ, శ్రీకృష్ణాది అవతారపురుషులు జన్మించే ముందూ, ఆ తర్వాత కూడ

1. రామ్‌చంద్రుని గోదానం

వారి తల్లి తండ్రులు ఎన్నో దివ్యదర్శనాల ద్వారా తమ బిడ్డలను దైవం రక్షిస్తూ ఉందని గ్రహించారని శాస్త్రాలు తెలుపుతున్నాయి. అయినా వారు పుత్రవ్యామోహం అనే మాయకు వశులైపోయి, తమ బిడ్డల నిజ దివ్యస్వరూపాలను మరిచిపోతారు. సామాన్య తల్లితండ్రులలాగే, ఆ బిడ్డల ఆలనపాలనల కోసం తాపత్రయపడతారు.

చంద్రాదేవి, ఖుదీరామ్‌ల విషయంలో కూడా ఇలాగే జరిగిందనాలి. కుమారుణ్ణి చూసిన తర్వాత తమ దివ్యస్వప్నాలను, దర్శనాలను వీరు మరిచిపోయారు. తమ కుమారుని ఆలనపాలన విషయంలో చింతాక్రాంతులయ్యారు. ఎలాగా? అన్న ఆలోచనలో పడ్డారు.

మేదినీపూర్‌లో ఖుదీరామ్ మేనల్లుడు రామ్‌చంద్ర బాగా సంపాదించుకుంటున్నాడు. అతడికి గదాధర్ జననం గూర్చి తెలియచేశారు. మేనమామ పేదస్థితి అతడికి తెలుసు. ఆ పేదకుటుంబంలో పిల్లవాడికి తగినన్ని పాలు దొరకవన్న విషయం కూడా తెలుసు. అందుకని మేనమామకు ఒక మంచి పాడి ఆవును పంపాడు. అలా ఖుదీరామ్‌కు పిల్లవాని పాల సమస్య తీరిపోయింది.

అలాగే పిల్లవాడికి ఎప్పుడు ఏం కావాలో అవన్నీ ఊహకు అందని రీతిలో వారికి లభిస్తూ ఉండేవి. అయినా ఆ దంపతులు పిల్లవాడి విషయమై ఎప్పుడూ ఆందోళన చెందుతూనే ఉండేవారు. అలా కాలం సాగిపోతోంది.

శిశువు పెద్దవాడవుతున్నకొద్దీ, అతడి ఆకర్షక అంశాలు ఇనుమడించ

2. గదాధర్ ఆకర్షణలు

సాగాయి. వాటితో ఆ పిల్లవాడు తల్లితండ్రులనూ కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాడు. అంతే కాదు. గ్రామంలోని స్త్రీల నందరినీ ఆకర్షించసాగాడు. ఆ స్త్రీలు, ప్రతిరోజూ

ఏదో ఒక వంకతో చంద్రాదేవి వద్దకు వచ్చి పిల్లవాడిని పరామర్శించి వెళుతుండే వారు. ''నీ బిడ్డను చూడాలన్న తపన మమ్మల్ని ఇలా లాక్కొని వస్తోంది'' అని చెప్పేవారు. ఇరుగుపొరుగు గ్రామాల్లోని ఆ దంపతుల బంధువులు కూడా, ఇప్పుడు వెనకటికన్నా తరచు వారి పేదకుటీరానికి రావడం మొదలుపెట్టారు. గదాధర్ అందరి ఆప్యాయతలకూ పాత్రుడయ్యాడు. అందరి ప్రేమలు పొందుతూ ఆరు నెలల ప్రాయానికి వచ్చాడు.

'అన్నప్రాశన' చేయవలసిన సమయం దగ్గరపడింది.

కుమారుడి 'అన్నప్రాశన' తంతును తన శక్తికి తగినట్లు సామాన్యంగా ముగించివేయాలని క్షుదీరామ్ అనుకున్నాడు. శాస్త్రోక్తకర్మలు చేయడం, కుమారునికి శ్రీ రఘువీరుని నైవేద్యం తినిపించడం, ముగ్గురు నలుగురు ముఖ్య బంధువులను పిలవడం - ఇలా ఆ శుభకార్యాన్ని పూర్తిచేయాలనుకున్నాడు. కాని అతడు అనుకొన్నదొకటైతే, అయింది మరొకటి.

ఆ ఊరి జమీందారు ధర్మదాస్ లాహా, క్షుదీరామ్ ఆప్తమిత్రుడు. అతడు క్షుదీరామ్‌కు తెలియకుండా, బ్రాహ్మణులను ప్రోత్సహించి పంపించాడు. ఆ బ్రాహ్మణులు, మరికొందరు ఊరి పెద్దలు వచ్చి, క్షుదీరామ్‌ను చుట్టుముట్టారు. అతడి కుమారుడి అన్నప్రాశన సందర్భంలో తమకు పప్పన్నం పెట్టించాలని ఒత్తిడి చేశారు. దాంతో క్షుదీరామ్ పెద్ద సంకటంలో చిక్కుకుపోయాడు. ఏం చేయాలో అతడికి పాలుపోలేదు. ఊరివారి కందరికీ అతడంటే ఎంతో గౌరవం, పూజ్యభావం ఉన్నాయి. వారిలో ఎవరినీ అతడు కాదనలేడు. అందరినీ పిలవ వలసి ఉంటుంది. కాని అందరికీ భోజనం పెట్టేంత ఆర్థికస్తోమత అతడికప్పుడు లేదుకదా! అలా అని ఇంటికి వచ్చి మరీ అడిగిన పెద్దలను నిరాకరించనూలేడు.

అతడికి ఏమీతోచక పూర్తిభారం శ్రీ రఘువీరునిపై మోపి తన ఆప్త మిత్రుడైన ధర్మదాసు వద్దకు సలహా కోసం వెళ్లాడు. అప్పుడు ధర్మదాసు ఆ కార్య భారాన్ని తనకు వదిలేసి, నిశ్చింతగా పనులు చేసుకోమని చెప్పాడు. అట్లే మిత్రు నికే అంతా వదిలేసి, క్షుదీరామ్ ఇంటికి తిరిగివచ్చాడు.

ధర్మదాస్ లాహా ఆనందంగా ఆ శుభకార్యానికి అయిన ఖర్చునంతా తానే భరించాడు. అన్ని ఏర్పాట్లూ తానే చేసి, ఆ శుభకార్యాన్ని చక్కగా జరిపిం చాడు.

ఇలా గదాధర్ 'అన్నప్రాశన'లో ఊళ్లోని పెద్దలు - పిన్నలు, బ్రాహ్మణులు అంతా పాల్గొన్నారు. మహదానందంగా రఘువీరుని ప్రసాదాన్ని స్వీకరించారు. బీదాబిక్కీ కూడా ఆ రోజు కడుపునిండా, తృప్తిగా భుజించి సంతోషించారు. అంతా గదాధర్‌ను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

ఇదంతా మేము విన్న వృత్తాంతం; దాన్నే మీకు తెలుపుతున్నాం.

రోజులు గడుస్తున్నాయి. గదాధర్ పెరుగుతున్నాడు. పెరుగుతున్నకొద్దీ అతడి చిలిపిచేష్టలు ఎక్కువయ్యాయి. వాటిని చూసి చంద్రాదేవి ఎంతో ఆనందించేది. కాని అదే సమయంలో ఏదో తెలియని భయం ఆమెను ఆవరిస్తుండేది. అతడు పుట్టడానికి ముందు ఆమె ఏ దేవతనూ ఏమీ కోరలేదు. కాని ఇప్పుడామెలోని మాతృప్రేమ కుమారుని శ్రేయస్సును కోరడం మొదలుపెట్టింది. ఆ మాతృప్రేమ కొద్దీ ఆమె దేవతలను వందల వేలసార్లు కుమారుని శ్రేయస్సుకై ప్రార్థనలు చేయసాగింది. తన కుమారుడికి ఎలాంటి చెడుగానీ, కీడుగానీ వాటిల్లకూడదని, ఎలాంటి ఆపదా రాకూడదని ఆమె ప్రార్థించేది. వినమ్రతతో వారికి ప్రణామాలు చేసేది.

3. చంద్రాదేవి దివ్యదర్శనాలు

అలా ప్రార్థనలతో ఆమె మనసు స్థిమిత పడేదికాదు. కుమారుని ఆలనాపాలనే ఆమెకు సర్వస్వం అయిపోయింది. ఆమె ధ్యాస సదా కొడుకు యోగక్షేమాల గురించే! ఆ కారణంగా ఆమెలోని దివ్యదర్శనాలను చూసే శక్తి తగ్గుముఖం పట్టింది. కాని అది పూర్తిగా తగ్గలేదు. అప్పుడప్పుడు ఒకటీ అర కలుగుతూనే ఉండేవి. అవి కలిగినప్పుడు ఆమెలో భయం, విస్మయం రెండూ జనించేవి. తన కుమారునికి ఎలాంటి చేటు మూడుతుందోనని గాబరాపడేది.

అలాటి ఒక సంఘటనను మేము అతినమ్మకస్తుల ద్వారా విన్నాం. దాన్ని పాఠకులకు తెలియచేస్తున్నాం.

4. గదాధర్, చంద్రాదేవికి 'పెద్దవాడు'గా కన్పించడం

అప్పటికి గదాధర్‌కు యింకా ఎనిమిది నెలలు కూడా నిండలేదు. ఒకరోజు ఉదయం ఆ పిల్లవాడికి పాలిచ్చి పడుకోబెట్టి దోమతెర కప్పి, చంద్రాదేవి ఇంటి పనులు చేసుకోసాగింది. కొంతసేపటికి గదిలోకి వచ్చి పిల్లవాడివైపు చూసి విభ్రాంతురాలైంది. దోమతెరలో తన పిల్లవాడు కనిపించలేదు. పైగా అక్కడ పొడవైన ఒక అపరిచిత పురుషుడు కనిపించాడు! ఆ పురుషుడు మొత్తం మంచాన్నంతా ఆక్రమించేసి ఉన్నాడు! ఆ దృశ్యం చూసి చంద్రాదేవి భయంతో నిలువునా వణికిపోయింది. పెద్దగా కేకవేస్తూ బయటికి పరిగెత్తి, భర్తను పిలిచింది. అతడు కంగారుపడుతూ రాగానే, తాను చూసిన విషయమంతా చెప్పి "పిల్లవాడు లే"డని ఏడుపుముఖం పెట్టింది.

ఖుదీరామ్, భార్యతో కూడ గదిలోకి వెళ్లి చూశాడు. అక్కడ అలాంటి పురుషు డెవరూ కనిపించలేదు. పిల్లవాడు హాయిగా నిద్రపోతున్నాడు. చంద్రాదేవికి అంతా ఆశ్చర్యంగా, అగమ్యగోచరంగా ఉంది. అంతకు క్రితం తనకు కనిపించిన వ్యక్తి ఏమైనట్లు? ఆ ఆలోచన రాగానే, ఆమెలో భయం మళ్లీ తలెత్తింది.

''నిజం. కళ్లారా చూశాను. ఈ మంచం మీదే ఆ వ్యక్తి కనిపించాడు. నేనేమీ భ్రమపడలేదు. అలా జరిగే అవకాశమే లేదు. నాకేదో భయంగా ఉంది. ఏ దయ్యమో, ఏ క్షుద్రదేవతో నా బిడ్డణ్ణి ఆవహించిందేమో! త్వరగా ఓ మంచి భూతవైద్యుణ్ణో, మంత్రగాడినో తోడ్కొనివచ్చి బిడ్డను వచ్చి చూపించండి. మన బిడ్డకు ఏదైనా కీడు వాటిల్లుతుందేమో!'' అంటూ భయం భయంగా భర్తను వేడుకుంది.

ఖుదీరామ్ అంతా విని, ఆమెను ఊరడించాడు.

''చూడు! మన ఈ అబ్బాయి పుట్టడానికి ముందు మనమెన్ని దివ్య దర్శనాలు చూశాం; ధన్యులమయ్యాం. అలాంటి దర్శనాలు ఇప్పుడు కూడా కలుగుతున్నాయి. ఇదీ అలాంటిదే. దీన్ని గూర్చి నువ్వు ఎలాంటి భయమూ చెందవలసిన అవసరం లేదు. ఏ క్షుద్రదేవత పనీ కాదిది. ఇంట్లో శ్రీ రఘువీరుడున్నప్పుడు ఇక క్షుద్రశక్తులు ఎలా వస్తాయి? అబ్బాయికి ఎలా కీడు చేస్తాయి? అలాంటి చింతలేవీ పెట్టుకోకు. అంతా రఘువీరుడు చూసుకొంటాడు. మరొక్క విషయం! ఈ సంఘటన గూర్చి ఎవరికీ ఏమీ చెప్పకు'' అని చెప్పి, ఆమెలోని మానసికక్షోభను ఖుదీరామ్ తొలగించాడు.

భర్త ఊరడింపుతో ఆమెలోని భయం కాస్త తగ్గింది కాని తన ముద్దుల తనయునికి ఏం జరుగుతుందోనన్న సంకోచం మాత్రం ఆ తల్లి హృదయం నుండి పూర్తిగా తొలగిపోలేదు.

ఆ రోజు శ్రీ రఘువీరుని ముందు రెండు చేతులు జోడించి అలాగే చాలాసేపటివరకు నిలబడిపోయింది. మౌనంగానే శ్రీ రఘువీరుని వేడుకుంది. తన కుమారుడికి ఏ కీడూ రాకుండా చూడమని ప్రాధేయపడింది.

5. 'సర్వమంగళ' జననం

కాలగమనంలో సంవత్సరాలు దొర్లిపోయాయి. ఈ మధ్యకాలంలో గదాధర్‌కు తోడుగా ఒక చెల్లెలు కూడ జన్మించింది. ఆనందం, ఆందోళన, ఉల్లాసం, ఆవేదన ఇలాంటి అనేక రకాల ఆటుపోటులతో చంద్రాదేవి, ఖుదీరామ్‌ల జీవితం గడిచిపోసాగింది. గదాధర్ తియ్యని చేష్టలు వారిని మరింత దృఢంగా ఆకట్టుకున్నాయి. ఆ అబ్బాయిపైన వారి ప్రేమ మరింత ప్రగాఢం కాసాగింది. ఇలాంటి దశలో చంద్రాదేవికి మరొక ఆడశిశువు జన్మించింది. ఆ శిశువే గదాధర్ చెల్లెలు 'సర్వమంగళ'.

6. గదాధర్ విద్యారంభం

పెద్దవాడవుతున్నకొద్దీ గదాధర్‌లో గొప్ప తెలివితేటలు, ప్రజ్ఞ చూసి, ఖుదీరామ్ విస్మయానందాలు చెందేవాడు. తన చిలిపి కుమారుణ్ణి ఒడిలో కూర్చోపెట్టుకుని, అతడు తమ పూర్వీకుల పేర్లను చెప్పేవాడు. చిన్నచిన్న దేవతాస్తుతులను, వందన శ్లోకాలను వినిపించేవాడు. రామాయణ మహాభారతాల నుండి మంచి కథలు చెప్పేవాడు.

గదాధర్‌లో విశేషగ్రహణశక్తి ఉండేది. ఒకమారు వింటే చాలు, ఏదైనా ఆ బాలుడికి అట్లే జ్ఞాపకం ఉండిపోయేది. దీన్నే ఏకసంథాగ్రహణం అంటారు. అలా తండ్రి చెప్పిన స్తోత్రాలు, కథలు ఆ బాలుడికి కంఠస్థం అయిపోయాయి. చాలాకాలం తర్వాత అడిగినా, వాటిని తు.చ. తప్పకుండా అప్పగించేవాడు.

ఖుదీరామ్ ఈ విశిష్టతను గమనించాడు. అతడికి గదాధర్‌లో మరోవిశేషం కూడ కనిపించింది. ఆ అబ్బాయి కొన్ని విషయాలను ఎంతో ఆసక్తితో, శ్రద్ధగా విని అర్థం చేసుకునేవాడు. కాని మరికొన్నింటిని అసలు పట్టించుకునేవాడే కాదు. ఎంత ప్రయత్నం చేసినా, ఆ విషయాలు అతడి బుర్రకెక్కేవికావు. అసలు అటు వైపు ధ్యాసే ఉండేది కాదతడికి. 'లెక్కపెట్టడం' ఎలాగో నేర్పడానికి ప్రయత్నిస్తే, అసలు అదతనికి వచ్చేది కాదు. 'ఇంకా పిల్లవాడేకదా, ఇంత చిన్నవయస్సులో వాటిని నేర్చుకోలేడు' అని ఖుదీరామ్ సరిపెట్టుకునేవాడు.

అయితే గదాధర్ చిలిపిచేష్టలు ఎక్కువ అవడం చూసి, ఖుదీరామ్ అతడికి ఐదవఏట 'అక్షరాభ్యాసం' చేయించి, బడిలో వేశాడు. తన తోటివయసు పిల్లలను చూసి గదాధర్ ఎంతో సంతోషించాడు. తన వినయవిధేయతలతో ఉపాధ్యాయుల మనసు చూరగొన్నాడు. తన ప్రేమ వర్తనంతో సాటి విద్యార్థులకందరికీ ప్రేమపాత్రుడయ్యాడు.

లాహాబాబులు ఆ గ్రామానికి జమీందారులు. వారి ఇంటి కెదురుగా విశాలమైన నాట్యమండపం ఉండేది. అందులోనే పాఠశాల నడుస్తూ ఉండేది.

7. లాహాబాబుల పాఠశాల

వారే తమ ఖర్చుతో ఒక ఉపాధ్యాయుణ్ణి ఏర్పాటు చేశారు. అతడు లాహాల పిల్లలకు, ఊరి పిల్లలకు కూడ చదువు చెప్పేవాడు. అలా లాహాబాబులే తమ ఊరి పిల్లల చదువుసంధ్యల కోసం బడిని ఏర్పాటు చేశారని చెప్పవచ్చు.

ఖుదీరామ్ పూరింటికి ఈ బడి చాలా దగ్గరిలోనే ఉండేది. బడి రోజుకు రెండుసార్లు, అంటే ఉదయం, మధ్యాహ్నం నడుస్తూ ఉండేది. విద్యార్థులు ఉదయమే వచ్చేవారు. రెండు మూడుగంటలు చదువుకుని, భోజనాదుల కోసం ఇళ్లకు వెళ్లేవారు. మళ్లీ మధ్యాహ్నం మూడు గంటలకొచ్చి, చీకటి పడేలోగా పాఠాలు చదువుకుని వెళ్లిపోయేవారు.


లాహాబాబుల పాఠశాల

గదాధర్‌లాంటి చిన్నపిల్లలు బడిలో అంతసేపు గడపవలసిన అవ

సరం ఉండేది కాదు. కాని ఆ పిల్లలు బడికి వెళ్లి హాజరు చెప్పవలసి వచ్చేది. ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నప్పుడు మాత్రం నేర్చుకునేవారు. మిగతా సమయాల్లో దగ్గరలోని మైదానంలో ఆడుకునేవారు.

బడిలోని పాతవిద్యార్థులు, కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు. చెప్పిన పాఠాలను వారు నేర్చుకుంటున్నారో లేదోనని కూడా చూసేవారు.

ఇలా ఉపాధ్యాయుడు ఒక్కడే అయినా, బడి పని మాత్రం చక్కగా జరుగుతూ ఉండేది. గదాధర్ పాఠశాలలో చేరినప్పుడు, శ్రీ యదునాథ్ సర్కార్ అనే ఉపాధ్యాయుడు ఉండేవాడు. కొంతకాలం తర్వాత ఏ కారణంచేతనో అతడు ఆ ఉద్యోగం మానుకున్నాడు. అతడి స్థానంలో శ్రీ రాజేంద్రనాథ్ సర్కార్ అనే వ్యక్తి ఉపాధ్యాయునిగా చేరాడు.

గదాధర్ పుట్టడానికి పూర్వమే ఖుదీరామ్‌కు కొన్ని దివ్యస్వప్నాలు, దర్శనాలు కలిగాయి కదా! అవి ఆ అబ్బాయి అద్భుత భావిజీవితాన్ని సూచిస్తుండడం కూడ ఖుదీరామ్‌కు తెలుసు కదా! అందుచేత ఆ జ్ఞాపకాలు అతడి మనోఫలకంపైన స్థిరంగా ముద్రితమైపోయాయి. అందుకే గదాధర్ పట్ల అతడు మామూలుగా కఠినంగా ఉండేవాడు కాదు. ఎప్పుడైనా ఏవైనా తుంటరి పనులు చేసినా కుమారుణ్ణి మందలించేవాడే తప్ప, కఠినంగా శిక్షించేవాడు కాడు. అందరూ అతిగారాబం చేయడంచేత, అందరూ అతిగా ప్రేమించడంచేత కుర్రవాడిలో కాస్త మొండితనం అలవడి ఉంటుందని సరిపెట్టుకునేవాడు. కాని ఆ మొండితనం విషయంలో అందరు తండ్రుల్లా అతడు తన కుమారుణ్ణి కొట్టడం, శిక్షించడంలాంటివి చేసేవాడు కాదు. ఆ మొండిపట్టే కుర్రవాడి భావి ఉన్నతికి దారితీస్తుందని అనుకునేవాడు. ఇలా అతడనుకోవటానికి కారణాలు కూడ ఉన్నాయి.

8. గదాధర్ విచిత్ర ప్రవృత్తి

ఖుదీరామ్ చాలాసార్లు గదాధర్ ప్రవర్తనను నిశితంగా పరిశీలించి ఉన్నాడు. అప్పుడప్పుడు గదాయ్ బడికి వెళ్లకుండా స్నేహితులతోపాటు ఊరి బయటకు వెళ్లి ఆటలాడుకునేవాడు. దగ్గరలో ఏవైనా నాటకాలు జరుగుతుంటే (వీధి నాటకాలు) ఎవరికీ చెప్పకుండా వెళ్లి చూసేవాడు. అలా తాను అనుకొన్న పనిని పూర్తిగా నెరవేర్చే స్వభావాన్ని ఖుదీరామ్, గదాయ్‌లో గమనించాడు. మరొక విషయం ఏమిటంటే, గదాయ్ ఏ విషయంలోనూ ఎప్పుడూ ఎలాంటి అబద్ధాలూ చెప్పి ఎరుగడు. తాను చేసిన పనిని దాచడానికి ఎన్నడూ ప్రయత్నించేవాడు కాడు. ఉన్నది ఉన్నట్లు చెప్పేవాడు. అంతేకాదు, అతడి హృదయంలో ఎప్పుడూ ఎవరికీ ఎలాంటి కీడూ చేయాలన్న తలంపే ఉండేది కాదు.

కాని ఖుదీరామ్‌కు ఒక్క విషయంలో మాత్రం ఆందోళన కలిగింది. ఒక పనిని చేయమని లేదా చేయకూడదని గదాయ్‌కు చెబితే, అతడు దాన్ని వెంటనే అమలుపరిచేవాడు కాడు. ఆ పని అతడికి పూర్తిగా అర్థం అయ్యేటట్లు, అతడి హృదయాన్ని స్పృశించేటట్లు వివరించవలసి వచ్చేది. అలా చేయకపోతే, గదాయ్ చెప్పిన పనికి పూర్తిగా వ్యతిరేకంగా ప్రవర్తించేవాడు. అంటే ప్రతివిషయాన్నీ కూలంకషంగా అవగాహన చేసుకోవాలి - అన్న అతడి స్వభావాన్ని ఇది సూచిస్తుంది.

'అయితే పిల్లల ఇలాంటి మొండి ప్రవర్తనను లోకం సాధారణంగా సహించదు. పిల్లలకు అన్ని విషయాలనూ వివరించి చెప్పేందుకు సిద్ధపడదు. వారి జిజ్ఞాసను సంతృప్తి పరచదు. అలాంటి స్థితిలో గదాయ్ మొండిగా సంఘంలోని కట్టుబాట్లను, ఆచారవ్యవహారాలను కాదని త్రోసిపుచ్చే ప్రమాదముంది' అని ఖుదీరామ్ ఆందోళన చెందేవాడు.

అతని కీ ఆందోళన కలగటానికి ఒక చిన్న సంఘటన కారణమైంది.

ఖుదీరామ్ ఇంటికి దగ్గరలో 'హాల్దార్‌పుకూర్' అనే పెద్ద చెరువొకటి ఉంది. గ్రామస్థులంతా త్రాగటానికి, స్నానాదులకు, వంటకు ఆ చెరువు నీటినే

9. దానిని సూచించే ఒక సంఘటన

వాడుకునేవారు. ఆ చెరువులో స్నానం చేయటానికి ఆడవారికి, మగవారికి రెండు వేర్వేరు ప్రత్యేక స్నానఘట్టాలున్నాయి. గదాధర్‌లాంటి చిన్నపిల్లలు సాధారణంగా స్నానంకోసం ఆడవారి స్నానఘట్టానికే వెళ్లేవారు.

ఒకరోజు గదాయ్ కొంతమంది తన వయస్సు పిల్లలతో స్నానానికి ఆ ఘట్టానికి వెళ్లాడు. చెరువులో దూకుతూ, ఈతలు కొడుతూ నానాగందరగోళం చేశాడు. స్నానం చేయడానికి వచ్చిన ఆడవారికి, వీరి ఈతలు చాలా ఇబ్బంది కలిగించాయి. చెరువు ఒడ్డున కూర్చుని నిత్యపూజాప్రార్థనాదులు చేస్తున్న ప్రౌఢ స్త్రీలపైన నీటిజల్లులు పడసాగాయి. అది చూసి ఆ స్త్రీలు యీ పిల్లలను అలా చేయవద్దని ఎన్నోసార్లు వారించారు. అయినా పిల్లలు వినలేదు. ఒక స్త్రీకి వారి చేష్టలు చాలా కోపం తెప్పించాయి.

''ఆడవాళ్లుండేచోట మగపిల్లల కేం పనిరా? మగవాళ్ల స్నానఘట్టానికి వెళ్లి ఈతలు కొట్టుకోండి. స్నానం చేసిన తర్వాత ఆడవాళ్లు బట్టలు ఉతుక్కుంటారు కదా, ఆడవాళ్లను నగ్నంగా చూడడం తప్పని తెలియదా?'' అని గట్టిగా మందలించింది.

ఆ మాటలు విని గదాయ్, ఆవిడ వద్దకొచ్చి ''ఎందుకు చూడకూడదూ? తప్పెలా అవుతుందీ?'' అని అమాయకంగా ప్రశ్నించాడు.

ఎందుకో, ఏమిటో ఆ కారణాన్ని ఆవిడ చెప్పలేదు. పైగా ఆ ప్రశ్న విని మరింత మండిపోయి తిట్టిపోసింది. ఆ తిట్లు విని మిగతా పిల్లలంతా చల్లగా అక్కడ నుండి జారుకున్నారు. కాని గదాయ్ అంతటితో ఊరుకోలేదు. ఒక ఉపాయం పన్నాడు. రెండు మూడు రోజు లతడు వరుసగా చెట్ల చాటు నుండి, స్నానంచేసే స్త్రీలను చూశాడు. చూసి, మరుసటి రోజు తనను మందలించిన స్త్రీ వద్దకు వచ్చాడు.

''మొన్నటి రోజున నలుగురు ఆడవాళ్ల స్నానం చేస్తుంటే చూశాను, నిన్న ఆరుమందిని చూశాను. ఇవ్వాళ ఎనిమిది మందిని చూశాను. కాని నా కేమీ కాలేదు కదా, మరి అది తప్పెలా అవుతుందీ?'' అని అమాయకంగా, సూటిగా అడిగాడు.

ఆ మాటలు విని ఆ స్త్రీ క్షణకాలం నివ్వెరబోయింది.

ఆ తర్వాత చంద్రాదేవికి ఇదంతా నవ్వుతూ చెప్పింది. చంద్రాదేవికి విషయం అర్థమైంది. ఒక రోజు గదాయ్‌ను దగ్గరకు తీసుకుని, ప్రేమతో ఇలా చెప్పింది:

''అలా చూసినందువల్ల నీకేమీ కాదు, నిజమే. కాని అది తప్పే. ఎందు కంటావా, ఆడవారికి అది చాలా సిగ్గుగా, బాధగా ఉంటుంది. ఆ ఆడవాళ్లు కూడా నా లాంటివారే కదా! వారిని బాధపెట్టడం అంటే, నన్ను బాధపెట్టినట్లే అవుతుంది. అందుచేత ఆడవారికి సిగ్గూ, కష్టమూ కలిగించే పనులు ఇక నువ్వు చేయవద్దు. అలాచేస్తే నా కెంతో కష్టంగా ఉంటుంది. మరి నన్ను బాధ పెట్టడం నీ కిష్టమా, చెప్పూ?'' అని వివరించి చెప్పింది.

ఆమె మాటలతో గదాయ్‌కు విషయం అర్థం అయింది. తాము స్నానం చేస్తుండగా ఎవరైనా మగవాళ్లు చూస్తే, ఆడవాళ్లకు కష్టం కలుగుతుందని తెలుసుకున్నాడు. ఒకరిని కష్టపెట్టే పనిని తానెందుకు చేయాలీ? చేయకూడదని నిర్ణయించుకున్నాడు.

ఆ క్షణం నుండి అతడు మళ్లీ అలా ఎన్నడూ ప్రవర్తించలేదు.

గదాధర్ చదువు చక్కగానే సాగుతోంది. కాస్త చదవనూ, వ్రాయనూ అతడు నేర్చుకున్నాడు. లెక్కలంటే అతడికి మునుపటి ఏహ్యభావం అట్లే ఉంది. ఇతరులను అనుకరించడంలో అతడికి అతడే సాటి అని చెప్పాలి. అతడిలోని సహజప్రతిభ అనేక రకాలుగా వ్యక్తం కాసాగింది.

10. గదాధర్ విద్యాభ్యాస పురోగతి

గ్రామంలో కుమ్మరులు దేవీదేవతల బొమ్మలు తయారుచేసేవారు. గదాయ్ వారి వద్దకు తరచూ వెళుతూ, వారి పనితనాన్ని నిశితంగా పరిశీలిస్తూ,

ఆ కళను నేర్చుకున్నాడు. ఇంటివద్ద తానుకూడ బొమ్మలు తయారు చేసేవాడు. అది అతడి కో వినోదక్రీడ అయింది.

అలాగే అతడు చిత్రకళను కూడ నేర్చుకున్నాడు. చిత్రాలు వేసేవారిని చూసి, ఆ కళలో కూడ ప్రావీణ్యం పొందాడు. ఊళ్లో ఎక్కడైనా పురాణ కథాకాల క్షేపాలు జరుగుతుంటే, వెళ్లి వినేవాడు. ఎక్కడైనా వీథినాటకాలు ఆడుతుంటే, వెళ్లి చూసేవాడు. వినడం, చూడడంతో ఊరుకునేవాడు కాదు, వాటిని ఎలా చెబితే శ్రోతలకు, ప్రేక్షకులకు మనోహరంగా ఉంటుందో, అలా తాను అనుక రించి చూపేవాడు. అతడి అద్భుత జ్ఞాపకశక్తి, నిశితదృష్టి ఈ విషయాల్లో అతడికి ఎంతో ఉపకరించాయి.

గదాయ్‌కు అద్భుత అనుకరణశక్తి ఉండేది. పైగా అతడు వినోదప్రియుడు. ఈ రెండు కారణాల వల్ల ఆ చిన్న వయసులోనే అతడు స్త్రీ, పురుషుల రకరకాల హావభావాలను అనుకరిస్తూ, అందరికీ వినోదాన్ని కలిగించేవాడు. అతడిలో సహ జంగా భక్తిశ్రద్ధ లుండేవి. అవి అతడి తల్లితండ్రుల నిత్యానుష్ఠానాలతో మరింత ఇనుమడించాయి. పెద్దవాడైన తర్వాత కూడ అతడు తల్లిదండ్రుల దినచర్య మూలంగా తాను పొందిన స్ఫూర్తిని మరచిపోలేదు. వారికి తాను ఎప్పటికీ ఋణ పడి ఉన్నాననే అనుకునేవాడు.

కాలాంతరంలో దక్షిణేశ్వరాలయంలో మేం ఆయన శుశ్రూషలో ఉన్నప్పుడు, మా కా విషయాలన్నీ చెప్పేవారు.

''మా అమ్మ పట్టి అమాయకురాలు. లౌకిక విషయాలు పాపం ఆమె కేమీ అర్థమయ్యేవి కావు. డబ్బు లెక్కించడం కూడ ఆమెకు చేతనయ్యేది కాదు. ఎవరితో ఏ విషయం చెప్పాలన్న వివేకం ఆమెకు మృగ్యం. అందుచేత తన కడుపులోని విషయాల నన్నింటినీ ఎవరికి పడితే వారికి చెప్పివేసేది. అది చూసి లోకులు ఆమెను 'వెర్రిబాగుల్ది' అంటూ నవ్వుకునేవారు. అందరికీ అన్నం పెట్ట డానికి పూనుకునేది. మా నాన్న నిమ్నకులస్థుల నుండి ఎలాంటి దానాలూ పుచ్చుకునేవాడు కాదు. రోజంతా పూజ, జపం, ధ్యానాదులలో గడిపేవాడు. నిత్యం సంధ్యావందనం చేసేవాడు. అప్పుడాయన ఛాతీ ఉబికి ఎర్రగా మారి పోయేది. కళ్ల నుండి బాష్పాలు కురుస్తూ ఆ ఎదను తడిపేవి. విశ్రాంతి సమ యాల్లో ఆయన రఘువీరుని అలంకరణ కోసం పూలమాలలు కడుతూ కూర్చునేవాడు. ఆయన ఎంతో నిక్కచ్చి మనిషి. దొంగసాక్ష్యం యిమ్మని ఒకరు ఒత్తిడి చేసినప్పుడు, తన తండ్రి తాతల ఆస్తిని సైతం వదలుకున్నాడు గానీ, అలాంటి పాపిష్టిపని చేయలేదు. ఆయన జీవితాన్ని చూసి, గ్రామస్థులంతా ఆయనను ఒక ఋషిగా గౌరవించేవారు.''

ఇలా గదాయ్ తల్లిదండ్రుల పట్ల జీవితాంతం ఎలా కృతజ్ఞుడై ఉన్నాడో దీని మూలంగా మనకు తెలుస్తున్నది.

రోజులు గడిచిపోతున్నకొద్దీ, గదాధర్ వ్యక్తిత్వం క్రమక్రమంగా అభివ్యక్తం కాసాగింది. అలా అతడి ధైర్యసాహసాలు కూడ చాలాసార్లు వ్యక్తమయ్యాయి.

11. గదాధర్ సాహసం

పెద్దపెద్దవారే వెళ్లటానికి భయపడే దయ్యాల ప్రాంతాలకు అతడు ధైర్యంగా వెళ్లి వస్తుండేవాడు. అతని అత్త 'రామశీల'. ఆమెను అప్పుడప్పుడు 'శీతలాదేవి' పూనేది. ఆ పూనకంలో ఆమె అదోతరహాగా ప్రవర్తించేది. ఒకసారి ఆమె క్షుదీరామ్ ఇంట్లో కొన్నాళ్లుంది. అప్పుడు ఓ రోజు ఆమెకు పూనకం వచ్చింది. ఇంట్లోవారంతా ఎంతో భయపడిపోయారు. గదాధర్ మాత్రం అసలు భయపడలేదు. పైగా ఆమెను నఖశిఖ పర్యంతం పరిశీలించి చూశాడు. అంతేకాదు, ఆమెకు దగ్గరగా వెళ్లి, ఆమెలోని మార్పును పరీక్షించాడు. అలా పరీక్షించి, ఆ తర్వాత ''అత్తను పూనిన శక్తి నన్ను కూడ పూనితే ఎంతో బాగుండేది'' అన్నాడు.

కామార్పుకూర్‌కు ఉత్తరంగా అరక్రోసు దూరంలో భూర్‌సుబో అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో మాణిక్‌రాజా అనే జమిందారున్నాడు. అతణ్ణి గూర్చి ఇదివరకే కొంత చెప్పాం. అతడు భక్తుడు, ఉదారుడు, దానశీలి. క్షుదీరామ్ భక్తినిష్ఠలు, ధార్మికజీవితం అతణ్ణెంతో ఆకర్షించాయి. అందుచేత క్షుదీరామ్‌తో స్నేహం చేశాడు. త్వరలోనే వారిద్దరు ప్రాణస్నేహితులయ్యారు.

ఒకరోజు క్షుదీరామ్, గదాయ్‌ను తీసుకుని మాణిక్‌రాజా ఇంటికి వెళ్లాడు. అప్పటికి గదాధర్‌కు ఆరేళ్లుంటాయి. గదాయ్, క్షణంలో కొత్తా పాతా అంటూ

12. అందరితో కలివిడిగా మెలగడం

ఏమీ లేకుండా ఇంట్లోని వారందరితో కలసిపోయాడు. వారికి సైతం ఆ పిల్లవాడంటే ఎందుకో విపరీతమైన ఆకర్షణ ఏర్పడింది. శ్రీరామజయ వంద్యోపాధ్యాయ, మాణిక్‌రాజా తమ్ముడు. అతడు గదాయ్‌ను చూసి, ''నీ కుమారుడు సామాన్యుడు కాడు సుమా! ఇతడిలో దైవాంశ కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. కాబట్టి నువ్వెప్పుడు ఈ వైపు వచ్చినా, గదాయ్‌ను వెంటతీసుకుని రావాలి. ఈ అబ్బాయిని చూస్తుంటే, నా కెంతో ఆనందం కలుగుతోంది'' అన్నాడు క్షుదీరామ్‌తో. కాని అనివార్యకారణాలవల్ల క్షుదీరామ్ చాలాకాలందాకా మళ్లీ మాణిక్‌రాజా ఇంటికి వెళ్లలేకపోయాడు. అప్పుడు మాణిక్‌రాజా స్వయంగా ఒక ఆడమనిషిని ఇంటికి పంపించి, గదాయ్ క్షేమసమాచారాలు తెలుసుకుని రమ్మనీ, వీలయితే గదాయ్‌ను వెంటబెట్టుకుని రమ్మనీ చెప్పాడు. క్షుదీరామ్ అలాగే కుర్రవాడిని పంపించాడు. గదాయ్ కూడా ఎంతో ఆనందంతో మాణిక్‌రాజా ఇంట్లో రోజంతా గడిపాడు. సాయంకాలం

ఆ పిల్లవాణ్ణే తిరిగి పంపుతూ, అతడికి మిఠాయిలు, ఆభరణాలు కానుకగా మాణిక్‌రాజా ఇంటివారు యిచ్చారు.

ఈ బ్రాహ్మణ కుటుంబానికి క్రమంగా గదాయ్ అతి సన్నిహితుడై పోయాడు. కొన్నిరోజుల వరకూ ఖుదీరామ్ 'భూర్‌సుబో'కు పోకుంటే, మనిషిని పంపి పిల్లవాడిని వారు పిలిపించుకునేవారు. గదాయ్ వారికి అంత ప్రేమపాత్రుడయ్యాడు.

కాలప్రవాహంలో మరో సంవత్సరం గడిచింది. గదాయ్‌కు ఏడవ ఏడు వచ్చింది. రోజులు గడిచేకొద్దీ ఆతడి మధురస్వభావం మరింత మనోహర మయింది. అందరికీ అతడు మరింత ప్రియతము డయ్యాడు. ముఖ్యంగా ఊళ్లోని స్త్రీలకు అతడంటే అమిత ఆకర్షణ ఏర్పడింది. తమ ఇంట్లో ఏవైనా పిండివంటలు, మిఠాయిలు చేసుకుంటే, ముందుగా గదాయ్‌కు వాటిని పెట్టాలని ఆతురతపడేవారు. ఇక సాటికుర్రవాళ్లు, ఆడపిల్లలు తాము తెచ్చుకున్న తినుబండారాలను అతడితో పంచుకుని తిన్నప్పుడే ఎంతో సంతృప్తి చెందేవారు. చుట్టుప్రక్కలవాళ్లు ఆ కుర్రవాడి చక్కని నడవడికను చూసి, వీనులవిందు చేసే పాటలు విని, తియ్యని పలుకులు ఆలకించి, ఎంతో ముగ్ధులయ్యేవారు. ఆ ఆనందంలో అతడి చిలిపి చేష్టలను వారు సంతోషంతో సహించేవారు.

13. గదాధర్ కల్పనా శక్తి వికాసం

ఈ దశలోనే ఒక సంఘటన జరిగింది. అది గదాయ్ తల్లితండ్రులను, బంధువులను ఎంతో ఆందోళనకు గురిచేసింది. దైవానుగ్రహంతో గదాయ్ ఆరోగ్యంగా బలిష్ఠంగానే ఉన్నాడు. అంతవరకూ అతడికి ఏ రుగ్మతా రాలేదు. అందుచేత అతడు సంతోషంగా, విహంగంలా స్వేచ్ఛగా తిరుగుతుండేవాడు. 'దేహధ్యాస లేకుండా ఉండడమే పూర్ణ ఆరోగ్య లక్షణం' అని వైద్యులు చెబుతారు. గదాయ్‌కు జన్మతః ఇలాంటి ఆరోగ్యమే ఉండేది. అతడి మనస్సు సహజంగానే ఏకాగ్రమై ఉండేది. అలాంటి ఏకాగ్రమైన మనసు ఏదైనా విషయం పట్ల ఆకర్షింప బడితే అప్పుడతనికి దేహస్పృహ పూర్తిగా లుప్తమైపోయేది. అతడి మనసు ఆ విషయంతో తాదాత్మ్యమైపోయేది. చల్లగా వీచే పిల్లగాలులకు నాట్యంచేసే విశాలమైన పచ్చికబయళ్లు, గలగలా నిరంతరం ప్రవహించే నిర్మల నదీజలాలు, పక్షుల మధుర కూజితాలు, సువిశాల నీలాకాశం, ఆ గగనతలంలో క్షణక్షణం రూపాలు మార్చుకునే మబ్బుల సముదాయం, ఇలాంటి మనోహర రమణీయ దృశ్యాలు అతడి దృష్టిని ఆకర్షించేవి. తమలో దాగిన రహస్యాలను, మహిమలను ఆ బాలుని ఆంతరిక దృష్టికి గోచరింపచేసేవి. అతడిలోని భావుకతను జాగృతం చేసేవి. దానితో ఆ దృశ్యాలు చూడగానే అతడు సర్వమూ మరిచి ఆ సుదూర భావనా

ప్రపంచంలో విహారం చేసేవాడు. మేం వివరించబోతున్న క్రింది అనుభవానికి మూలం ప్రకృతి సౌందర్యం పట్ల బాలుని ఆధ్యాత్మికపరమైన ప్రవృత్తి లోనిదే.

ఒక రోజు గదాయ్ పొలాల మధ్య నడుస్తూ వెళుతున్నాడు. చుట్టూ పచ్చని పంటపొలాలున్నాయి. అతడు అలా వెళుతూ ఆకాశంవైపు చూశాడు. ఆకాశంలో నల్లని కారుమబ్బులున్నాయి. ఆ నల్లని కారుమబ్బుల కింద నుండి తెల్లని కొంగలు మెరుపుతీగెలా బారులుతీరి ఎగురుతూ వెళుతున్నాయి. ఆ దృశ్యం ఎంత మనోహరమైనదో చూసి ఆనందించాల్సిందే. ఆ రమణీయ దృశ్యాన్ని చూడగానే గదాయ్ పరవశుడై మైమరచిపోయాడు. దానితో స్పృహతప్పి పడిపోయాడు.[1] ఆ అబ్బాయిని ఆ స్థితిలో చూసి, స్నేహితులు కంగారుపడిపోయి, ఇంటికి తీసుకువెళ్లి, విషయం తెలియచేశారు. కాసేపటికి గదాయ్‌కు స్పృహ వచ్చింది; అతడు మామూలు మనిషయ్యాడు.

గదాయ్‌కు జరిగిన ఈ సంఘటనను తెలుసుకుని చంద్రాదేవి, ఖుదీరాం ఎంతో ఆందోళన చెందారు. పుత్రప్రేమ కదా! ఇలాంటివి ఇకముందు జరుగకుండా ఉండేలా వారెన్నో జాగ్రత్తలు వహించారు. పిల్లవాడికి మూర్ఛరోగం లాంటివి ఏమైనా ఉన్నాయేమోనని అనుమానించారు. దానికోసం మందులూ మాకులు ఇప్పించాలా లేక శాంతిక్రియలు చేయించాలా అన్న సందిగ్ధంలో పడ్డారు. కాని గదాయ్ మాత్రం దీన్నంత తీవ్రంగా తీసుకోలేదు. ఆ స్థితిలో తన మనస్సు ఒక అపూర్వ వినూత్న భావనలో విలీనమైందని, ఆ కారణంగానే తనకలాంటి స్థితి కలిగిందని చెప్పాడు. పైగా తాను బాహ్యస్మృతి కోల్పోయినా, లోపల మాత్రం తానొకానొక దివ్యానందాన్ని అనుభవించానని అన్నాడు. ఇదే విషయాన్ని అతడు ఎన్నోసార్లు చెప్పాడు.... అయితే అలాంటి అవస్థ అతడికి మళ్లీ కలుగకపోవడం వల్ల, అతడి ఆరోగ్యం కూడా మామూలుగానే ఉండటం వల్ల, ఎవరు కూడా అతడి మాటలను పట్టించుకోలేదు. అది తప్పకుండా ఏదో వాతదోషం అయి ఉంటుందని అనుకున్నాడు ఖుదీరామ్. అయితే చంద్రాదేవి మాత్రం ఏదో దయ్యంవల్లే అలా జరిగిందని అనుకుంది.

ఈ సంఘటన కారణంగా, ఆ దంపతులు కొంతకాలం వరకు గదాయ్‌ను బడికి పంపలేదు. దానితో గదాయ్‌కు మరింత స్వేచ్ఛ లభించింది. చుట్టు ప్రక్కల

---

1. ''సాధకభావం - రెండవ అధ్యాయంలో'' ఈ సంఘటన గురించి శ్రీరామకృష్ణులవారు స్వయంగా చెప్పిన కథనం చూడండి.

ఇళ్లలోకి, ఊరంతా యథేచ్ఛగా తిరుగుతూ, మరింత చిలిపిగా ప్రవర్తిస్తూ ఉండిపోయాడు.

గదాయ్‌కు ఏడున్నర సం॥ వయసుంటుంది. అప్పుడు శరన్నవరాత్రులు సమీపించాయి. ఈ (దేవీ) నవరాత్రుల్లో శ్రీ దుర్గాదేవిని పూజిస్తారు. ఖుదీరామ్ మేనల్లుడు, కాస్త శ్రీమంతుడు అయిన రాంచంద్ర వంద్యోపాధ్యాయ గురించి ఇదివరకే చెప్పుకున్నాం కదా! అతడి ఉద్యోగం మేదినీపూర్‌లో ఉండడంవల్ల, సంవత్సరంలో ఎక్కువ కాలం అతడు అక్కడే ఉండేవాడు. కాని అతడి స్వగ్రామం మాత్రం సేలాంపూర్. ఆ గ్రామంలో అతడికి పూర్వీకుల గృహం ఉంది. అతడి కుటుంబం ఆ గ్రామంలోనే ఉండేది. ఉద్యోగరీత్యా అతనొక్కడు మాత్రం మేదినీపూర్‌లో వసించేవాడు.

14. రామ్‌చంద్రుని ఇంట్లో దుర్గాపూజ

రామ్‌చంద్ర తన స్వగ్రామంలోని ఇంట్లో ప్రతి సంవత్సరం శ్రీశ్రీ దుర్గాపూజను ఘనంగానే చేసేవాడు ఎంతో డబ్బు ఖర్చుపెట్టేవాడు. ఈ శరన్నవరాత్రుల్లో అతడి ఇంట్లో ఎనిమిది రోజుల వరకు భక్తిసంగీతం మారు మ్రోగుతూ ఉండేదని హృదయంరామ్ (శ్రీరామకృష్ణుల మేనల్లుడు) చెప్పగా మేము విన్నాం. బ్రాహ్మణులకు భోజనాలు పెట్టడం, పండితులకు పారితోషికాలివ్వడం, పేదలకు అన్నవస్త్రాల నివ్వడంలాంటి ఎన్నో పుణ్యకార్యాలతో ఆ ఇల్లు ఆనందంతో నిండిపోయేది.

ఈ పూజాసందర్భంలో రామ్‌చంద్ర, పరమపూజ్యుడైన తన మామ ఖుదీరామ్‌ను ఇంటికి తోడ్కొని వచ్చేవాడు. కొంతకాలం ఆయనతో ఆనందంగా గడిపేవాడు. ఈ సంవత్సరం కూడ పూజాసమయం రాగానే, కుటుంబ సమేతంగా రమ్మంటూ ఖుదీరామ్‌ను హార్దికంగా ఆహ్వానించాడు రామ్‌చంద్ర.

15. ఖుదీరామ్ శరన్నవరాత్రి ఉత్సవంలో పాల్గొనడం

అప్పుడు ఖుదీరాం వయస్సు అరవై ఎనిమిదేళ్లు. గత కొన్ని ఏళ్లుగా అతడు అజీర్తి, అతిసార వ్యాధులతో బాధపడుతూ ఉన్నాడు. ఆ కారణంగా అతడిలో బలం క్షీణించిపోయింది. శరీరంలో మునుపటి శక్తి లేదు. అత్యంత ప్రియమైన మేనల్లుని ఆహ్వానం అతడికి సంతోషాన్ని కలిగించింది. తప్పకుండా వెళ్లాలనే అనుకున్నాడతడు. కాని, తన శారీరక పరిస్థితి చూసి కాస్త సంకోచించాడు. అంతే కాదు, ఈసారి ఎందుకో అతడికి ఎక్కడికీ వెళ్లాలని అనిపించలేదు. తన చిన్ని ఇంటిని తన కుటుంబాన్ని, ముఖ్యంగా గదాయ్‌ను వదలి కొన్ని రోజులు మరో చోట గడపడానికి అతడికి మనస్కరించలేదు. ఆ బలీయమైన కారణం ఏమిటో అతడికే తెలియదు. కాని, రామ్‌చంద్ర కూడ తనకెంతో కావలసినవాడు. అతడి వద్దకు కూడ తప్పక వెళ్లాల్సిందే!

అతడికి వెంటనే ఏంచేయాలో తోచలేదు.

'రోజు రోజుకూ నాలో బలం తగ్గిపోతున్నది. ఈ సంవత్సరం వెళ్లకపోతే, బహుశ ఇకముందు ఎప్పుడూ వెళ్లటం సాధ్యం కాకపోవచ్చు. కాబట్టి వెళ్లటమే మంచిది' అని ఖుదీరామ్ అనుకున్నాడు.

చివరికి గదాయ్‌ను తనతోపాటు తీసుకువెళ్లడానికి నిశ్చయించుకున్నాడు. కాని మరుక్షణం అతణ్ణి మరో ఆలోచన అడ్డుకుంది. 'గదాయ్ లేకపోతే చంద్రా ఎలా ఉంటుందీ? దిగులుపడుతుందేమో! కాబట్టి పెద్దబ్బాయి రామ్‌కుమార్‌తో వెళతాను. పండుగ నాలుగురోజులు గడిపి, రామ్‌చంద్రను సంతోషపెట్టి వస్తాను' అనుకుని ఖుదీరామ్ తన నిశ్చయం మార్చుకున్నాడు.

అలాగే ఖుదీరామ్ శ్రీ రఘువీరుని మొక్కి, అందరివద్ద సెలవు తీసుకున్నాడు. గదాయ్‌ను ప్రేమమీర ముద్దాడాడు. రామ్‌కుమార్‌తో పూజకు కొన్ని రోజులు ముందే సేలంపూర్ వెళ్లాడు. పూజ్య మేనమామ, బావ రామ్‌కుమార్‌లను చూసి రామ్‌చంద్ర ఎంతో ఆనందించాడు.

ఖుదీరామ్ సేలాంపూర్‌కు వచ్చిన తర్వాత, అతడి వెనుకటి వ్యాధి అయిన అతిసారం తిరగబెట్టింది. వెంటనే అతడికి తగిన చికిత్స చేయించసాగారు.

16. ఖుదీరామ్ వ్యాధి - మరణం

శ్రీశ్రీ దుర్గానవరాత్రుల్లో షష్ఠి - సప్తమి - అష్టములు ఎంతో ఆనందంతో గడిచాయి. నవమి రోజున రోగం తీవ్రతరమైంది. దానితో అందరి ఆనందం భగ్నమైంది. రామ్‌చంద్ర మంచి వైద్యులను రావించాడు. రాంకుమార్, హేమాంగినుల సహాయంతో మేనమామకు సపర్యలు చేయసాగాడు. కాని ఖుదీరామ్ పరిస్థితి ఏమాత్రం మెరుగు కాలేదు. నవమినాటి పగలూ, రాత్రీ ఎలాగో గడిచాయి. మరుసటి దినం దశమి - అంతా ఆనందంతో కలుసుకునే విజయదశమి. ఆ రోజు ఖుదీరామ్ పూర్తిగా బలహీనుడైపోయాడు. నోట మాట రావడం కూడా కష్టమైంది.

సాయంకాలం శ్రీశ్రీ దుర్గామాతను నిమజ్జనం చేసి, రామ్‌చంద్ర సత్వరం మేనమామ దగ్గరకు వచ్చాడు. అప్పటికే తన మామ పరిస్థితి విషమించిందని తెలుసుకున్నాడు. అతడికి అంతిమ క్షణాలు దగ్గరపడ్డాయని గ్రహించాడు. చాలాసేపటి నుండి మామ ఆ స్థితిలోనే ఉన్నాడన్న విషయం తెలిసి, రామ్‌చంద్ర దుఃఖంతో కుంగిపోయాడు. కళ్లనుండి నీరు స్రవిస్తూండగా ఏడుస్తూనే మామ చెవి దగ్గరగా వచ్చి గట్టిగా మాట్లాడాడు.

''మామా! నువ్వెప్పుడూ శ్రీ రఘువీరుని నామాన్ని స్మరిస్తూ ఉంటావు కదా! మరిప్పుడెందుకు స్మరించవూ?'' అని బిగ్గరగా అన్నాడు.

శ్రీ రఘువీరుని నామం విన్న మరుక్షణమే క్షుదీరామ్‌లో కాస్త కదలిక కనిపించింది. అతడికి బాహ్యస్మృతి కూడ వచ్చింది. రామ్‌చంద్రవైపు చూశాడు.

''రామ్‌చంద్రా, నువ్వే కదా! అమ్మ నిమజ్జనం అయిపోయిందా? అయితే నన్ను కాస్త కూర్చోబెట్టు నాయనా!'' అన్నాడు.

రాంకుమార్, హేమాంగినుల సహాయంతో రామ్‌చంద్ర మేనమామను మంచం మీద నెమ్మదిగా కూర్చోబెట్టాడు. కూర్చున్న వెంటనే క్షుదీరామ్ గంభీర స్వనంలో శ్రీ రఘువీరుని పవిత్రనామాన్ని మూడుసార్లు ఉచ్చరించాడు. ఆ మరుక్షణం అతడి దేహం నుండి జీవుడు ఎగిరిపోయాడు. బిందువు సింధువులో కలసిపోయింది. తన పరమభక్తుని జీవనబిందువును, శ్రీ రఘువీరుడు తన అనంత జీవన సింధువులో విలీనం చేసుకున్నాడు. అతడికి అమృతత్త్వాన్నిచ్చాడు, పరమశాంతిని అనుగ్రహించాడు.

నాటి అర్ధరాత్రి ఆ గ్రామం అంతా భగవంతుని సంకీర్తనలతో మారు మ్రోగిపోయింది.

క్షుదీరామ్ భౌతిక కాయాన్ని నదీతీరానికి తీసుకువెళ్లారు. అక్కడే అంత్య క్రియలు, దహనసంస్కారం చేశారు.

మరునాడు ఈ విషాదవార్త కామార్పుకూర్ చేరింది. అక్కడి ఆనంద ధామాన్ని శోకసముద్రంలో ముంచెత్తింది.

మైలకాలం గడిచిపోయాక రామ్‌కుమార్ తండ్రి పేరిట శాస్త్రోక్తంగా ఒక కోడెదూడను వదిలిపెట్టాడు. ఎంతోమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టించాడు. తండ్రి శ్రాద్ధకర్మలు ఆ రీతిలో చక్కగా నిర్వహించాడు.

ఈ శ్రాద్ధకర్మ నిమిత్తం రామ్‌చంద్ర ఐదువందల రూపాయలు ఖర్చు పెట్టాడని చెప్పుకొంటారు.

7. గదాధర్ బాల్యం

1. క్షుదీరామ్ మరణంతో కుటుంబంలో ఏర్పడ్డ పరిణామాలు

క్షుదీరామ్ మరణం అతడి కుటుంబంలో చాలా మార్పులు తెచ్చింది. సుమారు నలభై నాలుగు సంవత్సరాల కాలం శ్రీమతి చంద్రాదేవి సుఖదుఃఖాలలో అతడు ఆమెకు జీవన సహచరుడిగా ఉన్నాడు. అందుకే అతడు లేని లోటు ఆమెకు కొట్టవచ్చి నట్లు కనిపించింది. ఆమెకు భర్తలేని ఈ ప్రపంచం శూన్యంగా తోచింది. అది సహజమే కదా!

మామూలుగానే ఆమె ఎప్పుడూ శ్రీ రఘువీరుని పాదపద్మాలను శరణు వేడుతూ ఉండేది. భర్త పోవడంతో ఇప్పుడామెకు ప్రపంచాసక్తి బొత్తిగా లేకుండా పోయింది. దానితో ఆమె మనసిప్పుడు ఎల్లవేళలా ఆ దేవుని పాదాలనే ఆశ్రయించ సాగింది. అయితే మనిషి ఎంతగా కోరుకుంటున్నా, సమయం రానిదే సంసార బంధం అంత సులభంగా వీడిపోదు సుమా! ఏడేళ్ళ పిల్లవాడు గదాయ్, నాలుగు సంవత్సరాల కూతురు సర్వమంగళ ఆమెను అలా నిరాసక్తురాలిగా ఉంచలేక పోయారు. వారి మూలంగా మళ్లీ ఆమెను, సంసారం తన వైపు లాక్కుంది. మళ్లీ ఆమె సుఖ దుఃఖమయ జీవితానికి వశవర్తియైంది. అలా ఆమె శ్రీ రఘు వీరుని సేవిస్తూ, తన చిన్నబిడ్డలను పోషిస్తూ దుఃఖమయ శేషజీవితాన్ని ఎలాగో గడపసాగింది.

ఇక సంసారభారమంతా ఇప్పుడు పెద్దకుమారుడు రాంకుమార్‌పై పడింది. దానితో శోకంతో దినాలను వ్యర్థంగా గడపడానికి అతడికి అవకాశం లేకపోయింది. దుఃఖితురాలైన తల్లిని, చిన్నపిల్లలయిన తమ్ముణ్ణి, చెల్లెలిని చూడ వలసిన బాధ్యతను అతడు గ్రహించాడు. అతడి పెద్ద తమ్ముడు రామేశ్వర్ స్మృతి, జ్యోతిశ్శాస్త్రాల అధ్యయనం పూర్తిచేశాడు. అతడు కుటుంబానికి ఆర్థికంగా ఎలా సహాయపడగలడో, ఆ విషయం కూడా చూడవలసి ఉంది. రామేశ్వర్ కిప్పుడు

పద్దెనిమిది ఏళ్లు. అతడికి ఏదైనా పని చూపించడమే గాక, తాను కూడా ఇప్పుడు మరికాస్త ఎక్కువగా సంపాదించవలసిన అవసరం ఏర్పడింది.

ఇలాంటి అనేక సమస్యలు రాంకుమార్‌ను చుట్టుముట్టాయి. కుటుంబం కోసం చింతిస్తూ రాంకుమార్ కాలం గడపసాగాడు. అతడి భార్య ఎంతో యోగ్యురాలు, బుద్ధిమంతురాలు. అత్త చంద్రాదేవి వెనుకటిలా పనులు చేయక పోవడం చూసి, తానే చాలావరకూ అన్ని పనులు చేయడానికి పూనుకుంది. వంటా, వార్పూ మొదలైన ఇంటి పనులన్నీ తానే ఎక్కువగా చూసుకోసాగింది.

పసితనంలో తల్లి పోవడం, బాల్యంలో తండ్రి పోవడం, యౌవనంలో భార్య పోవడం - ఇవి మనిషి జీవితాన్ని శూన్యం చేసినట్లుగా, మరే ఇతర సంఘటనలూ చేయజాలవని విజ్ఞులంటారు. పసిబిడ్డకు తల్లి ప్రేమ వాత్సల్యాలే ప్రధానాశ్రయాలు. అందుచేత పసితనంలో తండ్రి చనిపోయినా, పసివానికి అంత బాధ ఏర్పడదు. కాని పసివాడు పెరిగి పెద్దవాడవుతున్నకొద్దీ, అతడి బుద్ధి వికసిస్తున్నకొద్దీ, అతడు తండ్రికి చేరువవుతుంటాడు. తండ్రి ప్రేమను పొందుతుంటాడు. తాను ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించే తల్లి కూడా తన అన్ని అవసరాలూ తీర్చజాలదని, తండ్రి మాత్రమే వాటిని పూరించగలడని తెలుసుకుంటాడు. ఆ స్థితిలో ఆ బిడ్డ మనసు తండ్రి వైపుకు ఆకర్షింపబడుతుంది. అలాంటి దశలో తండ్రి చనిపోతే, ఆ బిడ్డ మనసు దాన్ని తట్టుకోలేదు.

2. తండ్రి మరణంతో గదాధర్ మానసిక స్థితి

ఖుదీరామ్ మరణం కూడా గదాధర్‌కు ఇలాంటి తీవ్రబాధనే కలిగించింది. ప్రతిరోజూ అనేక చిన్న చిన్న సంఘటనలు అతడికి తండ్రిని జ్ఞాపకం చేస్తుండేవి. దానితో అతడి అంతరంగం ఎప్పుడూ ఒకానొక విషాదంతో నిండిపోయి ఉండసాగింది. కాని అతని మనోబుద్ధులు వయసుకు మించి పక్వమై ఉండేవి. కాబట్టి తన మనసులోని చింతలను బయటకు వ్యక్తం చేసేవాడు కాడు. అందరికీ అతడు వెనకటి చలాకీ గదాయ్‌గానే కనిపించేవాడు. నవ్వుతూ, ఆడుతూ, వినోదిస్తూ ఉండేవాడు. కాని గదాయ్ అప్పుడప్పుడు శ్మశానంలోకి, మాణిక్‌రాజా మామిడితోపు లాంటి నిర్జన ప్రాంతాలకు వెళుతూ ఉండేవాడు; ఇతరులు అది గమనించినా, ఏమీతోచక అటువైపు వెళ్ళివుంటాడులే అని సరిపెట్టుకునేవారు. అందుకు మరోకారణం ఏదైనా ఉందేమోనన్న విషయం ఆ గ్రామస్థులకు తట్టేది కాదు.

గదాయ్ క్రమంగా గంభీరంగా ఉండడానికి, నిర్జన ప్రదేశాల్లో గడపడానికి ఎక్కువగా ఇష్టపడసాగాడు. అంతేకాదు, ఇప్పుడతడిలో పరిశీలనాశక్తి కూడా పెంపొందింది. లోకులను విమర్శనాత్మకంగా, నిశితంగా గమనించసాగాడు. వారి ప్రవర్తనలను సూక్ష్మంగా పరీక్షించసాగాడు.

సమానంగా దుఃఖాన్ని, బాధలను అనుభవించేవారంతా పరస్పరం సన్నిహితు లౌతారంటారు. ఇప్పుడు గదాధర్, తల్లికి మరింత సన్నిహితుడయ్యాడు.

3. ఇప్పుడు తల్లి పట్ల గదాయ్ ప్రవర్తన

కారణం ఇదేనేమో! ఇప్పుడు ఎక్కువ కాలం అతడు తల్లి వద్దే గడపసాగాడు. దైవ పూజాసేవల్లో, ఇతర ఇంటి పనుల్లో యథాశక్తి తల్లికి తోడ్పడసాగాడు. అలా చేయడంలో ఎంతో ఆనందించే వాడు. తాను తల్లివద్ద ఉన్నంతకాలం, ఆమె తన బాధను చాలావరకు మరచి పోయేదన్న విషయాన్ని అతడు త్వరలోనే గ్రహించాడు.

తల్లిపట్ల అతడు ప్రవర్తించే తీరులో కూడ కాస్త మార్పు వచ్చింది. ఇంతకు ముందు అది కావాలని, ఇది కావాలని తల్లి దగ్గర మంకుపట్టు పట్టేవాడు. ఇప్పుడలా మొండికేయడం లేదు. తాను కోరింది ఆమె యివ్వలేకపోతే, ఇప్పుడు ఆమే చాలాబాధ పడుతుందని అతడు గ్రహించాడు. ఆమెను బాధపెట్టడం ఇష్టంలేక, గదాధర్ తన మొండితనాన్ని వదలుకున్నాడు. తండ్రి పోవడం వల్ల, ఇక తల్లిని అన్నివిధాలా తానే 'కాపాడాలి' అన్న భావం అతడి హృదయంలో జనించింది.

4. సాధువులతో గదాధర్ సాంగత్యం

గదాధర్ మళ్లీ బడికి వెళ్లసాగాడు. పాఠాలు నేర్చుకోవడం మొదలుపెట్టాడు. కాని పాఠాలకంటే పురాణ కథలు, నాటకాలలోని పాటలు వినడంలో అతనెక్కువ ఆసక్తి చూపసాగాడు. రకరకాల దేవతా విగ్రహాలను తయారు చేస్తూండేవాడు. వీటిలోనే అతడికి ఎక్కువ ఆనందం లభించేది. ఇలా తండ్రి లేని లోటును మరచిపోవచ్చని, వీటిపై అతడు ఎక్కువ మక్కువ చూపసాగాడు.

అతడి అసాధారణ స్వభావం, అతడి దృష్టిని మరొక కొత్త విషయం పైకి మరల్చింది. అదే సాధుసాంగత్యం. ఆ ఊరి జమీందారులు లాహా బాబులు. వారు తమ ఊరికి ఆగ్నేయంలో, పూరీ క్షేత్రానికి వెళ్లే దారిపక్కన, యాత్రికుల సౌకర్యార్థం ఒక చక్కని సత్రాన్ని కట్టించివున్నారు. పూరీ జగన్నాథస్వామిని దర్శించడానికి వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు చాలామంది సాధువులు, బైరాగులు ఈ సత్రంలో కొంతకాలం గడుపుతూ ఉండేవారు. ఆ సమయంలో వారు ఊళ్లోకి వచ్చేవారు. ఇంటింటా భిక్ష గ్రహించి వెళుతుండే వారు.

సంసారం ఎంత అశాశ్వతమో ఇదివరకే గదాధర్ వినివున్నాడు. తండ్రి మరణంతో ఆ విషయం అతడికిప్పుడు రూఢి అయింది. అనిత్యమైన ఈ సంసారాన్ని త్యజించి, భగవత్సాక్షాత్కారం కోసం సాధనలు చేయడానికే సాధువులు, బైరాగులు తమ కాలాన్ని వినియోగిస్తారనీ, అలాంటి సాధుపుంగవుల

సాన్నిధ్యం మానవులకు పరమశాంతిని ప్రసాదిస్తుందనీ, పురాణాల ద్వారా గదాధర్ గ్రహించివున్నాడు. అందుచేత సాధుసాంగత్యం చేయాలన్న కోరికతో, అప్పుడప్పుడు గదాయ్ సాధువులు బసచేసే ఆ సత్రానికి వెళ్లడం మొదలు పెట్టాడు. ఉదయ సాయంకాలాల్లో వారు పవిత్ర 'ధుని'(మంట) రగిలించే వారు. ఆ 'ధుని' చుట్టూ కూర్చుని వారు భగవద్ధ్యానం చేసేవారు. ఆ సాధువులు భిక్షలో తమకు లభించిన మామూలు ఆహారాన్నే తమ ఇష్టదేవతలకు అర్పించి, ఆ ప్రసాదాన్ని పరమానందంతో ఆరగించి తృప్తిపడేవారు. వారు తామెప్పుడైనా తీవ్రరోగాలకు గురి అయితే, తమ మొత్తం భారాన్ని భగవంతునిపై మోపి, ఆ రోగబాధలను ఎంతో శాంతంగా సహించేందుకు ప్రయత్నించేవారు. తమ అవసరాల కోసం ఇతరులకు శ్రమనివ్వడం కూడ వారిష్టపడేవారు కారు.

గదాధర్ సాధువుల జీవితాలను ఇలా క్షుణ్ణంగా పరిశీలించేవాడు. ఈ పరిశీలనలో అతడికి మరో సత్యం కూడ తెలియవచ్చింది. కొంతమంది వంచకులు కూడా తమ స్వార్థసిద్ధి కోసం సాధువుల వేషాలు ధరించి, నిజమైన సాధువుల్లా నటిస్తూ, మోసాలు చేస్తూ, సదాచారాలను పాడు చేస్తుండేవారు. అలాంటి దొంగ సాధువుల విషయం కూడా గదాధర్‌కు తెలిసివచ్చింది.

అలా గదాధర్ నిజమైన సాధువులు ఎవరో, దొంగ సాధువులు ఎవరో తేలికగా గ్రహించే శక్తి సంపాదించాడు. నిజమైన సాధువులు కనిపిస్తే మాత్రం, వారికి వంటచెరకు, మంచినీళ్లు తెచ్చివ్వడం, చిన్న చిన్న ఇతర పనులు చేసి పెట్టడం చేసేవాడు. వారితో సన్నిహితంగా మెలగేవాడు. ఆ సాధువులు కూడా ఈ ముద్దుల బాలుని సేవలకు, శుశ్రూషలకు ఎంతో సంతోషించేవారు. అతడికి తమకు తెలిసిన చక్కని భజనలు, కీర్తనలు నేర్పించేవారు. మంచి మంచి బోధలు చేసేవారు. నివేదన చేసిన తమ భిక్షాన్నంలో కొంత అతడికి పెట్టి, అతనితోపాటు తామూ తింటూ తృప్తిపడేవారు.

కాని గదాయ్ అందరితోనూ ఇలా ఉండే అవకాశం లేకపోయింది. అనేక కారణాల రీత్యా, సత్రంలో బసచేసే సాధువులతోనే అతడు సన్నిహితంగా ఉండేవాడు.

5. ఈ సందర్భంగా చంద్రాదేవిలో జనించిన భయం తొలగిపోయిన తీరు

గదాధర్‌కు ఎనిమిదవ ఏడు నడుస్తోంది. ఒక రోజు ఆ సత్రంలోకి కొంతమంది సాధువులు వచ్చి బసచేశారు. వారు చాలా దూరప్రయాణం చేసి ఉంటారు; బాగా అలసిపోయారు. ఎందుకో తెలియదు కాని, ఆ సత్రంలో వారు చాలా రోజులవరకు ఉండిపోయారు. గదాయ్ వారితోపాటు ఉంటూ, వారికి సేవలు చేస్తూ, త్వరలోనే వారి ప్రేమకు పాత్రుడయ్యాడు.

వారితో గదాయ్ కలిసి ఉంటున్నాడన్న విషయం మొదట్లో ఎవరికీ తెలియదు. కాని రోజులు గడుస్తున్నకొద్దీ, ఆ విషయం ఊరంతా తెలిసిపోయింది. గదాయ్ ఎక్కువ కాలం వారితోనే గడుపుతున్నాడన్న సంగతి అందరూ గ్రహించారు.

ఒకరోజు గదాయ్ వారివద్ద చాలాసేపు గడిపి, ఇంటికి తిరిగివచ్చాడు. ఆ రోజు ఇంట్లో ఏమీ తినలేదు. తల్లి కారణం అడిగితే, సాధువుల వద్ద తిని వచ్చానని చెప్పాడు. ఆ రోజు చంద్రాదేవి ఆ విషయం అంతగా పట్టించుకోలేదు. అలా చాలాసార్లు జరిగింది. సాధువులకు తన కొడుకంటే ప్రీతి ఏర్పడడం చూసి, ఆమె సంతోషించింది తప్ప, ఏమాత్రమూ కీడు శంకించలేదు. సాధువుల ఆశీస్సులు తన కుమారుడికి లభించడం చూసి, ఆనందంతో కుమారుడి ద్వారా వారికి తినుబండారాలు, ఇతర అవసర వస్తువులు కూడా పంపించేది.

కాని క్రమంగా ఆమెలో కాస్త అలజడి ఏర్పడింది. అప్పుడప్పుడు గదాయ్ ఒళ్ళంతా భస్మం (బూడిద) పూసుకుని వచ్చేవాడు. ఒక రోజు తిలకం పెట్టుకుని కనిపించేవాడు. ఒక రోజు తన బట్టలనే చింపి, కౌపీనంగా ధరించి వచ్చేవాడు. ''అమ్మా, అమ్మా! చూడు, సాధువులు నన్నెలా అలంకరించారో!'' అంటూ ఆనందంగా చూపించేవాడు.

ఆ వేషాలు చూసి చంద్రాదేవి కలవరపడింది. సాధువులు తన గదాయ్‌ను మాయమాటలు చెప్పి ఎత్తుకుపోతారేమోనని భయపడింది. ఒక రోజు గదాయ్‌కు తన భయం చెప్పి, వలవలా ఏడ్చింది. అతడు తల్లిని శాంతింపచేయ డానికి ఎంతో ప్రయత్నించాడు. కాని ఆమెలోని భయం, ఆందోళన దూరం కాలేదు. తల్లి బాధ చూసి, తానిక సాధువుల వద్దకు వెళ్లనని తల్లికి మాట ఇచ్చాడు. దానితో ఆమె మనసు కాస్త కుదుటపడింది.

తన మాటను ఆచరణలో పెట్టడానికి ముందుగా, చివరిసారిగా సాధువుల వద్దకు వెళ్లాడు. వారికి విషయం చెప్పి, తానిక వారి వద్దకు రానని చెప్పాడు. వెంటనే సాధువులు గదాయ్‌తోపాటు చంద్రాదేవి వద్దకు వచ్చారు.

''అమ్మా! నువ్వు గదాయ్ విషయమై భయపడవలసిన అవసరం లేదు. అతణ్ణి మా వెంట తీసుకొనిపోవాలని మేమెప్పుడూ అనుకోలేదు. దైవసాక్షిగా మా కా పాడు ఆలోచన ఏమాత్రమూ లేదు. పైగా ఇంత చిన్నపిల్లవాడిని, తల్లిదండ్రుల అనుమతి లేకుండా తీసుకు వెళ్లడం దొంగతనమే అవుతుంది. అలాంటి పాపం మేమెలా చేస్తామమ్మా! అది మహాపరాధం తల్లీ! కాబట్టి నువ్వేం భయపడకు'' అంటూ రకరకాలుగా ఆమెకు నచ్చజెప్పారు.

వారి మాటలు విన్న తర్వాత చంద్రాదేవి మనసు నుండి ఆ భయం పూర్తిగా తొలగిపోయింది. సాధువులు కోరినట్లుగానే వెనుకటిలాగే తన కొడుకును వారి వద్దకు పంపసాగింది.

ఈ దశలో గదాయ్‌కు జరిగిన మరో సంఘటన చూసి తల్లి ఎంతో ఆందోళనకు గురైంది. ఆ సంఘటన హఠాత్తుగా జరిగిందని అందరూ అనుకున్నారు. కాని మాకలా అనిపించడం లేదు. ఆ బాలునిలో వికసిస్తున్న ఆధ్యాత్మిక భావం, గంభీర చింతనల ఫలితంగానే అది జరిగిందని మే మనుకొంటున్నాం.

6. రెండవసారి గదాధర్‌కు భావసమాధి

ఇక ఆ సంఘటన గూర్చి చెప్పుకొందాం.

కామార్పుకూర్‌కు ఉత్తరంగా రెండుమైళ్ల దూరంలో 'అనూర్' అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలోని విశాలాక్షి[1] దేవాలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఒకరోజు గదాయ్ ఆ దేవి దర్శనార్థం ఆ ఊరు వెళుతున్నాడు. కాని మధ్య దారిలోనే బాహ్యస్మృతి కోల్పోయాడు. ఆ రోజు అతడితో ఉన్నవారిలో ధర్మదాస్ లాహా సోదరి ప్రసన్నమయి కూడ ఉంది. ఆమె దైవభక్తి పరాయణురాలు. గదాధర్ స్థితి చూసి, ఆధ్యాత్మిక భావావేశం వల్లనే అతడికి అలా జరిగిందని ఆమె ఒక్కతె మాత్రం గ్రహించింది. ఆమె మాటలు చంద్రాదేవి నమ్మలేదు. వాతరోగం వల్లగానీ, మరేదో గాలి సోకడం వల్లగాని తన గదాయ్‌కు అలా జరిగిందని ఆమె అనుకుంది. ఆందోళన చెందింది. కాని దేవిని ధ్యానిస్తూండడం వల్ల, ఆమె పవిత్ర పాదపద్మాల్లో తన మనస్సు లయించడం వల్ల తన కా అవస్థ కలిగిందని గదాయ్ తల్లికి చెప్పాడు.

అలా మరి రెండేళ్లు గడిచిపోయాయి. గదాధర్‌కు క్రమంగా 'తండ్రిలేమి' మరుగున పడింది. సుఖ దుఃఖాలతో కూడిన మామూలు జీవితంలో అతడు నిమగ్నుడైపోయాడు.

7. గదాధర్ ఆప్త మిత్రుడు గయావిష్ణు

ధర్మదాస్ లాహా, ఖుదీరామ్‌కు ప్రాణస్నేహితుడని చెప్పుకున్నాం కదా! గయావిష్ణు ఆ ధర్మదాస్ కుమారుడే. అతడికీ, గదాయ్‌కూ మంచి స్నేహం కుదిరింది. వారిద్దరూ కలిసిమెలసి ఆడుకునేవారు, పాఠాలు నేర్చుకునేవారు. వారు సదా ఒకరిని వదలి మరొకరుండేవారే కాదు.

గ్రామంలోని స్త్రీలు మునుపటిలాగే గదాధర్‌ను భోజనానికి పిలుచుకుని వెళ్లేవారు. కాని తన స్నేహితుడు లేకుండా గదాయ్ వెళ్లేవాడు కాదు. 'ధని' మంచి

---

1. పూర్తి వివరాలు ''సాధక భావం - 2-2-20 చూడండి.

పిండివంటలు, మిఠాయిలు అతడికి ఇస్తే, వాటిలో కొంత స్నేహితుడికి పెట్టిగాని గదాయ్ తాను తినేవాడుకాడు.

8. గదాధర్ ఉపనయనం

గదాయ్‌కు ఇక తొమ్మిదవ ఏడు వస్తుందని, అతని పెద్దన్న రాంకుమార్ గ్రహించాడు. కాబట్టి అతడికి 'ఉపనయన సంస్కారం' చేయడానికి ఏర్పాట్లు చేయసాగాడు.

కమ్మరి కులానికి చెందిన 'ధని' అంతకు ముందే, ఎంతోకాలం క్రితం గదాయ్‌ను ఒక కోరిక కోరివుంది. ఉపనయనంలో మొదటి భిక్ష తన నుండి స్వీకరించాలని తనను 'అమ్మా' అని అనాలని, అలా తనను తరింపచేయాలని కోరుకుంది. ఆమె మాతృప్రేమకు కరిగిపోయి ''తప్పకుండా నీ కోరిక తీరుస్తాను'' అని గదాయ్ మాట యిచ్చాడు. ఆ పేదరాలు ఆ పిల్లవాని మాటలు నమ్మి, ఆనాటి నుండి కొంత కొంతగా డబ్బును ప్రోగుజేసుకుంది. ఇతర వస్తువులను సమకూర్చుకుంది. అలా ఏర్పాటు చేసుకుని, ఆ శుభముహూర్తం కోసం ఎదురుచూడసాగింది.

ఇప్పుడా సమయం రానే వచ్చింది. గదాయ్ తానిచ్చిన 'ఆ మాట' గురించి తన అన్నకు చెప్పాడు. అది విని, అది కుదరని విషయం అన్నాడు రాంకుమార్.

''మన వంశంలో ఇలాంటి అనాచారం ఎప్పుడూ లేదు'' అని కాదన్నాడు.

కాని గదాయ్ మాత్రం తాను ధనికి మాట యిచ్చానని, దాన్ని తప్పక నెరవేరుస్తానని పట్టుపట్టాడు.

''లేకపోతే నేను అసత్యవాది నౌతాను. అసత్యం చెప్పేవాడు బ్రాహ్మణునికి అర్హమైన యజ్ఞోపవీతాన్ని ధరించడానికి యోగ్యుడు కాడు'' అని అన్నాడు.

ఉపనయనానికి అన్ని ఏర్పాట్లూ అదివరకే జరిగిపోయాయి. గదాధర్ మాట వినకుంటే, ఆ ఏర్పాట్లన్నీ వమ్మయిపోయే ప్రమాదం ఏర్పడింది. ధర్మదాస్ లాహాకు విషయం తెలిసింది. అతడు వచ్చి అన్నదమ్ముల తగాదాను పరిష్కరించడానికి ప్రయత్నించాడు.

''రాంకుమార్! ఇలాంటి ఆచరణ ఇంతకు ముందు మీ వంశంలో ఎప్పుడూ జరగలేదన్నది నిజమే. కాని ఇతర సద్బ్రాహ్మణుల కుటుంబాలలో అప్పుడప్పుడు ఇలా జరగడం ఉంది. కాబట్టి ఇదేమంత అనాచారం కాదు. పైగా తమ్ముడు మాట ఇచ్చాడు. అతడి మాటను నిలబెట్టవలసి కూడా ఉంది కదా! అతణ్ణి సంతోషింపజేయడంలో తప్పేమీ లేదు'' అంటూ రాంకుమార్‌కు అతను నచ్చచెప్పాడు.

పెద్దవాడు, తండ్రికి ప్రాణస్నేహితుడు అయిన ధర్మదాస్ లాహా మాటను రాంకుమార్ కాదనలేకపోయాడు. ఒప్పుకున్నాడు.

గదాయ్ ఆనందంతో శాస్త్రోక్తంగా యజ్ఞోపవీతాన్ని ధరించాడు. ధని వద్ద నుండి మొదటి భిక్ష గ్రహించి ఆమెతో మాతృసంబంధం కల్పించుకున్నాడు. ఆ క్షణం నుండి సంధ్యావందనాది ద్విజోచిత కర్మలను అతడు ఎంతో శ్రద్ధతో ఆచరించసాగాడు.

అతడితో ఏర్పడిన మాతృ సంబంధంతో తాను తరించానని భావించి ధని ఆనందంతో పొంగిపోయింది.

ఉపనయనం జరిగిన కొంత కాలానికి గదాధర్ పదవ సంవత్సరంలోకి అడుగుపెట్టాడు.

ఆ పదవ ఏటే, గదాధరుని అసాధారణ ప్రజ్ఞ వెల్లడయ్యే సంఘటన ఒకటి జరిగింది. అది వారినందరినీ అద్భుతాశ్చర్యానికి లోనుచేసింది. జమీందారు

9. పండిత సమావేశంలో వివాదాస్పద శాస్త్రాంశాన్ని గదాధర్ పరిష్కరించడం

లాహా గృహంలో ఒక విశేష శ్రాద్ధకర్మ జరిగింది. ఆ సందర్భంలో అతడొక పెద్ద పండిత సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. పండితులు శాస్త్ర విషయాల గురించి చర్చిస్తున్నారు. పైగా పండితులు తర్కయుక్తంగా, ప్రమాణయుక్తంగా, శాస్త్రాలను ఉదాహరిస్తూ వాదోపవాదాలు చేస్తున్నారు. శాస్త్రాల్లో ప్రవేశమున్నవారికే, ఆ విషయాలు అర్థమౌతాయి, ఆసక్తి గొల్పుతాయి. పదేళ్ల గదాధర్ వారి చర్చలను పరమాసక్తితో, ఏకాగ్రంగా వింటున్నాడు. వారిని గంభీరంగా పరిశీలిస్తున్నాడు. అంతలో ఆ పండితుల మధ్య ఒక జటిల సమస్య వచ్చి పడింది. దాని గురించి చాలా లోతుగా వాదోపవాదాలు చేసుకున్నారు. అయినా వారికి తృప్తికరమైన సమాధానం రాలేదు. అంత శ్రద్ధగా వింటున్న గదాధరుడు నెమ్మదిగా - 'మీ సమస్యకు ఇది జవాబు కాదా?' - అంటూ పరిష్కారం చెప్పాడు. ఆ పరిష్కారం ఆ సమస్యకు కచ్చితంగా సరిపోయింది. జటిలమైన శాస్త్ర విషయానికి బాలుడు, శాస్త్రజ్ఞానంలేని పిల్లవాడు అంత శాస్త్రీయ సమాధానం చెప్పేసరికి పండిత సమూహమంతా విస్మయం చెందింది. ఆ తర్వాత గదాయ్‌ని ఎంతో ప్రశంసించారు. మనసారా ఆశీర్వదించారు.

యజ్ఞోపవీతాన్ని ధరించిన తర్వాత గదాధర్ ఎంతో సంతోషించాడు. అతడు మనసారా కోరుకొంటున్న దైవపూజాదులను చేయడానికి ఇప్పుడతడికి

10. మూడవ సారి గదాధర్‌కు భావసమాధి

అర్హత, అవకాశాలు లభించాయి కదా! శ్రీ రఘువీరుని చైతన్యమయ శిలావిగ్రహం తండ్రికి స్వప్నంలో సాక్షాత్కరించిన వైనం, శ్రీ రఘువీరుడు తమ ఇంట కొలువు చేసిన తర్వాత 'లక్ష్మీజల' అనే తమ కొద్దిపాటి పొలం సమృద్ధిగా పండుతున్న విషయం, దాంతో తమ కుటుంబ అవసరాలు తీరడం; కరుణామయియైన తన తల్లి అతిథి

అభ్యాగతులను ఆదరించేటందుకు ఆ ధాన్యం తోడ్పడడం - ఈ విషయా లన్నీ గదాధర్‌కు తెలియవచ్చాయి. అందుకే మొదటి నుండి తమ కులదైవం శ్రీ రఘువీరుడంటే అతడికి అమిత శ్రద్ధాభక్తులు ఏర్పడ్డాయి. అలాంటి శ్రీ రఘువీరుణ్ణి స్మరించే, పూజించే సదవకాశం అతడికప్పుడు లభించింది. దాంతో అతడి హృదయం వినూత్న భక్తిభావంతో నిండిపోయింది. సంధ్యావంద నాదులు ముగించి, ఆ తర్వాత గదాధర్ పూజకు కూర్చునేవాడు. అప్పుడు చాలా సేపటి వరకు పూజ ధ్యానాలలోనే గడిపేవాడు. శ్రీ రఘువీరుడు తన తండ్రికి దర్శనం ఇచ్చినట్లుగానే, తనకూ యివ్వాలని, తనను కూడా ఆదేశిస్తూ ఉండాలని గదాధర్ ఆకాంక్ష. అందుకే అతడు నిష్ఠతో, భక్తిప్రపత్తులతో భగవదారాధన చేయసాగాడు. రఘువీరుడినే కాదు, రామేశ్వర శివుణ్ణి, శీతలదేవిని కూడ సేవించ సాగాడు. ఎంతో శ్రద్ధగా, భక్తిప్రపత్తులతో చేస్తున్న అతడి పూజలు సత్వరమే ఫలి తాన్ని చూపాయి. గదాధర్ అంతఃకరణం శుద్ధిచెంది, అది భగవంతుని పూజలో పూర్తిగా నిమగ్నం కాసాగింది. అలాంటి దశలో అతడు భావసమాధిని (సవికల్ప సమాధి) పొందసాగాడు. అంతేకాదు, అతడికి అప్పుడప్పుడు దివ్యదర్శనాలు కూడ కలుగసాగాయి. ఆ ఏటి శివరాత్రి నాడు అతడిలాంటి సమాధిని, శివ దర్శనాన్ని పొందాడు.

ఆ శివరాత్రినాడు గదాధర్ ఉపవాసం చేశాడు. ఎంతో నిష్ఠతో, భక్తితో మహాదేవుణ్ణి పూజిస్తున్నాడు. అతడి స్నేహితులు గయావిష్ణు మొదలైనవారు కూడ ఉపవాసం ఉన్నారు. పొరుగునే ఉన్న సీతానాథ్ పాయిన్ ఇంట్లో ఆ రాత్రి శివమహిమను తెలిపే 'యాత్ర' (వీధి నాటకం) జరుగుతోంది. వారంతా ఆ నాటకం చూస్తూ జాగరణ చేయదలిచారు.

గదాధర్ మొదటి ప్రహర పూజను ముగించాడు. శివధ్యానంలో నిమగ్నుడై వున్నాడు. ఆ స్థితిలో గయావిష్ణు మొదలైన స్నేహితులు అతడి దగ్గరకు వచ్చారు.

''గదాయ్! గొప్ప సమస్య వచ్చిపడింది. నాటకంలో శివుని వేషం వేసే వ్యక్తికి జ్వరం వచ్చిందట, అతడు రాలేదు. శివుని వేషం ధరించడానికి మరెవ్వరూ లేరు. నువ్వా శివుని వేషం ధరించాలి. ఏమంత కష్టం కాదులే! రెండు మూడు సంభాషణలే. నువ్వు అలవోకగా చేసేస్తావు. కనుక వెంటనే రా'' అంటూ పట్టుబట్టారు.

''అబ్బే! ఇప్పుడెలా కుదురుతుందీ? నేను శివపూజలో ఉన్నాను కదా! పూజకు విఘ్నం కలగదా!'' అంటూ గదాయ్ అభ్యంతరం చెప్పాడు. అతడి మాటలు వారు పట్టించుకోలేదు.

''మరేం ఫరవాలేదు. శివుని వేషం వేసే వ్యక్తి, శివుడిలా ధ్యానం చేయవలసి ఉంటుంది. కాబట్టి అది శివపూజే అవుతుంది. పైగా నీ మూలంగా, ఎంతో మందికి నిరాశ తప్పి ఆనందం కలుగుతుంది. లేకపోతే నాటకం చూడాలని వచ్చిన జనం నిరాశ, అసంతృప్తితో తిరిగి పోవలసి వస్తుంది. కాబట్టి అంతమంది భక్తులను ఆనంద పరచేందుకైనా నువ్వు వచ్చి వేషం కట్టాల్సిందే. పైగా మేము కూడ ఉపవాసం ఉన్నాం. జాగరణ చేయాలి కదా! మా కోసం కూడ ఒప్పుకోవా?'' అంటూ వారు గదాయ్‌ను ఎంతో బలవంతపెట్టారు.

చివరికి గదాయ్ వారి కోరికను ఒప్పుకొన్నాడు. వారి వెంట వెళ్లాడు. వారు గదాయ్‌ను అద్భుతంగా అలంకరించారు. అచ్చు శివునిలాగే కనిపించేలా చేశారు.

తలపై జటాజూటాలు, మెడలో, ఇతర అంగాల్లో రుద్రాక్షమాలలున్నాయి. ఒళ్లంతా విభూతి. ఆ అలంకరణతో అతడు 'శివుని'గా రంగస్థలం మీదికి వచ్చాడు. వచ్చి ధ్యానంలో కూర్చున్నాడు. ఆ రూపం, ఆ ధ్యానం చూసి జనమంతా ఎంతో ఆనందించారు. కాని గదాధర్ కృత్రిమ ధ్యానం పాటించడం లేదన్న సంగతి ఎవరికీ తెలియదు. నిజంగానే ధ్యానంలో లీనమైపోయాడు. అతడి మనసు భావసమాధిని పొందింది. అలా చాలాసేపు గడిచింది. ఎంతసేపటికీ అతడికి బాహ్యస్మృతి రాలేదు. అది చూసి, అంతా ఆందోళన చెంది, ఆ రాత్రికి ఆ వీధినాటకాన్ని మధ్యలోనే ఆపివేశారు.

అప్పటి నుండి గదాధర్‌కు ఇలాంటి సమాధులు తరచూ కలుగసాగాయి. ధ్యానం చేస్తున్నప్పుడు, భగవంతుని కీర్తనలు, స్తోత్రాలు చేస్తున్నప్పుడు, అతడు పరవశత్వం చెందేవాడు. ఆ సమాధిలో అతడి మనస్సు అంతరంగంలో లీనమయ్యేది. లీనమై ఉన్నంతకాలం అతడికి బాహ్యవిషయస్ఫురణ ఉండేది కాదు! ఈ పరవశత్వం అప్పుడప్పుడు మరింత ప్రగాఢమయ్యేది. ఆ స్థితిలో అతడు ఒక శిలావిగ్రహంలా కనిపించేవాడు. బాహ్యస్మృతి వచ్చిన తర్వాత అతణ్ణి ఆ పరవశత్వం గురించి ఇతరులు అడిగేవారు.

11. గదాధర్‌కు పదేపదే భావసమాధులు కలగడం

''నేను ఏ దేవుణ్ణి ధ్యానం చేస్తుంటానో లేదా ఏ దేవీదేవతల కీర్తనలను వింటానో, ఆ దేవీదేవతల దర్శనం నాకు కలుగుతుంటుంది. ఆ సమయంలో వర్ణనాతీతమైన దివ్యానందంలో ఉండిపోతాను'' అని చెప్పేవాడు.

అతడి ఈ ధ్యానపారవశ్యకతలు, భావసమాధులు చంద్రాదేవికి, ఇతర కుటుంబ సభ్యులకు చాలాకాలంవరకు భయాన్నే కలిగించాయి. కాని వాటివల్ల అతడి ఆరోగ్యం చెడకుండడం చూసి, పైగా అతడు తన పనులను మామూలు

గానే చేసుకోవడం చూసి, వారు భయపడడం మానేశారు. అతడు మామూలు గానే ఉల్లాసంగా ఉండడం చూసి వారి భయం తీరిపోయింది.

ఇలాంటి భావసమాధులు తరచూ కలుగుతూండటం చేత గదాధర్ వాటికి అలవాటుపడిపోయాడు. అంతేకాదు, ఆ స్థితి అతడికి 'ఇచ్ఛాధీనం' అయింది. దానితో అతడు సూక్ష్మ ఆధ్యాత్మిక విషయాలను, రకరకాల దేవతల గురించిన సత్యాలను ప్రత్యక్షంగా తెలుసుకోసాగాడు. కాబట్టి ఆ భావసమాధులు అతడికి సంతోషాన్నే కలిగించేవి. భయం కలిగించేవి కావు.

అలా అతడి ఆధ్యాత్మిక ప్రవృత్తి మరింత ప్రగాఢమైంది. శ్రీహరినామ సంకీర్తనం, మానసాదేవి పూజ, ధర్మదేవతార్చన - ఇలా గ్రామంలో జరిగే ప్రతి ధార్మిక కార్యంలో అతడు పాల్గొనడం మొదలుపెట్టాడు. హృదయపూర్వకంగా ఆయా పూజాకార్యకలాపాలను చేసేవాడు.

అతడి ధార్మిక ప్రవృత్తి మహా ఉదారమైనది. అందుకే రకరకాల దేవతలను పూజించే భక్తులనంతా ఒకటిగానే చూసేవాడు. ఎవరినీ ద్వేషించేవాడు కాడు. అందరితో ఒకేవిధమైన మైత్రీభావంతో మెలగేవాడు. ఈ గ్రామంలో మొదటి నుండి వస్తున్న సంప్రదాయం కూడా, అతడి ప్రవృత్తికి దోహదం చేసిందని చెప్పవచ్చు. ఇతర గ్రామాల్లోలా కాక, ఈ గ్రామంలో శైవులు, వైష్ణవులు, శాక్తులు, ఇలా అన్ని సంప్రదాయాలకు చెందిన వారంతా కలసిమెలసి ఉండేవారు. ఎవరికీ మరొకరిపై ఎలాంటి వైషమ్యమూ ఉండేది కాదు. పరస్పరం మైత్రితో మసలు కుంటూ, జీవిస్తూ ఉండేవారు.

గదాధర్‌లో ఆధ్యాత్మిక వికాసం కలుగుతున్నా, అతడు చదువు విషయంలో ఎలాంటి ఉత్సాహమూ చూపలేదు. 'పండిత', 'భట్టాచార్య' మొదలైన బిరు

12. చదువు విషయంలో గదాధర్ ఉదాసీనత

దాంచితుల దైనందిన జీవితాలను అతడు పరిశీలించి చూసేవాడు. వారెంత విద్యావంతులైనా మామూలు జనం మాదిరే జీవించేవారు. లౌకిక సుఖభోగాలకు, ధన సంపదలకు అర్రులు చాచేవారు. చదువుకున్నవారు కూడ అలా ప్రాపంచికప్రాయులుగా ఉండడం చూసి, గదాధర్‌కు విద్య అంటే క్రమంగా ఉదాసీనత ఏర్పడింది. మనుషులు ఏ ఆశయంతో పనులు చేస్తూంటారో, అతని కా ఆశయం తీవ్ర పరిశీలన ద్వారా తెలిసిపోతుండేది. ఆ ఆశయాన్ని తన తండ్రి జీవితాదర్శంతో పోల్చి చూసుకునేవాడు. తన తండ్రికి ఉన్న వైరాగ్యం, దైవభక్తి, సత్యనిష్ఠ, సదాచారం, ఆధ్యాత్మికత, వీటితో బేరీజు వేసుకొని చూసుకునేవాడు. అలా వివేచించి చూశాక అతడికో సత్యం తెలిసింది: 'చాలావరకు ప్రపంచంలో అందరి ప్రధాన ఆశయం ఒక్కటే: అదే భౌతికత' - ఈ సత్యం తెలిసి ఎంతో ఆశ్చర్యపోయేవాడు.

''అయ్యో! అనిత్యమైన ఈ సంసారాన్ని నిత్యమని భావించి మోహగ్రస్తు లౌతున్నారే! ఆ మోహంలో పడిపోయి అనుక్షణం దుఃఖాలను అనుభవిస్తు న్నారే!'' అన్న విషయం తెలుసుకొని గదాధర్ ఎంతో వ్యథ చెందేవాడు. అందుచేత తన జీవితానికి మరొక మలుపు ఇవ్వదలిచాడు. ఇలా అతడు సంకల్పించుకోవ డంలో వింతేమీలేదు కదా!

పదకొండేళ్ల కుర్రవాడికి అంతటి ఆంతరిక అవలోకన, వివేచన సాధ్యమా? - అన్న సందేహం రావడం సహజమే. కాని గదాధర్ మామూలు పిల్లలలాంటి సాధారణ బాలుడు కాడన్న విషయం మనం ముందు గ్రహించాలి. అతడు అసాధారణ ప్రతిభాసంపన్నుడు, అద్భుత మేధాశక్తియుక్తుడు. అంతేకాదు, అతడు విశుద్ధ సంస్కారంతో జన్మించాడు. కాబట్టి వయసులో చిన్నవాడైనప్ప టికీ అతడి కా గంభీర పరిశీలనాశక్తి ఉండడంలో మనం ఆశ్చర్యచకితులం కానక్కరలేదు.

మరొక విషయం. ఎవరు ఏ విధంగా భావించినా, నిజాలను జరిగినవి జరిగినట్లు చెప్పటమే మా కర్తవ్యం. వాటిని మేము సంపూర్ణంగా పరిశీలించి, అవి నిజమేనని రూఢి అయిన తర్వాతనే వాటిని తెలియజేస్తున్నాం.

సరే, ఏది ఏమైనా అప్పటికే అమలులో ఉన్న చదువుపట్ల గదాధర్‌కు క్రమేణా ఉదాసీనత ఏర్పడింది. అది రోజురోజుకూ ఎక్కువ కాసాగింది.

13. గదాధర్ విద్యాభ్యాస పురోగతి

అయినా అతడు మామూలుగా రోజూ బడికి వెళ్లడం మాత్రం మానలేదు. ఆ పాఠాలు నేర్చుకునేవాడు కూడ. మాతృ భాషలో అచ్చయిన పుస్తకాలు చక్కగా చదువుకునేటంత భాషాసామర్థ్యం అతడికి అలవడింది. మాతృభాషలో చక్కగా రాయగలిగేవాడు కూడ. ఆ మాత్రం భాషాజ్ఞానంతో అతడు రామాయణ, భారతాది ఆధ్యాత్మిక గ్రంథాలను చక్కగా చదివేవాడు. అతడు చదువుతుంటే వినేవారు ఎంతో ముగ్ధులయ్యేవారు. అందుచేత అక్షరజ్ఞానంలేని ఆ గ్రామస్థులు, ఆ పవిత్ర గ్రంథాలను అతడి ముఖతా వినేందుకు ఉవ్విళ్లూరేవారు. అతడు కూడ ఎంతో ఆనందంతో చదివి వినిపించే వాడు. సీతానాథ్ పాయిన్, మధుజుగి, మరికొందరు పెద్దమనుషులు గదాధర్‌ను తమ ఇళ్లకు ఆహ్వానించేవారు. అప్పుడు గ్రామంలోని స్త్రీ - పురుషులు పలువురు వారి ఇళ్లకు వెళ్లి, గదాధర్ చదివే పురాణాదులను వినేవారు. రామాయణ భార తాదుల నుండి అతడు తన మధుర కంఠంతో ప్రహ్లాద ధ్రువ చరిత్రలను, ఇతర కథలను చదివి వినిపిస్తుంటే, వారెంతో భక్తిపరవశులై ఆనందించేవారు.

రామాయణ - మహాభారతాలే కాకుండా, అతడు ఇతర గ్రంథాలను కూడ వినిపించేవాడు. ఆ ప్రాంతంలో ప్రజాకవులు రచించిన వివిధ దేవతల

కథాకావ్యాలుండేవి. అవి సరళ పద్యాలలో మనోహరంగా రచించబడ్డవి. ఆ ప్రాంతాల్లో వాటికి జనాదరణ ఎక్కువగా ఉండేది. అవి కామార్పుకూర్‌లో అచ్చు పుస్తకాలుగా దొరికేవి. వాటిలో దేవతల స్వరూప మహిమల, అలౌకిక కర్మల కథలు ఉండేవి. 'తారకేశ్వర శివ ప్రకటన', 'యోగాద్యా మహిమ ప్రకటన సంగీత కావ్యం', 'వన విష్ణుపూర్‌లోని మదనమోహన కథ' - ఆ పుస్తకాల్లో కొన్ని. గదాధర్ వీటిని వినేవాడు. విన్న వెంటనే అతడికి మొత్తం కంఠస్థం అయి పోయేది. తాను విన్నవాటిని, తన దగ్గరున్న పుస్తకాల్లోని కథలను శ్రావ్యంగా చదివి వినిపించేవాడు. అంతేకాదు, గదాధర్ కొన్ని రచనలను స్వదస్తూరీలో రాసుకునేవాడు. అతడి దస్తూరీ ముత్యాల్లా గుండ్రంగా అందంగా ఉండేది. దొరికిన వ్రాతప్రతులకు, పుస్తకాలకు ప్రతులు వ్రాసి పెట్టుకునేవాడు. గదాధర్ స్వయంగా తన చేతివ్రాతతో వ్రాసుకున్న 'రామకృష్ణాయణం, యోగాద్యాకావ్యం, సుబాహు కావ్యం' మొదలైన వాటిని మేము కామార్పుకూర్‌లోని అతడి ఇంట్లో చూశాం. అతడి చేతివ్రాతను పరిశీలించి, అవి అతడు రాసినవేనని తెలుసు కున్నాం.

గ్రామంలోని స్త్రీ పురుషులు కోరినప్పుడల్లా అతడు ఈ కావ్యాలను ఎన్నోసార్లు మధురంగా చదివి వినిపించి ఉంటాడు. అందులో ఏమాత్రమూ సందేహం లేదు.

గణితమంటే అతడికి మొదటి నుండీ ఏవగింపు ఉండేదని చెప్పుకున్నాం కదా! అయినా, బడికి వెళుతూ ఉండడం వల్ల, ఈ గణితంలో కూడా అతడు కొంత అభినివేశం సంపాదించాడు. లెక్కల పట్టీలను, భూకొలతల పట్టీలను కంఠస్థం చేశాడని వినికిడి. గుణకారం, భాగహారం, కూడిక, తీసివేతల్లాంటి వాటిని కూడ కొంతవరకు నేర్చుకున్నాడట.

అతడు పదవ ఏట నుండి భావసమాధులకు లోనుకావడం చూసి, అతడి పెద్దన్న రాంకుమార్, అతడికి బడికి ఎప్పుడైనా వెళ్లే స్వేచ్ఛనిచ్చాడు. అంటే ఇష్టం వచ్చినప్పుడు బడికి వెళ్లడం, ఇష్టం వచ్చిన పాఠాలు నేర్చుకోవడంలో గదాయ్‌కు స్వాతంత్ర్యం ఇచ్చాడు. గదాధర్‌లో వాతం ప్రకోపించిందని అతడు అనుకున్నాడు. అందుచేత తమ్ముణ్ణి బలవంతం చేయకూడదనుకున్నాడు. అంతేకాదు, ఉపాధ్యాయుడు కూడ గదాధర్‌ను ఎక్కువగా ఒత్తిడి చేసేవాడు కాదు. అతడు పాఠాల విషయంలో ప్రగతి చూపకపోయినా, ఉపాధ్యాయుడు శిక్షించే వాడు కాదు.

అందుకే గదాధర్ చదువు, అప్పటి నుండి నత్తనడకనే సాగిందనాలి. అంటే అతడి చదువు అంతగా పురోగమించలేదు.

రెండు సంవత్సరాలు అలాగే దొర్లిపోయాయి. గదాధర్‌కు పన్నెండేళ్లు వచ్చాయి. అతడి రెండవ అన్న రామేశ్వర్. అతడికి ఇరవై రెండేళ్లు. అతడి చెల్లెలు సర్వమంగళకు తొమ్మిదేళ్లు. రామేశ్వర్ యుక్తవయస్కుడు కావడం చూసి, రాంకుమార్ అతడి వివాహానికి ప్రయత్నం చేయసాగాడు. కామార్పుకూర్‌కు దగ్గరలో 'గౌర్ హాటి' అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో రామ్‌సదయ్ వంద్యోపాధ్యాయ అనే వ్యక్తికి ఒక చెల్లెలుంది. ఆమెను రామేశ్వర్‌కు కుదిర్చాడు. చెల్లెలు సర్వమంగళను రామ్‌సదయ్ వివాహం చేసుకోవడానికి ముందుకు వచ్చాడు. ఇలా కుండమార్పిడి సంబంధాలు కావడం చేత 'కన్యాశుల్కం' ఇచ్చే బాధ తప్పింది రాంకుమార్‌కు. అలా వారిద్దరి పెళ్లిళ్లు జరిగిపోయాయి.

14. రామేశ్వర్, సర్వమంగళల వివాహాలు

ఈ రోజుల్లోనే మరో ముఖ్య సంఘటన జరిగింది. రాంకుమార్ కుటుంబంలో, రాంకుమార్ భార్య చాలాకాలంగా నిస్సంతులాగానే ఉండిపోయింది. ఇక ఆమెకు పిల్లలు పుట్టరనీ, ఆమె గొడ్రాలనీ అందరూ భావించారు. కాని, ఆశ్చర్యంగా ఆమె ఇప్పుడు గర్భం ధరించింది. దానితో ఇంట్లో వారంతా ఎంతో సంతోషించారు. సంతోషంతో పాటు వారికి అది విషాదాన్ని కూడ కలిగించింది. ఎందుకంటే, ఆమె గనుక గర్భం ధరిస్తే, బిడ్డను కని చనిపోతుందని రాంకుమారే జోస్యం చెప్పివున్నాడు. అతడి జోస్యం చాలావరకూ కచ్చితంగా జరుగుతూండేది.

భార్య గర్భం ధరించింది మొదలు, రాంకుమార్‌ను దురదృష్టం పట్టుకొంది. అతడి ఆదాయం సన్నగిల్లింది; అతడి ఆరోగ్యం కూడ క్షీణించసాగింది. అంతేకాదు, పనులు చేసుకోవడంలో అతడికున్న శక్తిసామర్థ్యాలు కూడ తగ్గసాగాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, అతడి భార్య ప్రవర్తన మరో ఎత్తయింది. ఆమెలో విపరీతమైన మార్పు వచ్చింది. ఇంట్లో కులదైవం శ్రీరఘువీరుని పూజ ముగిసేదాకా, ఉపనయనం జరగని చిన్నపిల్లలు, రోగులు తప్ప మిగతా వారెవ్వరూ పచ్చి మంచినీళ్లు కూడ ముట్టేవారు కారు. అది ఖుదీరామ్ కాలం నుండి వస్తున్న నియమం. అంతకాలం ఆమె కూడ ఆ నియమాన్ని పాటించింది. కాని గర్భవతి అయిన తర్వాత ఎందుకో ఆ నియమాన్ని ఉల్లంఘించడం మొదలుపెట్టింది. అది చూసి ఏదైనా అనర్థం వాటిల్లుతుందేమోనని భయపడి ఇంట్లోవారు ఆమెను అలా చేయవద్దని ఎంతగా వారించినా, నచ్చచెప్పినా ఆమె వారి మాటలు ఖాతరుచేయలేదు. అంతేగాక చిన్న చిన్న విషయాలలో ఇంట్లో వారందరితో గిల్లికజ్జాలు పెట్టుకోసాగింది. ఈమె యీ ప్రవర్తన మూలంగా

15. గర్భిణిగా ఉన్నప్పుడు రాంకుమార్ భార్య ప్రవర్తనలో మార్పు

కుటుంబం చింతాక్రాంతమైంది. ఆమె విపరీత ప్రవర్తనకు అటు భర్త రాంకుమార్, ఇటు అత్తగారు చంద్రాదేవి తమ అసమ్మతి వ్యక్తంచేసినా ఆమె ధోరణి మారలేదు. గర్భం ధరించాక కొందరి స్త్రీలలో తరచూ అటువంటి పరిణామాలు కలగడం సహజమేమోనని భావించి, వారు ఆమె విషయంలో సర్దుకుపోయారు. అయినప్పటికీ శాంతికి నెలవైన ఆ ధార్మిక కుటుంబంలో ఆ సమయంలో సదా అశాంతి మాత్రమే వాసం చేయసాగింది.

రాంకుమార్ పెద్దతమ్ముడికి చాలినంత చదువు ఉన్నప్పటికీ, సంపాదనలో అంతంత మాత్రంగానే ఉన్నాడు. కుటుంబ సభ్యుల సంఖ్య పెరగడం, ఆదాయం

16. రాంకుమార్ ఆర్థిక దుఃస్థితి

తగ్గడంతో ఒడుదొడుకులు లేకుండా కుటుంబం గడవడం కష్టమైపోయింది. ఈ ఆర్థిక దుఃస్థితి చూసి రాంకుమార్ ఎంతో ఆందోళన చెందాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా అందుకు ప్రతిక్రియ చేయలేకపోయాడు. ఏదో ఒక అదృశ్యశక్తి అతడి ప్రయత్నాలను వమ్ముచేస్తున్నట్లుగా తోచేది. ఆ తీరని చింతలతో, వ్యథలతో అతడికి జీవితమే భారమైపోయింది. రోజులు, నెలలు గడిచేకొద్దీ, అతడి భార్య ప్రసవించే సమయం దగ్గర పడేకొద్దీ, భార్య గురించిన తన జోస్యం జ్ఞాపకం చేసుకొంటూ రాంకుమార్ మరింత ఖిన్నుడవసాగాడు.

చిట్టచివరకు రాంకుమార్ భార్య 1849వ సం॥లో ముద్దులు మూటగట్టే

17. రాంకుమార్ భార్య మరణించడం

మగబిడ్డను ప్రసవించి, ఆ బిడ్డడి ముఖం వంకే చూస్తూ ప్రాణాలు విడిచింది. ఆ పేదకుటుంబంలో మళ్లీ దుఃఖం అలముకొంది.

8. యౌవన ప్రాదుర్భావం

భార్య మరణానంతరం కూడ రాంకుమార్‌ను దురదృష్టం వెన్నంటే రాసాగింది.

1. కలకత్తాలో రాంకుమార్ సంస్కృత పాఠశాలను ప్రారంభించడం

అతడు మరింత పేదరికం అనుభవించసాగాడు. స్వాధ్యాయనాది కార్యాలు జరిపించడం మూలంగా వచ్చే రాబడికూడ బాగా తగ్గిపోయింది. తమ చిన్ని పొలం లక్ష్మీజల నుండి పండే ధాన్యం తమ కుటుంబానికి సరిపోయినప్పటికీ, నిత్యావసరాలు సమకూర్చుకోవడం ఎంతో కష్టమవసాగింది. ముసలి తల్లికీ, తల్లిలేని బిడ్డ అక్షయ్‌కు కావలసిన పాలు అప్పుచేసి కొనుగోలు చేయవలసివచ్చేది. ఆ విధంగా రాంకుమార్ అప్పుల్లోపడ్డాడు. ఆ అప్పులు రోజురోజుకూ పెరగసాగాయి. మరోచోట మరింత ఎక్కువ ఆదాయం లభించవచ్చునే మిత్రుల సలహా మేరకు రాంకుమార్, కామార్పుకూర్ వదలి వెళ్లాలని సన్నాహాలు చేసుకోసాగాడు. భార్య మరణం కూడ ఈ స్థలమార్పుకు దోహదం చేసింది. అలా వెళ్లటం వలన తనకు కొంత మనశ్శాంతి కూడ లభిస్తుందని ఆశించాడు. కలకత్తా లేక బర్ద్వాన్‌లలో ఎక్కడ ఆదాయం పెంపొందించుకోవచ్చునని తర్జనభర్జనలు చేశాడు. చివరకు కలకత్తాకే వెళ్లడానికి నిర్ణయించాడు. అందుకు కారణం: శిహోర్ వాస్తవ్యుడైన మహేశ్‌చంద్ర ఛటోపాధ్యాయ్, దేరా వాస్తవ్యుడు రామధన్ ఘోష్ మొదలైన తాను ఎరిగిన వ్యక్తులు కలకత్తాకు వలసపోయి ఆర్థికంగా బాగా నిలదొక్కుకోగలిగారని రాంకుమార్ మిత్రులు సూచించడమే. పైగా పైన పేర్కొన్న వ్యక్తులు తెలివితేటలలోను, చదువులోను, శీలసంపదలోను రాంకుమార్‌కు తీసికట్టే. ఈ విషయాలన్నీ బాగా యోచించి, కుటుంబ బాధ్యతను రామేశ్వర్‌కు అప్పగించి, రాంకుమార్ కలకత్తాకు వెళ్లాడు. అక్కడ ఝామాపుకూర్ అనే పేటలో ఒక సంస్కృత పాఠశాలను ప్రారంభించి, పిల్లలకు సంస్కృతం నేర్పసాగాడు.

రాంకుమార్ భార్య మరణం ఆ కుటుంబంలో అనేక మార్పులు కొనితెచ్చింది. రాంకుమార్ పసిబిడ్డ అక్షయ్ బాధ్యతతో సహా ఇంటి విధులన్నీ

2. కుటుంబంపై రాంకుమార్ భార్య మరణం చూపిన ప్రభావం

ఇప్పుడు చంద్రాదేవి నిర్వహించవలసి వచ్చింది. రామేశ్వర్ భార్య తన శక్తి మేరకు అత్తగారికి సహాయపడినప్పటికీ, మరీ చిన్నపిల్ల కావడంచేత ఆమె సహాయం అంతంత మాత్రమే. కనుక రఘువీరుని పూజాదికాలు, అక్షయ్ ఆలనాపాలనా, వంటావార్పులూ మొత్తం చంద్రాదేవియే చూసుకోవలసిన అగత్యం ఏర్పడింది. దీనితో ఆమెకు క్షణం తీరిక ఉండేదికాదు. నలభై ఎనిమిదేళ్ల ఆమెకు ఇలా ఇంటి పనులన్నీ చూసుకోవడం ఎంతో కష్టంగానే ఉండేది. కాని శ్రీరఘువీరుని సంకల్పం అలా ఉందని గ్రహించి ఆమె దాని గురించి ఎలాటి బాధనూ వ్యక్తం చేసేది కాదు.

కుటుంబ ఆదాయ వ్యయాలను చూసుకోవలసిన బాధ్యత ఇప్పుడు రామేశ్వర్‌పై పడింది. కాని అతడి చదువు సంధ్యలు ఎన్నడూ అతడికి మంచి

3. రామేశ్వర్ ఉదంతం

సంపాదనను అందివ్వలేకపోయాయి. పైగా పరివ్రాజకులైన సాధుసన్న్యాసులు తారసపడ్డప్పుడు వారితో మాట్లాడుతూ ఎంతో సమయం వెచ్చించడమే కాక, వారి అవసరాలను తీర్చడంలోనూ వెనుకాడేవాడు కాడు. అందుచేత ఇంతకు మునుపుకంటే అతడి సంపాదన మెరుగుపడ్డా అతడు కుటుంబం అప్పు తీర్చలేకపోయాడు. కుటుంబపు అత్యావశ్యకాలు మాత్రం తీర్చగలిగేవాడు. ఎన్నడూ డబ్బు పొదుపు చేయలేక పోయాడు. కొన్ని సందర్భాలలో రాబడిని మించిన ఖర్చులు చేసి స్వేచ్ఛాజీవనం గడుపుతూ, 'శ్రీరఘువీరుడే ఏదో విధంగా కుటుంబాన్ని రక్షిస్తాడు' అనుకొనే వాడు.

తన చిన్న తమ్ముడైన గదాధర్‌ను, రామేశ్వర్ ప్రేమించినప్పటికీ, చదువు సంధ్యల్లో అతడి పురోగతిని గురించి ఎన్నడూ శ్రద్ధవహించి ఎరుగడు. అటు

4. గదాధర్ గురించి రామేశ్వర్ ఆలోచనలు

వంటి శ్రద్ధవహించే మనస్తత్వం రామేశ్వర్‌కు లేకపోవడమే కాక, ధనార్జన నిమిత్తం అతడు పలుచోట్లకు తిరగవలసిన అగత్యం కూడ ఒకటి ఉంది. ఆ విధంగా అతడికి తమ్ముడి చదువు గురించి పట్టించుకొనే ఆసక్తిగాని, తీరికగాని ఉండేది కాదు. పైగా గదాధర్ వివేచనాత్మక ప్రవృత్తి అతణ్ణి ఎన్నటికీ చెడుత్రోవ తొక్కనివ్వదని రామేశ్వర్ ప్రగాఢ విశ్వాసం. ఎందుకంటే అంత చిన్న వయస్సులోనే అద్భుత ఆధ్యాత్మిక భావ వికాసం అతడిలో చూశాడు కనుక. గ్రామంలోని స్త్రీపురుషు లందరూ గదాధర్ పట్ల ప్రగాఢ విశ్వాసం కలిగివుండి అతణ్ణి ఎంతగానో ప్రేమించడం చూసిన

రామేశ్వర్ విశ్వాసం మరింత ప్రగాఢమైంది. అందుచేత నిజంగా మంచివాడు, సచ్ఛరిత్రుడు కానివాడెవ్వడూ అందరి ప్రశంసలను అందుకోజాలడని, అందరి హృదయాలను ఆకర్షించలేడని అతడు అవగాహన చేసుకున్నాడు. దానితో తమ్ముని గూర్చి ఎక్కువగా ఆందోళన పడకుండా, అతడి భావిమహోదయం కోసం ఆనందంతో ఎదురు చూడసాగాడు. రాంకుమార్ కలకత్తాకు వెళ్లినప్పుడు గదాధర్ వయసు 13 ఏళ్లు. ఇప్పుడు అతణ్ణి నియంత్రించేవారెవ్వరూ లేకపోవడం వల్ల, ఇచ్ఛమేరకు వెళ్లే అవకాశం గదాధర్‌కు వచ్చింది.

5. ఈ సమయంలో గదాధర్ మానసిక స్థితి, వైఖరి

ఇంత చిన్నవయసులో గదాధర్ ఆంతరికదృష్టి ఎంతో వికసించిందని, ఇతరుల కార్యకలాపాల వెనుక నున్న వారి వారి ఉద్దేశాలను అతడు చక్కగా తెలుసుకునేవాడని మనం ఇదివరకే చెప్పుకున్నాం. బడికి వెళ్లి చదువుకోవడం, సంస్కృతంలో పారంగతుడై బిరుదులు పొందడం - వీటన్నింటి వెనుక ఒకే ఒక లక్ష్యం ఉందని - అది 'డబ్బు సంపాదనే' అని అతడు గ్రహించాడు. అతడి మాటల్లో చెప్పాలంటే, ఆ లక్ష్యం 'బియ్యం - అరటికాయలను మూటకట్టుకోవడం'. సాంసారిక సుఖభోగాల కోసం తమ శక్తిసంపదల నన్నింటినీ వ్యయంచేసే వారెవ్వరూ, తమ తండ్రిలా సత్యనిష్ఠులు, సచ్ఛరిత్రులు కాలేరని, వారు భగవద్దర్శనాన్ని పొందలేరని అతడు తెలుసుకున్నాడు. స్వార్థంతో అంధులైనవారు, భూమి కోసం లేదా ఇతర సంపదల కోసం పరస్పరం పోట్లాడుకోవడం, న్యాయస్థానాల చుట్టూ తిరగడం అతడు గమనించాడు. వారు ఇళ్లను, భూములను కొలిచి, 'ఈ భాగం నీది, ఈ భాగం నాది' అని పంచుకోవడం అతడు గమనించాడు. వారు తమది అనుకున్న భాగాన్ని కొన్నిరోజులు భోగించారో లేదో వారిని మృత్యువు స్వాహా చేసేది. ఇలాంటి సంఘటనలను కొన్నింటిని గదాధర్ కళ్లారా చూశాడు. దానితో 'ధనం, భోగేచ్ఛ'లే మనిషి జీవితంలోని అనర్థాలన్నింటికీ కారణమన్న నిర్ణయానికి వచ్చాడు. అందుచేత ధనసంపాదనే ప్రధాన లక్ష్యమైన చదువు మీద అతడికి రోజురోజుకూ ఏవగింపు అధికరించిందంటే దానిలో విడ్డూరమేమీ లేదు. అందుకు బదులుగా భగవంతునిపట్ల భక్తిప్రేమలను పెంపొందించుకోవడమే మానవజీవిత ప్రధానలక్ష్యమనే నిర్ణయానికి వచ్చాడు. దానితో తండ్రిలా మామూలు వస్త్రాలతో, అంటే జీవించడానికి కావలసిన అత్యవసర వస్తువులతో సంతుష్టుడై ఉండసాగాడు. కాని మిత్రులపైనున్న ప్రేమకొద్దీ బడికి వెళ్లడం కొంత కాలం వరకు కొనసాగించాడు. ఇప్పుడు అతడు శ్రీరఘువీరుని పూజలో, ఇంటిపనుల్లో తల్లికి తోడ్పడుతూ ఎక్కువకాలం గడపసాగాడు. ఈ పనులన్నీ అయ్యేవరకు అతడు ఇంట్లోనే ఉండవలసి వచ్చేది. అప్పటికే మధ్యాహ్నమయ్యేది.

గదాధర్ ఇప్పుడు చాలావరకు ఇంట్లోనే ఉండడంవల్ల గ్రామంలోని మహిళలకు అతణ్ణి చూసే మంచి అవకాశం లభించింది. వారు తమ ఇంటిపనుల్లో ఏమాత్రం తీరిక చిక్కినా, చంద్రాదేవి వద్దకు వచ్చేవారు. అప్పుడు గదాధర్ అక్కడ ఉంటే, అతణ్ణి పాటలు పాడమని అడిగేవారు. కొన్నిసార్లు పురాణ కథలను చదివి వినిపించమని కోరేవారు. అవకాశ మున్నంతవరకూ అతడుకూడ వారి కోరికలను నెరవేర్చేవాడు. ఒకవేళ ఆ సమయాల్లో అతడు తల్లికి ఇంటి పనుల్లో తోడ్పడుతుంటే వారంతా కలసి ఆ పనులు చేసిపెట్టి, అతడికి తీరిక కల్పించి అతడి పాటలూ, కథలూ వినేవారు. వారందరికీ ఇది దాదాపు ఒక దైనందిన కార్యక్రమమైపోయింది. ఆ మహిళలు అతడి సమక్షంలో శ్రవణం చేస్తూ ఎంతో ఆనందించేవారు. అందుచేత అతడి పాటలను, కథలను చాలా సేపటి వరకు విని, ఆనందించేందుకు వారు తమ ఇంటి పనులను సాధ్యమైనంత త్వరగా ముగించుకునేవారు.

6. గ్రామంలోని స్త్రీల కోసం గదాధర్ పురాణ పఠనం, సంకీర్తనాదులు

గదాధర్ ఆ గ్రామీణ స్త్రీలకు పాటలు, కథలు వినిపించి ఆనందింప చేయడమేకాక, వారిని ఇతర విధాలకూడ ఆనందింపచేసేవాడు. అప్పుడు ఆ గ్రామంలో 'యాత్ర' (వీధినాటకా)లు ఆడడానికి మూడు బృందాలుండేవి. 'బావుల్' పాటగాళ్ళు, 'కవులు' కూడ ఉండేవారు. ఆ ఊళ్లో చాలామంది వైష్ణవులుండేవారు. వారింట్లో దాదాపు ప్రతి రాత్రీ భాగవత పఠనమో, హరినామ సంకీర్తనమో జరుగుతూ ఉండేది. గదాధర్ ఏకసంథాగ్రాహి. ఒకమారు వింటే చాలు, అతనికది జ్ఞాపకంలో ఉండిపోయేది. అలా చిన్నప్పటినుండి తాను విన్న సంగీత రచనలను, నాటకాలను, పాటలను, స్తోత్రాలను మొదలైనవెన్నో అతడికి కంఠస్థమైపోయాయి. అందుచేత అతడు వినోదంలో ప్రత్యేకత కోసం ఒకమారు 'యాత్ర' నాటకం వేసేవాడు. మరొకమారు పాటలు పాడేవాడు. మరోసారి సంకీర్తనం చేసేవాడు. నాటకంలో వివిధ పాత్రలను తానొక్కడే పోషించేవాడు. అంటే బహుపాత్రలను తానే ధరించి, పాడి చూపేవాడు. ఆయా పాత్రల కనుగుణంగా, తన కంఠస్వరాలను మారుస్తూ ఉండేవాడు. ఎప్పుడైనా తల్లిగాని, మరెవ్వరైనా స్త్రీగాని విషాదవదనంతో కనిపిస్తే, నాటకంలోని హాస్యపాత్రలను అభినయించి వారి విషాదాన్ని పోగొట్టే ప్రయత్నం చేసేవాడు. లేకపోతే ఊళ్లోని అందరికీ తెలిసిన ఎవరో ఒక వ్యక్తిని అనుకరించి చూపేవాడు. ఆ అనుకరణ ఎంత సహజంగా ఉండేదంటే, దాన్ని చూసిన వారంతా కడుపుబ్బ నవ్వేవారు.

ఇలా గదాధర్ ఆ గ్రామంలోని స్త్రీలందరి పైన ఒక అపూర్వ ప్రాబల్యాన్ని సంపాదించుకున్నాడు. అతడి జనన సమయంలో అతడి తల్లికి విచిత్రస్వప్నాలు

రావడం, దివ్యదర్శనాలు కలగడం వారికి తెలుసు. అతడు ఆయాదేవతల భావావేశం పొందినప్పుడు, అతడి మనశ్శరీరాలు అద్భుత రీతిలో మార్పులు చెందడం వారు చూసివున్నారు. అంతే కాక అతడికున్న ప్రగాఢ భగవద్భక్తి, పురాణ పఠనంలో అతని తన్మయత, అతి మధురంగా అతడు పాడేపాటలు, తమందరితో ఎలాంటి అరమరికలూ లేకుండా పరమ ఆత్మీయతతో మెలగడం, ఆప్యాయంగా ఉండడం - ఇవన్నీ ఆ స్త్రీల కోమల హృదయాల్లో అతడిపట్ల అపూర్వ భక్తిప్రేమలను కలిగించాయనడంలో ఆశ్చర్యం లేదు. ధర్మదాస్ లాహా సోదరి ప్రసన్నమయి, ఇతర స్త్రీలు అతడిలో బాలగోపాలుని దివ్యచైతన్యాన్ని చూసి, తమ బిడ్డలకన్నా ఎక్కువగా అతణ్ణి ప్రేమించేవారని మేము విన్నాం. అలాగే యువతులు అతణ్ణి శ్రీకృష్ణాంశసంభూతునిగా భావించి సఖీభావంతో ప్రేమిస్తూ ఉండేవారు. వారిలో చాలామంది వైష్ణవ కుటుంబాల్లో జన్మించినవారే. వారి ఆధ్యాత్మిక జీవనంలో వారి సరళమైన విశ్వాసం ప్రధానమైన అంశం. కాబట్టి సద్గుణసంపన్నుడు, ప్రియదర్శనుడైన గదాధర్‌ను వారు దైవసమునిగా భావించడంలో ఆశ్చర్యంలేదు. అతడిపై వారికంతగా నమ్మకం ఉండడంవల్లే, తమ అంతరంగపు టాలోచనల నన్నింటినీ వారు దాచుకోకుండా అతడికి చెప్పేవారు. అతడి సలహాలను పొందే వారు, పాటించేవారు. అలాంటి సమయాల్లో గదాధర్ కూడ ఆ స్త్రీలలో ఒకతెగా ప్రవర్తించేవాడు.[1]

6. గదాధర్ పట్ల గ్రామంలోని స్త్రీల భక్తిప్రపత్తులు

గదాధర్ అప్పుడప్పుడు స్త్రీ వేషభూషణాదులను ధరించి ప్రసిద్ధ స్త్రీ పాత్రలను అభినయించేవాడు. తన మహిళా నేస్తాలు కోరినప్పుడు అతడు శ్రీమతి రాధారాణి పాత్రనో, ఆమె ప్రధాన సఖిపాత్రనో అభినయించేవాడు. అలాంటి సమయాల్లో అతడి అంగభంగిమలు, హావభావాలు, కంఠస్వరం అచ్చు స్త్రీల మాదిరిగానే ఉండేది. అలాంటప్పుడు అతణ్ణి గుర్తించటం ఎవరికీ సాధ్యం అయ్యేది కాదని ఆ స్త్రీలు చెబుతూండేవారు. స్త్రీల ప్రవర్తనారీతులను గదాధర్ ఎంత సూక్ష్మంగా పరిశీలించాడో దీని ద్వారా వెల్లడవుతుంది. వినోద ప్రియుడైన గదాధర్ స్త్రీవేషం ధరించి, చంకలో బిందె నుంచుకుని నీళ్ల తీసుకురావడానికి పురుషుల ముందు నుండే హల్దార్పుకూర్‌కు నడచివెళుతున్నప్పుడు అతడు కాదనే సందేహం ఎవరికీ కలిగేది కాదు.

8. స్త్రీ వేషధారణలో గదాధర్

---

1. II. 14 లో నమోదు చేసిన అంశాలను పరికిస్తే ఆ కాలఘట్టంలో తాను పూర్తిగా ఒక స్త్రీగా ఉండాలనే బలమైన కోర్కె గదాధర్‌కు కలిగిందని తెలియవస్తుంది.

గ్రామంలోని సంపన్న గృహస్థుడైన సీతానాథ్ పాయిన్ గూర్చి ముందే చెప్పివున్నాం. అతనికి ఏడుగురు కుమారులు, ఎనిమిదిమంది కూతుళ్లు ఉండే

9. గదాధర్: సీతానాథ్ పాయిన్ కుటుంబం

వారు. పెళ్లయిన తర్వాత కూడా వారంతా అతడి ఇంట్లోనే ఉమ్మడి కుటుంబంగా ఉండేవారు. ఆ కుటుంబం ఎంత పెద్దదంటే, వంటలో తాలింపు కోసం కావలసిన సంబారాన్ని పొడిచేయడానికి రోజూ పది రుబ్బురోళ్ళను ఉపయోగించేవారట! సీతానాథ్ దూరపు బంధువులు చాలామంది కూడ అతడి ఇంటికి దగ్గరలోనే ఇళ్లు కట్టుకుని నివసించేవారు. కాబట్టే వారుండే పేటకు 'వణిక్‌పల్లె' (వ్యాపారుల పేట) అనే పేరొచ్చింది. వారి ఇళ్లు ఖుదీరామ్ ఇంటికి దగ్గరలోనే ఉండేవి. అందువల్ల ఆ కుటుంబాలకు చెందిన పలువురు స్త్రీలు, ముఖ్యంగా సీతానాథ్ భార్య, కూతుళ్లు చంద్రాదేవి దగ్గరకు సమయం దొరికినప్పుడల్లా వస్తూ ఉండేవారు. ఇలా గదాధర్‌కు, వారికి మధ్య మంచి స్నేహం ఏర్పడింది. వారతణ్ణి చాలాసార్లు తమ ఇంటికి తీసుకుని పోయేవారు. అతణ్ణి స్త్రీ వేషం వేసుకోమని, ఆ వేషంలో అభినయించమని అర్థించేవారు. సీతానాథ్ బంధువులంతా, తమ స్త్రీలను సీతానాథ్ ఇంటికి తప్ప మరెక్కడికీ వెళ్లవద్దని కట్టడి చేసేవారు. కాబట్టి వేరేచోట వారికి గదాధర్ పురాణ పఠనం, కీర్తనలు వినే అదృష్టం ఉండేది కాదు. అందుచేత వారిలా అతణ్ణి తమ ఇళ్లకు తీసుకుని వెళ్లేవారు. విని ఆనందించేవారు. చంద్రాదేవి వద్దకు వెళ్లలేని చాలామంది స్త్రీలు, సీతానాథ్ ఇంట్లో గదాధరుణ్ణి చూసి, అతడి పట్ల ఎంతో ముగ్ధులయ్యేవారు. గదాధర్ సీతానాథ్ ఇంట్లో ఉన్నాడన్న విషయం తెలిస్తే చాలు వారు వెంటనే అక్కడికి వెళ్లి, అతడి పురాణ పఠనాన్ని - పాటలను వింటూ, అతడి అభినయాన్ని, పాత్రానుకరణమూ చూస్తూ ఎంతో ఆనందించేవారు. గృహ యజమాని సీతానాథ్ అతణ్ణి ఎంతో అభిమానించేవాడు. అంతేకాదు, వణిక్‌పల్లెలోని చాలామంది మగవారికి అతడి సద్గుణాల గురించి చక్కగా తెలుసు. అందుకే తమ ఇంటి స్త్రీలు అతడి వద్దకు వెళ్లి, అలా శ్రవణం, దర్శనం చేస్తూన్నా ఎలాంటి అభ్యంతరం చెప్పేవారు కాదు. కాని దుర్గాదాస్ పాయిన్ అనే ఒక వ్యక్తి మాత్రం అభ్యంతరం చెప్పేవాడు. అతడికి కూడ గదాధర్ పట్ల సదభిప్రాయం ఉంది, అతడంటే ఇష్టమూవుంది. కాని స్త్రీలను ఇచ్ఛ వచ్చినట్లు పంపించే విషయంలో మాత్రం, తమ కుటుంబ ఆచారం రీత్యా ఒప్పుకునేవాడు కాదు. తమ కుటుంబంలోని స్త్రీలను ఎప్పుడూ, ఎవరూ చూసి ఎరుగరని, తన ఇంటి అంతఃపుర విషయాలు ఎవరికీ తెలియవని సీతానాథ్, ఇతర బంధువుల ముందు అతడు గర్వంగా ప్రగల్భాలు పలికేవాడు. పైగా తన (కుటుంబ స్త్రీల) మాదిరి పరదా పద్ధతిని కచ్చితంగా అమలుపరచనివారిని అతడు చులకనభావంతో చూసేవాడు.

దుర్గాదాస్ ఒకరోజు ఒక బంధువు ముందు ఇలా బడాయికి పోతున్నాడు. అప్పుడే గదాధర్ అక్కడికి వచ్చాడు. ఆ బడాయి మాటలు విన్నాడు. ''పరదాలో ఉంచి ఎవరైనా స్త్రీలను కాపాడగలరా? సచ్ఛీలం - భగవద్భక్తి, ఇవి మాత్రమే వారిని రక్షిస్తాయి. నేను తలచుకుంటే, మీ అంతఃపురాన్నే కాదు, అక్కడ ఉండే స్త్రీల నందరినీ చూడగలను'' అని చెప్పాడు. ఆ మాటలు విని దుర్గాదాస్ మరింత గర్వంతో, ''చూద్దాం. నువ్వు అంతఃపురంలోకి ఎలా వెళతావో?'' అని అన్నాడు. గదాధర్ కూడా ''అలాగే'' అంటూ వచ్చేశాడు.

10. దుర్గాదాస్ గర్వభంగం

ఇది జరిగాక ఒకరోజు మధ్యాహ్నం పూట ఎవరితోనూ ఏమీ చెప్పకుండా గదాధర్ ఒక మాసిన ముతకచీర కట్టుకున్నాడు, చేతులకు వెండి కడియాలు ధరించాడు. అలా ఒక సాలె యువతి వేషం ధరించాడు. చీకటి పడడానికి కాస్త ముందుగా నెత్తి మీద ముసుగువేసుకుని, చంకలో ఒక బుట్ట పుచ్చుకుని, బజారు దారిన దుర్గాదాస్ ఇంటికి వచ్చాడు. దుర్గాదాస్ ఇంటి వసారాలో కూర్చుని కొంత మంది స్నేహితులతో మాట్లాడుతున్నాడు. గదాధర్ అతడి వద్దకు వచ్చి, తానొక సాలె స్త్రీనని, నూలు అమ్మడానికి సంతకు వచ్చానని, అయితే దురదృష్టం కొద్దీ తన స్నేహితురాళ్లు తనను వదలిపెట్టి వెళ్లిపోయారని చెప్పుకున్నాడు. ఆ రాత్రికి తనకు అక్కడ ఆశ్రయం ఇవ్వమని అడిగాడు. దుర్గాదాస్ ఆమె గ్రామం పేరు వగైరా వివరాలు అడిగాడు. ఆమె తెలిపిన జవాబులతో సంతృప్తుడయ్యాడు. ''సరే, లోనికి వెళ్లు. ఆడవాళ్లతోపాటు ఉండు'' అని చెప్పాడు. గదాధర్ కృతజ్ఞత చెప్పి, తల వంచుకొని లోపలికి వెళ్లాడు. తన 'కథను' అతడు అక్కడి స్త్రీలకు చెప్పి, వారితో కబుర్లలో పడ్డాడు. అంతచిన్నవయసులో ఉన్న ఆమెను చూసి, ఆమె తియ్యని పలుకులు విని వారు ఎంతో మురిసిపోయి, ఆమెను తమతో పాటుగా ఉండనిచ్చారు. ఆమెకో చోటు చూపి, పడుకోమని చెప్పారు. అక్కడ కూర్చుని, అటుకులు తింటూ లోపలి గదుల నన్నింటినీ, అందరినీ నిశితంగా అతడు పరిశీలించాడు. వారు మాట్లాడుకునే మాటలన్నీ విన్నాడు. వారి కబుర్లలో తానూ పాల్గొన్నాడు. అప్పుడప్పుడు వారిని కొన్ని ప్రశ్నలు కూడ అడిగాడు. ఇలా రాత్రి చాలాసేపు గడిచిపోయింది.

అంత రాత్రి పొద్దుపోయినా గదాధర్ ఇంటికి రాకపోవడంతో తల్లి చంద్రాదేవి కంగారుపడి, రామేశ్వర్‌ను వెదకడానికి పంపించింది. అతడు తరచూ వణిక్ పల్లి వెళతాడు కాబట్టి, అక్కడే వెదకమని చెప్పింది. రామేశ్వర్ మొదట సీతానాథ్ పాయిన్ ఇంటికి వెళ్లాడు. గదాధర్ అక్కడ లేకపోవడంతో, అతడు దుర్గాదాస్ ఇంటి వద్దకు వచ్చి, బిగ్గరగా తమ్ముణ్ణి పిలవసాగాడు. అన్న పిలుపు విని, అప్పటికే

చాలా రాత్రయిందని గదాధర్ గ్రహించాడు. వెంటనే జవాబుగా ''అన్నా! ఇదిగో వచ్చేస్తున్నాను'' అని లోపలి నుండే అరుస్తూ బయటకు వచ్చాడు. దుర్గాదాస్‌కు అప్పుడు స్పష్టంగా జరిగింది తెలిసిపోయింది. తాను, తన కుటుంబం ఇలా పూర్తిగా మోసపోవడం చూసి మొదట చాలా కోపానికి, సిగ్గుకు లోనయ్యాడు. కాని మరుక్షణమే గదాధర్ ఆ సాలెస్త్రీ పాత్రను ఎంత చక్కగా అభినయించాడో గుర్తుతెచ్చుకుని హాయిగా నవ్వుకున్నాడు. మరునాడు జరిగిన సంఘటన అంతా విని దుర్గాదాస్ గర్వాన్ని గదాధర్ అలా భంగపరచడం చూసి సీతానాథ్, అతడి బంధువులంతా ఎంతో సంతోషించారు. అప్పటి నుండి గదాధర్, సీతానాథ్‌పాయిన్ ఇంటికి వచ్చినప్పుడల్లా, దుర్గాదాస్ ఇంటి స్త్రీలు కూడ అక్కడికి రాసాగారు.

11. గదాధర్ పట్ల వణిక్‌పల్లెలోని వైశ్య స్త్రీల భక్తివిశ్వాసాలు

ఇలా సీతానాథ్ కుటుంబానికీ, వణిక్‌పల్లెలోని స్త్రీలందరికీ గదాధర్ పట్ల క్రమంగా అనురాగం అధికం కాసాగాయి. ఏ కారణంగానైనా వారతణ్ణి కొన్ని రోజులు వరుసగా చూడకపోతే, మనిషిని పంపించి అతణ్ణి తమ ఇళ్లకు పిలిపించుకునేవారు. సీతానాథ్ ఇంట్లో పురాణం పఠిస్తున్నప్పుడుగానీ, లేదా పాటలు పాడుతున్నప్పుడుగానీ అతడు ఒక్కోమారు భావసమాధి పొందుతూ ఉండేవాడు. అలాంటి స్థితుల్లో అతణ్ణి చూసిన తర్వాత అతడిపట్ల వారి భక్తిభావం మరింత ఇనుమడించింది. అలా అతడు భావసమాధి పొందిన సమయాల్లో అతణ్ణి సచేతన శ్రీకృష్ణునిగానో, శ్రీచైతన్యమహాప్రభువుగానో ఎంచి, వారిలో పలువురు అతణ్ణి పూజించేవారని, అతడి నృత్యానికి అనుగుణంగా ఒక బంగారు పిల్లన గ్రోవిని, స్త్రీపురుష పాత్రలకు యుక్తమైన దుస్తులను కొన్నింటిని వారతడి కోసం చేయించారని మేము విన్నాం.

12. గదాధర్ గురించి శ్రీమతి రుక్మిణి వివరణ

గదాధర్ ఆధ్యాత్మికత, పవిత్రత, నిశితబుద్ధి, ప్రేమ, అమాయకత్వం, సరళ ప్రవర్తన ఇవన్నీ నాటి కాలపు గ్రామీణ స్త్రీలపై ఎలాంటి ప్రభావాన్ని చూపాయో, ఆ విషయమై వారిలో కొందరు స్వయంగా చెప్పగా వినే అవకాశం అప్పుడప్పుడు మాకు కలిగింది.

1893వ సంవత్సరంలో స్వామి రామకృష్ణానందతో పాటుగా మేము కొంతమందిమి కామార్పుకూర్ వెళ్లాం. అప్పటికి అరవైఏళ్లు నిండిన శ్రీమతి రుక్మిణీదేవిని దర్శించాం. ఆమె శ్రీ సీతానాథ్ పాయిన్‌గారి కుమార్తె. ఆమె మాకు చెప్పిన విషయాన్ని చదివాక పాఠకులు గదాధర్ ప్రభావాన్ని అర్థం చేసుకో గలరు.

ఉత్తరదిక్కుగా చూపిస్తూ, రుక్మిణీదేవి ఇలా చెప్పింది:

''అదిగో అటు చూడండి. అక్కడే మా పాత ఇల్లు ఉండేది. మా కుటుంబానికి చెందిన వా రెవ్వరూ దాదాపుగా ఇప్పుడు లేరనే చెప్పవచ్చు. అందుకే అక్కడ ఎవరూ ఉండడం లేదు. ఇప్పుడదంతా శిథిలమైపోయింది. అయితే నాకు పదిహేడు, పద్దెనిమిది ఏళ్ల ప్రాయంలో, ఆ ఇల్లు ఒక శ్రీమంతుల భవనంలా కళకళలాడుతూ ఉండేది. మా నాన్న పేరు శ్రీ సీతానాథ్‌పాయిన్. మా పెద్దనాన్న, చిన్నాన్న కూతుళ్లతో సహా మేమంతా పదిహేడు - పద్దెనిమిదిమంది అక్కాచెల్లెళ్లం. ఓ నాలుగైదు ఏళ్ల తేడాతోతప్ప, మేమంతా అప్పటికి యౌవనంలో ఉన్న కన్యలమే. గదాధర్ చిన్నప్పటి నుండి మాతో కలసి ఆడుతూ, పాడుతూ తిరిగేవాడు. అందుచేత అతడికి, మాకు మధ్య మంచి స్నేహం ఉండేది. మేము యౌవనంలోకి వచ్చినా, అతడు మా ఇంటికి వస్తూ, వెళుతూ ఉండేవాడు. పెరిగి పెద్దవాడైన తర్వాత కూడ అతడు మా ఇంటి అంతఃపురంలోకి రాకపోకలు చేస్తుండేవాడు. మా నాన్నకు అతనంటే ఎంతో ప్రేమ. తన ఇష్టదైవంలా అతడి పట్ల మా నాన్న భక్తిప్రపత్తులు చూపేవాడు. ఇరుగుపొరుగులు కొందరు నాన్నను, 'మీ ఇంట్లో అంతమంది ఎదిగిన కూతుళ్లున్నారు కదా! గదాధర్ కూడ ఇప్పుడు పెద్దవాడయ్యాడు. మరి అతణ్ణింకా మీ ఇంట్లోకి రానిస్తున్నావేమిటీ?' అని అడిగేవారు. అది విని మా నాన్న, 'గదాధర్ గూర్చి నాకు బాగా తెలుసు. మీరు నిశ్చింతగా ఉండండి' అని చెప్పేవాడు. దానితో వారి నోళ్లు మూతబడిపోయేవి. గదాధర్ మా ఇంట్లోకి వచ్చి, ఎన్నెన్నో పురాణకథలు చెప్పేవాడు. నవ్వుతూ, నవ్వించేవాడు. ప్రతిరోజూ ఇలా అతడి మాటలు, హాస్యాలు వింటూ మేమంతా మా పనులను ఆనందంగా చేసుకునేవాళ్లం. అతడు మా వద్ద ఉన్నప్పుడు సమయం ఎంతో ఆహ్లాదంగా గడిచిపోయేది. దాన్ని ఎలా వర్ణించగలను? ఒక్కోరోజు అతడు రాకపోతే, అతడికి ఒంట్లో బాగాలేదేమోనన్న ఊహతో ఎంతో కలవర పడేవాళ్లం. నీటి కోసమనో లేదా మరో నెపంతోనో ఎలాగో మాలో ఒకరం ఆ రోజు బ్రాహ్మణి (చంద్రాదేవి) ఇంటికి వెళ్లి, అతడి విషయం కనుక్కొని వచ్చేవరకూ, మా మనసులు శాంతించేవి కావు. అతడి ప్రతిమాట మాకు అమృతంలా అనిపించేది. అందుచేత అతడు మా ఇంటికి రాని రోజున, అతణ్ణే గురించే మాట్లాడుకుంటూ మేమారోజు గడిపేవాళ్లం.''

గదాధర్ స్నేహం ఆ గ్రామ స్త్రీలకే పరిమితం కాలేదు. అతడి బహుముఖ ప్రతిభ, అతడి మనోజ్ఞమైన వ్యవహారదక్షత ఆ గ్రామంలోని ఆబాలవృద్ధులందరినీ ఆకట్టుకుంది. అతడితో వారందరికీ ఒక ప్రగాఢ సంబంధాన్ని ఏర్పరచింది. ప్రతి సాయంకాలం అతడు భాగవతాది పురాణాలు పఠించడానికినీ, భగవత్ సంకీర్తన చేయడానికి

13. గదాధర్ పట్ల గ్రామస్థు లందరి ప్రేమ

గాని పూనుకునేవాడు. వాటిని వినడానికి చిన్నా - పెద్ద గ్రామస్థులంతా సమావేశమయ్యేవారు. గదాధర్ ఏ రోజు, ఎక్కడ తన ఈ కార్యక్రమం నిర్వహిస్తాడో, ఆ రోజు అక్కడ ఆనందస్రవంతి ప్రవహించేది. కారణమేమంటే, అతడిలా పురాణాలను చక్కగా చదవడంగానీ, లేదా గంభీర ఆధ్యాత్మిక తత్త్వాలను అతడంత భక్తిపూర్వకంగా వివరించడంగానీ మరెవ్వరికీ సాధ్యమయ్యేది కాదు. అలాగే సంకీర్తన సమయంలో అతడి దివ్యభావావేశానికి, ఆధ్యాత్మిక భావాలను ప్రేరేపించేలా అప్పటికప్పుడు అనుపల్లవులను సృష్టించే అతడి శక్తికిగానీ ఎవరూ సాటివచ్చేవారు కారు. ఆతడి మధురకంఠం మరెవ్వరికుందనీ! భావపారవశ్యంతో అతడు చేసే మనోహర నృత్యాన్ని మరెవ్వరు చేయగలరూ! అంతేకాదు, హాస్యం పట్టించే సమయంలో, అతడిలా హాస్యపాత్రలను నటించడంలో, స్త్రీ పురుషుల రకరకాల హావభావాలను ప్రదర్శించడంలో అతణ్ణి ఎవరు మించగలరూ! అలాగే సమయానుకూలంగా, కొత్త కొత్త కథలను అల్లడంలో, కొత్తపాటలను పాడటంలో కూడ అతనిదే అగ్రతాంబూలం. కాబట్టే చిన్నా పెద్దా అంతా కూడ అతడి పట్ల అంతగా ఆకర్షితులై, ప్రతి సాయంకాలం అతడి రాక కోసం ఎంతో ఉత్సాహంతో ఎదురుచూస్తూ ఉండేవారు. గదాధర్ కూడ ఒక్కోరోజు ఒక్కోచోట వారిని కలుస్తూ వారికి ఆనందాన్ని కలిగిస్తూ ఉండేవాడు.

అంత పిన్నవయసులో కూడ అతడిలో ఎంతో నిశిత వివేచనాశక్తి ఉండేది. అందుకే గ్రామస్థుల్లో అనేకులు తమ కుటుంబ సమస్యలను అతడికి చెప్పుకుని, పరిష్కారం పొందుతుండేవారు. అలాగే సాధకులు కూడ అతడి పవిత్రశీలాన్ని చూసి, భగవన్నామ సంకీర్తన సమయంలో అతడు భావసమాధి పొందడం చూసి, అతడి సలహాలు పొంది పురోగతి సాధిస్తుండేవారు. కేవలం వంచకులు, దుర్మార్గులు మాత్రం అతడి నుండి తప్పుకుని దూరంగా ఉండేవారు. ఎందుకంటే, గదాధర్ నిశితదృష్టి వారి పైపై వేషాలను దాటి, వారి అంతరంగంలోకి చొచ్చుకుపోయి, వారి కుట్రలను, జిత్తులమారి చేష్టలను పసిగట్టేది. సత్యనిష్ఠుడు, ఉన్నది ఉన్నట్లు ముఖం మీద చెప్పేవాడు అయిన బాల గదాధర్, ఒక్కోసారి అందరి ముందే వారి పన్నాగాలను, కుటిల యోచనలను వెల్లడించి, సిగ్గుతో వారు తలలు దించుకునేలా చేసేవాడు. అతడి వినోదప్రియత్వంకూడ వారి కుటిల చేష్టలను అందరిముందూ అనుకరించేలా చేసేది. ఇది వారికి ఎంతో కోపం తెప్పించేది. కాని అందరూ గదాధర్ పక్షం వహించడం వల్ల ఏమీ చేయలేక వాళ్లు నోరు మూసుకుని ఉండవలసి వచ్చేది. అందుచేత ఆ వంచకులకు ఆ అవమానం నుండి తప్పించుకోవటానికి ఒకే మార్గం కనిపించేది - గదాధర్

కరుణాస్వభావానికి శరణువేడడం. తనను ఆశ్రయించినవారి పట్ల అతడు ప్రసన్నుడౌతాడని వారందరికీ తెలుసు.

సమవయస్కుల పట్లగల ప్రేమ కారణంగా, గదాధర్ బడికి వెళుతూ ఉండే వాడని మొదట్లోనే చెప్పుకున్నాం కదా! కాని అతడికి పధ్నాలుగేళ్లు వచ్చేసరికి అతడి

14. పొట్టకూటి చదువు పట్ల గదాధర్ విరక్తి

దైవభక్తి, ఆధ్యాత్మిక భావాలు తీవ్రమయ్యాయి. దానితో పొట్టకూటికి పనికివచ్చే చదువు తనకు అవసరం లేదన్న నిశ్చయానికి అతడు వచ్చాడు. తన జీవితం మరొక ఉన్నత ప్రయోజనాన్ని సాధించడానికి కేటాయించబడిందన్న భావన అప్పటి నుండే అతడికి కలిగింది. అందుచేత తన శక్తిసామర్థ్యాల నన్నింటిని భగవత్సాక్షాత్కారం కోసం మాత్రమే వినియోగించడానికి అతడు నిశ్చయించుకున్నాడు. అతడి మనఃఫలకం మీద తరచూ ఆ జీవితలక్ష్యం అస్పష్టంగా గోచరిస్తూ ఉండేది. కాని అది ఇంకా పూర్తిగా స్పష్టం కాకపోవడంవల్ల, ఆ లక్ష్యాన్ని అతడు చక్కగా అర్థం చేసుకోలేకపోయేవాడు. అయినప్పటికీ అతడిలో తన భావిజీవితాన్ని ఎలా గడపాలన్న ప్రశ్న ఉదయించినప్పుడల్లా, అతడి యోచనాయుక్త మేధస్సు పూర్తిగా భగవంతుణ్ణే ఆశ్రయించి జీవించమని సూచించేది. అతడి భావనాశక్తి కాషాయాంబరాలను, పవిత్ర ధునిని, భిక్షతో లభించే మాధుకరాన్ని, సర్వసంగాలను తెంచివేసి స్వేచ్ఛగా పరివ్రాజక జీవితాన్ని గడపడాన్ని, ఈ అన్నింటితోకూడ ముక్తజీవితాన్ని అతడి కల్పనాపటలంపైన ప్రజ్వలకర వర్ణాలతో చిత్రీకరించేది. కాని మరుక్షణమే తన తల్లి, అన్న, ఇంటివారి పేదరికం జ్ఞాపకం రావడంతో ప్రేమరసార్ద్రమైన అతడి కోమలహృదయం, పై మార్గంలో జీవయాత్ర చేయాలన్న మనోరథం నుండి వెనక్కు మరలేది. అంతేకాదు, తన తండ్రిలా భగవంతుని శరణుజొచ్చి, సంసారంలోనే ఉంటూ తనకు సాధ్యమైనంత వరకూ వారికి తోడ్పడవలసిందిగా, అది అతణ్ణి ప్రేరేపించేది. తన మనోబుద్ధులు ఇలా పరస్పర వ్యతిరేక మార్గాలను సూచిస్తూ ఉంటే, భగవంతుని నిర్దేశం కోసం ఎదురుచూస్తూ, శ్రీ రఘువీరుని మీదే భారమంతా వేసి అతడు జీవించ సాగాడు. శ్రీ రఘువీరుని భక్తితో అతడి హృదయం నిండివుండేది. అందుకే ఆ భగవంతుణ్ణే నిరంతరం తనవాడిగా అతడు భావించేవాడు. కాబట్టి యుక్త సమయంలో శ్రీ రఘువీరుడే తన చిక్కుముడులను విప్పుతాడన్న విశ్వాసం పెరిగింది. దానితో అతడి సందేహాలన్నీ సమసిపోయాయి. అతడి హృదయం, బుద్ధీ రెండూ పరస్పరం వ్యతిరేకించినప్పుడల్లా, అతడి హృదయమే నెగ్గుతూ ఉండేది. అప్పటి నుండి అతడు ప్రతి కార్యాన్నీ హృదయ ప్రేరేపణతోనే చేయ సాగాడు.

అసాధారణ అనుభూతిలో పూర్ణమై ఉన్న అతడి హృదయంలో, ఆ సమయంలో మరొక కొత్త భావన ఉదయించేది. గ్రామంలోని స్త్రీ పురుష

15. గదాధర్ నిస్స్వార్థపరత్వం

లందరితో అతడికి ఎంత అవినాభావ సంబంధం ఏర్పడిందంటే, వారినందర్నీ అతడు తన ఆత్మీయులుగా భావించేవాడు. వారి సుఖదుఃఖాలను తనవిగా అనుభూతి పొందుతుండేవాడు. కాబట్టి సన్న్యసించాలన్న భావన అతడిలో ఉదయించినప్పుడల్లా, సరళహృదయులు, ప్రేమపూరితులు అయిన ఆ గ్రామస్థులు, వారు తనపట్ల చూపే అఖండవిశ్వాసం జ్ఞాపకం వచ్చేవి. అంతేకాదు, తన జీవితాన్ని ఎలా మలచుకుంటే వారంతా తనను ఆదర్శంగా ఎంచుకొని తమ జీవితాలను ఉన్నతాదర్శవంతంగా చేసుకుంటారో, ప్రస్తుతం తనతో వారికున్న సంబంధం, శాశ్వత పారమార్థిక సంబంధంగా మారుతుందో అలా జీవించడం తన జీవితాశయమని కూడ అతడు గ్రహించసాగాడు. ఆవగింజంత కూడ స్వార్థం లేని అతడి హృదయం, ''కేవలం నీ ఒక్కడి ముక్తి కోసమే సంసారాన్ని త్యాగం చేయడం స్వార్థమే సుమా! పరులందరి శ్రేయస్సుకు కూడ తోడ్పడే కర్మను మాత్రమే నువ్వు ఆచరించు'' అంటూ అతడికి చెబుతూండేది.

అప్పుడు బడిలో అతడు నేర్చుకొంటున్న చదువు గూర్చి, మున్ముందు తటస్థపడే సంస్కృతవిద్య గూర్చి అతడి హృదయం - బుద్ధి ఏకమై, ''పొట్ట

16. గదాధర్ బడికి స్వస్తి, మిత్రులతో నాటకాలు ఆడడం

కూటి విద్య, ఎందుకూ పనికిరాదు'' అంటూ నొక్కి చెప్పాయి. అయినాసరే, బళ్లోని తన మిత్రులు బాధపడతారని అతడు వెంటనే బడి మానివేయలేదు. గయావిష్ణువు, ఇతర స్నేహితులు అతణ్ణి ఎంతగానో ప్రేమించేవారు. అతడి తెలివితేటలను, ధైర్యసాహసాలను చూసి, అతణ్ణి తమ నాయకునిగా భావించేవారు. కాని బడిని వదిలిపెట్టడానికి చివరికి అతడికి ఒక మంచి అవకాశం లభించింది. గదాధర్‌లోని అభినయకౌశల్యాన్ని గుర్తించిన అతడి మిత్రులు, ఒక రోజు ఒక విషయాన్ని గదాధర్ ముందుకు తెచ్చారు. ''మనమంతా ఒక నాటకబృందంగా ఏర్పడదాం. దానిలో శిక్షణ నిచ్చే బాధ్యతను నువ్వు స్వీకరించాలి'' అని చెప్పారు. గదాధర్ అందుకు అంగీకరించాడు. కాని తమ పెద్దలు ఎక్కడ తమను తప్పుపడతారోనన్న సంశయం వారికి ఉంది. అందుచేత వారికి తెలియకుండా శిక్షణ కార్యక్రమం కొనసాగించేందుకు తగిన స్థలాన్ని వెదకసాగారు. ధీమంతుడైన గదాధర్ చివరికి మాణిక్‌రాజ్‌కు చెందిన మామిడితోపును అందుకు తగిన స్థలంగా ఎన్నుకున్నాడు. ఆ తర్వాత ప్రతిరోజు వారిలో కొంతమంది బడి ఎగ్గొట్టి, నిర్ణీత

సమయంలో తోపునకు రావాలని నిశ్చయించుకున్నారు. అలాగే వారు దాన్ని వెంటనే అమల్లోపెట్టారు.

గదాధర్ శిక్షణలో ఆ బాలురు తమ పాత్రలను, పాటలను చక్కగా నేర్చుకుని నటించసాగారు. కొన్నిరోజులకే, ఆ మామిడితోపు శ్రీరామచంద్రుని శ్రీకృష్ణుని జీవనఘట్టాల అభినయాలతో మారుమ్రోగసాగింది. ప్రతి నాటకం లోను, అందుకు కావలసిన వివరాల నన్నింటినీ గదాధరే తన కల్పనాశక్తితో సమకూర్చేవాడు. అంతేకాదు, ప్రధానపాత్రలను తానే స్వయంగా పోషించేవాడు. ఆ నాటకబృందం ఏ ఘర్షణలూ లేకుండా సాఫీగా కొనసాగడంతో, ఆ బాలురు ఎంతో ఆనందించేవారు. మామిడితోపులో ఈ నాటకాలు జరుగుతున్నప్పుడు, అప్పుడప్పుడు గదాధర్ భావసమాధులు పొందుతూ ఉండేవాడని మేము విన్నాం.

17. లలితకళలలో గదాధర్ అభినివేశం

గదాధర్ భక్తి కీర్తనలు గానం చేయడంలో, నాటకాలు ఆడడంలో ఎక్కువ కాలం గడుపుతూ ఉండేవాడు. ఈ రెండు కళల్లోనే కాదు, చిత్రకళలో కూడ నైపుణ్యం ఉంది. ఒకనాడతడు గార్‌హాటి గ్రామం లోని చెల్లెలు సర్వమంగళ ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఆమె ఆనందంతో భర్తను సేవించడం చూశాడు. తర్వాత ఆ దృశ్యాన్ని అతడు చిత్రంగా గీశాడు. సజీవంగా కనిపించే ఆ చిత్రాన్ని చూసి కుటుంబంలోని వారంతా ఎంతో ఆశ్చర్యం చెందారని మేము విన్నాం.

చిత్రాలు వేయడంలోనే కాదు, విగ్రహాలు మలచడంలో కూడ గదాధర్‌కు నైపుణ్యం ఉండేది. వివిధ దేవతల విగ్రహాలను ఎంతో అద్భుతంగా అతడు మలచే వాడు. అతడి సహజ ఆధ్యాత్మిక ప్రవృత్తియే, అతణ్ణి ఆ విగ్రహాల తయారీకి పురికొల్పేది. అతడు స్నేహితులతో కలిసి విగ్రహాలను శాస్త్రోక్తంగా పూజించే వాడు.

బడి మానుకొన్న తర్వాత అతడు ఇంట్లో తల్లికి సహాయపడుతూ ఉండే వాడు. తన అంతర్గత ప్రేరణ కారణంగా పై కార్యక్రమాలు చేస్తుండేవాడు. ఇలా అతడు కాలక్షేపం చేయసాగాడు.

అక్షయ్ అతడి అన్నకుమారుడు. పసితనంలోనే ఆ అబ్బాయి తల్లి చనిపోయింది. తల్లిలేని ఆ అబ్బాయంటే గదాధర్‌కు ఎనలేని ప్రేమ. తన తల్లి ఇంటి పనులు చేసుకుంటున్నప్పుడు, ఈ శిశువు బాధ్యత తాను వహించేవాడు. ఆ శిశువును ఆడిస్తూ ఉండేవాడు. ఇది అతడి నిత్యకార్యక్రమంలో భాగమై ఉండేది.

అలా మూడు సంవత్సరాలు గడిచాయి. గదాధర్‌కు పదిహేడు ఏళ్ల వయస్సు వచ్చింది. కలకత్తాలో రాంకుమార్ నిర్వహిస్తున్న సంస్కృత పాఠ

శాల కూడ కాస్త పుంజుకోసాగింది. అతడి ఆదాయంకూడ ఒకింత మెరుగైంది.

రాంకుమార్ ఎక్కువకాలం కలకత్తాలోనే ఉండేవాడు. కాని సంవత్సరానికి ఒకసారి తప్పక కామార్పుకూర్ వచ్చి, కొన్ని వారాలు అక్కడ గడిపి వెళుతుండే

18. రాంకుమార్ అతణ్ణి కలకత్తాకు తోడ్కొనిపోవడం

వాడు. ఈమారు కూడ వచ్చాడు. వచ్చినప్పుడు చదువు విషయంలో గదాధర్‌కున్న ఉదాసీన వైఖరిని గమనించాడు. ఎంతో ఆందోళన చెందాడు కూడ. ఆ తర్వాత తన ఆ చిన్నతమ్ముడు తన సమయాన్ని ఎలా గడుపుతున్నాడో పరికించాడు.

తరువాత తల్లితో సంప్రతించి గదాధర్‌ను తనతో పాటు కలకత్తా తీసుకుపోవడానికి నిర్ణయించుకొన్నాడు. తన సంస్కృత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికరించడంతో, పాఠశాల నిర్వహణలో ఒక సహాయకుడు అవసరమై ఉండడం చేత, తమ్ముణ్ణి కలకత్తా తీసుకుపోవడం సబబుగానే తోచింది రాంకుమార్‌కు. కాబట్టి గదాధర్ కలకత్తా వెళ్లి అన్నగారికి కొంతలో కొంత సహాయపడుతూ, ఆతడి వద్దే ఇతర విద్యార్థులతోపాటు చదువుకోవచ్చని నిర్ణయించారు. ఈ ప్రతిపాదన గురించి చెప్పినప్పుడు గదాధర్ కించిత్తు కూడ అనిష్టం వ్యక్తం చేయలేదు. తాను తండ్రిలా గౌరవించే అన్నగారికి తను యీ రకంగా సహాయపడగలనని అతడు గ్రహించడమే ఇందుకు కారణం. ఒక శుభముహూర్తాన రాంకుమార్, గదాధర్‌లు తమ కులదైవం శ్రీరఘువీరునికి పూజాదిసేవలు ఒనరించి, తల్లి పాదధూళి స్వీకరించి కలకత్తాకు బయలుదేరారు. కామార్పుకూర్‌లో సంతోషాల సంతకు తెరపడింది. చంద్రాదేవి, ఇతర స్త్రీలు అతడి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకొంటూ, అతడి భవిష్యత్తు సంక్షేమాన్ని తలచుకొంటూ కుదుటపడసాగారు.

బాల్య భావం సమాప్తం

II

సాధక భావం

AC 79092
హైదరాబాద్-500 044.

ప్రస్తావన

శ్రీరామకృష్ణ దేవుల అలౌకిక సాధనలకు సంబంధించిన వివరాలతో కూడిన ఈ రెండవ భాగం, భగవత్కృపచే పూర్తయింది. దీనిలో ఇంతకు పూర్వం ఎవరికీ తెలియని ఆయన ఒనరించిన సాధనల గురించి, ఆ సాధనల వెనుకనున్న తాత్త్విక చింతనను గూర్చి వివరించడం జరిగింది. అంతేకాదు, పదిహేనేళ్ల నుండి నలభై ఏళ్ల వయస్సు వరకూ ఆయన జీవితంలో జరిగిన ముఖ్య సంఘటనలను కూడ కాలానుగుణంగా వివరించాము. ఈ భాగాన్ని 'సాధక భావం' అని పేర్కొన్నాం. ఎందుకంటే, వారు తమ ఆధ్యాత్మిక సాధనలను మొదలుపెట్టినప్పటి నుండి, వివేకానం దాది శిష్యులంతా ఆయన పవిత్రపాదాల చెంతకు చేరేదాకా శ్రీరామ కృష్ణ దేవుల సాధక జీవిత చరిత్రను దీనిలో పొందుపరిచాం కనుక!

ఈ భాగాన్ని వ్రాస్తున్నప్పుడు శ్రీరామకృష్ణుల జీవితంలోని ప్రధాన సంఘటనల కాలన్నిర్ణయాన్ని సరిగా చేయగలమో లేమో అన్న సంశయానికి లోనయ్యాం. ఆయన తాము సాధనలు చేస్తున్న ప్పుడు జరిగిన విషయాలను మాలో పలువురికి చెప్పేవారు. కాని వాటి పూర్వాపర్యత వారెవరికీ తెలియజేయలేదు. ఆ కారణంగా సాధనకాలంలో జరిగిన సంఘటనలు భక్తులందరి మనసుల్లో అయోమయంగా ఉండిపోయాయి. అయినా వారి కృపతో మేము ఎంతో పరిశోధించి, ఆ సంఘటనలకు చాలావరకు సరైన కాల నిర్ణయం చేయగలిగాం.

శ్రీ గురుదేవుల 'జన్మదినం' గూర్చిన భేదాభిప్రాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఎందుకంటే మొదటిసారి వ్రాసిన వారి జాతకపత్రం వినష్టమైందని, రెండవసారి రాసిన జాతకపత్రంలో చాలా తప్పులు దొర్లాయని ఆయనే స్వయంగా మాకు చెప్పారు. అయితే వంద సంవత్సరాల నాటి పాత పంచాంగాల నెన్నింటినో పరిశీలించిన తరువాత ఈ సమస్యకు ఒక పరిష్కారం దొరికింది. దీనితో ఆయన జనన తేదీని నిర్ధారణ చేయడం మాకు సులువైంది. పైగా గురుదేవులు చేసిన షోడశీపూజ గూర్చి ఇంతవరకూ ఎవరికీ అంత ఎక్కువగా తెలియదు. ఈ భాగాన్ని చదివే పాఠకులకు అది చక్కగా అర్థమవుతుంది.

ఈ గ్రంథం శ్రీరామకృష్ణుల అనుగ్రహపాత్రమౌతుందని, ఇది లోకకల్యాణానికి సాధకం కావాలని ప్రార్థిస్తూ గురుదేవుల పాద పద్మాలకు దీన్ని సమర్పించుకుంటున్నాం.

— రచయిత

ఉపోద్ఘాతం

సాధకునిగా అవతారపురుషుడు

1. అవతారపురుషుల సాధన వృత్తాంతాల అలభ్యత

ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్ర అధ్యయనం వల్ల ఒక విషయం స్పష్టమౌతున్నది. బుద్ధభగవానుణ్ణి, శ్రీ చైతన్యమహాప్రభువును తప్పించి, మిగతా అవతారపురుషుల సాధనల గూర్చి మనకు విపులంగా వివరాలు లభించడం లేదు. ఎంత ఆసక్తితో, ఎంత ఉత్సాహంతో, ఎంత హృదయ వేదనతో వారు సత్యసాక్షాత్కారం కోసం పూనుకున్నారో, ఆ ప్రయత్నంలో ఏ మేరకు పురోగమించారో మనకు తెలియదు. ఆ సత్యశోధన యత్నంలో వారు ఆశ - నిరాశ, భయం - విస్మయం, వ్యాకులత - ఆనందం మొదలైన మనోవృత్తులకు లోనై ఉంటారు; ఒకప్పుడు ఆహ్లాదం చెందడం, మరొకప్పుడు విషాదగ్రస్తులు కావడం జరిగివుంటుంది. అయినాసరే తాము చేరాలనుకున్న గమ్యాన్ని, ఒక్క క్షణం కూడా దృష్టిపథం నుండి వారు తప్పించి ఉండరు. అలా చివరి వరకూ వారు అంత తీవ్రంగా ఎలా సాధన చేయగలిగారో వివరంగా వారి జీవితాల్లో కానరావు. అలాగే, ఆ సాధక జీవితం తర్వాత వారు చేసిన అపూర్వ కార్యాలకు, బాల్యంలో వారికి లభించిన శిక్షణ, వారి ప్రయత్నాలకు మధ్యన ఉన్న కార్యాకారణ సంబంధం లేదా పూర్వాపర సంబంధం కూడ మనకు ఎంత శోధించినా కనిపించదు.

ఉదాహరణకు: బృందావన గోపికా మనోహరుడైన కృష్ణుడు, తర్వాత ద్వారకాధీశుడై - ధర్మసంస్థాపకుడిగా ఎలా పరిణమించాడో మనకు స్పష్టం కాదు.

అట్లే క్రీస్తు ముప్పై సంవత్సరాల అద్భుత జీవితంలో మనకు ఏ రెండు మూడు సంఘటనలలో మాత్రమే తెలియవస్తున్నాయి. అలాగే జగద్గురు శంకరాచార్యుల సాధనల కన్నా, వారి దిగ్విజయ వృత్తాంతమే ఎక్కువగా నమోదైంది. ఇతర మహాపురుషుల జీవితాల్లో కూడ అలాగే చాలాకొద్ది వివరాలు మాత్రమే లభ్యమవుతున్నాయి.

పై విషయానికి కారణం తెలుసుకోవడం కష్టమైన పని. భక్తుల అతిశయ భక్తి కారణంగా ఆ వివరాలన్నీ బహుశా గ్రంథస్థం కాకుండా ఉండిపోయాయేమో!

2. భక్తుల అపార్థాలు

సామాన్యమానవుల కుండే బలహీనతలను, ఆ పవిత్రాత్మలకు ఆపాదించడానికి సంకోచించి, వాటిని అందరి దృష్టికి తీసుకురాకుండా ఉండడమే మంచిదని వారు భావించి ఉంటారు. లేదా ఈ మహాపురుషులు ఏ అలౌకిక సాధనలు అనుష్ఠించి సర్వాంగసంపూర్ణ భావాలను, ఆదర్శాలను సాక్షాత్కరించుకున్నారో, ఆ సాధనల చరిత్రను పరిశోధించడం కన్నా, వారు సాక్షాత్కరించుకొన్న ఆ ఉదాత్త ఆదర్శాలను మాత్రమే మానవులకు తెలియచేయడం వల్ల ఎక్కువ లోకకల్యాణం జరుగుతుందని అనుకొని ఉంటారు. అందుచేత వారి సాధనల గూర్చి వ్రాయడం అనవసరమని భక్తులు భావించి ఉంటారు.

భక్తులు తమ గురువులను సదా పరిపూర్ణులుగా చూడాలనే అనుకుంటారు. మానవదేహం ధరించినా, మనిషిలో కనిపించే బలహీనతలు, అంతర్దృష్టి లేకపోవడం, అల్పశక్తి మొదలైనవన్నీ ఏ కొంచెమైనా, ఏ కాలంలోనైనా వారిలో ఉంటాయన్న విషయాన్ని భక్తులు అసలు ఒప్పుకోరు. బాలగోపాలుని నోట బ్రహ్మాండాలను చూడడానికే వారు ప్రయత్నిస్తారు. శిశువుల అర్థరహిత పసితనపు చేష్టల్లో కూడ పెంపొందిన మానవబుద్ధి కౌశల్యాన్ని, దూరదృష్టిని చూసే ప్రయత్నం చేస్తారు. అంతేకాదు వారిలో సర్వజ్ఞత్వం, సర్వశక్తిమత్వం, విశ్వజనీనప్రేమ, ఔదార్యం మొదలైన ఉదాత్త గుణాలను చూడడానికి ఉత్సాహపడతారు. అందుచేతనే, ఆ అవతార పురుషులు తమ భగవత్ స్వరూపాన్ని సామాన్యులకు తెలియకుండా దాచిపెట్టడం కోసం, తమ సాధన, భోజనాదులను, ఇతర మానసిక వృత్తులను, తినడం, నిద్రించడం, అలసిపోవడం, రోగగ్రస్తులు కావడం - చివరికి చనిపోవడం మొదలైన శారీరక క్రియలను కేవలం నటిస్తారన్న నిర్ణయానికి భక్తులు వస్తారనడంలో ఆశ్చర్యం లేదు. శ్రీరామకృష్ణుల శారీరక రుగ్మతను చూసి, వారి ప్రధాన భక్తులెంతోమంది 'అదంతా ఒక నటన - నిజం కాదు' అని భావించడం మేము స్వయంగా చూశాం.

భక్తులు అలాంటి నిర్ణయానికి రావడం, కేవలం వారి బలహీనతే. సామాన్యుల సాధన - ప్రయత్నం - ఉద్దేశాలను వారు అవతారపురుషులకు ఆపాదింప ఇష్టపడరు. అలాంటి తలంపులు తమ భక్తికి చెరుపు చేస్తాయని వారి అభిప్రాయం. అందుచేత వారికి వ్యతిరేకంగా మే మేమీ చెప్పవలసింది లేదు. కాని భక్తి ఇంకా పరిపక్వం కాని దశలోనే ఇలాంటి దుర్బలత ఉంటుందన్నది మాత్రం నిజం. భక్తి ప్రాథమికస్థాయిలో ఉన్నప్పుడు, భక్తుడు భగవంతుణ్ణి ఐశ్వర్యరహితునిగా భావించలేడు. కాని కాలక్రమంలో భక్తి ఓ మేరకు పక్వమైనప్పుడు, భగవంతుని మీద ప్రేమ ప్రగాఢమైనప్పుడు, భగవదైశ్వర్యాన్ని గూర్చిన తలంపే భక్తిమార్గంలో ఒక విఘ్నమని భక్తుడికి తోస్తుంది. అలాంటి స్థితిలో అతడు ఆ తలంపులను ప్రయత్నపూర్వకంగా తొలగించుకుంటాడు. భక్తిశాస్త్రాలన్నీ ఈ విషయాన్ని ముక్తకంఠంతో ఘోషిస్తాయి. శ్రీకృష్ణుని తల్లి యశోదాదేవి అడుగడుగునా బాలకృష్ణుని దివ్యలీలలను చూస్తూ కూడ, అతణ్ణి తన కొడుకుగా భావించి పెంచి పెద్ద చేయడం మనం చూస్తాం. శ్రీకృష్ణుడు జగత్కారణ భగవంతుడని గోపికలు ఎరిగి కూడ, అతణ్ణి తమ ప్రియతమునిగానే భావించారు తప్ప, మరోవిధంగా భావించలేకపోయారు. ఇతరత్రా కూడ ఇలాగే కనిపిస్తుంది.

3. వాని స్వైతుకత

భగవంతుని విశిష్టశక్తులను వ్యక్తంచేసే 'దర్శనాల'ను తమకు కలిగించమని పట్టుబట్టే భక్తులతో గురుదేవులు ఎన్నోమార్లు ఇలా చెప్పేవారు: ''నాయనలారా! అలాంటి దర్శనాలను కోరడం ఏమంత మంచిది కాదు. ఆయన శక్తి దర్శనం భయాన్ని కలిగిస్తుంది. దానితో భగవంతునితో ప్రేమ సంబంధం - నువ్వూ, నేను అనే ఆత్మీయభావం మరుగునపడుతుంది.'' ఆ మాటలు విని, ''గురుదేవులకు మా కలాంటి దర్శనాలు చేయించడం ఇష్టం లేదు. అందుకే ఇలా మాయమాటలు చెబుతున్నారు'' అని ఎంతో వ్యథ చెందేవారం. కాని ఎవరైనా భక్తులు మరింత మొండిపట్టుపట్టి, ''మీ దయ ఉంటే అసంభవం కూడ సంభవమౌతుంది. దయచేసి మా కలాంటి దర్శనాలు కలిగించండి'' అని బలవంతం చేస్తే, గురుదేవులు ఎంతో ఎనయభావంతో, ''నే నేమైనా చేయగలనా? అమ్మ సంకల్పం ఎలా ఉంటే అలాగే జరుగుతుంది'' అని చెప్పేవారు. వా రలా చెప్పిన తర్వాత కూడ, మళ్లీ ''మీ సంకల్పమే అమ్మ సంకల్పం'' అని భక్తులు ఒత్తిడి చేసేవారు. వారి కప్పుడు నచ్చచెబుతూ, ''మీకంతా అన్నిరకాల దర్శనాలూ కలగాలని నేనూ కోరుకుంటాను. కాని అదెలా జరుగుతుందీ?'' అని చెప్పేవారు. ఆ

4. శ్రీ రామకృష్ణుల ఉపదేశం: ఈశ్వరుని మాహాత్మ్య జ్ఞానం ఉన్నంతవరకూ, 'నువ్వూ - నేను' అన్న ఆత్మీయ ప్రేమ సంబంధం ఏర్పడదు; ఎవరి ఆధ్యాత్మిక భావాన్నీ భగ్నం చేయకు!

మాటలు విని కూడ సంతృప్తిపడక భక్తులు ఇంకా బలవంతం చేస్తే, మౌనం వహించి, చిరునవ్వుతో ప్రేమగా వారివైపు గురుదేవులు చూస్తూ ఉండిపోయే వారు. లేదా ఒక్కోసారి ''నే నింకేం చెప్పగలను? అమ్మ సంకల్పమే నెరవేరుగాక!'' అనేవారు. ఇలా ఎంత ఒత్తిడి చేసినా, ఆ భక్తుని భ్రాంతియుత దృఢనమ్మకాన్ని వమ్ము చేసేవారు కాదు. అతడి ఆధ్యాత్మిక భావానికి హాని కలిగించేవారు కారు. గురుదేవులు అనేకసార్లు అలా ప్రవర్తించడం మేం కళ్లారా చూశాం. ''ఎవరి ఆధ్యాత్మిక భావాన్నికూడ భగ్నం చేయవద్దు'' అని అనడం విన్నాం.

ఈ ఉపోద్ఘాత విషయానికి ప్రత్యక్షంగా సంబంధం లేకపోయినా, పై అంశాన్ని చెప్పాం కాబట్టి, దాన్ని వివరించడానికి ఒక ఉదాహరణ నివ్వదలిచాం.

5. ఆధ్యాత్మిక భావాన్ని భగ్నపరచడాన్ని గూర్చి ఒక ఉదాహరణ: కాశీపూర్‌లో శివరాత్రి నాడు జరిగిన ఒక సంఘటన

కేవలం సంకల్పంతో లేదా స్పర్శతో ఇతరులకు ఆధ్యాత్మికానుభూతిని కలిగించే శక్తి, కొందరు మహాత్ములకు మాత్రమే సాధ్యం. కాలక్రమంలో వివేకానందులకు అలాంటి శక్తి లభిస్తుందని, దాంతో ప్రపంచానికి అతడు ఎంతో మేలు చేస్తాడని గురుదేవులు మాకు తరచూ చెబుతుండేవారు. వివేకానందుల వంటి ఉత్తమాధికారి ప్రపంచంలో చాలా అరుదుగా ఉంటాడని, అతడు పరిచయమైనప్పటి నుండే గురుదేవులు గ్రహించారు. అందుకే ఆ క్షణం నుండి ఆయన అతడి ప్రతి చేష్టను ఆ ఉత్తమాధికారికి తగినట్లుగా మలచసాగారు. అతణ్ణి అద్వైతజ్ఞానంలో ఉన్నతిని సాధించడానికి ప్రోత్సహించేవారు. స్వామీజీ బ్రహ్మసమాజ ఉపదేశానుసారం ద్వైతభావంతో బ్రహ్మోపాసన చేస్తుండేవాడు. అలాంటి అతడికి 'సోఽహం' (నేను బ్రహ్మను) అన్న భావం పాపంగా, దైవాపచారంగా అనిపించేది. అయితే అతడు ఆ అద్వైతభావసాధనను చేయడానికి గురుదేవులు అన్ని విధాలా ప్రయత్నించేవారు. ఆ విషయమై తదనంతర కాలంలో స్వామీజీ స్వయంగా యిలా చెప్పేవారు.

''నేను దక్షిణేశ్వరానికి వెళ్లగానే, ఇతరుల కెవ్వరికీ చదవడానికి ఇవ్వని - నిషేధిత పుస్తకాలను గురుదేవులు నా కిచ్చి చదవమని చెప్పేవారు. వారి గదిలో ఆ పుస్తకాలతోపాటు, 'అష్టావక్ర సంహిత' కూడ ఉంది. అయితే ఎవరైనా దాన్ని చదవడానికి తీసుకుంటే, వద్దని చెప్పి, అందుకు బదులుగా గీతనో, పురాణాన్నో, 'ముక్తిమార్గం' అనే పుస్తకాన్నో ఇచ్చి చదువుకోమని చెప్పేవారు. కాని నేను వెళ్లీ వెళ్లగానే ఆ సంహితను నా చేతికిచ్చి నన్ను చదవమని చెప్పేవారు. లేదా అద్వైతపరమైన అధ్యాత్మ రామాయణాన్ని ఇచ్చి, దానిలో ఏదో ఒక భాగాన్ని చదవమనేవారు. నేను అభ్యంతరం చెబుతూ, 'ఇలాంటి పుస్తకాలను చదవడం

ఎందుకూ? నేను భగవంతుణ్ణి - అన్న ఆలోచన మహాపాపం. అలాంటి పాపపు విషయాలున్న పుస్తకాలను తగలెయ్యాలి' అనేవాణ్ణి. అది విని గురుదేవులు నవ్వుతూ, 'నీకోసం చదవమని అంటున్నానా? నాకు కాస్త చదివి వినిపించు. అలా చేస్తే, నేను భగవంతుణ్ణి అని భావించే అవసరం నీకుండదు' అని చెప్పేవారు. దానితో కొద్దిగా చదివి వినిపించేవాడిని.''

వివేకానందస్వామిని ఇలా అద్వైతజ్ఞానిగా తయారుచేస్తున్నా, బ్రహ్మానందాది ఇతర శిష్యులకు కొందరికి సాకారోపాసనాన్ని, మరికొందరికి నిరాకార సగుణోపాసనాన్ని, కొందరికి శుద్ధభక్తి మార్గాన్ని, కొందరికి జ్ఞానయుక్త భక్తి మార్గాన్ని - ఇలా రకరకాల మార్గాలను బోధిస్తూ వారందర్నీ ఆధ్యాత్మికపరంగా పురోగమింప చేస్తుండేవారు. స్వామి వివేకానంద - ఇతర శిష్యులూ దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల వద్దే ఉండేవారు. అక్కడే ఆహార శయనాదులు చేసేవారు. ఆధ్యాత్మిక విషయాలను చర్చించుకునేవారు. అలా అంతా కలిసే ఉన్నా, గురుదేవులు మాత్రం ఎవరిని ఎలా తయారుచేయాలో వారిని అలా తయారు చేస్తుండేవారు.

1886వ సంవత్సరం మార్చి నెలలో ఒక సంఘటన జరిగింది. కాశీపూర్ ఉద్యానగృహంలో గురుదేవు లుంటున్నారప్పుడు. కంఠవ్రణంతో రోగగ్రస్థులై ఉన్నారు. ఎంతో బలహీనులైపోయారు. అయినా పూర్వం కంటే అధికోత్సాహంతో తన శిష్యులను, ముఖ్యంగా వివేకానందస్వామిని మలచసాగారు. స్వామీజీకి సాధనమార్గాన్ని ఉపదేశించి, దాన్ని ఆచరణలో పెట్టడానికి అన్నివిధాలా దోహదం చేసేవారు. ప్రతిరోజు సాయంకాలం అందర్నీ బయటికి పంపించి, స్వామీజీ ఒక్కణ్ణే తన దగ్గరికి పిలిపించుకునేవారు. 'తన ఇతర శిష్యులను తన తదనంతరం మళ్లీ సంసారంలో ప్రవేశించకుండా ఉంచడం ఎలా? - వారికి తగిన శిక్షణను ఎలా ఇవ్వడం? వారికి మార్గదర్శకత్వం ఎలా వహించడం' మొదలైన విషయాల గురించి ఏకధాటిగా రెండు మూడు గంటలవరకూ అతడికి బోధించేవారు. అప్పుడప్పుడు అతణ్ణి 'యోచన'కు గురిచేసేవారు.

గురుదేవుల మాటలను, చేష్టలను చూసి చాలామంది భక్తులు, 'మా (భక్త) సంఘాన్ని సుప్రతిష్ఠం చేయడం కోసమే వారిలా కంఠరోగాన్ని నటిస్తున్నారు. వారి ఆ ఆశయం నెరవేరగానే వారు మళ్లీ స్వస్థులౌతారు' అని అనుకునేవారు. కాని స్వామి వివేకానందకు మాత్రం అంతరాంతరాళాల్లో, 'గురుదేవులు భక్తుల నుండి శాశ్వతంగా సెలవు పుచ్చుకొనే ప్రయత్నంలో ఉన్నారు. అందుకే అన్నింటిని చక్కబరుస్తున్నారు' అన్నది అనుభూతమయ్యేది కాని ఈ విషయాన్ని అన్ని సమయాల్లోనూ అతడు నమ్మివుంటాడనడం కాస్త సందేహమే!

సాధన ఫలంగా, ఇతరులను స్పర్శించి, వారిలో ఆధ్యాత్మికశక్తిని ప్రసరింప చేసే శక్తి వివేకానందునిలో అప్పుడప్పుడే జాగృతమౌతూన్నది. ఆ విషయం అతడికి తెలిసేది. కాని ఇతరులను స్పర్శించి, దాని నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం అంతవరకు చేయలేదు. వేదాంత అద్వైత సిద్ధాంత యథార్థాన్ని అతడు ఎన్నో విధాలుగా ధ్రువీకరించుకున్నాడు. తర్క - యుక్తులతో ఆ సిద్ధాంతాన్ని సాధించి దృఢచిత్తుడయ్యాడు. ఆ అద్వైత తత్త్వాన్ని పిన్నలు, పెద్దలు, యువకులు, గృహస్థులు - అందరికీ అనుభూతం చేయాలని ప్రయత్నించసాగాడు. ఇతడి ప్రయత్నం భక్తులందరిలో తీవ్రమైన భేదాభిప్రాయాలకు దారితీసింది. వారిలో పెద్ద అలజడి పుట్టించింది. స్వామీజీ స్వభావం చాలా విచిత్రమైంది. తనకు ఏది సత్యమని అనిపిస్తుందో, దాన్ని నిర్భయంగా, బాహాటంగా భేరీ మ్రోగించి మరీ ప్రకటిస్తాడు. అంతే కాదు, తర్క-యుక్తులను ప్రయోగించి ఇతరులు కూడ దాన్ని ఒప్పుకునేలా చేస్తాడు. ఇది అతడి నైజం. కాని ఈ లోకంలో స్థితిగతులు, అధికారభేదంతో సత్యం అనేకరకాలుగా వ్యక్తమయ్యే అవకాశం ఉందన్న సంగతి, ఇంకా పిన్నవాడైన వివేకానందకు తెలియరాలేదు.

ఆ రోజు శివరాత్రి, ఫాల్గుణమాసం. స్వామీజీతోపాటు మరి నలుగురు బాలభక్తులు ఉపవాసం ఉన్నారు. శివార్చన చేస్తూ, రాత్రంతా జాగరణ చేయాలని వారి సంకల్పం. పూజాదులవల్ల కలిగే శబ్దాలవల్ల గురుదేవుల విశ్రాంతికి భంగం కలుగుతుందన్న ఉద్దేశంతో, వసతి గృహానికి కాస్త దూరంలో ఉన్న వంట ఇంట్లోని ఒక గదిలో పూజ ఏర్పాట్లను చేసుకున్నారు. సాయంకాలం తర్వాత మంచివర్షం కూడ పడింది. కొత్త మబ్బులతో నిండిన ఆకాశంలో అప్పుడప్పుడు మెరుపులు మెరుస్తూంటే, అవి శివుని జటాజూటంలోని గంగాధారలను జ్ఞప్తికి తెస్తున్నాయి.

రాత్రి పదిగంటల తర్వాత మొదటి ప్రహరపూజ, జపధ్యానాలను ముగించి, పూజాపీఠంపై కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ స్వామీజీ మాట్లాడసాగాడు. అక్కడున్న వారిలో ఒకరు స్వామీజీకి హుక్కా తయారుచేసి తీసుకురావడానికి బయటికి వెళ్లాడు. మరొకరు ఏదో పని మీద వసతిగృహానికి వెళ్లాడు. ఆ సమయంలో తనలో తీవ్రంగా 'ఆ శక్తి' జాగృతమౌతున్నట్లు స్వామీజీ అనుభూతి చెందాడు. ఆ శక్తిని ఆ రోజు పరీక్షించాలన్న తలంపు అతడి కప్పుడు కలిగింది. ప్రక్కనే స్వామి అభేదానంద కూర్చుని ఉన్నాడు. అతణ్ణి పిలిచి, ''నన్ను కొంతసేపు తాకు'' అని చెప్పాడు. అభేదానంద అలాగే చేశాడు. ఇందాక బయటికి వెళ్లిన భక్తుడు ఆలోగా హుక్కా తయారుచేసుకుని లోపలికి వచ్చాడు. అప్పుడు వివేకానంద గాఢధ్యానంలో మునిగివుండడం, అభేదానంద తన కుడి చేతితో వివేకానంద కుడికాలును తాకి, కళ్లు మూసుకుని కూర్చుని ఉండడం

చూశాడు. అప్పుడు అభేదానంద చెయ్యి తీవ్రంగా వణకడం గమనించాడు. రెండు మూడు నిముషాల తర్వాత స్వామీజీ ధ్యానం నుండి మేల్కొన్నాడు. ''ఇక చాలు. ఇప్పుడు చెప్పు. నీ కెలా అనిపించింది?'' అని అభేదానందను అడిగాడు.

''విద్యుత్ బ్యాటరీని తాకితే, ఆ ఆఘాతానికి ఏదో లోపలికి వెళుతున్న ట్లుగా ఒళ్లంతా జలదరించిపోతున్నట్లు ఉంటుంది కదా! నిన్ను తాకినప్పుడు కూడ నా కలాగే అనిపించింది'' అని అభేదానంద చెప్పాడు.

అక్కడున్న మరొకరు, ''స్వామిని తాకినప్పుడు నీ చెయ్యి దానంతనటదే వణికిందా?'' అని అడిగాడు.

''ఔను, కదలకుండా ఉంచడానికి ప్రయత్నించాను కాని సాధ్యం కాలేదు'' అని చెప్పాడు అభేదానంద.

ఆ విషయమ్మై ఇక ఏ మాటలూ జరగలేదు. స్వామీజీ హుక్కా పీలుస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత అంతా రెండవ ప్రహరపూజ, ధ్యానంలో నిమగ్న లయ్యారు. అభేదానంద అప్పుడు ఎంతో గంభీర ధ్యానంలో నిమగ్నుడైనాడు. అంతకు ముందెప్పుడూ అతడికి అంత ప్రగాఢ ధ్యానం కలగడం మే మెప్పుడూ చూడలేదు. అతడి మెడ, తల కాస్త వంగి ఉన్నా, శరీరమంతా కర్రలా బిగుసుకు పోయింది. కాసేపటికి అతడు బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయాడు. అంతకు పూర్వం అతడు వివేకానందస్వామిని తాకడం వల్లనే, అతడి కిప్పుడు ఇలాంటి ప్రగాఢ ధ్యానస్థితి కలిగిందని అంతా అర్థం చేసుకున్నారు. వివేకానంద కూడ, అతడి ఆ స్థితిని గమనించి, ప్రక్కన ఉన్న సహచరుడికి సంజ్ఞ చేసి చూపించాడు.

రాత్రి నాల్గవ ప్రహరపూజ ముగిసిన తర్వాత, రామకృష్ణానందస్వామి ఆ పూజగదిలోకి వచ్చాడు. ''గురుదేవులు రమ్మంటున్నారు'' అని వివేకానంద స్వామితో చెప్పాడు. వెంటనే స్వామి వసతిగృహం రెండవ అంతస్తులో ఉన్న శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లాడు. రామకృష్ణానందస్వామి కూడ అతణ్ణే అనుసరిం చాడు.

స్వామి వివేకానందను చూడగానే, శ్రీరామకృష్ణులు, ''ఏమోయ్! కాస్త కూడబెట్టావో లేదో అప్పుడే అంతా ఖర్చుచేస్తావా? మొదట ఆ శక్తిని నీలో చక్కగా పెంపొందనివ్వు. ఆ తర్వాత దాన్ని ఎక్కడ ఎలా ఖర్చుపెట్టాలో నీకే తెలు స్తుంది. అమ్మే నీకు తెలుపుతుంది. ఆ పిల్లవాడిలో (అభేదానందస్వామి) నీ మనోభావాన్ని ప్రవేశపెట్టి, అతడికి ఎంత హాని చేశావో నీకేమైనా తెలుసా? ఆ అబ్బాయి ఇంతకాలం ఒక మనోభావంతో వికాసం చెందుతున్నాడు. ఆరు నెలల కడుపు గర్భస్రావం అయినట్లు ఇప్పుడు పాపం అదంతా నష్టమైపోయింది. సరే అయిందేమో అయింది. ఇక నుండి అనాలోచితంగా ఇలాంటి పనులు చేయవద్దు.

అయినా, ఆ కుర్రాడి అదృష్టం బాగుంది. అతడికి ఏమంత ఎక్కువ హాని జరగ లేదులే'' అని మందలించారు.

స్వామీజీ మాతో, ''అదంతా విని నే నప్పుడు తెల్లబోయాను. పూజ సమయంలో క్రింద ఆ గదిలో మేం ఏమేం చేసామో అదంతా ఆయనకు తెలుస్తూనే ఉందన్నమాట! అప్పుడు నేనిక ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండి పోయాను'' అని తరువాత చెప్పాడు.

పై శక్తిపాతం ఫలితంగా అంతవరకు అభేదానందలో నెలకొనివున్న ఆధ్యాత్మిక భావం నశించింది. అంతేకాదు అవగతం చేసుకొని జీర్ణించుకోవడానికి ఎంతో కష్టమైన అద్వైతభావం అతడిలో ప్రవేశించింది. పైగా అతడు దాన్ని అపార్థం చేసుకొన్నాడు. అద్వైతం పేరున అతడు నాస్తికుడిగా ప్రవర్తించసాగాడు. కొన్ని సమయాల్లో శాస్త్రాదేశాలకు భిన్నంగా వ్యవహరించేవాడు.

ఆ శక్తిపాత సంఘటన తర్వాత గురుదేవులు అతడికి అద్వైతాన్ని బోధించసాగారు. దైనందిన జీవితంలో అద్వైతం పేరుతో అతడు చేస్తున్న పొరపాట్లను ప్రేమతో చూపి, సరిదిద్దసాగారు. కాని గురుదేవుల దేహత్యాగం తర్వాత ఎంతో కాలం గడిచాకే తన దైనందిన జీవితాన్ని అద్వైతభావానికి అనుగుణంగా సమన్వయించుకోవడంలో అతడు కృతకృత్యుడయ్యాడు.

6. అవతారంలో భగవంతుడు మానవ మాత్రునిగా ప్రవర్తిస్తాడు

సత్యదర్శనం చేసి తమ జీవితాల్లో దాన్ని పూర్తిగా అభివ్యక్తం చేయడం కోసం అవతారపురుషులు అనుష్ఠించే సాధనలు, ప్రయత్నాలు అన్నీ కేవలం నటనలే అని ఒక వర్గం భక్తుల అభిప్రాయం. అలాంటి వారికి మా సమాధానం ఇది:

శ్రీరామకృష్ణులు ఎన్నడూ అలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం మేం వినలేదు. పైగా ''దేవుడు మనిషిగా అవతరించినప్పుడు, అతడి పనులన్నీ సామాన్య మానవుడివిగానే ఉంటాయి. మానవ దేహాన్ని దాల్చిన భగవంతుడు మనిషిలాగే సుఖదుఃఖాలు అనుభవిస్తూ ఉంటాడు. అతడు కూడ మనిషిలా పురుష ప్రయత్నం, ప్రయాస, తపస్సు ద్వారా ప్రతివిషయంలో పూర్ణత్వాన్ని పొందవలసి ఉంటుంది'' అని తరచూ చెబుతుండగా మేం విన్నాం. ప్రపంచ మత చరిత్రలన్నీ కూడ ఇదే విషయాన్నే ధ్రువీకరిస్తున్నాయి. అలా చేయకపోతే భగవంతుడు మనిషిగా అవతరించిన ఉద్దేశం, ప్రయోజనం నిష్ప్రయోజనాలవుతాయి.

స్వతంత్రేచ్ఛ, ఆత్మార్పణల గురించి శ్రీరామకృష్ణుల ఉపదేశాలను రెండు కోవలుగా వర్గీకరించవచ్చు. ఒక వంక ఆయన భక్తులతో ఇలా అంటూ ఉండడం మనం చూడవచ్చు:

''(నేను) అన్నం వండాను. ఇక మీరంతా కూర్చుని భోజనం చేయండి.''
''మూస తయారైంది. మీరిక మీ మనసులను దానిలో పోతపోసుకోండి.''
''మీరేమీ చేయలేకపోతే మీ ముక్త్యారునామాను నాకు అప్పగించండి.''

మరోవైపు ఇలా ఉపదేశించేవారు: ''కోరికలన్నింటినీ ఒక్కొక్కటిగా వదలి పెట్టండి. అప్పుడే సాఫల్యం లభిస్తుంది.'' - ''గాలిలో ఎగిరే ఎండుటాకులా ఉండండి.'' - ''కామకాంచనాలను పరిత్యజించి, భగవంతుణ్ణి ప్రార్థించండి.'' - ''నేను (రూపాయలో) పదహారణాలు (సాధన) చేశాను. మీరు ఒక్క అణా (సాధన) అయినా చేయండి.''

ఇలాంటి రెండు రకాల భావాలతో కూడుకొన్న గురుదేవుల ఉపదేశ ప్రాధాన్యాన్ని ఎరుగలేకపోవడం - స్వేచ్ఛ - విధి; ఆత్మార్పణం - పురుషప్రయత్నం, ఈ రెండింటినీ సరిగ్గా సమతౌల్యం చేసుకోలేకపోవడం వల్లే మనం జీవితం (సాధన)లో పురోగమించలేకపోతున్నామనడానికి కారణం అని తోస్తున్నది.

''మనిషికి స్వతంత్రేచ్ఛ ఏదైనా ఉందా?'' అనే విషయమై ఒక మిత్రుడితో మే మొకరోజు దక్షిణేశ్వరంలో చాలాసేపు చర్చించాం. చివరికి దాని నిజానిజాలను తెలుసుకోవడానికి శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లాం. విషయం చెప్పాం. బాలకులమైన మా వాదోపవాదాలను కాసేపు ఆయన వినోదంగా విన్నారు. తర్వాత గంభీరంగా, ''స్వాధీన ఇచ్ఛ లాంటిది ఎవరికైనా ఉంటుందంటారా? అనాదిగా అంతా ఈశ్వరేచ్ఛ వల్లే జరుగుతూ వస్తున్నది. ఇకముందు జరగబోతోంది కూడ. చివరికి తప్పకుండా మనిషి ఈ సత్యాన్ని అర్థం చేసుకుంటాడు. అయినా మనిషికి స్వతంత్రేచ్ఛ కొంతమేరకు ఉంటుంది. అది గుంజకు పొడవైన తాడుతో కట్టివేసిన పశువుకున్న స్వేచ్ఛ వంటిదే. గుంజనుండి పశువు మూడు మూరల దూరం వరకూ తిరగవచ్చు. లేదా తాడు ఎంత పొడవుంటుందో, అంతదూరం ఇచ్ఛమేరకు తిరగవచ్చు. మనిషి స్వేచ్ఛ కూడ ఇంతే. తాడు పొడవు మేరలో పశువు తన ఇష్టం వచ్చినట్లు ఏమైనా చేసుకోవచ్చు. పడుకోవచ్చు, తిరగవచ్చు. నిలబడవచ్చు, అలాంటి స్వేచ్ఛ దాని కివ్వాలనే మనిషి దాన్నలా కట్టివేశాడు. అలాగే భగవంతుడు కూడ మనిషికి కొంతమేరకు శక్తిని ఇస్తాడు. దాన్నతడు ఎలాగైనా, ఏ మోతాదులోనైనా ఉపయోగించుకునే స్వేచ్ఛనిస్తాడు. అంతమాత్రం చేత తాను 'స్వతంత్రుడను' అన్న భ్రమకు మనిషి లోనౌతాడు. కాని తాడు గుంజకు కట్టివేయబడివుంటుంది సుమా! ఒక విషయముంది - మనిషి ఆర్తుడై భగవంతుణ్ణి ప్రార్థిస్తే, భగవంతుడు మరోచోట ఆ బంధం వేయగలడు. లేదా తాడును మరింత పొడిగిస్తాడు. లేదా ఆయన కిష్టమైతే మెడకు తగిలించిన ఆ బంధాన్ని పూర్తిగా తొలగించివేస్తాడు కూడ!'' అని అన్నారు.

ఆయన మాటలు విన్న తర్వాత, ''అయితే సాధన - భజనలను చేయడం మనిషి వశంలో లేదంటారా? అలాంటప్పుడు 'నేను చేస్తున్నదంతా భగవదేచ్ఛతోనే చేస్తున్నాను' అని అందరూ అనడానికి వీలుంటుంది కదా?'' అని అడిగాం.

అందుకు ఆయన ఇలా అన్నారు: ''అవన్నీ కేవలం నోటిమాటలే! ముల్లూలేదూ, గుచ్చుకోనూ లేదు - అని అనడంవల్ల ఏమిటి లాభం? ముల్లు గుచ్చుకోగానే 'అబ్బా' అని కేకపెడతావు. సాధన చేయడం మనిషి చేతిలో ఉంటే, అందరూ సాధన చేస్తారు కదా! మరి అలా చేయడం లేదేమిటి? కాని ఒక్కటి మాత్రం నిజం. భగవంతుడు నీ కిచ్చిన శక్తిని నువ్వు సక్రమంగా వినియోగించుకోలేకపోతే, ఆయన నీ కిక అదనపు శక్తి నివ్వడు. కాబట్టి పురుషకారం లేదా పురుషప్రయత్నం అవసరం. భగవంతుడి కృప పొందాలంటే, కొద్దో గొప్పో అందరూ ప్రయత్నం చేయాల్సిందే. అలా ప్రయత్నం చేస్తే, దైవకృప వల్ల పది జన్మల్లో పొందే అనుభవాల నన్నింటినీ, ఒక్కజన్మలోనే పొందవచ్చు. అయితే ఎంతో కొంత ప్రయత్నం మాత్రం అందరూ తప్పక చేయాల్సిందే. ఒక కథను వినండి.

7. ఈ అంశంపై విష్ణు - నారద సంవాదోపాఖ్యానం

''ఒకప్పుడు గోలోకంలో విష్ణువుకు నారదునిపై ఏ కారణంగానో కోపం వచ్చింది. వెంటనే 'నరకవాసం' చేయమని నారదుణ్ణి శపించాడు. ఆ శాపం విని నారదుడు ఎంతో ఆందోళన చెందాడు. భగవంతుణ్ణి ఎన్నో విధాలుగా స్తుతించి, ప్రసన్నం చేసుకున్నాడు. ''ప్రభూ! నరకం ఎక్కడ - ఎలా - ఎన్ని రకాలుగా ఉంటుందో తెలుసుకోవాలని ఉంది. దయచేసి తెలియపరచండి'' అని ప్రార్థించాడు.

అప్పుడు విష్ణువు ఒక సుద్దముక్క తీసుకుని, నేలమీద భూమి - నరకం - స్వర్గం చిత్రంగీసి, ఏవేవి ఎక్కడుంటాయో వివరించాడు. 'ఇదయ్యా నరకం. ఇక్కడ స్వర్గం ఉంటుందయ్యా' అని చెప్పాడు. 'అలాగా, అయితే ఇంకేం, నేను నరకవాసం చేసేస్తాను' అంటూ నారదుడు 'నరకం' బొమ్మమీద పడిదొర్లాడు. దొర్లి, పైకిలేచి ప్రణామం చేశాడు.

అది చూసి విష్ణువు నవ్వి, 'ఇదేమిటీ, ఇది నరకవాసం ఎలా అవుతుందీ?' అన్నాడు.

'ఎందుక్కాదు? స్వర్గ - నరకాలు నీ సృష్టే కదా! నువ్వు గీసి చూపించి, 'ఇది నరకం' అన్నప్పుడు అది నిజంగానే నరకం అవుతుంది. అంతేకాదు, నేను దానిపై దొర్లినప్పుడు నిజంగానే నేను నరకయాతనను అనుభవించాను' అని నారదుడు ప్రగాఢ విశ్వాసంతో చెప్పాడు.

అతడి విశ్వాసం చూసి విష్ణువు కూడ, 'తథాస్తు' అన్నాడు. కాని భగవంతునిపైన ప్రగాఢ విశ్వాసంతో, కనీసం ఆ బొమ్మనరకం పైన అయినా దొర్లవలసి వచ్చింది నారదుడికి! ఆ మాత్రం ప్రయత్నం చేయడం వల్లే అతడి కర్మ తీరిపోయింది.'' కాబట్టి భగవంతుడి కృపారాజ్యంలో సైతం పురుషప్రయత్నానికి, పురుషకారానికి స్థానముందన్న విషయాన్ని గురుదేవులు ఇలాంటి కథల ద్వారా అప్పుడప్పుడు తెలియపరుస్తూ ఉండేవారు.

మానవదేహాలను ధరించి, మానవులుగానే ప్రవర్తించే అవతారపురుషులు కూడ, మనలాగే అనేక విషయాల్లో అల్పదృష్టి, పరిమిత జ్ఞానం కలిగివుంటారు.

8. అవతారపురుషులు ముక్తి మార్గాలను ఆవిష్కరిస్తారు

మనలాగే వారు కూడ సాధనలు, ప్రయత్నాలు చేస్తూ, అజ్ఞానాంధకారం నుండి బయటపడే మార్గాన్ని కనుగొనవలసి ఉంటుంది. వారా మార్గాన్ని కనుగొనేదాకా, అంతర్గతంగా ఉండే వారి దివ్యనైజం అప్పుడప్పుడు, చూచాయగా, కొన్ని క్షణాల పర్యంతం భాసించినా - అది వెంటనే మళ్లీ మరుగునపడిపోతూ ఉంటుంది. ఇలా 'బహుజనహితం కోసం' మాయ అనే ఆవరణాన్ని స్వీకరించిన అవతార పురుషులుకూడ, మనలాగే ఈ వెలుగు చీకట్ల రాజ్యంలో మార్గం కోసం తడుములాడుకోవలసి ఉంటుంది. కాని స్వార్థగంధం ఏమాత్రం వారిలో ఉండకపోవడంచేత, జీవనమార్గంలో వారు మనకంటే అధిక ప్రకాశాన్ని గాంచుతారు. అంతేకాదు, తమలో అంతర్గతంగా ఉన్న శక్తుల నన్నింటినీ అలవోకగా ఏకాగ్రం చేసుకొని, అతి స్వల్పకాలంలోనే జీవనసమస్యను పరిష్కరించి లోక కల్యాణంలో నిమగ్నులై కాలం గడుపుతుంటారు.

దివ్యమానవుడైన గురుదేవులు, నిజంగానే మానవుల అసంపూర్ణత్వాన్ని (స్వయంగా) స్వీకరించారు. కాబట్టి ఆయన మానవ భావాలను చక్కగా అధ్యయనం చేయడం వల్ల మన కెంతో మేలు ఒనకూరుతుంది.

9. అవతారపురుషులను మానవులుగా భావించకుంటే ఆ భావన ప్రాధాన్యాన్ని కోల్పోతుంది

అందుకే ఆయన మానవ భావాలను ముందుంచుకొనే, ఆయన దైవీభావాన్ని అధ్యయనం చేయమని పాఠకులను మేము కోరుతున్నాం. మనలో ఒక మనిషిగా ఆయనను మనం స్వీకరించకపోతే సాధన కాలంలో ఆయన అనుష్ఠించిన అలౌకిక సాధనల ప్రయత్నాల ఆంతర్యం మనం అవగతం చేసుకోలేం. అయితే నిత్యపూర్ణుడు, సత్యదర్శనం కోసం మళ్లీ ప్రయత్నం చేయడ మేమిటీ? అన్న ప్రశ్న ఎదురౌతుంది. మరణాన్నే వరించేవారి అమానుష వ్యాకులత కేవలం లోకం కళ్లు కప్పడానికే అనిపిస్తుంది. భగవత్సాక్షాత్కారం కోసం, తమ జీవితంలో ఉన్నతాదర్శాలను సుప్రతిష్ఠించుకోవడం కోసం ఆయన చేసిన ప్రయత్నాలు,

పాటించిన నియమనిష్ఠలు ప్రచండ త్యాగాలు - ఇవన్నీ మనలాంటి వారిని ఉత్తేజపరచవు. పైగా అందుకు విరుద్ధంగా మనలను తీవ్రనిరాశకు లోను చేస్తాయి. మన జీవితం నుండి అజ్ఞానం తొలగిపోవడం అసంభవం అనిపించేలా చేస్తాయి.

మనం గురుదేవుల కృపాలాభాన్ని ఆశిస్తున్నా, మనం వారిని కూడ మనలాగే మానవ భావమయులుగా అంగీకరించవలసిందే. ఎందుకంటే, ఆయన కూడ మనతో సరిసమానంగా దుఃఖాలను, యాతనలను అనుభవించి, ఆ తర్వాత మన దుఃఖాలను కడతేర్ప ముందుకు వచ్చారు. కాబట్టి ఏ కోణంలో చూసినా, ఆయనను మానవ భావమయులుగానే మనం భావించడం తప్ప మరో మార్గంలేదు. నిజానికి మనం ఎంతవరకైతే సకల బంధాల నుండి విముక్తులం కామో, నిర్గుణ పారమార్థిక సత్యంలో ప్రతిష్ఠితులమై ఉండమో, అంతవరకూ ఈశ్వరుణ్ణి, ఈశ్వరావతార పురుషులను మానవ భావమయులుగానే భావిస్తూ, స్వీకరించాల్సిందే. ''దేవో భూత్వా దేవం యజేత్'' - దేవుడవై దేవుణ్ణి పూజించు - అన్న మాట ముమ్మాటికీ సత్యం. నువ్వు సమాధిని అభ్యాసం చేసి, నిర్వికల్పసమాధి భూమి నధిరోహించినప్పుడే, భగవంతుని యథార్థ స్వరూపాన్ని ప్రత్యక్షం చేసుకుంటావు. అర్థం చేసుకొంటావు. ఆయనను వాస్తవికంగా ఆరాధించగలుగుతావు. అప్పటిదాకా నీ పూజ, ఆ దేవ భూమిని అధిరోహించడానికి, భగవంతుని యథార్థపూజకు నిన్ను అర్హుణ్ణి చేయడానికి పనికివచ్చే ప్రయత్నం మాత్రమే సుమా! అయితే అంతవరకు కూడ, జగత్కారణుడైన ఈశ్వరుని గురించి ఆయనొక విశిష్ట శక్తి సంపన్నుడైన మానవుడే - అన్న తలంపు మాత్రమే నీకు సహజంగా కలుగుతూ ఉంటుంది.

10. అవతారపురుషుల గురించిన దృక్పథాలు

కాని ఆ దేవత్వస్థితిని పొంది అలా మాయాతీత ఈశ్వర స్వరూపాన్ని యథార్థంగా పూజించగలిగేవారు బహు అరుదుగా ఉంటారు. కాబట్టి మనలాంటి సాధారణ వ్యక్తుల మీద కరుణతో, మన హృదయపూర్వక పూజలను గ్రహించడానికే భగవంతుడు ఈ మర్త్యలోకాన అవతరిస్తుంటాడు. మానవదేహాన్ని ఆశ్రయించి, మానవభావాన్ని అవలంబించి, దేవమానవుడుగా వ్యవహరిస్తూంటాడు. పూర్వయుగాల్లో అవతరించిన ఆయా దేవమానవులతో పోల్చి గనుక చూసుకుంటే, మనం ఎంతో అదృష్టవంతులం అని అనుకోవలసి ఉంటుంది. ఆ దేవమానవుల జీవిత చరిత్రలను చదివే అవకాశం మనకు లేదు; కాని శ్రీరామకృష్ణుల సాధనకాల చరిత్రను పఠించే సదవకాశం మాకు ఎంతో లభించింది. ఎందుకంటే

11. భగవదవతారం - మానవాళిపట్ల భగవంతుని కారుణ్యం

తరచూ ఆయన స్వయంగా ఆ సాధనకాలం నాటి తమ జీవిత సంఘటనల నెన్నింటినో మాకు వివరిస్తూ చెప్పేవారు. అందుచేత వారి సాధనల సజీవ చిత్రం మా మనోఫలకంపై గాఢంగా ముద్రితమైపోయింది. మేము ఆయన వద్దకు రాకపోకలు మొదలుపెట్టడానికి కొద్దికాలం క్రితమే, దక్షిణేశ్వర కాళికాలయ భక్త జనుల ముందు వారి విచిత్ర సాధనాభినయం జరిగిపోయింది. ఆయన సాధనలను కళ్లారా చూసినవారిలో చాలామంది అప్పుడు అక్కడే జీవిస్తూ ఉండేవారు. వారి ముఖతా కూడ గురుదేవుల సాధనల గూర్చి కొంతలో కొంత వినే అవకాశం మాకు లభించింది. ఏది ఏమైనా ఆ విషయాన్ని ఆలోచించడానికి ముందు, స్థూలంగా 'సాధన' గురించిన మూలతత్త్వాలను ఒకమారు సింహావలోకనం చేసుకోవడం మంచిది. కాబట్టి ఆ విషయం ఒకింత చర్చిద్దాం.

1. సాధకుడు - సాధన

శ్రీరామకృష్ణుల జీవితంలోని సాధకభావాన్ని అర్థం చేసుకోవాలంటే సాధన అంటే ఏమిటి? అన్న విషయాన్ని మనం ముందుగా తెలుసుకోవాలి. ''అనాదిగా భారతదేశం సాధనను ఏదో ఒక రూపంలో కొనసాగిస్తూ వస్తూనే ఉంది. అలాంటప్పుడు 'సాధన' గూర్చి మళ్లీ విస్తృత వివరణతో గ్రంథ పరిమాణాన్ని పెంచడమెందుకూ? ఆధ్యాత్మిక రాజ్యంలోని సత్యాల నన్నింటినీ సాక్షాత్కరించుకోవడం కోసం, భారతదేశం సుదీర్ఘకాలం నుండి తన శక్తుల నన్నింటినీ వినియోగించింది. నేడు కూడ వినియోగిస్తున్నది. ప్రపంచంలోని మరే ఇతర దేశమైనా అలా చేస్తున్నదా? ఈ దేశంలో ఉద్భవించినంత మంది అవతార పురుషులు, బ్రహ్మజ్ఞులు మరే దేశంలోనైనా జన్మించారా? అందుచేత సాధన మూల సూత్రాలతో ఇదివరకే మనం చక్కగా పరిచితులమై ఉండగా, మళ్లీ వాటిని గూర్చి చర్చించటం దేనికి?'' అని అనేకులు ఆక్షేపించవచ్చు.

పై ఆక్షేపణలో సత్యం లేకపోలేదు. అయినా దాన్ని గురించి మళ్లీ ఒకమారు చక్కగా ఆలోచించడం మంచిది, ఎంతో అవసరం కూడ. ఎందుకంటే, జన

1. సాధన విషయమై సామాన్యుల భ్రాంతి భావన

సామాన్యానికి 'సాధన' విషయమై చిత్రవిచిత్ర అభిప్రాయాలుండడం చూస్తుంటాం. ఆధ్యాత్మిక సాధనల లక్ష్యాన్ని మరిచిపోయి, కఠిన క్లేశకర తపస్సులను, దుర్లభ వస్తువుతో - దుర్లభ స్థానాల్లో చేసే చిత్రవిచిత్రమైన పనికిమాలిన చేష్టలను - ముక్కు బిగించి శ్వాసను ఆపడాన్ని - చివరికి మతి చెడినవారి పిచ్చిపిచ్చి కార్యకలాపాలు - ఇలాంటి వాటినన్నింటినీ అద్భుతసాధన విశేషాలని ఎంతోమంది భ్రమ పడుతుంటారు. అంతేకాదు, దుష్టసంస్కారాలు - దుర్వ్యసనాలుగల వారిని స్వస్థత పరచడానికి మహాత్ములు బోధించే విచిత్ర ప్రక్రియలను కూడ 'సాధనలు'గా భావిస్తారు. అంతటితో తృప్తి పొందక అవన్నీ జనులందరికీ ఉపయోగపడతాయని

వారు ప్రచారం చేస్తారు. చేయడమే కాదు వాటిని అభ్యాసం కూడ చేస్తుంటారు. మరికొంద రుంటారు. వారికి ఏమాత్రం వైరాగ్యమంటూ ఉండదు. రూప రసాది పంచేంద్రియ విషయభోగాలను ఆశిస్తూ, వాటికోసం అనేక క్రియాకలా పాలు చేస్తుంటారు. మంత్రం - ఓషధులతో పాములను వశం చేసుకునేలా, జగత్కారణ ఈశ్వరుణ్ణే తమ వశం చేసుకోవాలన్న ఆశతో మంత్ర తంత్రాది విచిత్ర వ్యర్థక్రియలతో కాలక్షేపం చేస్తుంటారు. కాబట్టి యుగయుగాల నుండి భారతదేశ ఋషులు, మహాత్ములు తీవ్రకృషితో కనుగొని, ఉపదేశించిన సాధనతత్త్వాల గూర్చి ఒకమారు క్లుప్తంగా చెప్పుకోవడం అప్రస్తుతం కాబోదు.

''అన్ని జీవాల్లో బ్రహ్మన్ని లేదా భగవంతుణ్ణే దర్శించడమే, సాధన చరమ దశ'' అని శ్రీరామకృష్ణులు చెబుతూ ఉండేవారు. సాధన చరమదశలో మాత్రమే సాధకుని భాగ్యంగా ఈ సర్వభూతస్థ బ్రహ్మసాక్షాత్కార స్థితి లభిస్తుంది. హిందువులకు సర్వోత్కృష్ట ప్రామాణిక శాస్త్రాలైన వేదోపనిషత్తులు ఈ విషయాన్నే నొక్కి వక్కాణిస్తాయి. ఈ ప్రపంచంలో నువ్వు ఏం చేస్తున్నావో, స్థూల - సూక్ష్మ - జడ - చేతనాలు; ఇటుకలు - కొయ్యలు - మట్టి - రాయి - పశువులు - పక్షులు - చెట్లు - పురుషులు - దేవతలు - అన్నీ కూడా ఒకే ఒక 'అద్వయ బ్రహ్మం' అని అవి స్పష్టం చేస్తుంటాయి. ఉన్న ఆ ఒక్క బ్రహ్మన్నే నువ్వు నానారూపాలతో, నానాభావాలతో చూస్తుంటావు, వింటూంటావు! అంటే పంచేంద్రియాలతో అనుభవిస్తుంటావు అన్నమాట. ఆ ఒక్క భగవంతునితోనే నువ్వు-నీ దైనందిన జీవితంలో జీవితాంతం వ్యవహరిస్తుంటావు. కాని నీ కా విషయం అర్థం కాక పోవడంచేత, భిన్న భిన్న వస్తువులతో, వ్యక్తులతో నువ్వు వ్యవహరిస్తున్నట్లు భావిస్తూ ఉంటావు.

2. సకల జీవాల్లో బ్రహ్మదర్శనానికి సాధనే ఉపాయం

ఈ విషయాన్ని విన్న తర్వాత మనలో ఎన్నో సందేహాలు తలెత్తుతాయి. వాటిని తొలగించడానికి శాస్త్రీయ సమాధానాలను ప్రశ్నోత్తరాల రూపంలో పాఠకులకు అందిస్తే, విషయం సులభంగా అర్థమవుతుందని మా ఆశయం.

ప్రశ్న: ఆ విషయం (ప్రపంచం నిజానికి బ్రహ్మమే అన్న విషయం) మనకు ప్రత్యక్షానుభవంలోకి రాకపోవడానికి కారణం ఏమిటి?

జవాబు: భ్రమ. మీరిప్పుడు భ్రమలో ఉన్నారు. ఆ భ్రమ తొలగనంత వరకూ, అది 'భ్రమ' అన్న విషయం ఎలా అర్థమౌతుంది? బాహ్యాభ్యంతరాలకు చెందిన ఏ భ్రమల గురించి అయినా, అవి కేవలం 'భ్రమలు' అని మనం తెలుసుకోవాలంటే వాటిని యథార్థ వస్తువులతో, అవస్థలతో పోల్చినప్పుడు అది సాధ్యమవుతుంది. అలాగే పైన చెప్పిన మీ భ్రాంతి (నానాత్వాన్ని చూడడం) తొలగాలంటే, సరైన (అద్వయ బ్రహ్మ) జ్ఞానం అవసరం.

ప్రశ్న: సరే. మరి ఆ భ్రమ కలగడానికి హేతువు ఏమిటి? అది మనలో ఎప్పుడు ప్రారంభమైంది?

జవాబు: సర్వత్రా భ్రమకు ఏది కారణమో, ఇక్కడ కూడ అదే! అంటే అజ్ఞానమే దానికి కారణం. ఆ అజ్ఞానం ఎప్పుడు నిన్ను పట్టుకుందో నీ కెలా తెలుస్తుంది? నువ్వు అజ్ఞానంలో ఉన్నంతకాలం, దాన్ని తెలుసుకోవడానికి నువ్వు చేసే ప్రయత్నాలన్నీ వ్యర్థమే అవుతాయి. కలను చూస్తున్నంత కాలం, అది నిజమేనని పిస్తుంది. మేల్కొన్న తర్వాత, ఆ స్వప్నాన్ని జాగ్రదావస్థతో పోల్చి చూసుకున్న తర్వాతే అది 'కల' అన్న విషయం స్పష్టమవుతుంది. ఈ విషయంలో నువ్వో ఆక్షేపణ చేయవచ్చు - కలలు కంటున్నప్పుడుకూడ కొంతమందికి 'ఇది కల' అనే జ్ఞానముంటుందని. దానికి ఒకటే సమాధానం: 'ఇది కల' అని వారికి కలిగే జ్ఞానం కూడ నిజానికి జాగ్రత్ స్మృతి నుండే కలుగుతుంది. అలాగే జాగ్రదవస్థలో జగత్తును ప్రత్యక్షంగా అనుభూతం చేసుకొంటున్నప్పుడు కూడ కొంతమందికి (జ్ఞానులకు) ఆ అద్వయ బ్రహ్మ స్మృతి కలుగుతూ ఉంటుంది.[1]

3. భ్రమ సత్యాన్ని మరుగుపరుస్తుంది: భ్రమకు హేతువు ఒక మర్మం

ప్రశ్న: మరైతే (భ్రాంతి నశించడానికి) మార్గం ఏమిటి?

జవాబు: అజ్ఞానాన్ని నాశనం చేయడమే దానికి ఉపాయం. ఆ భ్రమ లేదా అజ్ఞానం తొలగిపోతుందని నేను నిశ్చయంగా చెబుతున్నాను. పూర్వం ఎంత మందో దాన్ని నశింప జేసుకున్నారు. మనం కూడ దాన్నెలా నశింప జేసుకోవచ్చో, దానికో మార్గం చూపించి వెళ్లారు.

ప్రశ్న: సరే. ఆ మార్గాన్ని తెలుసుకునే ముందు, మే మొకటి రెండు ప్రశ్నలు వేయదలిచాం. మొదటిది - మేమింతమందిమి దేన్ని (ఏ నానాత్వాన్ని) చూస్తున్నామో, ప్రత్యక్షంగా అనుభవిస్తున్నామో, దాన్ని 'భ్రమ' అని నువ్వంటున్నావు. మళ్లీ ఏ కొద్దిమంది ఋషులో ఈ జగత్తును గ్రహిస్తున్న (అద్వయ బ్రహ్మ వస్తువుగా) దాన్నే 'సత్యం' అంటున్నావు. మరి ఆ కొద్దిమంది చూస్తున్నదే 'భ్రాంతి' ఎందుకు కాకూడదూ?

---

1. ఇంద్రియానుభవ విషయాలు మాత్రమే 'స్మృతి'గా ఉండిపోతాయి. కాబట్టి జాగ్రదవస్థను అనుభవించిన తర్వాతే, అది స్మృతి రూపంగా స్వప్నావస్థలో మేల్కొని 'ఇది నిజం కాదు; స్వప్నం' అనే వృత్తిని కలిగిస్తుంది. అలాగే, ఒక్కమారైనా సమాధిని పొంది, బ్రహ్మదర్శనాన్ని పొందినవారికి మాత్రమే అది స్మృతి రూపంలో నిల్చి, తర్వాత వారి మనసు జాగ్రదవస్థకు దిగివచ్చినా, ఆ బ్రహ్మసత్యం మరుపు రాకుండా చేస్తుంది. అప్పుడే వారికి ఈ జాగ్రదవస్థ కూడ స్వప్నతుల్యంగా కనిపిస్తుంది. *(చూడండి భ.గీ. 2-72)*

జవాబు: అనేక మంది నమ్మేదే 'సత్యం' కావాలన్న నియమమేమీ లేదు. ఋషులు ప్రత్యక్షం చేసుకున్నదే 'సత్యం' అని నేను చెప్పగలను. ఎందుకంటే, ఆ సత్యసాక్షాత్కారం ద్వారా వారు సకల దుఃఖాల, భయాల నుండి విముక్తులయ్యారు. పరిపూర్ణ శాంతిని పొందారు. అంతేకాదు. నిశ్చితమృత్యువుతో అంతమయ్యే మానవజీవిత ప్రయత్నాల కన్నింటికీ వెనుకవున్న ఒక మహ దాశయాన్ని (బ్రహ్మ దర్శనాన్ని) కనుగొన్నారు. పైగా నిజమైన జ్ఞానం మనిషిలో సహనం - సంతోషం - దయ - వినయం - మొదలైన సద్గుణాలను పెంపొం దిస్తుంది. అది మనిషి చిత్తాన్ని పరమ ఉదారపూర్ణం చేస్తుంది. ఋషుల జీవి తాల్లో అలాంటి అసాధారణ సద్గుణాలు, శక్తులుండడం మనకు శాస్త్రాల నుండి తెలుస్తూ ఉంది. వారి అడుగుజాడల్లో నడిచి, సిద్ధి పొందిన వారి జీవితాల్లో కూడ అలాంటి గుణాలుండడం మనం చూస్తూనే ఉంటాం.

4. ఋషులు జగత్తును ఎలా కాంచారో అదే సత్యం : అందుకు కారణం

ప్రశ్న: అదిసరే, మరి మనమంతా కూడ ఒకేరకమైన భ్రమలో ఉండటానికి కారణం ఏమిటి? ఉదాహరణకు, ఒకదాన్ని నేను 'పశువు'గా తెలుసుకుంటే, నువ్వు కూడా దాన్ని పశువుగానే గుర్తిస్తున్నావు తప్ప, మరో విధంగా కాదు. ఇతర విషయాల్లో కూడ ఇంతే. ఇలా ఏక కాలంలో అన్ని విషయాల్లోనూ అందరూ ఒకే భ్రాంతికి సమానంగా లోనుకావడం చాలా ఆశ్చర్యం కదా! కొంత మంది ఏదో ఒక విషయంలో భ్రాంతికి లోనైనా, ఇతరుల కా విషయంలో సమ్యక్ జ్ఞానం ఉండడం సర్వత్రా మనకు కనిపిస్తూ ఉంటుంది. కాని ఇక్కడ ఆ నియమం చెల్లుబాటు కావడం లేదు. అందుచేత నువ్వు చెబుతున్నది సము చితంగా కనిపించడం లేదు.

5. అనేకులకు ఒకే రకం 'భ్రమ' కలుగుతున్నా, ఆ భ్రమ 'సత్యం' కాబోదు

జవాబు: 'చాలామంది' అని నువ్వు పేర్కొన్న వారిలో, ఋషులను నువ్వు చేర్చలేదు. అందుకే నియమం పొసగడం లేదని నీ కనిపిస్తున్నది. లేకపోతే, నువ్వాశించే సమాధానం నీ ప్రశ్నలోనే ఉంది. అయినా నీ ప్రశ్నకు సమాధానం చెబుతున్నాను. జనులంతా ఒకే భ్రాంతికి లోనయ్యే విషయంలో శాస్త్రం చెబుతున్న దేమిటి? 'అపరిమిత అనంత విశ్వమానసంలో, ఈ జగత్తు ఒక కల్పనగా - ఒక భావనగా ఉదయిస్తుంది' - అని శాస్త్రం. నీ, నా, ఇతర జనులందరి వ్యష్టి మనస్సులన్నీ, ఆ విరాట్ పురుషుని మనసులో భాగాలుగా, అంశాలుగా ఉన్నాయి. అందుచేత మనమంతా కూడ భావాలనన్నింటినీ ఒకేరకంగా అనుభవిస్తూ ఉంటాం. ఆ కారణంగానే మనం ఒక పశువును పశువుగా తప్ప, మన ఇష్టానుసారం

6. సర్వులకూ ఒకే భ్రమ కలగడం ఎందుకు?

మరోరకంగా భావించలేము. కాబట్టి మనలో ఎవరైనా ఆత్మసాక్షాత్కారాన్ని పొంది, సర్వ భ్రమల నుండి ముక్తులైనా, మిగతావారంతా వెనుకటి భ్రమలోనే ఉంటారు. మరో విషయం. విరాట్ (ఈశ్వరుని) పురుషుని మనసులో జగత్తు అనే భావన ఉదయించినా, అతడు మనలా భ్రాంతిబంధనంలో చిక్కుకోడు. ఎందుకంటే - సర్వజ్ఞుడైన ఈశ్వరుడు, అజ్ఞానం నుండి జనించిన ఈ జగత్తు లోపల - వెలుపల - సర్వత్రా కూడా ఆ ఒక్క అద్వయ బ్రహ్మమే వ్యాప్తమై ఉండడం ప్రత్యక్షంగా చూస్తూంటాడు. మనం అలా చూడలేము. అందుకే మన కీ భ్రాంతి తప్పదు. ప్రభావానికి లోనుగాని దివ్యపురుషుని నైజాన్ని శ్రీరామకృష్ణులు ఇలా విశదీకరించేవారు: ''పాము నోట్లో విషం ఉంటుంది. అది ఆ నోటితోనే ఆహారం గ్రహిస్తూ ఉంటుంది. కాని దానికెలాంటి హానీ వాటిల్లదు. కాని పాము ఎవర్ని కాటువేస్తుందో, వారికి మాత్రం మృత్యువు తప్పదు.''

కాబట్టి శాస్త్రానుసారం చూస్తే, విరాట్ పురుషుని మనసులో లేదా విశ్వ మానసంలో కల్పనగా ఉదయించిన ఈ జగత్తు ఒకరకంగా మనందరి మనోకల్ప నయేనని స్పష్టమవుతున్నది. ఎందుకంటే, శరీరానికి - దాని వివిధ అవయవాలకు మధ్య ఉండే అవిచ్ఛేదక సంబంధం లాగే, మనందరి వ్యక్తిగత అల్ప మనసులన్నీ కూడ, ఆ విశ్వ మానసంలో అంశాలుగా నిత్యసంబంధం కలిగివుంటాయి.

7. జగత్తు అనే భావం దేశకాలాలకు అతీత మైంది; ప్రకృతికూడ అనాదే!

కాని ఈ విశ్వమానసంలో ఈ జగత్తు ఒకప్పుడుండి, మరొకప్పుడు లేకుండా పోతుందని చెప్పడం కూడ తగదు. ఎందుకంటే, ఏ నామరూపాలు లేకపోతే ఈ నానాత్వయుక్త విచిత్రసృష్టి అసంభవమో, ఆ నామరూపాలు లేదా దేశకాలాలు రెండు కూడ ఆ 'జగత్తు' అనే కల్పనలోని భాగాలే. ఆ జగత్ కల్పనలో అవి అవిచ్ఛిన్నంగా సర్వదా ఉంటాయి. కాస్త ప్రశాంతంగా ఆలోచిస్తే, ఈ సృష్టికంతా మూలభూతమైన ప్రకృతి లేదా మాయ అనాది అని, లేదా కాలాతీతమైనదని వేదాది శాస్త్రాలు ఎందుకు చెబుతున్నాయో అన్న విషయాన్ని పాఠకుడు చక్కగా అర్థం చేసుకోగలుగుతాడు. మరి జగత్తు మనఃకల్పన అయినట్లయితే, మనం దేన్ని కాలం అని అంటున్నామో, ఆ కాలంలో ఈ జగత్ కల్పన ప్రారంభం కాకపోతే, చివరికి ఒక విషయం తేలిపోతున్నది - అదేమిటంటే, కాలం అనే కల్పన కూడ (ఒకేమారు) దాని కాశ్రయమైన విశ్వమానసంలో ఉండే ఉంటుంది. మన పరి మిత వ్యష్టి మనస్సుల్లో ఈ జగత్ భావన ఎంతో కాలం నుండి ఉంటూరావడం వల్ల, 'జగత్తు సత్యం' అన్న భావన మనలో స్థిరపడిపోయింది. అలాగే ఈ కల్పన కతీతమైన అద్వయబ్రహ్మ సాక్షాత్ దర్శనం మనకు చాలాకాలంగా కలగకపోవడం

వల్ల కూడ 'ఈ జగత్తు కేవలం ఒక మనోకల్పన మాత్రమే' అన్న విషయాన్ని మరిచి, భ్రమలో పడిపోయామన్న సంగతిని మనం గ్రహించలేకుండా ఉన్నాం. దీనికి కారణం ఏమిటో ముందే చెప్పాం - ''సత్యవస్తువుతో, అవస్థతో పోల్చి చూసినప్పుడు మాత్రమే మనం బాహ్యాభ్యంతరాల భ్రమను అర్థం చేసుకో గలం.''

కాబట్టి, ఈ జగత్తును గూర్చి ప్రస్తుతం మనకున్న భావాలు, అనుభవాలు అన్నీ సుదీర్ఘకాలంగా వస్తూన్న మన అభ్యాసాల ఫలితమేనని మనకిప్పుడు స్పష్ట మవుతున్నది కదా! మనం ఈ జగత్తు వాస్తవ స్వరూపాన్ని గూర్చి (అంటే అది సత్యమా, భ్రమా? సత్యమైతే దాని స్వరూపం ఏమిటి? మొదలైన వాటిని గూర్చి) తెలుసు కోవాలంటే, మనకిప్పుడు ఉన్నవాటన్నింటికీ అతీతంగా ఉన్న దాన్నిగూర్చి తెలుసుకోవలసి ఉంటుంది. అలా తెలుసుకోవడానికి చేసే ప్రయత్నాలనే వేదాది శాస్త్రాలు 'సాధన' అంటాయి. స్త్రీ, పురుషుల్లో ఎవరైనాసరే తెలిసో తెలియకో ఇలాంటి ప్రయత్నాలు చేస్తుంటే, వారినే భారతదేశంలో 'సాధకులు' అని పేర్కొంటారు.

8. దేశకాలాలకు అతీతమైన జగత్ కారణాన్ని తెలుసు కోవడానికి చేసే ప్రయత్నమే 'సాధన'

మామూలుగా చెప్పాలంటే, జగత్తుకు అతీతంగా ఉన్న ఆ నిత్యవస్తువును తెలుసుకోవడానికి చేసే సాధన రెండు మార్గాలను అనుసరిస్తూ వస్తున్నది. శాస్త్రాలు ఆ మార్గాలను 1. నేతి, నేతి (ఇదికాదు, ఇదికాదు) అని లేదా జ్ఞానమార్గమని, 2. ఇతి, ఇతి (ఇదే, ఇదే) అని లేదా భక్తిమార్గం అని పేర్కొంటాయి. ఈ రెండు మార్గాల సాధకుల మధ్య ఉన్న తేడా ఒక్కటి మాత్రమే. జ్ఞానమార్గాన్ని అవలంబించే సాధకుడికి తన చరమలక్ష్యం గూర్చిన అవగాహన ఉంటుంది. దాన్ని సదా దృష్టిలో ఉంచుకుని పూర్తి ఎరుకతో దానివైపు అతడు క్రమక్రమంగా పురోగ మిస్తుంటాడు. కాని భక్తిమార్గాన్ని అనుసరించే సాధకుడికి చివరికి తానెక్కడికి చేరతాడో అన్న విషయం తరచూ తెలియకుండా ఉంటుంది. అతడు సాధన చేస్తూ చేస్తూ ఉన్నత లక్ష్యాలను ఒకదాని తర్వాత మరొకదాన్ని పొందుతూ చిట్ట చివరికి జగదతీతమైన ఆ అద్వయబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు. కాని ప్రపంచ విషయంలో సామాన్యులకుండే భావనలన్నింటినీ, ఈ రెండు మార్గా లను అనుసరించే సాధకులిద్దరు కూడా వదలిపెట్టవలసి ఉంటుంది. ఈ ఇద్దరికి తేడా ఒకటి ఉంది. జ్ఞానమార్గావలంబి మొదటి నుండే దాన్ని సంపూర్ణంగా పరిత్యాగం చేసే ప్రయత్నం చేస్తాడు. కాని భక్తుడు మాత్రం కొద్ది కొద్దిగా త్యాగం చేస్తూ సాధన కొనసాగిస్తాడు. కాని చివరికి అతడు కూడ జ్ఞానిలా సర్వాన్ని

9. 'నేతి, నేతి' - 'ఇతి, ఇతి' సాధన మార్గాలు

త్యజించి 'ఏకమేవాద్వితీయం' అనే తత్త్వాన్ని సమీపిస్తాడు - స్వార్థపరాయణులైన ప్రాపంచికులకు ఈ జగత్తులో సుఖభోగాలొక్కటే ఏకైక లక్ష్యంగా ఉంటాయి. ఈ సుఖభోగ లక్ష్యాన్ని పరిత్యాగం చేయడాన్నే శాస్త్రం 'వైరాగ్యం' అంటుంది.

సదా మారుతూ, నిశ్చిత మృత్యువుతో అంతమయ్యే మానవజీవితంలో 'ప్రపంచం అత్యంత అనిత్యం' అనే జ్ఞానం సహజంగానే కలుగుతుంది. ఈ కారణంగానే జగత్తును గూర్చి కలిగే సామాన్యభావన (అంటే ప్రపంచం సదా సుఖ స్థానంగా ఉంటుందనే సామాన్యుల భ్రాంతిభావన)ను త్యజించి, జగత్కారణాన్ని గూర్చి తెలుసుకోవడానికై ప్రాచీనులు (ఋషులు) ముందుగా 'నేతి - నేతి' అనే జ్ఞానమార్గాన్ని అవలంబించి ఉంటారని అనిపిస్తున్నది. అందుకే భక్తి, జ్ఞాన మార్గాలు రెండూ ఏకకాలంలో ప్రచారంలో ఉన్నా, భక్తిమార్గం పూర్తిగా పురోభి వృద్ధి చెందేందుకు ముందుగానే జ్ఞానమార్గం చక్కగా అభివృద్ధి చెంది ఉంటుం దని తెలుస్తున్నది.

10. 'నేతి, నేతి' - అనే జ్ఞానమార్గ లక్ష్యం - 'నేను ఎవరినీ?' అన్న దాన్ని తెలుసు కోవడమే!

'నేతి - నేతి' - సత్యజగత్కారణం ఇదికాదు, ఇది కాదు - అంటూ నిత్య సత్యంకాని తత్త్వాన్ని ప్రతిదాన్నీ వదలివేస్తూ, ముందుకు వెళుతూ, అనతి కాలం లోనే మనిషి అంతర్ముఖుడు అవగలిగాడనడానికి ఉపని షత్తులు సాక్ష్యం ఇస్తున్నాయి. బాహ్యవస్తువు లన్నింటికన్నా - అన్నింట్లో తన మనశ్శరీరాలే తనకు ప్రధానంగా ప్రపంచంతో సంబంధబాంధవ్యాలేర్పరుస్తున్నాయన్న విష యాన్ని మనిషి అర్థం చేసుకున్నాడు. అందుకే ఈ మనశ్శరీ రాలనే ఆధారం చేసుకుని జగత్కారణ అన్వేషణకు పూనుకుంటే, అది సత్వరమే తెలిసే అవకాశముందని కూడ అతడు గ్రహించాడు. పాత్రలోని ఒక్క మెతుకును పట్టి చూస్తే, పాత్రలోని అన్నమంతా ఉడికిందీ లేనిదీ ఎలా తెలుస్తుందో, అలాగే నిత్యజగత్కారణ బ్రహ్మను అంతర్గతంలో దర్శించుకొంటే, తర్వాత దాన్ని సర్వత్రా - సర్వవస్తువుల్లో - సర్వప్రాణుల్లో సాక్షాత్కరించుకోవచ్చు. అందుచేత జ్ఞానమార్గ సాధకుడికి 'నేను ఎవరినీ?' అన్న విషయాన్ని శోధించడమే ఏకైక లక్ష్యంగా ఉంటుంది.

జ్ఞాని, భక్తుడు - ఇద్దరు కూడ జగత్ విషయమై సామాన్యులకుండే భావ నను పరిత్యజించవలసి ఉంటుందని ఇదివరకే చెప్పుకున్నాం. అలాంటి భావనను

11. నిర్వికల్ప సమాధి

పరిత్యజించడం ద్వారా, మనిషి మనసు సర్వవృత్తి రహితమై, సమాధిని పొందేందుకు యోగ్యమౌతుంది. అలాంటి సమాధినే శాస్త్రాలు 'నిర్వికల్పసమాధి' అంటాయి. జ్ఞానమార్గ సాధ కుడు 'నే నెవరిని' అన్న శోధన చేస్తూ చివరికి ఎలా నిర్వికల్పసమాధిని పొందు

తాడో, ఆ విషయాన్ని మేము మరోచోట వివరించాము.[1] ప్రస్తుతం భక్తి మార్గగామి ఆ నిర్వికల్పసమాధిని ఎలా చేరుకుంటాడో వివరించే ప్రయత్నంచేస్తాం.

భక్తిమార్గాన్నే 'ఇతి - ఇతి' సాధన మార్గమంటామని చెప్పాం కదా! ఎందుకంటే, భక్తిమార్గావలంబికి ప్రపంచం అనిత్యమన్న అవగాహన ఉన్నా, సృష్టికర్త అయిన ఈశ్వరుడు ఒకడున్నాడన్న విషయాన్ని అతడు విశ్వసిస్తాడు. కాబట్టి ఆయన సృజించిన ఈ ప్రపంచం కూడ సత్యమని, దాని ఉనికి కూడ నిజమని నమ్ముతాడు. భక్తుడు ఈ ప్రపంచాన్ని, దానిలోని వస్తువులను, ప్రాణులను అన్నింటినీ భగవంతునికి సంబంధించినవిగా చూస్తూ, మొత్తం ప్రపంచాన్నే 'తనది'గా చేసుకునే ప్రయత్నం చేస్తాడు. సర్వాన్ని ఇలా భగవన్మయంగా దర్శించడంలో అతడి ప్రయత్నాలకు అడ్డువచ్చేవాటి నన్నింటినీ అతడు పరిత్యాగం చేస్తాడు. భగవంతుణ్ణి ఏదో ఒక రూపాన్ని తన ఇష్టదైవంగా ఎంచి, దానిపట్ల ప్రేమ పెంపొందించుకోవడం, దాని ధ్యానంలోనే తన్మయుడవడం, ఆ ఇష్టదేవత ప్రీత్యర్థమే సర్వకార్యాలనూ చేయడం - ఇదే భక్తుని తక్షణ లక్ష్యమౌతుంది.

భక్తిమార్గాన్ని అవలంబించి, భగవత్‌రూప ధ్యానంలో తన్మయత్వాన్ని పొంది, జగత్ ఉనికినే విస్మరించి నిర్వికల్పస్థితికి చేరడం ఎలాగో మన మిప్పుడు పరిశీలిద్దాం. ముక్తికి, సత్యసాక్షాత్కారానికి ప్రధాన సహాయ సాధనగా భక్తుడు తనకు ప్రియమైన భగవంతుని ఏదో ఒక రూపాన్ని ఎన్నుకొంటాడు. దాన్నే చింతన చేస్తూ, ధ్యానిస్తూ ఉంటాడు. మొదట్లో ధ్యానంలో అతడు తన ఇష్టదేవత సర్వాంగ స్వరూపాన్ని దర్శించడంలో అసమర్థుడై ఉంటాడు. మొదట్లో అతడికి అంగాంగ దర్శనమే సాధ్యమవుతుంది. ఇష్టదేవత చేతులనో - పాదాలనో - ముఖాన్నో - వక్షస్థలాన్నో ఇలా ఒక్కోమారు ఒక్కో అవయవాన్ని మాత్రం దర్శించగలుగుతాడు. సంపూర్ణస్వరూపాన్ని మొదట్లోనే దర్శించలేడు. ఈ అవయవ దర్శనం కూడ స్థిరంగా ఉండదతనికి. క్షణకాలం ఉండి, ఆ తర్వాత అదృశ్యమైపోతుంటుంది. కాని క్రమం తప్పక అభ్యాసం చేస్తున్నకొద్దీ, ధ్యానం గాఢమౌతున్నకొద్దీ ఆ ఇష్టదేవతామూర్తి సర్వాంగ స్వరూపం భక్తుని మనోఫలకం మీద అప్పుడప్పుడు దర్శనం అవుతూ ఉంటుంది. ధ్యానం మరింత గాఢతరం అయ్యేకొద్దీ, ఆ స్వరూపం మళ్లీ మనసు చపలమయ్యేదాకా స్థిరంగా నిలచివుంటుంది. తర్వాత ధ్యానగాఢతను బట్టి, ఆ ఇష్టదేవతాస్వరూపం స్థిరంగా నిలిచి ఉంటుంది. ఎక్కువకాలం స్థిరంగా ఉండడమే కాకుండా, ఆ మూర్తి నవ్వడం - మాట్లాడడం

12. నిర్వికల్ప సమాధి: 'ఇతి, ఇతి' సాధనమార్గం

---

1. చూడు. III.3

- చివరికి స్పర్శించడం - ఇలాంటి అనుభవాలన్నీ భక్తునికి కలుగుతాయి. అప్పు డా మూర్తి అన్ని విధాలా చైతన్యవంతమై కనిపిస్తుంది. భక్తుడు కళ్లు మూసుకున్నా - తెరచుకున్నా - ధ్యానం చేస్తున్నా - చేయకున్నా, అతడు ఏ అవస్థలో ఉన్నా, ఆ ఇష్టదేవతే, తన ఇచ్ఛానుసారంగా నానారూపాలను దాలుస్తుం దన్న దృఢ నమ్మకం భక్తుడికి ఏర్పడుతుంది. దానితో ఆ భక్తుడు తన ఇష్ట దేవతలో రకరకాల దివ్యస్వరూపాలను దర్శిస్తాడు. ''సాధకుడు భగవంతుని ఒక్క స్వరూపాన్నైనా అలా చైతన్యమయంగా దర్శించగలిగితే, అతడికి ఇతర రూప దర్శనాలు సహజంగానే కలుగుతాయి'' అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు.

పై విషయాల ద్వారా ఒక సంగతి మనకు స్పష్టమౌతున్నది. అలా సచేతన దైవస్వరూప దర్శన భాగ్యానికి నోచుకున్న భక్తుడికి జాగ్రదవస్థలోని ప్రపంచ వస్తువుల అస్తిత్వం ఎంత నిజమని తోస్తుందో, అతడు ధ్యానావస్థలో దర్శించే భావరాజ్యానికి చెందిన ఆ దేవతాదుల రూపాల అస్తిత్వం కూడ అంతే నిజమని అనిపిస్తుంది. అలా బాహ్య, భావ ప్రపంచాల సమాన అస్తిత్వబోధ ఎక్కువయ్యే కొద్దీ, అతడి మనసులో బాహ్యజగత్తు మనఃకల్పితమన్న ధారణ దృఢమౌతూ ఉంటుంది. గాఢధ్యానంలో భక్తుడి మనసులో భావరాజ్య అనుభవం ఎంత అధికంగా ఉంటుందంటే, అతని కా సమయంలో బయటి ప్రపంచపు ఎరుక పూర్తిగా తొలగిపోతుంది. భక్తుడి ఈ మానసిక అవస్థను శాస్త్రాలు 'సవికల్ప సమాధి'గా అభివర్ణిస్తాయి. ఆ సవికల్ప సమాధి కాలంలో భక్తుడి మానసికశక్తి ప్రభావంతో, అతడి మనసు నుండి బాహ్యప్రపంచం పూర్తిగా తొలగిపోయినా, భావరాజ్యం మాత్రం అట్లే భాసిస్తూ ఉంటుంది. ప్రపంచగత వ్యక్తులతో, వస్తు వులతో వ్యవహరిస్తున్నప్పుడు మనం ఎలా సుఖదుఃఖాలను అనుభవిస్తూ ఉంటామో, సవికల్ప సమాధ్యవస్థలో భక్తుడు తన ఇష్టదేవతతో వ్యవహరిస్తు న్నప్పుడు కూడ అలాంటి అనుభవాలనే పొందుతుంటాడు. ఆ అవస్థలో అతడి మనసు కేవలం తన ఇష్టదేవత నాశ్రయించే సంకల్ప - వికల్పాలతో నిండి ఉంటుంది. కేవలం ఒకే ఒక విషయాన్ని మాత్రమే ప్రధాన రూపంగా అవలంబనం చేసుకుని భక్తుడి మనసులో ఆ సమయంలో నానావృత్తులు ఉదయిస్తూ ఉంటాయి. శాస్త్రాలు ఈ అవస్థను 'సవికల్ప సమాధి', అంటే వికల్పాలతో కూడివున్న సమాధి అని పేర్కొంటాయి.

ఇలా భావరాజ్య విషయ గాఢచింతనా ఫలంగా భక్తుడి మనసు నుండి బాహ్యప్రపంచ స్ఫురణ పూర్తిగా తొలగిపోతుంది. భావరాజ్యంలో కూడ ఒకే విషయం ప్రాబల్యం వహించడంతో, ఇతర భావాలన్నీ అదృశ్యమైపోతాయి. ఇంత వరకూ ప్రగతి సాధించిన భక్తుడికి నిర్వికల్పసమాధి మరెంతో దూరంలో

ఉండదు. దీర్ఘకాల అభ్యాసఫలంగా వస్తున్న బాహ్యప్రపంచపు ఉనికి సత్యమన్న జ్ఞానం ఇప్పుడు పూర్తిగా తొలగిపోవడం మూలంగా, భక్తుడి మనసు ఎంతో శక్తి మంతం, మరెంతో దృఢసంకల్పయుక్తం అవుతుంది. తన మనసును ఇక సంపూర్ణంగా వికల్పరహితం చేయగలిగితే, తన ఆనందం మరింత అధికమౌతుం దన్న భావన అతడికి దృఢమవుతుంది. అప్పుడిక పరమోత్సాహంతో అతడి మనసు ఆ లక్ష్యం వైపు ముందుకు సాగుతుంది. అతడిక గురువు - భగవంతుల అనుగ్రహంతో త్వరలోనే భావరాజ్య చరమభూమిని అధిరోహించి, అద్వైత జ్ఞానంలో ప్రతిష్ఠితుడై పరమశాంతిని పొందుతాడు. మరోరకంగా చెప్పాలంటే, తన ఇష్టదేవత యందు అతడికున్న పరమ ప్రీతే, అతడి కా చరమస్థితిని ప్రసా దించగా, దానితో ప్రేరితుడై బృందావన గోపికల మాదిరి భక్తుడు తన ఇష్ట దైవంతో తాదాత్మ్యం చెందుతాడని చెప్పవచ్చు.

జ్ఞాని, భక్తుడు తమ చరమలక్ష్యాలను చేరడానికి శాస్త్రాలు పైరెండు మార్గా లను చెబుతున్నాయి. కాని అవతారపురుషు లందరి జీవితమంతటా దైవ, మానవ

13. దైవీ-మానవ భావాల సంయోగమే అవతారపురుషులు

భావాలు రెండూ కలిసివుండడం వల్ల, సాధనలు చేస్తున్న కాలంలో సైతం సిద్ధులకుండతగ్గ జ్ఞాన - భక్తులు వారిలో కనిపిస్తూ ఉంటాయి. ఎందుకంటే దేవ, మానవ భూముల్లో దేనిలోనైనా తమ ఇచ్ఛానుసారం సంచరించే సహజశక్తి వారిలో ఉంటుంది కనుక! లేదా అంతర్గతంగా ఉన్న దైవీభావం వారి స్వాభావిక స్థితిగా ఉండటంవల్ల, అది వర్తమానంలో ఉన్న మానవభావం అనే బయటి కప్పును చీల్చుకుని, బహిర్గతమై సహజంగానే విరాజిల్లుతూ ఉంటుంది. ఏది ఏమైనా అవతారపురుషు లందరి జీవితాల్లో వ్యక్తమయ్యే అలాంటి సంఘటనలు (వారి దైవీభావాన్ని వ్యక్తం చేసే సంఘటనలు) మానవబుద్ధికి దుర్భేద్య రహస్యాలుగానే మిగిలిపోతాయి. ఆ రహస్యాలు ఎప్పటికీ మనకు అర్థం అయ్యే అవకాశం లేదని మాకు తోస్తున్నది. అయినా శ్రద్ధాభక్తులతో వారి జీవితాలను అధ్యయనం చేయడం ద్వారా మానవుల కెంతో మేలు చేకూరుతుందన్న విషయంలో మాత్రం సందేహం లేదు. ప్రస్తుత సందర్భంలో ఆ అవతారపురుషుల చరిత్రలను మేం క్షుణ్ణంగా పరిశీలించి, వాటిలో ఆ రెండు భావాలు ఏకకాలంలో సరిసమానంగా ఉండగలవన్న విషయాన్ని పాఠకులకు వివరించడానికి ప్రయత్నిస్తాం. దేవమానవు డైన శ్రీరామకృష్ణుల పావనదర్శనం మా జీవితకాలంలో కలుగకపోయినట్లయితే, అవతారపురుషుల చరిత్రను ఆ రీతిలో అర్థంచేసుకోవడం మాకు కూడ సాధ్యమయ్యేది కాదని చెప్పడం అనవసరమేమో!

2. అవతార పురుషుల జీవితాల్లో సాధకభావం

1. శ్రీరామకృష్ణులలో దైవ, మానవ భావాల మేళనం

దివ్యమూర్తులైన శ్రీ గురుదేవుల సాంగత్య లబ్ధి పొంది, కృతార్థులమై మేము వారి జీవితాన్ని - శీలాన్ని ఏకాగ్రంగా పరికించేకొద్దీ, వారిలో దైవమానవ భావాలు రెండు కూడ అద్భుతరీతిలో మేళనం చెందివుండడం చూసి మేమెంతో ముగ్ధులమయ్యే వారం. పరస్పర విరుద్ధ భావాలు అలా ఏకకాలంలో ఒకే వ్యక్తిలో అంత మధురంగా, అంత సమరసంగా ఉండగలవన్న విషయాన్ని మేము వారిని చూడకపోయినట్లయితే అర్థం చేసుకోగలిగేవారం కాము. అలా మేము చూశాం. అందుకే ఆయన దేవ మానవుడన్న నమ్మకం; పరిపూర్ణ మానవ భావం, దైవీశక్తి మానవ దేహంలో, మానవభావ ఆవరణ ద్వారా అభివ్యక్తమైనప్పుడేమౌతుందో, అదే వారన్న నమ్మకం మాలో దృఢంగా నాటుకుపోయింది. ఆ విధంగా మేము చూశాం కాబట్టే, ఆ రెండు భావాల్లో దేన్ని కూడ వారు నటించలేదని, లోకానికి మేలు చేయడం కోసం వారు మానవభావాన్ని యథార్థంగానే స్వీకరించి దైవత్వానికి చేరే మార్గాన్ని మనందరికీ చూపించి వెళ్లారన్న విషయాన్ని మేము అవగతం చేసుకోగలిగాం. మేము వారిని చూశాం కాబట్టే, పూర్వయుగాల్లోని అవతార పురుషు లందరి జీవితాల్లో కూడ దైవ - మానవ భావాలు రెండూ కలిసి అభివ్యక్తమై ఉండేందుకు అవకాశముందని మేము గ్రహించగలిగాం.

శ్రద్ధాభక్తులతో ఏ ఒక్క అవతారపురుషుని జీవితాన్ని అధ్యయనం చేసి పరిశీలించినా, మన కీ సత్యం గోచరిస్తుంది. ఒక్కోమారు వారు మానవస్థాయిలో ఉంటూ, అన్ని వస్తువులు - వ్యక్తులతో కూడ సరిగ్గా మనలాగే వ్యవహరిస్తూ ఉండడం మనకు కనిపిస్తుంది. మరోసారి ఉన్నత భావస్థాయిలో చరిస్తూ, మనకు

తెలియని, మనకు పరిచయంలేని మహాశక్తియుత ఒక నూతన రాజ్యసమా

2. అవతారపురుషు లందరి విషయం కూడ అలాగే ఉంటుంది

చారాలను మన కోసం వారు దిగువకు తీసుకురావడం మనకు కనబడుతుంది. వారు కోరకున్నా సరే, ఏదో ఒక అజ్ఞాతశక్తి అన్నింటినీ చక్కగా అమర్చి వారితో అలా చేయిస్తూ ఉంటుంది. పసితనం నుండి కూడ వారి జీవితంలో అలాగే జరుగుతూ వస్తుంది. కాని చిన్నవయసులోనే వారి కా శక్తిని గూర్చిన ఎరుక అప్పుడప్పుడు కలుగుతున్నా, అది తమ స్వంతశక్తేనని, అది తమలోనే అంతర్గతంగా ఉందన్న విషయం వారికప్పుడు తెలియదు. అంతేకాదు, తమ ఇచ్ఛానుసారంగా ఆ శక్తిని ఉపయోగించుకుని ఉన్నత ఆధ్యాత్మిక స్థాయులను అధిరోహించి, ఆ దైవీభావ దృష్టితో లోకంలోని వస్తువులను - వ్యక్తులను చూస్తూ, తదనుగుణంగా వ్యవహరిస్తూ ఉండడం కూడ వారి కప్పుడు సాధ్యం కాదు. కాని వారు పెద్దవారవుతున్నకొద్దీ వారిలోని ఆ శక్తి కూడ ఇనుమడిస్తూ అభివ్యక్తమవుతూ వస్తుంది. అలా పదేపదే తమకు ప్రత్యక్షమౌతున్న ఆ శక్తితో పరిచితులై, దాన్ని పూర్తిగా తెలుసుకోవాలన్న ఆకాంక్ష వారిలో ఉదయిస్తుంది. చివరికి ఆ కోరికే అవతార పురుషులను అలౌకికానురాగ సంపన్నులుగా రూపొందించి, సాధనలు అనుష్ఠించడానికి వారిని ప్రోత్సహిస్తుంది.

అవతారపురుషుల ఆ ఆకాంక్షలో స్వార్థపరత్వం లేశమాత్రమైనా ఉండదు. ఈ లోకంలో గానీ, పరలోకంలో గానీ ఎలాంటి భోగసుఖాలను

3. అవతారపురుషులకు స్వార్థ సుఖ భావన లుండవు

పొందాలన్న కోరికా వారిలో కలగడం అంటూ ఉండదు. 'ఇతరులకేమైనా కానీ, నేను మాత్రం ముక్తుడనై పరమానందాన్ని అనుభవిస్తాను' అన్న భావం కూడ వారి కోరికలో కనిపించదు. మరి వారి కోరికకు ప్రధాన ప్రేరేపణ ఏమిటి? ఏ అజ్ఞాత దివ్యశక్తి నిర్దేశంతో జన్మాదిగా తాము అసాధారణ దివ్యానుభవాలను అనుభవిస్తున్నారో, ఏ దివ్యశక్తి ద్వారా బాహ్యప్రపంచగత వస్తువుల, వ్యక్తుల అస్తిత్వం ఎంత నిజమో - భావరాజ్యగత భావ విషయాల అస్తిత్వం కూడ అంతే నిజమన్న విషయం తమ కప్పుడప్పుడూ అనుభూతమవుతూ ఉంటుందో, అలాంటి దివ్యశక్తి ఈ జగత్తులో ఉందా? లేక అది కేవలం తన ఊహాజనిత మేనా? - అన్నదాని నిజానిజాలను తెలుసుకోవాలనుకోవడమే వారి కోరికకు ప్రేరేపణ. వారు సాధారణ వ్యక్తుల జ్ఞానాన్ని, అనుభవాలను తమ జ్ఞానానుభవాలతో పోల్చి చూసుకొన్నప్పుడు వారికొక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. 'ప్రపంచగత వస్తువులను, వ్యక్తులను తామెలా చూస్తుంటారో, ఇతరులు వాటిని చూడడం లేదని, సాధారణ వ్యక్తులకు ఉన్నతస్థాయుల నధిరోహించి

ప్రపంచాన్ని పరికించే శక్తి దాదాపు శూన్యమన్న విషయం వారికి విస్పష్టమవుతుంది.

అంతేకాదు, పై పోలికలో వారికి మరో విషయం కూడ సుస్పష్టమౌతుంది. సాధారణ, దివ్యస్థాయుల నుండి ఈ ప్రపంచాన్ని రెండు రకాలుగా చూడడం ద్వారా మూన్నాళ్ల ముచ్చటైన ఈ క్షణిక జీవితంలో, క్షణిక సుఖాలనిచ్చే రూపరసాది విషయభోగాలు సామాన్యులను ప్రలోభింపజేసినట్లు తమను ప్రలోభపరచలేని విషయం వారికి అర్థమవుతుంది. అలాగే, నిత్యపరిమాణశీలమైన ఈ సంసారంలో కష్టాలు ఎదురైనప్పుడు నిరాశ - అశాంతులు వారి బుద్ధిని ఎప్పుడూ కూడ కప్పివేయలేవు. కాబట్టి పైన పేర్కొన్న దివ్యత్వం పూర్తిగా తమ సొంతం చేసుకుని, తమ ఇచ్ఛానుసారంగా ఉన్నతోన్నతతమ భావస్థాయులను ఎలా అధిరోహించాలో, కోరినంతకాలం అక్కడ ఉండగలగడం ఎలాగో అన్న చింతనలో అవతారపురుషులుంటారు. అంతేకాక సామాన్యులందరికీ ఈ విధానాన్ని బోధించి, వారంతా శాంతిని ఎలా పొందగలరో అన్న విషయం గూర్చి కూడ కరుణార్ద్రచిత్తులైన అవతారపురుషులు చింతన చేస్తూ ఉంటారు. అందుకే సాధన - కారుణ్యం ఈ రెండూ వారి జీవితాల్లో ప్రక్క-ప్రక్కనే నిరంతరం ప్రవహించడం కనిపిస్తుంది. సామాన్యుల అవస్థతో తమ అవస్థను వారు పోల్చిచూసుకున్నప్పుడు, వారిలోని కారుణ్యం నూరింతలౌతుంది. అంతమాత్రాన వారి కారుణ్యం, ఆ పోలిక నుండి పుట్టిందని చెప్పరాదు. ఆ కారుణ్యం వారిలో ఆది నుండి ఉంది. దానితోపాటే వారు ఈ లోకంలోకి వస్తారు. దీనికి దృష్టాంతంగా శ్రీరామకృష్ణులు చెప్పిన ఈ కథను జ్ఞాపకం చేసుకుందాం.

4. అవతార పురుషుల కారుణ్యం, సాధనలు ఇతరుల మేలుకే!

ఒకప్పుడు ముగ్గురు స్నేహితులు సరదాగా షికారుకు బయలుదేరారు. కొంతదూరం వెళ్లిన తర్వాత వారికి మధుర సంగీతం వినిపించింది. వారిలో కుతూహలం పెరిగి ఆ సంగీతం వినవస్తున్న ప్రాంతానికి వచ్చారు. అక్కడ వారికి బాగా ఎత్తయిన ప్రహరీగోడ కనిపించింది. ఆ గోడకు ఆవలివైపు నుండి వారి కా మధుర సంగీతం వినిపిస్తోంది. వారిలో మరింత కుతూహలం కలిగింది. ఆవలి వైపు అసలేం జరుగుతున్నదో చూడ్డామన్న కోరిక పుట్టింది. వెంటనే వారు గోడ చుట్టూ తిరిగివచ్చారు. వారికి గోడలో ఎక్కడా ప్రవేశ ద్వారం కనిపించలేదు. లోపలికి వెళ్లాలన్న కాంక్ష వారిలో మరింత తీవ్రమైంది. వారు ప్రయత్నించి, ఒక నిచ్చెనను సంపాదించి, ఆ గోడకు వేశారు. ముందుగా ఒకడు నిచ్చెన ఎక్కి, అటువైపు జరుగుతున్న ఆనందోత్సవాన్ని తిలకించి ఆనందంతో పరవశించి, ఆవలి వైపుకు దూకేశాడు. అది

5. ఆనంద వన దృష్టాంతం

చూసి మిగతా ఇద్దరికీ మరింత ఆతురత కల్గింది. అటువైపు నిజంగా ఏదో అద్భుతం జరుగుతూందనుకున్నారు. ఈసారి రెండవవాడు పైకి ఎక్కి, ఆవలి వైపు దృశ్యాన్ని చూశాడు. చూసీ చూడగానే ఆనందంతో పరవశుడై, అతడూ ఆనందంతో పరవశుడై ఆవలి వైపుకు దూకేశాడు. మూడవ వ్యక్తిలో మరింత కుతూహలం పెరిగింది. అతడు కూడ పైకి ఎక్కి ఆవలివైపు 'ఆనందాన్ని' పరికించాడు. చూడగానే అతడి మనసు కూడ దూకడానికి ఉరకలు వేసింది. కాని అతడు ఒక క్షణం ఆగి ఆలోచించాడు. 'నేను కూడ దూకేస్తే, ఇక్కడ ఇంత మహదానందం ఉందన్న విషయం ఇతరుల కెలా తెలుస్తుంది? ఇతరులు కూడ ఈ ఆనందాన్ని అనుభవించాల్సిందే. కాబట్టి నేను దిగివెళ్లి అందరికీ ఈ సమాచారం తెలుపుతాను. అందరినీ ఇక్కడికి తోడ్కొని వస్తాను. అందరితో పాటు ఈ ఆనందాన్ని నే ననుభవిస్తాను' అనుకున్నాడు. వెంటనే క్రిందికి దిగి అతడు అందరికీ ఆ ఆనందవనం విషయం చెప్పాడు. అందరినీ అక్కడికి తోడ్కొని వెళ్లాడు. అందరితోపాటే తానూ ఆనందాన్ని అనుభవించాడు.

అందరితోపాటు కలిసి ఆనందాన్ని అనుభవిద్దామన్న కోరిక, మరి ఈ మూడవ వ్యక్తికి ఎందుకు కలిగిందో మనం చెప్పలేం. అలాగే లోకానికి మేలు చేయాలన్న ఆకాంక్ష అవతారపురుషుల్లో బాల్యం నుండే ఎందుకు ఉంటుందో ఆ విషయంకూడ మనం చెప్పలేం. వారిలో అది సహజంగానే ఉంటుంది. అంతే.

6. ఆత్మసంయమం

పై వివరణను చూసి, 'అయితే మనలాగే అదుపు తప్పిన ఇంద్రియాలతో పోరాడే అవసరం అవతార పురుషులకు ఉండదేమో! బుద్ధిమంతులైన బాలుర మాదిరిగా అవి నిరంతరం వారి వశంలోనే ఉంటాయేమో! అందుకే రూపరసాది విషయభోగాల నుండి వారు తమ చిత్తాలను అలవోకగా మరల్చి పరమాత్మలో నిమగ్నం చేయగలుగుతారు' అని చాలామంది అనుకోవచ్చు. కాని ఇది ఎంతమాత్రమూ నిజం కాదు. వారు కూడ సామాన్య మానవులలాగే సాధనలు చేయవలసి ఉంటుంది. వారు కూడ మనలాగే ఇంద్రియాలతో సంఘర్షణ పడవలసి ఉంటుంది. అలా పోరాడుతూనే వారు తమ లక్ష్యం వైపు సాగవలసి ఉంటుంది.

7. మనసులోని అపరిమిత కోరికలు

ఈ మానవ మానసం అగాధమైంది. దీని స్వరూప స్వభావాలను తెలుసుకోవాలని ప్రయత్నించే వ్యక్తికి దీని అంతు ఒక పట్టాన దొరకదు. స్థూలం - సూక్ష్మం - సూక్ష్మతరం - సూక్ష్మతమం - సూక్ష్మాతి సూక్ష్మతమం - ఇలా అనేక స్థాయుల్లో మనసు వ్యాప్తమై ఉంటుంది. అన్ని స్థాయుల్లోనూ వాసనలు అపరిమితంగా ఉంటాయి. ఎంతో కష్టపడి మనిషి, మనసు స్థాయినొకదాన్ని దాటితే, వెంటనే మరొక స్థాయి ఎదు

రొతుంది. దానిని ఎలాగో జయించినా, మరొకటి అడ్డు వస్తుంది. స్థూలాన్ని దాటితే, సూక్ష్మం ఎదురౌతుంది. దాన్ని కూడ గెలిచివెళితే సూక్ష్మతరం అడ్డుగా నిలుస్తుంది. స్త్రీసంభోగేచ్ఛను వదలిపెడితే, ధనపిశాచి నిన్ను పట్టుకుంటుంది.

అత్యంత ప్రమాదకరమైన ఈ మనస్సు స్వభావాన్ని గూర్చి గురుదేవులు పదేపదే హెచ్చరిస్తూండేవారు. వాసనలనన్నింటినీ త్యజించమని ఆయన మాకు

8. "వాసనలనన్నింటినీ త్యజించాలి" - గురుదేవుల బోధ

చెబుతూండేవారు. తమ జీవితంలో జరిగిన సంఘటనలను దృష్టాంతంగా ఉదాహరిస్తూ, తా నప్పుడు ఎలా ప్రవర్తించేవారో, ఎలా ఆలోచించేవారో, వ్యవహరిస్తుండేవారో తెలిపి తమ బోధను మా హృదయాల్లో నాటుకునేలా చేసేవారు. పురుషులకే కాదు, భక్తురాండ్రకు కూడ సర్వవాసనాత్యాగం చేయమని చెప్పేవారు. స్త్రీలలో సైతం భగవత్ ప్రీతిని ఉద్దీపన చేసేవారు.

ఉదాహరణగా ఒకనాటి సంఘటనను వివరిస్తాం.

శ్రీరామకృష్ణులను దర్శించిన స్త్రీ పురుషులంతా, ఆయన అమాయకత - సరళత - లేశమైనా కామగంధంలేని వారి అపూర్వప్రేమ మొదలైన సుగుణాలకు

9. వాసనాత్యాగం చేయమని భక్తురాండ్రకు ఉపదేశం

ఆకర్షితులయ్యేవారు. వారి హృదయాల్లో ఆయన ఉండిపోయేవారు. అందుచేత అవకాశం లభించినప్పుడల్లా, ఆయన దర్శనం చేసుకోవాలని ఉబలాటపడుతుండేవారు. అంతేనా, తాము మాత్రమే దర్శనం చేసుకుని తృప్తి చెందేవారు కారు, తమకు తెలిసిన వారినంతా కూడ గురుదేవుల వద్దకు తీసుకుని వచ్చేవారు. వారు కూడ శ్రీరామకృష్ణుల దర్శనం చేసుకుని, తరించి ఆనందం పొందాలని వారి సదాశయం.

ఒకమారు మాకు తెలిసిన ఒక భక్తురాలు మధ్యాహ్నం పూట గురుదేవుల దర్శనార్థం వచ్చింది. ఆమెతోపాటు ఆమె సవతి చెల్లెలు, ఆ చెల్లెలి మరదలు కూడ ఉన్నారు. వారు గురుదేవులకు ప్రణామం చేసి కూర్చున్నారు. గురుదేవులు వారిని కుశలం అడిగారు. తరువాత 'భగవంతునిపై ప్రీతిని పెంపొందించుకోవడమే మానవజీవిత ఏకైక లక్ష్యం కావా' అంటూ ఉపదేశింపసాగారు.

"భగవంతుణ్ణే శరణు పొందడం అంత సులభమా? మహామాయ ప్రభావం మనలను అలా చేయనిస్తుందా? మూడులోకాల్లో కూడ 'నా' అనేవారు ఎవరూలేకున్న వారిని కూడ ఆ మహామాయ మోహంలో పడవేస్తుంటుంది. వారు ఒక పిల్లిని పెంచుకునేలా చేస్తుంది. అదే వారికిక సంసారమవుతుంది. వా రా పిల్లి పోషణలోనే తిరుగుతుంటారు. 'అయ్యో! మా పిల్లికి చేపలు,

పాలు లేకపోతే ఇంకేమైనా ఉన్నాయా?' అంటూ వారు వాపోతుంటారు. మరొక రకం వారుంటారు. వారు సుసంపన్న కుటుంబంలోనే జన్మిస్తారు. ఆ స్త్రీలకు భర్త, పిల్లలు అందరూ చనిపోయివుంటారు. వారికి మరే బాదరాబందీ ఉండదు. అయినా ఆ వితంతువులు మాత్రం తమకు చావనేదే లేనట్లుగా ప్రవర్తిస్తారు. వారి ఇల్లంతా పాడుబడిపోయి ఉంటుంది. ఈ ప్రక్కన గోడలన్నీ కూలిపోయే ఉంటాయి, ఆ వైపు కూలడానికి సిద్ధంగా ఉంటాయి. ఇంటి కప్పు మీద మర్రి మొక్కలు మొలుస్తుంటాయి. వాటి ప్రక్కే కొన్ని తోటకూర కాడలు కూడా పెరుగుతుంటాయి. ఆ వితంతువులు ఆ మొక్కలతోనే కూర వండుకొని తింటూ సంసారంలో మునిగిపోతుంటారు. వారి స్థితి ఇంత దీనంగా ఉన్నా, ప్రపంచాన్ని మాత్రం వారు వదలిపెట్టరు. ఎందుకని? వారు భగవంతుణ్ణి ప్రార్థించరెందుకని? భగవంతుణ్ణే వా రెందుకు శరణు పొందరూ? ఇంకా వారికి సమయం రాలేదంటారా? ఆ తలమాసిన వారు అలా చేయరెందుకనీ?''

గురుదేవులు తమ ఉపదేశాన్ని కొనసాగించారు:

''మరో స్త్రీ ఉంటుంది. ఆమెకు వివాహం కాగానే వైధవ్యం ప్రాప్తిస్తుంది. బాల వితంతువు. ఆమెకు పిల్లాజెల్లా ఎవరూ ఉండరు. అయినా ఆమె దేవుణ్ణి మాత్రం ప్రార్థించదు, ఎందుకు ప్రార్థించదు? ప్రార్థించదు అంతే! పైగా అన్న ఇంట్లో పెత్తనం చలాయిస్తుంటుంది. తలకొప్పు గట్టిగా ముడేసుకుని, చీర కొంగున తాళంచెవుల గుత్తి కట్టుకుని రెండు చేతులు ఊపుకుంటూ అందరి మీద పెత్తనం చలాయిస్తుంటుంది. ఆ మహంకాళిని చూస్తే, ఊరంతా గజగజ లాడిపోతుంది. ఎప్పుడు ఎవరి మీదికి వచ్చి పడుతుందోనని భయపడిపోతుంటారు. ఆ విధవరాలు ఏమంటుందో తెలుసా? 'అమ్మో, నేను లేకపోతే ఇంకేమైనా ఉందా? మా అన్నకు భోజనం ఎవరు పెడతారు?' అంటుంది. పిచ్చిది కాకపోతే తన గతి ఏమవుతుందో ఆ విషయమై ఆలోచించదేం? ఇలా ఊడిగం చేస్తే ఆమె కేమొస్తుంది?''

ఇక్కడ ఒక విచిత్రం జరిగింది. శ్రీరామకృష్ణులను దర్శించడానికి వచ్చిన ఆ ముగ్గురు స్త్రీలలో మూడవ స్త్రీ మాత్రం అక్కడికి మొదటిసారిగా వచ్చింది. గురుదేవులు చెప్పిన సంఘటనలో 'బాలవితంతువు' కోవకు ఈమె చెందుతుంది. ఈమె కూడ అలాగే అన్న ఇంట్లో పెత్తనం చేస్తున్న బాలవితంతువే. ఈ విషయం గురుదేవులకు ముందుగా ఎవరూ చెప్పలేదు. మాటల సందర్భంలో గురుదేవులే ఆ విషయం ఎత్తుకున్నారు. తద్వారా మనసు లోపలిపొరల్లో వాసనలు ఎంత గాఢంగా నిక్షిప్తమై ఉంటాయో, వాటికెంత ప్రాబల్యం ఉంటుందో వివరించ

సాగారు. వారి మాటలు ఆ వితంతు స్త్రీ హృదయంలోకి తప్పకుండా చొచ్చుకు పోయి ఉంటాయి. అందులో సందేహం లేదు.

ఆయన మాటలు విన్న తర్వాత మాకు తెలిసిన భక్తురాలితో, ఆమె సవతి చెల్లెలు, ''అక్కా, ఎంత విడ్డూరం చూడు! గురుదేవుల నోట ఈ రోజే ఈ మాటలు రావాలా? ఈ మాటలు విని మా మరదలు ఎంత అపార్థం చేసు కుంటుందో నన్ను'' అంది మెల్లగా. అది విని ఆ భక్తురాలు, ''మనమేం చేయ గలం చెప్పు. అది వారి ఇష్టం. వారి కేమైనా మనం ముందే చెప్పామా ఏమిటి?'' అని శాంతపరిచింది.

మానవస్వభావాన్ని అధ్యయనం చేయడం ద్వారా ఒక విషయం స్పష్ట మవుతుంది. ఒక వ్యక్తి మనసు ఉన్నతోన్నత స్థాయిలకు అధిరోహిస్తున్నకొద్దీ, సూక్ష్మవాసనలు అతణ్ణి మరింత ఉద్ధృతంగా బాధిస్తూ ఉంటాయి. దొంగతనం, అసత్యభాషణం, వ్యభిచరించడం ఇలాంటి వాటిని పదేపదే చేసే వ్యక్తి, వీటిని మరొకమారు చేయవలసివస్తే కూడ ఏమంతగా బాధపడడు. కాని నీతి పరుడు, నిజాయతీగలవాడు, సుగుణశీలి, సత్ప్రవర్తన గలవాడు అయిన వ్యక్తి మనసులో కనీసం అలాంటి ఆలోచన వచ్చినా కూడ భరించలేడు. తానేదో మహా పాపం చేస్తున్నట్లు విపరీతంగా బాధపడతాడు. అవతార పురుషులు తమ జీవితాల్లో ప్రాపంచిక విషయ భోగాలను బాహ్యంగా త్యాగం చేయడం మనం చూస్తుంటాం. కాని వారు కూడ మనతో సమానంగానే, మనోగత సూక్ష్మ వాసనలతో ఘోరంగా పోరాడుతుంటారని, తమ మనసులో వాటి రూపాలను చూసి మనకన్నా కోటిరెట్లు ఎక్కువగా బాధపడుతుంటారని, వారే స్వయంగా స్పష్టంగా ఒప్పుకున్నారు. కాబట్టి, రూపరసాది విషయాల నుండి తమ ఇంద్రి యాలను మరలించడానికి వారు చేసే పోరాటం కేవలం ఒక నటన అని మనమెలా అనగలం?

10. అవతార పురుషులు సైతం సూక్ష్మ వాసనలతో పోరాడ వలసిందే

శాస్త్రీయంగా ఆలోచించే పాఠకులు ఇలా అడగవచ్చు: ''మీరు చెప్పే దాన్ని ఎలా అంగీకరిస్తాం? అద్వైతాచార్యుడు శ్రీ శంకరుడు తన గీతా భాష్యభూమికలో శ్రీకృష్ణపరమాత్మ జన్మ - శరీర ధారణల గూర్చి చెప్పిన విషయం గమనించండి. 'నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావుడు, జన్మరహితుడు, అవ్య యుడు, సర్వజీవి నియామకుడైన ఈశ్వరుడు లోకాలను అనుగ్రహించడం కోసం తన మాయాశక్తి సహాయంతో జన్మించిన వానిలా, దేహధారిలా కనిపిస్తాడు' - అని తెలిపారు.

11. అవతార పురుషులలో మానవ భావాలుంటాయి - అన్న దాని గురించిన ఆక్షేపణకు ఖండన

[1]ఆచార్యుడే స్వయంగా ఇలా చెబుతుంటే, మరి మీ మాటల నెలా అర్థం చేసుకోవాలి?''

ఆచార్యులు అలా చెప్పారు, నిజమే. అయినా మా మాటలు కూడా యుక్తి యుక్తాలే. శంకరాచార్యులు చెప్పినదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే, మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఈశ్వరుడు మానవ దేహధారణ చేయడం, నామ రూపాల్లో పరిమితుడై ఉండడం, ఇదంతా ఒక నటన అని ఆచార్యుడు చెబుతున్నట్లే, మీరు, నేను, ఈ ప్రపంచమంతా కూడ, ప్రపంచంలోని ప్రతివస్తువు, వ్యక్తి నామరూపాల గురించి కూడ 'ఇవేవీ నిజంకాదు, మిథ్య - నటన' అని కూడ ఆయనే చెబుతాడు. ఈ జగత్తంతా బ్రహ్మవస్తువుతో కల్పితమైన ఒక అధ్యాస అని, వాస్తవానికి దానికో అస్తిత్వం లేదని ఆయన చెబుతాడు. కాబట్టి ఆయన చెప్పిన ఈ రెండు వాక్యాలను కూడ మనం ఒకేరీతిగా గమనించినప్పుడే, మన సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుంది. కాబట్టి అవతార పురుషులు దేహ ధారణ, సుఖదుఃఖాది అనుభవాలు 'నటన' అని, మనందరి దేహధారణ, సుఖ దుఃఖాదులు వాస్తవమని ఆచార్యుని అభిప్రాయం కాదు. మనం చూసే విష యాలు, అనుభవాలు సత్యమని చెబితే, అవతార పురుషులు చూసేవికూడ సత్య మనే స్వీకరించాలి. కాబట్టి పైన మేము చెప్పిన విషయం యుక్తివిరుద్ధం కాదు.

12. పై విషయాన్నే మరో దృక్కోణం నుండి చూద్దాం

పై విషయాన్ని మరో దృక్కోణం నుండి పరికించినప్పుడది మరింత విశద మౌతుంది. ప్రపంచాన్ని గురించి మనకు రెండు రకాలైన భావాలు కలుగుతుంటాయని శాస్త్రాలు చెబుతాయి: ఒకటి అద్వైత స్థాయి నుండి చూసినప్పుడు, రెండు సాధారణ లేదా ద్వైతస్థాయి నుండి చూసినప్పుడు.

అద్వైతస్థాయి నుండి చూసినప్పుడు ప్రపంచం ఎంతవరకు సత్యమని పరి శీలనచేస్తే, అదసలు లేదని, ఏ కాలంలోనూ ఉండలేదని, 'ఏకమేవాద్వితీయం' - ఆ ఒక్క బ్రహ్మం తప్ప మరేమీ లేదని తెలుస్తుంది. ద్వైతస్థాయిలో ఉంటు న్నప్పుడు మాత్రం ఈ జగత్తును చూస్తే, అనంత నామరూపాలతో కూడిన ఈ సమష్టి అంతా సత్యమని నిత్యవర్తమానమని అనిపిస్తుంది. మనలాంటి సామా న్యుల కిది ప్రతిక్షణం అనుభవమౌతున్న విషయమే. శరీరాలున్నప్పుడు కూడ వాటితో ఎలాంటి సంబంధంలేని 'విదేహావస్థ' కలిగిన అవతారపురుషులు,

---

1. స చ భగవాన్... అజో౽వ్యయో భూతానామీశ్వరో నిత్య శుద్ధబుద్ధముక్తస్వభావో౽పి సన్, స్వమాయయా దేహవానివ, జాత ఇవ చ లోకానుగ్రహం కుర్వన్ లక్ష్యతే। (భ.గీ. శం.భా. ఉపోద్ఘాతం)

జీవన్ముక్తులు అధికకాలం అద్వైతస్థాయిలోనే జీవిస్తూ ఉంటారు. కాబట్టి ద్వైత స్థాయిలో వసిస్తున్న సమయాల్లో కూడ వారి కీ జగత్తు ఒక స్వప్నంలాగానే కనిపిస్తూ ఉంటుంది. జాగ్రదావస్థతో పోల్చిచూసినప్పుడు స్వప్నం మిథ్యగా తోచినా, స్వప్నం చూస్తున్నప్పుడది పూర్తిగా మిథ్య అని చెప్పజాలం. అలాగే అవతార పురుషులు, జీవన్ముక్తులు బ్రహ్మలీనులై ఉండేటప్పుడు వారి కీ జగత్తు మిథ్యగా తోస్తుంది. కాని వారు సమాధి నుండి కిందికి దిగి వచ్చినప్పుడు ఈ ప్రపంచం వారికి పూర్తి మిథ్యగా తోచదు.

13. ఉన్నత భావ స్థాయుల నుండి చూస్తే, ఈ జగత్తు ఆయా స్థాయులకు అనుగుణంగా గోచరిస్తుంది

పైన చెప్పినట్లు రెండు స్థాయుల నుండి ఈ జగత్తు రెండు రకాలుగా గోచరిస్తున్నట్లే, ప్రపంచంలోని ఏ వ్యక్తి అయినా ఇలాగే రెండు రకాలుగా కనిపించే అవకాశముంది. ద్వైతదృష్టితో చూస్తే ఆ వ్యక్తి 'బద్ధ జీవుడి'గా కనిపిస్తాడు. అద్వైత దృష్టి నుండి చూస్తే, అతడే నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వరూపబ్రహ్మగా గోచరిస్తాడు. భావ రాజ్యంలో పూర్ణ అద్వైత భూమి సర్వోన్నతిభూమి. సాధనల కన్నింటికీ లక్ష్యమైన ఆ అద్వైతశిఖరాన్ని అధిరోహించడానికి ముందు మానవ మానసం ఉన్నత, ఉన్నతతరాది వివిధ స్థాయులను అధిరోహించవలసివుంటుంది. ఆ వివిధ స్థాయులను అధిరోహిస్తున్న కొద్దీ, ఈ ప్రపంచం, దానిలోని వ్యక్తులు సాధకులకు ఆయా స్థాయుల కనుగుణంగా గోచరిస్తారు. ఒక్కొక్క స్థాయిని అతిక్రమించేకొద్దీ, జగత్తును గూర్చిన సాధకుని పూర్వాభిప్రాయాలు మారుతూ ఉంటాయి. అప్పుడతడికి ఈ జగత్తు (నామ రూపరహిత) భావనలుగానే తోచవచ్చు. లేదా వ్యక్తులు శరీరం నుండి వేరైనవారుగా, అపూర్వ శక్తియుతులుగా లేదా మనోమయులుగా లేదా జ్యోతిర్మయులుగా - ఇలా విభిన్న రీతులుగా గోచరిస్తూ ఉంటారు.

14. అవతార పురుషుల శక్తి ద్వారా మనిషి ఉన్నత భావస్థాయులకు అధిరోహించి, వారిని మానవస్వభావ రహితులుగా దర్శిస్తాడు

అవతార పురుషులను శ్రద్ధాభక్తులతో సమీపించే సాధకుడు కూడా తనకు తెలియకుండానే, ఉన్నత - ఉన్నతతర ఆధ్యాత్మిక భావస్థాయులను అధిరోహించగలుగుతాడు. అవతార పురుషుల మహాశక్తి ప్రభావంవల్లే అతడలా అధిరోహిస్తాడు. అలా ఆ ఉన్నతస్థాయుల నుండి ఆ సాధకుడు అవతారపురుషులను, వారి ప్రభావాన్ని దర్శిస్తాడు. వారు మహాశక్తిసంపన్నులని, దైవీభావం మాత్రమే వారి వాస్తవిక స్వరూపమని గుర్తిస్తాడు. ఇతర సమయాల్లో వారిలో కనిపించే మానవస్వభావాన్ని చూసి, కృపతో వారలా నటిస్తున్నారని ఆ సాధకుడు తప్పుగా అర్థం చేసుకుంటాడు. అయితే అతడి భక్తి, సాధన పెరిగేకొద్దీ భగవద్భక్తుల గూర్చి, సమస్త ప్రపంచం గూర్చి అద్వైతభావం దృఢమవుతుంది;

అంటే అద్వైతభావంలో నానాత్వం కనిపిస్తున్నా, చివరికి నిలిచేది అద్వయ బ్రహ్మం మాత్రమేనని అతడికి అర్థమవుతుంది.

ప్రపంచంలో కనిపించే వస్తువుల - వ్యక్తుల అస్తిత్వం 'నిజం' అనే అనుభవం ఎలా కలుగుతుందో, అలాగే మనసులోని ఉన్నత భావభూముల నధిరోహించి, అక్కడ కానవచ్చే విషయాల అస్తిత్వం కూడ అంతే నిజమన్న అనుభవం అవతార పురుషులకు వారి జీవితాల్లో చిన్నప్పటి నుండే అప్పుడప్పుడు కలుగుతూ ఉంటుందన్న విషయాన్ని మొదట్లోనే చెప్పుకున్నాం. తర్వాత నిత్యం ఎన్నెన్నో దివ్యదర్శనాలు అనుభవం అవుతుండడం వలన ఈ బాహ్యప్రపంచ అస్తిత్వం కన్నా, ఆ భావ ప్రపంచ అస్తిత్వమే ఎక్కువ నిజం అన్న నమ్మకం వారిలో క్రమంగా అధికమౌతూ ఉంటుంది. చివరికి, ఏ అద్వితీయ బ్రహ్మం నుండి అనంత నామరూపయుక్త ఈ విచిత్రప్రపంచం బహిర్గతమైందో వారా బ్రహ్మసాక్షాత్కారాన్ని పొంది ఆప్త కాములవుతారు. జీవన్ముక్తుల విషయంలో కూడ ఇలాగే జరుగుతూ ఉంటుంది. కాని చిన్న తేడా ఉంటుంది. అవతార పురుషులు అత్యంత స్వల్పకాలంలో పొందితే, సామాన్యులు మాత్రం జీవితాంతం సాధనచేసి పొందవలసి ఉంటుంది. ఒకవేళ వారు ఈ సాక్షాత్కారాన్ని సత్వరమే పొందినా, ఇతరుల్ని తురీయావస్థకు చేర్చేశక్తి, అవతారపురుషుల శక్తికన్నా చాలా తక్కువగా వారికి ఉంటుంది. ఈ విషయంలో శ్రీరామకృష్ణుల సూక్తి: ''జీవుడికి, అవతారపురుషునికి మధ్యన ఉండే తేడా కేవలం శక్తి తారతమ్యం మాత్రమే.''

15. అవతార పురుషుల మనో పరిణామ క్రమం

ఇలా అద్వైతస్థాయిలో కొంతకాలం ఉండి, జగత్కారణ పరబ్రహ్మ సాక్షాత్కారం ద్వారా బ్రహ్మానందాన్ని అనుభవించి, అవతార పురుషులు మళ్లీ నిమ్న భూములకు దిగివస్తారు. సామాన్యులకప్పుడు వారు మామూలు వ్యక్తులుగానే కనిపించినా, నిజానికి వారిప్పుడు దేవమానవులే. వారికప్పుడు ఈ జగత్తు, దాని కారణాల (బ్రహ్మం) ప్రత్యక్షజ్ఞానం ఉంటుంది. ఆ అవస్థలో వారికి బాహ్యాభ్యంతరయుక్త ఈ జగత్ అస్తిత్వం ఒక నీడలా అనుభూతమవుతుంది. ఈ అనుభవం సర్వ కాలాల్లో సర్వత్రా వారికి కలుగుతూ ఉంటుంది. అలాంటి స్థితిలో అసాధారణ ఉన్నత ఆధ్యాత్మిక శక్తులు లోకహితం కోసం వారిలో సర్వదా అభివ్యక్తమవుతుంటాయి. ప్రపంచగత వస్తువులన్నింటి ఆది - మధ్య - అంతాల గూర్చిన పూర్ణజ్ఞానం, సర్వజ్ఞత్వం వారికి లభిస్తాయి. స్థూలదృష్టి మాత్రమే ఉండే మన లాంటి దుర్బల మానవులం అప్పుడు వారి అలౌకిక చరిత్రను, కర్మలను ప్రత్యక్షంగా చూసి, వారిని శరణువేడి, ఆ కరుణామయుల కృపతో మళ్లీ ఈ

16. దేవమానవుడైన అవతార పురుషుడు సర్వజ్ఞుడు

విషయాన్ని అర్థం చేసుకుంటాం. మనసు బహిర్ముఖంగా ఉన్నంతవరకూ, బాహ్యజగత్తులో కనిపించే వస్తువుల, వ్యక్తుల సాంగత్యాన్ని సంపూర్ణంగా త్యజించి, మనసును అంతర్ముఖం చేయనంతవరకూ సత్యాన్ని, భగవత్ సాక్షాత్కారాన్ని పొంది చివరికి శాంతికి అధికారులం కాజాలమన్న విషయాన్ని తెలుసు కుంటాం.

పాశ్చాత్య విద్యాపారంగతుడైన పాఠకుడు, ''మీ మాటలన్నీ అసంబద్ధప్రలా పాలు. బాహ్యజగత్తులోని వస్తువులను, వ్యక్తులను అన్వేషిస్తూ నేటి విజ్ఞానం ఎంత ముందంజ వేసిందో, నిత్యం మరెంతగా ప్రగతి సాధి స్తున్నదో, తెలిసిన వారెవ్వరూ మీలా చెప్పరు'' అని ఆక్షే పించవచ్చు. అందుకు మేము, ''భౌతికవిజ్ఞానం విష యంలో మీరు చెబుతున్నది నిజమే. కాని దాని మూలంగా చరమసత్యం ఎప్పటికీ లభించదు'' అని జవాబిస్తాం. ఎందుకంటే ఈ విజ్ఞానశాస్త్రం జగత్ కారణం 'జడం' అని, అది మనందరికన్నా నీచం - నికృష్టం అని మనకు తెలియపరు స్తుంది. అలాంటి జడవిజ్ఞానం ఎంత అభివృద్ధి అవుతుందో, మనమంత బహిర్ముఖులమౌతాం. అంత అధికంగానే, రూపరసాది భోగసుఖాలే మన జీవిత ఏకైకలక్ష్యం అనుకుంటాం. కాబట్టి ఈ జగత్తంతా ఒక్క జడవస్తువునుండే ఉత్పన్నమయిందని నిరూపించినా, సూక్ష్మపారమార్థిక జగత్తులోని విషయా లన్నీ మనకు అజ్ఞాతంగానే, నిరూపణ కాకుండానే మిగిలిపోతాయి. భోగవాసన లన్నిటినీ సంపూర్ణంగా త్యజించి, మనసును పూర్తిగా అంతర్ముఖం చేయడం ఒక్కటే ముక్తికి మార్గమనే సంగతి మనకు అవగతం కానంతదాకా, దేశకాలాతీత ఆ అఖండసత్యాన్ని సాక్షాత్కరించుకోలేము. పరమశాంతిని పొందలేము.

17. జడప్రకృతి విజ్ఞానం జగత్కారణాన్ని వెల్లడించలేదు

అవతారపురుషులందరూ బాల్యం నుండే అప్పుడప్పుడు ఆధ్యాత్మిక భావతన్మయత్వాన్ని పొందుతూ ఉంటారనే విషయం మనకు తెలియవస్తున్నది. ఉదాహరణకు శ్రీకృష్ణుడు తన బాల్యకాలంలోనే దివ్య త్వాన్ని తల్లితండ్రులకు, బంధుమిత్రులకు ఎన్నోసార్లు వెలి బుచ్చాడు. బుద్ధుడు ఉద్యానంలో నడుస్తూ, బోధివృక్షం కింద కూర్చుని, సమాధిస్థితుడై దేవతల, మనుష్యుల దృష్టిని ఆకర్షించాడు. ఏసుక్రీస్తు బాల్యంలో తన దివ్యప్రేమతో వన్యపక్షుల నాకర్షించి, తన చేతులతో వాటికి ఆహారంపెట్టాడు. శంకరాచార్యుడు తన దివ్యశక్తి ప్రభావంతో తల్లిని ముగ్ధురాలిని చేసి, ఆమెను ఓదార్చి, చిన్నప్పుడే సంసారత్యాగం చేశాడు. శ్రీ చైతన్య మహాప్రభువు బాల్యంలోనే ఆధ్యాత్మిక భావపరవశుడై, 'భగవత్ ప్రేమికుడు మంచీ - చెడులన్నిట్లో కూడ దైవత్వాన్నే పరికిస్తాడు'

18. బాల్యం నుండే అవతార పురుషులు ఆధ్యాత్మిక భావ తన్మయులై ఉంటారు

అని చూపించాడు. శ్రీరామకృష్ణుల జీవితంలో కూడ ఇలాంటి ఘటనలెన్నో మనకు కనిపిస్తాయి. ఉదాహరణకు కొన్నింటిని దిగువ తెలియచేస్తున్నాం. వీటిని స్వయంగా ఆయన ముఖతా విన్నాం. వాటి ద్వారా పిన్నవయసులోనే మొదటి ఆధ్యాత్మిక భావతన్మయత ఆయనకు కలిగిందని మేం గ్రహించాం. ఆ సంఘటన గూర్చి వారిలా చెప్పారు:

19. ఆర్వేళ్ల ప్రాయంలో శ్రీరామకృష్ణుల భావపార వశ్యం

''ఆ ప్రాంతాల్లో (కామార్పుకూర్‌లాంటి ప్రాంతాల్లో) తినడం కోసం చిన్నపిల్లలకు చిన్నచిన్న బుట్టల్లో మరమరాలు పెడుతుంటారు. అలాంటి బుట్టలు లేనివారు పిల్లల బట్టకొంగుల్లో కడతారు. పొలాల్లో తిరుగుతున్నప్పుడు పిల్లలు ఆ బుట్టల నుండో లేదా కొంగుల నుండో మరమరాలు తీసుకుని తింటూ కాలక్షేపం చేస్తుంటారు. నా కప్పుడు ఆరేళ్లుంటాయేమో.[1] ఒకరోజు ఉదయం పొలంగట్టు మీద నడుస్తూ, బుట్ట నుండి మరమరాలు తింటూ తిరుగుతున్నాను. అది జ్యేష్ఠమో, ఆషాఢమో! అప్పుడు ఆకాశంలో ఓ వైపు నల్లని అందమైన మబ్బు కనిపించింది. దాన్ని చూస్తూ ఉండిపోయాను. కొద్దిక్షణాల్లోనే ఆ మబ్బు విస్తృతమై ఆకాశాన్నంతా ఆవరించింది. ఆ క్షణంలో పాలలాంటి తెల్లని కొంగలబారు ఒకటి ఆ నల్లని మబ్బు కింద నుండి ఎగురుతూ వెళ్లింది. అదెంత రామణీయక దృశ్యమో చెప్పలేను. అలా దాన్ని చూస్తూండగా, నా మనసు అపూర్వ భావపరవశతను పొందింది. నేను బాహ్యస్మృతి కోల్పోయి కిందపడిపోయాను. మరమరాలన్నీ గట్టుమీద చెదరిపోయాయి. కొంతమంది నన్ను ఎత్తుకొని ఇంటికి తీసుకొని వెళ్లారు. అలా భావసమాధిలో తన్మయుడనై, బాహ్యస్మృతిని కోల్పోడం నాకదే మొదటిసారి.''

20. విశాలాక్షీదేవిని దర్శింప వెళ్లే సమయంలో గురుదేవులు రెండవమాఱు భావ సమాధి పొందడం

శ్రీరామకృష్ణుల జన్మస్థలం కామార్పుకూర్‌కు రెండు మైళ్ల ఉత్తరంగా 'ఆనూర్' గ్రామం ఉంది. ఆ గ్రామదేవత విశాలాక్షి[2], జాగ్రద్దేవత. చుట్టుపట్ల గ్రామప్రజలు ఈ దేవికి మొక్కుకుంటూ ఉంటారు. తమ కోరికలు ఫలిస్తే, ఆనూర్ గ్రామానికి వచ్చి, ఈ దేవికి తమ మొక్కుబళ్లు చెల్లించుకుంటారు.

---

1. పదో, పదకొండో ఏళ్లుంటాయని 'శ్రీరామకృష్ణ కథామృతం' పేర్కొంటున్నది.

2. ఈ దేవి పేరు 'విశాలాక్షా', లేక 'విషలక్ష్మి' అనేది నిర్ణయించడం కష్టం. ప్రాచీన వంగ గ్రంథాల్లో మానసాదేవిని 'విషహరి' అనికూడ పేర్కొన్నారు. ఈ విషహరి విషలక్ష్మిగా మారడం సులభమే. అయితే మానసమంగళాది పుస్తకాల్లో ఆమెను వర్ణిస్తూ 'విశాలాక్షి'గా స్తుతించారు. కాబట్టి మానసాదేవియే విషలక్ష్మి లేదా విశాలాక్షిగా ఇక్కడి భక్తుల పూజలందు →

ఆనూర్ విశాలాక్షి

అలా వచ్చే భక్తుల్లో స్త్రీలే ఎక్కువ అని వేరే చెప్ప నవసరం లేదు. ఆ భక్తురాండ్రలో సైతం తమ రోగాలను నయం చేయమని మ్రొక్కడానికి వచ్చేవారే అధికం. ఉన్నత కులాలకు చెందిన స్త్రీలు కూడ గుంపులుగా దేవీ దర్శనం కోసం వస్తుంటారు. దేవీ ఆవిర్భావం, అభివ్యక్తీకరణ గూర్చి కథలు చెప్పుకుంటూ, పాటలు పాడు కుంటూ నిర్భయంగా, నిస్సంకోచంగా మైదానం దాటి, దేవి వద్దకు వస్తారు. దేవీ దర్శనం చేసుకొని వెళతారు. నేటికి కూడ సంప్రదాయస్థులైన స్త్రీలు ఇలా దేవీ దర్శనం చేసుకుని తిరిగి వెళ్లడం కని పిస్తుంది. శ్రీరామకృష్ణుల బాల్యకాలంలో కామార్పుకూర్, దాని పరిసర గ్రామాలు నేటికన్నా ఎక్కువ జనాభాను కలిగివుండేవని, అధిక సమృద్ధిమంతమై ఉండేవని తెలుస్తుంది. ఎందుకంటే నేటి చిట్టడవులమధ్య పడిపోయిన ఇటుక ఇళ్లు, పాడుపడిన దేవాలయాలు, రాసమంచెలు (నర్తన వేదికలు) కనిపించి ఈ విషయాన్ని ధ్రువీకరిస్తుంటాయి. కాబట్టే ఆ కాలంలో ఆనూర్ దేవీ దర్శనార్థం పలువురు యాత్రికులు వస్తూ ఉండేవారని చెప్పవచ్చు.

దేవి మైదానం మధ్యలో వెలసి ఉంటుంది. ఆమెకు పైన ఏ కప్పూ ఉండదు. ఆకాశమే కప్పు. ఎండ నుండి, వర్షం నుండి ఆమెకు రక్షణగా రైతులు ఆకులతో పందిరి లాంటిది ఏర్పాటు చేస్తుంటారు. ఒకప్పుడు ఈ దేవికి ఇటుకలతో కట్టిన గుడి ఉండేదని అనిపిస్తుంది. ఎందుకంటే, ప్రక్కనే పాత ఇటుకల కుప్పలు కనిపిస్తాయి. ఈ గుడి విషయం గ్రామస్థులను అడిగాం. వారు దేవియే తన సంకల్పానుసారంగా నిర్మించిన గుడిని పడగొట్టిందని చెప్పారు. వారి కథనం ఇలా ఉంది:

దేవికి గోపబాలురంటే ఎంతో ప్రీతి అట. తెల్లవారేసరికి ఆ పిల్లలు, గోవులను అక్కడికి తోలుకువచ్చి, వాటిని మేతకు వదిలేవారు. తామంతా ఈ దేవి వద్ద కూర్చుని కథలు చెప్పుకుంటూ, ఆటలాడుకుంటూ గడిపేవారు. పాటలు

→

కుంటూ ఉందనుకోవాలి. కామార్పుకూర్ నుండి ఘాటాల్‌కు వచ్చేదారిలో ఒకచోట మేము ఈ దేవికి సంబంధించిన చక్కని దేవాలయాన్ని చూశాం. ఆలయం ప్రక్కనే మంచి సంగీత శాల, పెద్ద చెరువు, తోటలు ఉన్నాయి. అవన్నీ చూసిన తర్వాత అక్కడ పూజకు చక్కని ఏర్పాట్లు ఉన్నాయని గ్రహించాం.

పాడుతూ, అడవి పూలతో దేవిని అలంకరిస్తూ ఉండేవారు. యాత్రికులు లేదా బాటసారులు ఇచ్చిన తీపిపదార్థాలు, వారిచ్చిన కాసులు పుచ్చుకొనేవారు. ఆ పిల్లల ఆటపాటలు చూస్తూ, దేవి మురిసిపోయేదట. ఒకసారి ఒక గ్రామానికి చెందిన శ్రీమంతుడు, తన కోరిక ఈడేరడంతో, ఆ దేవికి గుడి కట్టించాడు. దేవిని గుడి లోపల ప్రతిష్ఠింపచేశాడు. గుడిలో దేవీ నిత్యపూజల కోసం అతడొక పూజారిని కూడ నియమించాడు. ఆ పూజారి ప్రతిరోజు ఉదయ సాయంకాలాల్లో వచ్చి పూజచేసి, ఆ తర్వాత తలుపులకు తాళంవేసి వెళ్లిపోయేవాడు. ఇతర సమయాల్లో దర్శనంకోసం వచ్చేవారు మాత్రం, కటకటాల బయటినుండే దేవిని చూసి, తమ నైవేద్యాలను కాసులను లోపల వేసి వెళ్లిపోయేవారు. అందుచేత గోపబాలురకు పూర్వంలా కాసులు, నైవేద్యాలు దొరకడం తగ్గాయి. తమకు దొరికిన కాసులతో మిఠాయిలు కొని, దేవికి నివేదించి, తినేవారు. ఇప్పుడా అవకాశం పోవడంతో, ఆ పిల్లలు ఎంతో వ్యధ చెందారు. ''అమ్మా! నువ్వు గుడి లోపలికి వెళ్లికూర్చుని మా ఆహారాన్ని నిలిపేశావు కదా! నీ దయతో పూర్వం పండ్లు, జిలేబీలు తినే వాళ్లం. ఇప్పుడు మా కవన్నీ ఎవరిస్తారు?'' అంటూ మొరపెట్టుకున్నారు.

అమాయకులైన ఆ పిల్లల మొర విని, ఆ దేవి నాటి రాత్రే గుడిని పడ గొట్టింది. తెల్లారిచూస్తే గోడలు బీటలువారి, గుడి పడిపోయేలా కనిపించింది; వెంటనే పూజారి దేవిని బయటకు తెచ్చి, పూర్వస్థానంలోనే అమర్చాడు. అప్పటి నుండి గుడి కట్టడానికి ఎవరు ప్రయత్నించినా, అది తన కిష్టంలేదని కలలో కనిపించో, మరో స్థితిలోనో దేవి తెలియచేసేది. తమలో కొందరిని దేవి అలా బెదిరించిందని, తాము గుడికట్టకుండా అడ్డుకుందని ఆ గ్రామస్థులు చెప్పారు. వారికి కలలో కనిపించి ''మైదానం మధ్యలో, ఈ గోపబాలురతో నేను హాయిగా ఉంటున్నాను. ఎవరైనా నన్ను గుడిలో ప్రతిష్ఠింప ప్రయత్నిస్తే, వారిని సర్వనాశనం చేస్తాను, జాగ్రత్త! వారి వంశంలో ఎవరూ బ్రతకరు'' అని హెచ్చ రించేదట.

శ్రీరామకృష్ణుల కప్పుడు ఎనిమిదేళ్ల వయస్సు. ఇంకా ఉపనయనం కాలేదు. ఒకరోజు పలువురు కులీన స్త్రీలు బృందంగా తమ మ్రొక్కుబడులను చెల్లించుకోవడానికి విశాలాక్షి గుడికి బయలుదేరారు. గురుదేవుల కుటుంబంలో ఒకరిద్దరు, ధర్మదాస్ లాహా వితంతు సోదరి ప్రసన్నమయి కూడ ఆ బృందంలో ఉన్నారు. ప్రసన్నమయి సరళత, పవిత్రత, ఆధ్యాత్మికత, అమాయకత్వాలను చూసి గురుదేవులు ఆమెను ఎంతో గౌరవించేవారు. అన్ని విషయాల్లోనూ ఆమెను సంప్రతించి, ఆమె సలహా ప్రకారం నడచుకోవాలని ఆయన చాలాసార్లు శారదాదేవికి చెప్పేవారు. ఆమె గూర్చి అప్పుడప్పుడు తమ భక్తురాండ్రకు కూడ

చెప్పేవారు. ప్రసన్నమయి కూడ చిన్నప్పటి నుండి గురుదేవులను ఎంతో అభిమానించేది. చాలాసార్లు అతణ్ణి వాస్తవంగా గదాధర్‌గానే భావించేది. అత్యంత సరళ చిత్తురాలైన ఆమె, గదాధర్ ముఖతా దేవీదేవతల పుణ్యచరిత్రలను, భక్తిపూరిత సంగీతాన్ని విని ముగ్ధురాలై చాలాసార్లు అతణ్ణి ''ఓ గదాయ్! నువ్వు దేవుడవనే నా కప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది. ఎందుకంటావు?'' అని అడిగేది. గదాధర్ ఆమె మాటలు విని, మధురంగా మందహాసం చేస్తూ మౌనంగా ఉండిపోయేవాడు. లేదా మాట మార్చి మరో విషయంలోకి వెళ్లిపోయేవాడు. అయినా ఆమె మాత్రం గంభీరంగా తల పంకిస్తూ ''నువ్వేమైనా చెప్పు, నువ్వు మాత్రం మానవమాత్రుడవు కావు'' అనేది.

ప్రసన్నమయి రాధాకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపన చేసి నిత్యం తానే స్వయంగా సేవలన్నీ చేస్తూండేది. పండగల్లో, పర్వాల్లో, ఉత్సవాల్లో ఆ గుళ్లో పాటలతో కూడిన నాటకప్రదర్శనలు జరుగుతూ ఉండేవి. అయితే ప్రసన్నమయి వాటిని ఎక్కువగా వినేది కాదు. ఎవరైనా అడిగితే, ''గదాయ్ పాటలతో నా చెవుల్ని పాడు చేశాడు'' అనేది.

ఈ విషయాలన్నీ కాలాంతరంలో జరిగాయి.

గ్రామస్త్రీలు అలా వెళుతూండడం చూసి, బాల గదాయ్ తాను కూడ వారితోపాటు వస్తానన్నాడు. అంతదూరం చిన్నపిల్లవాడు నడవలేడని ఎంచి, ఆ స్త్రీలు మొదట్లో వారించారు. కాని గదాయ్ వినక వారి వెంట బయలుదేరాడు. ఆ స్త్రీల కది విసుగు కలిగించలేదు. పైపెచ్చు వారి కది సంతోషాన్నే కలిగించింది. వినోదప్రియుడు, ఎప్పుడూ ఆనందోల్లాసాలతో ఉండే పిల్లవాడు ఎవరి మనసుల నైనా ఆకర్షిస్తాడు. పైగా ఆ చిన్నవయసులోనే వివిధ దేవీదేవతలకు సంబంధించిన పద్యాలు, పాటలు ఎన్నో అతడికి కంఠస్థం. తాము కోరితే దారిలో తప్పకుండా కొన్ని పాటలను పాడి వినిపిస్తాడు కదా! మళ్లీ తిరిగి వచ్చేటప్పుడు అతడికి ఆకలైనా ఫరవాలేదు. ఎందుకంటే అప్పుడు తమ వద్ద దేవికి అర్పించిన పాలు, పండ్లు, మిఠాయిలు షైరా ఉంటాయి కదా! ఇక పిల్లవాడిని తీసుకెళ్లడంలో ఇబ్బందేముంది? అని అనుకుని ఆ స్త్రీలు నిస్సంకోచంగా గదాయ్‌ను తమతో తోడ్కొని వెళ్లారు. అతడు కూడ వారు కోరినట్లే సంతోషంగా కథలు చెబుతూ, పాటలు పాడుతూ వారి వెంట బయలుదేరాడు.

అలా వారంతా విశాలాక్షి వెలసివున్న మైదానంలోకి వచ్చారు. మైదానాన్ని దాటక మునుపే, హఠాత్తుగా ఒక సంఘటన జరిగింది. పాడుతున్న గదాయ్, ఉన్నట్టుండి పాడడం ఆపివేశాడు. అతడి శరీరం, అవయవాలన్ని కర్రలా బిగుసుకుపోయాయి. కళ్ల నుండి కన్నీరు ధారగా స్రవించసాగింది. అది చూసిన

స్త్రీలందరూ గాబరాపడిపోయి, "ఏమైంది గదాయ్" అంటూ ప్రశ్నించడం మొదలుపెట్టారు. గదాయ్ మాత్రం బదులేమీ పలుకక అలాగే ఉండిపోయాడు. అలవాటు లేని కారణంగా నడిచి నడిచి అలసిపోయి ఉంటాడని, వడదెబ్బ తగిలి ఉంటుందని ఆ స్త్రీలు భయపడ్డారు. వెంటనే ప్రక్క చెరువు నుండి నీళ్ల తెచ్చి, గదాయ్ ముఖం మీద, తల మీద చిలకరించారు. ఎంతచేసినా గదాయ్ మాత్రం మామూలు స్థితికి రాలేదు. అతడికి బాహ్యస్మృతి కలగలేదు. దానితో ఆ స్త్రీలు ఎంతో ఆందోళన చెందారు. ఏం చేయాలో వారికేమీ పాలుబోలేదు. తమ మొక్కుబడులను తీర్చుకుని, దేవిని ఎలా ఆరాధించాలో వారికి తోచలేదు. వారితోపాటు మగమనిషి అంటూ మరెవ్వరూ లేరు. వారికి అదొక పెద్దసమస్య అయిపోయింది. వారు దేవీదేవతల విషయం మరిచిపోయి అతడి చుట్టూ మూగి కూర్చున్నారు. కొందరు విసరసాగారు. కొందరు నీళ్ల చిలకరించసాగారు. కొందరతణ్ణి బిగ్గరగా పేరుపెట్టి పిలువసాగారు.

అలా కొంతసేపు గడిచింది. హఠాత్తుగా ప్రసన్నమయి మనసులో ఏదో స్ఫురించింది: 'దేవి అంటే ఎంతో భక్తిశ్రద్ధలున్న ఈ సరళహృదయుణ్ణి దేవి ఆవేశించిందేమో! సరళ, శుద్ధహృదయులైన పిల్లలపైన, స్త్రీపురుషులలో దేవీదేవతల ఆవేశం కలుగుతుందని నేను విన్నాను కదా!' అని ఆమె అనుకుంది.

వెంటనే ఆమె తన మనసులోని మాట ఇతరులకు చెప్పింది. గదాయ్‌ను పిలువకుండా ఏకాగ్రచిత్తంతో విశాలాక్షిదేవిని పిలవమని కోరింది. పుణ్యశీలి ప్రసన్నమయి అంటే ఆ స్త్రీలకు ఎంతో భక్తిప్రపత్తులున్నాయి. అందుచేత ఆమె మాటలు విశ్వసించి వెంటనే, "అమ్మా! దేవీ, విశాలాక్షీ, ప్రసన్నంకా తల్లీ, రక్షించు తల్లీ, అమ్మా! మమ్ములను కృపతో చూడవమ్మా, మాకోగతిని చూపించు తల్లీ" అని వ్యాకులహృదయంతో ప్రార్థించారు.

ఆశ్చర్యం! కొంతసేపు అలా వారు ప్రార్థించగానే, గదాయ్‌లో మార్పు కనిపించింది. ముఖంలో మధుర మందహాసం వికసించింది. బాహ్యస్మృతి కూడ మెల్లగా రాసాగింది. దానితో మహిళలంతా ఊరడిల్లారు. నిజంగానే దేవి అతణ్ణి ఆవేశించిందని నిశ్చయించుకొన్నారు. పదేపదే 'అమ్మా - అమ్మా' అంటూ పిలుస్తూ అతణ్ణి వేడుకోసాగారు.[1]

అలా క్రమంగా అతడికి బాహ్యస్మృతి కలిగింది. అతడు మామూలు స్థితిని పొందాడు. కాని విచిత్రంగా అతడిలో, ఆ విస్మృతి కారణంగా ఎలాంటి

---

1. భక్త్యావేశంలో దేవికి నివేదించడానికి తెచ్చిన తినుబండారాలను వారు అతడికి నివేదించారని కొందరంటారు.

అలసటగానీ, బలహీనతగానీ ఏర్పడలేదు. ఆ తర్వాత భక్తిప్రపూర్ణులైన ఆ మహిళ లంతా దేవీదర్శనం చేసుకున్నారు. సముచితంగా ఆమె నారాధించారు. ఇంటికి తిరిగివచ్చి, జరిగిన విషయాన్నంతా చంద్రాదేవికి వివరంగా తెలిపారు. అది విని ఆమె ఎంతో ఆందోళన చెందింది. గదాయ్ శ్రేయస్సు కోసం తమ కులదైవం శ్రీరఘువీరునికి విశేషపూజలు చేయించింది. విశాలాక్షికి పదేపదే ప్రణామా లర్పించింది. ఆమెకు కూడ విశేషపూజ చేయిస్తానని మ్రొక్కుకున్నది.

బాల్యకాలం నుండే అప్పుడప్పుతడు ఉన్నత ఆధ్యాత్మ భూముల నధిరో హించేవాడన్న విషయాన్ని ధ్రువపరిచే మరొక సంఘటన శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగింది. దాని వివరాలు ఇలా ఉన్నాయి:

కామార్పుకూర్‌లో శ్రీరామకృష్ణుల ఇంటికి కొస్తదూరంలో నైరుతీ దిశలో సువర్ణవణికుల[1] కుటుంబం ఒకటి వసించేది. వీరి ఇంటి పేరు 'పాయిన్'. ఈ 'పాయిన్'లు ఒకప్పుడు ఎంతో సంపన్నులుగా ఉండేవారనడానికి, వారు కట్టించిన శిల్పాలతో కూడిన సుందరమైన శివాలయమే సాక్ష్యం. ఆ కుటుంబంవారు ఒక రిద్దరు ఇప్పటికీ ఉన్నారు. పూర్వీకులు కట్టిన వారిండ్లన్నీ ఇప్పుడు శిథిలావస్థలో ఉన్నాయి. ఆ కాలంలో (శ్రీరామకృష్ణుల బాల్యంలో) వీరు చాలా సంపన్నులుగా ఉండేవారని గ్రామస్థులు చెబుతుంటారు. ఆ ఇల్లంతా ఆ కుటుంబం వారితోనే నిండి ఉండేది. వారికి పశువులు, పొలాలు, నాగళ్లూ అనేకం ఉండేవి. వారు భూస్వాములు. అంతేకాదు, బంగారం వ్యాపారంతో వారు బాగానే గడిస్తూ ఉండే వారు. కాని ఈ పాయిన్లు అటు జమీందారులు కాక, ఇటు మహాధనికులు కాక, మధ్యస్థంగా ఉండేవారు. ఒకరకంగా చెప్పాలంటే, మధ్యతరగతిలో ఉన్నతస్థాయికి చెందిన శ్రీమంతులు వారు.

ఈ పాయిన్ కుటుంబ పెద్ద ఎంతో ధార్మిక పరాయణుడు. సామర్థ్యం ఉన్నా అతడు తన ఇంటిని ఇటుకల కట్టడంగా మార్చడానికి ఎప్పుడూ ప్రయ త్నించలేదు. మట్టితో కట్టిన రెండంతస్తుల మేడతోనే సంతుష్టుడై ఉండేవాడు. కాని అతడు ఇటుకలు కాల్పించి, ఒక మంచి శివాలయాన్ని మాత్రం కట్టించాడు. అతడి పేరు రసిక్‌లాల్. అతడికి పుత్ర సంతానం లేదు. అందరూ కుమార్తెలే. వివాహానంతరం కూడ కుమార్తెలందరూ పుట్టింట్లోనే ఎందుకు వసిస్తున్నారో మాకు తెలియరావడం లేదు. శ్రీరామకృష్ణులకు పది లేక పదకొండేళ్ల వయ స్సప్పుడు పాయిన్ కుటుంబంలోని ఆఖరి కుమార్తె పెద్దమనిషి అయిందని మాకు తెలియవచ్చింది. కుమార్తె లందరూ అందంగా ఉండేవారు. దైవభక్తి,

---

1. పూర్వం వీరు బంగారు వ్యాపారం చేస్తుండేవారు.

బ్రాహ్మణులపట్ల ఆదర గౌరవాలు గలవారు. పొరుగింట్లోనే ఉండే గదాయ్ అంటే వారందరికీ ఎంతో ప్రేమ! చిన్నతనంలో రోజులో చాలాసేపు గదాయ్ ఈ ధార్మిక కుటుంబంతోనే గడిపేవాడు. అతడు ఉన్నత భావస్థాయిల్లో ఉంటూ పాయిన్‌ల ఇంట్లో చేసిన లీలలను ఇప్పటికీ గ్రామంలో చెప్పుకుంటూ ఉంటారు. ఈ దిగువ సంఘటనను మేము శ్రీరామకృష్ణుల ముఖతా విన్నాం.

కామార్పుకూర్‌లో శైవ, వైష్ణవభక్తులు ఎలాంటి పరస్పర ద్వేషభావాలూ లేకుండా కలసిమెలసి జీవిస్తూ ఉండేవారు. 'శివభజన'లాగే 'త్రిదివసహరి సంకీర్తనం' కూడ ప్రతి సంవత్సరం ఈ ఊళ్లో ఎంతో బ్రహ్మాండంగా జరుగుతుండేది. అయినా విష్ణ్వాలయాలతో పోల్చిచూస్తే, శివాలయాలు ఇక్కడ ఎక్కువే ఉన్నాయని చెప్పవచ్చు. పైన పేర్కొన్న సువర్ణవణికులలో ఎక్కువమంది దురభిమానులైన వైష్ణవులే. (శ్రీ చైతన్యమహాప్రభువు సహచరుడైన) శ్రీ నిత్యానంద ప్రభువు, శ్రీ ఉద్ధారణదత్త[1] అనే వ్యక్తికి మంత్రదీక్ష నిచ్చిన కాలం నుండి ఈ కులంలో వైష్ణవ ప్రాబల్యం పెరిగింది. కాని, కామార్పుకూర్‌కు చెందిన పాయిన్‌లు మాత్రం వైష్ణవభక్తి, శైవభక్తి రెండూ కలిగివుండేవారు. వృద్ధుడైన పాయిన్ కుటుంబపెద్ద ఒకవైపు నిత్యం త్రిసంధ్యల్లో హరినామం చేస్తూ ఉండేవాడు. మరోవైపు శివుణ్ణే ప్రతిష్ఠించి, ప్రతి సంవత్సరం శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసేవాడు. రాత్రి జాగరణకు దోహదం చేస్తుందని తన ఇంట్లో 'యాత్ర' (నాటకం) కూడ ఏర్పాటు చేసేవాడు.

21. శివరాత్రినాడు శ్రీరామకృష్ణులు భావ సమాధి పొందడం

ఒక శివరాత్రినాడు మామూలుగానే పాయిన్ ఇంట్లో 'యాత్రా వీథి నాటకం' ఏర్పాట్లు జరిగాయి. సమీప గ్రామంలోని ఒక నాటకబృందం ఈ కార్యక్రమానికి ఒప్పుకున్నారు. చీకటి పడిన తర్వాత శివమహిమను తెలిపే నృత్యగానాలుంటాయి ఈ కార్యక్రమంలో.

అయితే చీకటి పడుతుండగా నాటకంలో శివుని పాత్రను పోషించే పిల్లవాడికి హఠాత్తుగా జబ్బు చేసింది. ఆ పాత్రను పోషించేవారు మరెవ్వరూ ఎంత వెదకినా లభించలేదు. మరేదారీ లేక నాటకబృందం యజమాని నాటకాన్ని ఆపివేయక తప్పదని వర్తమానం పంపించాడు.

అయితే మరెలా? శివరాత్రి జాగరణ చేయడం ఎలా? గ్రామంలోని పెద్దవారంతా కలసి సంప్రతించుకుని, నాటకసూత్రధారుని వద్దకు ఒక మనిషిని పంపించి, ''శివపాత్రధారి ఎవరైనా దొరికితే నాటకం కొనసాగించగలవా?'' అని

---

1. ఈ ఉద్ధారణదత్తు సువర్ణవణికుల పూర్వీకుడని భావించవచ్చు.

అడిగించారు. ''అలాగే'' అంటూ అతడు జవాబు పంపించాడు. గ్రామపెద్దలు మళ్లీ సంప్రతించుకున్నారు. ఆ శివపాత్రను ఎవరు పోషించగలరు? బాగా ఆలోచించిన తర్వాత వారికి 'గదాయ్' ఆ పాత్రను పోషించగలడని అనిపించింది. గదాయ్ చిన్నవాడైనా, అతడికి శివభజనలు ఎన్నో తెలుసు. శివుని వేషం ధరిస్తే చూడముచ్చటగా కూడ ఉంటాడు. అందుచేత గదాయ్‌ను ఎన్నుకున్నారు. నటన సమయంలో ఏవైనా రెండుమూడు మాటలు మాట్లాడవలసివస్తే ఆ పని యజమాని తెలివిగా సరిచేసుకోగలడు. గదాయ్ కూడ గ్రామస్థుల కోరిక మేరకు శివపాత్రను వేయటానికి ఉత్సాహంగా సిద్ధమయ్యాడు.

కాస్త చీకటి పడ్డాక నాటకం మొదలైంది.

గ్రామ జమీందారు ధర్మదాస్ లాహాకు, గదాయ్ తండ్రి క్షుదీరామ్‌కు మంచి స్నేహం ఉండడంవల్ల, జమీందార్ పెద్దకుమారుడు గయావిష్ణువు, గదాయ్ ప్రాణమిత్రులయ్యారు. తన స్నేహితుడు శివుడుగా నటిస్తున్నాడని విని, గయా విష్ణువు తన మిత్రులందరితో వచ్చి గదాయ్‌ను 'శివుడి'గా అలంకరించాడు. సమయం రాగానే గదాయ్ శివవేషంలో రంగస్థలం మీదికి వచ్చాడు. ఆలోగానే అతడి మనసు శివుని చింతన, స్మరణతో శివమయమైపోయింది. అతడు వాస్తవం గానే అంతర్ముఖుడైపోయాడు. ఆ భావతన్మయత్వంలోనే రంగస్థలం మీదికి వచ్చి స్థిరంగా నిలబడిపోయాడు.

జటాజూటం, విభూతిధారిగా వేషం ధరించిన గదాయ్ అందరినీ ఆకర్షిం చాడు. నెమ్మదిగా, స్థిరంగా అతడు అడుగులు వేస్తూ రావడాన్ని, సుస్థిరంగా రంగస్థలం మధ్యలో నిలబడడాన్ని చూసి ప్రేక్షకులు ఎంతో ముగ్ధులయ్యారు. అతడి అంతర్ముఖత్వాన్ని తెలిపే అర్ధనిమీలిత నేత్రాలను, నిశ్చలదృష్టిని, మధుర మందహాసాన్ని చూసి ఎంతో ఆనందించారు. ఆ ఆనందంలో వారంతా గట్టిగా 'శివ శివ' అంటూ శివనామాన్ని ఉచ్చరించసాగారు. కొంతమంది స్త్రీలు 'ఊళలు' వేశారు. కొందరు శంఖధ్వానాలు చేశారు.

అలా కొంతసేపు గడిచింది. తర్వాత మళ్లీ పరమ ప్రశాంతత నెలకొంది. అప్పుడు నాటకసంస్థ యజమాని శివస్తోత్రాన్ని మొదలుపెట్టాడు. శివస్తోత్రం వింటూ గ్రామస్థులు, ''మన గదాయ్ ఎంత చక్కగా నప్పాడో, నిజంగా శివుడిలాగే కనిపిస్తున్నాడు సుమా!'' అని అనుకోసాగారు.

కాని గదాయ్ మాత్రం శివతన్మయత్వంలో మైమరచి, రంగస్థలం మీద స్థాణువులా నిలబడిపోయాడు. అతడి కళ్లు నీటిని వర్షిస్తున్నాయి. అది ఆనంద పరవశత్వానికి గుర్తు. అలా చాలసేపు గడిచింది. అయినా గదాయ్ కదలక మెదలక అలాగే ఉండిపోయాడు. అది చూసి నాటకబృందం యజమాని,

గ్రామపెద్దలు కంగారుపడి దగ్గరకు వెళ్లి కదిపిచూశారు. అలా చూసినప్పుడు గదాయ్ కాళ్లు చేతులు ప్రతిస్పందన లేకుండా ఉండడం గమనించారు. ఆ పిల్లవాడు పూర్తిగా బాహ్యస్మృతిని కోల్పోయాడు. అదంతా చూసి వారెంతో ఆందోళన చెందారు. "నీళ్లు చల్లండి", "విసనకర్రతో విసరండి", "శివనామం ఉచ్చరించండి" అంటూ ప్రేక్షకుల నుండి గోల బయలుదేరింది. "ఈ కుర్రాడు వినోదాన్నంతా పాడుచేశాడు. ఇక నాటకం ఏం జరుగుతుంది?" అని మరి కొంతమంది నిరాశపడ్డారు.

ఎంత ప్రయత్నించినా, గదాయ్‌కు బాహ్యస్మృతి రాకపోయేసరికి, నాటకాన్ని అంతటితో ఆపివేశారు. ప్రేక్షకులు ఎవరింటికి వారెళ్లిపోయారు. కొంతమంది గదాయ్‌ను ఎత్తుకుని ఇంటికి చేర్చారు. ఆ నాటి రాత్రంతా గదాయ్ ఆ భావపారవశ్యంలోనే ఉండిపోయాడు. అది చూసి ఇంట్లోవారంతా ఎంతో కంగారుపడ్డారు.

మరుసటిరోజు సూర్యోదయం అయిన తర్వాత గదాయ్‌కు బాహ్యస్మృతి వచ్చింది. మామూలు మనిషయ్యాడు.[1]

1. మూడురోజులు అదే పారవశ్య స్థితిలో ఉన్నాడని కొందరంటారు.

3. సాధకభావ తొలి అభివ్యక్తీకరణ

1. శ్రీరామకృష్ణుల బాల్యంలో భావపారవశ్యాలను తెలిపే ఇతర సంఘటనలు

పైన పేర్కొన్న సంఘటనలేకాక శ్రీరామకృష్ణులు తమ బాల్యంలో ఆధ్యాత్మిక భావపారవశ్యాన్ని పొందుతుండేవారనే సంగతిని ఇతర ఘటనలెన్నో స్పష్టం చేస్తున్నాయి. ఈ విధంగా జరిగిన చిన్నచిన్న సంఘటన లెన్నో వారి మనస్తత్వాన్ని సూచిస్తాయి.

శివుడు, దుర్గ మొదలైన దేవతల విగ్రహాలను ఓ కుమ్మరి చేస్తూ ఉన్నాడు. ఒకసారి శ్రీరామకృష్ణులు మిత్రులతో కలిసి వాహ్యాళికై వెళుతూ అక్కడికి చేరుకున్నారు. కుమ్మరి చేసిన విగ్రహాలను కాసేపు చూసిన తర్వాత ''అదేమిటి? దేవుడి కళ్లు ఇలా ఉంటాయా? చూడు. ఈ విధంగా చేయాలి'' అని చెప్పి ఎలా చేస్తే అపార కరుణ, అంతర్ముఖత్వం, ఆనందం, దివ్యశక్తి ఇవన్నీ ఒకేసారి కళ్లలో ఉట్టిపడతాయో, విగ్రహాలు జీవంతో దైవత్వాన్ని ప్రకటిస్తాయో శ్రీరామకృష్ణులు కుమ్మరికి చెప్పారు. విగ్రహాలు తయారుచేయడంలో ఎలాంటి శిక్షణా పొందకుండానే బాల గదాధర్ విషయాన్ని గ్రహించి బోధించడం చూసి అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. కాని కారణాన్ని మాత్రం కనుక్కోలేక పోయారు.

క్రీడాపరవశుడై స్నేహితులతో కలిసి ఒకానొక దేవతను పూజించాలనే కోరికతో బాల గదాయ్ మట్టితో దేవతా విగ్రహాన్ని చేసేవాడు. లేదా క్యాన్వాస్ పైన ఎంతో అందంగా చిత్రించేవాడు. దాన్ని చూసినవారు ఇదెవరో నేర్పరి అయిన కుమ్మరో లేదా చిత్రకారుడో ఆ పని చేసివుండవచ్చని అనుకునేవారు.

మళ్లీ అడిగేంత లోపలే గదాయ్ ఒకరికి ఓ విషయాన్ని అనుకోకుండా చెప్పి ఆ వ్యక్తి మనస్సును దీర్ఘకాలంగా వేధిస్తున్న సందేహాన్ని తీర్చేవాడు. దాంతో తన భవిష్యజ్జీవనాన్ని కొనసాగించే శక్తి, మార్గం అతడికి గోచరించేది. ఆశ్చర్యపర

వశుడై తన ఇష్టదేవత కరుణించి బాల గదాయ్ రూపంలో తన కా మార్గాన్ని చూపినట్లు ఆ వ్యక్తి భావించేవాడు. లేదా పండితులకు కొరకరానికొయ్యగా మారిన క్లిష్టశాస్త్రాంశాన్ని బాల గదాయ్ ఒక్క మాటతో పరిష్కరించి అందర్నీ విస్మయపరిచేవాడు.

గురుదేవుల బాల్యంలో జరిగినవన్నీ, మేము విన్నటువంటి అద్భుత సంఘటనలన్నీ కూడ ఉన్నత భావభూముల నధిరోహించడం ద్వారా ప్రకటితమైన వారి దివ్యశక్తికి నిదర్శనమనడం సరికాదు. కొన్ని సంఘటనలు మాత్రమే ఈ విధంగా జరిగాయి. కాని తక్కినవాటిని మనం ఇదమిత్థంగా ఆరు కోవలుగా విభజించవచ్చు. అవి: 1. అసాధారణ జ్ఞాపకశక్తి, 2. విచక్షణ జ్ఞానం, 3. నిష్ఠ, పట్టుదల, 4. అపరిమిత ధైర్యసాహసాలు, 5. వినోద ప్రియత్వం, 6. అపారప్రేమ, అనంత కరుణ.

2. శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగిన సంఘటనలను ఆరు కోవలుగా వర్గీకరించవచ్చు

పైన పేర్కొన్న ఈ ఆరు తరగతుల సంఘటన లన్నింటి మూలంగా గురుదేవుల మనస్సులో అసాధారణ విశ్వాసం, పవిత్రత, నిస్వార్థం సమ్మిళితమై ఉండడం మనకు కనిపిస్తుంది. స్వాభావికంగానే ఆయన మనస్సు ఈ మూడింటితో రూపుదిద్దుకుంది. ఈ జగత్తులో సంభవించే క్రియ, ప్రతిక్రియల ద్వారా ఆయన మానస సరోవరంలో స్మృతి, బుద్ధి, పట్టుదల, సాహసం, వినోద ప్రియత్వం, ప్రేమ, కరుణ రసాలనే తరంగాలు ఉప్పొంగుతున్నాయా అని మనకు అనిపిస్తుంది. ఈ కింద ఇచ్చిన కొన్ని ఉదాహరణల ద్వారా పాఠకుడు, మేం చెప్పిన దాన్ని అర్థం చేసుకోగలడు.

ఒకసారి గ్రామంలో శ్రీరాముని లేదా శ్రీకృష్ణుని గురించిన నాటకం జరిగింది. ఇతరులతోపాటు గదాయ్ కూడ ఆ నాటకం చూశాడు. మరుసటి రోజు దాదాపు అందరూ నాటకంలోని పాటలను, పురాణకథ సన్నివేశాలను మరచిపోయి ఎప్పటిలాగే తమ తమ దైనందిన కార్యక్రమాల్లో మునిపోయారు. కాని బాల గదాధర్ మనస్సులో అవి ఉసిగొల్పిన ఆధ్యాత్మిక భావతరంగాలకు అంతులేదు. వాటినన్నింటిని మరోసారి స్మరించి ఆనందాన్ని అనుభవించాలనే ఆలోచనతో గదాయ్ స్నేహితులను దగ్గర్లోనేవున్న మామిడి తోటలోకి తీసుకుపోయి వారందరికీ ఒక్కో పాత్ర ఇచ్చి, ఆయా పాత్రలకు సంబంధించిన సంభాషణలను నేర్పించి, తాను స్వయంగా ప్రధానపాత్ర ధరించాడు. ఇక నాటకం మొదలైంది. ఇరుగుపొరుగు పొలాలలో పనిచేసుకొనే రైతులు, పిల్లలు వేస్తున్న నాటకాన్ని చూసి ముగ్ధులై 'ఒక్కసారి మాత్రమే నాటకాన్ని చూసిన వీళ్లంతా ఎలా నాటకంలోని సంభాషణలు, పాటలు నేర్చుకోగలిగారా?' అని ప్రశ్నించుకున్నారు.

3. అద్భుత జ్ఞాపక శక్తికి ఒక దృష్టాంతం

4. సడలని పట్టుదలకు ఒక ఉదాహరణ

ఉపనయనం జరుగుతున్న రోజు గదాధర్ తమ కుటుంబం, సమాజం అనుసరించే సంప్రదాయానికి విరుద్ధంగా 'ధని' అనే కమ్మరి స్త్రీని తన భిక్షా మాతగా ఎన్నుకోవాలని పట్టుపట్టాడు. ఆమె ప్రేమ వాత్సల్యాలకు ముగ్ధులై ఆమె అంతరంగంలోని కోరికను తెలుసుకుని సామాజిక నిషేధాన్ని త్రోసిరాజని, నిమ్న జాతికి చెందిన ఆ స్త్రీ వండిన ఆహారాన్ని లాక్కొని తిన్నాడు. దాంతో ఆమె భయపడి అలా చేయవద్దని ఎంత వారించినా గదాయ్ పట్టించుకోలేదు.

5. అఖండ సాహసానికి ఒక ఉదాహరణ

ఒళ్లంతా బూడిద పూసుకుని, జటలు కట్టిన శిరస్సుతో తిరిగే నాగా ఫకీరులను చూస్తే చాలు పట్టణాల, గ్రామాల పిల్లల గుండెలు దడదడ కొట్టుకుంటాయి. ఈ ఫకీరులు చిన్నపిల్లలను మాయం చేసి తీసుకుపోతారనీ, లేదా అవకాశం దొరికితే బలవంతంగా దూరప్రదేశాలకు ఎత్తుకుపోయి తమ బృందంలో చేర్చుకుంటారనీ ఓ వదంతి వంగదేశంలో ఉంది. కామార్పుకూర్‌కు దక్షిణంగా పూరీ జగన్నాథానికి పోయే దారి ఒకటుంది. సాధువులు, బాబాలు, ఫకీరులు, బైరాగులు ఎప్పుడూ ఈ దారినే నడుస్తుంటారు. వారు గ్రామంలో భిక్షమెత్తుకుని ఒకటి రెండు రోజులు అక్కడున్న ధర్మసత్రంలో విశ్రాంతి తీసుకుని మళ్లీ తమ గమ్యానికి సాగిపోయేవారు. గదాయ్ మిత్రులు ఆ వదంతి విని భయపడి పారిపోయేవారు. కాని గదాధర్ మాత్రం భయపడేవాడు కాదు. ఫకీరుల గుంపును చూచిన తక్షణం ఆతడు వారితో కలిసి తన తీయని మాటలతో, సేవలతో వారిని ఇట్టే ఆకర్షించి వారి ఆచారవ్యవహారాలు గ్రహించడానికి వారితో ఎక్కువ సమయమే గడిపేవాడు. ఒక్కోరోజు దేవునికి నివేదించిన వారి అన్నాన్ని తిని ఇంటికి వచ్చి తల్లికంతా వివరించేవాడు. సాధువుల మీద ఉన్న ప్రీతితో వారిలా వేషం వేసుకోవాలనే కోరికతో ఒళ్లంతా భస్మం పూసుకునేవాడు. తల్లితండ్రు లిచ్చిన కొత్త బట్టలను చింపి కౌపీనంగా, పైబట్టగా మార్చి వాటిని ధరించి తల్లి ముందు నిలబడేవాడు.

6. వినోదప్రియత్వానికి ఒక తార్కాణం

గ్రామంలో ఉండే నిమ్నజాతులకు చెందిన వారిలో చాలామందికి రామాయణం, మహాభారతం చదవడం వచ్చేది కాదు. వాటిని వినాలనే కోరిక కలిగినప్పుడు చదివి, అర్థం చెప్పగలిగే వారిని ఒకర్ని ఆశ్రయించేవారు. ఆ వ్యక్తి రాగానే కాళ్లు కడుక్కోవడానికి నీళ్లు, పొగత్రాగడానికి పొగాకుతో నింపిన ఒక కొత్త హుక్కా, కూర్చొని చదవడానికి ఒక మంచి ఆసనం లేదా ఒక కొత్త చాప భక్తిపూర్వకంగా అందించేవారు. ఈ మర్యాదలన్నీ చేయించుకున్న పిదప ఆ వ్యక్తి గర్వంతో, అహంకారంతో పొంగిపోయి ఎలా ఆసనాన్ని అలంకరిస్తాడో, అస్వాభావికమైన చేష్టలతో, ఏవగింపు కలిగించే

స్వరవైఖరులతో పురాణ పఠనం చేస్తూ తన గొప్పతనాన్ని వెలిబుచ్చడానికి పడే తాపత్రయాన్ని గదాయ్ సూక్ష్మంగా పరిశీలించేవాడు. పిదప గదాయ్ ఇతరుల ఎదుట మహాగంభీరంగా వాటినన్నిటినీ అనుకరించి హాస్యతరంగంలో ముంచెత్తేవాడు.

7. శ్రీరామకృష్ణుల స్వాభావిక మనో నిర్మాణం

శ్రీరామకృష్ణుల బాల్యావస్థలో జరిగిన సంఘటనలను పరిశీలిస్తే ఎటువంటి మనస్సుతో ఆయన సాధనలో అగ్రగణ్యులయ్యారో మనకు అవగతమవుతుంది. అటువంటి మనసు తాను సంకల్పించినదంతా చేసే తీరుతుందని, విన్నదానినెప్పుడూ అది మరచిపోదని, గమ్యానికి వెళ్ళే మార్గంలో దేనిని ఆటంకం అని అర్థం చేసుకుంటుందో దానిని నిర్దాక్షిణ్యంగా విసిరిపారేస్తుందని మనకు అర్థం అవుతుంది. అలాంటి హృదయం భగవంతుని మీద, తన మీద, మనుష్యులందరిలో నిహితంగా ఉన్న దివ్యత్వంపై విశ్వాసాన్ని ఉంచి ప్రపంచంలోని కార్యాలన్నింటినీ నిర్వహిస్తుందని, అటువంటి హృదయంలో క్షుద్ర అపవిత్ర భావనలు ఉండడం అసంభవమని తెలుస్తుంది. లేశమైనా సంకీర్ణత్వం ఉన్నట్లుగా కనిపించిన భావాలన్నింటినీ త్రోసిరాజంటుందని, సర్వకాలాల్లోనూ, అన్ని విషయాల్లోనూ పవిత్రత, ప్రేమ, కారుణ్యం - ఇవే దాని వ్యవహారాన్ని నడపగలవని మనకు అర్థం కాగలదు. వీటితో పాటు మరొక్క సంగతి కూడ మనకు విదితమవుతుంది. అదేమంటే తనలోగానీ లేదా ఇతరులలోగానీ ఏ భావమైనా సరే తన అసలు రూపాన్ని మారువేషంతో కప్పుకుని వచ్చి వారి మనోహృదయాన్ని ఎన్నటికీ మోసం చేయలేదు. గురుదేవుల అంతరంగం గురించి ఈ విషయం విశేషంగా జ్ఞాపకం పెట్టుకుని ముందుకు వెళ్లినప్పుడే వారి సాధన జీవితపు అలౌకికత్వం మనకు చక్కగా అవగతమౌతుంది.

8. పొట్టకూటి విద్య పట్ల ఆయన విహ్యత

శ్రీరామకృష్ణుల జీవితంలో సాధనభావపు తొలి అభివ్యక్తీకరణ ఆయన కలకత్తాలో అన్న రాంకుమార్ సంస్కృత పాఠశాలలో ఉన్నప్పుడు మనకు కనిపిస్తుంది. ఒకరోజు రాంకుమార్ అతణ్ణి చదువుపై దృష్టిని కేంద్రీకరించమని మందలించినప్పుడు ''ఈ పొట్టకూటి విద్య నా కక్కర్లేదు. యథార్థజ్ఞానాన్నిచ్చే విద్యనే నేను కోరుకొంటాను'' అని శ్రీరామకృష్ణులు సమాధానమిచ్చారు. అప్పు డాయన వయస్సు పదిహేడేళ్లు. ఆధ్యాత్మికపరాయణుడైన రాంకుమార్ స్మృతి, జ్యోతిశ్శాస్త్రాలను చక్కగా నేర్చుకున్నవాడు. ఆయన ఝామపుకూర్‌లో దిగంబరమిత్ర అనే వారింటికి సమీపంలో సంస్కృత పాఠశాల నొకటి ప్రారంభించి విద్యార్థులకు పాఠాలు చెబుతుండేవాడు. అంతేకాకుండా దిగంబరమిత్ర, తదితర సంపన్నుల

ఇళ్లల్లో ప్రతిదినం దేవతార్చనలు నిర్వహించేవాడు. ఒకవైపు ఎక్కువ సమయం పిల్లలకు పాఠాలు చెప్పడంలోనే గడచిపోయినా ముందే ఒప్పుకున్నట్లు సంపన్నుల ఇళ్లల్లో పూజాది కార్యక్రమాలు మాత్రం కష్టమైనా విడిచిపెట్టేవాడు కాదు. విద్యాదానం రూపంలో వచ్చే ఆదాయం తక్కువ కావడమే అందుకు కారణం. కొద్దిరోజులలోనే ఆ ఆదాయం కూడా తగ్గుతూ వచ్చింది. ఆ స్థితిలో భగవత్పూజాదికాల ద్వారా వచ్చే రాబడిని వదులుకుంటే ఎలా అని ఆలోచించి శ్రమకు ఓర్చుకుని రెండు కార్యాలు చేస్తే తప్ప లాభం లేదనుకున్నాడు. పరిపరి విధాల ఆలోచించిన తర్వాత ఆయన తన చిన్నతమ్ముణ్ణి తీసుకువచ్చి దేవతార్చన పని అతడికి అప్పగించి తానేమో బడి పనులకు అంకితమయ్యాడు.

9. ఝామపుకూర్ పాఠశాలలో గురుదేవులు

గదాధర్ ఝామపుకూర్‌కు వచ్చినప్పటి నుంచి తనకత్యంత ప్రియమైన పూజాకార్యాన్ని ఆనందంతో నిర్వర్తిస్తూ వచ్చాడు. పెద్దన్నను సేవిస్తూనే మరోవైపు ఒకింత పాఠాలు కూడా నేర్చుకున్నాడు. సద్గుణ సంపన్నుడు, ప్రియదర్శనుడైన గదాయ్ అచిరకాలంలోనే అందర్నీ ఆకర్షించి వారి ప్రేమాభిమానాలకు పాత్రుడయ్యాడు. కామార్పుకూరులో లాగే ఇక్కడ కూడ ఉన్నత కుటుంబాలకు చెందిన స్త్రీలు, గదాయ్ భాగవద్భక్తికి, నిష్కాపట్యానికి, సరళవ్యవహారానికి ఆకర్షితులై కలసిమెలసి ఉండసాగారు. అతడికి చిన్నచిన్న పనులు పురమాయించేవారు, అతడి మృదుమధుర కంఠం నుండి భజనలు విని తృప్తిపడేవారు. కామార్పుకూరులో లాగే ఇక్కడ కూడ తన చుట్టూ సదా కొందరు భక్తులు పోగవుతూండడం చేత గదాయ్ చదువు సంధ్యలు అనుకున్న ప్రకారం సాగలేదు. ఈ విషయం గ్రహించి కూడ రాంకుమార్ తమ్ముణ్ణి వెంటనే ఏమీ అనలేకపోయాడు. ఎందుకంటే తన తల్లి ప్రేమనుంచి వేరుచేసి తనకు అనుకూలంగా ఉంటాడనే కారణంగా రాంకుమార్ ఝామపుకూర్‌కు తమ్ముణ్ణి తీసుకొచ్చాడు. అప్పుడిక తన తమ్ముడి సద్గుణాలకు ఆకర్షితులైనవారు తమ తమ ఇళ్లకు ప్రేమతో ఆహ్వానించి తీసుకుపోతుంటే రాంకుమార్ అతణ్ణి అలా వెళ్లవద్దని ఎలా ఒత్తిడి చేయగలడు? అసలు కుటుంబంలో దారిద్ర్యమే లేకపోతే అతణ్ణి ఇక్కడికి తీసుకువచ్చేవాడు కాడుగా! అలాగని తీసుకురాకపోయి ఉంటే గదాయ్ కామార్పుకూరులోనే ఉండి తల్లిప్రేమ పొందుతూ మరోవైపు విద్యాభ్యాసం కూడ కొనసాగించేవాడుగా? అందుకే కొంతకాలం వరకు రాంకుమార్ తన తమ్ముడు గదాయ్‌ని ఏమీ అనలేదు. కాని ఒకరోజు తన కర్తవ్యం తలచుకుని చదవడం ముఖ్యమని, గదాయ్‌ని చదువుపై మనసు లగ్నం చెయ్యమని మందలించాడు. ఎందుకంటే అమాయకంగా ఉంటూ ఎప్పుడూ మైమరచి ఉండే తన

తమ్ముడు ఎప్పుడో అప్పుడు సంసారబంధంలోకి అడుగుపెట్టవలసివస్తుంది కదా! ఆనాడు ప్రాపంచిక స్థితిగతులు తెలుసుకోవడం ముఖ్యంగదా అనే ఆలోచనతో రాంకుమార్ అలా మందలించాడు.

10. గదాయ్ దృక్పథం గుర్తించలేని రాంకుమార్

స్వార్థంతో కూడిన సంసారపు చట్రంలో పడి కష్టాలు అనుభవించిన రాంకుమార్ తన తమ్ముడు గదాయ్ అసాధారణ మనస్తత్త్వాన్ని గ్రహించలేక పోయాడు. పిన్నవయస్సులోనే లోకంలోని మనుష్యుల వ్యవహారసరళి, జీవితచక్రాన్ని లాగించడానికి చేసే కఠోర పరిశ్రమ కారణాన్ని గ్రహించిన గదాయ్ - పేరుప్రతిష్ఠలు, భోగసుఖాలు, లాభాలు పొందడం వంటివన్నీ తుచ్ఛమని భావించాడు. అందుకే మానవ జీవితోద్దేశం భగవత్సాక్షాత్కారమే అని నిశ్చయించుని దానికే అధిక సమయం వెచ్చించడం మొదలుపెట్టాడు. గదాయ్ ఆలోచనలను రాంకుమార్ కలలో కూడ ఊహించలేదు. ఒకసారి ''పొట్టకూటి కోసం పనికొచ్చే విద్య నేను అభ్యసించ''నని గదాయ్ చెప్పిన వాస్తవాన్ని గ్రహించలేకే రాంకుమార్ తమ్ముణ్ణి చదువుకోమని మందలించాడు. కాని అల్లంతలోనే రాంకుమార్ పశ్చాత్తాపపడి వందరెట్లు ఎక్కువగా గదాయ్‌పై ప్రేమ చూపించసాగారు. ఎవరెన్ని చెప్పినా గదాయ్ మాత్రం భగవత్సాక్షాత్కారానికే మనసు లగ్నం చేశారన్నది ఆయన ఆచరించిన కార్యాలను చూస్తే విశదమవుతుంది.

11. రాంకుమార్ సాంసారిక పరిస్థితులు

పై సంఘటన జరిగిన రెండు సంవత్సరాల కాలంలో శ్రీరామకృష్ణ, రాంకుమార్‌ల జీవిత చక్రంలో పెనుమార్పులు జరిగాయి. రాంకుమార్ ఆర్థికపరిస్థితి నానాటికీ దిగజారుతూ వచ్చింది. ఎంత ప్రయత్నించినా ఏపాటి ఉన్నతీ పొందలేకపోయాడు. బడిని మూసివేసి వేరే ఉద్యోగం చూసుకోవడం మంచిదేమోననుకున్నాడు. కాని ఏ నిర్ణయానికీ రాలేకపోయాడు. ఒక్కటి మాత్రం గ్రహించాడు. ఏదో ఒక ఉపాయం ఆలోచించకుండా ఉంటే కాలం గడిచేకొద్దీ చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోవడం తప్పదనుకున్నాడు. పౌరోహిత్యం, పూజచేయడం, చదువు చెప్పడం మినహా మరో వృత్తంటూ ఏదీ నేర్చుకోలేకపోయిన రాంకుమార్‌కు ఈ వయస్సులో ఆదాయం పెంచుకొనే మరో వృత్తిని నేర్చుకొనే శక్తి, పట్టుదల ఉన్నాయా? ఒకవేళ అలా నేర్చుకొని మరింత ఆదాయానికి ప్రయత్నించినా, తన పూజాదికాలకు, దైనందిన ఇతర కర్మకలాపాలకు సమయం కేటాయించడం కుదిరేపని కాదు. కనుక రఘువీరుని మీదే భారం వేసి, ఆ ఆలోచనల నుండి మనస్సును తిప్పి, నిరాశతోనే ఇంతకాలం చేస్తున్న వృత్తినే కొనసాగించసాగాడు. భగవంతునిపట్ల అచంచల విశ్వాసం ఉన్న రాంకుమార్, అల్పసంతోషియైన

రాంకుమార్, లౌకిక జీవితంలో చొరవతో చొచ్చుకుపోగల వ్యక్తి కాడని తేటతెల్లమౌతున్నది.

కాని భగవత్సంకల్పం వల్ల ఆ సమయంలో జరిగిన ఒక సంఘటన రాంకుమార్‌ను అనిశ్చిత స్థితి నుండి, ఆందోళనల బారి నుండి విముక్తుణ్ణి చేసింది.

4. దక్షిణేశ్వర కాళికాలయం

రాంకుమార్ కలకత్తాలో 1850వ సంవత్సరంలో సంస్కృత పాఠశాలను ప్రారంభించాడు. అప్పటికి బహుశా అతడి వయస్సు 45 ఏళ్లు ఉండవచ్చు. లేమి, దుర్ఘటనలు మొదలైనవి అతణ్ణి కొంత కాలం కలవరపరిచాయి. ఏకైక పుత్రుడు అక్షయ్‌ను ప్రసవించిన పిదప అతడి భార్య చనిపోయింది. తన భార్య ప్రసవం తర్వాత ఇక బతకదని సాధకుడు రాంకుమార్ ముందే భవిష్యద్వాణిగా గ్రహించి ఆ విషయాన్ని తన కుటుంబంలోని కొందరికి తెలిపాడు. అప్పటికి శ్రీరామకృష్ణులకు పద్నాలుగేళ్లు నిండాయి. సంపదలతో కూడిన కలకత్తా నగరంలో పలువురు ధనికులు, మధ్య తరగతికి చెందినవారు జీవిస్తున్నారు. శాంతి స్వస్త్యయనాది క్రియలు చేయడం, ధార్మిక సమస్యల గురించి శాస్త్రాభిప్రాయాలు వ్రాసివ్వడం, తన పాఠశాలకొచ్చే విద్యార్థులకు చక్కగా విద్య నేర్పడం వంటి వాటి ద్వారా ఆర్థికపరిస్థితులను మెరుగుపరచుకుని మానసిక చింతల నుంచి స్వేచ్ఛ పొందవచ్చని రాంకుమార్ కలకత్తాకు వచ్చివుండవచ్చు. లేదా భార్యావియోగం జీవితంలో ఏర్పరిచిన శూన్యం కారణంగా ఏదైనా దూరప్రాంతానికి వెళ్లి వివిధ పనుల్లో నిమగ్నమైవుంటే మనసుకు కొంత శాంతి కలుగుతుందనే భావంతోనైనా వచ్చివుండవచ్చు. ఏది ఏమైనా (కలకత్తా) ఝామాపుకూర్‌లో పాఠశాలను ప్రారంభించిన కొన్ని సంవత్సరాల తర్వాత రాంకుమార్ శ్రీరామకృష్ణులను ఎందుకు కలకత్తాకు తోడ్కొనివచ్చాడో, 1852లో కలకత్తాకు వచ్చిన తర్వాత మూడేళ్లు గురుదేవులు ఎలా గడిపారో పాఠకులకు మేమింతకు మునుపే చెప్పాం.

1. రాంకుమార్ కలకత్తాలో సంస్కృత పాఠశాలను ప్రారంభించడానికి కారణం

ఇక అప్పటి నుండి శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగిన సంఘటనల గురించి తెలుసుకోవాలంటే మన దృష్టి మరో వైపుకు మరల్చాలి. ఆర్థికంగా

పుంజుకోవడానికి రాంకుమార్ అప్పట్లో ఘాటుబాబు బృందంలో చేరి తన సంస్కృత పాఠశాల అభివృద్ధికి ప్రయత్నించాడు.

2. రాణీ రాస్మణి

రాణీ రాస్మణి దక్షిణ కలకత్తాలో జాన్‌బజార్ అనే ప్రాంతంలో వసించేది. ఆమెకు నలుగురు కుమార్తెలు. 44వ ఏట ఆమె భర్తను కోల్పోయింది. భర్త శ్రీ రాజ్‌చంద్రదాస్ నుండి అపరిమిత సంపద ఆమెకు సంక్రమించింది. ఆ ఆస్తిపాస్తులను సక్రమంగా చూసుకొని అనతికాలంలోనే కలకత్తాలో తనకంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకుంది. ఆమె పేరుప్రతిష్ఠలు నలుదిశలా వ్యాపించడానికి కార్యదక్షత ఒక్కటే కారణం కాదు. భగవద్భక్తి, ధైర్యసాహసాలు,[1] బీదసాదలపట్ల అపరిమిత సానుభూతి[2],

---

1. రాణీ రాస్మణి సాహసానికి ఒక నిదర్శనం: జాన్‌బజార్‌లో ఉన్న ఆమె ఇంటికి దగ్గర్లో ఆంగ్లేయ సైనిక శిబిరం వుండేది. ఒకసారి సైనికులు తప్పతాగి విచ్చలవిడిగా తిరుగుతూ వాకిలి కాపలా వారిని పక్కకునెట్టి ఆమె ఇంట్లోకి ప్రవేశించి కొల్లగొట్టసాగారు. ఆ సమయంలో ఇంట్లో పురుషులెవ్వరూ లేరు. దాంతో అంతఃపురంలోకి ప్రవేశించే సమయంలో రాణి కాళికారూపాన్ని ధరించి కత్తి పుచ్చుకుని వారిని వాకిట్లోనే తరిమేసిందట.

2. బీదసాదలపై ఆమెకున్న సానుభూతికి నిదర్శనం: ఒకప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం వారు గంగానదిలో చేపలుపట్టే బెస్తవారిపై పన్ను విధించారు. ఈ పెనుభారాన్ని భరించలేక వారు రాణికి తమ గోడు విన్నవించుకున్నారు. అప్పుడు ఆమె పెద్దమొత్తంలో డబ్బు చెల్లించి గంగా నదిలో బెస్తవారు చేపలు పట్టుకోవడానికి వీలు కల్పించింది. ప్రభుత్వం నుంచి అధికారపత్రాన్ని పొందిన వెంటనే ఆమె నదికి అడ్డంగా పలుచోట్ల గొలుసులు కట్టించింది. దాంతో ప్రభుత్వం వారి నౌకలు, ఇతర రహదారి పడవలు నదిలో ప్రవేశించడం కష్టమైంది. రాణి చర్యను ప్రతిఘటించడానికి పూనుకున్నవారితో "చేపలు పట్టుకోవడానికి నేను మీ కెంతో డబ్బు చెల్లించి అధికారం పొందాను. నేను ఆ అధికారానికి లోబడే గొలుసులు కట్టించాను. నౌకలు, పడవలు ఇక్కడ ఎక్కువగా తిరిగితే చేపలన్నీ పారిపోతాయి. అలా జరిగితే నాకు నష్టం వాటిల్లుతుంది. కనుక గొలుసులు తీసివేయడం అసంభవం. నదిలో చేపలు పట్టుకోవడానికి బెస్తలకు అవకాశం కల్పిస్తూ విధించిన కొత్తపన్నులు రద్దుచేస్తే, నా పట్టు విడవడానికి సిద్ధమే! అలా చెయ్యకపోతే ప్రభుత్వంపై దావా వేస్తాను" అని గట్టిగా హెచ్చరించింది. రాణీ రాస్మణి హెచ్చరికతో పేద బెస్తలపై విధించిన పన్నును ప్రభుత్వం సత్వరమే రద్దుచేసింది. ప్రజల సంక్షేమ కార్యాలలో ఆమె ఎంతో ఉత్సాహం చూపుతుండేది. అందుకు నిదర్శనం- "సోనాయి, బేలేఘాట్, భవానీపూర్ ప్రాంతాల్లో ఆమె కట్టించిన దుకాణాలు, భక్తుల కోసం (కలకత్తా, గంగానది ఒడ్డున) కాళీఘాట్‌లో నిర్మించిన ఘాట్ (మెట్లు), ఒక సత్రం, హాలీసహర్‌లో గంగానది తీరాన ఒక ఘాట్, సువర్ణరేఖనది కావలి ఒడ్డు నుంచి కొంత దూరం వరకు వేయించిన కాలిబాట ఇత్యాదులు. గంగాసాగర్, త్రివేణి, నవద్వీపం, అగ్రద్వీపం, పూరీ మొదలైన తీర్థక్షేత్రాలను సందర్శించి ఆయా దేవతల పేరిట అపార ధనం ఖర్చుపెట్టిందట. అలాగే మకింపూర్ జమీ పేదలను తోటయజమానుల దౌర్జన్యం నుంచి కాపాడింది. 10 వేల రూపాయలు ఖర్చు పెట్టి ఒక కాలువ త్రవ్వించింది. లెక్కలేనన్ని ప్రజాహిత కార్యాలు చేసి ఘనకీర్తి సంపాదించింది.

రాణీ రాస్మణి

చేసిన దానధర్మాలు, పుణ్యకార్యాల ద్వారా ఆమె పేరుప్రతిష్ఠలు సముపార్జించుకొంది. బెస్తకులంలో జన్మించినప్పటికీ సద్గుణాలతో 'రాణి' అనే బిరుదాన్ని సార్థకం చేసుకొంది. కుల భేదం పాటించక సర్వులు ఆమె పట్ల మర్యాదమన్నన చూపేవారు. ఆమె కుమార్తెలందరికీ పెళ్లిళ్లయిపోయాయి. సంతానవతులు అయ్యారు కూడ. ఒకే ఒక్క కుమారుణ్ణి వదలిపెట్టి ఆమె మూడవ కుమార్తె మరణించింది. అందగాడు, కార్యదక్షుడు అయిన మూడవ అల్లుడు శ్రీ మథురమోహన్ (మథురనాథ్ విశ్వాస్)కు రాణీ రాస్మణి తన నాలుగవ కుమార్తె జగదంబను ఇచ్చి వివాహం చేసింది. రాణీ రాస్మణి నల్గురు కుమార్తెల వంశీయులు ఈనాటికీ ఉన్నారు.[3]

---

3. పాఠకుల కోసం రాణీ రాస్మణి వంశవృక్షం వివరాలు: (దీనిని "శ్రీ దక్షిణేశ్వరం" అనే పుస్తకం నుంచి గ్రహించాం.)

రాణీ రాస్మణి - రాయ్ రాజ్ చంద్రదాస్

1. పద్మమణి (కుమార్తె)
రామచంద్రదాస్ (అల్లుడు)

2. కుమారి (కుమార్తె)
ప్యారీచౌధురి (అల్లుడు)

3. కరుణామయి (కుమార్తె)
మథురమోహన్ విశ్వాస్ (అల్లుడు)

1. ద్వారికానాథ్ విశ్వాస్
2. త్రైలోక్యనాథ్ విశ్వాస్
3. ఠాకూర్‌నాథ్ విశ్వాస్

4. జగదంబ (కుమార్తె)
మథురమోహన్ విశ్వాస్
(అల్లుడు)

3. రాణి దేవీభక్తి

సద్గుణశీలి రాణీ రాస్మణి కాళికాదేవి భక్తురాలు. జమీకి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాల మీద వేయడానికి గాను తయారుచేసిన ముద్ర మీద "కాళీ పదాభిలాషిణి శ్రీమతి రాస్మణి దాసి" అనే అక్షరాలు చెక్కబడ్డాయి. రాణి ప్రగాఢ భగవద్భక్తి ఇలా అన్ని విషయాల్లోనూ వ్యక్తమై ఉండేదని గురుదేవుల (శ్రీరామకృష్ణుల) ముఖతా మేము విన్నాం.

4. ఆలయం గురించి దైవాదేశం

కాశీక్షేత్రానికి వెళ్లి శ్రీ విశ్వనాథుని, అన్నపూర్ణాదేవిని సందర్శించి పూజించాలనే కోరిక ఆమెకు చాలాకాలంగా ఉంది. అందుకోసం ఆమె ఎంతో డబ్బు కూడ కేటాయించింది. కాని భర్త హఠాత్తుగా చని పోవడంతో ఇంటి భారమంతా ఆమె మీద పడింది. దాంతో అప్పట్లో తన కోరిక తీర్చుకోలేకపోయింది. కాని రోజులు గడిచేకొద్దీ తన అల్లుళ్ళ ముఖ్యంగా మథురమోహన్ ఆమె కీ విషయంలో తోడ్పడడంతో 1847లో కాశీ యాత్రకు సిద్ధమైంది. ఇక మరుసటి రోజు బయలుదేరవలసి ఉండగా ముందు రోజు రాత్రి దేవి ఆమెకు కలలో దర్శనమిచ్చి "కాశీకి పోనవసరం లేదు. భాగీరథీ తీరాన ఒక చక్కని ప్రదేశంలో నా శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించి, పూజతో పాటు అన్న నైవేద్యాలను ఏర్పాటు చెయ్యి, అదే చాలు. నే నా విగ్రహంలో అభివ్యక్తమై నిత్యం నీ సేవాదులు స్వీకరిస్తా"నని[1] ఆదేశించిందట! దాంతో ఆమె పరమానందభరితురాలై వెంటనే కాశీయాత్ర మానుకొని దేవీ ఆలయ నిర్మాణానికి సంకల్పించింది.

5. కాళికాలయ నిర్మాణం

ఈ విధంగా జగజ్జనని మీద ఎంతో కాలం నుంచి ఉన్న దైవభక్తి ఇప్పుడు ఆమెను గంగానదీ తీరంలో ఒక విశాలమైన స్థలం కొనుగోలుచేసి,[2] పెద్దమొత్తంలో ధనం వెచ్చించి తొమ్మిది గోపురాలతో కూడిన పెద్ద ఆలయం, చిన్న దేవాలయాలు, అలాగే ఒక చక్కని పూల తోట నిర్మాణానికి ఉపక్రమింపచేసింది. కాని ఆ పని 1855కి కూడ పూర్తి కాలేదు. దాంతో ఆమె మనస్సులో ఇలా అనుకొంది: 'జీవితం అనిశ్చితం. ఆలయ నిర్మాణానికి చాలాకాలం పడుతోంది. కనుక జగన్మాతనిలా ప్రతిష్ఠించాలన్న నా కోరిక ఈ జీవితంలో నెరవేరదా?' ఆ ఏడాది మే 31వ తేదీ (స్నాన

---

1. రాణి నావలో యాత్రకు బయలుదేరి కలకత్తాకు ఉత్తరంగా దక్షిణేశ్వర్ గ్రామం దాకా వచ్చి నౌకలోనే రాత్రి గడిపినప్పుడు ఆమెకు దేవీదర్శనమైందని కొందరు చెబుతారు.

2. కాళికాలయం నిర్మించిన స్థలం మొత్తం దాదాపు 17 ఎకరాలుంటుందని దేవోత్తర దానపత్రంలో వ్రాయబడింది. ఈ స్థలాన్ని కలకత్తా సుప్రీంకోర్టు న్యాయవాది హేస్టీ అనే ఆంగ్లేయుని నుండి రాస్మణి 1847 సెప్టెంబర్ 6న కొనుగోలు చేసింది.



దక్షిణేశ్వర దేవాలయాలు

యాత్ర పండుగరోజు) జగన్మాత ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా జరిపింది. అంతకు ముందు జరిగిన కొన్ని విషయాల గురించి తెలుసుకోవడం అవసరం.

జగన్మాత నుండి ఆదేశాన్ని పొందో లేక హృదయపూర్వక అభిలాషతోనో భక్తులు తమ ఇష్టదేవతను సర్వదా సేవించాలని కోరుకుంటారు. జగన్మాతకు అన్న నైవేద్యమివ్వాలనే కోరికతో రాణి హృదయం పరితపించింది. 'ఇచ్ఛానుసారం ఆలయాల నిర్మాణం జరిగిపోయింది. సేవాదులు నిర్విఘ్నంగా జరపడానికి తగిన ఆస్తులు ఏర్పాటుచేశాను. ఇంతచేసి కూడ మనసా జగన్మాతకు నిత్యం అన్న నైవేద్యాదులు సమర్పించుకోలేకపోతే అంతా వృథానే కదా' అని అనుకుంది రాణి రాస్మణి. ''హే జగదంబా! సారహీనాలైన పేరుప్రతిష్ఠలనిచ్చి నా ఈ కోరికను వమ్ముచేయవద్దు. నువ్విక్కడ నిత్యం అభివ్యక్తమై, దయచేసి ఈ దాసి ప్రాణాభిలాషను ఈడేర్చు తల్లీ!'' అని ప్రార్థించింది.

6. అన్న నైవేద్యం చేయడంలో ఎదురైన సమస్య

దేవికి అన్న నైవేద్యాలర్పించాలనే ఆమె కోరికకు ముఖ్యమైన రెండు అంతరాయాలు 1. తన నిమ్నజాతి, 2. శాస్త్ర నిషేధం అని రాణి గమనించింది. ఇలా అంతరాయాలు ఎదురైనా కూడ జగన్మాత తన అన్న నైవేద్యాన్ని గ్రహించదనే సందేహం ఆమె హృదయంలో ఎప్పుడూ పొడసూపలేదు. ఆ ఆలోచన రావడమే తరువాయి

7. ఈ సమస్యాపరంగా పండితుల ప్రతికూల అభిప్రాయాలు

ఆమె హృదయం ఆనందంతో నిండిపోవడం తప్ప ఏనాడూ సంకోచించేది కాదు. అలాంటప్పుడు విపరీత శాస్త్ర నిషేధం ఎందుకో? శాస్త్రకారులు హృదయ రహితులా? లేదా స్వార్థప్రేరితులై జగన్మాత వద్ద కూడ అగ్రవర్ణాలకే అధికారా లుండాలనే వ్యవస్థను రూపొందించారా? ఒకవేళ తన అంతఃప్రేరణనే అనుసరించి వ్యాప్తిలోవున్న ఆచారానికి విరుద్ధంగా అన్న నైవేద్యాలర్పిద్దామా అంటే భక్తులైన బ్రాహ్మణులు, సజ్జనులు దేవాలయానికి వచ్చి ప్రసాదాన్ని స్వీకరించరు కదా! ఇక మార్గం? అలా భావించి దేవికి నిత్యం అన్ననైవేద్యాన్ని సమర్పించే వ్యవస్థ కోసం నానాప్రాంతాల నుండి శాస్త్రకారులైన పండితుల అభిప్రాయాలను సేకరించ సాగింది రాణి. ఈ విషయంలో వారెవ్వరూ ఆమెను ప్రోత్సహించలేదు.

ఆ విధంగా ఆలయం, విగ్రహ నిర్మాణం పూర్తయినాయిగానీ రాణి కోరిక నెరవేరే మార్గం కనబడలేదు. చిన్నాపెద్దా పండితులందరి నుండి లిఖితపూర్వక శాస్త్రాభిప్రాయాలు తీసుకున్నా తన కోరిక నెరవేరే మార్గం కనిపించక ఆశ అడుగంటుతున్న సమయంలో ఒకరోజు ఝామాపుకూర్ చతుష్పాఠి (వేదపాఠశాల) నుండి ఒక లిఖితాభిప్రాయం వచ్చింది. ఆలయం నిర్మించడానికి ముందు ఆలయ సంపదనంతా రాణి ఎవరో ఒక బ్రాహ్మణుడికి దానం చేయాలి. అప్పుడు ఆ బ్రాహ్మణుడు ఆలయంలో దేవిని ప్రతిష్ఠింపజేసి అన్న నైవేద్యాన్ని అర్పించే వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చు. అలా చేయగలిగితే శాస్త్ర నియమం పాటించినట్లవుతుంది. బ్రాహ్మణాది అగ్ర వర్ణాలవారు దేవాలయంలో ప్రసాదం స్వీకరించినా వారికి దోషం అంటదు.

8. రాంకుమార్ అభిప్రాయం

ఈ అభిప్రాయం చూడగానే రాణి హృదయంలో ఆశ మళ్లీ చిగురించ సాగింది. తన గురువు పేరుతో ఆలయ ప్రతిష్ఠాపన చేసి, ఆయన అనుమతితో భగవత్సేవాకార్యాలన్నీ సక్రమంగా నెరవేరడానికి తాను కార్య నిర్వాహకురాలి పదవిని వహించాలని రాణి సంకల్పించు కుంది. రాంకుమార్ భట్టాచార్యులిచ్చిన లిఖితాభిప్రాయానుసారం కార్యక్రమాన్ని కొనసాగించాలనే రాణి దృఢసంకల్పాన్ని గ్రహించి పండితులందరూ ''ఆ విధంగా చేయడం సాంఘికాచారానికి విరుద్ధంగా ఉందని, అలా చేస్తే బ్రాహ్మణ సజ్జను లా స్థలంలో ప్రసాదాదులు గ్రహించలే''రని పరోక్షంగా దుయ్యబట్టసాగారు. కాని శాస్త్ర నిర్దేశాలకది విరుద్ధంగా ఉందని బాహాటంగా చెప్పే ధైర్యం వారెవరికీ లేకపోయింది.

9. ఆలయ ప్రతిష్ఠాపనకు రాణి సంకల్పం

పై సంఘటనతో రాణి దృష్టి రాంకుమార్ భట్టాచార్యుని వైపుకు ఆకర్షించ బడిందని ఊహించవచ్చు. ఆలోచించి చూస్తే ఆ రోజులలో అటువంటి అభి ప్రాయాన్ని వెల్లడించడం రాంకుమార్ సర్వతోముఖత్వాన్ని సూచిస్తోంది.

సంఘనేతలైన బ్రాహ్మణ పండితుల మనస్సులు ఆ సమయంలో అత్యంత సంకు

10. రాంకుమార్ సర్వతోముఖత్వం

చిత వలయంలోనే తిరుగుతూవుండేవి. ఆ వక్రం నుంచి బయటకొచ్చి శాస్త్రనిర్దేశాలలో ఉదారభావాలను చూసి పరిస్థితుల కనుగుణంగా వాటిని మలచుకొనే వ్యవస్థల నొసగే సమర్థులు వారిలో ఏ కొద్దిమందో ఉన్నారు. ఇందుకు పర్యవసానంగా జనసామాన్యం ఈ సంకుచిత అభిప్రాయాలను త్రోసిరాజని తమ ఉద్దేశాలనే నెరవేర్చుకోవడం జరిగేది.

రాంకుమార్‌తో రాణి సంబంధం అంతటితో ఆగిపోలేదు. తన కుల గురువుగారి కుటుంబ సభ్యులపట్ల సముచిత గౌరవమర్యాదలు చూపినప్పటికీ

11. యోగ్యమైన పూజారికోసం రాణి అన్వేషణ

తెలివైన రాణి, వారి శాస్త్ర అజ్ఞానాన్ని, వారి అభిప్రాయం మేరకు పూజాదులు నిర్వహింప తన అనర్హతను స్పష్టంగా అవగతం చేసుకొన్నది. కొత్తగా నిర్మించిన మందిరంలో పూజాసేవాది కార్యాలన్నింటినీ పండితులు, సదాచారసంపన్నులైన బ్రాహ్మణుల ద్వారానే కొనసాగించాలని నిశ్చయించుకుంది. అందుకు తగిన ఏర్పాట్లు ఆమె చేయసాగింది. ఇక్కడ కూడ ప్రచలితంగా ఉన్న సామాజికాచారం ఆమెకు అడ్డు గోడైంది. ఆ రోజులలో సద్వంశాలలో పుట్టి ఆచారనిష్ఠులైన బ్రాహ్మణులు శూద్రుల చేత ప్రతిష్ఠింపబడిన దేవాలయాలలోని దేవతలను పూజించడం అనేది లేదు. చివరికి నమస్కారం కూడ చేసేవారు కారు. అంతేకాక, రాణి కుల గురువు వంశానికి చెందినటువంటి (అంటే శూద్రులపై యాజమాన్యం చేసే) బ్రాహ్మణులను సైతం పతితులుగా, శూద్రసమానులుగా భావించేవారు. కాబట్టి రాణి దేవాలయంలో అర్చకత్వం నిర్వహింప సదాచార సంపన్నులైన బ్రాహ్మణు లెవరూ అంగీకరించలేదు. కాని రాణి మాత్రం తన ఆశ కోల్పోక పూజారుల వేతనాన్ని, పారితోషికాదులను అధికంచేసి వారికై పలుచోట్ల అన్వేషించసాగింది.

శ్రీరామకృష్ణులను వరుసకు సోదరియైన శ్రీమతి హేమాంగినీదేవి ఇల్లు కామార్పుకూర్‌కు సమీపంలోని ఉన్న సిహోర్ గ్రామంలో ఉంది. అక్కడ చాలా

12. మహేశ్‌చంద్ర ఛటోపాధ్యాయ పూజారులను సమకూర్చే బాధ్యత వహించడం

మంది బ్రాహ్మణులుండేవారు. ఈ గ్రామానికి చెందిన మహేశ్‌చంద్ర ఛటోపాధ్యాయ అనే బ్రాహ్మణుడు ఆ కాలంలో రాణి వద్ద ఉద్యోగిగా పనిచేసేవాడు. రాణీ రాస్మణి దేవాలయానికి పూజారులను, వంటవారిని వెతికి సమకూర్చితే నాలుగు డబ్బులు తనకు లభించవచ్చని భావించో ఏమిటో, ఆ పనిని చేయడానికతడు ముందుకు వచ్చాడు. రాణీగారి దేవాలయంలో పనిచేయడం అనుచితం కాదనే సంగతి గ్రామంలోని బ్రాహ్మణులకు తెలుపడానికి మొట్ట

మొదట అతడు తన అన్న క్షేత్రనాథ్‌ను శ్రీశ్రీ రాధాగోవింద మందిరంలో పూజారిగా నియమించాడు. ఇలా తన కుటుంబానికే చెందిన ఒక వ్యక్తిని రాణి కొలువులో నియమించడం ద్వారా ఇతర బ్రాహ్మణులను తీసుకొచ్చే పని చాలావరకు సులభమైంది. కాని ఎంత ప్రయత్నించినా కాళికాలయంలో పూజ చేయడానికి యోగ్యుడైన పూజారి లభించక ఎంతో ఆదుర్దాపడ్డాడు.

13. పూజారి బాధ్యత వహించమని రాణి రాంకుమార్‌ను కోరడం

రాంకుమార్ భట్టాచార్యతో మహేశ్‌కు చాలాకాలం నుండి పరిచయ ముంది. గ్రామ ఆచారం మేరకు వారి మధ్య ఒక విధమైన పరిచయం ఏర్పడి ఉంటుందని ఊహించవచ్చు. రాంకుమార్ భక్తసాధకుడని, శక్తిమంత్ర దీక్షను స్వీకరించాడనే విషయం మహేశ్‌కు తెలియకుండా ఉండదు. అలాగే అతడి కుటుంబ అస్తవ్యస్త స్థితి గురించి కూడ మహేశ్‌కు కొంచెం తెలిసేవుంటుంది. కనుక కాళీ దేవాలయ పూజారికోసం వెతుకుతున్నప్పు డతడి దృష్టి రాంకుమార్ వైపు మళ్లింది. కాని మరుక్షణమే అతడికి రాంకుమార్ శూద్రుల యజమాన్యాన్ని ఒప్పుకొనే బ్రాహ్మ ణుడు కాడనే విషయం తట్టింది. అతడు కలకత్తాకొచ్చి దిగంబర్‌మిత్ర మొదలైన కొందరి ఇళ్లల్లో పూజాదులు చేయడానికి సమ్మతించినా కైవర్తక (అగ్నికుల క్షత్రియ) జాతిలో జన్మించిన రాణి దేవాలయంలో పూజ చేయడానికి ఒప్పు కుంటాడా? సందేహమే! ఆలయ ప్రతిష్ఠాపనోత్సవ దినం సమీపించింది. కాని యోగ్యుడైన పూజారి ఎవరూ కన్పించలేదు. అంతా ఆలోచించి కనీసం ఒక్క సారైనా ప్రయత్నించి చూడడం యుక్తమని భావించాడు మహేశ్. కాని ఈ విష యంలో స్వయంగా ముందుకుపోక, అతడు మొదట రాణి దగ్గరకు వెళ్లి విష యాలన్నింటినీ వివరించి కనీసం ప్రతిష్ఠాపనదినమైనా వచ్చి పూజారి పదవి స్వీక రించి ప్రతిష్ఠాపనోత్సవ కార్యాలన్నింటినీ చక్కగా ముగించడానికి రాంకుమార్‌ను ఆహ్వానించవలసిందని ఆమెతో చెప్పాడు. రాంకుమార్ నుండి శాస్త్రాభి ప్రాయాన్ని పొందినప్పటి నుండి అతడి యోగ్యతపట్ల ఎంతో గౌరవభావం రాణి మనస్సులో నెలకొంది. కనుక అతడిప్పుడు పూజారి పదవిని వహించే అవకాశం ఉండడం చూసి ఎంతో ఆనందించి, ఎంతో వినయంతో అతడికి ఇలా లేఖ వ్రాసింది: "మీరు వెలిబుచ్చిన శాస్త్రాభిప్రాయం మద్దతుతోనే జగన్మాతను ప్రతిష్ఠించడానికి నేను ముందడుగు వేస్తున్నాను. రానున్న స్నానయాత్ర పండుగ నాడు ఈ పుణ్యకార్యాన్ని నిర్వర్తింప సన్నాహాలన్నీ సిద్ధం చెయ్యడమైంది. రాధాగోవింద ఆలయానికి పూజారి లభించాడు. కానీ, కాళికామాత పూజారి పదవి వహించి ప్రతిష్ఠాపనోత్సవాన్ని నెరవేర్చడంలో నాకు సహాయం చేయడానికి యోగ్యుడైన బ్రాహ్మణుడు ఎవడూ ముందుకు రావడంలేదు. కనుక ఈ



కాళికాలయం

విషయంలో మీరే సత్వరం ఒక దారి చూపి నన్ను గట్టెక్కించాలి. మీరు పండితులు, శాస్త్రజ్ఞులు. కనుక యోగ్యతలేని వారిని పూజారులుగా నియమించకూడదనే విషయం మీకు చెప్పనక్కర్లేదు.''

రాణి వ్రాసిన ఆ అభ్యర్థన లేఖను తీసుకుని మహేశ్ స్వయంగా రాంకుమార్ వద్దకు వెళ్లి పరిస్థితులను అతడి కెన్నోరీతుల నచ్చజెప్పి తగిన పూజారి దొరికే వరకు ఆ బాధ్యత నిర్వహించడానికి అతణ్ణే ఒప్పించాడు. భక్తితత్పరుడు, లోభరహితుడైన రాంకుమార్ జగన్మాత ప్రతిష్ఠాపనోత్సవం ఆగిపోరాదనే ఉద్దేశంతో మొదటిసారిగా దక్షిణేశ్వరానికి వచ్చాడు.[1] తర్వాత అతడు రాణి,

1. రాంకుమార్ దక్షిణేశ్వరానికి రావడాన్ని గురించి పై కథను మేం శ్రీరామకృష్ణుల మేనల్లుడైన హృదయరామ్ ముఖోపాధ్యాయ్ నుండి విన్నాం. కాని గురుదేవుల అన్న కుమారుడైన రామలాల్ భట్టాచార్య కథనం మరో విధంగా ఉంది. కామార్పుకూర్‌కు సమీపంలోని దేశ్రా గ్రామస్థుడైన రామ్‌ధన్ ఘోష్ అనే వ్యక్తి రాణీ రాస్మణి జమీలో ఉన్నతాధికారి. కార్యదక్షుడు కనుక క్రమంగా అతడు రాణికి కార్యదర్శి అయ్యాడు. రాంకుమార్ అతడికి పరిచితుడు కావడంచేత కాళీ ఆలయ ప్రతిష్ఠాపన రోజు దక్షిణేశ్వరానికి వచ్చి బ్రాహ్మణాదుల కిచ్చే పారితోషికాదులను స్వీకరించి వెళ్లమని అతడికి ఆహ్వానపత్రికను పంపాడు. కాని రాంకుమార్ జాన్ బజారులోని రాణి ఇంటికి వచ్చి, ''రాణి కైవర్తజాతికి చెందినది. మేము కులీన బ్రాహ్మణులం. ఆమె నుండి దానాదులను గ్రహిస్తే జాతి బహిష్కృతులు కాగలం'' అని రామ్‌ధన్‌తో చెప్పాడట. రామ్‌ధన్ అప్పుడు అతడికొక జాబితా చూపించి ''ఎంతమంది బ్రాహ్మణోత్తములు ఆహ్వానింపబడ్డారో చూడు. వీరందరూ వచ్చి రాణి నుంచి దానాదులు పరిగ్రహిస్తారు'' అని చెప్పాడు. దాంతో దానాలు గ్రహించడానికి ఒప్పుకుని రామకృష్ణులతో కలిసి ప్రతిష్ఠాపన దినానికి ముందురోజు దక్షిణేశ్వరానికి వచ్చాడు రాంకుమార్. జాతర, కాళీకీర్తనం, భాగవత పఠనం, రామాయణ కథ, భజన, మేళతాళాలతో కాళికాలయం ఆ పండుగ రోజులలో

→

మధురనాథ్ వినయపూర్వకంగా బ్రతిమలాడడంతోనూ, యోగ్యుడైన పూజారి ఇంకా దొరకకపోవడం చూసీ జీవితాంతం అక్కడే ఉండిపోయాడు. ఈ ప్రపంచంలో ప్రతి కార్యం జగన్మాత ఇచ్ఛానుసారమే జరుగుతుంది. దేవీభక్తుడైన రాంకుమార్ తాను ఆలయ పూజారిని కావడం జగన్మాత ఇచ్ఛగా భావించి ఒప్పుకున్నాడేమో ఎవరు చెప్పగలరు?

14. దేవిని రాణి ప్రతిష్ఠించడం

ఇలా తలవని తలంపుగా రాంకుమార్‌ను పూజారిగా పొంది 1855వ సంవత్సరం మే 31వ తేదీ గురువారం స్నానయాత్ర పండుగ దినాన రాణీ రాస్మణి కొత్త ఆలయంలో జగన్మాత ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆనందోత్సాహంతో జరిపింది. ఆ సందర్భంగా అక్కడ "దీయతాం, భుజ్యతాం" (ఇవ్వండి, తినండి) అనే కేకలతో రాత్రి, పగలు ఎడతెరిపి లేకుండా ఆలయమంతా కోలాహలంతో వెల్లివిరిసింది. రాణీ రాస్మణి ఆ సమయంలో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి అతిథులందర్నీ సమానంగా ఆదరించి ఆనందించిందని మేం విన్నాం. రాణిచే ఆహ్వానితులైన పలువురు వేద పండితులు, బ్రాహ్మణులు దక్షిణేశ్వరానికి వేంచేశారు. ఆ రోజున వారిలో ప్రతి ఒక్కరూ పట్టువస్త్రం, ఉత్తరీయం, దక్షిణ రూపంగా ఒక బంగారు నాణం పొందారు. దేవాలయ నిర్మాణానికి, ప్రతిష్ఠాపనోత్సవానికి 9 లక్షల రూపాయలు రాణి ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఆమె 2 లక్షల 26 వేల రూపాయలకు త్రైలోక్యనాథ్ ఠాకూర్ నుండి దినాజ్‌పూర్ జిల్లాలో ఠాకూర్ తాలుకాలోని శాల్‌బారీ పరగణా కొనుగోలుచేసి కాళికాలయాదుల పూజాసేవాదుల కోసం దానిని దానపత్రంగా వ్రాసి ఇచ్చింది.

15. ప్రతిష్ఠాపన నాడు శ్రీరామకృష్ణుల ప్రవర్తన

రాంకుమార్ భట్టాచార్య ఆ రోజు బియ్యం, పప్పు మొదలైన ఆహారపదార్థాలను ఆలయ భాండారం నుండి పుచ్చుకొని గంగానదీ తీరాన స్వయంగా వంట చేసుకుని, దానిని తన ఇష్టదేవతకు నివేదించి తర్వాత ప్రసాదాన్ని ఆరగించాడని కొందరంటారు. కాని మా కిది అసంభవంగా తోచింది. ఎందుకంటే అతడు దేవీ భక్తుడు. అంతేకాక, ఈ

→ ఆనందసాగరంలో తేలిపోయింది. రాత్రి అక్కడ ఆ ఆనందామృతం ఏ విఘ్నమూ లేకుండా కొనసాగింది. అసంఖ్యాకమైన దీపాలు ఆలయం నలుదిశలా వెలిగించడంతో రాత్రి కూడా పగలులా తోచింది. దానిని గురించి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: "ఆ సమయంలో దేవాలయాన్ని చూస్తే రాణి వెండికొండను ఎత్తుకుని వచ్చి ఇక్కడ అమర్చిందేమో అని అనిపించింది." ఈ ఆనందోత్సవాన్ని దర్శించడానికి రాంకుమార్ ప్రతిష్ఠాపన దినోత్సవ దినానికి ముందురోజే కాళికాలయానికి వచ్చాడు.

రామ్‌లాల్ భట్టాచార్య కథనాన్ని బట్టి చూస్తే, రామ్‌ధన్, మహేశ్ - ఈ ఇద్దరి ప్రార్థనతో రాంకుమార్ దక్షిణేశ్వరానికి వచ్చి అర్చక పదవి స్వీకరించాడని తెలియవస్తోంది.

విషయాన్ని గురించి లిఖితపూర్వకంగా శాస్త్రవిధానాన్ని రాంకుమార్ స్వయంగా ఇచ్చాడు. అలాంటప్పుడు తానే దేవి కర్పించిన ప్రసాదాన్ని నిరాకరించి తన అభిప్రాయానికి, భక్తిశాస్త్రాలు నిర్దేశించిన మార్గానికి విరుద్ధమైన పనిని చేసి వుంటాడని భావించడం ఎంతో అసమంజసం. శ్రీరామకృష్ణుల నుండి కూడ మేం అటువంటిదేమీ వినలేదు. కనుక పూజ ముగిసిన తరువాత జగన్మాత ప్రసాదాన్ని అతడు మహదానందంతో స్వీకరించాడనే మా అభిప్రాయం. శ్రీరామ కృష్ణులు ఆ ఆనందోత్సవంలో హృదయపూర్వకంగా పాల్గొన్నారు. కాని భోజన విషయంలో మాత్రం తన నియమాన్ని ఆయన సడలించలేదు. ఆనాటి సాయం కాలం ఆయన సమీప బజారు నుండి మరమరాలు, బెల్లం కొనుక్కుని తిని ఝామపుకూర్ బడికి నడిచివెళ్లి రాత్రి అక్కడే విశ్రమించారు.

16. కాళికాలయ ప్రతిష్ఠాపన గురించి శ్రీరామకృష్ణుల అభివర్ణన

దక్షిణేశ్వరంలో రాణీ రాస్మణి కాళికాలయ నిర్మాణం గురించి గురుదేవులు స్వయంగా మా కెన్నో సందర్భాల్లో ఎన్నో విషయాలు చెబుతుండేవారు. "రాణీ రాస్మణి కాశీక్షేత్రానికి పోవడానికి ఏర్పాట్లన్నీ సిద్ధం చేసు కుంది. బయలుదేరడానికి ఒక మంచిరోజు కూడ నిర్ణ యించుకుంది. ఆవశ్యకమైన వస్తు సంబారాలను తీసుకు వెళ్లడానికిగాను చిన్నాపెద్ద దాదాపు వంద పడవలు ఘాట్‌లో నిలిచిఉన్నాయి. కాని నిర్ణీత దినానికి ముందురోజు రాత్రి తీర్థయాత్రకు వెళ్లవద్దనే దేవి ఆదేశం పొంది రాణి తన సంకల్పాన్ని విడిచిపెట్టింది. తర్వాత ఆమె ఆలయ నిర్మాణానికి అనువైన స్థలం కోసం ప్రయత్నించసాగింది" అని శ్రీరామకృష్ణులే ఇలా కొనసాగించారు.

"గంగానది పశ్చిమతీరం కాశీతో సమానం అనే నమ్మకంతో మొదట ఆమె బాలి, ఉత్తర పాడా మొదలైన పశ్చిమతీర గ్రామాలలో వెతకసాగింది. కాని స్థలం లభించలేదు! ఎంత ధనం కావలసినా ఇవ్వడానికి రాణి సిద్ధంగా ఉన్నా అక్కడి భూస్వాములు తమ స్థలాలను అమ్మడానికి అంగీకరించలేదు.[1] ఎందుకంటే తమ స్థలాల్లో ఇతరులు నిర్మించిన ఘట్టాల నుండి గంగానదికి వెళ్లడానికి వారు ఇష్టపడలేదు. కనుక గత్యంతరంలేక గంగానదికి తూర్పు దిశన ఉన్న ఈ స్థలాన్నే రాణి కొనుగోలు చేయవలసి వచ్చింది.

"రాణి ఎనుకొన్న ఈ స్థలంలోని కొంతభాగం ఒక ఆంగ్లేయునికి చెందినది. మిగిలిన భాగంలో మహమ్మదీయుల శ్మశానం ఒకటి ఉండేది. అది

---

1. ఇప్పటికీ ఈ విషయాన్ని రూఢిపరిచే బాలి, ఉత్తర పాడా వయోవృద్ధులు జీవించే ఉన్నారు.

మహమ్మదీయ ఫకీరుకు చెందినది. ఈ స్థలం తాబేలు వెన్ను వంటి ఆకారంలో ఉంది. తంత్రశాస్త్రాల ప్రకారం అటు వంటి స్థలం శక్తిప్రతిష్ఠకు, దేవీసాధన లకు అత్యంత ప్రశస్తమైంది. కనుక భగవ దిచ్ఛాధీనంతోనే రాణి ఆ స్థలాన్ని క్రయం చేసిందని భావించవచ్చు.''

మళ్లీ అదే విషయం ప్రస్తావిస్తూ దేవీప్రతిష్ఠాపనను శాస్త్రాలు నిర్దేశించిన ఇతర ప్రశస్తదినాలలో చేయక విష్ణువుతో సంబంధించిన స్నానయాత్ర పండుగ రోజు రాణి చేయడానికి కారణం గురించి ఆయన అప్పుడప్పుడు చెప్పే వారు. ''దేవీ విగ్రహాన్ని రూపొందించ డానికి మొదలుపెట్టిన రోజు నుంచి రాణి

భవతారిణి కాళి

కఠోర తపస్సు చేయసాగింది. త్రిసంధ్యలలో స్నానం, హవిష్యాన్నం, నేల మీద పరుండడం, సాధ్యమైనంత వరకు పూజ, జప, ధ్యానాదులు చేయసాగింది. ఆలయం, దేవీ విగ్రహం నిర్మాణాలు పూర్తయినా ప్రతిష్ఠాపనోత్సవం కోసం మంచిరోజును నిర్ణయించడం నెమ్మదిగా జరుగుతూవచ్చింది. ఏ విధమైన ఆటం కమూ వాటిల్లకుండా ఉండడానికి దేవీవిగ్రహం ఒక పెట్టెలో భద్రపరచబడింది. కాని ఏదో ఒక కారణంగా విగ్రహం చెమర్చింది. స్వప్నంలో రాణికి దేవి ఆదేశ మిచ్చింది: ''ఎంతకాలం నన్నిలా కట్టిఉంచుతావు? నాకు ఊపిరాడడం లేదు. వీలైనంత త్వరలో నన్ను ప్రతిష్ఠించు.'' ఈ విధంగా దేవి ఆజ్ఞాపించడంతో దేవిని ప్రతిష్ఠించడానికి రాణి ఆందోళనపడింది. మంచిరోజు కోసం తాపత్రయపడింది. ఇలా స్నానయాత్ర, పూర్ణిమ దినానికి ముందు మరో శుభముహూర్తమేదీ లేకపోవడంతో ఆ రోజే దేవీ ప్రతిష్ఠాపన చేయడానికి ఆమె సంకల్పించింది.''

ఈ విషయాలే కాకుండా దేవికి అన్న నైవేద్యాన్ని అర్పించడాని కోసం మందిరాన్ని రాణి తన గురువుగారి పేరిట సంప్రోక్షించడం వంటి మరెన్నో సంగ తులు గురుదేవుల ముఖతా మేం విన్నాం. హృదయ్‌రాం ముఖోపాధ్యాయ నుండి రెండు విషయాలను గురించి మాత్రమే విన్నాం. అవి: ఆలయ ప్రతిష్ఠాపనకు సంబంధించిన శాస్త్రీయవిధానాన్ని మాత్రమే రాంకుమార్ ఇచ్చాడనీ, రెండవది రాంకుమార్ తాను దేవి ఆలయంలో పూజారి బాధ్యతను స్వీకరించడం ధర్మ

సమ్మతమే అనీ శ్రీరామకృష్ణులకు నచ్చచెప్పడానికిగాను 'ధర్మపత్ర'ను ఉపయో గించవలసి ఉండడం!

దక్షిణేశ్వరంలోని కాళికాలయంలో చిరకాలం పూజారిగా ఉండే ఉద్దేశం రాంకుమార్ భట్టాచార్య మనసులో మొదట్లో లేదనే సంగతి మనం ఈ సమ యంలో శ్రీరామకృష్ణుల ప్రవర్తన చూసి తెలుసుకోవచ్చు. కొంచెం ఆలోచించి చూస్తే సరళ హృదయుడైన రాంకుమార్ కూడ ఆ విషయాన్ని అప్పుడు అర్థం చేసుకోలేదని మనం గ్రహించగలం. దేవికి అన్ననైవేద్యం సమర్పించే విషయంలో శాస్త్రీయవిధానాన్ని ఇచ్చి, ప్రతిష్ఠాపన దినాన మాత్రం స్వయంగా వండిన అన్న నైవేద్యం దేవికి సమర్పించి, ఆ తర్వాత ఝామపుకూర్‌కు తిరిగిపోవాలనే అతడు భావించాడు. దేవికి అన్ననైవేద్యం నివేదించడంలో అతడి కెలాంటి సంకోచమూలేదని, తానెటువంటి తప్పుగానీ శాస్త్రవిరుద్ధమైన కార్యంగానీ చేస్తున్నాననే తలంపూ అతడిలో కలగలేదనే సంగతిని ఆ సమయంలో రాంకుమార్ తన చిన్నతమ్ముడితో మెలగిన విధానాన్నిబట్టి మనం సులభంగా గ్రహించవచ్చు.

ప్రతిష్ఠ జరిగిన మరుసటి ఉదయమే అన్ని విషయాలూ తెలుసుకోవ డానికో లేదా ఇంకా మిగిలివున్న ప్రతిష్ఠాపన కార్యాలను చూడాలనో శ్రీరామ కృష్ణులు దక్షిణేశ్వరానికి వచ్చారు. కొంతసేపు అక్కడున్న తర్వాత అన్న ఆ రోజు ఇక ఝామపుకూర్‌కు తిరిగి వచ్చే అవకాశం లేదని గ్రహించారు. కనుక ఆ రోజు అక్కడే ఉండిపొమ్మని అన్న ఎంత చెప్పినా వినక భోజన సమయానికల్లా ఆయన ఝామపుకూర్‌కు తిరిగి వెళ్లారు. దీని తర్వాత అయిదారు రోజుల వరకు వారు మళ్లీ దక్షిణేశ్వరానికి వెళ్లలేదు. ఆలయ ప్రతిష్ఠాపన కార్యాలన్నీ పూర్తిచేసుకుని అన్న యథాసమయంలో ఝామపుకూర్ తిరిగివస్తాడని భావించి అక్కడే ఉండిపోయారు. కాని వారం రోజులు గడచినా అన్న తిరిగి రాకపోవడంతో పరి పరి ఆలోచనలతో మనసు ఆందోళనపడింది. దాంతో ఉండబట్టలేక మళ్లీ దక్షి ణేశ్వరం వచ్చారు. రాణీ రాస్మణి ప్రోద్బలంతో జగజ్జనని పూజారిగా అక్కడే జీవనం గడపడానికి అన్న అంగీకరించాడనే వార్త శ్రీరామకృష్ణుల చెవిన పడింది. ఆయన మనసులో అప్పుడెన్నో ఆలోచనలు చెలరేగాయి. తమ తండ్రి శూద్రుల యాచకత్వాన్ని ఏనాడూ చేయలేదని, విచక్షణ లేకుండా అందరి నుండి దానాదులు గ్రహించేవారు కాదనే సంగతిని ఆయన అన్నకు జ్ఞప్తికి తెచ్చారు. అన్న పూజారి పదవిని స్వీకరించకుండా ఉండేందుకు ప్రయత్నించారు. అప్పుడు రాంకుమార్ తను చేసింది శాస్త్రయుక్తమేనని చెప్పడానికి ప్రయత్నించాడని వినికిడి. కాని ఎంత చెప్పినా అది శ్రీరామకృష్ణుల హృదయానికి హత్తుకోకపోవ

డంతో తుదకు 'ధర్మపత్ర'[1] అనుష్ఠానపు సరళోపాయాన్ని అనుసరించారు. రాంకుమార్ పూజారి పదవి అంగీకరించి ఎటువంటి నిందిత కర్మ చేయ లేదు, అది అందరికీ మంగళకరం అనే తీర్పు ధర్మపత్ర నుండి లభించిందని విన్నాం.

ధర్మపత్ర నిర్ణయాన్ని స్వీకరించడంవల్ల ఆ విషయాన్ని గురించిన వ్యథ గురుదేవుల మనసు నుండి తొలగిపోయింది. కాని మరో చింత ఆవరించింది.

17. ఆహార విషయంలో గురుదేవుల కఠోర నియమం

పూజారి పదవిని అన్న స్వీకరించడంతో ఆయన స్థాపించిన పాఠశాల ఇప్పుడు మూతబడింది. ఇక తానక్కడ చేయ గలిగినదేమిటి? అనే సంగతి ఆలోచిస్తూ ఆయన ఆ రోజు దక్షిణేశ్వరంలోనే ఉండిపోయారు. కాని అన్న ప్రేమగా ఎంత బ్రతిమలాడినా కూడ ఆలయంలో ప్రసాదం స్వీకరించడానికి మాత్రం ససేమిరా ఒప్పుకోలేదు. "ఇది దేవాలయం. ఆహారం గంగాజలంతో వండి జగజ్జననికి అర్పించబడింది. కనుక నువ్వు ప్రసాదం తీసుకోవడంలో దోషమేమీలేదు" అని రాంకుమార్ నచ్చ జెప్ప చూశాడు. కాని అన్న మాటలను శ్రీరామకృష్ణులు పట్టించుకోలేదు. "అలా అయితే మందిరభాండారం నుంచి ఆహారపదార్థాలు తీసుకుని గంగాతీరాన పంచ వటి కింద నువ్వే వండుకుని తిను. గంగాతీరంలోని వస్తువులన్నీ పవిత్రా

---

1. 'ధర్మపత్ర' అంటే ధర్మాన్ని, న్యాయాన్ని నిర్ణయాన్ని తెలిపే పత్రం. ఏదైనా విషయంపై యుక్తియుక్తత ద్వారా నిశ్చిత నిర్ణయానికి రాలేకపోయినప్పుడు విధినిర్ణయాన్ని తెలుసుకోవడా నికి ధర్మపత్ర నుపయోగించే పద్ధతి ఇప్పుడు కూడ గ్రామాలలో కన్పిస్తూంటుంది. ధర్మపత్ర నుండి ఇలా లభించిన తీర్మానాన్ని గురించి మళ్లీ తర్కించకుండా వారు ఆచరిస్తారు. దానిని ఉపయోగించే విధానం ఇది:

ఏదైనా విషయాన్ని చేయాలా వద్దా అనే నిర్ణయానికి రాలేకపోయినప్పుడు రెండు మారే డాకుల మీదో లేక రెండు తెల్ల కాగితాలపైనో 'అవును, కాదు' అని రాసి వాటిని ఓ కుండలో పెడతారు. తర్వాత ఓ చిన్నపిల్లవాణ్ణి పిలిచి ఆ రెండింటిలో ఒకటి తీయమంటారు. అలా లభించిన సమాధానాన్ని భగవదిచ్ఛగా అంగీకరించి తదనుసారంగా ఆచరిస్తాను. ఆస్తిపాస్తులు పంచుకునేప్పుడుకూడ కొన్నిసార్లు ధర్మపత్రను ఉపయోగిస్తారు. ఉదాహరణకు నలుగురు అన్నదమ్ములు ఒక కుటుంబంలో ఉన్నారనుకోండి. వారు ఆస్తిపాస్తులు పంచుకొని విడిగా ఉండాలనే నిర్ణయానికి వస్తారనుకోండి. కాని ఎవరికి ఏ భాగం దక్కాలనే విషయమై అభిప్రాయ భేదాలు తలెత్తుతాయి. అటువంటి సందర్భంలో ఊరి పెద్దలు చేరి సాధ్యమైనంతవరకు ఆ ఆస్తిపాస్తులు సరిసమంగా పంచుతారు. తర్వాత రెండు కుండలు తెప్పించి ఒకదానిలో నలుగురు సోదరుల పేర్లున్న నాలుగు పత్రాలు, రెండోదానిలో నాలుగు భాగాలున్న పత్రాలుపెట్టి ఇద్దరు పసిపిల్లలను పిల్చి ఒక్కొక్కరితో ఒక్కొక్క కుండనుండి పత్రాలు తీయిస్తారు. ఇలా ఎవరి పేరున ఏ భాగం వస్తుందో దానిని వారు భగవన్నిర్ణయంగా స్వీకరిస్తారు.

లవుతాయని నువ్వు అంగీకరిస్తావు గదా?'' అని రాంకుమార్ అన్నాడు. ఆహారాన్ని గురించి గురుదేవుల కఠోర నియమం ఇప్పుడు ఆయన గంగపట్ల గల భక్తి ముందు - తల వంచుకోవలసి వచ్చింది. పండితుడైన రాంకుమార్ యుక్తి తర్కాలచే చేయలేకపోయిన కార్యాన్ని గంగానదిపట్ల గల శ్రీరామకృష్ణులకున్న భక్తి ప్రపత్తులు చేయగలిగాయి. అన్న చెప్పిన దానికంగీకరించి రోజూ స్వయంగా వండుకుని గురుదేవులు దక్షిణేశ్వరంలో ఉండసాగారు.

18. శ్రీరామకృష్ణుల గంగాభక్తి

జీవితాంతం శ్రీరామకృష్ణులకు గంగానదిపై ప్రగాఢ భక్తి ఉండేది. గంగాజలాన్ని ఆయన 'బ్రహ్మవారి' - ''నిత్యశుద్ధ బ్రహ్మమే జీవుణ్ణి పవిత్రం చేయడానికి నీళ్లరూపం దాల్చిం'' దని చెబుతుండేవారు. ''గంగా తీరాన నివసించేవారి మనసులు దేవతల మనస్సులలా అవుతాయి. వారిలో ఆధ్యాత్మికత సహజంగానే పెంపొందుతుంది. గంగానది పవిత్ర బాష్పకణాలతో నిండిన గాలి రెండు తీరాలలో ఎంతదూరం వీస్తుందో ఆ ప్రదేశమంతా పవిత్రమౌతుంది. అంతేకాదు. ఆ ప్రదేశవాసుల జీవితాలలో సదాచారం, భగవద్భక్తి, ఆధ్యాత్మికనిష్ఠ, దానశీలత, తపస్సు మొదలైన సద్గుణాలు గంగాదేవి అనుగ్రహంతో, కృపతో సహజంగానే అభివ్యక్తమవుతాయి'' అని చెప్పేవారు. చాలాసేపు ప్రాపంచిక విషయాలు మాట్లాడి వచ్చిన వాడిని గానీ లేదా ప్రాపంచికుల సంసర్గం చేసి వచ్చిన వాడిని గానీ చూస్తే - 'కొంచెం గంగాజలాన్ని తాగిరా' అని గురుదేవులు అనేవారు. భగవద్భక్తిలేని ప్రాపంచికుడైనవాడు ఆలయంలో ఎక్కడైనా కూర్చుని ప్రాపంచిక విషయాల గురించి ఆలోచిస్తూ ఆ స్థలాన్ని కలుషితం చేస్తే ఆ చోట గంగాజలాన్ని చిలకరించేవారు. ఎవరైనా శౌచకర్మలకు గంగాజలాన్ని ఉపయోగిస్తే శ్రీరామకృష్ణులు ఎంతో బాధపడేవారు.

19. శ్రీరామకృష్ణులు స్వయంగా వండుకుని జీవించడం

మనోహరమైన గంగానదీ తీరం, పక్షుల కిలకిలారావాలతో కూడిన పంచవటి చుట్టూ రమణీయమైన ఉద్యానం, సువిశాల సుందర దేవాలయంలో పరమభక్తుడు, సాధకుడైన రాంకుమార్ నిర్వర్తిస్తున్న దేవీ పూజాదిసేవలు, ధార్మికుడైన పెద్దన్న పవిత్రప్రేమ, పరమ భక్తురాలు దేవ ద్విజ పరాయణురాలైన రాణీ రాస్మణి, ఆమె అల్లుడు మథుర్‌బాబుల శ్రద్ధాభక్తులు - వీటితో కూడిన దక్షిణేశ్వర కాళికాలయం శ్రీరామకృష్ణులకు రెండవ కామార్పుకూర్‌లా త్వరలోనే అగపడసాగింది. మరికొంత కాలం వరకు ఆయన స్వయంగా వండుకుని భోజనం చేస్తూ ఆనందంగా గడపసాగారు. భవిష్యత్ కర్తవ్యాన్ని గురించి మొదట్లో ఆయనకున్న చింత ఇప్పుడు తొలగిపోయింది.

20. సంకుచితత్వం, ధార్మికనిష్ఠ - వీటి తారతమ్యం

పైన తెలిపిన ఆహారవిషయంలో శ్రీరామకృష్ణులకున్న నియమం విని కొందరు ఇలా అనుకోవచ్చు: 'అటువంటి సంకుచిత భావం సాధారణంగా మనవంటి వారిలో కనిపిస్తూ ఉంటుంది. శ్రీరామకృష్ణులలో కూడ ఆ సంకుచిత భావం ఉందని పేర్కొనడం ద్వారా ఈ విధమైన సంకుచితత్వం లేకపోతే ఆధ్యాత్మిక మార్గపు చరమలక్ష్యాన్ని చేరడం అసంభవం అని మాతో చెప్పదలిచారా? ఏమిటి?'

అందుకు మా సమాధానం: ''సంకుచితత్వం, ధార్మిక నిష్ఠ - ఈ రెండూ వేర్వేరు విషయాలు. సంకుచితత్వానికి మూలం అహంకారం. అది ఆవరించినప్పుడు మనిషి తానేది అర్థం చేసుకుంటాడో, తానేమి చేస్తుంటాడో అదే సర్వోత్తమమైనదనే భ్రమలోపడి తనచుట్టూ తానే ఒక పరిధిని గీసుకుని నిశ్చింతుడై దాన్లోనే ఉండిపోతాడు. కాని ధార్మికనిష్ఠ తద్విరుద్ధం. శాస్త్రాలు, మహాత్ములు నిర్దేశించినదాన్ని విశ్వసించడం ద్వారా ఈ నిష్ఠ కలుగుతుంది. తన హృదయంలో నిష్ఠ ఉదయించడం ద్వారా మనిషి తన అహంకారాన్ని చూర్ణంచేసి ఆధ్యాత్మిక జీవనంలో ముందడుగువేస్తూ పరమసత్యాన్ని సాక్షాత్కరించుకుంటాడు. క్రమంగా ఈ నిష్ఠ ప్రాధాన్యం వహించినప్పుడు మనిషి మొదట్లో కొంతకాలం దాకా సంకుచితుడిగానే కనిపిస్తాడు. కాని దాని సహాయంతో తన జీవనమార్గంలో క్రమక్రమంగా స్పష్టమైన వెలుగును గాంచుతాడు. తన సంకుచితత్వం దానంతట అదే అంతరించిపోతుంది. కనుక ఆధ్యాత్మిక ప్రగతి మార్గంలో ధార్మికనిష్ఠ అత్యంత ఆవశ్యకం అని గ్రహించాలి. పైన చెప్పినట్టు శ్రీరామకృష్ణుల జీవితంలో ఉన్నటువంటి ధార్మికనిష్ఠను చూసి మనం స్పష్టంగా అర్థం చేసుకోవలసిందేమిటంటే శాస్త్రాలు నిర్దేశిస్తున్న శాసనాలమీద ప్రగాఢ నిష్ఠావంతులమై మనం ఆధ్యాత్మిక సత్యాలను ప్రత్యక్షం చేసుకోవడానికి ఉత్సాహంతో ముందుకు వెళితే కాలక్రమంలో యథార్థమైన ఉదారతకు అధికారులమై పరమశాంతిని పొందగలం. అటువంటి నిష్ఠ శూన్యమైనప్పుడు ఆధ్యాత్మికమార్గంలో ముందంజ వేయలేం. శ్రీరామకృష్ణులు ఉపదేశించినట్లు ఒక ముల్లును ఇంకొక ముల్లుతో తీసెయ్యాలి. నిష్ఠను పాటించే మనం వాస్తవికమైన ఉదారత పొందగలం. నియమాలను, శాసనాలను అనుసరించడం ద్వారానే వాటికి అతీతమైన స్థితిని చేరగలం.''

శ్రీరామకృష్ణుల జీవిత యౌవనావస్థలో ఈ అసంపూర్ణతను గమనించి బహుశా కొందరిలా అనవచ్చు: ''అయితే ఆయనను అవతార పురుషుడనడం ఎందుకు? మనిషి అంటే చాలదా? లేదా ఆయనను అవతారమూర్తిగా చేయాలనే అనుకుంటే ఆ అసంపూర్ణతను కప్పిపెట్టడమే మంచిది.'' అందుకు మా

సమాధానం: ''సోదరా! దేవుడు మానవరూపాన్ని దాల్చి అవతరించడం సంభవమని కలలోనైనా మేం కూడ నమ్మలేని కాలం ఒకటి ఉండేది. కాని ఆయన అహేతుక కృప వల్ల అది సంభవమని మాకు వారు విశదపరిచినప్పుడు మానవ శరీరం ధరించినప్పుడు శారీరక దోషాలూ, మానసిక లోపాలూ వారు స్వీకరిస్తా రన్న విషయాన్ని గ్రహించగలిగాం. 'ఏదైనా మరో లోహంతో మిశ్రితం చేయ కుండా వట్టి బంగారంతో ఆభరణాలు చేయడం కష్టం. అలాగే విశుద్ధ సత్వ గుణంతో ఏ కొంతవరకైనా రజస్తమో గుణాలను కలపకపోతే మన శరీరాలను నిర్మించడం అసంభవం' అని గురుదేవులు అంటుండేవారు.

''గురుదేవులు తమ జీవితంలోని అసంపూర్ణతలను మా నుంచి ఏనాడూ దాచుకోవడానికి ప్రయత్నించి ఎరుగరు. అయినా పదేపదే వారు మా కెన్నోసార్లు ఇలా చెప్పేవారు: 'పూర్వయుగాలలో ఎవడు రాముడు, కృష్ణుడు, మొదలైన రూపాలలో అవతరించాడో అతడే ఇప్పుడు (తమ శరీరాన్ని చూపిస్తూ) ఈ ఒరలో అవతరించాడు. కాని ఈసారి, రాజు మారువేషం ధరించి నగర సంచారం చేసే రీతిలో గుప్తరూపంలో అవతరించాడు.' ''

5. పూజారిగా శ్రీరామకృష్ణులు

1. మొదటిసారి చూసినప్పటి నుండి శ్రీరామకృష్ణుల వల్ల మథుర్‌బాబు ఆకర్షణ

దేవాలయ ప్రతిష్ఠాపన జరిగిన కొన్ని వారాలలోపే శ్రీరామకృష్ణుల సౌమ్య మూర్తిత్వం, కోమల స్వభావం, ధర్మనిష్ఠ, చిన్నవయస్సు రాణీ రాస్మణి అల్లుడైన మథుర్‌బాబును అమితంగా ఆకర్షించాయి. జీవితంలో దీర్ఘకాలం ఎవరితో గాఢసంబంధం కలుగబోతోందో అటువంటి వ్యక్తిని మొదటిసారి చూసీ చూడగానే మానవ హృదయంలో ఒక ప్రేమాకర్షణ కలగడం మనకు కనిపిస్తుంది. పూర్వజన్మలలో కలిగిన సంబంధ సంస్కారాల నుండి అది కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. శ్రీరామకృష్ణులను చూసినప్పుడు మథుర్‌బాబు మనసులో కూడ బలీయమైన ఒక అలౌకికాకర్షణ కలిగిందనే సంగతి తదనంతర కాలంలో వారిద్దరి మధ్య ఒక సుదృఢ ప్రేమసంబంధం ఏర్పడడం చూసి మనం నిశ్చయంగా గ్రహించగలం.

మథుర్‌బాబు

ఆలయ ప్రతిష్ఠాపన అనంతరం తమ కర్తవ్యమేమీ నిశ్చయించుకోలేక అన్న సలహా ప్రకారం ఒక నెలరోజులు శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలోనే ఉండిపోయారు. మథుర్‌బాబు ఈలోపు దేవిని సువర్ణ భూషణాదులచే అలంకరించే పనిలో ఆయనను నియుక్తం చేయాలని సంకల్పించి రాంకుమార్‌కు ఆ విషయం తెలిపాడు. అతడప్పుడు తన తమ్ముడి మానసికావస్థను గురించి

మథుర్‌బాబుకు వివరించి, అతణ్ణి ఆ విషయంలో నిరుత్సాహపరిచాడు. కాని తన పట్టుదలను అంత తేలికగా విడిచిపెట్టే వ్యక్తి కాదు మథుర్. అతడావిధంగా తాత్కాలికంగా నిరాకరింపబడినా తన సంకల్పాన్ని కార్యరూపంలో నెరవేర్చడానికి తగిన అదను కోసం ఎదురుచూడసాగాడు.

2. శ్రీరామకృష్ణుల మేనల్లుడైన హృదయ్

శ్రీరామకృష్ణుల జీవితంతో గాఢసంబంధం కలిగిన మరో వ్యక్తి ఇప్పుడు దక్షిణేశ్వరానికి వచ్చాడు. అతడే శ్రీమతి హేమాంగిని (ఈమె శ్రీరామకృష్ణుల మేనత్త అయిన శ్రీమతి రామ్‌శీల కుమార్తె) కుమారుడైన హృదయ్‌రాం ముఖోపాధ్యాయ్! పైన వర్ణించిన సంఘటనకు కొన్ని నెలల క్రితం ఇతడు పనికోసం వెదకుతూ బర్ద్వాన్ పట్టణానికి వచ్చాడు. అతడి వయసు అప్పుడు పదహారేళ్లు! ఈ యువకుడు అక్కడ పరిచితులైన తన గ్రామస్థుల వద్ద ఉంటూ ఏదైనా పని దొరుకుతుందేమోనని ప్రయత్నం చేశాడు. కాని సఫలుడు కాలేదు. రాణీ రాస్మణి కొత్తగా నిర్మించిన దేవాలయంలో తన మేనమామలు గౌరవప్రదంగా ఉంటున్నారని అతడికి తెలిసింది. కనుక అక్కడికి వెళితే తన కోరిక నెరవేరగలదని భావించాడు. ఇక ఆలస్యం చేయక వెంటనే హృదయ్ దక్షిణేశ్వరానికివచ్చి, చిన్ననాటి నుండి సుపరిచితుడు, సమవయస్కుడు, తనకు మేనమామ అయిన శ్రీరామకృష్ణులతో ఆనందంగా కాలం గడపసాగాడు!

హృదయ్ స్ఫురద్రూపి, సుందరుడు, బలిష్ఠుడు. దేహం ఎలా సుదృఢంగా ఉందో అలాగే అతడి మనసు కూడ దృఢమైనది, భయరహితమైనది. అతడు కఠోరమైన పరిశ్రమ చేయగలడు. పరిస్థితుల కనుగుణంగా తన ప్రవర్తనను సులభంగా మార్చుకోగలడు. సమస్యలు ఎదురైనప్పుడు అతడు ఏ ఆందోళనా చెందక స్థిరంగా నిలబడడమేగాక వాటిని అతిక్రమించడానికి అద్భుతమైన ఉపాయాలు పన్నడంలో బహునేర్పరి. తన చిన్నమామను (శ్రీరామకృష్ణులను) అతడు హృదయపూర్వకంగా ప్రేమించాడు. ఆయనను సుఖపెట్టడానికి శారీరక యాతనల నెన్నిటినైనా అనుభవించడానికి వెనుకాడేవాడు కాదు. సర్వదా క్రియాశీలుడైన హృదయ్‌లో ధ్యానం

హృదయ్

చేసే భావం అణుమాత్రమైనా లేదని చెప్పవచ్చు. కనుక ప్రాపంచికులలా అతడి మనసు కూడ స్వార్థప్రయత్నం నుంచి ఎప్పటికీ విడివడలేక పోయేది. ఇప్పటి నుండి శ్రీరామకృష్ణులతో అతడి కేర్పడిన సంబంధాన్ని గురించి మనం ఎంత ఆలోచిస్తామో మనకంత స్పష్టమయ్యే సంగతి - తదనంతర కాలంలో అతడి జీవితంలో కనిపించే కొద్దిపాటి ధ్యానశీలత, నిస్వార్థ ప్రయత్నం - ఇవి అతనిలో కలగడం భావమయులైన శ్రీరామకృష్ణులతోడి నిత్యసాంగత్యం, అప్పుడప్పుడు అతడు వారి చేష్టలను అనుకరించడానికి చేసిన ప్రయత్నాల ఫలితమే అని. ఆహారవిహారాది అన్నివిధాలైన శారీరక వ్యవహారాల్లో పూర్తి ఉదాసీనత, సర్వదా చింతనాశీలత్వం, లేశమైనా స్వార్థపరత్వం ఉండనటువంటి శ్రీరామకృష్ణుల భావుక జీవనం రూపొందే కాలంలో శ్రద్ధావంతుడు, ధైర్యశాలి, ఉద్యమశీలుడు, కార్యదక్షుడు అయిన హృదయ్ వంటి ఎవరో ఒక వ్యక్తి సహాయం అత్యంత ఆవశ్యకం. జగన్మాత శ్రీరామకృష్ణుల సాధనకాలంలో హృదయ్ వంటి వ్యక్తిని వారితో అత్యంత సన్నిహిత సంబంధంతో అనుబంధం చేయడం ఈ కారణం వల్లనేమో? హృదయే లేకపోతే సాధనకాలంలో తమ శరీరం రక్షింపబడడం అసంభవమనే

---

1. పాఠకుల సౌకర్యార్థం శ్రీరామకృష్ణుల వంశవృక్షాన్ని ఈ కింద పొందుపరుస్తున్నాం.



సంగతిని శ్రీరామకృష్ణుల మా కెన్నోసార్లు చెప్పారు. కనుకనే శ్రీరామకృష్ణుల జీవితంతోపాటు హృదయ్ పేరు కూడ చిరస్థాయిగా నిలిచిపోయింది. కాబట్టే మా హృదయపూర్వక శ్రద్ధాంజలికి అతడు అర్హుడు.

హృదయ్ దక్షిణేశ్వరానికి వచ్చిన నాటికి శ్రీరామకృష్ణుల వయసు ఇర్వై సంవత్సరాలపైన కొన్ని నెలలు. హృదయ్‌ను తన సహచరునిగా పొందడంతో

3. హృదయ్ వచ్చిన సమయంలో శ్రీరామకృష్ణుల పరిస్థితి

ఆయన దక్షిణేశ్వర జీవితం చాలా సులభమై ఉంటుందని మనం ఊహించవచ్చు. ఇప్పటి నుండి ఇక తినడం, తిరగడం, పడుకోవడం, కూర్చోవడం మొదలైన పనులన్నీ ఆయన, హృదయ్ సహాయంతో చేయసాగారు. సదా బాలుని స్వభావంగల శ్రీరామకృష్ణుల చర్యలన్నీ సాధారణ లోకుల దృష్టిలో అర్థరహితంగా కనిపించేవి. కాని హృదయ్ మాత్రం వాటిని విమర్శించక పోవడమేకాక హృదయపూర్వకంగా వాటిని ఆమోదించేవాడు. ఆయన పట్ల సానుభూతి చూపేవాడు. తద్వారా అతడు శ్రీరామకృష్ణుల కత్యంత ప్రీతిపాత్రుడయ్యాడు.

హృదయ్ స్వయంగా మాకిలా చెప్పాడు: ''ఇప్పటి నుండి శ్రీరామకృష్ణుల పట్ల నేనొక అనిర్వచనీయమైన ఆకర్షణను అనుభవిస్తుండేవాడిని. సర్వదా నీడలా

4. శ్రీరామకృష్ణుల పట్ల హృదయ్ ప్రేమ

వారిని అనుసరిస్తూండేవాడిని. ఒక్క క్షణమైనా వారిని విడిచి ఎక్కడైనా ఉండాలంటే ఎంతో కష్టంగా ఉండేది. నిద్రించడం, తిరగడం, కూర్చోవడం - అన్నిటినీ ఒక్కరంగా చేసేవాళ్లం. కేవలం మధ్యాహ్నం మాత్రం కాసేపు ఇద్దరం వేరయ్యేవారం. ఎందుకంటే శ్రీరామకృష్ణులు ఆహారపదార్థాలు (బియ్యం, కూరగాయలు) తీసుకుని పంచవటిలో స్వయంగా వండుకుని తినేవారు. నేనేమో ఆలయంలో ప్రసాదాన్ని తినేవాణ్ణి. అయినా వారి వంటకు నేను అంతా సిద్ధంచేసిన తర్వాతే వెళ్లేవాణ్ణి. ఆయన ఇలా స్వయంగా వండుకొని భోజనం చేసినా కూడ ఆయన మనసు శాంతిని పొందేది కాదు. ఆహార విషయంలో ఆయన నిష్ఠ అంత కఠోరంగా ఉండేది. మధ్యాహ్నం ఆయన వండుకున్నా కూడ రాత్రి మాత్రం మా మాదిరిగానే జగజ్జననికి నివేదించిన లూచీ ప్రసాదాన్నే[1] తినేవారు. ఆ విధంగా లూచీలను తింటూ తింటూ ఆయన కళ్లు నీళ్లతో నిండడం నేను ఎన్నో సందర్భాలలో చూశాను. అంతేకాదు విచారంగా జగన్మాతనుద్దేశించి 'అమ్మా! నాచే కైవర్తక (అగ్నికుల క్షత్రియుల) అన్నాన్ని తినిపించావే' అంటూ వాపోయేవారు.

గురుదేవులు అప్పుడప్పుడు తానే స్వయంగా ఆ సమయంలో జరిగిన విషయాలు మా కీ విధంగా తెలిపేవారు: 'కైవర్తకుల అన్నాన్ని తినాలనే భావన

---

1. మైదాపిండితో పూరీలలా చేసే రొట్టెలు. వంగదేశంలో ఇవి ప్రసిద్ధం.

మనసులో మహాకష్టం కలిగించేది. బీదసాదలు ఎంతోమంది కూడ ఆ కారణంగా రాస్మణి గుడికి తినడానికి వచ్చేవారు కాదు. తినడానికి ఎక్కువ మంది రాకపోవడంతో అన్న ప్రసాదాన్ని ఎన్నోరోజులు ఆవులకు వేసేవారు. ఇంకా మిగిలినదాన్ని గంగలో పారవేయవలసివచ్చేది.'' అలా వండుకుని తినవలసిన ఆవశ్యకత ఎంతో కాలం ఉండలేదని గురుదేవులు, హృదయ్‌ల నుండి మేం విన్నాం. కాళికాలయంలో పూజారి పదవి నెంతకాలం వరకు శ్రీరామకృష్ణులు స్వీకరించలేదో అంత కాలం దాకా ఆయన అలా చేసివుంటారనే మా అభిప్రాయం. ఆలయ ప్రతిష్ఠాపన జరిగిన రెండు మూడు నెలల తర్వాత ఆయన కాళికాలయ పూజారి అయ్యారు.

5. శ్రీరామకృష్ణుల చర్యలను అవగతం చేసుకోలేని హృదయ్

శ్రీరామకృష్ణులు తననెంతో ప్రేమించే వారనే సంగతి హృదయ్‌కు తెలుసు. కాని ఆయన గురించి ఒక్క విషయం మాత్రం అర్థం కాలేదు. అదేమిటంటే - తాను పెద్దమామ అయిన రాంకుమార్ ఏదైనా పనిలో సహాయం చెయ్యడానికి వెళ్లిన సమయంలో, మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత విశ్రాంతి తీసుకునేటప్పుడు, సాయంకాలం తాను ఆరాత్రిక దర్శనానికి పోయినప్పుడు కొంతసేపు వరకు శ్రీరామకృష్ణులు ఎక్కడో మాయమైపోయేవారు. ఎంత వెతికినా కనిపించేవారు కాదు. ఒకటి రెండు గంటల తర్వాత ఆయన తిరిగొచ్చినప్పుడు అడిగితే ఇక్కడే ఉన్నానంటూ అస్పష్టంగా జవాబు చెప్పేవారు. ఒక్కోరోజు ఆయనను వెదకుతూ ఉన్నప్పుడు పంచవటి దిశ నుండి ఆయన తిరిగిరావడం గమనించి బహుశా బహిర్భూమికి వెళ్లి ఉంటారేమోనని భావించి మరింకేమీ అడిగేవాడు కాదు హృదయ్.

6. శ్రీరామకృష్ణులు రూపొందించిన శివ విగ్రహాన్ని మథుర్ ప్రశంసించడం

హృదయ్ మాకు ఇలా చెప్పాడు: ''ఈ సమయంలో శివుణ్ణి పూజించాలనే కోరిక శ్రీరామకృష్ణులకు కలిగింది. బాల్యంలో కామార్పుకూర్‌లో అప్పుడప్పుడు ఆయన అలా చేస్తూవుండేవారని మేం ఇంతకు మునుపే తెలిపాం. మనసులో ఈ కోర్కె కలిగిన వెంటనే గంగానది నుండి మట్టిని తీసుకుని నంది, డమరుకం, త్రిశూల సమేతంగా ఒక చక్కని శివప్రతిమ చేసి ఆయన పూజించసాగారు. మథుర్‌బాబు ఆ సమయంలో వాహ్యాళిగా అటువైపు వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు తన్మయులై ఎవరిని పూజిస్తున్నారో చూడాలనే కుతూహలం అతడికి కలిగింది. దాంతో దగ్గరకు వచ్చి ఆ మూర్తిని చూశాడు. పెద్దది కాకపోయినా ఆ ప్రతిమ ఎంతో అందంగా రూపొందించబడింది. మథుర్ దానిని చూసి విస్మితుడయ్యాడు. దైవీభావం ఉట్టిపడుతోన్న మూర్తిని చూసి అటువంటిది బజారులో లభ్యం కాదని గ్రహించాడు. కుతూహలంతో హృదయ్‌ను

''ఈ మూర్తి ఎక్కడి నుండి తెచ్చారు. ఎవరు చేశారు?'' అని అడిగాడు. హృదయ్ సమాధానం నుండి శ్రీరామకృష్ణులు దేవతావిగ్రహాలు చెయ్యగలరని, విరిగిపోయిన మూర్తులను అందంగా కూడ అతికించగలరనే సంగతి తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. పూజ అయిన తర్వాత ఆ ప్రతిమను తన కిమ్మని మథుర్ అడిగాడు. హృదయ్ సమ్మతించి పూజ అయిన వెంటనే శ్రీరామకృష్ణులకు చెప్పి, ఆ విగ్రహాన్ని మథుర్‌బాబుకు అందచేశాడు. మథుర్ ఆ మూర్తిని చేతుల్లోకి తీసుకుని అతిసూక్ష్మంగా పరీక్షించసాగాడు. అంతేకాక ముగ్ధుడై దానిని రాణి దగ్గరకు పంపాడు. రాణి కూడ ప్రతిమను చూసి దానిని చేసిన శిల్పిని ప్రశంసించింది. దానిని చేసింది శ్రీరామకృష్ణులేనని తర్వాత తెలుసుకుని మథుర్‌లా ఆమె కూడ ఎంతో ఆశ్చర్యపోయింది.[1] శ్రీరామకృష్ణులను దేవాలయ కార్యంలో నియమించాలనే కోరిక మథుర్‌కు మొదట్లోనే ఉంది. ఆయన ఈ సాధన చూశాక ఆ కోర్కె మరింత బలీయమైంది. మథుర్ తన కోర్కెను కొంతకాలం క్రితం తన అన్న దగ్గర వ్యక్తం చేసిన సంగతి శ్రీరామకృష్ణులు విన్నారు. కాని ఒక్క భగవంతుణ్ణే సేవించడం తప్ప మరెవరి వద్దా ఉద్యోగం చెయ్యకూడదనే సంకల్పం చిన్నప్పటినుండి ఆయనలో దృఢంగా నాటుకుపోయింది. అందుకే వారా మాటలను లక్షించలేదు.

7. ఉద్యోగం చేయడంపై శ్రీరామకృష్ణుల అభిప్రాయం

ఉద్యోగం చేయడం గురించి గురుదేవులు అటువంటి అభిప్రాయాన్ని వెలిబుచ్చడం మేం చాలాసార్లు విన్నాం. క్లిష్టపరిస్థితులు ఎదురై ఉద్యోగం చేయవలసిన అగత్యం ఉన్నప్పుడు తప్ప, ఉద్యోగం చేసే ఎవరి పట్ల కూడ శ్రీరామకృష్ణులకు సదభిప్రాయం ఉండేది కాదు. ఒకసారి యువకుడైన భక్తులలో ఒకరు[2] ఉద్యోగం చేస్తున్నాడని తెలిసి ఆయన చాలాబాధపడ్డారు. ఆయన ఇలా అనడం విన్నాం: ''అతడు మరణించాడనే వార్త వినడం కన్నా ఉద్యోగం చేస్తున్నాడన్న వార్త నన్ను మరింత బాధకు లోనుచేస్తుంది.'' ఆ తరువాత అతడు ఆయనను దర్శించడానికి వచ్చినప్పుడు, వృద్ధురాలు, నిస్సహాయురాలు అయిన తల్లి పోషణార్థం అతడు ఉద్యోగం చేయవలసి వచ్చిందని తెలుసుకొన్నారు. అనురాగంతో అతడి తలను, శరీరాన్ని నిమురుతూ, ''అందులో దోషం లేదు. ఆ ఉద్దేశంతో ఉద్యోగం చేసినందున నిన్ను తప్పుపట్టకూడదు. కాని తల్లి కోసం కాకుండా కేవలం ధనసంపాదన నిమిత్తం నువ్వు ఉద్యోగం చేసివుంటే నిన్నిక స్పృశించలేకపోయేవాణ్ణే సుమా!

---

1. శ్రీరామకృష్ణులు పూజారిగా ఉన్న కాలంలో ఈ సంఘటన జరిగిందని, మథుర్‌బాబు రాణి కా ప్రతిమను చూపించి ''ఇంత యోగ్యుడైన పూజారి లభించడం వల్ల సత్వరమే దేవి జాగృతం కాగలదు'' అని అన్నట్లు కొందరంటారు.

2. స్వామి నిరంజనానంద

అందుకే నా నిరంజన్‌లో లవలేశమైనా అంజనం (అంటే మరక) లేదని, ఇంత హీనబుద్ధి ఉండదని నే నంటున్నాను'' అని అన్నారు.

నిరంజన్‌ను ఉద్దేశించి గురుదేవులు పలికిన మాటలు విని అక్కడున్న నూతన దర్శనార్థులు ఆశ్చర్యపోయారు. వారిలో ఒక వ్యక్తి సూటిగా ఇలా అడిగాడు కూడ: ''మహాశయా! ఉద్యోగం చేయడాన్ని మీరు ఖండిస్తున్నారు. కాని ఉద్యోగం చేయకుండా మా కుటుంబాలను ఎలా పోషించగలం?'' అందుకు శ్రీరామకృష్ణులు, ''(ఉద్యోగం) చేయదలచుకొన్న వారు చేయవచ్చు. ప్రతి ఒక్కరినీ చేయవద్దని నిషేధించడం లేదే! నేను చెప్పేది వీరి (నిరంజన్ తదితర యువకులైన భక్తులను చూపుతూ) కోసమే. వారి సంగతే వేరు.'' గురుదేవులు ఈ భక్తుల జీవితాలను ఆధ్యాత్మిక మార్గంలో మలుస్తున్నారు. పరిపూర్ణ ఆధ్యాత్మిక భావన, ఉద్యోగం మధ్య ఏనాడూ సామరస్యం కుదరదనే అభిప్రాయంతోనే ఆయన అలా పలికారని చెప్పడం అనవసరం.

8. మథుర్‌ను కలుసుకోవడానికి శ్రీరామకృష్ణుల సంకోచం

తన అన్న రాంకుమార్ నుండి మథుర్‌బాబుకున్న ఉద్దేశాన్ని తెలుసుకున్నప్పటి నుండి సాధ్యమైనంతవరకు అతడి దృష్టి నుండి దూరంగా ఉండటానికే ప్రయత్నించారు శ్రీరామకృష్ణులు. కారణమేమంటే మనోవాక్కాయ కర్మల ద్వారా సత్యాన్ని, ధర్మాన్ని పరిపాలించడంలో ఆయన ఎప్పుడూ ఎవరినీ ఎలా లక్షించేవారు కాదో అదే విధంగా మళ్లీ విశేషమైన కారణం లేకుండా ఎవరినైనా ఉపేక్షించడానికి గానీ లేదా ఊరకే కష్టపెట్టడానికిగానీ జీవితాంతం వెనుకాడుతూ ఉండేవారు. అంతేకాక ఎటువంటి ప్రతిఫలాన్ని మనసులో ఎంచక మాననీయుల సుగుణాలను ఆదరించడం, స్వాభావికంగా మర్యాదస్థులను గౌరవించడం వారి స్వభావం. కనుక ఆలయంలో పూజారి పదవిని స్వీకరించడమా? మానడమా? అనే ప్రశ్నకు తగిన సమాధానం పొందనంతకాలం మథుర్ ఆ ఉద్యోగం చేయమని తనను బ్రతిమాలుతూ కూర్చుంటే గత్యంతరంలేక నిరాకరించి అతడి మనసును కష్టపెట్టాలేమో అన్న ఆ సందేహమే శ్రీరామకృష్ణుల ఈ ప్రవర్తనకు మూల కారణమై ఉంటుందని మనం గ్రహించవచ్చు. పైగా తానప్పుడొక ఊరు పేరు లేని యువకుడు. మరి మథుర్‌బాబు, రాణీ రాస్మణికి కుడిభుజం వంటివాడు, గొప్ప వ్యక్తి. అటువంటి స్థితిలో అతడి అభ్యర్థనను త్రోసిపుచ్చడం మూర్ఖత్వంగానే పరిగణింపబడుతుంది గదా! కాని కాలం గడుస్తున్నకొద్దీ శ్రీరామకృష్ణులకు దక్షిణేశ్వరం మరింత ఆనందదాయకం కాసాగింది. అంతర్దృష్టి సంపన్నులైన గురుదేవులకు తమ ఈ మనోభావన అవగతం కాకుండా ఉండకపోదు. ఎలాంటి బరువుబాధ్యతలూ మీద పడకుండా ఉంటే దక్షిణేశ్వరంలో నివసించడానికి

మొదట్లో ఉన్న ఆక్షేపణ ఇప్పుడు వారి మనసు నుండి తొలగిపోయిందని, జన్మస్థలమైన కామార్పుకూర్‌కు తిరిగి వెళ్ళాలనే తహతహ ఇప్పుడు వారిలో లేదనే విషయాన్ని ఈ కాలఘట్టంలో జరిగిన సంఘటనల ద్వారా మనం చక్కగా గ్రహించవచ్చు.

9. శ్రీరామకృష్ణులు పూజారి పదవిని స్వీకరించడం

గురుదేవులు అనుమానించిందే ఒక రోజు జరిగింది. మ్రొక్కడానికిగాను మథుర్‌బాబు ఒకరోజు ఆలయానికి వచ్చి దూరం నుండి శ్రీరామకృష్ణులను చూసి, పిలవనంపాడు. ఆయనప్పుడు హృదయ్‌తో నడుస్తూ దూరం నుండే మథుర్‌బాబును చూచి అక్కడ నుండి వెళ్ళిపోబోతున్నప్పుడు పనివాడు వచ్చి ''బాబు పిలుస్తున్నారు'' అని చెప్పాడు. మథుర్‌బాబు దగ్గరకు వెళ్ళడానికి శ్రీరామకృష్ణులు తటపటాయించడం చూసి కారణమేమిటని అడిగాడు హృదయ్. సమాధానంగా ''నేను పోగానే ఉద్యోగం చేస్తూ ఇక్కడే ఉండిపొమ్మని ఆతడు అడుగుతా''డని చెప్పారు గురుదేవులు. ''దాన్లో తప్పేముంది? ఇంత మంచి స్థలంలో, ఒక పెద్ద మనిషి వద్ద పనిచెయ్యడం మంచిది కాదా? ఇక ఆలోచనెందుకు?'' అని హృదయ్ అన్నాడు. శ్రీరామకృష్ణులు అతడితో ''జీవితాంతం ఉద్యోగంలో బందీగా ఉండడం నా ఆశయం కాదు. అంతేకాక, పూజచేసే పనిని స్వీకరిస్తే దేవికి అలంకరింపబడే ఆభరణాల బాధ్యత అంతా నా మీదే పడుతుంది. అదొక పెద్ద తలనొప్పి. నాకది సాధ్యంకాదు. కాని నువ్వా బాధ్యతను పుచ్చుకొంటే పూజ చేయడానికి నా కెటువంటి ఆక్షేపణా లేదు'' అన్నారు.

నిజానికి హృదయ్ ఇక్కడకు వచ్చింది పని కోసమే. కనుక శ్రీరామకృష్ణుల షరతుకు సంతోషంగా ఒప్పుకున్నాడు. గురుదేవులప్పుడు మథుర్‌బాబు వద్ద కెళ్లారు. ఆలయంలో పూజారి ఉద్యోగం స్వీకరించమని మథుర్ ఆయనను



రాధాకాంతాలయం



రాధాకాంత విగ్రహం

గదాధర్ మలచిన విగ్రహం

అర్థించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు తన షరతు గురించి అతడికి చెప్పారు. మథుర్ తక్షణం ఆయన చెప్పిన షరతుకు ఒప్పుకున్నాడు. ఆ రోజు నుండే కాళి కాలయంలో వస్త్రాభరణాదులతో 'అమ్మ'ను అలంకరించే పనిలో శ్రీరామ కృష్ణులను, ఆయనకు రాంకుమార్‌కు సహాయం చేసే పనిలో హృదయ్‌ను మథుర్ నియమించాడు. మథుర్ అభ్యర్థనతో తమ్ముడలా పనిలో నియుక్తుడు కావడం చూసి రాంకుమార్ నిశ్చింతుడయ్యాడు.

10. గోవిందుని విగ్రహం పగిలిపోవడం

పైన చెప్పిన సంఘటనలన్నీ ఆలయ ప్రతిష్ఠాపన జరిగిన మూడు నెలల లోపే సంభవించాయి. 1855వ సంవత్సరాంతం. శ్రీకృష్ణజన్మాష్టమికి సంబంధించిన ఉత్సవ సన్నాహాలు ముందురోజే చేశారు. నందోత్సవం మధ్యాహ్నం శ్రీ రాధ - గోవింద ప్రత్యేకపూజ జరిగిపోయింది. పూజారి క్షేత్రనాథ్, రాధారాణిని మరో గదిలో శయనింపచేసివచ్చాడు. తర్వాత గోవిందుని శయనింపజేయడానికి తీసుకుని వెళుతున్నప్పుడు కాలుజారి పడ్డాడు. ఆ పడిపోవడంలో విగ్రహం కాలు ఒకటి విరిగిపోయింది. ఆ సంఘటన ఆలయంలో ఒక సంచలనాన్ని సృష్టించింది. ఎందరో పండితుల అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత చివరకు శ్రీరామకృష్ణుల సలహా ననుసరించి విరిగిపోయిన విగ్రహపు కాలును చక్కగా అతికించిన తర్వాత యథాప్రకారం పూజ కొనసాగింది.[1] శ్రీరామ

1. ఈ సంఘటన గురించి వివరాలకు III. 6.22లో చూడండి.

కృష్ణులు అప్పుడప్పుడు భావసమాధి పొందడం చూసి మథుర్‌బాబు విరిగిన విగ్రహస్థానంలో కొత్తవిగ్రహాన్ని ప్రతిష్ఠించడం గురించి ఆయన అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి ఆరాటపడ్డాడు. మథుర్‌కు సలహా ఇవ్వడానికి మునుపు శ్రీరామకృష్ణులు భావసమాధిలోకి వెళ్లారని, బాహ్యస్మృతి వచ్చిన తర్వాత మరో విగ్రహం పెట్టే అవసరం లేదని అతడికి తెలిపారని హృదయ్ చెప్పాడు. విరిగి పోయిన విగ్రహాలను అందంగా అతికించడంలో శ్రీరామకృష్ణులు మంచి నేర్పరి అనే సంగతి మథుర్‌కు తెలియని విషయం కాదు. కనుక మథుర్ అభ్యర్థనతో గురుదేవులప్పుడు గోవిందుని విగ్రహం కాలుని చక్కగా అతికించారు. ఆ అతి కింపు ఎంత కౌశలంగా చేశారంటే సూక్ష్మంగా పరిశీలించినా ఆ విగ్రహం ఒకప్పుడు విరిగిపోయినదనే సంగతి ఎవరూ ఇప్పటికీ తెలుసుకోలేరు.[1]

శ్రీరాధాగోవిందుని విగ్రహం ఆ విధంగా పగిలిపోయిన తర్వాత అటువంటి విగ్రహం పూజించడానికి పనికిరాదని లోకులు ఏమేమో అనేవారు. కాని రాణీ రాస్మణి, మథుర్‌బాబు మాత్రం శ్రీరామకృష్ణుల యుక్తియుక్తమైన సలహాలను దృఢంగా నమ్మి లోకుల మాటలను పెడచెవిన పెట్టారు. ఏది ఏమైనా అజాగ్రత్త వల్ల అపరాధం చేసిన క్షేత్రనాథ్‌ను పూజారి పదవి నుండి తొలగించారు. అప్పటి నుండి శ్రీ రాధాగోవిందుని పూజించే బాధ్యత శ్రీరామకృష్ణుల మీదనే పడింది. ఇక హృదయ్ కూడ పూజాసమయంలో శ్రీ కాళీమాతను ఆభరణాదులతో అలంకరించి రాంకుమార్‌కు తోడ్పడసాగాడు.

11. విరిగిన విగ్రహ పూజను గురించి శ్రీరామకృష్ణుల ఉవాచ

విగ్రహం పగిలిన సంఘటన గురించి హృదయ్ మరో సందర్భంలో మరో విషయం చెప్పాడు. కలకత్తాకు కొన్నిమైళ్ల దూరంలో ఉత్తరంగా బారానగర్ కుటీఘాట్‌కు సమీపంలో నడాల్ సంస్థాన ప్రసిద్ధ జమీందారు రతన్‌రాయ్‌కి చెందిన ఒక ఘాట్‌వుంది. ఈ ఘాట్ దగ్గర ఒక ఆలయం ఉంది. దీనిలో శ్రీదశ మహావిద్యా (దేవి) మూర్తి ప్రతిష్ఠితమై ఉంది. పూర్వం ఈ గుడిలో పూజాది సేవలకు మంచి ఏర్పాట్లే చేయబడ్డాయి. కాని శ్రీరామకృష్ణుల సాధనకాలం నాటికి ఇవి శోచనీయస్థితికి దిగజారాయి. కాలక్రమంలో శ్రీరామకృష్ణులపై మథుర్ భక్తి శ్రద్ధలు అధికమైన తర్వాత ఒకానొక సమయంలో వారిద్దరూ కలిసి ఈ ఆలయ దర్శనానికి వెళ్లారు. ఆలయ దీనావస్థను గమనించి శ్రీరామకృష్ణులు

---

1. దురదృష్టవశాత్తూ చాలాకాలం తర్వాత శ్రీరామకృష్ణులు బాగుచేసిన ఈ విగ్రహానికి బదులు మరో కొత్తవిగ్రహం ప్రతిష్ఠించబడింది. దర్శనార్థు లిప్పుడు చూసే గోవింద విగ్రహం శ్రీరామకృష్ణులు చక్కబరచినది కాదు. తర్వాత ఆ పాతవిగ్రహం అపహరింపబడింది.

మథుర్‌బాబుకు చెప్పి నెలనెలా రెండు రూపాయలు, రెండు మణుగుల బియ్యం ఇప్పించే ఏర్పాటు చేయించారు. అప్పటి నుండి శ్రీ దశ మహావిద్యాదేవిని దర్శించడానికి గురుదేవులు అప్పుడప్పుడు అక్కడకు వెళుతూ ఉండేవారు. ఒకరోజు ఆ విధంగా దేవిని దర్శించుకొని తిరిగి పోతున్నప్పుడు ఆ ప్రాంతపు సుప్రసిద్ధ జమీందారైన జయనారాయణ్ వంద్యోపాధ్యాయ తాను నిర్మించిన ఘాట్ దగ్గర పలువురితో కలిసి నిలబడి ఉండడం చూశారు. పరిచితుడవడం వల్ల ఆయనను కలుసుకోవడానికి శ్రీరామకృష్ణులు వెళ్లారు. జయనారాయణ్ ఆయనకు నమస్కరించి సాదరంగా ఆహ్వానించి తన తోటివారికి పరిచయం చేశాడు. తర్వాత మాటల సందర్భంలో రాణీ రాస్మణి కాళికాలయ ప్రస్తావన లేవ నెత్తి శ్రీరామకృష్ణులను, ''మహాశయా! అక్కడ గోవిందుని విగ్రహం పగిలి పోయిందట కదా?'' అని అడిగాడు. అందుకు జవాబుగా గురుదేవులిలా అన్నారు: ''ఎటువంటి బుద్ధి నీది? అనంతుడు, అఖండుడు అయిన వాడు పగిలి పోవడ మేమిటి?'' పిదప జయనారాయణ్ ప్రశ్నతో నిరర్థకమైన నానావిషయాలు లేవగలవనే అనుమానంతో శ్రీరామకృష్ణులు ఆ ప్రస్తావన మార్చి అన్ని విషయాల లోను ముఖ్యాంశాన్ని మాత్రమే గ్రహించి సారహీనమైన వాటిని విడవలసిందని అతడికి ఉపదేశించారు. బుద్ధిమంతుడైన జయనారాయణ్‌బాబు కూడ శ్రీరామ కృష్ణుల పరోక్ష సూచనను అర్థం చేసుకుని అటువంటి వ్యర్థప్రశ్నలు వేయడం మానుకొన్నాడు.

శ్రీరామకృష్ణులు చేసే పూజ చూడవలసిన ఒక అపూర్వదృశ్యం! దాన్ని చూసినవారు మంత్రముగ్ధులయ్యేవారు. ఇక ఆయన పాటలు: భక్తిభావంతో

12. శ్రీరామకృష్ణుల సంగీత ప్రతిభ

హృదయం పెల్లుబుకుతుండగా గంధర్వులు సైతం అసూయాపరులయ్యే విధంగా మధుర కంఠంతో ఆయన పాడేపాటలను ఒక్కసారి విన్నవాటిని ఎన్నడూ మరువలేకపోయేవారు. వాటిలో సంగీత విద్వాంసుల కృత్రిమ ఆలాపనలేవీ ఉండవు. కాని పాటలలోని భావంతో వారు సంపూర్ణంగా తన్మయులై విశుద్ధ రాగ తాళ లయబద్ధంగా ఆ భావాలను యథాతథంగా తమ మధురకంఠంతో గానం చేస్తూవుంటే అవి వినేవారి హృద యాంతరాళాలలోకి చొచ్చుకుపోయి రూప భావ తరంగాలను మేల్కొలిపేవి. భావమొక్కటే సంగీతం ప్రాణం అనే సంగతి ఆయన పాటలను వినేవారికి హృద్యంగమమయ్యేది. అలాగే తాళం, లయ విశుద్ధంగా లేకపోతే ఆ భావం చక్కగా అభివ్యక్తం కాజాలదనే సంగతి శ్రీరామకృష్ణుల ముఖతా వెలువడిన సంగీతాన్ని విని దానిని ఇతరుల సంగీతంతో పోల్చి చూసిన వారికి స్పష్టంగా అర్థమయ్యేది. రాణీ రాస్మణి దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడల్లా శ్రీరామకృష్ణులను

రావించి ఆయన పాటలను వింటూవుండేది. ఈ క్రింది పాట ఆమెకు విశేషంగా ప్రియమైంది.

కోన్ హిసాబే హరహృదే దాడియే చో మా పదదియే।
నిథకరే జిబ్ బడాయాచో జేనకాతో న్యాకామేయే జేనేథి జేనేథితారా
తారా నా తోర్ ఏమ్ని ధారా
తోర్ మాకి తోర్ బాబీర్ బుకే దాడియేఛిలో అమ్నికరే॥

భావం: అమ్మా! ఏమనుకొని నువ్వు శివుని హృదయ స్థానం మీద కాళ్లపెట్టి నిలబడ్డావు. మళ్లీ ఏమీ తెలియనిదానిలా పెద్దగా నాలుక చాచిపెట్టావే? (తప్పు తెలుసుకుని సిగ్గుపడిన దానిలాగా!) నా కిప్పుడు అర్థమైంది. ఓ తారా, 'ఇదంతా నీ వంశపారంపర్యంగా వస్తున్న పద్ధతేనా నీ తల్లి కూడ నీ తండ్రి గుండెమీద ఇలాగే నిలబడిందా ఏమిటి?''[1]

శ్రీరామకృష్ణుల పాటలంత మధురంగా ఉండడానికి కారణం కూడ ఉంది. పాడేటప్పుడు ఆ పాటల భావంలో వారెంత తన్మయులై పోయేవారంటే ఇతరుల మెప్పును పొందడానికి పాడుతున్నాననే స్పృహ వారి నుండి పూర్తిగా తొలగిపోయేది. పాట పాడుతున్నప్పుడల్లా శ్రీరామకృష్ణులలా తన్మయులయ్యే వారిని మరెవ్వరినీ మేం జీవితంలో చూడలేదు. భావుకులైన గొప్ప గాయకులు సైతం శ్రోతల నుంచి ఏ కొంచెమైనా ప్రశంస పొందాలనే కోరుకుంటారు. కాని గురుదేవుల పాటలు విని ముగ్ధులై, ఎవరైనా వారిని ప్రశంసిస్తే, ''ఈ వ్యక్తి పాటలోని భావాన్నే ప్రశంసిస్తున్నాడు గాని, నిజంగా ఆ గొప్పతనంలో బిందు మాత్రమైనా నాకు చెంద''దని వాస్తవికంగానే వారనుకొనేవారు. మేం కేవలం దీన్ని శ్రీరామకృష్ణులలోనే చూశాం.

హృదయ్ ఇలా చెప్పేవాడు:

13. పూజ చేస్తున్నప్పుడు శ్రీరామకృష్ణుల ప్రథమ దివ్యదర్శనం

''ఈ కాలంలో భక్తిగీతాలు పాడుతూ పాడుతూ కన్నీళ్లతో వారి వక్షస్థలం తడిసిపోయేది. పూజ చేస్తున్నప్పుడు ఎంత తన్మయులై చేసేవారంటే 'ఆ చోటికి అప్పుడు ఎవరైనా వచ్చినా లేదా దగ్గరకొచ్చి మాట్లాడినా వినబడేదే కాదు' అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. కరన్యాసం, అంగన్యాసం మొదలైన పూజావిధులు నిర్వర్తించేటప్పుడు ఆయా మంత్రవర్ణాలు తమ దేహంలో ఉజ్జ్వలకాంతితో ప్రత్యక్షమౌతూ ఉండడం తమ కళ్లతో నిజంగానే చూసేవారమని గురుదేవులు చెప్పారు.

---

1. శవరూప శివునిపై, కాళీమాత నిలబడి ఉంటుంది. శాక్తమతం ప్రకారం శివుడు పరబ్రహ్మకు ప్రతీక, కాళీ శక్తికి ప్రతీక.

మళ్ళీ కుండలినీ శక్తి సర్పాకృతితో సుషుమ్నా మార్గం ద్వారా సహస్రారానికి ఎక్కడం, అలా ఎక్కుతున్నప్పుడు శరీరంలోని ఏ ఏ అంగాలను ఆ శక్తి విడిచి పోతుందో ఆయా అంగాలు తక్షణం స్పందనరహితాలై పోయినట్లె మృతప్రాయులుగా అవడం ఆయన యథార్థంగా చూసేవారు. మళ్ళీ పూజాపద్ధతి ననుసరించి '' 'రం' ఇతి జలధారయాం వహ్ని ప్రాకారం విచింత్య'' - అంటే ''రం'' అనే బీజమంత్రాన్ని ఉచ్చరిస్తూ నలుదిక్కులా నీళ్లను చిలకరిస్తూ పూజారి భావించాలి. దుర్భేద్యమైన అగ్నికుడ్యం పూజాస్థలాన్ని చుట్టి అన్ని విఘ్నాల నుండి ఆ స్థలాన్ని రక్షిస్తున్నదని అర్థం శ్రీరామకృష్ణులలా చేసినప్పుడు నిజంగానే శత జిహ్వలతో విస్తరిస్తున్న అగ్నిప్రాకారం తమను, పూజస్థలాన్ని చుట్టుముట్టి అన్ని విధాలైన విఘ్నాల నుండి రక్షిస్తూండడం దర్శించేవారు. పూజాసమయంలో శ్రీరామకృష్ణులు తేజోమయ శరీరాన్ని, తన్మయత్వాన్ని చూసిన ఇతర బ్రాహ్మణులు 'సాక్షాత్తూ నారాయణుడే మానవశరీరాన్ని దాల్చి పూజ చేయడానికి కూర్చున్నట్లు కన్పిస్తున్నా'రని పరస్పరం చెప్పుకునేవారు.''

14. రాంకుమార్ శ్రీరామకృష్ణులకు వివిధ దేవతల పూజాపద్ధతులు నేర్పడం

దేవీ భక్తుడైన రాంకుమార్ దక్షిణేశ్వరానికి వచ్చినప్పటి నుండి కుటుంబపు జరుగుబాటు సమస్య నుండి చాలావరకు నిశ్చింతుడయ్యాడు. కాని మరో చింత అప్పుడప్పుడు అతణ్ణి బాధిస్తుండేది. అది చిన్న తమ్ముడైన శ్రీరామకృష్ణుల గురించి! ఎందుకంటే అక్కడికి వచ్చినప్పటి నుంచి తమ్ముడిలో ఏకాంతవాస ప్రియత్వం పెరగడం, సంసార విషయాలపై ఉదాసీనుడవడం రాంకుమార్ దృష్టికొచ్చింది. ప్రాపంచికోన్నతి కలిగించే ఏ పనిలోనైనా అతడు పూర్తిగా ఉదాసీనుడిగా ఉంటున్నాడు. ఎందుకంటే ఉదయం, సాయంకాలం ఎప్పుడంటే అప్పుడు అతడు ఆలయానికి దూరంగా గంగాతీరానికి పోయి ఒక్కడే అటూ ఇటూ తిరుగుతూ ఉండేవాడు. లేదా పంచవటి వద్ద స్థిరంగా కూర్చొని ఉండేవాడు. లేదా పంచవటికి నలువైపులా వ్యాపించివున్న చిట్టడవిలో ప్రవేశించి చాలాసమయం అక్కడ గడిపి మళ్ళీ బయటికి వచ్చేవాడు. ఇదంతా రాంకుమార్ గమనించాడు. మొదట్లో ఇలా అతడనుకునేవాడు. 'బహుశా పిల్లవాడు కామార్పుకూర్‌లో ఉన్న తల్లి దగ్గరకు తిరిగి వెళ్లకోరుతున్నాడేమో, అందుకే దానిని గురించి సర్వదా చింతిస్తున్నాడేమో!' కాని చాలాకాలం గడిచినా ఇంటికి వెళ్లాలన్న కోరికను శ్రీరామకృష్ణులు ఏనాడూ వెల్లడించలేదు. కొన్నిసార్లు రాంకుమార్ తమ్ముణ్ణే అడిగి, అతడిలో అటువంటి కోరిక లేదని గ్రహించి, ఇంటికి పంపాలనే ఆలోచనను మానుకొన్నాడు. అయినా రాంకుమార్ తనలో తానిలా వితర్కించుకోసాగాడు:

''నాకు వయస్సయింది. రోజురోజుకూ శరీరం దుర్బలమౌతోంది. జీవితం ఎప్పుడు అంతమౌతుందో ఎవరికెరుక? కనుక సమయాన్నిక వృథా చెయ్యకూడదు. నేను బతికున్నప్పుడే తమ్ముడెలా తన కాళ్లమీద తాను నిలబడి రెండు కాసులు ఆర్జించి సంసారాన్నెలా నడుపుకోగలడో ఆ విధంగా చేయడం ఏకైక కర్తవ్యం.'' కనుక తమ్ముణ్ణి ఆలయం పనిలో చేర్చాలనే అభిప్రాయాన్ని మథుర్‌బాబు తనతో వ్యక్తం చేసినప్పుడు చాలా సంతోషించాడు రాంకుమార్. కొంతకాలం తర్వాత మథుర్ అభ్యర్థనతో శ్రీరామకృష్ణులు మొదట్లో దేవికి అలంకారం చేసే పనిని, ఆ తర్వాత రాధాగోవిందుని పూజించే పనిని అంగీకరించడంతో చాలావరకు అతడు నిశ్చింతుడయ్యాడు. అప్పటి నుండి అతడు తమ్ముడికి చండీ పాఠం, కాళీపూజతో పాటు ఇతర దేవతల పూజలన్నీ నేర్పాడు. శ్రీరామకృష్ణులు ఆ విధంగా సంస్కార సంపన్నులైన బ్రాహ్మణులు విధ్యుక్తంగా నేర్చుకోవలసిన వాటిని సత్వరమే నేర్చుకున్నారు. శక్తిమంత్రంతో దీక్షితుడు కాకుండా దేవిని పూజించడం సముచితం కాదని విని దీక్షను పొందాలని సంకల్పించుకున్నారు.

కేనారామ్ భట్టాచార్యుడనే గొప్ప శక్తిసాధకు డొకరు ఆ కాలంలో కలకత్తాలో బైఠక్‌ఖానా బజారులో నివసిస్తుండేవాడు. ఆయన అప్పుడప్పుడు దక్షిణేశ్వర కాళికాలయానికి వస్తూవుండేవాడు. మథుర్‌బాబు, రాణి కుటుంబ సభ్యులతో అతడికి పరిచయం ఉండవచ్చుని పిస్తోంది. దేవీభక్తుడవడం వల్ల తెలిసినవారు ఆయన పట్ల అమిత గౌరవభావం చూపుతుండేవారు. ఆయనకు శ్రీరామకృష్ణుల అన్న రాంకుమార్ భట్టాచార్యులతో పూర్వం నుంచే పరిచయముంది. ఆయన నుంచి దీక్షను పొందాలని గురుదేవులు సంకల్పించుకున్నారు.

15. శ్రీ కేనారామ్ భట్టాచార్యుల నుండి శ్రీరామకృష్ణుల శక్తిదీక్ష స్వీకారం

దీక్ష పుచ్చుకున్న తక్షణమే శ్రీరామకృష్ణులు భావపరవశులై సమాధిమగ్నులైనారని, కేనారామ్ అనన్యమైన వారి భక్తిని చూచి ముగ్ధులై వారికి 'ఇష్టదేవతాదర్శనమవుగాక' అని హృదయపూర్వకంగా ఆశీర్వదించాడని మేం విన్నాం.

తన శరీరం దుర్బలమవడంచేత గానీ లేదా శ్రీరామకృష్ణులకు అభ్యాసమౌతుందని తలంచో రాంకుమార్ ఆ కాలంలో శ్రీ రాధాగోవిందుని పూజలు చేస్తూ, శ్రీ కాళికాదేవి పూజాకార్యక్రమాన్ని శ్రీరామకృష్ణులకు అప్పగించాడు. మథుర్‌బాబుకు ఆ సంగతి త్వరలోనే తెలియవచ్చింది. దేవీపూజలో శ్రీరామకృష్ణులప్పుడు ప్రావీణ్యం సంపాదించారని తెలుసుకొని, అప్పటి నుండి రాంకుమార్‌ను విష్ణుపూజ చేయవలసిందిగా అభ్యర్థించాడు మథుర్. కనుక ఆ కాలం నుంచి శ్రీరామకృష్ణులు శ్రీకాళికాలయంలో

16. రాంకుమార్ మరణం

పూజారిగా నియుక్తులయ్యారు. పెద్దవాడవుతున్న రాంకుమార్ శరీరం మరింత క్షీణించడం వల్ల ఎంతో కష్టమైన కాళికాలయ పని అతడు చేయడం అసాధ్య మని భావించే మథుర్ అలాంటి ఏర్పాటు చేసివుంటాడు. ఈ ఏర్పాటు రాంకుమార్‌కు ఎంతో సంతోషం కలిగించింది. తమ్ముడి కతడు ఆలయంలో చేయవలసిన పూజ, సేవాది కార్యాలన్నింటినీ క్షుణ్ణంగా నేర్పి, నిశ్చింతు డయ్యాడు. కొంతకాలం గడచిన తర్వాత, ఆయన మథుర్‌బాబుకు చెప్పి శ్రీ రాధాగోవిందుని పూజాకార్యక్రమంలో హృదయ్‌ను నియుక్తంచేశాడు. సెలవు పుచ్చుకుని కొన్ని రోజులు ఇంటికి వెళ్లే ఏర్పాట్లు చేసుకోసాగాడు. కాని ఈ లోపల ఏదో పని మీద కలకత్తాకు ఉత్తరంగావున్న శ్యామ్‌నగర్ మూలాజోడ్ అనే చోటికి వెళ్లాడు; అతడక్కడే హఠాత్తుగా మరణించాడు. రాణీ రాస్మణి దేవాలయ ప్రతిష్ఠాపన జరిపిన తర్వాత శ్రీజగన్మాత పూజ చేస్తూ రాంకుమార్ జీవించింది ఒక్క సంవత్సర కాలం మాత్రమే. కాబట్టి, బహుశా ఆయన 1856 మధ్య కాలంలో మరణించాడు.

6. ఆత్మక్షోభ - ప్రథమ దివ్యదర్శనం

1. అన్న రాంకుమార్ మరణం తర్వాత శ్రీరామకృష్ణుల ప్రవర్తన

బాల్యంలోనే శ్రీరామకృష్ణులు తండ్రిని కోల్పోయారు. ఆ క్షణం నుండి తల్లి చంద్రమణీ దేవి, పెద్దన్న రాంకుమార్ ప్రేమవాత్సల్యాల మధ్య పెరిగి పెద్దవారయ్యారు. రాంకుమార్ రామకృష్ణుల కన్నా ముప్ఫైఒక్క సంవత్సరాలు పెద్దవాడు. అందువల్ల గురుదేవులు తన అన్నగారిని తండ్రితో సమంగా గౌరవిస్తూ ఉండేవారు. అలాంటి తండ్రి సమానుడైన అన్న హఠాత్తుగా పరమపదించడంతో శ్రీరామకృష్ణులు ఎంతో దుఃఖించారని వేరుగా చెప్పాలా! ఈ సంఘటన 'సంసారం అనిత్యం' అన్న భావాన్ని ఆయన మనస్సులో మరింత దృఢం చేసింది. ఇది వారిలో వైరాగ్యాన్ని ఎంతవరకు ప్రజ్వలితం చేసిందో చెప్పలేము. ఏది ఏమైనా, ఆ క్షణం నుండి ఆయన జగన్మాత పూజలోనే అధికంగా నిమగ్నులు కాసాగారు. భగవద్దర్శనాన్ని పొందాలనుకొనేవారు, నిజంగా ఆ దర్శనాన్ని పొందగలరా, కృతార్థులు కాగలరా? అన్న విషయాన్ని తెలుసుకోవడానికి ఆయన వ్యాకులపడసాగారు. నిత్యపూజానంతరం జగన్మాత చెంతన కూర్చుని ఆమె ధ్యానంలో లీనమై రోజులు గడపసాగారు. ఆ సమయంలో రామ్‌ప్రసాద్, కమలాకాంత్[1] మొదలైన దేవీ భక్తులు రచించిన భక్తిగీతాలు పాడుతూ అమ్మకు వినిపిస్తూ అమ్మ ప్రేమలో లీనమై మైమరచిపోతూ ఉండేవారు. మధ్యాహ్నం, రాత్రి ఆలయాన్ని మూసి వేసిన తర్వాత, అందరినీ వదిలి బయట పంచవటి చుట్టూ ఉన్న చిట్టడవిలోకి వెళ్లి, జగన్మాతను ధ్యానిస్తూ ఉండిపోయేవారు.

శ్రీరామకృష్ణులు ఇలా జగన్మాత ధ్యానంలోనే నిరంతరం ఉండిపోవడం, హృదయ్‌కు ఎంతమాత్రమూ నచ్చేది కాదు. కాని అతడేం చేస్తాడు? తన మామ

---

1. వంగదేశంలో దేవీభక్తులు

సంగతి, పట్టుదల అతడికి తెలియనివేమీకావు. తన మామ తానేమి చేయా

2. హృదయ్ ఆందోళన

లనుకొంటాడో, అది చేసి తీరడం చిన్ననాటి నుండి ఆయన స్వభావమని అతడికి బాగా తెలుసు. ఆయనను నివారించడం ఎవరి తరమూ కాదు. అందుచేత అలా చేయవద్దని చెప్పడం, ఆపే ప్రయత్నం చేయడం వ్యర్థం. కాని శ్రీరామకృష్ణుల ఆ ధోరణి రోజురోజుకీ మితిమీరడం చూసి, అప్పుడప్పుడు హృదయ్ ఆయనకు చూచాయగా చెప్పే ప్రయత్నం చేస్తుండేవాడు. శ్రీరామకృష్ణులు రాత్రివేళ నిద్రించేవారు కారు. గది వదలి పంచవటి వైపు వెళుతున్నారన్న విషయం తెలిసి, హృదయ్ ఎంతో ఆందోళన చెందాడు. ఎందుకంటే, గుడిలో దేవీపూజ ఎంతో శ్రమతో కూడిన పని. పైగా శ్రీరామకృష్ణులు ఆహారం కూడ ఈ మధ్య తగ్గించారు. ఈ స్థితిలో రాత్రి పూటకూడ నిద్రపోకపోతే ఇక ఆయన ఆరోగ్యం దెబ్బ తినడం ఖాయం. కాబట్టే బాగా ఆలోచించి, సాధ్యమైనంతవరకూ పరిస్థితులను చక్కబెట్టాలనుకున్నాడు హృదయ్.

పంచవటి చుట్టుపట్ల ఉన్న స్థలం, ఇప్పటిలా సమతలంగా ఉండేది కాదు. గోతులతో, మిట్టలతో, దిబ్బలతో, పొదలు - చెట్లతో ఒక చిన్న అడవి మాదిరి

3. ఆ సమయంలో పంచవటి, పరిసరాలు

ఉండేది. ఆ అడవి చెట్ల మధ్య ఒక ఉసిరి చెట్టుండేది. అది అడవే కాక, శ్మశానభూమి కూడ కాబట్టి పగలు కూడ ఎవరూ ఆ ఛాయలకు వెళ్లేవారు కారు. రాత్రయితే, దయ్యాల భయం కారణంగా

పంచవటి (ఆ రోజుల్లో)

జనం, ఆ వైపు చూడడానికైనా భయపడేవారు. ఆ ఉసిరిచెట్టు ఎంతో పల్లంలో ఉండేదని హృదయ్ తెలిపాడు. అందువల్ల ఎవరైనా ఆ చెట్టు కింద కూర్చుంటే, అడవి బయటి ఎత్తైన ప్రదేశం నుండి వారిని చూడడం సాధ్యమయ్యేది కాదు. శ్రీరామకృష్ణులు రాత్రివేళ ఈ చెట్టు కింద కూర్చుని ధ్యానం చేస్తుండేవారు.

ఒక రాత్రివేళ శ్రీరామకృష్ణులు పంచవటి వైపు పోతుండగా, హృదయ్ ఆయనను అనుసరించాడు. ఆ విషయం ఆయనకు తెలియదు. ఆయన అడ

4. రాత్రివేళ ఆ అడవిలోకి ఎందుకు వెళుతున్నారో హృదయ్ వాకబు చేయడం

విలో ప్రవేశించడం చూశాడు. ఇంకా ముందుకు వెళితే ఆయనకు కోపం వస్తుందేమోనని భయపడి, హృదయ్ అక్కడే ఆగిపోయాడు. కాని అక్కడే నిలబడి చిన్న చిన్న రాళ్లు విసురుతూ ఆయనను భయపెట్టే ప్రయత్నం చేశాడు. అయినా ఆయన వెనుదిరగకపోవడం చూసి, మరేమీ చేయలేక, అతడు తన గదికి తిరిగి వచ్చేశాడు. మరుసటి రోజు వీలుచూసుకొని, ''రాత్రివేళ అడవికి వెళ్లి నువ్వక్కడ ఏం చేస్తుంటావు?'' అనడిగాడు. ''అక్కడొక ఉసిరి చెట్టు ఉంది. దాని కింద కూర్చుని ధ్యానం చేస్తూంటాను'' అని శ్రీరామకృష్ణులు జవాబు చెప్పారు. ''మనసులో ఏదైనా కోరికతో ఆ చెట్టు కింద ధ్యానం చేస్తే, అది ఈడేరుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి'' అని వివరించారు.

ఆ తర్వాత శ్రీరామకృష్ణులు యథాప్రకారం అడవిలోకి వెళ్లడం, ధ్యానం చేయడం కొనసాగాయి. హృదయ్‌కు మాత్రం ఏం చేయడానికీ పాలుబోలేదు.

5. శ్రీరామకృష్ణులను భయపెట్టడానికి హృదయ్ ప్రయత్నించడం

శ్రీరామకృష్ణులను భయపెట్టేందుకు ఆయన చుట్టూ రాళ్లు విసరుతుండేవాడు. అది హృదయ్ పనేనని తెలిసి కూడ శ్రీరామకృష్ణులు అతణ్ణి ఏమీ అనేవారు కాదు. భయపెట్టి లాభం లేదని తెలిసి, హృదయ్ ఒక రోజు శ్రీరామకృష్ణులతోపాటు ఆయనకు సమీపంగా అడవిలోకి పోయాడు. శ్రీరామకృష్ణులు ఉసిరి చెట్టు కిందకు వెళ్లి వస్త్రాలు విప్పడం, మెడలోని జందెం తీసివేయడం, సుఖాసీనుడై ధ్యానం చేయడం చూశాడు. అది చూసి తెల్లబోయాడు. ''మా మామకు పిచ్చిగాని పట్టలేదు కదా! పిచ్చివారుకాక ఇలా ఎవరు చేస్తారు? ధ్యానం చేయడం మంచిదే! కాని ఇలా ఒంటి మీద నూలుపోగు కూడ లేకుండా ధ్యానం చేయడం ఏమిటి?'' అని అతడు విస్మయం చెందాడు.

అలా విస్తుపోయి చూస్తున్న హృదయ్ ఇక ఆగలేకపోయాడు. వెంటనే

6. ''పాశముక్తుడై ధ్యానం చేయాలి'' - శ్రీరామకృష్ణుల ఉవాచ

శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లి, ''నువ్వు చేస్తున్న దేమిటి? జందెం - బట్టలు అన్నీ తీసేసి, నగ్నంగా ఉండి ఇలా కూర్చున్నావేం?'' అని గట్టిగా అడిగాడు. శ్రీరామకృష్ణులను

పదేపదే పిలిచాక ఆయనలో బాహ్యస్మృతి కలిగింది. హృదయ్ ప్రశ్న కూడ వినిపించింది.

"నీకు తెలియదులే. ధ్యానం ఇలాగే చేయాలి. సర్వ పాశాల నుండి ముక్తులై ధ్యానం చేయాలి. పుట్టినప్పటి నుండి మనిషి - లజ్జ, ఘృణ, కులం, శీలం, భయం, మానం, జాతి, అభిమానం - అనే ఎనిమిది పాశాల్లో చిక్కుకుని ఉంటాడు. జందెం కూడా ఒక బంధమే. ఎందుకంటే, 'నేను బ్రాహ్మణుడను. అందరి కన్నా శ్రేష్ఠుణ్ణి' అనే అహంభావాన్ని అది కలిగిస్తుంది. అమ్మను పిలిచే టప్పుడు ఈ పాశాల నన్నింటినీ పారేసి, ఏకాగ్రచిత్తంతో ఆమెను పిలవాలి. అందుకే నేను వీటన్నింటినీ తీసివేశాను. ధ్యానం పూర్తయ్యాక వచ్చేటప్పుడు మళ్లీ ధరిస్తాను" అని శ్రీరామకృష్ణులు వివరించారు.

హృదయ్ ఇలాంటి విషయాలను ఎన్నడూ విన్నది లేదు. అందువల్ల తెల్లబోయి వింటూ ఉండిపోయాడు. అదంతా విని వెనుదిరిగిపోయాడు. కాని అడవిలోకి వెళ్లే ముందు మాత్రం 'ఈ రోజు మామకు మంచి హితబోధ చేస్తాను. గట్టిగా మందలిస్తాను' అనుకున్నాడు. కాని అందుకు పూర్తి విరుద్ధంగా అంతా జరిగింది. తానే హితోపదేశం పొందవలసి వచ్చింది!

7. భావనలను కార్యాచరణలో పెట్టడంలోని ఆవశ్యకత

పైన చెప్పుకున్న సంఘటనకు సంబంధించిన మరో విషయాన్ని ఇక్కడ స్పష్టం చేయడం మంచిది. అది మనకు స్పష్టమైతే, శ్రీరామకృష్ణుల జీవితంలో తదనంతరం జరిగిన అనేక ఇతర సంఘటనలు మనకు సులభంగా అర్థమౌతాయి.

పైన చెప్పిన అష్టబంధాల నుండి ముక్తులు కావడానికి, వాటన్నింటినీ శ్రీరామకృష్ణులు కేవలం మానసికంగానే పరిత్యజించడంతో తృప్తి చెందక, బాహ్యంగా కూడ వాటిని సాధ్యమైనంత వరకు పరిత్యజించారు. తదనంతర జీవితంలో కూడ అన్ని విషయాల్లోనూ వారు ఇలాగే చేయడం మనం చూడవచ్చు.

ఉదాహరణకు, ఉన్నతకులంలో పుట్టానన్న అభిమానాన్ని నాశనంచేసి, యథార్థ 'వినమ్రతను' పొందడం కోసం, ఇతరులు అశుద్ధంగా భావించి దూరంగా ఉండేచోట్లను ఎంతో శ్రద్ధతో, స్వయంగా శుభ్రం చేశారు.

"సమలోష్టాశ్మ కాంచనుడు" (గీత) కాకపోతే, అంటే లోకులు అమూల్య వస్తువులుగా పరిగణించే, రత్నాలు - మణులు - బంగారం మొదలైన వాటిని మట్టితో సమానంగా - తుచ్ఛమైనవాటిగా భావించకుండా ఉంటే, మనిషి మనసు - శారీరక, ప్రాపంచిక భోగసుఖాలను వదిలిపెట్టజాలదన్న విషయాన్ని శ్రీరామ

కృష్ణులు విన్నవెంటనే, కొన్ని రూపాయి నాణాలను, మట్టిముద్దలను చేతిలోకి తీసుకొని 'రూపాయి - మన్ను; మన్ను - రూపాయి' అంటూ పలుకుతూ, ఆ రెంటినీ గంగానదిలో పారవేశారు.

8. సమగ్రమైన శ్రీరామకృష్ణుల పరిత్యాగం

జీవులంతా శివుడి స్వరూపాలే అన్న జ్ఞానాన్ని దృఢం చేసుకోవడానికై కాళికాలయంలో బిచ్చగాళ్లందరి భోజనం అయ్యాక, వారి ఎంగిలి మెతుకులను భగవత్ ప్రసాదంగా గ్రహించి, తలపైన పెట్టుకున్నారు. వారి ఎంగిలి విస్తరాకులను తమ తలపై మోసి గంగానదిలో పారవేశారు. తిరిగి వచ్చి ఆ స్థలాన్ని చీపురుతో శుభ్రంచేసి, తన నశ్వర శరీరం ద్వారా కొంతలో కొంతైనా కృతార్థుడనయ్యానని భావించి, తృప్తి చెందారు.

ఇలాంటి సంఘటనలను ఎన్నింటినైనా పేర్కొనవచ్చు. వీటన్నింటి మూలంగా మన కో విషయం స్పష్టమౌతున్నది. శ్రీరామకృష్ణులు భగవత్సాక్షాత్కార మార్గంలోని ఆటంకాల నన్నింటినీ, కేవలం మానసికంగా మాత్రమే పరిత్యజించడంతో తృప్తి పడలేదు. కాని మొట్టమొదట వాటన్నింటినీ స్థూలంగా విసర్జించి, సాధ్యమైనంతవరకు తమ శరీరాన్ని, ఇంద్రియాలను వాటి నుండి దూరంగా ఉంచుతూ, తద్విపరీత అనుష్ఠానాలను (అంటే సాక్షాత్కారానికి సహకరించే వాటిని) ఆచరిస్తూ, శరీరేంద్రియాలను బలవంతంగా తమ అదుపులో ఉంచుకునేవారు. ఇలాంటి ఆచరణ ద్వారా ఆయన మనసులోని పూర్వ సంస్కారాలన్నీ నిశ్శేషంగా నశించిపోయేవి. తద్విపరీత ఆధ్యాత్మిక సంస్కారాలు ఎంతో దృఢమయ్యేవి; ఆయన మనసు మరెప్పుడూ కూడ దారితప్పి చరించేది కాదు. అలా కొత్త సంస్కారాలను మనసు ముందుగా గ్రహించి, తర్వాత శరీర - ఇంద్రియాల ద్వారా కొంతలో కొంతైనా వాటిని ఆచరణలో పెడితేతప్ప, పాత సంస్కారాలు నశించి, కొత్త సంస్కారాలు స్థిరపడవు - అని శ్రీరామకృష్ణుల అభిప్రాయం.

9. శ్రీరామకృష్ణుల సాధన విధానం వల్ల ఆక్షేపణకు ఖండనం

పూర్వసంస్కారాలన్నింటినీ పూర్తిగా త్యాగం చేయడానికి ఇష్టపడని మనం, శ్రీరామకృష్ణులు అవలంబించిన పై సాధన విధానం అనవసరం అని భావించవచ్చు. విచిత్రమైన ఆయన సాధన విధానాన్ని విశ్లేషిస్తూ, కొంతమంది. అపవిత్రం, అసహ్యకరమైన ప్రదేశాలను శుభ్రం చేయడం రూపాయి - మన్నులను గంగలో పారవేయడం - ఈ విచిత్ర సాధన అంతా ఆయన ఊహాజనితమే తప్ప శాస్త్రీయం కాదని అనడానికి కూడ సాహసిస్తూంటారు. అయినా ఇంతకు ముందు ఎవరూ చేయని, ఎవరికీ తెలియని ఇలాంటి ఉపాయాల ద్వారా

ఆయన సాధించిన మానసికోన్నతిని, వాటికన్నా సులభమైన ఇతర ఉపాయాల ద్వారా సత్వరమే పొందవచ్చు కదా''[1] అని ఆక్షేపిస్తుంటారు.

అందుకు మా సమాధానం:

''నిజమే. మీరు చెప్పేది బాగానే ఉంది. కాని ఇలా బాహ్యంగా అనుష్ఠానం చేయకుండా, కేవలం మానసికంగా మాత్రమే విషయాదులను త్యాగంచేసే, మీరు చెప్పేలా 'సులభోపాయాల'ను అవలంబించి, రూపరసాది విషయాల్లో సంపూర్ణ విరక్తి పొంది, మనసును పూర్తిగా భగవంతుడికి అర్పించగలిగిన వ్యక్తులు ఇప్పటి వరకు ఎంతమంది జన్మించారో మీరు చూపగలరా? అదెప్పటికీ జరగదు. మనసు ఒక వైపు సాగుతూ ఉంటే, శరీరం మరోవైపు వెళుతూ ఉంటుంది కదా (అంటే మనసులోనేమో ఆధ్యాత్మిక భావం, శరీరంతో ప్రాపంచిక భోగం). ఇలాంటి మనశ్శరీరాల ద్వారా భగవత్సాక్షాత్కారం కలగడం సుదూర విషయం సుమా! ఇహలోకంలో కూడ ఇలాంటి మనశ్శరీరాల ద్వారా ఎలాంటి మహత్కార్యాన్నీ సాధించలేము. కాని రూపరసాది విషయ భోగలాలసులైన ఈ లౌకికులు ఈ సత్యాన్ని గ్రహించలేరు కదా! ఒకానొక భోగవిషయాన్ని త్యాగం చేయడం శ్రేయస్కరం అని అర్థమైనా కూడ, పూర్వసంస్కార ప్రాబల్యం చేత తన శరీరేంద్రియాల ద్వారా, మనిషి దానిని వదలిపెట్టే ప్రయత్నం ససేమిరా చేయడు. పైగా, 'శరీరం ఏమైనా చేయనీ, మనసులో మాత్రం నేను భగవంతుణ్ణే చింతనచేస్తూ ఉంటాను' అని అనుకుంటాడు. ఒకేకాలంలో యోగం, భోగం రెంటినీ తాను పొందగలడనే అనుకొంటాడు. అలా ఆత్మవంచన చేసుకొంటాడు. తన గొంతును తానే కోసేసుకుంటాడు. అయితే వెలుగు చీకట్ల మాదిరి - యోగం, భోగం రెండూ ఎప్పుడూ కలసి ఉండలేవు. కామ కాంచనయుత సాంసారిక సుఖాలను అనుభవిస్తూ, భగవత్సాక్షాత్కారాన్ని కూడ అదేకాలంలో, అదే స్థితిలో పొందగల సులభమార్గాన్ని, ఆధ్యాత్మిక ప్రపంచంలో ఇంతవరకూ ఎవరూ కనిపెట్టలేకపోయారు.[2] కాబట్టే శాస్త్రాలు, 'దేన్ని త్యాగం చెయ్యాలో దాన్ని మనోవాక్కాయాల ద్వారా త్యాగం చెయ్యాలి. దేన్ని అనుష్ఠించాలో దాన్ని మనోక్కాయాల ద్వారా అనుష్ఠించాలి. అప్పుడే సాధకుడు ఈశ్వరదర్శనానికి యోగ్యుడౌతాడు' అని పదేపదే ఘోషిస్తున్నాయి. అందుకే ఋషులు, 'మానసిక

---

1. శ్రీ శివనాథశాస్త్రి రచించిన 'శ్రీరామకృష్ణుల గూర్చిన వ్యక్తిగత స్మృతులు' Personal, Reminiscences of Ramakrishna Paramahamsa, Vide Modern Review for Nov.1910.

2. Ye Cannot Store God and Mammon together *(The Holy Bible. Matth. vi.24)*

భావాలను ఉద్దీప్తం చేసే శారీరక చిహ్నాలు, బాహ్య అనుష్ఠానాలు లేని తపస్సు ద్వారా (తపసోవాప్య లింగాత్)[1] మనిషి ఎప్పటికీ భగవత్సాక్షాత్కారాన్ని పొంద లేడు' అని చెబుతుంటారు. యుక్తి కూడ ఇదే విషయాన్ని - 'మనసనేది స్థూలం నుండి సూక్ష్మానికి - సూక్ష్మం నుండి కారణానికి - ఇలా క్రమక్రమంగా ముందుకు వెళుతుంది' అని స్పష్టం చేస్తున్నది. 'నాన్యః పంథా విద్యతేఽయ నాయ'[2] త్యాగం చేయడం తప్ప భగవత్ ప్రాప్తికి మరో మార్గం లేదు.

పెద్దన్న పరమపదించినప్పటి నుండి శ్రీరామకృష్ణులు జగన్మాత పూజలోనే తమ మనసును ఏకాగ్రం చేయడం కొనసాగించారని తెలియజేశాము. జగజ్జనని దర్శనాన్ని పొందడానికి ఏవి దోహదం చేస్తాయని గ్రహించారో, వాటి నన్నింటినీ ప్రగాఢ విశ్వాసంతో గట్టి పట్టుదలతో, చిత్తశుద్ధితో ఆయన అనుష్ఠించడం మొదలు పెట్టారు. ఈ సమయంలో యథావిధిగా పూజను ముగించి, ప్రతి నిత్యం రామ్‌ప్రసాద్ మొదలైన భగవత్సాక్షాత్కారం పొందిన భక్తులు రచించిన భక్తిగీతాలను మాతకు వినిపించడం పూజలో ఒక విశేష భాగంగా భావించారన్న విషయాన్ని గురుదేవుల ముఖతా మేము విన్నాం. గంభీర ఆధ్యాత్మిక భావమయమైన ఆ భక్తి పాటలను పాడుతుంటే, ఆయన హృదయం ఎంతో ఆనందంతో, ఉత్సాహంతో నిండిపోయేది. 'రామ్‌ప్రసాద్ లాంటి భక్తులు తల్లి దర్శనాన్ని పొందారు. కాబట్టి ఎవరైనా సరే జగన్మాత దర్శనాన్ని నిశ్చయంగా పొందవచ్చు. మరి ఆ తల్లి దర్శనం నా కెందుకు కలగటం లేదో!'' అను కొని ఆయన చింతించేవారు. వ్యాకుల హృదయంతో, ''అమ్మా! నువ్వు రామ్‌ప్రసాద్‌కు దర్శనమిచ్చావు. మరి నా కెందుకు దర్శన మివ్వవు? తల్లీ! నేను ధనం - భోగం - సుఖం - బంధుమిత్రులు - ఇవేమీ కోరను. నాకు నీ దర్శనం మాత్రమే చాలు'' అని ప్రార్థించేవారు. అలా ప్రార్థిస్తూ కన్నీరుమున్నీరుగా విల పించేవారు. ఆ కన్నీటితో ఆయన వక్షస్థలం తడిసిపోయేది. ఇలా హృదయభారం కాస్త తేలిక పడుతుంటే, తల్లిపట్ల విశ్వాసంతో కాస్త ఉపశమనం చెందిన తదుపరి మళ్లీ ఆయన పాటలు పాడేవారు. తల్లిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించే వారు. ఇలా పూజ, ధ్యానం, భజనలతో ఆయన రోజులు గడిపేవారు. ఆయన హృదయంలో భగవదనురాగం - వ్యాకులత దినదినం ఉద్ధృతంగా పెంపొంద సాగాయి.

10. ఈ స్థితిలో శ్రీరామకృష్ణుల దేవీ పూజా కార్యకలాపాలు

---

1. ముండక ఉపనిషత్తు 3.2.4
2. శ్వేతాశ్వతర ఉపనిషత్తు. 6.15

క్రమంగా ఆయన పూజచేసే సమయం, నిష్ఠ కూడ పెరగసాగాయి. ఒక్కో-మారు పూజకు కూర్చుని, విధి ప్రకారం ఒక పుష్పాన్ని తల మీద పెట్టుకోగానే ఆయన ధ్యానంలోకి వెళ్ళిపోయి దాదాపు రెండు గంటలసేపు అలా శిలాప్రతిమలా ఉండిపోయేవారు. లేదా తల్లికి ఆహారపదార్థాలను నివేదించి, ఆమె భోంచేస్తున్నదని భావిస్తూ అలా చాలాసేపు నిరీక్షిస్తూ ఉండిపోయేవారు. ఒక్కోమారు తెల్లవారుజామున లేచి, స్వయంగా పువ్వులు సేకరించి మాల కట్టి, వాటితో దేవిని అలంకరించడంలో ఎంతోసేపు గడిపేవారు. అలాగే ఎంతో భక్తిభావంతో సంధ్యాకాలం ఆరతిని చాలాసేపు నిర్వహించేవారు. మధ్యాహ్నం జగన్మాతకు పాటలు పాడి వినిపించేవారు. తన్మయులైపోయేవారు. అప్పుడు సమయం గూర్చి అసలు పట్టించుకొనేవారు కాదు. సమయం మించిపోతున్నదని చెబుతున్నా సంధ్య ఆరాత్రికం మొదలైన ఉపచారాలను సరైన సమయంలో ఆయన నిర్వర్తించలేక పోయేవారు. శ్రీరామకృష్ణులు ఇలా తమ పూజను కొంతకాలం నిర్వర్తిస్తూ వచ్చారు.

ఇలాంటి నిష్ఠ - భగవద్భక్తి - వ్యాకులత చూస్తున్న సాధారణ భక్తజనులు వారి వైపు ఆకర్షితులయ్యారన్న విషయాన్ని ఇప్పుడు మనం స్పష్టంగా గ్రహించవచ్చు. సాధారణంగా లోకులు ఏ మార్గంలో వెళుతుంటారో ఆ మార్గాన్ని వదలి ఎవరైనా మరో కొత్త మార్గంలో వెళితే, లేదా భిన్నరీతిలో మరేదైనా చేస్తే - జనసామాన్యం అతణ్ణి మొదట్లో వెర్రివాడి కింద జమకడుతుంది, ఎగతాళి చేస్తుంది. అయితే ఆ వ్యక్తి దృఢసంకల్పంతో దీక్షగా తన గమ్యంవైపు ప్రగతి సాధిస్తూపోతే, లోకుల అభిప్రాయం కూడ తదనుగుణంగా మారుతూ వస్తుంది. వారిలో ఆ వ్యక్తిపట్ల భక్తిగౌరవాలు పెంపొందుతాయి. శ్రీరామకృష్ణుల విషయంలో కూడ ఇలాగే జరిగింది. పై రీతిని శ్రీరామకృష్ణులు పూజలు చేస్తూంటే, మొదట్లో చాలామంది అవన్నీ అతడి పిచ్చి పనుల కింద జమకట్టి, హేళన చేశారు. కాని కొంత కాలం తర్వాత మాత్రం కొంతమందికి ఆయనపట్ల భక్తి - శ్రద్ధలు కలిగాయి. ఈ సమయంలో ఒకమారు మథుర్‌బాబు శ్రీరామకృష్ణుల పూజను చూసి, పరమ సంతుష్టుడై, ''మేము అద్భుతమైన పూజారిని పొందాం. దేవి సత్వరమే జాగృతమౌతుంది'' అని రాణీ రాస్మణికి చెప్పాడని మేము విన్నాం. కాని జనుల అభిప్రాయాలు ఏవైనా సరే అవి శ్రీరామకృష్ణుల నెప్పుడూ విచలితం చేయలేదు. ఆయనను తన మార్గం నుండి ఇసుమంత కూడ తప్పించలేదు. సముద్రం వైపుకు తిన్నగా పరుగులు పెట్టే నదిలా ఆయన మనసు నిర్విరామంగా ఒకే ఒక్క-భావంతో జగన్మాత చరణారవిందాలవైపు ఉరుకులు పరుగులు పెట్టసాగింది.

11. శ్రీరామకృష్ణుల పూజాదుల గూర్చి మథుర్‌బాబు ప్రశంస

భవతారిణి

12. భగవదనురాగం పెంపొందేకొద్దీ, శ్రీరామకృష్ణుల శారీరక మార్పులు

ఒక్కో రోజు గడిచిపోతున్నకొద్దీ, శ్రీరామకృష్ణుల మనసు భక్తి కారణంగా మరింత వ్యాకులత చెందసాగింది. నిర్విరామంగా ఒకే దిశన వెళుతున్న ఆయన మనస్సు ఆయన శరీరంలో రకరకాల మార్పుల ద్వారా వ్యక్తం కాసాగింది. ఆయన నిద్ర - ఆహారాదులు చాలా వరకు తగ్గిపోయాయి. శరీరంలోని రక్తం చాలా వేగంగా వక్షస్థలం - శిరస్సుల వైపు ప్రవహించడం మూలంగా, ఆయన వక్షస్థలం ఎప్పుడూ ఎర్రబారి ఉండేది. కళ్లు హఠాత్తుగా జలపూరితమయ్యేవి. భగవద్దర్శనం కోసం పరమ వ్యాకులతతో, 'ఏం చేయాలి, అమ్మ

దర్శనం ఎలా పొందాలి?' అన్న చింతనతో అనుక్షణం వ్యథ చెందుతూ ఉండేవారు. కాబట్టి పూజా సమయాల్లో తప్ప, మిగతా వేళల్లో వారి మనశ్శరీరాలు పరమ అశాంతితో ఆందోళనతో ఉండేవి.

ఆయనే స్వయంగా చెప్పగా ఈ విషయం మేం విన్నాం:

ఆ సమయంలో ఒక రోజు ఆయన పాటలు పాడుతూ జగన్మాతకు వినిపిస్తూ ఉన్నారు. అదే సమయంలో పరమ వ్యాకులతతో, ''అమ్మా! ఇంతగా పిలుస్తున్నానే, నీ కింకా వినిపించటంలేదా? రామ్‌ప్రసాద్‌కు దర్శనమిచ్చావు కదా, మరి నాకు కనిపించవా?'' అని విలపించేవారట.

శ్రీరామకృష్ణులు ఇలా చెబుతుండేవారు:

''అమ్మను చూడకపోతున్నానే అన్న వ్యథతో నా హృదయం దుర్భరవేదనకు గురయ్యేది. తడిబట్టను పిండినట్లుగా, నా హృదయాన్నెవరో మెలిపెట్టి పిండుతున్నట్లు అనిపించేది. ఈ జన్మ కిక అమ్మ దర్శనభాగ్యం లభించదన్న బాధతో నేనెంతగానో పరితపించేవాడిని. ఆ పరితాపం దుర్భరమైపోయింది. నాకు బతకాలనే ఆశ సన్నగిల్లింది. అమ్మను చూడని ఈ బ్రతుకెందుకు అనిపించింది. ఆ స్థితిలో అమ్మ గుడిలో ఉన్న ఖడ్గం మీద నా చూపు పడింది. దాంతో ఆ క్షణంలో నా జీవితాన్ని అంతం చేసుకోవాలనిపించింది. వెంటనే పిచ్చిగా వెళ్లి ఆ ఖడ్గాన్ని చేతిలోకి తీసుకున్నాను. అంతే, ఒక్కమారుగా 'అమ్మ అద్భుత దివ్యదర్శనం' కలిగింది. నేను దేహస్మృతిని కోల్పోయి, నేల మీద పడిపోయాను. బాహ్యప్రపంచంలో ఏం జరిగిందో, ఆ రోజు, మరురోజు కూడ ఎలా గడిచాయో నాకు తెలియదు. కాని అంతరంగంలో మాత్రం అంతకు ముందు నేనెన్నడూ అనుభవించని దివ్యానంద ప్రవాహంలో జగన్మాత సాక్షాత్కారాన్ని అనుభవిస్తూ ఉండిపోయాను.''

13. మహావ్యాకులతానంతరం జగజ్జనని దర్శనం

ఈ అద్భుత దర్శనం గూర్చి, శ్రీరామకృష్ణులు మరొకసారి మా కిలా చెప్పారు:

''నా కప్పుడు ఇళ్ళూ - వాకిళ్ళూ - ఆలయం - అన్నీ క్షణంలో అదృశ్యమైపోయాయి. ఎక్కడా ఏమీ లేదని అనిపించింది. తీరాలులేని అనంత చైతన్య జ్యోతిస్సముద్ర మొకటి నాకు కనిపించింది. ఎటువైపు ఎంత దూరం చూసినా, అన్ని దిక్కుల నుండి ఆ ఉజ్జ్వలసాగర తరంగాలు భయంకర ఘోషతో నన్ను మింగివేయడానికి మహావేగంతో నా వైపు రాసాగాయి. కన్నుమూసి తెరిచేంతలోగా అవి నన్ను ముంచేసి, ఉక్కిరిబిక్కిరి చేసేశాయి. నేను స్మృతి తప్పి క్రింద పడిపోయాను.''

కాళీమాత ఖడ్గం

ప్రథమ దర్శన కాలంలో తామిలా చైతన్య సముద్రాన్ని దర్శించామని ఆయన మాకు చెప్పారు. కాని చైతన్య స్వరూపిణి అయిన జగన్మాత వరాభయ మూర్తిని దర్శించారా వారు? ఈ జ్యోతిస్సముద్రంలో మరి ఆ దివ్యమూర్తి దర్శనం కూడ వారికి లభించిందా? లభించిందనే అనుకోవాలి. ఎందుకంటే ఆ ప్రథమదర్శన సమయంలో ఒకింత బాహ్యస్మృతి వచ్చిన తర్వాత ఎంతో ఆతురతతో ''అమ్మా, అమ్మా'' అని పిలిచారని మేము విన్నాం.

పైన చెప్పుకున్న 'దర్శనం' ఘటన ముగిసిన తర్వాత, జగజ్జనని చిన్మయ దర్శనాన్ని అవిచ్ఛిన్నంగా, సదా సర్వదా పొందాలనే కోరిక శ్రీరామకృష్ణులకు ఏర్పడింది. ఆ కోరికను నెరవేర్చుకోవడం కోసం ఆయన ఎంతగానో పరితపించసాగారు. ఎప్పుడూ విలపిస్తూ ఉండడం లాంటి బాహ్య లక్షణాల ద్వారా ఈ పరితాపం, వ్యక్తమయ్యేది కాదు. కాని అది ఆయన అంతరంగంలో సర్వదా జాజ్వల్యమానంగా ఉండేది. ఒక్కోమారు ఈ పరితాపం అపరిమితంగా ఉండేది. దాంతో ఆయన నేలమీద పడి బాధతో సతమతమయ్యేవారు. ''అమ్మా! నన్ను అనుగ్రహించు తల్లీ, నీ దర్శన మివ్వు తల్లీ!'' అంటూ ప్రార్థించేవారు. విలపించేవారు. వారి విలాపం విని జనం చుట్టూ మూగేవారు. ఆ సమయంలో అలాంటి అస్థిరత్వాన్ని చూసి జనం ఏమనుకుంటారోనన్న భావన ఆయనకు ఏమాత్రమూ ఉండేది కాదు. ''జనం నా చుట్టూ మూగినా, వారంతా కేవలం నీడల మాదిరి, తెర మీద గీచిన బొమ్మల మాదిరి కనిపించేవారు. అందుకే వారెదుట సిగ్గూ - సంకోచాలేవీ కలిగేవి కావు. కాని అమ్మ ఎడబాటు వలన దుర్భరవేదన కారణంగా స్పృహ కోల్పోయినప్పుడల్లా తక్షణమే, నిరుపమాన తేజోరూపంతో, వరాభయహస్తాలతో తల్లి చిన్మయ స్వరూపం ప్రత్యక్షమయ్యేది. ఆ స్వరూపం నవ్వేది, మాట్లాడేది, ఎన్నో రకాలుగా నన్ను బుజ్జగిస్తూ, నాకు తగిన శిక్షణ గరపుతూ ఉండేది. ఇదంతా నాకు గోచరిస్తూనే ఉండేది'' అంటూ ఆయన చెప్పేవారు.

7. సాధన - దివ్యోన్మాదం

1. ప్రథమ దివ్య దర్శనానంతర స్థితి

జగన్మాత ప్రథమ దర్శనంతో శ్రీరామకృష్ణులు మహదానందంలో లీనమై పోయారు. ఆ కారణంగా కొన్నిరోజుల వరకు ఆయన ఏ పనీ చేయలేకపోయారు. విధివిహితంగా పూజాదులను చేయడం ఆయనకు అసంభవమైపోయింది. అందుచేత హృదయ్ మరొక బ్రాహ్మణుని సహాయంతో వాటిని ఎలాగో ముగించేవాడు. తన మామ వాతప్రకోపంతో బాధపడుతున్నాడని ఎంచి, ఆయనకు చికిత్స చేయించసాగాడు. భూకైలాస సంస్థాన రాజకుటుంబ వైద్యులొకరితో అతడికి ఎలాగో పరిచయ మయింది. అతడితోనే శ్రీరామకృష్ణులకు చికిత్స చేయించసాగాడు. కాని రోగం అంత త్వరగా నయం కావడం సాధ్యం కాదని గ్రహించి ఆ విషయాన్ని కామార్పుకూర్‌కు కబురు చేశాడు.

2. వినూత్న భౌతిక సంచలనాలు, మానసిక స్ఫురణలు

భగవద్దర్శనం కోసం అత్యంత వ్యాకులతతో ఉండని రోజు, బాహ్యస్మృతి అంతగా కోల్పోని రోజు మాత్రం శ్రీరామకృష్ణులు యథాప్రకారం పూజ చేయడానికి పూనుకునేవారు. పూజ, ధ్యానాదులు చేస్తున్నప్పుడు తమ ఆలోచనలు, అనుభూతులు ఎలా ఉండేవో, ఆయన అప్పుడప్పుడు మాకు చెబుతూ ఉండేవారు.

''అమ్మ భవతారిణి ఆలయానికి ఎదురుగా నాట్యశాల ఉండేది. ఆ నాట్యశాల పిట్టగోడ మీద ధ్యానస్థ భైరవ విగ్రహం ఒకటుండేది. ధ్యానం చేయబోతున్నప్పుడు దాన్ని చూపి నా మనసుకు, 'నువ్వలా నిశ్చలంగా, నిశ్శబ్దంగా కూర్చుని అమ్మ పాదారవిందాలను ధ్యానించాలి' అంటూ చెప్పేవాడిని. నేను ధ్యానానికి కూర్చోగానే, శరీరంలోని అవయవాల కీళ్లను, పాదాల నుండి పైదాకా 'ఖట్ - ఖట్' అనే ధ్వనితో లోనుండి ఎవరో ఒకటి తర్వాత ఒకటి తాళంవేసి

బిగిస్తున్నట్లు అనిపించేది. ధ్యానిస్తున్నంత వరకు శరీరాన్ని కదిలించేందుకు - ఆసనాన్ని మార్చేందుకు - లేదా ధ్యానం వదిలి ఇచ్ఛ వచ్చినట్లు మరెక్కడికైనా వెళ్లి, మరేమైనా చేయడానికి సాధ్యమయ్యేది కాదు. మళ్లీ 'ఖట్ - ఖట్' శబ్దాంతో పై నుండి కిందికి కీళ్ల తాళాలన్నీ తెరిచేదాకా, నన్నెవరో బలవంతంగా అదిమి కూర్చోబెట్టినట్లు అనిపించేది.

''ధ్యానానికి కూర్చున్న తర్వాత ముందుగా మిణుగురు పురుగుల లాంటి జ్యోతిబిందువులను గాంచేవాణ్ణి. మరోమారు, మంచులా జ్యోతి దొంతరలు నలువైపులా వ్యాపిస్తూ కనిపించేవి. మరోసారి కరిగిన వెండిలా ధగధగ మెరిసే తరంగాలు సర్వత్రా వ్యాప్తమై ఉన్నట్లనిపించేది. కళ్లు మూసి ఉండగానే నా కివన్నీ గోచరించేవి. కళ్లు తెరిచిన తర్వాత కూడ ఇలాంటి దృశ్యాలు కనిపించేవి. వాటి అర్థమేమిటో, వాటి దర్శనం మంచిదో కాదో నాకు తెలిసేది కాదు. అందుచేత పరమ వ్యాకులతతో అమ్మను 'నాకేమవుతున్నదో అర్థం కావడం లేదు. నిన్ను పిలిచే మంత్రతంత్రాదులేవీ నాకు తెలియవు. నీ దర్శనం నా కెలా కలుగుతుందో, ఆ మార్గాన్ని నువ్వే నాకు బోధించు అమ్మా! నువ్వు తప్ప నాకు మరెవరు నేర్పుతారు? నువ్వు తప్ప నాకు మరి దిక్కెవ్వరు? మరెవ్వరు సహాయం చేస్తారు?' అంటూ ఏకాగ్రచిత్తంతో ప్రార్థించేవాణ్ణి. దుఃఖం ఎక్కువైతే బిగ్గరగా విలపించే వాడిని.''

3. జగన్మాత దర్శనానంతరం శ్రీరామకృష్ణుల భావనల, చర్యలలో మార్పు

ఈ సమయంలో శ్రీరామకృష్ణుల పూజాధ్యానాదులు ఒక కొత్తరూపాన్ని దాల్చాయి. ఆ అద్భుత తన్మయత్వం, జగన్మాతను పసివాడిలా ఆశ్రయించిన ఆ సరళత, ఆ అపార విశ్వాసం, ఆమెపై ఆధారపడివుండడం లోని మాధుర్యం - వీటిని ఇతరులకు అర్థమయ్యేటట్లు చెప్పడం చాలకష్టం. వయోజనులలో కనిపించే గాంభీర్యం, దేశకాలపాత్రానుగుణమైన విధినిషేధాలు, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇహపరాల్లో వ్యవహరించడం - ఇవేవీ శ్రీరామకృష్ణుల ఆచరణలో కనిపించేవి కావు. కాళీమాతను ఆయన చూసినప్పుడల్లా, ''అమ్మా! నిన్నే శరణుపొందిన ఈ బిడ్డతో ఏం మాట్లాడాలో అలా మాట్లాడించు. ఏం చేయాలో అలా చేయించు'' అన్న ఆశ్రితభావం కనిపించేది. ఇచ్ఛామయి జగన్మాత ఇచ్ఛలో, తన ఇచ్ఛను - అహంకారాన్ని పూర్తిగా లయం చేసి ఆమె చేతిలో కీలుబొమ్మగా మారి వారిప్పుడు అన్ని పనులు చేయసాగారు. అలాంటి పరిస్థితుల్లో సామాన్య ప్రజల నమ్మకాలకు, కార్యాలకు; శ్రీరామకృష్ణుల ప్రవర్తన, ఆచరణలకు మధ్యన ఒక పెద్ద తేడా కనిపించేది. వారి ఆచరణను చూసి, ఎంతోమంది రకరకాలుగా గుసగుసలాడేవారు. తర్వాత బహిరంగంగా పలక

సాగారు. కాని శ్రీరామకృష్ణులు వీటిని అసలు లెక్కపెట్టలేదు. తాము ఇప్పుడు జగజ్జనని కనుసంజ్ఞల ఆదేశం ప్రకారం వర్తిస్తున్నారు కదా! ఆ క్షుద్ర ప్రాపంచిక కోలాహలాలు వారి చెవుల నెలా తాకుతాయి? ప్రపంచంలో ఉన్నా, వారిలో ప్రాపంచికత ఉండేది కాదు. బాహ్యప్రపంచం వారికిప్పుడు స్వప్నతుల్యంగా కనిపించసాగింది. ఎంత ప్రయత్నించినా అది 'వాస్తవం' అన్న బోధ ఆయనకు కలిగేది కాదు. జగన్మాత ఆనందఘన చిన్మయమూర్తి ఒక్కటి మాత్రమే వారికి ఏకైక సత్యంగా గోచరించేది.

4. శ్రీరామకృష్ణుల పూజ - దర్శనాదుల్లో మునుపటికి ఇప్పటికి మధ్య కనిపించే వ్యత్యాసం

పూర్వం పూజ ధ్యానాదులు చేస్తున్నప్పుడు ఒక్కోమారు తల్లి చేతినో, కాంతిమంతమైన అమ్మ సుకోమల పాదాన్నో, కోటిసుధాకిరణోజ్జ్వల సుమధుర మాత మధుర మందహాసాన్నో శ్రీరామకృష్ణులు దర్శిస్తుండేవారు. ఇప్పుడు మాత్రం పూజ ధ్యానాది సమయాల్లోనే కాకుండా, ఇతర సమయాల్లో సైతం అతిలోక సౌందర్యంతో విరాజిల్లే జ్యోతిర్మయి జగన్మాతను దర్శించసాగారు. ఆమె నవ్వడం, మాట్లాడడం తనను అదీ ఇదీ చేయమనడం, తనను అంటిపెట్టుకుని ఉండడం - ఇవన్నీ అనుభూతం చేసుకోసాగారు.

పూర్వం తల్లికి నైవేద్యం అర్పించినప్పుడు, అమ్మ నేత్రాల నుండి ఒక అపూర్వకాంతి ధగధగా మెరుస్తూ వెలువడి, ఆ నివేదిత పదార్థాల నన్నింటినీ స్పర్శించి వాటి సారాన్ని గ్రహించి, తిరిగి ఆమె కళ్లల్లోకే తిరోహితమయ్యేది. ఇప్పుడు మాత్రం నైవేద్యాన్ని సమర్పించినంతనే, లేదా అంతకు ముందే తన దివ్య తేజస్సుతో ఆలయాన్నంతా ప్రకాశమానం చేస్తూ, భుజించడానికి సాక్షాత్తూ అమ్మే కూర్చోవడం శ్రీరామకృష్ణులు దర్శించసాగారు. హృదయ్ నుండి మేమీ క్రింది విషయం విన్నాం:

ఒక రోజు హృదయ్ పూజాసమయానికి అక్కడికి వెళ్లాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు మందార పువ్వుల, బిల్వపత్రాల అర్ఘ్యాన్ని చేతిలోకి తీసుకుని, నైవేద్యాన్ని అమ్మకు అర్పించబోతూ మంత్రపఠనం చేయబోతున్నారు. ఆ సమయంలో హఠాత్తుగా శ్రీరామకృష్ణులు, 'ఉండమ్మా, ఉండు. ముందు మంత్రాన్ని చదవనీ, ఆ తర్వాత తిందువుగాని' అని అనడం విన్నాడు. అలా అంటూ లేచి, పూజ పూర్తి కాకుండానే నైవేద్యాన్ని నివేదించారు.

పూర్వం పూజాసమయాల్లో కాళీ విగ్రహంలో సజీవ చైతన్యమూర్తిని దర్శించేవారు. ఇప్పుడు అసలు ఆలయంలో రాతి విగ్రహం వారికి గోచరమయ్యేది కాదు. జగత్తునంతా తన చైతన్యంతో, చైతన్యస్వరూపిణిగా భాసిస్తే ఆ చిద్ఘనరూపిణి, ఆ చైతన్యమయి వరాభయహస్తాలతో శోభిస్తూ సర్వదా వారికి ప్రత్యక్షమవ...

79092

సాగింది. ''అమ్మ ముక్కు వద్ద చేయిపెట్టిచూస్తే నిజంగానే ఆ తల్లి ఊపిరి పీలుస్తున్నట్లుండేది'' అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ''రాత్రివేళ దీపకాంతిలో తల్లి దివ్యదేహపు నీడ గోడ మీద పడుతుందేమోనని ఎంత సూక్ష్మంగా పరిశీలించినా, అది కనిపించేది కాదు. నేను నా గదిలో ఉండగా, అమ్మ కాలి అందెల 'ఘల్లు - ఘల్లు' రవళులు నా చెవినబడేవి. అమ్మ చిన్నపిల్లలా గెంతుతూ ఆనందంతో పైకి వెళ్ళేది. నేనది విని వెంటనే గది బయటికి వచ్చి చూసేవాణ్ణి. నిజంగానే అమ్మ ఆలయం రెండవ అంతస్తు వరండాలో నిలబడి శిరోజాలు ఆరవేసుకొంటూ కలకత్తా వైపు, గంగానది వైపు చూస్తూ కనిపించేది'' అని వివరించేవారు.

హృదయ్ ఇలా చెబుతుండేవాడు:

''శ్రీరామకృష్ణులు ఆలయంలో ఉన్నప్పుడు సరే సరి, ఆయన ఆలయంలో లేని సమయంలో కూడ, ఆలయంలోకి ప్రవేశిస్తే తక్షణమే ఏదో అనిర్వచనీయ దివ్యపారవశ్యంతో ఒడలు జలదరించేది. పూజాసమయంలో శ్రీరామకృష్ణులు ఎలా ప్రవర్తిస్తుంటారో చూద్దామన్న కుతూహలాన్ని ఆపుకోలేకపోయేవాణ్ణి. చాలాసార్లు అక్కడికి హఠాత్తుగా వెళ్ళి చూసేవాడిని. ఆ దృశ్యం చూసి భక్తివిస్మయాలతో నా మనసు పూర్ణమయ్యేది. కాని బయటికి రాగానే మళ్ళీ సందేహం కలిగేది. 'మామ నిజంగానే పిచ్చివాడైపోయాడేమో' అని అనుకునేవాణ్ణి. లేకపోతే పూజాసమయంలో ఇలా విపరీతంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? ఈ పూజను గూర్చి రాణిగారికి లేదా మథుర్‌బాబుకు తెలిస్తే వారేమనుకుంటారో అని భయపడేవాడిని. కాని మా మామ మనసులో అలాంటి తలంపు ఉండేదే కాదు. చెప్పినా వినేవాడు కాదు. ఆయనతో ఎక్కువగా మాట్లాడడం కూడ నాకు సాధ్యమయ్యేది కాదు. ఏదో ఒక తెలియరాని భయం, సంకోచం నన్నడ్డుకునేవి. అంతేకాక నాకూ ఆయనకూ మధ్య ఎంతో ఎడం ఉన్నట్లు అనిపించేది. అందుచేత మరేమీ చేయలేక, మౌనంగా వారి సేవచేస్తూ ఉండిపోయేవాణ్ణి. కాని ఎప్పుడో ఒకసారి మామ ఏదో విపరీతం చేస్తాడని మాత్రం అనిపించేది.''

5. ఈ సమయంలో శ్రీరామకృష్ణుల పూజ గురించి హృదయ్ దృక్పథం

పూజాసమయంలో హఠాత్తుగా గర్భగుడిలోకి వెళ్ళినప్పుడు శ్రీరామకృష్ణుల ప్రవర్తనను చూసి, తాను భక్తి - విస్మయ - భయాలతో ఉండిపోయేవాణ్ణే అంటూ హృదయ్ ఇంకా ఇలా చెప్పాడు:

''మందారపుష్పాల, బిల్వపత్రాల అర్ఘ్యాన్ని మామ ముందుగా తన తలపై పెట్టుకునేవాడు. తన వక్షానికి తాకించి, శరీర అవయవాలను స్పృశించి, తన కాళ్లను ముట్టి ఆ తర్వాత దాన్ని అమ్మ పాదపద్మాల్లో అర్పించేవాడు. బాగా తాగిన

వాడి మాదిరిగా ఆయన ఎద ఎఱ్ఱబారి ఉండేది. తూలుతూ ఉండేవాడు. అలా తూలుతూ దేవి పీఠాన్ని ఎక్కి, చుబుకాన్ని పుచ్చుకొని బుజ్జగించేవాడు. పాటలు పాడేవాడు. ఛలోక్తులు ఆడేవాడు. ఆమెతో మాట్లాడేవాడు. అమ్మ చేతిని పుచ్చుకుని నృత్యం చేసేవాడు. ఇవన్నీ నేను కళ్లారా చూశాను.

''అమ్మకు నైవేద్యం అర్పిస్తూ, హఠాత్తుగా లేచి నిలబడేవాడు. ఒక అన్నం ముద్దను తీసుకుని, వేగంగా వేదికనెక్కి, అమ్మ నోట్లో అన్నం పెట్టి - 'తినమ్మా, తిను బాగా తిను తల్లీ' - అంటూ చెప్పేవాడు. కాసేపాగి - 'ముందు నన్ను తినమంటావా? సరే, అలాగే, ఇదుగో తింటున్నాను' - అని, కొంత తాను తినేవాడు. మిగిలిన దాన్ని మళ్లీ అమ్మ నోట్లోపెట్టి - 'నేను తిన్నాగా, ఇక నువ్వు తిను' - అనేవాడు.

''ఒకరోజు నైవేద్యం పెట్టే సమయంలో గర్భగుడిలోకి ఒక పిల్లి దూరింది. 'మ్యావ్-మ్యావ్' అని అరవసాగింది. అది చూసి, - 'అమ్మా అన్నం తింటావా, తినమ్మా - అంటూ ఆయన ఆ నైవేద్యాన్నంతా పిల్లికి తినిపించాడు. ఒకరోజు అమ్మను శయనింపచేశాడు. - 'నన్నుకూడ నీ ప్రక్కనే పడుకోమంటావా, సరే అలాగే' అంటూ, అమ్మ వెండిమంచంపైన తను కాసేపు పడుకొన్నాడు. ఆయన పూజకు సిద్ధమై ధ్యానం చేస్తూ, చాలాసేపటి వరకు అందులో లీనమైపోయే వాడు. తెల్లారగట్టే లేచి, పూలు కోసుకునేవాడు - అమ్మకు మాలలు తయారు చేయడంకోసం. ఆ సమయంలో ఆయన ఎవరితోనో మాట్లాడుతూ, నవ్వుతూ, బుజ్జగిస్తూ, హాస్యం చేస్తూ ఉండేవాడు. రాత్రిళ్లు అసలు నిద్రపోయే వాడు కాదు. ఆయనెప్పుడూ భావావేశంలో ఉంటూ మాట్లాడుతూ - పాటలు పాడుతూ ఉండేవాడు లేదా పంచవటిలోకి వెళ్లి ధ్యానం చేసుకునేవాడు.''

''మా మామ విపరీత చేష్టలను చూసి ఎంతో కంగారుపడేవాణ్ణి. ఈ విషయం గూర్చి ఎవరికైనా ఎలా చెప్పాలి? ఎవరికైనా తెలిస్తే, విషయం పైవారికి తెలుస్తుంది. అప్పుడు మా మామకు హాని కలుగవచ్చు'' అని చెప్పాడు హృదయ్.

6. శ్రీరామకృష్ణుల విపరీత చేష్టలను చూసి ఆలయ ఉద్యోగులు మథుర్‌బాబుకు విన్నవించడం

ఒకటి రెండు రోజుల మాట కాదు గదా! ప్రతిరోజూ జరుగుతున్న విషయమే! ఎంతకాలం దాగుతుందది?

హృదయ్‌లాగే మరికొందరు కూడ శ్రీరామకృష్ణుల విపరీత చేష్టలను చూసి, ఆ విషయం ఆలయ ఉద్యోగులకు ఫిర్యాదుచేశారు. ఆ ఉద్యోగులు స్వయంగా వచ్చి, ఆ విషయాన్ని రూఢిపరచుకొన్నారు. కాని దేవీ భావనలో ఉన్నా, నిస్సంకోచంగా వ్యవహరిస్తూ, సర్వం మరచివున్న శ్రీరామకృష్ణుల ఆకృతి చూసి వారు ధైర్యంగా ఆయనను ఏమాత్రమూ హెచ్చరించలేకపోయారు. కాని

తమలో తాము సంప్రతించుకుని, వారంతా ఒక నిర్ణయానికి వచ్చారు. 'భట్టాచార్య (పూజారి)లకు పిచ్చిపట్టింది. లేదా ఏదో క్షుద్రదేవత అతణ్ణి ఆవేశించింది. లేకపోతే శాస్త్రవిరుద్ధంగా పూజను ఎవరైనా చేస్తారా? ఏది ఎలా ఉన్నా, దేవీపూజ - నైవేద్యాదులు సముచితంగా జరగడం లేదు. భట్టాచార్యులు అంతా అపవిత్రం చేసేస్తున్నాడు. మనం ఇంకా ఊరకుంటే బాగుండదు. వెంటనే ఆలయ యజమానులకు తెలియచేద్దాం' అని నిర్ణయించుకున్నారు.

మథుర్‌బాబుకు శ్రీరామకృష్ణుల విపరీత పూజల గురించి వర్తమానం పంపారు. అతడు అంతా చూసి, అందుకు జవాబుగా ఇలా వ్రాసి పంపాడు. ''సరే, వీలు చూసుకుని త్వరలో స్వయంగా నేనే వచ్చి అంతా పరిశీలిస్తాను. చూశాక ఏం చేయాలో ఆలోచిస్తాను. కాని అంతవరకు భట్టాచార్యులను ఎవరూ ఏమీ అనకండి. వారెలా పూజ చేస్తున్నారో అలాగే చేయనివ్వండి.''

ఆ తర్వాత ఆలయ ఉద్యోగులు మథుర్‌బాబు రాక కోసం ఆతురతతో ఎదురు చూడసాగారు. 'ఇక భట్టాచార్యుల పని అయినట్టే. అతణ్ణి తప్పకుండా సాగనంపుతారు. లేకపోతే ఇంత అనాచారం చేస్తాడా? దేవి మాత్రం ఎంతకాలం సహిస్తుంది?' అని అనుకున్నారు.

చెప్పినట్లే మథుర్‌బాబు ఒక రోజు హఠాత్తుగా ఆలయానికి వచ్చాడు. శ్రీరామకృష్ణుల పూజాకార్యాన్నంతా పరిశీలించసాగాడు. అలా చాలాసేపు చూశాడు. ఆధ్యాత్మిక తన్మయావస్థలో, సర్వం మరిచి ఉన్న శ్రీరామకృష్ణులకు ఆతడి రాక విషయం ఎలా తెలుస్తుంది? పూజలో, తల్లి భావనలో లీనమైపోయి ఎవరు వస్తున్నారో వెళుతున్నారో తెలుసుకొనే స్థితిలో వారసలుంటే కదా! మథుర్‌బాబు, శ్రీరామకృష్ణుల తన్మయత్వాన్ని గమనించాడు. అమ్మను పసిబిడ్డలా బుజ్జగించడం, ప్రేమ - వాత్సల్యాలతో మాట్లాడడం చూసి మథుర్‌బాబు, అది అనన్యభక్తితో కలిగిన ప్రేమ అనే విషయం గ్రహించాడు. ఇలాంటి నిర్మల నిశ్చల అనన్యభక్తి విశ్వాసాలతో కాక, మరి దేనివల్ల అమ్మ దర్శనం కలుగుతుంది? అని అనుకొన్నాడు. పూజ చేస్తున్న సమయంలో భట్టాచార్యుల కళ్ల నుండి కన్నీరు ధారకట్టడం, పరమోత్సాహంతో ఉండిపోవడం చూశాడు. అప్పుడప్పుడు ఆయన జడస్థితిలో నిశ్చలంగా ఉండిపోవడం, బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోవడం గమనించాడు. అదంతా చూసిన మథుర్ హృదయం దివ్యానందసంభరితమైంది. ఆలయం దైవావిర్భావంతో భాసిస్తున్నట్లు అతడు అనుభూతి చెందాడు. భట్టాచార్యులవారు జగన్మాత దర్శన లాభాన్ని పొంది కృతార్థుడయ్యాడనే దృఢనమ్మకం అతడికి కలిగింది. దాంతో అతడు భక్తిపునీత

7. మథుర్‌బాబు శ్రీరామకృష్ణుల పూజాదులను చూసి ముగ్ధుడవడం

హృదయంతో, సజలనయనాలతో జగన్మాతకు, ఆమె అపూర్వ అర్చకునికి దూరం నుండే పదేపదే వందనాలు చేశాడు. ఇంతకాలానికి దేవీ ప్రతిష్ఠ సార్థకమైంది. ఇంతకాలం తర్వాత నిజంగానే దేవి ఇక్కడ ఆవిర్భూతమైంది అనుకొని ఆనందించాడు. ఇంతకాలానికి నిజమైన అమ్మ ఆరాధన సుసంపన్నమవుతున్నదని సంతోషించాడు.

మథుర్‌బాబు అంతా చూసి, ఆలయోద్యోగులకు ఏమీ చెప్పకుండానే ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటిరోజు ఆలయ ప్రధానోద్యోగికి, ''భట్టాచార్య మహాశయుల పూజకు ఎవరూ ఎలాంటి అడ్డూ చెప్పవద్దు. ఆయన ఇచ్ఛ మేరకు ఆయనను పూజ చేసుకోనివ్వండి. ఎవరైనా ఆయనకు ఆటంకం కలిగిస్తే ఊరుకునేది లేదు'' అంటూ ఆదేశం పంపించాడు.

పై సంఘటనలు విన్న శాస్త్రపారంగతుడైన పాఠకుడు ఒక్క విషయాన్ని స్పష్టంగా తెలుసుకుంటాడు. అది - శ్రీరామకృష్ణులలో కలిగిన అద్భుత పరిణామం. ఆయన మనసప్పుడు శాస్త్రవిహిత విధుల నన్నింటినీ అతిక్రమించి, అహేతుక ప్రేమభక్తి అనే ఉన్నత మార్గంలో ప్రచండవేగంతో పరుగులు పెట్టసాగింది. ఈ పరిణామం ఎంత సులభంగా, ఎంత సహజంగా జరిగిందంటే; ఇతరుల మాట విషయం అటుంచి, స్వయంగా శ్రీరామకృష్ణులే దీన్ని అర్థం చేసుకోలేకపోయారు. వారికి అర్థం అయిందేమంటే - జగన్మాత పట్ల తనకున్న అపరిమితభక్తి ప్రేరణ వల్ల తానావిధంగా ప్రవర్తించకుండా ఉండలేకపోతున్నానని, ఎవరో బలవంతంగా తనతో అలా చేయిస్తున్నారని మాత్రమే! కాబట్టే - నా కిలా ఎందుకవుతోంది? నేను సరైన మార్గంలోనే ఉన్నాను కదా! - అన్న సందేహం అప్పుడప్పుడు ఆయన మనసులో కలుగుతూ ఉండేది. అందుకే ఆయనెంతో వ్యాకులతతో, ''అమ్మా! నా కిలాంటి అవస్థ ఎందుకు కలిగిందో నాకేం అర్థం కావడం లేదు. నేనేం చేయాలో, అది నువ్వే నాతో చేయించు. నేనేం నేర్చుకోవాలో అది నువ్వే నాకు నేర్పించు. నీ దర్శనం నా కివ్వు. నిరంతరం నా చేతిని వదిలిపెట్టకుండా పుచ్చుకుని ఉండు'' అంటూ ప్రార్థించేవారు.

8. శ్రీరామకృష్ణులు రాగాత్మికభక్తిని సంతరించుకోవడం

కామకాంచనాలు - పేరు ప్రతిష్ఠలు - ఇహపర సర్వభోగభాగ్యాలు - వీటన్నింటి నుండి మనసును ఉపసంహరించి, ఆయన జగన్మాతను ప్రార్థించేవారు. జగజ్జనని కూడ తన ప్రియాతిప్రియమైన కుమారుని చేతిని పుచ్చుకుని, ఆయనను అన్ని విధాలా సంరక్షిస్తూ, ఆయన ప్రార్థనను అనుగ్రహించింది. ఆయన ఆధ్యాత్మిక జీవితం పరిపూర్ణం కావడానికి ఏ సమయంలో ఏం కావాలో, ఏ వ్యక్తులు అవసరమో, ఆ సమయంలో ఆయా వస్తువులను - వ్యక్తులను

అయాచితంగా వారికి చేకూర్చేది. అలా వారిని సులభంగా సహజంగా శుద్ధజ్ఞానభక్తి చరమసీమను అధిరోహింపచేసింది. భగవద్గీతలో భగవంతుడు భక్తుడితో ఇలా ప్రతిజ్ఞ చేశాడు.

''అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥ *(9-22)*

''ఇతర చింతనల నన్నింటినీ వదిలిపెట్టి, నిశ్చల సమాహిత చిత్తంతో నన్ను మాత్రమే పరమభక్తి శ్రద్ధలతో భజిస్తూ, నన్నే సంపూర్ణంగా శరణు పొందిన భక్తులకు ఇహపర లోకాల్లో వారికేం కావాలో అవన్నీ నేనే సమకూర్చిపెడతాను.''

ఈ కాలఘట్టపు శ్రీరామకృష్ణుల జీవితాన్ని చక్కగా అధ్యయనం చేస్తే భగవంతుని ఆ ప్రతిజ్ఞ ఆయన జీవితంలో అక్షర సత్యం కావడం చూస్తాం. అది మనల్ని ఆశ్చర్యచకితులను చేస్తుంది. స్తంభీభూతులను చేస్తుంది. కామ కాంచనాలు మాత్రమే ఏకైకలక్ష్యంగా ఉండి, స్వార్థపరత్వంతో నిండివున్న ఈ వర్తమానయుగంలో భగవంతుని ఆ ప్రతిజ్ఞ 'సత్యం' అని మళ్లీ స్పష్టపరచవలసిన అవసరం ఏర్పడింది. సాధకులు ప్రతియుగంలో కూడ, 'సబ్‌చేడే, సబ్‌పాబే' - భగవంతునికోసం అన్నింటినీ వదిలిపెట్టినా, అవసర వస్తువుల లోటు వారి కెప్పుడూ ఏర్పడదనే విషయాన్ని మనుషులకు పదే పదే ఉపదేశిస్తున్నారు. అయినా దుర్బలుడు - విషయలోలుడు అయిన మనిషి ప్రస్తుత యుగంలో దాన్ని మళ్లీ ప్రత్యక్షంగా - పూర్ణంగా చూసేదాకా నమ్మలేకపోతున్నాడు. కాబట్టే ఈ శాస్త్రవచనాల సత్యాన్ని మనిషికి ఋజువు చేయడం కోసమే అనన్యచిత్తంతో మనోవాక్కాయాలతో తనను సంపూర్ణంగా శరణు పొందిన శ్రీరామకృష్ణులను నిమిత్తం చేసుకుని జగన్మాత అద్భుతమైన ఈ లీలానాటకాన్ని ఆడింది. ఓ మానవా! పవిత్రహృదయంతో ఈ విషయాన్ని ఆలకించి, నీకు సాధ్యమైనంత వరకూ త్యాగపథంలో ముందుకు సాగిపో.

ఆధ్యాత్మిక భావాల ప్రచండ ప్రవాహాలు అకస్మాత్తుగా మనుషుల జీవితాల్లో తటస్థించినప్పుడు వాటిని తట్టుకోవడానికి వెయ్యి ప్రయత్నాలు చేసినా ఫలితం

9. అవతారపురుషులు: రాగాత్మికభక్తి

ఉండదు. సామాన్య మానవుల జడదేహం వాటి ప్రచండ ప్రవాహ వేగాన్ని తట్టుకోలేక, తక్షణం ముక్కచెక్కలవుతుంది. ఎంతమందో సాధకులు ఇలా మృత్యుముఖంలో పడిపోతారు. పూర్ణ జ్ఞాన, పూర్ణభక్తి ప్రచండ ధాటిని తట్టుకోవడానికి తగిన శరీరం ఎంతో అవసరం. ఇంతవరకూ కేవలం అవతారపురుషులనే మహాత్ములు మాత్రమే తమ జీవితాల్లో ఆధ్యాత్మిక భావతరంగాల పూర్ణవేగాన్ని సర్వదా అరికట్టుకుని,

ప్రపంచంలో జీవిస్తుండడం చూస్తాం. కాబట్టే భక్తిశాస్త్రాలు ఈ అవతారపురుషులను శుద్ధసత్త్వసంపన్నులని పదేపదే అభివర్ణిస్తూ ఉంటాయి. [1]శుద్ధసత్త్వగుణంతో మాత్రమే నిర్మితమైన శరీరాలను ధరించి, వారు ఈ జగత్తులో అవతరిస్తుంటారు. కాబట్టే ప్రచండ ఆధ్యాత్మిక భావాలను తట్టుకోవడంలో వారు సమర్థులౌతారు. అలాంటి శరీరం కలిగిన తర్వాత కూడా చాలాసార్లు వారే భావవేగాలను తట్టుకోలేకుండా ఉండడం చూస్తుంటాం. విశేషంగా భక్తి మార్గంలోవున్న అవతారపురుషుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. భావభక్తుల ప్రాబల్యం వల్ల ఏసుక్రీస్తు, శ్రీచైతన్యదేవుల శరీరంలోని కీళ్ళు సడలిపోయి ప్రతి రోమకూపం నుండి రక్తం చుక్కలు చుక్కలుగా స్రవించడం - మొదలైన సంఘటనల గూర్చిన శాస్త్రవర్ణనల నుండి ఈ విషయాన్ని మనం గ్రహించవచ్చు. ఇలాంటి శారీరక మార్పులు ఎంతో బాధతో కూడినవన్న విషయంలో సందేహం లేదు. అయినా వీటి సహాయంతోనే వారి శరీరాలు భక్తిజనిత అసాధారణ మానసిక వేగాన్ని తట్టుకోవడంలో సమర్థవంతమౌతాయి. తర్వాత క్రమక్రమంగా ఆ భావవేగాన్ని తట్టుకోవడానికి అలవాటుపడిన శరీరాల్లో అలాంటి పరిణామాలు పూర్వంలా అంతగా కనిపించక, తగ్గిపోతాయి.

10. పాపపురుషుని అనుభూతి

ఆ రాగాత్మిక భక్తి ప్రచండ ప్రభావం మూలంగా శ్రీరామకృష్ణుల శరీరంలో ఇప్పటి నుండి రకరకాల విచిత్ర పరిణామాలు కలగసాగాయి. సాధన మొదలైనప్పటి నుండి కారం నూరిపోసినట్లు శరీరమంతటా భరించలేని మంట కలిగిందని ఇంతకు పూర్వం చెప్పుకున్నాం. ఈ మంట ఎక్కువ కావడం మూలంగా ఆయన ఎంతో బాధపడవలసి వచ్చింది. దీనికి గల కారణాన్ని గురుదేవులే స్వయంగా మాకు చాలాసార్లు చెప్పారు: ''పూజాసంధ్యాదులను చేస్తున్నకాలంలో శాస్త్రవచనం రీత్యా లోపల ఉన్న పాపపురుషుడు దగ్ధమయ్యాడని భావించేవాడిని. శరీరంలో నిజంగానే పాపపురుషుడున్నాడని, నిజంగానే అతణ్ణి దగ్ధంచేసి నాశనం చేయవచ్చని ఎవరికి తెలుసు? సాధనను మొదలుపెట్టినప్పటి నుండే శరీరంలో మంట ప్రారంభమైంది. మళ్లీ ఇదేమి జబ్బో అనుకున్నాను. క్రమంగా అది ఎక్కువై భరించరానిదైంది. వైద్యుల సలహా మేరకు రకరకాల తైలాలను మర్దన చేయించుకున్నాను. అయినా మంట ఏమాత్రమూ తగ్గలేదు. ఒకరోజు పంచవటి క్రింద కూర్చున్నాను. అప్పుడొక వింత చూశాను. బొగ్గులా, కారునలుపు శరీరంతో, నిప్పుల్లా మెరిసే ఎర్రని కళ్లతో, భయంకర ఆకారుడైన పురుషుడొకడు

---

1. అంటే, అత్యధికంగా సత్వం, రజోతమస్సులు అతితక్కువగా కలిగివుండడం శుద్ధసత్వం. కాస్తోకూస్తో రజస్తమాలు లేకుంటే దేహాలు నిర్మాణం కావు. -అనువాదకుడు

త్రాగినవాడిలా తూలుతూ దీనిలో (తన శరీరాన్ని చూపిస్తూ) నుండి బయటికి వచ్చాడు. ఆ మరుక్షణమే కాషాయవస్త్రాలు ధరించి త్రిశూలం చేతపట్టుకొన్న సౌమ్య పురుషు డొకడు దీనిలో నుండే బయటికి వచ్చి, ఆ నల్లని ఆకారంగల వాణ్ణి ఎదుర్కొని చంపేశాడు. ఆ క్షణం నుండి మంట తగ్గిపోయింది. దీనికి ముందు ఆరు నెలల దాకా ఆ మంటతో ఎంతో కష్టం అనుభవించాను.''

పాపపురుషు డలా దగ్ధమయ్యాక శరీరంలోని మంట తొలగిపోయినా, మరికొంత కాలానికి మళ్లీ ఆ మంట ప్రారంభమైందని గురుదేవులు చెప్పారు. ఈ సమయంలో వారు వైధీభక్తి పరిమితుల నధిగమించి రాగాత్మికభక్తిమార్గంలో పయనిస్తూ జగన్మాత పూజాదుల్లో నిమగ్నులై ఉండేవారు. ఆ మంట అలా ఎంత ఉధృతమైనదంటే తడితువ్వాలును తలపై పెట్టుకుని మూడు - నాలుగు గంటల దాకా గంగానదిలో కూర్చుని ఉన్నా ఏమాత్రమూ ఉపశమనం కలిగేది కాదు. తద నంతర కాలంలో భైరవీ బ్రాహ్మణి[1] వచ్చి, భగవంతుని పరిపూర్ణ దర్శనం కోసం ఆయనలో కలిగిన వ్యాకులత - విరహవేదనల నుండే ఆ మంట కలిగిందని గుర్తించి, ఎంతో సహజోపాయాలతో దానిని ఎలా దూరం చేసిందో, ఆ విష యాన్ని మేము మరోచోట వివరించాం.[2] దాని తర్వాత గురుదేవులు మధురభావ సాధన చేస్తున్నప్పుడు మళ్లీ అదే మంటతో బాధపడ్డారు. హృదయ్ ఇలా చెప్పే వాడు: ''శరీరం లోపల మండే కుంపటి ఉంచితే ఎలాంటి మంట, బాధ కలుగు తాయో, శ్రీరామకృష్ణులు ఆ కాలంలో అంతటి బాధను అనుభవించారు. ఆ తర్వాత కూడ ఆ మంట అప్పుడప్పుడు కలుగుతూ చాలాకాలం వరకూ ఆయ నను బాధించింది. తర్వాత సాధనలన్నీ ముగిసిన కొన్ని సంవత్సరాల తర్వాత బారాసాత్ గ్రామనివాసి అయిన వకీలు కనాయ్‌లాల్ ఘోషాల్ గారితో ఆయనకు పరిచయం ఏర్పడింది. వీరు గొప్ప శాక్తేయ సాధకులు. శ్రీరామకృష్ణులు అలా మంటతో బాధపడుతున్నారన్న విషయం వీరు విని, తమ ఇష్టదేవతా కవచాన్ని శరీరం మీద ధరించమని సలహా ఇచ్చారు. వారి సలహా ననుసరించి కవచాన్ని ధరించినప్పటి నుండి, మరెప్పుడూ ఆ మంట బాధించలేదు.''

11. రాణీ రాస్మణిని శిక్షించడం

జాన్‌బజార్‌లోని తన ఇంటికి వచ్చి, మథుర్‌బాబు శ్రీరామకృష్ణుల పూజా పద్ధతిని (తన అత్తగారైన) రాణీ రాస్మణికి వివరంగా తెలి పాడు. అది విని భక్తురాలైన ఆమె ఎంతో ఆనందించింది. భట్టాచార్యుల మధుర స్వరయుక్త భజనలు విని ఆమె ఇదివరకే ఆయన పట్ల

---

1. శ్రీరామకృష్ణుల ద్వారా తంత్రసాధనలు చేయించిన గురువు. వైష్ణవ సన్యాసి
2. గురుభావం, ఉత్తరార్ధం 4-1-10

అభిమానం పెంపొందించుకొంది. శ్రీగోవిందుని విగ్రహం విరిగినప్పుడు ఆయన భావపారవశ్యాన్ని, ఆయన వివేకాన్ని గ్రహించి ఆశ్చర్యపోయింది.[1] కాబట్టే శ్రీరామకృష్ణుల వంటి పవిత్రహృదయులకు జగన్మాత కృప లభించడం సంభవమే అని నిశ్చయించుకొంది. కాని ఈలోపు ఒక వింత సంఘటన జరిగింది. రాణీ, మథుర్‌బాబుల ఆ విశ్వాసం సడలిపోయే ఘటన అది. ఒక రోజు జగన్మాతను పూజించడం కోసం రాణి కాళికాలయానికి వెళ్లింది. ఆమె ఆలయంలో జగన్మాతను దర్శించుకొని శ్రీరామకృష్ణులను ఒక దేవీకీర్తన పాడి వినిపించమని కోరింది. శ్రీరామకృష్ణులు అలాగే జగన్మాతపై భక్తిగీతాన్ని పరవశులై ఆలపిస్తున్నారు. రాణి మాత్రం ఆ గీతాభావంలో మనస్సును నిలపక, తన ఆస్తి విషయమైన దావా గురించి ఆలోచించసాగింది. ఆమె మనసులోని ఆలోచనలు శ్రీరామకృష్ణులు గ్రహించారు. జగన్మాత సమక్షంలో జగన్మాతపై మనసును లగ్నం చెయ్యక ఇతర విషయాలపై మనసును పోనివ్వడం చూసి, 'ఛీ, ఇక్కడా ఆ పాడు ఆలోచనలేనా?' అంటూ ఆయన భావావేశంలో రాణి చెంపపైన కొట్టారు. అది ఆమెకు సరైన శిక్షణ ఇవ్వడానికే సుమా! జగన్మాత కృపాపాత్రురాలు, సాధకురాలు కాబట్టి రాణి తన తుచ్ఛమనోదౌర్బల్యాన్ని తెలుసుకుని ఎంతో పశ్చాత్తాపం చెందింది. పైగా ఈ సంఘటనతో శ్రీరామకృష్ణుల పట్ల ఆమెకు మరింత భక్తిశ్రద్ధలు పెరిగాయి. ఈ విషయాలను మేము మరోచోట విపులంగా తెలిపాం.[2]

12. భక్తిపరిపక్వత - శ్రీరామకృష్ణుల బాహ్యపూజ సహజంగా ఆగిపోవడం

ఇది జరిగిన కొంతకాలం తర్వాత శ్రీరామకృష్ణుల భక్త్యానందాలు ఎంత అధికమయ్యాయంటే, జగన్మాత నిత్యనైమిత్తిక పూజా, సేవాది కార్యకలాపాలను ఆయన కొనసాగించలేని స్థితి వచ్చింది. ఆధ్యాత్మిక మార్గంలో ప్రగతి చెందేకొద్దీ శాస్త్రాలు విధించే కర్మలన్నీ వాటంతట అవే సహజంగా తొలగిపోతాయి. గురుదేవులు ఈ విషయాన్ని చక్కని ఉదాహరణతో వివరించేవారు.

''కోడలు గర్భం ధరించనంతకాలం ఏం చేసినా అత్త అడ్డుకోదు. కోడలికి నెలతప్పిందని తెలిసినప్పటి నుండి అత్త ఆమె విషయంలో జాగ్రత్త వహిస్తుంది. నెలలు పెరిగేకొద్దీ, కోడలికి పని తగ్గిస్తుంది. ఇక ప్రసవకాలం దగ్గర పడగానే, కడుపులో బిడ్డకు అనర్థం వాటిల్లుతుందేమో అన్న ఉద్దేశంతో అత్త, కోడలికి ఏ పనీ చెప్పదు. బిడ్డ పుట్టిన తర్వాత, కోడలికి ఆ బిడ్డ ఆలనాపాలనా చూడడం ఒక్కటే పని.''

---

1. గురుభావం, 3-5,6
2. గురుభావం, పూర్వార్ధం 3-5-8

శ్రీరామకృష్ణుల బాహ్యపూజ, జగజ్జనని సేవాది కార్యకలాపాలన్నింటి విషయంలో కూడ ఇలాగే జరిగింది. అవన్నీ ఎంతో సహజంగా వైదొలగి పోయాయి. సదా భావపారవశ్యంలో ఉండే శ్రీరామకృష్ణులు ఇప్పుడు తల్లిని తన ఇచ్ఛ మేరకు (హృదయపూర్వకంగా) సేవించడం మొదలుపెట్టారు. పూజ చేయడానికి ముందే నైవేద్యం అర్పించేవారు. ధ్యానమగ్నులై తానూ, తల్లీ ఒక్కరే అనే జ్ఞానంతో దేవీ అర్చన కోసం ఉన్న గంధపుష్పాదులతో తన దేహాన్నే అలంకరించుకునేవారు. బాహ్యాంతరాలలో నిరంతరం ఆయన జగన్మాతనే దర్శించడం వల్ల గురుదేవుల చేష్టలన్నీ ఇలా కొనసాగేవన్న విషయాన్ని గురుదేవుల ముఖతా మే మెన్నోసార్లు విన్నాం. అంతేకాదు, ఆయన తన్మయత్వం ఏ కొంచెం తగ్గినా, తల్లి దర్శనంతో ఏమాత్రం ఎడబాటు కలిగినా, ఆయన హృదయం దుర్భర వేదనతో నిండిపోయేది. ఆయన నేలపై పడి పసిపిల్లవాడిలా దొర్లుతూ, ముఖాన్ని నేలకేసి రాస్తూ, తీవ్రంగా విలపించేవారు. ఊపిరి ఆగిపోయినంత పని అయ్యేది. శరీరమంతా గాయాలతో రక్తసిక్తమైపోయేది. ఇదంతా వారికేమీ తెలిసేది కాదు. తాము నీళ్లలో పడుతున్నారో - నిప్పులో పడుతున్నారో కూడ ఆయనకు స్పృహ ఉండేది కాదు. కాని జగన్మాత దర్శనం పొందడంతో ఆయన పరితాపం తగ్గిపోయేది. ఆయన ముఖం దేదీప్యమానంగా ప్రకాశించేది. ఆయనలో ఆనందం పెల్లుబికేది. ఆయన మరో వ్యక్తిగా కనిపించేవారు.

13. 'పూజాకార్యాలు ఆగిపోవడం' గూర్చి హృదయ్ కథనం; ఆ అవస్థను చూసి మథుర్ సంశయం

శ్రీరామకృష్ణులు పూజ చేయలేని స్థితికి వచ్చేదాకా, ఆయనతోనే పూజాదులను మథుర్ ఎలాగో చేయిస్తూ వచ్చాడు. కాని ఆ స్థితి రాగానే, పూజ కోసం వేరే ఏర్పాట్లు చేయడానికి నిశ్చయించుకొన్నాడు.

''మథుర్‌బాబు అలా నిశ్చయించుకోవడానికి మరో కారణం కూడ ఉంది. శ్రీరామకృష్ణులు ఒకరోజు భావావేశంలో హఠాత్తుగా పూజాపీఠం నుండి లేచి గుడిలో నన్నూ - మథురబాబును చూశారు. చూసి వెంటనే నా చేయి పుచ్చుకుని, నన్ను పూజాపీఠంపై కూర్చోబెట్టారు. మథుర్‌బాబుతో, 'ఇక నుండి హృదయ్ పూజ చేస్తాడు. నా పూజను అంగీకరించినట్లే, అమ్మ హృదయ్ పూజను కూడ అంగీకరిస్తుంది. అలా అని అమ్మే చెబుతున్నది' అన్నారు. మథుర్‌బాబు ఆయన పలుకులను దేవీ ఆదేశంగానే గ్రహించాడు'' అని హృదయ్ చెప్పాడు. కాని హృదయ్ కథనం ఎంతవరకు నిజమో చెప్పలేము. కాని ఆ స్థితిలో నిజంగానే శ్రీరామకృష్ణులు పూజాదులు చేసే స్థితిలో లేరని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. ఆ విషయాన్ని మథుర్‌బాబు కూడ చక్కగా అర్థం చేసుకున్నాడు.

మొదటిసారి చూడగానే మథుర్, శ్రీరామకృష్ణుల పట్ల ఆకర్షితుడైనాడని చెప్పుకున్నాం. అప్పటి నుండి వారిని దక్షిణేశ్వరంలోనే ఉండిపోయేలా చేయడానికి అతడు సర్వవిధాలా ప్రయత్నించసాగాడు. అన్ని అడ్డంకులనూ తొలగించసాగాడు. తర్వాత ఆయనలోని ఉదాత్త గుణాలు చూసి అతడు మరింత చేరువయ్యాడు. ఆయనను సేవించసాగాడు. ఇతరులు ఆయనకు ఎలాంటి హానీ చేయకుండా రక్షించసాగాడు. శ్రీరామకృష్ణులకు వాతప్రకోపం అన్న విషయం తెలిశాక దాని ఉపశమనం కోసం ఆయనకు ప్రతిరోజూ పటికబెల్లం పానకాన్ని ఏర్పాటు చేశాడు. రాగాత్మికభక్తి కారణంగా ఆయన పూజ విచిత్రంగా కొనసాగుతుంటే, ఇతరులు అపార్థం చేసుకుని ఆయనకు ఇబ్బంది కలిగించకుండా అతడు కాపాడాడు. ఇలాంటి మరికొన్ని సంఘటనలను మేము మరోచోట చెప్పాం.[1]

14. శ్రీరామకృష్ణులకు ఆయుర్వేద వైద్యుడు గంగాప్రసాద్ సేన్ చికిత్స

ఇంతగా ఆకర్షితుడైనప్పటికీ రాణీ రాస్మణిని, శ్రీరామకృష్ణులు కొట్టిన విషయం తెలిసిన తర్వాత, మథుర్‌కు కాస్త సందేహం ఏర్పడింది. శ్రీరామకృష్ణులు ఎంతటి ఉత్తమసాధకులైనా, ఆయనలో కూడ వేపకాయంత పిచ్చి ఉందేమో అనుకున్నాడు. ఎంతైనా మథుర్ ప్రాపంచిక జీవియే కదా! శ్రీరామకృష్ణులను పరిపూర్ణంగా ఎలా అర్థం చేసుకోగలడు? అందుచేత శ్రీరామకృష్ణుల పిచ్చిని నయం చేయాలని, అతడు కలకత్తాలోని సుప్రసిద్ధ వైద్యుడైన గంగాప్రసాద్ సేన్‌తో వారికి చికిత్స చేయించే ఏర్పాటు చేశాడు. అంతమాత్రంతో అతడు తృప్తిచెందలేదు. శ్రీరామకృష్ణులకు తర్కయుక్తంగా సాధన విషయమై సలహా కూడ ఇవ్వబోయాడు. దైవసంకల్పం ముందు మనిషి తర్కం ఎందుకూ పనికిరాదని, దైవం తలచుకొంటే అసంభం కూడ సంభవమౌతుందని శ్రీరామకృష్ణులు నచ్చచెప్పారు. కాని అతడు వినలేదు. అప్పుడు శ్రీరామకృష్ణులు తోటలో ఒక మొక్కకు పూచిన పూలకొమ్మను తెచ్చి చూపారు. ఆ మొక్క తెల్లని పువ్వులనే పూస్తుంది. కాని శ్రీరామకృష్ణులు తెచ్చిన కొమ్మకు ఒకటి తెల్లని పువ్వు, మరొకటి ఎర్రని పువ్వు ఉంది. అది చూసి మథుర్ దైవసంకల్పం అమోఘం అన్న విషయాన్ని అంగీకరించక తప్పిందికాదు. ఈ విషయాన్ని మరోచోట విశదం చేశాం.[2]

శ్రీరామకృష్ణులు ఇక నిత్యపూజ చేయలేరని తెలిసిన పిదప, మథుర్ ఆ పూజ కోసం వేరే ఏర్పాట్లు చేశాడని చెప్పుకున్నాం కదా! పూజానిర్వహణ

---

1. గురుభావం, పూర్వార్ధం 3-6-9
2. గురుభావం, పూర్వార్ధం 3-6-8

రామ్‌తారక్ ఛటోపాధ్యాయ అనే అతడికి అప్పగించాడు. రామ్‌తారక్, శ్రీరామకృష్ణుల పినతండ్రి కుమారుడు. ఉద్యోగం కోసం దక్షిణేశ్వరానికి వచ్చాడు. మథుర్ అతణ్ణి కాళీపూజకు నియోగించాడు. ఈ సంఘటనలు 1858వ సంవత్సరంలో జరిగాయి.

15. దక్షిణేశ్వరానికి హలధారి రాక

రామ్‌తారక్‌ను శ్రీరామకృష్ణులు 'హలధారి' అని పిలిచేవారు. హలధారి శ్రీరామకృష్ణులకు వరుసకు అన్న అవుతాడు. గురుదేవులు అతణ్ణి గురించి మాకు అనేక విషయాలు చెప్పేవారు. హలధారి మంచి పండితుడు, నిష్ఠగల సాధకుడు. అతడు శ్రీమద్భాగవతం, అధ్యాత్మ రామాయణం మొదలైన గ్రంథాలను నిత్యం పఠిస్తూ ఉండేవాడు. అతడికి విష్ణువంటే అమిత భక్తిప్రేమలు. దేవి అన్నా ఇష్టమే! కాని విష్ణువుపైన ఉన్నంత భక్తిలేదు. అలా అని వ్యతిరేకభావం కూడ లేదు. అందుకే మథుర్ కోరితే, జగన్మాతకు అర్చకుడిగా ఉండడానికి సమ్మతించాడు. అతడు స్వయంగా వండుకొనేవాడు. అది చూసి మథుర్ ''మీ తమ్ముడైన శ్రీరామకృష్ణులు, హృదయ్ ఆలయ ప్రసాదాన్నే తీసుకుంటున్నారు కదా! మరి మీ కెందుకీ అభ్యంతరం'' అని అడిగాడు. అందుకు హలధారి, ''మా తమ్ముడు ఆధ్యాత్మికంగా ఎంతో పురోగమించాడు. ఆలయ ప్రసాదం స్వీకరించడం వల్ల అతడికి ఏ దోషమూ అంటదు. కాని నా స్థితి అలా కాదు గదా! నే నింకా అంత ఉన్నతస్థాయికి ఎదగలేదు. కాబట్టి నాకు దోషం ఏర్పడుతుంది'' అని జవాబు చెప్పాడు. మథుర్‌కు ఆ జవాబు బాగా నచ్చింది. హలధారికి స్వయంపాకం ఇచ్చే ఏర్పాటు చేశాడు. హలధారి పంచవటి కింద వంట చేసుకుని భుజించేవాడు.

'శక్తి' పూజకు హలధారికి ఎలాంటి అభ్యంతరమూ ఉండేది కాదు. కాని జంతుబలి అంటే అతడికి గిట్టేది కాదు. జగన్మాతకు పర్వదినాల్లో జంతుబలి ఇచ్చే ఆచారంగా చాలాకాలం నుండి వస్తోంది. హలధారి ఆ దినాల్లో మాత్రం జగన్మాతను శ్రద్ధగా పూజించలేకపోయేవాడు. ఒకమారు అతడు అలా ఒక నెలరోజులు అన్యమనస్కుడిగా పూజించాడట. అప్పుడు ఒకసారి సంధ్యావందనం చేస్తున్నప్పుడు, దేవి భయంకర ఆకారంతో కనిపించి, ''నువ్వికనా పూజ చేయనవసరం లేదు. నన్నిలా అశ్రద్ధతో పూజిస్తే, నీ వంశాన్ని సర్వనాశనం చేస్తాను'' అని హెచ్చరించిందట. అదంతా తన భ్రమగా భావించి అతడు ఆ హెచ్చరికను లక్ష్యపెట్టక పూజ చేయడం కొనసాగించాడట. దాని ఫలితంగా, అతి స్వల్పకాలంలో అతడి చిన్నకొడుకు నిజంగానే చనిపోయాడు. అది చూసి, హలధారి వెంటనే శ్రీరామకృష్ణులకు జరిగినదంతా వివరించి

జగన్మాత పూజను మానుకున్నాడు. ఆ తర్వాత అతడు శ్రీరాధాగోవిందుని ఆలయంలో పూజ చేయసాగాడు. హృదయ్, కాళీకాదేవిని అర్చించసాగాడు. ఇదంతా మేము హృదయ్ తమ్ముడు రాజారామ్ చెప్పగా విన్నాం.

8. తొలి నాలుగేళ్ళ సాధనలో తుది ఘట్టాలు

శ్రీరామకృష్ణులు సాధనలు చేసిన కాలం గురించి మాకు కచ్చితంగా తెలియదు.

1. సాధనకాల పూర్వాపర్యత

ఆయన చెప్పిన మాటల మూలంగానే ఏమైనా నిర్ణయించ గలం. దాదాపు 12 సంవత్సరాలు నిరంతరాయంగా తాను వివిధ మతాల సాధనలు చేసినట్లు ఆయనే మాకు చెప్పారు. రాణీ రాస్మణి దక్షిణేశ్వర ఆలయాన్ని కులగురువుకు దానం చేస్తూ, ఒక దానపత్రం రాయించింది. దాని ప్రకారం మే 31, 1855 గురువారం నాడు శ్రీకాళీదేవి ప్రతిష్ఠ జరిగింది. ఆ సంవత్సరమే శ్రీరామకృష్ణులు కూడ అర్చకులయ్యారు. కాబట్టి 1855 నుండి 1867 వరకు వారి సాధనలు సాగినవని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ 12 సంవత్సరాలను ఆయన 'సాధన కాలం' అని ప్రత్యేకించి పేర్కొంటాం. కాని ఆ తర్వాత కూడ ఆయన తీర్థయాత్రలకు వెళ్లి, ఆ ప్రాంతాల్లో మరికొన్ని సాధనలు చేశారు. దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చిన తర్వాత కూడ ఆయన అప్పుడప్పుడు మళ్లీ సాధనలు చేశారు. ఈ విషయం గూర్చి తర్వాత చెప్పుకుందాం.

పన్నెండు సంవత్సరాల ఈ సాధన కాలాన్ని మూడు ప్రధాన భాగాలుగా

2. సాధనకాల ప్రధాన విభాగాలు

విభజించవచ్చు. ఒక్కొక్క భాగాన్ని లోతుగా అధ్యయనం చేద్దాం. మొదటి భాగం 1855 నుండి 1858 వరకు. ఈ భాగంలోని సంఘటనలు గూర్చి మనం ఇదివరకే చెప్పుకున్నాం. 1859 - 1862 వరకు సాధనలో రెండవ భాగం. ఈ నాలుగు సంవత్సరాలలో భైరవీ బ్రాహ్మణి ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణులు 64 తంత్రాలలో సాధన చేసి సిద్ధి పొందారు. వీటిని గోకుల వ్రతంతో మొదలుపెట్టారు. శాస్త్రరీత్యా గోవుకు గడ్డి పెట్టడం, ఈ వ్రతం. 1863 - 1867 వరకు సాధనలో మూడవ భాగం. ఈ కాలంలో

శ్రీరామకృష్ణులు 'బాలరామ' (రామ్‌లాలా) సాధన చేశారు. 'జటాధారి' అనే రామోపాసక సాధువు నుండి రామమంత్రాన్ని, బాలరామ విగ్రహాన్ని పొంది, సాధన చేశారు. తర్వాత 'మధురభావ' సాధనలో సిద్ధులయ్యారు. దీని కోసం ఆయన ఆరు నెలలు స్త్రీవేషం వేసుకున్నారు. భగవంతుడు పురుషుడు, నాయకుడు అయితే భక్తులు స్త్రీలు - నాయికలు అన్నది ఈ మధురభక్తి మార్గం. కాబట్టి ఈ మార్గంలోని భక్తులంతా విధిగా స్త్రీత్వాన్ని ఆపాదించుకుని పురుషునికి సర్వసమర్పణ చేయాలి. ఈ సాధన తర్వాత తోతాపురి అనే సన్న్యాసి ఆధ్వర్యంలో అద్వైత సాధనలో సన్న్యాసియై సాధనచేసి నిర్వికల్పసమాధి పొందారు. చివరికి 'గోవింద్' అనే సూఫీ ఫకీరు నుండి ఇస్లాం దీక్ష పొంది, సాధన చేశారు.

ఈ 12 సంవత్సరాలలో ముఖ్యసాధనలే కాక, మరికొన్ని సాధనలు కూడ చేశారు. 'సఖ్యభావ సాధన', 'కర్తాభజా - నవరసిక్' వైష్ణవ సాధనలు వాటిలో కొన్ని. వైష్ణవ సంప్రదాయ సాధనలన్నింటిలో గురుదేవులు నిష్ణాతులు. వైష్ణవ చరణ్ మొదలైన వైష్ణవసంప్రదాయ సాధకులు, సాధన సమయంలో సహాయం పొందడానికి గురుదేవుల వద్దకు వచ్చేవారు. ఇదే దానికి ఋజువు. ఇలా శ్రీరామకృష్ణుల సాధన కాలాన్ని త్రిభాగ యుక్తంగా లోతుగా పరిశీలన చేస్తే, మొదటి విభాగంలోని సాధనలకు, తక్కిన రెండు విభాగాలలోని సాధనలకు స్పష్టమైన తారతమ్యం మనకు కనిపిస్తుంది.

శ్రీరామకృష్ణులు సాధన చేయడానికి మొదలుపెట్టినప్పుడు, ఆయనకు ఒకే ఒక సహాయం అందింది. శ్రీకేనారామ్ భట్టాచార్యులు ఆయనకు శక్తి మంత్ర దీక్షను ఇచ్చారు. తద్ద్వారా భగవత్ సాక్షాత్కారం కోసం ఆయనలో ఆంతరికంగా తీవ్రతపన బయలుదేరింది. ఈ తపన తీవ్రతరం అవుతున్నకొద్దీ, ఆయన శరీరం, మనసు అనేక మార్పులకు లోనయ్యాయి. ఆయనలో ఇష్టదేవత యందు పరమప్రేమ జనించింది. 'వైధీభక్తి' పరిధిని ఆయన దాటేశారు. రాగాత్మికభక్తిలో ముందుకు పురోగమించారు. జగన్మాత సాక్షాత్కారం అయింది. యోగశక్తులన్నీ ఆయన పరమయ్యాయి.

3. తొలి నాలుగు సంవత్సరాల సాధనాను భూతుల సింహావలోకనం

'శ్రీరామకృష్ణులు భగవత్ సాక్షాత్కారాన్ని పొందారు. సకల సిద్ధులూ ఆయనకు లభించి కృతార్థులయ్యారు కదా! మరింకా ఆయన చేయవలసిందేముంది?' అంటారా, చెబుతాం.

4. జగన్మాత సాక్షాత్కారానంతరం కూడ శ్రీరామకృష్ణులు ఇంకా సాధనలు ఎందుకు చేశారు?

ఒకవైపు ఈ ప్రశ్న సమంజసమే. కాని ఇంకా సాధన చేయవలసి ఉంది. ''మొక్కలకు మొదట పువ్వులు, తర్వాత కాయలు కాయడం సహజం. కాని కొన్నింటిలో ముందు పిందెలు వేసి,

తర్వాత పూలు పూస్తాయి'' అని శ్రీరామకృష్ణులు చెబుతారు. శ్రీరామకృష్ణుల సాధన వికాసం కూడ రెండవదాని మాదిరిగానే సాగింది. సాధన ఆరంభంలోనే ఆయనకు దివ్యానుభూతులు, జగన్మాత దర్శనం అయ్యాయి. అయితే ఇవి ఎంతవరకు నిజం? ఎంతవరకు భ్రమ అన్నది ఆయనకు తేలలేదు. దానికోసం పూర్వసాధకుల సిద్ధి అనుభవాలతో తన అనుభవాలను పోల్చిచూసుకోవలసిన అవసరం ఏర్పడింది. అవన్నీ శాస్త్రాలలో ఉన్నాయి మరి! తాను పొందిన అనుభూతులు శాస్త్రోక్తసాధనల వల్ల కలుగలేదు; కేవలం తీవ్ర తపన - భక్తి వలన కలిగాయి. కాబట్టి ఆ అనుభూతులను శాస్త్రోక్త సాధనల ద్వారా కూడ పొందడం అత్యవసరమైంది. లేకపోతే వాటి నిజానిజాలు తన కెలా తెలుస్తాయి?

గురువులు తెల్పిన వారి వారి అనుభూతులు - శాస్త్రాలలో ఉన్న సాధకుల అనుభూతులు - సాధన ఫలంగా తాను పొందిన స్వానుభవాలు - ఈ మూడూ ఒక్కటే, వేర్వేరు కావు అని నిశ్చయంగా తెలియాలి. అప్పుడే తన సాధన సఫలమయినట్లు తెలుస్తుంది. ఆయన సందేహాలన్నీ నివృత్తమౌతాయి. ఆయన పరిపూర్ణ శాంతిని అనుభవిస్తారు.

పైన చెప్పిన విషయానికి ఒక ఉదాహరణగా శుకదేవుని జీవితంలో జరిగిన ఒక సంఘటనను పేర్కొనవచ్చు. వ్యాసుని కుమారుడైన శుకుడు పరమహంసలలో ప్రథమగణ్యుడు. మాయకు అతీతుడు. జన్మతః దివ్యదర్శనాలు, అనుభూతులు పొందుతూ ఉండేవాడు. అవి యథార్థాలో కావో, తాను గమ్యం చేరుకొన్నాడో లేదో నిర్ధరించుకోవడానికి శుకుడు వేదాలు, షడ్దర్శనాలు, తదితర శాస్త్రాలు అధ్యయనం చేశాడు. పిదప తన తండ్రిని ఇలా అడిగాడు: ''తండ్రీ! శాస్త్రోక్త సాధనలన్నీ జన్మతః నాకు సిద్ధించి ఉన్నాయి. అయినా నేనింకా ఆత్మజ్ఞానిని కానేమో అని సందేహంగా ఉంది. నా సందేహాన్ని నివృత్తి చేయి.'' అప్పుడు వ్యాసుడు అనేక విధాలుగా చెప్పి, ''నువ్వు ఆత్మజ్ఞుడివే. సందేహంలేదు.'' అని వివరించాడు. అయినా శుకునికి ఇంకా అవగాహన కాలేదు. అప్పుడు వ్యాసుడు 'మరొక ఆత్మజ్ఞాని ద్వారా తప్ప ఇతడి సందేహం తీరదు' అనుకుని, జనకుని వద్దకు శుకుణ్ణి పంపించాడు. శుకుడు, జనకుని కలుసుకొన్న తరువాత స్వానుభవ విషయంలో సందేహం తీరిపోయింది. ఇలా గురూపదేశం, శాస్త్రబోధ, స్వానుభూతి - మూడూ ఒక్కటేనని తెలిసిన తర్వాత, అతడు పరమశాంతిని పొందాడు.

5. శుకుని సాదృశ్యం

శుకుని ఈ కథనం, శ్రీరామకృష్ణుల అనుభూతికి ఒక దృష్టాంతం.

గురుదేవుల సాధనల ప్రయోజనం స్వార్థలాభం ఎంతమాత్రమూ కాదు. ఇతరుల కోసమే! కేవలం తానొక్కడే తరించిపోవాలని ఆయనెప్పుడూ ఆశించ

లేదు. జగన్మాత ఆయనను లోకకల్యాణం కోసం అవతరింపచేసింది. అందుకే

6. ఇతరుల కోసమే శ్రీరామకృష్ణులు సాధనలు చేశారు

మతాలన్నీ పరస్పరం సంఘర్షించుకొంటుంటే, వాటిలోని సత్యాసత్యాలను ఋజువు చేయడానికి శ్రీరామకృష్ణులు అసాధారణ ప్రయత్నాలు చేయడం కనిపిస్తుంది. అన్ని మతాల సాధనల్లో కౌశలం సాధించవలసిన అవసరం ఆయన కెందుకు కలిగిందంటారా? ఆధ్యాత్మిక ప్రపంచ ఆచార్యత్వం నిమిత్తమే! అంతేకాదు, సత్యానుభూతికి, విద్వత్తుకు సంబంధం లేదని, సాధన చేస్తే విద్యాగంధం లేనివారు సైతం సత్యదర్శనం చేయవచ్చునని నిరూపించడానికే జగన్మాత, శ్రీరామకృష్ణుల ద్వారా ఈ సాధనలన్నీ అనుష్ఠింపజేసింది. శ్రీరామకృష్ణుల జీవితాన్ని లోతుగా అధ్యయనం చేస్తే, మన కో విషయం స్పష్టమవుతుంది. జగన్మాత, శ్రీరామకృష్ణులను ఆధ్యాత్మిక జగద్గురువుగా రూపొందించడానికి అన్ని రకాల సహాయాలూ అందించింది. ఆ యా మతాల సిద్ధపురుషులను, శాస్త్రవేత్తలను యుక్తమైన సమయంలో ఆయన వద్దకు పంపించింది. వారి ద్వారా దీక్షల నిప్పించి సాధనలు చేయించి, కృతకృత్యులయ్యేలా చేసింది.

అందుకే కాలాంతరంలో అన్నిరకాల సాధకులకూ శ్రీరామకృష్ణులు మార్గదర్శకులయ్యారు. పైగా ఎవరికి ఏ సాధన అవసరమో, ఆ సాధనే వారికి చెప్పి చేయించి వారు సిద్ధత్వం పొందేలా చేశారు. అన్ని సాధన మార్గాలు తరచి చూసిన సిద్ధుడే, ఎవరికి ఏమార్గం తగినదో నిర్ణయించగలడు. శ్రీరామకృష్ణులు అలాంటి సర్వసాధన సిద్ధుడైన జగద్గురువు. ఆధ్యాత్మిక పథ నిర్దేశకులు.

మొదటి నాలుగు సంవత్సరాల సాధనకు, శ్రీరామకృష్ణులకు మూలాధారంగా ఉన్నది అంతర్గత హృదయావేదన; దైవసాక్షాత్కారార్థమైన మహా తపనే.

7. శ్రీరామకృష్ణుల నిక్కమైన తపన - భగవత్సాక్షాత్కారం

ఆ సమయంలో ఆయన వద్దకు ఏ గురువూ రాలేదు. ఏ గురువూ సాధనాపథం బోధించలేదు. ఆయనలోని తీవ్రాతితీవ్ర తపనే, ఆయనతో అన్ని సాధనలూ చేయించింది. చివరికి జగన్మాత సాక్షాత్కారం కూడ అయింది. దీన్నిబట్టి ఏ సాధన మార్గాన్ని అనుసరించినా, అనుసరించకున్నా బాహ్యసహాయం లేకపోయినా, సాధకునిలో తీవ్రతపన, దైవాన్ని పొందాలన్న మహాతపన ఒక్కటి ఉంటే చాలు, తప్పక సిద్ధి సాధ్యమవుతుంది - అన్న నిజం మనకు తెలుస్తోంది. కాని తీవ్ర తపన మాత్రం అవసరం. మామూలు తపన సరిపోదు. శ్రీరామకృష్ణుల సాధనామయ జీవితమే ఇందుకు తార్కాణం. ఈ తీవ్ర తపన వల్ల శ్రీరామకృష్ణులకు జగన్మాత చింతన - స్మరణ - తపన మరేమీ గుర్తుండేది కాదు. ఆహారం - నిద్ర - సిగ్గు - భయం మొదలైన శారీరక అవసరాలు - మానసిక వికారాలు ఏవీ ఆయనకు తోచేవి కావు.

వాటి గురించి లక్ష్యమే ఉండేది కాదు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలి అన్న విషయం అటుంచండి; అసలు ప్రాణరక్షణ కోసం కూడ ఆయన పూనుకునే వారుకారు. అప్పటి తన దశ గురించి, శ్రీరామకృష్ణులు, ''శరీర విషయమై స్మరణే ఉండేది కాదు. ఆ కారణంగా జుట్టు పెరిగిపోయి, దుమ్ముకొట్టి - మట్టి, మట్టిగా, జడలుగా మారిపోయేది. ధ్యానానికి కూర్చోగానే, శరీరం బిర్రబిగుసుకు పోయేది. శిలలా మారిపోయేది. పక్షులకు అది ఒక మనిషి శరీరం అన్న స్పృహే ఉండేది కాదు. నిర్భయంగా వచ్చి అవి నా తల మీదే కూర్చునేవి. తలలో బియ్యం మొదలైన గింజల కోసం ముక్కులతో పొడిచేవి. అది అలా ఉండేదా! ఒక్కోసారి తీవ్రవిరహం కలిగేది. విరహంతో తపిస్తూ, జగన్మాత కోసం ముఖాన్ని నేలకేసి రుద్దుకునేవాడిని. ముఖమంతా రక్తసిక్తమయ్యేది. ధ్యానం - భజన - ప్రార్థన - ఆత్మసమర్పణలతో పగలంతా ఎలా గడిచిపోయేదో తెలిసేదే కాదు. సాయం సంధ్యలో ఆలయం నుండి శంఖధ్వానాలు వినిపించేవి. ఆ ధ్వని వినగానే - 'అయ్యో, రోజు గడిచింది. మరొక్క దినం వ్యర్థంగా గడిచిపోయింది. జగజ్జనని దర్శనం ఈ రోజు కూడ కాలేదు' - అని దుఃఖించేవాడిని. ఆ దుఃఖం దుర్భరంగా ఉండేది. గుండెలు పగిలేలా ఉండేది. అస్థిరచిత్తంతో వ్యథ చెందేవాడిని. నేల మీద పడి పొర్లుతూ - 'అమ్మా, అమ్మా ఇవ్వాళ కూడ నువ్వు కనిపించలేదు. కని పించవా, అసలు కనిపించవా, ఎప్పుడూ కనిపించవా, కరుణించవా' - అని బిగ్గ రగా ఏడ్చేవాడిని. అలా ఏడ్చే నన్ను చూసి జనులు, - 'అయ్యో పాపం, కడుపులో శూలతో బాధపడుతున్నాడు కాబోలు, బాధకు తట్టుకోలేక అలా ఏడుస్తున్నాడు' - అనుకునే వారు సానుభూతిగా'' అని చెప్పేవారు.

మేము శ్రీరామకృష్ణుల సమక్షంలో ఉన్నప్పుడు భగవత్సాక్షాత్కారం కోసం ఎంత తపించవలసి ఉంటుందో మాకు చెప్పేవారు. ఆ సందర్భం లోనే తన సాధనకాల తపోమయ జీవితాన్ని వర్ణించి చెప్పేవారు. పై విషయాలు అలాంటప్పుడు చెప్పినవే. ''చూడండి, భార్యాబిడ్డలు చనిపోతే, ఆస్తులు పోతే, ఈ జనం కన్నీరు ప్రవాహం కట్టేటట్లు ఏడుస్తారు. కాని దేవుడు కనిపించలేదే అని ఎవరైనా ఏడుస్తారా? పైగా ఇంతగా ప్రార్థించాం, కాని దైవదర్శనం కానే లేదు అని కూడ నిందిస్తారు. వారిని ఒక్కసారి పరమ వ్యాకులతతో విలపించమనండి. భగవంతుడు ఎందుకు ప్రత్యక్షం కాడో నేను చూస్తాను'' అని విచారం వెలి బుచ్చుతూ చెప్పేవారు. ఆ వచనాలు విన్న మాకు, అంత నిశ్చితంగా చెబుతున్నా రంటే ఆయన జీవితంలో ఆ సత్యాలను ఆవిష్కరించుకొన్నారని స్పష్టమౌ తున్నది.

సాధనకాలం మొదటి నాలుగు సంవత్సరాల్లో శ్రీరామకృష్ణులు జగన్మాత సాక్షాత్కారంతోనే తృప్తి పొందలేదు. జగన్మాత దర్శనాన్ని భావముఖంగా[1] పొందిన తర్వాత, ఆయన శ్రీరఘువీరుని పట్ల ఆకర్షితులయ్యారు. శ్రీరఘువీరుడు వారి కులదైవం. రాముని దర్శనం హనుమంతుని వంటి దాస్యభక్తి ద్వారానే సాధ్యం అని ఆయన గ్రహించారు. అందుచేత తనలో హనుమంతుణ్ణి ఆవాహన చేసుకున్నారు. ఆ భావంలో కొంతకాలం గడిపారు. అనుక్షణం హనుమత్ చింతన, స్మరణ, ధ్యానంలో ఉండడంవల్ల, శ్రీరామకృష్ణుల సొంతవ్యక్తిత్వం క్రమంగా అదృశ్యమైంది. "ఆ సమయంలో హనుమంతుని లాగే ఆహార విహారాలన్నీ జరిగిపోయేవి. కావాలని చేసేవాడిని కాను. సహజంగా అవి జరిగిపోయేవి. అప్పుడు వెనుక తోకలా బట్టను వ్రేలాడదీశాను. కోతి మాదిరే గెంతుతూ నడిచేవాణ్ణి. పళ్ళు, దుంపలు తప్ప మరేమీ రుచించేవి కావు. కోతి మాదిరే తొక్క తీయకుండానే వాటిని తినేవాడిని. చాలావరకు ఎప్పుడూ చెట్ల మీదనే ఉండేవాడిని. అనుక్షణం గంభీరంగా 'రఘువీర, రఘువీర' - అనేవాడిని. కోతి కళ్ళ మాదిరే నా కళ్ళు కూడ చంచలమయ్యాయి, ఆశ్చర్యం ఏమిటో తెలుసా? వెన్నెముక క్రిందిభాగం ఒక అంగుళం పెరిగింది" అని అప్పటి తన స్థితిని వర్ణించి చెప్పేవారు శ్రీరామకృష్ణులు.

8. శ్రీరామకృష్ణుల దాస్యభావ సాధన

చివరి వర్ణన విన్న తర్వాత, "మహాశయా, ఆ పెరిగిన వెన్నెముక ఇంకా అలాగే ఉందా?" అని అడిగాం. అది విని ఆయన నవ్వి, "లేదులే, ఆ భావం మనసులో ఎప్పుడైతే సమసిపోయిందో అది మళ్లీ మామూలుగా అయిపోయింది" అని చెప్పారు.

దాస్యభావ సాధన చేస్తున్న కాలంలో శ్రీరామకృష్ణులకు ఒక దివ్యదర్శనం, దివ్యానుభవం కలిగాయి. ఈ దర్శన అనుభూతులు ఇంతకు పూర్వం పొందిన అనుభూతుల వంటివి కావు. క్రొత్తరకం అనుభూతులు ఇవి. కాబట్టే ఆ దర్శనం, ఆ అనుభూతి ఆయన చిత్తంలో గాఢంగా ముద్రించుకుపోయాయి. ఆ అనుభూతిని వివరిస్తూ, శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "ఆ సమయంలో, ఒకరోజు నేను పంచవటి క్రింద కూర్చున్నాను. ధ్యానం - చింతన ఇలాంటివి ఏమీ చేయడం లేదు. ఊరకనే అలా కూర్చుని ఉన్నాను. అంతలో చూస్తుండగానే ఒక స్త్రీ ఆకారం కనిపించింది. సాటిలేని తేజస్సుతో ఆమె సౌందర్యం వెలిగిపోతోంది. ఆమె చుట్టూ ఉన్న పరిసరాలు ఆమె దివ్యకాంతితో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. అప్పుడు నేను భ్రమలో

9. సీతామాత దర్శనం

---

1. III. 1 & 3

ఉన్నాననుకునేరు? నా కన్నీ మామూలుగానే కనిపిస్తున్నాయి. పంచవటిలోని చెట్లూ - చేమలు - రాళ్లూ - మొక్కలు, గంగానది - ఇవన్నీ కనిపిస్తున్నాయి. వీటితోపాటుగా, ఆ దివ్యస్త్రీ కూడ కనిపిస్తోంది. ఆమె మానవకాంతయే అని గ్రహించాను. ఎందుకంటే ఆమెకు మూడు కళ్ళుగానీ, నాలుగు చేతులుగానీ, ఒకటి కన్నా మించిన తలలుగానీ లేవు. మానవకాంతకు మాదిరే కళ్లు, శరీర అవయవాలున్నాయి. కాని దేవతా స్త్రీలలో లేని విశిష్టత ఆమెలో గోచరించింది. ఆమె వదనం నుండి ప్రేమ - దయ - కరుణ - సహనం - విషాదం - ఇవన్నీ ఒక్కుమ్మడిగా వర్షిస్తున్నాయి. ఆ దివ్య మానవకాంత నన్ను ప్రసన్నంగా చూస్తూ, నా వైపుకు గజగమనంతో గంభీరంగా నెమ్మదిగా చిన్నచిన్న అడుగులు వేస్తూ వస్తోంది. ఉత్తరదిశ నుండి దక్షిణదిశకు - నావైపు వచ్చింది. నా వైపు ఆమె రావడం చూసి, పరమాశ్చర్యంలో మునిగిపోయాను. ఎవ రీ దివ్యకాంత? అని అనుకుంటున్నంతలో, హఠాత్తుగా ఎక్కడి నుండో ఒక కొండముచ్చు దూకి అక్కడికి వచ్చింది. కిచకిచలాడుతూ ఆమె పాదాల చెంత కూర్చున్నది. అంతలో నా అంతరంగంలో ఒక స్ఫురణ కలిగింది - ఈమె సీత. జీవితంలో చాలాకాలం దుఃఖాలు అనుభవించిన సీతామాత. జనకుని ముద్దుల రాకుమారి. రాముని కోసమే జీవించిన సీతాసతి. ఆ స్ఫురణ రాగానే 'అమ్మా, అమ్మా' - అంటూ ఆమె పాదాలపై పడబోయాను. కాని మరుక్షణమే ఆమె మెరుపుతీగలా వేగంగా వచ్చి దీనిలో (తన శరీరాన్ని చూపిస్తూ) ప్రవేశించింది. నేను ఆశ్చర్యానందాలతో నిండిపోయాను. బాహ్యస్మృతి కోల్పోయి పడిపోయాను. ధ్యానం, చింతనలు లేకుండానే ఇలాంటి దర్శనాలు నా కెప్పుడూ కలుగలేదు. జన్మించినప్పటి నుండి దుఃఖాలే అనుభవించిన సీతాదేవిని మొట్టమొదటిసారిగా దర్శించినందుకే నేమో, నేను కూడ జీవితమంతా దుఃఖాలే అనుభవిస్తున్నాను.''

10. శ్రీరామకృష్ణులు స్వయంగా పంచవటి నాటడం

తపస్సుకు యుక్తమైన పవిత్రస్థలం శ్రీరామకృష్ణులకు అవసరమనిపించింది. అందుకే కొత్త పంచవటిని[1] స్థాపించాలనుకున్నారు. ఈ విషయం గురించి హృదయ్ మా కిలా చెప్పాడు:

పంచవటికి దగ్గరలో హంస్‌పుకుర్ (బాతుల కొలను) ఉంది. దాన్ని త్రవ్వి పెద్దది చేశారు. త్రవ్వగా వచ్చిన మట్టితో పాత

---

1. అశ్వత్థ, బిల్వవృక్షం చ వట ధాత్రి అశోకం।
వటీ పంచక మిత్యుక్తం స్థాపయేత్ పంచదిక్షుచ॥ *(స్కం.పు.)*

తూర్పున - అశ్వత్థం, ఉత్తరంగా - మారేడు, పడమట - మర్రి, దక్షిణంలో ఉసిరిక, ఆగ్నేయంలో - అశోకం నాటి, మధ్యలో పెద్దవేదిక నిర్మిస్తే, అది ధ్యానానికి ఉత్తమం అంటారు.

పంచవటి

పంచవటి దగ్గర ఉన్న దిగుడు ప్రదేశాన్ని పూడ్చారు. అలా సమతలంగా చేయడంతో శ్రీరామకృష్ణులు తరచూ దేనికింద ధ్యానం చేసేవారో, ఆ ఉసిరి చెట్టు నష్టమైపోయింది.

ఇప్పుడు మనం చూస్తున్న సాధన కుటీరానికి పడమరగా, శ్రీరామకృష్ణులు స్వయంగా ఒక రావిచెట్టు (అశ్వత్థం) నాటారు. హృదయ్ చేత మర్రి - అశోక - మారేడు - ఉసిరిక మొక్కలను నాటింపజేశారు. వాటితోపాటు తులసి, అపరాజిత[1] అనే మొక్కలను చుట్టూ నాటింపజేశారు. ఈ మొక్కలను మేకలు, ఆవులు మొదలైన పశువులు మేయకుండా, ఒక గట్టి కంచెను[2] వేయించారు. ఈ నిర్మాణమంతా అనుకోకుండా, అద్భుతంగా నెరవేరింది. ఆ వివరాలు మరోచోట (III.2) చెప్పి ఉన్నాం. శ్రీరామకృష్ణులు రోజూ తులసి, అపరాజిత మొదలైన మొక్కలకు నీరుపోస్తూ, చక్కగా చూసుకునేవారు. ఆ కారణంగా అవి త్వరలోనే పెరిగి పెద్దవయ్యాయి. ఎవరైనా వాటి మధ్య కూర్చుని ధ్యానం చేస్తుంటే, వారు ఇతరుల కెవరికీ కనిపించేవారు కారు.

రాణీ రాసమణి కాళికాలయాన్ని ప్రతిష్ఠ చేసిన తర్వాత పూరి, గంగాసాగర్ దర్శించడానికి వెళ్లే అనేకమంది సాధు సన్న్యాసులు, భక్తురాలైన రాణీ రాసమణి ఇచ్చే ఆతిథ్యాన్ని స్వీకరించేవారు. ఆ యాత్రకుపోతూ వస్తూ ఉండేటప్పుడు ఆ

---

1. శంఖు ఆకారంలో నీలంరంగు పువ్వులు పూచే తీగె.
2. ఈ కంచెను 'భర్తాభారీ' అనే తోటమాలి కట్టాడు. అతడు కాళికాలయ తోటమాలి.

[illegible]
11. [illegible] [illegible]. ఆ సమయం నుండి [illegible]
[illegible] [illegible] ప్రాణాయామం. [illegible] సాధన చేస్తుండేవారు. ఒకరోజు అతను [illegible] ఈ విషయాన్ని చెప్పారు. తరువాత అతను రాజయోగ సాధన చేయమని బోధించారు. ఎందుకంటే దాన్ని అతను పూర్తిగా అధిగమించి, దాని ఫలితాన్ని తెలుసుకున్నారు కనుక. కొంతమంది ఈ విషయాన్ని అడగగా సంప్రదించగా అతను ఇలా చెప్పారు: "ఈ సాధనలు ఈ కాలానికి కావు. కలియుగంలో జీవులు అల్పాయుష్కులు. వారి జీవితాలు కేవలం ఆహారం మీదనే ఆధారపడి ఉంటాయి. అలాంటప్పుడు, ముందు హఠయోగాభ్యాసంతో శరీరాన్ని దృఢం చేసుకొని, ఆ తర్వాత రాజయోగ సాధనతో భగవద్ ధ్యానం చేయడానికి సమయం ఎక్కడ ఉంటుంది?

హఠయోగంలో చెప్పిన క్రియలన్నింటినీ పూర్తిగా సాధించాలంటే హఠయోగంలో సంపూర్ణసిద్ధి పొందిన యోగ్య గురువు అవసరం. ఆయన వద్దే నివసించాలి. ఆయన ఉపదేశాన్ని అనుసరించి ఆహార విహారాది కఠోర నియమాల్ని పాటించాలి. నియమాలు ఏ కొంచెం తప్పినా, శరీరం రోగగ్రస్తమవుతుంది. ఒక్కోసారి చావు కూడ సంభవిస్తుంది. కాబట్టి అవన్నీ చేయనవసరం లేదు. ప్రాణాయామం, కుంభకం - ఇవన్నీ దేనికంటావా? మనసును వశంలోకి తెచ్చుకోవడానికే కదా! భక్తితో భగవద్ధ్యానం చేస్తే, మనసు - ప్రాణం సహజంగానే వశంలోకి వస్తాయి. కలియుగంలో మనిషి ఆయువు అల్పం. అతడి శక్తి కూడ అల్పమే. కాబట్టే కరుణామయుడైన భగవంతుడు ముక్తిమార్గం సులువు చేశాడు. భార్యాబిడ్డలు పోయినప్పుడు మనిషికి ఎంత వియోగం ఏర్పడుతుందో, ఎంత పరితాపం కలుగుతుందో తెలుసు కదా! అంతటి పరితాపాన్ని భగవంతుడికోసం, ఒక్క రోజయినా పడితే, సాధకుడికి భగవత్సాక్షాత్కారం తప్పక లభిస్తుంది."

నేడు చాలావరకు స్మార్తులు అనుసరించే సాధనలు చేస్తున్నారు. ఈ సాధ
12. హలధారి పెట్టిన శాపం
కులలో చాలామంది తాంత్రిక సాధనలే చేస్తుంటారు. వైష్ణవ సంప్రదాయ సాధకులైతే, పరకీయ ప్రేమను ఎక్కువగా సాధన చేస్తుంటారు. ఈ విషయాన్ని మరోచోట (II.13 & IV.1) వివరించాం.

హలధారి వైష్ణవమార్గ సాధకుడు. శ్రీరాధాగోవింద ఆలయ పూజారి. అతడు రహస్యంగా ఈ పరకీయ ప్రేమసాధన చేయసాగాడు. ఈ విషయం

తెలిసిన జనం పైకి అనలేక, లోపలే దీన్ని గూర్చి గుసగుసలాడుకునేవారు. వారికి అతడంటే భయం. అతడికి వాక్శుద్ధి ఉందని, అతడు ఏ మాట అన్నా నెరవేరుతుందని వారికి తెలుసు. అందుకే అతడి సాధన గూర్చి నవ్వుకునేవారే తప్ప, బాహాటంగా ఆట పట్టించేవారు కాదు. ఈ విషయం శ్రీరామకృష్ణులకు తెలిసింది. హలధారి ఆయనకు అన్న వరుస అవుతాడు. ఒకరోజు శ్రీరామకృష్ణులు హలధారికి జనం విషయం చెప్పి, కాస్త జాగ్రత్తగా ఉండమని హెచ్చరించారు. అది విని హలధారి ఉగ్రుడైపోయాడు. ''గదాయ్! నువ్వు నా కన్నా చిన్నవాడివి. ఆ విషయం మరిచి, నన్నే హెచ్చరిస్తావా? చూస్తూండు, రక్తం కక్కుకుంటావు'' అని శపించాడు. శ్రీరామకృష్ణులు ఎన్నోవిధాల నచ్చచెప్పారు, వేడుకున్నారు. అయినా హలధారి అవేవీ వినిపించుకోలేదు.

ఇది జరిగిన కొన్ని రోజులకు, ఒకరోజు రాత్రి శ్రీరామకృష్ణుల గొంతులో ఏదో ద్రవం లాంటిది ఊరింది. నోటి నుండి ధారగా పడింది. అది రక్తం! నిజంగానే శాపం ఫలించింది. ''ఆ రక్తం ఎలా ఉందో తెలుసా, నల్లగా, చిక్కుడు ఆకుల రసంలా ఉంది. చాలా చిక్కగా ఉంది. అందువలన కొంత క్రిందపడినా, మిగతాది మాత్రం నోటి నుండి క్రిందికి వ్రేలాడుతూనే ఉంది. ధోవతి అంచుతో అదిమి పట్టి రక్తాన్ని ఆపే ప్రయత్నం చేశాను. కాని లాభం లేకపోయింది. రక్తస్రావం ఆగలేదు. నాకెంతో కంగారు పుట్టింది. అంతా నా చుట్టూ చేరి ఆందోళనగా చూస్తున్నారు. హలధారి కూడ కంగారుగా పరిగెత్తుకొచ్చాడు. అతణ్ణి చూడగానే, ఏడుపు ముంచుకొచ్చింది. 'అన్నా! చూడు నీ శాపం ఎంతపని చేసిందో?' అన్నాను. అది చూసి అతడూ ఏడ్చేశాడు.

''ఆ సమయంలో ఆలయంలో ఒక వృద్ధ సాధువు వచ్చి ఉన్నాడు. అతడు కూడ వచ్చి నన్ను పరీక్షగా చూశాడు. 'మంచి పని జరిగింది. ఈ రక్తం ఇలా రావడం మేలైంది. నువ్వు హఠయోగ సాధన చేశావు కదా! సాధనాంతాన జడసమాధి కలుగుతుంది. నీ విషయంలో అదే జరిగింది. సుషుమ్నా ద్వారం తెరుచుకొంది. రక్తం తల వైపు ప్రవహిస్తూ వస్తున్నది. అది నీ తలలోకి చేరితే మాత్రం, నీ కిక స్పృహ ఉండదు. జడసమాధి సిద్ధిస్తుంది. కాని జగన్మాత ఆశయం వేరుగా ఉంది. నీ ద్వారా లోకకల్యాణం చేయించాలనుకుంటోంది. అందుకే అమ్మ నిన్నిలా రక్షించింది' అని సాధువు వివరించాడు. అది విని 'హమ్మయ్యా! గండం తప్పింది' అనుకున్నాను'' అంటూ గురుదేవులు కాలాంతరంలో మాకు వివరించారు.

ఇలా మనిషి శాపం, దైవం మూలంగా వరంగా పరిణమించింది.

హలధారి పట్ల శ్రీరామకృష్ణుల ప్రవర్తనలో ఒక మధురమైన మర్మం ఇమిడివుంది. హలధారి, శ్రీరామకృష్ణుల చిన్నాన్న కుమారుడు. అన్న వరుస.

13. శ్రీరామకృష్ణులను గూర్చి హలధారి వైఖరి

1858లో దక్షిణేశ్వరాలయానికి వచ్చి ఉంటాడు. 1865 వరకు శ్రీరాధాగోవింద పూజారిగా ఉన్నాడు: కాబట్టి గురుదేవుల రెండవ భాగ సాధనకాలం, ఆ తర్వాత మరికొంతకాలం అతనక్కడున్నాడన్నమాట. ఆ కారణంగా శ్రీరామకృష్ణులను సన్నిహితంగా చూసే అవకాశం అతడికి కలిగింది. కాని శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక వికాసం గూర్చి అతడు కచ్చితంగా 'ఇది' అని తెలుసుకోలేకపోయాడు. హలధారి శాస్త్రాలపై గట్టి నమ్మకం ఉన్నవాడు. విద్వాంసుడు కూడ. శాస్త్రీయ నియమనిష్ఠలను తు.చ. తప్పకుండా పాటించేవాడు. అందుకే భావసమాధి అవస్థలో శ్రీరామకృష్ణులు తన వస్త్రాలను, జందేన్ని తీసి పారేస్తే, అతడు గట్టిగా అధిక్షేపించాడు. శ్రీరామకృష్ణులు పిచ్చివాడని, సంప్రదాయ వ్యతిరేకి అని భావించాడు. ఈ విషయమై హృదయ్ ఇలా చెప్పాడు: ''హలధారి నాతో - 'చూడు హృదూ, తమ్ముడు ఎలా ప్రవర్తిస్తున్నాడో! బట్టలు తీసేస్తాడు, జందేన్ని తీసేస్తాడు. ఇది అపచారం కదా! ఎన్నో జన్మలకు గాని, బ్రాహ్మణ జన్మ లభించదు కదా! మరి ఇతడేమో బ్రాహ్మణత్వాన్ని భ్రష్టు పట్టిస్తున్నాడు. ఇతడేమైనా అత్యున్నత అవస్థకు, తురీయస్థితికి చేరుకున్నాడా ఏమిటి? హృదూ, అతడు నీ మాట వింటాడు. అతడు ఇలాంటి అపచారం చేయకుండా చెప్పి చూడు. అతణ్ణి కట్టిపడేసి అయినా, ఇలాంటి నికృష్టపు పనులు చేయకుండా చూడు', అన్నాడు.''

ఇలా శ్రీరామకృష్ణులను విమర్శించేవాడే అయినా మళ్లీ పూజాసమయంలో శ్రీరామకృష్ణుల దశ చూసి విస్తుపోయేవాడు. అప్పుడు శ్రీరామకృష్ణుల కళ్ల నుండి ప్రేమబాష్పాలు వర్షించేవి. భగవన్నామాన్ని వింటూ ఆయన పరవశులై ఆనందాబ్ధిలో మునిగిపోయేవారు. జగన్మాత సాక్షాత్కారం కోసం పరితపించిపోయేవారు. శ్రీరామకృష్ణుల ఈ దశ చూసి, హలధారి ఆశ్చర్యంతో ముగ్ధుడయ్యేవాడు. 'తమ్మునిలో తప్పకుండా దైవావేశం ఉంది. మామూలు భక్తునిలో ఇలాంటి లక్షణాలు ఏమీ ఉండవు' అని అనుకునేవాడు. కొన్ని సమయాలలో హృదయ్‌తో, ''హృదూ! ఆతడిలో నువ్వు ఏదో అసాధారణ శక్తిని చూసేవుంటావు! లేకుంటే ఆతణ్ణి అంత విశ్వసనీయంగా సేవించి ఉండవు'' అని చెప్పేవాడు.

14. హలధారి పాండిత్యాహంకారం

సదా సంశయగ్రస్తమైన హలధారి మనసు శ్రీరామకృష్ణుల యథార్థ స్థితిని గురించి ఒక నిశ్చితాభిప్రాయానికి రాలేకపోయింది. అతడి మనసు గౌరవం, జాలి మధ్య ఊగిసలాడుతూ ఉండేది. శ్రీరామకృష్ణులు ఇలా విశదంగా చెప్పారు: ''నా పూజను చూసిన తర్వాత, -

'తమ్ముడూ! నీ విషయం తెలిసిపోయింది' - అనేవాడు. ఇలా ఎన్నోసార్లు అన్నాడు. మళ్లీ విమర్శించేవాడు. ఈ మాటలు అతడి నుండి విన్నప్పుడల్లా - 'అన్నా! జాగ్రత్త, మళ్లీ భ్రమకు లోనయ్యేవు' అనేవాడిని. అది విని - 'తమ్ముడూ, ఇక నువ్వు నన్ను భ్రమ పెట్టలేవు. నీలోని భక్తి పరాకాష్ఠకు చేరింది' అని పొగడేవాడు. - 'చూస్తానుగా! ఈ మాట మీద నువ్వెంతకాలం నిలబడ తావో' - అని ఆట పట్టించేవాణ్ణి నేను.

''అతడు తన పూజ ముగించి, నస్యాన్ని గట్టిపట్టు పట్టేవాడు. తర్వాత గీత, భాగవతం, అధ్యాత్మ రామాయణం - ఈ గ్రంథాలలో ఏదో ఒకటి అధ్య యనం చేసేవాడు. దాంతో అతడిలో అహంకారం పెరిగేది. తాను జ్ఞాని ననుకునే వాడు. నే నతడి వద్దకు వచ్చి 'అన్నా! ఈ గ్రంథాలలో ఉన్న అవస్థలన్నీ నేను స్వయంగా పొందాను' అనేవాడిని - 'నా కవన్నీ చక్కగా అర్థమవుతాయి' అని చెప్పేవాడిని. అది వినగానే అతడు రెచ్చిపోయేవాడు. - 'ఓరి మూర్ఖుడా! నువ్వెక్కడ, ఈ శాస్త్రాలు ఎక్కడ? విద్యాగంధంలేని చవటవు, నీ కీ విషయాలు అర్థమవుతాయా?' అని మండిపడేవాడు. నేను - 'అన్నా! నిజం. దీనిలో (తన శరీరం చూపిస్తూ) ఉండేవాడు నా కన్నీ తెలియచేస్తున్నాడు. నాలో ఏదో భక్తి ఉందన్నావే ఆ భక్తే నా కన్నీ బోధిస్తోంది' అని వివరించేవాడిని. ఆ మాటలతో అతడు మరింత రెచ్చిపోయేవాడు. 'అవివేకీ! పో అవతలకు. ఈ కలికాలంలో కల్కి అవతారం ఒక్కటే ఉంది. ఇంకో అవతారం ఉందని ఏ శాస్త్రంలో ఉందో చెప్పు. నీకు బుర్ర చెడింది. అందుకే ఇలా పిచ్చి పిచ్చిగా వాగుతున్నావు' అని రోషంగా అనేవాడు. నాకు నవ్వు వచ్చేది. 'అన్నా! అదుగో మళ్లీ భ్రమలో పడు తున్నావు' అనేవాడిని. కాని నా మాటలు అతనెందుకు వింటాడు? - ఇలా అత డితో ఈ నాటకం ఎన్నోసార్లు, ఎంతోకాలం జరిగింది. ఒక రోజు నేను బట్టలు తీసేసి, చెట్టు మీద కూర్చుని, చిన్న పిల్లవాడిలా మూత్ర విసర్జన చేస్తున్నాను. హలధారి అది చూసి వెర్రెత్తిపోయాడు. నన్ను బ్రహ్మరాక్షసి ఆవహించిందని నిశ్చ యించుకున్నాడు.'

విచిత్ర పరిస్థితులలో హలధారి కుమారుడు మరణించాడని మునుపే తెలిపివున్నాం. సంకుచిత వైష్ణవుడు కావడం చేత కాళీమాత తామసి అనే గట్టి నమ్మకం అతడికి కలిగింది. శ్రీరామకృష్ణులతో ఒక రోజు ఈ మాట చెప్పాడు. ''అలాటి తమోప్రధాన దేవతను ఉపాసిస్తే, ఆధ్యాత్మిక ప్రగతి ఎలా కలుగుతుంది? కలగదు. కాబట్టే ఆ దేవతను పూజించకు'' అని సూచించాడు. శ్రీరామకృష్ణులు అందుకు బదులేమీ చెప్ప లేదు. కాని తన ఇష్టదైవం జగన్మాతను హలధారి తామసి అనడం విని చాలావ్యథ

15. హలధారి - కాళీ భావన

చెందారు. కాళికాలయానికి వెళ్లారు. అమ్మ ముందు మోకరిల్లి, కన్నీరు స్రవిస్తూ, అమాయకంగా తన వ్యధను వెళ్లబోసుకొన్నారు. "అమ్మా! హలధారి శాస్త్రాలు తెలిసిన పండితుడు. అతడు నిన్ను 'తామసి' అంటున్నాడు. నిజమా? కాదు గదా!" అని అడిగారు. జగన్మాత అప్పుడు తన నిజతత్త్వాన్ని స్పష్టం చేసింది. తన త్రిగుణాతీత మూలతత్త్వాన్ని ఆయనకు తెలియజేసింది. అది విని శ్రీరామకృష్ణులు పసిపిల్లవాడిలా సంతోషంతో పొంగిపోయారు. పరిగెత్తుకెళ్లి హల ధారి భుజాల పైకెక్కి కూర్చున్నారు. "అన్నా! అమ్మను తమోగుణి అంటావా? అమ్మ తామసియా? అమ్మ ఎవరో తెలుసా? ఆమె త్రిగుణమయి, త్రిగుణాతీతు రాలు. గుణం రీత్యా చూస్తే అమ్మ శుద్ధసాత్విక స్వరూపిణి. తెలుసా?" అని పదేపదే ఉత్తేజంతో చెప్పారు.

భావపరవశులైన శ్రీరామకృష్ణుల దివ్యవాణి, ఆయన పవిత్ర స్పర్శతో హలధారి అంతర్చక్షువు తెరుచుకొంది. అప్పుడతడు పూజాపీఠంపై కూర్చుని ఉన్నాడు. శ్రీరామకృష్ణుల మాటలను హృదయపూర్వకంగా అంగీకరించాడు. జగన్మాత శ్రీరామకృష్ణులలో అభివ్యక్తమై ఉండడం దర్శించాడు. వెంటనే పరమ భక్తిప్రపత్తులతో ఆయన పాదాలను పుష్పచందనాదులతో పూజించాడు. కొంత సేపటికి హృదయ్ అక్కడికి వచ్చాడు. "మామను ఏదో బ్రహ్మరాక్షసి ఆవహిం చిందని నువ్వు చెప్పావు కదా! మరి ఆయనను ఎందుకు పూజించావు?" అని హలధారిని అడిగాడు. "ఏమోమరి! నాకు అర్థం కావడంలేదు. అలా ఎందుకు అతడు కాళికాలయం నుండి సరాసరి నా వద్దకు వచ్చాడో, వచ్చి నన్నతడు ఏం చేశాడో తెలియదు. కాని అతడిలో నాకు దైవాంశ కనిపించింది. అందుకే పూజిం చాను. మరొక్క విషయం, హృదూ! కాళికాలయానికి అతనెప్పుడు వెళ్లినా, అతడు నన్నిలాగే మాయ చేస్తుంటాడు. ఈ రహస్యం ఏమిటో మరి!!" అంటూ హలధారి ఉన్న విషయం చెప్పాడు.

హలధారి అలా ఎన్నోసార్లు శ్రీరామకృష్ణుల దివ్యత్వాన్ని ప్రత్యక్షంగా దర్శిం చాడు. కాని అదేమి చోద్యమో, అతడు ముక్కుపొడుం పట్టించి శాస్త్ర అధ్య యనం చేయడానికి ఉపక్రమించగానే, పాండిత్యాభిమానం అతణ్ణి ముంచెత్తేది; ఆ అహంకారంతో అతడు మళ్లీ మామూలు మనిషైపోయేవాడు. 'ఆ రామకృష్ణకు వెర్రిపట్టింది' అనుకొనేవాడు.

16. ఉచ్ఛిష్ట భక్షణం

బాహ్యశౌచం, సదాచారం ఇలాంటివి ఎన్నెన్ని ఉన్నా సరే, మనస్సు కామినీ కాంచనాసక్తి నుండి ముక్తం కానంతవరకూ, సాధకుడికి అంత ప్రయోజనం ఉండదు. ఈ విషయం హలధారి జీవితం ద్వారా బుజువవుతున్నది. పై అలంకారాలు ఎన్ని ఉన్నా, అవి సత్యాను భూతిని కలిగించలేవు.

శ్రీరామకృష్ణులు సర్వులలో భగవంతుణ్ణే ప్రత్యక్షంగా దర్శించేవారు. ముఖ్యంగా ఆలయానికి వచ్చే బీదా బిక్కీలను నారాయణ స్వరూపులుగానే గాంచే వారు. వారు గ్రహించిన ప్రసాద ఉచ్ఛిష్టాన్ని శ్రీరామకృష్ణులు భగవత్ప్రసాదంగా భావించి తినేవారు. ఈ విషయం మేము మునుపే పేర్కొన్నాం. దాన్ని హలధారి చూసి చాలా చిరాకుపడ్డాడు. వెర్రి ఆవేశంలో శ్రీరామకృష్ణులతో, ''గదాయ్! నువ్వు నీ పిల్లలకు పెళ్లి ఎలా చేస్తావో అది చూస్తాను'' అన్నాడు. హలధారిని కొద్దో గొప్పో జ్ఞానిగా శ్రీరామకృష్ణులు భావించేవారు. ఆ మాటలు విన్న తర్వాత శ్రీరామకృష్ణులకు అతడిపై ఆ గౌరవం కూడ పోయింది. శ్రీరామకృష్ణులకు ఆవేశం వచ్చింది. ''ఓరీ, ధూర్తుడా! ఇదేనా నీ పాండిత్యం? శాస్త్రాన్ని వివరిస్తూ, ఈ జగత్తంతా మిథ్య, మాయ. జీవులంతా బ్రహ్మస్వరూపులు. అందరినీ బ్రహ్మంగా దర్శించాలని చెబుతావే, మరి అదంతా వట్టిదేనా? జగత్తు మిథ్య అంటూనే, పిల్లలను వరుసగా కంటూ ఉంటావే? నీ శాస్త్రజ్ఞానం మీద మూత్రవిసర్జన చెయ్యాలి'' అని గట్టిగా మందలించారు.

శ్రీరామకృష్ణులది శిశువు స్వభావం. కల్లాకపటం ఎరుగని అమాయకులు.

17. హలధారి విమర్శ: భావముఖంలో నెలకొని ఉండమన్న అమ్మ ఆదేశం

ఆయన హలధారి పాండిత్యం కారణంగా అప్పుడప్పుడు ఆందోళన చెందేవారు. నిజానిజాలు తెలుసుకోవడానికి జగన్మాత వద్దకు పరిగెత్తుకు వెళ్లి మొరపెట్టుకొనేవారు.

ఒకరోజు హలధారి భగవంతుని విషయం శ్రీరామకృష్ణులతో చర్చించసాగాడు. 'ఉన్నాడు - లేడు' అనే వాటికి భగవంతుని తత్త్వం అతీతమని శాస్త్రాలను ఉదాహరించాడు. కాబట్టి శ్రీరామకృష్ణులకు భావసమాధి కలగడం, ఆయన దివ్యదర్శనాలు, దివ్య అనుభూతులు అన్నీ అసత్యాలని, భ్రాంతులని ఋజువు చేయడానికి ప్రయత్నించసాగాడు.

దాంతో శ్రీరామకృష్ణుల మనసు అయోమయం అయింది. ఆయనే కాలాంతరంలో ఈ సంఘటనను తెలుపుతూ ఇలా అన్నారు: ''నాలో గొప్ప ఆందోళన చెలరేగింది. మరి నా దివ్యదర్శనాలు, నేను పొందిన అనుభవాలన్నీ కేవలం భ్రాంతులేనా అని కంగారుపడ్డాను. అంటే అమ్మ నన్ను వంచించిందా? అని వ్యథ చెందాను. ఆ ఆవేదనతో అమ్మకు అంతా చెప్పుకొన్నాను - 'అమ్మా! నాకు చదువు సంధ్యలు లేవని ఎంచి, నన్ను వెర్రివాణ్ణి చేసి, ఇలా మోసం చేస్తావా?' - అంటూ ఏడ్వసాగాను. కొంతకాలం అలా ఏడుస్తూనే ఉండిపోయాను. ఇంతలో నా కెదురుగా భూమిలో నుండి తెల్లని పొగమంచులాంటి పొర పైకివచ్చి, ఆ ప్రాంతాన్నంతా కమ్ముకుంది. చూస్తూండగానే ఆ పొగ

మంచులో బంగారువర్ణంలో మెరసిపోతున్న ఒక తేజోమూర్తి కనిపించింది. ఆ మూర్తి తదేకంగా నన్నే చూస్తూ 'వత్సా! చింతించకు... నువ్వు భావముఖంలోనే ఉండు' అంటూ ముమ్మార్లు పలికింది. తర్వాత నెమ్మదిగా ఎలా వచ్చిందో అలాగే పొగమంచు మూర్తితోపాటు కరిగిపోయింది. దాంతో నా మనసు సందేహరహితమై శాంతించింది.''

తోతాపురి, శ్రీరామకృష్ణులకు దీక్షనిచ్చి వెళ్లిపోయిన తర్వాత, శ్రీరామకృష్ణులు ఆరు నెలల కాలం నిర్వికల్పసమాధిలో ఉండిపోయారు. ఆరవ నెల తుదిలో ఆయన సమాధి భగ్నమైంది. జగన్మాత వాణి వినిపించింది. - 'నాయనా! ఈ సమాధిలో కాదు, నువ్వు భావముఖంలోనే ఉండాలి' అని ఆదేశించింది.

ఈ కింది సంఘటనను స్వామి ప్రేమానందకు ఆయనే స్వయంగా విశదీకరించారు: ఒకరోజు శ్రీరామకృష్ణులకు హలధారి అన్న మాటలు జ్ఞాపకానికి వచ్చి, అదే సంశయం మళ్లీ ఆయన మనస్సులో తలెత్తింది. పూజలో కూర్చుని ఈ సమస్యకు పరిష్కారం చూపమని అమ్మను యాచిస్తూ విలపించారు. అప్పుడు జగజ్జనని 'రతి తల్లి' రూపంలో దర్శనమిచ్చి, భావముఖంలో నెలకొని ఉండమని చెప్పింది.

దక్షిణేశ్వరాలయంలో హలధారి దాదాపు ఏడు సంవత్సరాలు వసించాడు. కాబట్టి ఆ కాలంలో శ్రీరామకృష్ణుల చెంతకు వచ్చిన గురువులను, మహాత్ములను అతడు స్వయంగా చూశాడు. పిశాచంలా కనిపించే బ్రహ్మజ్ఞుడైన సాధువు, భైరవీ బ్రాహ్మణి, జటాధారి, తోతాపురి వీరంతా క్రమంగా ఒకరి తర్వాత ఒకరు రావడం హలధారికి ప్రత్యక్షంగా తెలుసు. తోతాపురితో హలధారి వేదాంత చర్చలు చేసేవాడని శ్రీరామకృష్ణులే మాకు చెప్పారు. ఇదివరకు మేము పేర్కొన్న హలధారి - శ్రీరామకృష్ణుల సంఘటనలు, రెండు సంవత్సరాల కాలంలో అప్పుడొకటి ఇప్పుడొకటిగా జరిగాయి. కాని వాటినన్నిటినీ ఒకచోట చేర్చి తెలిపాము, పాఠకుల సౌకర్యార్థం.

18. దక్షిణేశ్వరంలో హలధారి వసించిన కాలగడువు

మనం ఇంతవరకు శ్రీరామకృష్ణుల సాధనామయ జీవితాన్ని తరచి చూశాం కదా! మనకు తద్ద్వారా కొన్ని సత్యాలు స్పష్టమయ్యాయి. అవేమిటంటారా? ఆలయంలోని వారి కందరికీ శ్రీరామకృష్ణులు వెర్రివెంగళాయిలా కనిపించేవారు. అది నిజం కాదని, ఆయనకు పిచ్చి లేదని, అది దివ్యభావం అని స్పష్టమైంది. కొందరు ఆయన బుర్ర చెడిందన్నారు. శరీర రుగ్మత కారణంగా మతి చలించిందన్నారు. అవి నిజం కాదని తేలిపోయాయి.

19. శ్రీరామకృష్ణుల దివ్యోన్మాదం గురించి చర్చ

ఆయనలో భగవత్సాక్షాత్కారానికై తీవ్రతపన, మహా ఆరాటం కలిగాయి. వాటి కారణంగానే ఆయన తనను తాను నియంత్రించుకోలేకపోయారు. అందుకే ఉన్మాదిలా కనిపించేవారు. కాని అది ఉన్మాదం ఎంతమాత్రమూ కాదు. ఆయన హృదయంలో దైవదర్శనం కోసమైన తీవ్రజ్వాల మండేది. అందుకే అందరిలా ఆయన ప్రవర్తించలేకపోయేవారు. ఆ కారణంగా, తమలా మామూలు వ్యక్తిలా లేకపోయేసరికి, ఆయనను పిచ్చివాడన్నారు. కాని ఎవరికి పిచ్చో వారికి తెలియదు. దివ్యోన్మాదంతో పూర్ణుడైనవాడు, మామూలు వ్యక్తిలా ఎలా మసలుకో గలడు?

హృదయ పరితాపం దుర్భరమైనప్పుడు అంతరంగం ఒక వైపుకు, మనసు మరో వైపుకు లాగుతున్నప్పుడు, ఆ వ్యక్తి మామూలు వ్యక్తుల్లా ఎలా ప్రవర్తించ గలడు? అందరికీ సహనం సమానంగా ఉండదు. ఏ కాస్త సుఖం - దుఃఖం వచ్చినా కొందరు తలక్రిందులౌతారు. కొందరు ఎంత తీవ్రదుఃఖం వాటిల్లినా, మహాసుఖాలు ప్రాప్తించినా, సముద్ర గర్భంలా సుస్థిరంగా ఉంటారు.

మరి శ్రీరామకృష్ణులకి ఉన్న సహనశక్తి ఏపాటిది? ఆయన జీవిత సంఘటన లను పరిశీలించి చూస్తే ఆయన సహనశక్తి అసాధారణమని మనకు తెలుస్తుంది. 12 సంవత్సరాలు సరిగ్గా తినకుండా, సరిగ్గా నిద్ర లేకుండా స్థిరంగా ఉండగలి గారు. అలా ఎవరైనా ఉండగలరా? అనేక సందర్భాలలో అపార సంపదలు ఆయ నను వెతుక్కొంటూ వచ్చాయి. కాని అవి భగవత్సాక్షాత్కారానికి ఆటంకాలని తెలుసుకొని, వాటిని ఆయన తృణప్రాయంగా తిరస్కరించారు. ఆయన సహన శక్తి, తితిక్ష ఎంతటిదో చెప్పడం కష్టం. అసాధారణం అని మాత్రం చెప్పవచ్చు. దీన్ని స్పష్టంచేసే సంఘటనలు ఆయన జీవితంలో కోకొల్లలు.

20. దాన్ని రుగ్మతగా ఎంచడంలోని యుక్తి దోషం

కాంచనోన్మత్తులు, సంసార లంపటులు అయిన అజ్ఞానులకు శ్రీరామ కృష్ణుల దివ్యోన్మాదం ఎలా అర్థమవుతుంది? అందుకే వారు శ్రీరామకృష్ణులకు ఏదో జబ్బు ముదిరిందనేవారు. ఒక్క మథుర్‌బాబు మాత్రం అలా అనుకోలేదు. తనకు తెలిసిన శాస్త్ర జ్ఞానంతో, తర్కంతో ఆలోచించి, అది జబ్బు మాత్రం కాదని అర్థం చేసుకొన్నాడు. శ్రీరామకృష్ణుల నిజస్థితిని అంచనా వేయగలిగే మరోవ్యక్తి ఎవ్వరూ ఆ సమయంలో లేరు. కేనారామ్ భట్టాచార్య ఉంటే, అతడు కనిపెట్టేవాడు. అతడే శ్రీరామకృష్ణులకు శక్తి మంత్రోపదేశం చేశాడు. దీక్ష ఇచ్చిన తర్వాత అతడు ఎక్కడికి వెళ్లిపోయాడో ఎవరికీ తెలియదు. హృదయ్ గాని, మరోవ్యక్తిగాని అతణ్ణి గూర్చి ఏమీ చెప్పలేకపోయారు. కాళికాలయంలో పనిచేసే ఉద్యోగుల విషయం వేరే చెప్పాలా? వారంతా కేవలం ప్రాపంచికులు, సంసార

లంపటులు. అలాంటి వారికి శ్రీరామకృష్ణుల వాస్తవిక స్థితి ఎలా అర్థమవుతుంది? పైగా వారే ఆయనను పిచ్చివాడని, ఆయనకు జబ్బు ఉందని విమర్శించారు.

అందుచేత అప్పటి శ్రీరామకృష్ణుల యథార్థస్థితిని తెలుసుకోవాలంటే, మనకు ఆ కాలంలో దక్షిణేశ్వరానికి వేంచేసిన మహాత్ముల, సాధకుల ఉవాచలే ఆధారం. అవే మనకు పరమ ప్రమాణం. వారి విషయం గురించి శ్రీరామకృష్ణులే మాకు స్వయంగా చెప్పేవారు. ఇతరులు కూడ ఆయన మాటలను బలపరచి ఉన్నారు. శ్రీరామకృష్ణులు చెప్పినదాన్నిబట్టి చూస్తే, ఆ మహాత్ములు, సాధకులు శ్రీరామకృష్ణులను పిచ్చివాడని అసలు అనుకోలేదని, పైగా అత్యున్నత ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించినవారని అనుకునేవారని స్పష్టమవుతుంది.

21. అప్పటి శ్రీరామకృష్ణుల ప్రవర్తన ఆ నిర్ణయాన్ని ఖండిస్తుంది

సాధనకాలంలోని శ్రీరామకృష్ణుల ఘటనలను పరిశీలిస్తే, మనకు కొన్ని విషయాలు స్పష్టమవుతాయి. దైవసాక్షాత్కారం కోసం ఆయన అత్యంత తీవ్రంగా పరితపించేవారు. అలాంటి సమయాల్లో అప్పుడప్పుడు ఆయన బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయేవారు. కాని, మిగతా సమయాల్లో ఆయన తన ఆరోగ్యం విషయమై ఎంతో జాగ్రత్త వహించేవారు. ఎవరు ఎలాంటి వైద్యసలహా ఇచ్చినా పాటించేవారు. పదిమందీ చికిత్స చేయించుకోమని చెబితే, వెంటనే ఒప్పుకున్నారు. తల్లి వద్దకు, కామార్పుకూర్ వెళితే మంచిదంటే, అలాగే వెళ్లారు. పిచ్చి కుదరాలంటే పెళ్లి చేయాలన్నారు కొంతమంది. శ్రీరామకృష్ణులు దానికీ అంగీకరించారు. శ్రీరామకృష్ణులు ఇంత ఎరుకతో, జాగరూకతతో ఉన్నప్పుడు, ఆయనకు పిచ్చని చెప్పడం ఎలా సబబు?

మరో విషయం. దైవతపనలో ఉన్నకాలంలో ఆయన ప్రాపంచికతకు - ప్రాపంచిక విషయాలకు, వ్యవహారాలకు పూర్తిగా దూరంగా ఉండేవారు. కాని భక్తులంతా కలిసి సంకీర్తనలు చేస్తున్నప్పుడు మాత్రం వారికి దూరంగా ఉండక, వారితోపాటు సంకీర్తనల్లో పాల్గొనాలని అనుకునేవారు.

బారానగర్‌లోని దశమహావిద్యలను దర్శించడం, కాళీఘాట్‌లోని కాళిని దర్శించడం, దాదాపు ప్రతి సంవత్సరం పానీహాటీ వైష్ణవోత్సవంలో పాల్గొనడం - ఈ సంఘటనలు పై విషయాన్ని స్పష్టం చేస్తాయి. ఆ క్షేత్రాల్లో ఆయన శాస్త్రకోవిదులైన వారితో మాట్లాడేవారు కూడ. ఈ సంభాషణల విషయమై మాకు తెలిసింది స్వల్పమే. అయినా ఆ మాత్రం దానితో మాకో విషయం - ఆ శాస్త్రకోవిదులు శ్రీరామకృష్ణులను ఎంతో గౌరవంతో ఆదరించేవారన్న విషయం నిశ్చయంగా తెలిసింది.

ఇక్కడ వైష్ణవచరణ్ విషయం ప్రస్తావిద్దాం. 1859లో పానీహాటీలో జరిగిన వార్షికోత్సవంలో శ్రీరామకృష్ణులు పాల్గొన్నారు. అప్పుడు ఉత్సవానంద గోస్వామి కుమారుడైన వైష్ణవచరణ్‌ను చూశారు. అతణ్ణి చూడడం శ్రీరామకృష్ణులకు అదే మొదటిసారి.

22. శ్రీరామకృష్ణులతో వైష్ణవచరణ్ తొలి సమావేశం

ఈ సంఘటనను హృదయ్ నుండి మాలో కొందరం విన్నాం. శ్రీరామకృష్ణులు కూడ ఈ విషయం మాకు స్వయంగా చెప్పారు.

ఆయన ఆ రోజు మణిమోహన్ సేన్‌కు చెందిన దేవాలయంలో కూర్చుని ఉన్నారు. అక్కడికి వైష్ణవచరణ్ వచ్చి శ్రీరామకృష్ణులను చూశాడు. చూసిన వెంటనే, ఆయన సామాన్యుడు కాదని, అత్యున్నత ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించినవారని గ్రహించాడు. ఆ రోజు అతడు శ్రీరామకృష్ణులతోనే ఎక్కువ సేపు గడిపాడు. స్వయంగా అటుకులు, బెల్లం, మామిడిపండ్లు, మిఠాయి కొన్నాడు. వాటిని భగవంతునికి నివేదించాడు. తర్వాత శ్రీరామకృష్ణులతో, ఇతర భక్తులతో ఆ ప్రసాదాన్ని ఆరగించి ఎంతో ఆనందించాడు.

వార్షికోత్సవం ముగిసిన తర్వాత వైష్ణవచరణ్ మళ్ళీ ఒక్కసారి శ్రీరామకృష్ణులను దర్శించాలనుకొన్నాడు. దక్షిణేశ్వర ఆలయానికి వచ్చి, శ్రీరామకృష్ణులను గూర్చి అడిగాడు. శ్రీరామకృష్ణులు ఉత్సవం నుంచి అప్పటికి ఇంకా తిరిగి రాలేదని తెలుసుకొని, ఎంతో నిరాశతో వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన జరిగిన తర్వాత మూడు సంవత్సరాలకు మళ్ళీ వైష్ణవచరణ్, శ్రీరామకృష్ణులను కలుసుకొన్నాడు. ఆ తర్వాత వారిద్దరి మధ్య సన్నిహిత సంబంధం నెలకొంది. ఈ వివరాలన్నీ మేము 'గురుభావం, ఉత్తరార్ధం IV.1'లో చెప్పివున్నాం.

ఈ నాలుగు సంవత్సరాల కాలంలో శ్రీరామకృష్ణులు కొన్ని విచిత్ర సాధనలు కూడ చేశారు. మనసును ధనతృష్ణా రహితం చేయదలచుకున్నారు. దానికోసం రూపాయి నాణాలను, మట్టిముద్దలను చేతుల్లోకి తీసుకునేవారు. వాటి సత్యాసత్యాల గూర్చి విచారణ చేసేవారు. దైవ దర్శనమే ఏకైక లక్ష్యమైన ఉన్న వ్యక్తికి మట్టి ఎంతగా సహాయపడుతుందో, ధనం కూడ అంతేనని తెలుసుకున్నారు. అంటే మట్టి సహాయం చేయలేదు, ధనమూ సహాయం చేయలేదు. రెండూ వ్యర్థమే. కాబట్టి ఆయనకు ఆ రెండూ సమానమైన విలువగలవిగానే తోచాయి. ఈ నిజం చిత్తంలో దృఢం చేసుకోవడానికి, 'మన్ను - రూపాయి; రూపాయి - మన్ను' అంటూ ధనాసక్తితోపాటు రూపాయిలను, మట్టిని గంగలో పారవేశారు.

23. విచిత్ర సాధనలు

బ్రహ్మ మొదలు ఈ విశ్వంలో ఉన్న జడ - చేతన పదార్థాలన్నీ భగవంతుని విభూతులేనని, భగవదంశాలేనని దృఢం చేసుకోవడానికి కూడ సాధన చేశారు. దాని కోసం ముష్టివారి ఎంగిలి మెతుకులు తిన్నారు. వారు తిన్న స్థలాన్ని శుభ్రం చేశారు. పాకీవారిని అంతా అసహ్యించుకుంటారు. ఆ పాకీవారి కన్నా తాను ఏమంత గొప్పవాడు కాదన్న సత్యాన్ని దృఢం చేసుకోవడానికే, తన అహంకారాన్ని నాశనం చేయడానికి, శ్రీరామకృష్ణులు పాకీవారి మరుగుదొడ్లను స్వయంగా శుభ్రం చేశారు.

గంధం మొదలు మలం వరకూ అన్నీ పంచభూతాల వికారాలేనని, వాటిలో 'ఇవి స్వీకరించదగ్గవి, ఇవి స్వీకరించదగనివి' అంటూ భేదాలు లేవన్న భావనను సాధన చేశారు. దాని కోసం ఆయన ఇతరుల మలాన్ని, నిర్వికారంగా తన నాలుకతో స్పృశించారు!

ఇలాంటి అద్భుత సాధనలన్నింటినీ శ్రీరామకృష్ణులు నాలుగు సంవత్సరాల కాలంలోనే సాధించారు. ఆయన ఈ మొదటి నాలుగు సంవత్సరాల సాధనలను, అనుభూతులను, దివ్యదర్శనాలను పరిశీలిస్తే ఆయన అంతరంగ తపన సుస్పష్టమవుతుంది. దైవసాక్షాత్కారం కోసం ఆయన ఎంత తీవ్రాతితీవ్రంగా తపించారో, ఎంత పట్టుదల, ఆత్మవిశ్వాసాలతో ఆయన తన సాధనాపథంలో పురోగమించారో మనకు విశదమవుతుంది. మరొక్క విశేషం ఉంది. ఆయన ఎవరి సహాయ సహకారాలూ ఆశించకుండా, కేవలం తీవ్ర తపనతో జగన్మాత పరిపూర్ణ దర్శనానుభవాన్ని పొందారు. అలా ఆప్తకాములయ్యారు. సాధన పరమ ఫలాన్ని పొందారు.

తదనంతరకాలంలో కూడ ఆయన సాధనలను చేయడానికి కారణం ఉంది. గురూపదేశాలు, శాస్త్ర వచనాలతో తన అనుభవాలను సరిపోల్చుకోవడానికే ఆయన తన సాధనలను కొనసాగించారు.

24. మనసే (అంతరాత్మ) గురువు

“అనుక్షణం వైరాగ్యం వహించి, ఇంద్రియ సంయమాన్ని సాధన చేస్తుంటే, సాధకుడి మనస్సు క్రమంగా పరిశుద్ధమవుతుంది. అది అతడి స్వాధీనమవుతుంది. అప్పుడిక ఆ మనసే సాధకుని గురువు అవుతుంది” అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఆ శుద్ధ మనసులో కలిగే భావాలు, ఆలోచనలు సాధకుణ్ణి ఏమాత్రం పతనం చేయవు. పైగా అతణ్ణి గమ్యానికి చేరుస్తాయి.

శ్రీరామకృష్ణుల మనస్సు జన్మతః పరిశుద్ధమైనట్టిది. కాబట్టి ఆ శుద్ధ మనసే ఆయనకు గురువై, సాధన మార్గాన్ని చూపి మొదటి నాలుగు సంవత్సరాల

లోనే ఆయనకు భగవత్సాక్షాత్కారాన్ని కలిగించింది. ఆయన శుద్ధమనసే ఏది చేయాలో, ఏది చేయకూడదో నిశ్చయించి ఆయనకు చెప్పేది. అంతేకాదు. అది మానవరూపం దాల్చి శ్రీరామకృష్ణులను సాధన మార్గంలో ప్రోత్సహించేది. ఆయనకు విశేషసాధన గురించి చెప్పేది. దాని ఫలం వివరించేది. ఆ సాధనను అనుష్ఠింపచేసేది. ఆయన సాధనలో లీనం కాకపోతే, భయపెట్టి మరీ చేయించేది.

ఆ కాలంలో శ్రీరామకృష్ణులు ధ్యానానికి కూర్చున్నప్పుడు, ఒక వింత చూసేవారు. తరుణప్రాయంలో ఉన్న ఒక సన్న్యాసి వాడియైన త్రిశూలాన్ని ధరించి, శ్రీరామకృష్ణులకు కనిపించేవాడు. అతడు శ్రీరామకృష్ణుల దేహం నుండే బయటికి వచ్చేవాడు. ధ్యానం సరిగా చేయకపోతే, ఆ త్రిశూలంతో ఆయనను పొడుస్తానని హెచ్చరించేవాడు.

ఒకమారు శ్రీరామకృష్ణుల శరీరం నుండి ఒక నల్లని పురుషుడు బయటకు వచ్చాడు. అతడు భోగమయుడు, వాసనాయుతుడైన పాపపురుషుడు. ఆ పాప పురుషునితోబాటు ఈ త్రిశూలధారియైన సన్న్యాసి కూడ వచ్చాడు. వచ్చి త్రిశూలంతో పొడిచి ఆ పాపపురుషుణ్ణి చంపేశాడు. ఇదంతా శ్రీరామకృష్ణులు స్పష్టంగా దర్శించారు.

శ్రీరామకృష్ణులకు ఎప్పుడైనా దూరక్షేత్రాల్లోని దేవతలను దర్శించాలని అనిపించేది. లేదా దూరప్రాంతాల్లో జరిగే కీర్తనలను వినాలనిపించేది. అప్పుడు ఈ త్రిశూల సన్న్యాసియే బయటికి వచ్చి, తేజోమార్గంలో ఆయా ప్రాంతాలకు వెళ్లేవాడు. దేవతలను దర్శించి, లేదా కీర్తనలు వింటూ కొంతసేపు ఉండేవాడు. తర్వాత తిరిగివచ్చి, శ్రీరామకృష్ణులలో కలిసిపోయేవాడు.

'ఇవన్నీ శ్రీరామకృష్ణులు మాకు స్వయంగా చెప్పినవే!

దాదాపు సాధన ప్రారంభకాలం నుండే శ్రీరామకృష్ణులు ఈ త్రిశూల సన్న్యాసిని దర్శించేవారు. అతడు అచ్చం శ్రీరామకృష్ణులను పోలి ఉండేవాడు. ఆ తన ప్రతిరూపం సలహాలపైనే శ్రీరామకృష్ణులు తన కార్యాలను, సాధనలను చేసేవారు. ఆనాటి తన అపూర్వ సాధనానుభవాల గూర్చి మాకు ఇలా చెప్పేవారు:

"అచ్చం నాలాగా ఉండే ఒక తరుణప్రాయపు సన్న్యాసి, నాలో నుండి బయటికి వచ్చేవాడు. నాకన్ని విషయాలూ బోధించేవాడు. అతడలా బయటికి వస్తున్నప్పుడు, ఒక్కొక్కసారి నాకు కొద్దిగా బాహ్యస్మృతి ఉండేది. మరొకప్పుడు బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయేవాడిని. ఒక జడపదార్థం మాదిరిగా, అతడి కార్యకలాపాలను చూస్తూ ఉండేవాడిని, అతడి మాటలు వినేవాడిని. అతడు తెలిపిన తాత్త్విక విషయాలనే, తదనంతర కాలంలో భైరవీ బ్రాహ్మణి, నగ్నస్వామి (తోతాపురి[1]) మళ్లీ నాకు ఉపదేశించారు. నాకు తెలిసిన వాటినే వారు మళ్లీ

చెప్పారు. కాబట్టి కేవలం శాస్త్రమర్యాదను పాటించడం కోసమే, జగన్మాత వారిని నాకు 'గురువులు'గా ఏర్పాటు చేసింది. ('సాధకునికి బాహ్యగురువు అవసరం' అన్నది శాస్త్రమర్యాద. అది మామూలు సాధకుల విషయంలో తప్పనిసరి. కాని శ్రీరామకృష్ణుల లాంటి అత్యున్నత సాధకులకు, బాహ్యగురువుల అవసరం ఉండదు. కాని లోకమర్యాదను, గురు శిష్యసంప్రదాయాన్ని గౌరవించడం కోసం శ్రీరామకృష్ణులు బాహ్యగురువులను స్వీకరించారు. - అనువాదకుడు) లేకపోతే వారిని నేను గురువులుగా స్వీకరించవలసిన అవసరమేమిటి? నా కన్నీ తెలుసు కదా!''

మొదటి నాలుగు సంవత్సరాల సాధన అంతిమ భాగంలో శ్రీరామకృష్ణులు కొంతకాలంపాటు కామార్పుకూర్‌లో ఉన్నారు. అప్పుడాయన కో అపూర్వ దివ్యదర్శనం కలిగింది. కామార్పుకూర్‌కు దగ్గరలో ఉన్న గ్రామం సిహోర్. అది హృదయ్ జన్మస్థలం. ఒకసారి శ్రీరామకృష్ణులు పల్లకీలో ఈ గ్రామానికి వెళు తున్నారు. అప్పుడే ఆయన కా దివ్యదర్శనం కలిగింది. - ''పైన విశాల నీలాకాశం ఉంది. క్రింద సువిశాల మైదానం ఉంది. చుట్టూ పచ్చని పైరులు కదలాడు తున్నాయి. రావి, మర్రిలాంటి చెట్లపైన చేరి పక్షులు కిలకిలారావాలు చేస్తు న్నాయి. పూలమొక్కలలోని పువ్వులు సువాసనలను, మధువులను వెదజల్లు తున్నాయి. ఈ ప్రకృతి రామణీయకతను చూస్తూ పరవశుడనై పోయాను. అప్పుడు హఠాత్తుగా ఈ దేహం (తన) నుండి ఇద్దరు కౌమారప్రాయంలో ఉన్న బాలకులు బయటికి వచ్చారు. వారెంతో అందంగా, ఆకర్షణీయంగా ఉన్నారు. అలా వచ్చి ఎంతెంతో దూరం వెళ్లేవారు. అంతలోనే పల్లకీ పక్కన నడుస్తూ కని పించేవారు. నవ్వేవారు. పరిహాసాలాడేవారు. అలా సరదాగా గడిపేవారు. అలా చాలాసేపు సరదాగా ఆనందించి, వారిద్దరూ మళ్లీ ఈ దేహంలోకే వెళ్లి పోయారు'' అంటూ మా కా దర్శనం గూర్చి శ్రీరామకృష్ణులు వివరించి ఉన్నారు.

ఈ దర్శనం తర్వాత ఒకటిన్నర సంవత్సరాల తదుపరి భైరవీ బ్రాహ్మణి దక్షిణేశ్వరానికి వచ్చింది. ఒకరోజు శ్రీరామకృష్ణులు తన దివ్యదర్శనాల గూర్చి ఆమెకు చెప్పారు. అవన్నీ విని, ''నాయనా! అవన్నీ వాస్తవాలే. ఈ మారు నిత్యా నందుని శరీరం లోపల శ్రీచైతన్యుడు అభివ్యక్తమయ్యాడు. వారిద్దరూ ఒకరై నీలో నెలకొని ఉన్నారు. అదే ఆ నీ దివ్యదర్శనం'' అని సమర్థించింది.

---

1. తోతాపురిని శ్రీరామకృష్ణ గురుదేవులు 'నంగ్‌తా' (నగ్నస్వామి) అని పిలిచేవారు. ఆయన నాగాసన్న్యాసి. వీరు దిగంబరులు.

ఆమె అప్పుడు శ్రీచైతన్య భాగవతంలోని రెండు పద్యాలు చదివింది. హృదయ్ ఈ వివరాలు చెప్పాడు. ఆ పద్యాలు ఇవి -

అద్వైతేర్ గోలా ధారి కోహెన్ బార్‌బార్
పున: జే కొరిబో లీలామోర్ చమత్కార్
కీర్తనే ఆనందరూప్ హోయిబే ఆమార్॥
అద్యావధి గౌర్ కొరేన్ గౌర్ రాయ్
కోనో కోనో భాగ్యవాన్ దేఖిబారే పాయ॥

శ్రీచైతన్యుడు, అద్వైతుని కౌగలించుకొని ఇలా అంటున్నాడు - ''మళ్లీ అద్భుత లీల సలుపుతాను. భగవత్కీర్తనానందంలో మునిగిపోతాను. అదే నా రాబోయే కాలపు అవతారం. ఇప్పుడు కూడ గౌరాంగుని లీలలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు అరుదైన భాగ్యవంతులు ఈనాటికీ ఆ లీలలు దర్శిస్తారు.''

ఒకరోజు గురుదేవుల పై దర్శన ఆంతర్యం గురించి అడిగాం. అందుకు

25. పై దర్శన ఆంతర్యం

ఆయన, ''నిజమే, నేను చూశాను. బ్రాహ్మణి కూడ అలాగే చెప్పింది. కాని దాని ఆంతర్యం నాకు కూడ అంతుబట్టలేదు'' అన్నారు.

సరే, ఈ దర్శనాల విషయంవల్ల ఒకటి స్పష్టమవుతున్నది. ఈ విశ్వంతో సుపరిచితుడైన మహాత్ముడెవరో ఏదో మహత్కార్యాన్ని సాధించడానికి, శ్రీరామకృష్ణుల మనోదేహాలను వాడుకుంటున్నాడన్నదే అది. శ్రీరామకృష్ణులకు కూడ ఈ భావన ఉంది. ఇలా తన నిజ వ్యక్తిత్వం గూర్చి ఆయనకు సూచన కలిగింది. ఈ అలౌకిక సూచన క్రమంగా స్పష్టరూపం దాల్చింది. దానితో పూర్వం ధర్మసంస్థాపనార్థం అయోధ్యలో రాముడుగా అవతరించినవాడు, బృందావనంలో శ్రీరాధారమణుడుగా అవతరించినవాడు, ఇప్పుడు మళ్లీ భారత దేశంలోనే కాక ప్రపంచమంతా ఆధ్యాత్మిక స్రవంతిని ప్రవహింపచేయడానికి తన శరీరంలో అవతరించాడని శ్రీరామకృష్ణులకు స్పష్టమయింది. అందుకే, ''ఎవడు రాముడో, ఎవడు కృష్ణుడో, అతడే ఇప్పుడు ఈ ఒరలో (తన శరీరం) అవతరించాడు. రాజు అప్పుడప్పుడు నగర పర్యవేక్షణకై మారువేషంలో వెళుతుంటాడు కదా! అలాగే ఈ గుప్తవేషంలో ఆ పురుషుడు మళ్లీ అవతరించాడు'' అని తరచూ ఆయన చెప్పేవారు.

తన ఈ అవతార రహస్యాన్ని శ్రీరామకృష్ణులు తన ఆంతరంగిక భక్తులకు పదేపదే చెప్పేవారు. అది ఎంతవరకు నిజమో తెలుసుకోవడానికి, మనకు వేరే ఆధారం ఏమీ లేదు - శ్రీరామకృష్ణుల మాటలు నమ్మడం తప్ప. దీన్ని అలా వదిలేస్తే, ఆయనకు కలిగిన దర్శనాలన్నీ సత్యమే అని దృఢంగా చెప్పవచ్చు.

కారణం మా స్వానుభవమే. మేము ఆయనను దర్శించడానికి వెళ్లేవారం కదా!

26. శ్రీరామకృష్ణుల దివ్యదర్శనాలు ఎన్నడూ అసత్యాలు కావు

ఆ సమయంలో ఆయనకు ఇలాంటి దర్శనాలు ప్రతినిత్యం ఎన్నో కలిగేవి. ఈ అనుభవాలు, అనుభూతులపై అనుమానంతో ఎన్నోసార్లు పరీక్షించిన ఆంగ్లవిద్యను అభ్యసించిన శిష్యులు పరాజితులయ్యారు. ఆశ్చర్యంతో వారికి ఒప్పుకోక తప్పేది కాదు. ఇందుకు సంబంధించిన కొన్ని సంఘటనలను మేము 'గురుభావం, ఉత్తరార్ధం (IV.1)'లో వివరించాం. ఇక్కడ ఒక సంఘటన గూర్చి చెబుతాం.

1885లో ఆశ్వయుజ (సెప్టెంబర్, అక్టోబర్) మాసంలో దుర్గా ఉత్సవాలు ఆనందంగా చేసుకొంటున్నారు. శ్రీరామకృష్ణుల శిష్యుల్లో కూడ ఈ

27. సురేశ్‌చంద్రమిత్ర ఇంట్లో కలిగిన దర్శనం

ఆనందం వెల్లివిరిసింది. కాని బాహాటంగా కనిపించలేదు. కారణం వారందరి ప్రియతమ గురువు జబ్బుతో మంచం పట్టి ఉన్నారు. శ్రీరామకృష్ణులు గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నప్పుడు, చికిత్స కోసం భక్తులంతా కలిసి, శ్యాంపుకూర్‌లో ఒక రెండంతస్తుల భవంతిని అద్దెకు తీసుకొని గురుదేవుల బసను అక్కడకు మార్చి నెలరోజులయింది. పేరుగాంచిన హోమియో వైద్యుడు మహేంద్రలాల్ సర్కార్ చికిత్స చేస్తున్నాడు.

ఎంత చికిత్స చేసినా వ్యాధి తగ్గుముఖం పట్టలేదు. పైగా ముదిరింది. గృహస్థభక్తులు రోజూ గురుదేవుల విషయం కనుగొంటూ, తగిన ఏర్పాట్లు చేసేవారు. శ్రీరామకృష్ణుల యువక శిష్యులు (వారిలో చాలామంది విద్యార్థులే) భోజనానికి మాత్రం ఇంటికి వెళ్లి మళ్లీ వచ్చి, గురుసేవలో ఉండిపోయేవారు. కొందరైతే అక్కడే ఉండిపోయేవారు.

'అధికంగా మాట్లాడినా, పదే పదే సమాధిలోకి వెళ్లినా ప్రమాదం' అని డాక్టర్ హెచ్చరించాడు. కాబట్టి ఆ రెండు విషయాల్లో జాగ్రత్తగా ఉండమని శిష్యులకు సలహా ఇచ్చాడు.

శ్రీరామకృష్ణులు వైద్యుని సలహా పాటించడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. కాని వీలుపడలేదు. మొదటి నుండి కూడ ఆయన తన శరీరానికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. దాన్ని రక్తమాంసయుత ఎముకల గూడుగానే పరిగణించారు. అలాంటిది ఒక్కమారుగా శరీరానికి ప్రాధాన్యం ఇవ్వడం, శరీరం కోసం జీవించడం ఆయనకు సాధ్యం కాకపోయింది. భగవద్విషయ ప్రస్తావన వస్తే తన శరీరాన్ని, దాని రక్షణను కూడ మరిచిపోయి, భగవంతుని గూర్చి మాట్లాడుతూ ఉండిపోయేవారు. దానితోపాటు ఆయనకు సమాధి స్థితులు కూడ కొనసాగాయి.

అంతేకాదు, ఇంతకుముందెప్పుడూ శ్రీరామకృష్ణులను దర్శించుకోని భక్తులెందరో, శ్రీరామకృష్ణుల దర్శనం కోసం రాసాగారు. వారంతా భక్తి - ప్రేమలతో తనవద్దకు వస్తే, గురుదేవులు ఊరకే ఎలా కూర్చుంటారు? వారితో భగవద్విషయాలు మాట్లాడేవారు. సాధన మార్గాలను ఉపదేశించేవారు. ఆయనలోని ఆ ఉత్సాహాన్ని - ఆనందాన్ని చూసిన తర్వాత శ్రీరామకృష్ణుల వ్యాధి అంత తీవ్రమైనది కాదని, త్వరలో నయమౌతుందని భక్తులు అనుకొనేవారు. క్రొత్తగా తన వద్దకు వచ్చేవారిని అనుగ్రహించడానికే, సాధ్యమైనంత ఎక్కువ మందికి భగవంతుని విషయం తెలియచేయడానికే శ్రీరామకృష్ణులు కావాలనే ఈ వ్యాధిని కోరి తెచ్చుకొన్నారని మరికొందరు భక్తులు తలచారు. తన ఆశయం నెరవేరగానే, తనంతట తానే ఈ వ్యాధిని నయం చేసుకుంటారని వారు అందరికీ నచ్చచెప్పేవారు.

డాక్టర్ సర్కార్ ప్రతిరోజూ ఉదయమో, సాయంత్రమో ఎప్పుడో ఒకసారి వచ్చి శ్రీరామకృష్ణుల రోగస్థితిని గమనించేవాడు. తగిన మందులు ఇచ్చేవాడు. ఆ పని అయిపోయిన తర్వాత శ్రీరామకృష్ణులతో భగవంతుని చర్చలో మునిగిపోయేవాడు. శ్రీరామకృష్ణులు భగవద్విషయాలు చెబుతూ ఉంటే పరవశుడై వింటూ ఉండిపోయేవాడు. అప్పుడతడికి సమయం కూడ తెలిసేది కాదు. రెండు మూడు గంటలు గడిచినా లక్ష్యపెట్టేవాడు కాదు. సంశయాలు వ్యక్తం చేసేవాడు. గురుదేవుల నుండి సరియైన సమాధానాలు పొంది ఆనందించేవాడు. అలా చాలా సేపు గడిచేది. అతడు తాను పెట్టిన నియమాన్ని తానే అలా ఉల్లంఘించేవాడు. దాంతో పశ్చాత్తాపం చెందేవాడు. గురుదేవులతో, "ఈ రోజు నీతో చాలా మాట్లాడించాను. సరే, ఇక ఈ రోజు నువ్వు మరెవ్వరితోనూ మాట్లాడవద్దు. అనర్థం జరిగిపోతుంది. నీ మాటల్లో చాలా ఆకర్షణ ఉంది. అందుకే నీతో మాట్లాడుతూ, దాదాపు మూడు గంటలు నా వైద్యశాలను కూడ మరిచిపోయి ఉంటున్నానంటే, ఆ ఆకర్షణ ఎంతటిదో కదా! సరేలే, అయిందేదో అయింది. ఇక నువ్వు ఎవ్వరితోనూ మాట్లాడకు. మాట్లాడినా ఎక్కువసేపు మాట్లాడవద్దు. ఆం నేను వచ్చినప్పుడు నాతో ఎంతసేపైనా మాట్లాడవచ్చు. ఫరవాలేదు" అని చెప్పేవాడు. ఆ మాటలకు అక్కడున్న వారంతా హాయిగా నవ్వుకునేవారు.

సురేంద్రనాథ్ మిత్రను శ్రీరామకృష్ణులు, 'సురేశ్‌మిత్ర' అని పిలిచేవారు. అతడు ఆ సంవత్సరం తన ఇంట్లో దుర్గాపూజ చేస్తున్నాడు. అతడి ఇల్లు సిమ్లా అనే పేటలో ఉంది. అంతకు పూర్వం ఆ కుటుంబంలో ప్రతి ఏటా దుర్గాపూజ జరుపుకొనేవారు. కాని ఒకసారి ఏదో అనర్థం జరిగింది. దాంతో పూజ చేయడం ఆపేశారు. సురేంద్ర, శ్రీరామకృష్ణుల భక్తుడు, నిర్భయుడు, గురు

దేవుల శక్తిలో విశ్వాసం ఉన్నవాడు. అతడు ఏదైనా చేయాలనుకొంటే, దేనికీ భయపడేవాడు కాదు. చేసివేసేవాడు. ఎవరు కాదన్నా, ఏమన్నా పట్టించుకొనే వాడు కాదు. భూత, ప్రేత పిశాచాది క్షుద్రశక్తులను అసలు లక్ష్యమే చేసేవాడు కాదు.

శ్రీరామకృష్ణులపైన అపారనమ్మకంతో, అనుమతితో అతడు తన ఇంట్లో మళ్లీ దుర్గాపూజను చేయడానికి ఈ సంవత్సరం సిద్ధపడ్డాడు. కుటుంబ సభ్యులు అతణ్ణి పూజ కూడదని వారించారు. చేయవద్దని నిషేధించారు. కాని అతడు తన పట్టు సడలించలేదు. గురుదేవుల అనుమతితో, దుర్గామాత పూజకు పూను కొన్నాడు. ఖర్చంతా తానొక్కడే భరించాడు. పూజ చేశాడు. అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కాని ఒకే ఒక్క లోటు, నిరాశ అతడిలో చోటు చేసుకొన్నాయి - తన ప్రియతమ గురుదేవుడు, తన పూజ ఉత్సవంలో పాల్గొనక పోవటమే అది.

సురేంద్రుని పూజాకార్యక్రమం, కొందరి నిందలకు కారణమైంది. అతడు తనింట్లో పూజచేయదలచుకొన్న కొన్ని రోజులకు ముందే, అతడి బంధువులు కొందరు రోగగ్రస్తులయ్యారు. అందుకు సురేంద్రునిపై దోషారోపణ చేశారు. కుటుంబ సభ్యులు కూడ అతణ్ణి ఆక్షేపించారు. పూజ చేయవద్దని వారించారు. కాని అతడు ఎవర్నీ, దేన్నీ లెక్కచేయలేదు. సోదరశిష్యుల నందరినీ ప్రేమతో ఆహ్వానించాడు. పరమభక్తితో దుర్గామాత పూజను కొనసాగించాడు.

సప్తమీపూజ అయింది. మహాష్టమిరోజు చాలామంది భక్తులు శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణుల వద్దకు చేరారు. భగవంతుని విషయం మాట్లాడుతూ, కీర్తనలు పాడుతూ ఆనందించసాగారు. సాయంకాలం డాక్టర్ సర్కార్ అక్కడికి వచ్చాడు. అప్పుడు నరేంద్ర (వివేకానంద) భక్తి కీర్తన గానం చేశాడు. అతడి మధుర గానానికి భక్తులంతా పరవశం చెందారు. శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు డాక్టర్‌కు పాటల అర్థం వివరిస్తూ, మధ్య మధ్యలో సమాధిస్థితులవుతూ ఉండి పోయారు. భక్తిపారవశ్యంలో కొంతమంది భక్తులు కూడ, ఆ రోజు బాహ్య స్మృతి కోల్పోయారు.

ఆ గదంతా ఆనందపూర్ణమైపోయింది. దాదాపు రాత్రి ఏడున్నర ప్రాంతంలో డాక్టర్ పరవశత్వం నుండి బయటపడ్డాడు. నరేంద్రుణ్ణి తన కొడుకులా కౌగలించుకొన్నాడు. శ్రీరామకృష్ణుల వద్ద సెలవు పుచ్చుకొని వెళ్లడానికి లేచాడు. అతడి గౌరవార్థం రామకృష్ణులు కూడ నవ్వుతూ లేచి నిలబడ్డారు. అంతే, వెంటనే ప్రగాఢ సమాధిలో మగ్నులైపోయారు.

అది సంధిపూజా ముహూర్తం[1], అందుకే ఆయన సమాధిమగ్ను లయ్యారు. భక్తులు ఆశ్చర్యంతో చూస్తూండిపోయారు. అరగంట తర్వాత ఆయన స్పృహలోకి వచ్చారు. డాక్టర్ సెలవు తీసుకొని వెళ్లిపోయాడు.

ఆ అరగంటలో ఏం జరిగిందో శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు:

''ఈ చోటు నుండి, సురేంద్రుని ఇంటిదాక, ఒక తేజోమార్గం ఏర్ప డింది. సురేంద్రుని భక్తికి సంతుష్టురాలై జగన్మాత అతడు పూజించే ప్రతిమలో అభివ్యక్తం కావడం నేను చూశాను. అమ్మ మూడవ నేత్రం నుండి కాంతికిరణం బయల్వెడలింది. జగన్మాత ఎదుట ఎన్నో దివ్వెలు వెలిగించారు. అమ్మ ముందు కూర్చుని సురేంద్రుడు - 'అమ్మా, అమ్మా' అంటూ పరితాపంతో ఏడుస్తు న్నాడు.''

అలా చెప్పి ''వెంటనే మీరంతా సురేంద్రుని ఇంటికి వెళ్లండి. మిమ్మల్ని చూసి అతడు కొంత శాంతిస్తాడు'' అని ఆదేశించారు.

వివేకానందాది శిష్యులు, ఇతర భక్తులంతా కలిసి శ్రీరామకృష్ణులకు ప్రణామంచేసి, సురేంద్రుని ఇంటికి వెళ్లారు. సురేంద్రుణ్ణే అడిగి ఇంతకు మునుపు శ్రీరామకృష్ణులు చెప్పినవన్నీ నిజమేనని ప్రత్యక్షంగా తెలుసుకొన్నారు. సురేంద్రుడు అమ్మను పిలుస్తూ ఏడ్చిన మాట నిజమేనని తెలుసుకొన్నారు.

ఇలా శ్రీరామకృష్ణులు చూసిన దర్శనం నిజమేనని తేలింది. అది తెలిసి అంతా ఆశ్చర్యచకితులయ్యారు.

శ్రీరామకృష్ణుల దివ్య ఆధ్యాత్మిక స్థితిని ఒక సందర్భంలో రాణీ రాస్మణి, ఆమె అల్లుడు మథుర్‌బాబు కూడ సరిగ్గా అవగాహన చేసుకోలేకపోయారు.

28. రాస్మణి, మథుర్‌ల తప్పుడు అభిప్రాయాలు

అఖండ బ్రహ్మచర్యం పాటిస్తున్నారు కాబట్టి ఆయన మెదడు చెడిందని, అందుకే అలా పిచ్చిగా ప్రవర్తిస్తున్నారని అనుకొన్నారు. ఆయన బ్రహ్మచర్యాన్ని భంగపరిస్తే, ఆయన మామూలు మనిషి అవుతారని నిశ్చయించుకున్నారు.

అందుకని వారు లక్ష్మీబాయి మొదలైన అందగత్తెలయిన వేశ్యలతో శ్రీరామ కృష్ణులను ప్రలోభానికి లోనుచేయడానికి దక్షిణేశ్వరంలోను, మెచువా బజార్ లోని ఒక ఇంట్లోను ప్రయత్నించారు. కాని శ్రీరామకృష్ణులకు ఆ వేశ్యల

---

1. బెంగాల్‌లో ఆశ్వయుజ దేవీ నవరాత్రులు ఘనంగా జరుపుకొంటారు. అష్టమి, నవమి తిథుల మధ్యకాలాన్ని 'సంధి' అంటారు. అప్పుడు జరిగే పూజ 'సంధిపూజ'. అమావాస్య, పూర్ణిమ, కాళీపూజ, అష్టమి, నవమి, సంధిపూజ - ఇలాంటి విశేష దినాల్లో శ్రీరామకృష్ణులు స్వాభావికంగానే, సమాధిస్థితులవుతూంటారు.

రూపంలో జగన్మాత దర్శనమే అయింది. వారిని చూసి 'అమ్మా, అమ్మా' అంటూ బాహ్యస్మృతి కోల్పోయారు. ఈ విషయం వివరిస్తూ, ''అప్పుడు నా పురుషాంగం తాబేలు అవయవంలా శరీరంలోకి ముడుచుకుపోయింది'' అని చెప్పారు.

పసివాడిలా ఉన్న శ్రీరామకృష్ణుల అమాయక ప్రవర్తనను చూసి, ఆ వేశ్యలు విస్మయం చెందారు. వారి మనస్సులు మాతృప్రేమ, వాత్సల్యాలతో నిండి పోయాయి. అలాంటి మహాత్ముణ్ణి పతనం చేయడానికి వచ్చి తాము ఎంతో అపచారం చేశామని బాధపడ్డారు. ఏడుస్తూ తమను క్షమించమని శ్రీరామ కృష్ణులను వేడుకొన్నారు. ఆయనకు నమస్కరించి వెళ్లిపోయారు.

9. వివాహం : దక్షిణేశ్వరానికి తిరిగిరావడం

1. కామార్పుకూర్‌లో శ్రీరామకృష్ణులు

దక్షిణేశ్వరాలయంలో శ్రీరామకృష్ణులు పూజాకార్యకలాపాలను వదిలిపెట్టారన్న వార్త కామార్పుకూర్‌లో ఉన్న తల్లి, చిన్నన్నలకు తెలిసింది. అది తెలిసి వారెంతగానో ఆందోళన చెందారు. రాంకుమార్ చనిపోయి రెండేళ్లయినా కాలేదు, అంతలోనే శ్రీరామకృష్ణులకు పిచ్చెక్కిందనే వార్త వారినెంతో కలవరపరిచింది. మనిషిని దురదృష్టం వెన్నాడుతుంటే, ఆపదలన్నీ ఒక్కుమ్మడిగా వస్తాయి. ఒకదాని తర్వాత ఒకటిగా కష్టంపైన కష్టం వచ్చి, మనిషిని బాధలపాలు చేస్తాయి - అనే నానుడి వీరి జీవితంలో నిజమై కూర్చుంది. వయసు మీరిన సమయంలో చంద్రాదేవికి గదాధర్ జన్మించాడు. అందుచేత సహజంగానే ఆ పిల్లవాడు ఆమె కెంతో ప్రీతిపాత్రుడయ్యాడు. ఆమె శ్రీరామకృష్ణుల స్థితి గూర్చి విని ఆగలేక వెంటనే వారిని కామార్పుకూర్‌కు రప్పించుకుంది. శ్రీరామకృష్ణులు అక్కడికి వచ్చినా, ఆయనలో ఏ మార్పూ కనిపించలేదు. సర్వదా ఉదాసీనులై, ఏదో కోల్పోయినట్లు, దేన్నో వెతుకులాడుతున్నట్లు, అశాంతచిత్తంతో ఉండేవారు. ఆతురతతో దీనంగా "అమ్మా - అమ్మా" అని విలపించేవారు. ఇవన్నీ చూసి తల్లి చంద్రాదేవి ఎంతో ఆందోళన చెందింది. కుమారుడికి ఉపశమనం కలగడానికి ఎన్నో రీతుల ప్రయత్నించింది. మందులూ, మాకులూ ఇప్పించింది. మంత్రతంత్రాది కర్మలు చేయించింది. భూతవైద్యం చేయించింది. తనకు తెలిసిన అన్నిరకాల చికిత్సలూ చేయించింది.

ఈ సంఘటన 1858వ సంవత్సరాంతంలో జరిగింది.

ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత శ్రీరామకృష్ణులు వెనుకటిలా మామూలుగా ప్రవర్తిస్తున్నా, అప్పుడప్పుడు పరమ వ్యాకులతతో "అమ్మా - అమ్మా" అని విలపిస్తూ ఉండేవారు. ఒక్కోమారు భావపారవశ్యంతో బాహ్యస్మృతి కోల్పోయే

వారు. ఆయన ప్రవర్తన ఒక్కోసారి అందరిలా మామూలుగా ఉండేది.

2. శ్రీరామకృష్ణులను భూతం ఆవహించిందన్న వదంతి

మరొకప్పుడు అందుకు పూర్తి భిన్నంగా ఉండేది. ఒక ప్రక్క ఆయన దైవభక్తి - మాతృభక్తి సరళ అమాయక వ్యవహారం - స్నేహితులతో ప్రేమపూరిత వర్తనం పూర్వంలాగే వ్యక్తమవుతుండేవి. ఇతర సమయాల్లో సమస్త ప్రాపంచిక విషయాలపైన సంపూర్ణ నిర్లిప్తత - సామాన్యులకు తెలియనిదేదో ఒకదాన్ని పొందడానికై మహావ్యాకులత, లజ్జ - భయం, ఘృణ లాంటివి ఎరుగని హృదయంలో తన అభీష్ట లక్ష్యాన్ని చేరడం కోసం ప్రచండ ప్రయత్నం - ఇవి వారిలో ఎల్లప్పుడూ కనిపిస్తూ ఉండేవి. గదాధర్‌లోని ఈ విచిత్ర వ్యవహారం చూసి, లోకుల మనసులో ఇతణ్ణి ఏదో భూతం ఆవహించిందన్న విచిత్ర అభిప్రాయం కలిగింది.

3. మంత్రవేత్త 'చండ'ను ఆవాహన చేయడం

అమాయకురాలు, కల్లాకపటం ఎరుగనిది ఆయన చంద్రాదేవి మనసులో కూడ అప్పుడప్పుడు ఇలాంటి అనుమానమే కలుగుతుండేది. ఇప్పుడు ఇతరులు కూడ అదే మాట అనడంతో, ఆమె అనుమానం దృఢపడింది. అందుచేత మంత్రవేత్తను పిలిపించింది.

ఆ సంఘటన గూర్చి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు:

''ఒకరోజు ఒక మంత్రవేత్త వచ్చాడు. మంత్రించిన ఒక వత్తిని కాల్చి, నన్ను దాన్ని వాసన చూడమన్నాడు. అలాచేస్తే 'ఆవహించిన భూతం పారిపోతుం'దని చెప్పాడు. నేను వాసన చూశాను. అయినా ఏమీ కాలేదు. మరొకనాటి రాత్రి కొంతమంది మహా మంత్రవేత్తలు చేరారు. వారంతా కలిసి 'చండ' అనే క్షుద్రశక్తిని ఆవాహన చేశారు. పూజాబలులు ఇచ్చారు. చండ వాటితో ప్రీతి చెంది 'అతణ్ణి ఏ భూతమూ పూనలేదు. అతడికి ఏ గాలీ సోకలేదు' అని వారితో చెప్పింది. తర్వాత నాతో 'గదాయ్! నువ్వు సాధువు కాగోరుతున్నావు కదా! అయితే మరి నువ్వు అంతగా వక్కలు తింటావేమిటి? అవి కామాన్ని ప్రకోపింప చేస్తాయి సుమా!' అని అందరిముందే చెప్పింది. నిజంగానే నేను వక్కలు ఎక్కువగా తినేవాడిని. అవంటే నాకెంతో ఇష్టం. చండ అలా చెప్పిన తర్వాత వాటిని తినడం మానేశాను.''

అప్పటికి శ్రీరామకృష్ణులకు ఇరవై మూడు సంవత్సరాలు నిండనున్నాయి. కామార్పుకూర్‌లో ఆయన కొన్ని నెలలున్నారు. అప్పుడు ఆయన చాలావరకు మామూలు స్థితిలోనే ఉండేవారు. ఆయనలోని వ్యాకులత, ఆవేదన ఎలా తగ్గాయో, ఆయన మళ్లీ మామూలు మనిషిగా ఎలా అయ్యారో దానికి కారణం

ఉండే ఉంటుంది. జగన్మాత దర్శనాలను పదేపదే పొందడం దానికి కారణం కావచ్చు. ఈ కాలంలో జరిగిన విషయాలను ఎన్నింటినో మేము ఆయన బంధువుల నుండి వినివున్నాం. కాబట్టే మాకా అభిప్రాయం కలిగింది. వారు చెప్పిన విషయాలను కింద వివరిస్తాము.

4. శ్రీరామకృష్ణుల బంధుగణం అభిప్రాయం

కామార్పుకూర్‌కు పశ్చిమంలో 'భూతిర్‌ఖాల్', ఈశాన్యం వైపు 'భూధుయ్‌మోరల్' అనే రెండు శ్మశానాలుండేవి. శ్రీరామకృష్ణులు చాలావరకు రాత్రింబవళ్లు ఎక్కువకాలం ఈ శ్మశానాల్లోనే గడుపుతుండేవారు. ఈ కాలంలో ఆయనలో అద్భుతశక్తులు అప్పుడప్పుడు అభివ్యక్తమవుతూ ఉండేవి. వాటిని ఆయన బంధువులు గమనించి ఉన్నారు. వారు మా కిలా చెప్పారు:

ఆ రెండు శ్మశానాల్లో నక్కలు, క్షుద్రశక్తులు ఉండేవి. ఆ ఆత్మీయులు వాటిని అప్పుడప్పుడు 'బలి' ద్వారా తృప్తిపరుస్తూ ఉండేవారు. ఒక కొత్త కుండలో 'మిఠాయి' మొదలైన తినుబండారాలు పెట్టి, దాన్ని శ్మశానంలోకి తీసుకెళ్లి బలిగా అర్పించేవారు. అలా అర్పించిన వెంటనే, అన్నివైపుల నుంచి నక్కలు గుంపులు గుంపులుగా వచ్చేవి. వాటిని తినిపోయేవి. క్షుద్రదేవతలకు అర్పించిన ఆహారం కుండతో సహా గాలిలోకి పైకి ఎగిరి వెళ్లేది. అదృశ్యమైపోయేది. ఆ క్షుద్ర దేవతలను ఆయన చాలాసార్లు చూడగలిగేవారు.

శ్రీరామకృష్ణులు అర్ధరాత్రి దాటినా శ్మశానాన్ని వదిలి వచ్చేవారు కారు. అప్పుడాయన చిన్నన్న రామేశ్వర్ ఆ శ్మశానం వద్దకు వెళ్లి బిగ్గరగా తమ్ముణ్ణి పిలిచేవాడు. ఆ పిలుపు విని వెంటనే, అన్నను హెచ్చరిస్తూ, ''అన్నా! వస్తున్నాను. నువ్వింక ముందుకు రాకు. వీరు (క్షుద్రదేవతలు) నీకు హాని కలిగిస్తారు'' అని చెబుతూ వచ్చేవారు. 'భూతిర్‌ఖాల్' శ్మశానంలో ఈ సమయంలో ఆయన ఒక బిల్వ విత్తనాన్ని నాటారు. శ్మశానంలోని పెద్ద మర్రిచెట్టు కింద కూర్చుని చాలా సమయాన్ని జపధ్యానాదుల్లో గడిపేవారు. జగన్మాతను చూడాలన్న కోరికతో వారంతకు క్రితం తీవ్ర పరితాపంతో బాధపడుతూ ఉండేవారు. ఈ కాలంలో ఆయన కొన్ని అపూర్వ దివ్యదర్శనాలను, అనుభవాలను పొందడంచేత ఆ పరితాపం చాలావరకు ఉపశమించింది.

ఈ కాలంలోని వారి జీవితాన్ని గనుక మనం పరిశీలిస్తే, ఒక విషయం స్పష్టమవుతుంది. వారిప్పుడు ఖడ్గపాలధారిణి, వరాభయకరీ, సాధకానుగ్రహకారిణి అయిన జగన్మాత చిన్మయమూర్తిని దాదాపు అనవరతం దర్శిస్తూ ఉండేవారు. తన కర్తవ్యాన్ని గూర్చి ఎప్పటికప్పుడు అమ్మ నడిగి, ఆమె చెప్పినట్లు జీవితాన్ని మలచుకోసాగారు. జగజ్జనని అఖండ చిన్మయ దర్శనభాగ్యం తమకిక త్వరలోనే

లభించగలదన్న విశ్వాసం ఈ కాలం నుండి ఆయన హృదయంలో సుస్థిరమైనదనే మనం అనుకోవచ్చు.

5. శ్రీరామకృష్ణులలో యోగశక్తులు వ్యక్తం కావడం

'భవిష్యత్తులో జరగబోయే విషయాలను తెలుసుకోవడం' లాంటి యోగశక్తులు ఈ కాలంలో శ్రీరామకృష్ణులలో వ్యక్తం కాసాగాయి. హృదయరామ్, కామార్పుకూర్ - జయరామ్‌బాటీలకు చెందిన అనేకులు ఈ విషయం ధ్రువీకరించారు. స్వయంగా గురుదేవులు కూడ ఈ విషయాన్ని గురించి మా కప్పుడప్పుడు సూచించేవారు. ఈ కింది కొన్ని సంఘటనలు ఈ అంశాన్ని విశదపరుస్తాయి.

శ్రీరామకృష్ణుల ప్రవర్తన, చేష్టలను చూసి దేవుని దయ వల్ల వారి 'పిచ్చి' నయమైందని చంద్రాదేవి తదితర బంధువులు అనుకున్నారు. శ్రీరామకృష్ణులు ఇప్పుడు వ్యాకులుడై విలపించడం లేదు. భోజనాదాలు మామూలుగానే చేస్తున్నారు. ఇతర వ్యవహారాలన్నీ కూడ సక్రమంగానే చేస్తున్నారు. కాబట్టి ఆయన

గురుదేవులు పుట్టిన ఇల్లు

6. శ్రీరామకృష్ణులకు వివాహం చేయాలని బంధువులు నిశ్చయించడం

మామూలు మనిషయ్యారని వారికి నిశ్చయం కలిగింది. కాని ఆయన శ్మశానాలకు వెళ్లడం, ఎవరి మాటా లెక్క చేయకుండా అప్పుడప్పుడు బట్టలను, జందేన్ని తీసివేసి ధ్యానాదులు చేయడం, ఎప్పుడూ జప ప్రార్థనలలోనే తమ కాలాన్ని గడపడం - ఇలాంటివన్నీ చేసేవారు. ఇవి మామూలు మనిషి చేసే పనులు కాకపోయినా, బాల్యం నుంచి అలాగే చేస్తూ వస్తున్నారు కాబట్టి, వీటిని వారు పిచ్చి లక్షణాలుగా పరిగణించలేదు. కాని ప్రాపంచిక విషయాలపైన పూర్తి ఉదాసీనతను, ఆయనలోని అంతర్ముఖత్వాన్ని చూసి వారి బంధువులంతా చింతాక్రాంతులయ్యేవారు. శ్రీరామకృష్ణుల దృష్టి పూర్తిగా సంసారం మీదికి మరలనంతవరకూ, మొదట కనిపించిన పిచ్చి మళ్లీ తిరగబెట్టే ఆస్కారముందని ఆ బంధువులు భావించసాగారు. అలాంటి ప్రమాదంలో శ్రీరామకృష్ణులు మళ్లీ పడకుండా చేయాలన్న ఉద్దేశంతో ఆయనకు వివాహం చేయదలిచారు. చంద్రాదేవి, అన్న రామేశ్వర్ ఇద్దరూ అతడికి తగిన అమ్మాయితో వివాహం చేయడానికి నిశ్చయించుకొన్నారు. 'పెళ్లి చేస్తే పిచ్చి కుదురుతుంది' అన్నది వారి అభిప్రాయం. కాబట్టి సద్వంశీయురాలు, సుశీల, సుందరి అయిన భార్య ప్రక్కనే ఉంటే మనసు ఇతర మార్గాల వెంట పరుగులు పెట్టదని, సంసారంలోనే కుదుటపడుతుందని వారి నమ్మకం.

ఈ పెళ్లి విషయం 'గదాయ్'కు తెలిస్తే, అడ్డుపడతా డనుకొని వారు రహస్యంగానే సంబంధాలు చూడసాగారు. కాని గదాధర్‌కు ఈ విషయం త్వరలోనే తెలిసిపోయింది. అయినా అతడు ఎలాంటి ఆటంకమూ కలిగించలేదు. పైగా పండగో, పబ్బమో జరిగినప్పుడు పిల్లలు ఎంతగా ఆనందిస్తారో అతడు కూడా పెళ్లి మాట విని అంతగా సంబరపడిపోయాడు. బహుశా ఈ విషయమై ఆయన జగన్మాతను అడిగి, ఆమె అంగీకారం పొంది ఉంటారు. లేకపోతే ఆయన ఆనందంగా ఉండడానికి కారణం కనిపించదు. ఈ విషయాన్ని మరోచోట (III.4) మేము వివరంగా చర్చించాం.

7. ఎందుకు శ్రీరామకృష్ణులు వివాహానికి అంగీకరించారు?

శ్రీరామకృష్ణులకు వివాహం చేయడం కోసం చుట్టుప్రక్కల గ్రామాల్లో వధువు కోసం తెగ ప్రయత్నించారు. కాని తగిన సంబంధం ఏదీ కుదరలేదు. ఒకచోట పెళ్లికూతురు నచ్చినా, కన్యాశుల్కం ఎక్కువ అడిగేవారు. అంత పైకం ఇచ్చే స్థితిలో చంద్రాదేవి లేదు. ఆమె కుమారుని వివాహ విషయమైన చింతలో మునిగివుండేది. ఇలాంటి స్థితిలో ఒక రోజు శ్రీరామకృష్ణులు హఠాత్తుగా భావావేశంలో, ''అక్కడ, ఇక్కడ

8. వధువును తానే ఎంపిక చేయడం

వెతికి ప్రయోజనం లేదు. జయరామ్‌బాటిలో శ్రీరామచంద్ర ముఖోపాధ్యాయ ఇంట్లో వధువు ఉంది. 'గడ్డిపోచతో కట్టి'[1] ఆమెను నా కోసమే భద్రంగా ఉంచారు. వెళ్లి మాట్లాడండి'' అని చెప్పారు.

శ్రీరామకృష్ణుల మాటలను వారంతగా పట్టించుకోలేదు. అయినా ఒక మారు చూసి వస్తే ఏం పోయింది అనుకుని, జయరామ్‌బాటికి మనిషిని

9. వివాహం

పంపించారు. ఆ మనిషి తిరిగి వచ్చి, ''అన్నీ సరిగానే ఉన్నాయి. అయితే ఆ అమ్మాయి మాత్రం మరీ చిన్న పిల్ల'' అని చెప్పాడు. ఆ పిల్లకు ఐదేళ్లట. అయినా వధువు లభించింది కాబట్టి, ఆ పిల్లతోనే గదాయ్‌కు వివాహం చేయ నిశ్చయించారు. ఒక శుభముహూర్తంలో రామేశ్వర్, తమ్మునితోపాటు జయరామ్‌బాటికి వెళ్లాడు. ఆ ఊరు కామార్పుకూర్‌కు పడమట నాలుగు మైళ్ల దూరంలో ఉంది. శ్రీరామచంద్ర ముఖోపాధ్యాయకు, కన్యాశుల్కం కింద 300 రూపాయలు ఇచ్చి, వివాహం చేయించాడు. ఈ వివాహం 1859వ సంవత్సరం, వైశాఖమాసం చివరి రోజుల్లో జరిగింది. అప్పుడు శ్రీరామకృష్ణుల వయసు 24 సంవత్సరాలు.

కుమారునికి వివాహం కావడంతో చంద్రాదేవి మనసు చాలావరకు కుదుటపడింది. వివాహం, ఇతర వ్యవహారాల్లో తన కొడుకు తాను చెప్పినట్లు

10. వివాహానంతరం చంద్రాదేవి, శ్రీరామకృష్ణుల ప్రవర్తన

వినడం చూసి, ఇంత కాలానికి దేవుడి అనుగ్రహం కలిగిందని ఆమె సంతోషించింది. సంసారమంటే ఏమీ పట్టనట్లుండే కుమారుడు ఇంటికి తిరిగి వచ్చాడు. ఉత్తమ వంశానికి చెందిన అమ్మాయి తనకు కోడలిగా లభించింది. డబ్బు కొరత కూడ తీరిపోయింది. భగవంతుని కృప లేకపోతే ఇవన్నీ ఎలా జరుగుతాయి? కాబట్టి కల్లాకపటం తెలియని చంద్రాదేవి హృదయం ఇంతకాలానికి ఆనందంతో నిండిపోయింది. కాని వివాహం తర్వాత కొన్ని రోజులకు తన పేదరికాన్ని తలచుకుని ఆమె మళ్లీ వ్యథ చెందవలసి వచ్చింది. గదాయ్ వివాహం ఘనంగా జరిపించాలని, కుటుంబ గౌరవాన్ని నిలపాలని ఆమె, తన కుటుంబ మిత్రుడు జమీందారు లాహాబాబు నుండి సొమ్ములను ఎరవు తీసుకుని, వాటిని వధువుకు అలంకరించింది. వివాహమయ్యాక వాటిని తిరిగి ఇచ్చివేయవలసి వచ్చింది. అదే ఆమె

---

1. మొదటి పంటను, పండ్లను, పాలను భగవంతునికి అర్పిస్తారు. అందుకుగాను, వాటిని 'గడ్డిపోచతో కట్టి' అది భగవంతునిదని గుర్తించి భద్రంగా పెడతారు. అలాంటి వాటిని చిన్నపిల్లలు కూడా తాకరు. ఇక్కడ వధువు ఇదివరకే శ్రీరామకృష్ణులకు నిర్ణయమై ఉంది అన్న విషయం సూచితం.

దుఃఖానికి కారణమైంది. వివాహం ముగిశాక కోడల్ని ఆమె తన సొంత కుమార్తెలా చూసుకోసాగింది. కుమార్తె వద్ద నుండి ఏ తల్లియినా పెట్టిన సొమ్ములు ఎలా లాక్కోగలదు? కాని తప్పదు! అవన్నీ ఎరవు సొమ్ములు కదా! ఏం చేయాలో పాపం ఆ వృద్ధురాలికి అంతుబట్టలేదు. లోలోనే బాధపడుతూ ఉండిపోయింది. ఆ విషయం ఆమె ఎవరికీ చెప్పలేదు. అయినా శ్రీరామకృష్ణులు ఎలాగో ఆ విషయాన్ని తెలుసుకున్నారు. వెంటనే ఒకరాత్రి నిద్రపోతున్న వధువు ధరించిన సొమ్ములను నెమ్మదిగా తొలగించి, తల్లికిచ్చారు. ఆ విషయం ఆ అమ్మాయికి అసలే తెలియదు. ఉదయం మేల్కొని "నేను ధరించిన నగలన్నీ ఏమైనాయి?" అని బాల శారద అడిగింది. అప్పుడు కంట తడిపెట్టుకొని చంద్రాదేవి ఆ అమ్మాయిని తన ఒడిలోకి తీసుకుని, "అమ్మా! ఆ సొమ్ముల కన్నా మంచివాటిని గదాయ్ నీకు చేయిస్తాడు కదా" అని ఊరడించింది. కాని ఈ కథ ఇంతటితో అయిపోలేదు. ఆ అమ్మాయి చిన్నాన్న, కూతుర్ని చూడడానికి వచ్చి, విషయమంతా విని ఎంతో కోపంతో ఆ అమ్మాయిని తోడ్కొని వెళ్లిపోయాడు. దాంతో చంద్రాదేవి మరింత వ్యధ చెందింది. ఆ విషయం తెలిసిన గదాధర్, ఆ సంఘటనను చాలా తేలికగా తీసుకుని, "అయితే ఏం! వివాహం జరిగిపోయిందిగా, ఇప్పుడు వారెంత ఎగిరినా వివాహాన్ని మాత్రం రద్దుచేయ లేరుగా!" అంటూ ఆమెకు ఊరట కలిగించాడు.

వివాహం అయిన తర్వాత దాదాపు ఒక సంవత్సరం ఏడు నెలల వరకు శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌లో ఉన్నారు. చాలాకాలం తర్వాత కొడుకు తిరిగి రావడం, పైగా కలకత్తాకు వెళితే మళ్లీ ఎక్కడ పిచ్చిపడుతుందో నన్న భయంవల్ల శ్రీరామకృష్ణులను, తల్లి కలకత్తాకు తిరిగి వెళ్లనివ్వలేదు. పెళ్లికుమార్తెకు ఇప్పుడు ఏడేళ్లు వచ్చాయి. ఆచార ప్రకారం శ్రీరామకృష్ణులు మామగారింటికి వెళ్లి కొన్ని రోజులుండి భార్యతో సహా తిరిగి వచ్చారు. ఆ తర్వాత కొంతకాలానికి ఆయన కలకత్తాకు తిరిగి వెళ్లడానికి సిద్ధమయ్యారు. మరికొంత కాలం ఉండమని తల్లి, అన్న బలవంతం చేశారు. కాని ఆయనకు తమ పేదరికం, కుటుంబ స్థితిగతులు తెలుసుకదా! అందుచేత శ్రీరామకృష్ణులు వారిని ఒప్పించి, తిరిగి కలకత్తాకు వచ్చేశారు. మళ్లీ కాళికాలయంలో పూజారిగా సేవలు కొనసాగించారు.

11. శ్రీరామకృష్ణులు కలకత్తాకు తిరిగి వెళ్లడం

కొన్ని రోజులు జగజ్జనని పూజను కొనసాగించారో లేదో శ్రీరామకృష్ణులు దాన్లో పూర్తిగా సంలీనమైపోయారు. కామార్పుకూర్, తల్లి, అన్న, భార్య, లోక వ్యవహారాలు, పేదరికం మొదలైనవన్నీ ఆయన మనసు నుండి అదృశ్యమైపోయాయి. సదా, సర్వవేళలా, సర్వులలో జగజ్జననిని దర్శించడం ఎలా అన్న

భావన ఒక్కటే ఆయన మనస్సును పూర్తిగా ఆక్రమించి వేసింది. అవిచ్ఛిన్న జప ధ్యానాదుల వల్ల ఆయన ఛాతీ మళ్లీ ఎర్రబారింది. లోకం, లౌకిక ప్రసంగాలు ఆయనకు విషతుల్యంగా కనిపించ సాగాయి. ఆ తీవ్రమైన దేహమంటలు మళ్లీ మొదలైనాయి. నిద్ర కరువైపోయింది. కాని ఆయన అటువంటి శారీరక మానసిక స్థితిని అంతకు మునుపే అనుభవించి ఉండడం వల్ల, ఈసారి వాటి ఉధృతాన్ని నిభాయించుకోగలిగారు.

12. రెండవసారి శ్రీరామకృష్ణుల దివ్యోన్మాదం

హృదయ్ మాకు ఇలా తెలియచేశాడు: మథుర్‌బాబు నిర్దేశం మేరకు కలకత్తాలోని సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుడైన గంగాప్రసాద్ సేన్, గురుదేవుల రుగ్మతకు చికిత్స మొదలుపెట్టాడు. నిద్రలేమికి, వాతప్రకోపానికి, ఒంటి మంట లకు అతడు చతుర్ముఖ గుళికలు, మధ్యమనారాయణ మొదలైన తైలాల ఔషధ నిర్ణయం చేశాడు. ఆ చికిత్స వెంటనే సత్ఫలితాన్ని ఇవ్వకున్నప్పటికీ, హృదయ్ నిరాశ చెందలేదు. అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులతోపాటు కలకత్తాలోని ఆ వైద్యుని ఇంటికి తనుకూడ వెళ్లేవాడు. ఒకరోజు హృదయ్‌తో వెళ్లినప్పుడు గంగా ప్రసాద్ సేన్ తనను జాగ్రత్తగా పరీక్షించి కొత్త ఔషధాలను నిర్ణయించాడని శ్రీరామకృష్ణులు చెప్పారు. అప్పుడు అక్కడ తూర్పు వంగదేశపు వైద్యుడు ఒక రున్నారు. శ్రీరామకృష్ణుల దృక్కులకు ఆకర్షితుడైన ఆ వైద్యుడు, ఆయన రుగ్మత గురించి లోతుగా యోచించి, ఇలా అన్నాడు: "రోగ లక్షణాలను బట్టి చూస్తే ఈయన దివ్యోన్మాద స్థితిలో ఉన్నట్లు కనబడుతూన్నది. ఇది ఔషధా లకు నయం కాదు."[1] ఈ వైద్యుడే రుగ్మతగా కానవచ్చే తన శారీరక మార్పులకు అసలు కారణాన్ని కనుగొన్న మొదటి వ్యక్తి అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. కాని ఆతడి మాటలు అప్పుడు ఎవరూ విశ్వసించలేదు. ఆ విధంగా కొంత కాలం గడిచింది. మథుర్‌బాబు, ఇతర శ్రేయోభిలాషులు ఎంతో ఆతురత చెంది, ఆ అసాధారణ వ్యాధికి నానారకాల చికిత్సలు చేయించసాగారు. కాని వ్యాధి తగ్గ ముఖం పట్టకపోగా, ఉధృతం కాసాగింది.

శ్రీరామకృష్ణుల వ్యాధి విషయం అలా అలా చంద్రాదేవి చెవిన పడింది. ఆమె ఎంతో ఆందోళన చెందింది. ఆమెకు ఏమీ పాలుపోలేదు. అందుచేత తన కుమారుని ఆరోగ్యం కోసం మహాదేవుని వద్ద ఆమరణ నిరాహారదీక్ష పూనింది. కామార్పుకూర్‌లో

13. చంద్రాదేవి ప్రాయోపవేశం

---

1. శ్రీరామకృష్ణులను చూసి ఈ మాటలన్నది గంగాప్రసాద్ సేన్ సోదరుడైన దుర్గాప్రసాద్ అని కొందరంటారు.



ప్రాచీన శివాలయం

'బుడోశివ్' అనే ఆలయముంది. అది (పురాతన) శివాలయం. ఆ దేవుడు 'జాగ్రుత' దేవుడని ప్రసిద్ధి. ఆమె ఆ గుడిలోకి వెళ్లి 'ప్రాయోపవేశం' చేపట్టింది. అలా దీక్షలో ఉండగా ఆమెకు 'ముకుందపుర్' శివాలయంలో ఆమరణ నిరాహారదీక్ష పూనమని దైవాదేశం అయింది. ఆమె అలాగే అక్కడికి వెళ్లి, ఆ దీక్ష పూనింది. తమ కోరికల కోసం ఎవరూ ఇదివరకు ఈ గుడిలో ప్రాయోపవేశం చేయలేదు. అది తెలిసినప్పటికీ, దైవాదేశాన్ని ఏమాత్రమూ సందేహించక వెళ్లి ఆమె దీక్ష పూనింది. రెండు మూడు రోజుల తర్వాత ఆమె కో దివ్యస్వప్నం కలిగింది. ఆ స్వప్నంలో జటాధారీ, వ్యాఘ్రచర్మాంబరధారీ అయిన పరమేశ్వరుడు దర్శనమిచ్చి, "భయపడవద్దు. నీ కొడుకు పిచ్చివాడు కాదు. భగవదావేశం వల్ల అతడికలాంటి స్థితి ఏర్పడింది" అని శాంతపరిచాడు. ఆ మాటతో ఆమె ఉపశమనం పొంది, భక్తిపూర్ణ హృదయంతో మహాదేవుణ్ణే పూజించి, ఇంటికి తిరిగివచ్చింది. కొడుకు ఆరోగ్యంకోసం కులదైవం శ్రీరఘువీరుని, శీతలాదేవిని శ్రద్ధతో సేవించ సాగింది. ముకుందపురం గుడిలో ఆమెకు దైవాజ్ఞ లభించడం చూసి, అప్పటి నుండి ఆ గుడికి కూడ పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ప్రతి సంవత్సరం ఎంతో మంది స్త్రీ - పురుషులు అక్కడ ప్రాయోపవేశ వ్రతాన్ని పూనసాగారు. ఈ విషయం మేము విన్న సంగతే.

14. ఈ సమయంలో శ్రీరామకృష్ణుల స్థితి

ఆ సమయంలో తన కేర్పడిన దివ్యభావాన్ని గుర్తుకు తెచ్చుకుని, గురుదేవులు మాకెన్నోసార్లు ఇలా చెబుతుండేవారు. "ఆధ్యాత్మిక భావ ప్రాబల్యంతో సామాన్యుల మనశ్శరీరాల్లో అలాంటి అవస్థ ఏర్పడడం సంగతి అలా ఉంచుదాం. కనీసం దానిలో పావుభాగం కలిగినా, వారి ప్రాణాలు నిలిచేవి కావు. రాత్రింబవళ్లూ ఎక్కువకాలం అమ్మ దర్శనాన్ని ఏదో ఒక రూపంలో పొందుతూ, సర్వం మరిచి ఉండేవాడిని నేను. అందుకే జీవించగలిగాను. లేకపోతే (తన శరీరాన్ని చూపిస్తూ) ఈ 'ఒర' ఎప్పుడో రాలిపోయేది. అప్పటి నుండి ఆరు సంవత్సరాల సుదీర్ఘకాలం వరకూ, నా కనులు నిద్రంటూ లేకుండా పోయింది. కనురెప్పలకు మూతపడే శక్తి పోయింది. ఎంత ప్రయత్నించినా కళ్లు మూసుకోవడం సాధ్యమయ్యేది కాదు. కాలం ఎలా సాగిపోయిందో నా కేమాత్రమూ తెలిసేది కాదు. శరీరాన్ని బ్రతికించి ఉంచాలన్న ధ్యాసకూడ ఉండేది కాదు. ఎప్పుడైనా శరీరంపైకి చూపు మరలితే

దాని అవస్థ చూసి భయం వేసేది. నాకు పిచ్చిగాని పట్టలేదు కదా! అని ఆందోళన చెందేవాడిని. అద్దం ముందు కూర్చుని, కంటిలో వ్రేలుపెట్టి పరీక్షించుకునేవాణ్ణి - కనురెప్పలు మూత పడతాయో, లేదోనని. అలా చేసినా ఫలితం ఉండేది కాదు. తెరిచిన కళ్లు తెరిచినట్లే ఉండిపోయేవి. భయంతో ఏడుస్తూ తల్లితో, 'అమ్మా! నువ్వే నా సర్వస్వమని నమ్మి, నీ మీదే భారం వేసి, నిన్ను ప్రార్థిస్తున్నందుకు ఇదా ఫలం?' అని అడిగేవాడిని. 'ఇంతటి ఘోరమైన రోగం ఎందుకు ఇచ్చావమ్మా' అంటూ నిలదీసేవాణ్ణి. అయితే మరుక్షణమే 'అమ్మా! ఏమైనా, ఈ శరీరం పోతే పోనీ! కాని నన్ను మాత్రం నువ్వు వదలవద్దు సుమా' అంటూ ప్రార్థించేవాడిని. 'అమ్మా! నాకు నీ దర్శనమివ్వు, నాపై కృప చూపు. నీ పాదాలు తప్ప నాకు మరేదీ శరణ్యం కాదు. నువ్వు తప్ప నాకు మరే గతీ లేదు' అంటూ విలపించేవాణ్ణి. అలా విలపిస్తూ, ఉంటే మనసు మళ్లీ ఎంతో ఉత్సాహపూరితమయ్యేది. శరీరం ఎంతో తుచ్ఛమైనదిగా కనిపించేది. అప్పుడు అమ్మ దర్శనమయ్యేది. అమ్మ దివ్యవాణి వినిపించేది. దానితో ఉపశమనం పొందేవాణ్ణి.''

15. శ్రీరామకృష్ణులలో శివ-కాళీలను మథుర్ దర్శించడం

జగన్మాత దివ్యసంకల్పం రీత్యా, ఈ సమయంలో ఒకరోజు మథుర్‌బాబుకి ఒక దివ్యదర్శనం కలిగింది. ఆ రోజు శ్రీరామకృష్ణులలో అతడు శివుణ్ణి, కాళీ మాతను - ఇద్దరినీ దర్శించి, అద్భుత ఆశ్చర్యానికి లోనయ్యాడు. అది చూసి శ్రీరామకృష్ణులను అతడు భగవంతునిగానే పూజించాడు. ఈ విషయాన్ని మేం మరో చోట వివరించాము.[1] దాని ప్రభావంగా మథుర్‌బాబు ఆ క్షణం నుంచి గురుదేవులను భగవత్ దృష్టితో చూస్తూ, ఆయన పట్ల అనన్య భక్తి శ్రద్ధావిశ్వాసాలు కలిగి ఉండసాగాడు. ఇలాంటి అద్భుత సంఘటన జరగడం చూస్తే, ఒక విషయం మనకు స్పష్టమవుతుంది. ఆ క్షణం నుంచి శ్రీరామకృష్ణుల సాధక జీవితంలో మథుర్‌బాబు సహాయ సహకారాలు విశేషంగా ఉంటాయన్నదే అది. అందుకే ఇచ్ఛాశక్తితో జగన్మాత వారి నిద్దర్ని కూడ అభేద్య ప్రేమబంధంతో గాఢంగా బంధించింది. అజ్ఞేయవాదం, భౌతికవాదం, నాస్తికవాదం వీటితో నిండి వున్న నేటి యుగంలో ఏర్పడిన ధర్మగ్లానిని నాశనం చేసి, అత్యంత శక్తిమంతమైన ఆధ్యాత్మిక శక్తిని సంక్రమింప చేయడానికి, శ్రీరామకృష్ణుల మనశ్శరీరాలనే యంత్రాన్ని జగన్మాత ఎంతో ప్రయత్నంతో, ఎంతటి అద్భుత ఉపాయంతో నిర్మాణం చేసిందో కదా! ఇది ఆయా సంఘటనలే తెలియచేస్తున్నాయి. వాటిని చూసి మనం అవాక్కైతీరాల్సిందే.□

---

1. గురుభావం, పూర్వార్థం 3-6-12

10. భైరవీ బ్రాహ్మణి ఆగమనం

వివాహం జరిగిపోయింది. శ్రీరామకృష్ణులు 1861లో కామార్పుకూర్ నుండి దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చారు. ఈ సమయంలో ఆయన జీవితంలో రెండు ముఖ్య సంఘటనలు జరిగాయి. అవి ఆయన భావి జీవితంపై చూపిన ప్రగాఢ ప్రభావం కారణం చేత వాటిని విశదంగా పరికిద్దాం.

1. రాణీ రాస్మణికి తీవ్రవ్యాధి

మొదటి సంఘటన. 1861 ప్రారంభంలో రాణీ రాస్మణి వ్యాధిగ్రస్తురాలయింది. ఒకరోజు ఆమె హఠాత్తుగా క్రింద పడిపోయింది. దానితో ఆమెకు జ్వరం, అజీర్ణం, రక్తవిరేచనాలు పట్టుకున్నాయి. ఆ వ్యాధి ప్రాణాంతకంగా పరిణమించింది.

2. దాన పత్రం అమలుపరచడం - రాణి మరణం

1855లో రాస్మణి కాళికాలయ ప్రతిష్ఠ చేసిందని చెప్పాం కదా! ఆలయ నిర్వహణ కోసం, నిత్యపూజల కోసం ఆమె మూడు జమీలు కొనుగోలు చేసింది. అవి (ఇప్పుడు బంగ్లాదేశ్‌లోని) దినాజ్‌పూర్ జిల్లాలో ఉన్నాయి. అందు నిమిత్తం రెండు లక్షల ఇరవై ఆరువేల రూపాయలు ఖర్చుపెట్టింది. ఆ జమీలను ఆలయానికి దానం చేయాలనుకుంది.[1] ఆ జమీలను దేవాలయానికే దానం చేయాలని నిశ్చయించుకున్నా కూడ, ఎందుకోమరి ఇంతకాలం ఆ పని చేయలేకపోయింది. తనకు అంత్యకాలం సమీపించడం చూసి, ఆ దానపత్రాన్ని రిజిస్టర్

---

1. హైకోర్ట్ నం. 308/1872; పద్మమణి, జగదంబ దాసీల మధ్య జరిగిన కోర్టు దావాలో, ఆ దానపత్రంలో ఇలా ఉంది - ''కీర్తిశేషులైన నా భర్త కోరిక మేరకు, నేను 1855, మే నెల 31 తారీఖున ఆలయంలో దేవతలను ప్రతిష్ఠించాను. ఆ దేవతల పూజాది సేవల నిమిత్తం రెండు లక్షల ఇరవై ఆరువేల రూపాయలతో దినాజ్‌పూర్ జిల్లాలో మూడు జమీలను కొనుగోలు చేశాను.''

చేయాలని తొందరపడింది. ఆమెకు నలుగురు కుమార్తెలు. వీరిలో రెండవ కుమార్తె కుమారి, మూడవ కుమార్తె కరుణమయి, ఆలయ ప్రతిష్ఠకు మునుపే మరణించారు. రాణి అంతిమ కాలంలో మొదటి కుమార్తె పద్మమణి, ఆఖరి కుమార్తె జగదంబదాసీ ఇద్దరే జీవించి ఉన్నారు.

భవిష్యత్తులో ఆ దేవాలయ ఆస్తికి వీరిద్దరి మూలంగా ఏ విధమైన తగాదాలూ రాకూడదని ఎంచి, రాస్మణి ఆ దానపత్రం మీద తన ఇద్దరి కుమార్తెల సంతకాలు పెట్టించాలనుకుంది. జగదంబ ఒప్పుకుంది. కాని పద్మమణి అంగీకరించలేదు. దానితో మృత్యుశయ్య మీద ఉన్న రాణి మనసు అశాంతితో నిండిపోయింది. చివరికి 1861, ఫిబ్రవరి, 18 నాడు ఆ దానపత్రంపైన తానే స్వయంగా సంతకం చేసింది. ఆ మరునాడే ఆమె దివంగతురాలయింది.

చనిపోవడానికి కొన్నిరోజుల ముందే, రాస్మణి (కలకత్తా వద్ద) ఆది గంగా తీరంలో కాళీఘాట్‌కు సమీపంలో ఉన్న ఇంట్లో వసించసాగింది. చనిపోవడానికి కొద్దిసమయం ముందు ఆమెను గంగాతీరానికి తీసుకుని వెళ్ళారు. ఆమె ముందు అనేక దీపాలు వెలిగించారు. ఆమె వాటినన్నింటిని తీసివేయమని చెప్పింది. ''ఈ వెలుగులు వద్దు. అమ్మ వచ్చింది. అమ్మ తేజంతో సర్వం కాంతివంతమైంది'' అంది. కొన్ని క్షణాల తర్వాత, ''అమ్మా! వచ్చావా, చూడమ్మా[1] పద్మ సంతకం చేయలేదు. ఏమౌతుందో ఏమో?'' అన్నది. ఆమె ప్రశ్నకు సమాధానంగా నేమోనన్నట్లు, నలువైపులనుండి నక్కలు ఊళలు వేయడం[2] మొదలుపెట్టాయి. ఆ మాటలు అని, వెంటనే ఆమె జగన్మాత ఒడిలో శాశ్వతంగా కన్నుమూసింది. అప్పుడు సరిగ్గా అర్ధరాత్రి!!

3. మృత్యుకాలంలో రాణికి దేవీదర్శనం

ఆలయానికి దానం ఇచ్చిన ఆ జమీ మున్ముందు రాణి అనుమానించినట్లుగానే తగాదాలకు కారణమైంది. రాస్మణి మనుమళ్ళు పరస్పరం జమీ పెత్తనంకోసం కలహించుకుంటూ, న్యాయస్థానాల కెక్కారు. రాణికి భగవత్సేవ కన్నా మించిన కోరిక ఉండేది కాదు. పైగా

4. రాణి అనుమానం నిజమైంది

---

1. దానపత్రం గూర్చిన న్యాయ వివరణ: 18 - 2- 1861 నాడు కలకత్తా ప్రభుత్వ న్యాయవాది జె.ఎఫ్. వాట్కిన్స్ ముందు రాణీ రాస్మణి దానపత్రాన్ని రిజిష్టర్ చేయించింది. ఈ విషయాన్ని ఆమె వంశీయులంతా ఒప్పుకుంటున్నారు. అయితే రాణి అనుమానం నిజమైంది. ఈ దేవాలయ ఆస్తిపైన అధికారం గూర్చి ఆమె వంశీయులలో తగాదాలు చెలరేగాయి. వారు న్యాయస్థానాని కెక్కారు. ఆ వ్యాజ్యం ఇప్పటికీ పరిష్కారం కాలేదు.

2. తంత్రశాస్త్రం ప్రకారం దేవి చుట్టూ నక్కలు మూగి ఉంటాయి. వాటి ఊళలు దేవి రాకకు సూచన.

ఆమె అఖండమైన తెలివితేటలున్న స్త్రీ. కాని, దానపత్రం విషయంలో ఆమె అనుమానపడిందంటే, కారణం ఆస్తి కోసం మనుషులు ఎంతకైనా దిగజారుతా రన్న వాస్తవం ఆమెకు తెలిసి ఉండడమే. అందుకే ఆమెను రోగం కన్నా, ఈ జమీ చింతే ఎక్కువగా బాధించింది. మృత్యుసమయంలో కూడా ఆమెకు అదే దిగులు!

న్యాయస్థాన పత్రాల ద్వారా మనకొక విషయం వెల్లడౌతుంది. రాణి కొన్న జమీని తనఖా పెట్టి ఈ వ్యాజ్యం ఖర్చులకోసం దాదాపు లక్ష రూపాయల[1] అప్పు తెచ్చారు. రాణీ రాస్మణి ఎంతో భక్తిప్రపత్తులతో దేవికి సమర్పించిన పవిత్రదానం, చివరి కిలా తగాదాలమయం అయిపోయింది. ముమ్ముందు దేవాలయ ఆస్తి యావత్తూ ఇలాగే లుప్తమైపోతుందేమో! చూద్దాం!!

రాస్మణి ఆఖరి అల్లుడు మథురమోహన్ విశ్వాస్. జమీందారీ వ్యవహారాలు చక్కగా తెలిసినవాడు. రాణికి కుడిభుజంగా మెలగేవాడు. దేవాలయ ప్రతిష్ఠ జరి

5. మథుర్‌బాబు అభ్యున్నతి - అతడి భగవత్సేవ

గిన నాటి నుండి, కాళికాలయానికి దానంగా వచ్చిన ఆస్తుల ఆదాయ వ్యయ విషయాలను అన్నింటినీ అతడే జాగ్రత్తగా పరిశీలిస్తూ, రాస్మణి ఆశయం మేరకు అన్ని ఏర్పాట్లూ చేయసాగాడు. రాణి చనిపోయిన తర్వాత కూడ దేవాలయ నిర్వహణను యథా ప్రకారం చేయించసాగాడు. శ్రీరామకృష్ణుల సాంగత్య ప్రభావం చేత అతడి మనసు పవిత్రమై, భక్తిపూరితమైపోయింది. అందుకే రాణి మరణం తర్వాత కూడ అతడు దైవసేవలను నిర్లక్ష్యం చేయలేదు.

శ్రీరామకృష్ణులకు - మథుర్‌బాబుకు మధ్య అపూర్వసంబంధం ఏర్ప డిందని ఇంతకు ముందే తెలిపాం. మరొక్క విషయం. శ్రీరామకృష్ణులు అనుష్ఠిం

6. మథుర్‌బాబు వనరులు శ్రీరామ కృష్ణుల తోడ్పాటుకే

చిన తాంత్రిక సాధనలు చాలాకాలం వరకు కొనసాగాయి. అయితే ఈ సాధనలను ప్రారంభించడానికి పూర్వమే రాణి మరణించింది. ఆలయ విషయాలపై మథుర్‌కు పెత్తనం లభించింది. అందుకే ఆ సాధనల విషయంలో శ్రీరామకృష్ణులకు సేవచేసే భాగ్యం మథుర్‌కు దక్కింది. బహుశా, అతని కా అధికారం గురుదేవులకు తోడ్పడ టానికే లభించిందేమో! కారణం: ఆ క్షణం నుండే మథుర్, శ్రీరామకృష్ణు

---

1. జమీని తాకట్టు పెట్టిన కారణంగా ఉన్న అప్పు రూ. 50,000-00
దానిమీద మూడు నెలలకు వడ్డీ రూ. 876-00
ఇతర ఖర్చులు రూ. 20,000-00

లను ప్రత్యక్షదైవస్వరూపంగా భావించి, ఆయన సేవయే ప్రధాన ధ్యేయంగా ఎంచుకోవడం. ఇదంతా జగన్మాత సంకల్పం! లేకపోతే 11 సంవత్సరాలు ఏకధాటిగా, ప్రగాఢవిశ్వాసంతో, భక్తితో ఒకే వ్యక్తిని సేవించడం మామూలు విషయం కాదు. దానికి దైవప్రేరణ ఉండవలసిందే. ఆ కారణంగానే, మథుర్‌కు అపార ధనసంపదలపైన ఆధిపత్యం లభించినా, అహంకరించి పతనం చెందలేదు. పైగా శ్రీరామకృష్ణుల పట్ల క్రమేణా అతడికి భక్తివిశ్వాసాలు పెంపొందాయి. అతడు శ్రీరామకృష్ణులను సేవించడమే తన భాగ్యం అనుకున్నాడు. నిజానికి మథుర్ ఎంత అదృష్టవంతుడో కదా!

7. శ్రీరామకృష్ణుల పట్ల మథుర్, ఇతరుల భావనలు

శ్రీరామకృష్ణుల అత్యున్నత ఆధ్యాత్మిక స్థాయిని అందరూ అర్థం చేసుకోలేదు. కేవలం ఆధ్యాత్మిక సాధకులు కొందరు మాత్రం గ్రహించారు. సాధారణ జనమంతా ఆయనను పిచ్చివాడనే అన్నారు. ఎందుకంటే ఆయన ప్రవర్తన వారికి బొత్తిగా అర్థం కాలేదు. ఆయన ప్రాపంచిక సుఖాలకు దూరంగా ఉన్నారు. మామూలు మనిషి బుద్ధికి అందని అతీత తత్త్వంలో లీనమై 'హరి - హరి', 'రామ - రామ', 'కాళీ - కాళీ' అంటూ కాలం గడిపేవారు. అది వారికి పిచ్చిచేష్టలా కనిపించేది. వారికి రాస్మణి, మథుర్ ఎంతటి ఐశ్వర్యవంతులో తెలుసు. వారి సహాయం పొంది ఎంతోమంది ధనవంతులయ్యారు! పైగా వారిద్దరు కూడ శ్రీరామకృష్ణుల పరమభక్తులు! అలాంటప్పుడు శ్రీరామకృష్ణులు ఎంతటి ధనవంతులయ్యే అవకాశముందో! కాని ఆయన పేదగానే ఉండిపోయారు. ఇది పిచ్చిగాక మరేమిటి? - అని మామూలు జనం అనుకునేవారు. కాని వారు శ్రీరామకృష్ణుల ఒక ఘనతను మాత్రం చూశారు. ప్రాపంచికంగా పనికిమాలిన వాడైనా, ఆయన కళ్ళల్లోని తేజస్సు, ఆయన ప్రవర్తన, ఆయన కంఠ మాధుర్యం, ఆయన మాటలతీరు జనులను విపరీతంగా ఆకర్షించేవి. మామూలు జనం ధనికులు - పండితులు - పూజనీయులు మొదలైన గొప్పవారి ముందుకు వెళ్ళడానికి సంకోచించేవారు. శ్రీరామకృష్ణులకు అలాంటి సంకోచాలు ఏమీ ఉండేవి కావు. ఆయన అందరి వద్దకూ నిర్భయంగా, స్వేచ్ఛగా వెళ్ళేవారు. మాట్లాడేవారు. అంతేకాదు. వారికి ఎంతో సన్నిహితుడు, ప్రియతముడు, ఆత్మీయుడయ్యేవారు. మామూలు జనానికి ఇది అంతుపట్టని ఆశ్చర్యం!

మామూలు జనం, ప్రత్యేకించి ఆలయ ఉద్యోగులు శ్రీరామకృష్ణులను గూర్చి ఇలా అనుకొనేవారు. మరోవైపు మథుర్ మరోవిధంగా, 'జగన్మాత అనుగ్రహం కారణంగా, శ్రీరామకృష్ణులకు ఇలాంటి ఉన్మత్తావస్థ కలిగిం'దని అనుకొనేవాడని హృదయ్ మాకు తెలిపాడు.

రాస్మణి చనిపోయిన తర్వాత కొద్దికాలానికే శ్రీరామకృష్ణుల జీవితంలో మరో విశేషం జరిగింది. దక్షిణేశ్వరాలయానికి పడమట, గంగాతీరాన అప్పుడు ఒక పెద్దతోట ఉండేది. ఆ తోటలో రకరకాల పూలచెట్లు, లతలు ఉండేవి. ఆ తోటను ఎంతో శ్రద్ధగా పెంచేవారు కాబట్టి, అది చాలా రమణీయంగా, మనోహరంగా ఉండేది. అప్పుడు శ్రీరామకృష్ణులు, జగన్మాత పూజ చేసేవారు కాదు. అయినా ఆ తోట నుండి పువ్వులు సేకరించి, చక్కని మాలలు కట్టి, వాటిని స్వయంగా అమ్మకు అలంకరించేవారు. ఆ పూదోటకు మధ్యన ఒక మెట్లదారి ఉండేది. అది గంగానది నుండి పైకి వచ్చేటందుకు ఉపయోగపడేది. ఆ దారి పైన ఉన్న విశాల ద్వారమండపానికి తీసుకుపోయేది. ఆలయానికి ఉత్తరాన స్త్రీల స్నానఘట్టం, నాదమండపం (నహబత్) ఉండేవి. స్త్రీల స్నానఘట్టానికి ప్రక్కన ఒక పెద్ద వకుళ వృక్షం (పొగడ చెట్టు) ఉండేది. అందుకే ఆ ఘట్టాన్ని 'బకుల్ ఘాట్' అనేవారు.

8. భైరవీ బ్రాహ్మణి ఆగమనం

దేవాలయాలు - ప్రాంగణం

ఒకరోజు ఉదయం శ్రీరామకృష్ణులు ఆ తోటలో పువ్వులు సేకరిస్తున్నారు. అప్పుడు బకుల్‌ఘాట్‌లో ఒక పడవ వచ్చి ఆగింది. ఆ పడవ నుండి కాషాయ వస్త్రధారిణి అయిన ఓ సన్న్యాసిని దిగింది. ఆమె చాలా అందంగా ఉంది. ఆమె చేతిలో పుస్తకాల కట్ట ఉంది. ఆమె పడవ దిగి సరాసరి దక్షిణ ద్వార మండపం వైపుకు సాగింది. వయస్సులో ఆమె ప్రౌఢయైనా ఆమె శరీరం కోమలంగా, అందంగా ఉంది. ఆమెను చూస్తే అంత వయస్సున్న దానిలా కనిపించదు.

జవ్వనురాలిగా తోస్తుంది. ఆమె కప్పుడు దాదాపు నలభై ఏళ్ళుంటాయి. ఈ విషయం గురుదేవులే మాకు చెప్పారు.

ఆమెను మొదటిసారి చూడగానే, భవిష్యత్తులో ఆమెకు, తనకు ఆత్మీయ సంబంధం ఏర్పడబోతోందని శ్రీరామకృష్ణులు గ్రహించారో లేరో చెప్పలేము. మామూలు మనుషులకు కొత్తవారిని చూడగానే, వారితో రాబోయే కాలంలో ఆత్మీయత ఏర్పడే టట్లయితే, వారికి కూడ ఆ కొత్తవారి పట్ల తెలియని ఆకర్షణ కలుగుతుంది. శ్రీరామకృష్ణుల విషయంలో కూడ అలాగే జరిగింది. దూరం నుండి ఆమెను అలా చూడగానే శ్రీరామకృష్ణులు తన గదికి వెళ్ళి పోయారు. హృదయ్‌ను పిలిచి, ఆ సన్న్యాసినిని తోడ్కొని రమ్మన్నారు. హృదయ్ సంకోచించాడు. ''ఆమె ఎవరో మనకు తెలియదు. మనం పిలిస్తే ఆమె ఎందుకు వస్తుందీ?'' అని సందేహించాడు. ''నా పేరు చెప్పి పిలువు, తప్పక వస్తుంది'' అన్నారు శ్రీరామకృష్ణులు. ముక్కూ-ముఖం ఎరుగని ఒక స్త్రీతో మాట్లాడతానని ఆయన అనేసరికి తాను విస్తుపోయానని హృదయ్ తర్వాత మాకు చెప్పాడు. అంతకు ముందెన్నడూ శ్రీరామకృష్ణులు అలా అపరిచిత స్త్రీలతో మాట్లాడి ఎరుగరు.

కాని శ్రీరామకృష్ణుల ఆదేశాన్ని హృదయ్ పాటించక తప్పలేదు. భైరవిని[1] చూసి, ''మా చిన్నాన్న దైవభక్తుడు. ఆయన మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు, వస్తారా?'' అని అడిగాడు. అతడి మాటలు వినగానే, మారుమాట్లాడకుండానే ఆమె హృదయ్ వెంట బయలుదేరింది. అది చూసి హృదయ్ మరింత విస్తుపోయాడు.

9. శ్రీరామకృష్ణులతో ఆమె తొలి సమావేశం

భైరవి హృదయ్‌తోపాటు శ్రీరామకృష్ణుల గదిలోకి వచ్చింది. శ్రీరామకృష్ణులను చూడగానే, విస్మయానందాలతో ఉప్పొంగిపోయింది. కళ్ళ నుండి బాష్పాలు స్రవించాయి. ''నాయనా! నువ్వు ఇక్కడున్నావా? గంగా తీరంలో ఉన్నావని మాత్రం తెలుసు. కాని ఎక్కడో తెలియదు. నీ కోసం గంగాతీరమంతా వెతుకుతున్నాను. ఇంతకాలానికి నువ్వు కనిపించావు'' అని చెప్పింది. శ్రీరామకృష్ణులు అదంతా విని, ''అమ్మా! నా విషయం నీకెలా తెలుసు?'' అనడిగారు. ''జగన్మాత నాకు ముగ్గురు వ్యక్తులను చూపించి, వారిని నేను కలుసుకోవాలని ఆదేశించింది. ఆ ముగ్గురిలో నువ్వు ఒకడవు. మిగతా ఇద్దరిని తూర్పు బెంగాల్‌లో కలుసుకొన్నాను. ఈ రోజు నిన్ను చూశాను'' అని భైరవి వివరించింది.

---

1. భైరవి అంటే తాంత్రిక సాధనలు చేసే సన్న్యాసిని.

శ్రీరామకృష్ణులు భైరవీమాతకు దగ్గరగా జరిగి కూర్చున్నారు. పసివాడు తల్లికి తన అనుభవాలను ఎంతో ఉత్సాహంతో ఆనందంతో తెలుపుతాడు.

10. ఇద్దరి మధ్య సంభాషణ

శ్రీరామకృష్ణులు కూడ పసివాని మాదిరిగానే తన దివ్య దర్శనాల గూర్చి, అనుభూతుల గూర్చి భైరవీమాతకు వివరించి చెప్పారు. తాను భగవత్ భావనలో బాహ్యస్పృహ కోల్పోవడం, శరీరంలో మంటలెత్తడం, నిద్రలేమి, ఇతర శారీరక వికారాలు మొదలైనవన్నీ వివరంగా తెలియచేశారు. అలా చెప్పి ఆమెతో, ''అమ్మా! నా కివన్నీ ఎందుకు కలుగుతున్నాయి? నాకేమైనా పిచ్చిపట్టిందా? జగన్మాతను స్మరించడంవల్ల నా కిలాంటి వ్యాధి దాపురించిందా?'' అంటూ ఎంతో ఆవేదనను వ్యక్తం చేశారు.

భైరవీ బ్రాహ్మణి ఆయన అనుభవాలను వింటూ ఉత్సాహ - ఆనందాలకు లోనయింది. మనసులో కరుణ - ప్రేమ - వాత్సల్యాలు పెల్లుబికాయి. ఆయనను ఆమె ఊరడించింది. ''నాయనా! నువ్వు పిచ్చివాడవు కావు. ఇది పిచ్చికాదు. ఆత్మానుభూతి! ఈ అవస్థలన్నీ ఆ అనుభూతి లక్షణాలే. నీ దివ్యభావస్థితిని ఎవరు అర్థం చేసుకోగలరు? మామూలు జనానికి అర్థం అవుతుందా? శ్రీరాధకు కూడా ఇలాంటి అవస్థే కలిగింది. శ్రీచైతన్యులకూ కలిగింది. భక్తిశాస్త్రాలు ఈ అనుభవాల గూర్చి పేర్కొంటాయి. భగవంతుణ్ణి అనన్యచిత్తంతో స్మరించే వారికంతా ఈ అనుభూతులు కలిగాయి. నా వద్ద ప్రామాణిక శాస్త్రాలున్నాయి. వాటి ద్వారా నీ అనుభూతులు భ్రమలు కావనీ, సత్యమేననీ 'నిరూపిస్తాను'' అని ఆయనకు ధైర్యం చెప్పింది.

శ్రీరామకృష్ణులు, భైరవి అంత ఆత్మీయంగా మాట్లాడుకోవడం చూసి, హృదయ్ ఆశ్చర్యచకితుడయ్యాడు.

అలా మాటల్లోపడ్డ వారికి కాలం తెలియలేదు.. అప్పటికే చాలా పొద్దు పోయింది. జగన్మాతకు నివేదించిన పండ్లు, పటికబెల్లం మొదలైనవి భైరవీ మాతకు ఫలహారంగా శ్రీరామకృష్ణులు పెట్టారు. భైరవిలో శ్రీరామకృష్ణుల పట్ల పుత్రవాత్సల్యం జనించింది. అది గ్రహించి, బిడ్డ తినకుండా తల్లి తినదని ఎంచి, శ్రీరామకృష్ణులు ఆ ప్రసాదంలో కొంత తిన్నారు. ఆలయ దేవతలను దర్శించి వచ్చి, ఆ ఫలహారం భైరవి స్వీకరించింది.

ఆమె తన మెడలో రఘువీరుని ప్రతిమ ధరించి ఉంది. రఘువీరునికి నైవేద్యం అర్పించడం కోసం ఆలయభాండారంలో బియ్యం, పప్పులు వగైరా పుచ్చుకొంది. పంచవటి క్రింద కూర్చుని వంటకు ఉపక్రమించింది.

వంట పూర్తిచేసి, రఘువీరుని ముందు నైవేద్యంగా అర్పించింది. తన ఇష్ట దేవతా ధ్యానంలో మునిగిపోయింది. ఆ స్థితిలో ఆమె కో దివ్యదర్శనం కలిగింది. ఆమెకు శరీర స్పృహలేదు. ఆమె కళ్ళు ప్రేమతో వర్షిస్తున్నాయి.

11. పంచవటిలో భైరవికి దివ్యదర్శనం

ఆ సమయంలో శ్రీరామకృష్ణులకు పంచవటికి వెళ్ళాలన్న అంతఃప్రేరణ కలిగింది. ఆయన కప్పుడు పూర్తి స్పృహలేదు. ఆ భావావేశంలో ఆయన పంచవటికి వెళ్ళారు. ఆయనకు తాను ఏం చేస్తున్నారో అసలు తెలియదు. భైరవి అర్పించిన రఘువీరుని నైవేద్యాన్ని శ్రీరామకృష్ణులు ఆరగింప మొదలుపెట్టారు.

భైరవికి బాహ్యస్పృహ కలిగింది. కళ్ళు తెరిచి చూస్తే ఏముందీ! శ్రీరామ కృష్ణులు బాహ్యస్పృహారహితులై నైవేద్యాన్ని ఆరగిస్తున్నారు! భైరవి ఆ దృశ్యం, తన దివ్యదర్శనం ఒకటి కావడం చూసి, ఎంతో ఆనందపరవశురాలైంది.

కొంతసేపు అలా గడిచింది. శ్రీరామకృష్ణులు బాహ్యస్పృహలోకి వచ్చారు. తాను చేసిన పని తెలుసుకొని, ఎంతో వ్యధ చెందారు. భైరవితో, "నా కేమిటో ఈ జబ్బు! మైమరచిపోయి, ఇలా ఏదేదో చేస్తుంటాను. ఎందుకమ్మా, ఇలా జరుగుతున్నది?" అని ఏడ్చారు. భైరవి, తల్లిలా ఆయనను ఓదార్చింది. "నాయనా! నువ్వేం తప్పు చేయలేదు. మంచిపనే చేశావు. నిజానికి ఇది నీ పని కాదు. నీలో ఉన్న వాడి పని. ధ్యానంలో ఒక దివ్యదర్శనం కలిగింది. అందులో ఎవరీ పని చేస్తున్నారో నాకు తెలిసిపోయింది. ఇంత కాలానికి నా పూజ సఫల మైంది. ఈ క్షణం నుండి నేను బాహ్యపూజ చేయవలసిన అవసరం లేదు" అని వివరించింది.

అలా చెప్పి, భైరవీబ్రాహ్మణి, శ్రీరామకృష్ణుల ఉచ్ఛిష్టాన్ని భగవత్ప్రసాదంగా స్వీకరించింది. అలా చేయడంలో ఆమె ఎలాంటి సంకోచానికీ లోనుకాలేదు. తన ఇష్టదైవం శ్రీ రఘువీరుడు శ్రీరామకృష్ణుల రూపంలో ప్రత్యక్షం కావడం చూసి పరమానందభరితురాలైంది. ఆనందబాష్పాలు ఆమె కళ్ళ వెంట ధారలు కట్టాయి. ఎంతోకాలం నుండి, ఎంతో భక్తితో పూజిస్తున్న ఆ రఘువీర శిలను గంగార్పణం చేసింది.

భైరవీ శ్రీరామకృష్ణుల ఆత్మీయత, సాన్నిహిత్యం, ప్రేమవాత్సల్యాలు నానాటికీ పెంపొందసాగాయి. శ్రీరామకృష్ణుల పట్ల పుత్రప్రేమతో, భైరవి దక్షిణేశ్వరంలోనే ఉండిపోయింది. వారిద్దరూ నిత్యం పంచవటి క్రింద కూర్చుని కాలగమనం కూడ తెలియని రీతిలో భగవత్ప్రసంగాలలో మునిగిపోసాగారు. భైరవి భక్తి - తంత్రశాస్త్రాలను ఉదాహరిస్తూ, ఆయన అనుభవాలు శాస్త్రీయాలేనని నిరూపించేది.

12. పంచవటిలో శాస్త్రచర్చ

అవతారపురుషుల లక్షణాలు, అనుభూతులు వివరించి, ఆయన సందేహాలను నివృత్తిచేసేది. ఆ విధంగా పంచవటిలో దివ్యానందం పరవళ్ళు త్రొక్కి ప్రవహించ సాగింది.

13. దేవమండల్ ఘాట్‌కు భైరవి బసను మార్చుకోవడానికి కారణం

అలా ఆరు లేక ఏడు రోజులు గడిచాయి. వారి మధ్య దోషం ఇసుమంత కూడా లేదు. కాని భైరవి అలా తన చెంత ఉండడం సబబు కాదని శ్రీరామ కృష్ణులకు తోచింది. తమ మధ్య నెలకొన్న నిజమైన సంబంధం విషయం లోకులకు తెలియదు, అర్థం కాదు. లోకులు కామినీ కాంచనాసక్తులై ఉంటారు. వారి బుద్ధి ఎప్పుడూ సంసారపరంగానే ఆలోచిస్తుంది. ఈ లోకుల మూలంగా భైరవికి ఎక్కడ నామర్దా వస్తుందోనని శ్రీరామకృష్ణులు భయపడ్డారు. ఆ విషయం భైరవికి చెప్పారు. ఆమె కూడా వెంటనే విషయం అర్థం చేసుకుంది. ఆలయానికి దగ్గరలో మరోచోటికి తన బస మార్చుకుంది. ప్రతిరోజూ శ్రీరామకృష్ణులను చూసి వెళ్ళాలని నిశ్చయించుకుంది. అలా ఆమె ఆలయాన్ని వదిలింది.

ఆలయాన్ని వదలి 'దేవమండల్ ఘాట్' అనే స్నానఘట్టంవద్ద బసచేయ సాగింది.[1] అది కూడా దక్షిణేశ్వర గ్రామంలోనిదే. ఆలయానికి ఉత్తరంగా గంగా తీరంలో అది ఉంది. భైరవి ఆ గ్రామంలో స్వేచ్ఛగా తిరిగేది. ఆమె సద్గుణాలు, సదాచారాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. గ్రామీణ స్త్రీలంతా ఆమె పట్ల శ్రద్ధ గౌరవాలు పెంపొందించుకున్నారు. దానితో ఆమె కనీస అవసరాలు తీరిపోయేవి. అంతేకాక, ఆమెపై రానున్న లోకాపవాదం కూడా తొలగిపోయింది.

దానితో ఆమె మళ్ళీ ప్రతిరోజూ కాళికాలయానికి వెళ్ళేది. శ్రీరామకృష్ణు లతో కొంతసేపు భగవత్ప్రసంగాలలో గడిపేది. గ్రామస్త్రీల వద్ద భిక్ష గ్రహించేది. భిక్షలో లభించిన మధురపదార్థాలను అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులకు కూడా తెచ్చి ఇస్తూవుండేది.

శ్రీరామకృష్ణులకు కలిగిన అనుభవాలు - దర్శనాలు - అవస్థలు అన్నీ భగవం తుని అనుగ్రహమేనని భైరవీ బ్రాహ్మణి భావించింది. కాని శ్రీరామకృష్ణులు భగవ త్ప్రసంగాలు వింటూ, మాట్లాడుతూ భావసమాధిలోకి వెళ్లిపోయేవారు. బాహ్య స్మృతి కోల్పోయేవారు. కీర్తనలో పరవశులయ్యేవారు. ఇవన్నీ భైరవి ప్రత్యక్షంగా

---

1. దీనిని గురించి హృదయ్ కథనం: భైరవికి శ్రీరామకృష్ణులే దేవమండల్ ఘాట్ (గట్టు) వద్ద ఉండమని సలహా ఇచ్చారట! భైరవిని ఆ మండల గృహస్థురాలైన స్వర్గీయ నవీనచంద్ర నియోగి భార్య ఆదరంతో ఆహ్వానించింది. ఘాట్‌వద్ద ఉన్న గదిలో ఎంతకాలమైనా నివసించ మని చెప్పింది. పైగా మంచం, పరుపు, బియ్యం, పప్పులు మొదలైనవన్నీ సమకూర్చి ఇచ్చింది.

చూసింది. చూసిన తర్వాత ఆయన సామాన్య సాధకుడు కాదని తెలుసుకొంది.

14. శ్రీరామకృష్ణులు అవతారపురుషులన్న భైరవి విశ్వాసానికి హేతువులు

చైతన్య చరితామృతం, చైతన్య భాగవతం మొదలైన గ్రంథాల్లో శ్రీ శ్రీ చైతన్యులు మరల అవతరిస్తాడని ఉంది. శ్రీరామకృష్ణులను గమనిస్తుంటే, భైరవికి ఆ అవతారం ఇదేనేమోనన్న స్ఫురణ కలిగింది. ఆమె శ్రీచైతన్య నిత్యానందుల చరిత్రలతో, శ్రీరామకృష్ణులను పోల్చి చూసుకుంది. శ్రీరామకృష్ణుల అనుభవాలకు, వారి అనుభవాలకు మధ్య చాలా దగ్గరి పోలికలుండడం గమనించింది. శ్రీ చైతన్యులలా పరవశత్వం పొందడం, ఆయనలా స్పర్శతో ఇతరులలో ఆధ్యాత్మికతను జాగృతం చేయడం చూసింది. భగవద్విరహం కారణంగా శ్రీచైతన్యులలో దుర్భరమైన మంటలు శరీరంలో పుట్టేవి. అప్పుడు పుష్పమాలతో - గంథంతో ఆయన శరీరాన్ని అలంకరిస్తే, ఆ మంటలు తగ్గేవి. శ్రీరామకృష్ణులలో కూడా భైరవికి అవే లక్షణాలు, అట్లే కనిపించాయి. ఆయన కూడా భగవంతుని విరహంతో వ్యధ చెందుతూ, శరీరంలో మంటలను అనుభవించేవారు. భైరవి అందుకు చికిత్సగా పూలమాలలు ధరించి, గంథం అలదుకోమని సూచించింది. అలా చేసిన వెంటనే ఆ మంటల వేడి చల్లబడింది. పంచవటిలో శ్రీరామకృష్ణులు రఘువీరుని నైవేద్యం ఆరగించారు. రఘువీరుడే శ్రీరామకృష్ణులుగా ఆమెకు దర్శనం కలిగింది. వీటన్నింటినిబట్టీ భైరవి ఒక నిర్ణయానికి వచ్చింది. శ్రీచైతన్యుడు, నిత్యానందుడు - ఇద్దరూ శ్రీరామకృష్ణుల శరీరంలో అవతరించారని ఆమెకు నిశ్చయమైంది. సిహోర్ గ్రామానికి వెళుతున్నప్పుడు, శ్రీరామకృష్ణుల శరీరం నుండి ఇద్దరు కౌమారప్రాయ వ్యక్తులు బయటకు రావడం మనం ఇదివరకే చెప్పుకున్నాం. ఆ విషయాన్ని శ్రీరామకృష్ణుల ముఖతా స్వయంగా విన్న తర్వాత, శ్రీరామకృష్ణులు అవతారపురుషుడేనని ఆమె మరింత గట్టిగా నిశ్చయించుకుంది. 'నిత్యానందుని తొడుగులో చైతన్యుని ఆవిర్భావం జరిగింది' అని అనుకుంది.

భైరవీ బ్రాహ్మణి ఎవరి నుంచీ ఏమీ ఆశించేది కాదు. కాబట్టి లోకుల మాటలను అసలు పట్టించుకునేది కాదు. తాను సత్యమనుకొన్నదాన్ని నిర్భయంగా వెల్లడించేది.

అలాగే శ్రీరామకృష్ణులను గూర్చి తనకు తెలిసిన సత్యాన్ని అందరికీ చెప్పసాగింది. ఒకరోజు మథుర్‌తో శ్రీరామకృష్ణులు పంచవటి క్రింద కూర్చుని ఉన్నారు. హృదయ్ కూడా అక్కడే ఉన్నాడు. మాటల సందర్భంలో శ్రీరామకృష్ణులు తన విషయంలో భైరవికి కలిగిన అభిప్రాయాన్ని మథుర్‌కు చెప్పారు. ''అవతారపురుష లక్షణాలు నాలో కనిపిస్తున్నాయట ఆమెకు! ఆమె

అనేక శాస్త్రాలు అధ్యయనం చేసింది. ఆమె వద్ద అనేక పుస్తకాలున్నాయి'' అని తెలిపారు.

మథుర్ అదంతా విని నవ్వాడు. ''బాబా! ఆమె ఏమైనా అనుకోనీ. అవతారాలు పది కన్నా ఎక్కువ లేవు కదా! అలాంటప్పుడు ఆమె చెప్పేది సత్యమెలా అవుతుందీ? కాని ఒకటి మాత్రం సత్యం. జగన్మాత అనుగ్రహం నీకు లభించింది'' అన్నాడు.

అప్పుడు భైరవి వారివైపుగా రాసాగింది. శ్రీరామకృష్ణులు, మథుర్‌కు 'ఆమే భైరవీ బ్రాహ్మణి' అని తెలిపారు. చేతిలో మిఠాయిల పళ్ళెంతో, మాతృప్రేమతో పరవశురాలై ఆమె శ్రీరామకృష్ణుల వైపు రాసాగింది. తన ప్రియతమ తనయుడైన బాలకృష్ణునికి, యశోదామాత వెన్నముద్దలు పెట్టడానికి ఎలా ప్రేమ - వాత్సల్యాలతో వచ్చేదో, అలా వచ్చింది.

దగ్గరకు రాగానే ఆమెకు మథుర్‌బాబు కనిపించాడు. వెంటనే తనను తాను సంబాళించుకుంది. మిఠాయి పళ్ళాన్ని హృదయ్‌కు ఇచ్చింది. శ్రీరామకృష్ణులు మథుర్‌బాబును ఆమెకు పరిచయం చేశారు. ''అమ్మా! నా గురించి నువ్వు నాకు చెప్పిన విషయాలు ఇతనికి చెప్పాను. ఇతడేమో అవతారాలు పది కన్నా ఎక్కువ ఉండడానికి వీలులేదంటున్నాడు. మరిప్పుడెలా?'' అని అమాయకంగా అడిగారు. మథుర్, భైరవిమాతకు నమస్కరించాడు. ఆమె అతణ్ణి ఆశీర్వదించింది.

''నాయనా! భాగవతం అవతారాలు ఇరవైనాల్గని పేర్కొంటున్నది. అంతే కాదు, విష్ణువు అనేకానేకసార్లు అవతరిస్తూంటాడని వ్యాసభగవానుడే తెలిపి ఉన్నాడు. వైష్ణవగ్రంథాల్లో కూడ శ్రీచైతన్యుడు మరల అవతరిస్తాడని ఉంది. పైగా శ్రీరామకృష్ణులకు కలుగుతున్న దివ్యానుభూతులు - దర్శనాలు - అవస్థలు దాదాపు శ్రీచైతన్యునితో సరిపోలుతున్నాయి'' అని వివరించింది మథుర్‌కు.

''భాగవతాన్ని, వైష్ణవ గ్రంథాలను అధ్యయనం చేసిన పండితులతో ఈ విషయంగా వాదించి, సప్రమాణికంగా నిరూపిస్తా''నని చెప్పింది. ఆమె మాటలన్నీ విన్న మథుర్ ఏం చెప్పడానికీ పాలుబోక మౌనంగా ఉండిపోయాడు.

శ్రీరామకృష్ణులు అవతారమన్న భైరవి మాటలు దాదాపు కాళికాలయంలో అందరికీ తెలిసిపోయాయి. దాంతో పెద్ద అలజడి రేగింది. అది ఎలా పరిణమించిందో, గురుభావం (III. 5,6; IV.1)లో మేము వివరంగా చెప్పాం. శ్రీరామకృష్ణులను అవతారమని భైరవి ప్రకటించినప్పటికీ ఆయనలో కొత్తగా ఏ మార్పూ రాలేదు. మామూలుగానే కాళీమాత తనయునిగానే ఉండిపోయారు. కాని భైరవి మాటలకు, పండితులు - విద్వాంసులు అయిన వారు ఎలా ప్రతిస్పందిస్తారోనన్న కుతూహలం మాత్రం

15. వైష్ణవచరణ్ రాక

ఆయనకు కలిగింది. అందుకై పండితుల సభ ఏర్పాటు చేయమని మథుర్‌ను కోరారు. మథుర్ విద్వాంసులైన వారందరినీ ఆహ్వానించాడు. వైష్ణవచరణ్‌కూడ అలా ఆహ్వానితుడై దక్షిణేశ్వరం వచ్చాడు.

ఆ పండితులందరి ముందు భైరవి తనవాదాన్ని ఎలా నిరూపించుకుందో, గురుభావం, ఉత్తరార్ధంలో (IV.1) మేము తెలియచేశాం.

11. తాంత్రిక సాధన

1. శ్రీరామకృష్ణుల పట్ల బ్రాహ్మణికి గల కచ్చితమైన అవగాహన

శ్రీరామకృష్ణుల అసామాన్య ప్రకృతి గురించిన పై నిర్ణయానికి (అంటే ఆయన అవతారమూర్తి అని) భైరవీ బ్రాహ్మణి కేవల హేతు వాదంతో రాలేదు. శ్రీరామకృష్ణులను ప్రప్రథమంగా కలుసుకున్నప్పుడు ఆయనతో సహా మరిద్దరిని కలుసుకొని వారి ఆధ్యాత్మిక జీవన పురోభివృద్ధిలో తాను తోడ్పడవలసివుందని ఆమె చెప్పడం పాఠకులకు సువిదితమే. శ్రీరామకృష్ణులను కలుసుకోవటానికి చాలాకాలం క్రితమే ఆమె జగన్మాత నుండి ఆదేశాన్ని పొందింది. ఆమె ఆధ్యాత్మిక సాధనాజనిత దివ్య దృష్టే ఆమెను దక్షిణేశ్వరానికి రావించి, శ్రీరామకృష్ణులను అవగాహన చేసుకోవడంలో ఆమెకు సహాయపడింది. రోజులు గడిచేకొద్దీ, శ్రీరామకృష్ణులకు అతి సన్నిహితం అయ్యేకొద్దీ - శ్రీరామకృష్ణుల సాధనానుష్ఠానాలలో తన పాత్ర ఏమిటో, తాను అందించవలసిన సహాయం ఏ రీతిలో ఉండాలో బ్రాహ్మణికి స్పష్టం కాసాగింది. కాబట్టే సామాన్య జనంలో శ్రీరామకృష్ణులను గురించి ఉన్న అపోహను తొలగించడంతోనే తన సమయాన్నంతా గడపలేదామె. శాస్త్రబద్ధమైన వివిధ సాధనలను అనుష్ఠించడంలో శ్రీరామకృష్ణులను నిమగ్నులను చేసింది. శ్రీరామకృష్ణులు జగజ్జననిని విస్పష్టంగా చూడగలందులకై, ఆమె అనంత అవ్యాజ కరుణాకటాక్ష ప్రాప్తికై - ఆయన స్వీయ దివ్యశక్తిలో (అదే ఆయన యథార్థ ప్రకృతి) ప్రగాఢంగా నెలకొనడానికై - ఆయనతో వివిధ ఆధ్యాత్మిక సాధనలను చేయించడంలో బ్రాహ్మణి నిమగ్నురాలైంది.

గురుపరంగా వస్తూన్న శాస్త్రనిర్దిష్టమైన సాధనామార్గాలను అనుసరించక, కేవలం హృదయపూర్వకమైన భావదనురాగంతో మాత్రమే జగన్మాత దర్శనం పొందగలిగారు శ్రీరామకృష్ణులు. కాబట్టే తమ ఉన్నతావస్థను గురించిన సంశయాల నుండి ఆయన విముక్తులు కాలేకపోతున్నారనే విషయాన్ని గ్రహించడానికి

సాధనలో పురోగమించిన బ్రాహ్మణికి ఎంతో సమయం పట్టలేదు. తమకు కలిగిన

2. బ్రాహ్మణి, శ్రీరామకృష్ణుల తాంత్రిక సాధనలు ఎందుకు చేయమన్నది?

అలౌకిక దివ్యానుభూతులన్నీ మతిభ్రమ కారణంగా కలిగిన వేమోనని, తమ శరీరంలో కలుగుతున్న భౌతిక మానసిక పరిణామాలన్నీ దాపురించబోయే ఏ ఘోరవ్యాధి తాలూకు చిహ్నలో అనీ సందేహం అప్పుడప్పుడు ఆయనలో మెదలుతూం డేది. ఆ సందేహ నివారణోపాయంగా ప్రస్తుతం బ్రాహ్మణి ఆయనను తాంత్రిక సాధనలను చేపట్టమని ప్రోత్సహించింది. ఎందుకంటే సాధకుడు ఎలాంటి సాధ నను అనుష్ఠిస్తే ఏ ఫలితాన్ని పొందుతాడో తంత్రశాస్త్రాలలో స్పష్టంగా ఉల్లేఖించ బడింది. శ్రీరామకృష్ణులూ అదే రీతిలో సాధనలు చేయగలిగితే, గతంలో ఎందరో సాధకులు సునిర్దుష్టమైన ఆ సాధనలను గావించి ఎలాంటి అనుభూతులను పొందగలిగారో, ఆయన కూడ అలాంటి అనుభూతులను పొందినప్పుడు, తమ అవస్థ వ్యాధిజనితం కాదనే యథార్థాన్ని ఆయన గ్రహిస్తాడని బ్రాహ్మణికి తెలుసు. అంతేగాక సాధన మూలంగా మనిషి ఉన్నత ఆధ్యాత్మిక భూముల నధిరో హించేకొద్దీ ఆయన మనశ్శరీరాలలో మహాద్భుతమైన శారీరక మానసిక పరి ణామావస్థలు కలుగుతవనీ, కాబట్టే స్వయంగా తనలో జనించిన మార్పులన్నీ ఇలాగే కలిగినవనే దృఢవిశ్వాసం శ్రీరామకృష్ణులలో ఏర్పడగలదు. తత్ఫలితంగా ప్రస్తుతం ఆయన చేస్తున్న తాంత్రిక సాధనానుష్ఠాన ఫలంగా భవిష్యత్తులో వారికి కలిగే దివ్యదర్శనాలు, దివ్యానుభూతులు - అవన్నీ సత్యమనీ, సాధన చేసే వారందరికీ అవన్నీ కలుగుతవనీ గ్రహించి, నిస్సంశయంతో ఆయన తన లక్ష్యం వైపు ఏ అడ్డంకీలేక సాగిపోగలరు. కాబట్టే గురువాక్యాలతో, శాస్త్రోపదేశాలతో స్వీయ అనుభవాలు సరిపోతున్నవో లేదో సరిపోల్చుకోమని శాస్త్రాలు సదా సాధ కుడికి హితవు చేయడానికి ఇదే కారణమనీ బ్రాహ్మణికి తెలుసు.

శ్రీరామకృష్ణులు అవతారపురుషులని ఎరిగీ వారి చేత సాధనలను చేయించడానికి బ్రాహ్మణి ఎందుకు పూనుకొన్నది అనే ప్రశ్న తలఎత్తవచ్చు.

3. అవతారమూర్తి యైన ఆయనకు సహాయపడాలని బ్రాహ్మణికి ఎలా తోచింది?

భగవదవతారాల వైభవాన్వితాలను ఎరిగివున్నప్పుడు, వారు పరిపూర్ణులనీ, ఈ సాధనలన్నీ వారికి అనావశ్యకాలనీ అంగీకరించాలి గదా! అందుకు జవాబు: శ్రీరామకృష్ణుల సర్వశ్రేష్ఠ మహత్త్వం ఆమె మనస్సులో సదా సచేతనలో ఉండివుంటే పైన చెప్పింది నిజం. కాని అలా జరగలేదు. మొట్టమొదట కలుసు కొన్నప్పటి నుంచి బ్రాహ్మణి శ్రీరామకృష్ణులను తన బిడ్డ మాదిరి ప్రేమించ సాగింది. మరి ఐశ్వర్య జ్ఞానాన్ని మరపించి, తన ప్రియతముడి సంక్షేమం నిమిత్తం ఆత్మసమర్పణం చేయించగలిగే శక్తి, ప్రేమలకన్న మరొక్కటి లోకంలో

ఏమున్నది? కాబట్టి యథార్థ ప్రేమ ప్రేరణాబలం చేతనే ఆమె శ్రీరామకృష్ణులను సాధనలలో నియుక్తుణ్ణి గావించినదనే విషయం స్పష్టమౌతున్నది. అవతార మూర్తులైన అందరి జీవితాలనూ పరికించినప్పుడు మన కీ పరిస్థితి ద్యోతక మవుతుంది. వారికి అతి సన్నిహితులైన వ్యక్తు లందరూ కూడ ఆ అవతార మూర్తుల అలౌకిక దివ్యశక్తులను గాంచి కొన్ని సమయాలలో విస్మయులవు తున్నప్పటికీ, మరుక్షణంలోనే అంతా మరచిపోయేవారు. అంతేగాక వారిపట్ల ఉండే ప్రేమతో ముగ్ధులై, ఇతరుల మాదిరి వారిని పరిమిత జ్ఞానులుగా ఎంచి, వారి సంక్షేమం కోసం పాటుపడుతూండడం మనం చూడవచ్చు. అదే విధంగా బ్రాహ్మణి కూడ శ్రీరామకృష్ణుల అసాధారణ భావపారవశ్యాన్ని, అలౌకిక శక్తి వ్యక్తీకరణను చూసి తరచూ దిగ్భ్రాంతురాలైనప్పటికీ మాతృప్రేమతో మరుక్షణమే అంతా మరచిపోయేది. ఆమె పట్ల శ్రీరామకృష్ణులు కనబరచిన శుద్ధప్రేమ, విశ్వాసం, పసిపిల్లవాడి మాదిరి పూర్తిగా ఆమె మీద ఆధారపడడం - ఇవి ఆ సన్న్యాసిని హృదయం నుంచి, సున్నితమైనప్పటికీ, తీవ్ర మాతృవాత్సల్య తరంగాలను రేపిందని ప్రత్యేకంగా చెప్ప పనిలేదు. కాబట్టే ఈ మాతృవాత్సల్యం ఆయన శక్తులను ఆమె తెలుసుకోకుండా అడ్డుపడింది. అంతేగాక సర్వవిధాలా ఆయనను సంతోషంగా ఉంచేటట్లూ, ఇతరుల నిర్బంధాల నుంచి ఆయనను రక్షించేటట్లూ, సాధనానుష్ఠానంలో ఆయనకు సహకరించేటట్లూ కూడ ఈ వాత్సల్యమే బ్రాహ్మణికి స్ఫూర్తినిచ్చింది.

4. అలా చేయడంలో బ్రాహ్మణి ఆతురత

పరమయోగ్యుడైన శిష్యుడికి బోధించే సదవకాశం కలిగినప్పుడు ఆచార్యుడి హృదయం తృప్తి - ఆత్మతృప్తిని పొందుతుంది. ప్రస్తుత కాలంలో ఆధ్యాత్మిక రంగంలో శ్రీరామకృష్ణుల వంటి సర్వోత్కృష్ట వ్యక్తి జన్మించివుంటాడని బ్రాహ్మణి కలలో కూడ ఊహించలేదు. శ్రీరామకృష్ణులకు బోధించే అవకాశం లభించినప్పుడు ఆమె హృదయం పరమానందం పొందివుంటుదనడం నిస్సంశయం. తన అధ్యయన, తీవ్ర తపోఫలితాలను స్వల్పకాలంలోనే ఆయనచేత కూడ అనుభవింపచేయడానికి ఆమె ఆతురత వహించినదనడంలో అబ్బురం లేదు.

5. జగజ్జనని అనుజ్ఞతోనే శ్రీరామకృష్ణులు తాంత్రిక సాధనల ననుష్ఠించడం: వాటికోసం ఆయన వ్యాకులత

తాంత్రిక సాధనలను అనుష్ఠించడంలోని ఔచిత్య ఆవశ్యకతల గురించి వాటి ప్రారంభానికి మునుపే జగజ్జననిని అడిగి, ఆమె అనుజ్ఞను పొందే, ఆ సాధనలు ఆచరించినట్లు శ్రీరామకృష్ణులే స్వయంగా మా కొకప్పుడు తెలిపారు. కాబట్టి కేవలం బ్రాహ్మణి ఆతురత, ప్రేరణలతోనే ఆయన ఆ సాధనలను ప్రారంభించలేదు. అంతేగాక సాధనాజనిత యోగదృష్టి ద్వారా కూడ

శాస్త్రోక్త విధానాల ననుసరించి జగన్మాతను సాక్షాత్కరించుకొనే సమయం ఆసన్న మైనదని తమ హృదయాంతరాళంలో ఆయనకు తోచింది. ఈ విధంగా శ్రీరామ కృష్ణుల ఏకాగ్రచిత్తం ఇప్పుడు బ్రాహ్మణి నిర్దేశించిన సాధనామార్గంలో ఆతు రతతో పరుగులెత్తసాగింది. ఆయన అనుభవిస్తూన్న ఆ ఆతురత, తీవ్రతను మన బోటి అతి సామాన్యులు తెలుసుకోవడం అసాధ్యం. అందుకు కారణం: అంతు లేని ప్రాపంచిక విషయాల వెంట నాలుగు దిక్కులా పరుగులెత్తే మన మనస్సులకు ఆ సంయమన శక్తి, ఏకాగ్రతా ఎక్కడున్నవి? ఇంద్రజాల సదృశాలైన ఈ గాజుపెంకులతో క్రీడించడం విడనాడి, భావంతరాళంలో మునిగి, వజ్రఖనులతో నిండిన సాగరగర్భానికి చేరే సాహసం మనకు ఎక్కడున్నది? 'పూర్తిగా మునిగిపో', 'నీలో నువ్వు మునిగిపో' అంటూ పదే పదే గురుదేవులు ఏ భావంతో మమ్మల్ని ప్రేరేపిస్తూండేవారో, ఆ భావాన్ని అనుసరించి, జగత్తులోని పదార్థాలన్నిటి మీద, చివరికి స్వకీయ దేహం మీది మాయా మమతలను ఛేదించి, ఆధ్యాత్మిక లోతు లలో మునిగిపోగలిగే శక్తి మనకెక్కడిది? దుర్భర పరితాపంతో, మహావ్యాకుల హృదయంతో, 'అమ్మా! దర్శనం ఇవ్వు' అని ప్రార్థిస్తూ పంచవటి క్రింద, గంగా సైకత తీరం మీద రక్తం స్రవించేవరకు గురుదేవులు ముఖాన్ని నేలకేసి రాచు కొనేవారని, ఎన్ని రోజులు గడచినా ఆ వ్యాకులతా భావం ఉపశమించేది కాదని మనం విన్నప్పుడు ఆ పలుకులు మన చెవులలో ప్రవేశించినా నిజానికి అవి మన హృదయ సీమను కించిత్తయినా ప్రతిస్పందింపజేయవే! ఎలా ప్రతిస్పందింప జేస్తాయి? జగజ్జనని వాస్తవంగానే ఉన్నది, అన్నిటినీ త్యజించి, వ్యాకులతా హృద యంతో ఆమెను పిలిస్తే తప్పక ఆమె సాక్షాత్కరిస్తుంది - అని శ్రీరామకృష్ణుల మాదిరి పసిపిల్లవాడి విశ్వాసం మనకు ఉందా?

6. సాధనాకాలంలో గురుదేవుల తీవ్ర వ్యాకులత

కాశీపూర్ ఉద్యానవాటికలో నివసిస్తున్నప్పుడు గురుదేవులు మా కొకరోజు సాధనాకాలంలో తాము అనుభవించిన తీవ్ర వ్యాకులతను గురించి ఒకింత సూచనప్రాయంగా తెలిపి మమ్మల్ని దిగ్భ్రాంతుల్ని చేశారు. అప్పటి మా అనుభవాన్ని పాఠకు లకు యథాతథంగా వర్ణించలేం. కాని ఆ సంఘటనను ఇక్కడ ప్రస్తావిస్తున్నాం.

భగవత్సాక్షాత్కారం కోసం స్వామి వివేకానంద అనుభవించిన తీవ్ర వ్యాకు లతను మేం అప్పుడు మా కళ్ల ముందే ప్రత్యక్షంగా చూస్తున్నాం. న్యాయశాస్త్ర పరీక్షకు రుసుము చెల్లించడానికి వెళ్లినప్పుడు ఆయనలో ఆధ్యాత్మిక జాగృతి ఎలా కలిగిందో, దాని ప్రేరణతో అస్థిమితుడై ఎలా ఆయన కట్టుబట్టతో, వట్టి కాళ్లతో పిచ్చిపట్టిన వాడిలా నగర వీథుల గుండా పరుగెత్తుకొని వచ్చి, కాశీపూర్‌లో ఉంటున్న గురుదేవుల పాదాల మీద వాలిపోయారో, తన హృదయపరితాపాన్ని

గురుదేవులకు వ్యక్తంచేసి ఆయన కృపాభిక్షను ఎలా పొందారో, నిద్రాహారాలను మాని అప్పటి నుంచి ఆయనెలా రేయింబవళ్ళు జప, ధ్యాన, భజన, భగవత్ప్రసంగాలతోనే కాలం గడపసాగారో; అపరిమిత సాధనోత్సాహంతో ఆయన సున్నిత హృదయం కూడ ఎలా వజ్రసదృశంగా మారి తల్లీ, సోదరుల కష్టాలపట్ల ఎంత ఉదాసీన వైఖరి దాల్చినదో; గురుదేవులు చూపిన సాధనామార్గంలో ఏకాగ్ర చిత్తుడై, దివ్యదర్శనాలను ఒకటి వెంట ఒకటి గాంచుతూ, మూడు నాలుగు నెలల స్వల్పకాల వ్యవధిలోనే నిర్వికల్ప సమాధి ఆనందం యొక్క ప్రథమానుభూతిని ఎలా పొందారో - ఇవన్నీ మా కళ్ళ ముందే జరిగి మమ్మల్ని స్తంభీభూతులను చేశాయి. స్వామీజీ (స్వామి వివేకానంద) అనన్య భక్తిని, వ్యాకులతను, సాధనోత్సాహాన్ని చూసి పరమానందభరితులై గురుదేవులు ఆయనను అమితంగా శ్లాఘించేవారు. అప్పట్లో ఒకరోజు గురుదేవులు ''సాధనపట్ల నరేన్ చూపే ప్రేమోత్సాహాలు నిజానికి అద్భుతమైనవే; కాని సాధన సమయంలో దీన్లో (తమను చూపిస్తూ) కలిగిన ఆ ప్రచండ వేగంతో పోలిస్తే అతడివి అతి సామాన్యమనే చెప్పాలి - పావు భాగం కూడ ఉండవు'' అన్నారు. గురుదేవుల ఆ మాటలు మాలో ఏ భావతరంగాల్ని ఉవ్వెత్తున లేపినవో పాఠకులైన మీరే ఊహించండి.

ఈ విధంగా జగన్మాత సూచనానుసారం శ్రీరామకృష్ణులు సర్వాన్నీ విస్మరించి సాధనలో మునిగిపోయారు. మహా విదుషీమణి, సాధనానుష్ఠానంలో సిద్ధహస్తురాలైన బ్రాహ్మణి అతి శ్రమతో తాంత్రిక క్రియలకు ప్రత్యేకమైన వస్తు సామగ్రిని వివిధ ప్రాంతాల నుంచి సేకరించి, సాధనా సమయంలో వాటి నెలా ఉపయోగించాలో గురుదేవులకు బోధించసాగింది.

ఈ తాంత్రిక సాధనలకు ఆవశ్యకమైన పంచముండీ[1] (మనిషి పుర్రెతో బాటు మరి నాలుగు జంతువుల పుర్రెల) గంగానదికి ఆవలి సుదూర ప్రాంతాల

---

1. ఇదానీం శ్రుణుదేవేశి ముండసాధనముత్తమం।
యత్కృత్వా సాధకో యాతి మహాదేవ్యాః పరం పదమ్॥ 51
నర మహిష మార్జార ముండత్రయం వరాననే।
అథవా పరమేశాని నృముండత్రయ మాదరాత్॥ 52
శివా సర్పసారమేయ వృషభాణాం మహేశ్వరి।
నరముండం తథా మధ్యే పంచముండాని హీరితమ్॥ 53
అథవా పరమేశాని నరాణాం పంచముండకాన్।
తథా శతం సహస్రం వాయుతం లక్షం తథైవ చ॥ 54
నియుతాంచథవా కోటిం నృముండాన్ పరమేశ్వరి।
నరముండం స్థాపయిత్వా ప్రోథయిత్వా ధరాతలే॥ 55

నుంచి తీసుకురాబడినవి. తాంత్రిక సాధనలకు అనువైన రెండు పీఠాలు[2] - ఒకటి కాళికాలయ ఉద్యాన ఉత్తర సరిహద్దు వద్దవున్న మారేడు చెట్టు కింద, రెండవది శ్రీరామకృష్ణులు స్వహస్తాలతో నాటి పెంచిన పంచవటి కింద - నిర్మించబడినవి. అవసరం మేరకు ఈ రెండు పంచముండి పీఠాలలో ఏదో ఒక దాని మీద ఆసీనులై జపం, పురశ్చరణం, ధ్యానాదులతో గురుదేవులు కాలం గడప సాగారు. ఈ రీతిలో రేయింబవళ్ళు, రోజులు, నెలలు ఎలా గడచిపోయినవో గురుశిష్యు లిద్దరికీ ఎరుకే లేదు. శ్రీరామకృష్ణులు ఆ సాధనను గురించి ఇలా చెప్పే వారు:[3] ''బ్రాహ్మణి పగటివేళ సుదూరంలో ఉన్న ప్రాంతాలకు వెళ్ళి తంత్రశాస్త్రాలలో నిర్దిష్టమైన, దుర్లభమైన విభిన్న వస్తువులను సేకరించి ఆలయ ఉద్యానానికి

7. పంచముండి పీఠ నిర్మాణం, 64 తంత్రాల లోని ముఖ్యసాధనల ననుష్ఠించడం

→

వితస్తి ప్రమితాం వేదీం తస్యోపరి ప్రకల్పయేత్।
ఆయామ ప్రస్థితోదేవి చతుర్హస్తా సమాచరేత్॥ 56
-యోగినీతంత్రం - పంచమ పటలః

సంక్షిప్త తాత్పర్యం: పరమేశ్వరీ! అత్యుత్తమమైన ముండ సాధనాన్ని గురించి చెబుతాను విను. దీన్ని సాధించేవాడు పరమేశ్వరీ లోకాన్ని పొందుతాడు. వీటిలో మొదటిది మూడు పుర్రెలతో చేయబడాలి అవి: 1. మనిషి 2. దున్నపోతు 3. పిల్లి పుర్రెలు లేదా బదులుగా మూడు మనిషి పుర్రెలతో కూడ చేయవచ్చు. రెండవది ఐదు పుర్రెలతో చేయబడాలి. అవి: 1. నక్క 2. పాము 3. కుక్క 4. ఎద్దు 5. వీటిమధ్య మనిషి పుర్రె లేదా బదులుగా ఐదు మనిషి పుర్రెలతోను చేయవచ్చు. (ఈ ముండ సాధనకు మనిషి పుర్రెలు ఎంత శ్రేష్ఠమైనవంటే ఒక్క అయిదే అని కాదు వంద, వెయ్యి, లక్ష, పదిలక్షలు, కోటి - ఎన్ని లభిస్తే అంత మంచిది.) ఇలా ఈ పుర్రెలను భూమిలోపల పాతిపెట్టి దానిమీద ఒక చదరపు వేదికను నిర్మించాలి. లేదా ఒకే ఒక్క మనిషి పుర్రెమీద కూడ అలాంటి వేదికనే నిర్మించవచ్చు. ఇలా నిర్మించబడిన వేదిక మీద ఆసీనులై, గురూపదిష్టానుసారంగా సాధన చేసే వ్యక్తికి ఫలితం సత్వరం లభిస్తుంది. -యోగినీతంత్రం, ఐదవ అధ్యాయం నుంచి

2. సాధకులు సామాన్యంగా ఐదు పుర్రెలతోకూడిన ఒక్క వేదికనే నిర్మించి జపధ్యానాదులను చేస్తూంటారు. కాని తాము రెండు వేదికలను నిర్మించామని గురుదేవులు మాతో చెప్పారు. వీటిలో ఒకటి మారేడు చెట్టు కింద మూడు మనిషి పుర్రెలతో నిర్మించబడినది. తాంత్రిక సాధనలలో సిద్ధి పొందిన ఒకింత కాలం తరువాత, వారా రెండు వేదికలను తొలగించి, ఆ పుర్రెల నన్నిటినీ గంగానదిలో పారవేశారు. సాధన చేయడానికి మూడు పుర్రెల ఆసనమే శ్రేష్ఠమైనదనో లేక ఆ కాలంలో పంచవటి కంటే మారేడు చెట్టువున్న స్థలం మరింత ప్రశాంతంగా ఉండడం చేతనో లేక అన్ని క్రియానుష్ఠానాలకూ అవసరమౌతవనో రెండు వేదికలు నిర్మించబడినవి. లేదా మారేడు చెట్టుకు సమీపంలోనే హోమం చేయడం ప్రమాదమని భావించి రెండవ వేదికను పంచవటి కింద నిర్మించి ఉండవచ్చు.

3. విభిన్న సమయాలలో శ్రీరామకృష్ణుల నుండి ఈ తాంత్రిక సాధనాదులను గురించి విన్న విషయాలనే మే మిక్కడ సందర్భానుసారంగా పొందుపరిచాం.

బిల్వ వృక్షం

తీసుకొని వచ్చేది. రాత్రివేళ మారేడు చెట్టు కిందనో లేక పంచవటి కిందనో ఆ వస్తువులను అమర్చి, నన్ను రావించి ఆయా వస్తువులతో యథావిధిగా నా చేత జగన్మాతను పూజింపచేసి, చివరకు జపధ్యానాలలో నన్ను నిమగ్నుడను చేసేది. ఇలా పూజ అయ్యాక సామాన్యంగా జపం చేయవలసిన అవసరమే ఉండేది కాదు. ఎందుకంటే పూజ ముగిసేటప్పటికి ఎంత తన్మయుడనయ్యేవాడినంటే జపమాలను ఒక్కసారి త్రిప్పి త్రిప్పకుండానే సమాధి స్థితుడనయ్యేవాణ్ణి. అంతేగాక శాస్త్రాలలో వర్ణించిన ఆ క్రియల ఫలితాలను పూర్తిగా పొందేవాణ్ణి. పరమాశ్చర్యకరమైన దివ్యదర్శనాలు, దివ్యానుభవాలు ఒకదాని వెంట ఒకటి ఆ సమయంలో ఎన్ని కలిగాయో లెక్కించలేను. ఈ విధంగా ప్రధానమైన అరవై నాలుగు తంత్రాలు విధించిన సాధనలనన్నిటినీ ఒకటొకటిగా బ్రాహ్మణి నా చేత చేయించింది. ఈ సాధనలు ఎంత దుష్కరమైనవంటే - వీటిని ఆచరించడంలో సాధకులలో అత్యధికులు పదభ్రష్టులయ్యేవారు. కాని జగన్మాత అనుగ్రహంతో వీటన్నిటిలోనూ ఉత్తీర్ణుడను కాగలిగాను.

8. స్త్రీమూర్తిలో జగన్మాతను దర్శించడం

''ఒకనాడు చూసేసరికి, బ్రాహ్మణి రాత్రివేళ ఎక్కడ నుంచో నిండు యౌవనంలోవున్న ఒక సుందరాంగిని తీసుకువచ్చి, ఆమెను దిగంబరిని చేసి, దేవీ ఆసనం మీద కూర్చోపెట్టి 'నాయనా! ఈమెను జగన్మాతగా పూజించు' అని నాతో చెప్పింది. పూజ పూర్తి కాగానే, 'ఆమె అంక (ఒడి) భాగాన కూర్చుని ఏకాగ్రంగా జపం చేయి' అని బ్రాహ్మణి నన్ను ఆదేశించింది. నేను భయకంపితుడనై, దీనంగా విలపిస్తూ, 'అమ్మా, అమ్మా! నిన్ను సంపూర్ణంగా శరణుజొచ్చిన వాడికి ఇదేమి ఆదేశం ఇస్తున్నావు? దుర్బలుడైన నీ బిడ్డకు ఇలాంటి అగ్నిపరీక్షను తట్టుకోవడం సాధ్యమా తల్లీ?' అంటూ ప్రార్థించసాగాను. ఇలా పలికీ పలకడం

తోనే ఏదో తెలియని శక్తి నన్ను ఆవహించి, నా హృదయాన్ని అపూర్వ దివ్య శక్తితో నింపింది. మంత్రముగ్ధుడిలా ఏం చేస్తున్నానో ఎరుక లేకుండానే ఇష్ట మంత్రాన్ని జపిస్తూ ఆ స్త్రీ అంక భాగాన కూర్చున్న మరుక్షణంలోనే సమాధి మగ్నుడనయ్యాను. బాహ్యస్మృతి వచ్చాక, నన్ను తిరిగి మామూలు స్థితికి తేవడానికి శ్రద్ధగా ప్రయత్నిస్తూ బ్రాహ్మణి నాకు కనపడింది. అప్పుడు నాతో ఆమె, 'నాయనా! కార్యకలాపం పూర్తయింది. ఎంత ఆశ్చర్యం! ఇతరులు ఇటువంటి పరిస్థితిలో అతికష్టం మీద తమను తాము సంబాళించుకొని, ఎలాగో ఒకింతసేపు జపం చేసి సరిపుచ్చుకొంటారు. మరి నువ్వో, పూర్తిగా బాహ్యస్మృతిని కోల్పోయి సమాధిమగ్నుడవైనావు.' ఆ పలుకులు ఆలకించి ఒక దీర్ఘ నిశ్వాసం విడిచాను. ఈ అగ్ని పరీక్షలో ఉత్తీర్ణుడను చేసినందుకు పదేపదే జగన్మాతకు ప్రణమిల్లసాగాను.

''మరొక రోజు చూశానుగదా! బ్రాహ్మణి మనిషి పుర్రెలో చేపను వండి, జగజ్జననికి తర్పణం అర్పించింది. నాతోనూ అలాగే చేయించి, ఆ చేపను నన్ను తినమన్నది. ఆమె ఆదేశాన్ని తు.చ. తప్పకుండా పాటించాను. మనస్సులో ఎలాంటి ఏహ్యాభావమూ జనించలేదు.''

9. ఘృణాత్యాగం (ఏహ్యాభావాన్ని విడిచి పెట్టడం)

''కాని ఏ రోజు బ్రాహ్మణి కుళ్ళిన నరమాంసాన్ని తీసుకొచ్చి, తర్పణం అయ్యాక నా నాలుకతో దాన్ని తాకమని చెప్పిందో, ఆ రోజు నా మనస్సంతా ఏవగింపుతో నిండిపోగా, 'ఇలా చేయడం సాధ్యమేనా?' అన్నాను. అప్పుడు ఆమె 'ఇందులో ఏముంది నాయనా? చూడు, నేను చేస్తున్నాను' అంటూ మాంసంలో ఒక చిన్న భాగం నోట్లో వేసుకొని, 'దేన్నీ ఏవగించుకోరాదు' అంటూ మళ్ళీ కొంత భాగం నా ముందు ఉంచింది. ఆమె అలా చేయడం చూడగానే జగన్మాత యొక్క ప్రచండ చండికామూర్తి ఉద్దీపనం నాలో కలిగింది. 'అమ్మా' అంటూ పదే పదే పలుకుతూ భావావిష్టుడనైనాను. అప్పుడు బ్రాహ్మణి మాంసపు తునకను నా నోట్లో ఉంచినా నాలో ఎలాటి ఏహ్యాభావమూ జనించలేదు.''

పూర్ణాభిషేకంలో అలా దీక్ష పుచ్చుకొన్ననాటి నుంచి బ్రాహ్మణి నిత్యం నా చేత చేయించిన తాంత్రిక సాధనలకు లెక్కేలేదు. ఆయా సందర్భాలలో

10. తాంత్రిక సాధనా సమయాలలో శ్రీరామకృష్ణుల ప్రవర్తన

జరిగిన సంగతులన్నీ నా కిప్పుడు గుర్తులేవు. కాని ఏనాడు తల్లి కృపతో రతిక్రియారక్తులైన దంపతుల సంభోగ మహదానందాన్ని దర్శించి, దాన్లో కేవలం శివశక్తి లీలావిలాసాన్ని మాత్రమే చూసి ఆనందభరితుడనై సమాధిస్థితుడనయ్యానో ఆ సంగతి జ్ఞాపకం ఉన్నది. ఆ రోజు బాహ్యస్మృతి కలిగాక బ్రాహ్మణి నాతో

ఇలా అన్నది: ''నాయనా! అత్యంత క్లిష్టమైన తాంత్రిక సాధనలో సిద్ధిపొంది, దివ్యభావంలో ప్రతిష్ఠితుడవైనావు. వీరభావంలో ఇదే చివరిమెట్టు.''

ఇది జరిగిన కొద్దికాలం పిదప అందరి ముందు, పగటివేళ, నట మండపంలో మరొక భైరవి సహాయంతో తంత్రశాస్త్ర నిర్దేశానుసారం 'కులాగార' పూజను యథావిధిగా అనుష్ఠించాను. పూజ ముగించి ఒక రూపాయి నాలుగు అణాలు దక్షిణగా సమర్పించి, ప్రణామం చేశాను. ఆ కర్మతో నా వీరభావ సాధన పూర్తి అయింది. దీర్ఘకాల పర్యంతం సాగిన ఆ తాంత్రికసాధనా సమయంలో స్త్రీల నందరినీ నేను ఎలా జగన్మాతగా దర్శించగలిగానో, అలాగే ఒక చుక్క అయినా 'కారణాన్ని'[1] (మధువు) పుచ్చుకోలేకపోయాను. కారణమనే పేరు విన్నంత మాత్రానే, లేదా దాని వాసన రావడంతోనే 'జగత్కారణం' నా మనస్సులో స్ఫురించేది, శరీరస్పృహ రహితుడ నయ్యేవాణ్ణి. అలాగే 'యోని' అనే శబ్దాన్ని విన్న తక్షణం 'జగద్యోని' ఉద్దీపనం కలుగగా, సమాధి స్థితుడనయ్యేవాణ్ణి.

దక్షిణేశ్వరంలో నివసిస్తూన్నప్పుడు గురుదేవులు ఒకరోజు స్త్రీల అందరి పట్లా తమకుండే మాతృభావాన్ని గురించి ప్రస్తావిస్తూ ఒక పౌరాణిక కథను

11. శ్రీరామకృష్ణులు చెప్పిన వినాయకుడి కథ

చెప్పారు. గణపతి అయిన వినాయకుడి హృదయంలో కూడా ఈ మాతృభావం దృఢంగా ఎలా నెలకొన్నదో ఈ కథలో వివరించబడింది. ఈ కథ వినడానికి మునుపు ఏనుగు ముఖంతో, బానపొట్టతో ఉండే ఈ దేవుడిమీద మాకు అంతగా భక్తిప్రపత్తులు ఉండేవి కావు. కాని గురుదేవుల ముఖతా ఈ కథ విన్న తరువాత మా అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. దేవత లందరిలో ప్రప్రథమంగా అతడొక్కడే పూజార్హుడని దృఢవిశ్వాసం కుదిరింది. ఆ కథ ఇది:

బాలగణపతి ఒకనాడు ఆడుకొంటున్నప్పుడు ఒక పిల్లిని చూసి దాన్ని దొరకపుచ్చుకొని పిల్లచేష్టగా చక్కగా బడితపూజ చేసి దాన్ని గాయపరిచాడు. పిల్లి ఎలాగో తప్పించుకొని పారిపోయింది. ఆ తర్వాత అతడు శాంతుడై తల్లి పార్వతీదేవిని చూడడానికి వెళ్లాడు. తల్లి దేహమంతా గాయాలతో రక్తసిక్తమై ఉండడం చూసి బాలగణపతి ఆశ్చర్యపోయాడు. మాతృదేవిని అలాంటి స్థితిలో చూసి ఎంతో బాధపడి, ''కారణం ఏమిటి?'' అని తల్లిని అడిగాడు. ''నాయనా!

---

1. వంగ భాషలో 'కారణ' మనే పదానికి కారణం, మధువు అని రెండు అర్థాలు ఉన్నాయి. అందుచేత ఒక అర్థంలో ఆ పదాన్ని ప్రస్తావిస్తే, రెండో అర్థం చటుక్కున స్ఫురిస్తుంది; అంటే మధువు అనగానే జగత్కారణం స్ఫురిస్తుంది.

దీని కంతటికీ కారణం నువ్వే'' అని విచారంతో పలికింది దేవి. తల్లిపట్ల అపార భక్తి ప్రేమలున్న గణపతికి తల్లి మాటలు ఆశ్చర్యాన్ని, అంతకంటే ఎక్కువ దుఃఖాన్ని కలిగించాయి. కంట నీరుపెట్టుకొని ''అమ్మా! నేను నిన్నెప్పుడు కొట్టాను? లేదా తెలియక నేను చేసిన ఏదైనా దుశ్చర్య ఫలితంగా ఇతరులు నిన్నిలా అవమానించారేమో అంటే అలాంటి సంఘటన ఏదీ నాకు జ్ఞాపకం రావడం లేదే?'' అన్నాడు.

కుమారుడి పలుకులు విని జగన్మాత ఇలా అన్నది: ''నాయనా! ఈ రోజు నువ్వు ఏ ప్రాణినైనా హింసించావేమో కాస్త జ్ఞాపకం తెచ్చుకో.'' ''అవునమ్మా, ఇంతకు మునుపే ఒక పిల్లిని చావబాది వచ్చాను'' అన్నాడు గణపతి. పిల్లి సొంతదారుడు తన తల్లిని అలా గాయపరిచాడేమో అని తలచుకొని బాలగణపతి ఖిన్నుడయ్యాడు. బాలుడలా పశ్చాత్తప్తుడవడం చూసి, ప్రేమపూర్వకంగా అతణ్ణి హృదయానికి హత్తుకొని, అతణ్ణి ఊరడిస్తూ దేవి ఇలా అన్నది: ''అలా జరగలేదు, నా ఈ దేహాన్ని ఎవరూ గాయపరచలేదు. కాని పిల్లి ఆదిగాగల ఈ విశ్వంలోని సమస్త ప్రాణికోటిలో నెలకొన్నది నేను కదా! కాబట్టే నువ్వు పిల్లిని గాయపరచిన చిహ్నాలు నా శరీరం మీద కానవస్తున్నాయి. తెలియక నువ్వలా చేశావు కనుక విచారించవద్దు. కాని నేటి నుంచి ఈ సంగతిని ఎప్పుడూ మరిచిపోవద్దు. లోకంలోని స్త్రీలందరూ నా అంశలే, జీవులలోని పురుషులందరూ నీ పితృదేవుల అంశలే. శివశక్తులు తప్ప ఈ జగత్తులో వేరొకటి ఏదీ లేదు.'' తల్లి మాటలు బాలగణపతి హృదయంలో ప్రగాఢంగా నాటుకున్నాయి. కనుకనే యుక్తవయస్సులో ఉన్నప్పుడు 'ఏ స్త్రీని వివాహమాడినా తల్లినే వివాహం చేసుకొన్నట్లు అవుతుంది' అని భావించి బ్రహ్మచారిగానే ఉండిపోవడం జరిగింది. అంతేగాక ఈ జగత్తు యావత్తూ శివశక్త్యాత్మకమనే దృఢవిశ్వాసం పూని, జ్ఞానులందరిలో అగ్రగణ్యుడైనాడు.

పై కథను చెప్పిన తరువాత గణేశుడి జ్ఞాన మహత్త్వ సూచకమైన మరొక కథను గురుదేవులు మాకు చెప్పడం జరిగింది. ఒకానొక సమయంలో పార్వతీ

12. గణేశ కార్తికేయుల విశ్వ పరిభ్రమణ వృత్తాంతం

దేవి తను ధరించిన అమూల్యమైన రత్నహారాన్ని చూపిస్తూ కుమారులైన గణేశ కార్తికేయులతో ''పధ్నాలుగు లోకాలతో కూడిన ఈ బ్రహ్మాండం చుట్టూ తిరిగి మీ రిద్దరిలో ఎవరు ప్రథములుగా వస్తారో వారికి ఈ రత్నహారాన్ని బహూకరిస్తాను'' అన్నది. ఇంకేం, అన్నగారి బానపొట్టను, నెమ్మదిగా కదిలే ఎలుక వాహనాన్ని తలచుకొని ఒకింత పరిహాసపూర్వకంగా నవ్వుకుంటూ 'రత్నహారం నాకే దక్కుతుంది' అని నిశ్చయించుకొని, తన నెమలి వాహనం అధిరోహించి తక్షణమే కార్తికేయుడు

బయలుదేరాడు. అతడు వెళ్లిపోయిన చాలాసేపటికి నెమ్మదిగా లేచాడు గణేశుడు. లేచి తన జ్ఞాననేత్రంతో శివశక్త్యాత్మకమైన ఈ జగత్తు యావత్తూ తల్లితండ్రులైన శివపార్వతుల శరీరాలలో దర్శిస్తూ, వారికి ప్రణామాలు చేస్తూ వినమ్ర గమన భంగిమలో వారికి ప్రదక్షిణం చేసి, నిశ్చితమనస్కుడై తన ఆసనంలో కూర్చున్నాడు. ఇది జరిగిన చాలాసేపటికి కార్తికేయుడు తిరిగి వచ్చినప్పుడు, రత్నహారం గణేశుడికే చెందుతుందని నిర్దేశించి, వాత్సల్యపూరితురాలై ముద్దు బాలకుడి మెడలో అలంకరించింది తల్లి పార్వతీదేవి.

ఈ విధంగా స్త్రీలందరిపట్లా గణపతికున్న మాతృభావాన్ని ఉద్దేశించి గురుదేవులు ఇలా అన్నారు: ''స్త్రీ లందరిపట్లా నా భావం కూడా అదే సుమా! కనుకనే వివాహం చేసుకొన్న నా భార్యలో కూడా సాక్షాత్తూ జగజ్జననిని దర్శించ గలిగి అర్చించి ఆమె పాదాలకు ప్రణమిల్లాను.''

13. తాంత్రిక సాధన: శ్రీరామకృష్ణుల అనుపమానత

స్త్రీలందరి పట్లా అచంచలమైన మాతృభావపూర్ణ హృదయంలో వీర భావానికి చెందిన క్రియానుష్ఠానాలన్నిటినీ తాంత్రికశాస్త్ర నిర్దేశానుసారంగా తు.చ. తప్పకుండా ఏ కాలంలోనైనా ఏ సాధకుడైనా ఆచరించినట్లు మేం వినలేదు. ఈ వీరోచిత పద్ధతి ననుసరించి సాధకులందరూ ఈనాటి వరకూ తమ సాధనలకు ఒక 'శక్తి'ని గ్రహిస్తూనే ఉన్నారు. ఈ కారణంగానే శక్తిని గ్రహించకపోతే సాధనలో సిద్ధి కలుగదనో లేక జగజ్జనని కృపను పొందడం అసంభవం అనో ప్రగాఢ విశ్వాసం ఈ 'వీరాచార' సాధకులలో కలిగింది. ఇటువంటి తప్పుడు అభిప్రాయం ఉండడం చేతా, తమ తమ పాశవిక కుసంస్కారాలకు వశులై ఉండడం చేతా ఈ మార్గానికి చెందిన సాధకులు తరచూ పరకీయశక్తిని గైకొనడానికి కూడ వెనుకాడకున్నారు. లోకులు తంత్రశాస్త్రాల పట్ల అంత నిరసన చూపడానికి ఇదే కారణం.

14. ఆ అనుపమానత వెనుక వున్నది జగన్మాత సంకల్పమే!

జీవితంలో తాను ఏనాడూ కలలో సైతం స్త్రీని గురించి చింతించలేదని యుగావతారులైన శ్రీరామకృష్ణులు ఎన్నోసార్లు మాకు చెప్పి ఉన్నారు. కనుకనే జీవితాంతం మాతృభావపూర్ణులైన శ్రీరామకృష్ణుల ద్వారా తాంత్రిక వీరాచార సాధనల నన్నిటినీ అనుష్ఠింపజేయడం జగన్మాత విశేష సంకల్పం మూలంగానే జరిగిందని సుస్పష్టంగా తెలుస్తోంది.

ఏ సాధనలోనైనా సిద్ధిని గడించడానికి తమకు మూడు రోజుల కంటే ఎక్కువ సమయం పట్టలేదని గురుదేవులు చెబుతూండేవారు. ''ఏ సాధననైనా చేపట్టినప్పుడు, తత్ఫలితాన్ని తనకు ఇవ్వమని పరమ వ్యాకులతతో తల్లిని

యాచించడంతో మూడు రోజుల్లోనే సిద్ధి కలిగేది.'' శక్తి లేకున్నప్పటికీ వీరాచార సాధన లన్నిట్లోనూ అతి స్వల్పకాలంలో ఆ విధంగా శ్రీరామకృష్ణులు సాఫల్యం పొందడం ద్వారా స్పష్టంగా

15. శక్తి (స్త్రీ) సాహచర్యం చేసే శ్రీరామకృష్ణుల విజయంలోని అంతస్సూచన

బుజువయ్యే అంశం ఏమిటంటే, ''పంచ'మ'కారాలు'' లేదా 'స్త్రీ గ్రహణం' ఆయా సాధకులకు ఆవశ్యక అంశాలు కావు అనేది. ఆత్మనిగ్రహంలేని సాధకుడు తన నీచప్రవృత్తులకు వశవర్తుడై అలా చేస్తుంటాడు. ఒకవేళ సాధకుడు అలా చేయడానికి (అంటే స్త్రీ గ్రహణం లేదా పంచ 'మ'కార గ్రహణం) పూనుకొని పునః పునః చేసే సాధన ద్వారా క్రమ క్రమంగా అతడు తన పశుప్రవృత్తులను అతిక్రమించి దివ్యభావంలో సుప్రతిష్ఠితుడు కాగలడని తాంత్రిక శాస్త్రాలు అతడికి అభయ ప్రదానమిచ్చి, ఉపదేశించడం ఆ శాస్త్రాల పరమ కరుణను సూచిస్తున్నదేగాని, ఆ నిమ్న పద్ధతుల ఆవశ్యకతను వ్యక్తం చేయడం లేదు.

కాబట్టి రూపరసాది ఏ లౌకిక భోగ్యవస్తువులూ సాధారణ వ్యక్తులను ప్రలోభితులను గావించి పునఃపునః జన్మజరామృత్యువుతో కూడిన ఈ

16. తాంత్రిక సాధనల ఉద్దేశం

సంసార సాగరంలో త్రోసివేస్తుంటవో, ఏ భోగ్యవస్తువులు మనిషిని ఆత్మజ్ఞానం, భగవత్సాక్షాత్కారం పొందినివ్వక ఆటంకాలుగా నిలుస్తవో, మనస్సంయమ సహాయంతో, ధైర్యంతో పదేపదే అనుష్ఠింపబడుతూన్న సాధన ప్రయత్నంతో ఆ భోగ్యవస్తువులన్నీ నిజానికి భగవత్ప్రీతికారకాలే అని సాధకుడి మూలంగా గ్రహింపచేయడమే తాంత్రిక సాధన ఉద్దేశంగా చెప్పవచ్చు. అంతేగాక సాధకుల మనోసంయమశక్తినీ, అర్హతనూ అనుసరించే తంత్రశాస్త్రాలు 'పశుభావం, వీరభావం, 'దివ్యభావం' అని సాధనలను మూడు తరగతులుగా విభజించి తమ తమ అధికారం యోగ్యతానుసారం ఈ మూడింటిలో తమకు అనువైన సాధనామార్గాన్ని చేపట్టి, భగవంతుడి వైపు అగ్రేసరులు అవ్వాలని ఉపదేశిస్తున్నాయి. కాని కఠోరమైన మనోసంయమమే ఈ సాధనల కన్నిటికీ పునాది. ఆత్మ సంయమం ఉన్నప్పుడు మాత్రమే ఈ సాధనలకు ఉచిత ఫలితాన్ని పొందడం సాధ్యమనీ లేకుంటే ఏ ప్రయోజనమూ సిద్ధించదనే విషయాన్ని కాలక్రమంలో లోకులు మరచిపోయారు. తాంత్రిక సాధకులు గావించే నీచ క్రియల కన్నిటికీ తంత్రశాస్త్రమే కారణం అనే తప్పుడు అభిప్రాయానికి వచ్చి, ఆ తంత్రశాస్త్రాలను నిందించసాగారు. అలాంటప్పుడు ప్రతి స్త్రీనీ తమ కన్నతల్లితో సమానంగా భావించి, తంత్రశాస్త్రోక్త సాధనలన్నిట్లో శ్రీరామకృష్ణులు పరిపూర్ణ సిద్ధిని పొందడం ద్వారా రెండు ప్రయోజనాలు నెరవేరాయి. ఒకటి - యథార్థమైన సాధకులు తమ జీవిత లక్ష్యానికి చేరే సరైన

మార్గాన్ని పొందడం. రెండవది - తంత్రశాస్త్రాల ప్రామాణ్యం మరొక్కసారి ఋజువై సుప్రతిష్ఠితం కావడం; అంతేగాక అవి బోధించే సాధనలు మహోప కారకాలుగా ప్రసిద్ధమై మహిమాన్వితం కావడం.

17. స్త్రీ సాహచర్యం లేకనే శ్రీరామకృష్ణులు విజయవంతులవడంలోని మరొక కారణం

ఈ కాలంలో శ్రీరామకృష్ణులు మూడు నాలుగేళ్లపాటు ఇలా తంత్రోక్త రహస్య సాధనాలన్నిటినీ సాధించడం జరిగింది. కాని మొదటి నుంచి చివరి వరకు క్రమానుసారంగా వాటిని గురించి మాలో ఎవరికైనా, ఎప్పుడైనా వివరించారని మేం అనుకోం. అయినా సాధన మార్గంలో ప్రోత్సహించే నిమిత్తమై అనేక సందర్భాలలో కొన్ని కొన్ని విషయాలను గురించి ఆయన మాలో చాలా మందికి చెబుతూండేవారు. మాలో ఒకరిద్దరిచేత వారి వారి అవసరాలకు తగ్గట్లుగా ఆ సాధనల్లో కొన్నిటిని అనుష్ఠింప చేశారు. తాంత్రిక క్రియాకలాపాల నన్నిటినీ అనుష్ఠించి, ప్రత్యక్షంగా అసాధారణమైన అనుభూతుల నెన్నిటినో శ్రీరామకృష్ణులు పొంది ఉండకపోతే, తదనంతర కాలంలో తమ వద్దకు రానున్న విభిన్న మానసిక ప్రవృత్తులతో కూడిన భక్తుల మానసిక స్థితిగతులను అవగతం చేసుకొని, సాధనాపథంలో సులువుగా వారిని అగ్రగాములను చేయలేకపోయే వారనీ, కాబట్టే జగజ్జనని ఈ కాలంలో శ్రీరామకృష్ణులకు ఈ మార్గంతో పూర్తిగా పరిచయం చేయించిందనీ మనం స్పష్టంగా గ్రహించవచ్చు. శరణార్థులైన భక్తులను ఏ విధంగా, ఎన్ని రీతుల ఆయన సాధనలో సుప్రతిష్ఠితులను చేయించేవారో - దాన్ని గురించి మేం మరో చోట సూచనప్రాయంగా తెలియచేశాం.[1] దాన్ని చదివి నప్పుడు పాఠకులు పైన చెప్పిన దాన్లోని యుక్తియుక్తతను సులువుగా అవగాహన చేసుకోగలరు. కాబట్టి దాన్ని ఇక్కడ ప్రస్తావించ నవసరం లేదు.

18. తాంత్రిక సాధనా కాలంలో శ్రీరామకృష్ణుల అనుభవాలు - దర్శనాలు

పైన చెప్పబడిన రీతిలో తాంత్రిక సాధన క్రియాకలాప అనుష్ఠానాలను గురించే కాక ఆ కాలంలో తమకు కలిగిన దర్శనాల, అనుభవాల నెన్నిటినో గురించి కొన్ని సందర్భాలలో శ్రీరామకృష్ణులు మాతో ప్రస్తావించేవారు. వాటిలో కొన్నిటిని ఇక్కడ పాఠకుల కోసం తెలుపుతున్నాం.

19. నక్కల ఉచ్ఛిష్టాన్ని తినడం

తాంత్రిక సాధనలను అనుష్ఠిస్తూన్న కాలంలో తమ ప్రవృత్తిలో అసాంతం పరివర్తన కలిగిందని ఆయన చెప్పారు. జగన్మాత ఒక్కోసారి నక్కల రూపం ధరిస్తూంటుందని విని, అలాగే శునకం భైరవుడి వాహనమనీ తెలుసుకొని ఈ కాలంలో వాటి (నక్కల, కుక్కల)

---

1. III. 1,2

ఉచ్ఛిష్టాన్ని పవిత్రంగా భావించి స్వీకరించాలనీ, మనస్సులో ఎలాంటి సంకోచభావమూ కలిగేది కాదనీ శ్రీరామకృష్ణులు చెప్పేవారు.

20. జ్ఞానాగ్నిచే ఆవృతుడై ఉన్నట్లు దర్శించడం

తమ దేహాన్ని, మనస్సును, జీవితాన్ని - సర్వస్వాన్ని జగన్మాత పాదపద్మాల వద్ద ఆహుతిగా అర్పించి, తాను లోపలా, బయటా జ్ఞానాగ్ని చేత ఆవృతుడై ఉండడాన్ని ఆయన దర్శించడం జరిగింది.

21. కుండలినీ జాగృతం

కుండలినీశక్తి జాగృతమై, శిరస్సులోవున్న సహస్రారం వైపు పైకి పోవడం శ్రీరామకృష్ణులు ఈ కాలంలో గాంచారు. కుండలినీశక్తి పైకి పోతున్నప్పుడు మూలాధారం నుంచి సహస్రారం వరకు ఉన్న పద్మాలన్నీ ఊర్ధ్వముఖాలై పూర్తిగా వికసించసాగాయి. ఒకటి వెంట మరొకటిగా అవి అలా వికసించగానే విచిత్రమూ, అపూర్వమూ అయిన దివ్యానుభూతులు[1] వారికి కలుగసాగాయి. ఉదాహరణకు జ్యోతిర్మయుడైన దివ్యపురుషుడొకడు సుషుమ్నా మార్గం ద్వారా పైకి వెళుతూ తన నాలుకతో తాకి ఆ పద్మాలను వికసింపజేయడం ఆయన దర్శించారు.

22. బ్రహ్మయోనిని దర్శించడం

వివేకానందస్వామికి ఒకానొక సమయంలో ఒక విచిత్ర అనుభవం కలిగింది. ఆయన ధ్యానానికి కూర్చోగానే జ్యోతిర్మయమైన పెద్ద త్రికోణం ఒకటి ఆయన ముందు అగపడింది. అది సజీవంగా ఉన్నట్లు ఆయన భావించారు. ఒకనాడు ఆయన దక్షిణేశ్వరానికి వచ్చి ఈ సంఘటన గురించి శ్రీరామకృష్ణులకు చెప్పారు. అది విని శ్రీరామకృష్ణులు, "భేష్, మంచిది. నీకు బ్రహ్మయోని దర్శనం అయింది. బిల్వవృక్షం కింద సాధన చేస్తూన్నప్పుడు నేనూ అలాగే దాన్ని చూసేవాణ్ణి. అంతేకాక ప్రతి క్షణమూ అది అసంఖ్యాక బ్రహ్మాండాలను ప్రసవించడం కూడ అవలోకించేవాణ్ణి" అని చెప్పారు.

23. అనాహత ధ్వనిని ఆలకించడం

ఈ విశ్వబ్రహ్మాండంలో వినవచ్చే శబ్దాలన్నిటి సమష్టి స్వరూపానికే ప్రణవం (ఓంకారం) అని పేరు. ప్రతిక్షణం అవిరామంగా లోకం అంతటా తనంతటు తానే స్పందిస్తూంటుంది. కాబట్టి దాన్ని అనాహత ధ్వని అంటారు. శ్రీరామకృష్ణులు ఈ తాంత్రికసాధనా కాలంలో అవిరామంగా ప్రతిధ్వనిస్తూండే ఈ అనాహత ధ్వనిని విన్నారు. ఆ సమయంలో పశుపక్ష్యాదుల అరుపులను తాను అవగతం చేసుకోగలిగేవాడనని శ్రీరామకృష్ణులు చెప్పగా విన్నామని కొందరు చెబుతారు.

---

1. III.2

ఈ కాలంలోనే శ్రీరామకృష్ణులకు కలిగిన మరో దివ్యానుభూతి: స్త్రీ యోనిలో జగజ్జనని సాక్షాత్తూ అధిష్ఠితురాలై ఉండడం. ఈ కాలం చివరి

24. అష్టసిద్ధులు : వాటి నిరర్థకత్వం

భాగంలో అణిమాద్యష్టసిద్ధులు తమలో ప్రకటితం కావడం ఆయన అనుభూతికి వచ్చింది. మేనల్లుడైన హృదయ్ వాటిని ఉపయోగించమని ప్రేరేపించడంతో శ్రీరామకృష్ణులు ఒకరోజు జగన్మాత దరిచేరి ఈ విషయ ఔచిత్యం గురించి ఎరుకగోరారు. అప్పు డాయన కొక విచిత్ర దర్శనం కలిగింది - అణిమాది యోగసిద్ధులు వేశ్యల మలం మాదిరి హేయాతి హేయం. సర్వదా విసర్జనీయాలని తద్వారా ఆయన గ్రహించారు. ఆ దర్శనం అయినప్పటి నుంచి 'సిద్ధి' అనే మాట వినపడగానే తనలో 'రోత' జనించేదని వారనేవారు.

శ్రీరామకృష్ణులు అష్టసిద్ధులను పొందారని చెప్పుకొనే ఈ సందర్భంలో మరొక సంఘటన మాకు జ్ఞాపకం వస్తోంది. ఆయన ఒక రోజు వివేకానందులను

25. అష్టసిద్ధుల గురించి వివేకానందులతో శ్రీరామకృష్ణుల ముచ్చట

ఒంటరిగా పంచవటికి పిలుచుకొని వెళ్లి ఇలా అన్నారు: ''చూడు, సుప్రసిద్ధమైన అణిమాది అష్టసిద్ధులూ నా కైవసంలో ఉన్నాయి. కాని వాటిని వినియోగపరచకూడదని చాలాకాలం క్రితమే నేను నిశ్చయించుకొన్నాను. వాటి వినియోగ ఆవశ్యకతా నా కేమీ కనిపించడం లేదు. కాని మత ప్రచారం మొదలైన కార్యాల నెన్నిటినో నువ్వు చెయ్యవలసి ఉంది. కాబట్టి వాటినన్నిటినీ నీ కివ్వాలని సంకల్పించాను. ఇవిగో తీసుకో.'' అందుకు జవాబుగా వివేకానందులు, ''మహాశయా! భగవత్సాక్షాత్కారానికి వీటి తోడ్పాటు ఏమైనా ఉంటుందా?'' అని అడిగారు. తదుపరి గురుదేవుల జవాబు నుంచి - మతప్రచారాది కార్యాల్లో ఏదో కొంతమేరకు అవి తోడ్పాటునివ్వగలిగినా, భగవత్సాక్షాత్కార విషయంలో మాత్రం ఎలాంటి సహాయమూ అందించలేవని ఎరిగి, నిష్కర్షగా వాటిని స్వీకరించ నిరాకరించారు వివేకానందులు. తద్ద్వారా గురుదేవులు తన పట్ల ఎంతో ప్రసన్ను లయ్యారని స్వామీజీ మాతో చెప్పారు.

జగజ్జనని మోహినీశక్తిని దర్శించాలనే ఆకాంక్ష జనించడంతో శ్రీరామకృష్ణులకు ఆ సమయంలోనే ఒక అద్భుత దర్శనం కలిగింది. అపూర్వ

26. మహామాయ దర్శనం

సౌందర్యరాశి అయిన ఒక స్త్రీమూర్తి గంగానది జలాల నుంచి బయటకువచ్చి అభిజాత గమనభంగిమతో పంచవటికి రాసాగింది. ఆ స్త్రీమూర్తి నిండు గర్భవతి. కొన్ని క్షణాలలో, తన సమక్షంలోనే అందాల పాపను ప్రసవించి, మహాప్రేమతో ఆ పాపకు పాలిస్తూండడం ఆయన గాంచారు. మరుక్షణంలోనే ఆ స్త్రీమూర్తి మహాభయంకర క్రూర

రూపాన్ని దాల్చి, ఆ పసికూనను 'కస కస' నమిలి మ్రింగి, తదనంతరం మళ్ళీ గంగాజలాల్లో ప్రవేశించి, కనుమరుగవడం ఆయన చూశారు.

పైన వర్ణించిన దర్శనాలేకాక ఈ కాలంలో శ్రీరామకృష్ణులు రెండు చేతుల నుంచి పది చేతులు కలిగిన ఎన్ని రకాల దేవీమూర్తులను దర్శించారో లెక్కలేదు.

27. షోడశీ సౌందర్యం

పైగా ఈ మూర్తులలో కొన్ని వారికి ఎన్నో సాధనలను గురించి ఆదేశం కూడా ఇచ్చాయి. ఇలా ఈ దేవీమూర్తులన్నీ కూడ మహాసౌందర్యవతులై ఉన్నప్పటికీ వాటిలో ఏవీ శ్రీరాజరాజేశ్వరి లేదా షోడశీదేవి సౌందర్యానికి సాటిరాలేవనే సంగతి గురుదేవుడు చెప్పడం విన్నాం. ''షోడశీ లేదా త్రిపురసుందరీదేవి అంగాంగాల నుంచి రూపసౌందర్యం కరిగి ప్రవహించి నలుదిక్కులనూ కాంతిమంతం చేయడం దర్శించాను'' అని ఆయన చెప్పేవారు. అంతేగాక భైరవాది దేవతామూర్తుల నెన్నిటినో ఈ సమయంలో వారు దర్శించడం సంభవించింది.

ఈ రకంగా తాంత్రిక సాధనలను ఆచరిస్తున్నప్పుడు ప్రతిరోజూ శ్రీరామకృష్ణులకు ఎన్ని అపూర్వ దివ్యదర్శనాలు, దివ్యానుభవాలు కలిగినవంటే, వాటి నన్నిటినీ యథాతథంగా వర్ణించడం మానవశక్తికి అతీతం. కాబట్టి ఆ ప్రయత్నంలో కాలాన్ని వెచ్చించడం వృథా ప్రయాస.

తాంత్రిక సాధనలను అనుష్ఠించినప్పటి నుంచి శ్రీరామకృష్ణుల సుషుమ్నా ద్వారం పూర్తిగా తెరుచుకోవడమేకాక, వారి నైజం శాశ్వతంగా బాలుడి

28. తాంత్రిక సాధనల ఫలితాలు

మాదిరి మారిపోయిందని మేం ప్రత్యక్షంగా ఆయన ముఖతా విన్నాం. ఈ తాంత్రిక సాధనాకాలపు చివరిఘట్టం నుంచి ఎంత ప్రయత్నించినా ఒంటి మీద కట్టుబట్టనూ, యజ్ఞోపవీతాన్ని ఉంచుకోలేకపోయేవారు. ఎప్పుడు ఎక్కడ అవి జారి కింద పడిపోయేవో ఆయనకు ఎరుకే ఉండేదికాదు. మానసం జగన్మాత పాదపద్మాల మీద సర్వదా లగ్నమై ఉండడమే ఆయన దేహస్మృతి లేమికి కారణం అని వేరేగా చెప్పనక్కర్లేదు. ఇతర పరమహంసల (నగ్న సన్న్యాసి వర్గం) మాదిరి దిగంబరావస్థ అభ్యాస పూర్వకంగా తమకు కలుగలేదనీ, అతి స్వాభావికంగా క్రమంగా దేహస్మృతిని కోల్పోవడంతో కలిగిందనీ వారి ముఖతా మేం ఎన్నోసార్లు విన్నాం.

అంతేగాక ఆ తాంత్రిక సాధనల నన్నిటినీ అలా పూర్తిచేశాక అన్ని పదార్థాలూ ఆత్మ యొక్క అభివ్యక్తాలే అనే జ్ఞానం ఎంత సుస్థిరమైన దంటే బాల్యం నుంచి తాము ఏ వస్తువులను తుచ్ఛమని, హేయాతిహేయాలని పరిగణించేవారో వాటినే ఇప్పుడు అతి పవిత్రతమ వస్తువులతో సమంగా ఎంచసాగారు.

"తులసీదళమూ, మునగ ఆకూ - రెండూ సమానంగా, పవిత్రంగానే కనబడేవి" అంటూ చెప్పేవారు.

29. తాంత్రోక్త సాధన కాలంలో శ్రీరామకృష్ణుల మేనిఛాయ

అప్పటి నుంచి కొన్ని ఏళ్లవరకు శ్రీరామకృష్ణుల మేనిచ్ఛాయ సదా సర్వత్రా సర్వుల దృష్టినీ ఆకర్షించేటంత సముజ్జ్వలంగా ప్రకాశించసాగింది. దేహాభిమాన రహితులైన ఆయన మనస్సు కిది ఎంత చీకాకు కలిగించే దంటే ఆ దివ్యకాంతిని తొలగించుకోవటం కోసం జగన్మాతను వేడుకొంటూ "అమ్మా, ఈ బాహ్యసౌందర్యం నాకు ఏమాత్రమూ అవసరం లేదు. దీన్ని వెనక్కు తీసుకొని ఆధ్యాత్మిక అంతః సౌందర్యాన్ని ప్రసాదించు" అని ప్రార్థించేవారు. వారి ఈ ప్రార్థన తదనంతర కాలంలో ఎలా ఈడేరిందనే ఉదంతం మేం మరోచోట[1] తెలిపాం.

30. భైరవీ బ్రాహ్మణి యోగమాయ అంశ

భైరవీ బ్రాహ్మణి తాంత్రిక సాధనలను అనుష్ఠించడంలో శ్రీరామకృష్ణులకు ఏ విధంగా సహాయం చేసిందో, అలాగే శ్రీరామకృష్ణులు తదనంతరకాలంలో ఆమె ఆధ్యాత్మిక జీవితంలో పరిపూర్ణురాలు కావడానికి విశేషంగా సహాయం చేశారు. ఆయన అలా తోడ్పడకుంటే బ్రాహ్మణి దివ్యభావంలో ప్రతిష్ఠితురాలు కాలేకపోయేది. దీన్ని గురించి మరోచోట[2] ఒకింత వివరించాం. భైరవీ బ్రాహ్మణి పేరు యోగేశ్వరి. ఆమె యోగమాయ అంశ అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు.

తాంత్రిక సాధనల ద్వారా దివ్యశక్తులను పొందిన శ్రీరామకృష్ణులు భవిష్యత్తులో అనేక సాధకులు ఆధ్యాత్మిక సహాయం నిమిత్తం తమ వద్దకు వస్తారనే విషయాన్ని జగన్మాత కృపతో తెలుసుకోగలిగారు. తన భక్తుడైన మథుర్ బాబుకూ, మేనల్లుడైన హృదయ్‌కూ ఆయన ఆ సంగతి తెలిపారు. అది విన్న మథుర్, "భేష్, బాబా[3] మేమంతా కలిసి మీతో పాటు ఆనందించగలం" అన్నాడు.

---

1. III.7,8.
2. III.8.22
3. 'బాబా' అంటే తండ్రి అని అర్థం. ఉత్తర భారతదేశంలో సాధుసన్న్యాసులను 'బాబా' అనో లేదో 'మహరాజ్' అనో పేర్కొనడం పరిపాటి. మథుర్ ఎప్పుడూ శ్రీరామకృష్ణులను 'బాబా' అనే సంబోధించేవాడు.

12. జటాధారి ఆగమనం - శ్రీరామకృష్ణుల వాత్సల్యభావ సాధన

దేవీభక్తురాలైన రాణీ రాస్మణి 1861వ సం॥లో కాలధర్మం చెందింది.

1. మథురనాథ్ అనుభవం - నడవడిక

తదనంతరం ఆ సంవత్సరాంతంలో శ్రీ యోగేశ్వరి భైరవీ బ్రాహ్మణి దక్షిణేశ్వర కాళికాలయానికి అరుదెంచింది. అప్పటి నుంచి 1863వ సంవత్సరాంతం దాకా శ్రీరామకృష్ణుల తాంత్రిక సాధనలు కొనసాగాయి. రాణి మరణించినప్పటి నుంచి శ్రీరామకృష్ణులను సేవించే మహ ద్భాగ్యం పొంది మథుర్ కృతార్థుడైనాడు. ఇంతకు క్రితం ఎన్నోసార్లు శ్రీరామ కృష్ణుల అపూర్వ భగవదనురాగం, మనోసంయమం, త్యాగ వైరాగ్యాలను పరీ క్షించి దృఢ నిశ్చితుడయ్యాడు. అయినా ఈ ఆధ్యాత్మికతతో పాటు ఆయనలో అప్పుడప్పుడు కించిత్తు చిత్తచాంచల్యం కూడా కలసివున్నదో లేదో అనే విషయమై మథుర్ ఒక స్థిరనిశ్చయానికి రాలేకపోయాడు. కాని శ్రీరామకృష్ణులు తాంత్రిక సాధనలు చేయడం ప్రారంభించిన నాటి నుంచి ఆతడి సంశయం పూర్తిగా నివృత్తి అయింది. పైగా అలౌకిక దివ్యశక్తులు ఆయనలో ప్రకటితమవడం ప్రత్యక్షంగా అనుభవానికి రావడంతో తన ఇష్టదైవం జగన్మాత తనపట్ల ప్రసన్నురాలై శ్రీరామ కృష్ణ రూపాన్ని దాల్చి తన సేవలను స్వీకరిస్తూన్నదనీ, సర్వదా తన వెన్నంటే తిరుగుతూ అన్ని విషయాల్లోనూ తనను రక్షించడమేగాక జమీపైని తన అజమాయిషీ చెక్కుచెదరనీయలేదనీ, రోజురోజుకూ తన మర్యాదమన్ననలు పెంపొందిస్తూన్నదనీ అచంచల విశ్వాసం మథురనాథ్‌లో ఈ కాలంలో ఏర్ప డింది. ఎందుకంటే ఈ రోజుల్లోనే అతడు తలపెట్టిన కార్యాలన్నీ సఫలం కావడంతో శ్రీరామకృష్ణుల కృపారూపంతో భగవత్సహాయం తనకు లభిస్తూన్న దని అతడు తలచసాగాడు. కాబట్టే ఆయన సాధనలకు ఆవశ్యకమైన సరంజామా

నంతా సమకూర్చడం మొదలుగా వారి అభిప్రాయానుసారం భగవత్సేవలకు, తదితర పుణ్యకార్యాల నిమిత్తం మథుర్ ఈ కాలఘట్టంలో ఎంతో ధనాన్ని ఖర్చు చేయడంలో ఎంత ఏసీ లేదు.

తాంత్రిక సాధనల ద్వారా శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక శక్తి అభివ్యక్తం రోజు రోజుకూ ఎంత అధికం కాసాగిందో ఆయన పవిత్ర పాదాలను శరణుజొచ్చిన మథుర్‌బాబుకు అన్ని విషయాల్లోను ఉత్సాహం, సాహసం, బలం అంతే అధికరించసాగాయి. భగవంతుడి పాదపద్మాలను శరణుజొచ్చి, ఆయనలో పరిపూర్ణ విశ్వాసాన్ని నిలిపి, భగవత్కృపను పొందిన భక్తుడు తన హృదయంలో ఎలాంటి అపూర్వ ఉత్సుకతను, శక్తిని అనుభవిస్తాడో మథుర్‌కీ అలాంటి అనుభూతే జనించింది. అయినా మథురనాథ్ రాజసిక భక్తి కేవలం శ్రీరామకృష్ణులను సేవించడంతోను, పలు పుణ్యకార్యాలు చేయడంతోనే సంతృప్తి పొంది ఆగిపోయింది. కాని ఆధ్యాత్మిక మార్గంలో ముందంజ వేసి నిగూఢ భావరహస్యాలను ప్రత్యక్షం చేసుకోవడానికి ప్రయత్నించలేదు. భగవద్దర్శనార్థం మథుర్ ప్రయత్నించకపోయినప్పటికీ శ్రీరామకృష్ణులే తన బలం, బుద్ధి, ఆశ్రయం, తన ఇహకాలం, పరకాలం, తన ప్రాపంచికోన్నతి, తన అధికార గౌరవాలకి మూలకారణం - ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీరామకృష్ణులే తన సర్వస్వం - అన్న ప్రగాఢ విశ్వాసం మథుర్ హృదయంలో హత్తుకుపోయింది.

మథురనాథ్ ఈ కాలంలో చేపట్టిన కార్యాలను పరికిస్తే శ్రీరామకృష్ణుల కృపాలాభాన్ని గడించి స్వకీయ ప్రాపంచిక వ్యవహారాలలో తాను సురక్షితుడననే సుదృఢ నమ్మకం అతడిలో కలగటం ఋజువవుతుంది.

2. మథుర్ 'అన్న మేరు' వ్రతానుష్ఠానం

ఈ కాలఘట్టంలో అతడు ఎంతో ధనాన్ని వెచ్చించి 'అన్న మేరు' అనే వ్రతాన్ని అనుష్ఠించాడనే సంగతి 'రాణీ రాస్మణి జీవిత చరిత్ర' అనే పుస్తకం ద్వారా మనకు తెలుస్తోంది. ఈ వ్రతం 1864వ సం॥లో దక్షిణేశ్వరంలో జరిగింది. ఈ వ్రతకాలంలో సమృద్ధిగా బంగారం, వెండితో సహా వేయి మణుగుల బియ్యం, వేయి మణుగుల నువ్వులు బ్రాహ్మణులకు, పండితులకు దానంగా ఇవ్వబడినట్లు హృదయ్ తెలిపాడు. వ్రతోత్సవాలలో సంకీర్తన చేయడానికి 'సహచారి' అనే సుప్రసిద్ధురాలైన గాయని, చండీ కీర్తనలను ఆలపించడానికి 'రాజనారాయణ్' అనే గాయకుడు నియుక్తులైనారు. వీటితోపాటు యాత్రాభినయాలు ఏర్పాటు చేయబడి దక్షిణేశ్వర ఆలయ ప్రాంగణం కొంతకాలం వరకు 'ఆనందసాగరం'గా మారిపోయింది. ఆ గాయకుల భజన కీర్తనలను ఆలకిస్తూ పదే పదే భావసమాధిమగ్నులవుతూన్న శ్రీరామకృష్ణులను చూసి, వారు అనుభవిస్తూన్న ఆనందంలోని తారతమ్యాన్నిబట్టి ఆయా గాయకుల గానప్రతిభను

బేరీజు వేసుకొని తదనుగుణంగా వారికి అతివిలువైన శాలువలు, పట్టువస్త్రాలు, వందలాది రూపాయలు మథుర్ బహూకరించాడని హృదయ్ చెప్పగా విన్నాం.

వేదాంతంలో నిష్ణాతుడైన పద్మలోచన్ ఆ రోజుల్లో బర్ద్వాన్ మహారాజు ఆస్థాన ప్రధాన పండితుడిగా ఉండేవాడు. ఆతడి పాండిత్య పటిమ, నమ్రత, తదితర సుగుణాల గురించి విని, మథుర్ 'అన్నమేరు' వ్రతం చేయడానికి కాస్త ముందుగా, శ్రీరామకృష్ణులు పద్మలోచన్‌ను చూడడానికి స్వయంగా వెళ్లడం జరిగింది. వ్రతానుష్ఠాన కాలంలో ఏర్పాటు చేయబడిన పండిత సభకు పద్మలోచన్‌ను ఆహ్వానించి ఆయనకు కానుకలు సమర్పించాలనే గొప్ప ఆకాంక్ష మథుర్‌లో కలిగిందని శ్రీరామకృష్ణులే మాతో చెప్పారు. శ్రీరామకృష్ణుల పట్ల ఆ పండితుడికి అపార భక్తిశ్రద్ధలుండడం ఎరిగి హృదయరామ్ ద్వారా ఆయనకు మథుర్ ఆహ్వానం పంపించాడు. కాని కారణాంతరాలవల్ల అప్పుడు పద్మలోచన్ రాలేకపోయాడు. పద్మలోచన్ పండితుడి వృత్తాంతం మేం మరొకచోట[1] సవిస్తరంగా తెలిపాము.

3. వేదాంత పండితుడు పద్మలోచన్‌ను శ్రీరామకృష్ణులు కలుసుకోవడం

తాంత్రిక సాధనలు పూర్తిచేసిన పిమ్మట శ్రీరామకృష్ణులు వైష్ణవ మతానికి చెందిన సాధనల పట్ల ఆకర్షితులైనారు. విచారించి పరికిస్తే అలా జరగడానికి స్వాభావికమైన కొన్ని కారణాలు మనకు కనిపిస్తాయి. మొదటి కారణం: శ్రద్ధాళువైన భైరవీ బ్రాహ్మణి వైష్ణవ శాస్త్రాలలో నిర్దేశించబడిన పంచభావాలతో కూడిన సాధనానుష్ఠానాలలో నిష్ణాతురాలు. అంతేగాక ఆ భావాల నన్నిటినీ ఒక్కొక్కటిగా గ్రహించి, తదేకచిత్తంతో వాటి సాధనల్లో చాలాకాలం గడిపింది. నందరాణి అయిన యశోదాదేవి వాత్సల్యభావంతో తన్మయురాలై బాలగోపాల జ్ఞానంతో శ్రీరామకృష్ణుల చేత వివిధ ఆహార పదార్థాలను తినిపిస్తూండేదనే సంగతి ఇంతక్రితమే ప్రస్తావించాం. కాబట్టి వైష్ణవీయ సాధనల పట్ల శ్రీరామకృష్ణులను ఆమె ప్రోత్సహించడంలో ఆస్కారం లేకపోలేదు. రెండవ కారణం: వైష్ణవ కుటుంబంలో జన్మించిన శ్రీరామకృష్ణులకు వైష్ణవీయ సాధనలపట్ల సహజంగానే ప్రీతి ఉంటుంది. పైగా కామార్పుకూర్ ప్రాంతాల్లో వైష్ణవీయ సాధనలు బహుళ ప్రచారంలో ఉండడం వల్ల, వాటిపట్ల చిన్ననాటి నుంచే ఆయనకు పూజ్యభావం కలిగివుండే గొప్ప అవకాశం ఉన్నది. మూడవది, అన్నిటికంటే ముఖ్యమైనది: జీవితాంతం శ్రీరామకృష్ణులలో స్త్రీ-పురుషుల ఇద్దరి నైజాలూ అపూర్వంగా

4. శ్రీరామకృష్ణుల వైష్ణవీయ సాధనలకు కారణాలు

---

1. చూడు III-2

మిళితమై ఉండటం కనబడుతుంది. వీటిలోని ఒకదాని ప్రభావంతో సింహ విక్రముడై, నిర్భీకుడై ప్రతి విషయపు అనుపానులూ అంతుబట్టే వరకూ పట్టు వీడనివాడై, మూర్తీభవించిన పురుషత్వంతో వెలుగొందేవారు. ఇక స్త్రీ స్వభావంతో ప్రభావితులైనప్పుడు రమణీమణులకు సహజమైన కోమలమూ, అయినప్పటికీ తీక్ష్ణమూ అయిన నైజం కలిగి, ప్రపంచంలో ప్రతివస్తువును, వ్యక్తిని తమ హృదయం ద్వారా గాంచుతూ, బేరీజువేస్తూ ఉండడం కానవచ్చేది. అలాగే ఈ స్త్రీ నైజ ప్రభావంతో కొన్ని విషయాల పట్ల ప్రగాఢ మమకారం, మరి కొన్నిటిపట్ల తద్విపరీతభావం సహజంగానే వారిలో కనపడేది. కనుకనే తమ హృదయం ప్రతిస్పందించినప్పుడు అంతులేని కష్టాలను కూడా అలవోకగా సహించగలిగినా, హృదయం నిర్లిప్తమైనప్పుడు సామాన్య మానవుడి మాదిరి శ్రీరామకృష్ణులు ప్రవర్తించలేకపోయేవారు.

5. వాత్సల్య మధుర భావ సాధనలప్పుడు శ్రీరామకృష్ణులలో స్త్రీ స్వభావాలు ఉదయించడం

ఆధ్యాత్మిక సాధనలను ప్రారంభించిన నాటి నుంచి మొదటి నాలుగేళ్ల కాలంలో శ్రీరామకృష్ణులు వైష్ణవ మార్గానికి చెందిన శాంతభావ సాధనను, దాస్యభావ సాధనను అనుష్ఠించడం జరిగింది. అంతేగాక ఒక్కొక్కప్పుడు శ్రీకృష్ణుడి సఖులైన సుదాముడు మొదలైన గోపబాలకుల మాదిరి సఖ్యభావాన్నీ సాధన చేశారు. ఈ అన్నిట్లోనూ ఆయన సిద్ధిని గాంచారు. శ్రీరామచంద్రుణ్ణే తనకు ప్రాణసముడిగా ఎంచి, సేవించిన ఆంజనేయ స్వామిని తన ఆదర్శంగా తీసుకుని, కొంతకాలం ఆయన ఈ దాస్యభక్తి మార్గాన్ని సాధించడం, పంచవటిలో ఆయనకు సీతాదేవి దర్శనం కావడం - ఈ విషయాలు ఇంతకు మునుపే చెప్పుకున్నాం. కనుక ప్రస్తుతం శ్రీరామకృష్ణులు వైష్ణవ శాస్త్రాల్లో ప్రధాన సాధనలుగా పరిగణింపబడే వాత్సల్యభావం, మధురభావం - ఈ రెండు సాధనలను చేయడానికి ఉపక్రమించారు. స్త్రీ నైజం అధికంగా ప్రకటితమవుతున్న ఈ కాలంలో ఆయన తన నొక జగన్మాతృ చెలికత్తెగా భావించుకొని చామరంతో దేవికి వీస్తూండేవారు. దుర్గాపూజ సందర్భంలో మధురుని కలకత్తా భవంతికి వెళ్లి, స్త్రీ వేషభూషణాదులను ధరించి, ఇంట్లోని స్త్రీ జనంతో కలిసిమెలిసి దుర్గాదేవికి ప్రణామాదులు చేసేవారు. ఒక్కోసారి వారిలో ఈ స్త్రీ నైజం ఎంత అధికరించేదంటే తమ కొక పురుష దేహం ఉన్నదనే సంగతే మరిచిపోతూండేవారు.[1] మేం దక్షిణేశ్వరానికి రాకపోకలు చేస్తూన్న ఆ కాలంలోనూ ఆయనలో అప్పుడప్పుడు ఈ స్త్రీ స్వభావం అభివ్యక్తం కావడం

---

1. చూడు III.7

చూశాం. కాని అప్పుడది గతంలో మాదిరి దీర్ఘకాలికం కాదు. అలా ఉండాల్సిన ఆవశ్యకత కూడా లేదప్పుడు. కారణం: స్త్రీ - పురుషుల స్వభావాలకు చెందిన భావాలు ఎన్ని ఉన్నాయో ఆయా భావాలనన్నిటినీ ఆయన సాధించడమే! జగజ్జనని కృపాకటాక్షం వల్ల ఇచ్ఛామాత్రంతోనే ఆయా భావాలన్నిటిలోను, వాటి కతీతమైన అద్వైతభావంలోను నెలకొని ఉండడం ఆయనకప్పుడు అతి సహజమై పోయింది. అంతేగాక తన వద్దకు వచ్చిన ప్రతీ సాధకుడి ఆధ్యాత్మిక పురోభివృద్ధి నిమిత్తం ఆ భావాలలో ఏ ఒక్కదాన్నైనా ఇష్టం వచ్చినంతకాలం నెలకొని ఉండే స్థితికి చేరారు.

6. శ్రీరామకృష్ణుల మనోనిర్మాణం

సాధన కాలంలో శ్రీరామకృష్ణుల మహిమాతిశయాన్ని కచ్చితంగా అవగతం చేసుకోవాలంటే జన్మతః ఆయన మనస్సు ఏ అసాధారణ పదార్థంతో రూపొందినదో, దైనందిన అనుభవాలపట్ల ఆయన ఎలా ప్రతిస్పందించేవారో, ఆయనలో చెలరేగిన ఆధ్యాత్మిక ఝంఝామారుతం గత ఎనిదేళ్ల కాలంలో కొనితెచ్చిన పరిణామాల నైజమేమిటో - వీటన్నిటినీ పరిగణలోకి తీసుకోవాలి. ఆయన 1855లో దక్షిణేశ్వర కాళికాలయానికి వచ్చేదాకా, ఆ తదుపరి కొంతకాలం కూడా తన తండ్రి తాతల మాదిరి తానూ సద్గృహస్థుడిగానే జీవిస్తాననే నమ్ముతూండే వాడినని స్వయంగా వారినోటే మేం విన్నాం. పుట్టిన నాటి నుంచి అహంభావరహితు డవడంతో, ఏ రీతిలోనూ తాను ప్రపంచంలో ఇతరుల కంటే అధికుడననీ లేదా ఇతరులలో కంటే తనలో విశిష్ట గుణాలు ఉన్నవనే భావన ఆయనలో ఏనాడూ పొడసూపలేదు. కాని కార్యక్షేత్రంలో కాలిడిన నాటి నుంచి అడుగడుగునా ఆయన అసాధారణ వైశిష్ట్యం ప్రకటితం కాసాగింది. ఏదో ఒక దైవీశక్తి అనుక్షణం వారి ననుగమిస్తూ లోకంలోని రూప రసాది ప్రతీ వస్తువు యొక్క అనిత్యత్వాన్ని, నిరర్థకత్వాన్ని ఉజ్జ్వల కాంతితో కళ్లకు కట్టినట్లు వారికి కనబరుస్తూ, సర్వదా ఆయనను తద్వ్యతిరేక మార్గంలో - అంటే భగవన్మార్గంలో నడపసాగింది. నిస్స్వార్థులై కేవలం సత్యాన్ని మాత్రమే అన్వేషిస్తూన్న శ్రీరామకృష్ణులు కూడా ఆ దైవనిర్దేశానుసారం నడవడాన్ని అతిత్వరలోనే అలవరచుకొన్నారు. ప్రాపంచిక భోగ్య వస్తుసముదాయాన్ని పొందాలనే ఆకాంక్ష కించిత్తు అయినా ఆయనలో కలిగివుంటే ఆయన అలా ప్రవచించడం అసంభవం.

జీవితాంతం ప్రతీ విషయం పట్లా ఆయన ప్రవర్తించిన తీరును జ్ఞాపకం చేసుకొంటే పై అంశం సాధకుడికి స్పష్టంగా తెలియవస్తుంది. ఈ లోకంలో ప్రాబల్యంలోని చదువుల ఉద్దేశం, 'బియ్యం, అరటికాయలను మూట కట్టుకోవడం', అంటే ధన సంపాదనకు మాత్రమే అని గ్రహించి ఆయన ఆ విద్యను

విరమించుకోవడం జరిగింది. కుటుంబ పోషణార్థం పూజారి పదవిని స్వీకరించారు.

7. శ్రీరామకృష్ణులలో గత సంస్కారాలు అసలు లేకపోవడం

భగవదర్శనకు మరో ఉన్నతోద్దేశం ఉన్నదని గుర్తించి భగవత్సాక్షాత్కారం నిమిత్తం ఉన్మత్తులైపోయారు. పరిపూర్ణ ఇంద్రియ నిగ్రహం మూలంగానే భగవత్సాక్షాత్కారం సాధ్యం అని గ్రహించి వివాహం చేసుకొన్నప్పటికీ, మనోవాక్కాయాలతో భార్యతో ఏలాటి సంపర్కమూ పెట్టుకోలేదు. సంచయం చేసే వ్యక్తి భగవంతుడి మీద ఏనాడూ పూర్తిగా నమ్మకం కలిగివుండలేదని గ్రహించి, ధన కనకాల మాట అటుంచి, అతి సామాన్య వస్తువులను సైతం కూడగట్టుకోవాలనే భావనను మనస్సు నుంచి పూర్తిగా తొలగించి వేశారు. శ్రీరామకృష్ణుల జీవితంలో ఇలాంటి ఎన్నో దృష్టాంతాలను చూడవచ్చు. ఈ దృష్టాంతాల నన్నిటిని పర్యాలోచించి చూస్తే ఇతర సామాన్యులను మోహగ్రస్తులను గావించే సంస్కార బంధనాలు చిన్ననాటి నుంచి వీరిమీద ఎంత మాత్రమూ ప్రభావం చూపలేదని తేటతెల్లమవుతుంది. భావాలను అవగాహన చేసుకోవడంలోను, వాటిని ఆచరించడంలోను ఆయనకున్న శక్తి ఎంత సుస్థిరమంటే మనస్సులోని పూర్వసంస్కారాలు తలెత్తి వారిని లక్ష్యభ్రష్టులను చేయలేకపోయేవి.

అంతేగాక శ్రీరామకృష్ణులు చిన్ననాటి నుంచి శ్రుతిధర సంపన్నులు; ఏకసంథాగ్రాహి; విన్నదాన్ని జీవితాంతం జ్ఞప్తిలో ఉంచుకోగలిగిన అద్భుత ప్రజ్ఞాశాలి.

8. శ్రీరామకృష్ణుల సద్గుణసంపత్తి

బాల్యంలో రామాయణ, మహాభారత కథలూ, భక్తి గీతాలు, యాత్రలలోని పాటలు - సంభాషణలు ఒకే ఒక్కసారి ఆలకించగానే, స్నేహితులతో కూడి కామార్పుకూర్ పొలాలలో, పచ్చిక బయళ్లలో వాటి నన్నిటిని ఆయన మళ్లీ అభినయించేవారన్నది పాఠకులకు విదితమే. కాబట్టి మనకు స్పష్టమవుతున్న విషయం: యావజ్జీవితం గొప్ప ప్రయత్నం మీదట కూడ ఏ సద్గుణాలను సముపార్జించడం సామాన్య సాధకులకు దాదాపు అసాధ్యమో అటువంటి అత్యద్భుత జ్ఞాపకశక్తి, అనన్య సత్యనిష్ఠ, తాము అవగతం చేసుకొన్న భావాలను తక్షణమే ఆచరణ రూపంలో పెట్టడం - ఇటువంటి దైవీసంపత్తిని చేజిక్కించుకొని దాని ఆధారంగా సాధనారాజ్యంలో అగ్రేసరులయ్యారు శ్రీరామకృష్ణులు. కాబట్టి అతిస్వల్ప వ్యవధిలోనే సాధనల పూర్ణఫలితాన్ని ఆయన పొందడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. సాధన కాలంలో కఠోర సాధనలలో కూడా కేవలం మూడు రోజుల్లోనే సిద్ధిని పొందానని ఆయన ముఖతా ఎన్నోసార్లు మేం విని దిగ్భ్రాంతులైనాం. అసాధారణమైన వారి మానసిక నిర్మాణమే ఇందుకు కారణం అనే యథార్థాన్ని మేం ఆ కాలంలో అణుమాత్రంగానైనా అవగాహన చేసుకోలేకపోయాం.

శ్రీరామకృష్ణుల జీవితంలోని కొన్ని సంఘటనలను ప్రస్తావించినప్పుడు పాఠకుడు పైన చెప్పిన మా కథనాన్ని అవగాహన చేసుకోగలడు. సాధన ఆరంభ కాలంలో నిత్యానిత్య వస్తువిచారం చేస్తూ, 'రూపాయి-మన్ను, మన్ను-రూపాయి' అంటూ మట్టిముద్దలతో సహా కొన్ని రూపాయలను గంగానదిలో పారవేశారు. వాటితో పాటు ఏ ధనాసక్తి మానవ హృదయాంతరాళాల వరకు తన ప్రభావాన్ని పరివ్యాప్తం చేస్తూంటుందో ఆ ఆసక్తి వారి మనస్సులో నుంచి కూకటివేళ్లతో సహా పెకలింపబడి తక్షణం గంగానదిలో విసర్జించబడింది.

9. శ్రీరామకృష్ణుల అసాధారణ మనో నిర్మాణానికి కొన్ని దృష్టాంతాలు

సామాన్యజనం ఏ మురికి ప్రదేశాలకు వెళ్లివచ్చాక స్నానాదులను చేయకుండా తమను శుచిమంతులుగా భావించుకోరో, అటువంటి ప్రదేశాలను శ్రీరామకృష్ణులు స్వహస్తాలతో శుభ్రపరిచారు. తక్షణమే ఆయన మనస్సు జన్మాదిగా విజృంభించే జాత్యహంకారాన్ని పరిత్యజించింది; సమాజంలో అస్పృశ్యులుగా పరిగణించబడే వ్యక్తులకంటే తాను ఏ రీతిలోనూ అధికుణ్ణి కాదనే భావం శాశ్వతంగా వారి మనస్సులో సుదృఢమైంది. తాను జగన్మాత బిడ్డను. 'స్త్రియః సమస్తాః సకలా జగత్సు' - ప్రపంచంలోని స్త్రీ లందరూ జగజ్జనని అంశలే అని విశ్వసించిన నాటి నుంచి ఇక ఏ స్త్రీనైనా భోగ్యవస్తువుగా భావించి దాంపత్య సుఖాన్ని అనుభవించాలనే ఊహ కూడా వారి మనస్సులో మటుమాయమైంది. ఇటువంటి దృష్టాంతాలను పర్యాలోచించినప్పుడు అనన్య సాధారణమైన ధారణాశక్తి ఆచరణాత్మకత లేకుంటే వారికి ఆ విధంగా సాధనాఫలాలు లభించడం ఏనాటికీ అసాధ్యం అనే సంగతి స్పష్టమౌతోంది. శ్రీరామకృష్ణుల జీవితంలోని ఈ సంఘటనలను విని మనం విస్మయులమవుతాం. లేదా వాటిని నమ్మలేకపోతాం. అందుకు కారణం: మనం అంతర అవలోకనం అప్పుడు చేస్తే మనకు కానవచ్చేది ఏమంటే - ఆయన మాదిరి, మనమూ మట్టితో సహా రూపాయలను వెయ్యి మార్లు అలా నీళ్లలో పారవేసినా మనలోని ధనవ్యామోహం కించిత్తయినా నశించదు. వెయ్యిసార్లు మురికి ప్రదేశాలను మనం కడిగి పరిశుభ్రం చేసినా, 'మేం శ్రేష్ఠుల'మనే జాత్యహంకారం మన నుంచి వైదొలగదు. అంతేగాక జగన్మాత స్త్రీ లందరి రూపంలో అభివ్యక్తమౌతోందని యావజ్జీవితం వింటూవున్నా కూడా, ఆచరణలో స్త్రీని తల్లిగా భావించలేం! ఈ పారమార్థిక సత్యాల ధారణాశక్తి మన పూర్వజన్మకృత కర్మసంస్కారాలలో ఎంత గట్టిగా చిక్కువడినదంటే శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ ఆ సంస్కారాల వల నుంచి బయటపడలేం. కనుకనే శ్రీరామకృష్ణులలా ఆ విషయాలన్నిటిలోను ఫలితాలను పొందలేం. ఆత్మసంయమమో శూన్యం. ధారణ శక్తో సున్న. పూర్వజన్మ సంస్కారాలో

మహాబలీయాలు. ఇటువంటి మనస్సుతోనా భగవత్సాక్షాత్కారం కోసం సాధనా రాజ్యంలో మనం అగ్రసరులమవగోరడం - కాబట్టే వారిలా ఫలితాన్ని పొందలేక పోవడం సహజమే కదా!

శ్రీరామకృష్ణుల వంటి అపూర్వ శక్తిసంపన్నమైన మనస్సుగల వ్యక్తులు ఈ లోకంలో నాలుగైదు వందల ఏళ్లలో ఏ ఒకరిద్దరైనా జన్మిస్తారా అన్నది సందేహాస్పదమే. శ్రీరామకృష్ణుల అనుపమానమైన మనస్సు - సహజసిద్ధంగానే పూర్తి సంయమశక్తి, పరిపూర్ణ ధారణశీలత ఇమిడిన ఆ మనస్సు, భగవద్దర్శనం కోసం అనన్య అనురాగ అఖండ పరితాప మహావాయువుతో తోలబడి ఎనిమిది ఏళ్లకాలం పాటు నిద్రాహారాలను పూర్తిగా త్యజించి జగజ్జనని పావన దర్శన లాభం కోసం అహోరాత్రాలు కఠోరసాధనల్లో నిమగ్నమై ఎంత మహాశక్తిసంపన్నమైనదో, సూక్ష్మదృష్టినొంది ఎటువంటి అద్భుత దివ్యానుభూతులను పొందినదో, అటువంటి మానసాన్ని గురించి మనలాంటి సామాన్య మనస్కులకు ఊహించుకోవడం కూడా అసాధ్యమే!

10. సాధుసత్తములకు మథుర్ సేవానిరతులు

రాణీ రాస్మణి మరణానంతరం కూడా దక్షిణేశ్వర కాళికాలయంలో జగన్మాత పూజాది సేవాకార్యాలు ఎలాంటి లోటుపాట్లూ లేకుండా సాగుతూనే వచ్చాయనే సంగతిని ఇదివరకే చెప్పుకొన్నాం. శ్రీరామకృష్ణుల గత ప్రాణుడైన మథుర్‌బాబు దేవీ సేవల నిమిత్తం యథావిధి ఖర్చులకు వెనుకాడకపోవడమేగాక, శ్రీరామకృష్ణుల అభిలాష మేరకు ఉదారంగా హెచ్చుమొత్తాలనే ఖర్చుపెట్టేవాడు. దేవీదేవతలను సేవించడమేకాక సాధుసత్తములను సేవించడమంటే అతడికి పరమప్రీతి. శ్రీరామకృష్ణుల పాదాశ్రయుడైన మథుర్ ఆయన బోధనల ద్వారా సాధువులు, సన్న్యాసులు, భక్తులు సాక్షాత్తూ భగవత్ప్రతీకలని విశ్వసించడమే ఇందుకు కారణం. కనుకనే శ్రీరామకృష్ణుల ఆకాంక్ష మేరకు అతడు ఈ కాలంలో సాధువులకు నిత్యం అన్నదానం చేయడమేగాక, వస్త్రాలు, దుప్పట్లు, కమండలాలు తదితర నిత్యావశ్యకాలైన వస్తువుల నన్నింటిని వారికి అందే ఏర్పాట్లు చేశాడు. ఈ ఏర్పాట్లు చక్కగా జరగడం కోసం ఆ వస్తువుల నన్నిటిని కొనుగోలుచేసి ఒక పెద్ద గదిలో నిల్వ వుంచి, శ్రీరామకృష్ణుల అనుజ్ఞానుసారం వాటిని పంపిణీ చేయాల్సిందిగా ఆలయ అధికారులను ఆదేశించాడు. ఇది జరిగిన కొద్దికాలానికే అన్ని సంప్రదాయాలకు చెందిన సాధుసత్తములకూ వారి వారి సాధనలకు అనుకూలమైన సామగ్రిని అందివ్వాలనే ఆకాంక్ష శ్రీరామకృష్ణులలో జనించినదని ఎరిగి అందుకు సముచిత ఏర్పాట్లన్నీ మథుర్ చేయించాడు.[1] ఇది బహుశా 1863-64లలో జరిగి

---

1. III.2.20

వుంటుంది. ఈ విధంగా రాణీ రాస్మణి కాళికాలయపు అద్భుతమైన అతిథి పరాయణత్వ సమాచారం సాధుసన్న్యాసుల నడుమ విస్తృతంగా వ్యాపించింది. రాణీ రాస్మణి జీవితకాలంలోనే తీర్థయాత్రాదులకు పోయివచ్చే సాధువులకు కాళికాలయం చక్కని విశ్రామ స్థలంగా పరిగణింపబడుతూన్నప్పటికీ ఇప్పుడు దాని యశస్సు సుదూర ప్రాంతాలకు కూడా ప్రాకింది. ఫలితంగా అన్ని సంప్రదాయాలకు చెందిన సాధకాగ్రగణ్యులూ విరివిగా దక్షిణేశ్వరానికి రాసాగారు. అంతేగాక అక్కడ ఒసగబడుతూన్న అతిథి సేవలతో సంతుష్టి పొంది, పని మనుషులను, అధికారులను, యజమానులను మనఃస్ఫూర్తిగా ఆశీర్వదించి తమ త్రోవన పోసాగారు. ఇలా అక్కడకు ఏతెంచిన ప్రఖ్యాతులైన సాధువుల నెందరిని గురించో శ్రీరామకృష్ణుల ముఖతా మేం విన్న సంగతులను మరొకచోట వివరించాం.[1] ఈ విషయం ఇక్కడ చెప్పడానికి కారణం: 'జటాధారి' అనే పేరు కలిగిన రామాయత్ సంప్రదాయానికి చెందిన సాధువు ఈ కాలంలోనే దక్షిణేశ్వరానికి ఏతెంచాడని పాఠకులకు తెలియచేయడం కోసమే. శ్రీరామకృష్ణులు ఆయనవద్ద రామమంత్రదీక్ష పుచ్చుకొన్నారు. అంతేగాక 'రామ్‌లాలా' అనబడే బాలరామచంద్రుడి ప్రతిమను కూడా ఆయన నుంచే అందుకొన్నారు. ఈ సంఘటన బహుశా 1864లో జరిగి ఉండవచ్చు.

శ్రీరామచంద్రుడి పట్ల జటాధారికి ఉన్న అసామాన్య భక్తిప్రపత్తుల గురించి ఎన్నోసార్లు మేం శ్రీరామకృష్ణుల ముఖతా వినివున్నాం. జటాధారి పరమప్రేమను

11. జటాధారి ఆగమనం

చూరగొన్నది బాలరామచంద్రుడి దివ్యమూర్తి. దక్షిణేశ్వరానికి రావడానికి పూర్వమే ఆ మూర్తిని దీర్ఘకాలం సేవించిన ఫలితంగా అతడి మనస్సు భావరాజ్యాన్ని అధిరోహించి ఎంతవరకు అంతర్ముఖస్థం, తన్మయత్వం పొందినదంటే బాలరామచంద్రుడు దివ్యజ్యోతి స్వరూపిగా ఎదుట ప్రత్యక్షమై, సభక్తికమైన ఆతడి పావన సేవలను పరిగ్రహించడం జటాధారి చూడడం జరిగేది. మొదట్లో అటువంటి దర్శనం ఒక్క ముహూర్తకాలం మాత్రమే అప్పుడప్పుడు కలిగి అతడు పరమానందంతో విహ్వలుడయ్యేవాడు. క్రమంగా అతడు సాధనలో మరింత పురోగమించేకొద్దీ ఆ దర్శనం కూడా సాంద్రతరమై దీర్ఘకాలం కొనసాగి, చివరికి నిత్యం చూసే వస్తువు మాదిరి సుస్పష్టమూ, నిరతమూ అయింది. ఇలా రాగాత్మికరాజ్యంలో సుప్రతిష్ఠితుడైన జటాధారి బాలరామచంద్రుణ్ణే దాదాపు నిత్యసహచరుడిగా పొందగలిగాడు. తదనంతరం ఏ ఆలంబనంతో తన జీవితంలో ఆ దివ్యదర్శన సౌభాగ్యం

---

1. IV. 2.4

పొందాడో, ఆ 'రామ్‌లాలా' విగ్రహాన్ని ప్రేమాతిశయంతో నిత్యం సేవిస్తూ, ఇచ్ఛానుసారంగా భారతదేశంలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకొంటూన్న సందర్భంలో దక్షిణేశ్వర కాళికాలయానికి జటాధారి ఏతెంచాడు.

12. శ్రీరామకృష్ణ జటాధారుల మధ్య నెలకొన్న సాన్నిహిత్యం

'రామ్‌లాలా' విగ్రహాన్ని పరిపూర్ణ హృదయంతో ఆరాధిస్తూన్న జటాధారి, అపర ప్రేమమూర్తి అయిన ఆ బాలరాముడి దివ్యదర్శనం తాను నిత్యం పొందుతూన్నాననే రహస్యాన్ని ఎవరికీ వెల్లడించలేదు. కాని అతడొక లోహ ప్రతిమను అపూర్వ నిష్ఠతో సేవిస్తూండడం మాత్రమే జనం చూసేవారు. అంతవరకే వారికి తెలుసు. కాని ఆధ్యాత్మిక రాజ్యంలో ఏకచ్ఛత్రాధిపత్యం నెరపుతూన్న శ్రీరామకృష్ణుల దివ్యదృష్టి, జటాధారిని ప్రథమంగా కలుసుకొన్నప్పుడే ఆ బాహ్యావరణాన్ని ఛేదించి, నిగూఢమైన అతడి రహస్యాన్ని కనుగొనగలిగింది. కాబట్టే ప్రథమ దర్శనంతోనే శ్రీరామకృష్ణులు ఆ సన్న్యాసి పట్ల అంత శ్రద్ధాసక్తులై, ఆయనకు అవసరమైన వస్తుసామగ్రిని ఆనందంతో సమకూర్చేవారు. అంతేకాక ప్రతి రోజూ గంటల పర్యంతం జటాధారితో గడుపుతూ రామ్‌లాలాను అతడు సేవిస్తూన్న తీరుతెన్నులను ప్రత్యక్షంగా చూసేవారు. జటాధారి ఏ ఆధ్యాత్మిక ప్రేమమూర్తి దివ్యదర్శనాన్ని సతతం పొందేవాడో, ఆ ప్రేమమూర్తిని శ్రీరామకృష్ణులు కూడ దర్శించడం జరిగిందనే ఉదంతాన్ని మేం మరొకచోట వివరించాం.[1] ఆ విధంగా జటాధారితోడి సంబంధం క్రమంగా అత్యంత సన్నిహితమూ, గౌరవప్రదమూ పరిణమించింది.

13. సఖీభావ మనోదశ

శ్రీరామకృష్ణులు ఈ కాలంలో స్త్రీ భావంతో తన్మయులై ఉండేవారు. అంతఃప్రేరణ ప్రాబల్యంతో తనను తాను జగన్మాత నిత్య సఖిగా భావిస్తూ స్వహస్తాలతో పూల మాలలను కట్టి తల్లిని అలంకరించడం, తాప నివారణార్థం చాలాసేపు దేవికి చామరంతో వీవడం, మథుర్‌తో చెప్పి కొంగ్రొత్త బంగారు ఆభరణాలను చేయించి, వాటితో జగజ్జననిని అలంకరించడం, అంతేగాక జగజ్జననిని సంతోషపరచే నిమిత్తం స్త్రీ వేషం ధరించి పాటలు పాడుతూ నృత్యం చేయడం - ఇత్యాది కార్యాలతో చాలాకాలం గడపసాగారు.

జటాధారి సాంగత్యంలో శ్రీరామకృష్ణులలో నిబిడీకృతమైవున్న శ్రీరామభక్తి పునరుజ్జీవనం పొందింది. ఆయన ఇప్పుడు ఆధ్యాత్మిక ప్రేమావతారుడు 'బాల రామచంద్రుడి' మూర్తిని గాంచసాగారు. స్త్రీభావ ప్రాబల్యంతో ఆయన

---

1. IV.2

హృదయం ప్రస్తుతం వాత్సల్య రసంతో నిండిపోయింది. తన పసిపిల్లను చూసి

14. స్త్రీభావ మనో దశలో వాత్సల్యభావ సాధన

నప్పుడు తల్లి ఏ అపూర్వ అనురాగాన్ని, ప్రేమాకర్షణను అనుభవిస్తూంటుందో, ఆ రామ్‌లాలాను చూస్తున్నప్పుడు ఆయన అలాంటి అనుబంధానికి లోనయ్యారు. ఆ ప్రేమాకర్షణే నిస్సందేహంగా, ఆయన నిప్పుడు రామ్‌లాలా పక్కన కూర్చుండ చేసి కాలం ఎలా గడిచిపోయేదో ఆయనకు తెలియనిచ్చేది కాదు. ఆ అపూర్వ దివ్యశిశువు తన తీయటి పసిచేష్టలతో తమను సర్వదా తనకడే ఉంచుకోవడానికి ప్రయత్నించేదనీ, తనను చూడలేకపోతే తల్లడిల్లుతూ తను వచ్చే మార్గాన్నే నిరీక్షిస్తూ ఉండేదనీ, ఎంత వద్దన్నా కూడ వినక సర్వదా తన వెన్నంటే తిరగడానికి ప్రయత్నించేదనీ - శ్రీరామకృష్ణులే చెప్పగా మేం విన్నాం.

శ్రీరామకృష్ణుల క్రియాశీల మానసం, చేపట్టిన ఏ కార్యాన్నీ అర్ధంతరంగా వదిలేదికాదు. బాహ్యక్షేత్రంలో ఈ విధంగా వ్యక్తమయ్యే ఆయన ప్రవృత్తి సూక్ష్మ

15. శ్రీరామకృష్ణుల సాధన తీవ్రత్వం

భావరాజ్యంలోనూ కచ్చితంగా ఇలాగే ఉండేది. స్వాభావికంగా ఏ భావమైనా దానంతట అదే ఆయన హృదయంలో స్ఫురించినప్పుడు ఆ భావ చరమసీమను చేరేదాకా, దాన్ని ప్రత్యక్షం చేసుకొనేదాకా ఆయన విశ్రమించేవారు కారు. శ్రీరామకృష్ణుల ఈ స్వభావాన్ని అవలోకించినప్పుడు పాఠకుడు ఇలా యోచించవచ్చు: 'అలా చేయడం మంచిదా? మనస్సులో ఎప్పుడు ఏ ఆలోచన జనిస్తే పూర్వాపరాలు చూసుకోకుండా, దాని చేతిలో కీలుబొమ్మగా మారి దాని వెనుక పరుగులెత్తడం - మనిషికి మంచిని చేకూరుస్తుందా?' దీనిలో కాస్త నిజం కూడ లేకపోలేదు. తమ మనస్సులో స్ఫురించే భావాల ననుసరించే శ్రీరామకృష్ణుల నైజం వారిని ఏనాడూ పదభ్రష్టులను చేయలేదనడం తథ్యం. కాని సామాన్యులకు మాత్రం అదెప్పుడూ అనుకరణీయం కాదు. కారణం దుర్బలులైన వ్యక్తుల మనస్సుల్లో మిక్కుటంగా మంచి - చెడు సంస్కారాలు అనవరతం లేస్తూనే ఉంటవి. తమలో సర్వదా కేవలం మంచిభావాలు మాత్రమే ఉదయిస్తాయనే విశ్వాసం ఉండడం సామాన్యులకు మంచిది కాదు. కాబట్టే కోరికలనే గుర్రాలను సతతం సంయమనమనే పగ్గంతో అదుపులో ఉంచుకోవడమే విధ్యుక్తం.

మనస్సంయమనం అత్యావశ్యకం అని పైన చెప్పిన అంశం ఎంతో యుక్తియుక్తమని ఒప్పుకోక తప్పదు. ఐనా అందుకు సమాధానం మేం చెప్పవలసి

16. సాధక శ్రేష్ఠులు: సంయమం

ఉన్నది. కేవలం కామకాంచనాలపై లగ్నమైన దృష్టి కలదీ, విపరీత భోగాసక్తితో కూడినదీ అయిన మానవ మానసం తనను తాను అంతగా విశ్వసించడం ఎప్పటికీ భావ్యం కాదు అనే విషయం

ఒప్పుకొని తీరాలి. కాబట్టి సామాన్యులు తమ కోరికలను అదుపులో ఉంచుకోవడం అత్యావశ్యకం. ఈ విషయంలో ఎవరికైనా సంశయం ఉంటే వారు దూరదృష్టిలేని మందమతులే. కాని భగవంతుడి కృప కారణంగా అరుదుగా కొందరు సాధకులకు ఈ సంయమనం ఉచ్ఛ్వాస - నిశ్వాసాల మాదిరి అతి సహజమూ, స్వాభావికమూ అవుతుందనే సంగతి వేదాది శాస్త్రాలలో పేర్కొనబడింది. వారి మనస్సు అప్పుడు కామ కాంచనాసక్తి నుంచి పూర్తిగా విడివడి, కేవలం సద్భావాలకు నిలయం అవుతుంది. శ్రీరామకృష్ణులు ఇలా అనేవారు: ''జగన్మాతను పూర్తిగా శరణు జొచ్చిన వ్యక్తి మనస్సులో ఆమె కృప కారణంగా ఏ చెడు భావనా తలయెత్తి తన ఆధిపత్యాన్ని సాగించలేదు. అమ్మ (జగజ్జనని) అతడి నెప్పుడూ తప్పుటడుగు వెయ్యనివ్వదు.'' ఇలాటి మహోన్నతావస్థకు చేరుకొన్న వ్యక్తి తన మనస్సులో జనించే తలపుల నన్నిటినీ పూర్తిగా విశ్వసించవచ్చు. అతడు అలా చేయడం ద్వారా కీడు వాటిల్లదు సరికదా, తద్భిన్నంగా ఇతరులకు ఎంతో శ్రేయస్సు చేకూరుతుంది. కారణం, దేహాభిమానమగ్నులమై, 'నేను, నేను' అనే ఏ నిమ్న అహంభావ ప్రేరణతో స్వార్థపరులమై లోకంలోని సమస్త సుఖభోగాలనూ పొందాక కూడ మనం సంతృప్తులం కాజాలమో, అలాటి నిమ్న 'అహంకారాన్ని' ఈశ్వరుడి విరాట్ అహంకారంతో విలీనం చేస్తారు ఆ మహానుభావులు - అలా చేసిన వ్యక్తులకు ఇక స్వార్థసుఖం నిమిత్తం పాటుపడడం అసంభవకార్యం. కాబట్టి అశేష కల్యాణగుణ సముద్రుడైన ఈశ్వరుడి శుభసంకల్పం లోకకల్యాణం నిమిత్తం అటువంటి మహనీయుల అంతరంగాల్లో వివిధ మనోభావాల రూపంలో వ్యక్తం అవుతూంటుంది. లేదా అటువంటి అవస్థకు చేరుకొన్న సాధకుడు అప్పుడు, 'నేను యంత్రాన్ని, నువ్వు చాలకుడవు' అనే అంశాన్ని ప్రతీక్షణం అంతరాంతరాళాల్లో అనుభవం చేసుకొని, తన మనస్సులో తలయెత్తే సంకల్పాలుగానే నిశ్చయంగా నమ్మి, వాటి ప్రేరేపణతో వాటిని ఆచరించడానికి కించిత్తయినా సంశయించడు. ఫలితం కూడ తదనుగుణంగానే కనిపిస్తుంది. అటువంటి వారి ఆచరణ ద్వారా అశేష లోకకల్యాణం ఒనగూరుతుంది. పైన వర్ణించబడ్డ మహోన్నతావస్థ శ్రీరామకృష్ణుల వంటి అసాధారణ మహాపురుషుల జీవితాలలో తొలిదశలోనే ఆరంభం అవుతుంది. కనుకనే అలాంటి మహనీయుల జీవిత చరిత్రలను చదువుతూన్నప్పుడు వారంతా ఏ మాత్రం యుక్తి విచారం చేయకనే తమ మనస్సులో ఉదయించే భావాలన్నిటిలో పూర్తి విశ్వాసం ఉంచి, అనేకమార్లు వాటిని కార్యరూపంలో పెట్టడం మనకు కనిపిస్తుంది. తమ నిమ్న సంకల్పాలను విరాట్పురుషుడి సంకల్పంతో సదా ఐక్యం చేసి, .సామాన్యుల మనోబుద్ధులకు గోచరంకాని సూక్ష్మాంశాల

న్నిటినీ గ్రహించి, అవగతం చేసుకోగలుగుతారు ఈ మహాత్ములు. విరాట్పురుషుడి మనస్సులో ఈ సూక్ష్మ భావాలన్నీ చిరకాలంగా నిలిచి ఉండడమే ఇందుకు కారణం.

మళ్లీ సామాన్య మానవ స్థాయికి దిగివచ్చి, సదా సంపూర్ణంగా ఈశ్వరేచ్ఛనే అనుసరిస్తూ ఉండడంవల్ల వారెంత మేరకు స్వార్థశూన్యులు, భావశూన్యులై ఉంటారంటే, ఎలా ఎవరి ద్వారా లేదా ఏ పరిస్థితుల్లో తమ క్షుద్ర మనశ్శరీరాలు మృత్యుగ్రస్తాలవుతవో ఆ విషయం గురించి ముందుగానే చక్కగా తెలుసుకొన్న తర్వాత కూడ ఆ వస్తువులపైగాని ఆ వ్యక్తుల మీదగాని కించిత్తు ఐనా కోపం వహించరు సరికదా, ఆ కార్యసాధనలో (అంటే తమ మృత్యువుకు) సాధ్యమైనంత వరకు వారికి సహాయం చేస్తూంటారు. కొన్ని ఉదాహరణల ద్వారా పాఠకుడికి మా అభిమతం అవగతం కాగలదు. సీతాదేవి నిష్కళంకిత అని కచ్చితంగా ఎరిగి ఉన్నప్పటికీ ఆమె బహిష్కరణ అనివార్యం కాబట్టి, ఆమెను అడవులకు పంపటం జరిగింది. మళ్లీ ప్రాణసముడైన తమ్ముడు లక్ష్మణుణ్ణి విడనాడితే, తన మానవలీల సమాప్తం అవుతుందని ఎరిగే, శ్రీరామచంద్రుడు అతణ్ణి పంపేశాడు. తన యదువంశం నశించిపోతుందని ముందుగానే తెలిసినప్పటికీ, తన్నివారణార్థం ఏ స్వల్ప ప్రయత్నమూ చేయకపోగా, ఆ ఘటన కచ్చితమైన సమయంలో జరిగేందుకు శ్రీకృష్ణుడు దోహదం చేశాడు. మళ్లీ ఒక వేటగాడి చేతుల్లో తన ప్రాణం పోతుందని తెలిసీ, సరైన అదనులో అక్కడకు వెళ్లి, లేత పద్మపత్రాల వంటి పాదాలు మాత్రం వేటగాడికి కనబడేట్లు గుబురైన పొదల నడుమ తన యావద్దేహాన్ని మరుగుపరచి కూర్చోగా వేటగాడు ఆ పాదాలు చూసి, మృగమని భ్రమించి తన నిశితశరాన్ని ప్రయోగించాడు. తన పొరపాటుకు పశ్చాత్తాపం చెందిన ఆ వ్యాధుణ్ణి ఊరడించి, ఆశీర్వదించి, అనంతరమే యోగబలంతో దేహాన్ని పరిత్యజించాడు శ్రీకృష్ణుడు.

17. అటువంటి సాధకులు ఏ విషయంలోనూ కలతచెందరు

అలాగే కరుణాసముద్రుడైన బుద్ధుడు చండాలుడి ఆతిథ్యాన్ని స్వీకరించాక తాను పరినిర్వాణంలో ప్రవేశిస్తానని ముందే ఎరిగీ, ఆ ఆతిథ్యాన్ని గ్రహించి, అతణ్ణి ఆశీర్వదించి, ఊరడించి, ఇతరుల నిందాద్వేషాల నుంచి అతణ్ణి రక్షించి, ఆ మీదటే మహాసమాధి పొందాడు. మళ్లీ స్త్రీలకు సన్న్యాస స్వీకారం అనుమతిస్తే తాను ప్రచారం చేసిన ధర్మం త్వరలోనే కలుషితమౌతుందని తెలిసీ తన మేనత్త అయిన గౌతమీదేవి సన్న్యసించటానికి అనుమతి నిచ్చాడు.

ఇక అవతారమూర్తి ఏసుక్రీస్తు విషయం: తన శిష్యుడైన జూడాస్ ధన లోభంతో ద్రోహం చేసి తనను శత్రువులకు పట్టిస్తాడనీ, తద్ద్వారా తనకు మరణం

సంభవిస్తుందనీ ఎరిగీ, అతడి పట్ల సమానంగా ప్రేమను ప్రదర్శించడం జరిగింది.

పరిశోధించి చూస్తే కేవలం అవతారమూర్తుల విషయంలోనేకాక, జీవన్ముక్తుల జీవితాల్లోనూ అటువంటి ఘటనలు ఎన్నో మనకు కానవస్తాయి.

18. అలాంటి సాధకులు నిస్స్వార్థపరులు

అవతారమూర్తులందరి జీవితాల్లోనూ ఒక వంక అసాధారణమైన వ్యక్తిగత ప్రయత్నమూ, మరోవంక ఈశ్వరేచ్ఛ మీద పూర్తిగా ఆధారపడడమూ - ఈ రెండూ ఒకే సమయంలో కనిపిస్తాయి. పరస్పర విరుద్ధంగా కానవచ్చే ఈ రెండిటికీ యుక్తియుక్త సామంజస్యం చేయాలంటే ఈశ్వరేచ్ఛయే వారిలో స్వప్రయత్నంగా వ్యక్తమౌతోందనే నిర్ణయానికి మనం రాక తప్పదు. కాబట్టి భగవదేచ్ఛను పూర్తిగా అనుసరించే పురుషుల్లోని స్వార్థసంస్కారాలన్నీ సంపూర్ణంగా నాశనమై, వారి మనస్సు ఎలాంటి పవిత్ర సీమను అధిరోహిస్తుందంటే కించిత్తయినా స్వార్థగంధంలేని అతిశుద్ధ భావాలు మాత్రమే అప్పుడు ఆ సీమలో ఉదయిస్తాయి. అలాటి శుద్ధావస్థను చేరుకొన్న సాధకులు ఇక నిశ్చింతులై, తమ మనస్సులో ఉదయించే ఆశయాలన్నిట్లో సుస్థిర విశ్వాసాన్ని నిలిపి, అవి ప్రేరేపించినట్లు ప్రవర్తించవచ్చు. తద్ద్వారా వారిని ఏ దోషమూ అంటదు. కాని సామాన్యులు శ్రీరామకృష్ణుల చర్యలను అనుకరించ కూడదు. ఐనా పైన పేర్కొన్న అసాధారణ అవస్థకు చేరుకొన్న సాధకులకు అవి జ్ఞానోదయం కలిగించి, వారి జీవితాలకు మార్గదర్శకాలవుతవి.

అటువంటి ఉన్నత ఆధ్యాత్మిక భూమిని చేరుకొన్న సాధకుల ఆహార విహారాది జీవిక వ్యాపారాలను శాస్త్రాలు దగ్ధబీజాలతో పోలుస్తున్నాయి. వృక్షలతాదుల విత్తనాలు వేయించినప్పుడు అవి మళ్లీ ఎలా మొలకెత్తజాలవో, అలాగే ఆ సాధకుల లౌకిక వాసనలన్నీ సంయమమనే జ్ఞానాగ్నిలో దగ్ధమై, మళ్లీ వారిని ఎన్నటికీ భోగవాసనల వైపు ఆకర్షించి, మార్గభ్రష్టులను చేయజాలవు. ''ఉక్కు కత్తి పరసువేదిని స్పృశించినప్పుడు బంగారు కత్తిగా మారుతుంది. భయానకమైనదాని ఆకారం మారనప్పటికీ, ఇక దానితో ఎవరినీ గాయపరచలేం'' అంటూ శ్రీరామకృష్ణులు ఈ అంశం మీద వ్యాఖ్యానించారు.

19. అలాంటి సాధకులు సత్యసంకల్పులవుతారు: ఇందుకు శ్రీరామకృష్ణుల జీవితంలో దృష్టాంతాలు

పైన పేర్కొన్న అవస్థకు చేరుకొన్న సాధకులు సత్యసంకల్పులవుతారని ఉపనిషద్ద్రష్టలైన ఋషులు చెబుతున్నారు. అంటే వారి మనస్సులలో ఉదయించే సంకల్పాలన్నీ కూడ సత్యమే అయితీరుతవి, ఏనాటికీ వమ్ముకావు. భావముఖంలో నెలకొన్న శ్రీరామకృష్ణుల మానసంలో ఉదయించే భావాలనన్నిటినీ పదేపదే పరీక్షించి, అవి యథార్థం కావడం చూడలేకపోతే మేమూ ఆ

ఋషుల మాటలను ఏనాటికీ విశ్వసించేవారం కాము. కాని ప్రత్యక్షంగా మేం చూశాం - ఫలానా ఆహారాన్ని స్వీకరించడానికి గురుదేవులు సంకోచిస్తే, కారణం ఆరాతీయగా, అంతకు మునుపే అది అపవిత్రం అయివుండడం జరిగేది. ఒక వ్యక్తికి ఆధ్యాత్మిక విషయాలపై సలహాలను ఇవ్వ పూనుకొన్నప్పుడు, హఠాత్తుగా ఆయన నోరు మూతపడేది. విచారించి చూస్తే, ఆ వ్యక్తి ఇందుకు పూర్తిగా అనర్హుడని తేలేది. ఫలానా వ్యక్తికి అతడి జీవితకాలంలో ఆధ్యాత్మిక అనుభూతి కలుగదనీ లేదా ఏ కొంచెం మాత్రమో కలుగవచ్చని ఆయనకు తోచితే, నిజానికి అది అలాగే జరిగేది. ఫలానా వ్యక్తిని ఆయన చూసినప్పుడు ఆయనలో ప్రత్యేకమైన ఒక భావం గాని లేదా ఒకానొక దేవతారూపం గాని మెదలితే, ఆ వ్యక్తి ఆ భావం యొక్క సాధకుడని లేదా ఆ దేవతామూర్తిని ఆరాధించే సాధకుడని తేటతెల్లమయ్యేది. శ్రీరామకృష్ణులు అకస్మాత్తుగా ఒక వ్యక్తితో తన అంతఃకరణ ప్రేరణతో ఏదైనా చెబితే, ఆయన పలుకుల మూలంగా అశేష కాంతిని కాంచి, అతడి జీవితం ఆమూలాగ్రం మార్పుచెందేది. ఇటువంటి సంఘటనలు శ్రీరామకృష్ణుల జీవితంలో కోకొల్లలు.

జటాధారి దక్షిణేశ్వరానికి ఏతెంచిన సమయంలో శ్రీరామకృష్ణులు అంతఃప్రేరణ ద్వారా బాహ్యాభ్యంతరంగా తమను పూర్తిగా ఒక స్త్రీగా భావించు కొంటూ, తదనుసారంగా ప్రవర్తించసాగారు. బాల రామచంద్రుడి మధుమయ రూపదర్శనం పొంది, అతడి పట్ల వాత్సల్యభావపూరితులైనారని మునుపే చెప్పుకొన్నాం. కులదైవం అయిన శ్రీ రఘువీరుడి పూజాసేవాదులను సముచిత రీతిలో ఆచరించడం కోసం బాల్యంలోనే ఆయన శ్రీరామ మంత్రదీక్షను పొందినప్పటికీ, శ్రీరాముణ్ణే ప్రభువుగా ఎంచడం తప్ప ఇతర భావాలవైపు ఆకర్షితులు కాలేదు ఆయన. కాని ఆయన హృదయం ఈ సమయంలో వాత్సల్యభావ పూరితం కావడంతో, గురువుల నుంచి యథావిధిగా ఆ భావాన్ని సాధించడానికి ఉపయుక్తమైన మంత్రాన్ని పొంది, దాని చరమానుభూతిని పొందడానికి ఆరాటపడసాగారు శ్రీరామకృష్ణులు. బాల రామచంద్రుడి మంత్రంలో సిద్ధిపొందిన జటాధారి, శ్రీరామకృష్ణుల అభిలాషను ఎరిగి, మహా సంతోషంతో తన ఇష్టమంత్రంలో దీక్షితులను చేశాడు. శ్రీరామకృష్ణులూ ఆ మంత్ర సహాయంతో గురు నిర్దేశిత మార్గాన్ని అనుసరించి, సాధనలో నిమగ్నులై కొన్ని రోజులలోనే బాలరామచంద్రుడి నిరంతర దివ్యదర్శన భాగ్యాన్ని పొందగలిగారు. వాత్సల్య భావంలో ఆ దివ్యమూర్తి ధ్యానంలో తన్మయులై ఆయనను అచిరకాలంలోనే సాక్షాత్కరించు కొన్నారు -

20. శ్రీరామకృష్ణులు - జటాధారి

జే రాం దశరథకీ బేటా, వహీరాం ఘటీఘటమే లేటా।
వహీరాం జగత్పసేరా, వహీరాం సబ్‌సే నేయారా॥

'దశరథ పుత్రుడైన శ్రీరాముడే ప్రతి దేహంలో జీవుడుగా వ్యక్తమౌతున్నాడు, అతడే జగత్తు లోపలా, బయటా అద్వితీయుడై ఉన్నాడు.'

అంటే శ్రీరామచంద్రుడు కేవలం దశరథ నందనుడనే కాదు, ఈ లోకంలోని ప్రతీ మనిషి దేహాన్ని ఆశ్రయించి జీవరూపుడిగా ప్రకాశిస్తున్నాడు. మళ్లీ అతడలా లౌకిక రూపంతో నిత్యం వ్యక్తమౌతూన్నా కూడా, అతడు ప్రపంచం కంటే సంపూర్ణంగా భిన్నుడు, మాయారహితుడు, నిర్గుణుడు, నిత్య సత్యుడు.

పైన ఉదహరించిన హిందీ గీతాన్ని శ్రీరామకృష్ణులు ఎన్నోసార్లు వర్ణించడం మేం వినివున్నాం.

శ్రీరామకృష్ణులకు ఇలా మంత్రదీక్షను ఇవ్వడమే కాక, తానింతకాలం అనన్యభక్తి ప్రపత్తులతో సేవిస్తూ వచ్చిన 'రామ్‌లాలా' (బాలరామచంద్రుడి) విగ్రహాన్ని ఆయనకు కానుక చేసి దక్షిణేశ్వరం నుంచి జటాధారి నిష్క్రమించాడు. ఆ చైతన్య విగ్రహం తానిక శ్రీరామకృష్ణుల వద్దనే ఉండిపోతాననే ఆకాంక్షను జటాధారికి వ్యక్తం చేయడమే ఇందుకు కారణం కావచ్చు. ఆ విగ్రహ అపూర్వ లీలావిలాసాన్ని గురించి మరోచోట మేం విపులంగా వర్ణించాం.[1] కాబట్టి దీన్ని గురించి ఇక్కడ ప్రస్తావించడం అవసరంలేదు.

21. జటాధారి 'రామ్‌లాలా' విగ్రహాన్ని శ్రీరామకృష్ణులకు కానుకగా ఇవ్వడం

వాత్సల్యభావపు పరిపూర్ణత్వాన్ని, దాని చరమానుభూతిని పొంద గలందులకై శ్రీరామకృష్ణులు పైన వర్ణింపబడినట్లు ఆ సాధనానుష్ఠానంలో నిమగ్నులైన కాలఘట్టంలో భైరవీ బ్రాహ్మణి దక్షిణేశ్వరంలో నివసించిందనే సంగతిని గతంలోనే తెలిపాము. తంత్రశాస్త్రాలతోనే గాక పంచభావాలతో కూడిన వైష్ణవ మతసాధనలోనూ ఆమె నిష్ణాతురాలనే సంగతిని మేం శ్రీరామకృష్ణుల ముఖతా విన్నాం. కాబట్టి వాత్సల్య, మధురభావ సాధనలను ఆచరిస్తూన్నప్పుడు ఆయన ఆమె ద్వారా ప్రత్యేకంగా ఏ సహాయాన్నైనా పొందారా? మేం ఈ విషయంగా ఆయన నుంచి స్పష్టంగా ఏమీ వినలేదు. కాని వాత్సల్య భావంలో సుప్రతిష్ఠితురాలై, 'బ్రాహ్మణి' చాలాకాలం శ్రీరామకృష్ణులను బాలగోపాలుడిగా ఎంచి, ఆయనను సేవించినదనే విషయం శ్రీరామకృష్ణుల నుండి, హృదయ్ నుండి మేం వినడం

22. వాత్సల్యభావ సాధనలో భైరవీ బ్రాహ్మణి సహాయం

---

1. IV.2

జరిగింది. కాబట్టి శ్రీరామచంద్రుని బాలగోపాలమూర్తిని తన బిడ్డడిగా ఎంచి వాత్సల్యభావ సాధనను అనుష్ఠించి దాన్లో చరమసాక్షాత్కారాన్ని పొందినప్పుడూ, తన నొక స్త్రీగా భావించి శ్రీకృష్ణుణ్ణి తన ప్రియుడిగా భావించి మధుర భావ సాధనలో ఉన్నప్పుడూ, శ్రీరామకృష్ణులు బ్రాహ్మణి నుంచి ఏదో కొంత సహాయాన్ని పొందివుండవచ్చునని మనం ఊహించుకోవచ్చు. ఏ రకమైన ప్రత్యేక సహాయమూ ప్రత్యక్షంగా పొందకపోయినప్పటికీ బ్రాహ్మణి స్వయంగా ఆ సాధనల్లో నిరతురాలై ఉండడం చూసీ, వాటి ప్రాశస్త్యాన్ని ఆమె ముఖతా వినీ, వాటిని సాధించాలనే తీవ్ర ఆకాంక్ష శ్రీరామకృష్ణుల మనస్సులో కలిగివుంటుందనే నిజాన్ని మనం అంగీకరించక తప్పదు.

13. మధురభావ సార తత్త్వం

సాధకుడు కాని వ్యక్తికి సాధకుల జీవితాలను అవగతం చేసుకోవడం ఎంతో కష్టం.

1. సాధకుడి అంతరంగ పోరాటం

కారణం, సాధన అనేవి అతిసూక్ష్మమైన ఆధ్యాత్మిక రాజ్యానికి చెందిన అంశాలు కనుక. మానవులను సమ్మోహితులను గావించే రూపరసాది విషయాలకు చెందిన స్థూలరూపాలు అక్కడ గోచరించవు. బాహ్యవస్తువులు, వ్యక్తిపరంగా జరిగే ఘటనా పరంపరలు, విచిత్ర కార్యకారణ పరంపరలు ఆ సీమలో కానరావు. లేదా రాగద్వేషాది ద్వంద్వాలతో నిండిన మానవ మనస్సు గత సంస్కారాల ప్రేరణతో అస్థిరమై, ఇతరుల నందరినీ అణగద్రొక్కి కేవలం తాను మాత్రమే ఈ ప్రాపంచిక భోగాలను అనుభవించడానికి విశ్వప్రయత్నం చేస్తుంటుందో - ఏ ప్రయత్నాలను విషయ విముగ్ధమైన ఈ లోకం వీరత్వంగా, మహత్వంగా కొనియాడుతుందో - అలాంటి ఉన్మత్త ప్రయత్నం ఆ భావరాజ్యంలో అణుమాత్రమైనా అభివ్యక్తం కాదు. అక్కడ నెలకొన్నవి కేవలం సాధకుడి మనస్సు, దాన్లోని జన్మజన్మాంతరాల నుంచి ప్రోగవుతూ వస్తూన్న అనంత సంస్కారాల ప్రవాహం. ఆ భావరాజ్యంలో మనకు కనిపించేవి: ఈ బాహ్యజగత్తులో ఫలానా వస్తువులతో లేదా ఫలానా వ్యక్తులతో జరిగిన సంఘర్షణ ఫలితంగా మనస్సు ప్రపంచంపట్ల విముఖమై, సాధకుడు ఉన్నత ఆశయాలకు, ఉన్నత లక్ష్యాలకు ఆకర్షితుడై, తన గమ్యాన్ని చేరడానికై మనస్సును పరిపూర్ణంగా ఏకాగ్రం చేయడానికి చేసే అనంత ఉద్యమం. ఆ ప్రయత్నానికి ఆటంకం కల్పించే తన మనస్సులోనే ఉన్న ప్రతికూల సంస్కారాలతో వెనుకంజవేయని అనంత సంగ్రామం. క్రమంగా ముందుకుపోతూ సాధకుడి మనస్సు పూర్తిగా బాహ్యవిషయాల నుంచి విముఖమై, తన వ్యక్తిత్వంలో ప్రగాఢంగా పాదుకొని, తాదాత్మ్యమై, ఆ అనంతరాజ్య గభీర, గభీరతర ప్రదేశాలకు దిగి సూక్ష్మ, సూక్ష్మతర భావస్తర అనుభూతులను పొందడం మనం చూడ

వచ్చు. ఇలా క్రమంగా ముందుకు పోయి పోయి ఆఖరుకు దేని నుంచి 'అహం' జ్ఞానంతోకూడిన సమస్త భావాలు ఉత్పన్నమవుతవో, ఏది 'అశబ్ద మస్పర్శ మరూప మవ్యయ మేకమేవాద్వితీయం' - శబ్దస్పర్శరూపరసగంధ విహీనం, నాశరహితం, రెండవదంటూలేని ఏకైక సత్యమో ఆ చరమస్థితికి, తన అస్తిత్వపు ఆ గభీరతమ ప్రాంతానికి చేరడం, చేరి దానిలో పూర్తిగా ఐక్యమై ఉండిపోవడం - ఇది ఆ భావరాజ్యంలో ఉండేదిది. ఆ పిదప సంస్కార సమూహాలన్నీ పూర్తిగా నాశనమై, 'సంకల్ప వికల్పాత్మక'మైన మనోధర్మం చిరతరంగా నాశనమయ్యే వరకు, మనస్సు ఏ మార్గాన్ని అనుగమించి పైన పేర్కొన్న అద్వైతస్థితికి చేరిందో, మళ్లీ ఆ మార్గాన్నే అనుసరించి ఆ సమాధిస్థితి నుంచి ఈ బాహ్యప్రపంచానికి దిగి వస్తుంది. ఈ రీతిలో సాధకుడి మనస్సు సంస్కారాలన్నీ సమూలంగా నశించే వరకు బాహ్య జగత్తుకు రాకపోకలు సాగిస్తూంటుంది. పైన వర్ణించిన ఆ భావ రాజ్యంలో మనకు అగపడేవి ఈ విషయాలు.

2. నిర్వికల్ప సమాధి - అసాధారణ సాధకులు

కాని పైన వర్ణించిన అద్వయ సమాధిస్థితి ఎవరి స్వతఃసిద్ధ వాసస్థానమో అటువంటి కొందరి సాధకుల గురించి - అతి ప్రాచీన కాలం నుంచి నేటివరకు అరుదైన అలాటి సాధకులు ఏ కొద్దిమంది మాత్రమో - ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్ర నమోదు చేసివుంచింది. మానవాళి శ్రేయస్సుకై వీరు కొంతకాలం బాహ్యజగత్తులో ఏదో విధంగా తమను నిర్బంధించుకొని నివసించడం జరుగుతుంది. శ్రీరామకృష్ణుల సాధన చరిత్రను మనం ఎంతగా అధ్యయనం చేస్తామో అంతగా వారి మనస్సు పై కోవకు చెందినదని మనకు అవగతమవుతుంది. వారి జీవిత చరిత్రను చదువుతున్న పాఠకుల మనస్సులను ఆ విశ్వాసం ఆకట్టుకోని పక్షంలో అందుకు బాధ్యత రచయిత లోపమే అని గ్రహించాలి. ఎందుకంటే శ్రీరామకృష్ణులు పదే పదే మాతో ఇలా అనేవారు: ''ఒకటి రెండు అల్ప కోరికలను బలవంతంగా కల్పించుకొని వాటి ద్వారా మీ అందరి కోసం మనస్సును నిమ్నస్థాయిలో ఉంచేవాణ్ణి. లేకుంటే అఖండంతో కలిసి తాదాత్మ్య మవడమే దాని స్వాభావిక ప్రవృత్తి.''

3. 'శూన్యం', 'పూర్ణం'- యథార్థానికి ఒక్కటే

నిర్వికల్ప సమాధికాలంలో అనుభూతమయ్యే అఖండ అద్వైత వస్తువును ప్రాచీన ఋషిసత్తములు కొందరు సమస్త భావాల అస్తిత్వంలేని 'శూన్యం' అనీ, మరికొందరు సమస్త భావాలు సమ్మిళితమయ్యే 'పూర్ణం' అనీ పేర్కొన్నారు. కాని వారంతా సూచిస్తూన్నది ఆ ఒకే వస్తువును గురించే. అందరు కూడ ఆ అఖండ వస్తువును సమస్తభావాల ఉత్పాదక, లయస్థానం అని వర్ణించడమే అందుకు కారణం. సమస్త భావాలు లయమయ్యే ఏ నిర్వాణభూమిని బుద్ధ భగవానుడు 'శూన్యం' అని

నిర్దేశించాడో, దాన్నే శ్రీ శంకరాచార్యులు సమస్త భావాల సమ్మేళన భూమి అయిన 'పూర్ణం'గా అభివర్ణించాడు. తదనంతర కాలపు బౌద్ధమతాచార్యుల అభిప్రాయాలను అవలకుపెట్టి, బుద్ధుణ్ణే శంకరుణ్ణే అధ్యయనం చేసినప్పుడు వారిద్దరూ వర్ణిస్తూన్నది ఒకే విషయం అనే తిరుగులేని నిర్ణయానికి మనం వస్తాం.

'శూన్యం' అనో లేదా 'పూర్ణం' అనే పేర్కొనబడే అద్వైత స్థితినే ఉపనిషత్తులు, వేదాంతం 'భావాతీత అవస్థ' అని వర్ణిస్తున్నాయి. కారణం ఏమిటంటే:

4. అద్వైత స్వరూపం

నిర్దుష్టంగా దీన్లో సుప్రతిష్ఠితమైనప్పుడు సాధకుడి మనస్సు సగుణబ్రహ్మను అంటే ఈశ్వరుని సృష్టి స్థితి లయాలనే లీలాజనితమైన సమస్త భావభూములను అతిక్రమించి దానిలో ఐక్యమైపోతుంది. కాబట్టి పరిమితమైన మానవ మస్తిష్కం ఆధ్యాత్మిక రాజ్యంలో ప్రవేశించి శాంత దాస్యాది పంచభావాలను అనుసరించి ఈశ్వరుడితో ఏ నిత్యసంబంధాన్ని కల్పించుకొంటుందో, వాటన్నిటి నుంచి అద్వైతం అనబడే భూమి పూర్తిగా వేరైన ఒక అపార్థివ వస్తువు అని మనకు స్పష్టమౌతోంది. సాధకుడు ఇహపర సుఖ భోగాల పట్ల పరిపూర్తిగా విరక్తుడై, పవిత్రతాబలంతో దేవతలను సైతం మించిన పదాన్ని పొందినప్పుడు, అప్పుడు మాత్రమే అతడికి అద్వైతభావం (అంటే అద్వైతమార్గాన్ని అనుసరించడానికి వలసిన ప్రగాఢ జిజ్ఞాస, ఆధికారికత) ప్రాప్తిస్తుంది. అంతేగాక అతడు ఆ అద్వైతభావ సహాయంతో ఈ విశ్వబ్రహ్మాండంతోపాటు సృష్టి స్థితి లయకారుడైన ఈశ్వరుడు దేన్లో నిత్య ప్రతిష్ఠితుడై నెలకొనివుంటాడో, ఆ నిర్గుణబ్రహ్మ పదార్థాన్ని ప్రత్యక్షంగా సాక్షాత్కారం చేసుకొని, తరిస్తాడు.

అద్వైతభావం, తద్ద్వారా లభించే నిర్గుణబ్రహ్మ వస్తువుల విషయం ఆవలికి పెడితే, ఆధ్యాత్మిక జగత్తులో మనకు కానవచ్చేవి శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య,

5. పంచభావాలు - భగవత్సాక్షాత్కారం

మధురభావాల - ఈ పంచభావాల వ్యక్తీకరణ. వీటిలో ప్రతీభావం యొక్క సాధ్యవస్తువు ఈశ్వరుడు లేదా సగుణ బ్రహ్మ, అంటే నిత్యశుద్ధముక్త స్వభావుడు, సర్వశక్తిమంతుడు, సర్వనియంత ఐన ఈశ్వరుడిపట్ల సాధకుడు ఈ ఐదు భావాలలో ఏదో ఒక భావాన్ని ఆరోపించుకొని, ఆయనను ప్రత్యక్షం చేసుకోవడంలో అగ్రేసరుడవుతాడు. సర్వాంతర్యామి, సమస్త భావాలకు ఆధారభూతుడు ఐన భగవంతుడు కూడ భక్తుడి ఏకమనస్కతను చూసి, అతడి భావాన్ని పరిపుష్టి గావించే నిమిత్తం అతడి భావానికి తగిన రీతిలో రూపాల్ని దాల్చి, ప్రత్యక్షమై అతడి ఆకాంక్షను నిర్వర్తిస్తాడు. ఈ విధంగా విభిన్న యుగాలలో చిద్ఘనుడైన భగవంతుడు నానాభావాలతో కూడుకొన్న రూపాలతో ఆవిర్భవించాడనీ, అంతేకాక ఆయన

మానవుడిగా కూడ అవతరించి భక్తుల అభీష్టాలను నెరవేర్చాడని శాస్త్రాలలో మనం చూస్తాం.

6. ఈ పంచభావాలు మనిషి పురోగతికి ఎలా తోడ్పడతాయి?

దైనందిన జీవితంలో మనుష్యులు పరస్పరం ఏ ఐహిక సంబంధాలతో కట్టుపడివుంటారో ఆ సంబంధాల యొక్క సూక్ష్మ, పరిశుద్ధ స్వరూపాలే ఈ శాంతదాస్యాది పంచభావాలు. ఈ లోకంలో మనం తల్లి, తండ్రి, భార్య, భర్త, ప్రభువు, భృత్యుడు, మిత్రుడు, మిత్రురాలు, కుమారుడు, కుమార్తె, రాజు, ప్రజలు, గురువు, శిష్యుడు మొదలైన ఒక్కొక్కరితో ఒక్కో ప్రత్యేక సంబంధాన్ని కల్పించుకొని ప్రవర్తిస్తూంటాం. అలాగే శత్రువులు కాని ఇతరులందరితో శాంత, గౌరవాస్పద వైఖరిలో వర్తిస్తూంటాం. ఈ సంబంధాలన్నిటినీ భక్తి బోధకులందరూ శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య (లేదా అపత్య), మధుర (లేదా కాంతాభావం) భావాలుగా వర్గీకరించారు. అంతేకాక ఆధికారిక భేదాన్ని అనుసరించి వీటిలో ఏదో ఒకదాన్ని ప్రధానరూపంగా అవలంబించి, ఆ భావంతో భగవంతుడితో ప్రేమాస్పద సంబంధం కలిగించుకొని సాధనలో ముందంజవేయమని ప్రబోధిస్తూన్నారు. కారణం: శాంతాది ఈ పంచభావాలతో జీవుడు నిత్యపరిచితుడు కావడం వల్ల వాటినే అవలంబించి భగవత్సాక్షాత్కారం కోసం ముందంజ వేయడం అతడికి సుగమమవుతుంది కనుక. అంతేకాదు, ప్రవృత్తి మూలకాలైన ఈ ఐహిక సంబంధాలకు చెందిన ఏ దాస్యాది భావాల స్ఫూర్తి జీవుడి మనస్సులో రాగద్వేషాలను జనింపచేసి, సంసారంలో గతాన అతడి ద్వారా నానాపాప కార్యాలను చేయిస్తూవుందో, ఆ భావాలే మళ్లీ భగవంతుడి దిశగా త్రిప్పబడిన పిమ్మట, అతడి మనస్సులో వివిధ వృత్తులను ఉత్పన్నం చేస్తూన్నప్పటికీ, ఇప్పుడవి నిర్నిరోధ వేగంతో అతణ్ణి భగవద్దర్శనమనే లక్ష్యం వైపుకే మళ్లిస్తవి. ఉదాహరణకు అనర్థాలన్నిటికీ మూలమైన కామాన్ని తీసుకోండి. ఇదొక మానసిక రుగ్మత అని చెప్పవచ్చు. కాని సాధకుడు ఇప్పుడు దాన్ని భగవత్సాక్షాత్కారంలో నియుక్తం చేస్తాడుగాక! ఆ సాక్షాత్కారానికి ఆటంకాలైన వస్తువుల మీద, వ్యక్తుల మీద అతడు కోపం చేసుకొంటాడు గాక! ఈశ్వరుడి నిరతిశయ నిరుపమాన ప్రేమ - సౌందర్య ఆనంద లబ్ధిలో అతడు సమ్మోహితుడై, పిచ్చివాడవుతాడుగాక! అదే మాదిరి లోభాన్ని గురించి భగవంతుడి పావన దర్శనం పొంది, కృతకృత్యులైన మహనీయు లందరి ధన్యతను గాంచి, అతడూ దాన్ని పొందే నిమిత్తం తీవ్ర పరితాపం పొందుగాక! అందుకోసం పరమలోభి అగుగాక! ఇతర భావాల సంగతి కూడ ఇదేమాదిరి.

7. భగవంతుడి ప్రేమ - వ్యక్తిత్వం

భగవంతుడితో ప్రేమాస్పద సంబంధాన్ని కల్పించే శాంతదాస్యాది ఈ ఐదు భావాల గురించిన బోధను ఒక ఫలానా బోధకుడు ఒక ఫలానా సమయంలో ప్రకటించడం జరిగిందని మనం ఇదమిత్థంగా చెప్పలేం. విభిన్న కాలాలలో ఎందరో మహాపురుషులు ఈ భారతావనిలో ఉద్భవించి, ఈ ఐదు భావాలలో ఒకటో, రెండో లేదా కొన్నిటినో అవలంబించి, భగవత్సాక్షాత్కారం కోసం సాధన చేసి కేవలం 'ప్రేమ' తోనే ఆయనను తన వాడిగా చేసుకొని, తదనుసారంగా చేయమని జనబాహుళ్యానికి ఉపదేశించారు. అలాటి ఆచార్యపురుషుల అపూర్వ జీవితాలను అధ్యయనం చేసినప్పుడు ఆ యా భావసాధనల కన్నిటికీ మూలస్వరూపంగా, ప్రాణస్వరూపంగా ఉన్నది ఒక్క 'ప్రేమ' మాత్రమే అనీ, అంతేగాక ఆ ప్రేమ యొక్క లక్ష్యవస్తువు భగవంతుడి అనంత రూపాలలో ఒకానొక రూపమే అనీ మనకు విస్పష్టం అవుతుంది. అందుకు కారణం: 'అద్వైత' సత్యం మనిషికి అనుభూతమవనంతకాలం అతడు భగవంతుడి ఫలానా పరిమితమైన, సాకార వ్యక్తిత్వాన్ని గురించి మాత్రమే ఊహించుకోగలడు, అనుభూతం చేసుకోగలడు.

8. ప్రేమ శక్తుల - చైతన్య నిర్మూలన

ప్రేమికులిద్దరి మధ్య నెలకొన్న ప్రేమస్వరూపాన్ని అధ్యయనం చేసినప్పుడు అది వారిద్దరి నడుమగల లౌకిక స్థాయుల, శక్తుల తారతమ్యాలను ఎలా క్రమంగా రూపుమాపుతుందో మనకు అవగతమవుతుంది. అదే రీతిలో భావసాధనలో నియుక్తుడైన సాధకుడి మనస్సు నుంచి కూడ ఈ ప్రేమ భగవంతుడి అపరిమిత శక్తుల చైతన్యాన్ని క్రమంగా తొలగింపచేసి, అతడి భావానురూపంగా భగవంతుణ్ణే తన ప్రేమాస్పదుడిగా మాత్రమే లక్షింపచేస్తుంది. కాబట్టే ఈ మార్గాన్ని అనుసరించే సాధకుడు ప్రేమ ద్వారా భగవంతుణ్ణే పూర్తిగా 'తనవాడు'గా చేసుకొని, అతణ్ణే బ్రతిమిలాడడానికి, విసిగించడానికి, పైపెచ్చు దుర్భాషలాడడానికి కూడ వెనుదీయకపోవడం మనం చూస్తూవుంటాం. సాధకుడిచే భగవంతుడి అనంతశక్తులను మరపింపచేసి, కేవలం ఆయన ప్రేమ - మాధుర్యాలను అనుభూతం చేయడంలో పైన పేర్కొన్న పంచభావాలలో ఏది ఎంతదాక సమర్థనీయమో, ఆ భావం ఆ మార్గంలో అంతవరకు 'ఉన్నత' భావంగా పరిగణించబడుతుంది. కేవలం ఈ దృక్కోణంలోనే ఆ పంచభావాల మధ్యవుండే తారతమ్యాలను భక్తి బోధకులు పరిశీలించి, మధురభావానికి అగ్రతాంబూలం ఇచ్చారు. కాకపోతే ఆ ప్రతి భావమూ కూడ సాధకుడికి భగవత్సాక్షాత్కారం కలిగించగలదనే అంశాన్ని ఆ ఆచార్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

పంచభావాలలో ప్రతి ఒక్కటి కూడ పరాకాష్ఠను చేరుకొన్నప్పుడు సాధకుడు మైమరచిపోయి, తన 'ప్రాణ ప్రియుడి' ఆనందంలోనే తాను ఆనంద పడుతున్నట్లు భావిస్తాడు. అంతేకాక విరహ సమయంలో భగవచ్చింతనతో తరచు తన ఉనికినే విస్మరిస్తాడు. ఆధ్యాత్మిక చరిత్రను అధ్యయనం చేసినప్పుడు పై విషయాలు మనకు తెలియవస్తాయి. బృందావన గోపికలు ఆ విధంగా తమ స్వకీయ ఉనికినే మరచిపోవడమేగాక వాస్తవానికి కొన్ని సందర్భాలలో తమ ప్రాణప్రియుడైన శ్రీకృష్ణుడితో తాదాత్మ్యం చెందేవారని శ్రీమద్భాగవతం మొదలైన భక్తి గ్రంథాలను చదివినప్పుడు మనకు తెలియవస్తుంది. మానవ కల్యాణం కోసం శిలువ వేయబడుతున్నప్పుడు ఏసు క్రీస్తు భరించరాని ఏ మహాబాధను అనుభవించాడో దాన్ని గురించి తదేకంగా ధ్యానిస్తూ కొందరు సాధకులు తాదాత్మ్యం చెందడంతో వారి దేహాలపై శిలువ వేయబడిన గుర్తులు ఏర్పడి, వాటి గుండా రక్తం స్రవించిన ప్రసిద్ధ సంఘటనలు క్రైస్తవ భక్తి గ్రంథాలలో మనకు కానవస్తున్నాయి.[1] కాబట్టి శాంత దాస్యాది పంచ భావాలలో ఏ ఒక్కదాన్లోనైనా పరాకాష్ఠను చేరుకొన్నప్పుడు సాధకుడు తన ప్రేమాస్పదుడైన భగవంతుడి చింతనలో తన్మయుడై ఆ మహాప్రేమోద్వేగంలో అతడితో కలిసి, తాదాత్మ్యం చెంది చివరకు అద్వైతానుభూతిని పొందడం జరుగుతుంది. శ్రీరామకృష్ణుల అపూర్వ ఆధ్యాత్మిక సాధన జీవితం ఈ అంశం మీద అద్భుత కాంతిని ప్రసరింపజేస్తోంది. పంచభావాల్లో ప్రతి భావాన్ని ఆయన అవలంబించి, ప్రతి దాన్లోను తన ప్రేమాస్పదుడి ప్రేమలో విలీనుడై, తన స్వీయ ఉనికినే పూర్తిగా మరచిపోయి అద్వైత భావాన్ని సాక్షాత్కరించుకొన్నారు.

9. ప్రతి భావం యొక్క స్వావలంబన

ఇక్కడొక ప్రశ్న ఎదురవుతుంది. అన్ని భావాలకూ అతీతమైన అద్వయ స్థితికి శాంతదాస్యాది భావాల సహాయంతో మానవ మస్తిష్కం ఎలా చేరగలదు? కారణం: ఏ భావమైనా ఉదయించి, నెలకొని పెంపొందాలంటే ఇద్దరు వ్యక్తులు ఉండాలి కదా?

నిజమే, ఏదేని ఒక భావం ఎంతగా పురోభివృద్ధి గాంచుతుందో, అది తన ప్రభావాన్ని అంతగా విస్తృతం చేసి సాధకుడి మనస్సు నుంచి తద్విరుద్ధంగా వుండే భావాల నన్నిటినీ క్రమంగా తొలగించివేస్తుంది. మళ్లీ ఆ భావం పరిపూర్ణంగా వృద్ధిగాంచినప్పుడు ఏకాగ్రమైన సాధకుడి మనస్సు ధ్యానసమయంలో, అంతకు

---

1. సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసి, సెయింట్ క్యాథరిన్ ఆఫ్ సియన్న జీవిత చరిత్రలను చూడండి.

మునుపు దాన్లో కనబడుతున్న 'నువ్వు' (సేవ్య), 'నేను' (సేవక), ఈ రెంటి నడుమ నెలకొనిన దాస్యాది సంబంధాన్ని ఒక్కొక్కప్పుడు విస్మరించి, కేవలం 'నువ్వు' అని సూచించే 'సేవ్య' (భగవంతుడు) వస్తువుతో ప్రేమ ద్వారా తాదాత్మ్యం చెంది, సుస్థిరంగా నెలకొంటుంది.

10. పంచభావాల ద్వారా అద్వయ స్థితిని పొందటం

మనస్సుకు ఏకకాలంలో 'నువ్వు', 'నేను', ఈ రెంటి నడుమ నున్న ప్రేమ సంబంధం ఎన్నటికీ ఎరుకవుండదని భారతీయ మహాచార్యులు అభిప్రాయ పడుతున్నారు. మనస్సుకు ఒక క్షణం 'నువ్వు' గురించిన ఎరుక, మరుక్షణం 'నేను' గురించిన ఎరుక ఉంటుంది. కాని మనస్సు ఈ రెండు భావాల మధ్యే డోలాయమానమౌతూన్నందున, దాన్లో (మనస్సులో) ఈ రెంటి మధ్య ఒక భావ సంబంధం వృద్ధి చెందుతుంది. తదుపరే మనస్సుకు ఏకకాలంలో ఈ రెండు భావాల, వాటి మధ్యగల సంబంధం గురించిన ఎరుక కలుగుతుంది. పరిణతి చెందిన మధురభావ ప్రభావంతో మనస్సులోని అశాంతత నశించి పోతుంది. అప్పుడు పైన పేర్కొన్న సత్యాన్ని అది క్రమంగా కనుగొనగలుగు తుంది. ధ్యానం ఎంత గభీరమౌతుందో మనస్సు అంత వృత్తిహీన మవుతుంది; నిజానికి ఉన్నది ఒకే ఒక్క 'అద్వయ' పదార్థమనీ, ఆ అద్వయ పదార్థాన్నే రెండు దృక్కోణాల నుంచి పరికిస్తూ 'నువ్వు', 'నేను' అనే రెండు విభిన్న పదార్థాలుగా (ఇంతకాలం) కల్పించుకొంటూ వస్తూన్నానని వృత్తిహీనం అయ్యేకొద్దీ మనస్సుకు విస్పష్టమౌతుంది.

11. వివిధ యుగాలలో వేర్వేరు సాధనలు

శాంతదాస్యాది భావాలలో ప్రతీభావం పరాకాష్ఠకు చేరినప్పుడు పైన చెప్పబడినట్లు మనస్సుకు అద్వైతానుభూతిని కలిగించడానికి ఎందరి సాధకుల, ఎంతటి మానవాతీత ప్రయత్నాలు ఆవశ్యకమయినవో అనే విషయాన్ని యోచించినప్పుడు ఆశ్చర్యపోక తప్పదు. ఒక్కొక్క యుగంలో శాంతదాస్యాది భావాలలో ఒక్కొక్కభావం ప్రధానమైన సాధనామార్గంగా అవలంబనీయంగా ఉండటమూ, ఆ యుగానికి చెందిన విఖ్యాత సాధకు లెందరో ఆ మార్గాన్ని అనుసరించి భగవత్సాక్షాత్కారాన్ని పొందడమూ, అంతేగాక వారిలో ఏ ఒకరిద్దరో అఖండ, అద్వయ పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని సైతం పొందడమూ జరిగింది. శాస్త్రరూపేణా లభ్యమౌతున్న ఆధ్యాత్మిక చరిత్రను అధ్యయనం చేసినప్పుడు ఈ సంగతులు మనకు స్పష్టం అవుతాయి.

వైదిక యుగంలోను, బౌద్ధయుగంలోను శాంతభావం ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. అద్వయానుభూతిలో పరాకాష్ఠను చేరుకొంది. ఉపనిషద్యుగంలో

దాస్యభావం, అపత్యభావం[1] ప్రముఖంగా ఉండడం జరిగింది. రామాయణ మహాభారత యుగాలలో (ఇతిహాస యుగాలలో) శాంతభావం, నిష్కామకర్మతో మిశ్రితమైన దాస్యభావం; తాంత్రిక యుగంలో భగవంతుణ్ణి 'తల్లి'గా ఎంచే మాతృభావం, పాక్షిక మధురభావం; వైష్ణవ యుగంలో సఖ్యభావ, వాత్సల్యభావ, మధురభావ సంపూర్ణ ప్రకటన - ఇలా వేర్వేరు యుగాలలో కొన్ని కొన్ని భావాలు ప్రధాన సాధనామార్గాలు కావడం మనకు తెలియవస్తోంది.

భారతదేశపు ఆధ్యాత్మిక చరిత్రను పరికిస్తే శాంతదాస్యాది పంచభావాలు అద్వయానుభూతితోపాటు వికాసం చెందివుండడం మనకు కానవస్తుంది. కాని

12. భారతదేశంలోను విదేశాలలోను పంచ భావాల వికాసం

విదేశాలలో సంగతి ఇలా కాదు. ఇతర దేశ మతసంప్రదాయాలలో శాంత, దాస్య, అపత్య (భగవంతుణ్ణి తండ్రిగా భావించే) భావాలు మాత్రమే వర్ధిల్లడం మనం చూడగలం. సఖ్య, మధురభావాలతో కూడిన రాజర్షి సాలమాన్ గీతాలు, యూదియా, క్రైస్తవ, ఇస్లాం మతాలలో చెక్కుచెదరక ఉన్నప్పటికీ, వాటిలోని భావాలను వారు అవగతం చేసుకోలేక, ఆ గీతాలకు విభిన్న అర్థాలను కల్పించుకొన్నారు. మహమ్మదీయ మతశాఖ ఐన 'సూఫీ' సంప్రదాయంలో సఖ్య, మధుర భావాలు చాలా మేరకు మిగిలి ఉన్నప్పటికీ, సాధారణ మహమ్మదీయులు అటువంటి భగవదుపాసనను తమ పవిత్ర కొరాన్ ఆదేశాలకు విరుద్ధమనే పరిగణిస్తారు. అదే మాదిరి క్యాథలిక్ క్రైస్తవ సంప్రదాయంలో ఏసుక్రీస్తు తల్లి మేరీ ప్రతిమ ద్వారా భగవంతుడి మాతృభావపూజ పరోక్షంగా ప్రచలితంగా ఉన్నప్పటికీ అది భగవంతుడి మాతృభావంతో బాహాటంగా అంగీకృతం కాలేదు. ఫలితంగా భారత దేశంలో బహుళ వ్యాప్తిలోవున్న జగన్మాత పూజ మాదిరి ఫలవంతమై అది అఖండ సచ్చిదానందానుభూతిని కలిగించడానికీగాని, ప్రతి స్త్రీని దైవాంశ సంభూతురాలిగా దర్శింపచేయడానికీగాని సమర్థం కాలేకపోయింది. క్యాథలిక్ క్రైస్తవ సంప్రదాయంలో ఆ మాతృభావ ప్రవాహం 'ఫల్గుణీ' నదిలా మార్గ మధ్యంలో ఇంకిపోయింది.

సాధకుడి మనస్సు ఏదో ఒక భావమార్గాన్ని అవలంబించి భగవంతుడి పట్ల

13. భావ ప్రగాఢతను తెల్పే సూచికలు

ఆకర్షితమౌతుందనీ, క్రమంగా అది భావంలో లీనమై బాహ్యప్రపంచం నుండి వెనక్కు తిరిగి తన ఆత్మలో విలీనం అవుతుందనీ ఇంతకు మునుపే చెప్పడం జరిగింది. మనస్సు ఆ విధంగా

---

1. అపత్యభావం అంటే భగవంతుణ్ణి తల్లిగానో లేక తండ్రిగానో భావించడం - ఇక్కడ తండ్రిగా భావించడంగా అర్థం చేసుకోవాలి.

విలీనం కానున్నప్పుడు దానిలోని పూర్వసంస్కారాలన్నీ తలెత్తి ఆ మార్గానికి అవరోధం కల్పించి, మనస్సును పైకి త్రోసి, మళ్లీ దాన్ని బహిర్ముఖం గావించడానికి సకల ప్రయత్నాలూ చేస్తాయి. కాబట్టే ప్రబలమైన పూర్వసంస్కార భారాన్ని వహిస్తున్న అతిసామాన్యుల మానసం, యావజ్జీవితం విశ్వప్రయత్నం చేసీ ఒక్క భావంలోనైనా లీనం కాకపోవడం జరుగుతుంది. అలా జరిగినప్పుడు సాధకుడు మొదట నిరుత్సాహపడతాడు. పిమ్మట సాధనానుష్ఠానాన్నే విడనాడతాడు. తుదకు తన లక్ష్యంపట్ల విశ్వాసాన్ని కోల్పోతాడు. తదనంతరం బాహ్య ప్రపంచంలోని రూప, రసాది భోగాలనే ప్రశస్తంగా ఎంచి, వాటి కోసం అర్రులు చాస్తాడు. కనుకనే భోగవిషయాల పట్ల పూర్తి విరక్తి, ప్రేమాస్పదుడి (భగవంతుడి) ధ్యానంలో విలీనం, ఆ భావసాధనలో జనించే పరవశత్వం, వీటినే తన లక్ష్యం వైపుగా సాధకుడు ఎంత పురోగమించాడో తెలియచేసే కొలబద్దగా భక్తి రంగంలో పరిగణిస్తారు.

ఏదో ఒక్క భావాన్ని అనుగమించి దానిలో తల్లీనం కావడానికి యత్నించి, లోపల నిబిడంగా ఉన్న పూర్వజన్మ సంస్కారాల ప్రబల ఆటంకాలను ఏ వ్యక్తి అనుభవించలేదో, అలాంటి వ్యక్తి (అంటే సాధన చేయని వ్యక్తి) సదరు సాధకుడి మనస్సులో జరిగే తీవ్రపోరాటాన్ని గురించి కించిత్తు కూడ అవగతం చేసుకోలేడు. మానవ జీవితంలో భావతన్మయత్వాన్ని పొందడానికి ఎన్ని కష్టాల యాతనలకు లోనుకావాలో అనుభవపూర్వకంగా ఎరిగిన ఒక్క సాధకుడు మాత్రమే శ్రీరామకృష్ణులు అతిత్వరలో ఒకదాని పిమ్మట ఒకటిగా సకల భావాలలో తన్మయత్వ సిద్ధి పొందడం చూసి, విస్మయుడై, ఇలా జరగడం మానవాతీతశక్తికి మాత్రమే సాధ్యమనే నిశ్చయానికి వస్తాడు.

14. ఈ భావాలన్నింటిలోను శ్రీరామకృష్ణుల అనుపమాన సాఫల్యం

సాధారణ మనుష్యులు ఆధ్యాత్మిక భూమికి చెందిన సూక్ష్మతత్త్వాలను అవగాహన చేసుకోలేకపోవడమే అవతారపురుషులుగా పేర్కొనబడే సాధకవీరుల సాధన చరిత్రలు యథోచితంగా నమోదు చేయబడకుండడానికి కారణం ఏమో! ఎందుకంటే వారి సాధన చరిత్రలను చక్కగా అధ్యయనం చేసినప్పుడు సాధన మార్గంలో ప్రవేశించడానికి మునుపు వారికి ఉండిన త్యాగవైరాగ్యాలు, సాధనలో సిద్ధిని పొందిన పిమ్మట సంసారమోహితులైన మానవాళి శ్రేయస్సుకై వారి ద్వారా ఏ అద్భుతశక్తి ప్రకటితమైనదో, ఆ సంగతులు మాత్రమే విపులంగా చర్చించబడడం మనకు కానవస్తుంది. మనస్సులోని గత సంస్కారరాసులను దగ్ధం చేసి, కూకటి వ్రేళ్లతో సహా వాటిని పెకలించివేసి, తమ మీద నిరంకుశాధికారత్వాన్ని

15. సాధకవీరుల ఆధ్యాత్మిక సాధనల నమోదు కొరత

పొందడానికై సాధన కాలంలో ఆ యుగపురుషులు ఏ అపూర్వ అంతః పోరాటంలో నిమగ్నులై ఉండడం జరిగిందో, ఆ వివరాలు చూచాయగా మాత్రమే గ్రంథాలలో ఉటంకింపబడినాయి. లేదా ఆ పోరాటాన్ని గురించిన వివరణ రూపకాలంకారం ద్వారా, ఉపమానం ద్వారా, అతిశయోక్తుల ద్వారా ఎలా వివరించబడినదంటే, ఆ వివరాలలో దాగున్న అణుమాత్రపు నిజాన్ని వెతికి కనుగొనడం కూడ దాదాపు అసాధ్యమనే చెప్పాలి. క్రింద ఇచ్చిన ఉదాహరణల నుండి పాఠకులు మేం చెప్పదలచుకొన్న భావాన్ని అవగాహన చేసుకోగలరు.

16. ఉదాహరణలు

i. శ్రీకృష్ణుని గురించి

లోకకల్యాణార్థం ఆవశ్యకమైన విశేష శక్తుల సముపార్జనకై భగవాన్ శ్రీకృష్ణుడు అనేకసార్లు తపస్సు చేయడం జరిగింది. విశేష శక్తుల సముపార్జనలో అతడు నీటినో లేక గాలిని మాత్రమే ఆహారంగా స్వీకరించి, కొంతకాలం ఒంటి కాలిమీద నిలబడి తప మాచరించాడని మాత్రమే తెలియవస్తోంది. కాని ప్రాపంచిక సంస్కారాల నుంచి ముక్తుడు కావడం కోసం ఆతడు ఒనరించిన అంతస్సమర వివరాలు తెలియరావడం లేదు.

ii. బుద్ధదేవుని గురించి

బుద్ధదేవుని గురించి కూడ - తీవ్రవైరాగ్య సంపన్నుడై అతడు లోకాన్ని పరిత్యజించి వెళ్లిపోవడం, నిర్వాణానుభూతిని పొందిన పిమ్మట అతడు ధర్మ చక్ర ప్రవర్తనం గావించడం - ఈ సంగతులు మాత్రమే విశదంగా తెలియవస్తున్నాయి. కాని ఆతడి సాధన చరిత్ర అంత ఇదమిత్థంగా తెలియరావడం లేదు. ఐనప్పటికీ ఇతర అవతార పురుషుల సాధనలు బొత్తిగా తెలియరాని స్థితిలో ఉన్నప్పుడు, బుద్ధ దేవుడి సాధన గురించి ఏవో కొన్ని వివరాలైనా మనకు తెలియవస్తున్నవి. ఉదాహరణకు: సాధనలో సిద్ధి పొందడం కోసం స్థిరసంకల్పుడై అన్నపానీయాలను విసర్జించి ఆరేళ్లకాలం పాటు ఆసనం నుండి కదలక ధ్యానమగ్నుడై ఉండిపోవడం జరిగిందనీ, అంతఃపవనాన్ని నిరోధించి, 'ఆస్ఫానక' మనే ఒక విశేష ధ్యానాన్ని అభ్యసించి సమాధిమగ్నుడై ఉండిపోయాడనీ మనకు తెలియవస్తోంది. కాని చిత్త సంస్కార సమూహాలను ధ్వంసం చేయడానికై ఆతడు ఒనరించిన మానసిక సమరాన్ని గురించి వర్ణిస్తూన్నప్పుడు గ్రంథకారుడు దాన్నొక ఐహిక ఘటన మాదిరి 'మారుని'[1]తో యుద్ధం చేసినట్లు చిత్రించాడు.

iii. భగవాన్ ఏసును గురించి

ఏసుక్రీస్తు సాధనలను గురించి ఒక్కముక్క కూడ నమోదైనట్లు కానరావడం లేదు. పన్నెండేళ్ల వరకు ఆతడి బాల్య జీవితంలోని కొన్ని సంఘటనలు, తదనంతరం ఆయన తన ముప్పయ్యవ ఏట జాన్ అనబడే సాధువు ద్వారా 'జ్ఞానస్నానం'

(మన మంత్రదీక్ష లాంటిది) చేయించుకోవడం, పిమ్మట ఒంటరిగా ఎడారిలో ప్రవేశించి నలభై రోజులు తీవ్ర తపఃప్రార్థనలతో గడపటం, అక్కడ 'సైతాన్' ప్రలోభాలకు లోనుగాక విజయోపేతుడై తిరిగి రావడం, ఆ తరువాత లోక హితార్థం ధర్మమార్గాన్ని ప్రచారం చేయడం వంటి కొన్ని వివరాలు మాత్రమే అతడి జీవిత చరిత్రకారుడు వర్ణించాడు. ఏసుక్రీస్తు అలా జీవించింది మూడు సంవత్సరాల వరకే. కాబట్టి పన్నెండవ ఏట నుండి ముప్పయ్యవ ఏట వరకు, అంటే పద్దెనిమిది సంవత్సరాల కాలం అతడు ఎలా గడిపాడో మనకు తెలియ రావడం లేదు.

శంకరాచార్యుల జీవితంలోని అనేక సంఘటనల వివరాలు లభిస్తున్నాయి.

iv. శంకరుల గురించి

కాని ఆయన ఒనరించిన సాధనలను గురించి అప్పటి ఆయన మానసిక అవస్థలను గురించి ఈ సంఘటనల ద్వారా ఊహించడం తప్ప గత్యంతరం కనబడడం లేదు.

శ్రీ చైతన్య మహాప్రభువు సాధన చరిత్రాంశాలు చాలావరకు నమోదు కాబడి ఉన్నాయి. కాని లవలేశమైనా కామగంధం లేని ఆయన మహోన్నత భగవత్ప్రేమ,

v. చైతన్యుల గురించి

రాధాకృష్ణుల ప్రణయ విరహ కథల ద్వారా రూపకాలంకారంలో వర్ణింపబడడం వలన సామాన్యులు అనేక సందర్భాలలో దానిని యథాతథంగా అర్థం చేసుకోలేకపోతున్నారు. అయినా సఖ్య భావం, వాత్సల్య భావం ప్రత్యేకించి మధురభావం - ఈ భావాలను అనుసరించి చేస్తూన్న సాధన గురించి, సాధన ప్రారంభదశ నుంచి పరిపూర్ణ దశకు చేరేవరకు సాధకుడి మనస్సులో ఏఏ మార్పులు, స్థితులు ఏర్పడుతవో వాటిని గురించి సాధకాగ్రగణ్యుడైన శ్రీ చైతన్య మహాప్రభువు, ఆయన ప్రధాన శిష్యులు, అనుయాయులు చక్కగా విపులీకరించడం జరిగింది. ఈ విపులీకరణ ఎక్కువగా రూపకాలంకారంలోనే ఉంది. కాని పైన పేర్కొన్న సఖ్య, వాత్సల్య, మధుర భావాలలో ప్రతి ఒక్క భావసాధన కూడ పరాకాష్ఠకు చేరుకొన్నప్పుడు, ఆ స్థితిలో సాధకుడి మనస్సు తన ప్రేమాస్పదుడితో (భగవంతుడు) తాదాత్మ్యం చెంది, అద్వయ వస్తువులో, పరబ్రహ్మతత్త్వంలో విలీనమై పోతుందనే చరమ సత్యాన్ని వారు వ్యక్తపరచలేదు. లేదా ఆ చరమ స్థితిని గురించి ఏ కాస్తో ఇంగితం చేసినా అది హీనావస్థ అనీ, కనుక సాధకుడు దాన్ని గురించి అప్రమత్తంగా[1] మెలగాలనీ ఉపదేశించారు వారు.

---

1. హిందువులు కామాన్ని కామదేవుడిగా, క్రైస్తవులు 'సైతాన్'గా మార్చినట్లు, బౌద్ధులు కామాన్ని 'మారుడు'గా మార్చారు.

vi. మధురభావ చరమ తత్త్వాన్ని గురించి శ్రీరామ కృష్ణులు

శ్రీరామకృష్ణుల అనుపమాన జీవితం, అసాధారణమైన వారి సాధనలు ఈ ఆధునిక యుగంలో సాధనలన్నిటి చరమతత్త్వాన్ని గురించి అతి విపులంగా మనకు శిక్షణ గరపుతున్నాయి; లోకంలోని ప్రతిమతమూ, ప్రతిసాధనా మార్గమూ, సంప్రదాయమూ చివరికి ఈ అద్వైత స్థితికే, ఈ ఏకైక లక్ష్యానికే కొనిపోతున్నవనే సంగతిని విస్పష్టంగా, సందేహానికి తావులేకుండా అవగాహన చేసుకోవడానికి తోడ్పడుతున్నవి. ఆయన జీవితం నుంచి నేర్వదగిన ఇతర అంశాలను ఆవలపెట్టినా, సర్వమత సమన్వయాన్ని స్థాపించగలిగిన ఆయన సువిశాల ఆధ్యాత్మిక దృష్టికి యావత్ప్రపంచమూ ఋణపడి ఉన్నదన్న సంగతి నిస్సందేహం.

17. మధురభావం: వైష్ణవాచార్యులు

శ్రీ చైతన్య మహాప్రభువు, తదితర వైష్ణవాచార్యులు ఆధ్యాత్మిక జగత్తుకు ఒసగిన మహోన్నత వరప్రసాదం 'మధురభావం' అనే సంగతి మొదట్లోనే చెప్పుకొన్నాం. వారు ఈ మార్గాన్ని చూపించకుంటే భగవల్లాభం నిమిత్తం అది ఎందరో సాధకులకు అవలంబనీయమై, వారికి శాంతి, విమలానందప్రదాయకం కాలేకపోయేది. శ్రీకృష్ణుడి బృందావనలీల నిరర్థకంగా జరిపింపబడలేదనే సంగతిని వారు మొదట అర్థం చేసుకొని, ఇతరులు కూడ ఆ నిజాన్ని గ్రహించడంలో ఎంతో కృషి చేశారు. శ్రీ చైతన్య మహాప్రభువులు జన్మించని పక్షంలో బృందావనం నేడు ఊరు పేరు లేని ఒక అరణ్యంగా మిగిలి ఉండేది.

పాశ్చాత్యాన్ని అనుకరిస్తూ కేవలం బాహ్య సంఘటనలను మాత్రమే నమోదు చేయడానికి ప్రయత్నిస్తూన్న ఆధునిక చరిత్రకారులు ఇలా అనవచ్చు:

18. బృందావన లీలల చారిత్రకత గురించి

''మీరు అంటున్నట్లు బృందావన లీల 'యథార్థంగా' జరిగినదనడానికి ఎలాంటి దాఖలాలూ కానరావడం లేదు. కనుక మీరు అనుభూతం చెందుతూన్న ఆనంద విలాసాలు ఆ మహాభావం - ఇవన్నీ నిరాధారాల మీద ప్రతిష్ఠితమైనవే.'' ఈ ఆక్షేపణకు

---

1. సాధన యొక్క చరమావస్థ ఏది? అనే దాన్ని గురించి భక్తిమార్గానుయాయులకు, జ్ఞానమార్గానుయాయులకు అభిప్రాయం భేదం ఉంది. 'పంచదారను కాగోరను, పంచదారను తినగోరతాను' - అంటే భక్తుడు భగవంతుడి మాధుర్యాన్ని చవిచూడడమే భక్తిసాధన చరమస్థితి అనీ, దీనికోసం వారిద్దరి మధ్య ఒకింత ప్రభేదం ఉండితీరాలని భక్తిమార్గాచార్యులు ఉపదేశిస్తారు. కాదు నిర్విశేష పరబ్రహ్మంలో పూర్తిగా లీనం కావడమే చరమానుభూతి, అది కలుగనంతదాకా ముక్తి అసంభవం అని జ్ఞానమార్గావలంబుల అభిప్రాయం. అద్వైతస్థితే చరమావస్థ అనేదే శ్రీరామకృష్ణ - వివేకానందుల మతం. కాని ఇందు గురించి వివాదం నిష్ప్రయోజనం. సాధన చేసుకొంటూ పో, నిజం నీకే అవగతం అవుతుందని శ్రీరామకృష్ణుల హితవు.
- అనువాదకుడు

వైష్ణవాచార్యుల ప్రత్యుత్తరం ఇది: ''మేం నమ్ముతున్నట్లు పురాణాలలో వర్ణింపబడిన సంఘటనలు సంభవించలేదని రూఢిగా చెప్పటానికి నువ్వు ఎలాంటి ప్రమాణాన్ని చూపగలవు? నీ చరిత్ర ఆ అతి ప్రాచీనయుగ ద్వారాన్ని తెరివిందనే నిస్సందేహ ప్రమాణాన్ని నువ్వు చూపలేనంత వరకూ నీ సందేహం కూడ నిరాధారాల మీద ప్రతిష్ఠితమైనదనే మేం అనగలం. ఒకవేళ ఏనాడైనా నువ్వు అలాటి ప్రమాణాన్ని చూపగలిగినా మా విశ్వాసానికి ఎలాంటి హానీ వాటిల్లదు. నిత్య బృందావనంలో జరిగే భగవంతుడి నిత్యలీలను అది స్పృశించలేదు. ఆధ్యాత్మిక జగత్తులో ఆ రహస్య లీలను చూడకోరితే మొట్టమొదట మనోవాక్కాయాలతో కామగంధహీనుడవవ్వు. ఆ పిమ్మట శ్రీమతి (రాధాదేవి) చెలికత్తెలలో ఒకరి అడుగుజాడలలో నిస్వార్థంగా సేవలందించడం నేర్చుకో. అప్పుడు, కేవలం అప్పుడు మాత్రమే శ్రీహరి లీలాభూమి అయిన శ్రీ బృందావనం నీ హృదయంలో చిరప్రతిష్ఠితమై ఉండడమూ, నీతో సహా ఆ దివ్యలీల నిత్యం అక్కడ అభినయింపబడడమూ నువ్వు దర్శించగలవు, అనుభవించనూ గలవు.''

19. బృందావన లీలలపై శ్రీరామకృష్ణులు నుడివినది

ఆధ్యాత్మిక జగత్తు యథార్థమనే అనుభూతిని పొందడం ద్వారా ఎవడు బాహ్య ప్రపంచంలోని ఘటనల పట్ల ఉదాసీనంగా ఉండడం నేర్వడో, భక్తి భావాల చరిత్రను విశుద్ధ హృదయంతో అధ్యయనం చేయడం నేర్వడో, అతడు ఏనాటికీ బృందావన లీల యొక్క సత్యత్వాన్ని, మాధుర్యాన్ని చవిచూడలేడు. మహోత్సాహంతో శ్రీరామకృష్ణులు ఆ బృందావన లీలను వర్ణిస్తూవుంటే, ఆయన వద్ద కూర్చుని ఉన్న ఆంగ్ల విద్య నభ్యసించిన యువకులకు అది అంతగా రుచించకపోవడం ఆయన గుర్తించేవారు. అప్పుడాయన ఇలా అనేవారు: ''మీరు ఆ లీలలో శ్రీకృష్ణుని పట్ల శ్రీమతికి ఉన్న ఆ ఆకర్షణను గ్రహించలేకున్నారెందుకు? భగవంతుడి పట్ల మనస్సులో అటువంటి ఆకర్షణ కలిగినప్పుడు భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. భర్త, పిల్లలు, కుటుంబం, కులం, శీలం, మానం, అవమానం, లజ్జ, ఘృణ, ప్రజాభిప్రాయం పట్ల భీతి, సమాజ భయం - సర్వస్వాన్నీ విడిచిపెట్టిన గోపికలు గోవిందుడి కోసం ఎలా పిచ్చివారైపోయారో చూడండి. ఎవరైనా అలా చేయగలిగితే వారికి భగవత్సాక్షాత్కారం తథ్యం.'' తిరిగి కొనసాగిస్తూ ఆయన ఇలా అనేవారు: ''పూర్తిగా కామహీనులు కాకపోతే మహాభావమయిన శ్రీరాధాదేవి ప్రేమభావాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. సచ్చిదానంద స్వరూపుడైన శ్రీకృష్ణుణ్ణి చూడగానే గోపికల మనస్సులు కోటానుకోట్ల రత్యానందం కంటే అధికానందంతో పొంగిపొరలేవి - అలాంటప్పుడు పరమ తుచ్ఛమైన ఈ దైహిక రతిసుఖాన్ని గురించి వారి మనస్సులు ఎలా

యోచిస్తవి? శ్రీకృష్ణుని దేహం నుండి వెలువడిన దివ్యజ్యోతి వారి శరీరాలను స్పృశించి ప్రతి ఒక్క రోమకూపం ద్వారా రతిసుఖం కంటే అనంతమైన ఆనందాన్ని అనుభవింపచేసేది.''

ఒకప్పుడు స్వామి వివేకానంద శ్రీరామకృష్ణుల వద్ద శ్రీ రాధాకృష్ణుల బృందావన లీల యొక్క చారిత్రక ప్రామాణికతను గురించి ఆక్షేపణ లేవ దీసి దాన్ని పుక్కిటి పురాణంగా ఋజువు చేయటానికి యత్నించారు. అప్పుడు శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''మంచిది. రాధాదేవి అంటూ ఏ వ్యక్తీ ఎన్నడూ లేదనీ, ప్రేమిక సాధకు డెవరో రాధాదేవిని ఊహించి కల్పించాడనీ అనుకొందాం. కాని రాధాదేవి పాత్రను చిత్రీకరిస్తున్నప్పుడు ఆ సాధకుడు తనను మరచిపోయి రాధాదేవి భావంలో పూర్తిగా లీనమైపోయి తాను 'రాధ'గా అయిపోయాడని నువ్వు అంగీకరింపక తప్పదుగదా! ఆ విధంగా బృందావన లీలాభినయం బాహ్యంగానూ జరిగి ఉండటం సత్యమని ఋజువు అవుతోంది.''

బృందావనంలో భగవంతుడు సలిపిన రాసలీలను గురించి శతకోటి ఆక్షేపణలు లేవనెత్తినా, శ్రీ చైతన్య మహాప్రభువు మొదలైన వైష్ణవాచార్యుల ద్వారా ప్రథమంలో కనుగొనబడి పరమపావనమైన వారి జీవితాలలో అభివ్యక్తమైన మధురభావం చిరతర సత్యంగానే నిలిచిపోతుంది. ఆ మార్గాన్ని అనుసరించ డానికి అర్హుడైన సాధకుడు తననొక స్త్రీగా భావించి భగవంతుణ్ణే తన పతిగా ఎంచి భగవంతుడి పావన దర్శనాన్ని పొంది ధన్యుడవుతాడు. అంతేగాక ఆ భావం పరిపూర్ణ వికాసం చెందినప్పుడు ఆ సాధకుడు శుద్ధాద్వైత బ్రహ్మస్వరూపంలో ప్రతిష్ఠితుడవుతాడు.

20. శ్రీ చైతన్యులు – మధురభావం

భగవంతుడి పట్ల పతి భావాన్నీ ఆరోపించుకొని సాధనామార్గంలో ముందంజ వేయడం స్త్రీలకు స్వాభావికమూ, సుగమమూకూడ. కాని పురుష దేహధారులకు అది అస్వాభావికంగానే అనిపిస్తుంది. అలాటప్పుడు శ్రీకృష్ణ చైతన్యదేవులు ఈ అస్వాభావిక సాధనామార్గాన్ని లోకంలో ఎందుకు ప్రవేశపెట్టారు? అనే ప్రశ్న మనస్సులో తలెత్తక మానదు. యుగావతార పురుషులు ఒనరించే కార్యాలన్నీ లోకశ్రేయస్సుకే అని మనం జవాబు చెప్పుకోవాల్సి ఉంటుంది. శ్రీ చైతన్యులు ప్రవేశపెట్టిన ఆ మధురభావ సాధనమార్గం కూడ ఈ ప్రయోజనార్థమే. ఆ కాలం నాటి సాధ కులు ఏ ఆధ్యాత్మిక ఆదర్శాన్ని సాధింప సుదీర్ఘకాలం ఉత్కంఠతో కృషిసల్పారో ఆ విషయాన్ని గుర్తించే చైతన్యులు సాధకులను మధురభావ సాధనాపథంలో పురోగమింప చేశారు. నిత్యముక్తులూ అవతారపురుషులూ అయి శ్రీ గౌరాంగ

మహాప్రభువులు[1] కేవలం తన పురోగతి నిమిత్తం ఏ సాధనామార్గాన్ని అవలంబించారో, దానినే లోకం యావత్తుకూ ఆదర్శప్రాయమైనదని నెలకొల్పారనడం సబబు కాదు. అందు గురించి శ్రీరామకృష్ణులు ఇలా అనేవారు: "ఏనుగుకు శత్రువులను ఎదుర్కోటానికి బయట దంతాలు, ఆహారాన్ని నమిలి శరీరాన్ని పోషించే నిమిత్తం లోపలి దంతాలు, రెండు రకాలైన దంతాలు ఉంటాయి. ఆ రీతిలోనే శ్రీ గౌరాంగునిలో లోపల ఒక భావం, బయట ఒక భావం - రెండు రకాల భావాలు అభివ్యక్తమయ్యేవి. బాహ్యమైన మధురభావ సహాయంతో ఆయన లోకశ్రేయస్సును ఒనగూర్చేవారు. భగవత్ప్రేమ ఫలసిద్ధితో బ్రహ్మభావంలో సుప్రతిష్ఠులై స్వయంభూమానందాన్ని ఆస్వాదిస్తూ అంతరంగాన అద్వైత భావంలో ఉండేవారు."

21. శ్రీ చైతన్యులు - సమకాలీన ఆధ్యాత్మిక స్థితిగతులు

బౌద్ధయుగ అవసానకాలంలో దేశంలో 'వజ్రయాన'[2] మనే మార్గాన్ని బోధించే ప్రచారకులు బయలుదేరారని చరిత్రకారులు పేర్కొంటున్నారు. వారిలా ప్రచారం చేయసాగారు: "నిర్వాణాన్ని పొందాలని ప్రయత్నిస్తూన్న మనస్సు వాసనాజాలం నుండి దాదాపుగా తప్పించుకొని, ధ్యానం సహాయంతో మహాశూన్యంలో విలీనమవబోతున్న సమయంలో 'నిరాత్మ' అనే దేవి వారి ముందు ప్రత్యక్షమై, శూన్యంలో వారు విలీనం కాకుండా ఆపి తన దేహంలో వారిని ఐక్యం చేసి ఉంచుతుంది. ఆ స్థితిలో సాధకులకు బాహ్యసుఖాలను అనుభవించడానికి వలసిన భౌతికదేహాలు ఉండకపోయినా, సూక్ష్మశరీరాలు ఉండడం వల్ల ఆ దేవి వారిచేత నిత్యం సూక్ష్మరూపంతో సమస్త ఇంద్రియ భోగాల సారాన్ని అనుభవింపచేయిస్తూవుంటుంది. కాబట్టి స్థూల విషయభోగాల నన్నిటినీ త్యాగం చేస్తే, భావరాజ్యంలో ఎడతెగని సూక్ష్మభోగానందం ప్రాప్తిస్తుంది." ఈ మతాన్ని వజ్రయాన బోధకులు ప్రజలలో ప్రచారం చేశారు. ఈ రీతిలో ప్రచారం గావించబడిన మతం కాలక్రమంలో అపార్థానికి గురై ఎడతెగని విషయ వాంఛే మత, సాధనల గమ్యంగా పరిణామం చెందడం, తత్ఫలితంగా దేశంలో విశృంఖల వ్యభిచారం విస్తృతి గాంచడం విచిత్రం అవబోదు. శ్రీ చైతన్య మహాప్రభువు అవతరించిన కాలంలో విద్యావిహీనులైన దేశవాసులు అపార్థం పాలైన ఈ బౌద్ధ సిద్ధాంతాన్ని అవలంబించి విభిన్న రహస్య శాఖల క్రింద విభజించబడ్డారు. బ్రాహ్మణాది అగ్రవర్ణాల వారు

---

1. శ్రీ చైతన్యులే - శ్రీకృష్ణ చైతన్యులు, శ్రీకృష్ణ చైతన్య భారతి, గౌరాంగ ప్రభువు, నిమాయ్ (బాల్యనామం) అని కూడ పేర్కొనబడుతూ ఉంటారు.

2. ఇదొక హేయమైన తాంత్రిక సాధనమార్గం.

కూడ అనేకులు జుగుప్సాకరమైన యీ తాంత్రిక వామాచార మార్గాలను అనుసరిస్తూ జగన్మాత యొక్క సకామపూజ, ఉపాసనల ద్వారా అణిమాది శక్తుల సముపార్జన నిమిత్తమూ, నిరవచ్ఛిన్న భోగసుఖప్రాప్తికోసమూ - మతం అంటే అదే అని భావించి కృషి చేయసాగారు. ఈ విధంగా ఈ వికృతిమార్గం మతం క్రింద ప్రచారం కాసాగింది. ఈ మతశాఖల ముమ్మరంలో పవిత్ర ఆధ్యాత్మిక భావాలలో ఏదో ఒక భావాన్ని అవలంబించి నిరవచ్ఛిన్న బ్రహ్మానంద ప్రాప్తిని పొందగోరే యథార్థ సాధకులు మార్గదర్శకత్వం కొరవడి నిస్సహాయ స్థితిలో ఉండిపోవడం జరిగింది. ఇటువంటి పరిస్థితిలోనే శ్రీ చైతన్య మహాప్రభువు అవతరించారు. మొదట్లో శ్రీ చైతన్యులు అద్భుతమైన త్యాగవైరాగ్యాలను తమ జీవితంలో ఆచరించి తదాదర్శాలను శ్రద్ధాళువులైన ఆ సాధకులకు చూపారు. పిదప త్యాగవైరాగ్యాదర్శంలో దృఢంగా పాదుకొన్నాక అత్యంత శుద్ధచిత్తుడైన తన నొక స్త్రీగా భావించుకొని భగవంతుని పతిగా ఆరాధించినప్పుడు జీవుడికి సూక్ష్మభావ రాజ్యంలో నిరవచ్ఛిన్న దివ్యానందానుభూతి నిజంగానే లభిస్తుందని ఆ సాధకులకు కనబరచారు. ఇది ఉన్నతులైన సాధకులకు మాత్రమే ఉపయుక్తమైన మార్గం. కాని జనసామాన్యానికి శ్రీ చైతన్యులు భగవంతుడి నామమహాత్మ్యాన్ని చాటి, నామజప సంకీర్తనాదులలో వారిని నియుక్తులను గావించారు. ఇంకా కలుషితంగాని, లక్ష్యచ్యుతి నొందని అనేక బౌద్ధ సంప్రదాయావలంబులు శ్రీ చైతన్యుల కృపతో మళ్లీ నిజమైన ఆధ్యాత్మిక మార్గం పట్టగలిగారు. వికృత వామాచారాన్ని అవలంబించే వర్గాలు మొదట్లో బాహాటంగా చైతన్యులను ధిక్కరించాయి. కాని అనుపమానమైన ఆయన జీవితాదర్శం పట్ల విశేష ఆకర్షణకు లోనై, ఆత్మఖండన చేసుకొని నిష్కామభావంతో ఆరాధించి జగజ్జననీ దర్శన లబ్ధికై ప్రయత్నించసాగారు. అనుపమానమైన శ్రీచైతన్యుల జీవిత ఘట్టాలను నమోదు చేసే సందర్భంలో కొందరు రచయితలు[1] శూన్యవాద సిద్ధాంతం ప్రతిపాదించిన బౌద్ధులు శ్రీ చైతన్యుల జనన సమయంలో ఆనందించారని వ్రాయడానికి హేతువు ఇదే.

22. మధురభావ సారతత్త్వం

సచ్చిదానంద స్వరూపుడైన శ్రీకృష్ణ పరమాత్ముడొక్కడే పురుషుడు. జగత్తులోని సమస్త స్థూల, సూక్ష్మ జీవజాలం మహాభావ రూపి అయిన ఆతడి ప్రకృతి అంశాలు కనుకనే ఆతడి భార్యలు. కనుక పవిత్ర హృదయులై జీవులు ఆతణ్ణే స్వామిగా, పతిగా భావించి

---

1. 'చైతన్య మంగళ'మనే గ్రంథాన్ని చూడండి. చైతన్యుల జీవిత చరిత్ర గ్రంథాలలో ఇది ప్రధానమైన, ప్రామాణికంగా పరిగణించబడే గ్రంథం.

త్రికరణశుద్ధిగా ఆరాధించగలిగితే భగవత్కృపతో సత్వరమే తమ లక్ష్యమైన ముక్తిని పొంది నిరవచ్ఛిన్న బ్రహ్మానందాన్ని అనుభవించగలరు. ఇది చైతన్య మహాప్రభువుల ద్వారా ప్రచారం గావించబడిన మధురభావ మూలతత్త్వం, సారాంశం. శాంత దాస్యాది ఇతర భక్తి భావాలన్నీ ఒక గొప్ప భావంలో ఇమిడివున్నప్పుడు దాన్ని మహాభావంగా పేర్కొంటారు. గోపికలలో ప్రధానురాలైన రాధాదేవి మహాభావ స్వరూపిణి. ఇతర గోపికలు ప్రతి ఒక్కరూ ఈ మహాభావాంతర్గతమైన ఇతర భావాలలో ఒకటో లేక అంతకంటే ఎక్కువ భావాల మూర్తులు. కాబట్టి సాధకు డెవడైనా ఈ గోపికల భావాలను అనుసరించి సాధన చేసి ఆయా భావాలలో పరిపూర్ణత్వం సాధించి చిట్టచివరకు ఆ మహాభావం నుండి జనించే మహదానందాన్ని లిప్తకాలం చవిచూసి ధన్యుడౌతాడు. ఈ విధంగా మహాభావ స్వరూపిణి[1] అయిన రాధాదేవి భావాన్ని ధ్యానిస్తూ, తన స్వకీయ సుఖాన్నికైన కోరికలను ఆసాంతం పరిత్యజించి మనోవాక్కాయాల ద్వారా సర్వతోభావంగా శ్రీకృష్ణుని సుఖంలోనే తన సుఖాన్ని పొందడం - ఈ భావమార్గం అనుసరించే సాధకుడి చరమలక్ష్యం.

---

1. కృష్ణస్య సుఖే పీడాశంకయా నిమిషస్యాపి అసహిష్ణుతాదికం యత్ర స రూఢో మహాభావః। కోటి బ్రహ్మాండగతం సమస్త సుఖం యస్య సుఖస్య లేశోపి న భవతి, సమస్త వృశ్చిక సర్పాదిదంశ కృత దుఃఖమపి యస్య దుఃఖస్య లేశో నభవతి, ఏవం భూతే కృష్ణ సంయోగ వియోగయోః సుఖదుఃఖే యతో, భవతః అధిరూఢః మహాభావః। అధిరూఢస్యైవ మోదన మాదన ఇతి ద్వ్యారూపౌ భవతః। -శ్రీ విశ్వనాథ చక్రవర్తి విరచిత 'భక్తిగ్రంథావళి' నుండి.

పై శ్లోక సారాంశం: భావమార్గాన్ని అనుసరిస్తూ సాధకుడు సర్వదా శ్రీకృష్ణుని సుఖాన్నే కోరుతూ, అతడు సుఖంగా ఉన్నప్పుడు కూడ ఆ సుఖంలో ఏదైనా పీడ కలుగుతుందేమోనని భయం చెందుతూ, ఆ భయంతో క్షణమైనా స్థిమితంగా ఉండలేని స్థితికి చేరినప్పుడు ఆ స్థితిని మహాభావంలోని 'రూఢ' స్థితి అంటారు. ఇది మహాభావం కంటే ఒక్కమెట్టు దిగువ స్థితి. పై మెట్టే మహాభావం. ఇక శ్రీకృష్ణుని సంయోగం నుండి ఏ సుఖం లభిస్తుందో కోటికోటి బ్రహ్మాండాలలోని సుఖం యావత్తూ ఆ సుఖంలో ఒక కోట్యంశానికి కూడ సమం కాదు; అలాగే లోకంలోవున్న తేళ్లు, పాములు కుట్టినా, కాటువేసినా ఆ దుఃఖం కృష్ణవియోగ దుఃఖంలోని కోట్యంశానికి సమానం అనిపించదు. శ్రీకృష్ణుని సంయోగ వియోగం నుండి అటువంటి సుఖదుఃఖాలు సాధకుడికి ఏ స్థితిలో అలా అనుభూతాతీతమో దానికి 'అధిరూఢ' స్థితి లేదా 'మహాభావం' అని పేరు. ఈ అధిరూఢ స్థితికి మోదనం, మాదనం అనే రెండు లక్షణాలు ఉన్నవి. రాధాదేవి యొక్క చెలికత్తెలలో కలిగే అపరిమితానందమే మోదనం. శ్రీకృష్ణుని భావనలో 'మత్తెక్కడం', అంటే సాత్త్విక భావాలన్నీ పరిపూర్ణంగా వ్యక్తమవడం, తత్ఫలితంగా శ్రీమతి దేహంలో కలిగే పులకింత, గగుర్పాటు ఇత్యాది మార్పులు కలుగడానికే 'మాదనం' అని పేరు.

సామాజిక నియమానుసారం వివాహమాడిన ప్రేమిక దంపతుల ప్రేమ యథేచ్ఛగా వ్యక్తం కాదు. జన్మ, జాతి, కులం, శీలం, సదాచారం, లోకనింద, సమాజ భీతి ప్రభృత బాహ్యపరిస్థితుల చేత చాల మేరకు ఆ ప్రేమ పరిమితం చేయబడుతుంది. అలాంటి ప్రేమికులు కర్తవ్యాకర్తవ్యాలను దృష్టిలో ఉంచుకొని ఈ నియమాల హద్దులలోనే ఉంటూ పరస్పర సుఖం నిమిత్తం యథాసాధ్యంగా త్యాగాన్ని పరిగ్రహిస్తూ ఉంటారు. వివాహితురాలైన స్త్రీ కఠోరమైన కట్టుబాట్లను తగిన రీతిలో పాటించబోయి అనేక సందర్భాలలో ప్రియుడిపై తనకున్న ప్రేమను విస్మరించడానికి లేక చాలావరకు తగ్గించుకోవడానికి వెనుకాడదు. కాని అక్రమ ప్రియుడి విషయంలో ఈ ప్రవర్తన పూర్తి భిన్నం. ప్రేమోద్వేగ కారణాన ఆమె సామాజిక సంప్రదాయాలను త్రోసిరాజని, తన సామాజిక భద్రతను పణంగాపెట్టి తన ప్రియుణ్ణే కలుసుకోవడానికి కించిత్తు అయినా వెనుకంజ వేయదు. ఇలాంటి ప్రేమోద్వేగాన్ని భగవంతుడిపట్ల కల్పించుకోమని వైష్ణవాచార్యులు సాధకులకు ప్రబోధిస్తూంటారు. కనుకనే బృందావన మహారాజ్ఞి అయిన శ్రీ రాధాదేవి వివాహిత అయినప్పటికీ, శ్రీకృష్ణుడి ప్రేమకై తన సర్వస్వాన్ని త్యజించిన భావమయిగా అభివర్ణించబడింది.

23. ప్రియుడిపైగల యావత్తు ప్రేమనూ భగవంతుడిపై ఆరోపితం చేయడం

శాంత, దాస్య, సఖ్య, వాత్సల్యభావాల సమష్టి సారం మధురభావం అనీ, ఇంకా చెప్పాలంటే - అంతకంటే అధికమైనదేననీ వైష్ణవాచార్యులు అభివర్ణించారు. ప్రేమికురాలైన నాయిక బానిసలా ప్రియుణ్ణే సేవిస్తుంది. నేస్తంలా సర్వావస్థల్లోనూ సముచిత సలహాల నిస్తుంది. అతడి సుఖంలోనే తన సుఖం ఉన్నట్లు భావిస్తుంది. అతడి బాధలు తన బాధలుగా స్వీకరిస్తుంది. అతడి శారీరక మానసిక పోషణ బాధ్యతను తల్లిలా స్వీకరిస్తుంది. సర్వదా అతడి శ్రేయస్సు గురించే యోచిస్తూ ఉంటుంది. కనుకనే మధురభావం మిన్నగా పరిగణించబడుతోంది. ఈ రీతిలో సకల విధాలా తనను తాను పూర్తిగా మరచిపోయి ప్రియతముడి శ్రేయాన్ని సాధిస్తూ, ఆతడి మనస్సుకు సర్వదా వినోదాన్ని కలిగిస్తూ, మనస్సును అపూర్వ శాంత్యానందాలతో నింపుతూ ఉంటుంది. ఏ నాయిక అలా తనను తాను ప్రేమ ప్రాబల్యంలో సంపూర్ణంగా మరచిపోయి ప్రియుడి శ్రేయో ఆనందాల నిమిత్తం శాయశక్తులా పాటుపడుతూవుంటుందో ఆమె ప్రేమయే సర్వోత్కృష్టమైనదనీ, పైగా ఆమే 'సమర్థ ప్రేమిక' అనీ భక్తి గ్రంథాలలో వర్ణింపబడివుంది. స్వార్థంతో కలుషితమైన ఇతర ప్రేమలన్నీ 'సమంజస', 'సాధారణి' కోవలలో చేర్చబడ్డాయి. 'సమంజస' కోవకు చెందిన నాయిక ప్రియుడి సుఖానికై ఎంత తాపత్రయ

24. అన్ని ఇతర భావాలూ వెరసినా మధుర భావమే మిన్న

పడుతుందో, స్వీయసుఖం కోసమూ అంతగానే తాపత్రయ పడుతుంది. ఇక 'సాధారణి'కి చెందిన నాయక కేవలం తన స్వీయ సుఖం కోసమే నాయకుణ్ణి ప్రేమిస్తుంది.

విషయ సుఖాలను గరళంలా విడనాడి ఆత్మసంయమంతో జీవితాన్ని గడుపుతూ, ప్రేమలో తనను తాను శ్రీకృష్ణుని ప్రేయసి స్థానంలో ఉన్నట్లు భావించుకోమని చైతన్యులు సాధకులకు ప్రబోధించారు.

25. మధురభావం ద్వారా చైతన్యులు చేసిన సేవలు

భగవన్నామ మహాత్మ్యాన్ని ప్రచారం చేసి సమాజంలో ఆ కాలఘట్టంలో మితిమీరిపోతూన్న (వామాచార తంత్రాల ద్వారా) వ్యభిచారాన్ని ఆ విధంగా అరికట్టగలిగారు. ఆయన సాధకులకు అందించిన భక్తిభావం, ఉపదేశం ప్రజానీకానికి చిరతర శ్రేయాన్ని కలిగించాయి. మార్గభ్రష్టులను సన్మార్గంలో పెట్టగలిగాయి. అదేవిధంగా అస్పృశ్యులుగా, సమాజం నుండి వెలివేయబడినట్లుగా పరిగణింపబడే వారినందరినీ తిరిగి సమాజంలోకి సగౌరవంతో తీసుకొని వచ్చి అందరినీ 'భాగవద్భక్తు' లనే క్రొత్త కులంలోకి చేర్చారు. అన్ని సంప్రదాయాలవారి ఎదుట త్యాగవైరాగ్యాలనే పవిత్ర ఉన్నత ఆదర్శాన్ని నిలబెట్టి అశేష లోకహితాన్ని చైతన్యులు చేకూర్చారు.

అంతేకాదు - జగన్నాథుడైన భగవంతుని గాఢంగా ధ్యానించి తద్వారా పవిత్ర చిత్తుడైన సాధకుడిలో మానసిక శారీరక వికారాలనబడే 'ఎనిమిది సాత్త్విక వికారాలు'[1] (వీటి తామసిక ప్రతిరూపాలు సామాన్య ప్రేయసీ ప్రియుల ప్రణయం, సంగమం నుండి ఉత్పన్నమవుతవి) నిజంగానే కలుగుతవనే విషయం చైతన్య మహాప్రభువు నిస్సందేహంగా నిరూపించి చూపారు. దాని సహాయంతో వైష్ణవ సంప్రదాయం ద్వారా ప్రచారం కాబడుతూన్న మధురభావం ఆనాటి అలంకార శాస్త్రాన్ని ఆధ్యాత్మిక శాస్త్రాలలో ఒకటిగా చేర్చి, అశ్లీల వాక్యాలన్నిటినీ ఉన్నత పవిత్ర ఆధ్యాత్మిక భావంతో రంజితం చేసి సాధక మనస్సులకు వాటిని ఆనంద దాయకాలుగా, ఉన్నతి విధాయకాలుగా చేసింది. అంతేగాక శాంతభావ సాధనకు ఆటంకాలుగా పరిగణింపబడే కామక్రోధాదులను - భగవంతుణ్ణే తనవాడిగా

---

1. యే చిత్తం తనుం చ క్షోభయంతి తే సాత్త్వికాః। తే అష్టౌస్తంభ స్వేదః రోమాంచ స్వరభేద వేపథు - వైవర్ణ్యాశ్రు ప్రలయాః ఇతి। తే ధూమాయితా జ్వలితా దీప్తా ఉద్దీప్తా సుదీప్తా ఇతి పంచవిధా యథోత్తర సుఖదాస్యుః॥ - ఆకరగ్రంథం

మనశ్శరీరాలను క్షోభపెట్టే వికారాలు సాత్త్విక వికారాలు. స్తంభితుడవడం (అంటే కదలలేక నిశ్చేష్టితుడవడం), చెమట పట్టడం, గగుర్పాటు, గద్గదస్వరం, వణకడం, వివర్ణుడవడం, కన్నీళ్లు కార్చడం, శరీర స్మృతిని కోల్పోవడం అని ఎనిమిది రకాలు. మళ్లీ తరతమ భేదానుసారం అవి ఐదు విధాలు. 1. పొగతో కూడిన సన్నని మంటవలె 2. ఒకింత వెలుగు 3. చక్కని వెలుగు 4. ఉజ్వల వెలుగు 5. మహోజ్వల వెలుగు. తరతమ భేదాన్ని అనుసరించి అవి సాధకునికి అధికాధికంగా ఆనందప్రదాయకాలవుతాయి.

చేసుకొని అతడికోసం, పైగా అతడి మీదనే వాటినన్నిటినీ ప్రయోగించడం నేర్పించి సాధన మార్గాన్ని సుగమం చేసింది చైతన్యుల మధురభావ బోధన.

ఆధునిక విమర్శకుల దృష్టిలో పురుష దేహధారులు మధురభావ సాధన నవలంబించడం అస్వాభావికమూ, అనౌచిత్యంగానూ కనిపించవచ్చు. కాని

26. వేదాంతులు - మధురభావం

వేదాంతవాదులకు దాని యౌక్తికతను, ప్రయోజనాన్ని నిర్ధారణ చేయడానికి అంత సమయం పట్టదు. దీర్ఘకాల అభ్యాస ఫలితంగా ఆలోచనలన్నీ మనస్సులో దృఢమైన సంస్కారాలుగా మారడం అతడు కనిపెడతాడు. జన్మజన్మాంతరాల ఈ సంస్కారాల ప్రాబల్యం చేతనే మనిషి ఒక్క అద్వయ బ్రహ్మవస్తువునే ఈ అనంత నానాత్వమయ ప్రపంచంగా కాంచుతూంటాడు. పరమేశ్వరుడి అనుగ్రహంతో ఒకవేళ అతడు ఎప్పుడైనా ప్రపంచం మిథ్య అని తెలుసుకోగలిగితే, ఆ క్షణంలోనే అతడి కళ్ళ ఎదుటే అది శూన్యంలో అదృశ్యమైపోతుంది. ప్రపంచం గోచరమవుతోంది. నేను పురుషుడను అని భావించడం వల్లనే నేను పురుషుడనైనాను. అలాగే తాను స్త్రీ అవడం సంభవిస్తోంది. మళ్లీ మానవ హృదయంలో ఏదైనా ఒక భావం ప్రబలమై నెలకొంటే ఆ భావం తద్వ్యతిరిక్త భావాల నన్నిటినీ త్రోసివేసి, క్రమంగా వాటిని నాశనం చేయడం మన దైనందిన జీవితంలో అనుభవైకవేద్యమే. కనుక భగవంతుడితో మధురభావ సంబంధాన్ని కలిగించుకొని క్రమంగా అది ప్రాబల్యం వహించడంతో ఇతర భావాల నన్నిటినీ ఆవరించి పిదప వాటి నన్నిటినీ పీకి పారవేయడానికై చేయబడే ఈ సాధనను వేదాంతులు చక్కగా అర్థం చేసుకోగలరు. దాన్ని, కాలులో గుచ్చుకొన్న ముల్లును మరొక ముల్లుతో తీసివేయడం వంటి ప్రయత్నంగా వారు వివేచిస్తారు. మనస్సులోని సంస్కారాలన్నిటికీ ముఖ్యావలంబనం 'నేను దేహిని లేదా నేను శరీరధారిని' అనే జ్ఞానం. మళ్లీ ఈ దేహంతో సంయుక్తమైన 'నేను పురుషుణ్ణి లేదా స్త్రీని' అనే సంస్కారం ఇతర సంస్కారాలన్నిటికంటే అతి ప్రాబల్యం వహిస్తుంది. కాబట్టి భగవంతుడి పట్ల పతి భావాన్ని ఆరోపించుకొని 'నేను స్త్రీని' అని సదా భావిస్తూ సాధక పురుషుడు ఎప్పుడు 'తన పుం భావాన్ని' మరచిపోవడంలో కృతకృత్యుడవుతాడో అప్పుడతడు 'నేను స్త్రీని' అనే భావాన్ని కూడ సులువుగానే అతిక్రమించి భావాతీత స్థితికి చేరగలడని చెప్పడం అనవసరం. కనుక మధురభావ సాధనలో పరిపూర్ణుడైనప్పుడు సాధకుడు భావాతీత భూమికి అతిసామీప్యానికి చేరగలడనే సంగతి వేదాంతవాది దృష్టికి సర్వదా యుక్తియుక్తంగా కనబడుతూ ఉంటుంది.

రాధాదేవి (శ్రీమతి) యొక్క ప్రేమభావ స్థితిని పొందడమే సాధకుడి లక్ష్యమా? అనే ప్రశ్న తలఎత్తవచ్చు. కాని వైష్ణవాచార్యులు ఈ సాధనను

27. మధురభావం - శ్రీమతి ప్రేమభావ స్థితి

ఒప్పుకోల్లరు. రాధాదేవి స్థితిని ఎవ్వరూ పొందజాలరనీ, సాధకుడు రాధాదేవి సఖీభావ స్థితిని మాత్రమే పొందగలడనీ వారు వక్కాణిస్తారు. ఐనప్పటికీ శ్రీమతి భావాన్ని పొందడమే సాధకుడి చరమగమ్యంగా మనం స్వీకరించాలి. ఎందుకంటే శ్రీమతికి, ఆమె సఖీమణులకు మధ్య ఉండేది గుణగత భేదం కాదు, పరిమాణ భేదం మాత్రమే. వారూ శ్రీమతిలానే సచ్చిదానందఘనుడైన శ్రీకృష్ణుని పతిగా భావించి భజించేవారే. అంతేగాక రాధాదేవితో కలిసినప్పుడు శ్రీకృష్ణుడు అధికానందాన్ని పొందడం గాంచి అతణ్ణి సుఖింపజేయగోరి రాధాకృష్ణుల సంగమం కోసం సర్వదా ప్రయత్నిస్తూవుండడం కానవస్తోంది. అదే విధంగా మనకు కనిపిస్తున్న మరొక విషయం ఏమిటంటే రూపగోస్వామి, సనాతన గోస్వామి, జీవగోస్వామి ప్రభృత వైష్ణవ గోస్వాములు ప్రతి ఒక్కరూ తమ తమ మధురభావాన్ని పరిపుష్టం చేసుకోవడానికై వేర్వేరు శ్రీకృష్ణ ప్రతిమలను సేవిస్తూ తమ బృందావన జీవితాన్ని గడిపారు. కాని శ్రీకృష్ణునితోబాటు శ్రీ రాధాదేవి ప్రతిమను కూడ ప్రతిష్ఠించి సేవించడానికి పూనుకోలేదు. కారణం ఏమిటంటే తమను తాము రాధాదేవి స్థానంలో ఊహించుకొని సాధన కొనసాగించినందునే వారు ఆమెను అలా పూజించలేదని మనం ఊహించవలసి ఉంది.

వైష్ణవ మత గ్రంథాలు అభివర్ణిస్తూన్న ఈ మధుర భావాన్ని గురించి అధ్యయనం చేయగోరేవారు శ్రీరూప, సనాతన, జీవగోస్వామి[1] మొదలైన తొలి వైష్ణవాచార్యులు వ్రాసిన భక్తిగ్రంథాలను, అలాగే శ్రీవిద్యాపతి, చండీదాస్[2] ప్రభృత భక్త కవిశ్రేష్ఠులచే విరచితమైన పూర్వరాగం, దానం, మానం, అభిమానం, మాధురం[3] ఇత్యాది భావాలు వర్ణింపబడిన పదావళి[4] గ్రంథాలను బాగా చదవాలి. మధుర భావనను చేపట్టి దానిలో ఏ పరాకాష్ఠ స్థితికి శ్రీరామకృష్ణులు చేరుకొన్నారో ఆ విషయం సుబోధక మవుతుందనే ఉద్దేశంతోనే మేం దాని సారాంశాన్ని ఇక్కడ సంక్షిప్తంగా చర్చించడం జరిగింది.

---

1. వీరు ప్రఖ్యాత వైష్ణవాచార్యులు.
2. వీరు వైష్ణవ మతాన్ని కవితారూపంలో ప్రచారం చేసిన (త్యాగరాజు వంటి) మహాభక్తులు.
3. పూర్వరాగం అంటే ప్రేమభావం ప్రారంభమవడం. దానం అంటే తనను తాను ప్రియునికి అర్పించుకోవడం. మానమంటే ప్రియుడి మీద చూపబడే ప్రేమపూర్వకమైన అలుక. అభిమానం అంటే ప్రియుడు తనను మరింత ఉదాసీన పరుస్తున్నాడనే తీవ్రమైన అలుక. మధుర భావానికి చెందిన ఈ వేర్వేరు భావాలు మొత్తం 'మాధురం' అని పేర్కొనబడతాయి.
4. వైష్ణవ కవిత్వం చోటుచేసుకొన్న కొన్ని గ్రంథాలకు 'పదావళి' అని పేరు.

14. శ్రీరామకృష్ణుల మధురభావ సాధన

1. ఆధ్యాత్మిక భావాలలో నెలకొని ఉండడమే శ్రీరామకృష్ణుల స్వాభావికత

పవిత్ర, ఏకాగ్రచిత్తంలో ఎప్పుడు ఏ భావం ఉదయిస్తుందో, దాన్లో పరిపూర్ణంగా శ్రీరామకృష్ణులు నెలకొని ఉండేవారు. అప్పుడు ఆ భావం ఆయన మనస్సును ఆసాంతం ఆవరించుకొని ఇతర భావాల నన్నిటినీ లుప్తం చేసేది. అంతేగాక ఆయన శరీరాన్ని ఆ భావ పూర్ణప్రకటనకు అనువైన సమగ్ర పరికరంగా మార్చివేసేది. మనం ఆయన జీవితాన్ని పరికించినప్పుడు, ఈ మానసిక విలక్షణత బాల్యంనుండీ ఆయనలో ఉండడాన్ని కనుగొనవచ్చు. మేం దక్షిణేశ్వరానికి రాకపోకలు చేసే కాలంలో ఆయన ఈ ప్రవృత్తిని అనునిత్యం గమనించే వాళ్లం. భక్తి సంగీతాన్ని వింటున్నప్పుడో లేదా మరో కారణంగానో ఆయన మనస్సు ఏదో ఒక ప్రత్యేక భావంలో మగ్నమై ఉన్నప్పుడు, ఇతర భావాలకు అనుగుణమైన సంగీతాన్ని గాని, ప్రసంగాన్ని గాని ఎవరైనా ప్రారంభిస్తే ఆయన తీవ్రమైన బాధకు లోనవడం మేం చూశాం. ఒకే దిశగా ప్రవహిస్తూవున్న చిత్తవృత్తుల గతి హఠాత్తుగా మరో భావానికి అనుగుణమైన సంగీత లేక ప్రసంగ ప్రవేశంతో నిరోధింపబడడమే ఆయన అలా బాధపడడానికి హేతువు. ఏదేని ఒకే ఒక్క భావం మీద చిత్తవృత్తులన్నీ ఏకాగ్రం అయ్యేస్థితిని సవికల్ప సమాధిగా పతంజలి ఋషి అభివర్ణించారు. భక్తి గ్రంథాలన్నీ దీన్నే భావసమాధిగా పేర్కొంటున్నాయి. శ్రీరామకృష్ణుల మనస్సు చిన్ననాటి నుంచీ అలాంటి పారవశ్య స్థితిలో నెలకొని ఉండేదని యిందుమూలంగా స్పష్టంగా తెలియవస్తోంది.

ఆధ్యాత్మిక సాధనలు ప్రారంభించినప్పటి నుంచీ పైన తెలిపిన ఆయన మానసిక విలక్షణత మరొక కొత్త అపూర్వ మార్గాన్ని అనుసరించింది. ఎందుకంటే తొలిరోజుల్లోలాగా ఆయన మనస్సు ఇప్పుడు ఏదైనా ఒక భావంలో ఒకింత కాలమే నెలకొని, ఆ పిదప మరొక భావంలోకి ప్రవేశించడం లేదు. ఒక

2. శ్రీరామకృష్ణులపై సాధనల పరిణామాలు

భావం సంస్థాపన చెందాక ఆ భావంలో పురోగతి గాంచి ఆ భావపు పరాకాష్ఠను చేరి, భావాతీతమైన అద్వయ స్థితిని అస్పష్టంగానైనా అనుభవించేటంత వరకు ఆ భావంలోనే స్థిరంగా ఆయన మనస్సు మగ్నమై ఉండసాగింది. పై విషయానికి ఉదాహరణలుగా కొన్ని సంఘటనలు పేర్కొనవచ్చు. దాస్యభావాన్ని సాధిస్తూవున్నప్పుడు దాని పరాకాష్ఠను చేరనంత కాలం శ్రీరామకృష్ణులు అపత్య (తాను జగన్మాత కుమారునిగా) భావసాధనను చేపట్టలేదు. అదే విధంగా అపత్య భావసాధనలో సిద్ధిని పొందనంత దాకా ఆయన వాత్సల్య, మధుర భావ సాధనానుష్ఠానాలను ప్రారంభించలేదు. శ్రీరామకృష్ణుల సాధన చరిత్రను అధ్యయనం చేసినప్పుడు సర్వత్రా ఇలాగే జరిగినదనడానికి అనేక దృష్టాంతాలు మనకు అగపడతాయి.

3. మధురభావ సాధనకు పూర్వం ఆయన వైఖరి

భైరవీ బ్రాహ్మణి అరుదెంచిన సమయంలో శ్రీరామకృష్ణుల మనస్సు భగవంతుణ్ణే తల్లిగా చూసే మాతృభావంతో నిండిపోయి ఉంది. ప్రపంచంలోని ప్రతి ప్రాణిలోను, ప్రతి పదార్థంలోను, విశేషంగా ప్రతి స్త్రీలోను ఆయన సాక్షాత్తూ జగన్మాతృ స్వరూప వ్యక్తీకరణను గాంచేవారు. అందుచేతనే భైరవీ బ్రాహ్మణిని చూసిన క్షణంలో ఆమెను 'అమ్మా' అని సంబోధించారు. తాను ఆమె కుమారుడినని పూర్తిగా విశ్వసించారు. కొన్ని సమయాల్లో ఆమె అంకంలో కూర్చుని ఆమె చేతితో ఆహారం స్వీకరించేవారు. ఈ కాలంలో బ్రాహ్మణి కొన్ని సమయాల్లో వ్రజ గోపికల భావంలో తన్మయురాలై మధురభావాన్ని వ్యక్తీకరించే పాటలను పాడేదనీ, శ్రీరామకృష్ణులకు అది నచ్చక ఆ పాటలను ఆపి మాతృభావాన్ని ప్రకటించే గీతాలను పాడమని ఆమెను కోరేవారనీ హృదయ్ ద్వారా మేం వినడం జరిగింది. బ్రాహ్మణి కూడ శ్రీరామకృష్ణుల మానసిక స్థితిని చక్కగా అవగతం చేసుకొని తక్షణం జగన్మాత సఖీభావాన్నో లేదా దాసీభావాన్నో వ్యక్తం చేసే గీతాలాపన ప్రారంభించేది. లేదా బాలగోపాలుని పట్ల యశోద హృదయంలో పొంగిపొరలే వాత్సల్యం వ్యక్తీకరించే పాటలను పాడసాగేది. ఈ సంఘటనలు శ్రీరామకృష్ణులు మధురభావ సాధనను ప్రారంభించడానికి ఎంతోకాలం మునుపు జరిగినవి. ఈ సంఘటనల ద్వారా ఆయన పారదర్శక నిష్కాపట్యం తేటతెల్లమవుతోంది. ఆయన తరచూ అన్నట్లుగా 'నా మానసిక ఆవాసంలో ఎన్నడూ కపటం చోటు చేసుకోలేదు.'

శ్రీరామకృష్ణులు దాస్యభావ సాధనను, వాత్సల్యభావ సాధనను చేపట్టిన ఉదంతాలను మనం ఇదివరకే చూసివున్నాం. ప్రస్తుతం ఆయన మధురభావ సాధనమార్గంలో అడుగిడి ఏ అనుష్ఠానాలలో మగ్నమయ్యారో వాటిని వివరి

ప్రేమ విహ్వలురైన వ్రజ గోపికల భావంలో ఎంత తాదాత్మ్యులైపోయారంటే తమ 'పురుష దేహ' ధ్యాసను పూర్తిగా మరచిపోయారు. ఆయన ప్రతి ఆలోచనా, పలుకూ, నడకా మొదలైన చేష్టలన్నీ స్త్రీలవిగానే మారిపోయాయి. మధుర భావ సాధనను అనుష్ఠిస్తున్నప్పుడు ఆరు నెలల కాలం ఆయన అలాగే స్త్రీ వేషధారణలో ఉండిపోయారని ఆయన ముఖతా మేం విన్నాం.

7. స్త్రీల లక్షణాలు ఆయనలో అభివ్యక్త మవడం

శ్రీరామకృష్ణులలో పురుష - స్త్రీ ప్రవృత్తులు అద్భుత రీతిలో సమ్మేళనమై ఉండడాన్ని మరోచోట పేర్కొన్నాం. కాబట్టి స్త్రీ వేషధారణ ద్వారా ఆయన మానసంలో ప్రస్తుతం స్త్రీ స్వభావం ఉద్దీపించడంలో ఎలాంటి ఆశ్చర్యమూ లేదు. కాని ఆ స్త్రీభావ ప్రేరణ ద్వారా ఆయన ప్రవర్తన, మాట, నవ్వు, కడగంటి చూపు, భావసూచనలు తదితర మనశ్శరీరాల అన్ని చేష్టలూ అచ్చం స్త్రీల మాదిరిగా మారిపోతాయని ఎవరూ, ఎన్నడూ ఊహించటం కూడ కష్టం. ఐనా వాస్తవానికి అదలా జరిగిందనే సంగతిని స్వయంగా మేము శ్రీరామకృష్ణుల నుండి, హృదయ్ నుండి కూడ పలుమార్లు విన్నాం. మేం దక్షిణేశ్వరానికి రాకపోకలు చేస్తున్న కాలంలో ఎన్నోసార్లు ఆయన స్త్రీ హావభావాలను అభినయించడం చూడటం జరిగింది. ఈ అనుకరణలు ఎంత స్వభావ సిద్ధంగా, సమగ్రంగా ఉండేవంటే స్త్రీలు కూడ వాటిని చూసి విస్మయం చెందేవారు.

8. మథుర్ కుటుంబంలో మిత్రురాలిగా శ్రీరామకృష్ణులు

ఆ కాలఘట్టంలో శ్రీరామకృష్ణులు ఒక్కోసారి జాన్‌బజారులోని రాణీ రాస్మణి గృహానికి వెళ్లి మథుర్ కుటుంబ స్త్రీలతో కలిసి అంతఃపురంలో నివసించే వారు. కామగంధం లేశమైనాలేని ఆయన పావన చరితం ప్రత్యక్షంగా ఎరిగిన ఆ స్త్రీలు ఆయనను సాక్షాత్తు దైవంగా భావించేవారు. అంతేగాక ఇప్పుడు ఆ స్త్రీజనం శ్రీరామకృష్ణుల స్త్రీజనోచిత నడవడి, వర్తన తమతో ఏకాత్మికమవడం గాంచి మంత్రముగ్ధులైనారు. అందుచేత వారు ఆయనను ఒక స్త్రీగా భావించసాగారు. ఆయన సమక్షంలో ఎలాంటి స్త్రీ సహజమైన సంకోచాన్నీ ప్రకటించరైరి.[1] మథుర్ కుమార్తెలలో ఒకరి భర్త ఈ సమయంలో జాన్‌బజార్ ఇంటికి రావడం తటస్థించినప్పుడు శ్రీరామకృష్ణులు స్వయంగా మథురుని ఆ కుమార్తె తల దువ్వి, వేషభూషణాదులతో అలంకరించి, భర్తను ఎలా వినోదింపచేయాలో వివిధ రీతుల ఆమెకు ఉపదేశించి, ఆమె చేయి పుచ్చుకొని మిత్రురాలి మాదిరి పడక గదిలోకి తీసుకువెళ్లి ఆమె భర్త ప్రక్కన కూర్చోబెట్టి వచ్చేవారు. ఈ ఉదంతం

---

1. గురుభావం, పూర్వార్ధం III.7

మేం ఆయన ముఖతా వినడం జరిగింది. ''ఆ స్త్రీజనం నన్ను తమ మిత్రురాలిగా చూడడంతో, వారెలాటి సంకోచానికీ లోనుకాలేదు'' అని గురుదేవులు చెప్పేవారు.

''ఆ వేషధారణలో ఉన్న ఆయనను స్త్రీ జనం పరివేష్టించి ఉన్నప్పుడు ఆయన సన్నిహిత బంధువులు కూడ ఆయనను చప్పున గుర్తించలేకపోయేవారు''

9. స్త్రీ వేషధారణలో శ్రీరామకృష్ణులను గుర్తించ లేకపోవడం

అని హృదయ్ చెప్పాడు. ''ఆ సమయంలో ఒకరోజు మథుర్ నన్ను అంతఃపురంలోకి తీసుకువెళ్లి 'ఈ స్త్రీలలో నీ మామ ఎవరో గుర్తించగలవా?' అని అడిగాడు. ఆయనతో చాలాకాలం కలిసి నివసించినప్పటికీ, అనునిత్యం ఆయనను సేవిస్తూన్నప్పటికీ వెంటనే ఆయనను గుర్తుపట్టలేకపోయాను. దక్షిణేశ్వరంలో ఆయన వసిస్తున్న ఆ కాలంలో మామ ప్రతిరోజూ తెల్లవారుజామున పువ్వులబుట్ట పుచ్చుకొని తోటలో పువ్వులు కోస్తూవుండేవారు. అప్పుడు మేము జాగ్రత్తగా పరిశీలించి చూడగా, నడకసాగిన ప్రతిసారి ఆయన ఎడమ పాదం, స్త్రీవలె ముందుగా కదలడం గమనించాం. 'శ్రీరామకృష్ణులు ఆ విధంగా పువ్వులు కోస్తూవున్నప్పుడు తరచు నేను ఆతణ్ణే రాధారాణిగా పొరబడేదాన్ని' అని భైరవీ బ్రాహ్మణి చెబుతూవుండేది. పువ్వులను కోసి తీసుకొని వచ్చి, వాటితో చిత్రవిచిత్రమైన పూమాలలను కట్టి రాధా గోవిందునికి అలంకరించేవారు. అదేమాదిరి ఒక్కోసారి జగన్మాతను కూడా పూమాలలతో అలంకరించి వ్రజగోపికలు కాత్యాయనీదేవిని ప్రార్థించినట్లు శ్రీకృష్ణుని ఆధ్యాత్మిక పతిగా పొందగోరి ఆర్తితో ప్రార్థించేవారు.''

ప్రస్తుతం శ్రీరామకృష్ణులు ఒకవైపు జగజ్జననిని సేవిస్తూ, పూజిస్తూ మరోవైపు శ్రీకృష్ణ పరమాత్ముని దర్శనం అభిలషిస్తూ ఆతణ్ణే తన ఆధ్యాత్మిక పతిగా

10. మధురభావ సాధనానుష్ఠాన కాలంలో భౌతిక మార్పులు

పొందగోరారు. తదుపరి అవిభాజ్య మానసంతో శ్రీకృష్ణ పాదారవిందాలను సేవిస్తూ, వ్యాకులతతో ప్రార్థిస్తూ, ప్రతీక్షతో కాలం గడపసాగారు. పగలు, రాత్రి ఒక్క క్షణ కాలమైనా ఆ ఉత్కంఠ ప్రార్థనలో అంతరాయం కలిగేది కాదు. రోజులు, పక్షాలు, నెలలు ప్రియతముని దర్శన ప్రతీక్షలో గడచిపోతున్నా నిరాశ, అవిశ్వాసం ఆయన హృదయాన్ని కించిత్తు కూడ విచలితం చేయలేకపోయాయి. ఆ ప్రార్థన క్రమంగా నిర్విరామ విలాపంగా మారింది. ఆ పరమ ప్రతీక్ష కాస్తా ఉన్మత్తతవంటి ఉత్కంఠగా, వ్యాకులతగా మారడంతో ఆయనకు నిద్రాహారాలు లుప్తమైనాయి. ఆ విరహ వేదనను వర్ణింప ఎవరి తరం? ప్రాణప్రియుడితో సర్వదా సంపూర్ణంగా సంయోగం చెందాలనే అంతంలేని ఆ పిపాసా మార్గంలో అధికమించలేని ఆటంకాలు ఎదురైనప్పుడు ఏ స్థితి మానవ హృదయాన్ని మథించి వేస్తుందో,

శరీరేంద్రియాలను శుష్కింపచేస్తుందో అది విరహానలం. ఆ విరహానలం భరింపజాలని మానసిక వ్యధగా వ్యక్తం కావడంతోనే శమింపక సాధన ప్రారంభంలో దుర్భరమైన శారీరక మంటగా, గతంలో కలిగిన అదే మంట మళ్లీ శ్రీరామకృష్ణుల శరీరంలో ప్రారంభమైంది. వారి ముఖతా మేం ఇలా విన్నాం: శ్రీకృష్ణ విరహపు తీవ్రప్రభావ ఫలితంగా ఆయన శరీరపు ప్రతి రోమకూపం నుండి రక్తబిందువులు అప్పుడప్పుడు స్రవించసాగాయి. దేహంలోని కీళ్లన్నీ పూర్తిగా సడలిపోయాయి. అపరిమిత హృదయ పరితాప కారణంగా ఇంద్రియాలు నిష్క్రియాలైపోగా ఒక్కోసారి మృతప్రాయంగా నిశ్చేష్టమై, స్పృహ కోల్పోయి చలనరహితమై పడివుండేవట.

11. శ్రీరామకృష్ణుల సర్వోత్కృష్ట ప్రేమ

దేహంతోటి తాదాత్మ్యం చెందే మనబోటి సామాన్యులం రెండు శరీరాల పరస్పర ఆకర్షణనే ప్రేమగా అర్థం చేసుకొంటాం. లేదా ఎంతో శ్రమించి ఈ స్థూలదేహాత్మ బుద్ధి నుండి ఒకింత పైకిపోయి, కొద్దిమంది సజ్జనుల దేహం ద్వారా ప్రకటమయ్యే సద్గుణ సంపత్తి పట్ల ఆకర్షితులమైనప్పుడు దానిని అతీంద్రియ ప్రేమగా పేర్కొంటూ, దానినెంతో శ్లాఘిస్తూ ఉంటాం. కాని తరతరాల నుండి కవులు గానం చేసే ఆ అతీంద్రియ ప్రేమ నిజానికి స్థూలదేహబుద్ధి, సూక్ష్మభోగవాసనా రహితమైనది కాదని అవగాహన చేసుకోవడానికి ఎక్కువకాలం పట్టదు. శ్రీరామకృష్ణుల జీవితంలో వ్యక్తమైన ఆ దివ్యప్రేమతో పోల్చినప్పుడు అది ఎంతో నిరర్థకంగా, వ్యర్థంగా, ప్రయోజనశూన్యంగా కనబడుతుంది.

12. శ్రీమతి సర్వాతిశయ ప్రేమ

శ్రీమతి రాధారాణి మాత్రమే ఈ సర్వాతిశయ ప్రేమను పరిపూర్ణంగా అనుభవంలోకి తెచ్చుకోగలిగిందని భక్తి గ్రంథాలు చాటుతున్నాయి. యావత్తు భక్తి సాహిత్యంలోను ఆమెకు సమానుడైన వ్యక్తి కానరాడు. కారణం: తన దైహిక, మానసిక సంతృప్తిని పూర్తిగా విస్మరించి సాంఘిక మర్యాదలను, ప్రజాభిప్రాయాన్ని లక్షించక లజ్జ, ద్వేషం, భయాదులను ఆమె వదలివేసేది. శ్రీకృష్ణుని ఆనందంలో మాత్రమే తాను ఆనందం అనుభవించడానికై జన్మ, కుల, సత్ప్రవర్తన, గౌరవ పదవులను ఆమె లెక్కించలేదు. వైష్ణవ శాస్త్రాల మేరకు ఏ జీవుడూ ఈ కోవకు చెందిన ప్రేమను పరిపూర్ణంగా తెచ్చుకోలేడు. ఈ దివ్యప్రేమను ఒకింత మాత్రమే శుకదేవుడు అనుభవంలోకి తెచ్చుకోగలిగాడు, అదీ రాధాదేవి అనుగ్రహం వల్ల మాత్రమే. అణుమాత్రమైనా కామగంధంలేని రాధాదేవి ప్రేమకు సాక్షాత్తూగా సచ్చిదానంద బ్రహ్మస్వరూపుడైన ఆ కృష్ణుడు వశుడైనాడు. భక్తులకు తన దర్శనభాగ్యాన్ని ఆమె మనవి మేరకు కలిగించేవాడు. ఈ బోధనల అంతరార్థం: శ్రీమతి (రాధారాణి)

అనుభవంలోకి తెచ్చుకొన్న సర్వాతిశయ ప్రేమను అనుభవపూర్వకంగా తెలుసుకోకుండా ఎవ్వరూ భగవంతుని పతిగా భావించి పరిపూర్ణ ప్రేమ మాధుర్యాన్ని - మధురభావాన్ని పొందలేరు.

వ్రజరాణి శ్రీమతి రాధారాణి, శ్రీకృష్ణుని పట్ల ప్రదర్శించిన అసాధారణ ప్రేమ వైభవాన్ని మాయారహితుడైన పరమహంస చక్రవర్తి శుకదేవుడు, ఆత్మారాములైన ఇతర మునులు ఎంతగానో శ్లాఘించి నప్పటికీ, భారతీయ జనసామాన్యం తమ జీవితాలలో ఆ ప్రేమను ఎలా పొందాలో చాలాకాలం వరకు తెలుసుకోలేకపోయారు. ఆ ప్రేమను అవగాహన చేసే నిమిత్తమే భగవంతుడు తాను, శ్రీమతీ ఒక దేహంలో - అంతరాన కృష్ణుడుగా, బాహ్యంలో రాధగా - గౌరాంగుడు లేక శ్రీ చైతన్యుడిగా అవతరించాడని గౌడీయ వైష్ణవాచార్యులు చెబుతున్నారు. ఆ విధంగా గౌరాంగుడు మధుర భావపు ప్రేమాదర్శాన్ని బోధిస్తూ మానవాళికి మంచి చేయడానికై అవతరించడం జరిగింది. శ్రీకృష్ణ ప్రేమ విహ్వలురాలైన రాధారాణి మనశ్శరీరాలలో ఏ లక్షణాలు వ్యక్తమైనవో, పురుష దేహుడైన శ్రీ గౌరాంగ మహాప్రభువులో కూడ భావప్రేమ శక్తి ఫలితంగా అవే లక్షణాలు వ్యక్తం కావడంతో వైష్ణవ గోస్వాములు ఆయనను శ్రీమతిగా నిశ్చయించడం జరిగింది. గతంలో శ్రీమతిలో మాత్రమే వ్యక్తం అయిన మధురభావపు భౌతిక, మానసిక చిహ్నాలు గౌరాంగునిలోనూ కనిపించాయి. కనుక సర్వశ్రేష్ఠ ప్రేమకు రెండవ దృష్టాంతం శ్రీ చైతన్యుడే అని మనకు తెలియవస్తోంది.

13. శ్రీ గౌరాంగుని సర్వోత్కృష్ట ప్రేమ

శ్రీమతి రాధాదేవి కృపతో తప్ప శ్రీకృష్ణ దర్శనం అసంభవమని గ్రహించి శ్రీరామకృష్ణులు ఇప్పుడు ఏకాగ్రచిత్తంతో ఆమెను ఉపాసించసాగారు. ఆమె ప్రేమ ఘనమూర్తి శ్రీకృష్ణుని యొక్క స్మరణ, మనన, ధ్యానంలో సతతం మగ్నులై ఆమె పాదపద్మాల వద్ద తన మానసిక ఉద్వేగాన్ని నివేదించసాగారు. తత్ఫలితంగా సత్వరమే రాధాదేవి దివ్యదర్శనాన్ని పొంది కృతార్థులైనారు. ఇతర దేవతామూర్తులను దర్శించినప్పుడు సంభవించినట్లే ఇప్పుడు కూడ ఆమె దివ్యమూర్తి తన దేహంలో కలిసి మాయమైపోయినట్లు ఆయన గాంచారు. ఆ దర్శనాన్ని ఆయన ఇలా వర్ణించేవారు: ''కృష్ణప్రేమతో సర్వస్వాన్ని కోల్పోయిన ఆ నిరుపమాన దివ్యప్రేమమూర్తి వైభవమూ, మాధుర్యమూ వర్ణనాతీతం. రాధాదేవి మేనిఛాయ నాగకేసర పుష్పాల పచ్చని పుప్పొడిలా ప్రకాశిస్తూవుండటం దర్శించాను.''

14. శ్రీరామకృష్ణుల రాధాదేవి దర్శనం

పైన పేర్కొన్న దర్శనానంతరం శ్రీరామకృష్ణులు పారవశ్య స్థితిలో తానే రాధాదేవిగా గుర్తించుకోసాగారు. రాధాదేవి పవిత్ర రూప, గుణాలను ప్రగాఢంగా

ధ్యానించడంతోనూ, నిరంతరం ఆమెలో తాదాత్మ్యం చెందుతున్నాననే భావన ఉండడం చేతా శ్రీరామకృష్ణులు తమ ప్రత్యేక అస్తిత్వాన్ని పూర్తిగా మరచిపోయారు. కాబట్టి మధురభావ జనితమైన ఆయన భగవత్ప్రేమ ఇప్పుడు పురోగమించి రాధారాణి ప్రేమకు అనురూపంగా మహోన్నత స్థితిని చేరుకొన్నదని నిస్సందేహంగా చెప్ప వచ్చును. దాని ఫలితం కూడ అలాగే కనబడింది. ఆ దర్శనం కలిగిన నాటి నుండి శ్రీమతి రాధారాణి, శ్రీ చైతన్యదేవులలా మధురభావ పరాకాష్ఠకు చేరుకొని మహాభావంగా రూపొందినప్పుడు ఏ లక్షణాలు కనిపిస్తాయో అవన్నీ ఇప్పుడు శ్రీరామకృష్ణులలోను అభివ్యక్తం కాసాగడమే అందుకు కారణం. ఈ మహాభావ ఫలితంగా కలిగే భౌతిక లక్షణాలన్నీ వైష్ణవాచార్యుల రచనలలో నమోదు అయినవి. వైష్ణవ శాస్త్రాలలో నిష్ణాతురాలైన భైరవీ బ్రాహ్మణి, తదుపరి వైష్ణవచరణ్ ప్రభృత సాధకులు శ్రీరామకృష్ణుల పావన దేహంలో మహాభావ ప్రేరణ ద్వారా వ్యక్తమయ్యే ఆ లక్షణాలన్నీ కానరావడం చూసి స్తంభీభూతులై తమ హృదయపూర్వక శ్రద్ధాభక్తులను ఆయనకు అర్పించారు. మహాభావాన్ని గురించి ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు మాతో ఎన్నోసార్లు ఇలా చెప్పారు: ''పంథొమ్మిది రకాల భావాలు ఒకే ఆధారంలో అభివ్యక్తమైనప్పుడు దాన్ని మహాభావంగా భక్తిశాస్త్రాలు పేర్కొంటాయి. సాధన చేసి ఒక్కొ-భావంలో సిద్ధిని గడించడంలో మనిషి యావత్తు జీవితం గడచిపోతుంది. (తమ దేహాన్ని చూపుతూ) ఇక్కడ ఒకే ఆధారంలో ఒకేచోట ఆ విధంగా పంథొమ్మిది భావాలు పూర్తిగా స్వయంవ్యక్తమౌతున్నాయి.''[1]

15. శ్రీమతితో శ్రీరామకృష్ణులు తాదాత్మ్యం చెందడం

---

1. జీవగోస్వామి ప్రభృత వైష్ణవాచార్యులందరూ రాగాత్మిక భక్తిని ఈ క్రింది రీతిలో విభజించారు:

రాగాత్మిక భక్తి

- కామాత్మికా (మధురరసం) సంభోగేచ్ఛామయే లేదా తత్తద్భావేచ్ఛామయే — స్నేహం, మానం, ప్రణయం, రాగం, అనురాగం — 5
- సంబంధాత్మికా
  - వాత్సల్య — స్నేహం, మానం, ప్రణయం, రాగం, అనురాగం — 5
  - సఖ్య — స్నేహం, మానం, ప్రణయం, రాగం, అనురాగం — 5
  - దాస్య — స్నేహం, మానం, ప్రణయం, రాగం, అనురాగం — 4
  - శాంత

5 + 5 + 5 + 4 = 19

శ్రీకృష్ణ విరహ జనిత అసహనీయ బాధతో శ్రీరామకృష్ణుల దేహంలో ప్రతి రోమకూపం నుండి రక్తం స్రవించడం ఇదివరలోనే మేం పేర్కొన్నాం.

16. స్త్రీభావం నెలకొన్న కాలంలో శ్రీరామకృష్ణులలో కలిగిన అసాధారణ భౌతికమార్పులు

మహాభావం పరాకాష్ఠకు చేరిన ఈ కాలంలో అది సంభవించింది. తానొక స్త్రీననే నిరంతర భావన ఆయనలో ఎంత ప్రగాఢంగా నెలకొన్నదంటే కలలో సైతం తానొక పురుషుడననే భావన ఆయనలో జనించేది కాదు. ఆయన దేహేంద్రియాలు అచ్చం స్త్రీలవలె పనిచేయసాగాయి. స్వయంగా ఆయన ముఖతా మేం ఇలా విన్నాం: స్వాధిష్ఠాన చక్రం ఉండే స్థానపు రోమకూపాల నుండి బహిష్ఠ స్త్రీలవలె ఈ కాలంలో ప్రతి నెల ఋతుస్రావం బిందురూపంలో తరచూ బహిర్గతమయ్యేదట! స్త్రీ దేహంవలె ప్రతి నెల మూడు రోజులు క్రమంగా అలా జరిగేదట. శ్రీరామకృష్ణుల మేనల్లుడైన హృదయరాం మాతో ఇలా చెప్పాడు: ''అలా జరగడం కళ్లారా నేను చూశాను. కట్టుకొన్న ధోవతి మలిన మౌతుందనే భయంతో ఆయన ఆ సమయంలో కౌపీనం ధరించడం చూశాను.''

వేదాంత శాస్త్రాలు మనకు ఇలా బోధిస్తున్నాయి: మనిషి యొక్క మనస్సే ప్రస్తుత రూపంలోని దేహాన్ని కల్పిస్తోంది. తీవ్రమైన కోరికలు లేదా వాసనల

17. మానసమే దేహాన్ని కల్పిస్తుంది

ద్వారా ప్రతిక్షణం మనస్సు ఈ దేహాన్ని విచ్ఛిత్తి గావిస్తూ, పునర్నిర్మిస్తూ మార్పులు కలిగిస్తూ ఉంటుంది. దేహం మీద మనస్సుకున్న సార్వభౌమాధికారం గురించి విన్నప్పటికీ మనం ఆ అంశం పూర్తిగా అర్థం చేసుకోలేకున్నాం. ఇందుకు కారణం: అత్యంత తీవ్రమైన వాసనలు మనస్సులో ఉదయించినప్పుడు అది ఇతర విషయాల నుండి వెనుదిరిగి ఒకే ఒక్క విషయం మీద కేంద్రీకృతమవుతుంది. తత్ఫలితంగా అపూర్వశక్తి ప్రకటిత మౌతుంది. కాని మనం దేని నిమిత్తమైనా ఏనాడైనా అలాటి తీవ్ర పరితాపం పొందినవారం కాము కదా! (కాబట్టే మన దేహంలో గణనీయమైన మార్పులు కలగడం మనం అనుభవించలేదు) కనుక ఒక ప్రత్యేకమైన విషయాన్ని పొందాలనే తీవ్రమైన కోరిక ఫలితంగా శ్రీరామకృష్ణుల దేహంలో అతిస్వల్ప కాలంలోనే అటువంటి మార్పులు కలగడం వలన పైన పేర్కొన్న వేదాంత బోధన నిస్సంశయంగా ఋజువైనదని చెప్పనవసరం లేదు. కాబట్టే శ్రీ పద్మలోచన ప్రభృత సుప్రసిద్ధ పండితులు శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మికానుభూతుల నన్నిటినీ ఆలకించి, వేద పురాణాది శాస్త్రాలలో పొందపరచబడివున్న పూర్వ యుగాల ఋషుల, సిద్ధ పురుషుల అనుభూతులతో వాటిని పోలుస్తూ ''మీ ఆధ్యాత్మికానుభూతులు వేదపురాణాది ప్రమాణాలను అతిక్రమించిపోయాయి'' అంటూ ఆయనను

శ్లాఘించారు. మానసిక భావాల ప్రాబల్యం ద్వారా శ్రీరామకృష్ణులలో కలిగిన శారీరక వికారాలను పరిశీలించి, స్తంభీభూతులై ఆ వికారాలు ప్రస్తుత శారీరక విజ్ఞాన సీమను అతిక్రమించాయని, తద్వారా అపూర్వ నూతన యుగం అవతరించనున్నదని మనం వ్యాఖ్యానించవచ్చు.

మధురభావ మార్గంలో పరిపూర్ణతను సంతరించుకొంటున్న శ్రీరామకృష్ణుల భగవత్ప్రేమ ప్రస్తుతం పరిశుద్ధమై ఘనీభూతమవడంతో ఇంతకు మునుపు వర్ణించినట్లు ఆయనకు వ్రజరాణి రాధాదేవి దర్శనం అయింది. అంతేగాక ఆ ప్రేమ ప్రభావంతో స్వల్పకాలంలోనే సచ్చిదానంద ఘన విగ్రహమూర్తి ఐన శ్రీకృష్ణ పరమాత్ముని పావన దర్శనం కూడ లభించింది. మునుపటి దివ్యమూర్తులలా శ్రీకృష్ణుని మూర్తి కూడ ఆయన పావన దేహంలో ఐక్యం చెందింది. శ్రీరామకృష్ణులకు ఈ దర్శనం కలిగిన రెండు మూడు నెలల పిదప పరమహంస పరివ్రాజకుడైన తోతాపురి విచ్చేసి వేదాంత ప్రసిద్ధమైన అద్వైతభావ సాధనలో ఆయనను నియుక్తులను చేశారు. కాబట్టి మధురభావ సాధనలో సిద్ధిని పొంది శ్రీరామకృష్ణులు తద్భావం ద్వారా దివ్యానందాన్ని అనుభవిస్తూ కొంతకాలం గడిపారని స్పష్టమవుతోంది. ఈ కాలంలో ఆయనకు కలిగిన అనుభవాన్ని గూర్చి వారి ముఖతా మేం వినడం జరిగింది. శ్రీకృష్ణుని భావనలోవున్న కాలంలో ఆయన ఎంత తన్మయులైపోయారంటే, స్వకీయ ఉనికినే పూర్తిగా మరచిపోయి ఒక్కోసారి తనను తానే శ్రీకృష్ణునిగా భావించుకొనేవారు. మళ్లీ మరొకప్పుడు ఆబ్రహ్మస్తంభపర్యంతం సమస్తాన్నీ శ్రీకృష్ణునిగా దర్శిస్తూ ఉండేవారు. దక్షిణేశ్వరానికి మేం వచ్చిపోతూ వారి సహచర్యంలో గడిపే కాలంలో ఆయన ఒక రోజు తోట నుండి ఒక నీలి రంగు గడ్డిపువ్వును కోసుకువచ్చి, మాకు దానిని చూపిస్తూ ప్రఫుల్ల వదనంతో, ''ఆ (మధురభావ సాధన) కాలంలో నాకు దర్శనమిచ్చే శ్రీకృష్ణుని మేనిఛాయ ఇలా ఉండేది'' అన్నారు.

18. శ్రీకృష్ణ దర్శనం

కామార్పుకూరు నుండి కలకత్తాకు రాక పూర్వం స్త్రీస్వభావ జనిత ప్రేరణ ద్వారా యౌవన ప్రాదుర్భావంలో శ్రీరామకృష్ణులకు ఒక విచిత్ర అభిలాష కలిగేది. వ్రజ గోపికలు స్త్రీ దేహులై జన్మించడం చేతనే సచ్చిదానంద ఘనుడైన శ్రీకృష్ణుని ప్రేమించి తమ ఆధ్యాత్మిక పతిగా పొందగలిగారని గ్రహించి, శ్రీరామకృష్ణులు ''నేనూ ఒక స్త్రీగా జన్మించివుంటే గోపికలలా శ్రీకృష్ణుని ఆరాధించి పొందగలిగేవాణ్ణే గదా!'' అని భావించేవారు. ఆయన అలా తమ పురుష దేహాన్ని శ్రీకృష్ణ దర్శనానికి ఒక అంతరాయంగా భావించి, తనకు పునర్జన్మ ఉండేపక్షంలో ఒక బ్రాహ్మణ

19. యౌవనంలో శ్రీరామకృష్ణుల ఆకాంక్ష

కుటుంబంలో పొడవైన కురులుగల బాలవితంతువుగా జన్మించి ఒక్క శ్రీకృష్ణుని తప్ప మరెవ్వరినీ పతిగా పరిగ్రహించనని ఊహించుకొంటూ ఉండేవారు. 'బ్రతకడానికి సామాన్య అన్నవస్త్రాలు ఉంటాయి. నివాసానికి ఒక చిన్న పూరిల్లు, దాని ప్రక్కనే కాస్త ఖాళీ స్థలం. తన కవసరమైన కూరనారలను తానక్కడే పండించుకొంటుంది. తనకు తోడుగా ఒక ముసలమ్మ ఉంటుంది. పాల కోసం ఒక ఆవు. స్వయంగా తానే పాలు పితుకుతుంది. వీటితోబాటు ఒక చిన్న నూలు వడికే రాట్నం.' గదాధర్ ఊహాలోక విహారం అంతటితో ఆగలేదు. 'పగటి వేళ పనిపాటలు ముగించుకొని, నూలు వడుకుతూ శ్రీకృష్ణ భజనలు గానం చేస్తూ ఉంటుంది. అంతేగాక చీకటిపడ్డాక ఆవుపాలతో తీపిపదార్థాలు తయారుచేసి, స్వహస్తాలతో శ్రీకృష్ణునికి తినిపించడానికై వ్యాకులతతో రహస్యంగా విలపిస్తూ ఉంటుంది. అప్పుడు శ్రీకృష్ణుడు ప్రసన్నుడై గోపబాలుని వేషంలో హఠాత్తుగా తన వద్దకు వచ్చి ఆ తీపిపదార్థాలు తింటాడు. ఇలా ఎవరికీ తెలియకుండా అను నిత్యం అతడు తన వద్దకు వస్తూపోతూ ఉంటాడు.' ఇటువంటి ఊహాగానంగా వ్యక్తమైన శ్రీరామకృష్ణుల అభిలాష అలా ఈడేరకపోయినా మధురభావ సాధనాను ష్ఠాన కాలంలో పైన వర్ణించిన రీతిలో నెరవేరింది.

మధురభావ సాధనలో సిద్ధిని గడించాక దివ్యానందాన్ని అనుభవిస్తూన్న కాలంలో శ్రీరామకృష్ణులకు కలిగిన మరో దివ్యదర్శనం గురించి ముచ్చటించి ప్రస్తుత అంశాన్ని ముగించుతాం. ఆ సమయంలో ఆయన ఒకరోజు విష్ణ్వాలయపు ముందు వసారాలో కూర్చుని భాగ వత పఠనాన్ని ఆలకిస్తున్నారు. అలా వింటూ వింటూ భావపరవశులై భగవాన్ శ్రీకృష్ణుని జ్యోతిర్మయమూర్తిని దర్శించారు. తదుపరి శ్రీకృష్ణుని పాదపద్మాల నుండి ఒక కాంతిపుంజం బయ ల్వెడలి మొదట భాగవత గ్రంథాన్ని తాకి, తర్వాత ఆయన వక్షస్థలాన్ని స్పృశించి, కొంత సమయం వరకు ఆ మూడింటినీ ఏకకాలంలో స్పృశిస్తూ ఉండడాన్ని ఆయన కాంచారు.

20. భాగవతం, భక్తుడు, భగవంతుడు - మూడూ ఒకటే - ఒకటే మూడూ!

అలాంటి దర్శనాన్ని పొందడం ద్వారా భాగవతం, భక్తుడు, భగవంతుడు అనే మూడూ వేరు పదార్థాలుగా వ్యక్తమైనప్పటికీ ఆ మూడూ ఒకే పదార్థం లేదా ఒకే పదార్థపు మూడు వ్యక్తీకరణలనే ప్రగాఢ విశ్వాసం తమకు కలిగిందని ''భాగవతం (శాస్త్రం), భక్తుడు, భగవంతుడు - మూడూ ఒకటే, ఒకటే మూడు'' అంటూ ఉండేవారు శ్రీరామకృష్ణులు.

15. శ్రీరామకృష్ణుల వేదాంత సాధన

మధురభావ సాధనలో పరిపూర్ణతను సంతరించుకొన్న శ్రీరామకృష్ణులు ప్రస్తుతం భక్తిభావ సాధనలలో పరాకాష్ఠను చేరుకొన్నారు. కాని ఆయన ఒనరించిన తక్కిన అపూర్వ ఆధ్యాత్మిక సాధనలను వర్ణించడానికి మునుపు ఈ కాలఘట్టంలో ఆయన మనఃస్థితిని గురించి అధ్యయనం చేయడం ఎంతో అవసరం.

1. ఈ సమయంలో శ్రీరామకృష్ణుల మనఃస్థితి గురించి ఒక అధ్యయనం

ఏ ఒక్క భావ సాధనలోనైనా సాఫల్యం పొందగోరితే సాధకుడు రూప రసాది లౌకిక భోగ్య విషయా లన్నింటినీ విషతుల్యంగా విడనాడాలని మనం గమనించాం. 'జహా రామ్ తహా నహీ కామ్[1] - రాముడు ఉండేచోట కాముడు ఉండజాలడు' అనే తులసీదాసు సూక్తి అక్షర సత్యం. శ్రీరామకృష్ణుల అనుప మాన సాధన చరిత్ర పై సూక్తికి తార్కాణం. కామ కాంచన త్యాగం అనే పునాదిపై దృఢంగా ప్రతిష్ఠితులైన తదనంతరమే ఆయన భక్తిసాధనలు అభ్యసించ మొదలు పెట్టారు. ఆ ఆధారం నుండి అణుమాత్రమైనా చలించకపోవడం చేతనే ఏ సమయంలో ఏ సాధనను అభ్యసించినా దానిలో స్వల్ప వ్యవధిలోనే పరిపూర్ణతను సంతరించుకో గలిగారు. కాబట్టి కామకాంచనాల ప్రలోభ మనే హద్దులకు

---

1. జహా రామ్ తహా నహీ కామ్
జహా కామ్ తహా నహీ రామ్।
దహ ఏక్ సాథ్ మిలతీ నహీ
రచి రజనీ ఏక్ ఠామ్॥ —తులసీదాసు దోహా

రాముడు ఉండేచోట కాముడు ఉండడు, కాముడు ఉండేచోట రాముడు ఉండడు. సూర్యుడూ చీకటీ ఒకేచోట కలసి ఉండడం అసంభవం.

సుదూరతీరంలో ఆయన మనస్సు ప్రస్తుతం నిరంతరం ఊర్ధ్వస్థితిలో వసించ సాగినదనే విషయం సుస్పష్టం.

విషయ భోగాలను త్యజించి తొమ్మిది సంవత్సరాల కాలం పాటు భగవ ద్దర్శనార్థం ఒనరించిన ఎడతెగని అభ్యాస ఫలితంగా ఆయన మనస్సుకు ప్రస్తుతం కేవలం భగవంతుని గురించి తప్ప మరి ఏ విషయాన్ని గురించిన ఆలోచనయినా విషతుల్యంగా అగపడే స్థితిని చేరుకొంది. త్రికరణశుద్ధిగా భగవంతుడు ఒక్కడే పరాత్పరుడనీ, సమస్త సారాల సారస్వరూపుడనీ అవగతం అయ్యేకొద్దీ, ఇహంలో కాని పరంలోకాని ఒక్క భగవంతుణ్ణే తప్ప ఇతరాల పట్ల పూర్తి ఉదాసీనం, వాసనారహితం అయింది ఆయన మనస్సు.

రూప రసాది బాహ్యవిషయాలను, శరీరపు సుఖదుఃఖాలను విస్మరించి తమ ఇష్టదైవం మీద ఆయన మనస్సు ఎంతవరకు ఏకాగ్రమైనదంటే, క్షణ కాలంలో అనాయాసంగా ఆయన మనస్సు బాహ్య విషయా లన్నిటి నుండి విడి వడి ధ్యేయవస్తువులో సంపూర్ణంగా తన్మయమైపోయి దివ్యానందాన్ని అనుభవించ గలిగేది. ఆ విధంగా రోజులు, నెలలు, సంవత్సరాలు క్రమంగా దొర్లిపోయినా ఆ దివ్యానంద ప్రవాహంలో క్షణంపాటు కూడ విఘ్నం కలిగేది కాదు. అంతేకాదు, భగవంతుడు తప్ప జీవితంలో ఆకాంక్షించ తగిన వస్తువు మరేదన్నా ఈ లోకంలో ఉన్నదనిగాని లేదా ఉండవచ్చుననే నమ్మకానికి ఏనాడూ ఆయన లోను కాలేదు.

జగత్కారణుడైన భగవంతుడు ఒక్కడే 'గతిః భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్'[1] - పరమగమ్యుడు, పోషకుడు, ప్రభువు, సర్వసాక్షి, జగత్తు కంతటికీ ఆవాస స్థానం, శరణ్యుడు, పరమహితుడు - అని గ్రహించడం మూలంగా జగన్మాతపై శ్రీరామకృష్ణులకు జనించిన ఏకాంత భక్తికి, విశ్వాసానికి, పరాధీనతకు మేర లేకపోయింది. వాటి సహాయంతో శ్రీరామకృష్ణులు ప్రస్తుతం జగజ్జననితో తమను నిత్యప్రేమసంబంధంతో ముడిపెట్టుకొన్నారు. అంతేకాక తన జీవితంలో ప్రతి చిన్న, పెద్ద పనిని జగన్మాత ఆదేశ, సూచనల మేరకే నిర్వర్తించడానికి పూర్తిగా అభ్యాసపడింది ఆయన మనస్సు. అందుకు హేతువు: పసిబిడ్డ తల్లి మీద పూర్తిగా ఎలా ఆధారపడి ఉంటాడో అలాగే సాధకుడు సర్వదా భగవంతుడు తన సమక్షంలోనే ఉండడం చూస్తూ, ఆయన మధురాతి మధుర మైన పలుకులు విని పులకాంకితుడౌతూ, ఆయన శక్తివంతమైన బాహువుల

---

1. గీత 9-18

ఆలంబనతో సంశ్లిష్ట సంసార మార్గంలో నిర్వృతితో సంచరిస్తూ ఉంటాడనే వాస్తవానికి అనేక నిదర్శనలు ఆయనకు అనుభూతమైనాయి.

వాత్సల్యపూరితురాలైన తల్లిలా జగత్కారణ రూపిణియైన జగన్మాత సర్వదా తన సమక్షంలో ఉంటూ ఉన్న పిదప కూడ శ్రీరామకృష్ణులు సాధనలో నియుక్తులు కావడం ఎందుకు? అని ప్రశ్నించవచ్చు. ఎవరిని పొందడానికై సాధకులు యోగాన్ని అభ్యసిస్తారో, కఠోర తపస్యాదులు అనుష్ఠిస్తూ ఉంటారో ఆతణ్ణే తన సొంతం చేసుకొన్నాక కూడ మళ్లీ సాధన చేయడంలోని ఔచిత్యం ఏమిటి? ఈ ప్రశ్నను ఇంతకు మునుపు ఒక దృక్పథంలో చర్చించడం జరిగింది. ఇప్పుడు మరో దృక్కోణం నుంచి నాలుగు ముక్కలు చెప్పవలసి ఉంది. గురుదేవుల పాదపద్మాల వద్ద కూర్చుని వారి సాధన చరిత్రను వింటు న్నప్పుడు మా మనస్సులలో కూడ ఆ సందేహం కలిగింది. దాని గురించి ఆయనను అడగడానికి మేం వెనుకాడలేదు. సమాధానంగా ఆయన మాకు ఏం చెప్పారో మేం ఇక్కడ వివరిస్తున్నాం: శ్రీరామకృష్ణులు ఇలా చెప్పడం జరిగింది: ''చూడండి. సర్వదా సముద్ర తీరంలో వసించే వ్యక్తి మనస్సులో కొన్ని సమ యాల్లో, రత్నగర్భగా పేర్కొనబడే సముద్రపు అట్టడుగున నిల్వ ఉన్న అమూల్య రత్నరాశులను చూడాలనే అభిలాష జనిస్తుంది. అదే విధంగా జగన్మాత సాన్నిధ్యం సర్వదా నాకు లభించినప్పటికీ, అనంత భావమయి, అనంత రూపిణియైన ఆమె నానాభావాలను అనుభూతం చేసుకోవాలనే, ఆమె నానారూపాలను దర్శించాలనే బలీయమైన కోర్కె నాలో ఉదయించింది. ప్రత్యేకమైన ఏదో ఒక రూపంలో ఆమెను దర్శించాలనే ఆకాంక్ష కలిగినప్పుడు ఆమెను అదే రూపంలో నాకు దర్శన మివ్వమని మంకుపట్టుతో ప్రార్థించే వాడిని. కరుణామయియైన అమ్మ కూడ అప్పుడు తన ఆ భావాన్ని లేదా రూపాన్ని దర్శించడానికి అనువైన ఆధ్యాత్మిక సాధనకు ఆవశ్యకమైన వాటి నన్నిటిని సమకూర్చి, నాచే నిర్వర్తింపజేసి నాకు ఆ రూపంలో దర్శనం ఇచ్చేది. ఆ రీతిలో విభిన్న ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించబడినవి.''

2. భగవత్సాక్షాత్కారానంతరం ఆయన సాధన - దాని అంతరార్థం

శ్రీరామకృష్ణులు మధురభావ సాధనలో పరిపూర్ణ సిద్ధిని పొంది భక్తిసాధనల చరమ భూమికను చేరుకొన్నారు. ఆ పిదప సర్వభావాతీతమైన సుప్రసిద్ధ అద్వైత వేదాంత సాధనను అనుష్ఠించాలనే తీవ్ర ప్రేరణ ఆయనలో జనించింది. జగన్మాత ప్రోత్సాహంతోనే ఆ ప్రేరణ ఆయనలో ఏవిధంగా కలిగిందో, ఏ విధంగా ఆయన జగన్మాత నిర్గుణ నిరాకార నిర్వికల్ప తురీయరూపాన్ని అనుభూతం చేసు కొన్నారో - ఆ ఉదంతం పాఠకులకు ఇప్పుడు చెప్పబోతున్నాం.

శ్రీరామకృష్ణులు అద్వైత సాధనను ప్రారంభించిన సమయంలో వృద్ధురాలైన ఆయన తల్లి దక్షిణేశ్వరంలో నివసిస్తూ ఉండేది. పెద్ద కుమారుడైన రాంకుమార్

3. దక్షిణేశ్వరానికి శ్రీరామకృష్ణుల తల్లి రాక

మరణ శోకాన్ని ఎంతో కష్టంతో సంబాళించుకొని ఆ తల్లి మిగిలిన ఇద్దరు కుమారులను అతిప్రియంగా చూసుకొంటూ కాలం గడపసాగింది. కాని అనతికాలంలోనే ప్రియాతిప్రియమైన తన చిన్నకుమారుడు గదాధర్ పిచ్చివాడైనాడనే లోకుల వదంతి విని ఆమె అంతులేని దుఃఖం అనుభవించింది. కుమారుణ్ణి స్వగృహానికి రప్పించి నానారకాల చికిత్సలు, శాంతి స్వస్త్యయనాదులు జరిపించిన పిదప ఏదో విధంగా అతడు కొంత కోలుకోవడంతో ఆమె హృదయంలో మళ్లీ ఆశ చిగురించింది. పిదప అతడికి వివాహం చేయించింది. కాని వివాహానంతరం దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చాక గదాధర్ మళ్లీ వెనుకటి స్థితిలో పడిపోయాడని ఎరిగి ఆ వృద్ధురాలు తనను అదుపులో ఉంచుకోలేకపోయింది. తన కుమారుడు కోలుకోవడానికై ఆమె స్వగ్రామంలోని శివాలయానికి మొదట వెళ్లింది. ఆ పిదప ముకుందపురంలోని ప్రాచీన శివాలయానికి వెళ్లి ఆమరణ ఉపవాస వ్రతం చేపట్టింది. మహాదేవుడు స్వప్నంలో ఆమెకు దర్శనమిచ్చి ఆమె కుమారుడు దివ్యోన్మాదంలో ఉన్నాడనీ, పిచ్చివాడు కాడనీ తెలిపిన పిదప ఆమె కొంత ఊరడిల్లింది. ఐనప్పటికీ సంసారం పట్ల పూర్తిగా నిరాసక్తత ఆమెలో కలిగింది. ఇది జరిగిన కొద్దికాలానికే తన శేషజీవితాన్ని పావన గంగాతీరంలో గడపాలని నిశ్చయించుకొని ఆమె తన చిన్న కుమారుని వద్దకు దక్షిణేశ్వరానికి వచ్చేసింది. సంసారంలో ఎవరి కోసం, ఎవరితో తాను కలిసి జీవించిందో వారు ఒకరి వెనుక ఒకరు తననూ, సంసారాన్నీ వదలి వెళ్లిపోతూ ఉన్నప్పుడు, ఈ వృద్ధాప్యంలో సంసారాన్ని అంటిపెట్టుకొని తాను ఉండడంలో ప్రయోజనం ఏముందని ఆమె యోచించడమే ఆమె దక్షిణేశ్వర ఆగమనానికి కారణం. మథురనాథ్ జరిపిన 'అన్న మేరు' ఉత్సవాన్ని గురించి మేం మునుపే చెప్పడం జరిగింది. తన శేష జీవితాన్ని గంగాతీరంలోని దక్షిణేశ్వరంలో గడపాలని తీర్మానించుకొన్న శ్రీరామకృష్ణుల తల్లి, 1864వ సం॥లో పై ఉత్సవం జరుగుతూ ఉన్న సందర్భంలో కాళికాలయానికి అరుదెంచి ఉంటారని మేం ఊహిస్తున్నాం. ఆమె ఈ సంకల్పం నెరవేరింది. ఆమె కామార్పుకూర్‌కు మళ్లీ ఎన్నడూ తిరిగి వెళ్లలేదు. తన శేష జీవితంలోని పన్నెండు సంవత్సరాల కాలం ఆమె కాళీ ఆలయంలోనే గడిపి, 1876వ సం॥లో పరమపదించింది. కాబట్టి శ్రీరామకృష్ణులు జటాధారి నుండి 'రామ' మంత్రదీక్షను పుచ్చుకోవడం, ఆయన నుండి రామ్‌లాలా ప్రతిమను గ్రహించడం, వాత్సల్య మధుర అద్వైతాది భావ సాధనలను అనుష్ఠించడం

మొదలైనవన్నీ ఆయన తల్లి దక్షిణేశ్వరంలో వసిస్తూ ఉన్న కాలంలోనే జరిగాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

4. చంద్రాదేవిలోని లోభరాహిత్యం

శ్రీరామకృష్ణుల తల్లిలో లోభ మనేది అణుమాత్రమైనా లేదనడానికి నిదర్శనంగా మేం ఇక్కడ ఒక సంఘటన గురించి పాఠకులకు తెలియజేయా లనుకుంటున్నాం. ఆ సంఘటన ఆమె దక్షిణేశ్వరానికి వచ్చిన కొద్దికాలంలోనే జరిగింది. ఈ కాలంలో దేవాలయపు నిర్వహణాధికారమంతా మథురనాథ్ చేతుల్లో ఉన్నదనీ, 'అన్న మేరు' ఉత్సవం మొదలైన పుణ్యకార్యాలను చేస్తూ ఉన్నాడనీ ఇంతకు మునుపే చెప్పడం జరిగింది. శ్రీరామకృష్ణుల పట్ల అతడికి అపరిమిత భక్తిప్రపత్తులు ఉండడం చేత ఆయన సేవాకార్యం, తన తదనంతరం కూడా ఎలాటి లోటుపాట్లులేక సమర్థనీయంగా జరిగేటట్లుగా సర్వదా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాని శ్రీరామకృష్ణులలో జ్వలించే వైరాగ్యం కారణంగా ఆ విషయాన్ని మథుర్ ఆయనతో ప్రస్తావించడానికి సాహసించలేకపోయాడు. ఇలా ఉండగా ఒకరోజు మథుర్, శ్రీరామకృష్ణుల ఆంతర్యం తెలుసుకోగోరి, ఆయనకు వినవచ్చేట్లు ఒక జమీని ఆయన పేరిట వ్రాసిపెట్టే విషయం హృదయ్‌తో ప్రస్తావించాడు. ఈ ఘటన అతణ్ణి గొప్ప కష్టానికి గురిచేసింది. శ్రీరామకృష్ణులు వారి సంభాషణ కొంచెం వినీవినగానే పిచ్చివాడిలా పరుగెత్తుకొంటూ వచ్చి, ''శాలా (ధూర్తుడా)! నన్ను లౌకిక వ్యక్తిని చేయాలనుకొంటున్నావా!'' అంటూ దాదాపు అతణ్ణి కొట్టబోయినంత పని చేశారు. కాని ఆ యోచన మథుర్‌ను ఎన్నడూ వదలలేదు. సదా అతడి మనస్సులో రగులుతూనే ఉండిపోయింది. కాని దాన్ని కార్యాచరణలో పెట్టే సదవకాశం అతడికి లభించలేదు. శ్రీరామకృష్ణుల తల్లి (చంద్రాదేవి) దక్షిణేశ్వర ఆగమనంతో తన దీర్ఘకాలిక సంకల్పం నెరవేరడానికి చక్కని అవకాశం ఏర్పడిందని అతడు భావించాడు. వెంటనే మథుర్ ఆ వృద్ధురాలిని ప్రతిరోజూ కలుసుకొని ఆమెను 'అవ్వా' అని సంబోధిస్తూ, పిచ్చాపాటీ మాట్లాడుతూ క్రమంగా ఆమెకు అమిత ఇష్టుడైపోయాడు. తరువాత ఒకరోజు చక్కని సదవకాశం చూసి ఆమెకు మనఃస్ఫూర్తిగా ఇలా విన్నవించాడు: ''అవ్వగారూ! మీకు సేవ చేసే అవకాశం నా కింత వరకూ ఇవ్వలేదు. నన్ను మీ సొంత మనిషిగా భావించే పక్షంలో మీకు కావలసింది ఏదైనా నా నుండి పుచ్చుకోండి.'' సరళ చిత్తురాలైన ఆ వృద్ధురాలు గొప్ప ఇరకాటంలో పడింది. ఎందుకంటే, కొంతసేపు దీర్ఘంగా ఆలోచించాక కూడా తనకు ఏం కావాలో ఆమెకు స్ఫురించలేదు. ఈ సంకట స్థితిలో ఆమె ఇలా అంది: ''నాయనా! భగవంతుడు నిన్ను చల్లగా చూడుగాక! ప్రస్తుతం నీ ప్రేమాస్పద పోషణలో నాకు ఏ లోటూ లేదు. నాకు

ఏదైనా అవసరమైనప్పుడు నిన్ను తప్పక అడుగుతాను.'' ఇలా అంటూ ఆమె తన పెట్టెను తెరిచి మథుర్‌తో ఇలా అంది: ''ఇదుగో చూడు, నాకు ఎన్ని చీరలు ఉన్నాయో! నీ పోషణలో తినడానికి, తాగడానికి కొదవ లేదు. కావలసినవన్నీ నువ్వు అమర్చావు, అమరుస్తున్నావు కూడా. అలాంటప్పుడు నీ నుండి ఏం కోరమంటావు?'' కాని మథుర్ అంత తేలికగా విడిచిపెట్టే వ్యక్తి కాడు. అతడు పదే పదే ఆమెను ''ఏదన్నా అడగండి'' అంటూ ప్రాధేయపడ్డాడు. కాసేపు తీవ్రంగా ఆలోచించాక శ్రీరామకృష్ణుల తల్లికి తనకు అవసరమైనది ఏమిటో గుర్తుకొచ్చి, ఇలా అంది: ''నువ్వు నాకు ఏదైనా ఇవ్వాలనుకొంటే, పంటినొప్పికి మందుగా వేసుకోవడానికి ఒక అణా పొగాకు కొని తెచ్చి ఇవ్వు.'' ఆమె మాటలకు లౌకికుడైన మథుర్ కళ్ళు చెమ్మగిల్లాయి. ఆమెకు ప్రణామం చేస్తూ ''అటువంటి త్యాగశీలుడైన కుమారుడు ఇటువంటి తల్లికి కాక, మరెవరికి జన్మిస్తాడు?'' అన్నాడు. ఆ తరువాత ఆమెకు పొగాకు తెప్పించి ఇచ్చాడు.

5. హలధారి నిష్క్రమణ - అక్షయ్ ఆగమనం

శ్రీరామకృష్ణులు వేదాంత సాధనను అనుష్ఠిస్తున్న సమయంలో ఆయన దాయాది అయిన హలధారి కాళికాలయంలోని శ్రీరాధాగోవిందుల పూజారిగా నియుక్తుడై ఉన్నాడు. శ్రీరామకృష్ణుల కంటే అతడు వయస్సులో పెద్దవాడు, భాగవతాది శాస్త్రగ్రంథాలలో ఒకింత అభినివేశం ఉన్నవాడు. ఈ కారణాల వల్ల అతడికి గర్వం ఉండేది. శ్రీరామకృష్ణులను అతడు ఎలా పరిహసిస్తూ ఉండేవాడో, ఆయనకు కలిగిన దివ్యదర్శనాలు, ఆధ్యాత్మిక అనుభవాలు సమస్తం ఆయన చిత్తచాంచల్యం వల్ల ఏర్పడిన వికారాలని విమర్శిస్తూ ఉండేవాడో, అతడి అభిప్రాయాన్ని విని శ్రీరామకృష్ణులు ఎంతో బాధపడి జగన్మాత వద్దకెళ్లి ఆ సంగతి నివేదించి, తల్లి నుండి పదే పదే అనునయింపబడేవారో - ఈ విషయాలన్నిటినీ పాఠకులకు మునుపే తెలియచేశాం. ములుకుల వంటి హలధారి పరిహాసపూరిత పలుకులు విని ఒకమారు శ్రీరామకృష్ణులు విషణ్ణులైనప్పుడు భావావస్థలోకి ప్రవేశించి దానిలో ఒక సౌమ్యమూర్తిని దర్శించి, 'భావముఖంలో' నెలకొని ఉండమనే ఆదేశాన్ని పొందారు. ఈ సంఘటనలు ఆయన వేదాంత సాధనను చేపట్టడానికి ఒకింత కాలానికి మునుపు జరిగినట్లుగా తోస్తున్నది. మధురభావ సాధనను అనుష్ఠిస్తూ ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు స్త్రీల దుస్తులు, ఆభరణాలు ధరించి అచ్చం స్త్రీ మాదిరి ప్రవర్తించడం చూసి హలధారి ఆయనను ఆత్మజ్ఞానశూన్యుడని నిర్ణయించాడు. పరమహంస పరివ్రాజకాచార్యుడైన శ్రీ తోతాపురి దక్షిణేశ్వరానికి విచ్చేసి అక్కడ వసిస్తున్నప్పుడు హలధారి కాళికాలయంలో ఉండేవాడనీ, అప్పుడప్పుడు తోతాపురితో శాస్త్రగ్రంథాలపై

చర్చిస్తూ ఉండేవాడనీ మేం శ్రీరామకృష్ణుల ముఖతా విన్నాం. ఒకరోజు తోతాపురి, హలధారి అధ్యాత్మ రామాయణం గురించి చర్చిస్తూ ఉన్నప్పుడు, సీతాలక్ష్మణ సమేతంగా శ్రీరాముని దివ్యదర్శనాన్ని శ్రీరామకృష్ణులు పొందారు. తోతాపురి బహుశా క్రీ.శ. 1865వ సంవత్సరాంతంలో దక్షిణేశ్వరానికి విచ్చేసి ఉండవచ్చు. ఆ తరువాత కొన్ని నెలలకు అనారోగ్య కారణంగానూ, తదితర కారణాలచేతా హలధారి కాళికాలయపు పూజారిగా ఉద్యోగ విరమణ చేయడం జరిగింది. శ్రీరామకృష్ణుల అన్నగారైన రాంకుమార్ కుమారుడు అక్షయ్, హలధారి స్థానే కాళికాలయ పూజారిగా నియుక్తుడయ్యాడు.

6. భావసమాధిలో పరిపూర్ణత నొందక అద్వైత సాధనానుష్ఠానం - తత్కారణం

భగవంతునిలో సాయుజ్యాన్ని లేక తాదాత్మ్యాన్ని పొందాలని గాని లేక నిర్వాణముక్తిని పొందాలని గాని ఎన్నడూ ప్రయత్నించకపోవడమే భక్తుడి స్వాభావికత. శాంత్యాది భక్తిమార్గాలను అవలంబించి భగవంతుని నానారూప వైభవాన్ని, ఉదాత్త గుణాలను చవిచూడాలనే భక్తుడి నిరంతర యత్నం. 'చక్కెర కాగోరను, చక్కెరను రుచిచూడగోరతాను' అనే దేవీ భక్తుడైన రామ్‌ప్రసాదుని సూక్తి భక్తుల హృదయపూర్వక ఉద్వేగపు స్వాభావిక విస్ఫోటంగా ప్రసిద్ధి గాంచింది. అలాంటప్పుడు భావసాధనల పరాకాష్ఠకు చేరుకొని సకల భావాలకూ అతీతమైన అద్వైతావస్థకు చేరడం కోసమైన శ్రీరామకృష్ణుల ప్రయత్నం అనేకులకు విపరీతంగా తోచవచ్చు. కాని ఇలాంటి నిర్ణయానికి రావడానికి మునుపు, ప్రస్తుతం శ్రీరామకృష్ణులు ఏ పని చేయడంలోనూ చొరవ తీసుకొనే సామర్థ్యం లేనివారైనారని మనం గుర్తుంచుకోవాలి. జగజ్జనని బిడ్డగా శ్రీరామకృష్ణులు సర్వదా, సంపూర్ణంగా ఆమె మీదనే ఆధారపడి, ఆమెపై పూర్తి విశ్వాసం ఉంచి, సదా అన్ని రీతుల్లోనూ ఆమె మార్గదర్శకత్వంలో మెలగడంలో సంతృప్తి చెందేవారు. జగన్మాత తన వంతూగా ఆయన బాధ్యతలన్నీ తానే వహించి తన ఒక ప్రత్యేక ప్రయోజనార్థం, ఆయన ఎరుకలేకయే ఒక క్రొత్త మూసలో ఆయన్ను పోత పోయ నెంచింది. అన్ని సాధనలు ముగిసిన పిమ్మట జగజ్జనని అభిలాష మేరకు ఒక దివ్య సంఘటన మూలంగా శ్రీరామకృష్ణులు ఆ ప్రత్యేక ప్రయోజనం ఏమిటో తెలుసుకోగలిగారు. వ్యక్తిమాత్రుడిగా తాను ఒకింత విడివడి ఉంటూ జగజ్జనని ప్రేమలో పూర్తిగా ముడివడి లోకశ్రేయస్సు అనే ఆమె మోపిన మహాబాధ్యతను తనదిగా గ్రహించి పరమానందంతో నిర్వర్తించ దొడగారు.

మధురభావ సాధనలో పరిపూర్ణతను పొందిన పిదప శ్రీరామకృష్ణులు అద్వైత సాధనను చేపట్టడంలోని యుక్తియుక్తత మరొక దృక్పథం నుంచి స్పష్టం అవుతుంది. భావస్థితి, భావాతీత స్థితుల రెంటికీ నడుమ సర్వదా కార్యకారణ

సంబంధం ఒకటి ఉంది. ఎందుకంటే: భావస్థితు లన్నిటికీ అతీతమైన అద్వైత

7. అద్వైత భావం - భక్తి భావం

రాజ్యపు భూమానందమే పరిమితమై భావ (భక్తి) రాజ్యానికి చెందిన శ్రవణ, దర్శన, స్పర్శనాది భగవత్సంభోగానంద రూపంగా వ్యక్తం అవుతోంది. కాబట్టి మధురభావపు పరాకాష్ఠకు చేరి, ద్వైతభూమి యొక్క చరమస్థితిని చేరుకొన్నాక భావాతీతమైన అద్వైతభూమికి తప్ప మరెప్పటికి పోగలుగుతుంది శ్రీరామకృష్ణుల మానసం?

పై వాదన సకారణయుతమే అయినప్పటికీ, శ్రీరామకృష్ణులు జగజ్జనని సూచన మేరకే అద్వైత సాధనను అనుష్ఠించారని ఈ క్రింది సంఘటన సుస్పష్టం చేస్తున్నది.

గంగాసాగరంలో స్నానం ఆచరించాలనే ఆకాంక్షతోను, పూరీ క్షేత్రంలో జగన్నాథుని దర్శించాలనే అభిలాషతోను పరివ్రాజకాచార్యుడైన శ్రీతోతాపురి

8. శ్రీ తోతాపురి దక్షిణేశ్వర ఆగమనం

మధ్యభారతదేశం నుండి ఇచ్ఛానుసారం తీర్థయాత్రలు సలుపుతూ వంగదేశానికి అరుదెంచాడు. పావన నర్మదానదీ తీరంలో సుదీర్ఘకాలం ఏకాకిగా వసించి, నిర్వికల్ప సమాధి స్థితిని చేర్పగల ఆధ్యాత్మిక సాధనానుష్ఠానాలలో నిమగ్నుడై బ్రహ్మసాక్షాత్కారాన్ని పొందిన మహనీయుడాతడు. ఇప్పటికీ అక్కడి వృద్ధ సాధువులు ఇందుకు ప్రత్యక్ష సాక్షులై ఉన్నారు. బ్రహ్మజ్ఞానం సిద్ధించాక యథేచ్ఛగా కొంతకాలం పర్యటించాలనే ఆకాంక్ష ఆతడిలో జనించింది. ఆ అభిలాషతోనే ఆతడు భారతదేశపు తూర్పు ప్రాంతాలకు వచ్చి పుణ్యక్షేత్రాలను ఒకటి వెంట ఒకటిగా సందర్శించసాగాడు. సమాధి స్థితిలో ఉండని సమయాలలో ఆత్మారాములైన మహాపురుషులకు బాహ్యప్రపంచం గోచరిస్తూ ఉన్నా, అది వారికి బ్రహ్మంగానే అనుభూతమవుతూ ఉంటుంది. మాయా ఆచ్ఛాదితమైన ఈ జగత్తులోని వ్యక్తులను, వస్తువులను, దేశకాలాదులను - హెచ్చు తగ్గులుగా ఆ బ్రహ్మపదార్థపు అభివ్యక్తాలుగానే అనుభూతం చేసుకొంటూ వా రా కాలంలో దేవాలయాలు, పుణ్యతీర్థాలు, సాధుసందర్శనాలను చేస్తూ ఉంటారు. కాబట్టి బ్రహ్మజ్ఞుడైన తోతాపురి కూడ తీర్థాటనలకు బయలుదేరడంలో వింత ఏమీ లేదు. పైన పేర్కొన్న రెండు (గంగాసాగరం, పూరీ) పుణ్యతీర్థాల సేవనానంతరం భారతదేశ వాయవ్య ప్రాంతాలకు వెళుతూ ఆయన దక్షిణేశ్వరం చేరుకొన్నాడు. ఏ ప్రదేశంలోనైనా మూడు రోజుల కంటే ఎక్కువ కాలం గడపటం ఆయన నియమం కాదు. అందుచేతనే దక్షిణేశ్వర కాళీ ఆలయంలో కూడా మూడు రోజులు మాత్రమే గడపాలని ఆయన వచ్చాడు. అనూహ్య లీలావిలాసిని అయిన జగజ్జనని, అతడి జ్ఞానానికి పరిపూర్ణతను సంతరింప చేయడానికి, తన సొంత బిడ్డ (శ్రీరామకృష్ణులు)తో అద్వైత సాధనను

అనుష్ఠింప చేయడానికి అక్కడకు తీసుకొని వచ్చిందని తోతాపురి మొదట్లో గ్రహించలేకపోయాడు.

కాళికాలయానికి రావడంతోనే తోతాపురి మొదట స్నానఘట్టం మీది విశాల ద్వారమండపానికి వచ్చాడు. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు ఏకవస్త్రం ధరించి, అన్యమనస్కులై అతిసామాన్యునిలా కూర్చుని ఉన్నారు. తపోదీప్తితో, భక్తిభావంతో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూన్న శ్రీరామకృష్ణుల ముఖారవిందాన్ని తిలకించిన క్షణంలోనే తోతాపురి ఆయనపట్ల ఆకర్షితుడయ్యాడు. ఆయన సామాన్య వ్యక్తి కాడనీ, అద్వైత వేదాంత సాధనకు ఉపయుక్తుడైన అటువంటి ఉత్తమాధికారి కనిపించడం చాలా అరుదు అనీ తోతాపురి హృదయాంతరాళంలో తలచాడు. ఆశ్చర్య, ఆరాటాలు పెనగొనగా తోతాపురి అడుగులు ముందుకు వేసి, శ్రీరామకృష్ణులను సమీపించి ఇలా అనుకొన్నాడు: 'హా! తాంత్రిక సాధనలతో ఊరిపోయిన వంగదేశంలో వేదాంత సాధనకు ఉపయుక్తమైన వ్యక్తి మరొకడుంటాడా?' సునిశితంగా పరిశీలించి తనంతట తానుగా శ్రీరామకృష్ణులను ఇలా అడిగాడు: ''నువ్వు పరమ యోగ్యుడైన సాధకునిలా కనిపిస్తున్నావు. వేదాంత సాధనను ఆచరిస్తావా?'' జటాజూటధారి, ఆజానుబాహువు అయిన ఆ నగ్న సన్న్యాసికి శ్రీరామకృష్ణులు ఇలా బదులు చెప్పారు: ''ఏం చేయాలో, ఏం చేయరాదో నాకేమీ తెలియదు. సమస్తం మా అమ్మకే తెలుసు. ఆమె ఆదేశం మేరకు చేస్తాను.'' అందుకు తోతాపురి, ''అయితే వెళ్లు, నీ తల్లిని అడిగి, వెంటనే తిరిగి రా. ఇక్కడ నేను ఎక్కువ కాలం ఉండబోవడం లేదు'' అన్నాడు. శ్రీరామకృష్ణులు బదులుగా ఏమీ పలుకకుండా నెమ్మదిగా జగన్మాత ఆలయానికి వెళ్లారు. ఆలయంలో భావావిష్టులై ''వెళ్లి, నేర్చుకో. నీకు బోధించే నిమిత్తమే ఆ సన్న్యాసి ఇక్కడకు వచ్చాడు'' అన్న జగజ్జనని ఆదేశవాణిని విన్నారు.

9. శ్రీరామకృష్ణులకు జగజ్జనని ఆదేశం

అర్ధబాహ్యచైతన్య స్థితిలో శ్రీరామకృష్ణులు అప్పుడు దివ్యానంద తేజోవదనులై తోతాపురి వద్దకు తిరిగి వచ్చి తల్లి ఆదేశాన్ని ఆతడికి తెలిపారు. శ్రీరామకృష్ణులు 'తల్లి' అంటూ ప్రేమాతిశయంతో సంబోధిస్తున్నది మానవమాత్రురాలైన తల్లిని కాదని, ఆలయంలో ప్రతిష్ఠితమైన దేవీ విగ్రహాన్నే అని గ్రహించాడు తోతాపురి. పసిబాలుని వంటి ఆతడి నిష్కాపట్యాన్ని చూసి ముగ్ధుడైనాడు. కాని ఆతడి ఈ మనోవైఖరికి హేతువులు అమాయకత్వం, మూఢనమ్మకమే అని అతడు భావించాడు. ఇలా భావించుకోవడంతోనే జాలిగొలిపే దరహాసంతో తోతాపురి పెదవి కొనలు ఎలా వంపులు తిరిగాయో మనం ఊహించుకోవచ్చు. తోతాపురి

10. జగన్మాతను గురించి తోతాపురి భావన

కుశాగ్రబుద్ధి వేదాంతంలో వర్ణింపబడిన కర్మఫలదాయకుడైన ఈశ్వరుణ్ణే తప్ప ఇతర దేవతల నెవరినీ గుర్తించడానికి ఒప్పుకోకపోవడమే ఇందుకు కారణం. అంతేగాక పరబ్రహ్మ పరాయణుడైన సంయమయుక్త సాధకుడికి ఆ ఈశ్వరుడి అస్తిత్వాన్ని విశ్వసించడమే తప్ప, అతణ్ణే ప్రార్థించి అతడి కృపాసిద్ధికై భక్తి ద్వారా ఆతణ్ణే ఆరాధింపవలసిన ఆవశ్యకత ఏమీ లేదని తోతాపురి అభిప్రాయం. ఈశ్వరుణ్ణే గురించే ఆతడి భావన ఇలా ఉండగా ఇక త్రిగుణమయి, బ్రహ్మశక్తి యైన మాయను గురించి ఆతడి భావాన్ని మనం ఊహించుకోవచ్చు. అందుచేతనే తోతాపురి ఆమెను కేవలం భ్రమగానే తలచి, ఆమె కొక వ్యక్తిగత అస్తిత్వం ఉన్నదని కూడ (భ్రమకు అస్తిత్వం ఆపాదిస్తే అది భ్రమ ఎలా అవుతుంది?) అంగీకరించడు. ఇక ఆమెను ప్రసన్నురాలిని చేసుకోవడం, ఆమెను ఆరాధించడం ఎలా ఒప్పుకొంటాడు? ఫలితంగా అజ్ఞాన బంధనం నుండి ముక్తిని పొందడానికి సాధకుడికి పురుషకారం, స్వప్రయత్నం ఒక్కటే ఉపాయమని అతడి నిశ్చితాభిప్రాయం. ఆత్మజ్ఞానానికి ఈశ్వరుడి లేదా శక్తితో కూడిన బ్రహ్మ కృప, తోడ్పాటు ఆవశ్యకమనే భావన తోతాపురి మనస్సులో అసలు జనించేదే కాదు. అంతేగాక ఎవరు అలా (సాకార ఉపాసన) చేస్తారో వారు కుసంస్కార వశవర్తులయ్యే అలా చేస్తూ ఉంటారనే నిర్ణయానికి వచ్చాడతడు.

11. గోప్యంగా సన్న్యాసం స్వీకరించాలన్న శ్రీరామకృష్ణుల నిశ్చయం: తత్కారణం

ఏది ఏమైనప్పటికీ తన వద్ద దీక్ష పుచ్చుకొని జ్ఞానమార్గంలో సాధన చేయసాగినప్పుడు శ్రీరామకృష్ణుల ఆ గత సంస్కారాలన్నీ అతిత్వరితంగా తొలగిపోతవని భావించి, తన యోచనలను ఆయనతో ప్రస్తావించక, ఇతర అంశాలతో పరిచయం కలిగించాడు. వేదాంత సాధనకు మునుపు శిఖను, యజ్ఞోపవీతాన్ని పరిత్యజించి విధివిహితంగా సన్న్యాసం పరిగ్రహించాలని తోతాపురి చెప్పాడు. అందుకు శ్రీరామకృష్ణులు ముందు ఒకింత తటపటాయించి పిదప గోప్యంగా సన్న్యాసం పుచ్చుకోవడంలో తన కెలాటి ఆక్షేపణా లేదని అన్నారు. కాని దాన్ని బహిరంగంగా నిర్వర్తిస్తే, అప్పటికే శోకసంతప్తయైన వృద్ధురాలైన తన తల్లి హృదయం మరింత క్షోభిస్తుందని, అలా చేయలేనని చెప్పారు. గోప్యంగా సన్న్యాసం శ్రీరామకృష్ణులు ఎందుకు తీసుకోగోరారో అర్థం చేసుకొన్న తోతాపురి, "మంచిది. శుభముహూర్తం చూసి గోప్యంగానే నీకు సన్న్యాసం ఇప్పిస్తాను" అన్నాడు. ఆ తరువాత కొన్ని రోజులు ఒక అనువైన స్థలంలో గడపాలనే ఉద్దేశంతో, ఆలయ ఉపవనానికి ఉత్తరాన ఉన్న సుందర పంచవటికి వచ్చి, అక్కడ తన ఆసనాన్ని పరిచాడు.

సాధన కుటీరం

12. శ్రాద్ధాది కర్మల ఆచరణ

తదనంతరం ఒక శుభముహూర్తంలో పితృదేవతల ఆత్మ తృప్త్యర్థం శ్రాద్ధాది కర్మలు చేయమని తోతాపురి, శ్రీరామకృష్ణులను ఆదేశించారు. ఆ కర్మకాండ ముగిశాక శిష్యుడి ఆత్మ తృప్తికైకూడ యథావిధిగా పిండప్రదానం చేయించాడు. అందుకు కారణం: సన్న్యాసం పుచ్చుకొన్నప్పటి నుండి సాధకుడు ఇహలోకం, భూ, భువః ఆది సమస్త లోకాలను పొందే ఆశను, హక్కును పూర్తిగా పరిత్యజిస్తాడు. అందుచేతనే సన్న్యసించే ముందు తన శ్రాద్ధకర్మను తానే స్వయంగా చేసుకోవాలని శాస్త్రాలు ఆదేశిస్తున్నవి.

శ్రీరామకృష్ణులు, తన ఆధ్యాత్మిక గురువుగా ఎవరిని ఎప్పుడైతే స్వీకరించారో అప్పుడు నిస్సంకోచంగా తనను తాను వారికి అర్పించుకొని, వారి ఆదేశాలను సంపూర్ణ విశ్వాసంతో పాటించే వారు. అందుచేత ఆయన ఇప్పుడు తోతాపురి ఆదేశానుసారం తు.చ. తప్పక వర్తించారని వేరే చెప్పనవసరం లేదు. శ్రాద్ధాది పూర్వ క్రియల నన్నిటినీ ఆచరించి, సంయతచిత్తులై పంచవటి దరినున్న సాధన కుటీరంలో గురువు తెల్పినట్లు సన్న్యాస దీక్షకు వలసిన సామగ్రిని సేకరించుకొని ఆ శుభముహూర్తం కోసం నిరీక్షించసాగారు.

వేకువకు రెండు గంటలు ఉందనగా శుభ బ్రహ్మముహూర్త సమయం ఏతెంచినప్పుడు, గురుశిష్యు లిద్దరూ సాధన కుటీరంలో కలుసుకున్నారు. అన్ని పూర్వక్రియలూ ముగిశాక హోమాగ్ని ప్రజ్జ్వలింపబడింది. ఇక భగవదార్థం సర్వస్వ త్యాగమనే ఏ వ్రతం సనాతన కాలం నుండి అవిచ్ఛిన్న గురు పరంపరానుగతంగా భారతదేశాన్ని బ్రహ్మజ్ఞ పదవిలో సుప్రతిష్ఠితం చేస్తూవస్తున్నదో ఆ సన్న్యాస దీక్షను స్వీకరించడానికి ముందు ఉచ్చరించబడవలసిన మంత్రాల పవిత్ర గంభీర ధ్వనితో పంచవటీప్రాంతం మారుమోగసాగింది. పావన సలిల భాగీరథీ స్నేహపూర్ణ వక్షాన్ని స్పృశించిన ఆ ధ్వని సుఖస్పర్శ ఒక నూతన అనుపమాన ప్రాణ సంచారాన్ని ఆమెలో కల్పించింది. యుగాలు గతించాక అలౌకిక భారతీయ సాధకు డొకడు భారతదేశం, సమస్త ప్రపంచంలోని బహుజన హితార్థం మళ్లీ సంపూర్ణ పరిత్యాగ వ్రతాన్ని, సన్న్యాసాన్ని స్వీకరించనున్నాడనే శుభవార్తను నలు దిశలా చాటించటానికే అన్నట్లు మర్మరధ్వనితో ఆనందంగా నృత్యం చేస్తూ ఆ జాహ్నవి ప్రవహించసాగింది.

గురువు విరజాహోమ మంత్రాలను పఠింప ప్రారంభించాడు. శిష్యుడు ఏకాగ్రచిత్తంతో గురువును అనుసరించి ఆ మంత్రాలను ఉచ్చరిస్తూ ప్రజ్వలిత పవిత్ర హోమాగ్నిలో ఆహుతులను సమర్పించ సాగాడు. మొదట ప్రార్థనా మంత్రాలు ఉచ్చరింపబడ్డాయి.

13. సన్న్యాస దీక్షకు ముందు పఠించే ప్రార్థనా మంత్రాలు

''పరబ్రహ్మతత్త్వం నన్ను పొందునుగాక! పరమానంద లక్షణం కలిగిన పదార్థం నన్ను పొందును గాక! అఖండం, ఏకరసం, మధు మయమూ అయిన పరబ్రహ్మ నాలో ప్రకటితమౌ గాక! నిన్ను ప్రకటించే బ్రహ్మ విద్యతో సహా నిత్యం వర్తమానుడవై ఉండే హే పరమాత్మ, దేవ మర్త్యాది నీ బిడ్డ లందరిలో నీ విశిష్ట కరుణకు పాత్రుడనైన నేను నీ బిడ్డను, నీ సేవకుడను. సంసారం అనే ఈ పీడకలను నాశనం గావించు. ఓ పరమేశ్వరా, ద్వైతరూపంలో ప్రతిభాసిస్తూ ఉన్న నా పీడకలల నన్నిటినీ అంతం చేయి. హే పరమాత్మా, నా ప్రాణవృత్తుల నన్నిటిని నీకు ఆహుతించి, ఇంద్రియాల నన్నిటిని నిరోధించి, నీపై ఏకాగ్రచిత్తుడను అవుదును గాక! సర్వ ప్రేరకుడవైన ఓ దేవా, జ్ఞాన ప్రతి బంధకాలైన మలినాలన్నిటిని నా నుంచి తొలగించి, నిరర్థక, విరుద్ధ భావనాదులు లేని యథార్థ తత్త్వజ్ఞానం నాలో ఉదయిస్తుందో దాన్ని నాకు అనుగ్రహించు. సూర్యుడు, వాయువు, నదీ నదాల స్నిగ్ధ పవిత్ర జలాలు, వరి, గోధుమలు మొద లైన ఆహార పదార్థాలు, మొక్కలు, వనస్పతులు - ఇత్యాది, లోకంలోని వస్తువు లన్నీ నీ ద్వారా నిర్దేశింపబడి, నా మార్గానికి సుకరములై, నా తత్త్వజ్ఞాన సముపార్జ నలో సహాయకారులు అగుగాక! హే బ్రహ్మన్! నువ్వే ఈ ప్రపంచంలోని విశిష్ట శక్తివంతాలైన అనేక రూపాలలో వ్యక్తమవుతున్నావు. శరీర మానసాలను పవిత్రీకరించుకొని, తత్త్వజ్ఞాన ధారణకు వలసిన సమర్థతను గడించాలనే ఆకాంక్షతో నేను అగ్నిస్వరూపుడవైన నీకు ఆహుతులు వ్రేలుస్తున్నాను. నా పట్ల ప్రసన్నుడవుకా!''[1]

ప్రార్థనా మంత్రాలు ఉచ్చరింపబడ్డ పిదప విరజాహోమం ప్రారంభమైంది. ''భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే నాలోని పంచభూతాలు పవిత్ర మగు గాక! ఈ ఆహుతి ప్రభావంతో రజోగుణ జనితమైన కళంకాల నుంచి ముక్తుడనై నేను జ్యోతిస్స్వరూపుడను ఔతాను గాక - స్వాహా.

''ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం - నాలోని యీ పంచ వాయువులు పవిత్రమగు గాక! ఈ ఆహుతి ప్రభావంతో రజోగుణ జనితమైన కళంకాల నుండి ముక్తుడనై నేను జ్యోతిస్స్వరూపుడను ఔతానుగాక - స్వాహా.

---

1. త్రిసుపర్ణ మంత్రాల తాత్పర్యానికి మహానారాయణోపనిషత్తు చూడండి.

14. సన్న్యాస దీక్షకు ముందు అనుష్ఠించే విరజాహోమ భావార్థం

"శబ్ద స్పర్శ రూప రస గంధాలనే ఇంద్రియాల ద్వారా నాలో ఉత్పన్నమైన సంస్కార సమూహాలు అన్నీ పవిత్రమగు గాక! ఈ ఆహుతి ప్రభావంతో రజోగుణ జనితమైన కళంకాల నుండి ముక్తుడనై నేను జ్యోతిస్స్వరూపుడ నౌతాను గాక - స్వాహా.

"నా మనోవాక్కాయ, కర్మాదులన్నీ పవిత్రమగు గాక! ఈ ఆహుతి ప్రభావంతో రజోగుణ జనితమైన కళంకం నుండి ముక్తుడనై నేను జ్యోతిస్స్వరూపుడ నౌతాను గాక!

"ఎర్రని కళ్లతో, అగ్ని శరీరంలో వసించేవాడా! జ్ఞాన ప్రాప్తితో ప్రతిబంధకాల నన్నిటినీ నాశనం చేసే పరమాత్మా! మేలుకో! హే ఇష్టార్థసిద్ధి ప్రదాయకా! తత్త్వజ్ఞాన మార్గంలో నాకు అడ్డంకులుగా నున్న విఘ్నాల నన్నిటినీ తొలగించు. అంతేగాక నాలోని పూర్వ జన్మకృత సంస్కార రాశి పరిశుద్ధమై, గురుముఖతా ఆలకించిన తత్త్వజ్ఞానం నాలో ఉదయింప చెయ్యి. ఈ ఆహుతి ప్రభావంతో రజోగుణ సంజనిత కళంకం నుండి ముక్తుడనై నేను జ్యోతిస్స్వరూపుడనౌతాను గాక - స్వాహా.

"చిదాభాస బ్రహ్మస్వరూపుడనైన నేను, భార్య, బిడ్డలు, సంపద, గౌరవం, అందం, తదితరాలను ఆకాంక్షించే సమస్త వాసనలను ఈ అగ్నికి ఆహుతి చేయడం ద్వారా నిశ్శేషంగా త్యజిస్తాను గాక - స్వాహా."

15. శిఖను, యజ్ఞోపవీతాన్ని త్యజించడం

ఆ రీతిలో ఆహుతులన్నీ సమర్పించబడిన పిదప 'భూలోకం, స్వర్గలోకం, తదితర లోకాలనన్నిటినీ పొందాలనే ఆకాంక్షను నేను ఈ క్షణం నుండి త్యజిస్తున్నాను'; 'జగత్తులోని ప్రాణికోటు లన్నిటికీ నా నుండి ఎలాంటి భీతీ కలుగకుండు గాక' - అనే శపథంతో హోమకార్యం పరిసమాప్తమయింది. ఆ తరువాత శిఖా సూత్రాలను యథావిధిగా హోమాగ్నిలో ఆహుతించాక, అతిప్రాచీన కాలం నుండి పరంపరానుగతంగా వస్తూ ఉన్న సాధకుల సంప్రదాయం మేరకు గురువు యిచ్చిన కౌపీనాన్ని, కాషాయ వస్త్రాలను ధరించి సన్న్యాసనామాన్ని[1] గ్రహించిన

---

1. సన్న్యాస దీక్షను ఇచ్చిన తరుణంలో తోతాపురి, గురుదేవులకు 'శ్రీరామకృష్ణ' అనే నూతన నామధేయాన్ని ఇచ్చారని మాలో కొందరు అభిప్రాయపడుతున్నారు. కాదు, గురుదేవులకు పరమ భక్తుడూ, హృదయపూర్వకంగా ఆయనను సేవించినవాడూ అయిన మథుర్ బాబు ఆయనను ఆ పేరుతో మొదట పిలిచేవాడని మరికొందరు అంటారు. మొదటి అభిప్రాయమే సమంజసంగా ఉందని మాకు అనిపిస్తోంది.

→

తరువాత (అంటే సన్న్యాసదీక్ష పరిసమాప్తమయ్యాక) తోతాపురి నుండి బ్రహ్మజ్ఞానోపదేశాన్ని ఆలకింప ఉద్యుక్తులయ్యారు శ్రీరామకృష్ణులు.

సన్న్యాస దీక్ష ముగిశాక బ్రహ్మజ్ఞుడైన తోతాపురి అద్వైత వేదాంత ప్రసిద్ధమైన 'నేతి, నేతి' మార్గాన్ని అనుసరించి, బ్రహ్మస్వరూపంలో తాదాత్మ్యం చెందమని శ్రీరామకృష్ణులను ప్రేరేపిస్తూ ఇలా ఉద్బోధ గావించాడు:

16. తోతాపురి ఉద్బోధ

"నిత్య - శుద్ధ - బుద్ధ - ముక్త స్వభావం కలిగినది, దేశ కాల నిమిత్తాల ద్వారా సర్వదా అవిచ్ఛిన్నమైనది అయిన పరబ్రహ్మ మొక్కటే నిత్యసత్యం. అసాధ్యాన్ని సాధ్యంచేసే శక్తిగల మాయ తన ప్రభావంతో ఆ పరబ్రహ్మని నామరూపాల ద్వారా ఖండితమైన దానినిగా, పరిచ్ఛిన్నమైన దానినిగా కనబరుస్తూ ఉన్నప్పటికీ అది ఏనాడూ అలా కానేరదు. కారణం: నిర్వికల్ప సమాధిలో, మాయ నుండి జనితమైన ఈ దేశకాలాదులు, నామరూపాలు బిందుమాత్రంగానైనా అనుభూతానికి రావు. కాబట్టి నామ రూపాల పరిధిలోని ఏ వస్తువూ ఎన్నటికీ నిత్యవస్తువు కాజాలదు. కనుక నామరూపాత్మకాలైన ఈ అనిత్య వస్తువులను పరిత్యజించు. నామరూప మనే పంజరాన్ని సింహసదృశ పరాక్రమంతో బద్దలుకొట్టి దాని నుండి బయటకు రా. నీలోనే నెలకొని ఉన్న ఆత్మతత్త్వాన్వేషణలో మునిగిపో. సమాధి సహాయంతో స్వాత్మలో వసించు. అప్పుడు నామరూపాత్మకమైన జగత్తు శూన్యంలో అదృశ్యం కావడం నువ్వు గాంచుతావు. ఈ క్షుద్రమైను 'నేను' అనే జ్ఞానం విరాట్టులో లీనం కాగా, అఖండ సచ్చిదానందాన్ని స్వస్వరూపంగా ప్రత్యక్ష సాక్షాత్కారం చేసుకోగలవు. 'ఏ జ్ఞానంతో ఒక వ్యక్తి మరోవ్యక్తిని చూస్తాడో, తెలుసుకొంటాడో, వింటాడో - ఆ జ్ఞానం అల్పం, క్షుద్రం. ఏది అల్పమో అది తుచ్ఛం. దానిలో పరమానందం

→

'ఎంతో పరిశోధన చేశాక పై రెండు అభిప్రాయాలు యుక్తియుక్తంగా లేవని, అంత ప్రాచుర్యంలో లేకపోయినా చిన్నప్పటి నుండే గురుదేవులకు ఆ పేరు ఉండేదని అనుమానించ వచ్చని స్వామి ప్రభానంద తెలియచేస్తున్నారు. అందుకు హేతువు: శ్రీరామకృష్ణుల కుటుంబంలోని వారంతా శ్రీరాముని భక్తులు. రఘువీరుడు వారి కులదేవత. కుటుంబంలోని దాదాపు అందరి పేర్లలోను 'రామ' శబ్దం ఉండటం కనిపిస్తూనే ఉంది. ఉదాహరణకు: క్షుదీరామ్, రాంకుమార్, రామేశ్వర్, రామ్‌శిల, హృదయరామ్, రామ్‌తారక్. కాబట్టి గదాధర్ కూడ 'శ్రీరామకృష్ణ'లనే పేరును కలిగి ఉండడం సహజమేననీ, కాని ఆయన ఆ పేర సుప్రసిద్ధులు కావడం తదనంతర కాలంలోనే అనీ స్వామి ప్రభానందుల అభిప్రాయం. నిజానికి శ్రీరామకృష్ణులు ప్రఖ్యాతికి వచ్చింది కేశవసేన్ తన పత్రికలలో ఆయనను గురించి వ్రాయడం ప్రారంభించినప్పటి నుండే. కనుక ప్రభానందుల అభిప్రాయమే యుక్తియుక్తంగా తోస్తోంది."

- అనువాదకుడు.

లేదు. కాని ఏ జ్ఞానాన్ని సముపార్జించి ఒక వ్యక్తి ఇతరులను చూడడో, తెలుసుకొనడో, వినడో - అది భూమజ్ఞానం, బ్రహ్మజ్ఞానం. అదే పరమానంద దాయకం. ఎవడు సర్వులలోను సర్వదా విజ్ఞాతుడిగా ప్రకాశిస్తూ ఉన్నాడో ఆ పరమాత్మను ఏ పరిమిత మనోబుద్ధులు తెలుసుకోగలవు.''[1]

శ్రీ తోతాపురి వివిధ ఉపదేశాల ద్వారా, యుక్తి తర్కాల ద్వారా, శాస్త్ర బోధనల ద్వారా ఆనాడు శ్రీరామకృష్ణులను సమాధిస్థితి పొందింప ప్రయత్నించాడు. తోతాపురి ఆ రోజు తాను యావజ్జీవితం కఠోర సాధనలు చేసి సిద్ధించుకొన్నదైన అద్వైత చైతన్య స్థితిలో శ్రీరామకృష్ణులను వెంటనే అవస్థితులను చేయ బద్ధకంకణు డైనట్లు ప్రయత్నించాడు. ఆ విషయం మేము గురుదేవుల నుండి తెలుసు కొన్నాం. ఆయన ఇలా అన్నారు: ''దీక్షానంతరం దిగంబరుడు నానాసిద్ధాంత వాక్యాలను ఉపదేశించసాగాడు. మనస్సును సమస్త విషయాల నుండి వికల్ప రహితం చేసుకొని ఆత్మధ్యానంలో నిమగ్నం చేయమని చెప్పాడు. కాని ధ్యానానికి కూర్చున్న నేను ఎంత ప్రయత్నించినా మనస్సును నిర్వికల్పం చేయడంలోనూ, నామరూపాల ఆవరణను దాటిపోవడంలోనూ కృతకృత్యుణ్ణి కాలేకపోయాను. ఇతర విషయాలన్నిటి నుండి సులభంగానే మనస్సు ఉపసంహరణ చెందింది. కాని అలా ఉపసంహరణ చెందిన తక్షణమే చిరపరిచితమైన జగజ్జనని చిద్ఘన సజీవమూర్తి దాని ఎదుట దేదీప్యమానంగా ప్రకాశిస్తూ గోచరించగా, నా మనస్సు నామరూపాలను అతిక్రమించి పోజాలకపోయింది. అద్వైత బోధనలను ఆలకించి ధ్యానానికి ఆసీనుడనై ఎన్నిసార్లు ప్రయత్నించినా ప్రతిసారీ అట్లే జరగడంతో ఇక నిర్వికల్ప సమాధిని ఎన్నటికీ పొందలేననే నిస్పృహ నాలో జనించింది. పిదప నేను కళ్ళు తెరిచి దిగంబరుడితో, 'లేదు, అది సాధ్యం కాదు. మనస్సును పూర్తిగా వికల్పరహితం చేసి ఆత్మధ్యానంలో మగ్నం కావడం నాకు అసాధ్యం' అని అన్నాను. ఆ మాటలకు దిగంబరుడు నన్ను చీవాట్లుపెడుతూ ఆవేశంతో, 'ఏమిటీ? సాధ్యం కాదా?' అంటూ కుటీరంలో అటూ ఇటూ పరికించి పగి లిన ఒక గాజు పెంకును చూశాడు. దాన్ని తీసుకొని సూది వంటి దాని మొనతో బలవంతంగా కనుబొమల మధ్య గ్రుచ్చి, 'నీ మనస్సును ఈ బిందువుపై కేంద్రీ కరించు' అన్నాడు. నేనప్పుడు దృఢసంకల్పంతో ధ్యానానికి కూర్చున్నాను. మళ్ళీ వెనుకటిలా మనస్సులో జగన్మాత రూపం ప్రత్యక్షమైన మరుక్షణమే జ్ఞానాన్ని కత్తిగా ఎంచుకొని మానసికంగా ఆ మూర్తిని రెండుగా ఖండించి వేశాను. అప్పుడు

17. శ్రీరామకృష్ణులకు నిర్వికల్ప సమాధి సిద్ధించడం

1. బృహదారణ్యకోపనిషత్తు. 2.4.14

మనస్సులో యిక ఏ వికల్పమూ మిగిలి ఉండకపోవడంతో అది సమస్త నామ రూపాత్మకమైన జగత్తును దాటి రివ్వున పైకి ఎగసిపోగా, నేను సమాధిమగ్నుడ నైనాను.''

18. తోతాపురి నిర్ధారణ - విస్మయం

శ్రీరామకృష్ణులు పైన వర్ణించిన రీతిలో సమాధిమగ్నులై ఉన్నప్పుడు తోతాపురి చాలాసేపు ఆయన ప్రక్కనే కూర్చుండిపోయాడు. పిదప కుటీరం వెలుపలకు వచ్చాడు. తనకు తెలియకుండా ఎవరైనా కుటీరంలో ప్రవేశించి శ్రీరామకృష్ణులకు విఘ్నం కలిగిస్తారేమో నని తలుపుకు తాళం బిగించాడు. ఆ తరువాత సమీపంలోని పంచవటి క్రింద ఉన్న తన ఆసనంపై కూర్చుని తలుపు తెరిచే నిమిత్తం శ్రీరామకృష్ణుల పిలుపుకై నిరీక్షించసాగాడు.

పగలు గడిచిపోయి, రాత్రి అయింది. మెల్లగా ప్రశాంతంగా రోజులు దొర్లాయి. మూడు రోజులు గడిచిపోయాక కూడా తలుపు తెరవమనే పిలుపు రానందున తోతాపురి విస్మయ ఆరాటాలతో కుటీరం తలుపు తెరవ డానికై తన ఆసనం నుండి లేచాడు. తన శిష్యుని స్థితిని తెలుసుకోగోరి తోతాపురి కుటీరంలోకి వెళ్ళాడు. తను ఏ భంగిమలో కూర్చోబెట్టి వెళ్ళాడో అదే భంగి మలో శ్రీరామకృష్ణులు కూర్చొని ఉండడం చూశాడు. దేహంలో ప్రాణం నిలిచి వున్న జాడ ఏమీ అగపడడం లేదు. కాని ఆయన ముఖమండలం ప్రశాంత గంభీరమై, తేజోరాశిలా ప్రకాశిస్తూ ఉన్నది. బాహ్యజగత్తు పరంగా శిష్యుడు పూర్తిగా మృతప్రాయుడు. గాలి లేని చోట కంపహీనమైన దీపంలా ఆతడి మనస్సు బ్రహ్మంలో లీనమై ఉన్నదని గురువు గ్రహించాడు.

సమాధి మర్మాల నెరిగిన తోతాపురి స్తంభీభూతుడై ఇలా భావించాడు: 'నా ముందు జరిగింది వాస్తవమేనా? నలభై సుదీర్ఘ సంవత్సరాల కఠోర సాధనతో నేను సముపార్జించినది ఈ మహాపురుషుడు ఒక్క రోజులోనే సాధించగలిగాడా?' సందేహాస్పదుడైన తోతాపురి, శ్రీరామకృష్ణుల పరిస్థితిని పరీక్షించి, ఆయన దేహంలో వ్యక్తమవుతున్న లక్షణాలను సునిశితంగా పరిశీలించ నెంచాడు. గుండె కొట్టుకొంటూ ఉన్నదో లేదో, లేశమాత్రమైనా ఊపిరి నాసికా రంధ్రాల నుండి వస్తూ ఉన్నదో లేదో ఆతడు పరీక్షించాడు. కొయ్యదుంగలా స్థిరంగా అవస్థితమై ఉన్న శిష్యుడి దేహాన్ని మళ్ళీ మళ్ళీ స్పృశించి చూశాడు. కాని దానిలో ఎలాంటి వికారంగాని, విలక్షణం గాని, బాహ్యచైతన్యంగాని కనిపించలేదు. విస్మయానంద పరవశుడైన తోతాపురి ఇలా కేకపెట్టాడు: ''ఇది దైవమాయయా? నిజంగానే ఇది సమాధియా? వేదాంతంలో పేర్కొనబడిన జ్ఞానమార్గంలో తుట్టతుది ఫలమైన నిర్వికల్ప సమాధియా ఇది? హా! దైవమాయ ఎంత విచిత్రమైనది!''

పిదప తోతాపురి సమాధిస్థితి నుండి శిష్యుణ్ణి బాహ్యచేతనలోకి తీసుకు వచ్చే కార్యం చేపట్టాడు. 'హరిః ఓం, హరిః ఓం' అనే ఆతడి మేఘగంభీర కంఠ స్వరంతో పంచవటి ప్రాంతం మార్మోగసాగింది.

19. శ్రీరామకృష్ణులను సమాధిస్థితి నుండి బాహ్య స్పృహలోకి తేవడానికి తోతాపురి చేసిన ప్రయత్నం

శిష్యుడి పట్ల ప్రేమాకర్షితుడై నిర్వికల్ప సమాధిలో అతణ్ణి సుప్రతిష్ఠుణ్ణి చేయడానికై తోతాపురి రోజులు, నెలల తరబడి దక్షిణేశ్వరంలోనే ఎలా గడిపాడో, శ్రీరామకృష్ణుల సహాయంతో స్వకీయ ఆధ్యాత్మిక జీవనం ఎలా మరింత పరిపూర్ణమైనదో - ఆ వృత్తాంతం మరొక చోట[1] మేం వివరించడం జరిగింది.

అవిచ్ఛిన్నంగా పదకొండు నెలల కాలం దక్షిణేశ్వరంలో గడిపిన పిదప తోతాపురి భారతదేశ పశ్చిమ ప్రాంతాలకు బయలుదేరాడు. ఈ సంఘటన జరిగిన అనతికాలంలోనే నిరంతరం నిర్వికల్ప అద్వైత భూమిలో నెలకొని ఉండాలనే దృఢసంకల్పం శ్రీరామకృష్ణుల మనస్సులో జనించింది. ఆయన ఆ సంకల్ప అభీష్టం ఎలా నెరవేరిందో, సామాన్య సాధకుల మాట అలా ఉంచి, అవతార పురుషుల కంటే కాస్త తక్కువ స్థాయిలోని, 'ఆధికారిక పురుషులు' కూడ ఏ అత్యున్నత అద్వైత భూమిలో ఎక్కువ కాలం నెలకొని ఉండలేరో, ఆ అద్వైత భూమిలో ఆయన ఎలా నిరవచ్ఛిన్నంగా ఆరు నెలల కాలంపాటు వసించారో, ఆ సమయంలో ఒక సాధువు కాళికాలయానికి ఏతెంచి శ్రీరామకృష్ణులను చూసి వారి ద్వారా భవిష్యత్తులో మహోత్కృష్ట లోక శ్రేయస్సు కలుగనున్నదని గ్రహించి ఆరు నెలల కాలం అక్కడే ఉండి వివిధోపాయాల ద్వారా ఆయన శరీరాన్ని పరిరక్షించి, అక్కడి నుండి వెళ్ళిపోయాడో - ఈ వివరాలన్నిటినీ మరొకచోట[2] తెలిపాము. కాబట్టి శ్రీరామకృష్ణుల కృపాతిశయంతో మథురనాథ్ జీవితంలో జరిగిన ఒకానొక విశేష సంఘటనను ఇక్కడ ప్రస్తావించి ఈ అధ్యాయాన్ని పూర్తిచేస్తాం.

శ్రీరామకృష్ణులలో వ్యక్తమయ్యే అద్భుత దైవీశక్తులను చూసి ఆయన పట్ల మథురనాథ్ భక్తివిశ్వాసాలు అప్పటికే మరింతగా ఇనుమడించాయి. ఈ సమయంలో జరిగిన ఒక సంఘటన అతడి భక్తిని సుదృఢమూ, అచంచలమూ గావించి శ్రీరామకృష్ణులకు అతణ్ణి సంపూర్ణ శరణాగతుణ్ణిగా చేసివేసింది.

మథురనాథ్ రెండవ భార్యయైన శ్రీమతి జగదంబా దాసి రక్తగ్రహణి వ్యాధిగ్రస్తురాలైంది. వ్యాధి క్రమంగా విషమించింది. కలకత్తాలోని సుప్రసిద్ధ

---

1. గురుభావం, పూర్వార్థం III.8
2. గురుభావం, పూర్వార్థం III.3.10

వైద్యులు, (ఆయుర్వేద) కవిరాజులు మొదట్లో ఆమె ప్రాణానికే ముప్పు అని భయపడ్డారు, పిదప పెదవులు విరిచారు.

20. పాణాంతకమైన రోగం నుండి జగదంబా దాసిని శ్రీరామకృష్ణులు రక్షించడం

మధురనాథ్ పుట్టుకతో పేదవాడైనప్పటికీ ఎంతో అందగాడైనందున రాణీ రాస్మణి తన మూడవ కుమార్తె కరుణామయి నిచ్చి వివాహం చేసిందని శ్రీరామ కృష్ణుల ముఖతా మేం వినివున్నాం. కరుణామయి మరణించడంతో రాణీ రాస్మణి తన ఆఖరికుమార్తె జగదంబా దాసిని మధుర్‌నాథ్ కిచ్చి వివాహం చేసింది. వివాహానంతరం మధుర్ పరిస్థితిలో గొప్ప మార్పు వచ్చింది. అనతికాలం లోనే అతడు తన వివేక కౌశలాదులతో రాణికి కుడిభుజం అయ్యాడు. రాణీ రాస్మణి మరణానంతరం ఆమె జమీపై యావత్తు ఆజమాయిషీ ఆతడి పరం ఎలా అయిందో ఆ వృత్తాంతం లోగడే చెప్పుకొన్నాం.

ప్రస్తుతం తన ప్రియాతిప్రియమైన భార్య జగదంబా దాసిని కోల్పోవ డమేగాక, జమీపై తను చలాయించే ఆజమాయిషీనీ వదులుకోవాల్సిన పరిస్థితి మధుర్‌కి ఎదురైంది. వైద్యులు పెదవి విరిచినప్పటి అతడి మనఃస్థితిని గురించి ఎక్కువగా చెప్పనవసరం లేదు. మధుర్ అపరిమిత ఆందోళనకు గురై దక్షిణేశ్వ రానికి వచ్చి జగన్మాతకు ప్రణమిల్లి శ్రీరామకృష్ణులను వెతుక్కుంటూ పంచవటి కేసి వచ్చాడు. అతడి గాబరా స్థితిని చూసి శ్రీరామకృష్ణులు అతణ్ణి ఆప్యాయంగా తన ప్రక్కన కూర్చోపెట్టుకొని, కారణం ఏమిటని అడిగారు. మధుర్ ఆయన పాదాలపై వ్రాలిపోయి, కంట నీరు పెట్టుకొని డగ్గుత్తికతో విషయం అంతా ఆయ నకు తెల్పి దీనాతిదీనంగా ఇలా అన్నాడు: ''దుర్ఘటన సంభవించబోతోంది. కాని దాని గురించే కాక, బాబా! ఇక మీదట నిన్ను సేవించుకొనే భాగ్యాన్ని కోల్పో బోతూ ఉన్నందుకు ఎంతో బాధపడుతున్నాను.''

మధుర్ దైన్యావస్థను చూసి శ్రీరామకృష్ణుల హృదయం కరుణతో నిండి పోయింది. ఆయన భావసమాధిలోకి వెళ్ళి, మధుర్‌తో, ''భయపడకు! నీ భార్యకు నయం అవుతుంది'' అన్నారు. శ్రీరామకృష్ణులను సాక్షాత్తూ భగవంతు డని విశ్వసించిన మధుర్, శ్రీరామకృష్ణుల అభయ ప్రదానంతో సజీవుడైనట్లుగా భావించి, నాటికి ఆయన నుండి సెలవు పుచ్చుకొన్నాడు. జాన్‌బజార్‌లోని తన గృహాన్ని చేరుకోగానే జగదంబా దాసి ఆరోగ్యం ఆకస్మికంగా మెరుగవడం మధుర్ గమనించాడు. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: ''నాటి నుండి జగదంబా దాసి నెమ్మదిగా కోలుకోసాగింది. ఆ వ్యాధివల్ల ఆమె అనుభవించవలసిన బాధనంతా ఈ దేహం (తమ శరీరాన్ని చూపిస్తూ) భరించింది. జగదంబా దాసికి నయం

అయిన కారణంగా రక్తగ్రహణి ఇత్యాది వ్యాధులతో నేను ఆరు నెలల కాలం బాధల ననుభవించాను.''

మథుర్ ఒనరించిన అద్భుత సేవలను గురించి ముచ్చటిస్తూ శ్రీరామ కృష్ణులు ఒకరోజు పై సంఘటనను ప్రస్తావించి, ''ఊరకే పధ్నాలుగు సంవత్సరాలు మథుర్ నాకు సేవలు ఒనరించాడా? దీని (తన దేహాన్ని చూపుతూ) ద్వారా జగజ్జనని అతడికి ఎన్నో అద్భుతశక్తులను దర్శింపచేసింది. అందుకే అతడు అంత భక్తిప్రపత్తులతో నన్ను సేవించాడు'' అని అన్నారు.

16. వేదాంత సాధనకు భరతవాక్యం - ఇస్లాం మత సాధన

1. శ్రీరామకృష్ణుల తీవ్ర వ్యాధి: ఆయన అసదృశ వైఖరి

పైన వివరించినట్లు జగదంబా దాసి ప్రాణాంతక వ్యాధిని నయం చేసిన కారణాన ఐతేనేం లేదా ఎడతెగక ఆరు సుదీర్ఘ నెలల కాలం పాటు అద్వైత భూమిలో నెలకొని ఉండడం కోసమై చేపట్టిన అతిమానుషమైన ప్రయత్నాల ఫలితంగా అయితేనేం శ్రీరామకృష్ణుల దార్ఢ్యశరీరం ఛిన్నాభిన్నమై కొన్ని నెలలూ వ్యాధిగ్రస్తమై ఉన్నది. తీవ్ర గ్రహణి రోగం వాతబడినట్లు ఆయన ముఖతా మేం విన్నాం. మేనల్లుడైన హృదయ్ రేయింబవళ్లు ఆయనకు శుశ్రూషలు చేశాడు. చికిత్సకై సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుడైన గంగాప్రసాద్ సేన్‌ను నియమించి, పథ్యాదులకు ప్రత్యేక ఏర్పాట్లు గావించాడు మథుర్. ఆయన శరీరం తీవ్రవ్యాధికి గురైనప్పటికీ, దేహ చైతన్యానికి అతీతంగా ఆయన మనస్సు అనుభవించిన అపురూప ప్రశాంతత, నిరవచ్ఛిన్న దివ్యానందం వర్ణనాతీతం. ఆయన మనస్సు దేహం నుండి, వ్యాధి నుండి, సకల లౌకిక వస్తువుల నుండి కించిత్ సూచన మేరకే విడివడిపోయి, రివ్వున పైకెగసి క్షణంలో ఆ ఊర్ధ్వ నిర్వికల్పభూమిని చేరుకొనేది. బ్రహ్మ, ఆత్మ లేక ఈశ్వరుడు వంటి పదాలు స్ఫురణకు వచ్చిన మరుక్షణమే తక్కిన విషయాల నన్నిటిని మరచిపోయి ఆ భావనలో లీనమైపోగా, ఆయన ప్రత్యేక అస్తిత్వం పూర్తిగా మరుగైపోయేది. కాబట్టి వ్యాధి తీవ్రత కారణంగా దేహంలో భరించలేని బాధ కలిగినా ఆ బాధను ఆయన లేశమాత్రంగానే అనుభవించే వారని స్పష్టమవుతోంది. కాని వ్యాధిజనితమైన ఆ బాధ కొన్ని సమయాలలో తమ మనస్సును ఆధ్యాత్మికానుభూతుల సమున్నత భూముల నుండి దిగువకు తీసుకువచ్చి దేహచైతన్యాన్ని కల్పించేదని ఆయన నుండే మేం

విని ఉన్నాం. వేదాంత మార్గాన్ని అనుసరించే పరమహంస పరివ్రాజకాచార్యులు ఈ కాలంలో తమ వద్దకు వచ్చి ఉన్నారని శ్రీరామకృష్ణులు తెలిపారు. ఆ కాలంలో 'నేతి, నేతి', 'అస్తి - భాతి - ప్రియం'[1], 'అయమాత్మాబ్రహ్మ' ఇత్యాది ప్రసిద్ధ వేదాంత తత్త్వ విచారణ పలుకులతో సర్వదా ఆయన గది మారుమ్రోగుతూ ఉండేది.[2] ఆ అత్యున్నత వేదాంత తాత్త్విక చర్చలలో వారు ఎలాంటి తుది నిర్ణయానికీ రాలేకపోయినప్పుడు, శ్రీరామకృష్ణులే మధ్యవర్తులై పరిష్కరించే వారు. సామాన్యులలా ఆయన కూడ వ్యాధి బాధతో మనోవ్యాకులత పొంది వుండే పక్షంలో దురవగాహమైన ఆ తాత్త్విక చర్చలలో సర్వదా పాల్గొనడం ఎన్న టికీ ఆయనకు సాధ్యపడేది కాదని చెప్పడం అనవసరం.

2. 'భావముఖం'లో నెలకొని ఉండడం గురించిన శ్రవణ సంబంధిత అనుభవం : తత్ఫలితం

నిర్వికల్ప సమాధి స్థితిలో ఆయన అలా నిరవచ్ఛిన్నంగా నెలకొని ఉన్న కాలం ఆఖరున శ్రీరామకృష్ణులకొక శ్రవణ సంబంధిత దివ్యానుభూతి కలిగిందని వేరొకచోట[3] మేం తెలియజేశాం. 'భావముఖం'లో నెల కొని ఉండు అని మూడవసారి ఆయన ఆదేశం పొంద డమే ఆ అనుభూతి. శ్రవణ సంబంధిత అనుభూతి అని మేం పేర్కొంటున్నప్పటికీ, ఆయన హృదయాంతరాళా లలో అనుభూతం చేసుకొన్నదిగా దానిని పాఠకులు గ్రహించాలి. కారణం : మొదటి రెండుసార్లు జరిగినట్లు ఈసారి ఆ ఆదేశాన్ని ఏ మూర్తి ముఖతా ఆయన విని ఉండలేదు. కాని తురీయ అద్వైత భూమిలో సంపూర్ణంగా ఐక్యం చెందక ఆయన మనస్సు సర్వదా ఆ తత్త్వం నుండి కించిత్తు విడివడి, ఒకింత దిగువకు వచ్చి తనను సగుణబ్రహ్మగానో లేక విరాట్ బ్రహ్మగానో లేదా జగజ్జనని అంశగానో భావిస్తూ ఉంటూ ఉండేదో, అట్టి అవస్థలో 'భావముఖంలో వసించు' అనే భావన లేదా సంకల్పం ఆ విరాట్పురుషుని విశ్వమానసంలో జనించి ఉండడం శ్రీరామకృష్ణులు ప్రత్యక్షంగా అనుభూతం చేసుకొన్నారు. తత్ఫలితంగా ఆయన భవిష్యత్ జీవితోద్దేశం స్పష్టంగా ఆయన కళ్ల ముందు గోచరమైంది.

శరీరాన్ని ఉంచుకోవాలనిగాని లేదా జీవించి ఉండాలని గాని కించిత్తు కోరికా ఆయనలో లేకున్నప్పటికీ అతిగూఢమైన జగజ్జనని సంకల్పంతో భావముఖంలో నెలకొని ఉండమని పదే పదే ఆదేశాన్ని పొంది స్వప్రయోజనం

---

1. మాండూక్యోపనిషత్తు
2. గురుభావం, ఉత్తరార్థం IV.2.4
3. III.2.20; IV.3.2.20

ఏమీ లేకున్నప్పటికీ భగవల్లీలా ప్రయోజనార్థం తమ శరీరాన్ని పరిరక్షించు కోవాలని, నిర్వికల్ప స్థితిలో పరబ్రహ్మతో తాదాత్మ్యం చెంది ఉంటే శరీరం ఉండడం అసంభవమని, కాబట్టే తామిప్పుడు అలా ఆదేశితులైనారని స్పష్టంగా శ్రీరామకృష్ణులు గ్రహించారు. 'జాతిస్మరత్వం'[1] ద్వారా ఆయన ఇప్పుడు చక్కగా ఇలా అర్థం చేసుకొన్నారు: తాము నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావులైన అవతార పురుషులమని, ప్రస్తుత యుగంలో ఏర్పడ్డ ధర్మగ్లానిని తొలగించివేసి లోక కల్యాణం సాధించే నిమిత్తమే తాము మానవరూపు దాల్చి కఠోర తపస్సు చేయవలసి వచ్చిందనీ! అంతేగాక జగజ్జనని ఏదో ఒక ప్రత్యేక ప్రయోజనార్థమే తనను ఈసారి బాహ్య ఐశ్వర్య, ఆడంబరరహితునిగా, విద్యావిహీనునిగా, ఒక పేదబ్రాహ్మణ కుటుంబంలో జన్మింప చేసిందనీ, ఆ లీలా రహస్యం (అంటే తానొక అవతారపురుషుడననే) తమ జీవితకాలంలో కొద్దిమంది మాత్రమే గ్రహించగలరనీ, కాని తమ మనఃశరీరాల ద్వారా మహాప్రబల ఆధ్యాత్మిక తరంగాలు ఉత్పన్నమవుతాయో అవి మహా వేగగతిన ఎగసి చిరకాలం మానవాళికి శ్రేయస్సు ఒనగూరుస్తవని శ్రీరామకృష్ణులు ఇప్పుడు చక్కగా తెలుసుకొన్నారు.

3. గతజన్మల స్మృతి- బ్రహ్మజ్ఞాన అనుభూతి

శ్రీరామకృష్ణులకు జాతిస్మరత్వాది అసాధారణ అనుభూతులు ఎలా కలిగినవో మనం అర్థం చేసుకోవాలంటే శాస్త్రాలు వక్కాణిస్తున్న కొన్ని విషయాలను మనం స్మరించాలి. జ్ఞానమార్గాన్ని అనుసరించి నిర్వికల్ప అద్వైతానుభూతిలో సంపూర్ణంగా నెలకొని ఉండడానికి మునుపు సాధకుడికి జాతిస్మరత్వ శక్తి జనిస్తుందని శాస్త్రాలు[2] చెబుతున్నాయి. అద్వైతభావం పరిపూర్ణదశకు చేరినప్పుడు సాధకుడి స్మృతి శక్తి ఎంత అధికరిస్తుందంటే ఇంతకు మునుపు అతడు ఎక్కడ, ఎలా, ఎన్నిసార్లు ఏయే శరీరాలు ధరించి జన్మించాడో, ఏ పాపపుణ్య కర్మలను నిర్వర్తించాడో - తన ఆ సాంసారిక చరిత్ర యావత్తూ కళ్లకు కట్టినట్లు అతడి స్మృతిపథంలో స్పష్టంగా మెదలుతుంది. తత్ఫలితంగా సాంసారిక విషయాలన్నిటి అనిత్యత, రూప రసాది భోగాలకై పరుగులెత్తుతూ పదే పదే జన్మించడంలోని నిష్ప్రయోజనం అతడికి సుబోధక మవుతుంది. అప్పుడు అతడి మనస్సులో ఉత్పన్నమైన తీవ్ర వైరాగ్యం కారణంగా అతడు కామవాసనలన్నిటి నుండి సంపూర్ణంగా విడివడతాడు.

---

1. గత జన్మలను జ్ఞాపకం తెచ్చుకొనే శక్తి.
2. ఛాందోగ్యోపనిషత్తు 8.2

4. సంకల్పాలన్నీ సత్యం అయ్యే స్థితి

బ్రహ్మజ్ఞానుల సంకల్పాలన్నీ సత్యమై తీరుతవని ఉపనిషత్తులు[1] చాటుతున్నాయి. అతడు దర్శించగోరే దేవలోకం, పితృలోకం ఇత్యాది ఏ లోకాన్ని అయినా సమాధి ద్వారా మనస్సుతో సందర్శించగలడు. అటువంటి జ్ఞానికి నానాయోగ విభూతులు, అణిమాది అష్టసిద్ధులు అప్రయత్నంగానే సిద్ధిస్తాయని పతంజలి మహర్షి తన యోగసూత్రాలలో ప్రస్తావించాడు. వాసనారాహిత్యం, సిద్ధులు పొంది ఉండడం - ఈ పరస్పర విరుద్ధమైన రెండూ అట్టి బ్రహ్మజ్ఞానిలో ఏకకాలంలో నెలకొని ఉండడం ఎలా పొసగుతుందనే ప్రశ్నకు, అద్భుతమైన శక్తులు సిద్ధించినా కూడ వారిలో లేశమైనా కామన (కోరిక)లు ఉండకపోవడం చేత ఆ జ్ఞానులు ఆ శక్తులను ఎన్నడూ స్వకీయార్థం ఉపయోగించరని పంచదశి రచయిత శ్రీ విద్యారణ్యులు సమన్వయం చేశారు. ఏ ప్రాపంచిక పరిస్థితిలో ఉంటూ సాధకుడు బ్రహ్మజ్ఞానాన్ని సంతరించుకొన్నాడో, జ్ఞానార్జనానంతరం కూడ అతడు అదే పరిస్థితులలో ఉంటూ కాలాన్ని గడుపుతాడు. అంటే అతడు తన స్థితిగతులను మార్చడానికి, మెరుగు పరచుకోవడానికి ససేమిరా ప్రయత్నించడు. అతడి మనస్సులో ఎలాటి వాసనలూ, కామనలూ లేకపోవడమే ఇందుకు కారణం. కాని ఆధికారిక పురుషులు, అవతార పురుషులు నిరపేక్షంగా భగవదేచ్ఛాధీనులై ఉంటూ బహుజన హితార్థం, లోకశ్రేయస్సు నిమిత్తం అవసరమైన సందర్భాలలో ఆ సిద్ధులను ఉపయోగించటం కద్దు.

5. శాస్త్రబోధల వెలుగులో శ్రీరామకృష్ణుల అసాధారణ అనుభూతులు

పైన ఉట్టంకించిన శాస్త్రబోధనల వెలుగులో ఈ కాలఘట్టంలో శ్రీరామకృష్ణుల జీవితాన్ని అధ్యయనం చేసినప్పుడు వారికి కలిగిన అసాధారణ అనుభూతులు అన్నీ కాకపోయినా చాలావరకు తేటతెల్లమవుతాయి. త్రికరణశుద్ధిగా తమ సర్వస్వాన్ని ఆయన భగవంతుని పాదపద్మాలకు సమర్పించిన ఫలితంగా వాసనారహితులు కావడం చేతనే అంత స్వల్పకాలంలో నిర్వికల్ప అద్వైత స్థితిని చేరి, దానిలో దృఢంగా ప్రతిష్ఠితులు కాగలిగారని మనం చక్కగా అర్థం చేసుకోవచ్చు. జాతిస్మరత్వ శక్తిని పొందడం ద్వారా ఆయన ఈ కాలంలో స్పష్టంగా ప్రత్యక్షం చేసుకోగలిగిన విషయం: గత యుగాలలో ఎవడు శ్రీరాముడిగా, శ్రీకృష్ణుడిగా అవతరించి లోకహితాన్ని చేకూర్చాడో ఆతడే ప్రస్తుత

---

1. సంస్కార సాక్షాత్కారణాత్ పూర్వజాతి జ్ఞానం - పాతంజలి సూత్రాలు, విభూతి పాదం, 18వ సూత్రం అంటే - సంస్కారాల నన్నిటినీ పూర్తిగా తెలుసుకోవటం చేత సాధకుడికి తన పూర్వజన్మలన్నిటిని గురించిన జ్ఞానం కలుగుతుంది అని తాత్పర్యం.

యుగంలో శ్రీరామకృష్ణుడిగా దేహధారణ చేసి అవతరించాడు. కాబట్టే లోకకల్యాణార్థం సాధనానంతర జీవితంలో దైవీశక్తులు ప్రతినిత్యం ఆయనలో అభివ్యక్తం అవుతూ ఉన్నప్పటికీ ఆయన తన సుఖం కోసం వాటిని ఎన్నడూ ఉపయోగించకపోవడం మనం అవగతం చేసుకోవచ్చు. నిగూఢ ఆధ్యాత్మిక తత్త్వాలను సాక్షాత్కరించుకోగల శక్తి సంకల్పమాత్రాన ఆయన ఇతరులలో ఎలా జాగృతం చేయగలిగారో మనం అర్థం చేసుకోగలం. అంతేగాక ఆయన అసాధారణ దివ్యప్రభావం నానాటికీ ప్రపంచమంతటా ఎందుకు పరివ్యాప్తం చెందుతూ ఉన్నదో ఆ శాస్త్రబోధనల నుండి మనం కొంత మేరకయినా అవగాహన చేసుకోగలం.

అద్వైత భూమిలో దృఢంగా ప్రతిష్ఠితులైన పిదప, అక్కడ నుంచి మళ్లీ భావరాజ్యానికి దిగివస్తూ ఉన్న సమయంలో శ్రీరామకృష్ణులు పైన పేర్కొన్న విధంగా తమ భూత భవిష్యత్తుల గురించి చక్కగా ఎరిగి ఉన్నారు. కాని ఆయనకు ఆ అనుభూతులన్నీ హఠాత్తుగా ఒక్క రోజులోనే కలిగినవని అనుకోవడం సమంజసం కాదు. భావభూమికి దిగివచ్చిన ఒక ఏడాది పిదప ఈ విషయాల గురించిన పరిపూర్ణ జ్ఞానం ఆయన సంతరించుకొన్నారని ఊహించవలసి ఉంటుంది. ఆ కాలఘట్టంలో జగజ్జనని ఒకటి వెంట ఒకటిగా ఆయన కళ్ల ఎదుట నుంచి తెరలను తొలగించి రోజువారీగా ఆయనకు ఈ విషయాలను విస్పష్టం చేయసాగింది. ఆ విషయాలన్నీ ఆయన మనస్సుకు ఏకకాలంలో ఎందుకు స్ఫురించలేదు? అనే ప్రశ్నకు సమాధానం ఇది: అద్వైత భూమిలో వసిస్తూ వర్ణనాతీతమైన బ్రహ్మానందానుభావంలో ఆయన ఆ కాలంలో సదా మునిగి ఉన్నారు. కనుక ఆయన మనస్సు మళ్లీ బహిర్ముఖం కానంతవరకు ఆ విషయాల నన్నిటినీ తెలుసుకోవాలన్న ఆకాంక్ష గాని, వ్యవధిగాని కలుగలేదు. ఆధ్యాత్మిక సాధనల ప్రారంభంలో, "అమ్మా! ఏం ఆచరించాలో నా కేమీ తెలియదు. స్వయంగా నువ్వు ఏం బోధిస్తావో దానినే నేర్చుకొంటాను" అని ఆయన జగజ్జననిని ప్రార్థిస్తూ, వేడుకొన్నారు. ఆయన మొర అక్షరాలా నెరవేరింది.

6. పైన పేర్కొన్న అనుభూతులన్నీ ఏక కాలంలో కలుగకపోవ డానికి హేతువు

అద్వైత భూమిలో సుస్థాపితులైన శ్రీరామకృష్ణులు ఈ కాలంలో మరో అనుభూతిని కూడ చవిచూశారు. అద్వైత సాక్షాత్కారాన్ని పొంది దాన్లో సుప్రతిష్ఠితం కావడమే నానారకాల సాధనల చరమోద్దేశం అని ఆయన అంతరాంతరాళాల్లో గ్రహించారు. భారతదేశంలో వాడుకలో ఉన్న ప్రధాన మత సంప్రదాయాల నన్నిటినీ

7. సాధనలన్నిటి చరమలక్ష్యం అద్వైత సాక్షాత్కారమే

సాధన చేసి, వాటిలో ప్రతిదీ సాధకుణ్ణి చివరకు అద్వైత స్థితికే చేరుస్తుందనే సాక్షాత్కారాన్ని ఆయన ఇంతకు మునుపే పొంది ఉండడమే తత్కారణం. అద్వైత స్థితిని గురించి ప్రశ్నించినప్పుడు ఆయన పదే పదే మాకు ఇలా చెబుతూ ఉండేవారు: ''నాయనలారా అది కడపటిది, పరాకాష్ఠ. భగవత్ప్రేమ పరిపక్వమైనప్పుడు చిట్టచివరికి ఆ అనుభూతి సాధకు లందరి జీవితాల్లోనూ స్వతహాగా కలిగి తీరుతుంది. అద్వైత సాక్షాత్కారమే మతా లన్నిటి చరమ అనుభూతి. మతాలు, మార్గాలు మాత్రమే (గమ్యం కాదు).''

8. పైన పేర్కొన్న శ్రీరామకృష్ణుల అనుభూతి న భూతో న భవిష్యతి

ఆ రీతిగా ప్రత్యక్ష అద్వైత సాక్షాత్కారాన్ని పొందిన శ్రీరామకృష్ణుల మనస్సు అపరిమితమైన ఉదారభావంతో పొంగిపొరలింది. భగవత్సాక్షాత్కారాన్నే మానవ జీవితోద్దేశంగా బోధించే మత సంప్రదాయా లన్నిటిపట్ల ప్రస్తుతం ఆయన అసామాన్య సానుభూతిని వ్యక్తం చేయ సాగారు. కాని అటువంటి మహోదారత, సానుభూతి - ఇవి తమ స్వకీయ ఆవిష్కారాలని, గతంలో ఏనాడూ ఏ సాధక శ్రేష్ఠుడూ వాటిని అంత సమగ్రంగా సంతరించుకోవడం జరగలేదనే సంగతిని మొదట గ్రహించలేదు. దక్షిణేశ్వర కాళికాలయంలోనూ, ఇతర సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలోను నానా సంప్రదాయాలకు చెందిన ఉదాత్త సాధకులతో సాన్నిహిత్యం కలిగిన పిమ్మటే ఆయనకు ఆ విషయం (అంటే మతాలన్నీ మార్గాలనీ, కాబట్టి అన్ని మతాల పట్ల ఉదారత, సానుభూతి కనబరచాలనే తమ విశిష్టానుభూతి) క్రమంగా అవగతం కాసాగిందని మేం అభిప్రాయపడుతున్నాం. కాబట్టే అప్పటి నుండి మత వైఖరిలో ఏకపక్ష పోకడ ఎదురైనప్పుడు ఆయన దాన్ని తక్షణమే ఖండిస్తూ, ఆ సంకుచిత వైఖరిని తొలగింప అన్ని విధాలా ప్రయత్నించడం జరిగింది.

9. శ్రీరామకృష్ణుల ఇస్లాం మతసాధన - ఆయన ఉదారత కొక దృష్టాంతం

అద్వైత జ్ఞానంలో సుప్రతిష్ఠితులైన శ్రీరామకృష్ణుల మనస్సు ఇప్పుడు ఎంత ఉదారతతో నిండి ఉన్నదో ఈ కాలపు ఒక సంఘటన నుండి మనం స్పష్టంగా అవగతం చేసుకోవచ్చు. నిర్వికల్ప స్థితి నుండి దిగి వచ్చిన పిదప శ్రీరామకృష్ణులు రోగగ్రస్తులై కొన్ని నెలల పాటు బాధపడ్డారనే సంగతి మనకు విదితమే. రోగబాధ ఉపశమించిన పిదపే ఈ సంఘటన జరిగింది.

ఈ ఉదంతం జరగడానికి కొంత మునుపు ఆధ్యాత్మికతపై తహతహ చెందే గోవిందరాయ్ అనే వ్యక్తి దక్షిణేశ్వరానికి వచ్చాడు. పుట్టుకతో అతడు క్షత్రియుడని హృదయ్ చెప్పాడు. బహుశా అతడు అరబ్బీ, పారశీక భాషలు నేర్చి ఉండవచ్చు. విభిన్న మత సిద్ధాంతాలను అధ్యయనం చేసి, వివిధ మత సంప్రదాయస్థు

లతో సన్నిహితంగా మెలగిన పిదప, చివరకు అతడు మహ్మదీయ మతం లోని ఉదారత పట్ల ఆకర్షితుడై, నియమ ప్రకారం మహమ్మదీయ మతం పుచ్చుకొన్నాడు. ధార్మిక పిపాసువైన గోవింద, మహమ్మదీయ మతాన్ని పుచ్చుకొన్నప్పటికీ అతడు మహమ్మదీయ సామాజిక ఆచార వ్యవహారాలను ఎంతవరకు అనుసరించాడో చెప్పడం కష్టం. కాని ఇస్లాం మత దీక్షను పుచ్చుకొన్నాక అతడు ఉత్సాహభరితంగా ఖురాన్ పఠించడంలోను, ఆ మతానుసారంగా సాధనాదులను నిర్వర్తించడంలోను నిమగ్నుడైనాడనే సంగతి మేం విన్నాం. గోవింద గొప్ప భాగవద్భక్తుడు. ఇస్లాం అంతశ్శాఖలలో ఒకటైన సూఫీ సంప్రదాయంలో బహుళ వ్యాప్తంగా ఉన్న ఉపదేశాల మానసిక వైఖరుల ప్రకారం భగవంతుని ఆరాధించే విధానం అతడి మనస్సును హస్తగతం చేసుకొని ఉండవచ్చు. ఎందుకంటే, సూఫీ దర్వేషులలా భక్తిభావ సాధనల్లో అతడు రేయింబవళ్లు మునిగి ఉన్నాడు.

10. సూఫీ సాధకుడు గోవిందరాయ్ ఆగమనం

ఎలాగో గోవింద రాయ్ దక్షిణేశ్వర కాళికాలయానికి రావటం తటస్థించింది. ప్రశాంతమైన పంచవటి ప్రాంతం సాధనలకు సానుకూలంగా ఉంటుందని భావించి ఆ నీడన తన ఆసనాన్ని పరచుకొని కాలం గడపసాగాడు. రాస్మణి నిర్మిత కాళికాలయంలో సంసారాన్ని పరిత్యజించిన హైందవ సాధువులకూ, మహమ్మదీయ ఫకీర్లకూ సరిసమానమైన ఆతిథ్యం ఒసగబడేది. అందుచేత కాళికాలయంలో వసిస్తూన్న గోవిందకు భిక్షకై బయటకు వెళ్లవలసిన అగత్యం కలుగలేదు. అందుకే అతడు నిశ్చింతతో ఇష్టదేవతా ధ్యానంలో రోజులు ఆనందంగా గడపసాగాడు.

11. గోవిందతో మాట్లాడిన పిదప శ్రీరామకృష్ణుల సంకల్పం

భక్తుడైన గోవిందను చూసి శ్రీరామకృష్ణులు అతడిపట్ల ఆకర్షితులైనారు. అతడితో సంభాషణలు నెరపి చిత్తశుద్ధితో కూడిన విశ్వాసం, భాగవద్భక్తిని గాంచి ముగ్ధులయ్యారు. ఈ విధంగా శ్రీరామకృష్ణుల మనస్సు మహమ్మదీయ మతం వైపు ఆకర్షింపబడింది. ఆయన ఇలా భావించారు: 'భగవత్సాక్షాత్కారానికి ఇది కూడా ఒక మార్గమే. అనంత లీలా విలాసినియైన అమ్మ ఈ మార్గం ద్వారా కూడా తన పాదపద్మాలను చేరుకోవడానికి అనేకులను దీవిస్తూ ఉంది. తనను శరణుజొచ్చిన వారిని ఆమె ఈ మార్గం ద్వారా ఏ రీతిలో ధన్యులను గావిస్తూ ఉన్నదో నేను చూసి తీరాలి. గోవింద నుండి దీక్ష పుచ్చుకొని ఈ పథంలో సాధన అనుష్ఠించాలి.'

తన సంకల్పాన్ని తక్షణమే కార్యాచరణలో పెట్టారు శ్రీరామకృష్ణులు. గోవిందకు తన ఆకాంక్షను తెల్పి, అతడి నుండి దీక్ష పుచ్చుకొని, విధ్యుక్తంగా

12. గోవింద నుండి దీక్ష - తత్సాధనలో సిద్ధి

ఇస్లాం మత సాధనను అనుష్ఠించసాగారు. దాన్ని గురించి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''ఆ సమయంలో సభక్తికంగా 'అల్లా' మంత్రాన్ని జపించేవాణ్ణి. మహమ్మదీయునిలా వస్త్రధారణ చేసేవాణ్ణి. ప్రతినిత్యం మూడుసార్లు నమాజు చేసేవాణ్ణి. ఆ సమయంలో హైందవ భావనలు అడుగంటి మనస్సు నుండి అదృశ్యమైపోయాయి. హిందూ దేవీ దేవతలకు మొక్కడం మాట అటుంచి, వారిని దర్శించడానికి కూడ అనిష్టం జనించింది. ఆ భావనలో మూడు రోజులు గడిపాను. ఆ మత సంప్రదాయపు సాధనాఫలాన్ని అనుభూతం చేసుకొన్నాను.'' ఇస్లాం సాధనను అనుష్ఠిస్తూ ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులకు మొదట పొడవాటి గడ్డంతో, అతి గంభీరుడైన ఒక తేజోమయ పురుషుని దివ్యదర్శనం కలిగింది. పిదప సగుణ బ్రహ్మ దర్శనం పొంది, చివరకు నిర్గుణ నిర్విశేష బ్రహ్మలో ఆయన మనస్సు లీనమైపోయింది.

ఇస్లాం మత సాధనానుష్ఠాన కాలంలో మహమ్మదీయులకు ప్రీతికరమైన ఆహారాన్ని, చివరకు గోమాంసాన్ని కూడ తినాలనే కోర్కె శ్రీరామకృష్ణులకు కలిగిందని హృదయ్ చెప్పాడు. మథుర్‌బాబు అక్కరతో

13. ఇస్లాం ధర్మ సాధనాకాలంలో శ్రీరామకృష్ణుల ప్రవర్తన

చేసిన అభ్యర్థన ఆయనను ఆ కార్య విముఖుని చేసింది. కాని బాలక స్వభావులైన శ్రీరామకృష్ణుల అభిలాషను కొంతలో కొంత అయినా తీర్చకుంటే ఆయన దాని నుండి వైదొలగరని భావించి మథుర్ ఆ సమయంలో మహమ్మదీయ వంటవాణ్ణి ఒకణ్ణి రప్పించాడు, అతడి నిర్దేశంతో మహమ్మదీయులు వండే తీరులో ఒక బ్రాహ్మణుడు వండగా ఆ ఆహారం శ్రీరామకృష్ణులకు సమర్పించారు. ఇస్లాం మత సాధన చేస్తూ ఉన్న రోజుల్లో శ్రీరామకృష్ణులు ఒక్కసారి కూడ కాళికాలయంలోకి అడుగిడలేదు. ఆలయ ప్రాంగణానికి వెలుపల ఉన్న మథుర్ భవనంలో ఉండిపోయారు.

ఇస్లాం మతసాధన చేసిన స్థలం

పైన ఉదాహరించిన సంఘటన నుంచి అద్వైత వేదాంత సాధనలో సంపూర్ణత్వం సంతరించుకొన్న తరువాత శ్రీరామకృష్ణుల మనస్సు ఇతర మత సంప్రదాయాలపట్ల ఎంత సానుభూతి చెందిందో స్పష్టమౌతోంది. అంతేకాక కేవలం వేదాంత విజ్ఞానంలో విశ్వాసం కలిగి ఉండడం ద్వారానే భారతదేశం

లోని హిందువులు, మహమ్మదీయులు ఒకరిపట్ల ఒకరు సానుభూతి వహించి,

14. ఇస్లాం మతసాధన - దాని ప్రాధాన్యం

సోదరభావం పెంపొందించుకోగలరనే సంగతీ విశద మౌతూ ఉంది. లేకపోతే శ్రీరామకృష్ణులు చెబుతూ ఉన్నట్లు ''హిందూ మహమ్మదీయుల నడుమ కొండంత తారతమ్యం నెలకొని ఉంటుంది. ఇరువురి ఆలోచనా సరళి, విశ్వాసాలు, కార్యకలాపాలు, నడవడికలు - సుదీర్ఘకాలంగా వారు కలసి జీవిస్తూ ఉన్నప్పటికీ పరస్పర దురవగ్రాహ్యంగానే ఉండిపోతాయి.'' ఏదో ఒకనాడు ఆ కొండంత తారతమ్యం తొలగిపోయి హిందువులు, మహమ్మదీయులు ప్రేమాస్పదులై ఆలింగనం చేసుకొంటారని ఈ యుగావతారులైన శ్రీరామకృష్ణుల ఇస్లాం మత సాధన సూచిస్తూ ఉన్నదేమో?

నిర్వికల్ప భూమిలో ఉన్న ఫలితంగా ప్రస్తుతం ద్వైత భూమి పరిధిలో ఉన్నటువంటి దృశ్యాలనుగాని, వ్యక్తులనుగాని చూసి పలుమార్లు హఠాత్తుగా

15. శ్రీరామకృష్ణులలో అద్వైత స్మృతి ప్రగాఢత

ఆయనలో అద్వైతస్మృతి జాగృతం అయ్యేది. వెంటనే ఆయన ఆ తురీయభావంలో లీనమయ్యేవారు. కావాలని కోరకపోయినా సామాన్యమైన ఉద్దీపనతోనో, సూచనతోనో ఆయనకు అట్టి స్థితి కలగడం మేం చూశాం. కాబట్టి ఇక సంకల్పించుకొన్న మాత్రానే ఆయన ఆ అద్వైత స్థితిని పొందగలిగేవారని చెప్పడం అనవసరం. అద్వైతభావం ఎంత విస్తృతి మేరకు ఆయనకు స్వభావసిద్ధం అయిపోయిందో ఈ క్రింది సంఘటనలు, చిన్నవైనప్పటికీ విస్పష్టం చేస్తాయి.

దక్షిణేశ్వర కాళికాలయపు ఉద్యానం విశాలమైనది. వర్షాకాలంలో గడ్డి ఏపుగా పెరగడంతో ఉద్యానంలో కూరగాయ మొక్కలు నాటడానికి తోట

16. కొన్ని ఉదాహరణలు

i. గడ్డికోసే ముసలి వాడు

మాలులకు ఎంతో అసౌకర్యంగా ఉండేది. కనుక ఆ సమయంలో ఉచితంగా గడ్డి కోసుకొని పట్టుకుపోవడానికి అనుమతి పొందిన ఒక ముసలి వాడు ఒకరోజు అక్కడికొచ్చి గడ్డి కోసుకోసాగాడు. కోసిన గడ్డిని పెద్దమోపుగా కట్టి బజారుకు తీసుకొనిపోయి అమ్ముకోవడానికి అతడు సిద్ధం కాసాగాడు. దురాశతో అతడు ఎంత గడ్డి కోసుకొన్నాడంటే ఆ మోపును మోసుకుపోవడం మాట అలా ఉంచి దాన్ని కనీసం ఎత్తడం కూడ అతడి శక్తికి మించిన పని అని శ్రీరామకృష్ణులు గమనించారు. కానీ ఆ ముసలివాడు దాన్ని గ్రహించే స్థితిలో లేడు. ఆ పెద్ద మోపును తల పైకెత్తుకోవడానికి నానావిధాల ప్రయత్నించాడు. కానీ, అతడి ప్రయత్నాలు ఫలించలేదు. ఆ దృశ్యాన్ని తదేకంగా చూస్తూ శ్రీరామకృష్ణులు భావ పారవశ్యం చెందారు. ''లోపల పరిపూర్ణజ్ఞాన స్వరూపంతో ఆత్మ ప్రకాశిస్తూ ఉంటే, వెలుపల ఎంత మూర్ఖత్వం, అవివేకం'' అనే భావన జనించి ''ఓ రామా!

నీ లీలావిలాసం ఎంత విచిత్రమైనదయ్యా'' అని వ్యాఖ్యానిస్తూ ఆయన సమాధి మగ్నులయ్యారు.

మరొకనాడు, గుదంలో గుచ్చుకోబడి ఉన్న ఒక చిన్నపుల్లతోసహా ఒక సీతాకోక చిలుక ఎగురుకొంటూ రావడం శ్రీరామకృష్ణులు చూశారు. తుంటరి పిల్లవాడెవడో అలా చేసివుంటాడని భావించి ఆయన మొదట చాలా బాధపడ్డారు. కాని మరుక్షణమే భావావిష్టులై, ''ఓ రామా! ఈ దుఃస్థితిని నీకు నువ్వే కల్పించుకొన్నావు'' అంటూ పకపక నవ్వుకోసాగారు.

ii. గాయపడిన సీతాకోకచిలుక

ఒక సమయంలో కాళికాలయపు తోటలో ఒక ప్రత్యేక స్థలంలో లేత దూర్వాగ్రాసం పెరిగి చూడముచ్చటగా ఉంది. శ్రీరామకృష్ణులు ఆ లేతపచ్చిక స్థలాన్ని చూస్తూ ఉన్నప్పుడు భావావిష్టులై ఆ స్థలంతో తాదాత్మ్యం చెందారు. అదే సమయంలో ఒక వ్యక్తి ఆ లేత పచ్చిక మీదుగా నడిచి వెళ్ళడం తటస్థించింది. దాంతో, శ్రీరామకృష్ణులు ఛాతీలో భరించలేని బాధను కలిగించిన భావనకు లోనై అశాంతచిత్తులైనారు. ఆ సంఘటనను ప్రస్తావిస్తూ తదనంతరం మాతో ఇలా అన్నారు: ''ఛాతీపై ఎవరైనా త్రొక్కితే ఎలాంటి బాధ కలుగుతుందో, సరిగ్గా అటువంటి బాధనే ఆ సమయంలో నేను అనుభవించాను. అట్టి భావావస్థ ఎంతో బాధాకరం. ఆ స్థితిలో నేను ఆరు గంటలసేపు మాత్రమే ఉన్నప్పటికీ, ఆ బాధను భరించలేకపోయాను.''

iii. కాళ్ళ క్రింద త్రొక్కివేయబడిన లేతపచ్చిక

ఒకరోజు శ్రీరామకృష్ణులు భావపారవశ్యులై విశాలమైన ద్వార మండపం వద్ద నిలబడి గంగానదిని తిలకిస్తున్నారు. ఆ సమయంలో ఆ ఘట్టం వద్ద రెండు పడవలు లంగరు దించబడి ఉన్నాయి. ఏదో పేచీ వచ్చి ఆ పడవలవాళ్ళు ఇద్దరూ కలహించుకోసాగారు. క్రమంగా కలహం పోరాటం లోకి దిగింది. అప్పుడు ఆ ఇద్దరిలోనూ బలాఢ్యుడైన వాడు రెండవవాడి వీపు మీద గట్టిగా ఒక దెబ్బ వేశాడు. దాంతో శ్రీరామకృష్ణులు హఠాత్తుగా బాధతో కేకలు పెట్టారు. కాళికాలయంలో ఉన్న హృదయ్ ఆ కేకలు విని పరుగున వచ్చి, శ్రీరామకృష్ణుల వీపు కందిపోయి, వాచిపోయి ఉండడం చూశాడు. అప్పుడు హృదయ్ పదే పదే ఆయనను, ''మామా! నిన్నెవరు కొట్టారో చూపించు. అతగాడి తల తీసివేస్తాను'' అంటూ అడిగాడు. ఒకింత సేపయ్యాక శ్రీరామకృష్ణులు తెప్పరిల్లాక, ఆ సంఘటనను ఆయన నుంచి విని హృదయ్ ఆశ్చర్యచకితుడైపోయి, 'ఇలా జరగడం సంభవమేనా?' అని తలపోశాడు.

iv. పడవవాని ముష్టిఘాతానికి శ్రీరామకృష్ణుల వీపు వాచిపోవడం

గిరీశ్‌చంద్రఘోష్ ఈ సంఘటనను శ్రీరామకృష్ణుల ముఖతా విని మాకు తెల్పాడు. శ్రీరామకృష్ణులను గురించిన ఇలాంటి సంఘటనలు ఎన్నైనా పేర్కొనవచ్చు.

17. కామార్పుకూర్‌లో...

1. భైరవీ బ్రాహ్మణి, హృదయ్‌లతో శ్రీరామకృష్ణులు కామార్పుకూర్ సందర్శించడం

ఆరు నెలలపాటు దేహ బాధలు అనుభవించాక శ్రీరామకృష్ణులు రోగ విముక్తులయ్యారు. అప్పటికి ఆయన మనస్సు ద్వైత - అద్వైత భూముల సంగమమైన భావముఖంలో వసించడం చాలా వరకు అలవరచుకొంది. కానీ ఆయన శరీరం మునుపటిలా బలాన్ని, ఆరోగ్యాన్ని పుంజుకోలేదు. పైగా వర్షాకాలంలో గంగాజలం ఉప్పుతో నిండి ఉండడంతో, త్రాగటానికి అనువైన మంచినీరు లభించక ఆయన గ్రహణిరోగం తిరగబెట్టే అవకాశం కూడ ఉంది. కాబట్టి ఆయన తమ జన్మస్థలమైన కామార్పుకూర్‌కు పోయి కొన్ని నెలలు అక్కడ గడపడం సబబని నిర్ణయించారు. అది 1867వ సంవత్సరం జ్యేష్ఠమాసం. శ్రద్ధాళువైన మథుర్ భార్య జగదంబా దాసి శ్రీరామకృష్ణుల కుటుంబం శివుని కుటుంబంలా పేదకుటుంబమని బాగా ఎరుగును. కనుక 'బాబా'కు ఎటువంటి అసౌకర్యమూ కలుగరాదనే తలంపుతో ఆమె అవసరమైన వస్తుసామగ్రులన్నిటినీ సేకరించి ఆయనతోపాటు వాటిని పంపే ఏర్పాట్లు[1] చేయసాగింది. పిదప శ్రీరామకృష్ణులు ఒక మంచి ముహూర్తంలో కామార్పుకూర్‌కు పయనమయ్యారు. భైరవీ బ్రాహ్మణి, హృదయ్ ఆయన వెంట వెళ్ళారు. వృద్ధురాలైన ఆయన తల్లి గంగాతీరంలోనే నివసించాలనే తన సంకల్పం మేరకు దక్షిణేశ్వరంలోనే మథుర్ సంరక్షణలో ఉండిపోయింది.

గత ఎనిమిది సంవత్సరాలుగా శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌కు రాలేదు. కాబట్టి బంధువులు ఆయనను చూడటానికి ఎంతో ఆతురత చెంది ఉన్నారని

---

1. గురుభావం, ఉత్తరార్థం IV.1.14

చెప్పడం అనవసరం. వారి ఆతురతకు కొన్ని ప్రత్యేక కారణాలున్నవని తెల్పటం

2. బంధుమిత్రుల నడుమ

కూడ అసంగతమే. అందుకు హేతువు - ఆయన, అక్కడ స్త్రీ ఉడుపులు ధరించి 'హరి, హరి' అంటూ కేకలు పెడుతున్నారని, సన్న్యాసి అయిపోయారని, ఒక్కొక్కప్పుడు ఎడతెగకుండా 'అల్లా, అల్లా' అంటూ జపిస్తూంటారని మొదలైన విచిత్ర వదంతులు వారి చెవుల బడడమే. కాని శ్రీరామకృష్ణులు ఆ పూర్వపు వ్యక్తిగానే వారికి అగపడడంతో ఆ వదంతులు ఎంత నిరాధారమైనవో వారు తెలుసుకొన్నారు. అదే అమాయకత్వం, ప్రేమతో కూడిన అదే ఉల్లాసం, కఠోరమైన అదే సత్యనిష్ఠ, అదే భక్తి ప్రగాఢత, హరి నామం వినడంతోనే ఉర్రూతలు వేసే పారవశ్యం - గతంలోని ఈ గుణాలన్నీ చెక్కుచెదరక పరిపూర్ణంగా ఆయనలో అట్లే ఉన్నాయి. కాని ఇప్పుడు వారికి కనబడే ఆయనలోని ఏకైక మార్పు - ఆయన మనశ్శరీరాలు వర్ణనాతీతమైన దేదీప్యమానమైన దివ్యప్రకాశంతో వెలుగొంది ఉండడమే. ఇందుచేత హఠాత్తుగా ఆయన ముందుకు రావడానికి లేక ఆయన ప్రస్తావించక మునుపే ఎటువంటి లౌకిక విషయాలనైనా కదపడానికి వారు ఎంతో సంకోచించారు. అంతేగాక శ్రీరామకృష్ణుల సమక్షంలో తాము ఉన్నప్పుడు తమ సాంసారిక చీకుచింతలన్నీ గాల్లో కలిసి మాయమైపోయినట్లుగా భావించారు. అందుకు మారుగా వారి హృదయాలలో నిర్మల, శాంత దివ్యానందం ప్రవహించడం వారు అనుభూతం చేసుకొన్నారు. ఆయన నుంచి దూరంగా ఉన్నప్పుడు, మళ్ళీ ఆయన వద్దకు వెళ్ళాలనే అవ్యక్తమైన ఒక ప్రగాఢ ఆకాంక్ష వారిలో జనించేది. ఆ విధంగా సుదీర్ఘ కాలానంతరం ఆయన తమ నడుమ ఉండడంతో ఆ పేద కుటుంబంలో ఎడతెగని ఆనందం వెల్లివిరిసింది. ఆ ఆనందాన్ని పరిపూర్ణం చేసే నిమిత్తం ఆ కుటుంబ స్త్రీల నిర్దేశం మేరకు ఒక వార్తాహరుడు శ్రీరామకృష్ణుల మామగారి గ్రామమైన జయరాంబాటికి, క్రొత్త కోడలిని తోడ్కొనిరావాల్సిందిగా పంపబడ్డాడు. శ్రీరామకృష్ణులకు ఈ విషయం తెలిసినప్పటికీ ఆయన తన సమ్మతిని గాని, అసమ్మతినిగాని వ్యక్తం చేయలేదు. అప్పటి వరకు ఆయన భార్య, వివాహానంతరం ఒక్కసారే ఆయనను కలుసుకొన్నది. కుటుంబ సంప్రదాయం ప్రకారం శ్రీరామకృష్ణులు జయరాంబాటికి వెళ్ళినప్పుడు ఆమెకు ఏడేళ్ళ ప్రాయంలో కలుసుకోవడం తటస్థించింది. అప్పటికి ఆమెకు వివాహం అంటే అవగాహనకాని అతి పిన్నవయస్సు. కనుక అప్పుడు జరిగిన సంఘటనల్లో ఒక్కటి మాత్రమే ఆమెకు జ్ఞాపకం ఉంది. శ్రీరామకృష్ణులతోపాటు హృదయ్‌కూడా వచ్చాడు. ఆమె ఇంట్లో మారుమూల ఎక్కడో నక్కి ఉన్నా కూడా హృదయ్ ఎక్కడ నుంచో సేకరించుకొని వచ్చిన తామర పువ్వులతో, సిగ్గుతో ముడుచుకుపోయి ఉన్న ఆమె

పాదపద్మాలను పూజించాడు. ఇది జరిగిన ఆరేళ్ళ తరువాత, అంటే ఆమె పదమూడవ ఏట మళ్ళీ ఆమెను కామార్పుకూర్‌కు తోడ్కొని వచ్చారు. ఈసారి ఆమె అక్కడ నెల రోజులు గడిపింది. కాని ఆ సమయంలో శ్రీరామకృష్ణులు, చంద్రమణీదేవి దక్షిణేశ్వరంలో ఉండడం వలన వారిని చూసే భాగ్యం ఆమెకు కలుగలేదు. ఇది జరిగిన దాదాపు ఆరు నెలల పిదప మళ్ళీ ఆమె కామార్పు కూర్‌కు వచ్చి ఒకటిన్నర నెలలు అక్కడ గడిపింది. కాని పై కారణంగానే ఆ ఇద్దరిలో ఎవరినీ ఆమె చూడలేకపోయింది.

3. కామార్పుకూర్‌కు మాతృదేవి ఆగమనం

అక్కడ నుంచి ఆమె పుట్టింటికి తిరిగి వెళ్ళిన మూడు లేక నాలుగు నెలల తరువాత శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌కు వచ్చారనే వార్త, తనను అక్కడకు రమ్మన్న కబురు ఆమెకు అందాయి. అప్పటికి ఆమె పధ్నాలుగవ ఏట అడుగుపెట్టి ఆరు, ఏడు నెలలు గడిచి ఉంటాయి. కనుక నిజానికి వివాహానంతరం తన భర్తను సందర్శించడం ఆమెకు ఇదే మొదటిసారి అని చెప్పవలసి ఉంటుంది.

4. అందరివట్ల శ్రీరామకృష్ణులు ప్రవర్తించిన తీరుతెన్నులు

ఈ సందర్భంలో శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌లో ఆరు లేక ఏడు నెలల కాలం ఉన్నట్లు తెలియవస్తోంది. చిన్ననాటి నేస్తాలు, ఆయనను ఎరిగివున్న ఆ గ్రామస్థులైన స్త్రీ పురుషులందరూ గతంలోలా ఆయనతో కలసిమెలసిపోయి ఆయనను సంతోషపెట్ట ప్రయత్నించారు. సుదీర్ఘ కాలానంతరం వారిని చూడడం శ్రీరామకృష్ణులకు కూడా ఆనందమయమైంది. గొప్ప పండితులు, చింతనాపరులు తమ కఠోర పరిశ్రమానంతరం తీరిక సమయంలో చిన్నపిల్లల అర్థంపర్థంలేని వినోదాలలో తాముా పాల్గొని ఆనందించడం కద్దు. గిరి గీసుకొన్న తమ సాంసారిక వ్యవహారాలలో తలమునక లవుతున్న కామార్పుకూర్‌లోని స్త్రీ పురుషులతో కలసిపోయిన శ్రీరామకృష్ణులు కూడ పై ఉదహరించిన వారిలా ఆనందించసాగారు. కాని ఐహిక జీవితం మూడునాళ్ళ ముచ్చట అని తెలుసుకొని, సంసార జీవితం గడుపుతూ కూడా క్రమంగా సంయమం అలవరచుకొని అన్ని విషయాలలోనూ భగవంతునిపై ఆధార పడడం వారు నేర్వాలని ఆయన భావించారు. ఆటపాటలు, వినోదాల ద్వారా మాకు సర్వదా నేర్పిన అదే విషయాలను బట్టి కామార్పుకూర్‌లో ఆయన అలా చేసి ఉంటారని మేం ఊహిస్తున్నాం.

ఈ చిన్న పల్లెలో జీవనం గడుపుతూ కొందరు ఊహించని రీతిలో ఆధ్యాత్మిక పురోగతి పొందడం చూసి శ్రీరామకృష్ణులు భగవంతుని దుర్గ్రాహ్యమైన దివ్యమహిమకు అచ్చెరువొందారు. దీన్ని తేటపరచే ఒక సంఘటనను మాకు పలుమార్లు చెప్పారు.

శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: ఆ కాలఘట్టంలో ఒకరోజు ఆయన మధ్యాహ్న భోజనానంతరం తన గదిలో విశ్రమించి ఉన్నారు. ఆ సమయంలో

5. కొందరు గ్రామస్త్రీల ఆధ్యాత్మిక పురోభివృద్ధి గురించి...

ఇరుగుపొరుగు స్త్రీలు కొందరు ఆయనను చూడటానికి వచ్చారు. ఆయన ప్రక్కన కూర్చుని ఆధ్యాత్మిక విషయాల గురించి మాట్లాడసాగారు. హఠాత్తుగా శ్రీరామకృష్ణులు భావపరవశులైనారు. చేప సముద్రంలో ఎలా క్రీడిస్తుందో అలా తాను సచ్చిదానంద సాగరంలో ఒక చేపలా తేలుతూ, మునుగుతూ అనేక రీతుల్లో క్రీడిస్తూ ఉన్నట్లుగా అనుభూతి పొందారు. ఇతరులతో మాట్లాడుతూ ఉన్నప్పుడు ఆయన భావపారవశ్యు లవడం కద్దు. కాబట్టి ఆ స్త్రీలు ఆ సంఘటనను పట్టించుకోక తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చడంతో అక్కడ పరిస్థితి గోలగోలగా తయారయింది. అప్పుడు వారిలో ఒకామె ఆయన భావపారవశ్యం తగ్గేవరకు గోల చేయవద్దని హెచ్చరించింది. ఆమె ఇలా అంది: ''ఆయన ఇప్పుడు ఒక చేపలా సచ్చిదానంద సాగరంలో క్రీడిస్తున్నారు. మీరు కనుక గోల చేస్తే ఆయన ఆనందానికి అవరోధం ఏర్పడుతుంది.'' ఆమె మాటలను వారిలో చాలామంది నమ్మకపోయినా, అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. సమాధి స్థితి నుంచి దిగివచ్చిన పిదప ఆయన అనుభవాన్ని గురించి ప్రశ్నించినప్పుడు శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''అవును. ఆమె చెప్పింది నిజమే. ఏం ఆశ్చర్యం! ఆమె కిది ఎలా తెలిసింది?''

శ్రీరామకృష్ణులకు కామార్పుకూర్ గ్రామంలోని స్త్రీ పురుషుల దైనందిన జీవితాలు ప్రస్తుతం చాలామేరకు క్రొత్తగా ద్యోతకమవుతున్నవని మనకు తెలియ

6. కామార్పుకూర్‌లో శ్రీరామకృష్ణుల భావనలు

వస్తోంది. సుదీర్ఘ కాలానంతరం చాలా దూరప్రాంతం నుంచి స్వస్థలానికి తిరిగి వచ్చిన వ్యక్తికి తన గ్రామంలోని ప్రతివ్యక్తీ, ప్రతి వస్తువూ ఎలా క్రొత్తగా కనబడుతుందో, అలాగే ఆయనా భావించసాగారు. శ్రీరామకృష్ణులు తమ స్వస్థలం నుంచి కేవలం ఎనిమిది సంవత్సరాలు మాత్రమే దూరంగా ఉన్నారు. కాని ఈ స్వల్పకాల వ్యవధిలోనే ఆయన హృదయంలో ఆధ్యాత్మిక సాధనలనే తుఫాను చెలరేగింది. ఆయనలో తీవ్ర పరిణామాన్ని కొనితెచ్చింది. ఆ సమయంలో ఆయన తమను మరచిపోయారు, జగత్తును విస్మరించారు, దేశకాల పరిధులను గమించారు. కాని అక్కడ నుంచి దిగివస్తూ ఉన్నప్పుడు సకల జీవులలో భగవంతుడు వెలసి ఉన్నట్లూ, ప్రతివ్యక్తీ ప్రతివస్తువూ అపూర్వకాంతిని సంతరించుకొని ఉన్నట్లూ కాంచగలిగే జ్ఞానంతో రూపాంతరం పొంది, తిరిగివచ్చారు. మనస్సులో జనించే ఆలోచనా వృత్తుల పారంపర్యభేదం ద్వారానే మనం కాలాన్ని గురించిన, దాని వ్యవధి పరిమితి

గురించిన ఎరుకను పొందుతామనే విషయం దర్శన ప్రసిద్ధం. కాబట్టే స్వల్పకాలంలో అనేక ఆలోచనాతరంగాలు ఉవ్వెత్తున లేచి లయం అయినప్పుడు మనకు ఆ స్వల్పకాలమే అతి దీర్ఘకాలంగా కనబడుతుంది. ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో శ్రీరామకృష్ణుల అంతరంగంలో ఎటువంటి ఉత్తుంగ చింతనాతరంగాలు, భావాలు ఎగసినవో ఆలోచిస్తే ఆశ్చర్యపరవశులం కాక తప్పదు. కాబట్టి ఈ స్వల్పకాలం ఆయనకు ఒక యుగంగా కనపడడంలో వింత ఏమీ లేదు.

7. స్వగ్రామం పట్ల శ్రీరామకృష్ణుల అభిమానం

కామార్పుకూర్ గ్రామస్థు లందరితోనూ శ్రీరామకృష్ణులు ఎటువంటి అద్భుత అనురాగ బంధాన్ని ఏర్పరచుకొన్నారో యోచించినప్పుడు ఆశ్చర్యపోక తప్పదు. గ్రామ జమీందారులైన లాహాల నుంచి, బ్రాహ్మణులు, కమ్మరులు, వడ్రంగులు, స్వర్ణకారులు తదితరుల కుటుంబాలలోని స్త్రీ పురుషు లందరూ ఆయన పట్ల శ్రద్ధాపూర్వకమైన ప్రేమబంధంతో ఉండేవారు. స్త్రీ పురుషు లనేకులు ఆయన పట్ల కనబరచిన భక్త్యనురాగాలను గురించి శ్రీరామకృష్ణులు అనేక సందర్భాలలో సంతోషాతిశయంతో ప్రస్తావించినప్పుడు మేం ముగ్ధులమే అయ్యాం. వారిలో ముఖ్యులు: సరళ హృదయురాలు, భక్తిమతి, ధర్మదాస్‌లాహా వితంతు కుమార్తె అయిన ప్రసన్నమయి; ధర్మదాస్ లాహా కుమారుడైన శ్రీరామకృష్ణుల నేస్తం గయావిష్ణు లాహా; యథార్థ విశ్వాసంగల శ్రీనివాస్ శంఖారి (అంటే గాజుల వాడు); పాయిన్ కుటుంబంలోని భక్తురాండ్రైన స్త్రీలు; శ్రీరామకృష్ణుల భిక్షామాత అయిన ధని. శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌లో బసచేసిన ఆ అన్ని రోజులూ దాదాపు వీరందరూ ఆయన వద్దే ఉండిపోయారు. ఇంటి పనుల మూలంగానో లేక దైనందిన కార్యకలాపాల కారణంగానో అలా ఆయన వద్దనే ఉండలేనివారు ఉదయాన్నో, మధ్యాహ్నమో, సాయంత్రమో తమకు తీరిక చిక్కినప్పుడల్లా ఆయన వద్దకు వచ్చేవారు. అలా వచ్చేటప్పుడు స్త్రీలు వివిధ రకాల మిఠాయిలు, పిండివంటలు తమతో తీసుకువచ్చేవారు. వాటిని శ్రీరామకృష్ణులు తింటూ ఉన్నప్పుడు వారు పరమానందం చెందేవారు. మధుర వర్తనులైన ఆ గ్రామీణులు తనను పరివేష్టించి ఉండగా శ్రీరామకృష్ణులు తమ కుటుంబ సభ్యులతో కాలం గడుపుతూ ఉన్నప్పటికీ సర్వదా ఆయన దివ్యపారవశ్య స్థితిలో ఎలా నెలకొని ఉన్నారనే విషయాన్ని సూచనప్రాయంగా మరోచోట[1] తెలిపి ఉన్నాం. అందుచేత ఇక్కడ మళ్ళీ చెప్పనవసరం లేదు.

---

1. గురుభావం, ఉత్తరార్ధం IV.1.14

ఈసారి కామార్పుకూర్‌కు వచ్చిన సందర్భంలో శ్రీరామకృష్ణులు మరొక గొప్ప కర్తవ్య నిర్వహణలో నిమగ్నులయ్యారు.

8. భార్యపట్ల శ్రీరామకృష్ణుల కర్తవ్య నిర్వహణ

మొదట్లో తన భార్య కామార్పుకూర్‌కు రావటం పట్ల ఉదాసీనంగా ఉండిపోయారు. కాని ప్రస్తుతం ఆమె శ్రేయస్సుకై ఆమెకు విద్యాబుద్ధులు గరప సంకల్పించారు. శ్రీరామకృష్ణులు వివాహితులని ఎరిగి, ఆయనకు సన్న్యాసదీక్ష ఒసగిన గురువు తోతాపురి ఒకప్పుడు ఆయనతో ఇలా అనడం జరిగింది: "(వివాహం) అయితే ఏమిటి? భార్య తనతో ఉన్నప్పుడు కూడా ఏ వ్యక్తి త్యాగం, వైరాగ్యం, వివేకం, విజ్ఞానం ఏ రీతిలోనూ చెక్కుచెదరక ఉంటాయో ఆ వ్యక్తే నిజంగా బ్రహ్మంలో ప్రతిష్ఠితుడైనవాడు. స్త్రీ పురుషుల నిద్దరినీ సదా భేదబుద్ధి లేకుండా ఆత్మదృష్టితో గాంచుతూ, తదనురూపంగా వ్యవహరిస్తాడో అతడే బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తి. స్త్రీ పురుషుల భేదభావం ఉన్న వ్యక్తులు సాధకులు కావచ్చునేమో కాని వారు బ్రహ్మజ్ఞానానికి ఇంకా సుదూరంలో ఉన్నవారి కిందే లెక్క." తోతాపురి పై వ్యాఖ్యానం శ్రీరామకృష్ణులకు గుర్తుకు వచ్చింది. దీర్ఘకాలిక కఠోర సాధనా ప్రాప్తమైన ఆత్మజ్ఞానాన్ని పరీక్షించడంలోను, తన భార్య శ్రేయోదాయాన్ని కనుగొనడంలోను ఆయన ఉన్ముఖులైనారు.

కర్తవ్యం కింద నిశ్చయించుకొన్న దేనినీ ఉపేక్షించడంగాని అర్థాంతరంగా విడిచిపెట్టడంగాని చేసేవారు కారు శ్రీరామకృష్ణులు. ప్రస్తుత విషయంలోనూ

9. దానిలో శ్రీరామకృష్ణుల సాఫల్యం

అట్లే జరిగింది. ఇహపర విషయాలన్నిటిలోనూ పూర్తిగా తనపైనే ఆధారపడి ఉన్న పసి భార్యకు శిక్షణ గరపడంలో అర్థాంతరంగా ఆయన ఆగిపోలేదు. దేవతలను, గురుజనులను, అతిథి అభ్యాగతులను సేవించడం, గృహ కృత్యాలు చక్కదిద్దుకోవడం, ధనాన్ని సద్వినియోగపరచడం, వీటి అన్నిటికంటె ప్రధానంగా సర్వస్వాన్ని భగవంతునికి సమర్పించడం, దేశకాల పరిస్థితుల ననుసరించి వ్యవహరించడంలో ఎలా సమర్థురాలు కావాలో నేర్పాలన్న తలంపుతోనే ఉన్నారాయన. అఖండ బ్రహ్మచర్య సంపన్నమైన స్వీయ జీవితాదర్శాన్ని ఆమె కళ్ళ ఎదుట ఉంచి పైన చెప్పినట్లు ఆమె కొసగిన శిక్షణ ఎలా ఫలించిందో - ఆ విషయాన్ని మేము మరొకచోట[1] సూచించాం. కనుక ఇక్కడ క్లుప్తంగా చెప్పవలసినది ఏమంటే: కామగంధ రహితమైన శ్రీరామకృష్ణుల వినిర్మల ప్రేమను పొంది పరమానందభరితురాలై సాక్షాత్తు ఇష్టదైవంగా యావజ్జీవితం ఆయనను పూజిస్తూ, ప్రతీ విషయంలోనూ ఆయన

---

1. గురుభావం, పూర్వార్ధం III.4

అడుగు జాడలను అనుసరించి స్వీయజీవితాన్ని ఆయన ఉపదేశానుసారం మాతృదేవి మలచుకోగలిగారు.

శ్రీరామకృష్ణులు, భార్యపట్ల తమ కర్తవ్యాన్ని నిర్వర్తించ ప్రయత్నిస్తూ ఉన్నప్పుడు ఆయనను అనేక సందర్భాలలో భైరవీ బ్రాహ్మణి అవగతం చేసుకో

10. భైరవీ బ్రాహ్మణి వెరపు

లేకపోయింది. తోతాపురితో పరిచయం కలిగాక సన్న్యాసం స్వీకరించాలన్న శ్రీరామకృష్ణుల సంకల్పాన్ని వమ్ము చేయ ఆమె ప్రయత్నించింది.[1] సన్న్యాసం స్వీకరించి అద్వైత తత్త్వసాధనలో సర్వో త్కృష్టులైతే ఆయన భగవద్భక్తి కూకటివ్రేళ్ళతో సహా పెకలించుకుపోతుందని ఆమె భావించింది. ప్రస్తుతం కూడా అటువంటి భయంతో కూడిన అభి ప్రాయానికే ఆమె వచ్చింది. భార్యతో సన్నిహితంగా మెలిగితే ఆయన బ్రహ్మ చర్యానికి హాని వాటిల్లవచ్చునని ఆమె తలచిందని భావించవచ్చు. కాని తోతాపురి వ్యవహారంలో మాదిరిగానే ఇప్పుడు కూడా శ్రీరామకృష్ణులు ఆమె ఉద్దేశాలకు అనుగుణంగా వర్తించలేదు. శ్రీరామకృష్ణుల ఈ నడవడిక ఆమె మనస్సును గాయ పరచి ఉండవచ్చు. ఇది ఆత్మాభిమానం క్రింద ఎదిగి గర్వం, అహంకారాల తీవ్ర రూపు దాల్చి శ్రీరామకృష్ణుల పట్ల విశ్వాసం కోల్పోయేటట్లు పరిణమించింది. తన భావనలను బాహాటంగా ఆమె వెల్లడించిన వైనం మేం హృదయ్ నుండి విన్నాం. ఉదాహరణకు: ఆమె ముందు ఎవరైనా ఆధ్యాత్మికతకు సంబంధించిన ఏదైనా ప్రశ్నను లేవనెత్తి, దాన్ని శ్రీరామకృష్ణులను అడిగి ఆయన అభిప్రాయం తెలుసుకొంటానని అనడమే తరువాయి, ఆమె భగ్గున మండిపడి, "అతడేం చెప్పగలడు? అతడి కళ్ళు తెరిపించింది నేనే కదా!" అనేదట. లేదా అల్పమైన కారణంగానో లేక ఏ కారణం లేకుండానే ఆయన కుటుంబంలోని స్త్రీలను చీవాట్లు పెట్టేది. కాని శ్రీరామకృష్ణులు మాత్రం ఆమె దుర్భాషణలను, అత్యాచార పూర్వక ధోరణిని ప్రశాంతచిత్తులై చూస్తూ ఉండడమే కాక ఆమె పట్ల మునుపు ఉన్న భక్తిగౌరవాలను కించిత్తయినా సడలించుకోలేదు. ఆయన ఆదేశానుసారం మాతృదేవి కూడా తన సొంత అత్తగారికి చూపే గౌరవాన్ని భైరవీ బ్రాహ్మణి పట్ల కనబరుస్తూ సదా భక్తిప్రపత్తులతో ఆమె సేవలో నిమగ్నురాలైంది. బ్రాహ్మణి పలు కులకు, చర్యలకు అమాయక బాలికలా ఆమె ఎలాంటి అసమ్మతినీ వ్యక్తం చేయలేదు.

గర్వాహంకారాలు పెచ్చుపెరిగినప్పుడు యోచనాపరుడైన వివేకిని కూడా మబ్బు క్రమ్ముకొంటుంది. ఆ విపరీత వర్తన కారణాన అచిరకాలంలోనే ప్రతీ మలుపు వద్దా తాకిడులు, దెబ్బలు తప్పవు. అలాంటి అనుభవాల ఫలితంగా పదే

---

1. గురుభావం, పూర్వార్థం 3.2.11

పదే ఏర్పడ్డ నిస్పృహ, అతడిలో ఇంకా వివేకం మిగిలి ఉంటే, స్వకీయ దోషాన్ని చక్కదిద్ది మళ్ళీ అతణ్ణి సరైన మార్గంలోకి మళ్ళిస్తుంది. విజ్ఞురాలైన బ్రాహ్మణి విషయంలోనూ అలాగే జరిగింది. మితిమించిన అహంకార ప్రాబల్యంతో దేశకాల పరిస్థితులను యుక్తంగా మదింపు చేసుకోలేక ఒకనాడు ఆమె అమిత ఇబ్బందికరమైన పరిస్థితిని కల్పించింది. ఆ సంఘటన ఇలా జరిగింది.

11. గర్వాహంకారాల ఉద్ధతితో బ్రాహ్మణి వివేచనాశక్తిని కోల్పోవడం

శ్రీనివాస్ శంఖారిని గురించి ఇదివరకే ప్రస్తావించాం. అగ్రకులంలో జన్మించనప్పటికీ అతడు భాగవద్భక్తి విషయంలో మాత్రం ఎందరో బ్రాహ్మణుల కంటే ఉన్నతుడు. ఈ కాలఘట్టంలో ఒక రోజు అతడు శ్రీ రఘువీరుని ప్రసాదం స్వీకరించే ఉద్దేశంతో శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చాడు. తమ మధ్యన శ్రీనివాస్ ఉండడం శ్రీరామకృష్ణులకు, ఆయన కుటుంబ సభ్యులకు ఎంతో సంతోషదాయకమే అని చెప్ప పనిలేదు. శ్రీనివాస్ భక్తివిశ్వాసాలను గాంచి నైష్ఠికమైన బ్రాహ్మణి కూడా సంతసించింది. మధ్యాహ్నం వరకు వారంతా భక్తిపరమైన వివిధ విషయాలను గురించి ముచ్చటించారు. ఈలోపు రఘువీరుని పూజానైవేద్యాది సేవలన్నీ పూర్తయ్యాయి. శ్రీనివాస్ కూడా ప్రసాదం స్వీకరింప కూర్చున్నాడు. ప్రసాదం ఆరగించి పిదప, అక్కడి ఆచారరీత్యా అతడు, తాను భుజించిన స్థలాన్ని శుభ్రపరచబోతూ ఉండగా, ''మేమే శుభ్రం చేసుకొంటాం'' అంటూ బ్రాహ్మణి, అతణ్ణి ఆ పని చేయకూడదని కట్టడి చేసింది. గత్యంతరంలేక శ్రీనివాస్ ఇంటికి తిరిగి వెళ్ళిపోవలసి వచ్చింది.

12. ఆ పరిస్థితిని కల్పించిన సంఘటన

కులాచారాలు, నియమాలు ప్రాబల్యం వహించిన ఆనాటి గ్రామాలలో వాటిని ఉల్లంఘించడం తరచూ పెద్ద కలహాలకు, వైషమ్యాలకు దారితీసేది. అలాంటి సంఘటనే ఇప్పుడూ జరిగింది. శ్రీరామకృష్ణులను చూడడానికి వచ్చిన బ్రాహ్మణ స్త్రీలు, బ్రాహ్మణ కులస్థురాలైన బ్రాహ్మణి, శ్రీనివాస్ ఉచ్ఛిష్టాన్ని శుభ్రం చేయబోవడం చూసి పెద్దగా ఆక్షేపించారు. కాని వారి ఆక్షేపణను ఆమె పట్టించుకోలేదు. క్రమంగా అది తగవులాటలోకి దిగింది. శ్రీరామకృష్ణుల మేనల్లుడైన హృదయ్ ఈ గందరగోళం విన్నాడు. ఈ చిన్న సంఘటన పెద్ద పోట్లాటలోకి దారితీయవచ్చునని ఎంచి, బ్రాహ్మణిని ఆచార నియమాలను ఉల్లంఘించవద్దన్నాడు. కాని ఆమె, అతడి మాటలను లక్ష్యపెట్టలేదు. దానితో హృదయ్ కోపోద్రిక్తుడవడంతో వారిద్దరి మధ్య వాగ్యుద్ధం చెలరేగింది. బ్రాహ్మణితో, ''నువ్వు అట్లే చేస్తే ఈ ఇంట్లో నిన్ను ఉండనివ్వం'' అన్నాడు హృదయ్. బ్రాహ్మణి అంత తేలికగా లొంగే ఘటం కాదు. ''ఉండనివ్వకపోతే నష్టం లేదు.

13. బ్రాహ్మణితో హృదయ్ తగవులాట

శీతలాదేవి గదిలో[1] మానసాదేవి[2] పడుకొంటుందిలే'' అంటూ బదులు చెప్పింది. ఇంట్లోని వారంతా వేడుకొని బ్రాహ్మణిని ఆ పని నుండి విరమింప జేసి తగవులాటను అంతటితో ఆపించారు.

పై విషయంలో ఆమె తల ఒగ్గినప్పటికీ, నాడు ఆమె అహం తీవ్రంగా దెబ్బతిన్నదనే చెప్పాలి. కోపం చల్లారిన పిదప ప్రశాంతంగా ఆలోచించి తన తప్పిదాన్ని గుర్తించింది. ఇలాంటి తప్పిదాలు పదే పదే చేస్తూ ఉంటే తానిక అక్కడ కొనసాగలేనని ఆమె భావించింది. సదసద్విచార సంపన్నుడూ, వివేకవంతుడూ అయిన సాధకుడు తన అంతర్దృష్టిని తన మనస్సుపై పరపినప్పుడు దాన్లో దాగివున్న అపవిత్ర భావాలు కనబడకపోవు. బ్రాహ్మణి విషయంలోకూడా ఇప్పుడు అదే జరిగింది. శ్రీరామకృష్ణుల పట్ల తన వైఖరిలో ఏర్పడిన విపరీత ధోరణి గురించిన ఎరుక ఆమెకు అంతరవలోకనం మూలంగా కలిగింది. ఆమె పశ్చాత్తప్తురాలైంది. ఇలా కొన్ని రోజులు గడిచిపోయాయి. ఒక రోజు బ్రాహ్మణి స్వహస్తాలతో రకరకాల పువ్వులతో మాలలు కట్టి, గంధచందనాదులు అలది, శ్రీరామకృష్ణులను సాక్షాత్తు శ్రీ గౌరాంగుని (చైతన్యుని)గా భావిస్తూ, ఆయనను ఆ మాలలతో మనోహరంగా అలంకరించింది. పిదప హృదయపూర్వకంగా ఆయనను క్షమాపణ వేడుకొన్నది. తరువాత తనను తాను అదుపులో ఉంచుకొని, తన మనఃప్రాణాలు భగవదాయత్తం చేసి, కామార్పుకూర్‌ను వీడి కాశీక్షేత్రానికి బయలుదేరింది. ఆరు సుదీర్ఘ సంవత్సరాల కాలం నిరంతరాయంగా శ్రీరామకృష్ణులతో కలిసి వసించిన తరువాత భైరవీ బ్రాహ్మణి ఆఖరికి ఆయన నుండి సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయింది.

14. బ్రాహ్మణి తన తప్పిదాన్ని గుర్తించడం - సెలవు పుచ్చుకోవడం

శ్రీరామకృష్ణులు దాదాపు ఏడు నెలల కాలం వివిధ ఆధ్యాత్మిక భావనలలో కామార్పుకూర్‌లో గడిపిన తరువాత బహుశా 1867వ సంవత్సరాంతాన దక్షిణేశ్వరానికి తిరిగివచ్చారు. అప్పటికి ఆయన చాలావరకు మునుపటి ఆరోగ్యాన్ని, బలాన్ని పుంజుకొన్నారు. దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చిన స్వల్పకాలం తరువాత ఆయన జీవితంలో ఒక ముఖ్యమైన సంఘటన జరిగింది. దాన్ని పాఠకులకు ఇప్పుడు వివరించబోతున్నాం.

15. దక్షిణేశ్వరానికి శ్రీరామకృష్ణులు తిరిగి రావడం

---

1. శీతలాదేవి ప్రతిష్ఠింపబడిన గుడి.
2. మానసాదేవి నాగదేవత. ఈ రకంగా భైరవీ బ్రాహ్మణి తనను తాను క్రూర సర్పంతో పోల్చుకుంది.

18. శ్రీరామకృష్ణుల తీర్థయాత్ర - హృదయరాం వృత్తాంతం

1. శ్రీరామకృష్ణుల తీర్థయాత్ర నిర్ణయమవడం

మథుర్‌బాబు, అతడి భార్య భారతదేశపు వాయవ్య ప్రాంతంలోని ముఖ్య తీర్థాలను సందర్శింప సన్నద్ధులవుతున్నారు. జనవరి నెలలో ప్రయాణానికి ఒక సుముహూర్తంకూడా నిర్ణయించారు. మథుర్‌తోబాటు ఆతడి గురువు కుమారుడు, ఇంకా అనేకులు కూడా వెళ్ళనున్నారు. తమతోబాటు రావలసిందిగా మథుర్‌బాబు, అతడి భార్య శ్రీరామకృష్ణులను ఎంతో ప్రాధేయపడ్డారు. పర్యవసానంగా వృద్ధురాలైన తమ తల్లి[1], మేనల్లుడైన హృదయ్‌లను తోడ్కొని వారితోపాటు తీర్థయాత్రలకు వెళ్ళటానికి శ్రీరామకృష్ణులు అంగీకరించారు.

2. తీర్థయాత్రకు బయలుదేరిన రోజు

మథుర్‌బాబు 1868వ సం॥ జనవరి 27వ తేదీ శుభ దినాన శ్రీరామకృష్ణులు, తదితరులతో మథుర్ తీర్థయాత్రకు బయలుదేరాడు. శ్రీరామకృష్ణుల తీర్థయాత్రా విశేషాలను మేం మరొకచోట[2] వర్ణించాం. కాబట్టి హృదయ్ నుంచి మేం విన్న సంగతులను మాత్రమే ఇక్కడ తెలుపుతున్నాం.

3. యాత్ర ఏర్పాట్లు

శ్రీరామకృష్ణులు, ఆయన తల్లి, మథుర్ దంపతులు, వారి కోడలు, మథుర్ గురువుగారి కుమారుడు, హృదయ్, ఒక వంట బ్రాహ్మణుడు, ఒక ద్వారపాలకుడు, ఆడ మగ పనివాళ్ళు - మొత్తం దాదాపు నూట ఇరవై ఐదుమంది బయలుదేరారు. ఒక రెండవ తరగతి పెట్టె,

---

1. శ్రీరామకృష్ణుల తల్లి వారితోపాటు తీర్థయాత్రలకు వెళ్ళలేదని కొందరంటారు. కాని హృదయ్ మాత్రం, ఆమె తీర్థయాత్రలకు వెళ్ళిందని చెప్పాడు.

2. గురుభావం, ఉత్తరార్ధం IV.3

మూడు మూడవ తరగతి పెట్టెలు వీరందరికోసం రైలు కంపెనీవారు కేటాయించారు. అంతేకాక కలకత్తా - కాశీ మధ్య మార్గంలో ఈ నాలుగు పెట్టెలు కావలసిన చోట వేరుచేయడానికి అనువుగా ఏర్పాటు చేసుకొన్నారు.

దేవఘర్ వద్ద వైద్యనాథ్ శివుని దర్శనం చేసుకొని అక్కడ కొన్నిరోజులు విశ్రమించారు. అక్కడ ఒక ముఖ్య సంఘటన జరిగింది. అక్కడి ఒక గ్రామంలోని స్త్రీ, పురుషుల దైన్యావస్థను చూసి శ్రీరామకృష్ణుల హృదయం దయార్ద్రమైపోయింది. మథుర్‌బాబుకు చెప్పి వారందరికీ ఒకరోజు కడుపారా భోజనం పెట్టించి, ఒక్కో వస్త్రాన్ని ఇప్పించారు[1] ఆయన.

4. వైద్యనాథ్ సందర్శనం - దరిద్ర నారాయణ సేవ

వైద్యనాథ్ నుండి తిన్నగా కాశీకి బయలుదేరాడు మథుర్‌బాబు. దారిలో చెప్పుకోదగ్గ విశేషం ఏదీ జరుగలేదు. కాని కాశీకి సమీపంలోని ఒక స్టేషన్‌లో బండి నుంచి దిగిన శ్రీరామకృష్ణులు, హృదయ్ మళ్ళీ బండిలోకి ఎక్కేలోపునే రైలు బయలుదేరింది. దానితో మథుర్ గాబరాపడి మరుసటి రైలులో వారిని పంపించివేయమని కాశీ నుంచి తంతివార్త పంపించాడు. కాని అదృష్టవశాత్తు వారు మరుసటి రైలుకోసం వేచి వుండనవసరం లేకపోయింది. ఆ సమయంలో రాజేంద్రలాల్ వంద్యోపాధ్యాయ అనే ఆ రైలు కంపెనీవారి ఉన్నతోద్యోగి ప్రత్యేక రైలులో పర్యవేక్షణ నిమిత్తం అక్కడకు వచ్చాడు. వీరిని ఆ దురవస్థలో చూసి తన రైలులో ఎక్కించుకొని కాశీకి తోడ్కొనిపోయాడు. రాజేంద్రలాల్ వంద్యోపాధ్యాయ కలకత్తాలోని బాగ్ బజార్ నివాసి.

5. దారిలో ఊహించని ఘటన

కాశీ చేరుకోగానే కేదార్ ఘాట్ వద్ద ప్రక్క-ప్రక్కనే ఉన్న రెండు ఇళ్లను మథుర్ అద్దెకు తీసుకొన్నాడు. అన్ని విధాల అతడు యువరాజులా అక్కడ మెలగాడు. అతడు బయటకు వెళ్ళినప్పుడల్లా ముందూ వెనుకా పరిజనం ఛత్రచామరాదులు పుచ్చుకొని నడిచేవారు. అతడి తలపై సదా ఒక వెండి గొడుగును తెరచి పట్టుకొనేవారు. ఈ ఆర్భాటాన్నంత చూసి జనం అతణ్ణి ఒక మహారాజుగా భావించారు.

6. కేదార్‌ఘాట్ వద్ద బస చేయడం

కాశీలో బసచేసినప్పుడు దాదాపు ప్రతిరోజు శ్రీరామకృష్ణులు ఒక పల్లకీలో వెళ్ళి శ్రీ విశ్వనాథుని దర్శించారు. హృదయ్ కాలినడకన ఆయనను అనుసరించేవాడు. ఆలయానికి వెళ్ళే దారిలోనే ఆయన భావపరవశులయ్యేవారంటే ఇక భగవద్దర్శన సమయంలో మాట చెప్పనక్కరలేదు. ఇలా దేవాలయాలన్నిటిలోను

---

1. గురుభావం పూర్వార్ధం III. 7.37

ఆయన భావపరవశులయినప్పటికీ, కేదారేశ్వర ఆలయంలో ఆయన విశేషంగా భావపారవశ్యం చెందటం తటస్థించింది.

ఒక వంక దేవాలయాలను సందర్శిస్తూ మరోవంక శ్రీరామకృష్ణులు కాశీలోని సుప్రసిద్ధులైన సాధుపుంగవులను కూడా దర్శించారు. సదా హృదయ్

7. శ్రీరామకృష్ణులు - త్రైలింగస్వామి

ఆయన వెంటే ఉండేవాడు. పరమహంస శ్రేష్ఠుడైన త్రైలింగ స్వామిని ఆయన పలుమార్లు దర్శించారు. ఆ సమయంలో త్రైలింగస్వామి మౌనవ్రతం పాటిస్తూ మణికర్ణికాఘట్టం వద్ద వసించేవారు. శ్రీరామకృష్ణులు ఆయనను దర్శింప వెళ్ళిన మొట్టమొదటి రోజున, త్రైలింగ స్వామి తమ ముక్కుపొడి డబ్బాను శ్రీరామకృష్ణుల ముందు ఉంచి సాదరంగా ఆహ్వానించారు. శ్రీరామకృష్ణులు, స్వామి శారీరక లక్షణాలను పరీక్షించి హృదయ్‌తో, ''ఈయనలో నిజమైన పరమహంస లక్షణాలన్నీ కనబడుతున్నాయి. ఈయన సాక్షాత్తూ విశ్వేశ్వరుడు'' అని చెప్పారు. త్రైలింగస్వామి మణికర్ణిక వద్ద ఒక స్నానఘట్టం నిర్మింప సంకల్పించుకొన్నారు. శ్రీరామకృష్ణుల ఆదేశం మేరకు హృదయ్ కొన్ని పారల మట్టిని ఆ స్థలంలో వేశాడు. ఒకరోజు శ్రీరామకృష్ణులు, త్రైలింగ స్వామిని మథుర్‌బాబు నివాసానికి ఆహ్వానించి, తమ స్వహస్తాలతో ఆయనకు క్షీరాన్నం తినిపించారు.

శ్రీరామకృష్ణులు కాశీలో అయిదారు రోజులు బసచేసి తరువాత మథుర్‌తో బాటు ప్రయాగకు వెళ్ళారు. త్రివేణీ సంగమంలో స్నానం చేసి, అక్కడ మూడు

8. ప్రయాగలో శ్రీరామకృష్ణుల ప్రవర్తన

రాత్రులు గడిపారు. మథుర్ తదితరులు అక్కడ శిరోముండనం చేయించుకున్నారు. శ్రీరామకృష్ణులు చేయించుకోలేదు. ''నేను చేయించుకోవలసిన అవసరం లేదు'' అని చెప్పారు. ప్రయాగ నుండి కాశీకి తిరిగి వచ్చి అక్కడ పదిహేను రోజులు గడిపిన తరువాత బృందావనానికి బయలుదేరారు.

బృందావనంలో మథుర్ నిధువనానికి సమీపంలో బస చేశాడు. కాశీలో మాదిరే ఇక్కడ కూడా అతడు తన వైభవ దర్పాలను ప్రదర్శించాడు. భార్యతో

9. బృందావనంలోని నిధువనం ప్రభృత స్థలాల సందర్శనం

కూడా ఆలయాలు దర్శించి కొన్ని బంగారు కాసులు అర్పించి ప్రణామాలు చేశాడు. నిధువనంతోబాటు శ్రీరామకృష్ణులు రాధాకుండ్, శ్యామకుండ్, గోవర్ధన గిరిని సందర్శించారు. భావపారవశ్యంలో ఆయన గోవర్ధన గిరిని ఆరోహించారు. బృందావనంలో వసిస్తూ ఉన్న సాధుపుంగవుల గురించి విని, వారిని దర్శించారు. నిధువనంలో వసిస్తున్న 'గంగామాత'ను దర్శించినప్పుడు ఆయన పరమానందభరితులయ్యారు. ఆమె మేని లక్షణాలను సూచించి హృదయ్‌తో,

''ఈమె అత్యున్నత ఆధ్యాత్మిక స్థితిని పొందినది'' అన్నారు శ్రీరామకృష్ణులు.

దాదాపు ఒక పక్షం రోజులు బృందావనంలో గడిపి మథుర్ తదితరులు కాశీకి తిరిగి వచ్చారు. విశేష వేషభూషణాల అలంకారంలో విశ్వేశ్వరుని దర్శింపగోరి వారందరూ వైశాఖ మాసం వరకు కాశీలోనే ఉండిపోయారు. శ్రీరామకృష్ణులు ఈ సమయంలో అన్నపూర్ణా దేవి సువర్ణ ప్రతిమను దర్శించారు.

10. కాశీకి తిరిగి రాక

శ్రీరామకృష్ణులు కాశీలో యోగేశ్వరి భైరవీ బ్రాహ్మణిని కలుసుకొన్నట్లు హృదయ్ తెలిపాడు. ఆయన ఆమె వసించే 'చౌషట్టీ (అంటే అరవై నాలుగు) యోగినీ' అనే బసకు పలుమార్లు వెళ్ళారు. బ్రాహ్మణి అప్పుడు 'మోక్షదా' అనే స్త్రీతో కలిసి నివసిస్తూ ఉంది. మోక్షదా భక్తివిశ్వాసాలను గాంచి శ్రీరామకృష్ణులు చాల సంతోషించారు. బ్రాహ్మణి కూడా శ్రీరామకృష్ణులతోబాటు బృందావనానికి వచ్చింది. ఇక అక్కడే ఆమెను ఉండిపొమ్మన్నారు ఆయన. బృందావనం నుండి శ్రీరామకృష్ణులు తిరిగి వచ్చేసిన స్వల్పకాలంలోనే బ్రాహ్మణి అక్కడే మరణించింది.

11. కాశీలో భైరవీ బ్రాహ్మణిని కలుసుకోవడం

బృందావనంలో బసచేసి ఉన్నప్పుడు వీణావాదాన్ని వినాలనే ఆకాంక్ష శ్రీరామకృష్ణులకు కలిగింది. కాని ఆ సమయంలో వీణ వాయించేవారు ఎవరూ అక్కడ లేకపోవటంతో ఆయన కోర్కె తీరలేదు. కాశీకి తిరిగి వచ్చాక మళ్ళీ ఆయనలో ఆ కోర్కె జనించింది. కాశీలో మహేశ్‌చంద్ర సర్కార్ అనే వీణాపండితుడు ఉండేవాడు. శ్రీరామకృష్ణులు ఒకరోజు హృదయ్‌ను తోడ్కొని మహేశ్ ఇంటికి వెళ్ళి వీణ వాయించమని అతణ్ణి అభ్యర్థించారు. మహేశ్ 'మదన్ పురా' అనే ప్రాంతంలో వసిస్తూన్నాడు. శ్రీరామకృష్ణుల అభ్యర్థన మేరకు నాడు మహేశ్ మహోల్లాసంతో చాలాసేపు వీణ వాయించాడు. సుమధుర వీణానాదాన్ని వింటూనే శ్రీరామకృష్ణులు భావపరవశులయ్యారు. ఒకింత బాహ్యస్మృతి కలుగగానే, ''అమ్మా! నాకు బాహ్యస్మృతిని ఇవ్వు. సావధానంగా నేను వీణానాదం వినగోరుతున్నాను'' అంటూ జగజ్జననిని ప్రార్థించటం వినవచ్చింది. వెంటనే ఆయన బాహ్యభావభూమిలో నెలకొనగలిగారు. మహదానందంతో వీణానాదాన్ని వింటూ, అప్పుడప్పుడు వీణానాదానికి అనుగుణంగా తమ గాత్రాన్ని జోడించి పాడారు కూడా! ఆయన సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఆనందంగా అక్కడ గడిపారు. మహేశ్ సమర్పించిన ఉపాహారాన్ని

12. వీణావాదకుడైన మహేశ్‌ను చూడ వెళ్ళటం

స్వీకరించి మథుర్‌బాబు వద్దకు తిరిగి వచ్చేశారు. మహేశ్ నాటి నుండి అను నిత్యం శ్రీరామకృష్ణుల దర్శనార్థం వెళ్ళసాగాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి గురించి, ''వీణను వాయిస్తూ ఉన్నప్పుడు అతడు తనను మరచిపోయేవాడు'' అని చెప్పారు.

కాశీ నుండి గయాక్షేత్రానికి వెళ్ళాలనే కోర్కె మథుర్ వెలిబుచ్చాడు. కాని శ్రీరామకృష్ణులు అందుకు ససేమిరా సమ్మతించక పోవడంతో మథుర్ ఆ ఆలోచన మానుకొని కలకత్తాకు తిరిగి వచ్చేశాడు.

13. దక్షిణేశ్వరానికి తిరిగి రావడం: తదనంతర కార్యాలు

ఆ విధంగా దాదాపు నాలుగు నెలల కాలం ముఖ్యమైన పుణ్యతీర్థాలను సేవించుకొని శ్రీరామకృష్ణులు 1868వ సం॥ మధ్య కాలంలో (జ్యేష్ఠ మాసంలో) దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చారని హృదయ్ తెలిపాడు. ఆయన బృందావనంలోని రాధాకుండ్, శ్యామకుండ్ నుండి కొంత మట్టి, ధూళి తీసుకువచ్చారు. దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చాక హృదయ్ సహాయంతో ఆయన దాన్లో కొంతభాగాన్ని పంచవటి చుట్టూ వెదజల్లి, మిగిలిన దానిని తమ సాధన కుటీరంలో స్వయంగా తామే త్రవ్వి పాతిపెట్టారు. ''నేటి నుండి ఈ స్థలం బృందావనం లాగా పవిత్రభూమి కాగలదు'' అని ప్రకటించారు. కొన్ని రోజులు గడిచాక విభిన్న ప్రాంతాల నుండి వైష్ణవ గోస్వాములను, భక్తులను ఆహ్వానించమని శ్రీరామకృష్ణులు మథుర్‌ను కోరారు. వారందరూ వచ్చారు. శ్రీరామకృష్ణులు పంచవటిలో ఒక ఉత్సవాన్ని జరిపించారు. ఆ సందర్భంలో మథుర్ - గోస్వాము లొక్కొక్కరికి పదహారు రూపాయలు, భక్తులకు తలా ఒక రూపాయి చొప్పున దక్షిణ ఇచ్చాడు.

తీర్థయాత్రల నుండి తిరిగి వచ్చిన కొద్దికాలం లోపునే హృదయ్ భార్య మరణించింది. ఈ దుర్ఘటనతో హృదయ్ మనస్సు కొంతకాలం వరకు

14. హృదయ్ భార్య మరణం

వైరాగ్యంతో నిండిపోయింది. హృదయ్ ధ్యానపరాయణ ప్రవృత్తి గలవాడు కాడనే సంగతి మునుపే చెప్పుకొన్నాం. తన ప్రాపంచిక స్థితిగతులను పెంపొందించుకొని సాధ్యమైనంత వరకు సుఖించాలన్నదే ఆతడి జీవితాదర్శం. శ్రీరామకృష్ణుల నిరంతర సాహచర్యం కారణంగా అతడిలో ఆధ్యాత్మిక భావాలు జనించినా అవి ఎక్కువ కాలం నిలిచి ఉండలేదు. సుఖించే సదవకాశం చేజిక్కినప్పుడల్లా సమస్తం విస్మరించి, దానినే వెంబడించేవాడు. దాన్ని సాధించే వరకు అతడి మనస్సులో మరొక ఆలోచనే వచ్చేది కాదు. అందుచేతనే శ్రీరామకృష్ణుల అపూర్వ దివ్యసాధనలన్నీ హృదయ్ దక్షిణేశ్వరంలో వసిస్తూన్న కాలంలోనే అనుష్ఠింపబడినప్పటికీ, శ్రీరామకృష్ణులలో తాను గాంచిన తీవ్రదివ్య పరితాపం చేత హృదయ్ కించిత్తు కూడ ప్రభావితం కాలేదు. అయి

నప్పటికీ హృదయ్ యథార్థంగానే తన మామను ప్రేమించాడు. ఏ సమయంలో సేవ అవసరమైనప్పటికీ ఆయనను సేవించడంలో హృదయ్ ఎన్నడూ వెనుకంజ వేయలేదు. తత్ఫలితంగా అతడు సాహసం, దక్షత, తెలివితేటలు పెంపొందించు కొన్నాడు. సాధుపుంగవుల నుండి తన మామ అలౌకిక మహత్వాన్ని వినేకొద్దీ, ఆధ్యాత్మిక సాధనాకాలంలో ఆయనలో అపూర్వ దైవీశక్తుల వ్యక్తీకరణను తాను ప్రత్యక్షంగా పరిశీలించేకొద్దీ, తన లోలోపలి బలాన్ని హృదయ్ మరింతగా అనుభూతం చేసుకోగలిగాడు. శ్రీరామకృష్ణులతో అతడి సాన్నిహిత్యం చలవ వల్లనే ఇది సాధ్యమైంది. తను ఒనరించిన సేవల కారణంగా ఆయన సాన్నిహిత్యాన్ని పొందాననుకోవడం - ఆయన తన సొంత మనిషి, ఆయనకు తాను ఇష్టుడనీ భావించడం - శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక సాధనా విజయాలు ఒక రకంగా తనవి కూడా అని హృదయ్‌ను అనుకొనేలా చేశాయి. ఎప్పటికన్నా వాటిని తను పొంద డానికి ప్రయత్నిస్తే, తన దివ్యశక్తులచే శ్రీరామకృష్ణులు వాటిని తనకు లభింప చేస్తారని అతడు తలపోశాడు. కనుక ఇప్పటినుండే ఆందోళన చెందవలసిన అవసరం తనకు లేదని హృదయ్ భావించాడు. ముందు ఒకింత లౌకిక సుఖాలను అనుభవించి, ఆ తరువాత పరాన్ని గురించి తాపీగా యోచించవచ్చు. అను కొన్నాడు. అప్పటి వరకు జీవితం పట్ల అతడి వైఖరి ఈ రీతిలోనే ఉండేది.

భార్య మరణంతో శోకపూరితుడైన హృదయ్ ఇప్పుడు తన జీవిత వైఖరి, విధానాలలో మార్పు తెచ్చుకోవడానికి తగిన సమయం ఆసన్నమైనదను కొన్నాడు. అతడు అప్పటి నుండి వెనుకటి కన్నా మరింత నిష్ఠతో జగజ్జననిని పూజింప ఉపక్రమించాడు. శ్రీరామకృష్ణులను అనుకరిస్తూ, ధరించిన వస్త్రాన్ని, జంధ్యాన్ని ఆవలపెట్టి ధ్యానం చేయసాగాడు. శ్రీరామకృష్ణులు అనుభూతం చేసుకొన్న ఆధ్యాత్మిక అనుభూతులు తను కూడా పొందగలందులకు తనకు సహాయం చేయమని ఆయనను అర్థించాడు. అతడికి సాధనలు చేయవలసిన అవసరం ఎంతమాత్రం ఉండదని శ్రీరామకృష్ణులు నొక్కి చెప్పారు. తనను సేవించటం ద్వారానే ఆ ఫలితాలు అతడు పొందగలడని భరోసా ఇచ్చారు. తాము ఇద్దరూ రేయింబవళ్ళు భగవద్భావంలో మగ్నులై, ఆహార నిద్రాది శారీరక అవసరాలను విస్మరిస్తే, తమలో ఒకరు మరొకరిని చూసుకోవడం ఎలా కుదురు తుందని శ్రీరామకృష్ణులు, హృదయ్‌కు నచ్చచెప్ప చూశారు. కాని హృదయ్ ఆ మాటలకు చెవి ఒగ్గలేదు. చివరకు శ్రీరామకృష్ణులు గత్యంతరంలేక సమ్మ తిస్తూన్న ధోరణిలో ఇలా అన్నారు: ''సరే, అమ్మ సంకల్పమే నెరవేరుతుంది. నా సంకల్పంతో ఏదైనా జరుగుతుందా? అమ్మే నా మనస్సును మరల్చి, నన్ను ఆ అవస్థలోకి తీసుకువచ్చి, అద్భుత అనుభూతులను అనుగ్రహించింది. అమ్మ సంకల్పిస్తే నీకూ ఆ అనుభూతులను అనుగ్రహిస్తుంది.''

ఈ మాటలు జరిగిన కొన్ని రోజుల తరువాత పూజ చేస్తూ ఉన్నప్పుడు, ధ్యానంలో ఉన్నప్పుడు హృదయ్‌కు జ్యోతిర్మయ దేవతామూర్తుల దర్శనాలు కలగసాగాయి. ఆ సమయంలో అతడు భావావిష్టుడై అర్ధ బాహ్యస్మృతి పొందేవాడు. ఇలా ఉండగా ఒకరోజు మథుర్ బాబు భావావస్థలో ఉన్న హృదయ్‌ను చూడడం తటస్థించింది. వెంటనే అతడు శ్రీరామకృష్ణులను, ''బాబా! హృదయ్‌కు మళ్ళీ ఏమైంది?'' అని అడిగాడు. అందుకు శ్రీరామకృష్ణులు, మథుర్‌కు ఇలా చెప్పారు: ''హృదు నడవడిక బూటకం కాదు. దివ్యదర్శనాలు చూపించమని జగజ్జననిని పట్టుపట్టాడు. అందుకే వాటిని పొందుతున్నాడు. ఒకింత వాటి రుచి చూపించిన పిదప జగజ్జనని, అతణ్ణి మామూలు స్థితికి తీసుకువస్తుంది.'' ఆ మాటలు విని మథుర్ ఇలా అన్నాడు: ''బాబా! ఇదంతా నీ లీల. నువ్వే హృదయ్‌కు అటువంటి స్థితిని కలిగించావు. కనుక నువ్వే అతడికి ఉపశమనం కలిగించు. నంది భృంగులవలె మేం ఇద్దరం కలిసి నిన్ను సేవించుకొంటాం. ఈ అసాధారణ స్థితులు మాకెందుకు?''

15. హృదయ్ భావపారవశ్యం

మథుర్, శ్రీరామకృష్ణుల మధ్య ఈ సంభాషణ జరిగిన కొన్ని రోజులకు ఒకనాటి రాత్రి శ్రీరామకృష్ణులు పంచవటి వైపుకు వెళ్లటం హృదయ్ చూశాడు. ఆయనకు అవసరమౌతాయని నీటిచెంబు, తువ్వాలు పుచ్చుకొని హృదయ్ ఆయనను అనుసరించాడు. అలా పోతూవున్నప్పుడు హృదయ్ ఒక అత్యద్భుత దర్శనం గాంచాడు. శ్రీరామకృష్ణులు రక్తమాంసాలతో కూడిన దేహధారియైన మానవుడుగా హృదయ్‌కు గోచరించలేదు. ఆయన దేహం నుండి ప్రసరిస్తూ ఉన్న అపూర్వ కాంతితో పంచవటి దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. ఆయన నడుస్తున్నప్పుడు జ్యోతిర్మయమైన ఆయన పాదాలు నేలను స్పృశించక, గాలిలో తేలుతూ ఆయన్ను ముందుకు తీసుకుపోతున్నాయి. కళ్లు భ్రమించాయేమో అనుకొని హృదయ్ కళ్లు నులుముకుని మరీమరీ చూశాడు. ఊహూఁ! చెట్లు, లతలు, గంగానది, కుటీరం మొదలైనవన్నీ సహజసిద్ధంగానే కనబడుతూ ఉన్నప్పటికీ శ్రీరామకృష్ణులు మాత్రం జ్యోతిర్మయ రూపంలోనే కనిపించారు. దీనిని చూసి అమితాశ్చర్యానికి లోనైన హృదయ్ తన మనస్సులో ఏదైనా మార్పు జరిగిందేమోనని భావించాడు. ఇలా అనుకొని హృదయ్ తన దేహం వంక చూసుకొన్నాడు; తానుకూడ జ్యోతిర్మయ దేహం ధరించిన పురుషుడనని, భగవంతుని అనుచరుడనని, సాక్షాత్తు భగవంతుని వద్ద శాశ్వతంగా ఉంటూ ఆయనకు సేవలు ఒనరిస్తున్నానని అతడికి అనిపించింది. 'తాను భగవంతుని జ్యోతిర్ఘన అంగం నుండి జన్మించిన అంశరూపుడనని, భగవంతుని సేవార్థమే మరొక దేహాన్ని దాల్చి

16. హృదయ్ చూసిన అద్భుత దర్శనం

ఆయన నుండి విడిగా ఉన్నానని' అతడు అనుకొన్నాడు. అటువంటి దివ్య దర్శనం గాంచి, తన జీవిత మర్మాన్ని తెలుసుకొన్న హృదయ్ హృదయం పరమా నందంతో పొంగిపొరలింది. అతడు తనను మర్చిపోయాడు, ప్రపంచాన్నే మర్చి పోయాడు, లోకులు తనను పిచ్చివాడని పిలుస్తారేమోనన్న సంగతిని మర్చి పోయాడు. అర్ధబాహ్య పారవశ్యంలో పిచ్చివాడిలా, "ఓ రామకృష్ణా! ఓ రామ కృష్ణా! మనం మానవులం కాము. మనం ఇక్కడ ఎందుకు ఉన్నాం? దేశదేశాలూ తిరుగుతూ జీవులను ఉద్ధరిద్దాం, పద. నువ్వు ఎవరివో నేనూ ఆతడినే" అంటూ బిగ్గరగా కేకలు పెట్టసాగాడు.

శ్రీరామకృష్ణులు మాతో ఇలా చెప్పారు: "అతడి కేకలు విని నేను, 'ఒరే, ఆగు ఆగు! ఎందుకు అలా ప్రవర్తిస్తున్నావు? మన కేదో ఆపద సంభవించినదని జనం ఇక్కడకు పరిగెత్తుకు వస్తారు' అన్నాను. కాని అతడు నా మాటలు వింటాడా? పరుగున అతడి వద్దకు వెళ్లి, అతడి హృదయాన్ని స్పృశించి, 'అమ్మా! వీణ్ణి జడునిగా చేసివెయ్యి' అన్నాను.

శ్రీరామకృష్ణులు అలా పలుకగానే తన దివ్యదర్శనం, పరమానందం శూన్యంలో మాయమైపోయి మళ్ళీ పూర్వపు మందుడుగా అయిపోయా

17. హృదయ్ మనస్సు మందగించడం

నని హృదయ్ మాతో చెప్పాడు. అలా పారవశ్య స్థితి నుండి హఠాత్తుగా క్రిందికి పడిపోవడంతో హృదయ్ ఖిన్ను డయ్యాడు. అతడు విలపిస్తూ శ్రీరామకృష్ణులతో, "మామా! నువ్వెందుకు అలా చేశావు? మందుణ్ణే అయిపోవాలని ఎందుకు పలికావు? నాకు ఇక ఎన్నటికీ అట్టి పరమానంద దర్శనం కలుగదు" అన్నాడు. అందుకు శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "నువ్వు శాశ్వతంగా మందుడు అయిపోవాలని నేను అన్నానా? కాస్త స్థిమితంగా ఉండు. ఆ చిరు దర్శనానికే నువ్వింతగా కేకలు పెట్టావే! అందుకే నేను అలా పలికాను. ఇరవై నాలుగు గంటలూ ఎన్ని దివ్యదర్శనాలు, దివ్యాను భూతులు నేను పొందుతున్నాను! కాని నేను అలా కేకలు పెడుతున్నానా? అట్టి దివ్యదర్శనాలు పొందడానికి నీకు ఇంకా సమయం ఆసన్నం కాలేదు. ప్రస్తుతం శాంతంగా ఉండు. సమయం వచ్చినప్పుడు నువ్వు వివిధ దర్శనాలు, అను భూతులు పొందగలవు."

శ్రీరామకృష్ణుల మాటలు విని హృదయ్ మౌనం పాటించినా, అతడు

18. హృదయ్ సాధనలకు విఘ్నం

ఎంతో బాధపడ్డాడు. అహంకారపూరితుడై ఎలాగైనా ఆ దివ్యదర్శనాన్ని మళ్ళీ పొంద ప్రయత్నించాలని హృదయ్ సంకల్పించాడు. ఆ సంకల్పం మేరకు అతడు జపధ్యానాలలో ఎక్కువ కాలం గడపసాగాడు. అంతేగాక రాత్రివేళ పంచవటికి వెళ్ళి పూర్వం శ్రీరామకృష్ణులు ఏ

చెట్టుక్రింద కూర్చుని జపధ్యానాలు అనుష్ఠించారో అదే చెట్టు క్రింద తాను కూర్చుని జగజ్జననిని ప్రార్థించాలని తలపోశాడు. అనుకొన్నట్లే ఒకనాటి అర్ధరాత్రి వేళ పంచవటికి వెళ్ళి శ్రీరామకృష్ణులు సాధనలు అనుష్ఠించిన స్థలంలో ధ్యానం చేయడానికి కూర్చున్నాడు. విచిత్రంగా శ్రీరామకృష్ణులకు కూడా అదే సమయంలో పంచవటికి వెళ్ళాలనే ఆకాంక్ష జనించింది. అక్కడకు ఆయన చేరుకొన్నారో లేదో, ''మామా! నన్ను రక్షించు, నన్ను రక్షించు. కాలిపోతూ వస్తున్నాను'' అన్న హృదయ్ దీనారావాలు ఆయన విన్నారు. వడివడిగా ముందుకు వెళ్ళి హృదయ్ వద్దకు వచ్చి, ''ఏమైంది హృదయ్?'' అని అడిగారు. బాధతో అశాంతుడైన హృదయ్, ''మామా! ఇక్కడ ధ్యానానికి కూర్చున్నానో లేదో ఎవరో కణకణ మండుతున్న బొగ్గులను నా ఒంటి మీద పోసినట్లయింది. నేను భరించలేని మంటతో బాధపడుతున్నాను'' అన్నాడు. శ్రీరామకృష్ణులు అతడి ఒంటిని తన చేతులతో నిమురుతూ, ''భయపడకు, చల్లారుతుందిలే. అయినా నువ్వెందుకు ఇలా చేస్తున్నావు? నా సేవతోనే నువ్వు సమస్తం సాధించగలవని నీకు పదేపదే చెప్పాను కదా!'' అన్నారు. శ్రీరామకృష్ణులు చేతులు తనను స్పృశించగానే ఒంటి మంటలు చల్లారిపోయాయని హృదయ్ చెబుతూ ఉండేవాడు. ఆ తరువాత అతడు ధ్యానం చేయడానికి మరెన్నడైనా పంచవటికి వెళితే ఒట్టు. శ్రీరామకృష్ణుల సలహాకు విరుద్ధంగా తాను ఏం చేసినా తనకు మంచి జరగదని హృదయ్‌కు గట్టి నమ్మకం కుదిరింది.

19. హృదయ్ శ్రీశ్రీ దుర్గాపూజ మహోత్సవం నిర్వర్తించడం

శ్రీరామకృష్ణుల మాటలతో హృదయ్ ఒక రకంగా శాంతి పొందాడనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కాని దేవాలయ దైనందిన కర్తవ్యాలు మునుపటి మాదిరి అతడికి రుచించడం లేనట్లే కనిపించాయి. తాను ఆనందం పొందగలిగే ఏదో ఒక విన్నూత్న ప్రక్రియకై అతడి మనస్సు అన్వేషించసాగింది. 1868వ సం॥ శరత్కాల ఆగమనం దృష్టిలో ఉంచుకొని, తన ఇంట్లో శ్రీశ్రీ దుర్గాపూజ మహోత్సవం నిర్వర్తించాలని హృదయ్ సంకల్పించాడు. హృదయ్ సవతి అన్నగారైన గంగా నారాయణ్ అప్పటికే గతించాడు. మరో బంధువైన రాఘవ్, మథుర్ బాబు జమీలో శిస్తు వసూలుచేసే ఉద్యోగిగా నియమించబడి బాగానే సంపాదిస్తున్నాడు. కాలం కలిసి రావడంతో హృదయ్ కుటుంబం ఉన్నతి నొందింది. ఇంటి వద్ద కొత్త చండీ మండపం (పూజాదులు నిర్వర్తించబడే పెద్ద చావడి) కట్టించారు. జగజ్జననిని ఒకసారి ఆ మండపంలో ఆరాధించాలనే కోర్కెను గంగా నారాయణ్ వెలిబుచ్చాడు. కాని ఆ కోర్కె తీర్చుకొనే అవకాశం రాకుండానే అతడు మరణించాడు. తన అన్నగారి కోరిక గుర్తున్న హృదయ్ దానిని నెరవేర్చాలని సంకల్పిం

వాడు. చేతల మనిషి అయిన హృదయ్‌కు ఆ పూజాకార్యం శాంతిని ఇవ్వగలదని ఎరిగిన శ్రీరామకృష్ణులు అందుకు సమ్మతించారు. మథుర్‌బాబు ఈ ఉత్సవానికి కొంత ధన సహాయం చేశాడు. శ్రీరామకృష్ణులను తోడ్కొని వెళ్ళి ఉత్సవ సమయంలో తన ఇంట్లో గడిపేటట్లు చేయాలని హృదయ్ ఎంతో అభిలషించాడు. కాని ఆ సమయంలో శ్రీరామకృష్ణులు తనతోనే ఉండిపోవాలని మథుర్‌బాబు ఆకాంక్షించాడు. ఈ వ్యవహారంలో తన వైఫల్యానికి ఖిన్నుడైన హృదయ్ శ్రీశ్రీ దుర్గాపూజకు ఒంటరిగానే ఇంటికి వెళ్ళడానికి తయారయ్యాడు. అలా కుంగిపోయిన హృదయ్‌ను చూసి శ్రీరామకృష్ణులు, ఓదారుస్తూ ఇలా అన్నారని హృదయ్ మాకు తెలిపాడు: ''ఎందుకు బాధపడతావు? సూక్ష్మశరీరంతో రోజూ నీ పూజను తిలకించడానికి నేను వస్తాను. నువ్వు తప్ప నన్ను ఎవరూ చూడలేరు. తంత్రధారకుని (ప్రధానాచార్యుడు)గా ఒక బ్రాహ్మణుని నియుక్తం చేసుకొని భక్తి శ్రద్ధలతో జగజ్జననిని అర్చించు. కఠోర ఉపవాసం చేయనవసరం లేదు. అందుకు మారుగా మధ్యాహ్నం పాలు, గంగాజలం, కలకండ పానకం పుచ్చుకో. ఈ రీతిలో నువ్వు పూజిస్తే, జగజ్జనని నిశ్చయంగా నీ పూజను స్వీకరిస్తుంది.'' పిదప శ్రీరామకృష్ణులు ఎవరిచే ప్రతిమను తయారు చేయించాలో, ఎవరిని తంత్రధారకునిగా నియమించాలో, తక్కిన ఏర్పాట్లు ఎలా చేయించాలో తనకు విశదీకరించినట్లు హృదయ్ తెలియచేశాడు. తరువాత హృదయ్ శ్రీశ్రీ దుర్గాపూజ నిర్వర్తించడానికి మహదానందంతో ఇంటికి బయలుదేరాడు.

20. హృదయ్‌కు శ్రీరామకృష్ణుల దర్శనం

హృదయ్ ఇంటికి వెళ్ళి శ్రీరామకృష్ణుల సూచనల మేరకు అన్ని ఏర్పాట్లూ చేసుకొన్నాడు. అలా షష్ఠి రోజున దేవి ప్రతిష్ఠ, మేలుకొలుపు మొదలైన క్రియలు పూర్తి చేసుకొని స్వయంగా పూజావ్రతాన్ని చేపట్టాడు. సప్తమి పూజ సాంగోపాంగంగా పూర్తయింది. రాత్రివేళ దేవికి హారతి ఇస్తూ ఉన్నప్పుడు దివ్యజ్యోతిర్మయ దేహంతో దేవీప్రతిమ ప్రక్కన శ్రీరామకృష్ణులు భావావిష్టులై నిలబడి ఉండడం హృదయ్ చూశాడు. అలా ప్రతిరోజూ రాత్రి హారతి సమయంలో, సంధిపూజాకాలంలో (అష్టమి, నవమి తిథుల సంధికాలం విశేష శుభకాలంగా పరిగణింపబడి శ్రీశ్రీ దుర్గాదేవికి ప్రత్యేక పూజ జరుపబడుతుంది) శ్రీరామకృష్ణుల దివ్యదర్శనం పొంది, శ్రీశ్రీ దుర్గాపూజ మహోత్సాహంతో నిర్వర్తింపబడినదని హృదయ్ మాకు తెలిపాడు. దుర్గాదేవి ఉత్సవం పూర్తిచేసిన కొన్ని రోజులకే హృదయ్ దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చి జరిగినదంతా శ్రీరామకృష్ణులకు నివేదించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు అతడితో ఇలా అన్నారు: ''హారతి, సంధిపూజా సమయాలలో నీ పూజను చూడాలని గొప్ప ఆకాంక్ష కలిగేది. భావపారవశ్య స్థితిలోకి వెళ్ళిపోయేవాడిని.

జ్యోతిర్మయ దేహం దాల్చి జ్యోతిర్మయ మార్గం గుండా నీ పూజామండపానికి వెళ్ళినట్లు అనుభూతి చెందాను.''

శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితిలో ఒకసారి, ''నువ్వు ఏటా జరిపే శ్రీశ్రీ దుర్గాపూజ మూడుసార్లు చేస్తావు'' అని భవిష్యద్వాణి పలికారు. అది అక్షర

21. దేవీనవరాత్రోత్సవ కడపటి సందర్భం

సత్యమైంది. శ్రీరామకృష్ణుల వాక్కులను పెడచెవిన పెట్టి హృదయ్ నాలుగవసారి శ్రీశ్రీ దుర్గాపూజ చేయ పూను కొన్నప్పుడు ఒకటి వెంట ఒకటిగా ఎన్నో విఘ్నాలు ఎదురయ్యేసరికి ఆ ప్రయత్నం విరమించాడు. మొదటి సంవత్సరం పూజ జరిగిన కొద్దికాలంలోనే హృదయ్ పునర్వివాహం చేసుకొని, మునుపటిలా దక్షిణేశ్వర కాళికాలయంలో ఉంటూ శ్రీరామకృష్ణులను సేవించడంలో నిమగ్నుడయ్యాడు.

19. బంధు వియోగం

శ్రీరామకృష్ణుల పెద్ద అన్నగారైన రామ్‌కుమార్ కుమారుడు అక్షయ్ గురించి పాఠకులకు ఒకింత పరిచయం ఇంతకు మునుపే చేశాం. పూజ్య తోతాపురి దక్షిణేశ్వరానికి అరుదెంచిన స్వల్పకాలానికే, 1865వ సం॥లో అక్షయ్ కూడా అక్కడకు చేరుకొన్నాడు. రాధాకాంత ఆలయంలో అతడు అర్చకుడిగా నియమితుడయ్యాడు. అప్పుడు అక్షయ్ వయస్సు దాదాపు పదిహేడు ఏళ్ళు. అతణ్ణి గురించి కొంత ఇక్కడ తెలియ చేయడం అవసరం.

1. అక్షయ్ వృత్తాంతం

పుట్టగానే తల్లి మరణించడంతో తల్లిలేని ఆ బిడ్డడు కుటుంబంలోని అందరికీ విశేష ప్రీతిపాత్రుడయ్యాడు. 1852వ సం॥లో శ్రీరామకృష్ణులు మొదటిసారి కలకత్తాకు వచ్చినప్పుడు అక్షయ్ మూడు లేక నాలుగేళ్ళవాడు కాబట్టి అక్షయ్‌ను తన ఒడిలోకి తీసుకొని లాలించే అవకాశం శ్రీరామకృష్ణులకు కలకత్తాకు రాక పూర్వం లభించింది. కాని రామ్‌కుమార్ మాత్రం ఎన్నడూ తన బిడ్డను ఒడిలోకి తీసుకోలేదు. అందుకు కారణం ఏమిటని అడిగినప్పుడు రామ్‌కుమార్, ''మమకారం పెంచుకోవడం వృథా. ఈ బిడ్డ ఎక్కువ కాలం జీవించడు'' అని జవాబు చెప్పేవాడు. తరువాత తనను, ప్రపంచాన్నీ మరచిపోయి సాధనానుష్ఠానాలలో శ్రీరామకృష్ణులు లీనమైపోయారు. అప్పటికి అక్షయ్ బాల్యావస్థను దాటి అందమైన యువకుడిగా పెరిగి పెద్దవాడయ్యాడు.

అక్షయ్ అమిత అందగాడని శ్రీరామకృష్ణులు, ఆయన బంధువుల నుంచి విని ఉన్నాం. అతడి మేనిఛాయ ప్రకాశవంతంగాను, శరీర సౌష్ఠవం సుకుమారం గాను ఉండేదని వారు చెప్పారు. సజీవ శివుని రూపు సంతరించుకొన్నట్లుగా కనిపించేవాడట.

2. అక్షయ్ సౌందర్యం

చిన్ననాటి నుండి శ్రీరామచంద్రుని పట్ల అక్షయ్ మహాభక్తి కలిగి ఉన్నాడు. తమ కులదైవమైన శ్రీ రఘువీరుని సేవలో అనునిత్యం ఎంతో సమయం గడిపేవాడు. కాబట్టి దక్షిణేశ్వరంలోని రాధాకాంత ఆలయ పూజారిగా నియుక్తుడవడం అతడి మనస్సుకు ఎంతో నచ్చింది. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: "శ్రీరాధా గోవిందుల పూజ నిర్వర్తిస్తున్నప్పుడు అక్షయ్ ఎంత ప్రగాఢధ్యానంలో నిమగ్నుడైపోయేవాడంటే, ఆలయంలోకి ఆ సమయంలో వచ్చేపోయే జనసమూహం గురించి అతడికి ఎరుకే ఉండేది కాదు. రెండు గంటలు గడిచిన తరువాత మాత్రమే అతడు బాహ్య స్పృహలోకి వచ్చేవాడు." ఆలయంలో దైనందిన పూజ నిర్వర్తించి పంచవటికి వెళ్ళి, అక్కడ చాలాసేపు శివ పూజలో గడిపేవాడని హృదయ్ నుంచి మేం విని ఉన్నాం. పిదప స్వయంగా వంట చేసుకొని భోజనం చేసి, భాగవత పఠనంలో నిమగ్నుడయ్యేవాడు. అంతేగాక భగవత్ప్రేమకై జనించిన విమూత్న ప్రేరణతో అతడు కంఠంలో, అంగిలిలో అప్పుడప్పుడు రక్తం వచ్చి, వాచేటంత అధికంగా న్యాసాన్ని, ప్రాణాయామాన్ని ఒనరించేవాడు. అంతటి భక్తి, భగవత్ప్రేమలు గల అక్షయ్ శ్రీరామకృష్ణులకు విశేష ప్రేమపాత్రుడు కావటంలో ఆశ్చర్యం లేదు.

3. సాధన పట్ల అక్షయ్ భక్తిప్రపత్తి

కొన్నేళ్ళు గడిచాయి. అప్పుడు 1869వ సంవత్సరాంత సమయం. అక్షయ్ ఈ మనోప్రవృత్తి గురించి తెలుసుకొన్న అతడి పినతండ్రి రామేశ్వర్, ఈ మనోవైఖరిని నిరోధింప అక్షయ్‌కు వధువును వెదుకసాగాడు. కామార్పుకూర్‌కు మరీ దూరంలో లేని కూచ్‌కోల్ గ్రామంలో అనుకూలమైన వధువు లభించగానే అక్షయ్‌ను తోడ్కొని పోవడానికి రామేశ్వర్ దక్షిణేశ్వరానికి వచ్చాడు. అది చైత్రమాసం. వారి ప్రయాణానికి ఆ మాసం అశుభమని ఆక్షేపాలు లేవదీసినప్పటికీ రామేశ్వర్, అక్షయ్‌లు పెడచెవినబెట్టారు. పరాయి ఊళ్ళో తాత్కాలికంగా వసిస్తూ స్వగ్రామానికి బయలుదేరడంలో ఈ శాస్త్రనిషేధం వర్తించదని చెప్పి వారు ప్రయాణం కట్టారు. ఇంటికి తిరిగి వెళ్ళిన స్వల్పకాలంలోనే, 1869వ సం॥ వైశాఖ మాసంలో అక్షయ్ వివాహం జరిగింది.

4. అక్షయ్ వివాహం

వివాహమైన కొన్ని నెలల తరువాత అత్తవారి ఇంట్లో ఉన్నప్పుడు అక్షయ్ తీవ్ర వ్యాధిగ్రస్తు డయ్యాడు. ఆ సమాచారం తెలియగానే రామేశ్వర్ అతణ్ణి కామార్పుకూర్‌కు తోడ్కొనివచ్చి చికిత్స చేయించసాగాడు. అక్షయ్ కాస్త కోలుకొన్నాడు. తరువాత అతణ్ణి దక్షిణేశ్వరానికి పంపటం జరిగింది. అక్కడ అతడి దృక్కులు ప్రకాశవంతమై ఆరోగ్యం మెరుగుపడుతున్నట్లు కనిపించింది. కాని

5. వివాహానంతరం అక్షయ్ తీవ్రవ్యాధిగ్రస్తు డవడం

హఠాత్తుగా ఒకరోజు అక్షయ్ జ్వరపీడితుడయ్యాడు. వైద్యులు అది సాధారణమైన జ్వరంగా భావించి త్వరలోనే తగ్గుతుందని చెప్పారు.

వివాహానంతరం స్వల్పకాలంలోనే అక్షయ్ అత్తవారి ఇంట్లో వ్యాధిగ్రస్థుడయ్యాడని తెలుసుకొన్న శ్రీరామకృష్ణులు ఇలా అన్నారని హృదయ్ నుంచి మేం విన్నాం: "హృదూ! శకునాలు ఏమీ బాగోలేవు. రాక్షస గణానికి చెందిన వధువుతో అక్షయ్‌కు వివాహం జరిగింది. పిల్లవాడు బ్రతకడని భయపడుతున్నాను." అక్షయ్‌కు తిరగబెట్టిన జ్వరం మూడు నాలుగు రోజులకు కూడా తగ్గుముఖం పట్టకపోవడంతో ఆయన హృదయ్‌ను పిలిచి ఇలా అన్నారు: "హృదూ! వైద్యులు రోగ నిర్ధారణ చేయలేకపోతున్నారు. అక్షయ్‌ది జటిలమైన, తీవ్రజ్వరమై ఉంటుంది. నీ తృప్తికోసంమంచి వైద్యుణ్ణే రప్పించి చికిత్స చేయించు. కాని పిల్లవాడు నిశ్చయంగా బ్రతకడనిపిస్తోంది."

6. అక్షయ్ బ్రతకడని శ్రీరామకృష్ణులు చెప్పిన భవిష్యవాణి

హృదయ్ ఇలాచెప్పాడు: "ఆయన అలా చెప్పగా విని, ఆయనను నిలదీసి, 'మామా! అలా మాట్లాడవద్దు. నీ నోటి నుండి అలాంటి పలుకులు రానివ్వకు' అన్నాను. అందుకు ఆయన, 'కావాలని నే నలా అంటున్నానా? దైవీ ప్రభావంతో అప్రయత్నంగా నా నోరు అలా పలుకుతున్నది. జగజ్జనని నాకు ఏం తెలుపుతుందో, ఏం చెప్పమంటుందో అదే నేను పలుకుతాను. అక్షయ్ మరణించాలని నేను కోరుకొంటానా?' "

7. హృదయ్ దడుపు, ప్రవర్తన

శ్రీరామకృష్ణుల ఈ మాటలతో హృదయ్ భయభీతుడైనాడు. మంచి వైద్యులను పిలిపించి అక్షయ్‌కు నానావిధాల చికిత్స చేయించసాగాడు. కాని రోగం విషమించసాగింది. దాదాపు ఒక నెల రోజులు అక్షయ్ బాధపడ్డాడు. అక్షయ్ అంతిమక్షణాలు సమీపించినవని గ్రహించి శ్రీరామకృష్ణులు అతడి శయ్య వద్దకు వెళ్ళి, "అక్షయ్! 'గంగా, నారాయణా, ఓం రామా' అని ఉచ్చరించు" అన్నారు. అక్షయ్ ఒకటి, రెండు, మూడు సార్లు ఆ మంత్రాన్ని ఉచ్చరించి తుదిశ్వాస విడిచాడు. అక్షయ్ మరణించగానే హృదయ్ ఎంత హృదయవిదారకంగా విలపించాడో శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో అంతగా నవ్వారని హృదయ్ నుండి మేము విన్నాం.

8. అక్షయ్ మరణం: శ్రీరామకృష్ణుల ప్రవర్తన

ప్రియతముడూ, పుత్రసమానుడూ అయిన అక్షయ్ మరణాన్ని ఉన్నత భావభూమి నుండి వీక్షించి శ్రీరామకృష్ణులు ఆ విధంగా నవ్వసాగినా ఆయన హృదయంలో ఆ సంఘటన ఆఘాతం కలిగించలేదని చెప్పటం సబబు కాదు. చాలా కాలం తరువాత ఈ సంఘటన గురించి ఆయన మాతో పలుమార్లు

9. అక్షయ్ మరణం పట్ల శ్రీరామకృష్ణుల మనోక్లేశం

ప్రస్తావించారు. భావపారవశ్యంలో తాను మరణాన్ని ఒక అవస్థ నుండి మరొక అవస్థకు మారటంగా పరిగణించినప్పటికీ, బాహ్యచైతన్యంలోకి దిగివచ్చినప్పుడు అక్షయ్ మరణం తనలో మహాశూన్యాన్ని కల్పించిందని శ్రీరామకృష్ణులు చెప్పేవారు.[1] అక్షయ్ మరణానంతరం శ్రీరామకృష్ణులు మరెన్నడూ మథుర్‌బాబు భవంతిలో నివసించలేదు. అక్షయ్ ఆ భవంతిలోనే మరణించడం అందుకు కారణం.

అక్షయ్ మరణానంతరం శ్రీరామకృష్ణుల చిన్న అన్నగారైన రామేశ్వర్ రాధాగోవింద ఆలయ పూజారిగా నియుక్తుడయ్యాడు. కామార్పుకూర్‌లోని కుటుంబ బాధ్యత అంతా అతడిదే కావటం చేత రామేశ్వర్ సదా సర్వవేళలా దక్షిణేశ్వరంలో ఉండలేక పోయేవాడు. అర్హుడూ, విశ్వసనీయుడూ అయిన వ్యక్తికి తన అర్చక విధులను అప్పగించి రామేశ్వర్ అప్పుడప్పుడు కామార్పుకూర్‌కు వెళ్ళి కొన్నాళ్ళు అక్కడ గడిపేవాడు. రామచంద్ర ఛటోపాధ్యాయ, దీనానాథ్ అనే ఇద్దరు వ్యక్తులు రామేశ్వర్ స్థానే పూజాదికాలు నిర్వర్తించేవారని మేము వినివున్నాం.

10. పూజారిగా రామేశ్వర్ నియామకం

ఈ కాలఘట్టంలోనే శ్రీరామకృష్ణులను తోడ్కొని మథుర్‌బాబు తన జమీకి, తన స్వీయ గురువు ఇంటికి వెళ్ళటం జరిగింది. అక్షయ్ మరణంతో శ్రీరామకృష్ణులకు కలిగిన మనస్తాపాన్ని ఉపశమింప మథుర్ బహుశా ఇలా చేసివుండవచ్చు. ఎందుకంటే: పరమభక్తుడైన మథుర్ ఒక వంక శ్రీరామకృష్ణులను సాక్షాత్తు భగవంతునిగా ఎంచి ఆధ్యాత్మిక విషయాలన్నిటిలో ఆయన సూచనలు పాటించేవాడు. మరొక వంక లౌకిక విషయాలన్నిటిలో ఆయనను అమాయక బాలునిగా ఎంచి అన్ని విధాల ఆయనను సంరక్షించే బాధ్యత తనదిగా భావించేవాడు. ఈ ప్రయాణంలో ఒక ఫలానా గ్రామంలోని స్త్రీ పురుషుల దయనీయ స్థితిని చూసి శ్రీరామకృష్ణులు ఎంతగానో చలించిపోయారు. వారినందరినీ ఆహ్వానించి తలకు రాచుకోవడానికి చమురు, ఒక కొత్త వస్త్రం, కడుపారా తిండి మథుర్ చేత ఇప్పించారు శ్రీరామకృష్ణులు. రాణాఘాట్‌కు సమీపంలోని కళాయ్‌ఘాట్ అనే చోట, చూర్ణీ కాలువలో మథుర్ శ్రీరామకృష్ణులతో నౌకావిహారం చేస్తూన్నప్పుడు ఈ సంఘటన జరిగిందని హృదయ్ తెలిపాడు.

11. మథుర్‌తో రాణాఘాట్‌లో శ్రీరామకృష్ణులు - దరిద్రనారాయణ సేవ

'సత్‌క్షీర' అనే ప్రదేశానికి సమీపంలోని 'సోనాబేడే' అనే గ్రామంలో మథుర్ పూర్వీకుల గృహం ఉందని హృదయ్ మాకు చెప్పాడు. ఈ గ్రామానికి చుట్టు

---

1. గురుభావం, పూర్వార్థం III.1.24

ప్రక్కల గ్రామాలు మథుర్ జమీకి చెందినవి. శ్రీరామకృష్ణులను తన జమీకి

12. మథుర్ పూర్వీకుల గృహంలో శ్రీరామకృష్ణులు

మథుర్ తోడ్కొని వెళ్ళాడు. మథుర్ కుల గురువు ఇల్లు ఈ ప్రాంతానికి అనతిదూరంలోనే ఉంది. ఆ సమయంలో గురువు కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి పంపకాల విషయంలో కొట్లాట జరుగుతోంది. ఆస్తి పంపకాల విషయంలో మథుర్‌ను మధ్యవర్తిగా వ్యవహరించమని వారు కోరారు. ఆ గ్రామం పేరు తాలామగ్రో. ఆ గ్రామానికి పోతున్నప్పుడు శ్రీరామకృష్ణులను, హృదయ్‌ను తన ఏనుగు అంబారీ మీద కూర్చోబెట్టి, మథుర్ పల్లకీలో కూర్చున్నాడు.[1] మథుర్ గురువు పుత్రులు ప్రేమాదరాలతో సేవించడం చూసి శ్రీరామకృష్ణులు ఆనందభరితులై కొన్ని వారాలు అక్కడే గడిపిన తర్వాత దక్షిణేశ్వరానికి తిరిగివచ్చారు.

దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చిన అనతికాలంలోనే శ్రీరామకృష్ణులకు సంబంధించి కలకత్తాలోని 'కలుటోలా' అనే పేటలో ఒక విశేష సంఘటన జరిగింది.

13. 'కలుటోలా' హరిసభలో, కాల్నా, నవద్వీపాది ప్రాంతాలలో శ్రీరామకృష్ణులు

ఈ పేటలోని కాళీనాథ్ దత్తా లేదా కాళీనాథ్‌ధర్ అనే వ్యక్తి ఇంట్లో హరిసభ జరుగుతూ ఉండేది. (హరినామ సంకీర్తన జరుపుకొనే సమావేశాన్నే హరిసభ అంటారు) ఆ సభకు ఆహ్వానితులైన శ్రీరామకృష్ణులు అక్కడకు వెళ్ళి భావపారవశ్యంలో శ్రీచైతన్యుల ఆసనం (సంకీర్తన జరుగుతున్నప్పుడు శ్రీ చైతన్యుల గౌరవార్థం ప్రత్యేకంగా కేటాయించిన ఆసనం) మీద కూర్చున్నారు. ఈ సంఘటన గురించి విపులంగా మరొకచోట[2] వర్ణించాం. ఈ సంఘటన జరిగిన అనతికాలంలోనే శ్రీరామకృష్ణులకు నవద్వీప్ సందర్శించాలనే ఆకాంక్ష జనించింది. మథుర్ బాబు ఆయనను కాల్నా, నవద్వీప్ మరికొన్ని ప్రదేశాలకు తోడ్కొని వెళ్ళాడు. కాల్నాలో శ్రీరామకృష్ణులు, భగవాన్‌దాస్ బాబాజీ అనే ఉత్తమ వైష్ణవ భక్తుని కలుసుకోవడం, నవద్వీపంలో ఆయన పొందిన అద్భుత దర్శనం గురించిన వివరాలు మరొకచోట పొందుపరిచాం.[3] ఈ పవిత్ర స్థలాలను శ్రీరామకృష్ణులు బహుశా 1870లో సందర్శించి ఉంటారు. నవద్వీపంలో ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు ప్రగాఢ భావత్ ఉద్దీపనం చెందలేదు. కాని నవద్వీపం సమీపంలోని

---

1. గతుకుల బాట కావడం చేత గ్రామానికి వెళ్ళేటప్పుడు శ్రీరామకృష్ణులను పల్లకీలో ఆసీనులను చేసి మథుర్ ఏనుగు నెక్కి పయనించాడనీ, కానీ గ్రామం సమీపంలో శ్రీరామకృష్ణుల కుతూహలాన్ని తీర్చడానికి ఆయనను ఏనుగు అంబారీపై కూర్చోబెట్టాడని హృదయ్ చెప్పాడు.
2. గురుభావం, ఉత్తరార్థం IV.3.32
3. గురుభావం, IV.3.32

గంగాతీరపు ఇసుక దిబ్బల మీదుగా వెళుతూ ఉన్నప్పుడు ప్రగాఢ భగవత్ ఉద్దీపనం పొందారు. మథుర్ మొదలైనవారు ఇందుకు కారణం ఏమిటని అడిగారు. చైతన్యుల లీలాస్థానమైన ప్రాచీన నవద్వీపం కాలాంతరంలో నదిలో మునిగి పోయింది. ఆ లీలాస్థానాలపై ఇసుక మేటవేసి ఈ దిబ్బలు రూపొందాయి. అందుచేతనే ఆ దిబ్బల మీదుగా పోతున్నప్పుడు తనకు ప్రగాఢ భగవదుద్దీపన కలిగిందని శ్రీరామకృష్ణులు వివరించారు.

14. మథుర్‌బాబు నిస్స్వార్థ భక్తిప్రపత్తులు

పధ్నాలుగు సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు నిరంతరాయంగా శ్రీరామ కృష్ణులకు సేవలు ఒనరించాడు మథుర్‌బాబు. అతడి మనస్సు ఎంత స్వార్థరహితమైనదో చాటిచెప్పే హృదయ్ తెలిపిన ఒక ఉదంతాన్ని ఇక్కడ ప్రస్తావించడం అసంగతం కాబోదు.

ఒకసారి మథుర్‌బాబు శరీరపు కీలు ఒకదాన్లో కురుపు లేచి అతడు పడక బెట్టాడు. శ్రీరామకృష్ణులను చూడాలనే మథుర్‌బాబు ఆతురతను ఎరిగిన హృదయ్, శ్రీరామకృష్ణులకు ఆ విషయం తెలిపాడు. కాని శ్రీరామకృష్ణులు, ''నేను వెళ్ళి ప్రయోజనం ఏమిటి? ఆ కురుపును నయం చేయగలనా ఏమిటి?'' అన్నారు. శ్రీరామకృష్ణులు రాకపోవడం చూసి మథుర్ ఒకరి వెంట ఒకరినిగా దూతలను ఆయన వద్దకు పంపి, తన మనోవాంఛితాన్ని తెలియపరిచాడు. ఈ ప్రార్థనలను మన్నించి శ్రీరామకృష్ణులు అతడి వద్దకు వెళ్ళారు. శ్రీరామకృష్ణు లను చూడగానే మథుర్ ఆనందం అవధులు దాటింది. అతికష్టంతో లేచి దిండ్లను ఆనుకొని కూర్చుని, ''బాబా! కాస్త మీ పాదధూళిని ప్రసాదించండి'' అన్నాడు మథుర్.

అందుకు శ్రీరామకృష్ణులు, ''నా పాదధూళితో నీకు ఏం ఒనగూరు తుంది? నీ కురుపును అది నయం చేస్తుందా?'' అని అడిగారు.

ఆ మాటలకు మథుర్, ''బాబా! నే నంత నీచుడనా? నా కురుపు నయం కోసమా నీ పాదధూళిని కోరుతున్నాను? దాని కోసం వైద్యులు ఉన్నారు. భవ సాగరాన్ని దాటగోరే నీ శ్రీచరణ ధూళిని అర్థిస్తున్నాను'' అని అన్నాడు.

అతడి మాటలు విన్న మరుక్షణమే శ్రీరామకృష్ణులు భావపారవశ్యం చెందారు. మథుర్ తన తలను శ్రీరామకృష్ణుల పాదాలమ్రోల వాల్చి ధన్యుడనైనట్లు భావించాడు. అతడి కళ్ళ వెంట ఆనందాశ్రువులు ప్రవహించాయి. ఇది జరిగిన అనతికాలంలోనే మథుర్ స్వస్థుడయ్యాడు.

ఆ కాలంలో శ్రీరామకృష్ణుల పట్ల మథుర్‌కు గల ప్రగాఢ భక్తి విశ్వాసాలను సూచించే అనేక విషయాలను శ్రీరామకృష్ణుల నుంచి, హృదయ్ నుంచి మేం విని ఉన్నాం. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇహపరాలలో గతి, ఆశ్రయం ఆయనే అనే

దృఢ విశ్వాసం మథుర్‌కు కలిగింది. అలాగే మథుర్ పట్ల శ్రీరామకృష్ణుల అనుగ్రహం కూడా ఎల్లలెరుగనిదే. స్వతంత్ర చిత్తులైన శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు మథుర్ చర్యలు కొన్నిటి పట్ల విసుగు చెందినా వెంటనే వాటిని మరచిపోయి, అతడి ప్రార్థనలన్నిటినీ మన్నించేవారు. అతడి ఇహపర శ్రేయస్సు కోసం ప్రయత్నించేవారు. శ్రీరామకృష్ణుల, మథుర్‌ల నడుమ పెనగొనివున్న ప్రగాఢ అనురాగబంధాన్ని ఈ క్రింది వృత్తాంతం స్పష్టం చేస్తుంది.

15. మథుర్, శ్రీరామకృష్ణుల పరస్పర ప్రేమ, ఆరాధన

భావపారవశ్యంలో ఒకసారి శ్రీరామకృష్ణులు, ''ఓ మథుర్! నువ్వు జీవించి ఉన్నంత వరకు నేను ఇక్కడ (దక్షిణేశ్వరంలో) ఉంటాను'' అన్నారు. ఆ మాటలు విని మథుర్ ఉలికిపడ్డాడు. ఎందుకంటే సాక్షాత్తూ జగజ్జనని శ్రీరామకృష్ణుల రూపంలో తననూ, తన కుటుంబాన్నీ సంరక్షిస్తోందని అతడికి బాగా తెలుసు. కాబట్టి ఆయన మాటలను బట్టి తన మరణానంతరం శ్రీరామకృష్ణులు తన కుటుంబాన్ని వదలి వేసి పోతారని మథుర్ భావించాడు. పిదప అతి వినమ్రంగా శ్రీరామకృష్ణులతో, ''అదేమిటి బాబా! నా భార్య, నా కుమారుడు ద్వారికానాథ్ కూడా నీ ఎడ అత్యంత భక్తిప్రపత్తులు ఉన్నవారే కదా!'' అన్నాడు. మథుర్ చింతించడం చూసి శ్రీరామకృష్ణులు, ''మంచిది. నీ భార్య, ద్వారి (ద్వారకానాథ్) జీవించి ఉన్నంత వరకు నేను ఇక్కడే ఉంటాను'' అన్నారు. వాస్తవానికి అలాగే జరిగింది. జగదంబాదాసి, ద్వారకానాథ్‌లు మరణించిన అనతికాలంలోనే శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరాన్ని విడిచిపెట్టారు. జగదంబాదాసి 1881వ సం॥లో మరణించింది.[1] ఆమె మరణానంతరం మూడేళ్ళ కన్నా ఒకింత ఎక్కువ కాలం మాత్రమే శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో ఉండడం తటస్థించింది.

16. ఒక వృత్తాంతం

మరో సందర్భంలో మథుర్ శ్రీరామకృష్ణులతో ఇలా అన్నాడు: ''బాబా! నీ భక్తులు పలువురు వస్తారని చెప్పావే! కాని వాళ్ళు ఎక్కడ? ఎవరూ రాలేదే?'' అందుకు శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''జగజ్జనని వారిని ఎప్పటికి తోడ్కొని వస్తుందో నాకు తెలియదు. కాని భక్తులు వస్తారని అమ్మే స్వయంగా వెల్లడించింది. నాకు ఆమె తెలియచేసిన వన్నీ ఒక్కటొక్కటిగా నిజమయ్యాయి. ఇది ఎందుకు నిజం కాలేదో ఎవరికి ఎరుక?'' ఇలా అంటూ శ్రీరామకృష్ణులు ఖిన్నులై తనకు కలిగిన ఆ దర్శనం

17. మరో వృత్తాంతం

---

1. ''జగదంబాదాసి వీలునామా రాయకుండా అప్పటికి సజీవుడైన మథురుని ఏకైక కుమారుడూ, ప్రతివాదియైన త్రైలుక్షుని వారసునిగా వదలి, 1881వ సం॥ జనవరి 1వ తేదీ →

భ్రాంతి ఏమో అని భావించారు. ఆయన అలా ఖిన్నులవడం చూసి మథుర్ బాధపడి ఆ ప్రస్తావన లేవనెత్తడం తన అవివేకంగా భావించాడు. బాలక స్వభావులైన శ్రీరామకృష్ణులను ఊరడించే ఉద్దేశంతో మథుర్ ఇలా అన్నాడు: ''బాబా! వాళ్ళు వస్తే వస్తారు, లేకుంటే లేదు. సర్వదా విధేయతతో మిమ్మల్ని సేవిస్తున్న మీ భక్తుణ్ణి నేను ఇక్కడున్నాను. అలాంటప్పుడు భక్తుల గురించిన నీ దర్శనం ఎలా అసత్యం అవుతుంది? మరి నే నొక్కడినే వందమంది భక్తుల పెట్టు. అందుకే జగజ్జనని అనేకమంది భక్తులు వస్తారని చెప్పింది.'' అందుకు శ్రీరామకృష్ణులు, ''నువ్వు చెబుతున్నదే నిజం కావచ్చు; ఎవరికి తెలుసు?'' అన్నారు. మథుర్ ఈ ప్రస్తావనను ఇక పొడిగించలేదు. మరో విషయం ప్రస్తావించి శ్రీరామకృష్ణుల మనస్సును మళ్ళించాడు.

18. నిస్వార్థ భక్తిపై శాస్త్రవాక్యం

సతతం శ్రీరామకృష్ణుల సాంగత్య లబ్ధిని పొందిన మథుర్‌బాబు మనోభావాలలో ఎంత గొప్ప మార్పులు ఉత్పన్నమైనవో 'గురుభావం' అనే విభాగంలో పాఠకులకు తెలియజేశాం. జీవన్ముక్తులను సేవించి భాగ్యం పొందిన వ్యక్తికి ఆ మహాపురుషులు ఒనరించిన పుణ్యకర్మల సత్ఫలాలన్నీ లభిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. అలాంటప్పుడు అవతార పురుషుల సేవకులకు నానా దైవీసంపత్తులు, సద్గుణాలు అబ్బడం విచిత్రమా!

19. మథుర్‌బాబు కాలధర్మం

కలిమిలేములు, సుఖదుఃఖాలు, సంయోగ వియోగాలు, జీవన మరణాలనే అవిరామ ద్వంద్వ తరంగయుత కాలప్రవాహం ఈ ప్రపంచాన్ని క్రమంగా 1871వ సంవత్సరానికి తీసుకువచ్చింది. సంవత్సరాలు దొర్లేకొద్దీ గాఢతరమవుతున్న శ్రీరామకృష్ణ - మథుర్‌ల దివ్యసంబంధం పదిహేనవ సం॥లోకి అడుగిడింది. వైశాఖ మాసం గడిచింది, జ్యేష్ఠమూ వెళ్ళిపోయింది; ఆషాఢంలో సగం రోజులు దొర్లిపోయాయి. ఆ సమయంలో జ్వరంతో మథుర్ మంచంపట్టాడు. ఆ జ్వరం సత్వరం ఉద్ధృతమై, జటిలమై, ఎడతెగనిదిగా మారింది. వారంరోజుల్లో మథుర్ మాట పడిపోయింది. మథుర్‌బాబు భక్తివ్రతం పరిసమాప్తికి వచ్చిందనీ, జగజ్జనని తన భక్తుణ్ణి తన ఒడిలోకి తీసుకోనున్నదనీ శ్రీరామకృష్ణులకు ముందుగానే తెలుసు. అందుచేతనే మథుర్‌ను పలుకరించడానికి నిత్యం హృదయ్‌ను పంపుతున్నప్పటికీ ఆయన స్వయంగా మథుర్‌ను చూడటానికి ఒక్కసారి కూడా వెళ్ళ

→

లేక ఆ తేదీకి అటూ ఇటూ తేదీలలో మరణించింది.'' - హైకోర్ట్ దావా నెం *203, 1889* లోని వాది వాఙ్మూలం (త్రైలుక్ - మథుర్‌నాథ్ రెండవ కుమారుడైన త్రైలోక్యనాథ్ సంక్షిప్త నామం)

లేదు. అంతిమ దినం రానేవచ్చింది. మథుర్‌ను కాళీఘాట్‌కు తరలించారు. ఆ రోజు శ్రీరామకృష్ణులు, హృదయ్‌ను కూడా పంపించలేదు. కాని మధ్యాహ్నం రెండు మూడు గంటలసేపు ప్రగాఢ భావపారవశ్య స్థితిలో మగ్నులైపోయారు. శరీరం దక్షిణేశ్వరంలో ఉండగా, శ్రీరామకృష్ణులు దివ్యదేహంతో జ్యోతిర్మయ మార్గంలో తన భక్తుడైన మథుర్ వద్దకు వెళ్ళి అతణ్ణి కృతార్థుణ్ణి చేసి, స్వయంగా మహాపుణ్యలోకాలు అతడికి ప్రాప్తింపజేశారు.

20. భావసమాధిలో శ్రీరామకృష్ణులు ఆ సంఘటన తిలకించడం

సాయంత్రం ఐదు గంటల తరువాత శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితి నుండి దిగివచ్చారు. వెంటనే హృదయ్‌ను పిలిచి, ''జగజ్జనని చెలికత్తెలు మథుర్‌ను ఆప్యాయంగా దివ్యరథంలో ఆసీనుని చేసి తీసుకువెళ్ళారు. అతడి ఆత్మ దేవీలోకానికి వెళ్ళింది'' అని చెప్పారు. ఈ మాటలు విని హృదయ్ మౌనంగా ఉండి పోయాడు. రాత్రి బాగా పొద్దుపోయాక దక్షిణేశ్వర ఆలయ అధికారులు తిరిగి వచ్చి మథుర్ సాయంత్రం ఐదు గంటలకు మరణించాడనే[1] సమాచారం హృదయ్‌కు చెప్పారు. ఈ రీతిలో దేవలోకాలకు వెళ్ళినా, ప్రాపంచిక భోగ వాసనలు ఇంకా సమసిపోనందున పరమభక్తుడైన మథురామోహన్[2] ఈ మర్త్యలోకానికి మళ్ళీ తిరిగి రావలసి ఉంటుందన్న సంగతిని మరో సందర్భంలో శ్రీరామకృష్ణులు చెప్పగా మేం విన్నాం. ఈ విషయం పాఠకులకు మరోచోట[3] విశదపరిచాము.

---

1. ''మథుర్ మోహన్ విశ్వాస్ వీలునామా వ్రాయకుండా వితంతువైన తన భార్య జగదంబాదాసిని విడిచి 1871వ సం॥లో మరణించాడు. అతడి మొదటి భార్య, ఆమెకు జన్మించిన భూపాల్ - వీరిద్దరూ అంతకు మునుపే మరణించారు. అంతకు క్రితమే మరణించిన ద్వారకానాథ్ విశ్వాస్, ప్రతివాదులైన త్రైలుక్‌నాథ్, ఠాకూర్‌దాస్ ఉరఫ్ ధర్మాదాస్ ఈ ముగ్గురూ పైన పేర్కొన్న జగదంబాదాసికి జన్మించిన కుమారులు.''

- హైకోర్టు దావాలో వాది వాఙ్మూలం నుండి గ్రహితం. కేసు నెం. 230, 1889వ సం॥ - శ్యామాచరణ్ విశ్వాస్ వర్సెస్ త్రైలుక్‌నాథ్ విశ్వాస్, గురుదాస్, కాళిదాస్, దుర్గాదాస్, కుముదిని.

2. మథురామోహన్, మథురానాథ్, మథుర్‌బాబు - ఇవన్నీ మథుర్ నామాంతరాలు.

3. గురుభావం, పూర్వార్థం III.7.39

20. షోడశీ పూజ

1. వివాహానంతరం మొట్ట మొదటిసారి శ్రీరామకృష్ణులతో మాతృ దేవి సమావేశం

మథుర్ గతించాడు. కానీ దక్షిణేశ్వర కాళికాలయంలోని జీవన వాహిని మునుపటి మాదిరే సాగిపోతోంది. రోజులు, నెలలు గడిచి పోయి 1872వ సంవత్సరం ఫాల్గుణ మాసం అరుదెంచింది. శ్రీరామకృష్ణుల జీవితంలో ఆ సమయంలో ఒక అతి విశేష సంఘటన జరిగింది. ఈ ప్రత్యేక సంఘటనకు దారితీసిన సంఘటనల పరంపరను అర్థం చేసుకోవడానికి జయరాంబాటీలోని శ్రీరామకృష్ణుల అత్తగారింటికి మన దృష్టిని ఇప్పుడు సారించాలి.

భైరవీ బ్రాహ్మణి, హృదయ్‌లను తోడ్కొని 1867వ సంవత్సరం శ్రీరామకృష్ణులు తమ స్వగ్రామమైన కామార్పుకూర్‌కు వెళ్ళినప్పుడు బంధుగణంలోని స్త్రీలు ఆయన భార్యను అక్కడకు రప్పించిన విషయం ఇంతకు మునుపే తెలిపాం. నిజానికి వివాహానంతరం మాతృదేవి మొట్టమొదటిసారిగా భర్తను చూడటం ఇప్పుడే. కలకత్తాలాంటి నగరాలలోని బాలికలను కామార్పుకూర్ వంటి గ్రామీణ ప్రాంత బాలికలతో పోల్చి చూసిన వ్యక్తికి ఒక్క విషయం సుస్పష్టమౌతుంది - నగర బాలికల మనశ్శరీరాలు, గ్రామీణ బాలికల కన్నా చిన్న వయస్సులోనే అభివృద్ధి చెంది ఉంటాయి. గ్రామాలలో పద్నాలుగు, పదిహేను లేదా పదహారేళ్ళ వయస్సయినా బాలికల శరీరాలలో యౌవనారంభ లక్షణాలు అంతగా కనిపించవు. శరీరాల మాదిరే వారి మానసిక వికాసం కూడా ఆలస్యంగానే జరుగుతుంది. పంజరంలోని పక్షుల్లా పరిమిత పరిసరాలలో, చిన్న ఆవాసాలలోమాత్రమే పెరిగి పెద్దవారయ్యే గతి పట్టకపోవడమే గ్రామీణ బాలికల ఆరోగ్యాంశానికి బహుశా కారణం అయ్యుండవచ్చు. పరిశుద్ధమైన గాలిని పీల్చుకొంటూ, స్వేచ్ఛగా గ్రామాలలో తిరుగాడుతూ స్వాభావిక పరిసరాలలో వారు జీవిస్తారు.

కాబట్టి తన పద్నాలుగవ ఏట భర్తను మాతృదేవి నిజానికి ప్రప్రథమంగా చూసినప్పుడు ఆమెను పసిబాలిక అనే చెప్పాలి. వైవాహిక జీవిత మహత్తర ఆదర్శ

2. అప్పటి మాతృదేవి మనోస్థితి

కర్తవ్యాలను అవగతం చేసుకొనే శక్తి అప్పుడే ఆమెలో అంకురించసాగింది. దేహ స్పృహారహితులైన శ్రీరామకృష్ణుల దివ్యసాంగత్యాన్ని, నిస్వార్థ ప్రేమ పూరితమైన ఆ పరిశుద్ధ బాలిక అనిర్వచనీయమైన ఆనందానుభూతితో ఉల్లసితురాలైంది. అప్పుడు తనలో జనించిన ఆ ఉల్లాసాన్ని గురించి కాలాంతరంలో శ్రీరామకృష్ణుల భక్తురాండ్రతో అనేక సందర్భాలలో ఆమె ఇలాచెప్పింది: ''ఆనందపూర్ణమైన ఒక పెద్ద కుంభం నా అంతరంగంలో ప్రతిష్ఠాపితమైనట్లు అప్పటినుండి నాకు అనుభూతమవుతూ ఉంది. వర్ణించ నలవిగాని ఎడతెగని దివ్యానందంతో నా హృదయం పరిపూర్ణమై ఉండేది.''

కొన్ని నెలలు కామార్పుకూర్‌లో గడిపిన తరువాత శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్ళారు. అనంత పరమానంద సంపత్తుకు అధికారిణి

3. జయరాంబాటీలో ఆమె జీవితం

నయ్యానని భావిస్తూ ఆ బాలిక పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆ దివ్యానంద భావన ఆమె ప్రవర్తనలో, మాటలో, పని తీరుతెన్నులలో ఒక మార్పును తీసుకువచ్చింది. కానీ జనసామాన్యం ఈ మార్పును గమనించారో లేదో చెప్పడం కష్టం. ఎందుకంటే ఆ అనుభూతి ఆమె చపలత్వాన్ని కాక శాంతస్వభావాన్ని అధికం చేసింది. దుడుకుదనాన్ని కాక ఆలోచనాపరత్వాన్ని ద్విగుణీకరించింది. స్వార్థాన్ని అణిచి నిస్వార్థురాలినిగా మార్చింది. వీటన్నిటికీ మించి తన అంతరంగంలోని అన్ని రకాల కోర్కెలనూ తొలగించివేసి, మానవాళియాతనల, దుఃఖాల పట్ల అనంత సానుభూతిని ఆమె అలవరచుకొంది. క్రమంగా ఆమె మూర్తీభవించిన కరుణాస్వరూపంగా పరిణమించింది. ఆ మానసికానంద ప్రభావంతో ఎడతెగని శారీరక కష్టాలు కూడా ఆమెకు ఇప్పుడు అప్రధానమైపోయాయి; పైగా ఇతరుల పట్ల తాను చూపుతున్న ఆదరాభిమానాలకు వారి నుండి ఎలాంటి ప్రతిఫలమూ లభించకపోయినా కూడా ఆమె కష్టపెట్టుకొనేది కాదు. ఆ విధంగా అతిస్వల్ప భౌతిక ఆవశ్యకాలతో సంతృప్తురాలై ఆమె తనలో తాను మగ్నురాలై పుట్టింట కాలం గడపసాగింది. భౌతికంగా ఆమె పుట్టింట ఉన్నప్పటికీ ఆమె మనస్సు మాత్రం దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల పాదపద్మాల వద్దే వసించసాగింది. పతిదేవుని చూడాలనే బలీయమైన కోరిక ఆమెలో అప్పుడప్పుడు చెలరేగుతున్నప్పటికీ ప్రయత్నపూర్వకంగా ఆ కోర్కెను అణచుకొని, ఓర్పు వహించింది. ప్రథమ సమావేశంలోనే తనను సాదరంతో ప్రేమించిన తన భర్త తనను మరచిపోరు, సముచిత సమయంలో తప్పకుండా తమ వద్దకు పిలుచుకొనిపోతారని

ఆమె తలపోయసాగింది. ఆ రీతిలో రోజులు ఒకటి వెంట మరొకటిగా గడిచిపోసాగాయి. అంతరంగంలో ప్రగాఢ విశ్వాసంతో పతిసాన్నిధ్యాన్ని చేరుకొనే శుభ ముహూర్తం కోసం మాతృదేవి నిరీక్షించసాగింది.

ఒకటి తరువాత ఒకటిగా నాలుగు సంవత్సరాలు దీర్ఘంగా గడచిపోయాయి. కానీ ఆమె మనస్సులో ఆశ, అపేక్ష అనే ఉద్ధృత ప్రవాహం సరిసమానంగానే **4. ఆమె మనోవ్యథ - సంకల్పం** పారసాగింది. కానీ మనస్సు ఆమె శరీరం తీరులోనే నెలకొనలేదు. దినదినాభివృద్ధి గాంచుతూ 1872వ సంవత్సరం పుష్య మాసానికి ఆమెను పద్దెనిమిదేళ్ళ నవయౌవనవతిగా రూపొందించింది. భగవంతునిపోలిన భర్తను కలుసుకొన్న ఆ తొలి సమావేశజనితమైన పరమానందం జీవితంలోని దైనందిన సుఖదుఃఖాల నుండి ఆమెను ఎంతో ఊర్ధ్వస్థితిలో నిలిపి ఉంచింది; కానీ ప్రతికూలమైన, నిర్దయాపూరితమైన లోకం పోకడల పొరబాటు ఉండనే ఉంది కదా! గ్రామంలోని పురుషులు తమ ఉబుసుపోక కబుర్లలో తన భర్తను పిచ్చివాడని, ధరించిన వస్త్రాన్ని ఊడదీసి దిగంబరంగా 'హరి, హరి' అంటూ తిరుగుతున్నాడని వ్యాఖ్యానించసాగారు. సహ వయస్కులైన స్త్రీలు 'పిచ్చివాడి పెళ్ళా'మని వ్యంగ్యంగా సూచిస్తూ జాలిగొలిపే దృక్కులతో ఆమెను చూడసాగారు. వీటిని చూసి ఆమె నొచ్చుకున్నదే తప్ప ఏమీ మారుమాట్లాడలేదు. శ్రీరామకృష్ణుల ధ్యాసలోనే ఆమె మగ్నురాలై ఉన్నప్పటికీ, ఆమెలో సందేహాలు చోటు చేసుకున్నాయి. ''ఆయన నేను గతంలో చూసిన అదే వ్యక్తి కారా? జనం చెప్పుకొంటూ ఉన్న మార్పు ఆయనలో కలిగిందా? విధివశాత్తు అలా నిజంగా జరిగివుంటే, నేను ఇక్కడ ఎంతమాత్రమూ ఉండరాదు. ఆయన ప్రక్కనే ఉండి, సేవించడం నా కర్తవ్యం కదా!'' ఆమెలో ఇలాంటి భావాలు మెదలసాగాయి. దీర్ఘంగా యోచించి, స్వయంగా దక్షిణేశ్వరం వెళ్ళి నిజానిజాలు తెలుసుకొని, ఆ తరువాత పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాలనే నిర్ణయానికి వచ్చింది మాతృదేవి.

శ్రీచైతన్యులు ఫాల్గుణ మాసం పౌర్ణమినాడు జన్మించారు. ఆనాడే 'డోలా యాత్ర' (శ్రీకృష్ణుని ఉయ్యాలలూగించే) పండుగ జరుపుకొంటారు. ఆ సంద **5. సంకల్ప కార్యాచరణ** ర్భంలో పావన గంగానదిలో స్నానమాచరించడానికి వంగ దేశం మూలమూలల నుండి జనం తండోపతండాలుగా కలకత్తా నగరానికి ప్రతీ ఏటా వస్తారు. జయరాంబాటీలోని మాతృదేవి దూరపు బంధువులైన స్త్రీలు కొందరు ఆ సందర్భంలో కలకత్తాకు వెళ్ళాలని ఇంతకు మునుపే నిశ్చయించుకొన్నారు. మాతృదేవి వారి వద్దకు వెళ్ళి తాను కూడా గంగాస్నానం చేయాలనే ఆకాంక్షను వెలిబుచ్చింది. ఆమె తండ్రి అనుమతి

లేకుండా ఆమెను తమతో తీసుకొని వెళ్ళడం భావ్యంకాదని ఆ స్త్రీలు మాతృదేవి తండ్రియైన రామచంద్ర ముఖోపాధ్యాయుని ఆ విషయం అడిగారు. తెలివైన ఆ తండ్రి తన కుమార్తె కలకత్తాకు ఎందుకిప్పుడు పోగోరుతున్నదో వెంటనే గ్రహించాడు. స్వయంగా తానే ఆమెను కలకత్తాకు తోడ్కొని వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లూ చేయించాడు.

రైలుబళ్ళ పుణ్యమా అని సుదూరంలో ఉన్న కాశీ, బృందావనం వంటి స్థలాలు సైతం చేరుకోవడంలో పట్టే కాలవ్యవధి పరిగణనలో - కలకత్తాకు చేరువైనాయి. కానీ ఆనాడు శ్రీరామకృష్ణుల జన్మస్థలమైన కామార్పుకూర్, మాతృదేవి జన్మస్థలమైన జయరాంబాటీ గ్రామాలు అంత అదృష్టానికి నోచుకోలేదు. అవి కలకత్తాకు ఎప్పటి మాదిరే అంతే దూరంలో ఉన్నాయి.

ఇప్పటి[1] స్థితి కూడా అలాగే ఉన్నదంటే, ఆ నాటి స్థితి గురించి చెప్ప నవసరం లేదు. ఆ రోజుల్లో విష్ణుపూర్ మీదుగా గాని లేదా తారకేశ్వర్ మీదుగా గాని రైలు మార్గం వేయబడలేదు. అలాగే కలకత్తా - ఘటాల్ నడుమ పడవ ప్రయాణ సౌకర్యమూ లేదు. కాబట్టి ఆ గ్రామాల ప్రజలు పల్లకీలలోనో లేదా కాలి నడకనో పయనించడం తప్ప మరో గత్యంతరం లేదు. జమీందార్లు, సంపన్నులు తప్ప మిగిలిన జనసామాన్యానికి కాలినడకే గతి. కనుక కుమార్తెను, ఇతర స్త్రీలను తోడ్కొని రామచంద్ర ముఖోపాధ్యాయ కాలినడకన ఆ దీర్ఘప్రయాణం సాగించాడు. కన్నుల పండువ గొల్పుతున్న వరిపొలాలను ఒకటి వెంట ఒకటిగా దాటుకొంటూ, తామరపువ్వులతో నిండి మనోజ్ఞంగా ఉన్న తటాకాలను చూస్తూ, రావి, మర్రి లాంటి విశాల వృక్షాల నీడలలో విశ్రమిస్తూ ఆ బృందం నడిచిపో సాగింది. మొదటి రెండు మూడు రోజులు ఆనందంగా గడిచిపోయాయి. కానీ గమ్యస్థానం దాకా ఆ ఆనందం కొనసాగలేదు. సుదీర్ఘ ప్రయాణాల అలుపునకు అలవాటుపడని మాతృదేవి మార్గమధ్యంలో ఒకచోట తీవ్ర జ్వరపీడితురాలైంది. తండ్రి రామచంద్రుడు ఎంతో కలతచెందాడు. కుమార్తె అటువంటి ఆందోళనకర పరిస్థితిలో ఉండటంతో ముందుకు పయనించడం ఇక అసంభవమని గ్రహించి రామచంద్రుడు అక్కడకు సమీపంలో ఉన్న ఒక చిన్న సత్రం వద్ద ఆగి, అక్కడ బసచేశాడు.

6. కాలినడకన తండ్రితో దక్షిణేశ్వరానికి

---

1. ప్రస్తుతం కలకత్తా నుండి విష్ణుపూర్ లేక తారకేశ్వర్ వరకు రైలులో వెళ్ళి అక్కడ నుండి బస్సు మీద జయరాంబాటీ, కామార్పుకూర్ చేరుకోవచ్చు. లేదా తిన్నగా కారులోగాని, బస్సు మీదగాని కలకత్తా నుండి కామార్పుకూర్ చేసుకోవచ్చు.

ప్రయాణం మధ్యలో అలా జ్వరపీడితురాలు కావడం మాతృదేవికి ఎంత హృదయావేదనను కలిగించిందో చెప్పనలవి కాదు. కాని ఆ స్థితిలో కలిగిన ఒక

7. జ్వరపీడితురాలైన మాతృదేవికి కలిగిన అద్భుత దర్శనం

అద్భుత దర్శనం ఆమెను ఎంతో ఊరడించింది. ఆ దర్శనం గురించి కొన్ని సందర్భాలలో ఆమె తన భక్తురాండ్రకు ఇలా వర్ణించి చెప్పేవారు: ''తీవ్ర జ్వరంతో అప్పుడు ఒళ్ళు తెలియక పడివున్నాను. ఒంటి మీది దుస్తులు అస్తవ్యస్తంగా ఉండడంకూడా నాకు తెలియలేదు. అప్పుడు ఒక బాలిక వచ్చి నా పక్కన కూర్చోవడం నేను చూశాను. ఆమె మేని ఛాయ కారు నలుపు. కాని అంతటి సౌందర్యవతిని నేను ఎన్నడూ చూసింది లేదు. ఆమె నా పక్కన కూర్చుని తన చేతులతో సుతిమెత్తగా నా తలను, శరీరాన్ని నిమురసాగింది. ఆమె చేతులు ఎంత మృదువుగా, చల్లగా ఉన్నాయంటే, నా శరీర ఉష్ణోగ్రత, మంటలు తగ్గిపోసాగాయి. ఆమెను ఆప్యాయంగా, 'నువ్వు ఎక్కడనుండి వస్తున్నావు?' అని అడిగాను. 'దక్షిణేశ్వరం నుండి' అని జవాబిచ్చిందామె. ఆ జవాబుకు నివ్వెరబోయి, 'దక్షిణేశ్వరం నుండా! నేను వారిని (శ్రీరామకృష్ణులను) చూడాలని, వారికి సేవ చేయాలని దక్షిణేశ్వరానికే వెళుతున్నాను. కాని దారి మధ్యలో ఈ జ్వరం రావడంతో నా కా భాగ్యం దక్కలేదు' అన్నాను నేను. 'ఎందుకు దక్కదు? నువ్వు తప్పక దక్షిణేశ్వరం వెళ్ళగలవు. జ్వరం తగ్గిపోగానే అక్కడకు వెళ్ళి వారిని చూడగలవు. నీ కోసమే కదా నేను వారిని అక్కడ ఆపివుంచాను' అన్నదామె. 'అవునా! మాకు నువ్వు బంధువువా, చెప్పు' అన్నాను నేను. 'నేను నీ సోదరిని' అన్నదామె. 'నిజమా! అందుకే నువ్వు ఇలా వచ్చావు' అన్నాను నేను. ఇలా ఆమెతో మాట్లాడుతూ నేను నిద్రలోకి జారుకొన్నాను.''

రామచంద్ర తెల్లవారి లేవగానే కుమార్తె జ్వరం తగ్గిపోయి ఉండడం చూశాడు. నిస్సహాయ స్థితిలో అలా మార్గమధ్యంలో పడివుండడం కన్నా

8. మాతృదేవి దక్షిణేశ్వర ఆగమనం: శ్రీరామకృష్ణుల ప్రవర్తన

ఆమెను తోడ్కొని నెమ్మదిగా ప్రయాణం చేయటమే సబబుగా తోచింది అతడికి. గతరాత్రి కలిగిన అద్భుత దర్శనంతో ఉత్తేజితురాలైన మాతృదేవి తండ్రి యోచనను ఆమోదించింది. వాళ్ళు కాస్త దూరం కాలినడకన వెళ్ళారో లేదో ఒక పల్లకీ దొరికింది. మాతృదేవికి మళ్ళీ జ్వరం వచ్చింది. కాని గతరాత్రిలా జ్వరం తీవ్రం కాకపోవడంతో ఆమె ఆ పరిస్థితిని సంబాళించుకోగలిగింది. దీన్ని గురించి ఆమె ఎవరితోనూ ప్రస్తావించలేదు. క్రమంగా వాళ్ళు గమ్యం చేరుకున్నారు. రాత్రి తొమ్మిది గంటలకు మాతృదేవి దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల వద్దకు చేరుకొన్నది.

జ్వరంతో అలా బాధపడుతూ వచ్చిన ఆమెను చూసి శ్రీరామకృష్ణులు కలత చెందారు. బయటి చలి కారణంగా ఆమె జ్వరం ప్రకోపిస్తుందని ఎంచి, శ్రీరామకృష్ణులు ఆమెకు తమ గదిలోనే ప్రత్యేకంగా పడక ఏర్పాటు చేయించారు. తరువాత ఆయన నిట్టూరుస్తూ ఇలా అన్నారు: ''చివరకు నువ్వు వచ్చేశావు. అయ్యో, నా మథుర్ ఇప్పుడు లేకపోయాడే! అతడు ఉండివుంటే నీకు ఏ ఏ సౌకర్యాలు చేయించి ఉండేవాడో కదా!'' పథ్యపానాదులకు, మందులకు చక్కని ఏర్పాట్లు చేయబడటంతో మాతృదేవి మూడు నాలుగు రోజులలోనే బాగా కోలుకోగలిగింది. శ్రీరామకృష్ణులు ఆమెను తమ గదిలోనే అట్టెపెట్టుకొని ప్రతి విషయం స్వయంగా తామే చూసుకొన్నారు. ఆ తరువాత నహబత్‌లో ఉంటున్న తమ తల్లితో కలిసి ఆమె వసించడానికి ఆయన ఏర్పాటు చేశారు.

9. ఆనందభరితురాలైన మాతృదేవి

వదంతుల మూలంగా పుట్టిన చింతలన్నీ తొలగిపోయాయి. తన విశ్వాసాన్ని క్రమ్ముకు వస్తున్న సందేహమనే దుమ్మూధూళి ఇప్పుడు నలువంకలా చెల్లాచెదరై అదృశ్యమైంది. శ్రీరామకృష్ణులు పూర్వం ఎలా ఉన్నారో ఇప్పుడూ అట్లే ఉండివుంటారన్న ఆమె విశ్వాసాన్ని, ఆయన ఆమె పట్ల తీసుకుంటున్న శ్రద్ధ, కనబరుస్తున్న ప్రేమలు రూఢి చేశాయి. విచక్షణ రహితంగా లోకులే ఈ వదంతులు ప్రచారం చేశారని ఆమె గ్రహించింది. తన 'ప్రభువు' అదే 'ప్రభువు'గా ఉండిపోవడమే జరిగిందనుకొన్నదామె. ఆమెను మరచిపోక పోవడమే కాదు, మునుపటిలా ఆమె పట్ల కృపాళువై కూడా ఉన్నారు. కనుక ప్రస్తుత తన కర్తవ్యాన్ని ఆమె నిర్ణయించుకొంది. ఆనందభరితయై నహబత్‌లో ఆమె వసిస్తూ శ్రీరామకృష్ణులకు, ఆయన తల్లికి సేవలందించడంలో నిమగ్నురాలైపోయింది. కుమార్తె సంతోషంగా ఉండడంతో ఆమె తండ్రి ఆనందభరితుడై కొన్ని రోజులు అక్కడ గడిపి సంతోషంగా ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు.

10. స్వీయ బ్రహ్మజ్ఞానాన్ని శ్రీరామకృష్ణులు పరీక్షించుకోవడం

1867వ సం॥ లో శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌లో ఉన్నప్పుడు మాతృదేవిని అక్కడకు తోడ్కొని రాగా అప్పుడు ఆయనలో జనించిన ఆలోచనా సరళిని గురించి పాఠకులకు తెలిపే ఉన్నాం. బ్రహ్మజ్ఞానికి దేహచైతన్యం మీద ఆధారపడిన స్త్రీ పురుష విభేదం ఉండదన్న తోతాపురి మాటలు అప్పుడు ఆయనకు జ్ఞాపకానికి వచ్చాయి. స్వీయ జ్ఞాన పరీక్షకు, తమ భార్య పట్ల నిర్వర్తించ వలసిన కర్తవ్య నిర్వహణకు ఆ పరిస్థితిని వినియోగింప సన్నద్ధులయ్యారు. ఆ రెండు లక్ష్యాలను సాధింప కార్యారంభులు కాగానే కలకత్తాకు తిరిగి వెళ్ళవలసి

వచ్చింది. ఇప్పుడు ఆమె తన ప్రక్కనే ఉండడంతో ఆ లక్ష్య సాధనకు ఉద్యుక్తు లయ్యారు.

భార్యను దక్షిణేశ్వరానికి రావించి ఆయన ఇంతకు మునుపే తమ జ్ఞానాన్ని పరీక్షించుకొని ఉండవచ్చు కదా, అలా ఎందుకు చెయ్యలేదు అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. సాధారణ వ్యక్తి నిస్సందేహంగా అలాగే చేసి వుండేవాడని అందుకు జవాబు చెప్పవచ్చు. కాని శ్రీరామకృష్ణులు సాధారణ వ్యక్తుల కోవకు చెందరు. కనుక ఆయన విభిన్నంగా వర్తించారు. సదా సర్వవేళలా సంపూర్ణంగా భగవంతుని మీదే ఆధారపడుతూ ప్రతి పనీ చేసేవారు తాము చేయనెంచిన వాటిని ఒక పథకం వేసుకొని చేయరు. స్వకీయ శ్రేయస్సును కోరిగాని లేదా పరుల శ్రేయస్సుకోసం గాని మనవంటి వారి అల్ప పరిమిత బుద్ధిబల సహాయాన్ని అపేక్షించక, వారు సహాయ మార్గదర్శి కర్తవ్యాలకై పరమాత్ముని విరాట్ బుద్ధిని అపేక్షిస్తారు. కాబట్టే చొరవచేసుకొని పరీక్షించుకోడానికి వారెప్పుడూ పరాఙ్ముఖులుగానే ఉండిపోతారు. వారు భగవదిచ్ఛానుసారం వర్తిస్తూపోతారు. తమ ప్రమేయం లేకుండానే పరీక్షా సమయం ఆసన్నమైనప్పుడు, వారు ఆ పరీక్షకు సంతోషంగా లోనవుతారు. శ్రీరామకృష్ణులు తమ సంకల్పం మేరకు స్వీయ దివ్యజ్ఞానాన్ని పరీక్షింప తాను సిద్ధపడలేదు. కాని సతీమణి కామార్పుకూర్‌లో తమ వద్దకు వచ్చినప్పుడు ఆమె పట్ల తమకున్న కర్తవ్యం నిర్వహించాలంటే తాము ఆ పరీక్షకు నిలబడాలనీ, తరువాత మాత్రమే ఆ కర్తవ్య నిర్వహణకు పూనుకోవడానికి సంసిద్ధులవాలనీ గ్రహించారు. మళ్ళీ, భగవత్సంకల్పం మేరకు పరిస్థితిలో మార్పువచ్చి తాము సతీమణి నుండి దూరంగా కలకత్తాకు తిరిగి వెళ్ళిపోయి జీవించవలసి వచ్చినప్పుడు ఆయన తనంత తానుగా ఆమెను తమ వద్దకు రప్పించుకోగోరలేదు. మాతృదేవి తానుగా దక్షిణేశ్వరానికి రానంత కాలం ఆమెను రప్పించుకోవాలనే స్వల్ప ప్రయత్నం కూడా ఆయన చేయలేదు. మాతృదేవి పట్ల శ్రీరామకృష్ణుల ప్రవర్తన దశలలోని సామంజస్యాన్ని మనం ఈ విధంగా మన సామాన్య బుద్ధితో కనుగొనగలం. అయినా మరొక విషయం మనం స్పష్టంగా గ్రహించాలి - తాము అలా ఆచరించడమే భగవత్సంకల్పంగా ఆయన తమ యోగదృష్టితో గ్రహించగలిగారు.

11. మాతృదేవికి ఆయన శిక్షణ

ఇప్పుడు తమ సతీమణి పట్ల తమ కర్తవ్య నిర్వహణను ఒనరుస్తూ పరీక్షకు లోను కావలసిన సమయం మళ్ళీ ఆసన్నమైనదని గ్రహించిన శ్రీరామకృష్ణులు, అందుకు సంసిద్ధులయ్యారు. అవకాశం లభించినప్పుడల్లా మాతృదేవికి మానవజీవిత లక్ష్యం, కర్తవ్యాలను గురించి క్షుణ్ణంగా బోధిస్తూవచ్చారు. ఈ కాలంలో ఆయన మాతృదేవికి ఇలా చెప్పినట్లు

12. ఆయన బోధన విధానం

తెలియవస్తోంది: ''చందమామ పిల్లలందరికీ మామ అయినట్లుగానే భగవం తుడు ఎల్లరికీ ఆత్మబంధువు. ఆయన్ను ప్రార్థించే హక్కు అందరికీ ఉంది; హృదయపూర్వకంగా ప్రార్థించే వారికి ఆయన దర్శనమిచ్చి తరింప చేస్తాడు. నువ్వు కూడా ఆయనను ప్రార్థిస్తే, ఆయన దర్శనం పొందగలవు.'' శ్రీరామ కృష్ణుల బోధన కేవలం ఉపదేశాలతో కూడుకొన్నది మాత్రమే కాదు. శిష్యుని తమ చెంత ఉంచుకొని, ప్రేమ వాత్సల్యాదులతో అన్ని విధాల అతణ్ణి తన సొంత మనిషిగా చేసుకొని, పిదప ఉపదేశించేవారు. అంతటితో ఆగిపోరు. శిష్యుడు ఉప దేశాలను సక్రమంగా ఎంతవరకు ఆచరణలో పెట్టాడో ఒక కంట కనిపెడుతూ ఉంటారు. శిష్యుడు పొరపాటున తమ ఉపదేశాలకు విరుద్ధంగా వెళితే, అతడి తప్పిదాన్ని చూపి, సవరించేవారు. మాతృదేవి విషయంలో కూడా అదే విధానాన్ని పాటించారు. మొట్టమొదటి రోజునుండే ప్రేమ ద్వారా ఆమెను ఎంతవరకు తమ సొంత దానినిగా చేసుకొన్నారనే సంగతి ఆమె దక్షిణేశ్వరం రాగానే ఆమెకు తమ గదిలో పడక ఏర్పాటు చేయడం, ఆమె జ్వరం నుండి కోలుకొన్నాక ప్రతీ రోజు రాత్రి తన పక్కనే పడుకోవడానికి ఆమెకు అనుమతి ఇవ్వడం ద్వారా స్పష్టంగా తెలుసుకోవచ్చు. మాతృదేవి పట్ల శ్రీరామకృష్ణుల పరిశుద్ధ, కచ్చితమైన ఆనాటి వర్తనం గురించి పాఠకులకు మేం మరోచోట[1] తెలిపివున్నాం. కనుక ఇక్కడ దాన్ని మళ్ళీ చెప్పడం అనవసరం. అక్కడ ప్రస్తావించిన విషయాలకు ఒకటి రెండు ముక్కలు ఇక్కడ జోడిస్తున్నాం.

13. మాతృదేవిని ఏ దృష్టితో శ్రీరామకృష్ణులు చూసేవారు?

ఈ సమయంలో ఒక రోజు శ్రీరామకృష్ణుల పాదాలు ఒత్తుతూ మాతృదేవి, ''మీరు నన్ను ఏ దృష్టితో చూస్తారు?'' అని అడిగింది. అందుకు ఆయన, ''ఏ జనని ఆలయంలో ఆవిర్భవించి ఉన్నదో, ఏ జనని ఈ శరీరానికి జన్మనిచ్చి ప్రస్తుతం నహబత్‌లో వసిస్తూ ఉన్నదో, అదే జనని ఇప్పుడు నా కాళ్ళు ఒత్తుతూ ఉన్నది. నిజానికి నిన్ను సర్వదా ఆనందమయ స్వరూపిణియైన సాక్షాత్తూ జగజ్జనని అవతారంగా చూస్తూ ఉంటాను'' అని జవాబిచ్చారు.

14. ఆత్మసంయమాన్ని శ్రీరామకృష్ణులు పరీక్షించు కోవడం

మరో సందర్భంలో, మాతృదేవి తమ పక్కన నిద్రిస్తూ ఉండడం చూసి శ్రీరామకృష్ణులు తమ మనస్సును సంబోధిస్తూ ఇలా వివేచింపసాగారు: ''ఓ మనసా, ఇదొక స్త్రీ శరీరం. లోకులు దీన్ని గొప్ప భోగవస్తువుగా ఎంచుతారు, దీన్ని అనుభవించడానికి పడిగాపులు కాస్తారు. కాని దానికోసం పోతే, దేహ

1. గురుభావం, పూర్వార్థం 3.4.13

చైతన్య భావంలోనే పాతుకుపోతారు. దాన్ని దాటిపోయి సచ్చిదానంద ఘనుడైన పరమాత్మను అనుభూతి చేసుకోలేరు. ఓ మనసా! లోపల ఒక భావనకు ఆశ్రయం ఇచ్చి, బయట తద్విరుద్ధ వైఖరిని ప్రకటించకు. నిజం చెప్పు, నీకు ఈ శరీరం కావాలా? భగవంతుడు కావాలా? నువ్వు దీనినే కోరే పక్షంలో, ఇదుగో నీ ముందే ఉంది, అందుకో.'' ఇలా వివేచిస్తూ మాతృదేవి దేహాన్ని స్పృశించాలనే భావన ఆయన మనస్సులో వచ్చి రాకమునుపే, ఆయన మనస్సు కుదించుకు పోయి ప్రగాఢ 'సమాధి'లో విలీనమైపోయింది; ఆ రాత్రి మామూలు భావభూమికి అది దిగిరాలేదు. మరునాడు భగవన్నామాన్ని పదేపదే ఉచ్చరించిన పిదప, ఎంతో ప్రయత్నం మీదట ఆయనకు బాహ్యస్మృతి తెప్పించగలిగారు.

ఆ విధంగా పూర్ణ యౌవనంలో ఉన్న శ్రీరామకృష్ణులు, నవయవ్వన సంపన్నురాలైన మాతృదేవి శారదాదేవి - ఈ దివ్యదంపతుల దివ్యలీలా విలాసాలను గురించి శ్రీరామకృష్ణుల ముఖతా మేము విన్న విషయాలు ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో మరే అవతార పురుషుని జీవితంలోనూ జరిగినట్లు తెలియరాదు. ఆ విషయాలు విన్న మానవ హృదయం ముగ్ధమై, సహజంగానే వారి దివ్యత్వం ఎడ విశ్వాసాన్ని పొందుతుంది. హృదయాంతరాళం నుండి వారి పాదపద్మాల పట్ల భక్తిప్రపత్తులను ప్రదర్శిస్తుంది. దేహస్మృతి లేని శ్రీరామకృష్ణులు ఈ కాలంలో రాత్రుళ్లు పూర్తిగా సమాధిమగ్నులై గడపడం జరిగింది. సమాధి స్థితి నుండి బాహ్యచైతన్య స్థాయికి దిగివచ్చిన పిదప కూడ ఆయన మనస్సు ఎంతటి సమున్నత భూమిలో నెలకొని ఉండేదంటే, సామాన్యుని దేహాత్మజ్ఞానం ఒక్క ముహూర్త మాత్రం కూడ వారిలో జనించేది కాదు.

15. అనుపమానమైన శ్రీరామకృష్ణుల వర్తన

ఆ విధంగా రోజులు, నెలలు దొర్లి ఒక సంవత్సర కాలం గడిచిపోయింది. ఐనప్పటికీ అద్భుతమైన శ్రీరామకృష్ణుల, అపురూపమైన మాతృదేవి యొక్క మనోసంయమనం లేశమాత్రమూ సడలలేదు. పొరపాటుగానైనా ఒక్క క్షణమాత్రం కూడ శారీరక సంయోగం కోరదగ్గదనే, సంతోషదాయకమనే తలంపే అసలు వారి మనస్సులలో మెదలలేదు. ఆ రోజుల్లో జరిగిన విషయాలు జ్ఞప్తికి తెచ్చుకొని శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు మాతో యిలా చెప్పేవారు: ''ఆమె (మాతృదేవి) అంతటి పవిత్రురాలు కాకపోయినట్లయితే, తనను తాను మరిచిపోయి నన్ను వేధించివుంటే నా సంయమం నీరుగారి, దేహబుద్ధి అంకురించేదేమో? నా వివాహానంతరం ఆమె (మాతృదేవి) మనస్సును కామగంధరహితం

16. మాతృదేవి అసాధారణ ప్రవృత్తి గురించి శ్రీరామకృష్ణులు

చేయమని జగజ్జననిని అర్థించాను. ఆమెతో కలిసి ఆ సమయంలో వసించిన తరువాత జగజ్జనని నా మొర ఆలకించిందని గ్రహించాను.''

ఒక సంవత్సరకాల ప్రయోగంతో ఎలాటి దైహికమైన వాంఛా తన మనస్సును ఆకట్టుకోజాలదని శ్రీరామకృష్ణులకు రూఢి అయింది. తమ సతీ

17. పరీక్షానంతరం శ్రీరామకృష్ణుల సంకల్పం

మణి జగజ్జనని అంశ లేక సచ్చిదానంద స్వరూపమైన బ్రహ్మం అనే మనోవైఖరి ఆయన చైతన్యం యొక్క సుస్థిర సహజ లక్షణంగా మారిపోయింది. జగజ్జనని కృపాకటాక్షంతో తాము ఈ అగ్ని పరీక్షలో కృతకృత్యుడనైనామని ఆయన గ్రహించారు. ఇప్పుడు ఆయన మనస్సు స్వాభావికంగానే దివ్య ఆధ్యాత్మిక భూమిలో ప్రతిష్ఠితమైపోయింది. జగజ్జనని అనుగ్రహంతో తమ సాధన పరిపూర్తి అయిందనీ, తమ మనస్సు ఇప్పుడు జగజ్జనని పాదపద్మాలలో ఎంతగా లీనమైపోయినదంటే, తెలిసీగాని తెలియకగాని తల్లి సంకల్పానికి విరుద్ధమైన భావనలు ఏవీ తమ మనస్సులో మెదలవనీ ఆయన హృదయాంతరాళంలో గ్రహించారు. జగజ్జననిచే నిర్దేశితులైన ఆయన హృదయంలో ఒక అసాధారణ కోర్కె ఉదయించింది; కించిత్తు తటపటాయింపు కూడ లేకుండా ఆ అభిలాషకు కార్యరూపం సంతరింప పూనుకొన్నారు. శ్రీరామకృష్ణుల మాతృదేవుల ముఖతా అప్పుడప్పుడు మేము విన్న విషయాలను అనుసంధానపూర్వకంగా పాఠకులకు ఇప్పుడు తెలుపుతున్నాం.

1873వ సం॥ జ్యేష్ఠమాసం సగంపైగా గడచిపోయింది. నాడు (మే 25వ తేదీ) అమావాస్య; పవిత్రమైన ఫలహారిణి కాళీపూజ పర్వదినం. దక్షిణేశ్వర

18. షోడశీ పూజకు సన్నాహాలు

ఆలయంలో ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వర్తింపబడతాయి. జగజ్జననిని పూజించగోరి నాడు శ్రీరామకృష్ణులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లు ఆలయంలో కాకుండా ఆయన ఇచ్ఛ మేరకు ఆయన గదిలో గోప్యంగా జరిగాయి. పూజా సమయంలో దేవిని ఆశీనురాలిని చేయడానికిగాను పసుపు కుంకుమాదులతో అలంకరింపబడిన ఒక కొయ్యపీఠం అర్చకుని కుడివైపున అమర్చబడింది. సూర్యాస్తమయం అయింది. అమావాస్య చిమ్మచీకట్లు క్రమంగా నలుదిక్కులా అలముకోసాగాయి. శ్రీరామకృష్ణుల మేనల్లుడైన హృదయ్ నాటి రాత్రి కాళి కాలయంలో విశేషపూజ నిర్వర్తించవలసివుంది. కాబట్టి సాధ్యమైనంతవరకు శ్రీరామకృష్ణుల పూజా సన్నాహాలు చేశాక కాళికాలయానికి వెళ్లిపోయాడు. రాధా గోవింద ఆలయ రాత్రిపూజ, సేవాదులను పూర్తిచేసుకొని పూజారి దీను వచ్చి శ్రీరామకృష్ణుల పూజ ఏర్పాట్లలో తోడ్పడసాగాడు. దేవిని అలా గోప్యంగా పూజించడానికైన ఈ ఏర్పాట్లన్నీ పూర్తయ్యేటప్పటికి రాత్రి తొమ్మిది గంట

లయింది. ఈలోపు శ్రీరామకృష్ణులు పూజాసమయంలో అక్కడ (ఆయన గదిలో) ఉండవలసిందిగా మాతృదేవికి కబురు పంపారు. ఆమె అక్కడకు వచ్చాక ఆయన పూజకు ఉపక్రమించారు.

పూజోపకరణాలన్నీ మంత్రపూత జలంతో పవిత్రీకరింపబడి పూజ యొక్క పూర్వాంగాలన్నీ పూర్తయ్యాయి. కుంకుమాదులతో అలంకృతమైన

19. మాతృదేవికి అభిషేకం చేసి ఆమెను శ్రీరామకృష్ణులు అర్చించడం

దేవీపీఠం మీద కూర్చోవలసిందిగా మాతృదేవికి సైగచేత శ్రీరామకృష్ణులు సూచించారు. పూజా కార్యక్రమాన్ని తిలకిస్తూ ఉండగానే ఆమె అర్ధబాహ్యచైతన్య స్థితిని చేరుకొన్నది. కాబట్టి తాను ఏం చేస్తున్నానో అన్న ఎరుక లేకుండానే మంత్రముగ్ధురాలై పూర్వాభిముఖంగా కూర్చున్న శ్రీరామకృష్ణులకు కుడివైపున ఉన్న దేవీపీఠం మీద ఉత్తరాభిముఖంగా ఆమె కూర్చున్నది. తమ ముందున్న చెంబులోని మంత్రపూత జలాన్ని శాస్త్రనిర్దేశానుసారం పదేపదే మాతృదేవిపై ప్రోక్షించారు శ్రీరామకృష్ణులు. పఠించవలసిన మంత్రాలను చదివాక ఆవాహన మంత్రాలను ప్రారంభించారు.

''ఓ బాలా! సర్వశక్త్యాధీశ్వరీ, మాతా, త్రిపురసుందరీ! నాకై సిద్ధి ద్వారాన్ని తెరువు. ఈమె (మాతృదేవి) మనశ్శరీరాలను పవిత్రీకరించి, ఈమెలో అభివ్యక్తీకరించి సర్వకల్యాణ సాధనభూతవుగా.''

ఆవాహనం ముగించాక మాతృదేవి దేహంలో మంత్రపాఠంతో న్యాస క్రియను ముగించి షోడశోపచారాలతో (అంటే అర్ఘ్యపాద్యాదులనే పదహారు

20. శ్రీరామకృష్ణుల సమాధి, జపతపాదుల సమర్పణ

ఉపచారాలతో నిర్వర్తింపబడే పూజ) యథావిధిగా ఆమెను సాక్షాత్తూ జగజ్జననిగా అర్చించారు. పిదప నైవేద్యం అర్పించి, దాన్లో ఒకింత తమ చేతులతో ఆమె నోటికి అందించారు. ఈలోపు మాతృదేవి బాహ్యచైతన్యాన్ని పూర్తిగా కోల్పోయి సమాధిమగ్నురాలైంది. శ్రీరామకృష్ణులు కూడ అర్ధబాహ్యస్మృతిలో మంత్రోచ్చారణ చేస్తూ సంపూర్ణ సమాధిలో లీనమైపోయారు. సమాధిమగ్నుడైన అర్చకుడు సమాధిస్థితిలో విలీనమైన దేవితో తాదాత్మ్యం చెందాడు.

చాలసేపు గడచిపోయింది. రాత్రి రెండవ జాము గడిచి మూడవ జాములో కూడ ఎంతోసేపు గడచిపోయింది. ఆత్మారాములైన శ్రీరామకృష్ణులలో ప్రస్తుతం బాహ్యస్మృతి చిహ్నాలు ఒకింత కనిపించసాగాయి. మునుపటి అర్ధ బాహ్యస్మృతిని పొంది ఆయన దేవికి ఆత్మనివేదనం చేయసాగారు; తమతో బాటు తమ జపమాలనూ, సమస్త సాధనాఫలాలనూ శాశ్వతంగా దేవి పాద పద్మాల కడ సమర్పించి మంత్రాలు ఉచ్చరిస్తూ ఆమెకు ప్రణమిల్లారు:

ఓం సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే।
శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోఽస్తుతే॥

షోడశీపూజ పరిసమాప్తమైంది. మూర్తీభవించిన సకల విద్యారూపిణి అయిన ఒక నారీ శరీరం ద్వారా జగదీశ్వరి ఉపాసనతో శ్రీరామకృష్ణుల సాధనలు చరమావస్థను చేరుకొన్నవి. సర్వతోముఖ పరిపూర్ణత్వాన్ని ఆ మహనీయుడు సంతరించుకొన్నారు.

మాతృదేవి

షోడశీపూజ అనంతరం మాతృదేవి దాదాపు ఐదు నెలలు శ్రీరామకృష్ణుల వద్ద వసించింది. మునుపటిలా ఆమె శ్రీరామకృష్ణులను, ఆయన తల్లి చంద్రా దేవిని సేవిస్తూ పగటివేళ నహబత్‌లోనే గడుపుతూ, రాత్రి శ్రీరామకృష్ణులతోనే శయనిస్తూ వచ్చింది. శ్రీరామకృష్ణులు రేయింబవళ్లు ఎడతెగని భావసమాధిలో

మగ్నులై ఉండసాగారు. కొన్నివేళల్లో ఆయన హఠాత్తుగా నిర్వికల్ప సమాధిలో మగ్నులయ్యేవారు. ఆ సమయంలో ఆయన శరీరంలో మృత్యు లక్షణాలు పొడసూపేవి. ఆయనకు ఎప్పుడు ఎటు వంటి సమాధి స్థితి కలుగుతుందో అనే భయంతో మాతృదేవికి రాత్రి నిద్రపట్టేది కాదు. ఒకనాటి రాత్రి ఎంతోసేపు గడచిపోయినా శ్రీరామకృష్ణులకు సమాధి భంగం కాకపోవడం చూసి ఎంతో భయపడి ఏం చేయడానికీ పాలుపోక మాతృదేవి, హృదయ్‌ను ఇతరులను నిద్ర నుండి లేపింది. హృదయ్ వచ్చి ఆయన చెవిలో చాలసేపు భగవన్నామం ఉచ్చరించిన తరువాతనే శ్రీరామకృష్ణులు సమాధి స్థితి నుండి దిగివచ్చారు. సమాధి స్థితి నుండి దిగి వచ్చిన పిదప జరిగినదంతా తెలుసుకొని మాతృదేవికి నిద్రాభంగమౌతూన్నదని గ్రహించి తల్లితోబాటు నహబత్‌లో ఆమె నిద్రించడానికి ఆయన ఏర్పాటు చేశారు. ఈ తీరులో ఒక సంవత్సరం నాలుగు నెలలు దక్షిణేశ్వరంలో శ్రీరామ కృష్ణులతో నివసించి 1873వ సంవత్సర కార్తీకమాసంలో (అక్టోబర్) కామార్పు కూర్‌కు మాతృదేవి తిరిగి వెళ్లిపోయింది.

21. మాతృదేవి: శ్రీరామకృష్ణుల ఎడతెగని సమాధిస్థితి

21. శ్రీరామకృష్ణుల సాధనలకు భరతవాక్యం

1. షోడశీపూజతో శ్రీరామకృష్ణులలో సాధన ఆకాంక్ష సమసిపోవడం

షోడశీ పూజతో శ్రీరామకృష్ణుల సాధన వ్రతం పరిసమాప్తమైంది. పన్నెండు సుదీర్ఘ సంవత్సరాల కాలంపాటు ఆయనను అవిశ్రాంతంగా వివిధ ఆధ్యాత్మిక భావనలలో సాధనలు అనుష్ఠింప చేసిన భగవదనురాగం అనే పవిత్రాగ్ని నిరంతరం ప్రజ్వరిల్లుతూనే వచ్చింది. షోడశీపూజతో పూర్ణాహుతి నందుకొని ఆ పవిత్రాగ్ని చల్లబడింది. చల్లబడక మరేం చేయగలదు? ఇంతకు మునుపే ఆహుతి నివ్వక శ్రీరామకృష్ణుల వద్ద ఆయనదంటూ ఏదైనా మిగిలి ఉందా? లేదు. సంపద, మన్నన, పేరు ప్రతిష్ఠలు ఇత్యాది లౌకిక వాంఛనీయాలనన్నిటినీ ఆయన చాలాకాలం క్రితమే ఆ సాధనాగ్నికి ఆహుతి నిచ్చేశారు. తమ హృదయం, ప్రాణం, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం - వీటినన్నింటినీ ఒకదాని వెంట ఒకటిగా ఆ పవిత్రాగ్ని భయంకర జ్వాలల పరం చేసివేశారు. వివిధ సాధనా పథాల ననుసరించి నానా భావాలలో జగజ్జననిని దర్శించాలనే ఏకైక ఆకాంక్ష మాత్రం ఆయనలో మిగిలి ఉంది. ఇప్పుడు మిగిలివున్న ఆ ఒక్క ఆకాంక్షను కూడ ఆ పవిత్రాగ్నికి ఆహుతి ఇచ్చేశారు. అలాటప్పుడు ఆ సాధనాగ్ని చల్లబడక ఏంచేస్తుంది?

2. అందుకు హేతువు

శ్రీరామకృష్ణుల మనోవ్యాకులతను ఎరిగిన జగజ్జనని మొట్టమొదట తన దర్శనభాగ్యం కలిగించి పిదప లసాధారణ గుణసంపన్నులైన సాధకశ్రేష్ఠులతో పరిచయం కావించింది. వారి సహాయంతో వివిధ శాస్త్రీయ మార్గాలను అనుసరించగలిగారు. వాటిలో కలిగిన అనుభవాలను తమ ప్రథమ దర్శనంతో పోల్చి చూసుకొనే అవకాశం ఆయన కలిగింది. అలాంటప్పుడు ఇక ఆమెను కోరడానికి ఏం ఉన్నది? తంత్రశాస్త్రాలు నిర్దేశించిన అరవైనాలుగు సాధనలను ఒకటి వెంట ఒకటిగా ఆయన అనుష్ఠించడం జరిగి పోయింది. భారతదేశంలో ప్రాచుర్యంలోవున్న వైష్ణవ సంప్రదాయంలోని శాంత

దాస్యాది పంచభావాలను ఆధారంగా చేసుకొని భక్తిసాధనలన్నీ కూడ అనుష్ఠింప బడ్డాయి. సనాతన వైదిక మతానుసారమైన సన్న్యాసదీక్షను పరిగ్రహించి నిర్విశేష నిరాకార బ్రహ్మదర్శనం కలిగింది. జగజ్జనని యొక్క లీలావిలాసంతో భారతేతర దేశాలకు ఉనికిపట్టై ఉన్న మహమ్మదీయ మత సాధన కూడ అనుష్ఠింపబడి తత్సాధ్య ఫలం కూడ లభించింది. కాబట్టి ఇప్పుడు జగజ్జననిని ఏం చూపమని లేక ఏం వెల్లడిచేయమని ఆయన కోరగలరు?

కాని షోడశీపూజ జరిగిన ఒక సంవత్సరం తరువాత జగజ్జననిని మరొక సాధనామార్గం ద్వారా దర్శించుకోవాలనే ఆకాంక్ష శ్రీరామకృష్ణులలో జనించింది.

3. అద్భుత రీతిలో క్రీస్తుమత పరిపూర్ణత్వాన్ని శ్రీరామకృష్ణులు సంతరించుకోవడం

అప్పటికి శంభుచరణ్ మల్లిక్ అనే వ్యక్తి ఆయనకు పరిచయస్థుడయ్యాడు. అతడు శ్రీరామకృష్ణులకు బైబిల్ చదివి వినిపించేవాడు. ఈ విధంగా ఆయనకు ఏసుక్రీస్తు పావన జీవితాన్ని గురించి, క్రీస్తు స్థాపించిన మతం గురించి తెలియ వచ్చింది. ఆ సంప్రదాయ మార్గంలో సాధనలు అనుష్ఠించాలనే కోర్కె ఆయన మనస్సులో మెదలింది. ఆ కోర్కె మనస్సులో మెదలీమెదలగానే జగజ్జనని దాన్ని అద్భుత రీతిలో నెరవేర్చి ఆయనను కృతార్థుణ్ణి చేసింది. ప్రత్యేకమైన ప్రయత్నం చేయవలసిన అవసరం ఆయనకు కలుగలేదు. ఆ సంఘటన యిలా జరిగింది: దక్షిణేశ్వర కాళికాలయానికి దక్షిణ దిక్కున యదుమల్లిక్ ఉద్యానగృహం ఉన్నది. శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు అక్కడకు వాహ్యాళిగా వెళ్లడం కద్దు. మొదటిసారి శ్రీరామకృష్ణులను దర్శించినప్పటినుండి యదుమల్లిక్, అతడి తల్లి ఆయన పట్ల అత్యంత భక్తిప్రపత్తులు కనబరచేవారు. కాబట్టి వారు ఉద్యానగృహంలో లేని సమయంలో కూడ శ్రీరామకృష్ణులు అక్కడకు వెళ్లినప్పుడు ఉద్యానగృహ సిబ్బంది కచ్చేరీ తలుపులు తెరచి ఆయనను అక్కడ కూర్చుని కొంచెంసేపు విశ్రమించ వలసిందిగా కోరేవారు. ఆ గది గోడలకు చక్కని చిత్తరువులు వ్రేలాడగట్టబడి ఉండేవి. వాటిలో తల్లి ఒడిలోవున్న బాలక్రీస్తు చిత్తరువు ఒకటి ఉంది. ఒక రోజు ఆ గదిలో కూర్చుని తదేకదృష్టితో ఆ చిత్తరువును తిలకిస్తూ ఏసుక్రీస్తు అద్భుత జీవిత చరిత్ర గురించి ఆయన చింతనచేస్తూ ఉన్నారు. ఆ సమయంలో ఆ చిత్రం సజీవమై దివ్యకాంతితో ప్రకాశించసాగిందని, ఆ తల్లి, తనయుడు బాల ఏసు దేహాల నుండి కాంతిపుంజాలు బయల్వెడలి తమ హృదయంలో ప్రవేశించి తమ మానసిక భావనల నన్నిటినీ ఆమూలాగ్రం పరివర్తనం చెందించినవని ఆయన చెప్పేవారు. జన్మసిద్ధమైన హైందవ సంస్కారాలన్నీ అంతరంగంలో ఒక మారు మూల ఒదిగిపోగా, దాన్లో పూర్తిగా భిన్నమైన సంస్కారాలు ఉదయించడం చూసి ఆయన శతవిధాల తనను నియంత్రించుకోడానికి ప్రయత్నించి జగజ్జననిని

హృదయపూర్వకంగా, ''అమ్మా! ఏం వింతమార్పులు నాలో తీసుకువస్తు న్నావు?'' అని ప్రార్థించారు. కాని అన్నీ నిష్ఫలమయ్యాయి. ఆ సంస్కార తరంగాలు ఉధృతమై ఆయన మనస్సులోని హైందవ సంస్కారాల నన్నిటినీ ముంచెత్తి వేశాయి. ఫలితంగా హిందూ దేవతామూర్తుల పట్ల ఆయనకున్న భక్తి, ప్రేమలు అదృశ్యమైపోయాయి. వాటి స్థానే ఏసుక్రీస్తుపట్ల, ఆయన సంప్రదాయం పట్ల గొప్ప భక్తి విశ్వాసాలు శ్రీరామకృష్ణుల హృదయంలో పాదుకుపోయాయి. అవి క్రైస్తవ ప్రార్థనామందిరంలో ఏసుక్రీస్తుమూర్తి ఎదుట ఫాదిరీలు ధూపదీపాదులు అర్పించడం ఆయనకు దర్శింపచేశాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో కూడిన ప్రార్థనల రూపంలో వారి హృదయ ఆతురతను అవి వెల్లడించాయి. పిదప శ్రీరామకృష్ణులు కాళికాలయానికి తిరిగివచ్చి అంతరంగ సంఘటనల చింతనలో లీనమై పోయారు. కాళికాలయానికి వెళ్లి జగజ్జననిని దర్శించుకోవాలనే విషయం ఆయన పూర్తిగా విస్మరించారు. ఈ రీతిలో మూడు రోజులపాటు ఆ భావతరంగాలు ఆయన మనస్సుపై ఆధిపత్యం చలాయించాయి. చివరకు మూడవ రోజు చీకటిపడ్డాక ఆయన పంచవటి గుండా నడచిపోతూ ఉన్నప్పుడు ఒక అద్భుత దృశ్యం గాంచారు. ఉజ్జ్వల గౌరవర్ణుడైన ఒక అద్భుత దివ్యమానవుడు తదేక దృష్టితో ఆయనను అవలోకిస్తూ ఆయన వైపుగా రాసాగాడు. ఆ వ్యక్తి విదేశీయుడని, విజాతీయుడని చూసిన క్షణంలోనే శ్రీరామకృష్ణులు గ్రహించారు. పొడవైన ఆతడి కళ్లు ఆతడి ముఖారవిందానికి అద్భుత శోభను సంతరింపచేస్తున్నాయి. ఆతడి ముక్కు ఒకింత చప్పిడిదైనప్పటికీ ఆతడి అందానికి ఏమాత్రం కొరతగా లేదు. శ్రీరామకృష్ణులు ఆ సుందర ముఖారవిందంపై తొణికిసలాడే అద్భుత దివ్య భావ ప్రకటనం గాంచి 'ఇతడెవరా?' అని అబ్బురపోయారు. ఆ దివ్యమూర్తి దగ్గరకు రాగానే శ్రీరామకృష్ణుల హృదయాంతరాళం నుండి, ''ఏసు ప్రభువు, దుఃఖయాతనల నుండి జీవులను ఉద్ధరించడానికి ఎవరు తన హృదయ రక్తాన్ని సమర్పించారో, ఈశ్వరునితో అభిన్నుడైన పరమయోగి, మహాప్రేమికుడు ఇతడే ఆ క్రీస్తు, ఆ ఏసు ప్రభువు'' అనే పలుకులు వెలువడ్డాయి. అంతర్వాణి అలా పలుకుతూ ఉన్న సమయంలో ఏసుక్రీస్తు, శ్రీరామకృష్ణులను ఆలింగనం చేసుకొని, ఆయన దేహంలో విలీనమైపోయాడు. వెంటనే శ్రీరామకృష్ణులు భావ సమాధిమగ్నులై బాహ్యచైతన్యాన్ని కోల్పోయి కొంతసేపు సగుణ బ్రహ్మంతో తాదాత్మ్యం చెందారు. ఆ విధంగా ఏసుక్రీస్తు దర్శనం పొంది ఆయన (క్రీస్తు) అవతారమూర్తి అనే విషయంలో ఈషణ్మాత్ర సందేహరహితులయ్యారు.

ఇది జరిగిన చాలాకాలం తరువాత మేం శ్రీరామకృష్ణులను సందర్శించే సమయంలో ఒకరోజు ఆయన ఏసుక్రీస్తు ప్రస్తావన తెచ్చి, ''నాయనలారా! మీరు

బైబిల్ చదివారు కదా! ఏసుక్రీస్తు భౌతిక లక్షణాలను గురించి దాన్లో ఏం వ్రాసి వుంది? ఆయన ఎలా కనిపించేవాడు?'' అని అడిగారు. ''మహాశయా! బైబిల్‌లో ఎక్కడా ఆయన భౌతిక వర్ణన మేం చూడలేదు. కాని యూదుడుగా జన్మించడం చేత ఆయన మేనిఛాయ ఉజ్వల గౌరవర్ణంలో ఉండటం, విశాల నేత్రాలు, చిలుకవంటి కొక్కెపు ముక్కు ఉండటం తథ్యం'' అని మేం జవాబు ఇచ్చాం. మేం అలా చెప్పగానే శ్రీరామకృష్ణులు, ''కాని ఆయన ముక్కు ఒకింత చప్పిడిదై ఉండటం నేను చూశాను. ఆయనను అలా ఎందుకు చూశానో తెలియడం లేదు'' అని అన్నారు. అప్పటికి ఏ మాటా ఆయనకు చెప్పకపోయినా మేం ఇలా యోచిం చాము: 'భావసమాధిలో ఆయన చూసిన స్వరూపం వాస్తవమూర్తితో ఎలా సరిపోలుతుంది? అందరి యూదుల మాదిరే ఆయన ముక్కు దీర్ఘంగా ఒకింత మెలిదిరిగి ఉండటం నిశ్చయం.' కాని శ్రీరామకృష్ణుల మహాసమాధి తదనంతరం ఏసుక్రీస్తు శరీర నిర్మాణం గురించి మూడు విభిన్న వర్ణనలు ఉన్నాయని, వాటిలో ఆయన ముక్కు ఒకింత చప్పిడిగా ఉండేదనే వర్ణన ఒకటి ఉందని మాకు తెలియవచ్చింది.

4. శ్రీరామకృష్ణుల ఏసుక్రీస్తు దర్శనం ఋజువు కావడం

ప్రపంచంలో ప్రాబల్యం వహించిన ప్రధాన మతాలన్నిటిలో శ్రీరామకృష్ణులు పరిపూర్ణత్వాన్ని పొందడం చూసి బుద్ధభగవానుని గురించి ఆయనకు ఎలాంటి అభిప్రాయం ఉండేదనే ప్రశ్న పాఠకులలో తలెత్తవచ్చు. కనుక దానిని గురించి మాకు తెలిసిన విషయాలు ఇక్కడ పొందుపరచడం సముచితం. హైందవ జనసామాన్యం బుద్ధుని ఏ రీతిలో పరిగణించారో ఆయన కూడ అదే విధంగా పరిగణించారు. అంటే సదా ఆయన బుద్ధుని భగవదవతారంగా విశ్వసించి హృదయపూర్వకంగా పూజ్యభావంతో ఆరాధించారు. అంతేగాక పూరీక్షేత్రంలోని శ్రీ జగన్నాథ - సుభద్రా - బలరాముల రూపంలో బుద్ధదేవుని అవతారతత్త్వం ఈనాటికీ అభి వ్యక్తం అవుతూవుందని ఆయన విశ్వసించారు. జగన్నాథుని అనుగ్రహంతో జాతి భేదా లేవీ పాటింపబడవనే విఖ్యాతి పూరీక్షేత్రానికి కలిగినదని విని శ్రీరామ కృష్ణులకు ఆ క్షేత్రాన్ని సందర్శించాలనే తీవ్రేచ్ఛ జనించింది. కాని తాను అక్కడకు వెళితే తమ శరీర పతనం తథ్యమని ఎరిగి, జగజ్జనని సంకల్పం కూడ అందుకు విరుద్ధంగా ఉందని యోగదృష్టితో తెలుసుకొని ఆ సంకల్పం నుండి విరమించుకొన్నారు.[1] గంగాజలాన్ని ప్రత్యక్ష 'బ్రహ్మవారిగా' (అంటే జల

5. బుద్ధుని గురించి శ్రీరామకృష్ణుల దృక్పథం

---

1. గురుభావం ఉత్తరార్థం IV.3.25

రూపంలో వ్యక్తమౌతున్న బ్రహ్మం) శ్రీరామకృష్ణులు సతతం పరిగణించేవారనే విషయం ఇదివరకే తెలిపివున్నాం. అదే విధంగా జగన్నాథుని అన్నప్రసాదం స్వీకరించగానే మనస్సు నుండి విషయాసక్తి తొలగిపోయి పవిత్రమౌతుందనీ, ఆధ్యాత్మిక భావధారణకు ఉపయుక్తమౌతుందనీ శ్రీరామకృష్ణులు దృఢంగా విశ్వసించేవారు. విధిలేక ఒకింతసేపు విషయాసక్తుల మధ్య గడపవలసిన నిర్బంధం ఎదురైతే, పిదప వెంటనే ఆయన కాసిని గంగాజలాన్ని, ఒకింత జగన్నాథుని 'ఆట్కే' (అంటే వండిన అన్నాన్ని జగన్నాథునికి నివేదించిన తరువాత దానిని ఎండబెట్టి ప్రసాదంగా సమర్పించడాన్ని 'ఆట్కే ప్రసాద్' అంటారు) ప్రసాదాన్ని నోట్లో వేసుకొనేవారు. అంతేగాక అట్లే చేయమని శిష్యులకు, భక్తులకు చెప్పేవారు. అంతేగాక పైన చెప్పిన బుద్ధుడు భగవదవతారమనే శ్రీరామకృష్ణుల విశ్వాసానికి తోడుగా మరొక సంగతి కూడ మాకు తెలియవచ్చింది. శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తులలో ముఖ్యుడు, గొప్ప కవి, నాటక ప్రయోక్త అయిన గిరీశ్ చంద్ర ఘోష్ బుద్ధుని జీవిత చరిత్రను నాటకంగా రచించి ఉన్నాడు. ఆ నాటక ప్రదర్శనను తిలకించిన శ్రీరామకృష్ణులు, ''బుద్ధదేవుడు భగవదవతారమూర్తి అనే విషయం నిశ్చయం. ఆయన స్థాపించిన సంప్రదాయానికి, వైదిక జ్ఞానమార్గానికి మధ్య ఎటువంటి వ్యత్యాసమూ లేదు'' అంటూ వ్యాఖ్యానించారు. యోగ దృష్టితో ఆయన ఆ విషయం తెలుసుకొని అలా చెప్పారని మా దృఢనమ్మకం.

6. జైన, సిక్కు సంప్రదాయాల పట్ల శ్రీరామకృష్ణుల భక్తి విశ్వాసాలు

జైనమత ప్రవక్తలైన తీర్థంకరులను గురించీ, సిక్కుమత ప్రవక్తలైన నానక్ నుండి గురుగోవింద సింగ్ వరకు ఉన్న పదిమంది గురువులను గురించీ ఆయా మత సాధకుల నుండి అనేక విషయాలు శ్రీరామకృష్ణులు తమ జీవిత ఉత్తరార్ధంలో వినివున్నారు. వారి పట్ల విశేష ప్రేమ, ఆదరణలు ఆయనకు ఉండేవి. ఆయన గదిలో వివిధ దేవతామూర్తుల చిత్రాలతోపాటు ఏసుక్రీస్తు చిత్తరువు ఒకటి, తీర్థంకర మహావీరుని శిలావిగ్రహం ఒకటి ఒక ప్రక్కన ఉండేవి. ఆ చిత్రాలన్నిటితోబాటు ఈ రెండిటి ముందు కూడ ప్రతి ఉదయం, సాయంత్రం సాంబ్రాణి ధూపం ఆయన అర్పించేవారు. వారి పట్ల విశేష భక్తి ఆదరణలు కనబరచినప్పటికీ తీర్థంకరులలో ఎవరినినైనాగాని, పదిమంది గురువులలో ఎవరినైనాగాని ఆయన భగవదవతారంగా అభివర్ణించడం మేం వినలేదు. పదిమంది సిక్కు గురువులను గురించి ఇలా చెప్పేవారు: ''వీరందరూ జనక ఋషి యొక్క అవతారాలు; రాజర్షియైన జనకుడు ముక్తి పొందుతున్న సమయంలో లోకశ్రేయస్సు ఒనరించాలనే ఆకాంక్ష ఆయనలో జనించిందనే విషయం సిక్కులు నాకు తెలిపారు. కాబట్టే ఆయన నానక్ నుండి గురుగోవిందసింగ్ వరకు పదిమార్లు అవతరించి, సిక్కు

మతాన్ని స్థాపించి ఆ తరువాత నిర్విశేష బ్రహ్మంలో శాశ్వతంగా విలీనమై పోయాడు. సిక్కుల ఈ లోకోక్తి మిథ్య అని చెప్పడానికి ఏ కారణమూ కనిపించడం లేదు.''

సకల మత సాధన లన్నిటిలోను సిద్ధి పొందిన పిదప శ్రీరామకృష్ణులు అసాధారణమైన కొన్ని అనుభూతులు చవిచూశారు. వాటిలో కొన్ని ఆయనకు సంబంధించినవి, కొన్ని సాధారణ ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించినవి. వాటిలో కొన్నిటిని ఇదివరలోనే పాఠకులకు తెలిపి ఉన్నప్పటికీ, ఇక్కడ ప్రధానమైన వాటిని గురించి ప్రస్తావిస్తున్నాం. సాధనలన్నీ సమాప్తం అయిన తరువాత జగజ్జననిలో లీనమై భావముఖంలో నెలకొనివున్న కాలంలోనే ఆయనకు ఆ దివ్యానుభూతుల సమగ్ర అవగాహన కలిగి ఉంటుందని భావిస్తున్నాం. శ్రీరామకృష్ణులు యోగదృష్టి సహాయంతో అవగాహన చేసుకొన్నప్పటికీ, మేం వాటికి యుక్తియుక్తమైన వివరణను ఇవ్వడానికి ప్రయత్నిస్తాం.

7. శ్రీరామకృష్ణుల అద్భుత అనుభూతుల పునరావృత్తి

మొట్టమొదట - తామొక భగవంతుని అవతారమని, ఆధికారిక పురుషుడని, తాము అనుష్ఠించిన ఆధ్యాత్మిక సాధనలన్నీ ఇతరుల నిమిత్తమే అని శ్రీరామకృష్ణుల దృఢవిశ్వాసం. ఇతరుల సాధన జీవితంతో తమ సాధన జీవితాన్ని పోల్చిచూసినప్పుడు ఆ రెండిటి మధ్య ఎంతో వ్యత్యాసం ఉండటం తమ వివేచనాశక్తితో గమనించారు. సామాన్య సాధకుడు ఏదో ఒక్క భావ మార్గాన్ని అవలంబించి, జీవితాంతం ఆ మార్గంలో సాధనలు అనుష్ఠించి, భావ ద్దర్శనం పొంది పరిపూర్ణ తృప్తిని పొందుతాడు. కాని శ్రీరామకృష్ణుల విషయం వేరు; ప్రతి భావ సాధనలోను స్వల్ప వ్యవధిలోనే ఆయన సాఫల్యం చెందారు. కాని అన్ని మతాల, అన్ని భావాల ప్రకారం సాధనలు అనుష్ఠించి విజయులయ్యే టంత వరకు ఆయన సంతృప్తి చెందలేదు. కారణం లేని కార్యం ఉండదు. తమ విషయంలో ఎందుకు యిలా జరిగిందనే కారణాన్ని కనుగొనబోయి, యోగారూఢులై తత్కారణాన్ని (అంటే తాము అవతారపురుషులని) పైన పేర్కొన్న రీతిలో ఆయన తెలుసుకొన్నారు. తాము శుద్ధ బుద్ధ ముక్త స్వభావుడు, సర్వశక్తిమంతుడైన ఈశ్వరుని విశేష అవతారం కావడంవల్లనే తమ విషయంలో అలా జరిగిందని ఆయన గ్రహించారు. అంతేకాక అసాధారణమైన తమ సాధనలు ఆధ్యాత్మిక రాజ్యం నుంచి ఒక కొత్త వెలుగును తీసుకువచ్చాయని, ఆ సాధనలన్నీ సర్వజీవ కల్యాణం కోసం అనుష్ఠింపబడినవే కాని తమ వ్యక్తిగత అక్కరలను తీర్చుకోవడానికి కాదని కూడ ఆయన గ్రహించారు.

8. తమను గురించిన అనుభూతులు:
i. తాము ఒక భగవదవతారం

జీవు లందరిలా కాక తమకు ముక్తి లేదని ఆయన ప్రగాఢ విశ్వాసం. సాధారణ తర్కంతో దీనిని అవగతం చేసుకోవడానికి ఎవరికైనా ఎంతో

ii. తమకు ముక్తి లేదనే విషయం

సమయం పట్టదు. ఎవరు ఈశ్వరుని నుండి అభిన్నుడో, ఈశ్వరాంశ సంభూతుడో, శుద్ధ బుద్ధ ముక్తస్వభావుడో, అక్కరలులేని పరిమితిలేని అలాంటి వ్యక్తి యొక్క ముక్తిని గురించిన ప్రస్తావన ఎందుకు? జీవుల ఉద్ధరణమనే భగవత్కార్యం ఎంతకాలం వరకు కొనసాగుతుందో అంతకాలం యుగయుగాల్లో అవతరించి ఆ కార్యాన్ని నిర్వర్తించే ఆ వ్యక్తికి ముక్తి ఎలా కలుగుతుంది? శ్రీరామకృష్ణులు తరచూ చెప్పినట్లు, ''జమీలో ఎక్కడ ఉపద్రవం చెలరేగినా కార్యనిర్వహణాధికారి అక్కడకు పరుగెత్తుకొని వెళ్లక తప్పదు.'' యోగదృష్టితో తమను గురించి పై విషయాలతోబాటు మరో విషయం కూడ ఆయన గ్రహించారు. వాయవ్య దిశను చూపుతూ, భవిష్యత్తులో మళ్లీ తాము ఆ వైపునకు రావలసి వస్తుందని ఆయన మాతో పదే పదే చెప్పివున్నారు. ఆగమన సమయాన్ని గురించి కూడ గురుదేవులు తమకు తెలియ చేశారని మాలో కొందరు భక్తులు[1] చెబుతున్నారు. వారితో ఆయన ఇలా అన్నారట: ''రెండు వందల సంవత్సరాల పిదప నేను ఆ వైపునకు రావలసివుంది. అప్పుడు అనేకులు ముక్తి పొందుతారు. ఆ సమయంలో ముక్తి లభించని వారు అప్పటి నుంచి దీర్ఘకాలం వేచివుండవలసి ఉంటుంది.''

భావసమాధి స్థితిలో ఆయన తన మరణాన్ని గురించి అది తటస్థించడానికి చాలాకాలం క్రితమే తెలుసుకొన్నారు. ఒకరోజు దక్షిణేశ్వరంలో భావా

iii. తమ మరణాన్ని గురించిన ఎరుక

విష్టులై ఉన్నప్పుడు మాతృదేవితో ఆయన ఇలా చెప్పారు: ''ఎవరంటే వారి చేతుల నుండి నేను తినడం, కలకత్తాలో రాత్రుళ్లు గడపడం, ఎవరో అంతకు మునుపే కాస్త తిన్న ఆహారం నేను ఆరగించడం - ఇవి జరగడం నువ్వు ఎప్పుడు చూస్తావో, నా మరణం సమీపంలో ఉన్నదని గ్రహించు.'' మరో సందర్భంలో మాతృదేవితో, భావావిష్టులై ఆయన, ''అవసానదశలో పాయసాన్నం తప్ప మరేమీ తినను'' అని చెప్పారు. ఇదెలా యథార్థంగా జరిగిందో మరోచోట[2] మేం తెలిపివున్నాం.

ఇప్పుడు మేము రెండవ కోవకు చెందిన ఆయన అనుభూతులు, అంటే ఆధ్యాత్మికతకు చెందిన అనుభూతులను నమోదు చేస్తున్నాం. అన్ని మతాల సాధనలలోను సిద్ధిని సముపార్జించిన తదనంతరం 'అన్ని మతాలూ సత్యాలే -

---

1. గిరీశ్‌చంద్ర ఘోష్ తదితరులు.
2. గురుభావం, III.2

ఎన్ని మతాలో అన్ని మార్గాలు' అనే ప్రగాఢ విశ్వాసం శ్రీరామకృష్ణులకు కలిగింది. యోగశక్తితోను, సాధారణ వివేచనతోను శ్రీరామకృష్ణులు దాన్ని అవగతం చేసుకొన్నారు. ప్రధాన మతధర్మ సాధనలన్నిటినీ అనుష్ఠించి, ప్రతి సాధన చరమ ఫలాన్నీ ఆయన అనుభవైకవేద్యం చేసుకొన్నారు. ఈ సత్యాన్ని ప్రకటించి లోకంలో నెలకొనివున్న ధర్మగ్లానిని అరికట్టి, మతవైషమ్యాన్ని ఆపడమే ప్రస్తుత యుగంలో యుగావతారులైన శ్రీరామకృష్ణుల ఆవిర్భావ ఉద్దేశం అని గ్రహించడానికి ఎవరికీ అట్టేసేపు పట్టదు. ఇంతకు మునుపు ఏ అవతారపురుషుడూ సాధనలు అనుష్ఠించి, 'మతాలన్నీ కూడ సత్యాలే, భగవత్సాక్షాత్కారానికి మార్గాలే' అనే సత్యాన్ని తమ తమ జీవితాలలో సంపూర్ణంగా అనుభూతం చేసుకొని, ఆ సత్యాన్ని ప్రకటించి ఉండలేదు. ఆధ్యాత్మిక మత సిద్ధాంతాల ఉదారత మేరకు అవతారపురుషుల ఘనతను నిర్ణయించినప్పుడు, ఆ సత్యాన్ని ప్రకటించినందుకు నిస్సంశయంగా అగ్రతాంబూలం శ్రీరామకృష్ణులకే అందించవలసి ఉంటుంది.

9. ఆధ్యాత్మికతకు చెందిన అనుభూతులు:

i. అన్ని మతాలూ సత్యాలే - ఎన్ని మతాలో అన్ని మార్గాలు

ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం - ఆధ్యాత్మిక ప్రగతి భేదం మేరకు ప్రతి వ్యక్తికీ ఇవి స్వతస్సిద్ధంగా వచ్చి చేరుతవి. 'కాబట్టి ఇవి పరస్పర విరుద్ధాలు కావు, కాని మనిషి మనస్సు యొక్క పరిణామ వికాస క్రమంలోని ప్రత్యేక స్థితులపై అవి ఆధారపడి ఉన్నవి' అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. శాస్త్రాలను అవగాహన చేసుకోవడంలో శ్రీరామకృష్ణుల ఈ అనుభూతులు ఎంత అపరిమిత సహాయకారులో కాస్త యోచిస్తే స్పష్టమౌతుంది. సత్యద్రష్టలైన ఋషులచే ఆవిష్కృతం కాబడి వేదాల, ఉపనిషత్తుల, ఇతర శాస్త్రాలలో లిపిబద్ధం చేయబడినా ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత మత సత్యాలు సరైన రీతిలో అర్థంచేసుకోబడక ఎంత గందరగోళం ఉత్పన్నం చేశాయో, శాస్త్రోక్త ఆధ్యాత్మిక మార్గం ఎంత జటిలతమమైనదో మాటల్లో చెప్పతరం కాదు. ఆ మత శాఖల పరస్పర సముచిత సామరస్యాన్ని కనుగొనలేక, ఈ మతాలను అవలంబించేవారు శాస్త్రపాఠాలకు తప్పుడర్థాలు జోడించియైనా సరే తాము ప్రచారం చేస్తూన్న మత సంప్రదాయం ఒక్కటే శాస్త్రాల కచ్చితమైన వ్యాఖ్యానమని ఋజువుపరచడానికి గట్టి ప్రయత్నమే చేశారు. వ్యాఖ్యాతల ఈ ప్రయత్న ఫలితంగా శాస్త్ర విచారం అనే పేరు వినగానే జనంలో భయం గూడకట్టుకోసాగింది. ఈ భయం వారిలో శాస్త్రాలపట్ల విశ్వాసాన్ని సడలించింది; తద్ద్వారా భారతదేశపు ఆధ్యాత్మికతకు భ్రష్టత పట్టింది. అందుకనే యుగావతారులైన శ్రీరామకృష్ణులకు ద్వైతం,

ii. ప్రతివ్యక్తీ తన మనఃస్థితుల మేరకు ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత తత్త్వాలను అంగీకరింపవలసిందే!

విశిష్టాద్వైతం, అద్వైతం అనే ఈ మూడు మత సిద్ధాంతాలను స్వకీయ జీవితంలో విభిన్న దశలలో అనుభూతం చేసుకొని, వాటి అద్భుత సామరస్యాన్ని జనబాహుళ్యానికి ప్రచారం చేయవలసిన ఆవశ్యకత కలిగింది. శాస్త్రమర్మాన్ని సమ్యగ్రూపంలో అవగతం చేసుకోగోరితే వాటిని గురించి శ్రీరామకృష్ణుల ఈ నిశ్చితాభిప్రాయాన్ని మనం జ్ఞాపకం చేసుకోవడం ఒక్కటే మార్గం:

''అద్వైత సాక్షాత్కారమే చరమస్థితి అని తెలుసుకోం; అది మనోవాక్కులకు అతీతమైన అనుభూతి.

''విశిష్టాద్వైతం వరకు ఉన్న స్థితులను మనోబుద్ధుల ద్వారా అవగాహన చేసుకోవచ్చు, వర్ణించవచ్చు. ఈ స్థితిలో నిత్యం, లీల ఈ రెండూ సత్యాలే. ఈ స్థితిలో చిన్మయ నామం, చిన్మయధామం, చిన్మయశ్యాం (అంటే భగవంతుడు, ఆయన నామం, ఆయన ధామం) అన్నీ చిన్మయస్వరూపాలే.

''విషయాసక్తి ప్రబలంగా ఉన్న సామాన్యులకు ద్వైతభావ మార్గమే, భక్తి మార్గమే ఉపయుక్తం. నారదపంచరాత్రంలో నిర్దేశించినట్లు బిగ్గరగా భగవన్నామ సంకీర్తనాదులను గానం చేయడమే సముచితం.''

iii. కర్మయోగాన్ని ఆశ్రయిస్తే సామాన్యంగా జనం ప్రగతి నొందుతారు

మనిషి ఆధ్యాత్మిక ప్రగతిలో కర్మలకు పరిమితిని నిర్ణయించి శ్రీరామకృష్ణులు అనేవారు: ''సత్వగుణోపేతులైన వ్యక్తుల కర్మ స్వతస్సిద్ధంగానే తొలగిపోతుంది; ప్రయత్నం మీద కూడ వారు కర్మ ఒనరించలేరు. ఉదాహరణకు ఒక ఇంటి కోడలిని తీసుకోండి. కోడలు గర్భందాల్చి ప్రసవకాలం సమీపించేకొద్దీ గృహకృత్యాలు తగ్గుతూవస్తాయి. ప్రసవానంతరం ఆమెకు మరే పనీ ఉండదు, బిడ్డ ఆలనాపాలనా తప్ప. కాని సత్వగుణరహితులైన ఇతరులందరూ భగవంతునిపై పూర్తిగా భారం మోపి, సంపన్నుని గృహంలో పనిచేసే దాసీలా[1] సాంసారిక కర్తవ్యాలను అనాసక్తులై నిర్వర్తించాలి. ఈ విధమైన కర్తవ్య నిర్వహణకే కర్మయోగం అనిపేరు. భగవంతుని నామజపంతో ఆయనను

---

1. ఒక సంపన్నుని గృహంలో ఒక దాసీ పనిచేస్తూవుంటుంది. ఆమె తన విధులను జాగ్రత్తగా నిర్వర్తిస్తూ, ఇంటి వస్తువులను జాగ్రత్తగా కాపాడుతూ, యజమాని బిడ్డలను తన సొంతబిడ్డల్లా ముద్దుమురిపాలతో పెంచుతూ, ఇతరులతో ఆ కుటుంబ సభ్యురాలిగా మెలగుతూ, ఆ కుటుంబం నిమిత్తం ఇతరులతో తగాదాపడడానికి సైతం వెనుదీయక ఆ కుటుంబాన్ని సేవిస్తూ ఉంటుంది. కాని తాను ఆ కుటుంబంలోని వ్యక్తినికాననీ, యజమాని లేక యజమానురాలి ఒక్క మాటతో తాను ఆ ఇంటిని వదిలివేయవలసి ఉంటుందనీ, తన సొంత ఇల్లు, మనుషులు →

ధ్యానిస్తూ పైన తెల్పిన రీతిలో అనాసక్తతతో ఇతర కర్తవ్యాలను నిర్వర్తించడం - ఇదే వారికి తరుణోపాయం.

జగజ్జనని చేతుల్లో ఉపకరణప్రాయులైన తాము, తమ జీవితంలో ప్రకటితమైన ఉదారమతానికి ఉపయుక్తమైన ఒక నూతన సంప్రదాయాన్ని స్థాపింపవలసి ఉందని శ్రీరామకృష్ణులు గ్రహించారు. మథుర్‌బాబు జీవించి ఉన్నకాలంలోనే శ్రీరామకృష్ణులకు ఈ సంగతి అనుభవంలోకి వచ్చింది. ఆధ్యాత్మిక పురోగతికై భక్తు లనేకులు తమ వద్దకు రానున్నారని జగజ్జనని తమకు తెలిపిందని ఆయన మథుర్‌కు చెప్పారు. తదనంతర కాలంలో ఇది వాస్తవమైందని చెప్పడం అనవసరం. కాశీపూర్ ఉద్యాన గృహంలో ఒకసారి ఆయన తమ ఛాయాచిత్రాన్ని తిలకిస్తూ, ''ఉత్కృష్ట యోగావస్థను కనబరచే ఛాయాచిత్రం ఇది. రాబోయే కాలంలో ప్రతి గృహంలోనూ ఈ మూర్తి[2] పూజింపబడుతుంది'' అని మాకు చెప్పారు.

iv. ఉదార ధర్మ సంప్రదాయ సుస్థాపన

''ఎవరికి ఈ జన్మ కడపటిదో వారందరూ నా వద్దకు ఆధ్యాత్మిక ఉన్నతికై వస్తారు'' అని తమ యోగశక్తితో ఆయన గ్రహించడమే కాక దానిని ప్రగాఢంగా విశ్వసించారు కూడ. దీనిని గురించిన మా అభిప్రాయాన్ని పాఠకులకు మరోచోట[3] తెలియచేసినందున ఇక్కడ తిరిగి చెప్పడం లేదు.

5. కడపటి జన్మలో ఉన్న వారంతా ఆయన ఉపదేశాలు అంగీకరించారు

శాస్త్రపారంగతులైన ముగ్గురు ప్రసిద్ధ సాధక - పండితులు శ్రీరామకృష్ణుల సాధనాకాలంలోని మూడు ప్రధాన ఘట్టాలలో ఆయన వద్దకు వచ్చారు. వారు కళ్లారా ఆయన ఆధ్యాత్మిక స్థితులను తిలకించారు. వాటిపై చర్చించే అవకాశం కూడ వారు పొందారు. శ్రీరామకృష్ణులు తాంత్రిక సాధనలో సిద్ధులైన పిదప పద్మలోచన పండితుడు ఆయనను దర్శించాడు. వైష్ణవ సాధనలలో శ్రీరామ

→

దూర గ్రామంలో ఉన్నారనీ ఆమెకు సదా జ్ఞాపకం ఉంటుంది. అదే విధంగా, ఓ సంసారివైన మనిషీ! సంసారంలో జీవించు, నీ కుటుంబసభ్యులతో కలిసిమెలసి వ్యవహరించు, విధ్యుక్తంగా వారికి సేవలొనరించు. కాని నీ అంతరాంతరాల్లో వారెవ్వరూ నీవారు కారనీ, నీ ఇల్లు, నిజమైన నీ బంధుగణం స్వర్గరాజ్యంలో ఉన్నారనీ, వారి జీవితానికి ఉనికికి భగవంతుడే కేంద్రమనీ ఎరిగివుండు. -శ్రీరామకృష్ణ కథామృతం నుండి సంకలితం

2. శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులై కూర్చున్న ఛాయాచిత్రం.
3. గురుభావం, ఉత్తరార్థం IV.4

కృష్ణులు పరిపూర్ణత్వం సంతరించుకొన్న తదుపరి వైష్ణవచరణ్ ఆయనను కలుసుకొన్నాడు. శ్రీరామకృష్ణులు సాధనలన్నీ పూర్తిచేసి, తద్ద్వారా జనించిన దివ్యశోభతో వెలుగొందుతున్న సమయంలో ఆయనను దర్శించుకొనే ప్రత్యేక అవకాశం గౌరీపండితుడికి దక్కింది. ''మీలో భగవదావిర్భావాన్ని, దివ్యశక్తి అభివ్యక్తీకరణను నేను చూస్తున్నాను'' అని పద్మలోచన పండితుడు శ్రీరామకృష్ణులను చూడగానే అన్నాడు. శ్రీరామకృష్ణులు భావసమాధిమగ్నులై ఉండగా చూసి వైష్ణవచరణ్ ఆయనను భగవదవతారంగా కీర్తిస్తూ సంస్కృతంలో ఆశువుగా స్తుతించాడు. అదే విధంగా శ్రీరామకృష్ణులను చూడగానే గౌరీ పండితుడు ఇలా పలికాడు: ''నేను చదివిన శాస్త్రాలలో వర్ణింపబడిన ఉత్కృష్ట ఆధ్యాత్మిక స్థితులన్నీ మీలో ప్రత్యక్షంగా అభివ్యక్తమై కానవస్తున్నాయి. అంతే కాదు, ఆ శాస్త్రాలలో నమోదుకాని అత్యున్నత భావావస్థలు కూడ మీలో ప్రత్యక్షంగా అభివ్యక్తమై ఉండటం చూస్తున్నాను. మీ స్థితి వేదవేదాంతాలు, తదితర శాస్త్రాలలో పేర్కొన్న స్థితుల నన్నిటినీ అతిక్రమించి చాలాదూరం పోయింది. మీరు మానవమాత్రులు కారు. అవతారాలన్నిటికీ ఏది మూలమో ఆ వస్తువు మీరే.'' శ్రీరామకృష్ణుల అపూర్వ జీవిత చరిత్రను, ఇంతకు మునుపు పేర్కొన్న ఆయన అద్భుత అనుభూతులను చదివినప్పుడు ఆ ప్రసిద్ధ సాధక పండితులు శ్రీరామకృష్ణులను ముఖస్తుతికై అలా ప్రశంసించలేదన్న విషయం మనం స్పష్టంగా గ్రహించగలం. ఆ సాధక పండితులు దక్షిణేశ్వరానికి విచ్చేసిన సమయాలను ఈ క్రింది విధంగా రూఢిపరచవచ్చు:

10. విభిన్న సమయాల్లో శ్రీరామకృష్ణులను దర్శించిన ముగ్గురు ప్రసిద్ధ సాధకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు

ప్రప్రథమంగా దక్షిణేశ్వరంలో వసిస్తూ ఉన్నప్పుడు మాతృదేవి గౌరీ పండితుణ్ణి అక్కడ చూసింది. మళ్లీ, మథుర్‌బాబు సజీవుడై ఉన్నప్పుడు గౌరీ పండితుడు దక్షిణేశ్వరానికి వచ్చాడన్న విషయం శ్రీరామకృష్ణుల నుండి మేం విన్నాం. కాబట్టి గౌరీపండితుడు క్రీ.శ. 1871వ సం॥లో ఎప్పుడో దక్షిణేశ్వరానికి వచ్చి క్రీ.శ. 1873వ సంవత్సరం వరకు శ్రీరామకృష్ణులతో నివసించి ఉన్నట్లు తెలియవస్తోంది. తాము సముపార్జించిన శాస్త్రజ్ఞానాన్ని తమ స్వీయ జీవితాలలో ఆచరణయుతం చేయగోరిన సాధక - పండితులను చూడాలనే ఆకాంక్ష సదా శ్రీరామకృష్ణులకు ఉండేది. శ్రీయుత గౌరీకాంత భట్టాచార్య తర్కభూషణ్ (గౌరీపండితుని పూర్తిపేరు) పైన పేర్కొన్న సాధకుల కోవకు చెందిన వాడు. కనుక అతణ్ణే చూడగోరి మథుర్‌బాబు ద్వారా ఆహ్వానం పంపి శ్రీరామకృష్ణులు అతణ్ణే దక్షిణేశ్వరానికి రావించారు. శ్రీరామకృష్ణుల జన్మస్థలానికి సమీపంలో ఉన్న

11. పండితుల ఆగమన సమయాల నిరూపణ

ఇందేశ్ గ్రామ వాస్తవ్యుడు గౌరీపండితుడు. హృదయ్ తమ్ముడైన రాంరతన్, మథుర్‌బాబు ఆహ్వాన పత్రికను తీసుకొని వెళ్లి గౌరీకాంతుని దక్షిణేశ్వర కాళికాలయానికి తోడ్కొని వచ్చాడు. సాధనానుష్ఠాన ఫలితంగా గౌరీపండితుడు సముపార్జించిన అద్భుతశక్తి గురించి, దక్షిణేశ్వరం వచ్చాక శ్రీరామకృష్ణుల సాంగత్య ప్రభావంలో అతడిలో క్రమంగా పెల్లుబికిన తీవ్ర వైరాగ్యం ఫలితంగా అతడి సంసార పరిత్యాగ వైనం గురించి పాఠకులకు మరోచోట[1] వివరించాము.

'అన్నమేరు' ఉత్సవాన్ని మథుర్‌బాబు 1864వ సం॥ జరిపించాడని 'రాణీ రాస్మణి జీవిత చరిత్ర' అనే పుస్తకం ధృఢీపరుస్తున్నది. ఆ సందర్భంలో పద్మలోచన్ పండితుని దక్షిణేశ్వరానికి ఆహ్వానించి, అతడికి కానుకలు చెల్లించాలనే తీవ్ర అభిలాష మథుర్‌కు కలిగిందని మేం శ్రీరామకృష్ణుల ముఖతా వినివున్నాం. ఇందుమూలంగా వేదాంతశాస్త్రపారంగతుడైన పద్మలోచన భట్టాచార్య తర్కాలంకార్ క్రీ.శ. 1864వ సంవత్సరంలో శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చివుంటాడని తెలియవస్తోంది.

అట్లే ఉత్సవానంద గోస్వామి కుమారుడైన వైష్ణవచరణ్ దక్షిణేశ్వరానికి అరుదెంచిన సమయం సులువుగా నిర్ధరించవచ్చు. శ్రీరామకృష్ణుల అలౌకికత్వాన్ని గురించి వైష్ణవచరణ్ మొదట భైరవీ బ్రాహ్మణి యోగేశ్వరితోను, పిదప గౌరీ పండితునితోను చర్చించిన విషయం శ్రీరామకృష్ణుల నుండి మేం విన్నాం. బ్రాహ్మణిలా అతడు కూడ వైష్ణవశాస్త్రాలు పేర్కొంటున్న మహాభావ లక్షణాలన్నీకూడ శ్రీరామకృష్ణుల మనశ్శరీరాలలో అభివ్యక్తమై ఉండటం చూసి విస్మయుడై, శ్రీరామకృష్ణులు శ్రీ గౌరాంగుని అవతారమనే బ్రాహ్మణి నిర్ణయంతో ఏకాభిప్రాయానికి వచ్చాడు. పైన ప్రస్తావించిన సంగతులు విన్న పిదప వైష్ణవచరణ్, శ్రీరామకృష్ణులు మధురభావ సాధనలో పరిపూర్ణులైన తదనంతరం, అంటే 1865వ సం॥లో మొదటిసారి ఆయన వద్దకు వచ్చాడని గ్రహించవచ్చు. అప్పటినుండి అతడు 1873వ సం॥ వరకు తరచు దక్షిణేశ్వరానికి వచ్చిపోతూ ఉండేవాడు.

పైన ప్రస్తావించిన అనుభూతులు కలిగిన తదనంతరం ఈశ్వరప్రేరణ ద్వారా శ్రీరామకృష్ణుల మనస్సులో ఒక కొత్త ప్రబలమైన ఆకాంక్ష తలెత్తింది. యోగారూఢ స్థితిలో గతంలో తాము చూసిన భక్తులకు కలుసుకోవాలని, తమ ఆధ్యాత్మిక శక్తిని వారికి అందించాలని ఆయన ఎంతో ఆతురత చెందారు. దానిని గురించి ఆయన ఇలా చెప్పారు: ''ఆ ఆతురతకు హద్దూ అదుపూ లేక

---

1. గురుభావం, పూర్వార్ధం 3.1.36

పోయింది. పగటి వేళ యావత్తూ ఆ ఆతురతను మహాకష్టంతో ఏదోరకంగా

12. తమ ఆంతరంగిక భక్తులను చూడగోరడం - బిగ్గరగా వారిని పిలవడం

హృదయంలో అదిమి ఉంచగలిగేవాణ్ణి. లౌకికుల పనికిమాలిన విషయతుల్యమైన ప్రసంగాలు వింటూ, అవి అసహనీయమైనప్పుడు వారంతా (రానున్న భక్తులు) వచ్చినప్పుడు భగవంతుని గురించి ప్రసంగించి ప్రాణం చల్లబరచుకొంటాను, నా ఆధ్యాత్మిక అనుభూతులు వారికి తెలిపి హృదయ భారాన్ని తగ్గించుకొంటాను అని ఏమేమో ఊహించుకొనేవాణ్ణి. వాళ్లు వస్తారనే భావన నాలోను, నా చుట్టూ ప్రతి విషయంలోను అల్లుకుపోయి, ఎడతెరపి లేకుండా వారిని గురించే చింతన చేసే దశకు వచ్చేశాను. ఎవరికి ఏం చెప్పాలో, ఎవరికి ఏం ఇవ్వాలోనని సంసిద్ధుడనై ఉన్నాను. పగలు గడచిపోయి సాయంత్రం కాగానే నాలో ఉప్పొంగుతూవున్న ఆ ఆతురతను ఎంతటి సహనంతోనూ నియంత్రించుకోలేకపోయేవాడిని. మరోరోజు గడిచిపోయిందే, వాళ్లు ఇంకా రాలేదే అనే ఆలోచన రేకెత్తేది. ఆలయంలో శంఖారావం మారుమ్రోగసాగినప్పుడు యజమానుల భవనం పై కెళ్లి, మానసిక వ్యథ కారణంగా చెలరేగిన అశాంతితో, అశ్రుధారలు స్రవిస్తూండగా, బిగ్గరగా, 'నా బిడ్డలారా ఎక్కడున్నారు? రండి, అందరూ రండి. మిమ్మల్ని చూడకుండా ఇక నేను ఉండలేను' అని నేను పెట్టిన కేకలతో ఆలయ ఆవరణ ప్రతిధ్వనించేది. ఏ తల్లి అయినా తన బిడ్డలను చూడడానికి ఇంతటి ఆతురతను అనుభవించిందో లేదో సందేహమే! ప్రేయసీ ప్రియులు లేదా మిత్రద్వయం పరస్పరం కలుసుకోవడానికి అంత తహతహ చెందివుంటారని నేనెన్నడూ విని ఉండలేదు! నేను అనుభవించిన ఆతరతతో ప్రాణం తల్లడిల్లిపోయేదనే చెప్పాలి. ఇది జరిగిన కొన్ని రోజుల తరువాత భక్తులు ఒకరొకరుగా రాసాగారు.''

ఆ విధంగా శ్రీరామకృష్ణుల ఆతురతతో కూడిన పిలుపు తదుపరి భక్తులు దక్షిణేశ్వరానికి రావడానికి మునుపు కొన్ని ముఖ్యసంఘటనలు జరిగాయి. ఆ సంఘటనలు ప్రస్తుత విషయానికి ప్రత్యక్షంగా సంబంధించినవి కానందున, వాటిని ఈ గ్రంథం ప్రస్తుత విభాగపు అనుబంధంలో పొందుపరిచాము.

అనుబంధం

షోడశీపూజ నుండి ఆంతరంగిక భక్తుల రాక మొదలయ్యే వరకు శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగిన ప్రధాన సంఘటనలు

1. రామేశ్వర్ మరణం

షోడశీ పూజానంతరం 1873వ సంవత్సరం అక్టోబర్ నెలలో మాతృదేవి కామార్పుకూర్‌కు తిరిగి వచ్చేశారని మేం పాఠకులకు తెలిపేవున్నాం. ఆమె అక్కడకు చేరిన స్వల్పకాలానికే శ్రీరామకృష్ణుల చిన్న అన్నగారైన రామేశ్వర్ భట్టాచార్య సన్నిపాత జ్వరం (టైఫాయిడ్) సోకి మరణించాడు. శ్రీరామకృష్ణుల తండ్రి తరపు వంశీయులలోని స్త్రీ పురుషు లందరి జీవితాలలోను ఆధ్యాత్మికత ఏదో రూపంలో అభివ్యక్తం అయింది. శ్రీ రామేశ్వర్ గురించి దీనికి సోదాహరణగా మేం ఎన్నో విషయాలు వినివున్నాం.

2. రామేశ్వర్ ఉదార నైజం

రామేశ్వర్ ధారాళ మనస్తత్వం ఉన్న వ్యక్తి. సాధువులు, ఫకీరులు తన వాకిటి వద్ద కొచ్చి ఏది కోరినా - అది ఇంట్లో ఉంటే చాలు - తక్షణమే దాన్ని వారికి ఇచ్చేసేవాడు. ఫకీరులు ఆతడి వద్దకు వచ్చి వంట పాత్ర, నీటికుండ, దుప్పటి ఇత్యాదులు కోరగా, అతడు ఇంట్లో నుండి వాటిని తెచ్చి వారికి ఇచ్చేసేవాడని ఆతడి బంధువుల నుండి మేం వినివున్నాం. తన కుటుంబంలో ఎవరైనా ఇందుకు ఆక్షేపణ వ్యక్తం చేస్తే అతడు శాంతంగా, ''అతణ్ణి తీసుకోనీ! అడ్డు చెప్పకు! అటువంటి వస్తువులు అనేకం మళ్లీ వస్తాయి. ఎందుకు సతాయిస్తావు?'' అనేవాడు. జ్యోతిశ్శాస్త్రంలో కూడ అతడికి కొంత ప్రవేశం ఉంది.

రామేశ్వర్ దక్షిణేశ్వరం నుండి చివరిసారిగా కామార్పుకూర్‌కు వెళ్ల నున్నప్పుడు అతడు అక్కడ నుండి తిరిగి రాడనే యథార్థం శ్రీరామకృష్ణులకు

3. రామేశ్వర్ మరణం గురించి శ్రీరామకృష్ణుల హెచ్చరిక

తెలుసు. ఆయన భావసమాధిలో రామేశ్వర్‌తో, ''నువ్వు ఇంటికి వెళు తున్నావన్నమాట. వెళ్లు! కాని భార్యతో ఏకశయ్యాగతు డవు కాబోకు. అలా చేసే పక్షంలో నువ్వు బ్రతకడం సందేహమే'' అని హెచ్చరిక చేశారు. ఈ విషయం మాలో ఒకరు[1] శ్రీరామకృష్ణుల ముఖతా విన్నారు.

4. తల్లి సంవేదన పట్ల శ్రీరామకృష్ణుల అక్కర

ఇంటికి చేరుకొన్న కొన్ని రోజులకే రామేశ్వర్ రోగగ్రస్తుడయ్యాడనే వార్త అందింది. ఆ వార్త విని శ్రీరామకృష్ణులు, హృదయ్‌తో ''నా నిషేధాన్ని అతడు పాటించలేదు. ఇప్పుడతడు బ్రతకడం సందేహమే'' అని అన్నారు. ఈ వార్త అందిన ఐదారు రోజులకు రామేశ్వర్ మృతిచెందాడనే సమాచారం అందింది. వృద్ధురాలైన తన తల్లికి రామేశ్వర్ మరణ వార్త తీవ్ర ఆఘాతంగా పరిణమిస్తుందేమోనని శ్రీరామ కృష్ణులు భయపడ్డారు. ఆయన ఆలయానికి వెళ్లి తన తల్లిని శోకభారం నుండి రక్షించమని జగజ్జననిని దీనంగా ప్రార్థించారు. అలా ప్రార్థించాక తల్లిని ఊరడింప నహబత్‌కు వెళ్లి కన్నీళ్లతో ఈ విషాదవార్తను ఆమెకు తెలిపారు. స్వయంగా గురుదేవుల నుండి మేం ఈ విషయం వినివున్నాం - శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''అమ్మ ఈ విషాద వార్త విని స్పృహతప్పి పడిపోతుందనీ, ఈ ఆఘాతం తట్టుకొని బ్రతికివుండే అవకాశం తక్కువనీ నేను భయపడ్డాను. కాని తద్విరుద్ధంగా జరిగింది. ఆమె ఈ వార్త విని, ఒకింత బాధపడి, 'సంసారం అనిత్యం. నేడో రేపో అందరూ పోవలసిన వారే కాదా! కాబట్టి అందుకై విలపించి ప్రయోజనం లేదు' అంటూ నన్నే అనునయింపసాగింది. తంబురాను తారస్థాయి శ్రుతికి మీటినట్లుగా జగజ్జనని మా అమ్మ మనస్సును అత్యున్నత స్థాయిలో నిలిపి ఉంచినదనీ, అందుచేతనే ఈ ప్రాపంచిక దుఃఖశోకాలకు ఆమె చలించలేదనీ నాకు అనిపించింది. ఈ భావం మదిలో మెదలగానే జగజ్జననికి పదే పదే ప్రణామం చేసి, నిశ్చింతుడనయ్యాను.''

5. మరణ సమయంలో రామేశ్వర్ ప్రవర్తన

మరణించడానికి అయిదారు రోజులకు మునుపే తన ఆసన్న మరణం గురించి రామేశ్వర్ ఎరుగును. తన సన్నిహిత బంధువులకు ఈ సంగతి తెలిపి అంత్యక్రియల, శ్రాద్ధాదికర్మల ఏర్పాట్లన్నీ సిద్ధంచేసి పెట్టాడు. తన ఇంటికి ఎదురుగావున్న మామిడిచెట్లు ఏదో కారణంగా నరికివేయబడి ఉండటం చూసి, ''మంచిదే అయింది. నా అంతిమ సంస్కారానికి ఈ చెట్లు ఉపయోగపడుతుంది'' అని అన్నాడు. రామేశ్వర్

---

1. స్వామి ప్రేమానంద

అంతిమ క్షణాల వరకు పవిత్ర రామనామాన్ని జపిస్తూనే ఉన్నాడు. మరణం సంభవించడానికి కాస్సేపు ముందు మాత్రమే అతడు అపస్మారక స్థితిలో ఉండటం తటస్థించింది. తన భౌతికకాయాన్ని శ్మశానంలో దహనం చేయ వద్దనీ, శ్మశానం ప్రక్క నుండి వెళ్లే కాలిబాట క్రింద ఖననం చేయవలసిందనీ మరణించడానికి ముందు రామేశ్వర్ తన బంధువులను కోరాడు. అందుకు కారణం ఏమిటని అడిగినప్పుడు అతడు, ''ఆ బాట మీదుగా నడిచి వెళ్లే ఎందరో సాధువుల పాదధూళితో నాకు సద్గతి ప్రాప్తిస్తుంది'' అని చెప్పాడు. అర్ధరాత్రి వేళ రామేశ్వర్ మరణించాడు.

గోపాల్ అనే ఆ గ్రామస్థ డొకడు, రామేశ్వర్ చాలకాలం నుండి ఆప్త మిత్రులుగా ఉండేవారు. రామేశ్వర్ మరణించిన అదే సమయంలో తన ఇంటి తలుపును ఎవరో తట్టిన చప్పుడు విన్నానని గోపాల్ చెప్పాడు. ఎవరు అని అడగ్గా, ''నేను రామేశ్వర్‌ను. గంగా స్నానానికి పోతున్నాను. ఇంట్లో శ్రీరఘువీరుడు ఉన్నాడు. ఆయన సేవలో ఎలాంటి లోటూ రాకుండా కాస్త గమనిస్తూ ఉండు'' అనే జవాబు వినవచ్చింది. మిత్రుని పిలుపు విని గోపాల్ తలుపు తెరవబోతూండగా, ''నాకు దేహం లేదు. కాబట్టి తలుపు తెరిచినా నన్ను చూడలేవు'' అన్న మాటలు వినిపించాయి. అయినప్పటికీ గోపాల్ తలుపు తెరిచాడు. కాని అక్కడ ఎవరూ కనిపించలేదు. ఆ తరువాత తను విన్న విషయంలోని నిజానిజాలు తెలుసుకో గోరి అతడు రామేశ్వర్ ఇంటికి వెళ్లాడు. రామేశ్వర్ మరణం యథార్థమే అని అక్కడ గోపాల్ తెలుసుకొన్నాడు.

6. మరణానంతరం రామేశ్వర్ మళ్లీ కాన రావడం

1873వ సం॥లో, నలభై ఎనిమిదేళ్ల వయస్సులో తన తండ్రి రామేశ్వర్ మరణించాడని శ్రీరామ్‌లాల్ ఛటోపాధ్యాయ చెబుతున్నాడు. తన తండ్రి చితా భస్మాన్ని సేకరించుకొని కలకత్తా సమీపంలోని 'వైద్యవాటీ' అనే ప్రదేశానికి వచ్చి, అక్కడ దాన్ని గంగలో నిమజ్జనం చేశాడు. దక్షిణేశ్వరంలో ఉన్న శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లే నిమిత్తం పడవలో అక్కడ గంగానదిని దాటాడు. గంగను దాటుతూ బార క్పూర్‌లో నిర్మింపబడుతున్న అన్నపూర్ణాదేవి ఆలయాన్ని చూశాడతడు. మథుర్‌నాథ్ భార్యయైన జగదంబాదాసీ తరఫున నిర్మింపబడుతూన్న ఆ ఆలయ నిర్మాణం అప్పటికి సగం మాత్రమే పూర్తయింది. తదనంతరం ఆ ఆలయంలో దేవీ ప్రతిష్ఠాపన 1875వ సంవత్సరంలో జరిగింది. రామేశ్వర్ మరణానంతరం ఆయన స్థానే దక్షిణేశ్వర పూజారిగా రామ్‌లాల్ నియమితు డయ్యాడు.

7. దక్షిణేశ్వర పూజారిగా రామ్‌లాల్ నియామకం

మథుర్‌బాబు మరణానంతరం కలకత్తాలోని సిందూరియాపటీ పేట వాస్తవ్యుడైన శంభుచరణ్ మల్లిక్, శ్రీరామకృష్ణుల పరిచయ భాగ్యం పొందాడు.

8. శంభుమల్లిక్ ఉదంతం

క్రమంగా ఆయన పట్ల అతడు అత్యంత భక్తిప్రపత్తులు పెంపొందించుకొన్నాడు.[1] అప్పటికే శంభుబాబు బ్రహ్మ సమాజంపట్ల అమిత ఆకర్షితుడయ్యాడు. అతడి దానశీలత కారణంగా కలకత్తాలో పేరెన్నిక గాంచాడు. శ్రీరామకృష్ణుల పట్ల శంభుబాబు భక్తిప్రపత్తులు దినదినాభివృద్ధి చెందాయి. మథుర్‌బాబులా గురుదేవులను సేవించుకొనే విశేష భాగ్యం అతడికి దక్కింది. శ్రీరామకృష్ణులకు ఏవైనా వస్తువులు అవసరమైనాయని తనకు తెలిసీతెలియగానే శంభు వాటిని సరఫరా చేసేవాడు. శ్రీరామకృష్ణులను తన అంతిమ దినాల వరకు సేవించి ఎంతో సంతృప్తి చెందాడు. శ్రీరామకృష్ణులను అతడు 'గురూజీ' అని సంబోధించేవాడు. అలా సంబోధించడం పట్ల చిరాకు వ్యక్తం చేస్తూ ఆయన, ''గురువు ఎవరు? శిష్యుడెవరు? నువ్వే నా గురువువి'' అని ఆయన అనడం కద్దు. కాని శంభు అలా సంబోధించడం మానలేదు. తన జీవితాంతం ఆయనను అలాగే సంబోధిస్తూ వచ్చాడు. ఆయన దివ్యసాంగత్యంతో అతడి ఆధ్యాత్మిక పథం వెలుగొందింది, తత్ప్రభావంతో అతడి ఆధ్యాత్మిక జీవితం సఫలతను సంతరించుకొన్నదని శ్రీరామకృష్ణులను అతడు అలా సంబోధించడాన్ని బట్టి రూఢి పరచుకోవచ్చు. శంభుబాబు భార్య కూడ శ్రీరామకృష్ణులను సాక్షాత్తు దేవునిలా హృదయపూర్వకంగా ఆరాధించింది. మాతృదేవి దక్షిణేశ్వరంలో బసచేసిన సందర్భాలలో ఆమెను ప్రతి మంగళవారం[2] నాడు తమ స్వగృహానికి తోడ్కొని వెళ్లి షోడశోపచారాలతో మాతృదేవి పాదపద్మాలను పూజించేది.

మాతృదేవి దక్షిణేశ్వరానికి రెండవసారి 1874వ సంవత్సర వైశాఖ మాసంలో బహుశా వచ్చివుండవచ్చు. మునుపటిలా ఇప్పుడూ ఆమె శ్రీరామకృష్ణుల తల్లి (తన అత్తగారు)తో పాటు నహబత్‌లోనే నివసింపసాగింది. ఆ విషయం తెలిసే, ఆ చిన్నగదిలో ఆమెకు అసౌకర్యంగా ఉంటుందని

---

1. మథుర్ మరణానంతరం పానీహాటీ వాస్తవ్యుడైన శ్రీ మణిమోహన్ సేన్ శ్రీరామకృష్ణుల నిత్యావసర వస్తువుల సరఫరా బాధ్యతను తానుగానే స్వీకరించాడనే విషయం శ్రీరామకృష్ణులు ప్రస్తావించడం తాము విన్నామని కొందరు భక్తులు చెప్పారు. అప్పట్లో మణిసేన్ శ్రీరామకృష్ణుల పట్ల అమిత భక్తిప్రపత్తులు కలిగి తరచు ఆయన్ను దర్శించడం కద్దు. మణిమోహన్ తరువాత శంభు ఆ బాధ్యత పుచ్చుకొన్నాడు. కాని శ్రీరామకృష్ణులే స్వయంగా తమ రెండవ రసద్దారు (సరఫరాదారు) శంభుమల్లిక్ అని పేర్కొనడం జరిగింది. కనుక మణిసేన్ శ్రీరామకృష్ణుల సేవాబాధ్యతను తానుగా స్వీకరించినా ఎక్కువ కాలం దానిని నిర్వహించలేకపోయి ఉండవచ్చు.

2. వంగదేశంలో మంగళవారం దేవీపూజకు అతిశ్రేష్ఠమైన దినంగా పరిగణిస్తారు.

భావించి శంభు దక్షిణేశ్వర ఆలయం దగ్గర ఒక ఖాళీస్థలాన్ని రెండు వందల యాభై రూపాయలకు కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో విశాలమైన ఒక రెల్లుగడ్డి పైకప్పు గదిని ఆమె కోసం కట్టించాలని సంకల్పించాడు. ఆ సమయంలో కెప్టెన్ విశ్వనాథ్ ఉపాధ్యాయ్ అనే నేపాల్ ప్రభుత్వ అధికారి ఒకరు శ్రీరామకృష్ణులను సందర్శిస్తూ క్రమంగా ఆయన పట్ల విశేష భక్తిని పెంపొందించుకొన్నాడు. మాతృదేవి నిమిత్తం శంభు నిర్మించనున్న గది సంగతి తెలుసుకొని, అందుకు అవసరమైన కలపనంతా తాను సరఫరా చేస్తానని కెప్టెన్ విశ్వనాథ్ సంతోషంగా ముందుకు వచ్చాడు. నేపాల్ ప్రభుత్వానికి చెందిన సాల్ కలప వ్యాపారం యావత్తూ అతడి చేతులలో ఉండటమే ఇందుకు కారణం. అందు చేత అలా సరఫరా చేయడం అతడికి ఏమంత కష్టమూ కాదు, ఖర్చుతో కూడినదీ కాదు. గది నిర్మాణం ప్రారంభించగానే బేలూరు గ్రామంలోని తన కలప నిల్వల నుంచి విశ్వనాథ్ మూడు పెద్ద సాల్ కలప దుంగలను గంగా నీటి ప్రవాహం మీదుగా పంపించాడు. కాని నాటి రాత్రి నది ఉధృతమైన పోటులో ఉన్నందున ఒక కలప దుంగ నది దిగువకు కొట్టుకుపోయింది. ఈ విషయం తెలిసి హృదయ్ విసుగుచెంది మాతృదేవిని 'దురదృష్టవంతురాలు'గా పేర్కొనే వరకు వెళ్లాడు. ఒక దుంగ ప్రవాహంలో కొట్టుకొనిపోయిందని తెలిసి కెప్టెన్ మరో కలప దుంగను పంపించాడు. గది నిర్మాణం పూర్తయింది. మాతృదేవి ఆ గదిలో దాదాపు ఒక ఏడాదిపాటు నివసించింది. ఇంటి పనులలో సహాయం చేస్తూ మాతృదేవికి తోడుగా ఉండడానికి ఒక స్త్రీని నియమించారు. మాతృదేవి అక్కడ వంట చేసి నిత్యం శ్రీరామకృష్ణుల కోసం దక్షిణేశ్వరానికి భోజనం తీసుకుపోయేవారు. ఆయన భోజనం చేసిన తరువాత ఆమె వెనక్కు తిరిగి వచ్చేసేవారు. పగటి వేళ ఎప్పుడైనా శ్రీరామకృష్ణులు ఆమెను చూడ్డానికి ఆ గదికి వెళ్లేవారు. కాస్సేపు అక్కడ గడిపి మళ్లీ దక్షిణేశ్వర దేవాలయానికి తిరిగి వెళ్లిపోయేవారు. ఒకే ఒక్క రోజు మాత్రం ఈ నియమాన్ని ఆయన ఉల్లంఘించవలసిన అగత్యం ఏర్పడింది. ఆ రోజు మధ్యాహ్నం శ్రీరామకృష్ణులు అక్కడకు రాగానే కుంభవృష్టి ప్రారంభమై అర్ధరాత్రి దాటేవరకు ఆగలేదు. నాటి రాత్రి ఆయన ఆలయానికి తిరిగి పోవడం అసంభవమై అక్కడే గడపవలసిన అగత్యం ఏర్పడింది. మాతృదేవి ఆయనకు అన్నం, చారు వండి భోజనం వడ్డించింది. ఆయన భోజనం చేసి నాటి రాత్రి అక్కడే గడిపారు.

9. మాతృదేవి నిమిత్తం శంభు ఒక గది కట్టించి ఇవ్వడం

ఒక సంవత్సర కాలం ఆ గదిలో నివసించిన తరువాత మాతృదేవి అతిసార వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆమెకు స్వస్థత చేకూర్చడంలో శంభు

ఎంతో శ్రద్ధ వహించాడు. అతడు డ్యాక్టర్ ప్రసాద్‌ను రావించి మాతృదేవికి చికిత్స చేయించసాగాడు. కాస్త కోలుకొన్న తరువాత ఆమె బహుశా 1876వ సం॥లో జయరాంబాటిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. పుట్టింటికి చేరగానే వ్యాధి తిరగబెట్టడంతో ఆమె మంచం పట్టింది. క్రమంగా వ్యాధి ముదిరి ఆమె కోలుకోగలదా అన్న అనుమానం తలెత్తింది. అప్పటికే ఆమె తండ్రిగారైన శ్రీరామచంద్ర ముఖోపాధ్యాయ్ దివంగతుడయ్యాడు. కనుక మాతృదేవి తల్లి, తమ్ముళ్లు ఆమెకు తమ శక్తి మేరకు సేవలు అందించసాగారు. మాతృదేవి తీవ్ర అనారోగ్యం గురించి విని శ్రీరామకృష్ణులు ఇలా అన్నారని, మేం విన్నాం: ''కాబట్టి హృదూ! ఆమె (మాతృదేవి) ఈ లోకంలోకి కేవలం రావడం పోవడం మాత్రమే మిగిలాయి; మానవ జన్మ ఉద్దేశం (అంటే భగవత్సాక్షాత్కారం) నెరవేరకపోయిందే!''

10. మాతృదేవి తీవ్ర అనారోగ్యానికి గురి కావడం

ఏ రకమైన చికిత్సకూ వ్యాధి ఉపశమింపకపోవడంతో దేవి ఎదుట ప్రాయోపవేశం చేయ మాతృదేవి సంకల్పించింది. తల్లికి, తమ్ముళ్లకు ఈ విషయం తెలిస్తే వాళ్లు అందుకు అడ్డుపడతారని ఎంచి మాతృదేవి ఎవరికీ తెలుపకుండా గ్రామంలోని సింహవాహినీదేవి ఆలయానికి వెళ్లి ప్రాయోపవేశ వ్రతం ఆచరించింది. ప్రాయోపవేశ స్థితిలో ఆమె కేవలం కొన్ని గంటలు గడపగానే దేవి ప్రసన్నురాలై ఆమెకు స్వస్థత కలిగించే ఔషధం సూచించింది.

11. సింహవాహినీ ఆలయంలో మాతృదేవి ప్రాయోపవేశం

దేవి ఆదేశంగా ప్రాప్తమైన ఔషధం పుచ్చుకోగానే వ్యాధి తగ్గుముఖం పట్టి, క్రమంగా పూర్వపు శక్తిని ఆమె పుంజుకోగలిగింది. ఆ విధంగా మాతృదేవి ప్రాయోపవేశ వ్రతం ఆచరించి ఔషధం సంప్రాప్తించుకొన్న సంఘటనానంతరం, సింహవాహినీదేవి ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో జాగ్రదాదేవిగా[1] ప్రసిద్ధి కెక్కింది.

శ్రీరామకృష్ణులను, మాతృదేవిని దాదాపు నాలుగు సంవత్సరాలు శంభుబాబు సేవించాడు. పిదప రోగంతో మంచంపట్టాడు. ఒకరోజు శ్రీరామకృష్ణులు రోగంతో బాధపడుతున్న శంభును వెళ్లి పలకరించి వచ్చారు. తిరిగి వచ్చాక, ''శంభు జీవన దీపంలో చమురు ఇగిరిపోయింది'' అని అన్నారు. శ్రీరామకృష్ణుల వాక్కులు నిజమయ్యాయి. మధుమేహవ్యాధి జటిలమై అతడు కొద్దిరోజుల్లోనే మరణించాడు. శంభుబాబు పరమ ఉదారుడు, నిర్భయుడైన భక్తితత్పరుడు. రోగంతో బాధపడుతున్న సమయంలో ఒక్క రోజైనా అతడి మనోప్రసన్నత తగ్గింది లేదు. మరణించడానికి

12. మరణ సమయంలో శంభు నిర్భీక వర్తనం

---

1. జనంతో కలిసి జీవిస్తూ వారికి శుభం చేకూర్చే దేవి అని అర్థం.

కొన్ని రోజుల ముందు అతడు హృదయ్‌తో సంతుష్టహృదయుడై ఇలా అన్నాడు: ''మరణం గురించి నా కెలాంటి ఆరాటమూ లేదు. మూటాముల్లె సర్దుకొని పోవడానికి తయారుగా ఉన్నాను.'' శంభుబాబుతో పరిచయం ఏర్పడడానికి చాలాకాలం క్రితమే శ్రీరామకృష్ణులు భావసమాధి స్థితిలో జగజ్జనని అతణ్ణి తన రెండవ రసద్దారు (సరఫరాదారు)గా నియామకం చేయడం చూశారు. ప్రప్రథమంగా అతణ్ణి చూడగానే ఇతడే ఆ వ్యక్తి అని ఆయన గుర్తించారు.

అనారోగ్య కారణంగా తన పుట్టింటికి మాతృదేవి వెళ్లిపోయిన తరువాత శ్రీరామకృష్ణుల జీవితంలో ఒక ముఖ్య సంఘటన జరిగింది. 1876వ సంవత్సరం సరిగ్గా శ్రీరామకృష్ణుల పుట్టినరోజు నాడు ఆయన తల్లిగారైన చంద్రమణీదేవి తన ఎనభై ఐదవ ఏట పరమపదించింది. వృద్ధాప్యం కారణంగా చనిపోవడానికి కొన్ని సంవత్సరాలకు ముందు నుండి ఆమె మనస్సు, ఇంద్రియాల పటుత్వం చాలావరకు సన్నగిల్లిపోయాయి. ఆమె మరణం గురించి హృదయ్ నుండి మేం విన్నది ఇక్కడ పొందుపరుస్తున్నాం.

13. చంద్రమణీదేవి అంతిమ దినాలు

చంద్రాదేవి మరణించడానికి నాలుగు రోజుల ముందు హృదయ్ సెలవు పుచ్చుకొని ఒకసారి ఇంటికి వెళ్లివద్దామనుకొన్నాడు. కాని ఏదో తెలియరాని భయంతో అతడి మనస్సు ఆరాటం చెందింది. శ్రీరామకృష్ణులను ఒంటరిగా వదలి వెళ్లడానికి అతడికి మనస్కరించలేదు. హృదయ్ తన భయోద్రేకాన్ని శ్రీరామకృష్ణులకు వ్యక్తం చేయగా, ఆయన, ''అయితే నువ్వు వెళ్లవద్దు'' అని అన్నారు. మూడు రోజులు ఏ అవాంఛనీయ సంఘటనా జరక్కుండానే గడచిపోయాయి.

ప్రతి రోజు శ్రీరామకృష్ణులు తల్లి వద్దకు వెళ్లి కొంతసేపు ఆమె వద్ద గడిపి, స్వహస్తాలతో ఆమెకు సేవలందించేవారు. హృదయ్ కూడ అట్లే చేసేవాడు. 'కాళీతల్లి' అనే పరిచారిక దాదాపు పగలంతా ఆ వృద్ధురాలిని కనిపెట్టుకొనే ఉండేది. ప్రస్తుతం ఆమె హృదయ్ పట్ల సుముఖంగా ఉండడం లేదు. అందుకు కారణం: అక్షయ్ మరణించినప్పటి నుండి అక్షయ్‌ను హృదయ్ చంపాడనీ, తన కుమారుణ్ణీ కోడలినీ కూడ చంపే ప్రయత్నంలో ఉన్నాడనీ ఒక వెర్రితలంపు ఆమె మనస్సులో గాఢంగా పాదుకుపోయింది. అందుకే ఆమె అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులను, ''హృదయ్ మాటలకు ఎన్నడూ చెవి ఒగ్గకు'' అని హెచ్చరించేది. వయోభారం, అస్థిరత మూలంగా ఆమెలో పరిస్థితులను అవగతం చేసుకొనే శక్తి సన్నగిల్లినట్లు మరెన్నో విషయాల నుండి తెలియవస్తున్నది. ఈ క్రింది విషయం ఉదాహరణగా తీసుకోవచ్చు: దక్షిణేశ్వర కాళికాలయం ప్రక్కనే ఆలం బజార్ జనుపనార మిల్లు నెలకొనివుంది. ప్రతి రోజు మధ్యాహ్నం మిల్లులోని

పనివారికి అరగంట సేపు విరామం ఇచ్చేవారు. అరగంట తరువాత పని ప్రారంభించడానికి సంకేతంగా ఈల ధ్వని వినవచ్చేది. ఈ ఈల ధ్వని విని చంద్రాదేవి అది వైకుంఠంలో ధ్వనించే శంఖారావం అని నిర్ణయించుకొంది. కనుక ఆమె ఆ ఈల ధ్వని వినవచ్చే వరకు భోజనానికి కూర్చునేది కాదు. భోజనం చెయ్యమని ఆమెను అడిగితే, ''ఇప్పుడే ఎలా భోజనం చేస్తాను? ఇంకా లక్ష్మీనారాయణునికి నైవేద్యం కాలేదే! వైకుంఠం నుండి శంఖారావం వినబడలేదు. ఎవరైనా నైవేద్యం కాకుండా తినవచ్చునా?'' అని అడిగేది. మిల్లు సెలవు రోజుల్లో ఈల ధ్వని వినరానందున ఆ వృద్ధురాలిని భోజనానికి కూర్చోబెట్టడం ఎంతో కష్టంగా ఉండేది. ఆమె చేత భోజనం తినిపింపజేయడానికి శ్రీరామకృష్ణులు, హృదయ్ ఎన్నో ఉపాయాలు ఆలోచింపవలసివచ్చేది.

ఏది ఎలావున్నప్పటికీ నాలుగవ రోజు రానేవచ్చింది. ఆమెలో అనారోగ్య లక్షణాలు ఏవీ పొడసూపలేదు. చీకటిపడ్డాక శ్రీరామకృష్ణులు ఆమె వద్దకు వెళ్లి తన చిన్ననాటి సంఘటనలు, వాటి వివరాలు ముచ్చటిస్తూ ఆమెను ఆనందింప చేశారు. ఆమెను పడుకోబెట్టి శ్రీరామకృష్ణులు తమ గదికి వచ్చేసరికి అర్ధరాత్రి అయింది.

మర్నాడు భళ్లున తెల్లవారింది. ఉదయం ఎనిమిది గంటలయింది. కాని ఆ వృద్ధురాలు తలుపు తీసి బయటికి రాలేదు. 'కాళీ తల్లి' నహబత్ మొదటి అంతస్తులోని ఆమె గది తలుపు వద్దకెళ్లి పదేపదే ఆమెను పిలిచింది. కాని ఏ బదులూ రాలేదు. తలుపుకు చెవి ఆన్చి వినగా వృద్ధురాలి కంఠం నుండి గురగుర శబ్దం రావడం వినిపించింది. భయంతో వెంటనే ఆ విషయం శ్రీరామకృష్ణులకు, హృదయ్‌కు తెలిపింది. హృదయ్ వచ్చి చాకచక్యంతో బయట నుంచి లోపలి గడియ తీసి వెళ్లి చూడగా, చంద్రాదేవి స్పృహకోల్పోయి పడివుంది. వెంటనే అతడు ఆయుర్వేద ఔషధం తెచ్చి ఆమె నాలుకపై పెట్టాడు. కాస్త పాలు, గంగాజలం కూడ ఆమె గొంతులో పోయసాగాడు. మూడు రోజులు ఆమె అదే స్థితిలో ఉండిపోయింది. తదుపరి అంతిమ క్షణాలు రానే వచ్చాయి. ఆమెను గంగాతీరానికి తీసుకువెళ్లారు. ఆమెను అంతర్జలినిని (అంటే సగం దేహం నదీ జలంలో ఉంచడం) చేశారు. పువ్వులు, చందనం, తులసీదళాలతో శ్రీరామ కృష్ణులు ఆమె పాదపద్మాలకు అంజలి ఘటించారు. సన్న్యాసియైన శ్రీరామ కృష్ణులు తల్లికి అంతిమ సంస్కారాలు చేయడం నిషిద్ధం కనుక, ఆయన చిన్నన్న గారి పుత్రుడైన రామ్‌లాల్‌చే వాటిని చేయించారు. అట్లే అశౌచ గడువు పూర్తయ్యాక తల్లి పేరిట ఒక కోడెదూడెను విడిచిపెట్టి రామ్‌లాల్ చంద్రాదేవి శ్రాద్ధకర్మ లన్నిటినీ యథావిధిగా నిర్వర్తించాడు

సన్న్యాసాశ్రమ ప్రతిష్ఠ గౌరవాల పట్ల, శాస్త్ర నిర్దేశాలపట్ల గల మాన్యతతో శ్రీరామకృష్ణులు తల్లి మరణించినప్పుడు అశౌచం తదితర గార్హస్థ్య నియమాదులను పాటించలేదు. కాని తల్లిపట్ల కుమారుడు నిర్వర్తించవలసిన ఏ కర్మా చేయలేదని తలచి ఒక రోజు ఆయన తల్లికి తర్పణం వదలాలనుకొన్నారు. కాని దోసిలిలో నీరు తీసుకొంటుండగానే ఆయన భావావేశపరులయ్యారు. ఆయన వ్రేళ్లు కొరడుబారి, విడివడి వ్రేళ్ల సందులగుండా నీళ్లు కారిపోయాయి. ఎన్నిసార్లు ప్రయత్నించినా అల్లే జరగడంతో దుఃఖిస్తూ పరలోకగతురాలైన తల్లికి తన అసమర్థతను మొరపెట్టుకొన్నారు. 'గలిత కర్మావస్థ' అనే అవస్థను గురించి శాస్త్రాలు పేర్కొంటున్నాయని, అలాంటి అవస్థ లేక స్థితి పొందిన వ్యక్తి, అంటే ఆధ్యాత్మికోన్నతి కలిగినప్పుడు, స్వతఃసిద్ధంగానే కర్మలన్నీ పరిపూర్ణంగా తొలగిపోతాయని ఒక పండితుని నుండి శ్రీరామకృష్ణులు తదనంతరం విన్నారు. అలాంటి అవస్థలో ఉన్న వ్యక్తికి శాస్త్రవిహిత కర్మలు నిర్వర్తించడం సాధ్యం కాదు. అలా చేయకపోయినా అతడికి ఎలాంటి పాపమూ చుట్టుకోదు.

14. శ్రీరామకృష్ణులు తల్లికి తర్పణంచేయ ప్రయత్నించడం

తల్లి మరణించడానికి ఒక సంవత్సరానికి మునుపు శ్రీరామకృష్ణుల జీవితంలో జగజ్జనని సంకల్పం చేత ఒక ముఖ్య సంఘటన జరిగింది. 1875వ సంవత్సరంలో బ్రహ్మసమాజ నేతయైన కేశవచంద్రసేన్‌ను చూడాలనే ఆకాంక్ష శ్రీరామకృష్ణులకు కలిగింది. భావపరవశ్యంలో ఉండగా ఈ విషయంగా జగజ్జనని ఆదేశం ఆయనకు వినవచ్చింది. కలకత్తాకు కొన్ని మైళ్ళ ఉత్తర దిశలో ఉన్న బేల్ఘారియాలోని జయగోపాల్ సేన్ గృహోద్యానంలో ఆ సమయంలో కేశవసేన్ తన శిష్యులతో ఆధ్యాత్మిక సాధనలలో మునిగి ఉన్నాడని ఆయన తెలుసుకొన్నారు. ఆయన హృదయ్‌తో కలిసి కెప్టెన్ విశ్వనాథ్ ఉపాధ్యాయ్ బండిలో బయలుదేరి, అక్కడకు దాదాపు ఒంటి గంట ప్రాంతాన చేరుకొన్నారు. (ఈ విషయం మేం హృదయ్ నుండి విన్నాం.) ఆ రోజు శ్రీరామకృష్ణులు ఎర్రంచు ధోవతి ధరించారు. ధోవతి అడుగు అంచు ఎడమ భుజం మీదుగా వెనక్కు వ్రేలాడేటట్లు వేసుకొన్నారు.

15. శ్రీరామకృష్ణులు కేశవచంద్రసేన్‌ను చూడబోవడం

హృదయ్ బండి నుండి దిగి ఉద్యాన కాసారం గట్టుమీద కేశవ్, ఆయన అనుయాయులు కూర్చుని ఉండడం చూశాడు. కేశవ్ వద్దకు వచ్చి అతడితో ఇలా అన్నాడు: ''నా మేనమామ ఒక మహాభక్తుడు. మీ ముఖతా భగవత్ ప్రసంగం వినగోరి ఇక్కడకు వచ్చారు. మీరు సమ్మతిస్తే ఆయనను ఇక్కడకు తోడ్కొని వస్తాను.'' కేశవ్ అందుకు

16. బేల్ఘారియా ఉద్యానంలో కేశవ్

కేశవ్ సేన్

సమ్మతించాడు. శ్రీరామకృష్ణులను బండి నుండి హృదయ్ జాగ్రత్తగా దింపి అక్కడకు తోడ్కొని వచ్చాడు. అప్పటిదాకా కేశవ్ తదితరులు ఆయనను చూడాలని ఎంతో ఉత్కంఠగా ఉన్నారు. ఆయనను చూడగానే వారి ఆతురత చప్పగా చల్లారింది. ఆయన వారికి ఒక సామాన్య వ్యక్తిగానే కనిపించారు.

శ్రీరామకృష్ణులు, కేశవ్ వద్దకు వచ్చి ఇలా అన్నారు: ''బాబూ! మీరు భగవద్దర్శనం పొందారట కదా! ఆ దర్శనం ఎలా ఉంటుందో తెలుసుకోగోరుతున్నాను. అందుకే నేను మీ వద్దకు వచ్చాను.'' ఆ విధంగా భగవత్ప్రసంగం ప్రారంభమైంది. శ్రీరామకృష్ణుల ప్రశ్నకు కేశవ్ ఏం సమాధానం చెప్పాడో తెలియడం లేదు. కాని కొన్ని క్షణాలయ్యాక,

17. మొదటిసారిగా కేశవ్‌తో శ్రీరామకృష్ణులు సంభాషించడం

''ఎరుగగ తరమె ఏరికినైనా, తల్లి కాళి నిజతత్త్వ మించుక? షడ్దర్శనములె శక్తిహీనములు, తల్లి విషయము తెలియచేయుటకు.....'' అన్న రాంప్రసాద్ సుప్రసిద్ధ గీతాన్ని పాడి శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులయ్యారని హృదయ్ మాకు తెలిపాడు. శ్రీరామకృష్ణుల భావపారవశ్య స్థితిని చూసి కేశవాదులు దానినొక ఉన్నత ఆధ్యాత్మిక అవస్థగా పరిగణించలేదు. అది కేవలం ఒక నటనగానో మతిచెడిన వ్యవహారంగానో వారు తలచారు. శ్రీరామకృష్ణులకు బాహ్యచైతన్యం కల్పింప హృదయ్ ఆయన చెవిలో ఓంకారనాదం వినిపించసాగాడు. దాంతో మధుర దరహాసంతో ఆయన ముఖారవిందం తేజోవిరాజమానమైంది. ఆ విధంగా పాక్షికంగా బాహ్యచైతన్యం పొంది ప్రగాఢ ఆధ్యాత్మిక విషయాలను అతి సరళమైన భాషలో సాధారణ ఉదాహరణలు జోడిస్తూ వివరించసాగారు. అందరూ మంత్రముగ్ధులై ఆయన ముఖంవైపే చూస్తూ కూర్చుండిపోయారు. స్నానపానాదుల వేళ ఎప్పుడో దాటిపోయిందని, మళ్లీ సంధ్యాసమయ ఉపాసన వేళ అయిందని ఎవరికీ ఎరుకే లేకపోయింది. వారి మనోవైఖరిని గమనించి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''ఆవుల మందలోకి మరో జంతువు ఏదైనా ప్రవేశిస్తే, అవి ముందుకెళ్లి దాన్ని కుమ్మబోతాయి. కాని మరో ఆవు కనుక వస్తే అవి దాని ఒంటిని నాకుతాయి. అది స్వజాతిది. మన వ్యవహారమూ నేడు అట్లే ఉంది.''

పిదప కేశవ్‌ను ఉద్దేశించి, "నీ తోక తెగి పడిపోయింది" అన్నారాయన. ఆయన మాటలు అంతరార్థం అవగతం చేసుకోలేక కేశవ్ అనుయాయులు ఒకింత చికాకు వ్యక్తం చేయడం చూసి, తమ వచనాల అంతరార్థాన్ని వివరించి చెప్పారు. "ఇలా చూడండి. తోక ఉన్నంత వరకు చిరుకప్ప నీళ్లలో మాత్రమే జీవిస్తుంది, నేలపైకి రాలేదు. కాని తోక రాలిపోయిన తరువాత అది నీళ్లలోను, నేలమీద మసగలదు. అదేవిధంగా అజ్ఞానం అనే తోక ఉన్నంతవరకు మనిషి సంసారం అనే నీళ్లలో జీవించక తప్పదు. కాని ఆ తోక తొలగిపోయిన పిదప సంసారంలోగాని, సచ్చిదానందంలోగాని యథేచ్ఛగా సంచరించవచ్చు. ఓ కేశవ్! నీ మనస్సు ప్రస్తుతం అలాటి స్థితిని సంతరించుకోవడంతో నువ్వు సంసారంలోను, సచ్చిదానందం లోను జీవించగలవు." శ్రీరామకృష్ణులు ఇలాంటి వివిధ అంశాలపై ఆ రోజు చాలాసేపు ప్రసంగించి దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చేశారు.

18. శ్రీరామకృష్ణులకూ కేశవ్‌సేన్‌కూ మధ్య నెలకొన్న సాన్నిహిత్యం

శ్రీరామకృష్ణులను మొట్టమొదటిసారి చూసినప్పటి నుండి కేశవసేన్ ఆయన పట్ల అమిత ఆకర్షితుడయ్యాడు. నాటి నుండి తన మరణ పర్యంతం, ఆయనను దర్శించడం మాననీయంగా భావించి తరచూ ఆయన దివ్యసాంగత్య లబ్ధి పొందసాగాడు. స్వయంగా తనే దక్షిణేశ్వరానికి రావడంగాని లేక అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులను తన కలకత్తా నివాసమైన కమల కుటీరానికి తోడ్కొని వెళ్లడంగాని చేసేవాడు. శ్రీరామకృష్ణ కేశవసేన్‌ల నడుమ నెలకొన్న సాన్నిహిత్యం ఎంత ప్రగాఢతరమైనదంటే పరస్పరం వాళ్లు కేవలం కొన్ని రోజులు సైతం చూసుకోకుండా ఉండలేకపోయేవారనడం అతిశయోక్తి కాబోదు. అలాటి సందర్భాలలో శ్రీరామకృష్ణులు కలకత్తాలోని కేశవ్ వద్దకో లేక కేశవ్‌సేన్ ఆయనను దర్శింప దక్షిణేశ్వరానికో రావడం కద్దు. బ్రహ్మసమాజ వార్షికోత్సవం నాడు తన అనుయాయులతో కలిసి శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లడమో లేక ఆయనను తమ వద్దకు తోడ్కొని వచ్చి భగవత్ప్రసంగాలతో నాడు ఆయనతో గడపడమో ఉత్సవంలో ఒక భాగంగా కేశవ్ పరిగణించేవాడు. కేశవ్ తన అనుయాయులతో స్టీమర్‌లో భగవత్ వైభవాన్ని కీర్తిస్తూ దక్షిణేశ్వరానికి వచ్చి శ్రీరామకృష్ణులను స్టీమర్‌లో తోడ్కొని, ఆయన అమృతోపదేశాలను వీనులవిందు చేసుకొంటూ గంగానదిలో విహరించడం పరిపాటి.

19. దక్షిణేశ్వరంలో కేశవ్ ప్రవర్తన

శాస్త్ర ఆదేశాలను జ్ఞప్తిలో ఉంచుకొని కేశవ్ ఏనాడూ దక్షిణేశ్వరానికి రిక్తహస్తాలతో వచ్చి ఎరుగడు. వచ్చినప్పుడల్లా తనతోకూడ కొన్ని పళ్లు తెచ్చి శ్రీరామకృష్ణుల ముందు వాటిని ఉంచేవాడు. భక్తిప్రపత్తులతో ఆయన పాదపద్మాల వద్ద కూర్చుని ఆయనతో

సంభాషించేవాడు. ఒకసారి శ్రీరామకృష్ణులు పరిహాసంగా కేశవ్‌తో, ''కేశవ్! నువ్వు నీ ప్రసంగాలతో అనేకులను మంత్రముగ్ధులను చేస్తావు. నాకు్కూడా ఏదైనా చెప్పు'' అన్నారు. అందుకు కేశవ్ వినమ్రంగా ఇలా జవాబిచ్చాడు: ''మహాశయా! కమ్మరి కొలిమి వద్దకు నేను సూదులు అమ్మడానికి పోవాలా? దయచేసి మీరే ఏదన్నా చెప్పండి, నేను వింటాను. మీ ముఖతా విన్న వచనాలలో ఏవో కొన్ని లోకులకు చెప్పిన మరుక్షణమే వారు మంత్రముగ్ధులవుతున్నారు.''

''బ్రహ్మ పదార్థపు అస్తిత్వాన్ని అంగీకరించే పక్షంలో బ్రహ్మం యొక్క శక్తిని కూడ అంగీకరించవలసే ఉంటుంది. బ్రహ్మం, బ్రహ్మశక్తి సర్వదా అభిన్న మైన ఒక్కటే'' అని ఒక రోజు దక్షిణేశ్వరంలో శ్రీరామ కృష్ణులు, కేశవ్‌కు వివరించి చెప్పారు. కేశవ్ ఆ వివరణకు ఆమోదం తెలిపాడు. ఆ తరువాత మళ్లీ ఆయన అతడితో ఇలా చెప్పారు: ''బ్రహ్మం, బ్రహ్మశక్తి ఎలా అభేదమో అదే రీతిలో భాగవతం - భక్తుడు - భగవంతుడు - ఇలా రూపాలు మూడు ఐనప్పటికీ పదార్థం అభిన్న మైన ఒక్కటే; ఈ మూడు ఒక్కటే, ఒక్కటే మూడు.'' కేశవ్ ఈ వచనాలు కూడ అవగతం చేసుకొని, అంగీకరించాడు. మళ్లీ శ్రీరామకృష్ణులు ఇలా కొనసాగించారు: ''గురువు, కృష్ణుడు, భక్తుడు - ఈ ముగ్గురూ ఒక్కరే, ఒక్కరే ముగ్గురూను. ఇప్పుడు ఈ విషయం నీకు వివరింపబోతున్నాను.'' ఆ మాటలు విని కేశవ్ ఒకింతసేపు ఆలోచనలో పడ్డాడు. అతడి మనస్సులో ఏ ఆలోచనలు మెదలినవో తెలియరాలేదు. వినమ్రంగా అతడు, ''మహాశయా! మీరు ఇప్పటికి చెప్పిన దానికంటే ఎక్కువ విషయాలు ప్రస్తుతం నేను అంగీకరింపలేను. కనుక ఈ విషయాంశాన్ని పొడిగించాల్సిన అవసరం లేదు'' అన్నాడు. అందుకు శ్రీరామకృష్ణులు, ''మంచిది; ఇక్కడికి ఆపివేద్దాం'' అన్నారు. పాశ్చాత్య భావన లచే ఆదర్శాలచే ప్రభావితమైన కేశవసేన్ మనస్సు శ్రీరామకృష్ణుల దివ్యసాంగత్యం ద్వారా ఎంతో ప్రకాశాన్ని సంతరించుకొన్నది. కేశవ్ రోజురోజుకీ సనాతన వైదిక ధర్మ మర్మాలను అవగతం చేసుకొంటూ, ఆధ్యాత్మిక సాధనలలో మునిగి పోయాడు. శ్రీరామకృష్ణులకు మరింత సన్నిహితుడయ్యేకొద్దీ అతడి మతపర మైన అభిప్రాయాలు క్రమంగా మార్పుకు లోనుకావడం ద్వారా పై విషయం మనకు స్పష్టం అవుతోంది.

20. కేశవ్‌కు, శ్రీరామకృష్ణుల ఉప దేశాలు

దారుణంగా గాయపడితే తప్ప మనిషి మనస్సు సంసారం పట్ల అనాసక్తతను వహించి, భగవంతుడే సర్వస్వం అని భావించదు. శ్రీరామకృష్ణులతో పరిచయం ఏర్పడ్డ మూడు సంవత్సరాల తరువాత కేశవసేన్ కూచ్‌బిహార్ సంస్థానం యువరాజుకు తన కుమార్తెనిచ్చి వివాహం జరిపించడంతో, కేశవ్ పెద్ద

ఆఘాతానికి గురియైనాడు. ఆ వివాహం భారతీయ బ్రహ్మసమాజంలో గొప్ప

21. కూచ్ బిహార్ వివాహం: పర్యవసానం

సంచలనం సృష్టించి, సమాజాన్ని రెండుగా విభజించివేసింది. కేశవ్‌కు ప్రతికూలురైనవారు సమాజం నుండి విడిపోయి 'సాధారణ బ్రహ్మసమాజం' అనే ఒక కొత్త సమాజాన్ని స్థాపించుకొన్నారు. రెండు వర్గాలవారి మధ్య ఒక అల్ప విషయం మీద చెలరేగిన కలహం గురించి దక్షిణేశ్వరంలోని శ్రీరామకృష్ణులు విని దిగ్భ్రాంతి చెందారు. బ్రహ్మసమాజస్థుల బాలికల వివాహయోగ్యమైన వయో నియమాన్ని గురించి విని శ్రీరామకృష్ణులు ఇలా వ్యాఖ్యానించారు: ''జననం, మరణం, వివాహం - ఈ మూడూ పూర్తిగా భగవంతుని సంకల్పం మేరకే జరుగుతాయి. వీటిని నిర్నిబద్ధ నియమావళికి లోనుచేయరాదు. కేశవ్ ఎందుకు ఆ నియమావళిని విధించాడు?'' శ్రీరామకృష్ణుల సమక్షంలో ఎవరైనా కూచ్‌బిహార్ వివాహ ప్రస్తావన తెచ్చి, కేశవ్‌ను గర్హిస్తే ఆయన ఇలా అనేవారు: ''అలా చేసినందుకు కేశవ్‌ను నిందించడ మెందుకు? అతడొక గృహస్థు. తన కుమారులకు, కుమార్తెలకు ఏది మంచిదో దాన్ని అతడు ఎందుకు చేయకూడదు? సన్మార్గం నుండి వైదొలగకుండా తన భుజస్కంధాల మీదవున్న కుటుంబ బాధ్యతను అలా నిర్వర్తించడంలో గర్హించవలసిన అగత్యం ఏముంది? మత, నైతికతలకు విరుద్ధంగా కేశవ్ వ్యవహరించలేదు. నిజానికి అతడు తండ్రిగా తన కర్తవ్యాన్నే నిర్వహించాడు.'' గృహస్థుడు ఒనరించవలసిన కర్తవ్యాల దృష్ట్యా పరికించి శ్రీరామకృష్ణులు సదా కేశవ్ చర్యను దోషరహితమైనదిగానే సమర్థించేవారు. ఏదిఏమైనప్పటికీ కూచ్‌బిహార్ వివాహ సంఘటన పర్యవసానంగా కేశవ్ మరింతగా అంతర్ముఖుడై ఆధ్యాత్మిక మార్గంలో సత్వరం పురోగమించాడనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

శ్రీరామకృష్ణుల అవ్యాజ అనురాగాన్ని చూరగొన్నప్పటికీ ఆయనను సందర్శించి, ఆయన వచనాలను వినే అవకాశాలు ఎన్నో కలిగినప్పటికీ, పాశ్చాత్య భావా

22. శ్రీరామకృష్ణులను అమితంగా గౌరవించాడు కాని ఆయన ఆదర్శాలన్నిటినీ కేశవ్ అంగీకరించలేదు

దర్శాలతో ప్రభావితుడైన కేశవసేన్, శ్రీరామకృష్ణులను సమగ్రంగా అవగతం చేసుకొన్నాడనడం సంశయాస్పదమే. ఒక వంక అతడు శ్రీరామకృష్ణులను మూర్తీభవించిన సజీవ ఆధ్యాత్మికతగా పరిగణించేవాడు. ఆయనను తన ఇంటికి తోడ్కొనివెళ్లి తాను ఎక్కడ శయనిస్తాడో, భుజిస్తాడో, కూర్చుంటాడో, బ్రహ్మసమాజ శ్రేయస్సుకై ఏ స్థలంలో కూర్చుని చింతన చేస్తాడో - ఆ స్థలాల నన్నిటినీ స్వయంగా ఆయనకు చూపించి, తన మనస్సు భగవంతుని విస్మరించకుండేటట్లు, ఆ స్థలాలలో తాను ఉన్నప్పుడు లౌకిక వస్తువుల స్ఫురణ కలుగకుండేటట్లు తనను ఆశీర్వదించమని ఆయనను కోరాడు.

తాను భగవంతుని ధ్యానం చేసే స్థలానికి శ్రీరామకృష్ణులను తోడ్కొని వెళ్లి ఆయన పాదపద్మాలకు పుష్పాంజలి ఘటించాడు.[1] తాను దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు ''నవవిధాన్‌కి జై'[2] అని నినాదం చేస్తూ శ్రీరామకృష్ణులకు ప్రణామం చేయడం మాలో పలువురం చూసేవున్నాం.

మరో వంక, 'మతాలన్నీ సత్యాలే, ఎన్ని మతాలో అన్ని మార్గాలు' అనే శ్రీరామకృష్ణుల సూక్తిని కేశవ్ పూర్తిగా అనుమోదించలేదు. ప్రత్యామ్నాయంగా అన్ని మతాలలోని తనకు ఆవశ్యకాలుగా కనిపించిన అంశాలను స్వీకరించి, అనావశ్యకాలను త్రోసిరాజని 'నవ విధాన్' అనే ఒక కొత్త మతాన్ని స్థాపింప ప్రయత్నించాడు. శ్రీరామకృష్ణులతో పరిచయమైన ఒకింత కాలానికే ఈ 'నవ విధాన్' స్థాపితం కావడం చూస్తే, శ్రీరామకృష్ణుల సకల మతాల సామరస్య సిద్ధాంతాన్ని కేశవ్ పాక్షికంగా ఆమోదించి ప్రచారం చేసినట్లుగా తోస్తున్నది.

23. 'నవ విధాన్': శ్రీరామకృష్ణుల అభిప్రాయం

పాశ్చాత్య విద్య నాగరకతల ఉద్ధృత తరంగాలు భారత తీరాలను తాకి ప్రాచీన బ్రహ్మవిద్య, భారతీయ సామాజిక ఆచార సంప్రదాయాలలో సమూల మార్పును తెస్తున్న తరుణంలో, ఈ దేశంలోని ప్రతిభావంతులు ప్రతి ఒక్కరూ ప్రాచ్య పాశ్చాత్య విద్య, నాగరకతల మధ్య ఒక సామరస్యాన్ని కనుగొన ప్రయత్నించారు. రాజా రామ్మోహన్ రాయ్, మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్, బ్రహ్మానంద కేశవ్ ప్రభృతులు వంగదేశంలో ఈ లక్ష్యార్థం ఎలా తమ ప్రాణాలు అర్పించారో, అట్లే భారతదేశం ఇతర రాష్ట్రాలలో కూడ ఎందరో మహనీయులు రంగప్రవేశం చేసి అదే పనిని కొనసాగించారు. కాని శ్రీరామకృష్ణుల అవతరణకు మునుపు వారిలో ఎవరూ ఈ సమస్యను పరిపూర్ణంగా పరిష్కరించలేకపోయారు. శ్రీరామకృష్ణులు భారతదేశంలోని సకల మత సాధనలను సముచిత రీతిలో తమ జీవితకాలంలో అనుష్ఠించి, ప్రతి మతంలోనూ సాఫల్యం సిద్ధించుకొని, భారతదేశ భ్రష్టతకు మతం హేతువు కాదనీ, దాని హేతువు మరెక్కడో ఉందనీ తెలియచేశారు. ధార్మికతనే ఆధారం చేసుకొన్న సమాజం, ఆచారాలు, సంప్రదాయాలు, వెరసి భారతీయ సంస్కృతీ నాగరకతలు గతంలో భారతదేశానికి వైభవాన్ని, సౌభాగ్యాన్ని సంతరించి

24. శ్రీరామకృష్ణులు: భారతజాతీయ సమస్య

---

1. ఈ విషయం మేం శ్రీ విజయకృష్ణ గోస్వామి నుండి విన్నాం.
2. 'కూచ్‌బిహార్' వివాహ వివాద ఫలితంగా బ్రహ్మసమాజం రెండుగా విడిపోయి, కేశవ్ నాయకత్వం వహించిన వర్గం 'నవ విధాన్' గా పేర్కొనబడింది. నవవిధాన్ అంటే కొత్తపద్ధతి అని అర్థం.

పెట్టాయి. సంజీవనివంటి అదే ధార్మికత లేక మతం అట్లే పరిపూర్ణంగా నిలిచే ఉంది. మన సకల ప్రయత్నాలకూ ఒక్క ఆ ధార్మికతనే ఆధారం చేసుకొంటే మన జాతీయ జీవన నౌకను తిరిగి విజయవంతంగా మనం నడిపించగలం. మతం మనిషి దృక్పథాన్ని ఎంత విశాలం చేయగలదో ఆదర్శమయ జీవితాన్ని స్వయంగా తాము గడిపి శ్రీరామకృష్ణులు ప్రదర్శించి చూపారు. తదుపరి పాశ్చాత్య భావాల, ఆదర్శాలచే ప్రభావితులైన తమ యువశిష్యులకు, ప్రధానంగా స్వామి వివేకానందకు ఆ మతంలోని ఉదారతాశక్తిని ప్రసారం చేసి, జీవితంలో ప్రతి పనిని ఆ ధార్మికతకు తోడ్పడేటట్లు ఎలా నిర్వర్తించాలో వారికి బోధించారు. ఆ విధంగా పైన పేర్కొన్న భారతదేశ జటిల సమస్యకు అద్భుతమైన పరిష్కారాన్ని చూపారు. లోకంలోని ప్రధాన మత సాధనలు అనుష్ఠించి, వాటిలో సఫలతను సాధించి శ్రీరామకృష్ణులు ఎలా లోకంలోని మత వైషమ్యాలు, ఆధ్యాత్మికపరమైన భేదాభిప్రాయాలు తొలగించే ఉపాయాన్ని సూచించారో, అట్లే భారతదేశంలోని యావన్మత సాధనలలో పూర్వాచార విధానాల ద్వారా పరిపూర్ణత్వాన్ని సముపార్జించుకొని భారతీయ మతాల మధ్య నెలకొన్న కలహాలను రూపుమాపారు. దేనిని ఆధారంగా చేసుకొని మన జాతీయత మొదటి నుంచీ నిలిచి ఉన్నదో, భవిష్యత్తులో నిలబడగలదో దాన్ని చూపించారు.

శ్రీరామకృష్ణుల ఆదర్శాల అంతస్సూచనలను కేశవ్ పరిపూర్ణంగా అవగతం చేసుకోవడంలో విఫలుడైనప్పటికీ, ఆయన అతణ్ణి అమితంగా అభిమానించారనడం 1884వ సం॥ కేశవ్ మరణించినప్పుడు ఆయన ప్రవర్తించిన తీరు మనకు స్పష్టం చేస్తుంది. ఆయన యిలా అన్నారు: ''ఆ సమాచారం అందాక నేను మంచంనుండి మూడు రోజులు దిగలేకపోయాను; నా శరీరంలో ఒక భాగం పక్షవాతం సోకి పడిపోయినట్లుగా అనిపించింది.''

25. కేశవ్ మరణం పట్ల శ్రీరామకృష్ణుల ప్రతిస్పందన

కేశవసేన్‌ను ప్రప్రథమంగా శ్రీరామకృష్ణులు కలుసుకొన్నప్పుడు జరిగిన ఒక సంఘటనను ప్రస్తావించి ఈ అనుబంధ భాగాన్ని పూర్తిచేస్తాం. ఆ సమయంలో సర్వులనూ ఆనందపారవశ్యంలో ముంచెత్తే శ్రీ చైతన్యుల నగర సంకీర్తనం చూడాలనే ఆకాంక్ష శ్రీరామకృష్ణులకు జనించింది. జగజ్జనని ఈ క్రింద వర్ణించిన రీతిలో ఆయన ఆకాంక్షను ఈడేర్చింది. తమ గది వెలుపల నిలబడినప్పుడు శ్రీరామకృష్ణులు పంచవటి దిశనుండి అద్భుత సంకీర్తన తరంగాలు తమవైపు రావడం తిలకించారు. పిదప ఆ తరంగాలు దక్షిణేశ్వర ప్రధాన ద్వారం వైపు సాగిపోతూ చెట్ల వెనుక కనుమరుగయ్యే దృశ్యాన్ని ఆయన గాంచారు - నవద్వీపచంద్రుడైన

26. సంకీర్తన చేస్తున్న గౌరాంగుని శ్రీరామకృష్ణులు దర్శించడం

శ్రీగౌరాంగ మహాప్రభువు, నిత్యానంద అద్వైతులు ఇరువైపుల తనను అనుగమిస్తూ ఉండగా భగవత్ప్రేమోన్మత్తుడై జనసందోహం నడుమ నుండి సులిమెత్తని గమనభంగిమతో ముందుకు వెళ్లసాగాడు. చుట్టూ గుమిగూడిన జనులు ఆయన ప్రేమోన్మత్త ప్రభావం చేత ఆధ్యాత్మికోన్మత్త స్థితిని పొంది వివశులైనారు. వారిలో కొందరు నృత్యం చేయసాగారు. ఇసుక వేసినా రాలనంత మంది జనం ఉన్నారక్కడ. ఆ దివ్యసంకీర్తన బృందంలో అగపడిన కొందరి ముఖాలు శ్రీరామకృష్ణుల జ్ఞాపకాలలో స్థిరంగా ముద్రితమైపోయాయి. ఇది జరిగిన కొలది కాలానికి ఒకరొకరుగా ఆ సదరు వ్యక్తులు భక్తులుగా రాసాగినప్పుడు వారిని గుర్తించి, పూర్వజన్మలో వారు శ్రీచైతన్యుల సహచరులన్న స్థిర నిర్ణయానికి శ్రీరామకృష్ణులు వచ్చారు.

ఈ దర్శనం కలిగిన కొద్దికాలం తరువాత శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌కు, హృదయ్ స్వగ్రామమైన శిహోర్‌కు వెళ్లారు. శిహోర్ గ్రామానికి కొన్ని మైళ్ల దూరంలో ఫులుయ్ - శ్యాంబజార్ అనే గ్రామం ఒకటి నెలకొని ఉంది. అక్కడ వైష్ణవులు అనేకులు ఉంటున్నారనీ, వారు నిత్యం భగవత్కీర్తనం చేస్తూ ఆ ప్రదేశాన్ని ఆనందమయం చేస్తూవుంటారని విని ఆయన అక్కడకు వెళ్లి వారి సంకీర్తన వినగోరారు. శ్యాంబజార్ సమీపంలో బేల్టే అనే మరోగ్రామం ఉంది. ఆ గ్రామ వాస్తవ్యుడైన నటవర్ గోస్వామి అంతకు మునుపే శ్రీరామకృష్ణులను దర్శించుకొని, తమ ఇంటికి వచ్చి ఆయన పాదధూళితో తన గృహాన్ని పావనం చేయమని ఆహ్వానించి ఉన్నాడు. హృదయ్‌తో కలిసి శ్రీరామకృష్ణులు అతడి ఇంటికి వెళ్లారు. అక్కడ ఏడు రోజులు బసచేసి, శ్యాంబజార్ వైష్ణవుల సంకీర్తనానందాన్ని గ్రోలారు. ఆయన పరిచయ భాగ్యం పొందిన ఆ గ్రామానికే చెందిన ఈశాన్‌చంద్ర మల్లిక్ తన ఇంటికి వచ్చి కీర్తనానందాన్ని ప్రసాదించవలసిందిగా భక్తిప్రపత్తులతో ఆయనను ఆహ్వానించాడు. సంకీర్తన సమయంలో శ్రీరామకృష్ణుల అపూర్వ భావపరివర్తన అక్కడి వైష్ణవులను అమితంగా ఆకర్షించింది. ఆయన అపూర్వ భావపరివర్తన సమాచారం శ్యాంబజార్‌లోనే కాక రాంజీవన్‌పూర్, కృష్ణగంజ్ తదితర సుదూర సమీప గ్రామాలకు కూడ ప్రాకింది. వెంటనే ఆ గ్రామాల నుండి సంకీర్తన బృందాలు దివ్యానందాన్ని వారితో కలిసి గ్రోల, శ్యాంబజారుకు గుంపులు కట్టి రాసాగారు. దానితో ఆ గ్రామం జనంతో క్రిక్కిరిసిపోయింది. సంకీర్తన రాత్రింబవళ్లు కొనసాగింది. రోజులో పలుమార్లు పుట్టి గిట్టే ఎవరో గొప్ప భక్తుడు అక్కడకు వచ్చాడనే వార్త వ్యాపించింది. ఆయనను చూడాలనే ఉత్కంఠతో జనం నిద్రాహారాలు మరచిపోయి చెట్లు, ఇంటికప్పులపై కెక్కి కూర్చున్నారు. ఆ విధంగా మూడు పగళ్లు, మూడు

రాత్రులు అక్కడ దివ్యానందం వెల్లువై ప్రవహించింది. శ్రీరామకృష్ణులను చూసి, ఆయన పాదాలను స్పృశించేందుకు జనం పిచ్చివాళ్లే అయ్యారు. శ్రీరామకృష్ణులకు ఆహారస్నానాదులకు సమయమే దొరకలేదు. పరిస్థితి విషమించక ముందే హృదయ్, శ్రీరామకృష్ణులను తోడ్కొని గోప్యంగా శిహోర్‌కు పారిపోయాడు. అంతటితో ఆ ఆనందప్రవాహపు వెల్లువ ఆగిపోయింది. శ్యాంబజార్ వాస్తవ్యులైన ఈశాన్ చౌధురి, నటవర్ గోస్వామి, ఈశాన్ మల్లిక్, శ్రీనాథ్ మల్లిక్ తదితరులు, వారి వంశస్థులు ఆ సంఘటనను ఇప్పటికీ ప్రస్తావించి శ్రీరామకృష్ణుల పట్ల విశేష భక్తిప్రపత్తులు కనబరుస్తూ ఉంటారు. కృష్ణగంజ్ గ్రామానికి చెందిన విఖ్యాత ఖోల్ (మద్దెల వంటి వాద్యం) వాద్యగాడైన శ్రీ రామ్‌చరణ్ దాస్‌తో శ్రీరామకృష్ణులకు పరిచయం కలిగింది. అతడి ఖోల్ వాద్యం విన్న మరుక్షణంలోనే శ్రీరామకృష్ణులు భావసమాధి మగ్నులయ్యారు. పైన ప్రస్తావించిన సంఘటనను కొంత స్వయంగా శ్రీరామకృష్ణుల నుండి, కొంత హృదయ్ నుండి మేం విన్నాం. ఈ సంఘటన కాలాన్ని మేం ఈ క్రింది విధంగా నిర్ధారణ చేశాం:

1875వ సం॥లో కేశవసేన్ శ్రీరామకృష్ణులను సందర్శించిన తరువాత శ్రీరామకృష్ణుల పరమ భక్తుడూ, ఆలంబజార్ వైద్యుడూ అయిన శ్రీ మహేంద్రనాథ్ పాల్ ఆయనను కలుసుకోవడం జరిగింది. తాను శ్రీరామకృష్ణులను ఆయన శిహోర్ నుండి తిరిగి వచ్చిన తరువాత కలుసుకొన్నాననీ, అప్పుడు ఆయన ఫులుయ్ - శ్యాంబజార్‌లో జరిగిన సంఘటనల గురించి తనతో ముచ్చటించారనీ మహేంద్రనాథ్ పాల్ మాకు తెలిపారు. కనుక పై సంఘటనలు 1879 తరువాత, అంటే శ్రీరామకృష్ణుల ఆంతరంగిక భక్తుల రాక ప్రారంభమైన నాటి తదనంతరమే జరిగి ఉండవచ్చు. దక్షిణేశ్వర ఆలయానికి అతి సమీపంలో స్వామి యోగానంద ఇల్లు ఉండడంతో, ఆతడు మాత్రమే శ్రీరామకృష్ణులను అంతకు మునుపే సందర్శించి ఉండవచ్చు. స్వామి వివేకానంద శ్రీరామకృష్ణుల వద్దకు 1881లో వచ్చారు. జగదాంబదాసీ 1881వ సం॥ జనవరిలో మరణించింది. ఇది జరిగిన ఆరు నెలల తరువాత హృదయ్ అనాలోచితంగా మథుర్‌బాబు పసి మనుమరాలి పాదాలను పూజించాడు. ఆమె తండ్రి, తద్ద్వారా తన కుమార్తెకు ఏదైనా కీడు వాటిల్లుతుందేమోనని భయపడి, కుపితుడై హృదయ్‌ను కాళికాలయ ఉద్యోగం నుంచి తొలగించాడు. కనుక మనం చర్చిస్తున్న సంఘటన ఎప్పుడో 1879లోనో లేక అంతకు మునుపో జరిగి ఉండాలి.

సాధక భావం సమాప్తం

IIII

గురుభావం 1

ప్రస్తావన

ఇది శ్రీరామకృష్ణ పరమహంస గ్రంథంలో మూడవ భాగం. శ్రీరామకృష్ణులు తమ సాధనలు పరిపూర్తి చేసినప్పటి నుండి ఆయన ఖ్యాతి లోకవిదితం అయ్యేవరకు ఆయన జీవితంలో సంభవించిన సంఘటనలు ప్రధానంగా ఈ విభాగంలో నమోదయ్యాయి. ఆ కాలఘట్టంలో జరిగిన సంఘటనల, ఆయన చర్యలను మాత్రమే మేం నమోదు చేయలేదు. సాధ్యమైనంత వరకు ఆ చర్యలకు పురిగొల్పిన, వాటికి దారితీసిన ఉద్దేశాలను సైతం మేం చర్చించాం. అందుకు హేతువు: మనిషి వ్యక్తిత్వం దేహం-ఆత్మల మేళనం కాబట్టి, ఒక వ్యక్తి బాహ్య జీవిత సంఘటనల అధ్యయనం మాత్రమే చేస్తే ఆతడి జీవిత చరిత్ర అధ్యయనం అసంపూర్ణమే అవుతుంది. స్వీయచరిత్రనో లేక ఒకరి చరిత్రనో వ్రాస్తున్నప్పుడు భౌతికవాద పాశ్చాత్యుడు తన సమర్థతను ప్రధానంగా సంఘటనలు నమోదు చేయడంలో ప్రదర్శిస్తాడు. ఆధ్యాత్మికవాద హైందవుడు మానసిక వ్యాపారాలను శ్రద్ధగా చిత్రించడంలో తన మనస్సును నిమగ్నం చేస్తాడు. యథార్థమైన స్వీయ చరిత్ర లేక చరిత్ర దేహ-ఆత్మల మేళనమై ఉండాలని మన విశ్వాసం. మనస్సు యొక్క చరిత్రను ఆవిష్కరించే దృక్పథంతో మాత్రమే స్థూలశరీర చర్యలు నమోదు చేయబడాలి.

అంతేకాక శ్రీరామకృష్ణుల అపూర్వ జీవిత చరితాన్ని మేం అనేక చోట్ల శాస్త్రాల వెలుగులో చర్చించాం. శ్రీరామకృష్ణుల అనుపమాన మనోవ్యాపారాలను, అనుభవాలను, చర్యలను భారతీయ మహాత్ములైన శ్రీకృష్ణ, బుద్ధ, శంకర, చైతన్యుల వంటి వారితోను ఏసుక్రీస్తు వంటి ఇతర దేశాల మహానుభావులతోను పోల్చి మేం అధ్యయనం చేయవలసి వచ్చింది. శ్రీరామకృష్ణులు మాతో పదే పదే విస్పష్టంగా, ''పూర్వం ఎవరు రాముడిగా, కృష్ణుడిగా అవతరించారో వారే ప్రస్తుతం (తన దేహాన్ని చూపుతూ) ఈ ఒరలో ఉన్నారు'' అని చెప్పేవారు.

''దీని (అంటే తన) ఆధ్యాత్మిక అనుభవాలు వేదవేదాంతాలలో నమోదైన వాటిని అతిక్రమించిపోయాయి'' అని కూడ చెప్పారు. నిజం చెప్పాలంటే, సాధ్యమైనంత వరకు నిష్పక్షికంగా వర్ణించినప్పుడు భావముఖంలో నెలకొనివున్న శ్రీరామ కృష్ణుల అపూర్వ జీవితం వంటి జీవితం ఆధ్యాత్మిక ప్రపంచ చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఉండలేదని చెప్పక తప్పదు.

పూర్వ అవతార పురుషులు నెలకొల్పిన మతసాధనలను అనుష్ఠించి ఆయన కనుగొని ప్రకటించిన, ''ఎన్ని మతాలో అన్ని మార్గాలు'' అన్న నూతన సత్యం యొక్క అంతస్సూచనను పరికించినప్పుడు, గత యుగాలలో ఆవిర్భవించిన యావన్మంది అవతారమూర్తుల సమష్టి స్వరూపమే శ్రీరామకృష్ణులని మనం అంగీకరించక తప్పదు. అసదృశమైన శ్రీరామకృష్ణుల పావన జీవితాన్ని మనం అధ్యయనం చేసే కొద్దీ, వేదాల సారాంశమైన విశ్వజనీన శాశ్వత ఆధ్యాత్మిక భావాల అపూర్వ ఫలంగా ఆయనను మరింతగా మనం విశ్వసిస్తాం.

శ్రీరామకృష్ణుల అంతేవాసియైన పూజ్య స్వామి వివేకానంద శ్రీరామకృష్ణుల భావాలను ప్రచారం చేసినప్పటి నుండి, ఆయన జీవితచరిత్రను తెలుసుకోవాలనే జనుల ఉత్కంఠ మేరకు అనేకులు ఆయనను గురించి అనేక విషయాలు ప్రచురించారు. కాని వారిలో ఏ ఒక్కరూ అద్వితీయమైన ఆయన జీవితానికి, సనాతన వైదిక ధర్మానికి మధ్య నెలకొనివున్న నిగూఢ సంబంధాన్ని స్పష్టంగా వ్యక్తం చేయలేకపోయారు. తత్ఫలితంగా, పై ప్రచురణలను అధ్యయనం చేసినప్పుడు, శ్రీరామకృష్ణులు సనాతన హైందవమతం నుండి విడివడ్డవారనీ, తమదే అయిన ఒక ప్రత్యేక మతశాఖను నెలకొల్పి వెళ్ళిపోయారనే ఒక దురభిప్రాయం ప్రజల మనస్సులో చోటుచేసుకొంటుంది. అంతేకాక, ఆ కథనాలలో శ్రీరామ కృష్ణుల జీవితచరిత్రకు సంబంధించి పొరపాట్లు దొర్లాయి. ఆయన జీవితంలో జరిగిన యథార్థ సంఘటనల, చారిత్రకమైన పూర్వాపర పొకడల మధ్యనున్న సంబంధం వెలుగుచూడలేదు. కాబట్టి ప్రజానీకంలో ఆ కొరతను కొంతమేరకు తీర్చడానికి, తప్పుడు అభిప్రాయాలను సరిద్దడానికి, స్వామి వివేకానందుల అడుగుజాడలను అనుసరించి మేం ఈ పుస్తకంలో ఆ అద్వితీయ జీవితాన్ని మాకు ద్యోతకమైన రీతిలో వివరించే ప్రయత్నం చేశాం. శ్రీరామకృష్ణుల అత్యున్నత మానసిక స్థితిని (భావముఖం) చిత్రించడమే మా ఉద్దేశం. ఆ స్థితిని పిసరంత అనుభూతం చేసుకోవడం మూలంగా స్వామి వివేకానంద, తదితరులు, మేం సైతం మా జీవితాలను ఆయన పాదపద్మాల వద్ద అంకితం చేసుకోగలిగాం. సామాన్య వ్యక్తికి అగ్రాహ్యం కాని శ్రీరామకృష్ణుల జీవిత ఉదాత్త ఆశయం కించిత్తు అయినా ఈ పుస్తకంలో కచ్చితంగా అభివర్ణితమై ఉన్నదంటే, అందుకు కారణం

ఆయన మహత్త్వమే అని పాఠకులు గుర్తిస్తారు గాక! కాని ఏ రకమైన అసంపూర్ణత, లోపం దీన్లో చోటుచేసుకొని ఉంటే, అందుకు కారణం సముచిత అవగాహన, వ్యాఖ్యాన సమర్థత మాలో కొరవడి ఉండడమే! శ్రీరామకృష్ణుల అమూల్య జీవితపు ప్రథమ, చరమ భాగాలను పాఠకులకు తదనంతరం సమర్పించగలమని ఆశిస్తున్నాం.[1]

'భావముఖం'లో నెలకొన్న అతి గంభీరమైన శ్రీరామకృష్ణుల జీవితంతో మన సనాతన వైదిక మతానికి ఉన్న నిగూఢ సంబంధాన్ని గురించి వర్ణించిన స్వామి వివేకానంద పద్యకృతిని, సూక్తిప్రదమైన వ్యాసాన్ని ముందుగా పొందుపరచి ఆ తరువాత ఈ గ్రంథాన్ని ప్రారంభించాం.

- రచయిత

---

1. స్వామి శారదానంద 'శ్రీరామకృష్ణ పరమహంస' గ్రంథం వ్రాయడం ఈ విభాగంతోనే ప్రారంభించారు. ఆ తరువాత ఆయన క్రమంగా 4,2,1,5 భాగాలను రచించడం జరిగింది.

హిందూమతం : శ్రీరామకృష్ణులు

ఆచండాలాప్రతిహతరయో యస్య ప్రేమప్రవాహః
లోకాతీతోఽప్యహహ న జహౌ లోకకల్యాణమార్గమ్।
త్రైలోక్యేఽప్యప్రతిమ మహిమా జానకీప్రాణబన్ధో
భక్త్యా జ్ఞానం వృతవరవపుః సీతయా యో హి రామః॥

స్తబ్ధీకృత్య ప్రళయకలితం వాహవోత్థం మహాంతం
హిత్వా రాత్రిం ప్రకృతి సహజామంధతామిస్రమిశ్రామ్।
గీతం శాంతం మధురమపి యః సింహనాదం జగర్జ
సోఽయం జాతః ప్రథితపురుషో రామకృష్ణస్త్విదానీం॥

ఎవరి ప్రేమ ప్రవాహం ఆచండాల పర్యంతం అప్రతిహతంగా ప్రవహించినదో, ఎవరు లోకాతీతుడై ఉండీ లోకశ్రేయస్సులోనే నిరతుడై ఉండిపోయాడో, ఎవరి మహిమ ముల్లోకాలలో అసదృశమో, ఎవరు జానకీప్రాణనాథుడో, జ్ఞానమయమైన ఎవరి దేహం సీతాదేవి అనే భక్తితో ఆవృతమై ఉండిపోయిందో, ఎవరు శ్రీరామచంద్రుడుగా అవతరించాడో;

ఆతడే శ్రీకృష్ణుడుగా అవతరించి కురుక్షేత్ర రణరంగంలో చెలరేగిన ప్రళయకాల కోలాహలాన్ని అణచివేశాడు. ఆతడే శాంతమూ మధురమూ ఆయన గీతలను సింహగర్జారావంతో ఆలపించి ప్రకృతి సహజమైన అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేశాడు. సుప్రసిద్ధుడైన ఆ దివ్యమూర్తి మళ్ళీ ఈ యుగంలో శ్రీరామకృష్ణులుగా అవతరించాడు.

శాస్త్రం అనే మాట ఆద్యంతాలు లేని వేదాలను సూచిస్తుంది. ఈ వేదాలే ధార్మిక బోధనకు యోగ్యమైనవి.

స్మృతి అంటే పురాణాలు, మనుధర్మశాస్త్రాది గ్రంథాలని గ్రహించాలి. వేదాలను ఇవి అనుసరించే మేరకే వాటికి సాధికారికత ఉంటుంది.

సత్యం రెండు రకాలుగా ఉంటుంది: 1. మానవుల పంచేంద్రియాల ద్వారా గ్రహింపబడేది, ఊహతో సిద్ధాంతీకరింపబడేది. 2. యోగాభ్యాసం మూలంగా జనించిన సూక్ష్మశక్తుల ద్వారా గ్రహించేది.

మొదటి పద్ధతి ద్వారా సంతరించుకొన్న జ్ఞానానికి విజ్ఞానశాస్త్రం (Science) అని పేరు; రెండవ విధానం ద్వారా సముపార్జించుకొన్న జ్ఞానం 'వేదం'.

వేదం అని పేర్కొనబడే యీ ఆద్యంతాలు లేని అనంత జ్ఞానరాశి శాశ్వతంగా విద్యమానమై ఉంటుంది. సృష్టికర్త స్వయంగా ఈ అతీంద్రియ వేదజ్ఞాన సహాయంతో ఈ బ్రహ్మాండాన్ని సృజిస్తూన్నాడు, పోషిస్తూన్నాడు, నశింప చేస్తూన్నాడు.

ఈ అతీంద్రియశక్తి ఏ వ్యక్తిలో అభివ్యక్తమౌతుందో ఆ వ్యక్తినే ఋషి అంటారు; ఆ శక్తిద్వారా ఆయన ఏ అలౌకిక సత్యాలను అనుభూతం చేసుకొంటాడో వాటికే వేదాలని పేరు.

వేద జ్ఞానాన్ని సంతరించుకొన్న ఈ ఋషిత్వాన్ని లేక ద్రష్టత్వాన్ని సిద్ధించుకోవడమే యథార్థ మతానుభూతి. సాధకుని జీవితంలో ఈ ప్రత్యక్షానుభూతి కలుగనంత వరకు మతం కేవలం అర్థంపర్థం లేని పదజాలంగానే మిగిలిపోతుంది. ఆధ్యాత్మిక సీమ గడపపైన సైతం అతడు అడిగిడలేదనే చెప్పాలి.

వేదాల సాధికారికత దేశకాల పాత్రల ప్రసక్తి లేనిదై విరాజిల్లుతుంది; అంటే వాటి సాధికారికత ఒక ప్రత్యేక కాలానికి, దేశానికి, వ్యక్తికి పరిమితమై ఉండదు.

విశ్వజనీన మతాన్ని వివరించగలిగేది వేదాలు మాత్రమే. ఈ అలౌకిక అనంత జ్ఞానంలో ఏదో కించిత్తు భాగం మన ఇతిహాస, పురాణాదులలోను, విదేశాల మత గ్రంథాలలోను కానవస్తున్నది. అయినా కూడ ఈ అనంత అలౌకిక జ్ఞానరాశి ప్రప్రథమంగా, పరిపూర్ణంగా, మార్పుచేర్పులేక లభ్యమైనదిగా ఎంచబడి ఆర్యజాతిలో 'వేదం' పేరిట ప్రసిద్ధమై నాలుగు భాగాలుగా (ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం - ఒకే వేదం వేదవ్యాసులచే నాలుగు భాగాలుగా విభజింపబడి, నాలుగు పేర్లు సంతరించుకొన్నది) విభజన పొందినది. ఈ విధంగా నాలుగు వేదాలలో లభ్యమౌతున్న అక్షరరాశి యావత్ప్రపంచానికి ఆరాధనీయమై, భారతీయ లేక విదేశీయ శాస్త్రాలన్నిటిలో వ్యక్తమయ్యే సత్యానికి చరమ నిదర్శనమై సర్వోన్నత స్థానాన్ని పొంద అర్హమై ఉన్నది.

ఆర్యులచే ఆవిష్కరింపబడిన ఆ 'వేదం' అనే అక్షరరాశి గురించి మరో విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఆ రాశిలో ఏది లౌకికం కాదో[1], ఏది అర్థవాదం కాదో[2], ఏది ఐహిత్యం కాదో అది మాత్రమే వేదం. (అంటే అతీంద్రియ పారమార్థిక సత్యాలకు మాత్రమే వేదం అని పేరు.) ఈ వేదరాశి జ్ఞానకాండ, కర్మకాండ అని రెండు భాగాలుగా విభజింపబడింది. కర్మకాండలో వివరింపబడిన క్రియాకలాపాలు, వాటి ఫలితాలు మాయచే ఆవరింపబడిన ఈ ప్రపంచంలో సర్వకాలాలలో నిలిచి ఉంటాయి. కనుకనే దేశకాల పాత్రాదులలో మార్పులు ఏర్పడుతూ ఉండడం చేత తదనుగుణంగా వీటిలోను మార్పులు వచ్చాయి, వస్తున్నాయి, వస్తాయి. సామాజిక ఆచార వ్యవహారాలు ఈ కర్మకాండ మీదనే ఆధారపడి ఉండడం చేత వాటిలో కూడ మార్పులు రావడం తప్పనిసరి. అదేవిధంగా సాంప్రదాయికంగా వస్తూవున్న ఆచారవ్యవహారాలన్నీ కూడ శాస్త్ర విధులకు, సదాచారుల వర్తనకు ప్రతికూలం కానంత వరకు కాలానుగుణంగా ఒప్పుదల పొందుతాయి. వేదాలకు, వేదాలను అనుసరించే స్మృతుల ప్రభృత శాస్త్రాలకు ప్రతికూలమైన, సత్పురుషుల ఆచరణకు విరుద్ధమైన లౌకిక ఆచారాలనే వేదబోధనలుగా ఎంచి వాటిని పాటించడమే ఆర్యజాతి అధఃపతనానికి ముఖ్యకారణం.

వేదాలలోని జ్ఞానకాండకే మరొక పేరు వేదాంతం. నిష్కామకర్మ, మనో ఏకాగ్రత, భక్తి, ఆత్మజ్ఞానం - వీటి సహాయంతో ఈ వేదాంతం అనాది పర్యంతం మానవులను మాయాసాగరాన్ని దాటించి ఆవలి ముక్తిపదానికి చేరుస్తు వస్తూన్నది. దేశకాలపాత్రలు ఈ వేదాంతంపై ఏపాటి ప్రాబల్యమూ చూపలేవు

---

1. లౌకికం అంటే పంచేంద్రియజనిత జ్ఞానం, ప్రాపంచిక జ్ఞానం. ఈ లౌకికజ్ఞానం పొందడానికి వేదం అవసరం లేదు. ఉదాహరణకు: సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అనే జ్ఞానం పొందడానికి వేదం అవసరం లేదు, మన కళ్లే ఆ జ్ఞానాన్ని ఇస్తాయి.

2. కొన్ని కర్మలు చేయాలి, కొన్నిటిని చేయకూడదు అని వేదాలలో చెప్పబడింది. దీనికే విధినిషేధం అని పేరు. ఈ విధినిషేధాలను మనుష్యులు అంత సులభంగా పాటించరు. కాబట్టి వాటిని మనచే చేయించడానికై ఈ కర్మను చేస్తే ఈ లాభం కలుగుతుంది, స్వర్గానికి పోతావు. చెయ్యకుంటే నష్టం వాటిల్లుతుంది, నరకంలో పడతావు - ఇలాటి వాక్యాలు వేదాలలో ఉన్నాయి. వీటికే అర్థవాదాలని పేరు. ఇవి కేవలం స్ఫూర్తిని ఇస్తాయిగాని, నిజానికివి పారమార్థిక సత్యాలు కావు. కనుక ఇవి వేదం క్రిందికి రావు.

3. ఐతిహ్యం అంటే రామాయణ భారతాల వంటి ఇతిహాసాలు. జనసామాన్యంలో సత్యం, ధర్మం, పాతివ్రత్యం ఇత్యాది ఆదర్శాలను హరిశ్చంద్రుడు, ధర్మరాజు, శ్రీరాముడు, సీతాదేవివంటి ఆదర్శమూర్తుల వృత్తాంతాల ద్వారా ప్రచారం చేయడం ఇతిహాసాల లక్ష్యం. కనుక ఇవి కూడ వేదం అనే అర్థానికి చెందవు.

కనుక, సకల ప్రజానీకానికీ సకల కాలాలకూ సకల దేశాలకూ విశ్వజనీన మతాన్ని బోధింప అది మాత్రమే అర్హతను సంతరించుకొని ఉన్నది.

వేదాలలోని కర్మకాండను ఆధారం చేసుకొని వ్రాయబడిన మనుధర్మ శాస్త్రాల వంటి ఇతర విషయాలతోబాటు దేశకాలపాత్రల కనుగుణంగా సమాజ సంక్షేమానికి దోహదం చేసే కర్మలను కూడ పేర్కొని ఉన్నవి. ఇక పురాణాల వంటివి వేదాంతంలో నిగూఢంగా ఉన్న సత్యాలను విశదంగా వర్ణించాయి. భగవంతుని అసంఖ్యాక అంశలలో ఏదో ఒక అంశకు మూర్తిభావం వహించిన అవతారమూర్తుల మహోన్నత గుణగణాలను అభివర్ణిస్తూ పై సత్యాలను పురాణాదులు ఉద్ఘాటించేందుకు ప్రయత్నించాయి.

కాని కాలక్రమంలో ఆర్యసంతతివారు సదాచారమార్గం నుండి భ్రష్టులై, వైరాగ్యరహితులై వ్యాప్తిలోవున్న ఆచారాలనే పాటిస్తూ క్రమంగా వివేకశూన్యు లయ్యారు. వేదాంతం ప్రసక్తే లేదు, కనీసం పురాణాలనన్నా వారు సరిగా అర్థం చేసుకోలేకపోయారు. ఎందుకంటే: సూక్ష్మాతిసూక్ష్మమైన వైదాంతిక సత్యాలను అల్పబుద్ధులైన సామాన్యులకు విశదపరచడం కోసం స్థూలంగా, నిర్దిష్టంగా వర్ణించడం చేత, భగవంతుని విభిన్న భావాలను బోధించడం చేత అవి పరస్పర విరుద్ధంగా ఉన్నట్లే కానవస్తాయి.[1] తత్ఫలితంగా అనంతభావ సమష్టియైన అఖండ సనాతన వైదికధర్మాన్ని అనేక విభాగాలుగా విడగొట్టి మత వైషమ్యాలను రగిలించి, ఒకర్ని ఒకరు ఆ దావానలంలో పడత్రోయడానికి సదా ప్రయత్నిస్తూ వచ్చారు. ధర్మానికి ఆలవాలమైన భారతదేశాన్ని ఆ రీతిలో వారు దాదాపు నరక తుల్యంగా మార్చివేశారు. అలాంటి పరిస్థితిలో ఆర్యుల నిజమైన మతం ఏమిటో, సదా కలహించుకొంటూ స్థూలదృష్టికి శాఖోపశాఖలుగా కానవస్తూ, ఎక్కడ చూసినా విపరీత ఆచారాల సంప్రదాయాలతో కూడుకొని

---

1. ఉదాహరణకు భాగవతాది పురాణాలు విష్ణువును, స్కాందాది పురాణాలు శివుణ్ణి, దేవీభాగవతాదులు దేవిని ప్రముఖంగా శ్లాఘించడం కానవస్తూన్నది. అదేవిధంగా కొన్ని పురాణాలలో భక్తి, మరికొన్నిటిలో జ్ఞానం విశిష్టంగా వ్యక్తమౌతున్నవి. ఇవన్నీ సాధకుల విభిన్న మానసిక అవస్థలకు అనుకూలించే భావద్వారాలను, మార్గాలను చూపుతున్నవని గ్రహించలేక శివుని కంటే విష్ణువు అధికుడనీ, విష్ణువు కంటే శివుడే గొప్పవాడనీ లేదా భక్తి కంటే జ్ఞానం శ్రేష్ఠమనీ, జ్ఞానం కంటే భక్తి సులభమనీ మందబుద్ధులు పరస్పరం పోట్లాడుకొంటుంటారు. కనుకనే సార్వజనీనమైన సనాతన వైదికమార్గం శాఖోపశాఖలుగా చీలిపోయిందనీ, అటువంటి పరిస్థితులలో భగవంతుడు శ్రీరామకృష్ణులుగా అవతరించి వాటికి సామరస్యాన్ని చేకూర్చారని స్వామి వివేకానంద ఇక్కడ వ్యాఖ్యానిస్తున్నారు.

- అనువాదకుడు

స్వదేశీయులకు భ్రాంతి జనితమై, విదేశీయులకు తిరస్కారస్థానమై, దేశకాల పరిస్థితులకు అనుగుణంగా నానామతాలుగా సంప్రదాయాలుగా మతశాఖలుగా చీలిపోయిన మన సనాతన వైదిక మతంలో నిజమైన ఐక్యత ఎక్కడ ఎలా ఉన్నదో చూపించడానికి, కాలానుక్రమంగా కోల్పోయిన సనాతన ధర్మం యొక్క విశ్వజనీనతను స్వీయజీవితంలో ప్రత్యక్షంగా అభివ్యక్తం చేసి ఆ సనాతన మతానికి సజీవ ఉదాహరణమై భగవాన్ శ్రీరామకృష్ణులు ఈ ఇలలో అవతరించారు.

శాశ్వతత్వం సంతరించుకొని సృష్టి స్థితి లయ కారకుడైన ఈశ్వరునికి తోడ్పడుతూవున్న ఈ వేదశాస్త్రం వాసనారహితం గావించబడిన ఋషి హృదయంలో ఎలా వెల్లడవుతుందో చూపించడానికి, శాస్త్రాల సత్యత్వం ఈ రీతిలో నిరూపణమైనప్పుడు మతం లేదా ధర్మం పునఃస్థాపితమవుతుంది, పునః ప్రకటితమవుతుంది అనే ఉద్దేశంతోనే వేదమూర్తియైన భగవంతుడు ఈ ప్రస్తుత అవతారంలో బాహ్యవిద్యాశిక్షణకు దాదాపు ఉపేక్ష వహించాడు.

అసలు మతమైన వేదాన్ని, ఆ మత బోధకుడైన బ్రాహ్మణుని పరిరక్షించడానికి భగవంతుడు పదేపదే అవతరిస్తాడని స్మృతుల వంటి గ్రంథాలు చాటి చెప్పడం సువిదితమే.

నదీప్రవాహం ఏటవాలు ప్రదేశం నుండి క్రింద పడుతున్నప్పుడు వేగాన్ని సంతరించుకొనేట్లుగా, క్రిందపడి పైకి ఎగసే అల మరింత ఎత్తును సంతరించుకొనేట్లుగా ఆర్యసమాజం తన రుగ్మతలను వదలగొట్టుకొని, భగవంతుని కరుణా కటాక్షంతో మరింత వైభవోపేతంగా శక్తియుక్తంగా రూపొందడం చరిత్ర ప్రసిద్ధం.

ప్రతి పతనావస్థ నుండి పైకి వచ్చిన మన సమాజం అంతర్నిహితమై ఉన్న తన సనాతన పరిపూర్ణత్వాన్ని మరింతగా ప్రకటిస్తూ వస్తూన్నది. సకల భూతాంతర్యామియైన భగవంతుడు కూడ తన ప్రతి అవతారంలోను ఆత్మస్వరూపాన్ని అధికాధికంగా అభివ్యక్తంచేస్తూ వస్తున్నాడు.

పదే పదే ఈ భారతభూమి మూర్ఛావస్థను పొందినప్పుడు, భగవంతుడు మళ్లీ మళ్లీ అవతరించి ఆత్మప్రకటన ద్వారా దానిని పునఃజాగృతం చేసివున్నాడు.

కాని గతంలో దుఃఖమనే ఏ అమావాస్య రేయీ ఈ పావన భూమిని ఇప్పటి రేయి క్రమ్మినంత గాఢాంధకారాన్ని ఆవరించి ఉండలేదు. ఆ రాత్రి దాదాపు గడచిపోయింది, చరమాంకంలో ఉంది. అయినప్పటికీ ఈ ప్రస్తుత అగాధ పతనంతో పోల్చిచూస్తే వెనుకటి పతనాలు గోష్పదతుల్యంగానే కనిపిస్తాయి.

కనుక ప్రస్తుత ఆర్యసమాజ సముజ్జ్వల జాగృతం గతకాలపు జాగృతాలతో పోల్చితే సూర్యుని ఎదుట మినుకు మినుకు మనే నక్షత్రాల్లా కాంతివిహీనాలనే

చెప్పాలి. అట్లే ప్రస్తుత పునఃజాగృత ఉద్ధతితో పోల్చి చూసినప్పుడు వెనుకటి యుగాల సంభవాలు పిల్లల ఆటగా ద్యోతకమౌతాయి.

ఈ పతనాన్ని నివారించగలిగే యోగ్యపురుషులు కొరవడడం చేత ప్రస్తుత పతనావస్థలో సనాతన ధర్మంలో నిహితమైన భావసమష్టి తునకలై నలుదిక్కులా శాఖోపశాఖలుగా చెదరిపోయింది. కొన్ని ప్రాంతాలలో అది పాక్షికంగా పదిలమై ఉన్నప్పటికీ ఇతరచోట్ల పూర్తిగా లుప్తమైపోయింది.

ఈ పునర్జాగృతి నుండి లభించే నూతన బలం ద్వారా త్రాణ పొంది మనుష్యులు ముక్కలు ముక్కలై చెల్లాచెదరైన ఆధ్యాత్మిక జ్ఞానరాశిని సమష్టీకరించడమేకాక లుప్తమైన వివిధ కళలను, విజ్ఞానశాస్త్రాలను మళ్లీ ఆవిష్కరించుకొని, ఆ భావాలను, ఆదర్శాలను సముచిత అవగాహనతో అనుభూతం గావించుకొని తమ జీవితాలను సుసంపన్నం చేసుకోగలందులకై పరమ కారుణ్యమూర్తియైన భగవంతుడు ఇతర యుగా లన్నిటికంటే ప్రస్తుత యుగంలో సమధిక సంపూర్ణంగా, సకలభావ సమన్వితుడై, సకల విద్యాసహాయకుడై పైన చెప్పినట్లు యుగావతారునిగా (శ్రీరామకృష్ణులుగా) ఉద్భవించారు.

కాబట్టే ఉదాత్త భావాల, ఆశయాల సామరస్యం ఈ మహాయుగ అరుణోదయకాలంలోనే ప్రచారం కాబడుతూన్నది. సనాతన వేదాలలో, సనాతన ధర్మంలో తాపడం చేయబడి మరుగున ఉన్న ఈ అనంత, శాశ్వత మహదాశయం సమాజంలో ఉచ్చస్వనంలో చాటబడుతూన్నది.

ఈ నవీన యుగధర్మం సమస్త ప్రపంచానికి, ప్రత్యేకంగా భారతదేశానికి ఫలవంతమైన ఆధారం కాగలదు; ఈ నవీనయుగ ధర్మప్రచారకులైన భగవాన్ శ్రీరామకృష్ణులు గత యుగాలలో జన్మించి యుగధర్మాన్ని ప్రచారం చేసిన అవతారమూర్తుల రూపుదిద్దుకొన్న అభివ్యక్తీకరణే. ఓ మనిషీ! ఈ సత్యాన్ని విశ్వసించి, గ్రహించు.

ఓ మనిషీ! మరణించిన వ్యక్తి తిరిగి రాడు, గడిచిపోయిన రాత్రి మళ్లీ రాదు; మానసిక ఉద్వేగం ఎంత ఆవేశభరితమైనదైనప్పటికీ మళ్లీ అదే రూపు దాల్చదు; అదే విధంగా జీవుడు రెండుసార్లు ఒకే దేహాన్ని పొందలేడు. కనుక గతాన్ని ఆరాధించడం ఆపి, ప్రస్తుతాన్ని పూజించడానికి మేం మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. గతించిన దానికోసం దుఃఖించడం మాని ప్రస్తుతానికి పాటుపడవలసిందిగా ఆహ్వానిస్తున్నాం. కనుమరుగైన మార్గాలను కనుగొనడంలోనే మీ శక్తులన్నిటిని వృథాచేయక కొత్తగా నిర్మితమైన సమీపంలో ఉన్న ఈ విశాల మార్గంలో అడుగిడమని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. బుద్ధిమంతుడా! ఈ సూచనను స్వీకరించు.

నవజాగృతమైన ఏ శక్తి చూచాయగా మాత్రమే ప్రకటితమై దిగ్దిగం తాలు వ్యాపించి ప్రతిధ్వనులతో నిండిపోతున్నదో, ఆ మహాశక్తి ఇక పరిపూర్ణంగా అభివ్యక్తమైతే ఏం జరుగుతుందో ఊహించి, అనుభూతం చేసుకో. ఇక నిరర్థక సంశయాలను విడిచిపెట్టు; దుర్బలత్వాన్ని విడనాడు; బానిస జాతులకు సహజ మైన అసూయాద్వేషాలను వదలి ఈ మహాయుగ ధర్మచక్ర పరివర్తనానికి చేయూత ఇవ్వు.

మేం భగవంతుని దాసులం, భగవత్పుత్రులం, భగవంతుని లీలలో సహాయకులం - అనే విశ్వాసాన్ని హృదయంలో గాఢంగా పాదుగొల్పుకొని కార్యారంగంలో అడుగిడు.

వివేకానంద

1. భావముఖంలో శ్రీరామకృష్ణులు

యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసా శ్చ యే।
మత్త ఏ వేతి తా న్విద్ధి న త్వహం తేషు తే మయి॥
త్రిభి ర్గుణమయై ర్భావై రేభిః సర్వ మిదం జగత్।
మోహితం నాభిజానాతి మా మేభ్యః పర మవ్యయమ్॥

సాత్త్వికర రాజసిక తామసిక భావాలు ఏవేవి ఉన్నవో - అవన్నీ నా నుండే జనించినవని తెలుసుకో. అవి నాలో ఉన్నా, నేను వానిలో లేను.

ఈ త్రిగుణాల నుండి పుట్టిన భావాలచే ఈ సమస్త ప్రపంచం మోహ వశమై ఉన్నది. కనుకనే యీ గుణాలకు అతీతుడను, అవ్యయుడను అయిన నన్ను ఈ ప్రపంచం తెలుసుకోలేకున్నది.

గీత: 7-12-13

1. శ్రీరామకృష్ణుల పలుకులలోని గూఢార్థం

పన్నెండు సంవత్సరాలపాటు అవిచ్ఛిన్నంగా అసామాన్య సాధనలు అనుష్ఠించిన పిదప, ''భావముఖంలో నెలకొని ఉండు'' అన్న జగజ్జనని ఆదేశాన్ని శ్రీరామకృష్ణులు పాటించారని అనేకులు ఇప్పుడు తెలుసుకొన్నారు. కాని భావముఖంలో నెలకొని ఉండడం అంటే ఏమిటో వివరించడమూ, దాని గూఢార్థం తెలుసుకోవడమూ అంత సులభం కాదు. ఇరవై ఎనిమిది సంవత్సరాల మునుపు స్వామి వివేకానంద ఒక మిత్రునితో[1] ఇలా చెప్పారు: ''శ్రీరామకృష్ణులు పలికిన ప్రతి వాక్యం నుండి బుట్టలకొద్దీ తాత్త్విక గ్రంథాలు రచించవచ్చు.'' ఆ మిత్రుడు ఆ మాటలు విని ఆశ్చర్యపోయి, ''అవునా? ఆయన వచనాలలో అంతటి గూఢార్థం ఇమిడి ఉంటుందని మేం

---

1. శ్రీ హరమోహన్ మిత్ర

గ్రహించలేదే. ఆయన వచనాలలో ఒకదాన్ని తీసుకొని ఆ రీతిలో నాకు వివరించి చెప్పగలవా?'' అని అడిగాడు.

స్వామీజీ: ''అర్థం చేసుకోగల బుద్ధి ఉంటే నీకు అర్థమయ్యేది. గురుదేవుల ఏదో ఒక ఉపదేశాన్ని తీసుకో, నేను వివరిస్తాను.''

మిత్రుడు: ''సరే. సకల జీవులలో నారాయణునే దర్శించడం గురించి ఉపదేశిస్తూ 'ఏనుగు నారాయణుడు - మావటి నారాయణుడు' అనే కథను శ్రీరామకృష్ణులు చెప్పారే, దాన్లోని గూఢార్థాన్ని నాకు వివరించు.''

వెంటనే స్వామీజీ 'స్వాధీన ఇచ్ఛ - అదృష్టవాదం' లేదా 'పురుష ప్రయత్నం - భగవత్సంకల్పం' అనే సిద్ధాంతాలను ప్రస్తావనకు తెచ్చారు. ప్రాచ్య పాశ్చాత్య దేశాలలోని ఆ రెండు పక్షాలకు చెందిన పండితులు అనాది నుండి వివాదిస్తూ ఉన్నప్పటికీ ఏ స్థిరనిర్ణయానికీ రాలేకపోవడం గురించి తెలిపి, పైన పేర్కొన్న శ్రీరామకృష్ణుల నీతికథ ఆ వివాదానికి ఎలా అద్భుత పరిష్కారం కాగలదో సరళంగా మూడురోజుల పాటు ఆ మిత్రుడికి వివరించారు స్వామీజీ.

2. అవతార పురుషు లందరి వచనాల్లో సారూప్యం

బాగా విచారించి చూసినప్పుడు శ్రీరామకృష్ణుల దైనందిన జీవితవర్తనంలో, ఆయన ఉపదేశాలలో అటువంటి గూఢార్థం ఇమిడి ఉండడం చూసి ఆశ్చర్య పడకతప్పదు. అవతారపురుషు లందరి విషయంలోను ఇది నిజమే. వారి జీవితాలను అధ్యయనం చేసినప్పుడు ఈ నిజం తేటతెల్లమవుతుంది. ప్రతిపక్షం వారి కుతర్కాలను చీల్చిచెండాడడం ద్వారా ధర్మసంస్థాపన చేయవలసివచ్చిన శ్రీ శంకరాచార్యుల వంటి ఏ ఒకరిద్దరు మహాపురుషులను మినహాయిస్తే తక్కిన మహాపురుషుల జీవితాలలో మనకు ద్యోతకమయ్యేది వారు బోధింపదలచిన సత్యాలను తేటతెల్లని మాటలలో, హృదయాన్ని స్పృశించే చిన్నికథల దృష్టాంతాలు, రూపకాల ద్వారా వివరించి ఉండడమే. పెద్దపెద్ద మాటలు, దీర్ఘసమాసాలు, చెవులు గింగురుమనే వాగ్ధాటి - ఇవన్నీ వారిలో కానరావు. అయినా వారి ఆ సామాన్య పదజాలంలో, అరమరికలు లేని చిరునవ్వులలో సామాన్యులను సైతం ఉన్నత ఆదర్శాలను సంతరించుకొనేలా చేయగలిగిన గూఢార్థమూ, శక్తీ ఇమిడివున్నవి. అంతేకాదు వేల సంవత్సరాల పర్యంతం ప్రయత్నించి, ఇప్పటికీ మనం వారి వచనాలలోని పూర్తి అర్థాన్ని, వాటి శక్తి పరిమితిని గ్రహించలేదనే చెప్పాలి. వాటిని అధ్యయనం చేసేకొద్దీ వాటిలోని ప్రగాఢమైన అర్థాలు మనకు స్ఫురిస్తాయి. ఆ బోధనలను మనం తరచి తరచి యోచించేకొద్దీ మన మనస్సు 'అనిత్యం అసుఖం'[1] అయిన

---

1. భగవద్గీత 9-33: '.... అనిత్య మసుఖం లోక మిమం....'

ఈ నశ్వర జగత్తును పరిత్యజించి ఉన్నతోన్నత భావభూములను ఆరోహిస్తుంది. ఇలా పరమపదప్రాప్తి లేదా బ్రహ్మస్థితి లేదా ముక్తి లేదా భగవద్దర్శనం (నానా రూపాలలో దర్శించిన ఒకే స్థితిని మహాపురుషులు విభిన్న నామాలతో పేర్కొం టారు.) వైపుగా ఎవరెంతగా పురోగమిస్తారో అంతగా వారు తమ అంతరాంత రాళాల్లో ఆ మహానుభావుల సరళ వచనాల ప్రగాఢ మహత్వాన్ని గ్రహించు కొంటారు.

సర్వత్రా ఇదే నియమం. శ్రీరామకృష్ణుల పలుకులలో, వర్తనలో కూడ ఈ నియమానికి మినహాయింపు కానరాదు. ప్రప్రథమంలో ఆయన పలుకులు విన్నప్పుడు అవి అంత అర్థవంతాలుగా వ్యక్తం కావు. కాని కాలం గడిచేకొద్దీ ఆ పలుకుల విస్తార అర్థం వెల్లడవుతుంది. అందునిమిత్తం ఇక్కడ ఒక ఉదాహరణ ఇస్తే చాలను కొంటాం. కొన్నిసార్లు శ్రీరామకృష్ణులను సందర్శించిన పిదప శ్రీ గిరీశ్‌చంద్ర ఘోష్ పూర్తిగా తనను ఆయనకు అర్పించుకొని, ఒకరోజు, ''ఇప్పటి నుండి నన్ను ఏం చెయ్యమని సెలవిస్తారు?'' అని అడిగాడు.

3. ఒక ఉదాహరణ: గిరీశ్ - ముఖ్త్యారు నామా

శ్రీరామకృష్ణులు: ఇంత కాలంగా ఏం చేస్తున్నావో, అదే కొనసాగించు. ఇప్పుడు ఇరువంకల ఇది (భగవంతుడు), అది (సంసారం) నిలుపుకొని ఉండు. ఒక వైపు (సంసారం) వదలిపోయాక ఏం జరగాలో అది జరుగుతుంది. కాని ప్రతి ఉదయం, సాయంత్రం భగవంతుని స్మరణ మననాలు కొనసాగించు.

ఇలా పలికి ఆయన, గిరీశ్‌కేసి చూశారు, జవాబుకై నిరీక్షిస్తూన్నట్లు.

ఆ మాటలు విని గిరీశ్ ఖిన్నుడై, ఇలా తలపోశాడు: ''నా దైనందిన భౌతికావసరాలైన తినడం త్రాగడం నిద్రించడం వంటి వాటి విషయాలలోనే నేను నియమిత కాలాన్ని పాటించను; అలాటిది నేను చేస్తున్న పని. భగవంతుని ఉదయ సాయంత్రాలలో స్మరింప మరచిపోవడం తథ్యం. ఏం కష్టం వచ్చిపడింది! గురూపదేశాన్ని ఉల్లంఘించడం మహాదోషం, హానికరం కూడ. కనుక చెప్పినట్లు చేస్తానని మాట ఎలా ఇవ్వగలను! ఈ ప్రపంచంలో ఎవరికైనా వాగ్దానం చేసి, దాన్ని భంగపరిస్తే ఎంత తప్పు! అలాంటప్పుడు ముక్తికి దారి చూపించే సాక్షాత్తు గురు వుకు వాగ్దానం చేసి దాన్ని పాటించకపోవడం గురించి వేరేగా చెప్పాలా!''

తన ఆలోచనలను వ్యక్తం చేయడానికి గిరీశ్ సంకోచించసాగాడు. నిజానికి శ్రీరామకృష్ణులు తనను ఎంతో కష్టమైన పనికి పురమాయించలేదని గిరీశ్ ఆలోచించసాగాడు. మరెవరినన్నా అలా చేయమని ఆయన పురమాయించి ఉంటే, అతడు తక్షణమే అంగీకరించే వాడు. కాని గిరీశ్ ఏం చెయ్యగలడు? పూర్తిగా బహిర్ముఖమైన తన మానసిక

4. గిరీశ్ మానసిక స్థితి

స్థితిని చక్కగా ఎరిగివున్న గిరీశ్, ప్రతినిత్యం తనకు పురమాయింపబడిన ఆ చిన్న ఆధ్యాత్మిక సాధనకూడ తన శక్తికి మించిన పని అని భావించడం తప్పు! మళ్లీ తన ప్రవృత్తిని గురించి పర్యాలోచన చేశాడు: ఏ రకమైన ప్రతిజ్ఞకైనా, నియమానికైనా జీవితాంతం కట్టుబడి ఉండడం అనే ఆలోచన సైతం అతణ్ణి ఊపిరాడకుండా చేసివేస్తుంది; ఆ ప్రతిజ్ఞ లేక నియమాన్ని భంగం చేసేవరకు అతడి మనస్సు స్థిమితపడదని అతడికి బాగా తెలుసు. అతడి జీవితంలో ఇది అక్షర సత్యం. మంచినిగాని చెడునుగాని స్వేచ్ఛాపూర్వకంగా చేయడంలో ఎలాంటి కష్టమూ ఉండదు; కాని ఒక ఫలానా పనిని విధిగా చేయాలి అనే ఆలోచన మెదలగానే అతడి మనస్సు తిరుగబడేది. తన ఈ దుర్బల, నిస్సహాయ స్థితిని తలచుకొని గిరీశ్ కుమిలిపోయి, కిమ్మనలేదు. తను చేయగలననిగాని, చేయలేననిగాని ఏ జవాబూ చెప్పలేకపోయాడు. అటువంటి సులువైన పనిని తాను నిర్వర్తించలేనని సిగ్గువిడిచి అతడెలా చెప్పగలడు? ఒకవేళ అలా చెప్పినప్పటికీ, శ్రీరామకృష్ణులు, అక్కడున్న ఇతరులు తనను గురించి ఏమనుకొంటారు? బహుశా వారు అతడి నిస్సహాయ పరిస్థితిని అవగతం చేసుకోలేక, బయటకు వ్యక్తం చేయకపోయినా అతడు నటిస్తున్నాడని భావించవచ్చు.

గిరీశ్ మౌనం వహించడంతో అతడి భావాలు గ్రహించి శ్రీరామకృష్ణులు అతణ్ణి పరికించి ఇలా అన్నారు: ''మంచిది. అలా చేయలేకుంటే భోజనానికి ముందు, నిద్రించడానికి ముందు దేవుణ్ణి స్మరించుకో.''

గిరీశ్‌చంద్ర ఘోష్

గిరీశ్ మౌనమే వహించాడు. 'అంతమాత్రమైనా చేయగలనా?' అని తనను తానే ప్రశ్నించుకొన్నాడు. అతడు కొన్ని రోజులు ఉదయం పది గంటలకు భోజనం చేస్తాడు, మరికొన్ని రోజులు సాయంత్రం ఐదు గంటలకు తింటాడు. రాత్రి భోజన విషయంలోనూ ఇదే అస్తవ్యస్తత. భోజనం చేస్తున్నాననే ఎరుకే లేకుండా భోజనం చేసిన సందర్భాలు ఎన్నో. న్యాయస్థానాలలో నడుస్తున్న వ్యాజ్యాల గురించిన చిక్కులు, క్లేశాలే ఇందుకు కారణం.

'తాను న్యాయవాదికి పంపిన పైకం ఆయనకు సకాలంలో ముట్టినదో లేదో అన్న సంగతి తనకు తెలియరాకపోవడం, వ్యాజ్యం విచారణకు వచ్చే రోజున న్యాయవాది హాజరు కాని పక్షంలో అది ఎంత ప్రమాదానికి దారితీస్తుందో ఏమో!' ఇలాంటి ఆలోచనలలో మునిగిపోయేవాడు. పనుల ఒత్తిడిలో అలాంటి రోజు మళ్ళీ రావచ్చు, అలా రావడం అసంభవం కాదు; అలా జరిగితే ఆ రోజున భగవంతుని స్మరించడం మరచిపోవడం తథ్యం. అయ్యో, ఇంత సులువైన పని చెయ్యమని గురుదేవులు చెబుతున్నా 'చేస్తా'నని చెప్పలేకున్నానే! గిరీశ్ విషమ సందిగ్ధావస్థలో పడి చేష్టలుదక్కి, మూగపోయాడు. కాని అతడి హృదయంలో ఆదుర్దా భీతి నిరాశలతో కూడిన తుఫాను చెలరేగింది. శ్రీరామకృష్ణులు గిరీశ్‌కేసి దృక్కులు పరపి, నవ్వుతూ, '' 'ఇది కూడ నాకు సాధ్యం కాని పనే' అని చెప్పబోతున్నట్లున్నావు. మంచిది. అలాగైతే 'నీ ముఖ్త్యారునామా'[1]ను నా కివ్వు'' అంటూ శ్రీరామకృష్ణులు అర్ధబాహ్య పారవశ్య స్థితిని పొందారు.

5. ముఖ్త్యారునామా ఇచ్చాక గిరీశ్ మానసిక స్థితి

ఈ సూచన గిరీశ్‌కు నచ్చింది. ఇప్పుడు అతడి మనస్సు ప్రశాంతతను సంతరించుకొంది. శ్రీరామకృష్ణుల ఆసరాకై, అపార కృపకై గిరీశ్ హృదయంలో మేరమీరిన ప్రేమ పెల్లుబికింది. మహాభయావహమైన బంధనమనే నియమం శాశ్వతంగా వదలినందుకు గిరీశ్ బ్రతుకుజీవుడా అనుకొన్నాడు. ఇప్పుడు తాను ఏం చేసినప్పటికీ తమ దివ్యశక్తితో గురుదేవులు ఏదో రకంగా తనను రక్షిస్తారు అనే ప్రగాఢ విశ్వాసం మాత్రం అతడికి ఉంటే చాలు.

6. ముఖ్త్యారునామాను ఇవ్వడం ఒక ప్రేమ బంధనం

ముఖ్త్యారునామాను గురుదేవులకు సమర్పించడం అంటే: స్వప్రయత్నంతోనో లేదా సాధనాదులు అనుష్ఠించో దేనినీ విడిచిపెట్టనవసరం లేదు; గురుదేవులే తమ శక్తితో తన మనస్సులోని చివరి ఐహిక అవశేషపర్యంతం తొలగించివేస్తారని గిరీశ్ అప్పటి భావన.

కాని నియమాలనే బంధనాన్ని మెడమట్టా తగిలించుకోవడమే భరించలేని గిరీశ్ అందుకు బదులుగా అంతకంటె వందరెట్లు బలీయమైన ప్రేమ అనే ఉచ్చును బుద్ధిపూర్వకంగా మెడకు తగిలించుకొన్నట్లు అప్పుడు గ్రహించలేకపోయాడు. తాను చేస్తొన్న పనియొక్క ప్రాధాన్యం, లోతులను అతడు తరచి

---

1. 'ముఖ్త్యారునామా'ను ఇవ్వడమంటే తన బాధ్యతనంతా మరొకరికి అప్పగించడమని అర్థం. ఆస్తిపాస్తుల వ్యవహారాలలో ఎవరైనా తన బాధ్యతనంతా మరొకరికి అప్పగించినప్పుడు, ఆ రెండవ వ్యక్తి యజమానిపరంగా ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం, ఇచ్చిపుచ్చుకోవడాలు చేయడం, దస్తావేజులపై సంతకాలు చేయడం వంటి వ్యవహారాల నన్నిటినీ చూసుకొంటాడు.

చూడలేదు. తనకు అనుకూలత లేక ప్రతికూలత, కీర్తి లేక అపకీర్తి, సుఖం లేక దుఃఖం కలిగించే పరిస్థితులు ఏవి ఎదురైనా తాను మారుమాట్లాడక, సణుగుకోక వాటిని భరించవలసి ఉంటుందని అతడప్పుడు గ్రహించలేకపోయాడు. ఇతర ఆలోచనలన్నీ అతడి మనస్సు నుండి మాయమైపోయాయి. అంతులేని శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి అతడు పాత్రుడై ఉన్నాడు. అంతేగాక ఇప్పుడు అతడిలో శ్రీరామకృష్ణులను ఆశ్రయించానన్న 'అహం' జనించి, ఉద్భృతం కాసాగింది. లోకంపట్ల అతడిలో ఒక రకమైన తిరస్కారభావం పొడమింది; అతణ్ణి గురించి లోకం ఏం మాట్లాడినా, చివరకు ఈసడించుకొన్నా అతడికి అప్రస్తుతం; ఏ పరిస్థితిలోనైనా, ఏ సమయంలోనైనా నిస్సంశయంగా శ్రీరామకృష్ణులు తన మనిషే అనే భరోసాతో ఉన్నాడతడు. భక్తిశాస్త్రాలలో[1] భగవదాశ్రితమైన ఈ 'అహంకారం' ఆధ్యాత్మిక సాధనలలో అత్యుత్తమమైన ఒకానొక సాధనగా పరిగణింపబడుతూన్నదనీ, అదృష్టవంతులైన మనుష్యులనే వరిస్తుందనీ అప్పుడతడు గ్రహించలేకపోయాడు. ఏది ఎలావున్నా గిరీశ్ ఇప్పుడు నిశ్చింతగా ఉన్నాడు. తింటున్నప్పుడు, తాగుతున్నప్పుడు లేక ఏ పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు, 'శ్రీరామకృష్ణులు నా పూర్తి బాధ్యతను వహించారు' అనే ఉపశమనకారియైన ఒక్క ఆలోచనే అతడి మదిలో సదా మెదలేది. ఆ ఆలోచన క్రమంగా ప్రగాఢమై అతడిపై ఆధిపత్యం వహించి అప్రయత్నపూర్వకంగా శ్రీరామకృష్ణులనే ధ్యానింపచేయిస్తూ అతడి భావాలలో, చర్యలలో ఆమూలాగ్రంగా పరివర్తనం తీసుకురాసాగింది. ఇదంతా గ్రహించకపోయినప్పటికీ, గిరీశ్ హృదయం ఆనందంతో నిండిపోయింది. శ్రీరామకృష్ణులు తనను ప్రేమించడం, తన సొంతమనిషి కంటే ఆయన తనకు ఆప్తులవడం అని గిరీశ్ తలచడమే ఇందుకు కారణం.

''ఎవ్వరి మనోగత ఆధ్యాత్మిక వైఖరిలోనూ జోక్యం చేసుకోరాదు'' అని శ్రీరామకృష్ణులు సదా బోధించేవారు. ఆ మేరకే ఆయన భక్తులతో వ్యవహరించే

7. గిరీశ్‌కు శిక్షణ ఇచ్చిన విధానం

వారు. గిరీశ్ ఆధ్యాత్మిక మనోభావాన్ని చక్కగా ఎరిగివున్నవారు కావడం చేత, ఆ మనోభావం మేరకే అతడికి ఉపదేశాలిచ్చేవారు. ఒకరోజు ఏదో సామాన్య విషయంలో శ్రీరామకృష్ణుల సమక్షంలో, ''దాన్ని నేను చేస్తాను'' అన్నాడు గిరీశ్. హఠాత్తుగా శ్రీరామకృష్ణులు ఆక్షేపణీయంగా, ''అదేమిటి? నేను చేస్తానని అంటావెందుకు? ఒకవేళ నువ్వు చెయ్యలేకపోతే! అప్పుడేమిటి? భగవత్సంకల్పం ఉంటే చేస్తానని చెప్పాలి'' అని అన్నారు. అప్పుడు గిరీశ్ ఇలా అనుకొన్నాడు: ''ఆయన చెప్పింది నిజమే. నా పూర్తి

---

1. నారద భక్తిసూత్రాలు

బాధ్యతను భగవంతునిపై మోపాను, ఆయన నా భారం వహింప సమ్మతించారు. ఒక ఫలానా పని సముచితమైనదని, నాకు మేలు ఒనగూరుస్తుందని ఆయన భావించి, నాకు అనుమతి ఇస్తేనే దాన్ని నేను చేయగలను. నా స్వశక్తితో అన్యథా దాన్ని నేనెలా చెయ్యగలుగుతాను?'' పై విషయం అర్థం చేసుకొని క్రమంగా గిరీశ్ 'నేను చేస్తాను', 'నేను వెళతాను' అని చెప్పడం మానుకొన్నాడు.

ఇలా రోజులు దొర్లిపోయాయి. కాలక్రమంలో శ్రీరామకృష్ణులు మహాసమాధి చెందారు. ఈలోపు గిరీశ్ అనేక దుర్ఘటనలు ఎదుర్కొన్నాడు; అతడి భార్య, కుమారుడు తదితరులు మృతిచెందారు. కాని ప్రతిసారీ అతడి మనస్సు ఇలా సమర్థించుకోసాగింది: ''ఆయన (శ్రీరామకృష్ణులు) ఈ సంఘటనలు నీ మేలు కోసమే జరుగనిస్తున్నారు. నీ బాధ్యతను ఆయనకు అప్పగించావు, దాన్ని ఆయన స్వీకరించారు; కాని నిన్ను ఫలానా మార్గంగుండా తీసుకుపోతానని ఆయన ఎలాంటి హామీ ఇవ్వలేదు కదా. ఈ మార్గం నీకు సుగమంగా ఉంటుందని ఈ మార్గంగుండా నిన్ను తోడ్కొని వెళుతున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ నువ్వు సణుగుకోవడం, చిరచిరలాడడం తగదు. అలాంటప్పుడు నీ ముఖ్త్యారునామాను లేదా నీ బాధ్యతను ఆయనకు అప్పగించడం కేవలం ఉత్త నోటిమాటే కదా!'' ఇలా రోజులు గడిచేకొద్దీ ముఖ్త్యారునామాను ధారాదత్తం చేయడంలోని అంతరార్థం గిరీశ్‌కు విస్పష్టం కాసాగింది. దానిని పూర్తి అర్థం చివరికైనా అతడికి అవగతమైందా? దానిని గురించి ప్రశ్నించినప్పుడు, గిరీశ్ ఇలా అన్నాడు: ''ఇప్పటికీ గ్రహించవలసింది ఎంతో ఉంది. ముఖ్త్యారునామాను అలవోకగా ఇచ్చివెయ్యడంలో ఇంత నిగూఢత ఉంటుందని అప్పుడు నాకు తెలుసా ఏమిటి? ఏదో ఒక సమయంలో జపతపాదుల భజనల పారమార్థిక సాధనలకు ముగింపు అనేది ఉంటుంది. కాని ముఖ్త్యారునామాను ఇచ్చివేసిన వ్యక్తి కర్మకలాపాలకు అంతం అంటూ ఉండదని నేనిప్పుడు తెలుసుకొన్నాను.'' ఇలా అనడానికి కారణం: తన అన్ని ఆలోచనలకు, చేష్టలకు ఆయన (భగవంతుడు) పైన, ఆయన శక్తిపైన తాను ఆధారపడి ఉన్నాడో లేక తన దిక్కుమాలిన 'అహం'పైన ఆధారపడి ఉన్నాడో ప్రతి అడుగులోను, ప్రతి శ్వాసలోను తాను పరికించవలసి ఉందని అతడు గ్రహించడమే.

8. ముఖ్త్యారునామాను ఇవ్వడంలోని ప్రాధాన్యాన్ని గిరీశ్ అవగతం చేసుకోవడం

ముఖ్త్యారునామాను అంగీకరించడానికి సంబంధించి మన మనస్సులో అనేక ఆలోచనలు తలెత్తుతాయి. ఏసుక్రీస్తు, చైతన్య మహాప్రభువు వంటి అవతార పురుషులకు మాత్రమే కొన్ని సందర్భాలలో కొందరికి ఈ రకం అభయ ప్రదానం ఇవ్వడం చెల్లిందని ప్రపంచ చరిత్రలో మనకు కానవస్తుంది. సామాన్య

9. అవతారపురుషుడు ముక్తిప్రదాత

గురువులకు అలా చేసే శక్తిగాని సమర్థతగాని లేదు. వారు మహా అయితే వేటి ద్వారా తాము ఆధ్యాత్మికోన్నతిని పొందగలిగారో అటువంటి మంత్రాలను ప్రత్యేక సాధనలను బోధించడం మాత్రం చేయగలరు; లేదా తాము పావన జీవనం గడుపుతూ తద్ద్వారా జనులను పవిత్రతవైపుగా ఆకర్షించగలరు. కాని నానారకాల లౌకిక బంధనాలలో చిక్కుకుపోయి మనిషి పూర్తిగా అసహాయ స్థితికి దిగజారినప్పుడు ఒక చిన్నపనిని నిర్వర్తించమన్నా దాన్ని చేయడానికి అతడు తన అశక్తతను వ్యక్తంచేసి నిస్పృహతో సహాయాన్ని కోరతాడు. అతడికి తోడ్పడడం సామాన్య గురువుల శక్తికి మించిన పనే అవుతుంది. 'నీ పాప చర్యల భారాన్నంతా నేను పుచ్చుకొంటాను; ఆ పాప ఫలాన్ని నీ తరఫున నేను అనుభవిస్తాను' అని ఒక వ్యక్తి మరో వ్యక్తితో చెప్పడంగాని, అలా చేయడం గాని ఒకరికి శక్తికి మించిన పనే అవుతుంది. లోకంలో అటువంటి ధర్మగ్లాని ఏర్పడిన సమయంలో కృపావశుడై భగవంతుడు అవతరిస్తాడు. మానవుల పాప చర్యల ఫలాన్ని వారి తరఫున స్వయంగా తానే అనుభవించి వారిని బంధవిముక్తులను చేసి ఉద్ధరిస్తాడు. అలా చేసినప్పటికీ ఆయన మనిషిని పూర్తిగా దుఃఖవిముక్తుణ్ణి చేయడు. అతడికి గుణపాఠం నేర్పడానికి అతడి ద్వారా ఏ కొద్దిగానైనా స్వప్రయత్నం చేయిస్తాడు. ఈ సందర్భంగా శ్రీరామకృష్ణులు, ''వారి (అవతారపురుషుల) అనుగ్రహంతో మనిషి పది జన్మలు అనుభవించవలసిన దాన్ని ఒక్క జన్మలోనే తీర్చేసుకొంటాడు'' అని చెప్పేవారు.

10. ఉదాహరణ

పైన తెల్పిన విషయం వ్యక్తిపరంగా ఎంత నిజమో జాతిపరంగానూ అంతే నిజం. ఈ విషయమే భగవద్గీతలో (11.8) 'విశ్వరూపదర్శనార్థం అర్జునుడికి దివ్యచక్షువు ఒసగడం' అనీ, పురాణాలలో 'భగవంతుని అనుగ్రహం పొందడం' అనీ, గౌడీయ వైష్ణవశాస్త్రాలలో 'జగాయ్ - మధాయ్‌లను ఉద్ధరించడం' లేదా 'వారిలోని విశ్వాసరాహిత్యాన్ని మార్గం చేయడం' అనీ, క్రైస్తవ శాస్త్రాలలో 'ఏసుక్రీస్తు ఇతరుల పాపాన్ని తాను భరించి వారికి బదులుగా ప్రాయశ్చిత్తం చేయడం' అనీ పేర్కొనబడుతోంది. శ్రీరామకృష్ణుల జీవితంలో దీనిని గురించిన సూచన గ్రహించలేకపోయి ఉంటే ఆ విషయంలో సత్యం ఉన్నదనే సంగతి అనుభూతం చేసుకోలేకపోయేవారం.

చికిత్స నిమిత్తం శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్‌లో బసచేసి ఉన్నప్పుడు ఒకరోజు తమ సూక్ష్మదేహం స్థూలశరీరం నుండి బయటకు వచ్చి అటూ ఇటూ పచార్లు చేయడం ఆయనకు దర్శనమైంది. ఈ దర్శనం గురించి ఆయన ఇలా చెప్పారు: ''దాని వీపు పుళ్లమయంగా ఉండడం చూశాను. ఆ పుళ్లు ఎలా

ఏర్పడ్డాయో అని ఆశ్చర్యపోయాను. రకరకాల పాపకృత్యాలు చేసిన జనం వచ్చి నన్ను తాకుతారు, వారి వేదనలకు కరిగిపోయి వారి పాపకృత్యాల ఫలాలను తీసుకోవలసి వచ్చినందున నాకు ఆ పుళ్ళు ఏర్పడ్డాయని జగజ్జనని నాకు దర్శింపచేసింది. అందుకే (తమ గొంతు[1] చూపుతూ) ఈ రోగం. కాకుంటే,

11. 'ముక్త్యారునామా'ను అంగీకరించడంలో శ్రీరామకృష్ణుల అంతర్దృష్టి

ఈ శరీరం ఎన్నడూ ఏ తప్పూ చేయకపోయినా ఎందుకు ఇంత బాధను అనుభవిస్తూన్నది?'' మేం అవాక్కయి ఇలా అనుకొన్నాం: 'నిజంగానే ఒక వ్యక్తి ఇతరులు చేసిన పాపకృత్యాల ఫలాన్ని తాను అనుభవిస్తూ వారికి ఆధ్యాత్మిక పురోగతి కల్పింప వారిని విముక్తులను చేయించగలడా?' శ్రీరామకృష్ణుల పలుకులు విని, ఆయనపట్ల ఉన్న ప్రేమతో అనేకులం ఇలా భావించాం: 'అయ్యో, అబద్ధాలాడడం మోసగించడం ఇత్యాది అనేక పాపకృత్యాలకు ఒడికట్టి మే మెందుకు గురుదేవులను తాకాము? ఆయన ఎంతో బాధపడుతున్నారు, నొప్పిని అనుభవిస్తున్నారు. ఇకపై మళ్ళీ ఎన్నడూ ఆయన దివ్యశరీరాన్ని స్పృశించకూడదు.'

ఈ సందర్భంగా శ్రీరామకృష్ణులు మరో సందర్భంలో అన్న మాటలు మాకు గుర్తుకువస్తున్నాయి. ఒకప్పుడు బొల్లివ్యాధిగ్రస్తుడైన ఒక వ్యక్తి వచ్చి, శ్రీరామకృష్ణులు తమ చేతిని తన వ్యాధిగ్రస్త శరీరంపై నిమిరితే ఆ రోగం నయమౌతుందని దీనంగా ఆయనను ప్రార్థించాడు. శ్రీరామకృష్ణులకు అతడిపట్ల దయ జనించి, ఇలా

12. బొల్లివ్యాధిని శ్రీరామకృష్ణులు నయం చేయడం

అన్నారు: ''మంచిది. నువ్వు ఏం చెబుతున్నావో నా కేమీ తెలియదు. కాని నువ్వు కోరుతున్నావు కాబట్టి నా చేత్తో నిమురుతాను. జగజ్జనని సంకల్పం ఉంటే, నయం అవుతుంది.'' ఇలా అంటూ ఆయన తన చేత్తో అతడి దేహాన్ని నిమిరారు. ఆ రోజంతా చెయ్యి నొప్పితో ఆయన ఎంతో అశాంతికి గురై జగజ్జననికి, ''మళ్ళీ ఎన్నడూ అలాంటి పని చేయను తల్లీ'' అని విన్నవించారు. తరువాత శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''అతడి రోగం నయమైపోయింది. కాని ఆ బాధ యావత్తు (తమ శరీరాన్ని చూపుతూ) ఇది అనుభవించింది.'' ఈ యుగంలో వేదాలు, బైబిల్, ఖురాన్, పురాణాలు, మంత్రతంత్రాది శాస్త్రాలను శ్రీరామకృష్ణుల జీవన ప్రకాశంలో అధ్యయనం చేస్తే తేలికగా అవగతమౌతాయని ఆయన జీవితంలోని ఈ సంఘటనలు చెప్పకచెబుతున్నాయి. శ్రీరామకృష్ణులు కూడా మాతో, ''నాయనలారా, నవాబుల కాలంలో చలామణిలో ఉన్న నాణాలు పాదుషాల కాలంలో చెల్లుబడి కావు'' అని చెప్పేవారు.

---

1. ఈ సంభాషణ జరిగినప్పుడు శ్రీరామకృష్ణులు గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.

బాహ్యదృష్టికి 'ముక్త్యారునామా'ను ఇవ్వడం అన్నది చాల సులువైన పనిగా, మరొకరికి బదిలీ చేయడానికి అది వేచి సిద్ధంగా ఉన్నంత సులువైనదిగా గోచరిస్తుంది. మనిషి తన ఇష్టాలకు బానిస, మత ఆచరణలో సైతం అతడు అనుకూల్యాలను ఎదురుచూస్తాడు. అతడు రెంటినీ, అంటే ఒక వంక ప్రాపంచిక సుఖాలనూ, మరోవైపు భగవద్దర్శన ఆనందాన్నీ చవిచూడ నెంచుతాడు. ప్రాపంచిక సుఖాలు అతడికి ఎంత తియ్యగా అమృతప్రాయంగా కనిపిస్తాయంటే, వాటిని త్యజించాలనే కేవల ఆలోచనే అతడి పాదాల క్రింద నేల క్రుంగిపోతున్న తలంపును కలిగిస్తుంది. అలా కనుక చేస్తే పిదప తన జీవితానికి ఆలంబన ఏది అని అతడు ఆశ్చర్య పోతాడు. కనుకనే ఆధ్యాత్మిక జగత్తులో 'ముక్త్యారునామా'ను ఇవ్వడం చలామణి అవుతుందని విన్న తక్షణమే ఎగిరి గంతులు వేస్తాడు. అతడు ఇలా అనుకొంటాడు: ''మంచిది, ఎంత దివ్యంగా ఉంటుంది! దొంగతనం, మోసం, దోపిడీ ఇత్యాదులు చేసి తృప్తిగా సుఖాలను అనుభవిస్తాను. శ్రీచైతన్యులో, ఏసుక్రీస్తో లేదా శ్రీరామకృష్ణులో నేను పరలోకంలో సుఖంగా ఉండేటట్లు చూసుకొంటారు. పరలోకం అని ఎందుకు అన్నానంటే, ఏదో ఒక రోజు నేను చావాలి కదా!'' తానొక మూర్ఖుడనని, అలా భావించడం కేవలం ఆత్మవంచన అని, తన మనస్సు సదా తనను అట్లే మోసగిస్తూ వస్తూన్నదని పాపం అప్పుడతడు అర్థం చేసుకోడు. తాను అలా భావించడం తాను చేసిన పాపకృత్యాల ఫలితంగా వాటిల్లబోయే భయంకర దుఃస్థితి చిత్రీకరణలను చూడ భయపడి తన కళ్లను తానే మూసుకోవడం అని, తలక్రిందులుగా పడి అధఃపతనం అవుతున్న దృశ్యాన్ని తన మనస్సు నుండి తొలగింప తన దుష్ట మనస్సు చేస్తున్న ప్రయత్నం అనీ గ్రహించాడు. బలవంతంగా తన కళ్లు తెరవబడే ఒకానొక రోజు రాబోతుందని, అప్పుడు తీరంలేని సముద్రం ఒక్కటే తన ఎదుట కనబడుతుందని అతడికి ఇప్పుడు అర్థం కాదు. తదనంతరం ఒక వంచకుడు ఇచ్చిన 'ముక్త్యారునామా'ను ఎవ్వరూ అంగీకరించరని అతడికి అవగతమౌతుంది. ఆహా, మనిషీ, దివ్యమైన బేరం కుదుర్చుకొన్నానని తలపోస్తూ నిన్ను నువ్వు ఎన్ని విధాలుగా వంచించుకొంటున్నావు. మనిషి మనస్సులో మహా భ్రాంతిని కల్పిస్తున్న మహామాయకు జయహో! ఆ మహామాయను సంబోధిస్తూ శ్రీరామప్రసాద్ తన పాటలో చెప్పింది అక్షరాల సత్యం:

13. 'ముక్త్యారునామా'ను ఇవ్వడంలోని క్లిష్టత

శాభాష్ మా దక్షిణా కాళీ, భువన్ భేర్కీ లాగియే దిలి,
తోర్ భేల్కీర్ గుటి చరణ్ దూటి భవేర్ భాగ్యేఫేలే దిలి।

ఏమన్ బాజికరేఛ్మేయే, రాఖ్లి బాజారే పాగల్ సాజాయే,
నిజే గుణమయీ హోయే పురుష్ ప్రకృతి హోలి,
మనేతే తాయి సంద్కరి, జే చరణ్ పాయిని త్రిపురారి,
ప్రసాద్రే సేయి చరణ్పాబి? తుయి ఓ బుఝి పాగల్ హోలి॥

భావం: అమ్మా, దక్షిణ కాళీ, సెబాష్! ప్రపంచమంతటా ఇంద్రజాలాన్ని పరపావు. కాని ఈ ఇంద్రజాలాన్ని పటాపంచలు చేయగలిగే నీ పాదపద్మాలు రెంటినీ శివుని అదృష్టఫలంగా ఆయన కిచ్చావు. నువ్వు ఎలాంటి ఐంద్రజాలికుని కుమార్తెవంటే తండ్రినే పిచ్చివానిగా చేశావు. త్రిగుణమయివై నువ్వే పురుష ప్రకృతులుగా అభివ్యక్తమౌతున్నావు. అటువంటప్పుడు (అంటే మరి వేరెవరో కాక నువ్వే ఇంద్రజాలంగా వ్యక్తమౌతున్నప్పుడు) నా మనస్సులో సందేహం తలెత్తుతున్నది. అది: ఏ పాదపద్మాలను త్రిపురారి కూడ పొందలేకపోయాడో వాటిని ఓ (రాం) ప్రసాదూ, నువ్వు పొందగలవా? నీ కేమైనా పిచ్చి కనుక పట్ట లేదు కదా!

అభిలషించిన మాత్రానే 'ముక్త్యారునామా'ను ఇవ్వలేం. నియమనిష్ఠలతో దీర్ఘకాలం సాధనలు అనుష్ఠించిన ఫలంగా ఇవ్వగలిగిన స్థితికి మనస్సు చేరు

14. 'ముక్త్యారు నామా'ను ఇవ్వగల మానసిక స్థితి

కొన్నప్పుడు మాత్రమే 'ముక్త్యారునామా'ను యుక్తంగా ఇవ్వవచ్చును. అప్పుడు మాత్రమే భగవంతుడు దాన్ని అంగీ కరిస్తాడు. సుఖపడాలనే ఆశతో మనిషి విషయవస్తువుల వెంట పరుగులు తీసి చివరకు తాను పొందింది ''మరుమరీచిక' అనే నిజాన్ని ఎప్పుడు గ్రహిస్తాడో; అట్లే ఎన్ని ఆధ్యాత్మిక సాధనలు జపతపాదులు అనుష్ఠించినా అనంతుడైన భగవంతుణ్ణి పొందడానికి ఇవన్నీ ఏపాటికీ చాలవని ఎప్పుడతడు అంతరాంతరాళాలలో అవగతం చేసుకొంటాడో; పర్వతాలను పెళ్లగింప నానావిధానాల పద్ధతులను ఒక్కటీ విడువక ప్రయత్నించి చివరకు ఒక పూచిక పుల్లను కదలించే శక్తి సైతం తనకు లేదని ఎప్పుడతడికి చక్కగా అర్థమౌతుందో, అటువంటప్పుడు, 'కలడు కలండనెడి వాడు కలడో లేడో, ఉంటే రక్షించు' అని ఎలుగెత్తి మొరపెట్టుకొంటాడో, అప్పుడు మాత్రమే భగవంతుడు అతడి 'ముక్త్యారునామా'ను పుచ్చుకొంటాడు.

అందుకు విరుద్ధంగా మనస్సు విపరీత ధోరణి వహించి, ''ఆధ్యాత్మిక

15. మనస్సు కల్పించే భ్రమ నుంచి జాగ్రత్త వహించు

సాధనలు అనుష్ఠించడంలో లేక భగవంతుని స్మరించడంలో నాకు ఆనందం కలగడం లేదు. కాని పట్టపగ్గాలు లేకుండా నా చాపల్యాలను తీర్చుకోవడంలోనే నాకు ఆనందం కనిపిస్తుంది కనుక నేను అట్లే వర్తిస్తాను'' అని అంటుంది. ఈ వైఖరికి ఆక్షేపణ

తెలిపితే, అందుకు తక్షణ జవాబుగా ఇలా అంటుంది: ''ఎందుకు, భగవంతునికి నేను నా ముక్త్యారునామాను ఇచ్చివేశాను కదా! ఈ విధంగా ఆయన నన్ను చేయనిస్తుంటే నేను ఏం చేయగలను? ఆయన నా మనస్సును ఎందుకు మార్చలేదు?'' అప్పుడు ఇలా ఇవ్వబడిన ముక్త్యారునామా కేవలం తనను తాను మోసపుచ్చుకోవడానికి, ఇతరులను మోసగించడానికి మాత్రమే పనికి వస్తుంది. దీని ఫలితం 'ఇతో నష్టః తతో భ్రష్టః' - 'రెంటికీ చెడ్డ రేవడి' గతి మాత్రమే.

16. మరో దృక్పథం

మరో దృక్పథం నుండి వివేచించి చూస్తే పై విషయం మరింత బాగా అవగతం అవుతుంది. సరే, నువ్వు 'ముక్త్యారునామా' ఇచ్చేశావనే ఒప్పుకొందాం అనుకో. కనుక భగవంతుని ప్రార్థించడం గాని, ఏ రకమైన ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించే అవసరంగాని నీకు లేదని అనుకొందాం. కాని యుక్తంగా నువ్వు 'ముక్త్యారునామా'ను భగవంతునికి ఇస్తే, ఆయన నిరవధిక కరుణ గురించి సదా నీ అంతరాంతరాళాలలో యోచిస్తూనే ఉంటావు. అప్పుడు నువ్వు తీరంలేని ఈ సంసారసాగరంలో పడి ఇంతకాలం కొట్టుమిట్టాడుతున్నావనీ, తన అనుగ్రహంతో ఆయన నిన్ను ఉద్ధరించాడనే తలంపు నీలో మెదలుతుంది. అలా నువ్వు భావించినప్పుడు ఆయన పట్ల నీకెంత భక్తిప్రేమలు కృతజ్ఞత పెల్లుబుకుతాయో కాస్త ఊహించి చూడు. అలాటప్పుడు సదా ఆయన గురించి యోచిస్తూ, ఆయన నామస్మరణ చేయమని నీకు వేరే చెప్పాల్సిన అవసరం ఉంటుందా! ఆయన పట్ల ప్రేమతో నిండిపోయిన నీ హృదయం సహజంగా అలా చేయకుండా ఉండగలదా? విషజంతువు వంటి సర్పం సైతం తనకు ఆశ్రయం ఇచ్చిన వ్యక్తిపట్ల కృతజ్ఞతాభావంతో వానపాముగా వ్యవహరించి ఇంట్లోని వారెవరికీ హాని కలిగించదు. మరి నీ హృదయం దాని కంటే క్షుద్రమైనదా? నీ ఇహపరాల బాధ్యతనంతా స్వీకరించిన ఆయన పట్ల కృతజ్ఞతతో, ప్రేమతో నీ హృదయం పులకించిపోదా? కనుక నువ్వు 'ముక్త్యారునామా'ను ఇచ్చేశాక కూడ భగవంతుణ్ణి ప్రార్థించడంలో నీకు ఎలాటి ఆనందం కలుగకుంటే, నువ్వు సముచితంగా నీ 'ముక్త్యారునామా'ను ఆయనకు సమర్పించలేదని, ఆయన కూడ నీ బాధ్యతను స్వీకరించలేదని కచ్చితంగా గ్రహించు. 'ముక్త్యారునామా'ను ఇచ్చివేశానని ఇకపై నిన్ను నువ్వు వంచించుకోవద్దు; నిష్కళంకుడు పాపరహితుడైన భగవంతునిపై నీ పాపకృత్య 'మరక'ను పులమడానికి ప్రయత్నించకు. అలా చేయచూస్తే నీకే మహాహానికరంగా పరిణమిస్తుంది. శ్రీరామకృష్ణులు చెప్పిన గోహత్యకు పాల్పడిన బ్రాహ్మణుని కథ జ్ఞాపకం చేసుకో.

ఒకప్పుడు ఒక బ్రాహ్మణుడు ఎంతో శ్రమించి ఒక అందమైన తోటను పెంచాడు. వివిధ రకాలైన పళ్ల, పువ్వుల మొక్కలను నాటి అవి ఏపుగా పెరగడం

చూసి అమితానందభరితుడయ్యాడు. ఇలావుండగా ఒక రోజు తోట ద్వారం తెరిచివుండడంతో ఒక ఆవు తోటలోకి ప్రవేశించి మొక్కలను మేయసాగింది. ఆ సమయంలో బ్రాహ్మణుడు ఏదో పనిమీద బయటకు వెళ్లివున్నాడు. తిరిగి రాగానే ఆ ఆవు ఇంకా మొక్కలను మేస్తూనే ఉండడం అతడి కంటబడింది. దానితో అతడు కాలరుద్రుడై ఒక బడితె పుచ్చుకొని దాన్ని చావబాదాడు. దెబ్బ తగలరాని చోట తగలడంతో ఆవు చచ్చిపోయింది. ఆవు చావడం చూసి బ్రాహ్మణుడు భయంతో వణికిపోయాడు. 'అయ్యో, బ్రాహ్మణుడనైన నేను మహాపాతకమైన గోహత్యకు పాల్పడ్డాను గదా!' అన్న ఆలోచనతో సతమతమయ్యాడు. ఆ బ్రాహ్మణుడు కాస్త వేదాంతం చదివి ఉండడంతో మనిషి ఇంద్రియాలు తమ శక్తిని కొందరు ప్రత్యేక దేవతల నుండి పొందుతవని అతడికి జ్ఞప్తికి వచ్చింది. ఉదాహరణకు: కంటికి చూసేశక్తి సూర్యుని నుండి, చెవికి వినేశక్తి దిగ్దేవత నుండి, చేతులకు పనిచేసే శక్తి ఇంద్రుని నుండి లభిస్తాయి. బ్రాహ్మణుడికి ఇప్పుడు ఆ వేదాంత వచనాలు జ్ఞప్తిలోకి వచ్చాయి. అతడు ఇలా ఆలోచించాడు: ''అలా అయితే ఆ ఆవును చంపింది నేను కాదు. నా చేతికి కదలిక కల్పించింది ఇంద్రుని శక్తి; కాబట్టి ఆవును చంపింది ఇంద్రుడే!'' ఇలా తర్కించుకొని ఆ బ్రాహ్మణుడు స్థిమితపడ్డాడు.

17. గోహత్యకు పాల్పడిన బ్రాహ్మణుని కథ

ఇంతలో గోహత్యాపాతకం బ్రాహ్మణుడి దేహంలో ప్రవేశింప వచ్చింది, కాని అతడి మనస్సు దాన్ని పారద్రోలింది. అతడు ఇలా అన్నాడు: ''వెళ్లిపో, నీకిక్కడ స్థానం లేదు; గోహత్యను చేసింది ఇంద్రుడు! వెళ్లి ఆయననే పట్టుకో.'' అప్పుడు ఆ పాతకం ఇంద్రుణ్ణే పట్టుకోవడానికి వెళ్లింది. అప్పుడు ఇంద్రుడు ఆ పాతకంతో, ''కాస్త ఆగు. నేను వెళ్లి బ్రాహ్మణుడితో మాట్లాడి తిరిగి వస్తాను. అప్పుడు కావాలంటే నన్ను పట్టుకుందువుగాని'' అని అన్నాడు. ఇలా అంటూ ఇంద్రుడు మానవరూపం దాల్చి బ్రాహ్మణుడి తోటలోకి వెళ్లాడు. మొక్కలను, చెట్ల ప్రక్క నిలబడి వాటిని పరికిస్తూన్న ఆ బ్రాహ్మణుణ్ణే, ఇంద్రుడు చూశాడు. బ్రాహ్మణుడికి వినబడేట్లుగా ఇంద్రుడు ఆ తోట అందాన్ని తెగ పొగడుతూ, అతణ్ణే సమీపించి, ''ఆహా! ఎంత అందమైన తోట! మొక్కలు చెట్లు సముచిత స్థానాలలో నాటబడి తోట యజమాని చక్కని అభిరుచిని చెప్పక చెబుతున్నాయి'' అని అన్నాడు. పిదప ఆ బ్రాహ్మణుణ్ణే ఉద్దేశించి, ''మహాశయా! ఈ తోట ఎవరిదో చెప్పగలరా? ఆ మొక్కలను చెట్లను ఇంత అందంగా, పొందికగా ఎవరు నాటారు?'' అని అడిగాడు. తన తోటను అలా ప్రశంసించడంతో ఆ బ్రాహ్మణుడు సంతోషంతో తబ్బిబ్బిపోయి, ''అయ్యా, ఈ తోట నాదేనండి; ఈ

18. శ్రీరామకృష్ణుల వచనాల ప్రగాఢతర అర్థం

మొక్కలన్నిటిని నేనే నాటానండి. రండి, తోటంతా తిరిగి చూద్దురుగాని'' అని అన్నాడు. తోట గురించి అనేక విషయాలు ముచ్చటిస్తూ ఆత్మస్తుతి చేసుకొంటూ ఇంద్రుడికి తోటంతా తిప్పి చూపుతూ, ఆవు చచ్చిపడివున్న చోటుకు పొరపాటున వచ్చాడు. ఇంద్రుడు అక్కడ చచ్చిపడివున్న ఆవును చూసి ఉలిక్కిపడినట్లు నటిస్తూ, ''రామరామ! ఈ గోహత్యను చేసిన వాడెవడు?'' అని అడిగాడు. అప్పటిదాకా తోటకు చెందిన అన్ని విషయాలలోను, 'ఇది నేనే చేశాను', 'నేనే స్వయంగా దీన్ని చేశాను' అని చెప్పుకొంటూ వచ్చిన ఆ బ్రాహ్మణుడు, ఆ ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో తెలియక మౌనం వహించాడు. ఇంద్రు డప్పుడు స్వీయరూపాన్ని దాల్చి, బ్రాహ్మణుడితో ఇలా అన్నాడు: ''ఓరీ నయవంచకా! ఈ గోహత్యాపాతకం మాత్రం నాకు వర్తిస్తుంది. అంతేనా? ఇదుగో నీ గోహత్యా పాతకం. దాన్ని అందుకో.'' ఇలా అంటూ ఇంద్రుడు అంతర్థానమయ్యాడు; గోహత్యాపాతకం బ్రాహ్మణుడి శరీరాన్ని ఆవహించింది.

ఇక 'ముక్త్యారునామా' విషయం ఆపి, ప్రధాన విషయంలోకి వద్దాం. శ్రీరామకృష్ణుల భక్తుల నెవరినైనా అడిగినప్పుడు వారు నిస్సంకోచంగా, 'కాలం గడిచేకొద్దీ ఆయన అనుగ్రహంతో, ఆయన వచనాల ప్రగాఢ అర్థాన్ని మేం తెలుసుకోగలుగుతున్నాం' అని ప్రకటిస్తారు. శ్రీరామకృష్ణుల వ్యక్తిత్వానికి ముగ్ధులమై వారి వచనాలను, చర్యలను కేవలం విన్నప్పుడు లేక చూసినప్పుడు అవి మాకు స్పష్టమైన అర్థాన్ని స్ఫురింపచేయలేదు. కాని ఇప్పుడు వాటిలో ఇమిడివున్న అద్భుత భావాలు కనుగొని ఆశ్చర్యపోతున్నాం. ఆయన ప్రియమైన సూక్తి ఇది: ''నాయనలారా! మీరు సరైన సమయంలో సాధిస్తారు, యుక్త కాలంలో మీకు అవగతమౌతుంది. విత్తనం నాటిన వెంటనే ఫలం లభిస్తుందా? మొదట అంకురం, పిదప మొలక, తదనంతరం మొక్కగా ఎదుగుతుంది; ఆ తరువాత పువ్వులు పూస్తుంది, చివరకు పళ్లను కాస్తుంది; అది పద్ధతి. పట్టువిడువక నిరంతరం శ్రమించాలి. ఈ పాట ఏం తెలుపుతున్నదో వినండి.'' ఇలా అంటూ శ్రావ్యకంఠంతో ఆ పాట పాడేవారు:

19. యుక్త సమయంలో అవగాహన కలుగుతుంది

హరిసే లాగి రహో భాయి
తేరా బనత్ బనత్ బనిజాయ్ - తేరా బిగడ్ బాత్ బనిజాయ్
అంకా తారే బంకా తారే తారే సుజన్ కసాయీ
(జార్) శుగా పడాయకే గణికా తారే, తారే మీరాబాయి
దౌలత్ దునియా మాల్ ఖజానా, బేలియా బియేల్ చలాయీ
(జార్) ఏక్ బాత్‌కో డాణ్టో పడే తో ఖోజ్ ఖబర్ నా పాయీ

అయిసీ భక్తి కర్ ఘట్ భీతర్, ఛోడ్ కపట చతురాయీ
సేవా వన్ది ఔర్ అధీనతా సహజ్ మిలి రఘురాయీ.

భావం:

సోదరా! సంతోషంతో సాధన చేస్తూపో
సరైన సమయంలో సిద్ధిని పొందగలవు
తప్పులన్నీ క్రమంగా ఒప్పులౌతాయిలే
అంకా తరించాడు బంకా తరించాడు
కసాయి సుజన్‌కూడా తరించాడు
చిలుకకు మాటలు నేర్పి వేశ్య తరించింది
మీరాబాయి కూడ తరించింది
ప్రపంచంలోని సంపదలన్నీ తనవైనా
వర్తకుడు ఇంకా ఎడ్లబండిని తోలుతూనే ఉంటాడు
కాని తప్పని ఆ చివరిక్షణం వచ్చినప్పుడు
అవన్నీ ఎక్కడ మాయమౌతవో ఎవరికీ తెలియదు
కనుక కాపట్యాన్ని, జిత్తులమారితనాన్ని వీడు
ఈ ఘటం లోపల ప్రగాఢభక్తిని సంపాదించుకో
భక్తుల సేవ, భగవంతునికి వందనం, శరణాగతి
ఈ సద్గుణాలుంటే రఘునాథుడు అతి సులభంగా లభిస్తాడు.

తరువాత ఆయన ఇలా అనేవారు: "భాగవత్సేవ, ఆరాధన, శరణాగతి - అంటే వినమ్రత; వీటిని విశ్వసించి అవలంబిస్తే సమస్తం లభిస్తుంది; భగవత్సాక్షాత్కారం కలగడం తథ్యం. కాని వాటిని వదలిపెడితే పురోగతి ఆగిపోతుంది.

20. పట్టువిడువని సాధనానుష్ఠాన ఆవశ్యకత

ఒకప్పుడొక వ్యక్తి ఉద్యోగం చేస్తూ ఎంతో శ్రమపడి కాస్తకాస్తగా డబ్బు పొదుపుచేయసాగాడు. ఇలా ఉండగా ఒక రోజు లెక్కపెట్టగా చూస్తే, వెయ్యి రూపాయలు పొదుపు చేసినట్లు తెలియవచ్చింది. వెంటనే సంతోషాతిశయంతో చంకలు గుద్దుకొని ఇలా అనుకొన్నాడు: 'ఇక మీదట ఉద్యోగం చేయాల్సిన అగత్యం నాకేముంది? ఇప్పటికే వెయ్యి రూపాయల నిల్వ ఉందికదా! ఇంకా అవసరం ఏముంటుంది?' ఇలా భావించి అతడు ఉద్యోగం వదలిపెట్టాడు. అల్ప మనిషి, అల్ప లక్ష్యం! ఆ కొద్ది మొత్తానికే తబ్బిబ్బిపోయి అతడికి కళ్లు నెత్తికెక్కాయి. కాని వెయ్యి రూపాయలు ఖర్చు కావడానికి ఎంత సమయం పడుతుంది! కళ్లుమూసి తెరిచేలోపుగా ఆ మొత్తం ఖర్చయిపోయింది. మళ్లీ గడ్డురోజుల్లో పడ్డాడు;

కార్యాలయ అధికారులు కాళ్లావేళ్లాపడసాగాడు. కనుక ప్రయత్నం వదలిపెట్టడం సబబు కాదు. ఆయన (భగవంతుడి) వాకిలి వద్ద సహనంతో వేచివుండాలి. అలా సిద్ధపడి చేయగలిగినప్పుడు మాత్రమే విజయం ప్రాప్తించుకోవచ్చు.''

మళ్లీ ఒక్కోసారి, ''తేరా బనత్ బనత్ బనిజాయ్ - అంటే క్రమేపి చేసుకొంటూ పోతే ఎప్పుడో అప్పుడు సిద్ధిని పొందుతావు' అనే చరణం పాడుతూ, హఠాత్తుగా, ''అహో, క్రమేపి ఎందుకు? అటువంటి మంద భక్తి కలిగి ఉండకూడదు. హృదయం విశ్వాసంతో ద్రవించిపోవాలి. ఇప్పటికిప్పుడే సాక్షాత్కారం కలగాలి, ఈ క్షణంలోనే ఆయనను నేను దర్శించుకోవాలి. హృదయపూర్వకత కొరవడిన భక్తి భగవత్సాక్షాత్కారానికి దోహదం చేయగలదా?''

21. మందభక్తిని వీడు!

శ్రీరామకృష్ణులను తేరిపారచూసినప్పుడల్లా ఆయన ఆధ్యాత్మిక భావనల మూర్తి అని మాకు అనిపించేది; ఆధ్యాత్మిక భావనలన్నీ ఆయనలో సంఘటితమై ఉండడం చేత అవి ఒక ఆకృతిని సంతరించుకొన్నందున శ్రీరామకృష్ణులను చూస్తున్నామని మేం భావించేవారం. మానసిక భావనల మార్పుకు అనుగుణంగా ఏక కాలంలో శారీరక మార్పులు కలుగుతాయని మనం ఊరకే చెప్పుకోవడం కద్దు; కాని నిజానికి అటువంటి పరివర్తనను కళ్లారా చూడడం ఎంతో అరుదు - ఎప్పుడో కాని అట్టి అసాధారణ ఘటన తారసపడదు. కాని మనస్సులో ప్రచండ భావతరంగాలు చెలరేగినప్పుడవి శరీరంలో ఎంతో మార్పును శ్రీరామకృష్ణుల విషయంలో మాదిరి, తీసుకు వస్తాయనే విషయం కలలో సైతం ఊహించుకోలేము. నిర్వికల్పసమాధి స్థితిలో ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులలో 'నేను' అనే ఎరుక పూర్తిగా అదృశ్యమయ్యేది. ఏకకాలంలో ఆయన నాడి, హృదయ స్పందన ఇత్యాదులు ఆగిపోయేవి. శ్రీ మహేంద్రలాల్ సర్కార్ తదితర వైద్యులు వైద్య పరికరాల సహాయంతో ఆయనను పరీక్షించి గుండె స్పందన సూచనలు ఏవీ కానరాకపోవడం కనుగొన్నారు.[1] ఆ పరీక్షతో తృప్తిచెందని మహేంద్రలాల్ సర్కార్ వైద్య మిత్రుడొకడు శ్రీరామకృష్ణుల కంటిగ్రుడ్డును తన వేలితో స్పృశించి చూశాడు. మరణించిన వ్యక్తిలో మాదిరి అది మొద్దుబారి ఉండడం గమనించాడు. 'సఖీభావ' సాధన అనుష్ఠిస్తూ ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు సదా తనను శ్రీకృష్ణుని చెలికత్తెలలో

22. ఆధ్యాత్మిక భావనల మూర్తియైన శ్రీరామకృష్ణులు - భావనల మార్పుకు అనుగుణమైన శారీరక మార్పులు

1. ఈ వైద్యపరీక్ష శ్రీరామకృష్ణులు కంఠవ్రణ చికిత్స నిమిత్తం శ్యాంపుకూర్‌లో బసచేసి ఉన్నప్పుడు మా సమక్షంలో జరిగింది.

ఒకటిగా భావిస్తూ, ఆ భావనలో తాదాత్మ్యం చెందిపోయేవారు. అప్పుడు ఆయనలో స్త్రీ ప్రవర్తన, స్త్రీలు నిలబడే, నడిచే, కూర్చునే, మాట్లాడే తీరుతెన్నులు స్వాభావికంగా అభివ్యక్తం అయ్యేవి. నిరంతరం ఆయనతో కలిసిమెలిసి ఉండే శ్రీ మథురనాథ్ తదితరులు అనేక సందర్భాలలో ఆయనను అతిథిగా వచ్చిన స్త్రీగా పొరబడ్డారు.[1] ఇటువంటి అనేక సంఘటనలను మేం కళ్లారా చూశాము, ఆయన ముఖతా విన్నాము కూడ; దాదాపుగా నిర్ధారణ గావింపబడ్డ ఆధునిక మనస్తత్వ శాస్త్ర, శరీర ధర్మశాస్త్ర నియమాలు పునః ప్రతిపాదింపబడవలసి ఉన్నవేమో! ప్రజలకు ఈ సంఘటనలను గురించి తెలిపితే, వాటిని వారు నమ్మగలరా?

23. సర్వులలోని సమస్త భావాలను గ్రహించగల శ్రీరామకృష్ణుల శక్తి

కాని అన్నిటికంటే శ్రీరామకృష్ణులలో కొట్టొచ్చినట్లు మాకు కనిపించే విషయం - భావరాజ్యంలో సర్వత్రా యథేచ్ఛగా విహరించే ఆయన శక్తి! పిన్నలలో పెద్దలలో, సన్న్యాసులలో గృహస్థులలో, భక్తులలో, వేదాంతులలో, స్త్రీలలో - పురుషులలో - ఇలా ప్రతి ఒక్కరిలోని గొప్ప స్వల్ప భావాలను అవగతం చేసుకొనే శక్తి సమన్వితు లాయన! ప్రతి ఆధ్యాత్మిక సాధకుని అంతరంగ భావాలను అవగాహన చేసుకొనే శక్తి ఆయనకు ఉంది. ఆధ్యాత్మిక రాజ్యంలో ఆ సాధకుని పురోగతి, అతడు ఎంచుకొన్న సాధనాపథం, అతడి పురోగమనానికి ప్రస్తుత ఆవశ్యకతలు తెలుసుకొనే శక్తి సమర్థులాయన. సాధకునికి సానుకూలమైన అనుష్ఠానమార్గం నిర్దేశించే ఆయన అద్భుతశక్తి గణనీయమైనది. ఈ విషయాలను గురించి మేం గాఢంగా తరచి చూసినప్పుడు, భూత వర్తమాన భవిష్యత్ కాలపు యావత్తు భావాలనూ మినహాయింపులేక ఆయన తన జీవితంలో అప్పటికే అనుభూతి చేసుకొన్నారని మాకు అనిపించేది. ప్రతి భావ ప్రాదుర్భావం నుండి అది కనుమరుగయ్యే కాలంవరకు దాని యావత్తు చరిత్ర వివరాలు ఆయన జ్ఞప్తిలో ఉన్నవనడం అతిశయోక్తి కాబోదు. ఈ కారణం చేతనే కాబోలు ఎవరైనా ఆయనతో తన మానసిక అవస్థను గురించి చెప్పినప్పుడు, అతడి స్థితిని గ్రహించి దానిని తన మదిలో నిల్వచేసిన అనుభవాలతో పోల్చిచూసి, అప్పటికప్పుడే ఆ వ్యక్తికి సముచిత విధానాన్ని తెలిపేవారు. ప్రతి విషయంలోనూ ఆయన ఈ నియమాన్ని పాటించేవారు. తీవ్ర లౌకిక అనురక్తి, సాంసారిక సంక్షోభం, పరిత్యాగానికి ప్రతికూలమైన భావం లేక ఉద్వేగం సదా మెదలుతూ ఉండే స్థితి ఇత్యాదులు ప్రతిఘటించినప్పుడు, దారితెన్ను కానరాక ఎవరైనా జిజ్ఞాసువు వినమ్రంగా ఆయన వద్దకు వస్తే ఆయన ఆ వ్యక్తికి సముచిత విధానాన్ని నిర్దేశించేవారు.

---

1. మథురనాథ్ ఇంట్లోనే 'సఖీభావ' సాధనను శ్రీరామకృష్ణులు అనుష్ఠించారు.

అంతేగాక అటువంటి పరిస్థితులలో తన స్వీయ అనుభవాలను తెలిపి ఆ వ్యక్తిలో ఉత్తేజం పాదుగొలిపేవారు. ''నాయనా! అప్పుడు ఫలానా ఫలానా సంఘటన జరిగింది, నేను ఫలానా ఫలానా విధానాన్ని పాటించాను'' అని ఆయన చెప్పేవారు. శ్రీరామకృష్ణులు అలా చెప్పాక ఆ జిజ్ఞాసువు మనస్సు ఎంతటి ఆశతో నిండిపోయేదో, అతడు ఎంతటి విశ్వాసంతో పట్టుదలతో ఆయన నిర్దేశించిన పథంలో పురోగమించాడో ఇక్కడ ప్రస్తావించడం అనావశ్యకం. అంతేకాదు; శ్రీరామకృష్ణులు తమ ఆంతరిక రహస్యాలను అతడితో చెప్పడంతో, ఆయనకు అతడి పట్ల ఉన్న అత్యంత ప్రేమ ఆ వ్యక్తికి అనుభూతమయ్యేది. ఒకటి రెండు దృష్టాంతాలు పై విషయాన్ని స్పష్టీకరిస్తాయి.

24. మొదటి దృష్టాంతం: మణిమోహన్ పుత్రశోక ఉదంతం

కలకత్తాలోని సిందూరియాపాటి వాస్తవ్యుడైన మణిమోహన్ మల్లిక్ కుమారుడు వృద్ధిలోకివస్తున్నవాడు మరణించాడు. కుమారుని దహన సంస్కారవిధులన్నీ నిర్వర్తించగానే తిన్నగా అతడు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చాడు. ఆయనకు నమస్కరించి, దుఃఖ భారంతో గదిలో ఒక మూలగా కూర్చున్నాడు. అప్పుడు ఆ గదిలో జిజ్ఞాసువులైన పలువురు భక్తులు, సత్యాన్వేషకులు, స్త్రీలు పురుషులు కూర్చుని ఉన్నారు; శ్రీరామకృష్ణులు వారితో వివిధ ఆధ్యాత్మిక అంశాల గురించి మాట్లాడుతున్నారు. మణిమోహన్ కూర్చున్న కాస్సేపటికే శ్రీరామకృష్ణుల దృష్టి అతడిమీద పడింది. తల ఊపి, ''మంచిది, ఈ రోజు ఎందుకు అంత విచారంగా కనిపిస్తున్నావు?'' అని ఆయన అడిగారు. గద్గద స్వనంలో మణిమోహన్, ''(తన కుమారుడి పేరు చెప్పి) ఈ రోజు అతడు మరణించాడు'' అని జవాబు చెప్పాడు. బడలికచే మ్లానమైన అతడి ఆకృతిని చూసి, గద్గదమైన అతడి కంఠస్వరం విని ఆ గదిలో ప్రతి ఒక్కరూ నోట మాటరాక, మూగవోయారు. మణిమోహన్ హృదయాన్ని కుదిపివేస్తున్న బాధ, మానసిక వ్యధ కేవలం ఊరడింపు మాటలతో చల్లారవని ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. ఐనప్పటికీ వాళ్లు అతణ్ణి ఈ విధంగా ఊరడింప ప్రయత్నించారు: 'సంసారం మూడు నాళ్ల ముచ్చట. ఏదో ఒకరోజు ప్రతి ఒక్కరూ మరణించవలసినవారే కదా! ఎంతగా విలపించినా పోయినవాళ్లు మళ్లీ తిరిగివస్తారా! కనుక దుఃఖం వీడి, సహనం వహించు.' సృష్ట్యాదినుండి శోకసంతప్తులైన స్త్రీ పురుషులను ఇటువంటి వచనాలతోనే ఊరడిస్తూ వస్తున్నారు. కాని అటువంటి ఊరడింపు వచనాలతో ఎందరి హృదయాలు స్థిమితపడ్డాయి! ఎలా స్థిమితపడతాయి? మనోవాక్కాయ కర్మలు మూడు ఏకీకృతమైనప్పుడే కదా మన సాంత్వన వచనాలు ఇతరుల హృదయాలను స్పృశించి అక్కడ అదేరకమైన భావనలను ఉత్పన్నం

చేయగలవు? కాని అటువంటి సుగుణం మనలో పూర్తిగా కొరవడిందే! 'సంసారం అనిత్య' మని వక్కాణిస్తున్నా, మన ప్రతీ ఆలోచన, చేసే ప్రతీ పని ఆ భావనకు తద్విరుద్ధమైనదే; సంసారాన్ని ఒక పీడకలగా పరిగణించమని మనం ఇతరులకు ఒక వంక ఉపదేశిస్తూ, మరోవంక మన హృదయాంతరాళాల్లో సంసారాన్ని నిత్యమైనదిగా ఎంచి, కలకాలం ఇక్కడే జీవించ ఏర్పాట్లు చేసుకొంటాం. అలాంటప్పుడు మన మాటలు ఎలా శక్తిమంతాలవుతాయి?

అలా అందరూ మణిమోహన్‌ను అలవాటయిన ఓదార్పు వచనాలతో ముంచెత్తుతూ ఉన్నా, శ్రీరామకృష్ణులు మాత్రం చాలాసేపటి వరకు అతడి శోకాలాపాలను మౌనంగా వింటూ కూర్చుండిపోయారు. ఆయన ఆ ఉదాసీన వైఖరిని చూసి, 'ఈయన ఎంత కాఠిన్య హృదయులు, కరుణాశూన్యులు' అని తలపోస్తూ, వాళ్లు ఆశ్చర్యపోయారు.

ఆ వృద్ధుడి మాటలు వింటూ క్రమేణా శ్రీరామకృష్ణులు అర్ధబాహ్య సమాధి స్థితిలోకి వెళ్లిపోయారు. హఠాత్తుగా ఆయన మల్లవీరుని భంగిమలో తన కుడి అరచేతితో ఎడమ భుజాన్ని చరచుకొని, లేచి నిలబడి అసాధారణ ఉద్ధతితో పాటపాడ నారంభించారు:

జీవ్ సాజ్ సమరే, ఐదేఖో రణవేశే కాల్ ప్రవేశే తోర్ ఘరే ।
ఆరోహణ్ కరి మహాపుణ్య రథే, భజన్ సాధన్ దూటీ అశ్వ జుడే తాతే
దియే జ్ఞాన్ ధనుకే టాన్, భక్తి బ్రహ్మబాణ్ సంయోగ్ కోరోకే ।
ఆర్ ఏక్ జుక్తి ఆఛే శోనో సుసంగతి, సబ్ శత్రు నాశేర్ వాయినే రథరథీ।
రణభూమి జది కొరేన్ దాశరథి[1] భాగీరథేర్ తీరే ॥

భావం:

జీవుడా! యుద్ధానికి సంసిద్ధుడవవు
అదుగో చూడు, యుద్ధ విన్యాసంలో మృత్యువు నీ ఇంట (దేహంలో) ప్రవేశిస్తున్నదో
సాధన, భజనలనే రెండు గుర్రాలను పూన్చి
మహాపుణ్య మనే రథాన్ని అధిరోహించి
జ్ఞానమనే వింటికి భక్తి అనే బ్రహ్మాస్త్రాన్ని సంధించు
(మృత్యువనే శత్రువు నెదుర్కో)

---

1. ఈ గేయ రచయిత.

కాకుంటే రథం, రథి - ఏవీ లేకున్నా శత్రువుల నందరినీ నిర్జించే
ఉపాయం మరొకటి ఉంది, విను
గంగాతీరాన్నే[1] దాశరథి యుద్ధరంగంగా చేసుకోవడమే (ఆ ఉపాయం).

మహోద్ధతిని సూచించే ఆ పాట రాగం, అందుకు అనుగుణమైన అంగ భంగిమలు, శ్రీరామకృష్ణుల కళ్ల ప్రసరించిన వీరోచిత వైరాగ్య స్ఫురిత దృక్కులు కలగలసి అప్పుడు ఆ గదిలో ఉన్న ప్రతి ఒక్కరి హృదయంలోను అద్భుత శక్తిని, ఆశాభావాన్ని ఉత్పన్నం చేశాయి. ప్రతి ఒక్కరి హృదయం భ్రాంతి దుఃఖాల ఆవరణం నుండి పైకెగసి విమల దివ్యానందంతో నిండిపోయింది; ఆ దివ్యానందం ఇంద్రియాతీతం, సంసారాతీతం అయినది. మణిమోహన్ సైతం ఆ దివ్యానందాన్ని చవిచూశాడు; మానసిక వ్యథ, దుఃఖాలను మరచిపోగలిగాడు. పరిపూర్ణ శాంతితో, గంభీరముద్రతో స్తిమితపడ్డాడు.

పాట పూర్తయింది. కాని ఆ చిరుపాటతో శ్రీరామకృష్ణులు ఉత్పన్నం చేసిన దివ్యభావతరంగాలు ఆ గదిని చాలాసేపటి వరకు నింపివేశాయి; అందరూ వాటి ఉనికిని అనుభూతం చేసుకొన్నారు. 'భగవంతు డొక్కడే మన సొంతం; మన హృదయాలను, జీవితాలను ఆయనకే అర్పిద్దాం. మన పట్ల కరుణ వహించి ఆయన మనకు దర్శనం ఇస్తాడుగాక!' అనే దివ్యభావనలో తన్మయులై ఆ గది లోని వారంతా నిశ్చల స్థితిలో ఉండిపోయారు. కాస్సేపటికి శ్రీరామకృష్ణులు సమాధిస్థితి నుండి బాహ్యస్మృతిలోకి వచ్చి, మణిమోహన్ చెంత కూర్చుని ఇలా పలుకసాగారు: "ఆహా! పుత్రశోకంతో సమానమైన దహించివేసే బాధ మరొకటి ఈ లోకంలో ఉందా? ఈ ఒర (దేహం) నుండి జన్మించినవాడు పుత్రుడు; అంతే కదా! కాబట్టి ఈ దేహం ఎంతకాలం నిలిచివుంటుందో అంతవరకు ఆతడితోడి సంబంధం ఉండనే ఉంటుంది." ఇలా అంటూ శ్రీరామకృష్ణులు, మణిమోహన్‌కు ఒక ఉదాహరణగా అక్షయ్ మరణం గురించి మనస్సును కదలించివేసే తీరులో వివరించసాగారు. అక్షయ్ మరణ దృశ్యాన్ని ఆయన ప్రత్యక్షీకరించుకొంటున్నట్లుగా అప్పుడు కనిపించారు. పిదప ఆయన ఇలా అన్నారు: "అక్షయ్ మరణించాడు. అప్పుడు నా కేమీ అనిపించలేదు. మనిషి ఎలా మరణిస్తాడో నేను నిలబడివుండి చూశాను. ఒరలో ఉంచిన కత్తిని బయటకు లాగినట్లుగా నేను గాంచాను. కత్తిలో ఎలాటి మార్పూ లేదు. ఉన్నది ఉన్నట్లే ఉండిపోయింది; ఒర క్రింది పడివుంది. దాన్ని చూసి నా కెంతో ఆనందంవేసింది.

1. అంటే గంగానది పరమ పవిత్రమైనది. కనుక సాధన భజనలు కొరవడిన వాడైనా, మహాపాపియైనా ఆ పవిత్ర తీర్థాన్ని ఆశ్రయించిన వాడు తరిస్తాడని భావం.

నేను నవ్వాను, పాడాను, నాట్యం చేశాను. తరువాత వాళ్ళు ఆ దేహాన్ని దహనం చేసి తిరిగివచ్చారు. మర్నాడు నేను అక్కడ (తమ గదికి తూర్పుగా కాళికాలయ ప్రాంగణం వైపుగా ఉన్న వసారాను చూపుతూ) నిలబడి ఉన్నాను. అప్పుడు నాకు ఏం అనిపించిందో తెలుసా? తడిబట్టను పిండుతూన్నట్లు నా హృదయాన్ని ఎవరో మెలిపెట్టి పిండుతున్నట్లు అనిపించింది. అక్షయ్ మరణంతో నా కంతటి భరించరాని బాధ కలిగింది. అప్పుడు ఇలా అనుకొన్నాను: ''అమ్మా, దీనికి (తమ దేహానికి) కట్టుబట్టతోసైతం ఎలాటి సంబంధమూ లేదే; అలాటప్పుడు అన్నగారి కుమారుడితో ఏం సంబంధం పెనగొని ఉంటుంది? అయినా దీనికే (తమకు) ఇంతటి బాధ కలుగుతున్నప్పుడు ఇక గృహస్థులు ఎంతటి మనోవ్యధ అనుభవిస్తారో కదా! అమ్మా! వారు పడే బాధను నా కిలా తెలియ చేస్తున్నావా?''

కాస్సేపయ్యాక శ్రీరామకృష్ణులు కొనసాగించారు: ''కాని ఒక విషయం నీకు తెలుసా? ఎవరైతే ఆయన (భగవంతుణ్ణి) శరణు జొచ్చుతారో వారు ఇట్టి భరింపరాని దుఃఖంలో పూర్తిగా మునిగిపోరు. కొన్ని ఎదురుదెబ్బలు తగిలినా తిరిగి నిలకడ స్థితిని పొందుతారు. అల్పశక్తి ఉన్నవారు మాత్రం చిన్నతెప్పల్లా, అదుపుతప్పి తలక్రిందులై పూర్తిగా మునిగిపోతారు. గంగానదిలో స్టీమర్ పోతున్నప్పుడు వాటి ప్రక్కనున్న చేపలుపట్టే చిన్న పడవల గతిని నువ్వు గమనించలేదా? అవి అదుపుతప్పి కనుమరుగు కావడమూ, కొన్ని సందర్భాలలో నదిలో మునిగిపోవడమూ కద్దు. కాని వేలకొద్దీ మణుగుల బరువు సరకులను మోసుకుపోయే ఓడలకు కుదుపులు ఏర్పడ్డా, అవి వాటిని తట్టుకోగలవు. కాని అవి సైతం ఒకటి రెండు పర్యాయాలు అల్లల్లాడవలసే ఉంటుంది.''

ఆ విషాదభరిత వాతావరణం అలా కాస్సేపు గడిచాక మళ్ళీ శ్రీరామకృష్ణులు కొనసాగించారు: ''సంసారంలో వీరందరితోటి (భార్య బిడ్డలు మొదలైన వారితో) బాంధవ్యం ఎన్ని రోజుల వరకు కొనసాగుతుంది? సుఖించాలనే కోర్కెతో మనిషి సంసారంలో ప్రవేశిస్తాడు; వివాహం చేసుకొంటాడు, కుమారుణ్ణి కంటాడు; కుమారుడు పెరిగి పెద్దవాడవుతాడు; కుమారుడికి వివాహం జరిపిస్తాడు; ఆ రకంగా కొన్నిరోజులు ఆహ్లాదంగా గడచిపోతాయి. తదనంతరం ఒకడు రోగగ్రస్తుడవుతాడు, మరొకడు మరణిస్తాడు, ఇంకొకడు భ్రష్టుడవుతాడు; ఇటువంటి క్లేశాలు, ఆరాటాలతో మనిషి సతమతమౌతాడు. నిరాశానిస్పృహలు అధికరించేకొద్దీ విలాపాలు తీవ్రస్థాయిని చేరుతాయి. మిఠాయిలు తయారుచేసే వాడి పొయ్యిలో పచ్చికట్టెలు ఎలా మండుతాయో నువ్వు గమనించలేదా? మొదట అవి చక్కగా మండుతాయి. తరువాత కట్టెలు మండేకొద్దీ లోనున్న తేమంతా

నీటి వెనుక భాగానికి ప్రవేశిస్తుంది. తదనంతరం నురుగులా రూపొంది, బుడగలై పగిలి చుంయ్‌మనే శబ్దం వినవస్తుంది. ఈ సంసారమూ అటువంటిదే.'' ఆయన ఈ విధంగా సంసారపు అనిత్యత్వం, సారహీనత్వం, భగవంతుని పాదపద్మాలను ఆశ్రయించుకోవడం మాత్రమే సుఖ కారణమనే వివిధ అంశాలను ప్రస్తావిస్తూ మణిమోహన్‌ను ఓదార్చసాగారు. కాస్సేపటికి మణిమోహన్ తేరుకొన్నాడు. పిదప, ''ఇందుకే కదా మీ వద్దకు పరుగెత్తుకొని వచ్చాను. ఈ క్లేశాగ్నిని మరెవరూ చల్లార్చలేరని తెలిసే ఇక్కడకు వచ్చాను'' అని అన్నాడు.

మేం అప్పుడు శ్రీరామకృష్ణుల అసాధారణ ప్రవర్తన చూసి ఆశ్చర్యచకితులమై ఇలా అనుకొన్నాం: ''కఠిన హృదయులూ, ఉదాసీనులూ అని కాస్సేపటి క్రితం మేం భావించింది వీరిని గురించేనా? నిజమైన మహాపురుషుల చిన్నచిన్న పనులు సైతం జనసామాన్యం రీతిలో ఉండవు. ప్రతి చిన్న పెద్ద కార్యంలోను ఆయన మహత్వం వెల్లడవుతుంది. కాస్సేపటి క్రితం సమాధిమగ్నులై భగవత్సాన్నిధ్యంలో ఉన్నప్పుడు ఎవరి హృదయ స్పందన ఆగిపోయిందో, వీరేనా వారు? మణిమోహన్ దుఃఖాన్ని చూసి సానుభూతి వహించి సామాన్యునిలా వ్యవహరించిన అదే వ్యక్తి వీరేనా? ఇదంతా కేవలం భ్రాంతి అనే వచనాలతో ఆ వృద్ధుని పలుకులన్నీ కొట్టిపారేసి ఉండగలిగేవారు; అలా చేసే శక్తి ఆయనకు లేదని కాదు. తను మహత్వాన్ని ఆయన అలా ప్రకటించివుంటే, వారు గొప్ప ఆధ్యాత్మిక గురువో లేక మరేదో అయివుండవచ్చు కాని కచ్చితంగా ఈ ప్రపంచానికి చెందినవారు కారని మాత్రం భావించేవారం; సామాన్యుల మానసికావస్థలను గ్రహించే శక్తి వీరికి లేదనుకొనేవారం. పైగా, 'భార్యాబిడ్డల పట్ల అనురక్తి కారణంగా మాబోటి దుర్బలులు నిస్సహాయ పరిస్థితిలో పడే రీతిలో, వీరు కనుక కేవలం ఒక్కసారి పడివుంటే 'మాయ లీల' పట్ల ఎలా ఉదాసీన వైఖరి వహించేవారో మేం చూసివుండేవారం' అని అనేవాళ్లం.''

బహుశా మరుక్షణమే ఒక యువకుడు కుంగిపోయి వచ్చి, ''మహాశయా, కామం నుండి విముక్తి ఎలా లభిస్తుంది? మోహాలు, చెడు తలంపులు చెలరేగి నా మనస్సును కలచివేసి నన్ను వ్యాకులపరుస్తున్నాయి'' అని అడిగాడు.

25. రెండవ ఉదాహరణ: కామాన్ని జయించడంపై శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''ఆహ్! భగవత్సాక్షాత్కారం కలిగే వరకు కామం పూర్తిగా నశించదు. భగవద్దర్శనానంతరం కూడ దేహం ఉన్నంతవరకు కించిత్తు ఉండనే ఉంటుంది; కాని అది తల ఎత్తలేదు. నేను సైతం కామం నుండి పూర్తిగా విముక్తుడనయ్యానని నువ్వు తలుస్తున్నావా? ఒకసారి, కామాన్ని జయించాననే భావన నాలో మెదలింది. పిదప పంచవటి క్రింద

కూర్చుని ఉండగా, నేను అణచుకోలేనేమో అన్నంత కామోద్రేకం నన్ను ముంచెత్తి వేసింది. నేను విలపించాను; నేలమీది ధూళిదూసరాలకేసి నా ముఖాన్ని రుద్దుతూ, "అమ్మా! నేనొక ఘోరాపరాధం చేశాను. కామాన్ని జయించాననే భావనను మళ్లీ ఎన్నడూ మదిలోకి రానివ్వను" అని అమ్మకు చెప్పుకున్నాను. ఆ తరువాత కామం మటుమాయమైంది. నీకు తెలుసా, నువ్విప్పుడు యౌవన ప్రవాహపు పోటులో ఉన్నావు. అందుచేతనే దాన్ని అరికట్టలేకపోతున్నావు. పోటు ఏర్పడినప్పుడు గట్టును లక్షిస్తుందా? అది పొంగిపొర్లి గట్టును తెంచుకొని తీవ్ర గతితో ముందుకు ఉరుకుతుంది. తరువాత వరిచేలలో వెదురుబొంగు లోతున నీళ్లు నిలబడిపోతాయి. కాని కలికాలంలో మానసిక పాపం, పాపం క్రిందికి రాదంటారు. అవాంఛనీయ భావన మదిలో ఒకటి రెండుసార్లు తలెత్తినంత మాత్రాన, దాన్ని గురించి నువ్వెందుకు బాధపడాలి? అవి శరీర విధులుగా వస్తూపోతూ ఉంటాయి. మలమూత్రాదుల వంటివే అని వాటిని గురించి భావించుకోవాలి. మలమూత్రాదుల వంటి దేహ విధులు నిర్వర్తింపబడినప్పుడు జనులు బాధపడతారా? అదే విధంగా ఈ కామ భావనలను అల్పమైనవిగా, నిరర్థకమైనవిగా ఎంచి, వాటిని పట్టించుకోకూడదు. అంతేకాక, హృదయపూర్వకంగా భగవంతుణ్ణి ప్రార్థించు, సదా హరినామాన్ని జపించు, ఆయనను ధ్యానించు. అవి వస్తూపోతూవున్నా వాటిని లక్షించవద్దు. మెల్లగా అవి అదుపులోకి వస్తాయి." తానే యువకుడై, మరో యువకునితో మాట్లాడుతున్నారేమో అనిపించింది.

26. మూడవ ఉదాహరణ: పై విషయంలో యోగానందస్వామికి శ్రీరామకృష్ణుల ఉపదేశం

ఈ సందర్భంలో యోగానందస్వామి విషయం మాకు జ్ఞాపకం వస్తున్నది. కామాన్ని జయించినట్లుగా మాకు తెలిసిన అరుదైన వ్యక్తులలో యోగానందస్వామి ఒకరు. ఒకరోజు అతడు అదే ప్రశ్నను దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను అడిగాడు. అప్పు డతడి వయస్సు బహుశా పద్నాలుగు లేక పదిహేనేళ్లు ఉండవచ్చు. కొద్ది కాలం క్రితంనుండే అతడు శ్రీరామకృష్ణుల దర్శనార్థం వస్తున్నాడు. ఆ సమయంలో నారాయణ అనే హఠయోగి ఒకడు దక్షిణేశ్వరంలోని పంచవటిక్రింద ఒక కుటీరంలో నివసిస్తూ నేతి, ధౌతి[1] హఠయౌగిక ప్రక్రి

---

1. ఒక అంగుళం వెడల్పు, పది లేక పదిహేను మూరల పొడవైన తడిపిన బట్టను మెల్లగా దిగమింగి, మళ్లీ దాన్ని వెలుపలకు తీసుకురావడాన్ని నేతి అంటారు. రెండు మూడు శేర్ల నీళ్లు త్రాగి మళ్లీ ఆ నీళ్లను వాంతి చేసుకోవడాన్ని ధౌతి అంటారు. గుదం ద్వారా నీటిని పీల్చి మళ్లీ ఆ నీటిని వెలుపలకు తీసుకురావడాన్ని కూడ ధౌతి అంటారు. శరీరంలోని కఫపూరిత మలినాదులను ఆ విధంగా హఠయోగులు బయటకు లాగివేస్తారు. ఈ ప్రక్రియ రోగ నివారకంగా పనిచేసి, శరీరాన్ని పటిష్ఠ మొనరుస్తుంది.

యలు ప్రదర్శిస్తూ చూపరుల ఉత్సుకతను ఆకర్షించసాగాడు. ఆ చూపరులలో తానుకూడ ఒకడినని, హఠయోగి ప్రదర్శిస్తున్న ఆ ప్రక్రియలను చూసి వాటిని అనుష్ఠించకుంటే బహుశా కామం నశించదని, భగవద్దర్శనం కాదేమోనని తను భావించినట్లు చెప్పాడు. కాబట్టి కామాన్ని జయింప శ్రీరామకృష్ణులు కూడ ఏదో ఒక ఆసనం-గీసనం వేయమనో, లేదా కరక్కాయనో మరొకటో తినమనో, లేదా ప్రాణాయామాది ఏదో ఒక సాధనను బోధిస్తారనో ఎంతో ఆశతో ఆయనను ఆ ప్రశ్న అడిగాడు. అప్పుడు ఏమైందో యోగానందస్వామి ఇలా చెప్పాడు: '' 'శ్రద్ధతో హరి నామాన్ని జపించు, అది (కామం) నశిస్తుంది. మరేదీ ఇక అవసరం లేదు.' ఆ జవాబు నాకు సుతరామూ నచ్చలేదు. నేను ఇలా అనుకొన్నాను: 'ఎటువంటి ప్రక్రియా ఈయనకు తెలిసి ఉండదు. అందుకే నిష్ప్రయోజనమైన దేదో ఒకటి నాకు ఉపదేశించారు. హరి నామస్మరణతో కామం నశిస్తుందా? అనేకులు హరినామం జపిస్తున్నారు కదా! వాళ్లలో కామం ఎందుకు నశించిపోలేదు?' మరో రోజు నేను కాళికాలయానికి వచ్చి, తిన్నగా శ్రీరామకృష్ణుల వద్దకు పోకుండా పంచవటి వద్దనున్న హఠయోగి సమీపంలో నిలబడి, ఆతడి సంభాషణను ఉత్కంఠతో వింటున్నాను. హఠాత్తుగా అక్కడకు శ్రీరామకృష్ణులు రావడం తటస్థించింది. నన్ను అక్కడ చూసీచూడగానే పిలిచి, నా చేతిని పుచ్చుకొని తమ గదికి తీసుకువెళ్లి, 'నువ్వు అక్కడకు ఎందుకు వెళ్లావు? అలా వెళ్లకు. హఠయోగ ప్రక్రియలను నువ్వు అభ్యసించే పక్షంలో నీ మనస్సు పూర్తిగా శరీరం మీదనే కేంద్రీకృతమౌతుంది. భగవంతుని వైపుగా పోదు' అని అన్నారు. ఆ మాటలు విని, 'తమ వద్దకు రావడం మానుకొంటానని కాబోలు ఈయన నాతో ఇలా అంటున్నా'రని నే ననుకొన్నాను. నా తెలివితేటలపై నాకు గట్టి నమ్మకం ఉంది. నా వివేకానికి ఎలాంటి కితాబు ఇచ్చాను! నేను ఆయన వద్దకు వెళ్లినా వెళ్లకపోయినా ఆయనకు ఒరిగేది ఏమీ లేదన్న సంగతి నాకప్పుడు స్ఫురించలేదు. ఆహా! ఎలాటి ధూర్త, సందేహాస్పద మనస్కుణ్ణి నేను! శ్రీరామకృష్ణుల కృప ఎల్లలెరుగనిది. ఇటువంటి అనుచిత భావనలకు మనస్సులో స్థానం కల్పించినప్పటికీ నాకు ఆయన ఆశ్రయం[1] ఇచ్చారు. ఆ తరువాత, 'ఆయన చెప్పినట్లు చేసి ఏం జరుగుతుందో చూడవచ్చు కదా!' అనే ఆలోచన నాలో మెదలింది. అలా అనుకొని తదేకచిత్తంతో హరినామాన్ని జపింప నారంభించాను. 'నిజం చెప్పాలంటే, శ్రీరామకృష్ణులు తెలిపిన ఫలితాలు క్రమేణా నేను ప్రత్యక్షంగా చవిచూశాను.''

---

1. ఇతడు శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష శిష్యుడు, తదనంతరం సన్న్యాసం పుచ్చుకొన్నాడు.

ఈ రీతిలో ప్రతి ఒక్కరి మానసిక అవస్థ ఆవశ్యకాలనూ ఆకళింపు చేసుకొనే శ్రీరామకృష్ణుల శక్తికి అనేక ఉదాహరణలు పేర్కొనవచ్చు. సిందూరియాపటీ వాస్తవ్యుడైన మణిమోహన్ మల్లిక్‌ను ఇంతకు మునుపే పరిచయం చేసివున్నాం. ఆతడి బంధువైన ఒక భక్తురాలు తరచు శ్రీరామకృష్ణుల దర్శనార్థం వస్తూ ఉండేది. ఒకరోజు, ఆమె శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి, భగవద్ధ్యానానికి కూర్చున్నప్పుడు లౌకిక భావనలు, ఒకరి మాటలు, మరొకరి ముఖం ఇత్యాదులు తన మనస్సును ఆక్రమించుకొని తనను అశాంతికి గురిచేస్తున్నాయని వినమ్రంగా ఆయనతో చెప్పింది. తక్షణమే శ్రీరామకృష్ణులు ఆమె భావాన్ని అవగతం చేసుకొన్నారు. ఆమె ప్రేమించే వ్యక్తి పలుకులు, ముఖం ఆమె మనస్సులో మెదలుతున్నాయని ఆయన గ్రహించారు. ''సరే, ఎవరి ముఖం నీ మనస్సులో ద్యోతకమవుతున్నది? నువ్వు ఎవరిని ప్రేమిస్తున్నావు?'' అని ఉట్టిపడే అనురాగంతో ఆమెను అడిగారు. తాను పెంచుతున్న తన చిన్ని మేనల్లుణ్ణే ప్రేమిస్తున్నానని ఆమె బదులు చెప్పింది. అప్పు డాయన ఇలా అన్నారు: ''సరే, మంచిది. ఆ పిల్లవాడు బాలగోపాలుడనే భావనతో అతడికి అన్నం తినిపించడం, దుస్తులు వేయడం మొదలైన పనులు చేస్తూవుండు. అతడిలో భగవంతుడు గోపాలుని రూపులో నెలకొని ఉన్నాడనే వైఖరి అవలంబించు. ఆ గోపాలునికే నువ్వు అన్నం తినిపించడం ఇత్యాది సేవలు ఒనరిస్తున్నావని భావించుకో. ఈ సేవలన్నీ ఒక వ్యక్తిమాత్రుడికి ఒనరిస్తున్నావని నువ్వెందుకు అనుకొంటావు? భావానికి అనుగుణంగానే ఫలప్రాప్తి కలుగుతుంది.'' ఆయన సూచించినట్లు చేసిన ఫలితంగా కొద్దికాలంలోనే ఆమె ఆధ్యాత్మిక పురోగతిని సాధించిందని, భావసమాధిని సైతం ఆమె పొందగలిగిందని మాకు తెలియవచ్చింది.

27. నాలుగవ ఉదాహరణ: మణిమోహన్ బంధువు ఉదంతం

స్వయానా ఆయన పురుషదేహం ధరించివున్నారు కాబట్టి పురుషుల మనోభావాలను గ్రహించి, అవగతం చేసుకోగల శక్తి శ్రీరామకృష్ణులకు ఉన్నదని స్పష్టంగా చెప్పవచ్చు. కానీ కోమలత్వాన్ని, బిడ్డలపట్ల వాత్సల్యానురాగాదులు ఇత్యాదులు చవిచూడ స్త్రీలకు భగవంతుడు మరో అంగాన్ని అనుగ్రహించి ఉన్నప్పుడు, శ్రీరామకృష్ణులు స్త్రీల సమస్త భావాలను కచ్చితంగా ఎలా ఎరిగివున్నారో అని యోచించి చూసినప్పుడు ఆశ్చర్యపోక తప్పదు. భక్తురాండ్రు ఇలా అనేవారు: '' శ్రీరామకృష్ణులు పురుషులన్న ఆలోచనే సామాన్యంగా మాకు వచ్చేదికాదు. ఆయన మాలో ఒకరిగా అనిపించేవారు. అందుచేతనే ఆయన సమక్షంలో మేము కించిత్తుకూడ లజ్జ, సంకోచమూ పడేవారంకాము. బహు

28. స్త్రీల నానా మానసిక అవస్థలను గ్రహించగల శ్రీరామకృష్ణుల శక్తి

అరుదుగా అవి కలిగినా తక్షణమే మరచిపోయి మా మానసిక భావాలను ఎలాటి సంకోచమూలేక ఆయన ముందు వ్యక్తం చేసేవారం.''

'నేను శ్రీకృష్ణుని చెలికత్తెను లేదా దాసిని' అనే భావనలో సుదీర్ఘకాలం లయమై 'నేను పురుషుడను' అనే విషయం శ్రీరామకృష్ణులు పూర్తిగా విస్మరించడమే ఇందుకు కారణమేమో! పతంజలి మహర్షి తమ యోగసూత్రాలలో ఇలా పేర్కొన్నారు: ''పరులకు హాని కలిగించాలనే భావన పూర్తిగా నీ మనస్సులోనుండి తొలగిపోయినప్పుడు, పెద్దపులులు, పాములతోసహా ప్రపంచంలో మరెవరూ నీకు హాని తలపెట్టరు. నిన్ను చూసినా హాని చేయాలనే తలంపే వాటికి కలుగదు.'' కామక్రోధాది ఇతర మనోప్రవృత్తుల విషయంలోకూడ ఇట్లే జరుగుతుందని గ్రహించాలి. పురాణాలలో ఈ యథార్థం గురించి ఎన్నో ఉదాహరణలు కానవస్తాయి. ఒక్క ఉదాహరణ పేర్కొంటే చాలునేమో! నిష్కళంకుడు, మాయకు అతీతుడు, సదా బ్రహ్మభావంలో మగ్నమైన యువ శుకదేవుడు సంసారాన్ని త్యజించి వెళ్లిపోసాగాడు. పుత్రమోహంతో గుడ్డివాడైన వృద్ధుడైన అతడి తండ్రి వ్యాసుడు విలపిస్తూ, ''కుమారా! ఎక్కడకు వెళ్లిపోతున్నావు?'' అంటూ అతడి వెంట పరుగెత్తసాగాడు. దారిలో ఒక సరోవరంలో అప్సరసలు తమ బట్టలు ఒడ్డున పడేసి స్నానం చేస్తున్నారు. యువకుడైన శుకుణ్ణి చూసికూడ వాళ్లు సిగ్గుపడక, సంకోచించక అట్లే స్నానం చేయసాగారు. కాని వృద్ధుడైన వ్యాసుడు అటుకేసి రాగానే హటాహుటిన బట్టలు తీసి ఒంటికి చుట్టుకొన్నారు. ఈ విషయం గమనించి వ్యాసుడు, 'ఇదేం చోద్యం! యువకుడైన నా కుమారుడు వాళ్ల ముందునుంచి వెళ్లినా కనీసం వాళ్లు కదల్లేదు. కాని వృద్ధుడనైన నన్ను చూసి వారి కింత సిగ్గు ముంచుకొచ్చిందే!' అని అనుకొన్నాడు. అందుకు కారణం ఏమిటని వ్యాసుడు అడిగిన ప్రశ్నకు ఆ అప్సరసలు ఇలా జవాబిచ్చారు: ''శుకుడు ఎంత పవిత్రుడంటే, 'తాను ఆత్మ' అనే భావం మాత్రమే సర్వదా అతడిలో మెదలుతూ ఉంటుంది. తనకున్నది పురుష దేహమో లేక స్త్రీశరీరమో అనే ధ్యాస సైతం అతడిలో లేదు. అందుచేతనే అతణ్ణి చూసినప్పటికీ మాకు ఎలాంటి సిగ్గూ జనించలేదు. కానీ నీవు వృద్ధుడవు, స్త్రీల అంగవిన్యాసాలు, క్రీగంటిచూపులు చక్కగా ఎరిగినవాడవు. పైగా వారి రూపలావణ్యాదులను విస్తృతంగా వర్ణించినవాడవు. శుకునిలా నీకు స్త్రీపురుషుల పట్ల ఆత్మదృష్టి లేదు; అది రాదు కూడ. అందుచేతనే నిన్ను చూడగానే పురుషుడవనే ఎరుక మాలో కలిగింది, సిగ్గు ముంచుకువచ్చింది.''

29. అందుకు కారణం

శ్రీరామకృష్ణుల పట్ల కూడ పై భావనే మాకు స్ఫురిస్తుంది. దేదీప్యమానమైన వారి ఆత్మజ్ఞానం, స్త్రీ పురుష లందరిపట్ల ఆయనకు ఉన్న ఆత్మ

30. శ్రీరామకృష్ణుల సమక్షంలో స్త్రీలు అరమరికలు లేకుండా మెలగడానికి హేతువు

దృష్టి, వారి సమక్షంలో ఉన్నంతసేపు 'నేను పురుషుడను', 'ఆమె స్త్రీ' మొదలైన భావనలు సామాన్యంగా జనించనంతటి ఉన్నత స్థితికి ప్రతి వ్యక్తి మనస్సును తీసుకుపోతుంది. అందుచేతనే పురుషులలా స్త్రీలుకూడ ఆయన సమక్షంలో సిగ్గు పడేవారుకారు. అంతేకాదు; శ్రీరామకృష్ణుల సాంగత్యంలో ఉన్నప్పుడు వారిలో ఆత్మదృష్టి ప్రేళ్లానేది. అప్పుడు తాము సంకటమైనవని పరిగణించే పనులను సైతం శ్రీరామకృష్ణుల విజ్ఞప్తి మేరకు వాళ్ల ఏ సంకోచం లేకుండా అనాయాసంగా చేసేవారు. మరెవరు కోరినా ఇట్టి పనులను చేయడానికి వారు నిరాకరించేవారని చెప్పనవసరంలేదు. బళ్ల, పల్లకీలలో తప్ప ఎన్నడూ ఎక్కడకూ ప్రయాణం చేయని గౌరవనీయ కుటుంబాలకు చెందిన స్త్రీలు[1] సైతం శ్రీరామకృష్ణుల విజ్ఞప్తి మేరకు పగటివేళ కాలినడకన గంగాతీరం వరకు వచ్చి, పడవలలో దక్షిణేశ్వర కాళికాలయానికి రావడం కద్దు. పైగా, అక్కడకు వెళ్లాక బహుశా శ్రీరామకృష్ణుల కోర్కెమేరకు దగ్గరలోని బజారుకు వెళ్లి ఆయనకు అవసరమైన సరకులు కొని తెచ్చేవారు. అట్లే సాయంత్రం మళ్లీ కాలినడకన కలకత్తాకు తిరిగి వెళ్లిపోయేవారు. ఒకటి రెండు ఉదాహరణలు పేర్కొంటే ఈ విషయం తేటతెల్లమౌతుంది.

అది 1884వ సంవత్సరం. ఆ సమయంలో మాతృదేవి (శ్రీ శారదాదేవి) జయరాంబాటిలోని తమ పుట్టింట్లో ఉన్నారు. బలరాంబోసు తన తండ్రితో

31. మొదటి ఉదాహరణ

కూడ బృందావనానికి వెళ్లివున్నాడు. వారితోపాటు రాఖాల్ (స్వామి బ్రహ్మానంద), గోపాల్ (స్వామి అద్వైతానంద), పలువురు భక్తులు, భక్తురాండ్రు వెళ్లారు. ఆ సమయంలో బాగ్‌బజార్ వాస్తవ్యులైన ఒక గౌరవనీయ కుటుంబానికి చెందిన ఒక స్త్రీ శ్రీరామకృష్ణులను గురించి విన్నది, కాని ఎన్నడూ ఆయనను చూడలేదు. దక్షిణేశ్వరానికి వచ్చి ఆయనను దర్శించుకోవాలనే తీవ్ర ఆకాంక్ష ఆమెకు కలిగింది. అప్పటికి రెండు సంవత్సరాల నుండి తరచూ శ్రీరామకృష్ణులను దర్శించుకొంటూ వస్తున్న తనకు పరిచయస్థురాలైన ఒకామెతో, ఈమె తన ఆకాంక్షను వెలిబుచ్చింది. అనుకొన్న ప్రకారం ఆ స్త్రీ లిద్దరూ మర్నాటి మధ్యాహ్నం దక్షిణేశ్వరం చేరుకొన్నారు. శ్రీరామ

---

1. గౌరవనీయ కుటుంబాలకు చెందిన ఇటువంటి స్త్రీలు నాటి కాలఘట్టంలో బహిరంగంగా వచ్చేవారు కారని గుర్తుంచుకోవాలి.

కృష్ణుల గది తలుపులు మూసివుండడం చూశారు. గది ఉత్తరపు గోడలోని చిన్ని రంధ్రాలగుండా తొంగిచూశారు; శ్రీరామకృష్ణులు విశ్రాంతిగా పడుకొనివున్నారు. అందువేత మాతృదేవి నివసించే నహబత్‌కు వెళ్ళి, అక్కడ కూర్చుని నిరీక్షించ సాగారు. కాసేపయ్యాక శ్రీరామకృష్ణులు లేచి ఉత్తరపు గది తలుపు తెరిచి చూడగా, ఆ భక్తురాళ్లు నహబత్ మొదటి అంతస్తు వసారాలో కూర్చుని ఉండడం గమనించారు. వాళ్లను తమ వద్దకు రమ్మని పిలిచారు. ఆ భక్తురాండ్రు ఆయన గదిలోకి వచ్చి కూర్చోగానే శ్రీరామకృష్ణులు మంచం నుంచి దిగి, తమకు పరిచయస్తురాలైన స్త్రీ ప్రక్కన కూర్చున్నారు. శ్రీరామకృష్ణుల ఆ చర్యకు ఆమె సిగ్గుపడి కాస్త ఒదిగి కూర్చుంది. అప్పుడు శ్రీరామకృష్ణుల, ''ఎందుకింత సిగ్గు? సిగ్గు, ఏవగింపు, భయం ఉన్నంతవరకు భగవత్సాక్షాత్కారం కలుగదు. (చేతిని ఊపుతూ) నిజానికి నేనూ మీవంటి వాడినే. కాని (తన గడ్డం చూపుతూ) ఈ గడ్డం ఉండడంచేత కదా మీకు సిగ్గు కలుగుతున్నది?'' అని అన్నారు.

అలా అంటూ వెంటనే భగవత్ప్రసంగం చేస్తూ వారికి ఎన్నో ఉపదేశా లిచ్చారు. ఆ భక్తురాళ్లు కూడ స్త్రీ పురుషుల మధ్యనున్న విభేదాన్ని విస్మరించి ఎలాంటి సంకోచమూలేక ప్రశ్నలువేస్తూ, జవాబులు వినసాగారు. సుదీర్ఘ సంభా షణానంతరం వాళ్లు సెలవు పుచ్చుకొని వెళ్లబోయేముందు శ్రీరామకృష్ణులు, ''వారానికి ఒక్కసారన్నా రండి. ప్రారంభంలో తరచూ ఇక్కడకు వస్తూవుం డండి'' అని అన్నారు. ఆ స్త్రీలు గౌరవనీయ కుటుంబాలకు చెందినప్పటికీ వారు పేదవారని బండిబాడుగ సదా భరించలేరనీ తెలిసి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''మీరు ఇక్కడకు వచ్చేటప్పుడు ముగ్గురు నలుగురు కలిసి పడవలో రండి. తిరిగి వెళ్లేటప్పుడు బారానగర్ వరకు నడిచి అక్కడ కలిసికట్టుగా బండిని మాట్లాడు కోండి.'' అప్పటినుండి ఆ భక్తురాండ్రు ఆయన సలహా ప్రకారమే వ్యవహరించా రని వేరేగా చెప్పాలా!

32. పై విషయం గురించి రెండవ ఉదాహరణ

మరో భక్తురాలు మాతో ఒక రోజు ఇలా చెప్పింది: ''ప్రసిద్ధిచెందిన భోలా మిఠాయి దుకాణంలో 'సర్'[1] అనే మంచి మిఠాయి లభిస్తుంది. శ్రీరామ కృష్ణులకు 'సర్' అంటే ఇష్టమని తెలిసి ఒకరోజు పెద్ద 'సర్' ముక్కను కొన్నాము. చెప్పాపెట్టక మేం ఐదుగురం కలిసి పడవ మాట్లాడుకొని దక్షిణేశ్వరానికి వెళ్లాం. అక్క డకు వెళ్లాక శ్రీరామకృష్ణులు కలకత్తాకు వెళ్లారని తెలిసి, హతాశులమయ్యాం.

1. వంగదేశం తీపి తినుబండారాలకు ప్రసిద్ధం. పాలను చక్కగా మరగబెట్టాక దాని మీద కట్టే చిక్కని మీగడను తీసి, చక్కెరతో కలిపి తయారుచేసే తీపిపదార్థం 'సర్'.

ఏం చేయాలో పాలుబోలేదు. అప్పుడు రాంలాల్ దాదా (శ్రీరామకృష్ణుల అన్నగారి కుమారుడు) అక్కడున్నాడు. గురుదేవులు కలకత్తాలో ఎక్కడకు వెళ్లారని అతడిని అడిగాం. కంబులేటోలాలోని 'పంతులు'[2] గారి ఇంటికి వెళ్లారని అతడు చెప్పాడు. ఆ జవాబు విని 'అ' తల్లి, 'ఆ ఇల్లు నాకు తెలుసు, మా తండ్రిగారి ఇంటికి సమీపంలోనే ఉంది. వెళదామా? పోదాం పదండి. ఇక్కడ వేచివుండి ఏం ప్రయోజనం?' అని అన్నది. అందుకు అందరం సమ్మతించాం. మేం తీసుకువచ్చిన 'సర్' మిఠాయిని రాంలాల్ చేతికిచ్చి, 'శ్రీరామకృష్ణులు తిరిగి వచ్చాక ఆయనకు అందించండి' అన్నాము. అప్పటికే మేం వచ్చిన పడవను పంపేశాం. కాలినడకన బయలుదేరాం. కాని గురుదేవుల సంకల్పమేమో, ఆలంబజార్ వరకు కొద్దిదూరం వచ్చామో లేదో, కలకత్తానుండి ఖాళీగా తిరిగి వస్తున్న ఒక బండి దొరికింది. ఆ బండిని మాట్లాడుకొని మేం శ్యాంపుకూర్ చేరాము. అక్కడ మరో కొత్త సమస్య ఎదురైంది. 'అ' తల్లి ఆ ఇంటిని గుర్తు పట్టలేకపోయింది. అటూ ఇటూ తిప్పి బండిని తన తండ్రిగారి ఇంటి ముందు ఆపమన్నది. ఇంట్లోనుండి ఒక పనివాణ్ణి పిలుచుకు వచ్చింది. అతడు మాతో వచ్చి 'పంతులు'గారి ఇల్లు చూపాడు. మొత్తానికి 'పంతులు'గారి ఇంటిని చేరుకొన్నాం. ఇందులో 'అ' తల్లిని ఎలా తప్పుపట్టగలం? మాకంటే ఆమె నాలు గైదేళ్లు చిన్నది. అప్పుడు ఆమెకు ఇరవై ఆరు లేక ఇరవై ఏడేళ్లు ఉండవచ్చు నేమో! ఆమె కేవలం ఒక ఇంటి కోడలు, ఎన్నడూ బయటకు వెళ్లిందికాదు. పైగా ఆ ఇల్లు ఒక చిన్న సందులో ఉండడంచేత ఆమె ఎలా గుర్తుపట్టగలదు!

"చివరికి ఎలాగో వచ్చి చేరుకొన్నాం. అప్పటికి పంతులుగారి కుటుం బంతో మాకు పరిచయం లేదు. ఇంట్లోకి వెళ్లాం. ఒక చిన్న గదిలో చిన్న కొయ్య మంచం మీద శ్రీరామకృష్ణులు కూర్చుని ఉన్నారు. ఆయన ప్రక్కన ఎవరూ లేరు. మమ్మల్ని చూడగానే ఆయన నవ్వి, ఆప్యాయంగా, 'ఆహా! మీ రిక్కడకు ఎలా వచ్చారు?' అని అడిగారు. మేం ఆయనకు ప్రణామం చేసి, జరిగింది పూసగుచ్చి నట్లు చెప్పాం. ఆయన ఎంతో సంతోషించారు. మమ్మల్ని కూర్చోమని, అనేక విషయాలపై మాట్లాడసాగారు. స్త్రీలను దరిదాపులకు రానివ్వరని, తమను స్పృశించనివ్వరని ప్రతి ఒక్కరూ చెబుతూంటారు. ఆ విషయం విని మాకు నవ్వు వచ్చింది. 'మేం ఇంకా చనిపోలేదు' అని అనుకొన్నాం. ఆయన ఎంత దయార్ద్రహృదయులో ఎవరి కెరుక? స్త్రీ పురుషుల పట్ల ఆయనది ఒకే వైఖరి.

---

2. 'శ్రీరామకృష్ణ కథామృత' రచయిత మహేంద్రనాథ్ గుప్తా. ఆయన ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నందున 'పంతులు' గారిగా పేర్కొబడ్డారు.

కాని స్త్రీలు కనుక ఎక్కువసేపు తమ సమీపంలో ఉండిపోతే, 'ఆహా! ఇప్పుడు ఆలయాలకు వెళ్ళి దైవదర్శనం చేసుకోండి' అని చెప్పేవారు. పురుషులను సైతం అట్లే చేయమని ఆయన చెప్పడం మేం వినివున్నాం. ఏది ఏమైనప్పటికీ మేం కూర్చుని, ఆయనతో మాట్లాడుతున్నాం. మాలో కొంచెం వయస్సు పైబడ్డ ఇద్దరు తలుపు ప్రక్కన, తక్కిన ముగ్గురం గదిలో ఒక మూల కూర్చున్నాం. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు 'లావు బ్రాహ్మణు'డని పిలిచే ప్రాణకృష్ణ ముఖోపాధ్యాయ ఆకస్మికంగా అక్కడకు వచ్చాడు. మేం బయటకు వెళ్ళిపోవాలా? అలా వెళ్లే దారిలేదు. మరి మేం ఎక్కడకు వెళ్లగలం? తలుపు ప్రక్కన ఒక కిటికీ ఉంది. వయస్సు పైబడ్డ స్త్రీలిద్దరూ ఆ కిటికీ వద్ద కూర్చున్నారు. తక్కిన మేం ముగ్గురం శ్రీరామకృష్ణులు కూర్చున్న మంచం దిగువన చేరి పడుకొన్నాం. దోమలు కుట్టడంతో మా ఒళ్లంతా వాచిపోయింది. మేం ఏం చెయ్యగలం! కదలడానికి కూడ ఆస్కారం లేదు. నిశ్చలంగా పడుకొనివున్నాం. ఆ బ్రాహ్మణుడు శ్రీరామకృష్ణులతో ఒక గంటసేపు మాట్లాడాక వెళ్ళిపోయాడు. పిదప మేం నవ్వుకొంటూ బయటకు వచ్చాం.

"ఆ తరువాత ఉపాహారం నిమిత్తం శ్రీరామకృష్ణులను ఇంటి లోపలికి తోడ్కొని వెళ్లారు. మేం ఆయనను అనుసరించాం. కాస్సేపయ్యాక శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరం తిరిగి వెళ్లడానికి బండి ఎక్కారు. పిదప మే మందరం కాలినడకన ఇళ్లకు చేరుకొన్నాం. అప్పుడు రాత్రి తొమ్మిది గంటలయింది."

33. స్త్రీలపై సమాన కృపను శ్రీరామకృష్ణులు వర్షించడం

"మర్నాడు మళ్లీ మేం దక్షిణేశ్వరానికి వెళ్లాం. మేం అక్కడకు వెళ్లగానే ఆయన మా ప్రక్కకు వచ్చి, 'ఆహా! మీరిచ్చిన 'సర్'ను దాదాపు పూర్తిగా నేనే ఆరగించాను; దాన్లో కాస్త మాత్రమే మిగిలింది. తిన్నందు వలన ఏ జబ్బూ చేయలేదు, పొట్టమాత్రం కాస్త భారంగా ఉండడం తప్ప' అని అన్నారు. ఆ మాట విని నేను ఆశ్చర్యపోయాను. ఆయన సున్నితమైన కడుపుకు ఏదీ పెద్దగా పడదు. ఏకమొత్తంగా 'సర్'ను తినేశారంటే ఊహకు అందడంలేదు! భావావస్థలో వాన్ని తినేశారని తెలిసింది. శ్రీరామకృష్ణులు 'పంతులు' గారి ఇంట్లో భోజనంచేసి రాత్రి పదిన్నరకు దక్షిణేశ్వరం చేరుకొన్నారని తెలియవచ్చింది. వచ్చిన కాస్సేపటికి భావసమాధి మగ్నులై రాంలాల్‌ను పిలిచి, 'బాగా ఆకలిగా ఉంది. గదిలో ఏముందో పట్రా' అని చెప్పారు. వెంటనే రాంలాల్ 'సర్' మిఠాయినంతా ఆయన ముందు పెట్టాడు. అప్పుడాయన దాన్ని దాదాపు పూర్తిగా తినేశారు. భావావస్థలో ఆయన అప్పుడప్పుడు విపరీతంగా తిని జీర్ణించుకోవడం కద్దు అని మాతృదేవి నుండి, లక్ష్మి అక్క నుండి విన్న సంగతి నాకు జ్ఞప్తికి వచ్చింది. ఆహా! ఎంతటి ఆయన

అనుగ్రహానికి మేం పాత్రులమయ్యాం! ఆ కరుణ వర్ణనాతీతం. ఎంతటి ఆకర్షణ! ఆయన వద్దకు మేం ఎలా వెళ్లి, అవన్నీ నిర్వర్తించేవారమో మాకే తెలియరాదు, అర్థం కాదు. అలా కాలినడకన ఎక్కడకైనా పరిచయస్థులు కాని వారి ఇళ్లకు ఆ రీతిలో సాధుసన్న్యాసులను దర్శించుకోవడానికి లేక వారి ఆధ్యాత్మిక వచనాలను వినడానికి ప్రస్తుతం మేం వెళ్లలేము. ఎవరి శక్తితో మేం అలా చేయగలిగేవారమో ఆ శక్తి ఆయనతోబాటే అదృశ్యమైంది. ఆయనను కోల్పోయి మేం ఇంకా ఎలా బ్రతికివున్నామో మాకే అర్థంకావడం లేదు.''

ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలుగా పేర్కొనవచ్చు. ఏనాడూ తమ గడప దాటి బయటకు అడుగుపెట్టి ఎరుగని వారిని అంగడికి పంపి సరకులు కొనుగోలు చేయించారు. అభిమానం, అహం నశింపచేసే ఉద్దేశంతో ఇంటింటికి భిక్షకై పంపించారు. అట్లే తమతో 'పానీహాటీ' ఉత్సవానికి వారిని తోడ్కొనిపోయారు. అక్కడ ఆ భక్తురాండ్రు మహదానందంతో సంకోచపడక శ్రీరామకృష్ణుల అనుజ్ఞ మేరకు చెప్పింది చేయడం జరిగింది. కాస్త దీర్ఘంగా యోచించిచూస్తే ఇది స్వల్ప విషయంగా కనిపించదు. ఆధ్యాత్మిక చైతన్య తరంగాల ప్రభావంలో జాతి, లింగ, అంతస్తు ఇత్యాది వ్యత్యాసాల కారణంగా జనించే సంకోచ భావాలన్నీ తాత్కాలికంగా సమసిపోయేవి. దివ్యచైతన్యం మూర్తీభవించిన శ్రీరామకృష్ణులలో ప్రతి ఒక్కరూ తమ తమ భావాల పరిపూర్ణ ఆదర్శాన్ని కాంచగలిగి తమ జీవితం కృతార్థమైనట్లు భావించేవారు. పురుషులు ఆయనలో పరిపూర్ణ పుంభావాన్ని కాంచి తలఒగ్గారు. స్త్రీలు ఆయనలో ఉదాత్త స్త్రీభావాలు పరిపూర్ణంగా అభివ్యక్తమైనట్లు కనుగొని, ఆయనను తమ పరమ ఆప్తునిగా పరిగణించి ఎటువంటి సంకోచమూ లేకుండా ఆయనతో మెలగేవారు.

34. స్త్రీల హావభావాలను శ్రీరామకృష్ణులు అనుకరించడం

స్త్రీలకు సహజమైన హావభావాలను, అంగభంగిమలను అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులు అనుకరించి మమ్మల్ని వేడుక పరిచేవారు. ఆ అనుకరణ అంత కచ్చితంగా ఉండడం మమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తేది. ఒక సందర్భంలో ఒక భక్తురాలు మాతో ఇలా చెప్పింది:

''పురుషులు ఎదురుపడినప్పుడు స్త్రీలు ఎలా ప్రవర్తిస్తారో మా సమక్షంలో శ్రీరామకృష్ణులు అభినయించి చూపసాగారు. తలమీద ముసుగును సరిచేసుకోవడం, చెవుల ప్రక్క ముంగురులను సవరించుకోవడం, పైటను రొమ్ములపై నిండుగా కప్పుకోవడం, అర్థంపర్థంలేక మాట్లాడడం - కచ్చితంగా స్త్రీలు ఎలా ప్రవర్తిస్తారో అలా చేసి చూపారు. అది చూసి మాకు నవ్వు ఆగలేదు. కాని ఆయన ఆ విధంగా స్త్రీలను కించపుచ్చుతున్నారని అంతరంగంలో అవమానంతో బాధపడ్డాం. 'స్త్రీ లందరూ అట్లే ఉంటారా?' అన్న ఆలోచన

మాలో మెదలింది. ఏది ఏమైనా మేం స్త్రీలమే కదా! ఎవరైనా స్త్రీలను అలా అనుకరించి చూపితే మేం సహజంగా బాధపడతాం కదా! ఆహా! తక్షణమే శ్రీరామకృష్ణులు మా అవస్థను అవగతం చేసుకొన్నారు. 'మంచిది, ఇది మమ్మల్ని గురించి కాదు. మీరు అవిద్యాశక్తులు కారు కదా! ఆ ప్రవృత్తిగల స్త్రీలు మాత్రమే అలా ప్రవర్తిస్తారు' అని ఆప్యాయంగా మాతో అన్నారు.''

స్త్రీ పురుష నైజాలు శ్రీరామకృష్ణులలో సరిసమంగా అభివ్యక్తం కావడం భక్తు లందరూ దాదాపు చూసివున్నారు. అట్టి అనుభవం గిరీశ్ చంద్రఘోష్ ఒక రోజు చవిచూసి, కాస్త చొరవచేసుకొని శ్రీరామకృష్ణులను, ''మహాశయా! మీరు పురుషులా లేక స్త్రీలా?'' అని అడిగాడు. అందుకు శ్రీరామకృష్ణులు నవ్వి, ''నాకు తెలియదు'' అని జవాబిచ్చారు. ఆయన ఆ మాట ఏ అర్థంలో, అంటే ఆత్మజ్ఞులైన పురుషులు, 'నేను పురుషుణ్ణి కాను, స్త్రీని కాను' అని చెప్పేటట్లు ఆత్మదృష్టితో పలికారో లేక తమలో ఇద్దరి నైజాలూ సామరస్యంతో మేళవింపబడి ఉండడం చూసి అలా పలికారో తేల్చిచెప్పలేము.

35. స్త్రీ పురుషుల నైజాలు రెండూ శ్రీరామకృష్ణులలో మేళవించి ఉండడం

అనంత భావమయులైన శ్రీరామకృష్ణులు ఈ విధంగా 'భావముఖం'లో నెలకొని స్త్రీల వద్ద స్త్రీగాను, పురుషుల వద్ద పురుషునిగాను వర్తిస్తూ ప్రతి ఒక్కరి యావత్తు భావాలూ యథాతథంగా అవగతం చేసుకోగలిగేవారు. ఈ విషయం స్వయంగా ఆయనే మాలో కొందరి వద్ద వ్యక్తం చేశారు. పరమ భక్తురాలైన ఒక స్త్రీ[1], శ్రీరామకృష్ణులు ఒక రోజు తనతో ఇలా చెప్పారని మాకు తెలిపింది: '' కేవలం ఒక్క చూపుతోనే ఒక వ్యక్తి నైజం తెలుసుకోగలను; సజ్జను డెవడో దుర్జను డెవరో, కులీను డెవడో కానివాడెవడో, జ్ఞాని ఎవడో భక్తు డెవడో, ఎవడికి భగవత్సాక్షాత్కారం లభిస్తుందో, ఎవడికి లభించదో నేను గ్రహించగలను. కాని వారు బాధపడతారని ఆ విషయం వ్యక్తం చేయను.'' ఆయన సదా భావముఖంలో నెలకొని ఉండడం చేత జగత్తు యావత్తు ప్రతిక్షణం భావమయంగా ఆయనకు కానవస్తూవుంటుంది. స్త్రీలు పురుషులు, ఆవులు, గుర్రాలు, చెట్లు, మన్ను అన్నీ విశ్వమానసంలో విభిన్న భావతరంగాల సమష్టిగా మునిగి లేస్తూ ఉన్నట్లు, ఈ భావాలనే ఆవరణాల ద్వారా ఆ అనంత అఖండ సచ్చిదాకాశం - ఒక్కోచోట చిన్నదిగా, మరోచోట విస్తృతంగా, ఒక్కోచోట ఆవరణం ఎంత దట్టమంటే సచ్చిదానందాకాశం

36. భావముఖ స్థితిలో వసించడంచేత శ్రీరామకృష్ణులు సర్వుల భావాలూ అవగతం చేసుకోగలిగారు

---

1. ప్రేమానందస్వామి తల్లి

అసలక్కడ లేదేమో అన్నట్లు - శ్రీరామకృష్ణులకు సర్వదా అనుభూతమయ్యేది. ఆనందమయి నిష్కళంక మానసపుత్రులైన శ్రీరామకృష్ణులు స్వచ్ఛందంగా తమ తను మనః చిత్తవృత్తులను, తమ సర్వస్వాన్ని జగజ్జనని పాదపద్మాలకు అర్పించి, సమాధి స్థితి మూలంగా బ్రహ్మానందానుభవాన్ని పొంది, విరతంగా ఆమెలో తాదాత్మ్యం చెందనారంభించారు. కాని అక్కడకు చేరుకొన్నాక జగజ్జనని సంకల్పం మరో రీతిలో ఉందని ఎరిగి, ఆమె ఆజ్ఞను శిరసావహించి, ద్వైత-అద్వైత విహీనం, అనిర్వచనీయం అయిన అవస్థలో లీనమైవున్న తమ మనస్సును బలవంతంగా మళ్లీ విద్యామాయ అనే ఆవరణంతో కప్పి, తల్లి ఆజ్ఞను పాటించ సాగారు. అనంత భావమయురాలైన జగజ్జనని కూడ వారిపట్ల ప్రసన్నయై ఆయ నను దేహధారిగా ఉంచినప్పటికీ సర్వదా ఆయన మనస్సును ఆ ఏకత్వంలో ఎంత సమున్నతస్థానంలో నిలిపి ఉంచేదంటే ఆ అనంత విశ్వమానసంలో ఏఏ భావాలు ఉదయించేవో అవన్నీ కూడ తమవే అయినట్లుగా ఆయన అనుభూతం చేసుకొనే వారు. అంతేగాక అవన్నీ ఎంతవరకు తమ అధీనంలో ఉన్నట్లు ఆయన అను భూతం చేసుకొనేవారంటే, ఆయనను చూసిన వారందరికీ - ఎవరు తల్లో ఆమే బిడ్డగా, ఎవరు బిడ్డో అతడే తల్లిగా (అంటే సాక్షాత్తు జగన్మాతే శ్రీరామకృష్ణులుగా, శ్రీరామకృష్ణులే జగన్మాతగా) అనిపించేది. 'చిన్మయ ధామం, చిన్మయ నామం, చిన్మయ శ్యాం' - అంటే భగవంతుడు, అతడి నామం, అతడి నెలవు - ఈ మూడు ఒక్కటే.

తెలిసినంత మేరకు మేం తెలియజేశాము; పాఠకమహాశయులారా! అనంత భావమూర్తియైన ఈ శ్రీరామకృష్ణు లెవరో మీరే యోచించి గ్రహించు కోండి.